శ్రీః

ఓం స్వస్తి శ్రీగణేశాయ నమః

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః

బాలానందినీసహితమగు

శ్రీమద్రామాయణము - ఉత్తరకాండము

(మొదటి సంపుటము)

ప్రథమః సర్గః

[రాముని సభకు మహర్షులు వచ్చుట, వారితో రాముడు సంభాషించుచు వారిని కొన్ని విషయములు అడుగుట.]

మూ. ప్రాప్తరాజ్యస్య రామస్య రాక్షసానాం వధే కృతే,
ఆజగ్ముర్మునయః సర్వే రాఘవం ప్రతినన్దితుమ్. 1

కౌశికోఽథ యవక్రీతో గార్గ్యో గాలవ ఏవ చ,
కణ్వో మేధాతిథేః పుత్రః పూర్వస్యాం దిశి యే శ్రితాః. 2

ప్ర. అ. రాక్షసానామ్ = రాక్షసులయొక్క, వధే = వధ, కృతే = చేయబడినదగుచుండగా, రామస్య = రాముడు, ప్రాప్తరాజ్యస్య = పొందబడిన రాజ్యము కలవాడగుచుండగా, రాఘవమ్ = రాముణ్ణి, ప్రతినన్దితుమ్ = అభినందించుటకు, సర్వే = సమస్తమైన, మునయః = మునులు, ఆజగ్ముః = వచ్చిరి. పూర్వస్యామ్ = తూర్పు, దిశి = దిక్కునందు, యే = ఎవరు, శ్రితాః = ఆశ్రయించి ఉన్నారో, అట్టి, కౌశికః = కౌశికుడు, అథ = మరియు, యవక్రీతః = యవక్రీతుడు, గార్గ్యః = గార్గ్యుడు, గాలవ ఏవ చ = గాలవుడు, మేధాతిథేః = మేధాతిథియొక్క, పుత్రః = పుత్రుడైన, కణ్వః = కణ్వుడు, (ఆజగ్ముః = వచ్చిరి).

తా. రాక్షసులను సంహరించిన పిమ్మట రాముడు రాజ్యమును పొంది యుండగా అతనిని అభినందించుటకై మును లందరూ వచ్చిరి. తూర్పుదిక్కునందు నివసించుచున్న కౌశికుడు, యవక్రీతుడు, గార్గ్యుడు, గాలవుడు, మేధాతిథి పుత్రుడైన కణ్వుడు ఆ ప్రాంతమునుండి వచ్చిరి. 1, 2

మూ. అథాత్రేయశ్చ భగవాన్నముచిః ప్రముచిస్తథా,
అగస్త్యోత్రిశ్చ భగవాన్సుముఖో విముఖస్తథా, 3
ఆజగ్ముస్తే సహాగస్త్యా యే శ్రితా దక్షిణాం దిశమ్.

ప్ర. అ. అథ=పిమ్మట, యే=ఎవరు, దక్షిణాం దిశమ్=దక్షిణదిక్కును, శ్రితాః = ఆశ్రయించినారో, తే = అట్టి, ఆత్రేయశ్చ = ఆత్రేయుడు, భగవాన్= పూజ్యుడైన, నముచిః = నముచి, తథా = మరియు, ప్రముచిః = ప్రముచి, తథా= మరియు, అగస్త్యః = అగస్త్యుడు, అత్రిశ్చ = అత్రి, భగవాన్ = పూజ్యుడైన, సుముఖః = సుముఖుడు, తథా = మరియు, విముఖః = విముఖుడు, సహాగస్త్యాః = అగస్త్యసహితులై, ఆజగ్ముః = వచ్చిరి.

తా. దక్షిణదిక్కునందు నివసించు ఆత్రేయుడు, నముచి, ప్రముచి, అగస్త్యుడు, అత్రి, సుముఖుడు, విముఖుడు అగస్త్యుణ్ణి ముందు ఉంచుకొని వచ్చిరి.

మూ. నృషఙ్గః కవషీ ధౌమ్యః కౌషేయశ్చ మహానృషిః, 4
తేఽప్యాజగ్ముః సశిష్యా వై యే శ్రితాః పశ్చిమాం దిశమ్.

ప్ర. అ. నృషఙ్గః = నృషంగుడు, కవషీ=కవషి, ధౌమ్యః = ధౌమ్యుడు, కౌషేయశ్చ=కౌషేయుడను, మహాన్=గొప్ప, ఋషిః=ఋషి, యే=ఏ మునులు, పశ్చిమాం దిశమ్ = పశ్చిమదిక్కును, శ్రితాః = ఆశ్రయించినారో, తేఽపి=వారు కూడా, సశిష్యాః = శిష్యసహితులై, ఆజగ్ముః = వచ్చిరి.

తా. పశ్చిమదిక్కునందు నివసించు నృషంగుడు, కవషి, ధౌమ్యుడు, కౌషేయు డను మహర్షి-పశ్చిమదిక్కునందు నివసించు ఈ ఋషులు కూడ శిష్యులతో కలసి వచ్చిరి. 4

మూ. వసిష్ఠః కశ్యపోఽథాత్రిర్విశ్వామిత్రః సగౌతమః, 5
జమదగ్నిర్భరద్వాజస్తేఽపి సప్తర్షయస్తథా,
ఉదీచ్యాం దిశి సప్తైతే నిత్యమేవ నివాసినః. 6

ప్ర. అ. వసిష్ఠః = వసిష్ఠుడు, కశ్యపః = కశ్యపుడు, అథ = మరియు, అత్రిః = అత్రి, సగౌతమః=గౌతమునితో కూడిన, విశ్వామిత్రః=విశ్వామిత్రుడు, జమదగ్నిః = జమదగ్ని, తథా=మరియు, భరద్వాజః=భరద్వాజుడు, తే = ఆ, సప్తర్షయః=సప్తర్షులు కూడ వచ్చిరి. ఏతే= ఈ, సప్త=ఏడుగురు, నిత్యమ్= నిత్యమూ, ఉదీచ్యాం దిశి = ఉత్తరదిక్కునందు, నివాసినః = నివసించువారు.

తా. నిత్యమూ ఉత్తరదిక్కునందు నివసించు వసిష్ఠుడు, కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, భరద్వాజుడు అను ఏడుగురు ఋషులు కూడ వచ్చిరి.

వి. వసిష్ఠుడు అయోధ్యలో పురోహితుడుగా నిత్యమూ ఉన్నను ఆ వసిష్ఠుడు సప్తర్షిమండలములో ఉన్న వసిష్ఠుని రూపాంతరమే. ఇక్కడ ఆ సప్తర్షిమండలములో ఉన్న వసిష్ఠుడు వచ్చినట్లు వర్ణింపబడినది అని గోవిందరాజాది వ్యాఖ్యాతలు వ్రాసిరి. 5, 6

మూ. సంప్రాప్యైతే మహాత్మానో రాఘవస్య నివేశనమ్,
విష్ఠితాః ప్రతిహారార్థం హుతాశనసమప్రభాః, 7
వేదవేదాఙ్గవిదుషో నానాశాస్త్రవిశారదాః.

ప్ర. అ. హుతాశనసమప్రభాః = అగ్నితో సమానమైన తేజస్సు గల, వేదవేదాఙ్గవిదుషః = వేదములయందు వేదాంగములయందు పండితులు, నానాశాస్త్రవిశారదాః = అనేకశాస్త్రములందు నేర్పుగల, ఏతే = ఈ, మహాత్మానః = మహాత్ములు, రాఘవస్య = రామునియొక్క, నివేశనమ్ = గృహమును, సంప్రాప్య = పొంది, ప్రతిహారార్థమ్ = ద్వారపాలకునికొరకు, విష్ఠితాః = నిలచినారు.

తా. అగ్నితో సమానమైన కాంతి గల, వేదవేదాంగములందు పండితులు, వివిధశాస్త్రములలో సమర్థులు అయిన ఈ మహాత్ములు రాముని గృహము చేరి, ద్వారపాలకుని ద్వారా రామునకు తెలుపుటకై నిలచిరి. 7

మూ. ద్వాఃస్థం ప్రోవాచ ధర్మాత్మా అగస్త్యో మునిసత్తమః, 8
నివేద్యతాం దాశరథేరృషీనస్మానుపాగతాన్.

ప్ర. అ. మునిసత్తమః = మునిశ్రేష్ఠుడైన, ధర్మాత్మా = ధర్మాత్ముడైన,

అగస్త్యః = అగస్త్యుడు, ద్వాఃస్థమ్ = ద్వారపాలకుని గూర్చి, ప్రోవాచ=పలికెను. ఋషీన్ = ఋషులమైన, అస్మాన్ = మమ్ములను, ఉపాగతాన్=వచ్చినవారినిగా, దాశరథేః = రామునకు, నివేద్యతామ్=తెలుపబడుగాక.

తా. ధర్మాత్ముడైన అగస్త్యమహాముని ద్వారపాలకునితో- "ఋషులమైన మేము వచ్చినట్లు రామునకు చెప్పుము"అని పలికెను 8

మూ. ప్రతీహార స్తతస్తూర్ణమగస్త్యవచనాద్ద్రుతమ్, 9
సమీపం రాఘవస్యాశు ప్రవివేశ మహాత్మనః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ప్రతీహారః = ద్వారపాలకుడు, అగస్త్యవచనాత్=అగస్త్యుని మాటవలన, తూర్ణమ్=శీఘ్రముగా, మహాత్మనః=మహాత్ముడైన, రాఘవస్య = రామునియొక్క, సమీపమ్=సమీపమును, ద్రుతమ్=పరుగెత్తుచున్నట్లుగా, ఆశు = శీఘ్రముగా, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. పిమ్మట ఆ ద్వారపాలకుడు అగస్త్యుని మాట విని, శీఘ్రముగా పరుగెత్తుచున్నట్లుగా, వెంటనే, మహాత్ముడైన రాముని సమీపమునకు వెళ్లెను. 9

మూ. నయేఙ్గితజ్ఞః సద్వృత్తో దక్షో ధైర్యసమన్వితః, 10
స రామం వీక్ష్య సహసా పూర్ణచన్ద్రసమద్యుతిమ్,
అగస్త్యం కథయామాస సంప్రాప్తమృషిసత్తమమ్. 11

ప్ర. అ. నయేఙ్గితజ్ఞః=నీతిని, మనోభావములను ఎరిగినవాడు, సద్వృత్తః =మంచి నడవడిక గలవాడు, దక్షః=సమర్థుడు, ధైర్యసమన్వితః = ధైర్యముతో కూడినవాడు అయిన, సః = ద్వారపాలకుడు, పూర్ణచన్ద్రసమద్యుతిమ్ = పూర్ణచంద్రునితో సమానమైన కాంతి గల, రామమ్ = రాముణ్ణి, సహసా = శీఘ్రముగా, వీక్ష్య = చూచి, ఋషిసత్తమమ్ = ఋషిశ్రేష్ఠుడైన, అగస్త్యమ్ = అగస్త్యుణ్ణి, సంప్రాప్తమ్ = వచ్చినవానినిగా, కథయామాస = చెప్పెను.

తా. నీతిని, ఇతరుల మనోభావమును ఎరిగినవాడు, మంచి నడవడిక కలవాడు, సమర్థుడు, ధైర్యవంతుడు అయిన ఆ ద్వారపాలకుడు చంద్రునితో సమానమైన కాంతి గల ఆ రాముణ్ణి చూచి అగస్త్యమహాముని వచ్చినట్లు చెప్పెను. 10,11

మూ. శ్రుత్వా ప్రాప్తాన్ మునీంస్తాంస్తు బాలసూర్యసమప్రభాన్,
ప్రత్యువాచ తతో ద్వాఃస్థం ప్రవేశయ యథాసుఖమ్. 12

ప్ర. అ. బాలసూర్యసమప్రభాన్ = బాలసూర్యునితో సమానమైన కాంతి గల, తాన్ = ఆ, మునీన్ = మునులను, ప్రాప్తాన్ = వచ్చినవారినిగా, శ్రుత్వా= విని, తతః = అటుపిమ్మట, ద్వాఃస్థమ్ = ద్వారపాలకుని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. యథాసుఖమ్ = సుఖముగా, ప్రవేశయ=ప్రవేశపెట్టుము.

తా. బాలసూర్యుని వంటి కాంతి గల మునులు వచ్చినట్లు విని రాముడు ద్వారపాలకునితో "వారిని సుఖముగా ప్రవేశపెట్టుము"అని పలికెను. 12

మూ. దృష్ట్వా ప్రాప్తాన్ మునీంస్తాంస్తు ప్రత్యుత్థాయ కృతాఞ్జలిః,
పాద్యార్ఘ్యాదిభిరానర్చ గాం నివేద్య చ సాదరమ్. 13

ప్ర. అ. ప్రాప్తాన్ = వచ్చిన, తాన్ = ఆ. మునీన్ = మునులను, దృష్ట్వా=చూచి, ప్రత్యుత్థాయ=లేచి, కృతాఞ్జలిః=చేయబడిన దోసిలి కలవాడై, సాదరమ్ = ఆదరపూర్వకముగా, గామ్ = ఎద్దును, నివేద్య = సమర్పించి, పాద్యార్ఘ్యాదిభిః=పాద్యము అర్ఘ్యము మొదలైనవాటితో, ఆనర్చ=అర్చించెను.

తా. వచ్చిన ఆ మునులను చూచి, ప్రత్యుత్థానము చేసి, అంజలి ఘటించి నమస్కరించి, ఆదరపూర్వకముగా ఎద్దును సమర్పించి, పాద్యార్ఘ్యాదులతో అర్చించెను. 13

మూ. రామోఽభివాద్య ప్రయత ఆసనాన్యాదిదేశ హ,
తేషు కాఞ్చనచిత్రేషు మహత్సు చ వరేషు చ, 14

కుశాన్తర్ధానదత్తేషు మృగచర్మయుతేషు చ,
యథార్హముపవిష్టాస్తే ఆసనేష్వృషిపుఙ్గవాః. 15

ప్ర. అ. రామః=రాముడు, అభివాద్య = నమస్కారముచేసి, ప్రయతః= నియమవంతుడై, ఆసనాని = ఆసనములను, ఆదిదేశ హ = చూపెను. కాఞ్చన చిత్రేషు = బంగారముచేత చిత్రవర్ణములైన, మహత్సు = గొప్పవైన, వరేషు చ = శ్రేష్ఠములైన, కుశాన్తర్ధానదత్తేషు = లోపల కుశములను ఉంచి ఇవ్వబడిన,

మృగచర్మయుతేషు చ = కృష్ణాజినములతో కూడిన, తేషు = ఆ, ఆసనేషు = ఆసనములయందు, తే = ఆ, ఋషిపుఙ్గవాః = ఋషిశ్రేష్ఠులు, యథార్హమ్ = తగు విధముగా, ఉపవిష్టాః = కూర్చున్నారు.

తా. రాముడు నమస్కరించి, నియమవంతుడై వారికి ఆసనములను చూపెను. ఆ ఋషిపుంగవులు బంగారముచేత చిత్రములైన, అడుగున కుశలు పరచిన, మృగచర్మముతో కూడిన శ్రేష్ఠములైన ఆ గొప్ప ఆసనములమీద తగు విధముగా కూర్చుండిరి. 14, 15

మూ. రామేణ కుశలం పృష్టాః సశిష్యాః సపురోగమాః,
మహర్షయో వేదవిదో రామం వచనమబ్రువన్,
కుశలం నో మహాబాహో సర్వత్ర రఘునన్దన. 16

ప్ర. అ. రామేణ = రామునిచేత, కుశలమ్ = కుశలమును, పృష్టాః = అడగబడిన, సపురోగమాః = ముందు నడచు పరివారముతో కూడిన, సశిష్యాః = శిష్యులతో కూడిన, వేదవిదః = వేదవేత్తలైన, మహర్షయః = మహర్షులు, రామమ్ = రాముణ్ణి గూర్చి, వచనమ్ = వచనమును, అబ్రువన్ = పలికిరి. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! రఘునన్దన = రామా! నః = మాకు, సర్వత్ర = అంతటా, కుశలమ్ = క్షేమము.

తా రాముడు కుశలప్రశ్న చేయగా, శిష్యులతోను, ముందు నడచు పరివారముతోను కూడిన ఆ వేదవేత్తలైన మహర్షులు రామునితో ఇట్లు పలికిరి— "గొప్ప బాహువులు గల రామా! మేము అన్ని విషయములందు క్షేమముగా ఉన్నాము. 16

మూ. త్వాం తు దిష్ట్యా కుశలినం పశ్యామో హతశాత్రవమ్,
దిష్ట్యా త్వయా హతో రాజన్ రావణో లోకరావణః. 17

ప్ర. అ. దిష్ట్యా = భాగ్యవశముచేత, హతశాత్రవమ్ = చంపబడిన శత్రువులుగల, కుశలినమ్ = కుశలవంతుడవైన, త్వామ్ = నిన్ను, పశ్యామః = చూచుచున్నాము. రాజన్ = రాజా!, దిష్ట్యా = భాగ్యవశముచేత, లోకరావణః = లోకములను ఏడ్పించిన, రావణః = రావణుడు, త్వయా = నీచేత, హతః = చంపబడినాడు.

తా. శత్రువులను చంపి క్షేమముగా ఉన్న నిన్ను అదృష్టవశముచేత చూచుచున్నాము. రాజా! లోకములను ఏడ్పించిన రావణుణ్ణి అదృష్టవశముచేత నీవు చంపినావు. 17

మూ. న హి భారః స తే రామ రావణః పుత్రపౌత్రవాన్,
సధనుస్త్వం హి లోకాంస్త్రీన్విజయేథా న సంశయః. 18

ప్ర. అ. రామ = రామా! పుత్రపౌత్రవాన్ = పుత్రపౌత్రులతో కూడిన, సః రావణః = ఆ రావణుడు, తే = నీకు, భారః = భారము, న హి = కాదుకదా? సధనుః = ధనస్సుతో కూడిన, త్వమ్ = నీవు, త్రీన్ = మూడు, లోకాన్ = లోకములను, విజయేథాః = జయించెదవు. సంశయః = సంశయము. న = లేదు.

తా. రామా! పుత్రపౌత్రసహితుడైన ఆ రావణుడు నీకొక పెద్ద బరువు కాదు కదా! ధనస్సు చేత పట్టిన నీవు మూడు లోకములనూ కూడ జయించగలవు; సందేహము లేదు. 18

మూ. దిష్ట్యా త్వయా హతో రామ రావణః పుత్రపౌత్రవాన్,
దిష్ట్యా విజయినం త్వాద్య పశ్యామః సహ సీతయా. 19

ప్ర. అ. రామ = రామా! దిష్ట్యా = భాగ్యవశముచేత, త్వయా = నీచేత, పుత్రపౌత్రవాన్ = పుత్రపౌత్రులు గల, రావణః = రావణుడు, హతః = చంపబడినాడు. దిష్ట్యా = భాగ్యవశముచేత, విజయినమ్ = విజయవంతుడవైన, త్వా = నిన్ను, అద్య = ఇప్పుడు, సీతయా సహ = సీతతో కూడ, పశ్యామః = చూచుచున్నాము.

తా. రామా! నీవు భాగ్యవశముచేత పుత్రపౌత్రవంతుడైన రావణుణ్ణి చంపినావు. విజయవంతుడవై సీతాసమేతుడవై ఉన్న నిన్ను భాగ్యవశముచేత ఈనాడు చూడగల్గుచున్నాము. 19

మూ. లక్ష్మణేన చ ధర్మాత్మన్ భ్రాత్రా త్వద్ధితకారిణా,
మాతృభిర్భ్రాతృసహితం పశ్యామోఽద్య వయం నృప. 20

ప్ర. అ. ధర్మాత్మన్ = ధర్మాత్ముడా! నృప = రాజా! త్వద్ధితకారిణా =

నీకు హితమును చేసిన, భ్రాతా = సోదరుడైన, లక్ష్మణేన = లక్ష్మణునితోను, మాతృభిః = తల్లులతోను, భ్రాతృసహితమ్ = సోదరులతో కూడిన నిన్ను, వయమ్ = మేము, అద్య = నేడు, దిష్ట్యా = భాగ్యవశముచేత, పశ్యామః = చూచుచున్నాము.

తా. ధర్మాత్ముడవైన రాజా! నీకు హితమును చేయువాడైన సోదరుడైన లక్ష్మణునితోను, తల్లులతోను, ఇతర సోదరులతోను కూడిన నిన్ను అదృష్ట వశముచేత ఇప్పుడు చూడగల్గుచున్నాము. 20

మూ దిష్ట్యా ప్రహస్తో వికటో విరూపాక్షో మహోదరః,
అకమ్పనశ్చ దుర్ధర్షో నిహతాస్తే నిశాచరాః. 21

ప్ర. అ. దిష్ట్యా = భాగ్యవశముచేత, ప్రహస్తః = ప్రహస్తుడు, వికటః = వికటుడు, విరూపాక్షః = విరూపాక్షుడు, మహోదరః = మహోదరుడు, దుర్ధర్షః = ఎదిరింప శక్యముకాని, అకమ్పనశ్చ = అకంపనుడు, నిశాచరాః = ఈ రాక్షసులు, తే = నీకు, నిహతాః = చంపబడిరి.

తా. అదృష్టవశముచేత నీవు ప్రహస్తుడు, వికటుడు, విరూపాక్షుడు, మహోదరుడు, ఎదిరింపశక్యము కాని అకంపనుడు-ఈ రాక్షసులను సంహరించినావు. 21

మూ. యస్య ప్రమాణాద్విపులం ప్రమాణం నేహ విద్యతే,
దిష్ట్యా తే సమరే రామ కుమ్భకర్ణో నిపాతితః. 22

ప్ర. అ. రామ = రామా! యస్య = ఎవనియొక్క, ప్రమాణాత్ = ప్రమాణము కంటె, విపులమ్ = పెద్దదైన, ప్రమాణమ్ = ప్రమాణము, ఇహ = ఇక్కడ, న విద్యతే = లేదో, కుమ్భకర్ణః = అట్టి కుంభకర్ణుడు, దిష్ట్యా = భాగ్యవశముచేత, సమరే = యుద్ధమునందు, తే = నీకు, నిపాతితః = పడగొట్టబడినాడు.

తా. ఎవని ప్రమాణమును మించిన ప్రమాణము ఈ ప్రపంచకములో లేదో అట్టి కుంభకర్ణుణ్ణి అదృష్టవశముచేత యుద్ధములో సంహరించినావు. 23

మూ. త్రిశిరాశ్చాతికాయశ్చ దేవాన్తకనరాన్తకౌ,
దిష్ట్యా తే నిహతా రామ మహావీర్యా నిశాచరాః. 23

ప్ర. అ. రామ=రామా! త్రిశిరాశ్చ=త్రిశిరస్సు, అతికాయశ్చ=అతికాయుడు, దేవాన్తకనరాన్తకౌ = దేవాంతకనరాంతకులు, మహావీర్యాః = గొప్ప పరాక్రమము గల, నిశాచరాః = రాక్షసులు, దిష్ట్యా = భాగ్యవశముచేత, తే=నీకు, నిహతాః = చంపబడినారు.

తా. రామా ! మహాపరాక్రమము గల రాక్షసులైన త్రిశిరస్సును, అతికాయుణ్ణి, దేవాంతక నరాంతకులను నీవు అదృష్టవశమువేత సంహరించినావు. 23

మూ. కుమ్భశ్చైవ నికుమ్భశ్చ రాక్షసౌ భీమదర్శనౌ,
దిష్ట్యా తౌ నిహతౌ రామ కుమ్భకర్ణసుతౌ మృధే. 24

ప్ర. అ. రామ=రామా! కుమ్భకర్ణసుతౌ = కుంభకర్ణుని కుమారులు, భీమదర్శనౌ=భయంకరమైన దర్శనముగల, రాక్షసౌ = రాక్షసులైన,తౌ = ఆ, కుమ్భశ్చైవ = కుంభుడు, నికుమ్భశ్చ = నికుంభుడు, మృధే = యుద్ధమునందు, దిష్ట్యా = భాగ్యవశముచేత, నిహతౌ = చంపబడిరి.

తా. రామా : చూచువారికి భయంకరులుగా ఉండు రాక్షసులైన, కుంభకర్ణుని పుత్రులైన కుంభ-నికుంభులను అదృష్టవశముచేత నీవు యుద్ధములో చంపితివి. 24

మూ. యుద్ధోన్మత్తశ్చ మత్తశ్చ, కాలాన్తకయమోపమౌ,
యజ్ఞకోపశ్చ బలవాన్ ధూమ్రాక్షో నామ రాక్షసః. 25
కుర్వన్తః కదనం ఘోర మేతే శస్త్రాస్త్రపారగాః,
అన్తకప్రతిమైర్బాణైర్దిష్ట్యా వినిహతాస్త్వయా. 26

ప్ర. అ. కాలాన్తకయమోపమౌ = ప్రళయకాలమునందు సంహారము చేయు యముని వంటి, యుద్ధోన్మత్తశ్చ= యుద్ధోన్మత్తుడు, మత్తశ్చ = మత్తుడు, బలవాన్ = బలవంతుడైన, యజ్ఞకోపశ్చ= యజ్ఞకోపుడు ధూమ్రాక్షః నామ= ధూమ్రాక్షు డను పేరు గల, రాక్షసః = రాక్షసుడు, ఘోరమ్= ఘోరమైన, కదనమ్ = యుద్ధమును, కుర్వన్తః = చేయుచున్న, శస్త్రాస్త్రపారగాః=శస్త్రాస్త్రముల పారమును పొందిన,ఏతే=వీళ్ళు, దిష్ట్యా=భాగ్యవశముచేత, త్వయా=నీచేత, అన్తకప్రతిమైః=యమునితో సమానములైన, బాణైః=బాణములచేత, వినిహతాః = చంపబడినారు.

తా. ప్రలయకాలమునందు సంహారము చేయు యమునితో సమానులైన యుద్ధోన్మత్త-మత్తులు, బలవంతుడైన యజ్ఞకోపుడు, ధూమ్రాక్షుడు- ఘోర మైన యుద్ధము చేయు శస్త్రాస్త్రములయందు నిపుణులైన ఈ రాక్షసులందరినీ, అదృష్టవశముచేత నీవు యముని వంటి బాణాలచేత సంహరించినావు. 25, 26

మూ. దిష్ట్యా త్వం రాక్షసేన్ద్రేణ ద్వన్ద్వయుద్ధముపాగతః,
దేవతానామవధ్యేన విజయం ప్రాప్తవానసి. 27

ప్ర. అ. దేవతానామ్ = దేవతలకు కూడ, అవధ్యేన = అవధ్యుడైన, రాక్షసేన్ద్రేణ = రావణునితో, ద్వన్ద్వయుద్ధమ్ = ద్వంద్వయుద్ధమును, ఉపాగతః = పొందిన, త్వమ్=నీవు, దిష్ట్యా=భాగ్యవశము చేత, విజయమ్=విజయమును, ప్రాప్తవాన్ అసి = పొందినావు.

తా. దేవతలు కూడ చంపజాలని, రాక్షసరాజైన రావణునితో ద్వంద్వ యుద్ధములో పాల్గొని అదృష్టవశముచేత విజయము పొందినావు. 27

మూ. సంఖ్యే తస్య న కించిత్తు రావణస్య పరాభవః,
ద్వన్ద్వయుద్ధమనుప్రాప్తో దిష్ట్యా తే రావణిర్హతః, 28

ప్ర. అ. సంఖ్యే = యుద్ధమునందు, తస్య రావణస్య = ఆ రావణుని యొక్క, పరాభవః = పరాభవము, న కించిత్తు = ఏమీ కాదు. దిష్ట్యా = భాగ్య వశముచేత, ద్వన్ద్వయుద్ధమ్ = ద్వంద్వయుద్ధమును, అనుప్రాప్తః = పొందిన, రావణిః = ఇంద్రజిత్తు, తే = నీకు, హతః చంపబడినాడు.

తా. యుద్ధములో (ప్రత్యక్షముగా కనబడే) రావణుని చంపుట అంత గొప్ప పని కాదు. కాని ద్వంద్వయుద్ధములో నిలచిన ఇంద్రజిత్తును నీవు (నీ సోదరుడు) అదృష్టవశముచేత చంపినావు. 28

మూ. దిష్ట్యా తస్య మహాబాహో కాలస్యేవాభిధావతః,
ముక్తః సురరిపోర్వీర ప్రాప్తశ్చ విజయస్త్వయా. 29

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా. వీర = వీరుడా! దిష్ట్యా = భాగ్యవశముచేత, కాలస్యేవ = యముడు వలె, అభిధావతః = పరుగెత్తి

ఎదురుగా వచ్చుచున్న, తస్య = ఆ, సురరిపోః = ఇంద్రజిత్తుకు(నుండి), ముక్తః = ముక్తుడవైతివి; త్వయా = నీచేత, విజయశ్చ = విజయము కూడ, ప్రాప్తః = పొందబడినది.

తా. గొప్ప బాహువులు గల ఓ ! వీరుడా ! యముడు వలె శీఘ్రముగా మీదికి వచ్చుచున్న ఆ ఇంద్రజిత్తునుండి తప్పించుకొని అదృష్టవశముచే నీవు విజయము పొందినావు. 29

మూ. అభినన్దామ తే సర్వే సంశ్రుత్యేన్ద్రజితో వధమ్,
అవధ్యః సర్వభూతానాం మహామాయాధరో యుధి,
విస్మయస్త్వేష చాస్మాకం తం శ్రుత్వేన్ద్రజితం హతమ్. 30

ప్ర. అ. సర్వే = మే మందరము, తే = నీయొక్క, ఇన్ద్రజితః = ఇంద్రజిత్తుయొక్క, వధమ్ = వధను, శ్రుత్వా = విని, అభినన్దామ = అభినందించుచున్నాము. తమ్ = ఆ, ఇన్ద్రజితమ్ = ఇంద్రజిత్తును, హతమ్ = చంపబడినవానినిగా, శ్రుత్వా = విని, అస్మాకమ్ = మాకు, ఏషః = ఇది, విస్మయః తు = ఆశ్చర్యము. మహామాయాధరః = గొప్ప మాయను ధరించిన అతడు, యుధి = యుద్ధమునందు, సర్వభూతానామ్ = సకలభూతములకు, అవధ్యః = చంప శక్యము కానివాడు.

తా. నీవు ఇంద్రజిత్తును చంపిన వార్త విని మేమందరము అభినందించుచున్నాము .యుద్ధములో ఆతనిని ఎవ్వరూ కూడ చంపజాలరు. అందుచేత అతడు సంహరింపబడినట్లు విని మాకు చాలా ఆశ్చర్యము కలిగినది. 30

మూ. ఏతే చాన్యే చ బహవో రాక్షసాః కామరూపిణః,
దిష్ట్యా త్వయా హతా వీర రఘూణాం కులవర్ధన. 31

ప్ర. అ. రఘూణామ్ = రఘువంశీయుల, కులవర్ధన = కులమును వృద్ధిపొందించినవాడా ! దిష్ట్యా = భాగ్యవశముచేత, ఏతే చ = వీళ్ళు, కామరూపిణః = కామరూపము గల, వీరాః = వీరులైన, బహవః = అనేకులైన, అన్యే రాక్షసాః చ = ఇతర రాక్షసులు, త్వయా = నీచేత, హతాః = చంపబడినారు.

తా. రఘువంశీయుల కులమును వృద్ధిపొందించిన ఓ ! రామా ! నీవు

అదృష్టవశముచేత ఈ రాక్షసులను, స్వేచ్ఛా రూపధారులైన చాలమంది ఇతర రాక్షసులను చంపినావు. 31

మూ. దత్త్వా పుణ్యామిమాం వీర సౌమ్యామభయదక్షిణామ్,
దిష్ట్యా వర్ధసి కాకుత్స్థ జయేనామిత్రకర్శన. 32

ప్ర. అ. వీర = వీరుడా! అమిత్రకర్శన = శత్రువినాశకా! కాకుత్స్థ = రామా! పుణ్యామ్ = పుణ్యమైన, ఇమామ్ = ఈ, సౌమ్యామ్ = సౌమ్యమైన, అభయదక్షిణామ్ = అభయ మనే దక్షిణను, దత్త్వా = ఇచ్చి, దిష్ట్యా = భాగ్యవశముచేత, జయేన = జయముతో, వర్ధసి = వృద్ధిపొందుచున్నావు.

తా. వీరుడవు, శత్రుసంహారకుడవు అయిన ఓ! రామా! పుణ్యమైన, సౌమ్యమైన ఈ అభయదక్షిణను ఇచ్చి అదృష్టవశముచేత జయముతో వృద్ధి పొందుచున్నావు. 32

మూ. శ్రుత్వా తు వచనం తేషాం మునీనాం భావితాత్మనామ్,
విస్మయం పరమం గత్వా రామః ప్రాఞ్జలిరబ్రవీత్. 33

ప్ర. అ. భావితాత్మనామ్=పవిత్రమైన మనస్సు గల, తేషాం మునీనామ్= ఆ మునులయొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, రామః=రాముడు, పరమమ్ = గొప్ప, విస్మయమ్ = ఆశ్చర్యమును, గత్వా = పొంది, ప్రాఞ్జలిః= కట్టబడిన దోసిలి కలవాడై, అబ్రవీత్ = పలికెను.

తా. పవిత్రమైన మనస్సు గల ఆ మునుల వచనమును విని రాముడు ఆశ్చర్యపడుచు, చేతులు జోడించి నమస్కరించుచు పలికెను. 33

మూ. భవన్తః కుమ్భకర్ణం చ రావణం చ నిశాచరమ్,
అతిక్రమ్య మహావీర్యౌ కిం ప్రశంసథ రావణిమ్. 34

ప్ర. అ. భవన్తః = మీరు, మహావీర్యౌ=గొప్ప పరాక్రమము గల, కుమ్భకర్ణం చ = కుంభకర్ణుణ్ణి, నిశాచరమ్ = రాక్షసుడైన, రావణం చ = రావణుణ్ణి, అతిక్రమ్య = అతిక్రమించి, రావణిమ్ = ఇంద్రజిత్తును, కిమ్ = ఎందువలన, ప్రశంసథ = ప్రశంసించుచున్నారు ?

తా. గొప్ప పరాక్రమము గల కుంభకర్ణుణ్ణి, రావణుణ్ణి, కాదని మీరు ఇంద్ర జిత్తును ఎందుకు ఇంతగా ప్రశంసించుచున్నారు ? 34

మూ. మహోదరం ప్రహస్తం చ విరూపాక్షం చ రాక్షసమ్,
మత్తోన్మత్తౌ చ దుర్ధర్షౌ దేవాన్తకనరాన్తకౌ,
అతిక్రమ్య మహావీర్యాన్ కిం ప్రశంసథ రావణిమ్. 35

ప్ర. అ. మహావీర్యాన్ = గొప్ప పరాక్రమము గల, మహోదరమ్ = మహోదరుణ్ణి, ప్రహస్తం చ = ప్రహస్తుణ్ణి, రాక్షసమ్ = రాక్షసుడైన, విరూపాక్షం చ = విరూపాక్షుణ్ణి, మత్తోన్మత్తౌ చ = మత్తోన్మత్తులను, దుర్ధర్షౌ = ఎదిరింప శక్యము కాని, దేవాన్తకనరాన్తకౌ = దేవాంతకనరాంతకులను, అతిక్రమ్య=దాటి, రావణిమ్ = ఇంద్రజిత్తును, కిం ప్రశంసథ = ఎందువలన ప్రశంసించుచున్నారు ?

తా. గొప్ప పరాక్రమము గల మహోదర - ప్రహస్త - విరూపాక్షులను, మత్తోన్మత్తులను, ఎదిరింప శక్యము కాని దేవాంతక నరాంతకులను కాదని ఇంద్ర జిత్తును ఎందుకు ప్రశంసించుచున్నారు ? 35

మూ. అతికాయం త్రిశిరసం ధూమ్రాక్షం చ నిశాచరమ్,
అతిక్రమ్య మహావీరాన్ కిం ప్రశంసథ రావణిమ్. 36

ప్ర. అ. మహావీర్యాన్ = గొప్ప పరాక్రమము గల, అతికాయమ్ = అతికాయుణ్ణి, త్రిశిరసమ్ = త్రిశిరస్సును, నిశాచరమ్ = రాక్షసుడైన, ధూమ్రాక్షం చ=ధూమ్రాక్షుణ్ణి, అతిక్రమ్య=దాటి, రావణిమ్=ఇంద్రజిత్తును, కిం ప్రశంసథ= ఎందుకు పొగడుచున్నారు ?

తా. అతికాయుణ్ణి, త్రిశిరస్సును, ధూమ్రాక్షుణ్ణి, మహాబలవంతులైన వీళ్ళ నందరినీ కాదని ఇంద్రజిత్తును ఎందుకు ప్రశంసించుచున్నారు ? 36

మూ. కీదృశో వై ప్రభావోఽస్య కిం బలం కః పరాక్రమః,
కేన వా కారణేనైష రావణాదతిరిచ్యతే. 37

ప్ర. అ. అస్య = వీనియొక్క, ప్రభావః = ప్రభావము, కీదృశః=ఎట్టిది ? బలమ్ = బలము, కిమ్ = ఎట్టిది ? పరాక్రమః = పరాక్రమము, కః = ఎట్టిది ?

ఏషః = ఇతడు, కేన వా = ఏ, కారణేన = కారణముచేత, రావణాత్ = రావణుని కంటె, అతిరిచ్యతే = గొప్పవాడగుచున్నాడు ?

తా. అతని ప్రభావము ఎట్టిది ? బలము ఎట్టిది ? పరాక్రమము ఎట్టిది ? అతడు ఏ కారణము చేత రావణునికంటె గొప్పవాడు ? 37

మూ. శక్యం యది మయా శ్రోతుం న ఖల్వాజ్ఞాపయామి వః,
యది గుహ్యం న చేద్వక్తుం శ్రోతుమిచ్ఛామి కథ్యతామ్. 38

ప్ర. అ. మయా = నాచేత, శ్రోతుమ్ = వినుటకు, శక్యం యది = శక్యమైనచో, వక్తుమ్ = చెప్పుటకు, గుహ్యమ్ = రహస్యమైనది, న చేత్ = కానిచో, శ్రోతుమ్ = వినుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను, కథ్యతామ్ = చెప్పబడుగాక, వః = మిమ్ములను, న ఆజ్ఞాపయామి ఖలు = ఆజ్ఞాపించుటలేదు కదా !

తా. నేను వినుటకు యోగ్యమైనచో, చెప్పుటకు అది రహస్యము కానిచో, నేను వినవలె నని కోరుచున్నాను; చెప్పుడు; కాని మిమ్ములను ఆజ్ఞాపింపజాలను.

మూ. శక్రోఽపి విజితస్తేన కథం లబ్ధవరశ్చ సః,
కథం చ బలవాన్పుత్రో న పితా తస్య రావణః. 39

ప్ర. అ. తేన = వానిచేత, శక్రోఽపి = దేవేంద్రుడు కూడ, కథమ్ = ఎట్లు, విజితః = జయింపబడినాడు ? సః = అతడు, కథమ్ = ఎట్లు, లబ్ధవరశ్చ = పొందబడిన వరములు గలవాడు ? పుత్రః = పుత్రుడు, కథమ్ = ఎట్లు, బలవాన్ = బలముగలవాడు, తస్య = వానియొక్క, పితా = తండ్రియైన, రావణః = రావణుడు, న = కాడు ?

తా. అతడు దేవేంద్రుణ్ణి కూడ ఎట్లు జయించినాడు ? వరములు ఎట్లు పొందినాడు ? కుమారుడే ఎట్లు అధికబలవంతుడు ? తండ్రి ఎందువలన కాడు ?

మూ. కథం పితుశ్చాప్యధికో మహాహవే
శక్రస్య జేతా హి కథం స రాక్షసః,
వరాశ్చ లబ్ధాః కథయస్వ మేఽద్య
తత్ప్రచ్ఛతశ్చాస్య మునీన్ద్ర సర్వమ్. 40

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే ప్రథమః సర్గః.

ప్ర. అ. మునీన్ద్ర = ఓ ! మునీంద్రా ! సః రాక్షసః = ఆ రాక్షసుడు, పితుశ్చ = తండ్రికంటె కూడ, కథమ్ = ఎట్లు, అధికః = గొప్పవాడు ? మహాహవే = మహాయుద్ధమునందు, కథమ్ = ఎట్లు, శక్రస్య = ఇంద్రునకు, కథమ్ = ఎట్లు, జేతా = జయించినవాడు ? వరాశ్చ = వరములు, లబ్ధాః = ఎట్లు పొందబడినవి ? పృచ్ఛతః = అడుగుచున్న, మే = నాకు, అస్య = వీనికిసంబంధించిన, తత్ = ఆ, సర్వమ్ = సమస్తమునూ, అద్య = ఇప్పుడు, కథయస్వ = చెప్పుము.

తా. ఓ మునీంద్రా ! ఆ రాక్షసుడు తండ్రికంటె ఎట్లు గొప్పవాడు ? మహాయుద్ధములో ఇంద్రుణ్ణి ఎట్లు జయించగలిగినాడు ? వరము లెట్లు పొందినాడు ? అడుగుచున్న నాకు ఇతనికి సంబంధించిన ఈ విషయము లన్నీ చెప్పుము. 40

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ప్రథమసర్గ సమాప్తము.

అథ ద్వితీయః సర్గః

[అగస్త్యుడు పులస్త్యుని గుణములను తపస్సును వర్ణించి చెప్పి ఆతనికి విశ్రవస్సు పుట్టుకను చెప్పుట.]

మూ. తస్య తద్ వచనం శ్రుత్వా రాఘవస్య మహాత్మనః,
కుమ్భయోనిర్మహాతేజా వాక్యమేతదువాచ హ. 1

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, తస్య రాఘవస్య = ఆ రాముని యొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, కుమ్భయోనిః = అగస్త్యుడు, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. మహాత్ముడైన రాముని మాటలు విని గొప్ప తేజస్సు గల అగస్త్యుడిట్లు పలికెను. 1

మూ. శృణు రామ తథా వృత్తం తస్య తేజో బలం మహత్,
జఘాన శత్రూన్యేనాసౌ న చ వధ్యః స శత్రుభిః. 2

ప్ర. అ. రామ = రామా! తస్య = ఆ ఇంద్రజిత్తుయొక్క, వృత్తమ్ = చరిత్రను, తేజః = తేజస్సును, తథా = మరియు, మహత్ = గొప్పదైన, బలమ్ = బలమును, శృణు = వినుము; యేన = దేనిచేత, అసౌ = ఇతడు, శత్రూన్ = శత్రువులను, జఘాన = చంపెనో; సః = అట్టి, అసౌ చ = ఇతడు, శత్రుభిః = శత్రువులచేత, న వధ్యః = చంప శక్యము కానివాడో.

తా. రామా! ఏ తేజోబలాదులచేత ఈ ఇంద్రజిత్తు శత్రువులను వధించెనో, తాను వధింప శక్యముకానివాడై ఉండెనో అట్టి వాని చరితమును, తేజస్సును, గొప్ప బలమును వినుము. 2

మూ. తావత్తే రావణస్యేదం కులం జన్మ చ రాఘవ,
వరప్రదానం చ తథా తస్మై దత్తం బ్రవీమి తే. 3

ప్ర. అ. రాఘవ = రామా ! తావత్ = ముందుగా, రావణస్య = రావణుని యొక్క, ఇదమ్ = ఈ, కులమ్ = కులమును, జన్మ చ = జన్మను, తథా = మరియు, తస్మై దత్తమ్ = వానికి ఇవ్వబడిన, వరప్రదానం చ = వరప్రదానమును, తే = నీకు, బ్రవీమి = చెప్పుచున్నాను.

తా. రామా ! ముందుగా రావణుని కులమును, జన్మను, అతడు సంపాదించిన వరములను గూర్చి నీకు చెప్పెదను. 3

మూ. పురా కృతయుగే రామ ప్రజాపతిసుతః ప్రభుః,
పులస్త్యో నామ బ్రహ్మర్షిః సాక్షాదివ పితామహః. 4

ప్ర. అ. రామ = రామా ! పురా = పూర్వమునందు, ప్రజాపతిసుతః = బ్రహ్మదేవుని పుత్రుడు, ప్రభుః = సమర్థుడు, సాక్షాత్ = సాక్షాత్తు, పితామహః ఇవ = బ్రహ్మదేవుని వంటివాడు అయిన, పులస్త్యో నామ = పులస్త్య దను పేరు గల, బ్రహ్మర్షిః = బ్రహ్మర్షి, కృతయుగే = కృతయుగమునందు ఉండేవాడు.

తా. రామా ! పూర్వము కృతయుగమునందు బ్రహ్మదేవుని కుమారుడు, సాక్షాత్తు బ్రహ్మదేవుని వంటివాడు అయిన, సమర్థుడైన పులస్త్య దను బ్రహ్మర్షి ఉండేవాడు. 4

మూ. నానుకీర్త్యా గుణా స్తస్య ధర్మతః శీలత స్తథా,
ప్రజాపతేః పుత్ర ఇతి వక్తుం శక్యం హి నామతః. 5

ప్ర. అ. తస్య = అతనియొక్క, గుణాః = గుణములు, ధర్మతః = ధర్మమువలన, తథా = మరియు, శీలతః = శీలమువలనా, న అనుకీర్త్యాః = చెప్ప శక్యమైనవి కావు. నామతః = పేరువలన, ప్రజాపతేః పుత్రః = ప్రజాపతిపుత్రు దని, వక్తుమ్ = చెప్పుటకు, శక్యం హి = శక్యము కాదా.

తా. అతని ధర్మమునకు, శీలమునకు సంబంధించిన గుణములు వర్ణింప శక్యములు కావు. అతనిని పేరుచేత ప్రజాపతిపుత్రు దనియే చెప్పవలెను. 5

మూ. ప్రజాపతిసుతత్వేన దేవానాం వల్లభో హి సః,
ఇష్టః సర్వస్య లోకస్య గుణైః శుభ్రైర్మహామతిః. 6

ప్ర. అ. సః = పులస్త్యుడు, ప్రజాపతిసుతత్వేన = బ్రహ్మపుత్రుడగుట చేత, దేవానామ్ = దేవతలకు, వల్లభః హి = ఇష్టుడు కదా ? మహామతిః = గొప్ప బుద్ధి గల అతడు, శుభ్రైః = శుభ్రములైన, గుణైః = గుణములచేత, సర్వస్య లోకస్య = సమస్తలోకమునకు, ఇష్టః = ఇష్టుడు.

తా. ఆ పులస్త్యుడు ప్రజాపతిపుత్రు డగుటచేత దేవతలకు ఇష్టుడు. గొప్ప బుద్ధిగల అతడు పరిశుద్ధములైన గుణములచేత సమస్తలోకమునకు ఇష్టుడు. 6

మూ. స తు ధర్మప్రసంగేన మేరోః పార్శ్వే మహాగిరేః,
తృణబిన్ద్వాశ్రమం గత్వా న్యవసన్మునిపుఙ్గవః. 7

ప్ర. అ. సః = ఆ, మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడు, ధర్మప్రసంగేన = ధర్మప్రసంగము చేత, మహాగిరేః = మహాపర్వతమైన, మేరోః = మేరువుయొక్క, పార్శ్వే = పార్శ్వమునందు, తృణబిన్ద్వాశ్రమమ్ = తృణబింద్వాశ్రమమునుగూర్చి, గత్వా = వెళ్ళి, న్యవసత్ = నివసించెను.

తా. ఆ మహాముని ధర్మాచరణమునందు ఆసక్తిచేత మేరుమహాపర్వత పార్శ్వమునం దున్న తృణబింద్వాశ్రమమునకు వెళ్ళి అక్కడ నివసించెను. 7

మూ. తపస్తేపే స ధర్మాత్మా స్వాధ్యాయనియతేన్ద్రియః,
గత్వాశ్రమపదం తస్య విఘ్నం కుర్వన్తి కన్యకాః. 8

ప్ర. అ. సః = ఆ, ధర్మాత్మా = ధర్మాత్ముడు, స్వాధ్యాయనియతేన్ద్రియః = స్వాధ్యాయమునందు నియమింపబడిన ఇంద్రియములు కలవాడై, తపః = తపస్సును, తేపే = చేసెను. కన్యకాః = కన్యకలు, తస్య = వానియొక్క, ఆశ్రమ పదమ్ = ఆశ్రమస్థానమును గూర్చి, గత్వా = వెళ్ళి, విఘ్నమ్ = విఘ్నమును, కుర్వన్తి = చేయుచుండిరి.

తా. ధర్మాత్ముడైన ఆ పులస్త్యుడు స్వాధ్యాయమునందు ఇంద్రియములను

ఏకాగ్రము చేసి తపస్సు చేసెను. కన్యకలు అతని ఆశ్రమమునకు వెళ్ళి విఘ్నము చేయుచుండిరి. 8

మూ. ఋషిపన్నగకన్యాశ్చ రాజర్షితనయాశ్చ యాః,
క్రీడన్త్యోఽప్సరసశ్చైవ తం దేశముపపేదిరే. 9

ప్ర. అ. యాః = ఏ, ఋషిపన్నగకన్యాశ్చ = ఋషులయొక్క పన్నగుల యొక్క కన్యలు, రాజర్షితనయాశ్చ = రాజర్షుల పుత్రికలు ఉన్నారో వారు, అప్సరసశ్చైవ = అప్సరఃస్త్రీలు, క్రీడన్త్యః = క్రీడించుచున్నవారై, తం దేశమ్ = ఆ ప్రదేశమును, ఉపపేదిరే = చేరిరి.

తా. ఋషికన్యలు, నాగకన్యలు, రాజర్షికన్యలు, అప్సరఃస్త్రీలు క్రీడించుచు ఆ ప్రదేశమునకు వచ్చుచుండిరి. 9

మూ. సర్వర్తుషూపభోజ్యత్వాద్రమ్యత్వాత్కాననస్య చ,
నిత్యశస్తాస్తు తం దేశం గత్వా క్రీడన్తి కన్యకాః. 10

ప్ర. అ. తాః కన్యకాః = ఆ కన్యకలు, కాననస్య=ఆ వనము, సర్వర్తుషు = అన్ని ఋతువులయందు, ఉపభోజ్యత్వాత్ = అనుభవింపదగినదగుటవలనను, రమ్యత్వాత్ = సుందరమైనదగుటవలనను, నిత్యశః = నిత్యమూ, తం దేశమ్= ఆ ప్రదేశమును గూర్చి, గత్వా = వెళ్ళి, క్రీడన్తి = క్రీడించుచున్నారు (చుండిరి).

తా. ఆ వనము అన్ని ఋతువులలోను అనుభవించుటకు యోగ్యమై అందముగా ఉండుటచేత ఆ కన్యకలు నిత్యమూ ఆ వనమునకు వెళ్ళి క్రీడించుచుండిరి.

మూ. దేశస్య రమణీయత్వాత్పులస్త్యో యత్ర స ద్విజః,
గాయన్త్యో వాదయన్త్యశ్చ లాసయన్త్యస్తథైవ చ, 11
మునేస్తపస్వినస్తస్య విఘ్నం చక్రురనిన్దితాః.

ప్ర. అ. ద్విజః = బ్రాహ్మణుడైన, సః పులస్త్యః = ఆ పులస్త్యుడు, యత్ర = ఎక్కడ ఉండెనో, దేశస్య = ఆ ప్రదేశము, రమణీయత్వాత్ =సుందరమైనదగుటవలన, అనిన్దితాః = దోషములు లేని ఆ కన్యలు, గాయన్త్యః=గానము చేయుచు, వాదయన్త్యశ్చ = వాద్యములు ప్రయోగించుచు, తథైవ చ = మరియు,

లాసయన్త్యః = నాట్యముచేయుచు. తపస్వినః = తపస్సు గల, తస్య మునేః = ఆ మునికి, విఘ్నమ్ = విఘ్నమును, చ|క్రుః = చేసిరి.

తా. ఆ పులస్త్యుడు ఉన్న ఆ |ప్రదేశము సుందర మగుటచేత దోషరహితలైన ఆ కన్యకలు అక్కడ గానము చేయుచు, వాద్యములు వాయించుచు, నాట్యమాడుచు తపఃశాలియైన ఆ మునికి విఘ్నము చేసిరి. 11

మూ. అథ రుష్టో మహాతేజా వ్యాజహార మహామునిః, 12
యా మే దర్శనమాగచ్ఛేత్సా గర్భం ధారయిష్యతి.

|ప. అ. అథ = అటుపిమ్మట, రుష్టః = కోపించిన, మహాతేజాః = గొప్ప తేజస్సు గల మహామునిః = ఆ మహాముని, వ్యాజహార పలికెను. యా = ఏ స్త్రీ, మే = నాయొక్క, దర్శనమ్ = దర్శనమును, ఆగచ్ఛేత్ = పొందునో, సా = ఆమె, గర్భమ్ = గర్భమును, ధారయిష్యతి = ధరించగలదు.

తా. అప్పుడు మహాతేజఃశాలియైన ఆ మహాముని కోపించి "నా కంట బడిన స్త్రీ గర్భము ధరించును" అని పలికెను. 12

మూ. తాస్తు సర్వాః |ప్రతి|శ్రుత్య తస్య వాక్యం మహాత్మనః, 13
|బహ్మశాపభయాద్భీతా స్తం దేశం నోపచ|క్రముః.

|ప. అ. తాః సర్వాః = ఆ అందరు కన్యలు, మహాత్మనః = మహాత్ముడైన, తస్య = ఆ పులస్త్యునియొక్క, వాక్యమ్ = వాక్యమును, |ప్రతి|శ్రుత్య = విని, |బహ్మశాపభయాత్ = |బాహ్మణశాపభయమువలన, భీతాః = భయపడిన వారై, తం దేశమ్ = ఆ |ప్రదేశమును, నోపచ|క్రముః = వెళ్ళలేదు.

తా. ఆ కన్యక లందరూ ఆ పులస్త్యుని మాట విని, |బాహ్మణశాపమునకు భయపడి ఆ |ప్రదేశమునకు వెళ్ళుట మానివేసిరి. 13

మూ. తృణబిన్దోస్తు రాజర్షేస్తనయా న శృణోతి తత్, 14
గత్వా|శ్రమపదం త|త్ర విచచార సునిర్భయా.

|ప. అ. రాజర్షేః = రాజర్షియైన, తృణబిన్దోః = తృణబిందువుయొక్క, తనయా తు = కుమార్తె అయితే, తత్ = ఆ వాక్యమును, న శృణోతి = వినలేదు.

ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును గూర్చి, గత్వా = వెళ్ళి, సునిర్భయా = ఏ మాత్రమూ భయము లేనిదై, తత్ర = అక్కడ, విచచార = సంచరించెను.

తా. కాని రాజర్షియైన తృణబిందువు పుత్రిక ఆ విషయము వినకపోవుటచే ఆ ఆశ్రమమునకు వెళ్ళి అక్కడ నిర్భయముగా సంచరించెను. 14

మూ. న చాపశ్యచ్చ సా తత్ర కాం చిదభ్యాగతాం సఖీమ్, 15
తస్మిన్ కాలే మహాతేజాః ప్రాజాపత్యో మహానృషిః,
స్వాధ్యాయమకరోత్తత్ర తపసా భావితః స్వయమ్. 16

ప్ర. అ. సా = ఆమె, తత్ర = అక్కడ, అభ్యాగతామ్ = వచ్చిన, కాం చిత్ = ఏ, సఖీమ్ = సఖురాలినీ కూడ, న అపశ్యత్ = చూడలేదు. తస్మిన్ = ఆ, కాలే = సమయమునందు, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, తపసా = తపస్సుచేత, భావితః = పవిత్రము చేయబడిన, ప్రాజాపత్యః = ప్రజాపతిపుత్రుడైన, మహాన్ = గొప్పవాడైన, ఋషిః = ఋషి, తత్ర = అక్కడ, స్వయమ్ = స్వయముగా, స్వాధ్యాయమ్ = స్వాధ్యాయమును, అకరోత్ = చేసెను.

తా. అక్కడ ఆమెకు ఏ సఖురాలూ కూడ వచ్చినట్లు కనబడలేదు. ఆ సమయమునందు, అక్కడ గొప్ప తేజస్సు గల, తపస్సుచేత పవిత్రుడైన, ప్రజాపతి పుత్రుడైన ఆ మహర్షి స్వయముగా స్వాధ్యాయాధ్యయనము చేయుచుండెను.

మూ. సా తు వేదశ్రుతిం శ్రుత్వా దృష్ట్వా వై తపసో నిధిమ్,
అభవత్పాండుదేహా సా సువ్యఞ్జితశరీరజా. 17

ప్ర. అ. సా తు = ఆమె, వేదశ్రుతిమ్ = వేదధ్వనిని, శ్రుత్వా = విని, తపసః = తపస్సుకు, నిధిమ్ = నిధియైన ఆ పులస్త్యుణ్ణి, దృష్ట్వా = చూచి, సువ్యఞ్జితశరీరజా = చాల స్పష్టమైన గర్భముగలదై, పాణ్డుదేహా = తెల్లని దేహము గలది, అభవత్ = అయెను.

తా. ఆమె ఆ వేదధ్వనిని విని, ఆ మహర్షిని చూడగానే స్పష్టమైన గర్భముతో తెల్లని దేహము గలదిగా అయెను.

మూ. బభూవ చ సముద్విగ్నా దృష్ట్వా తద్దోషమాత్మనః,
ఇదం మే కిం త్వితి జ్ఞాత్వా పితుర్గత్వాశ్రమే స్థితా. 18

ప్ర. అ. ఆత్మనః = తనయొక్క, తత్ = ఆ, దోషమ్ = దోషమును, దృష్ట్వా = చూచి, సముద్విగ్నా = దిగులుచెందినదై, బభూవ చ = అయెను. మే = నాయొక్క, ఇదమ్ = ఇది, కిం తు = ఏమి, ఇతి = అని, జ్ఞాత్వా = ఆలోచించి, గత్వా = వెళ్ళి, పితుః = తండ్రియొక్క, ఆశ్రమే = ఆశ్రమమునందు, స్థితా = ఉన్నది.

తా. ఆమె తనలో గలిగిన ఆ దోషమును చూచి, దిగులుచెందెను. నాకు ఇదేమి, ఇట్లు జరిగినది అని ఆలోచించుకొనుచు తిరిగి వెళ్ళి తండ్రి ఆశ్రమములో ఉండెను. 18

మూ. తాం తు దృష్ట్వా తథాభూతాం తృణబిన్దురథాబ్రవీత్,
కిం త్వమేతత్త్వసదృశం ధారయస్యాత్మనో వపుః. 19

ప్ర. అ. అథ = అనంతరము, తృణబిన్దుః = తృణబిందువు, తథాభూతామ్ = ఆ విధముగా ఉన్న, తామ్ = ఆమెను, దృష్ట్వా = చూచి, త్వమ్ = నీవు, అసదృశమ్ = తగని, ఏతత్ = ఈ, ఆత్మనః వపుః = నీ శరీరమును, ధారయసి = ధరించుచున్నావు; కిమ్ = ఇది ఏమి ? అని, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు తృణబిందువు ఆ విధముగా ఉన్న ఆమెను చూచి "నీ శరీరము ఉండవలసిన విధముగా లేదు; ఇది ఏమి ?" అని ప్రశ్నించెను. 19

మూ. సా తు కృత్వాఞ్జలిం దీనా కన్యోవాచ తపోధనమ్,
న జానే కారణం తాత యేన మే రూపమీదృశమ్. 20

ప్ర. అ. సా కన్యా తు = ఆ కన్య అయితే, దీనా = దీనురాలై, అఞ్జలిమ్ = దోసిలిని, కృత్వా = చేసి, తపోధనమ్ = ఆ రాజర్షిని గూర్చి, ఉవాచ = పలికెను. తాత = తండ్రీ, యేన = ఏ కారణముచేత, మే = నాయొక్క, రూపమ్ = రూపము, ఈదృశమ్ = ఇట్టిదిగా అయినదో, కారణమ్ = ఆ కారణమును, న జానే = ఎరుగను.

తా. ఆ కన్య దీనురాలై, అంజలి ఘటించి ఇట్లు చెప్పెను :- "తండ్రీ ! నా రూపము ఇట్లు ఎందుచేత అయినదో నాకు తెలియదు." 20

మూ. కిం తు పూర్వం గతాస్మ్యేకా మహర్షేర్భావితాత్మనః,
పులస్త్యస్యాశ్రమం దివ్యమన్వేష్టుం స్వసఖీజనమ్. 21

ప్ర. అ. కిం తు = కాని, పూర్వమ్ = పూర్వము, స్వసఖీజనమ్ = నా సఖీజనమును, అన్వేష్టుమ్ = వెదకుటకు, ఏకా = ఒంటరిదాననై, భావితాత్మనః = పవిత్రమైన మనస్సు గల, మహర్షేః = మహర్షియైన, పులస్త్యస్య = పులస్త్యుని యొక్క, దివ్యమ్ = దివ్యమైన, ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును గూర్చి, గతా = వెళ్ళినాను.

తా. కాని పూర్వ మొకనాడు నా సఖురాళ్ళను వెదకుచు పవిత్రమైన మనస్సు గల పులస్త్య మహర్షి ఆశ్రమమునకు ఒంటరిగా వెళ్ళి ఉన్నాను. 21

మూ. న చ పశ్యామ్యహం తత్ర కాం చిదభ్యాగతాం సఖీమ్,
రూపస్య తు విపర్యాసం దృష్ట్వా త్రాసాదిహాగతా. 22

ప్ర. అ. తత్ర = అక్కడ, అహమ్ = నేను, అభ్యాగతామ్ = వచ్చిన, సఖీమ్ = సఖురాలిని, కాం చిత్ = ఒక్కదానినీ కూడ, న పశ్యామి = చూడను. (చూడలేదు). తు = కాని, రూపస్య = రూపముయొక్క, విపర్యాసమ్ = మార్పును, దృష్ట్వా = చూచి, త్రాసాత్ = భయమువలన, ఇహ = ఇక్కడికి, ఆగతా = వచ్చినాను.

తా. అక్కడికి ఏ సఖురాలూ కూడ వచ్చినట్లు కనబడలేదు. కాని నా రూపములో మార్పు కలుగుట చూచి, భయముతో ఇక్కడికి వచ్చినాను. 22

మూ. తృణబిన్దుస్తు రాజర్షిస్తపసా ద్యోతితప్రభః,
ధ్యానం వివేశ తచ్చాపి అపశ్యదృషికర్మజమ్. 23

ప్ర. అ. తపసా = తపస్సుచేత, ద్యోతితప్రభః = ప్రకాశింపచేయబడిన కాంతి గల, రాజర్షిః = రాజర్షియైన, తృణబిన్దుస్తు = తృణబిందువైతే, ధ్యానమ్ = ధ్యానమును, వివేశ = ప్రవేశించెను. తత్ = దానిని, ఋషికర్మజమ్ = ఋషి యొక్క కర్మవలన కలిగినదానినిగా, అపశ్యత్ = చూచెను.

తా. తపస్సుతో ప్రకాశించుచున్న రాజర్షియైన తృణబిందువు ధ్యానములో ప్రవేశించి అది ఆ ఋషి శాపమువలన కలిగిన దని గ్రహించెను. 23

మూ. స తు విజ్ఞాయ తం శాపం మహర్షేర్భావితాత్మనః,
గృహీత్వా తనయాం గత్వా పులస్త్యమిదమబ్రవీత్. 24

ప్ర. అ. సః = అతడు, భావితాత్మనః = పవిత్రమైన మనస్సు గల, మహర్షేః = మహర్షియొక్క, తం శాపమ్ = ఆ శాపమును, జ్ఞాత్వా = తెలిసికొని, తనయామ్ = కుమార్తెను, గృహీత్వా = తీసికొని, గత్వా = వెళ్ళి, పులస్త్యమ్ = పులస్త్యుణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. అతడు పవిత్రమైన మనసుగల ఆ మహర్షి ఇచ్చిన శాపమును తెలిసికొని, కుమార్తెను తీసికొని వెళ్ళి పులస్త్యునితో ఇట్లు పలికెను. 24

మూ. భగవంస్తనయాం మే త్వం గుణైః స్వైరేవ భూషితామ్,
భిక్షాం ప్రతిగృహాణేమాం మహర్షే స్వయముద్యతామ్. 25

ప్ర. అ భగవన్ = పూజ్యుడా ! మహర్షే = మహర్షీ ! స్వైః = తన సంబంధమైన, గుణైరేవ = గుణములచేతనే, భూషితామ్ = అలంకరించబడిన, మే తనయామ్ = నా కుమార్తెయైన, ఇమామ్ = ఈమెను, స్వయమ్ = స్వయముగా, ఉద్యతామ్ = ఇవ్వబడిన, భిక్షామ్ = భిక్షనుగా, ప్రతిగృహాణ = స్వీకరించుము.

తా. పూజ్యుడవైన ఓ మహర్షీ ! ఈమె నా కుమార్తె. తన గుణములచేతనే అలంకరించబడినది. ఈమెను తనంతట తానుగా వచ్చిన భిక్షనుగా స్వీకరింపుము. 25

మూ. తపశ్చరణయుక్తస్య శ్రామ్యమాణేన్ద్రియస్య తే,
శుశ్రూషణపరా నిత్యం భవిష్యతి న సంశయః 26

ప్ర. అ. తపశ్చరణయుక్తస్య = తపస్సును ఆచరించుటయందు లగ్నమైన, శ్రామ్యమాణేన్ద్రియస్య = శ్రమపడుచున్న ఇంద్రియములు గల, తే = నీయొక్క, నిత్యమ్ = నిత్యమూ, శుశ్రూషణపరా = శుశ్రూషణమునందు ఆసక్తి కలది, భవిష్యతి = కాగలదు. సంశయః = సంశయము, న = లేదు.

తా. తపస్సు చేయుచు శ్రమపడుచున్న ఇంద్రియములు గల నీకు నిత్యమూ శుశ్రూష చేయుటయందే ఈమె ఆసక్తి గలదై ఉండగలదు; సందేహము లేదు. 26

మూ. తం బ్రువాణం తు తద్వాక్యం రాజర్షిం ధార్మికం తదా,
జిఘృక్షురబ్రవీత్కన్యాం బాఢమిత్యేవ స ద్విజః. 27

ప్ర. అ. సః ద్విజః = ఆ బ్రాహ్మణుడు, తదా = అప్పుడు, కన్యామ్ = కన్యకను, జిఘృక్షుః = గ్రహింపదలచిన వాడై, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, బ్రువాణమ్ = పలుకుచున్న, ధార్మికమ్ = ధార్మికుడైన, తం రాజర్షిమ్ = ఆ రాజర్షిని గూర్చి, బాఢమ్ ఇత్యేవ = తప్పక అట్లే అగుగాక అని, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు ధార్మికుడైన ఆ రాజర్షి పలికిన పలుకులు విని, ఆ బ్రాహ్మణుడు ఆ కన్యకను స్వీకరించుటకు నిశ్చయించుకొని, అట్లే అగుగాక అని పలికెను. 27

మూ. దత్వా తు తనయాం రాజా స్వమాశ్రమపదం గతః,
సాపి తత్రావసత్కన్యా తోషయన్తీ పతిం గుణైః. 28

ప్ర. అ. రాజా = రాజు, తనయామ్ = కుమార్తెను, దత్వా = ఇచ్చి, స్వమ్ = తన సంబంధమైన, ఆశ్రమపదమ్ = ఆశ్రమస్థానమును గూర్చి, గతః = వెళ్ళినాడు. సా కన్యాపి = ఆ కన్యకూడ, గుణైః = గుణములచేత, పతిమ్ = భర్తను, తోషయన్తీ = సంతోషింపచేయుచున్నదై, తత్ర = అక్కడ, అవసత్ = నివసించెను.

తా. రాజు కుమార్తెను ఆతనికి ఇచ్చి తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను. ఆ కన్య కూడ తన గుణములచేత భర్తను సంతోషపెట్టుచు అక్కడ నివసించెను. 28

మూ. తస్యాస్తు శీలవృత్తాభ్యాం తుతోష మునిపుంగవః,
ప్రీతః స తు మహాతేజా వాక్యమేతదువాచ హ. 29

ప్ర. అ. మునిపుంగవః = ఆ మునిశ్రేష్ఠుడు, తస్యాః = ఆమె యొక్క, శీలవృత్తాభ్యామ్ = శీలముచేతను, నడవడికచేతను, తుతోష = సంతోషించెను. సః = ఆ, మహాతేజాః = గొప్ప తేజస్సు గల పులస్త్యుడు, ప్రీతః = సంతోషించినవాడై, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. ఆ మునిశ్రేష్ఠుడు ఆమె శీలముచేతను, నడవడిక చేతను చాల

సంతోషించెను గొప్ప తేజస్సు గల ఆ పులస్త్యుడు సంతోషించి ఈ వాక్యమును పలికెను. 29

మూ. పరితుష్టోఽస్మి సుశ్రోణి గుణానాం సంపదా భృశమ్,
తస్మాద్దేవి దదామ్యద్య పుత్రమాత్మసమం తవ,
ఉభయోర్వంశకర్తారం పౌలస్త్య ఇతి విశ్రుతమ్. 30

ప్ర. అ. సుశ్రోణి = ఓ! సుందరీ! గుణానామ్ = గుణములయొక్క, సంపదా = సంపదచేత, భృశమ్ = మిక్కిలి, పరితుష్టః అస్మి = సంతోషించితిని. దేవి = ఓ! దేవీ! తస్మాత్ = ఆ కారణమువలన, తవ = నీకు, ఆత్మసమమ్ = నాతో సమానుడు, ఉభయోః = మన ఇద్దరియొక్క, వంశకర్తారమ్ = వంశమును చేయువాడు, పౌలస్త్యః ఇతి = పౌలస్త్యుడు అని, విశ్రుతమ్ = ప్రసిద్ధుడూ అయిన, పుత్రమ్ = పుత్రుణ్ణి, అద్య = ఇప్పుడు, దదామి = ఇచ్చుచున్నాను.

తా. ఓ! సుందరీ! నీ గుణసంపదకు చాలా సంతోషించినాను. అందువలన నీకు, ఇప్పుడు. ఉభయవంశములను ఉద్ధరించు. పౌలస్త్య దను కుమారుణ్ణి ఇచ్చెదను. 30

మూ. యస్మాత్తు విశ్రుతో వేదస్త్వయేహాధ్యయతో మమ,
తస్మాత్స విశ్రవా నామ భవిష్యతి న సంశయః. 31

ప్ర. అ. ఇహ = ఇక్కడ, మమ = నేను, అధ్యయతః = చదువుచుండగా, వేదః = వేదము, యస్మాత్ = ఏ కారణమువలన, విశ్రుతః = వినబడినదో, తస్మాత్ = ఆ కారణమువలన, విశ్రవాః నామ = విశ్రవస్సు అను పేరుగలవాడు, భవిష్యతి = కాగలడు. సంశయః = సంశయము, న = లేదు.

తా. నేను ఇక్కడ వేదాధ్యయనము చేయుచుండగా నీవు విని ఉన్నావు కదా? అందుచేత వానికి "విశ్రవుడు" అను పేరు వచ్చును; సందేహములేదు. 31

మూ. ఏవముక్తా తు సా దేవీ ప్రహృష్టేనాన్తరాత్మనా,
అచిరేణైవ కాలేనాసూత విశ్రవసం సుతమ్,
త్రిషు లోకేషు విఖ్యాతం యశోధర్మసమన్వితమ్. 32

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తా = పలకబడిన, సా దేవీ = ఆ దేవి,

ప్రహృష్టేన = సంతోషించిన, అన్తరాత్మనా = మనస్సుతో కూడినదై, అచిరేణ కాలేనైవ = అచిరకాలముచేతనే, త్రిషు = మూడు, లోకేషు = లోకములయందు, విఖ్యాతమ్ = ప్రసిద్ధిచెందిన, యశోధర్మ సమన్వితమ్ = యశస్సుతోను ధర్మముతోను కూడిన, విశ్రవసమ్ = విశ్రవసుడను, సుతమ్ = కుమారుణ్ణి, అసూత = కనెను.

తా. ఆ దేవి ఆ మాటలు విని చాల సంతోషించెను. ఆమె అచిరకాలమునందే, మూడు లోకములలో ప్రసిద్ధుడు, యశోధర్మములతో ప్రకాశించువాడు అయిన విశ్రవసుడు అను పుత్రుణ్ణి కనెను. 32

మూ. శ్రుతిమాన్ సమదర్శీ చ వ్రతాచారరత స్తథా,
పితేవ తపసా యుక్తో హ్యభవద్విశ్రవా మునిః. 33

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్వితీయః సర్గః.

ప్ర. అ మునిః = మునియైన. విశ్రవాః = విశ్రవసుడు, పితేవ = తండ్రి వలె, శ్రుతిమాన్ = వేదములుకలవాడు, సమదర్శీ చ = సమదృష్టికలవాడు, తథా = మరియు, వ్రతాచారరతః = వ్రతములయందు ఆచారములయందు ఆసక్తుడు, తపసా = తపస్సుతో, యుక్తః = కూడినవాడు, అభవత్ హి = ఆయెను.

తా. మునియైన విశ్రవస్సు తండ్రి వలె వేదపారంగతుడు, సమదృష్టి కలవాడు, వ్రతములయందు ఆచారములయందు ఆసక్తుడు, తపఃశాలి అయి ఉండెను. 33

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
ద్వితీయసర్గ సమాప్తము.

అథ తృతీయః సర్గః

[విశ్రవసుకు వైశ్రవణుడు అను పుత్రుడు జనించుట. అతడు తపస్సు చేసి వరములు పొంది లంకలో నివసించుట.]

మూ. అథ పుత్రః పులస్త్యస్య విశ్రవా మునిపుఙ్గవః,
అచిరేణైవ కాలేన పితేవ తపసి స్థితః. 1

ప్ర. అ. అథ = అటుపిమ్మట, పులస్త్యస్య = పులస్త్యునియొక్క, పుత్రః = పుత్రుడైన, మునిపుంగవః = మునిశ్రేష్ఠుడైన, విశ్రవాః = విశ్రవసుడు, పితేవ = తండ్రివలె, అచిరేణైవ = అల్పమైన, కాలేన = కాలముచేత, తపసి = తపస్సునందు, స్థితః = ఉండెను.

తా. పులస్త్యుని కుమారుడైన మునిశ్రేష్ఠుడైన విశ్రవసుడు అల్పకాలమునందే తండ్రి వలె తపోనిష్ఠాగరిష్ఠుడాయెను. 1

మూ. సత్యవాన్ శీలవాన్ దాన్తః స్వాధ్యాయనిరతః శుచిః,
సర్వభోగేష్వసంసక్తో నిత్యం ధర్మపరాయణః. 2

ప్ర. అ. సత్యవాన్ = సత్యవంతుడు, శీలవాన్ = మంచి శీలము గలవాడు, దాన్తః = ఇంద్రియనిగ్రహవంతుడు, స్వాధ్యాయనిరతః = స్వాధ్యాయమునందు ఆసక్తి కలవాడు, శుచిః = పరిశుద్ధుడు, సర్వభోగేషు = సమస్తభోగములయందు, అసంసక్తః = ఆసక్తిలేనివాడు, నిత్యమ్ = ఎల్లప్పుడూ, ధర్మపరాయణః = ధర్మమునందు ఆసక్తి కలవాడు అయి ఉండెను.

తా. స్వాధ్యాయాధ్యయనము నందు ఆసక్తుడై, ఇంద్రియనిగ్రహముతో పవిత్రుడుగా ఉన్న ఆతడు సత్యసచ్ఛీలములతో ఏ భోగములయందును ఆసక్తి లేనివాడై నిత్యము ధర్మము నాచరించుచుండెను. 2

మూ. జ్ఞాత్వా తు తస్య తద్వృత్తం భరద్వాజో మహామునిః,
దదౌ విశ్రవసే భార్యాం స్వసుతాం దేవవర్ణినీమ్. 3

ప్ర. అ. మహామునిః = మహాముని యైన, భరద్వాజః = భరద్వాజుడు అను, మహామునిః = మహాముని, తస్య = అతనియొక్క, తత్ = ఆ, వృత్తమ్ = చరిత్రను, శ్రుత్వా = విని, విశ్రవసే = విశ్రవసునకు, దేవవర్ణినీమ్ = దేవతతో సమానమైన రూపము గల, స్వసుతామ్ = తన కుమార్తెను, భార్యామ్ = భార్యనుగా, దదౌ = ఇచ్చెను.

తా. భరద్వాజమహాముని ఆ విశ్రవసుని మంచి చరిత్రను గూర్చి విని, దేవత వంటి సౌందర్యము గల తన కుమార్తెను అతనికి భార్యనుగా ఇచ్చెను. 3

మూ. ప్రతిగృహ్య తు ధర్మేణ భరద్వాజసుతాం తదా,
ప్రజాన్వీక్షికయా బుద్ధ్యా శ్రేయో హ్యస్య విచిన్తయన్. 4
ముదా పరమయా యుక్తో విశ్రవా మునిపుఙ్గవః,
స తస్యాం వీర్యసంపన్నమపత్యం పరమాద్భుతమ్, 5
జనయామాస ధర్మజ్ఞః సర్వైర్బ్రహ్మగుణైర్వృతమ్.

ప్ర. అ. ధర్మజ్ఞః = ధర్మమును ఎరిగిన, మునిపుంగవః = మునిశ్రేష్ఠుడైన, విశ్రవాః = విశ్రవసుడు, తదా = అప్పుడు, పరమయా = గొప్ప, ముదా = సంతోషముతో, యుక్తః = కూడినవాడై, ప్రజాన్వీక్షికయా = సంతానమును గూర్చి ఆలోచించు, బుద్ధ్యా = బుద్ధితో, భరద్వాజసుతామ్ = భరద్వాజుని కుమార్తెను, ధర్మేణ = ధర్మముచేత, ప్రతిగృహ్య = స్వీకరించి. అస్య = పుట్టబోవు పుత్రునియొక్క, శ్రేయః = శ్రేయస్సును, విచిన్తయన్ = ఆలోచించుచు, తస్యామ్ = ఆమెయందు, వీర్యసంపన్నమ్ = పరాక్రమవంతుడు, పరమాద్భుతమ్ = చాల ఆశ్చర్యకరుడు, సర్వైః = సమస్తమైన, బ్రహ్మగుణైః = బ్రాహ్మణగుణములతో, వృతమ్ = కూడినవాడూ అయిన, అపత్యమ్ = సంతానమును (పుత్రుని), జనయామాస = జనింపచేసెను.

తా. సకలధర్మములు తెలిసిన మునిశ్రేష్ఠుడైన విశ్రవసుడు, చాల సంతోషించుచు, సంతానము కనవలె నను ఆలోచనతో, పుట్టబోవు పుత్రుని

శ్రేయస్సును కోరుచు ఆ భరద్వాజుని కుమార్తెను ధర్మానుసారముగా స్వీకరించి, ఆమెయందు పరాక్రమవంతుడు, చాల ఆశ్చర్యమును కలిగించువాడు, సమస్తమైన బ్రాహ్మణగుణములతో కూడినవాడు అయిన పుత్రుణ్ణి జనింపచేసెను 4,5

మూ. తస్మిన్ జాతే తు సంహృష్టః స బభూవ పితామహః. 6
దృష్ట్వా శ్రేయస్కరీం బుద్ధిం ధనాధ్యక్షో భవిష్యతి,
నామ చాస్యాకరోత్ప్రీతః సార్ధం దేవర్షిభిస్తదా. 7

ప్ర. అ. తస్మిన్ = అతడు, జాతే = పుట్టినవాడగుచుండగా, సః = ఆ, పితామహః = పితామహుడు, సంహృష్టః = సంతోషించినవాడు, బభూవ హ = ఆయెను. శ్రేయస్కరామ్ = శ్రేయస్కరమైన, బుద్ధిమ్ = బుద్ధిని, దృష్ట్వా = చూచి, ధనాధ్యక్షః = ధనాధ్యక్షుడు, భవిష్యతి = కాగలడు (అని పలికెను). ప్రీతః = సంతోషించినవాడై, తదా = అప్పుడు, దేవర్షిభిః సార్ధమ్ = దేవర్షులతో కూడ కలిసి, అస్య = వీనికి, నామ చ = పేరును కూడ, అకరోత్ = చేసెను.

తా. ఆతడు పుట్టుటచే పితామహుడైన పులస్త్యుడు సంతోషించెను. ఆతని శ్రేయస్కరమైన బుద్ధిని గుర్తించి "ఇతడు ధనాధ్యక్షుడు కాగలడు"అని పలికెను. అప్పుడు దేవర్షులతో కూడి సంతోషపూర్వకముగా ఇతనికి నామధేయము చేసెను.

మూ. యస్మాద్విశ్రవసోఽపత్యం సాదృశ్యాద్విశ్రవా ఇవ,
తస్మాద్వైశ్రవణో నామ భవిష్యత్యేష విశ్రుతః. 8

ప్ర. అ. యస్మాత్ = ఏ కారణమువలన, విశ్రవసః = విశ్రవసుని యొక్క, అపత్యమ్ = సంతానమో, సాదృశ్యాత్ = సాదృశ్యమువలన, విశ్రవాః ఇవ = విశ్రవస్సు వలె ఉన్నాడో, తస్మాత్ = ఆ కారణమువలన, ఏషః = ఇతడు, వైశ్రవణో నామ = వైశ్రవణు డని, విశ్రుతః = ప్రసిద్ధుడు, భవిష్యతి = కాగలడు.

తా. విశ్రవసుని పుత్రుడైన ఇతడు విశ్రవసుని పోలికలో ఉన్నాడు. అందుచేత ఇతడు వైశ్రవణు డని ప్రసిద్ధి పొందగలడు. 8

మూ. స తు వైశ్రవణస్తత్ర తపోవనగతస్తదా,
అవర్ధతాహుతిహుతో మహాతేజా యథానలః. 9

ప్ర. అ. తదా = అప్పుడు, తత్ర = అక్కడ, తపోవనగతః = తపోవనములో ఉన్న, సః = ఆ, వైశ్రవణః = వైశ్రవణుడు, ఆహుతిహుతః = హోమముచేయబడిన ఆహుతులు గల, అనలః యథా = అగ్ని వలె, మహాతేజాః = గొప్ప తేజస్సు గలవాడై, అవర్ధత = పెరిగెను.

తా. అప్పుడు ఆ తపోవనమునందున్న వైశ్రవణుడు ఆహుతులు హోమము చేసిన అగ్నివలె గొప్ప తేజస్సుతో పెరిగెను. 9

మూ. తస్యాశ్రమపదస్థస్య బుద్ధిర్జజ్ఞే మహాత్మనః,
చరిష్యే పరమం ధర్మం ధర్మో హి పరమా గతిః. 10

ప్ర. అ. ఆశ్రమపదస్థస్య = ఆశ్రమస్థానమునందున్న, తస్య మహాత్మనః = ఆ మహాత్మునకు, బుద్ధిః = బుద్ధి, జజ్ఞే = పుట్టెను. పరమమ్ = గొప్ప, ధర్మమ్ = ధర్మమును, చరిష్యే = ఆచరించగలను, ధర్మః = ధర్మము, పరమా = గొప్పదైన, గతిః హి = గతి కదా ?

తా. ఆశ్రమములో నివసించుచున్న మహాత్ముడైన ఆ వైశ్రవణునకు - "ధర్మమే అత్యుత్తమగతి గాన ధర్మమును ఆచరించెదను" అను బుద్ధి కలిగెను.

మూ. స తు వర్షసహస్రాణి తపస్తప్త్వా మహావనే,
యన్త్రితో నియమైరుగ్రైశ్చకార సుమహత్తపః. 11

ప్ర. అ. సః = అతడు, వర్షసహస్రాణి = వేలకొలది సంవత్సరములను, మహావనే = మహావనమునందు, తపః = తపస్సు, తప్త్వా = చేసి, ఉగ్రైః = ఉగ్రములైన, నియమైః = నియమములచేత, యన్త్రితః = నియంత్రితుడై, సుమహత్ = చాల గొప్ప, తపః = తపస్సును, చకార = చేసెను.

తా. అతడు వేలకొలది సంవత్సరములు మహావనమునందు తపస్సు చేసి, ఉగ్రములైన నియమములు పాటించుచు చాల గొప్ప తపస్సు చేసెను. 11

మూ. పూర్ణే వర్షసహస్రాన్తే తం తం విధిమకల్పయత్,
జలాశీ మారుతాహారో నిరాహారస్తథైవ చ,
ఏవం వర్షసహస్రాణి జగ్ముస్తాన్యేకవర్షవత్. 12

ప్ర. అ. పూర్ణే = పూర్ణమైన, వర్షసహస్రాన్తే = వేయి సంవత్సరముల అంతమునందు, జలాశీ = జలమును మాత్రమే భుజించుచు, మారుతాహారః = వాయువే ఆహారముగా కలవా డగుచు, తథైవ చ = మరియు, నిరాహారః=ఆహారములేని వాడగుచు, తం తమ్=ఆ యా, విధిమ్=నియమమును, అకల్పయత్= కల్పించుకొనెను. ఏవమ్ = ఇట్లు, తాని = ఆ, వర్షసహస్రాణి = వేలకొలది సంవత్సరములు. ఏకవర్షవత్ = ఒకే సంవత్సరము వలె, జగ్ముః = వెళ్ళినవి.

తా. వేయి సంవత్సరముల కాలము పూర్తిఅయిన పిమ్మట అతడు జలము మాత్రమే త్రాగుట, వాయువు మాత్రమే ఆహారముగా తీసికొనుట, ఆహార మేమీ లేకపోవుట మొదలైన ఆ యా నియమములను పాటించెను. ఈ విధముగా వేల కొలది సంవత్సరములు ఒక్క సంవత్సరముగా గడచిపోయెను. 12

మూ అథ ప్రీతో మహాతేజాః సేన్ద్రైః సురగణైః సహ,
గత్వా తస్యాశ్రమపదం బ్రహ్మేదం వాక్యమబ్రవీత్· 13

ప్ర. అ. అథ = అటుపిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, బ్రహ్మ = బ్రహ్మ, ప్రీతః = సంతోషించినవాడై, సేన్ద్రైః = ఇంద్రునితో కూడిన, సురగణైః సహ = దేవతాగణములతో కూడ, తస్య = అతనియొక్క, ఆశ్రమ పదమ్ = ఆశ్రమస్థానమును గూర్చి, గత్వా = వెళ్ళి, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట గొప్ప తేజస్సు గల బ్రహ్మదేవుడు సంతోషించి, ఇంద్రునితో కూడిన దేవతాగణములతో కూడ అతని ఆశ్రమమునకు వెళ్ళి ఇట్లు పలికెను. 13

మూ. పరితుష్టోఽస్మి తే వత్స కర్మణానేన సువ్రత,
వరం వృణీష్వ భద్రం తే వరార్హస్త్వం మహామతే. 14

ప్ర. అ. సువ్రత = మంచి నియమములు గలవాడా ! వత్స = నాయనా! తే = నీయొక్క, అనేన = ఈ, కర్మణా = కర్మచేత, పరితుష్టః అస్మి = సంతోషించితిని. మహామతే = గొప్ప బుద్ధి కలవాడా, త్వమ్ = నీవు, వరార్హః = వరములకు తగినవాడవు. వరమ్=వరమును, వృణీష్వ=కోరుకొనుము. తే=నీకు, భద్రమ్ = క్షేమ మగు గాక.

తా. నాయనా! మంచి నియమములు కలవాడా! ఈ నీ తపస్సుకు సంతోషించినాను. గొప్ప బుద్ధి కలవాడా! నీవు వరములకు తగినవాడవు; వరము కోరుకొనుము. నీకు క్షేమ మగుగాక. 14

మూ. అథాబ్రవీద్వైశ్రవణః పితామహముపస్థితమ్,
భగవన్ లోకపాలత్వమిచ్ఛేయం విత్తరక్షణమ్. 15

ప్ర. అ. అథ = అటుపిమ్మట, వైశ్రవణః = వైశ్రవణుడు, ఉపస్థితమ్ = వచ్చిన, పితామహమ్ = బ్రహ్మదేవుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. భగవన్ = పూజ్యుడా! విత్తరక్షణమ్ = ధనమునకు అధిపతిత్వమును, లోకపాలత్వమ్ = లోకపాలత్వమును, ఇచ్ఛేయమ్ = కోరుదును.

తా. అప్పుడు వైశ్రవణుడు వచ్చిన బ్రహ్మదేవునితో ఇట్లనెను- "పూజ్యుడా! లోకపాలత్వమును, ధనాధిపత్యమును కోరుచున్నాను". 15

మూ. అథాబ్రవీద్వైశ్రవణం పరితుష్టేన చేతసా,
బ్రహ్మ సురగణైః సార్ధం బాఢమిత్యేవ హృష్టవత్. 16

ప్ర. అ. అథ = అటు పిమ్మట, సురగణైః సార్ధమ్ = దేవతాగణములతో కూడిన, బ్రహ్మ = బ్రహ్మదేవుడు, హృష్టవత్ = సంతోషించినవాడై, పరితుష్టేన = సంతోషించిన, చేతసా = చిత్తముతో, వైశ్రవణమ్ = వైశ్రవణుని గూర్చి, బాఢమ్ ఇత్యేవ = తప్పక అట్లే అని, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట దేవతాగణములతో కూడిన బ్రహ్మదేవుడు సంతోషించిన మనస్సుతో, ఆనందపూర్వకముగా వైశ్రవణునితో "తప్పక అట్లే అగుగాక" అని పలికెను. 16

మూ. అహం వై లోకపాలానాం చతుర్థం స్రష్టుముద్యతః,
యమేన్ద్రవరుణానాం చ పదం యత్తవ చేప్సితమ్. 17

తద్గచ్ఛ బత ధర్మజ్ఞ నిధీశత్వమవాప్నుహి,
శక్రామ్బుపయమానాం చ చతుర్థస్త్వం భవిష్యసి. 18

ప్ర. అ. ధర్మజ్ఞ=ధర్మము తెలిసినవాడా! అహమ్=నేను, లోకపాలానామ్ = లోకపాలురైన, యమేన్ద్రవరుణానాం చ = యమ - ఇంద్ర - వరుణులకు, చతుర్థమ్ = నాల్గవవానిని, స్రష్టుమ్ = సృజించుటకు, ఉద్యతః = ఉద్యుక్తుడనై ఉన్నాను. తవ = నీకు, యత్ = ఏది, ఈప్సితమ్ = ఇష్టమైనదో, తత్ = దానిని, గచ్ఛ = పొందుము. బత = ఆహా ! నిధీశత్వమ్ = నిధులకు అధిపత్యమును, అవాప్నుహి = పొందుము, త్వమ్ = నీవు, శక్రామ్బుపయమానామ్ = ఇంద్ర - వరుణ—యములకు, చతుర్థః = నాల్గవవాడవు, భవిష్యసి = కాగలవు.

తా. ధర్మములు తెలిసిన ఓ ! వైశ్రవణుడా ! ప్రస్తుతము లోకపాలురుగా ఉన్న యమ-ఇంద్ర-వరుణులు కాక మరొక నాల్గవ లోకపాలుణ్ణి సృష్టించవలెనని అనుకొనుచున్నాను. అందుచేత నీ కిష్టమైన లోకపాలత్వమును పొందుము. నిధులకు అధిపతివిగా కూడ అగుము; నీవు ఇటుపై ఇంద్ర-వరుణ-యములకు నాల్గవవాడవు కాగలవు. 17, 18

మూ. ఏతచ్చ పుష్పకం నామ విమానం సూర్యసంనిభమ్,
ప్రతిగృహ్ణీష్వ యానార్థం త్రిదశైః సమతాం వ్రజ. 19

ప్ర. అ. యానార్థమ్ = ప్రయాణముకొరకు, సూర్యసంనిభమ్ = సూర్యునితో సమానమైన, ఏతత్ = ఈ, పుష్పకం నామ = పుష్పక మను పేరు గల, విమానమ్ = విమానమును, ప్రతిగృహ్ణీష్వ=గ్రహించుము. త్రిదశైః=దేవతలతో, సమతామ్ = సమత్వమును, వ్రజ = పొందుము.

తా. నీవు సంచారము చేయుటకై సూర్యునితో సమానమైన ఈ పుష్పక విమానమును స్వీకరించుము; దేవతలతో సమానుడవు అగుము. 19

మూ. స్వస్తి తేఽస్తు గమిష్యామః సర్వ ఏవ యథాగతమ్,
కృతకృత్యా వయం తాత దత్త్వా తవ వరద్వయమ్. 20

ప్ర. అ. తే = నీకు, స్వస్తి = క్షేమము, అస్తు = అగుగాక. సర్వే ఏవ= అందరమూ, యథాగతమ్ = వచ్చినట్లుగా, గమిష్యామః = వెళ్లెదము. తాత = నాయనా ! తవ = నీకు, వరద్వయమ్ = రెండు వరములను, దత్త్వా = ఇచ్చి; వయమ్ = మేము, కృతకృత్యాః = కృతకృత్యులము అయినాము.

తా. నాయనా! నీకు క్షేమ మగుగాక. మేమందరము వచ్చినట్లే తిరిగి వెళ్ళెదము. నీకు రెండు వరములు ఇచ్చి మేము కృతకృత్యులము అయినాము. 20

మూ. ఇత్యుక్త్వా స గతో బ్రహ్మ స్వస్థానం త్రిదశైః సహ,
గతేషు బ్రహ్మపూర్వేషు దేవేష్వథ నభ స్తలమ్, 21
ధనేశః పితరం ప్రాహ ప్రాఞ్జలిః ప్రయతాత్మవాన్.

ప్ర. అ. సః బ్రహ్మ = ఆ బ్రహ్మదేవుడు, ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, త్రిదశైః సహ = దేవతలతో కూడ, స్వస్థానమ్ = తన స్థానమును గూర్చి,గతః= వెళ్ళినాడు. బ్రహ్మపూర్వేషు=బ్రహ్మ మొదలైన, దేవేషు = దేవతలు, నభ స్తలమ్ ఆకాశమును గూర్చి, గతేషు = వెళ్ళినవారగుచుండగా, ప్రయతాత్మవాన్ = నిగ్ర హించబడిన మనస్సు గల, ధనేశః = వైశ్రవుడు, అథ = అటు పిమ్మట, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలికలవాడై, పితరమ్ = తండ్రిని గూర్చి, ప్రాహ = పలికెను.

తా. బ్రహ్మదేవుడు ఈ విధముగా పలికి దేవతలతో కూడ స్వస్థానమునకు వెళ్ళెను. బ్రహ్మాదిదేవతలందరు ఆకాశమార్గమున వెళ్ళి పోయిన పిమ్మట, మనో నిగ్రహము గల ఆ వైశ్రవణుడు తండ్రితో ఇట్లనెను. 21

మూ. భగవన్ లబ్ధవానస్మి వరమిష్టం పితామహాత్, 22
నివాసనం న మే దేవో విదధే స ప్రజాపతిః.

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! పితామహాత్ = బ్రహ్మదేవుని నుండి, ఇష్టమ్ = ఇష్టమైన, వరమ్ = వరమును, లబ్ధవాన్ = పొందినవాడను, అస్మి = అయిఉన్నాను. దేవః = దేవుడైన, సః ప్రజాపతిః = ఆ బ్రహ్మ, మే = నాకు, నివాసనమ్ = నివాసమును, న విదధే = ఏర్పరచలేదు.

తా. పూజ్యుడా! బ్రహ్మదేవునినుండి ఇష్టమైన వరమును పొందినాను. కాని ఆ బ్రహ్మదేవుడు నాకు నివాసస్థానమును ఏర్పరపలేదు. 22

మూ. తం పశ్య భగవన్ కంచిన్నివాసం సాధు మే ప్రభో,
న చ పీడా భవేద్యత్ర ప్రాణినో యస్య కస్య చిత్. 23

ప్ర. అ. భగవన్=పూజ్యుడా! ప్రభో=సర్వసమర్థుడా! మే=నాకొరకు,

తమ్ = అట్టి, కంచిత్ = ఒకానొక, నివాసమ్ = నివాసమును, సాధు = బాగుగా, పశ్య = చూడుము; యత్ర = ఎక్కడ, యస్య కస్య చిత్ = ఏ ఒక్క, ప్రాణినః = ప్రాణికి, పీడా = పీడ, న భవేత్ = కలగదో.

తా. సర్వసమర్థుడవైన ఓ! పూజ్యుడా! నాకొరకై ఏ ప్రాణికి కూడ పీడ కలగని నివాసస్థానమును చూడుము. 23

మూ. ఏవముక్తస్తు పుత్రేణ విశ్రవా మునిపుఙ్గవః,
వచనం ప్రాహ ధర్మజ్ఞః శ్రూయతామితి సత్తమ. 24

ప్ర. అ. పుత్రేణ = పుత్రునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ధర్మజ్ఞః = ధర్మములు ఎరిగిన, మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడైన, విశ్రవాః = విశ్రవుడు, సత్తమ = చాల మంచివాడా, శ్రూయతామ్ = వినబడుగాక, ఇతి = అని, వచనమ్ = వచనమును, ప్రాహ = పలికెను.

తా. మునిశ్రేష్ఠుడు, ధర్మములు ఎరిగినవాడూ అయిన విశ్రవసుడు పుత్రుని మాటలు విని, "ఓ! సత్పురుషుడా! వినుము" అని పలికెను. 24

మూ. దక్షిణస్యోదధేస్తీరే త్రికూటో నామ పర్వతః,
తస్యాగ్రే తు విశాలా సా మహేన్ద్రస్య పురీ యథా. 25

లఙ్కా నామ పురీ రమ్యా నిర్మితా విశ్వకర్మణా,
రాక్షసానాం నివాసార్థం యదేన్ద్రస్యామరావతీ. 26

ప్ర. అ. దక్షిణస్య ఉదధేః = దక్షిణ సముద్రముయొక్క, తీరే = తీరమునందు, త్రికూటో నామ = త్రికూట మను పేరు గల, పర్వతః = పర్వత మున్నది. తస్య = దానియొక్క, అగ్రే = అగ్రమునందు, మహేన్ద్రస్య = మహేంద్రుని యొక్క, పురీ యథా = పట్టణము వలె, విశాలా = విశాలమైన, సా పురీ = ఆ పట్టణ మున్నది. రమ్యా = రమ్యమైన, లఙ్కా నామ = లంక అను, పురీ = పట్టణము, ఇన్ద్రస్య = ఇంద్రునియొక్క, అమరావతీ యథా = అమరావతి వలె, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, నివాసార్థమ్ = నివాసముకొరకు, నిర్మితా = నిర్మించబడినది.

తా. దక్షిణ సముద్రతీరమునందు త్రికూట మను పర్వత మున్నది. దాని

పైభాగమున మహేంద్రుని నగరము వంటి విశాలమైన నగర మున్నది. లంక అను, రమ్యమైన ఇంద్రుని అమరావతి వంటి ఆ నగరమును రాక్షసుల నివాసార్థమై విశ్వకర్మ నిర్మించెను. 25, 26

మూ. తత్ర త్వం వస భద్రం తే లఙ్కాయాం నాత్ర సంశయః,
హేమప్రాకారపరిఘా యన్త్రశస్త్రసమావృతా. 27
రమణీయా పురీ సా హి రుక్మవైదూర్యతోరణా,
రాక్షసైః సా పరిత్యక్తా పురా విష్ణుభయార్దితైః. 28

ప్ర. అ. తత్ర = ఆ, లఙ్కాయామ్ = లంకయందు, త్వమ్ = నీవు, వస = నివసించుము. తే = నీకు, భద్రమ్ = క్షేమము కలుగును. అత్ర = ఈ విషయమునందు, సంశయః = సంశయము, న = లేదు. హేమప్రాకారపరిఘా = బంగారు ప్రాకారము, గడియలు గల, యన్త్రశస్త్ర సమావృతా = యంత్రముల తోను ఆయుధములతోను కూడిన, రమణీయా = సుందరమైన, రుక్మవైదూర్య తోరణా = బంగారపు, వైదూర్యవికారమైన ముఖద్వారములు గల, సా = ప్రసిద్ధమైన, సా = ఆ, పురీ = పట్టణము, పురా = పూర్వము, విష్ణుభయార్దితైః = విష్ణువునుండి భయముచేత పీడింపబడిన, రాక్షసైః = రాక్షసులచేత, పరిత్యక్తా = విడవబడినది.

తా. నీవు ఆ లంకలో నివసించుము. నీకు క్షేమ మగును; సంశయము లేదు. బంగారు ప్రాకారమూ, గడియలూ, యంత్రములూ, ఆయుధములూ, బంగారువికారమైన వైదూర్యమాణిక్యములు పొదిగిన ముఖద్వారములూ గల రమ్యమైన ఆ నగరమును పూర్వము విష్ణువునుండి భయముచేత పీడితులైన రాక్షసులు విడిచి వెళ్లిపోయిరి. 27, 28

మూ. శూన్యా రక్షోగణైః సర్వై రసాతలతలం గతైః,
శూన్యా సంప్రతి లఙ్కా సా ప్రభుస్తస్యా న విద్యతే. 29

ప్ర. అ. రసాతలతలమ్ = రసాతలము అడుగుభాగమును గూర్చి, గతైః = వెళ్ళిన, సర్వైః = సమస్తమైన, రక్షోగణైః = రాక్షసగణములతో, శూన్యా = శూన్యమైనది. సంప్రతి = ఇప్పుడు, సా లఙ్కా = ఆ లంక, శూన్యా = శూన్యమైనది. తస్యాః = దానికి, ప్రభుః = ప్రభువు, న విద్యతే = లేదు.

తా. రాక్షసు లందరూ రసాతలముక్రిందికి వెళ్ళిపోయినారు. అక్కడ ఎవ్వరూ లేరు. ఈ విధముగా ఇప్పుడు లంక శూన్యముగా ఉన్నది. దానికి ప్రభువు ఎవ్వడూ లేడు. 29

మూ. స త్వం తత్ర నివాసాయ గచ్ఛ పుత్ర యథాసుఖమ్,
నిర్దోష స్తత్ర తే వాసో న బాధ స్తత్ర కస్య చిత్. 30

ప్ర. అ. పుత్ర = పుత్రుడా! సః = అట్టి, త్వమ్ = నీవు, తత్ర = అక్కడ, నివాసాయ = నివాసముకొరకు, యథాసుఖమ్ = సుఖముగా, గచ్ఛ = వెళ్లుము. తత్ర = అక్కడ, తే = నీయొక్క, వాసః = నివాసము, నిర్దోషః = దోషములు లేనిది. తత్ర = అక్కడ, కస్య చిత్ = ఎవనియొక్కా, బాధః = బాధ, న = లేదు.

తా. పుత్రా! నీవు అక్కడ నివసించుటకు సుఖముగా వెళ్లుము. అక్కడ నీవు నివసించుటలో ఏ దోషమూ ఉండదు. ఎవరి బాధా కూడ ఉండదు. 30

మూ. ఏతచ్ఛ్రుత్వా స ధర్మాత్మా ధర్మిష్ఠం వచనం పితుః,
నివాసయామాస తదా లఙ్కాం పర్వతమూర్ధని. 31

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, సః = అతడు, పితుః = తండ్రి యొక్క, ధర్మిష్ఠమ్ = ధర్మసంమతమైన, ఏతత్ = ఈ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, పర్వతమూర్ధని = పర్వతాగ్రమునందు, లఙ్కామ్ = లంకను, తదా = అప్పుడు, నివాసయామాస = నివాసముగా ఏర్పరచెను.

తా. ధర్మాత్ముడైన ఆ వైశ్రవణుడు తండ్రి పలికిన ధర్మ సంమతమైన ఆ వాక్యము విని పర్వతశిఖరముమీద ఉన్న లంకను నివాసముగా ఏర్పరచుకొనెను. 31

మూ. నైరృతానాం సహస్రైస్తు హృష్టైః ప్రముదితైః సదా,
అచిరేణైవ కాలేన సంపూర్ణా తస్య శాసనాత్. 32

ప్ర. అ. తదా = అప్పుడు, తస్య = అతనియొక్క, శాసనాత్ = శాసనము వలన, అచిరేణ కాలేనైవ = కొద్ది కాలముచేతనే, హృష్టైః = సంతోషించిన,

ప్రముదితైః = ఆనందించిన, నైర్ృతానామ్ = నైర్ృతులయొక్క, సహస్రైః = వేలచేత, సంపూర్ణా = నిండినది.

తా. ఆ లంక వైశ్రవణుని ఆజ్ఞచేత కొద్దికాలములోనే సంతోషానంద ములతో కూడిన వేలకొలది రాక్షసులతో ఎల్లప్పుడూ నిండి ఉండెను. 32

మూ. స తు తత్రావసత్ ప్రీతో ధర్మాత్మా నైర్ృతర్షభః,
సముద్రపరిఖాయాం స లఙ్కాయాం విశ్రవాత్మజః. 33

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, నైర్ృతర్షభః = నైర్ృతులలో శ్రేష్ఠుడైన, విశ్రవాత్మజః = విశ్రవస్సు కుమారుడైన, సః = ప్రసిద్ధుడైన, సః = ఆ వైశ్రవణుడు, తత్ర = అక్కడ, సముద్రపరిఖాయామ్ = సముద్రము పరిఖగా గల, లఙ్కాయామ్ = లంకయందు, ప్రీతః = సంతోషించినవాడై, అవసత్ = నివసించెను.

తా. ధర్మాత్ముడైన నైర్ృతశ్రేష్ఠుడైన ఆ వైశ్రవణుడు సముద్రము పరిఖగా ఉన్న ఆ లంకాపట్టణములో సంతోషముతో నివసించెను. 33

మూ. కాలే కాలే తు ధర్మాత్మా పుష్పకేణ ధనేశ్వరః,
అభ్యాగచ్ఛద్వినీతాత్మా పితరం మాతరం చ హి. 34

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, ధనేశ్వరః = ధనాధిపతియైన ఆ వైశ్రవణుడు, కాలే కాలే = ఆ యా కాలమునందు, పుష్పకేణ = పుష్పకముచేత, పితరమ్ = తండ్రిని గూర్చి, మాతరం చ హి = తల్లిని గూర్చి, వినీతాత్మా = వినయముతో కూడిన మనస్సు కలవాడై, అభ్యాగచ్ఛత్ = వచ్చెను.

తా. ధర్మాత్ముడు, ధనాధిపతి అయిన ఆ వైశ్రవణుడు పుష్పకము నెక్కి అప్పుడప్పుడు వినయపూర్వకముగా తలిదండ్రుల దగ్గరకు వచ్చుచుండెడివాడు.

మూ. స దేవగన్ధర్వగణైరభిష్టుత
స్తథాప్సరోనృత్యవిభూషితాలయః,
గభస్తిభిః సూర్య ఇవావభాసయన్
పితుః సమీపం ప్రయయౌ స విత్తపః. 25

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే తృతీయః సర్గః.

ప్ర. అ. దేవగన్ధర్వగణైః = దేవతలయొక్క, గంధర్వులయొక్క, గణములచేత, అభిష్టుతః = స్తుతించబడిన, తథా = మరియు, అప్సరోనృత్యవిభూషితాలయః = అప్సరస్త్రీల నృత్యములచేత అలంకరించబడిన గృహము గల, సః = ఆ, సః = ప్రసిద్ధుడైన, విత్తపః = ధనాధ్యక్షుడు, గభస్తిభిః = కిరణములచేత, సూర్యః ఇవ = సూర్యుడు వలె, అవభాసయన్ = ప్రకాశింపచేయుచు, పితుః = తండ్రియొక్క, సమీపమ్ = సమీపమును గూర్చి, ప్రయయౌ = వెళ్ళెను.

తా. దేవతాగణములచేతను, గంధర్వగణములచేతను స్తుతింపబడినవాడు, అప్సరస్త్రీల నృత్యములచేత అలంకరించబడిన గృహము గలవాడు అయిన ఆ వైశ్రవణుడు కిరణములచేత సూర్యుడు వలె ప్రకాశింపచేయుచు తండ్రి సమీపమునకు వెళ్లెను. 35

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో మూడవ సర్గ సమాప్తము.

అథ చతుర్థః సర్గః

[రాక్షసవంశవర్ణనము. హేతి - విద్యుత్కేశ - సుకేశుల ఉత్పత్తి]

మూ. శ్రుత్వాగస్త్యేరితం వాక్యం రామో విస్మయమాగతః,
కథమాసీత్తు లఙ్కాయాం సంభవో రక్షసాం పురా. 1

ప్ర. అ రామః = రాముడు, అగస్త్యస్య = అగస్త్యునియొక్క, ఈరితమ్ = పలకబడిన, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, పురా = పూర్వము, లఙ్కాయామ్ = లంకయందు, రక్షసామ్ = రాక్షసులయొక్క, సంభవః = పుట్టుక, కథమ్ = ఎట్లు, ఆసీత్ తు = అయినది అని, విస్మయమ్ = ఆశ్చర్యమును, గతః = పొందినాడు.

తా. రాముడు అగస్త్యుని మాటలు విని, పూర్వము లంకలో రాక్షసుల పుట్టుక ఎట్లు జరిగినదా అని ఆశ్చర్యపడెను. 1

మూ. తతః శిరః కమ్పయిత్వా త్రేతాగ్నిసమవిగ్రహమ్,
తమగస్త్యం ముహుర్దృష్ట్వా స్మయమానోఽభ్యభాషత. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శిరః = శిరస్సును, కమ్పయిత్వా = కదల్చి, త్రేతాగ్నిసమవిగ్రహమ్ = త్రేతాగ్నితో (అగ్నిత్రయముతో) సమానమైన శరీరము గల, తమ్ = ఆ, అగస్త్యమ్ = అగస్త్యుణ్ణి, దృష్ట్వా = చూచి, ముహుః = మాటిమాటికి, స్మయమానః = ఆశ్చర్యపడుచు, అభ్యభాషత = పలికెను.

తా. పిమ్మట అతడు శిరస్సు కదల్చుచు, మాటిమాటికి ఆశ్చర్యము చెందుచు, గార్హపత్యము, ఆహవనీయము, దక్షిణాగ్ని అను మూడు అగ్నులతో సమానమైన శరీరము గల అగస్త్యుణ్ణి చూచి ఇట్లు పలికెను. 2

మూ. భగవన్పూర్వమప్యేషా లఙ్కాసీత్పిశితాశినామ్,
శ్రుత్వేదం భగవద్వాక్యం జాతో మే విస్మయః పరః. 3

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! ఏషా = ఈ, లఙ్కా = లంక, పూర్వ మపి = పూర్వముకూడా, పిశితాశినామ్ = రాక్షసులయొక్క నివాసముగా, ఆసీత్ = ఉండెను అని, ఇదమ్ = ఈ, భగవద్వాక్యమ్ = పూజ్యుడవైన నీ వాక్యమును, శ్రుత్వా = విని, మే = నాకు, పరః = అధికమైన, విస్మయః = ఆశ్చర్యము కలిగినది.

తా. పూజ్యుడా ! ఈ లంక పూర్వము కూడ రాక్షసుల నివాసముగా ఉండె దని నీ మాటలు విని నాకు చాల అధికమైన ఆశ్చర్యము కలుగుచున్నది. 3

మూ. పులస్త్యవంశాదుద్భూతా రాక్షసా ఇతి నః శ్రుతమ్,
ఇదానీమన్యతశ్చాపి సంభవః కీర్తిత స్త్వయా. 4

ప్ర. అ. రాక్షసాః = రాక్షసులు, పులస్త్యవంశాత్ = పులస్త్యవంశమునుండి, ఉద్భూతాః ఇతి = పుట్టినారు అని, నః = మాకు, శ్రుతమ్ = వినబడినది. ఇదానీమ్ = ఇప్పుడు, త్వయా = నీచేత, అన్యతశ్చాపి = ఇతరులవల్ల కూడ, సంభవః = పుట్టుక, కీర్తితః = చెప్పబడినది.

తా. రాక్షసులు పులస్త్యవంశమునందే పుట్టినా రని మేము విని ఉన్నాము. కాని ఇప్పుడు నీవు, ఇతరవంశములందు పుట్టిన రాక్షసులు కూడ ఉండెడివారని చెప్పుచున్నావు. 4

మూ. రావణాత్కుమ్భకర్ణాచ్చ ప్రహస్తాద్వికటాదపి,
రావణస్య చ పుత్రేభ్యః కిం ను తే బలవత్తరాః. 5

ప్ర. అ. తే = వాళ్ళు, రావణాత్ = రావణునికంటె, కుమ్భకర్ణాచ్చ = కుంభకర్ణునికంటె, ప్రహస్తాత్ = ప్రహస్తునికంటె, వికటాదపి = వికటునికంటె, రావణస్య = రావణునియొక్క, పుత్రేభ్యః = పుత్రులకంటె, బలవత్తరాః కిం ను = ఎక్కువ బలము కలవారా ?

తా. ఆ రాక్షసులు రావణ- కుంభకర్ణ-ప్రహస్త-వికటులకంటెను, రావణ పుత్రులకంటెను అధికబలవంతులా ? 5

మూ. క ఏషాం పూర్వకో బ్రహ్మన్ కింనామా చ బలోత్కటః,
అపరాధం చ కం ప్రాప్య విష్ణునా ద్రావితాః కథమ్. 6

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రాహ్మణుడా! ఏషామ్ = వీరిలో, కః = ఎవడు, పూర్వకః = పూర్వుడు? బలోత్కటః = బలముచేత తీవ్రుడైన అతడు, కింనామా చ = ఏమి పేరు గలవాడు? కమ్ = ఏ, అపరాధమ్ = అపరాధమును, ప్రాప్య = పొంది, విష్ణునా = విష్ణువుచేత, కథమ్ = ఎట్లు, ద్రావితాః = తరిమివేయబడిరి?

తా. ఓ! మహామునీ! ఆ రాక్షసుల ప్రథమపురుషుడు ఎవరు? బలముచేత మదించిన అతని పేరు ఏమి? వాళ్ళు ఏ అపరాధము చేయుటచేత విష్ణువు వాళ్ళను లంకనుండి తరిమివేసినాడు? 6

మూ. ఏతద్విస్తరతః సర్వం కథయస్వ మమానఘ,
కుతూహలమిదం మహ్యం నుద భానుర్యథా తమః. 7

ప్ర. అ. అనఘ = దోషములులేనివాడా! ఏతత్ = దీనిని, సర్వమ్ = అంతను, విస్తరతః = విస్తారముగా, మమ = నాకు, కథయస్వ = చెప్పుము. మహ్యమ్ = నాకొరకు, ఇదమ్ = ఈ, కుతూహలమ్ = కుతూహలమును, భానుః = సూర్యుడు, తమః యథా = చీకటిని వలె, నుద = తొలగించుము.

తా. ఓ! దోషరహితుడా! నాకు దీని నంతను సవిస్తరముగా చెప్పి సూర్యుడు తమస్సును తొలగించినట్లు నాకు కలిగిన ఈ వేడుకను తొలగించుము.

మూ. రాఘవస్య వచః శ్రుత్వా సంస్కారాలంకృతం శుభమ్,
అథ విస్మయమానస్తమగస్త్యః ప్రాహ రాఘవమ్. 8

ప్ర. అ. అథ = అటుపిమ్మట, అగస్త్యః = అగస్త్యుడు, రాఘవస్య = రామునియొక్క, సంస్కారాలంకృతమ్ = సంస్కారముచేత అలంకరించబడిన, శుభమ్ = మంగళకరమైన, వచః = వచనమును, శ్రుత్వా = విని, విస్మయమానః = ఆశ్చర్యపడుచు, తం రాఘవమ్ = ఆ రాముణ్ణి గూర్చి, ప్రాహ = పలికెను.

తా. అప్పుడు అగస్త్యుడు రాముడు పలికిన, సంస్కారముచేత శోభించుచున్న మంగళప్రదమైన వచనమును విని ఆశ్చర్యపడుచు అతనితో ఇట్లనెను. 8

మూ. ప్రజాపతిః ప్రజాః సృష్ట్వా అపః సలిలసంభవః,
తాసాం గోపాయనే సత్త్వానసృజత్పద్మసంభవః. 9

ప్ర. అ. సలిలసంభవః=ఉదకమునుండి పుట్టిన, పద్మసంభవః=పద్మమునుండి పుట్టిన, ప్రజాపతిః = బ్రహ్మదేవుడు, అపః = ఉదకములను, సృష్ట్వా = సృష్టించి, తాసామ్ = వాటియొక్క, గోపాయనే = రక్షణమునందు, సత్త్వాన్ = ప్రాణులను, అసృజత్ = సృజించెను.

తా. జలములో పద్మమునుండి పుట్టిన బ్రహ్మదేవుడు పగలు గడచిన పిమ్మట భూమిక్రింద ఉన్న సముద్రరూపమైన జలమును సృష్టించి రాత్ర్యంతమునందు ఆ ఉదకమునందే విష్ణునాభికమలములో ఉండి, ఆ ఉదకమును రక్షించుటకై జంతువులను సృజించెను. (ఇది గోవిందరాజులు చెప్పిన భావము). 9

మూ. తే సత్త్వాః సత్త్వకర్తారం వినీతవదుపస్థితాః,
కిం కుర్మ ఇతి భాషన్తః క్షుత్పిపాసాభయార్దితాః. 10

ప్ర. అ. తే = ఆ, సత్త్వాః = ప్రాణులు, క్షుత్పిపాసాభయార్దితాః = ఆకలిచేత, దప్పికచేత, భయముచేత పీడితులై, కిమ్ = ఏమి, కుర్మః = చేయుదుము, ఇతి = అని, భాషన్తః = పలుకుచు, సత్త్వకర్తారమ్ = ప్రాణులను సృష్టించిన ఆ బ్రహ్మదేవుణ్ణి, వినీతవత్ = వినయవంతులై, ఉపస్థితాః = సమీపించిరి.

తా. ఆ ప్రాణులు ఆకలిచేత, దప్పికచేత, భయముచేత పీడితులై, "మేము ఏమి చేయవలెను ?" అని పలుకుచు, తమను సృష్టించిన ఆ బ్రహ్మదేవునివద్దకు వినయపూర్వకముగా వెళ్ళిరి. 10

మూ. ప్రజాపతిస్తు తాన్ సర్వాన్ ప్రత్యాహ ప్రహసన్నివ,
ఆభాష్య వాచా యత్నేన రక్షధ్వమితి మానవాః. 11

ప్ర. అ. ప్రజాపతిస్తు=బ్రహ్మదేవుడైతే, ప్రహసన్నివ = నవ్వుచు, తాన్ =ఆ, సర్వాన్ = అందరినీ, వాచా=వాక్కుతో, ఆభాష్య = పలకరించి, మానవాః =మానవులారా ! యత్నేన = ప్రయత్నముతో, రక్షధ్వమ్=రక్షించుడు, ఇతి = అని, ప్రత్యాహ = తిరిగి పలికెను.

తా. బ్రహ్మదేవుడు వారి నందరిని మంచి మాటలతో పలకరించి,

నవ్వుచు, "మీరు ప్రయత్నపూర్వకముగా ఈ జలమును రక్షింపుడు" అని పలికెను. 11

మూ. రక్షామ ఇతి తత్రాన్యైర్యక్షామ ఇతి చాపరైః,
భుంక్షితాభుంక్షితైరుక్తస్తతస్తానాహ భూతకృత్. 12

ప్ర. అ. తత్ర = వారిలో, భుంక్షితాభుంక్షితైః = ఆకలిగొన్నవాళ్ళు ఆకలిగొననివాళ్ళుఅయిన, అన్యైః = కొందరిచేత, యక్షామః ఇతి = పూజించెదము అని, అపరైః = మరికొందరిచేత, రక్షామః ఇతి చ = రక్షించెదము అని, ఉక్తః = పలకబడిన, భూతకృత్ = బ్రహ్మదేవుడు, తతః = అటుపిమ్మట, తాన్ = వాళ్ళను గూర్చి, ఆహ = పలికెను.

తా. వాళ్ళలో ఆకలిగొన్న కొందరు రక్షించెదము అని, ఆకలిగొనని మరికొందరు పూజించెదము అని పలుకగా ఆ బ్రహ్మదేవుడు వాళ్ళతో ఇట్లనెను.

మూ. రక్షామ ఇతి యైరుక్తం రాక్షసాస్తే భవన్తు వః,
యక్షామ ఇతి యైరుక్తం యక్షా ఏవ భవన్తు వః. 13

ప్ర. అ. వః = మీలో, యైః = ఎవరిచేత, రక్షామః ఇతి = రక్షించెదము అని, ఉక్తమ్ = పలకబడినదో, తే = వాళ్ళు, రాక్షసాః = రాక్షసులుగా, భవన్తు = అగుదురుగాక. వః = మీలో, యైః = ఎవరిచేత, యక్షామః ఇతి = పూజించెదము అని, ఉక్తమ్ = పలకబడినదో, వాళ్ళు, యక్షా ఏవ = యక్షులుగానే, భవన్తు = అగుదురుగాక.

తా. మీలో రక్షించెద మని చెప్పినవాళ్ళు రాక్షసులుగాను, పూజించెద మని చెప్పినవాళ్ళు యక్షులుగాను అగుదురు గాక. 13

మూ. తత్ర హేతిః ప్రహేతిశ్చ భ్రాతరౌ రాక్షసాధిపౌ,
మధుకైటభసంకాశౌ బభూవతురరిందమౌ. 14

ప్ర. అ. తత్ర = వారిలో, హేతిః = హేతి, ప్రహేతిశ్చ = ప్రహేతి అను, మధుకైటభసంకాశౌ = మధుకైటభులతో సమానులైన, అరిందమౌ = శత్రుసంహారకులైన, రాక్షసాధిపౌ = రాక్షసప్రభువులైన, భ్రాతరౌ = సోదరులు, బభూవతుః = ఉండిరి.

తా. ఆ రాక్షసులలో మధుకైటభులతో సమానులైన, శత్రుసంహారకులైన, హేతి, ప్రహేతి అను రాక్షసనాయకులైన సోదరులు ఉండిరి. 14

మూ. ప్రహేతిర్ధార్మికస్తత్ర తపోవనగతస్తదా,
హేతిర్దారక్రియార్థే తు పరం యత్నమథాకరోత్. 15

ప్ర. అ. తత్ర = వారిలో, ధార్మికః = ధార్మికుడైన, ప్రహేతిః = ప్రహేతి, తదా = అప్పుడు, తపోవనగతః = తపోవనమును పొందెను. అథ = పిమ్మట, హేతిః తు = హేతియైతే, దారక్రియార్థే = వివాహమునిమిత్తము, పరమ్ = గొప్ప, ప్రయత్నమ్ = ప్రయత్నమును, అకరోత్ = చెసెను.

తా. వారిలో ప్రహేతి చాల ధార్మికుడు. అతడు తపోవనమునకు వెళ్ళి పోయెను. అప్పుడు హేతిమాత్రము వివాహము చేసికొనవలె నని గొప్ప ప్రయత్నము చేసెను. 15

మూ. స కాలభగినీం కన్యాం భయాం నామ మహాభయామ్,
ఉదావహదమేయాత్మా స్వయమేవ మహామతిః. 16

ప్ర. అ. అమేయాత్మా = గొప్ప బలము గల, మహామతిః = గొప్పబుద్ధి గల, సః = హేతి, కాలభగినీమ్ = యముని సోదరి, మహాభయామ్ = చాల భయంకరురాలు అయిన, భయాం నామ = భయ అను పేరు గల, కన్యామ్ = కన్యను, స్వయమేవ = స్వయముగనే, ఉదావహత్ = వివాహమాడెను.

తా. గొప్ప బుద్ధిపరాక్రమములు గల ఆ హేతి తానే స్వయముగా వెళ్ళి కోరి యముని సోదరియైన, చాల భయంకరురాలైన భయ అను కన్యను వివాహమాడెను. 16

మూ. స తస్యాం జనయామాస హేతీ రాక్షసపుంగవః,
పుత్రం పుత్రవతాం శ్రేష్ఠో విద్యుత్కేశమితి శ్రుతమ్.

ప్ర. అ. పుత్రవతామ్ = పుత్రవంతులలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడు, రాక్షసపుంగవః = రాక్షసశ్రేష్ఠుడు అయిన, సః హేతిః = ఆ హేతి, తస్యామ్ = ఆమె యందు, విద్యుత్కేశమితి = విద్యుత్కేశు డను, శ్రుతమ్ = ప్రసిద్ధుడైన, పుత్రమ్ = పుత్రుణ్ణి, జనయామాస = జనింపచేసెను.

తా. పుత్రవంతులలో శ్రేష్ఠుడైన, రాక్షసనాయకుడైన ఆ హేతికి ఆమె యందు విద్యుత్కేశు డను ప్రసిద్ధుడైన పుత్రుడు జనించెను. 17

మూ. విద్యుత్కేశో హేతిపుత్రః స దీప్తార్కసమప్రభః,
వ్యవర్ధత మహాతేజాస్తోయమధ్య ఇవామ్బుజమ్. 18

ప్ర. అ. హేతిపుత్రః = హేతిపుత్రుడు, దీప్తార్కసమప్రభః = ప్రకాశించు చున్న సూర్యునితో సమానమైన కాంతి గల, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, సః విద్యుత్కేశః = ఆ విద్యుత్కేశుడు, తోయమధ్యే = నీటి మధ్యయందు, అమ్బుజమ్ ఇవ = పద్మము వలె, వ్యవర్ధత = పెరిగెను.

తా. ప్రకాశించుచున్న సూర్యునితో సమానమైన కాంతి గల, మహాతేజః శాలియైన హేతిపుత్రు డైన ఆ విద్యుత్కేశుడు నీటి మధ్య తామరపువ్వు వలె పెరిగెను. 18

మూ. స యదా యౌవనం భద్రమనుప్రాప్తో నిశాచరః,
తతో దారక్రియాం తస్య కర్తుం వ్యవసితః పితా. 19

ప్ర. అ. సః = ఆ, నిశాచరః = విద్యుత్కేశుడు, యదా = ఎప్పుడు, భద్రమ్ = మంగళకరమైన, యౌవనమ్ = యౌవనమును, అనుప్రాప్తః = పొంది నాడో, తతః = అటుపిమ్మట, పితా = తండ్రి, తస్య = వానికి, దారక్రియామ్ = వివాహమును, కర్తుమ్ = చేయుటకు, వ్యవసితః = నిశ్చయించెను.

తా. ఆ విద్యుత్కేశునకు శుభకరమైన యౌవనము రాగానే ఆతని తండ్రి వివాహము చేయవలె నని నిర్ణయించెను. 19

మూ. సంధ్యా దుహితరం సోఽథ సంధ్యాతుల్యాం ప్రభావతః,
వరయామాస పుత్రార్థం హేతీ రాక్షసపుంగవః. 20

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రాక్షసపుంగవః = రాక్షసశ్రేష్ఠుడైన, సః = ఆ, హేతిః = హేతి, ప్రభావతః = ప్రభావమువలన, సంధ్యాతుల్యామ్ = సంధ్యతో సమానురాలైన, సంధ్యాదుహితరమ్ = సంధ్య కుమార్తెను, పుత్రార్థమ్ = పుత్రుని నిమిత్తమై, వరయామాస = వరించెను.

తా. పిమ్మట రాక్షసశ్రేష్ఠుడైన హేతి తన కుమారుని నిమిత్తమై సంధ్యతో సమానురాలైన సంధ్యాపుత్రికను వరించెను. 20

మూ. అవశ్యమేవ దాతవ్యా పరస్మై సేతి సంధ్యయా,
చిన్తయిత్వా సుతా దత్తా విద్యుత్కేశాయ రాఘవ. 21

ప్ర. అ. రాఘవ = రామా! అవశ్యమేవ = తప్పక, పరస్మై = పరునకు, దాతవ్యా = ఇవ్వదగినది, ఇతి = అని, చిన్తయిత్వా = ఆలోచించి, సంధ్యయా = సంధ్యచేత, సా సుతా = ఆ పుత్రిక, విద్యుత్కేశాయ = విద్యుత్కేశునకు, దత్తా = ఇవ్వబడినది.

తా. తప్పక పరునకు ఇవ్వవలసినదే కదా అని ఆలోచించి సంధ్య ఆ పుత్రికను విద్యుత్కేశునకు ఇచ్చెను. 21

మూ. సంధ్యాయాస్తనయాం లబ్ధ్వా విద్యుత్కేశో నిశాచరః,
రమతే స్మ తయా సార్ధం పౌలోమ్యా మఘవానివ. 22

ప్ర. అ. నిశాచరః = రాక్షసుడైన, విద్యుత్కేశః = విద్యుత్కేశుడు, సంధ్యాయాః = సంధ్యయొక్క, తనయామ్ = కుమార్తెను, లబ్ధ్వా = పొంది, మఘవాన్ = ఇంద్రుడు, పౌలోమ్యా ఇవ = శచీదేవితో వలె, తయా సార్ధమ్ = ఆమెతో కూడ, రమతే స్మ = క్రీడించెను.

తా. విద్యుత్కేశుడు సంధ్య కుమార్తెను పొంది, దేవేంద్రుడు శచీదేవితో క్రీడించినట్లు ఆమెతో క్రీడించెను. 22

మూ. కేనచిత్త్వథ కాలేన రామ సాలఙ్కటఙ్కటా,
విద్యుత్కేశాద్గర్భమాప ఘనరాజిరివార్ణవాత్. 23

ప్ర. అ. రామ = రామా! అథ = అటుపిమ్మట, సాలఙ్కటఙ్కటా = సాలంకటంకట, కేనచిత్ = ఒకానొక, కాలేన = కాలముచేత, ఘనరాజిః = మేఘపంక్తి, అర్ణవాత్ ఇవ = సముద్రమునుండి వలె, విద్యుత్కేశాత్ = విద్యుత్కేశునివలన, గర్భమ్ = గర్భమును, ఆప = పొందెను.

తా. రామా ! సంధ్యాపుత్రియైన సాలంకటంకట కొంత కాలానికి, మేఘ పంక్తి సముద్రమునుండి వలె, విద్యుత్కేశునినుండి గర్భమును ధరించెను. 23

మూ. తతః సా రాక్షసీ గర్భం ఘనగర్భసమప్రభమ్,
ప్రసూతా మన్దరం గత్వా గఙ్గా గర్భమివాగ్నిజమ్. 24

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సా రాక్షసీ = ఆ రాక్షసస్త్రీ, మన్దరమ్ = మందరపర్వతమును గూర్చి, గత్వా = వెళ్ళి, గఙ్గా = గంగ, అగ్నిజమ్ = అగ్ని వలన కలిగిన, గర్భమ్ ఇవ = గర్భమును వలె, ఘనగర్భసమప్రభమ్ = పిడుగుతో సమానమైన కాంతి గల, గర్భమ్ = గర్భమును, ప్రసూతా = కనినది.

తా. పిమ్మట ఆ రాక్షసస్త్రీ మందరపర్వతముమీదికి వెళ్ళి అక్కడ, గంగ అగ్నిదేవునినుండి తనకు సంక్రమించిన రుద్రతేజోరూపమైన గర్భమును విడచినట్లు, పిడుగుతో సమానమైన తన గర్భమును ప్రసవించెను. 24

మూ. సముత్సృజ్య తు సా గర్భం విద్యుత్కేశరతార్థినీ,
రేమే తు పతినా సార్ధం విస్మృత్య సుతమాత్మజమ్,
ఉత్సృష్టస్తు తదా గర్భో ఘనశబ్దసమస్వనః. 25

ప్ర. అ. విద్యుత్కేశరతార్థినీ = విద్యుత్కేశునితో క్రీడను కోరుచున్నదై, సా = ఆమె, గర్భమ్ = గర్భమును, సముత్సృజ్య = విడచి, ఆత్మజమ్ = తన వలన పుట్టిన, సుతమ్ = పుత్రుణ్ణి, విస్మృత్య = మరచి, పతినా సార్ధమ్ = భర్తతో కూడ, రేమే = క్రీడించెను. తదా = అప్పుడు, ఘనశబ్దసమస్వనః = మేఘధ్వనితో సమానమైన ధ్వని గల, గర్భః = గర్భము, ఉత్సృష్టః = విడువబడెను.

తా. విద్యుత్కేశునితో రమించవలె నను కోరికతో ఆమె ఆ గర్భమును విడచి, తన ఔరసపుత్రుణ్ణే మరచి భర్తతో కూడ రమించెను. అప్పుడు మేఘ ధ్వనివంటి ధ్వని గల ఆ గర్భము విడువబడెను. 25

మూ. తయోత్సృష్టః స తు శిశుః శరదర్కసమద్యుతిః,
నిధాయాస్యే స్వయం ముష్టిం రురోద శనకైస్తదా. 26

ప్ర. అ. తయా = ఆమెచేత, ఉత్సృష్టః = విడవబడిన, శరదర్కసమ

ద్యుతిః = శరత్కాలసూర్యునివంటి కాంతి గల, సః శిశుః = ఆ శిశువు, స్వయమ్ = తానే, ఆస్యే = ముఖమునందు, ముష్టిమ్ = పిడికిలిని, నిధాయ = ఉంచి, తదా = అప్పుడు, శనకైః = మెల్లగా, రురోద = ఏడ్చెను.

తా. ఆమె ఇట్లు విడచివేయగా శరత్కాలసూర్యునివంటి కాంతి గల ఆ శిశువు తానే నోట్లో పిడికిలి పెట్టుకొని మెల్లగా ఏడ్చెను. 26

మూ. తతో వృషభమాస్థాయ పార్వత్యా సహితః శివః,
వాయుమార్గేణ గచ్ఛన్వై శుశ్రావ రుదితస్వనమ్. 27

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వృషభమ్ = వృషభమును, ఆస్థాయ = అధిష్ఠించి, వాయుమార్గేణ = వాయుమార్గముచేత, గచ్ఛన్ = వెళ్ళుచున్న, పార్వత్యా = పార్వతితో, సహితః = కూడిన, శివః = ఈశ్వరుడు, రుదితస్వనమ్ = రోదనధ్వనిని, శుశ్రావ = వినెను.

తా. అప్పుడు పార్వతీసమేతుడై, నందిని ఎక్కి వాయుమార్గములో వెళ్ళుచున్న పరమేశ్వరుడు ఆ ఏడ్పును వినెను. 27

మూ. అపశ్యదుమయా సార్ధం రుదన్తం రాక్షసాత్మజమ్,
కారుణ్యభావాత్పార్వత్యా భవస్త్రిపురసూదనః. 28

ప్ర. అ. పార్వత్యా = పార్వతితో కూడిన, త్రిపురసూదనః = త్రిపుర సంహారకుడైన, భవః = ఈశ్వరుడు, రుదన్తమ్ = ఏడ్చుచున్న, రాక్షసాత్మజమ్ = రాక్షసకుమారుణ్ణి, ఉమయా సార్ధమ్ = పార్వతితో కూడ, కారుణ్యభావాత్ = కారుణ్యముతో, అపశ్యత్ = చూచెను.

తా. పార్వతీసహితుడైన త్రిపురసంహారకుడైన ఈశ్వరుడు ఏడ్చుచున్న ఆ రాక్షసపుత్రుణ్ణి జాలితో చూచెను. 28

మూ. తం రాక్షసాత్మజం చక్రే మాతురేవ వయఃసమమ్,
అమరం చైవ తం కృత్వా మహాదేవోఽక్షరోఽవ్యయః.
పురమాకాశగం ప్రాదాత్పార్వత్యాః ప్రియకామ్యయా,
ఉమయాపి వరో దత్తో రాక్షసీనాం నృపాత్మజ. 30

ప్ర. అ. అక్షరః = నాశరహితుడు, అవ్యయః = మార్పులేనివాడుఅయిన, మహాదేవః = మహాదేవుడు, తమ్ = ఆ, రాక్షసాత్మజమ్ = రాక్షసపుత్రుణ్ణి, మాతురేవ = తల్లికే, వయఃసమమ్=వయస్సుతో సమానమైన వానినిగా, చక్రే= చేసెను. తమ్=వానిని, అమరం చైవ=మరణము లేనివానినిగా కూడ, కృత్వా= చేసి, పార్వత్యాః = పార్వతియొక్క, ప్రియకామ్యయా = ప్రియమునందు కోరిక చేత, ఆకాశగమ్ = ఆకాశములో సంచరించు, పురమ్ = పట్టణమును, ప్రాదాత్= ఇచ్చెను. నృపాత్మజ = రామా ! ఉమయాపి=పార్వతిచేత కూడ, రాక్షసీనామ్= రాక్షసస్త్రీలకు, వరః = వరము, దత్తః = ఇవ్వబడినది.

తా. రామా ! నాశరహితుడు, ఎట్టి మార్పులూ లేనివాడూ అయిన మహేశ్వరుడు ఆ రాక్షసపుత్రునకు తల్లి వయస్సుతో సమానమైన వయస్సును ఇచ్చెను. (అంతగా పెరుగునట్లు చేసెను). పార్వతికి ప్రియము చేకూర్చుటకై ఆకాశమునందు సంచరించు పురమును కల్పించి ఇచ్చెను. పార్వతి కూడ రాక్షస స్త్రీలకు వరము ఇచ్చెను. 29, 30

మూ. సద్యోపలబ్ధిర్గర్భస్య ప్రసూతిః సద్య ఏవ చ,
సద్య ఏవ వయఃప్రాప్తిర్మాతురేవ వయస్సమమ్. 31

ప్ర. అ. గర్భస్య = గర్భముయొక్క, సద్యోపలబ్ధిః = వెంటనే ప్రాప్తి, సద్యః ఏవ చ = వెంటనే, ప్రసూతిః = పుట్టుక, మాతురేవ = తల్లియొక్క, వయఃసమమ్ = వయస్సుతో సమముగా, సద్య ఏవ=వెంటనే, వయఃప్రాప్తిమ్= వయస్సుయొక్క ప్రాప్తి (వరముగా ఇవ్వబడినవి).

తా. వెంటనే గర్భము, గర్భము ధరించిన వెంటనే ప్రసవించుట, పుట్టిన వెంటనే శిశువు తల్లి వయస్సుతో సమానమైన వయస్సు పొందుట - వీటిని వరములుగా ఇచ్చెను. 31

మూ. తతః సుకేశో వరదానగర్వితః
శ్రియం ప్రభోః ప్రాప్య హరస్య పార్శ్వతః,
చచార సర్వత్ర మహాన్ మహామతిః
ఖగం పురం ప్రాప్య పురందరో యథా. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుర్థః సర్గః

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాన్ = గొప్పవాడు, మహామతిః = గొప్ప బుద్ధి గలవాడు అయిన, సుకేశః = సుకేశుడు, ప్రభోః = ప్రభువైన, హరస్య = ఈశ్వరునియొక్క, పార్శ్వతః=పార్శ్వమునుండి, శ్రియమ్=ఐశ్వర్యమును, ప్రాప్య = పొంది, వరదానగర్వితః = వరదానముచేత గర్వించినవాడై, ఖగమ్ = ఆకాశమునందు సంచరించు, పురమ్ = పురమును, ప్రాప్య = పొంది, పురందరో యథా = దేవేంద్రుడు వలె, సర్వత్ర = అంతటా, చచార = సంచరించెను.

తా. గొప్పవాడు, గొప్ప తేజస్సు కలవాడు అయిన సుకేశుడు ప్రభువైన మహేశ్వరుని వైపునుండి ఐశ్వర్యమును పొంది, ఆకాశమునందు సంచరించు నగరమును పొంది దేవేంద్రుడు వలె అంతటా సంచరించెను. 32

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో నాల్గవసర్గ సమాప్తము.

అథ పఞ్చమః సర్గః

[సుకేశుని సంతానమైన మాల్యవత్ - సుమాలి - మాలుల సంతానము వర్ణనము.]

మూ. సుకేశం ధార్మికం దృష్ట్వా వరలబ్ధం చ రాక్షసమ్,
గ్రామణీర్నామ గన్ధర్వో విశ్వావసుసమప్రభః. 1

ప్ర. అ. గ్రామణీః నామ=గ్రామణి అను పేరు గల, విశ్వావసుసమప్రభః = విశ్వావసువుతో సమానమైన కాంతి గల, గన్ధర్వః = గంధర్వుడు, ధార్మికమ్ = ధార్మికుడు, వరలబ్ధమ్ = పొందబడిన వరములు గలవాడు అయిన, రాక్షసమ్ = రాక్షసుడైన, సుకేశమ్ = సుకేశుణ్ణి, దృష్ట్వా = చూచి (మూడవశ్లోకములోని "దదౌ" అనుదానితో అన్వయము) కుమార్తెను ఇచ్చెను.

తా. విశ్వావసువుతో సమానుడైన గ్రామణి అను గంధర్వుడు ధార్మికుడైన, వరములు పొందిన సుకేశుణ్ణి చూచి (కన్యను ఇచ్చెను). 1

మూ. తస్య దేవవతీ నామ ద్వితీయా శ్రీరివాత్మజా,
త్రిషు లోకేషు విఖ్యాతా రూపయౌవనశాలినీ, 2
తాం సుకేశాయ ధర్మాత్మా దదౌ రక్షఃశ్రియం యథా.

ప్ర. అ. తస్య = వానికి, త్రిషు = మూడు, లోకేషు = లోకములయందు, విఖ్యాతా = ప్రసిద్ధురాలు, రూపయౌవనశాలినీ=రూపయౌవనములతో ప్రకాశించునది, ద్వితీయా = రెండవ, శ్రీరివ=లక్ష్మివంటిది అయిన, దేవవతీనామ=దేవవతి అను పేరుగల, ఆత్మజా = కుమార్తె ఉన్నది. ధర్మాత్మా=ధర్మాత్ముడైన అతడు, తామ్=ఆమెను, రక్షఃశ్రియం యథా = రాక్షసరాజ్యలక్ష్మిని వలె, సుకేశాయ = సుకేశునకు, దదౌ = ఇచ్చెను.

తా. ఆ గ్రామణికి మూడు లోకాలలో ప్రసిద్ధురాలైన, రూపయౌవనము

లతో ప్రకాశించుచున్న రెండవ లక్ష్మీదేవియా అన్నట్లున్న దేవవతి అను కుమార్తె ఉండెను. ధర్మాత్ముడైన అతడు ఆమెను, రాక్షసరాజ్యలక్ష్మిని వలె, సుకేశునకు ఇచ్చెను. 2

మూ. వరదానకృతైశ్వర్యం సా తం ప్రాప్య పతిం ప్రియమ్, 3
ఆసీద్దేవవతీ తుష్టా ధనం ప్రాప్యేవ నిర్ధనః.

ప్ర. అ. సా=ఆ, దేవవతీ = దేవవతి, వరదానకృతైశ్వర్యమ్=వరదానము చేత చేయబడిన ఐశ్వర్యము గల, ప్రియమ్ = ప్రియుడైన, తమ్ = అతనిని, పతిమ్ = భర్తనుగా, ప్రాప్య = పొంది, నిర్ధనః = ధనము లేనివాడు, ధనమ్ = ధనమును, ప్రాప్యేవ = పొంది వలె, తుష్టా=సంతోషించినది, ఆసీత్=ఆయెను.

తా. వరదానముచేత ఐశ్వర్యవంతుడైన, ప్రియుడైన ఆతనిని భర్తనుగా పొంది దేవవతి, ధనమును పొందిన నిర్ధనుడు వలె, చాల సంతోషించెను. 3

మూ. స తయా సహ సంయుక్తో రరాజ రజనీచరః, 4
అఞ్జనాదభినిష్క్రాన్తః కరేణ్వేవ మహాగజః.

ప్ర. అ. తయా సహ = ఆమెతో కూడ, సంసక్తః = కూడిన, సః రజనీచరః = ఆ రాక్షసుడు, అఞ్జనాత్=అంజన మను దిగ్గజమునుండి, అభినిష్క్రాన్తః = పుట్టిన, మహాగజః = మహాగజము, కరేణ్వేవ = ఆడఏనుగుతో వలె, రరాజ= ప్రకాశించెను.

తా. ఆమెతో కూడిన ఆ రాక్షసుడు అంజన మను దిగ్గజమునకు పుట్టిన, మహాగజము ఆడఏనుగుతో కలిసి ప్రకాశించినట్లు ప్రకాశించెను. 4

మూ. తతః కాలే సుకేశస్తు జనయామాస రాఘవ,
త్రీన్ పుత్రాన్ జనయామాస త్రేతాగ్నిసమవిగ్రహాన్. 5

ప్ర. అ. రాఘవ = రామా! తతః = అటుపిమ్మట, సుకేశస్తు=సుకేశుడు, కాలే = తగినకాలమునందు, జనయామాస = పుత్రులను కనెను. త్రేతాగ్నిసమవిగ్రహాన్ = మూడు అగ్నులతోసమానములైన శరీరములు గల, త్రీన్=ముగ్గురు, పుత్రాన్ = పుత్రులను, జనయామాస = కనెను.

తా. రామా ! పిమ్మట, సుకేశుడు తగిన సమయమునందు గార్హపత్య-దక్షిణాగ్ని-అహవనీయము లను మూడు అగ్నులతో సమానమైన దేహములు గల ముగ్గురు పుత్రులను కనెను. 5

మూ. మాల్యవన్తం సుమాలిం చ మాలిం చ బలినాం వరమ్,
త్రీంస్త్రినేత్రసమాన్ పుత్రాన్ రాక్షసాన్ రాక్షసాధిపః. 6

ప్ర. అ. రాక్షసాధిపః = ఆ రాక్షసప్రభువు, మాల్యవన్తమ్ = మాల్యవంతుని, సుమాలిం చ = సుమాలిని, బలినామ్ = బలవంతులలో, వరమ్ = శ్రేష్ఠుడైన, మాలిం చ = మాలినీ, త్రినేత్రసమాన్ = శివునితోసమానులైన, రాక్షసాన్ = రాక్షసులైన, త్రీన్ = ముగ్గురు, పుత్రులను, (కనెను).

తా. ఆ సుకేశుడు శివునితో సమానులైన, మాల్యవంతుడు, సుమాలి, బలవంతులలో శ్రేష్ఠుడైన మాలి అను ముగ్గురు పుత్రులను కనెను. 6

మూ. త్రయో లోకా ఇవావ్యగ్రాః స్థితాస్త్రయ ఇవాగ్నయః,
త్రయో మన్త్రా ఇవాత్యుగ్రాస్త్రయో ఘోరా ఇవామయాః. 7

త్రయః సుకేశస్య సుతాస్త్రేతాగ్నిసమతేజసః,
వివృద్ధిమగమంస్తత్ర వ్యాధయోపేక్షితా ఇవ. 8

ప్ర. అ. అవ్యగ్రాః = బాధలులేని, త్రయః = మూడు, లోకాః ఇవ = లోకములు వలె, త్రయః = మూడు, అగ్నయః ఇవ = అగ్నులు వలె, అత్యుగ్రాః = చాల ఉగ్రములైన, త్రయః = మూడు, మన్త్రాః ఇవ = మంత్రములు వలె, ఘోరాః = ఘోరములైన, త్రయః = మూడు, ఆమయాః ఇవ = వాతపిత్తశ్లేష్మరూపములైన ఆమయములు వలె, స్థితాః = ఉన్న, త్రేతాగ్నిసమతేజసః = అగ్నిత్రయముతో సమానమైన తేజస్సు గల, సుకేశస్య = సుకేశునియొక్క, త్రయః = ముగ్గురు, సుతాః = పుత్రులు, తత్ర = అక్కడ, ఉపేక్షితాః = ఉపేక్షించబడిన, వ్యాధయః ఇవ = వ్యాధులు వలె, వివృద్ధిమ్ = వృద్ధిని, అగమన్ = పొందిరి.

తా. నిర్భయములైన మూడు లోకములు వలె, మూడు అగ్నులు వలె, ఉగ్రములైన మూడు మంత్రములు వలె, ఘోరములైన వాతపిత్తశ్లేష్మము లను

మూడు దోషములు వలె ఉన్న, త్రేతాగ్నితో సమానమైన తేజస్సు గల సుకేశుని ముగ్గురు పుత్రులు ఉపేక్షించబడిన వ్యాధులు వలె అక్కడ వృద్ధి పొందిరి. 7,8

మూ. వరప్రాప్తిం పితుస్తే తు జ్ఞాత్వైశ్వర్యం తపోబలాత్,
తపస్తప్తుం గతా మేరుం భ్రాతరః కృతనిశ్చయాః. 9

ప్ర. అ. తే భ్రాతరః = ఆ సోదరులు, పితుః = తండ్రియొక్క, వరప్రాప్తిమ్ = వరముల ప్రాప్తిని, తపోబలాత్ = తపోబలమువల్ల, ఐశ్వర్యమ్ = ఐశ్వర్యమును, జ్ఞాత్వా = తెలిసికొని, కృతనిశ్చయాః = చేయబడిన నిశ్చయము గలవారై, తపః = తపస్సును, తప్తుమ్ = చేయుటకు, మేరుమ్ = మేరుపర్వతమును గూర్చి, గతాః = వెళ్ళిరి.

తా. తమ తండ్రికి వరములు లభించిన విషయమును, తపోబలముచేత ఐశ్వర్యము లభించినట్లూ తెలిసికొని ఆ సోదరులు తపస్సు చేయవలె నని నిశ్చయించుకొని, మేరుపర్వతమునకు వెళ్ళిరి. 9

మూ. ప్రగృహ్య నియమాన్ ఘోరాన్ రాక్షసా నృపసత్తమ,
విచేరుస్తే తపో ఘోరం సర్వభూతభయావహమ్. 10

ప్ర. అ. నృపసత్తమ = రాజశ్రేష్ఠుడా ! తే = ఆ, రాక్షసాః = రాక్షసులు, ఘోరాన్ = భయంకరములైన, నియమాన్ = నియమములను, ప్రగృహ్య = గ్రహించి, సర్వభూతభయావహమ్ = సకలప్రాణులకు భయమును కలిగించు, ఘోరమ్ = ఘోరమైన, తపః = తపస్సును, చేరుః = చేసిరి.

తా. రామా ! ఆ రాక్షసులు కఠినములైన నియమములను అవలంబించి, సకలప్రాణులకు భయమును కలిగించు ఘోరమైన తపస్సు చేసిరి. 10

మూ. సత్యార్జవశమోపేతైస్తపోభిర్భువి దుర్లభైః,
సంతాపయన్త్రీన్ లోకాన్సదేవాసురమానుషాన్. 11

ప్ర. అ. సత్యార్జవశమోపేతైః = సత్యముతోను, ఋజుత్వముతోను, శమముతోను కూడిన, భువి = భూమియందు, దుర్లభైః = దుర్లభములైన, తపోభిః = తపస్సులచేత, సదేవాసురమానుషాన్ = దేవతలతోను, అసురులతోను, మానవుల

తోను కూడిన, త్రీన్ = మూడు, లోకాన్ = లోకములను, సంతాపయన్తః = తపింపచేయుచు, (తపస్సు చేసిరి).

తా. భూలోకములో దుర్లభములైనవి, సత్య-ఋజుత్వ-శమములతో కూడినవి అయిన తపస్సులచేత, దేవ-అసుర-మానవులతో కూడిన లోకములకు సంతాపము కలిగించుచు తపస్సు చేసిరి. 11

మూ. తతో విభుశ్చతుర్వక్త్రో విమానవరమాశ్రితః,
సుకేశపుత్రానామన్త్ర్య వరదోఽస్మీత్యభాషత. 12

ప్ర. అ. తతః = అటుపిమ్మట, విభుః = ప్రభువైన, చతుర్వక్త్రః = బ్రహ్మదేవుడు, విమానవరమ్ = విమానశ్రేష్ఠమును, ఆశ్రితః=ఆశ్రయించినవారై, సుకేశపుత్రాన్ = సుకేశుని పుత్రులను, ఆమన్త్ర్య = పిలచి, వరదః = వరములను ఇచ్చువాడను, అస్మి = అయి ఉన్నాను, ఇతి = అని, అభాషత = పలికెను.

తా. పిమ్మట లోకప్రభువైన బ్రహ్మదేవుడు శ్రేష్ఠమైన విమానము నెక్కి వచ్చి సుకేశుని పుత్రులను పిలచి మీకు వరము లిచ్చెదను అని పలికెను. 12

మూ. బ్రహ్మాణం వరదం జ్ఞాత్వా సేన్ద్రైర్దేవగణైర్వృతమ్,
ఊచుః ప్రాఞ్జలయః సర్వే వేపమానా ఇవ ద్రుమాః. 13

ప్ర. అ. సర్వే = వాళ్ళందరూ, సేన్ద్రైః = ఇంద్రునితో కూడిన, దేవగణైః = దేవతాగణములతో, వృతమ్ = కూడిన, బ్రహ్మాణమ్ = బ్రహ్మను, వరదమ్= వరము లిచ్చేవానినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, ప్రాఞ్జలయః = ఎత్తబడిన దోసిళ్ళు గలవారై, ద్రుమాః ఇవ = వృక్షములు వలె, వేపమానాః = వణకుచు, ఊచుః = పలికిరి.

తా. ఇంద్రాదిదేవగణములతో కలిసి వచ్చిన బ్రహ్మదేవుడు వరముల నిచ్చు నని తెలిసికొని ఆ రాక్షసులు అంజలులు ఘటించి, చెట్లవలె వణకుచు ఇట్లు పలికిరి. 13

మూ. తపసారాధితో దేవ యది నో దిశసే వరమ్,
అజేయాః శత్రుహన్తారస్తథైవ చిరజీవినః,
ప్రభవిష్ణవో భవామేతి పరస్పరమనువ్రతాః. 14

ప్ర. అ. దేవ=ఓ! ప్రభూ! తపసా=తపస్సు చేత, ఆరాధితః=పూజించ బడిన నీవు, నః = మాకు, వరమ్ = వరమును, దిశసే యది = ఇచ్చినట్లయితే, అజేయాః = జయింప శక్యము కానివారము, శత్రుహన్తారః = శత్రువులను సంహరించేవారము, తథైవ = మరియు చిరజీవినః=చిరకాలము జీవించువారము, ప్రభవిష్ణవః = సర్వసమర్థులము, పరస్పరమ్ = పరస్పరమూ, అనువ్రతాః = ప్రేమకలవారము, భవామ = అగుదుముగాక, ఇతి = అని (పలికిరి).

తా. ప్రభూ! మా తపస్సుచేత సంతోషించినవాడవై మాకు వరములు ఇవ్వదలచినచో , మేము శత్రువులను నశింపచేసేవారముగాను, జయింప శక్యము కానివారముగాను, చిరకాలము జీవించువారముగాను, అత్యధిక సామర్థ్యము ఉన్న వారముగాను, పరస్పరము స్నేహము కలవారముగాను అగునట్లు వరమిమ్ము.14

మూ. ఏవం భవిష్యథేత్యుక్త్వా సుకేశతనయాన్విభుః,
స యయౌ బ్రహ్మలోకాయ బ్రహ్మ బ్రాహ్మణవత్సలః

ప్ర. అ. విభుః = ప్రభువైన, బ్రాహ్మణవత్సలః = బ్రాహ్మణులయందు ప్రేమ గల, సః బ్రహ్మ = ఆ బ్రహ్మదేవుడు, ఏవమ్ = ఇట్లు, భవిష్యథ=కా గలరు, ఇతి = అని, సుకేశతనయాన్ = సుకేశుని కుమారులను గూర్చి, ఉక్త్వా = పలికి, బ్రహ్మలోకాయ = బ్రహ్మలోకముకొరకు, యయౌ = వెళ్ళెను.

తా. ప్రభువైన, బ్రాహ్మణులయందు ప్రేమ గల ఆ బ్రహ్మదేవుడు సుకేశుని కుమారులతో "అట్లే అయ్యెదరు" అనిపలికి బ్రహ్మలోకానికి వెళ్ళిరి. 15

మూ. వరం లబ్ధ్వా తు తే సర్వే రామ రాత్రించరాస్తదా,
సురాసురాన్ ప్రబాధన్తే వరదానసునిర్భయాః. 16

ప్ర. అ. రామ = రామా! తదా = అప్పుడు, సర్వే = సమస్తమైన, తే నిశాచరాః = రాక్షసులు, వరమ్ = వరమును, లబ్ధ్వా = పొంది, వరదానను నిర్భయాః = వరదానముచేత చాల భయములేనివారై, సురాసురాన్ = సురులను అసురులను కూడ, ప్రబాధన్తే = బాధించుచున్నారు

తా. రామా ! ఆ రాక్షసులందరు వరములు పొంది, వరములు పొందుట చేత ఏ మాత్రము భయము లేనివారై సురులను, అసురులను బాధించిరి. 16

మూ. తై ర్బాధ్యమానాస్త్రిదశాః సర్షిసంఘాః సచారణాః,
త్రాతారం నాధిగచ్ఛన్తి నిరయస్థా యథా నరాః 17

ప్ర. అ. తైః = వాళ్ళచేత, బాధ్యమానాః = బాధింపబడుచున్న, సర్షిసంఘాః = ఋషిసంఘములతో కూడిన, సచారణాః = చారణులతో కూడిన, త్రిదశాః = దేవతలు, నిరయస్థాః = నరకములో ఉన్న, నరాః యథా = నరులువలె, త్రాతారమ్ = రక్షకుణ్ణి, నాధిగచ్ఛన్తి = పొందలేదు.

తా. వాళ్ళచే బాధింపబడిన దేవతలకు, ఋషులకు, చారణులకు, నరకములో ఉన్న నరులకు వలె రక్షకు డెవ్వడూ దొరకలేదు. 17

మూ. అథ తే విశ్వకర్మాణం శిల్పినాం వరమవ్యయమ్,
ఊచుః సమేత్య సంహృష్టా రాక్షసా రఘుసత్తమ. 18

ప్ర. అ. రఘుసత్తమ = రామా! అథ = అటుపిమ్మట, శిల్పినామ్ = శిల్పులలో, వరమ్ = శ్రేష్ఠుడు, అవ్యయమ్ = నాశరహితుడూ అయిన, విశ్వకర్మాణమ్ = విశ్వకర్మను, సమేత్య = సమీపించి, తే రాక్షసాః = ఆ రాక్షసులు, సంహృష్టాః = సంతోషించుచున్నవారై, ఊచుః = పలికిరి.

తా. రామా! పిమ్మట ఆ రాక్షసులు సంతోషించుచు శిల్పులలో శ్రేష్ఠుడు, నాశరహితుడూ అయిన విశ్వకర్మవద్దకు వెళ్ళి ఇట్లు పలికిరి. 18

మూ. ఓజస్తేజోబలవతాం మహతామాత్మతేజసా,
గృహకర్తా భవానేవ దేవానాం హృదయేప్సితమ్. 19

ప్ర. అ. ఓజస్తేజోబలవతామ్ = శక్తి, తేజస్సు, బలము గల, ఆత్మతేజసా = తమ తేజస్సుచేత, మహతామ్ = గొప్పవారైన, దేవానామ్ = దేవతలకు, హృదయేప్సితమ్ = వాళ్ళ హృదయములకు ఇష్టమగునట్లుగా, గృహకర్తా = గృహములు నిర్మించినవాడవు, భవానేవ = నీవే.

తా. ఓజస్సు, తేజస్సు, బలము గలవారు, తమ తేజస్సుచేత గొప్పవారు అయిన దేవతలకు వారి హృదయములకు ఇష్టమగునట్లుగా గృహములు నిర్మించువాడవు నీవే కదా! 19

మూ. అస్మాకమపి తావత్త్వం గృహం కురు మహామతే,
హిమవన్తముపాశ్రిత్య మేరుమన్దరమేవ వా, 20
మహేశ్వరగృహప్రఖ్యం గృహం నః క్రియతాం మహత్.

ప్ర. అ. మహామతే = గొప్ప బుద్ధి కలవాడా! హిమవన్తమ్ = హిమవత్పర్వతమును గానీ, మేరుమన్దరమేవ వా = మేరుపర్వతమును గాని, మందర పర్వతమును గాని, ఉపాశ్రిత్య = ఆశ్రయించి, అస్మాకమపి = మాకు కూడ, త్వమ్ = నీవు, గృహమ్ = గృహమును, కురు తావత్ = నిర్మించుము. నః = మాకు, మహేశ్వరగృహప్రఖ్యమ్ = మహేశ్వరుని గృహమువంటి, మహత్ = గొప్పదైన, గృహమ్ = గృహము, క్రియతామ్ = నిర్మించబడుగాక

తా. గొప్ప బుద్ధి గలవాడా! హిమవత్పర్వతము మీద గాని, మేరుపర్వతము మీద గాని, మందరపర్వతముమీద గాని మాకు కూడ గృహమును నిర్మింపుము. మాకు మహేశ్వరుని గృహము వంటి గృహమును నిర్మింపుము. 20

మూ. విశ్వకర్మా తతస్తేషాం రాక్షసానాం మహాభుజః, 21
నివాసం కథయామాస శక్రస్యేవామరావతీమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాభుజః = గొప్ప భుజములు గల, విశ్వకర్మా = విశ్వకర్మ, శక్రస్య = దేవేంద్రునియొక్క అమరావతీమివ = అమరావతి వంటి, నివాసమ్ = నివాసమును, తేషాం రాక్షసానామ్ = ఆ రాక్షసులకు, కథయామాస = చెప్పెను.

తా. పిమ్మట గొప్ప భుజములు గల విశ్వకర్మ దేవేంద్రుని అమరావతితో సమానమైన నివాసమును గూర్చి ఆ రాక్షసులకు చెప్పెను. 21

మూ. దక్షిణస్యోదధేస్తీరే త్రికూటో నామ పర్వతః, 22
సువేల ఇతి చాప్యన్యో ద్వితీయో రాక్షసేశ్వరాః.

ప్ర అ. రాక్షసేశ్వరాః = రాక్షస ప్రభువులారా! దక్షిణస్య = దక్షిణపు, ఉదధేః = సముద్రముయొక్క, తీరే = తీరమునందు, త్రికూటో నామ = త్రికూటమను, పర్వతః = పర్వత మున్నది. సువేలః ఇతి = సువేల మను, అన్యః = మరియొక, ద్వితీయోఽపి చ = రెండవది కూడ (ఉన్నది).

తా. రాక్షస ప్రభువులారా, దక్షిణసముద్రతీరమునందు త్రికూటము, సువేలము అను రెండు పర్వతములున్నవి. 22

మూ. శిఖరే తస్య శైలస్య మధ్యమేఽమ్బుదసంనిభే, 23
శకునైరపి దుష్ప్రాపే టఙ్కచ్ఛిన్నచతుర్దిశి,
త్రింశద్యోజనవిస్తీర్ణా శతయోజనమాయతా. 24
స్వర్ణప్రాకారసంవీతా హేమతోరణసంవృతా,
మయా లఙ్కేతి నగరీ శక్రాజ్ఞప్తేన నిర్మితా. 25

ప్ర. అ. తస్య శైలస్య = ఆ త్రికూటపర్వతము యొక్క, అమ్బుద సంనిభే = మేఘముతో సమానమైన, శకునైరపి = పక్షులచేత కూడ, దుష్ప్రాపే = చేరశక్యముకాని, టఙ్కచ్ఛిన్నచతుర్దశి = టంకముచేత ఛేదించబడిన నాలుగు దిక్కులు గల, మధ్యమే శిఖరే = మధ్యశిఖరమునందు, శక్రాజ్ఞప్తేన = ఇంద్రుని చేత ఆజ్ఞాపించబడిన, మయా = నాచేత, త్రింశద్యోజనవిస్తీర్ణా = ముప్పై యోజనములు విస్తారముకల, శతయోజనమ్ = నూరు యోజనములను, ఆయతా = పొడవైన, స్వర్ణ ప్రాకారసంవీతా = బంగారు ప్రాకారముచేత చుట్టబడిన, హేమ తోరణ సంవృతా = బంగారుతోరణములతో కూడిన, లఙ్కేతి = లంక అను, నగరీ = పట్టణము, నిర్మితా = నిర్మించబడినది.

తా. దేవేంద్రుడు ఆజ్ఞాపింపగా నేను నల్లని మేఘముతో సమానమైన, టంకములచేత నాలుగువైపులా చెక్కబడిన ఆ త్రికూట పర్వతమధ్య శిఖరముమీద ముప్పై యోజనాల వెడల్పు, నూరు యోజనాల పొడవు ఉన్న లంకాపురమును నిర్మించి ఉంటిని. దాని చుట్టూ బంగారు ప్రాకారము ఉన్నది. దాని ముఖద్వారములు బంగారముతో నిర్మింపబడినవి. 23, 24, 25

మూ. తస్యాం వసత దుర్ధర్షా యూయం రాక్షసపుంగవాః,
అమరావతీం సమాసాద్య సేన్ద్రా ఇవ దివౌకసః. 26

ప్ర. అ. రాక్షసపుంగవాః = రాక్షసశ్రేష్ఠులారా! యూయమ్ = మీరు, దుర్ధర్షాః = ఎదిరింప శక్యముకానివారై, అమరావతీమ్ = అమరావతిని, సమాసాద్య

= పొంది, సేన్ద్రాః = ఇంద్రునితో కూడిన, దివౌకసః ఇవ = దేవతలు వలె, తస్యామ్ = దానియందు, వసత = నివసించండి.

తా. రాక్షసశ్రేష్ఠులారా! మీరు ఆ నగరములో, అమరావతిని పొంది ఇంద్రాదిదేవతలు వలె, ఎదిరింప శక్యముకానివారై నివసించండి. 26

మూ. లఙ్కాదుర్గం సమాసాద్య రాక్షసైర్బహుభిర్వృతాః,
భవిష్యథ దురాధర్షాః శత్రూణాం శత్రుసూదనాః. 27

ప్ర. అ. శత్రుసూదనాః=శత్రుసంహారకులారా! లఙ్కాదుర్గమ్ = లంకా దుర్గమును, సమాసాద్య=పొంది, బహుభిః=అనేకులైన, రాక్షసైః=రాక్షసులతో, వృతాః = కూడినవారై, శత్రూణామ్ = శత్రువులకు, దురాధర్షాః = ఎదిరింప శక్యముకానివారు, భవిష్యథ = కాగలరు.

తా. శత్రుసంహారకులారా! లంకాదుర్గము చేరి, అనేకరాక్షసులతో కూడిన మిమ్ములను శత్రువు లెవ్వరూ ఎదిరింపజాలరు. 27

మూ. విశ్వకర్మవచః శ్రుత్వా తతస్తే రాక్షసోత్తమాః,
సహస్రానుచరా భూత్వా గత్వా తామవసన్పురీమ్. 28

ప్ర. అ. తే రాక్షసోత్తమాః = ఆ రాక్షసశ్రేష్ఠులు, విశ్వకర్మవచః = విశ్వకర్మవచనమును, శ్రుత్వా = విని, తతః = అటుపిమ్మట, సహస్రానుచరాః = వేల కొలది అనుచరులు కలవారై, తామ్ = ఆ, పురీమ్ = పట్టణమును గూర్చి, గత్వా = వెళ్ళి, అవసన్ = నివసించిరి.

తా. రాక్షసశ్రేష్ఠులైన ఆ ముగ్గురూ విశ్వకర్మ మాటలు విని వేలకొలది అనుచరులతో కూడినవారై ఆ పురమునకు వెళ్ళి నివసించిరి. 28

మూ. దృఢప్రాకారపరిఖాం హైమైర్గృహశతైర్వృతామ్,
లఙ్కామవాప్య తే హృష్టా న్యవసన్ రజనీచరాః. 29

ప్ర. అ. తే రజనీచరాః = ఆ రాక్షసులు, దృఢప్రాకారతోరణామ్ = దృఢమైన ప్రాకారము పరిఖా గల, హైమైః = బంగారువికారమైన, గృహశతైః =

వందలకొలది గృహములతో, వృతామ్ = కూడిన, లఙ్కామ్ = లంకను, అవాప్య = పొంది, హృష్టాః = సంతోషించినవారై, న్యవసన్ = నివసించిరి.

తా. ఆ రాక్షసులు దృఢమైన ప్రాకారము, పరిఖా గల వందలకొలది బంగారు గృహములతో కూడిన, లంకను చేరి సంతోషముతో నివసించిరి. 29

మూ. ఏతస్మిన్నేవ కాలే తు యథాకామం చ రాఘవ,
నర్మదా నామ గన్ధర్వీ బభూవ రఘునన్దన. 30

ప్ర. అ. ("యథాకామచరానఘ" అను ప్రాచ్యపాఠము బాగున్నది). అనఘ = దోషములు లేనివాడా! రఘునన్దన = రామా! ఏతస్మిన్నేవ = ఈ, కాలే = కాలమునందు, యథాకామచరా = స్వేచ్ఛగా సంచరించు, నర్మదా నామ = నర్మద అను, గన్ధర్వీ = గంధర్వస్త్రీ, బభూవ = ఉండెను.

తా. దోషరహితుడవైన రామా! ఆ కాలమునందే స్వేచ్ఛగా సంచరించు నర్మద అను గంధర్వస్త్రీ ఒకతె ఉండెను. 30

మూ. తస్యాః కన్యాత్రయం హ్యాసీద్ధ్రీశ్రీకీర్తిసమద్యుతి,
జ్యేష్ఠక్రమేణ సా తేషాం రాక్షసానా మరాక్షసీ, 31

కన్యాస్తాః ప్రదదౌ హృష్టా పూర్ణచన్ద్రనిభాననాః,
త్రయాణాం రాక్షసేన్ద్రాణాం తిస్రో గన్ధర్వకన్యకాః, 32
దత్తా మాత్రా మహాభాగా నక్షత్రే భగదైవతే.

ప్ర. అ. తస్యాః = ఆమెకు, హ్రీశ్రీకీర్తిసమద్యుతి = హ్రీ-శ్రీ-కీర్తులతో సమానమైన కాంతి గల, కన్యాత్రయమ్ = కన్యకాత్రయము, ఆసీత్ = ఉండెను. అరాక్షసీ = రాక్షసస్త్రీ కాని, సా = ఆమె, హృష్టా = సంతోషించినదై, పూర్ణచన్ద్రనిభాననాః = పూర్ణచంద్రునితో సమానమైన ముఖములు గల, తాః = ఆ, కన్యాః = కన్యలను, తేషాం రాక్షసానామ్ = ఆ రాక్షసులకు, జ్యేష్ఠక్రమేణ = జ్యేష్ఠక్రమముచేత, ప్రదదౌ = ఇచ్చెను. మహాభాగాః = గొప్పభాగ్యము గల, తిస్రః = ముగ్గురు, గన్ధర్వకన్యకాః = గంధర్వకన్యలు, మాత్రా = తల్లిచేత, భగదైవతే = భగుడు దేవతగా గల, నక్షత్రే = ఉత్తరఫల్గునీ నక్షత్రమునందు, త్రయాణామ్ = ముగ్గురు, రాక్షసేన్ద్రాణామ్ = రాక్షసప్రభువులకు, దత్తాః = ఇవ్వబడిరి.

తా. ఆ నర్మదకు హ్రీదేవి, శ్రీదేవి, కీర్తిదేవి వంటి ముగ్గురు కుమార్తెలు ఉండిరి. రాక్షసజాతికి చెందని ఆ నర్మద పూర్ణచంద్రుని వంటి ముఖములు గల ఆ కన్యకలను జ్యేష్ఠక్రమమున, అనగా పెద్దవానికి పెద్ద కుమార్తెను, రెండవవానికి రెండవ కుమార్తెను, మూడవవానికి మూడవ కుమార్తెను, సంతోషపూర్వకముగా ఇచ్చెను. మహాభాగ్యవతులైన ఆ ముగ్గురు గంధర్వకన్యలను తల్లి ఆ రాక్షస శ్రేష్ఠులకు భగుడు దేవతగా గల ఉత్తరఫల్గునీ నక్షత్రముతో కూడిన దివసము నందు ఇచ్చెను. 31, 32

మూ. కృతదారాస్తు తే రామ సుకేశతనయాస్తదా, 33
చిక్రీడుః సహ భార్యాభిరప్సరోభి రివామరాః.

ప్ర. అ. రామ = రామా! తదా = అప్పుడు. కృతదారాః = వివాహమాడిన, తే = ఆ, సుకేశతనయాః = సుకేశుని పుత్రులు, అమరాః = దేవతలు, అప్సరోభిరివ = అప్సరఃస్త్రీలతో వలె, భార్యాభిః సహ = భార్యలతో కూడ, చిక్రీడుః = క్రీడించిరి.

తా. రామా! అప్పుడు వివాహము చేసికొనిన పిమ్మట సుకేశుని పుత్రులు, దేవతలు అప్సరఃస్త్రీలతో క్రీడించినట్లు క్రీడించిరి. 33

మూ. తతో మాల్యవతో భార్యా సున్దరీ నామ సున్దరీ, 34
స తస్యాం జనయామాస యదపత్యం నిబోధ తత్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మాల్యవతః = మాల్యవంతుని యొక్క, భార్యా = భార్య, సున్దరీ నామ = సుందరి అను, సున్దరీ = సౌందర్యవతి. సః = అతడు, తస్యామ్ = ఆమెయందు, యత్ = ఏ, అపత్యమ్ = సంతానమును, జనయామాస = పుట్టించెనో, తత్ = దానిని గూర్చి, నిబోధ = తెలిసికొనుము.

తా. సుందరి అను పేరు గల సౌందర్యవతి మాల్యవంతుని భార్య. అతడు ఆమెయందు ఏ సంతానమును పుట్టించెనో తెలిసికొనుము. (వినుము). 34

మూ. వజ్రముష్టి ర్విరూపాక్షో దుర్ముఖశ్చైవ రాక్షసః, 35
సుప్తఘ్నో యజ్ఞకోపశ్చ మత్తోన్మత్తౌ తథైవ చ,
అనలా చాభవత్కన్యా సున్దర్యాం రామ సున్దరీ. 36

ప్ర. అ. రామ = రామా! సున్దర్యామ్ = సుందరియందు; వజ్రముష్టిః = వజ్రముష్టి, విరూపాక్షః = విరూపాక్షుడు, దుర్ముఖః = దుర్ముఖు డను, రాక్షస శ్చైవ = రాక్షసుడు, సుప్తఘ్నః = సుప్తఘ్నుడు, యజ్ఞకోపశ్చ = యజ్ఞకోపుడు, తథైవ చ = మరియు; మత్తోన్మత్తౌ = మత్తోన్మత్తులు, (పుట్టిరి). సున్దరీ = సుందరి యైన, అనలా = అనల అను, కన్యా చ = కన్యయు, అభవత్ = పుట్టెను.

తా. రామా! సుందరియందు మాల్యవంతునకు వజ్రముష్టి, విరూపాక్షుడు, దుర్ముఖుడు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, మత్తోన్మత్తులు, సౌందర్యవతియైన అనల అను కన్యా పుట్టిరి. 35, 36

మూ. సుమాలినోఽపి భార్యాసీత్పూర్ణచన్ద్రనిభాననా,
నామ్నా కేతుమతీ రామ ప్రాణేభ్యోఽపి గరీయసీ. 37

ప్ర. అ. రామ = రామా! సుమాలినోఽపి = సుమాలికి కూడ, పూర్ణ చన్ద్రనిభాననా = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల, నామ్నా = పేరు చేత, కేతుమతీ = కేతుమతి, ప్రాణేభ్యోఽపి = ప్రాణములకంటె కూడ, గరీయసీ = గొప్పదైన, భార్యా = భార్యగా, ఆసీత్ = ఆయెను.

తా. రామా! పూర్ణచంద్రుని వంటి ముఖముగల కేతుమతి అను భార్య సుమాలికి ప్రాణములకంటె కూడ గొప్పదిగా ఉండెను. 37

మూ. సుమాలీ జనయామాస యదపత్యం నిశాచరః,
కేతుమత్యాం మహారాజ తన్నిబోధానుపూర్వశః. 38

ప్ర. అ. మహారాజ = మహారాజా! నిశాచరః = రాక్షసుడైన, సుమాలీ = సుమాలి, కేతుమత్యామ్ = కేతుమతియందు, యత్ = ఏ, అపత్యమ్ = సంతానమును. జనయామాస = పుట్టించెనో, తత్ = దానిని గూర్చి, అనుపూర్వశః = క్రమముగా, నిబోధ = తెలిసికొనుము.

తా. మహారాజా! రాక్షసుడైన సుమాలి కేతుమతియందు పుట్టించిన సంతానమును గూర్చి వరుసగా వినుము. 38

మూ. ప్రహస్తోఽకమ్పనశ్చైవ వికటః కాలికాముఖః,
ధూమ్రాక్షశ్చైవ దణ్డశ్చ సుపార్శ్వశ్చ మహాబలః. 39

సంహ్రాదిః ప్రఘసశ్చైవ భాసకర్ణశ్చ రాక్షసః,
రాకాపుష్పోత్కటా చైవ కైకసీ చ శుచిస్మితాః,
కుమ్భీనసీ చ ఇత్యేతే సుమాలేః ప్రసవాః స్మృతాః. 40

ప్ర. అ. ప్రహస్తః = ప్రహస్తుడు, అకమ్పనశ్చైవ = అకంపనుడు, వికటః = వికటుడు, కాలికా ముఖః = కాలికాముఖుడు, ధూమ్రాక్షశ్చైవ = ధూమ్రాక్షుడు, దణ్డశ్చ=దండుడు, మహాబలః=గొప్పబలము గల, సుపార్శ్వశ్చ = సుపార్శ్వుడు, సంహ్రాదిః = సంహ్రాది, ప్రఘసః చైవ=ప్రఘసుడు, రాక్షసః= రాక్షసుడైన, భాసకర్ణశ్చ = భాసకర్ణుడు, శుచిస్మితాః = తెల్లని చిరునవ్వు గల, రాకా = రాక, పుష్పోత్కటా చైవ = పుష్పోత్కట, కైకసీ = కైకసి, కుమ్భీనసీ చ = కుంభీనసి, ఇత్యేతే = వీళ్ళు, సుమాలేః = సుమాలియొక్క, ప్రసవాః = సంతానముగా, స్మృతాః = చెప్పబడినారు.

తా. ప్రహస్తుడు, అకంపనుడు, వికటుడు, కాలికాముఖుడు, ధూమ్రాక్షుడు, దండుడు, సుపార్శ్వుడు, సంహ్రాది, ప్రఘసుడు, భాసకర్ణుడు అను పుత్రులు, తెల్లని చిరునవ్వు గల రాక, పుష్పోత్కట, కైకసి, కుంభీనసి అను కుమార్తెలు సుమాలి సంతానము. 39, 40

మూ. మాలేస్తు వసుదా నామ గన్ధర్వీ రూపశాలినీ,
భార్యాసీత్పద్మపత్రాక్షీ స్వక్షీ యక్షీవరోపమా. 41

ప్ర. అ. రూపశాలినీ = రూపముతో ప్రకాశించునది, పద్మపత్రాక్షీ = పద్మ పత్రములవంటి నేత్రములు కలది, స్వక్షీ = అందమైన నేత్రము గలది, యక్షీ వరోపమా = శ్రేష్ఠమైన యక్షస్త్రీతో సమానురాలు అయిన, వసుదా నామ=వసుద అను, గన్ధర్వీ = గంధర్వస్త్రీ, మాలేః = మాలియొక్క, భార్యా = భార్యగా, ఆసీత్ = అయెను.

తా. సౌందర్యముతో ప్రకాశించునది, పద్మపత్రములవంటి నేత్రములు గలది, అందమైన నేత్రములు గలది, శ్రేష్ఠురాలైన యక్షస్త్రీతో సమానురాలు అయిన వసుద అను గంధర్వస్త్రీ మాలికి భార్య ఆయెను. 41

మూ. సుమాలేరనుజస్తస్యాం జనయామాస యత్ప్రభో,
అపత్యం కథ్యమానం తు మయా త్వం శృణు రాఘవ.

ప్ర. అ. ప్రభో = ఓ ! ప్రభూ ! రాఘవ = రామా ! తస్యామ్ = ఆమె యందు, సుమాలేః = సుమాలియొక్క, అనుజః = తమ్ముడు, యత్ = ఏ, అపత్యమ్ = సంతానమును, జనయామాస = పుట్టించెనో, మయా = నాచేత, కథ్యమానమ్ = చెప్పబడుచున్న, తత్ = దానినిగూర్చి, శృణు = వినుము.

తా. ఓ ! ప్రభూ! రామా! మాలివలన ఆమెయందు కలిగిన సంతానమును గూర్చి చెప్పెదను ; వినుము. 42

మూ. అనలశ్చానిలశ్చైవ హరః సంపాతిరేవ చ,
ఏతే విభీషణామాత్యా మాలేయాస్తే నిశాచరాః. 43

ప్ర. అ. అనలశ్చ = అనలుడు, అనిలశ్చైవ = అనిలుడు, హరః = హరుడు, సంపాతిరేవ చ = సంపాతి, ఏతే = ఈ, తే = ప్రసిద్ధులైన, విభీషణామాత్యాః = విభీషణుని అమాత్యులైన, నిశాచరాః = రాక్షసులు, మాలేయాః = మాలిపుత్రులు.

తా. అనలుడు, అనిలుడు, హరుడు, సంపాతి అను ప్రసిద్ధులైన విభీషణామాత్యులు మాలి పుత్రులు. 43

మూ. తతస్తు తే రాక్షసపుంగవాస్త్రయో
నిశాచరైః పుత్రశతైశ్చ సంవృతాః,
సురాన్ సహేన్ద్రా న్నృషినాగయక్షాన్
బబాధిరే తాన్ బహువీర్యదర్పితాః. 44

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తే = ఆ, త్రయః = ముగ్గురు, రాక్షస పుంగవాః = రాక్షసశ్రేష్ఠులు, నిశాచరైః = రాక్షసులతోను, పుత్రశతైశ్చ = వందలకొలది పుత్రులతోను, సంవృతాః = కూడినవారై, బహువీర్యదర్పితాః = అధికమైన పరాక్రమముచేత గర్వించినవారై, తాన్ = ఆ, సహేన్ద్రాన్ = ఇంద్రునితో కూడిన, సురాన్ = దేవతలను, ఋషిరాక్షసాన్ = ఋషులను రాక్షసులను, బబాధిరే = బాధించిరి.

తా. పిమ్మట ఆ ముగ్గురు రాక్షసులు ఇతరరాక్షసులతోను, చాలమంది పుత్రులతోను కూడినవారై, అధికమైన పరాక్రమముచేత గర్వించినవారై ఇంద్ర సహితులైన దేవతలను, ఋషులను, నాగులను, యక్షులను బాధించిరి. 44

మూ. జగద్భ్రమన్తోఽనిలవద్దురాసదా
రణేషు మృత్యుప్రతిమానతేజసః.
వరప్రదానాదపి గర్వితా భృశం
క్రతుక్రియాణాం ప్రశమంకరాః సదా. 45

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చమః సర్గః.

ప్ర. అ. అనిలవత్ = వాయువు వలె, జగత్ = జగత్తును, భ్రమన్తః = తిరుగుచున్నవారై, దురాసదాః = ఎదిరింప శక్యముకానివారై, రణేషు = యుద్ధములయందు, మృత్యుప్రతిమానతేజసః = మృత్యువుతో సమానమైన తేజస్సు కలవారై, వరప్రదానాత్ అపి = వరములను ఇచ్చుటవలన కూడ, భృశమ్ = మిక్కిలి, గర్వితాః = గర్వించినవారై, సదా = ఎల్లప్పుడు, క్రతుక్రియాణామ్ = యజ్ఞక్రియలకు. ప్రశమంకరాః = శాంతిని చేయుచున్నవారై, (దేవాదులను బాధించిరి).

తా. యుద్ధములందు మృత్యువుతో సమానమైన తేజస్సు గలవారు, ఎదిరింప శక్యము కానివారు, బ్రహ్మ వరములు ఇచ్చుటచేత మిక్కిలి గర్వితులు అయిన ఆ రాక్షసులు ఎల్లప్పుడు యజ్ఞములకు విఘాతము చేయుచు, వాయువు వలె జగత్తునందు అంతటా తిరుగుచు అందరినీ బాధించిరి. 45

'బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
ఐదవ సర్గ సమాప్తము.

అథ షష్ఠః సర్గః

[శివుని సంమతిచేత దేవతలు రాక్షసులను చంపుటకై విష్ణువును శరణుజొచ్చుట; విష్ణువు ధైర్యము చెప్పగా వారు తిరిగి వెళ్ళిపోవుట, రాక్షసులు దేవతలతో యుద్ధము చేయుటకై వెళ్ళుట; వాళ్ళకు సాహాయ్యము చేయుటకై విష్ణువు వచ్చుట.]

మూ. తైర్వధ్యమానా దేవాశ్చ ఋషయశ్చ తపోధనాః,
భయార్తాః శరణం జగ్ముర్దేవదేవం మహేశ్వరమ్. 1

ప్ర. అ. తైః = వాళ్ళచేత, వధ్యమానాః = చంపబడుతున్న, దేవాశ్చ = దేవతలు, తపోధనాః = తపస్సే ధనముగా గల, ఋషయశ్చ = ఋషులు, భయార్తాః = భయపీడితులై, దేవదేవమ్ = దేవతలకు దేవుడైన, మహేశ్వరమ్ = మహేశ్వరుణ్ణి, శరణం జగ్ముః = శరణు పొందిరి.

తా. ఆ రాక్షసులచేత పీడింపబడిన దేవతలు, తపస్సే ధనముగా గల ఋషులు భయపీడితులై దేవదేవుడైన మహేశ్వరుణ్ణి శరణు జొచ్చిరి. 1

మూ. జగత్సృష్ట్యన్తకర్తారమజమవ్యక్తరూపిణమ్,
ఆధారం సర్వలోకానామారాధ్యం పరమం గురుమ్. 2

తే సమేత్య తు కామారిం త్రిపురారిం త్రిలోచనమ్,
ఊచుః ప్రాఞ్జలయో దేవా భయగద్గదభాషిణః. 3

ప్ర. అ. తే = ఆ, దేవాః = దేవతలు, జగత్సృష్ట్యన్తకర్తారమ్ = జగత్తు యొక్క సృష్టిని అంతమును చేయువాడు, అజమ్ = పుట్టుక లేనివాడు, అవ్యక్తరూపిణమ్ = అవ్యక్తమైన రూపము గలవాడు, సర్వలోకానామ్ = సమస్తలోకములకు, ఆధారమ్ = ఆధారమైనవాడు, ఆరాధ్యమ్ = ఆరాధింపదగిన, పరమం గురుమ్ = గొప్ప గురువు, కామారిమ్ = మన్మథుని శత్రువు, త్రిపురారిమ్ = త్రిపుర

ముల శత్రువు, త్రిలోచనమ్ = మూడు నేత్రములు కలవాడు అయిన మహేశ్వరుణ్ణి, సమేత్య = చేరి, ప్రాఞ్జలయః = కట్టబడిన దోసిళ్ళు గలవారై, భయగద్గద భాషిణః = భయముచేత గద్గదముగా మాటలాడుచు, ఊచుః = పలికిరి.

తా. జగత్సృష్టిలయములు చేయువాడు, పుట్టుక లేనివాడు, వ్యక్తము కాని రూపము గలవాడు, సకలలోకములకు ఆధారమైనవాడు, అందరూ ఆరాధించ దగిన పరమగురువు, మన్మథశత్రువు, మూడు పురముల శత్రువు, మూడు నేత్రములు గలవాడు అయిన మహేశ్వరునివద్దకు వెళ్ళి, దేవతలు అంజలులు ఘటించి, భయముచేత డగ్గుత్తిక పొందిన కంఠస్వరములతో ఇట్లు పలికిరి. 2, 3.

మూ. సుకేశపుత్రైర్భగవన్ పితామహవరోద్ధతైః,
ప్రజాధ్యక్ష ప్రజాః సర్వా బాధ్యన్తే రిపుబాధకైః. 4

ప్ర. అ. ప్రజాధ్యక్ష = ప్రజలకు ప్రభువైనవాడా! భగవన్=పూజ్యుడా! పితామహవరోద్ధతైః = బ్రహ్మవరములచేత దృప్తులైన, రిపుబాధకైః = శత్రువులను బాధించు, సుకేశపుత్రైః = సుకేశుని పుత్రులచేత, సర్వాః = సమస్తమైన, ప్రజాః = ప్రజలు, బాధ్యన్తే = బాధింపబడుచున్నారు.

తా. ప్రజల ప్రభువైన ఓ! పూజ్యుడా! బ్రహ్మ ఇచ్చిన వరములచేత గర్వించి ఉన్న, శత్రువులను బాధించువారైన సుకేశుని పుత్రులు ప్రజల నందరిని బాధించుచున్నారు. 4

మూ. శరణాన్యశరణ్యాని హ్యాశ్రమాణి కృతాని నః,
స్వర్గాచ్చ దేవాన్ ప్రచ్యావ్య స్వర్గే క్రీడన్తి దేవవత్. 5

ప్ర. అ. నః = మాయొక్క, శరణాని = గృహములు, ఆశ్రమాణి = ఆశ్రమములు, అశరణ్యాని = రక్షణమును ఇచ్చునవి కానివిగా, కృతాని = చేయబడినవి. స్వర్గాత్ = స్వర్గమునుండి, దేవాన్ = దేవతలను, ప్రచ్యావ్య=తొలగించి, స్వర్గే = స్వర్గమునందు, దేవవత్ = దేవతలవలె, క్రీడన్తి = క్రీడించుచున్నారు.

తా. ఆ రాక్షసులు మా గృహములను, ఆశ్రమములను రక్షణ ఇవ్వని ప్రదేశములుగా చేసివేసినారు. స్వర్గమునుండి దేవతలను వెడలగొట్టి స్వర్గములో దేవతలం వలె క్రీడించుచున్నారు.

మూ. అహం విష్ణురహం రుద్రో బ్రహ్మాహం దేవరాడహమ్,
అహం యమశ్చ వరుణశ్చన్ద్రోఽహం రవిరప్యహమ్. 6

ఇతి మాలీ సుమాలీ చ మాల్యవాంశ్చైవ రాక్షసాః,
బాధన్తే సమరోద్ధర్షా యే చ తేషాం పురఃసరాః. 7

ప్ర. అ. మాలీ = మాలి, సుమాలీ చ = సుమాలి, మాల్యవాంశ్చైవ = మాల్యవంతుడు అను, రాక్షసాః = రాక్షసులు, తేషామ్ = వాళ్ళకు, పురఃసరాః = ముందు నడచు, యే చ = ఎవరున్నారో ఆ రాక్షసులు, సమరోద్ధర్షాః = యుద్ధము నందు గర్వించినవారై, అహమ్ = నేనే, విష్ణుః = విష్ణువును; అహమ్ = నేనే, రుద్రః = రుద్రుడను; అహమ్ = నేనే, బ్రహ్మ = బ్రహ్మదేవుడను; అహమ్ = నేనే, దేవరాట్ = దేవేంద్రుడను; అహమ్ = నేనే, యమశ్చ = యముడను, వరుణః = వరుణుడను, అహమ్ = నేనే, చన్ద్రః = చంద్రుడను, అహమ్ = నేనే, రవిరపి = సూర్యుడను కూడ, ఇతి = అని, బాధన్తే = బాధించుచున్నారు.

తా. మాలి, సుమాలి, మాల్యవంతుడు, వారి ముందు నడచు రాక్షసులు కూడ యుద్ధములో ధృష్టులై, నేనే విష్ణువును; నేనే రుద్రుడను; నేనే బ్రహ్మ దేవుడను; నేనే దేవేంద్రుడను, నేనే యముడను; నేనే వరుణుడను; నేనే చంద్రుడను, నేనే సూర్యుడను అని చెప్పుచు బాధించుచున్నారు. 6, 7

మూ. తన్నో దేవ భయార్తానామభయం దాతుమర్హసి,
అశివం వపురాస్థాయ జహి వై దేవకణ్టకాన్. 8

ప్ర. అ. దేవ = ఓ! ప్రభూ! తత్ = ఆ కారణమువలన, భయార్తానామ్ = భయముచేత పీడింపబడిన, నః = మాకు, అభయమ్ = అభయమును, దాతుమ్ = ఇచ్చుటకు, అర్హసి = తగి ఉన్నావు. అశివమ్ = భయంకరమైన, వపుః = శరీరమును, ఆస్థాయ = అవలంబించి, దేవకణ్టకాన్ = దేవతల శత్రువులను, జహి వై = చంపుము.

తా. మహాదేవా! ఆ కారణమువలన భయపీడితులమైన మాకు అభయము ఇమ్ము. భయంకరమైన రూపము ధరించి దేవతల శత్రువులను చంపుము. 8

మూ. ఇత్యుక్తస్తు సురైః సర్వైః కపర్దీ నీలలోహితః,
సుకేశం ప్రతి సాపేక్షః ప్రాహ దేవగణాన్ ప్రభుః. 9

ప్ర. అ. సర్వైః = సమస్తమైన, సురైః = దేవతలచేత, ఇతి = ఇట్లు, ఉక్తః = పలకబడిన, కపర్దీ = కపర్ద మను జట ధరించిన, ప్రభుః = ప్రభువైన, నీలలోహితః = శివుడు, సుకేశం ప్రతి = సుకేశుణ్ణి గూర్చి, సాపేక్షః = ప్రేమ కలవాడై, దేవగణాన్ = దేవతాగణములను గూర్చి, ప్రాహ = పలికెను.

తా. దేవతలు అందరు ఈ విధముగా ప్రార్థింపగా జటాధారి, ప్రభువు అయిన శివుడు తనను ఆశ్రయించిన సుకేశుని విషయమున పక్షపాతము గల వాడగుటచేత, దేవగణములతో ఇట్లు పలికెను. 9

మూ. అహం తాన్న హనిష్యామి మమావధ్యా హి తే సురాః,
కిం తు మన్త్రం ప్రదాస్యామి యో వై తాన్నిహనిష్యతి.

ప్ర. అ. సురాః = దేవతలారా ! అహమ్ = నేను, తాన్ = వాళ్ళను, న హనిష్యామి = చంపను. తే = వాళ్ళు, మమ = నాకు, అవధ్యాః హి = చంప దగనివారు కదా. కిం తు = కాని, యః వై = ఎవడు, తాన్ = వాళ్ళను, నిహ నిష్యతి = చంపగలడో, మన్త్రమ్ = అట్టి ఆలోచనను, ప్రదాస్యామి = ఇచ్చెదను.

తా. దేవతలారా ! వాళ్ళు నేను చంపదగినవారు కాదు, అందుచేత నేను వాళ్ళను చంపను. కాని ఎవడు వాళ్ళను చంపగలడో దానిని గూర్చిన ఆలోచన చెప్పెదను. 10

మూ. ఏతమేవ సముద్యోగం పురస్కృత్య మహర్షయః,
గచ్ఛధ్వం శరణం విష్ణుం హనిష్యతి స తాన్ ప్రభుః.

ప్ర. అ. మహర్షయః = మహర్షులారా ! ఏతమ్ = ఈ, సముద్యోగమ్ ఏవ = ప్రయత్నమునే, పురస్కృత్య = పురస్కరించుకొని, విష్ణుమ్ = విష్ణువును, శరణమ్ = శరణము, గచ్ఛధ్వమ్ = పొందుడు. ప్రభుః = సమర్థుడైన, సః = అతడు, తాన్ = వాళ్ళను, హనిష్యతి = చంపగలడు.

తా. మహర్షులారా ! ఈ ప్రయత్నమునే పురస్కరించుకొని విష్ణువును శరణుపొందుడు. సమర్థుడైన అతడు వాళ్ళను చంపగలడు. 11

మూ. తతస్తు జయశబ్దేన ప్రతినన్ద్య మహేశ్వరమ్,
విష్ణోః సమీపమాజగ్ముర్నిశాచరభయార్దితాః. 12

ప్ర. అ. నిశాచరభయార్దితాః = రాక్షసులవలన భయముచేత పీడితులైన ఆ దేవతాదులు, మహేశ్వరమ్ = మహేశ్వరుణ్ణి, జయశబ్దేన = జయశబ్దముచేత, ప్రతినన్ద్య = అభినందించి, విష్ణోః = విష్ణువుయొక్క, సమీపమ్ = సమీపమును గూర్చి, ఆజగ్ముః = వచ్చిరి.

తా. పిమ్మట రాక్షసభయముచేత పీడింపబడిన ఆ దేవాదులు మహేశ్వరుణ్ణి "జయ విజయీ భవ"అని అభినందించి విష్ణువుదగ్గరకు వెళ్ళిరి. 12

మూ. శఙ్ఖచక్రధరం దేవం ప్రణమ్య బహుమాన్య చ,
ఊచుః సంభ్రాన్తవద్వాక్యం సుకేశతనయాన్ ప్రతి 13

ప్ర. అ. శఙ్ఖచక్రధరమ్ = శంఖచక్రములు ధరించిన, దేవమ్ = ఆ దేవుణ్ణి, ప్రణమ్య=నమస్కరించి, బహుమాన్య చ=గౌరవించి, సుకేశతనయాన్ ప్రతి = సుకేశునిపుత్రులను గూర్చి, సంభ్రాన్తవత్ = భయముతో కూడిన, వాక్యమ్ = వాక్యమును, ఊచుః = పలికిరి.

తా. శంఖచక్రధారియైన ఆ శ్రీమహావిష్ణువును నమస్కరించి, స్తుతించి, ఆతనితో, సుకేశుని పుత్రులను గూర్చి భయముతో కూడిన వాక్యము పలికిరి. 13

మూ. సుకేశతనయైర్దేవ త్రిభిస్త్రేతాగ్నిసంనిభైః,
ఆక్రమ్య వరదానేన స్థానాన్యపహృతాని నః. 14

ప్ర. అ. దేవ = ప్రభూ ! త్రేతాగ్నిసంనిభైః=అగ్నిత్రయముతో సమానులైన, త్రిభిః = ముగ్గురు, సుకేశతనయైః = సుకేశపుత్రులచేత, వరదానేన = వరదానముచేత, నః = మాయొక్క, స్థానాని = స్థానములు, ఆక్రమ్య = ఆక్రమించి, అపహృతాని = అపహరించబడినవి.

తా. ప్రభూ ! అగ్నిత్రయమువంటి సుకేశుని పుత్రులు ముగ్గురు వరదానముచేత మా స్థానములను ఆక్రమించి అపహరించినారు. 14

మూ. లఙ్కా నామ పురీ దుర్గా త్రికూటశిఖరే స్థితా,
తత్ర స్థితాః ప్రబాధన్తే సర్వాన్నః క్షణదాచరాః. 15

ప్ర. అ. దుర్గా = ప్రవేశింప శక్యము కాని, లఙ్కా నామ = లంక అను, పురీ = పట్టణము, త్రికూటశిఖరే = త్రికూటపర్వతశిఖరమునందు, స్థితా = ఉన్నది. తత్ర = దానియందు, స్థితాః = ఉన్నవారై, క్షణదాచరాః = రాక్షసులు, నః = మమ్ములను, సర్వాన్ = అందరిని, ప్రబాధన్తే = బాధించుచున్నారు.

తా. త్రికూటపర్వతశిఖరముమీద లంక అను ఇతరులు ప్రవేశింప శక్యము కాని పట్టణ మున్నది. రాక్షసులు దానియందు నివసించుచు మమ్ముల నందరినీ బాధించుచున్నారు. 15

మూ. స త్వమస్మద్ధితార్థాయ జహి తాన్మధుసూదన,
శరణం త్వాం వయం ప్రాప్తా గతిర్భవ సురేశ్వర. 16

ప్ర. అ. సురేశ్వర = దేవతాప్రభువైన, మధుసూదన = ఓ! మధుసూదనా! సః త్వమ్ = అట్టి నీవు, అస్మద్ధితార్థాయ = మా హితముకొరకు, తాన్ = వాళ్ళను, జహి = చంపుము. వయమ్ = మేము, త్వామ్ = నిన్ను, శరణం ప్రాప్తాః = శరణు పొందినాము. గతిః = గతివిగా, భవ = అగుము.

తా. దేవతల ప్రభువైన ఓ! మధుసూదనా! అట్టి నీవు మా హితము కొరకై ఆ రాక్షసులను చంపుము. నిన్ను శరణుజొచ్చినాము. మాకు గతివి అగుము. 16

మూ. చక్రకృత్తాస్యకమలాన్నివేదయ యమాయ వై,
భయేష్వభయదోఽస్మాకం నాన్యోఽస్తి భవతా వినా. 17

ప్ర. అ. చక్రకృత్తాస్యకమలాన్ = చక్రముచేత తెగగొట్టబడిన ముఖపద్మములు గల ఆ రాక్షసులను, యమాయ = యమునికొరకు, నివేదయ = సమర్పించుము; భవతా వినా = నీవు తప్ప, అస్మాకమ్ = మాకు, భయేషు = భయములయందు, అభయదః = అభయము నిచ్చువాడు, అన్యః = మరియొకడు, నాస్తి = లేడు.

తా. ఆ రాక్షసుల ముఖపద్మములను చక్రముచేత ఛేదించి వాళ్ళను యమలోకమునకు పంపుము. భయములు కలిగినప్పుడు అభయ మిచ్చువాడు నీవు తప్ప మాకు మరెవ్వరూ లేరు. 17

మూ. రాక్షసాన్ సమరే దుష్టాన్ సానుబన్ధాన్ మదోద్ధతాన్.
నుద త్వం నో భయం దేవ నీహారమివ భాస్కరః. 18

ప్ర. అ. సానుబన్ధాన్ = పరివారముతో కూడిన, మదోద్ధతాన్ = మదము చేత మితిమీరిన, దుష్టాన్ = దుష్టులైన, రాక్షసాన్ = రాక్షసులను, సమరే = యుద్ధమునందు, (చంపుము). దేవ = ఓ ! ప్రభూ ! త్వమ్ = నీవు, భాస్కరః = సూర్యుడు, నీహారమివ = మంచును వలె, నః = మాయొక్క, భయమ్ = భయమును, నుద = తొలగించుము.

తా. దేవా ! మదముచేత మితిమీరిన ఆ దుష్టరాక్షసులను పరివారసహితముగా యుద్ధములో చంపుము. సూర్యుడు మంచును తొలగించినట్లు మా భయమును తొలగింపుము. 18

మూ. ఇత్యేవం దైవతైరుక్తో దేవదేవో జనార్దనః,
అభయం భయదోఽరీణాం దత్త్వా దేవానువాచ హ. 19

ప్ర. అ. ఇత్యేవమ్ = ఇట్లు, దైవతైః = దేవతలచేత, ఉక్తః = పలకబడిన, దేవదేవః = దేవతల ప్రభువైన, అరీణామ్ = శత్రువులకు, భయదః = భయము నిచ్చు, జనార్దనః = విష్ణువు, అభయమ్ = అభయమును, దత్త్వా = ఇచ్చి, దేవాన్ = దేవతలను గూర్చి, ఉవాచ హ = పలికెను.

తా. దేవదేవుడు, శత్రుభయంకరుడు అయిన మహావిష్ణువు దేవతల మాటలు విని, వాళ్ళకు అభయ మిచ్చి ఇట్లు పలికెను. 19

మూ. సుకేశం రాక్షసం జానే ఈశానవరదర్పితమ్,
తాంశ్చాస్య తనయాన్ జానే యేషాం జ్యేష్ఠః స మాల్యవాన్.

ప్ర అ. ఈశానవరదర్పితమ్ = ఈశ్వరుని వరముచేత గర్వితుడైన, రాక్షసమ్ = రాక్షసుడైన, సుకేశమ్ = సుకేశుణ్ణి, జానే = ఎరుగుదును. అస్య = వీనియొక్క, తాన్ = ఆ, తనయాన్ చ = పుత్రులనుకూడ, జానే = ఎరుగుదును. యేషామ్ = ఎవరిలో, సః మాల్యవాన్ = ఆ మాల్యవంతుడు, జ్యేష్ఠః = పెద్దవాడో.

తా. ఈశ్వరు డిచ్చిన వరములచేత గర్వితుడైన రాక్షసుడైన సుకేశుణ్ణి, మాల్యవంతుడు జ్యేష్ఠుడుగా గల అతని పుత్రులను నేను ఎరుగుదును. 20

మూ. తానహం సమతిక్రాన్తమర్యాదాన్ రాక్షసాధమాన్,
నిహనిష్యామి సంక్రుద్ధః సురా భవత విజ్వరాః. 21

ప్ర. అ. సురాః = దేవతలారా ! సమతిక్రాన్తమర్యాదాన్ = దాటబడిన కట్టుబాట్లు గల, తాన్ = ఆ, రాక్షసాధమాన్ = రాక్షసాధములను, సంక్రుద్ధః = కోపించిన, అహమ్ = నేను, నిహనిష్యామి=చంపగలను. విగతజ్వరాః=పోయిన మనస్తాపము గలవారుగా, భవత = అగుడు.

తా. దేవతలారా ! కట్టుబాట్లు అతిక్రమించిన ఆ రాక్షసులను నేను కోపావిష్టుడనై సంహరించెదను. మనస్తాపమును విడిచిపెట్టుడు. 21

మూ. ఇత్యుక్తాస్తే సురాః సర్వే విష్ణునా ప్రభవిష్ణునా,
యథావాసం యయుర్హృష్టాః ప్రశంసన్తో జనార్దనమ్. 22

ప్ర. అ. ప్రభవిష్ణునా=సమర్థుడైన, విష్ణునా = విష్ణువుచేత, ఏవమ్=ఇట్లు, ఉక్తాః = పలకబడిన, సర్వే = సమస్తమైన, తే=ఆ, సురాః = దేవతలు, హృష్టాః = సంతోషించినవారై, జనార్దనమ్ = విష్ణువును, ప్రశంసన్తః=ప్రశంసించుచు, యథావాసమ్ = తమ తమ నివాసములను అనుసరించి, యయుః=వెళ్ళిరి.

తా. సమర్థుడైన విష్ణువు మాటలు విని ఆ దేవత లందరు సంతోషించి, విష్ణువును ప్రశంసించుచు తమ తమ గృహములకు వెళ్ళిరి. 22

మూ. విబుధానాం సముద్యోగం మాల్యవాంస్తు నిశాచరః,
శ్రుత్వా తౌ భ్రాతరౌ వీరావిదం వచనమబ్రవీత్. 23

ప్ర. అ. నిశాచరః = రాక్షసుడైన, మాల్యవాంస్తు = మాల్యవంతుడైతే, విబుధానామ్ = దేవతలయొక్క, సముద్యోగమ్ = ప్రయత్నమును, శ్రుత్వా = విని, వీరౌ = వీరులైన, తౌ = ఆ, భ్రాతరౌ = సోదరులను గూర్చి, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాక్షసుడైన మాల్యవంతుడు దేవతల ప్రయత్నమును గూర్చి విని, వీరులైన తన సోదరులతో ఇట్లు పలికెను. 23

మూ. అమరా ఋషయశ్చైవ సంగమ్య కిల శంకరమ్,
అస్మద్వధం పరీప్సన్త ఇదం వచనమబ్రువన్. 24

ప్ర. అ. అమరాః = దేవతలు, ఋషయశ్చైవ = ఋషులు, అస్మద్వధమ్ = మన సంహారమును, పరీప్సన్తః = పొందగోరుచున్నవారై, శంకరమ్ = శివుణ్ణి, సంగమ్య = కలిసి, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రువన్ కిల = పలికిరట.

తా. దేవతలు, ఋషులు మన వధను కోరుచు, శివుని దగ్గరకు వెళ్ళి ఇట్లు పలికినారట. 24

మూ. సుకేశతనయా దేవ వరదానబలోద్ధతాః,
బాధన్తేఽస్మాన్ సముద్దృప్తా ఘోరరూపాః పదే పదే. 25

ప్ర. అ. దేవ = ప్రభూ! సుకేశతనయాః = సుకేశుని పుత్రులు, వరదానబలోద్ధతాః = వరదానబలముచేత ఉద్ధతులై, సముద్దృప్తాః = మిక్కిలి గర్వించినవారై, ఘోరరూపాః = ఘోరములైన రూపములు గలవారై, పదే పదే = అడుగడుగునా, అస్మాన్ = మమ్ములను. బాధన్తే = బాధించుచున్నారు.

తా. ప్రభూ! భయంకరరూపములు గల సుకేశపుత్రులు వరదానబలముచేత బరితెగించినవారై, చాల గర్వితులై, అడుగడుగునా మమ్ములను బాధించుచున్నారు. 25

మూ. రాక్షసైరభిభూతాః స్మో న శక్తాః స్మ ప్రజాపతే,
స్వేషు సద్మసు సంస్థాతుం భయాత్తేషాం దురాత్మనామ్.

ప్ర. అ. ప్రజాపతే = ప్రజల ప్రభువైన ఓ! మహాదేవా! రాక్షసైః = రాక్షసులచేత, అభిభూతాః = తిరస్కరించబడినవారము, స్మః = అయి ఉన్నాము. దురాత్మనామ్ = దురాత్ములైన, తేషామ్ = వాళ్ళయొక్క, భయాత్ = భయము వలన, స్వేషు = మా సంబంధమైన, సద్మసు = గృహములయందు, సంస్థాతుమ్ = నిలచుటకు, శక్తాః = సమర్థులము, న స్మః = కాము.

తా. ప్రజల ప్రభువైన ఓ! మహేశ్వరా! మమ్ములను రాక్షసులు ఓడించినారు. వాళ్ళ భయమువలన మా ఇండ్లలో నివసించజాలకున్నాము. 26

మూ. తదస్మాకం హితార్థాయ జహి తాంశ్చ త్రిలోచన,
రాక్షసాన్ హుంకృతేనైవ దహ ప్రదహతాం వర. 27

ప్ర. అ. త్రిలోచన = ఓ ! మహేశ్వరా ! తత్ = ఆకారణమువలన, అస్మాకమ్ = మాయొక్క, హితార్థాయ = హితముకొరకు, తాన్ = వాళ్ళను, జహి = చంపుము. ప్రదహతామ్ = కాల్చివేయువారిలో, వర = శ్రేష్ఠుడా ! రాక్షసాన్ = రాక్షసులను, హుంకృతేనైవ = హుంకారముచేతనే, దహ = కాల్చి వేయుము. 27

తా. మూడు నేత్రములు కలవాడా ! అందువలన మా హితముకొరకై వాళ్ళను చంపివేయుము. దహించువారిలో శ్రేష్ఠుడా ! ఆ రాక్షసులను హుంకారము చేతనే కాల్చివేయుము. 27

మూ. ఇత్యేవం త్రిదశైరుక్తో నిశమ్యాన్ధకసూదనః,
శిరః కరౌ చ ధున్వాన ఇదం వచనమబ్రవీత్. 28

ప్ర. అ. త్రిదశైః = దేవతలచేత, ఇత్యేవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, అన్ధకసూదనః = అంధకాసురసంహారియైన ఈశ్వరుడు, నిశమ్య = విని, శిరః = శిరస్సును, కరౌ చ = హస్తములను, ధున్వానః = కదల్చుచు, ఇదం వచనమ్ = ఈ వచనమును. అబ్రవీత్ = పలికెను.

తా. దేవతల మాటలు విని మహేశ్వరుడు శిరస్సు, హస్తములు కదల్చుచు ఇట్లు పలికెను. 28

మూ. అవధ్యా మమ తే దేవాః సుకేశతనయా రణే,
మన్త్రం తు వః ప్రదాస్యామి యస్తాన్వై విహనిష్యతి.

ప్ర. అ. దేవాః = దేవతలారా ! తే = ఆ, సుకేశతనయాః = సుకేశ పుత్రులు, రణే = యుద్ధమునందు, మమ = నాకు, అవధ్యాః = చంపదగనివారు. యః = ఎవడు, తాన్ = వాళ్ళను, విహనిష్యతి = చంపగలడో, మన్త్రం తు = ఆలోచననైతే, వః = మీకు, ప్రదాస్యామి = ఇచ్చెదను.

తా. దేవతలారా ! నేను యుద్ధములో సుకేశుని పుత్రులను చంపుటకు వీలులేదు. వాళ్ళను ఎవడు చంపగలడో ఆ ఉపాయమును మీకు చెప్పెదను. 29

మూ. యోఽసౌ చక్రగదాపాణిః పీతవాసా జనార్దనః,
హరిర్నారాయణః శ్రీమాన్ శరణం తం ప్రపద్యథ. 30

ప్ర. అ చక్రగదాపాణిః = చక్రము, గద హస్తములందు కలవాడు, పీత వాసాః = పచ్చని వస్త్రము గలవాడు, జనార్దనః = శత్రుజనపీడకుడు, హరిః = పాపహరుడు, శ్రీమాన్ = శ్రీమంతుడు అయిన, యః = ఏ, అయమ్ = ఈ, నారాయణః = నారాయణుడు గలడో, తమ్ = అతనిని, శరణం = శరణునిగా, ప్రపద్యథ = పొందుడు.

తా. చక్రము, గద హస్తములం దున్నవాడు, పీతాంబరుడు, శత్రుజనపీడ కుడు, పాపహరుడు, శ్రీమంతుడు అయిన నారాయణుణ్ణి శరణు పొందుడు. 30

మూ. హరాదవాప్య తే మన్త్రం కామారిమభివాద్య చ,
నారాయణాలయం ప్రాప్య తస్మై సర్వం న్యవేదయన్.

ప్ర. అ. తే = ఆ దేవతలు, హరాత్ = శివునినుండి, మన్త్రమ్ = ఆలోచనను, అవాప్య = పొంది, కామారిమ్ = శివుణ్ణి, అభివాద్య చ = నమస్కరించి, నారాయణాలయమ్ = నారాయణుని గృహమును, ప్రాప్య = పొంది, తస్మై = అతనికి, సర్వమ్ = సమస్తమును, న్యవేదయన్ = తెలిపిరి.

తా. దేవతలు మహేశ్వరుని ఆలోచనను గ్రహించి, అతనికి నమస్కరించి, మహావిష్ణువుదగ్గరికి వెళ్ళి అతనికి అంతా తెలిపిరి. 31

మూ. తతో నారాయణేనోక్తా దేవా ఇన్ద్రపురోగమాః,
సురారీంస్తాన్ హనిష్యామి సురా భవత నిర్భయాః. 32

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఇన్ద్రపురోగమాః = ఇంద్రుడు మొదలైన, దేవాః = దేవతలు, నారాయణేన = నారాయణునిచేత, ఉక్తాః = పలుకబడిరి. సురాః = దేవతలారా! తాన్ = ఆ, సురారీన్ = రాక్షసులను, హనిష్యామి = చంపెదను. నిర్భయాః = భయము లేనివారు, భవత = అగుడు.

తా. అప్పుడు శ్రీమహావిష్ణువు ఇంద్రాదిదేవతలతో ఇట్లు పలికెను. "దేవత లారా! ఆ రాక్షసులను చంపెదను. నిర్భయముగా ఉండుడు." 32

మూ. దేవానాం భయభీతానాం హరిణా రాక్షసర్షభా,
ప్రతిజ్ఞాతో వధోఽస్మాకం చిన్త్యతాం యదిహ క్షమమ్.

ప్ర. అ. రాక్షసర్షభా = రాక్షసశ్రేష్ఠులారా! భయభీతానామ్ = భయ హేతువువలన భయపడిన, దేవానామ్ = దేవతలకు, హరిణా = విష్ణువుచేత, అస్మాకమ్ = మనయొక్క, వధః = వధ, ప్రతిజ్ఞాతః = ప్రతిజ్ఞచేయబడినది. ఇహ = ఈ విషయమునందు, యత్ = ఏది, క్షమమ్ = యుక్తమో, చిన్త్యతామ్ ఆలోచించబడుగాక.

తా. ఓ! రాక్షసశ్రేష్ఠులారా! మనలను చంపెద నని విష్ణువు భయార్తులైన దేవతలకు ప్రతిజ్ఞచేసి చెప్పినాడు. ఈ విషయమునందు ఏమి చేయుట యుక్తమో ఆలోచింపుడు. 33

మూ. హిరణ్యకశిపోర్మృత్యురన్యేషాం చ సురద్విషామ్,
నముచిః కాలనేమిశ్చ సంహ్రాదో వీరసత్తమః. 34
రాధేయో బహుమాయీ చ లోకపాలోఽథ ధార్మికః,
యమలార్జునౌ చ హార్దిక్యః శుమ్భశ్చైవ నిశుమ్భకః. 35
అసురా దానవాశ్చైవ సత్త్వవన్తో మహాబలాః,
సర్వే సమరమాసాద్య న శ్రూయన్తేఽపరాజితాః. 36

ప్ర. అ. హిరణ్యకశిపోః = హిరణ్యకశిపునకు, అన్యేషామ్ = ఇతరులైన, సురద్విషాం చ = రాక్షసులకు, మృత్యుః = మరణము (వచ్చినది). నముచిః = నముచి, కాలనేమిశ్చ = కాలనేమి, వీరసత్తమః = ఉత్తమవీరుడైన, సంహ్రాదః = సంహ్రాదుడు, బహుమాయీ = చాల మాయలు గల, రాధేయః = రాధేయుడు, అథ = మరియు, ధార్మికః = ధార్మికుడైన, లోకపాలః = లోకపాలుడు, యమలార్జునౌ చ = యమలార్జునులు, హార్దిక్యః = హార్దిక్యుడు, శుమ్భశ్చైవ = శుంభుడు, నిశుమ్భకః = నిశుంభకుడు, సత్త్వవన్తః = ధైర్యముగల, మహాబలాః = గొప్ప బలము గల, అసురాః = అసురులు, దానవాశ్చైవ = దానవులు, సర్వే = వీరందరూ, సమరమ్ = యుద్ధమును, ఆసాద్య = పొంది, అపరాజితాః = పరాజయము పొందింపబడనివారుగా, న శ్రూయన్తే = వినబడుటలేదు.

తా. విష్ణువుచేతిలో హిరణ్యకశిపుడు, ఇతరరాక్షసులు మరణించినారు. ఈతనితో యుద్ధము చేయుటకై వెళ్ళిన నముచి, కాలనేమి, ఉత్తమవీరుడైన సంహ్రాదుడు, అనేకమాయలు గల రాధేయుడు, ధార్మికుడైన లోకపాలకుడు, యమలార్జునులు, హార్దిక్యుడు, శుంభుడు, నిశుంభుడు, గొప్ప ధైర్యపరాక్రమములు గల అసురులు, దానవులు వీరందరు పరాజయము పొందక తిరిగి వెళ్ళినట్లు మనము వినలేదు. 34-36

మూ. సర్వైః క్రతుశతైరిష్టం సర్వే మాయావిదస్తథా,
సర్వే సర్వాస్త్రకుశలాః సర్వే శత్రుభయంకరాః, 37
నారాయణేన నిహతాః శతశోఽథ సహస్రశః.

ప్ర. అ. సర్వైః = అందరిచేతను, క్రతుశతైః = వందలకొలది క్రతువుల చేత, ఇష్టమ్ = యాగముచేయబడినది. తథా = మరియు, సర్వే = అందరూ, మాయావిదః = మాయలు తెలిసినవారే. సర్వే = అందరూ, సర్వాస్త్రకుశలాః = అన్ని అస్త్రములయందు నేర్పుగలవారే; సర్వే = అందరూ, శత్రుభయంకరాః = శత్రువులకు భయము కలిగించువారే. శతశః = వందలకొలది, అథ = మరియు, సహస్రశః = వేలకొలది, నారాయణేన = నారాయణునిచేత, నిహతాః = చంపబడినారు.

తా. ఈ అసురులందరూ వందలకొలది యాగములు చేసినవారే. అందరూ మాయలు తెలిసినవారే. అందరూ అన్ని అస్త్రాలయందూ నేర్పు గలవారే. అందరూ శత్రువులకు భయంకరులే. అట్టి వందలకొలది, వేలకొలది అసురులను నారాయణుడు చంపివేసినాడు. 37

మూ. ఏతద్ జ్ఞాత్వా తు సర్వేషాం క్షమం కర్తుమిహార్హథ,
దుఃఖం నారాయణో జేతుం యో నో హన్తు మిహేచ్ఛతి.

ప్ర. అ. ఏతత్ = దీనిని, జ్ఞాత్వా = తెలిసికొని, సర్వేషామ్ = మన అందరికీ, క్షమమ్ = యుక్తమైనదానిని, ఇహ = ఇప్పుడు, కర్తుమ్ = చేయుటకు, అర్హథ = తగి ఉన్నారు. యః = ఏ నారాయణుడు, ఇహ = ఇప్పుడు, నః = మనలను, హన్తుమ్ = చంపుటకు, ఇచ్ఛతి = కోరుచున్నాడో, నారాయణః = అట్టి నారాయణుడు, జేతుమ్ = జయించుటకు, దుఃఖమ్ = కష్టమైనది.

తా. ఈ విషయమును తెలిసికొని మన అందరికీ తగిన కార్యము చేయుడు. మనలను చంపుటకై నిర్ణయించుకొన్న నారాయణుణ్ణి జయించుట కష్టము. 38

మూ. తతః సుమాలీ మాలీ చ శ్రుత్వా మాల్యవతో వచః,
ఊచతుర్భ్రాతరం జ్యేష్ఠమశ్వినావివ వాసవమ్. 39

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సుమాలీ = సుమాలి, మాలీ చ = మాలీ కూడ, మాల్యవతః = మాల్యవంతునియొక్క, వచః = వాక్యమును, శ్రుత్వా = విని, అశ్వినౌ = అశ్వినీదేవతలు, వాసవమివ = ఇంద్రుని గూర్చి వలె, జ్యేష్ఠం భ్రాతరమ్ = అన్నగారిని గూర్చి, ఊచతుః = పలికిరి.

తా. అన్నగారి మాటలు విన్న సుమాలి, మాలీ కూడ, అశ్వినీదేవతలు దేవేంద్రునితో పలికి నట్లు అన్నగారితో ఇట్లు పలికిరి. 39

మూ. స్వధీతం దత్తమిష్టం చ ఐశ్వర్యం పరిపాలితమ్,
ఆయుర్నిరామయం ప్రాప్తం సుధర్మః స్థాపితః పథి. 40

ప్ర. అ. స్వధీతమ్ = బాగా అధ్యయనము చేయబడినది. దత్తమ్ = ఇవ్వ బడినది. ఇష్టం చ = యాగము చేయబడినది. ఐశ్వర్యమ్=ఐశ్వర్యము, పరిపాలి తమ్ = పాలించబడినది. నిరామయమ్ = రోగములు లేని, ఆయుః = ఆయుర్దా యము, ప్రాప్తమ్ = పొందబడినది. సుధర్మః = మంచి ధర్మము, పథి=మార్గము నందు, స్థాపితః = స్థాపించబడినది.

తా. మనము బాగా అధ్యయనము చేసినాము. దానములు ఇచ్చినాము. యాగాలు చేసినాము. ఐశ్వర్యము పాలించినాము. రోగములు లేని ఆయుర్దాయ మును పొందినాము. మంచి ధర్మమార్గమును నిలిపినాము. 40

మూ. దేవసాగరమక్షోభ్యం శస్త్రైః సమవగాహ్య చ,
జితా ద్విషో హ్యప్రతిమాస్తన్నో మృత్యుకృతం భయమ్.

ప్ర. అ. అక్షోభ్యమ్ = క్షోభింప శక్యము కాని, దేవసాగరమ్ = దేవతా సముద్రమును, శస్త్రైః = ఆయుధములతో, సమవగాహ్య చ = ప్రవేశించి, అప్రతి మాః = సాటి లేని, ద్విషః = శత్రువులు, జితాః = జయించబడినారు. తత్ =

ఆకారణమువలన, నః = మనకు, మృత్యుకృతమ్ = మృత్యువువలన ఏర్పడిన, భయమ్ = భయము, న = లేదు.

తా. క్షోభింప శక్యము కాని దేవతాసైన్యసముద్రములోనికి శస్త్రముల సాహాయ్యముతో ప్రవేశించి సాటి లేని శత్రువులను జయించినాము. అందువలన మనకు మృత్యువువలన కలుగు భయము లేదు. 41

మూ. నారాయణశ్చ రుద్రశ్చ శక్రశ్చాపి యమస్తథా,
అస్మాకం సంముఖే స్థాతుం సర్వే బిభ్యతి సర్వదా. 42

ప్ర. అ. నారాయణశ్చ = నారాయణుడు, రుద్రశ్చ = రుద్రుడు, శక్రశ్చ = ఇంద్రుడు, తథా = మరియు, యమశ్చ = యముడు, సర్వే = అందరూ, అస్మాకమ్ = మనయొక్క, సంముఖే = ఎదట, స్థాతుమ్ = నిలచుటకు, సర్వదా = ఎల్లప్పుడూ, బిభ్యతి = భయపడుదురు.

తా. నారాయణుడు, రుద్రుడు, ఇంద్రుడు, యముడు, అందరూ కూడ మన ఎదుట నిలచుటకు ఎల్లప్పుడూ భయపడుచుందురు. 42

మూ. విష్ణోర్ద్వేషస్య నాస్త్యేవ కారణం రాక్షసేశ్వర,
దేవానామేవ దోషేణ విష్ణోః ప్రచలితం మనః. 43

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసరాజా ! విష్ణోః = విష్ణువుయొక్క, ద్వేషస్య = ద్వేషమునకు, కారణమ్ = కారణము, నాస్త్యేవ = లేనే లేదు. దేవానామ్ = దేవతలయొక్క, దోషేణైవ = దోషముచేతనే, విష్ణోః = విష్ణువుయొక్క, మనః = మనస్సు, ప్రచలితమ్ = చలించినది.

తా. రాక్షసరాజా ! మనతో విష్ణువుప ద్వేషము ఉండుటకు కారణము ఏమీ లేదు. దేవతల చెప్పుడుమాటలచేతనే విష్ణువు మనస్సు చలించినది. 43

మూ. తస్మాదద్యైవ సహితాః సర్వేఽన్యోన్యసమావృతాః,
దేవానేవ జిఘాంసామో యేభ్యో దోషః సముత్థితః. 44

ప్ర. అ. తస్మాత్ = ఆకారణమువలన, అద్యైవ = ఇప్పుడే, సహితాః = కూడినవారమై, అన్యోన్యసమావృతాః = పరస్పరము రక్షించుకొనుచున్నవారమై,

యేభ్యః = ఏ దేవతలనుండి, దోషః = ఈ దోషము, సముత్థితః = కలిగినదో, దేవానేవ = అట్టి దేవతలనే, జిఘాంసామః = చంపుటకు ఇచ్ఛయించెదము.

తా. అందువలన ఇప్పుడే కలిసి వెళ్ళి. ఒకరి నొకరు రక్షించుకొనుచు, ఈ దోషమునకు కారణభూతులైన దేవతలను చంపెదము. 44

మూ. ఏవం సంమన్త్ర్య బలినః సర్వసైన్యసమావృతాః,
ఉద్యోగం ఘోషయిత్వా తు సర్వే నైరృతపుంగవాః, 45
యుద్ధాయ నిర్యయుః క్రుద్ధా జమ్భవృత్రాదయో యథా.

ప్ర. అ. బలినః = బలవంతులైన, సర్వే=సమస్తమైన, నైరృతపుంగవాః = రాక్షసశ్రేష్ఠులు, ఏవమ్ = ఇట్లు, సంమన్త్ర్య = ఆలోచించి, సర్వసైన్యసమావృతాః = సమస్తసైన్యముతో కూడినవారై, ఉద్యోగమ్ = తమప్రయత్నమును, ఘోషయిత్వా = చాటించి, క్రుద్ధాః = కోపించినవారై, జమ్భవృత్రాదయో యథా = జంభుడు వృత్రాసురుడు మొదలైనవారు వలె, యుద్ధాయ = యుద్ధముకొరకు, నిర్యయుః = బయలుదేరిరి.

తా. బలవంతులైన ఆ రాక్షసశ్రేష్ఠులు ఈ విధముగా ఆలోచించి సకల సైన్యములతో కూడినవారై తమ ప్రయత్నమును చాటించి, జంభ-వృత్రాసురాదులు వలె, కోపముతో యుద్ధానికి బయలుదేరిరి. 45

మూ. ఇతి తే రామ సంమన్త్ర్య సర్వోద్యోగేన రాక్షసాః, 46
యుద్ధాయ నిర్యయుః సర్వే మహాకాయా మహాబలాః.

ప్ర. అ. రామ = రామా! మహాకాయాః = గొప్ప దేహములు గల, మహాబలాః = గొప్పబలము గల, సర్వే = సమస్తమైన, తే రాక్షసాః = ఆ రాక్షసులు, ఇతి = ఇట్లు, సంమన్త్ర్య = ఆలోచించి, సర్వోద్యోగేన = సమస్తప్రయత్నముచేత, యుద్ధాయ = యుద్ధముకొరకు, నిర్యయుః = బయలుదేరిరి.

తా. రామా! పెద్ద శరీరములు గల, మహాబలశాలులైన ఆ రాక్షసులందరూ ఈ విధముగా ఆలోచించి అన్ని విధముల ప్రయత్నములు చేసి యుద్ధమునకై బయలుదేరిరి. 46

మూ. స్యన్దనై ర్వారణై శ్చైవ హయైశ్చ కరిసంనిభైః, 47
ఖరై ర్గోభిరథోష్ట్రైశ్చ శింశుమారై ర్భుజంగమైః,
మకరైః కచ్ఛపైర్మీనై ర్విహఙ్గైర్గరుడోపమైః, 48
సింహైర్వ్యాఘ్రైర్వరాహైశ్చసృమరై శ్చమరై రపి,
త్యక్త్వా లఙ్కాం గతాః సర్వే రాక్షసా బలగర్వితాః, 49
ప్రయాతా దేవలోకాయ యోద్ధుం దైవతశత్రవః.

ప్ర. అ. బలగర్వితాః = బలముచేత గర్వించిన, సర్వే రాక్షసాః = సమస్తమైన రాక్షసులు, లఙ్కామ్ = లంకను, త్యక్త్వా = విడచి, స్యన్దనైః = రథములచేత, వారణైశ్చైవ = ఏనుగులచేత, కరిసంనిభైః = ఏనుగులతో సమానమైన, హయైశ్చ = గుఱ్ఱములచేత, ఖరైః = గాడిదలచేత, గోభిః = ఎద్దులచేత, అథ = మరియు, ఉష్ట్రైః చ = ఒంటెలచేత, శింశుమారైః = శింశుమారములచేత, భుజంగమైః = సర్పములచేత, మకరైః = మొసళ్ళచేత, కచ్ఛపైః = తాబేళ్ళచేత, మీనైః = చేపలచేత, గరుడోపమైః = గరుత్మంతునితోసమానములైన, విహంగైః = పక్షులచేత, సింహైః = సింహములచేత, వ్యాఘ్రైః = పులులచేత, వరాహైశ్చ = వరాహములచేత, సృమరైః = గవయములచేత, చమరై రపి = చమరమృగములచేత, గతాః = వెళ్ళిరి. దైవతశత్రవః = దేవతల శత్రువులైన ఆ రాక్షసులు, యోద్ధుమ్ = యుద్ధముచేయుటకు, దేవలోకాయ = దేవలోకమునకు, ప్రయాతాః = వెళ్ళిరి.

తా. బలముచేత గర్వించిన రాక్షసు లందరు లంకను విడచి రథములు, ఏనుగులు, ఏనుగులవంటి గుఱ్ఱములు, గాడిదలు, ఎద్దులు, ఒంటెలు, శింశుమారములు, సర్పములు, మొసళ్లు, తాబేళ్ళు, చేపలు, గరుత్మంతునివంటి పక్షులు, సింహములు, వ్యాఘ్రములు, వరాహములు, సృమరములు, చమరమృగములు ఎక్కి వెళ్ళిరి. దేవతల శత్రువులైన ఆ రాక్షసులు యుద్ధము చేయుటకై దేవలోకమునకు వెళ్ళిరి. 47-49

మూ. లఙ్కావిపర్యయం దృష్ట్వా యాని లఙ్కాలయాన్యథ, 50
భూతాని భయపర్ణాని విమనస్కాని సర్వశః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, లఙ్కాలయాని = లంక నివాసముగా గల, యాని = ఏ, భూతాని = ప్రాణులు గలవో అవి, లఙ్కావిపర్యయమ్ = లంకలోని మార్పును, దృష్ట్వా = చూచి, సర్వశః = అన్ని వైపులా, భయదర్శిని = భయమును చూచుచున్నవై, విమనస్కాని = ఉత్సాహశూన్యమైన మనస్సులు కలవి అయినవి.

తా. పిమ్మట లంకలో నివసించు ప్రాణులన్నీ లంకలో కనబడుచున్న లోకవిరుద్ధములైన విషయములను చూచి, భయము రానున్న దని భావించుచు, మనస్సులో దిగులు చెందినవి. 50

మూ. రథోత్తమైరుహ్యమానాః శతశోఽథ సహస్రశః, 51
ప్రయాతా రాక్షసాస్తూర్ణం దేవలోకం ప్రయత్నతః,
రక్షసామేవ మార్గేణ దైవతాన్యపచక్రముః. 52

ప్ర. అ. అథ = అటుపిమ్మట, శతశః = వందలకొలది, సహస్రశః = వేలకొలది, రాక్షసాః = రాక్షసులు, రథోత్తమైః = శ్రేష్ఠములైన రథములచేత, ఉహ్యమానాః = మోయబడుచున్నవారై, ప్రయత్నతః = ప్రయత్నపూర్వకముగా, తూర్ణమ్ = శీఘ్రముగా, దేవలోకమ్ = దేవలోకమును గూర్చి, ప్రయాతాః = వెళ్ళిరి. దైవతాని = దేవతలు, రక్షసామ్ = రాక్షసులయొక్క, మార్గేణైవ = మార్గముచేతనే, అపచక్రముః = పారిపోయిరి.

తా. వందలకొలది, వేలకొలది రాక్షసులు శ్రేష్ఠములైన రథము లెక్కి, శీఘ్రముగా, ప్రయత్నపూర్వకముగా స్వర్గలోకమునకు వెళ్ళిరి. వాళ్ళు అటు బయలుదేరగానే దేవతలు ఇటు పారిపోయిరి. 51, 52

మూ. భౌమాశ్చైవాన్తరిక్షాశ్చ కాలాజ్ఞప్తా భయావహాః,
ఉత్పాతా రాక్షసేన్ద్రాణామభవాయ సముత్థితాః. 53

ప్ర. అ. భౌమాశ్చైవ = భూమికి సంబంధించినవి, అన్తరిక్షాశ్చ = అంతరిక్షమునకు సంబంధించినవి అయిన, భయావహాః = భయంకరములైన, ఉత్పాతాః = దుశ్శకునములు, కాలాజ్ఞప్తాః = కాలముచేత ఆజ్ఞాపించబడినవై, రాక్షసేన్ద్రాణామ్ = రాక్షసప్రభువులయొక్క, అభావాయ = వినాశముకొరకు, సముత్థితాః = బయలుదేరినవి.

తా. కాల్రప్రేరణచేత భయంకరములైన అపశకునములు రాక్షసుల వినాశ మును సూచించుచు భూమియందు, అంతరిక్షమునందు కనబడినవి. 53

మూ. అస్థీని మేఘా వవృషురుష్ణం శోణితమేవ చ,
వేలాం సముద్రాశ్చోత్క్రాన్తాశ్చేలుశ్చాప్యథ భూధరాః.

ప్ర. అ. మేఘాః = మేఘములు, అస్థీని = ఎముకలను, ఉష్ణమ్ = వేడి యైన, శోణితమేవ చ = రక్తమును, వవృషుః = వర్షించినవి. సముద్రాః చ = సముద్రములు కూడ, వేలామ్ = తీరమును, ఉత్క్రాన్తాః = దాటినవి, అథ = మరియు, భూధరాః = పర్వతములు, చేలుః చ = చలించినవి కూడ.

తా. మేఘములు ఎముకలను వేడియైన రక్తమును వర్షించినవి. సముద్ర ములు తీరములు దాటినవి. పర్వతములు చలించినవి. 54

మూ అట్టహాసాన్ విముఞ్చన్తో ఘననాదసమస్వనాః,
వాశన్త్యశ్చ శివాస్తత్ర దారుణం ఘోరదర్శనాః. 55

ప్ర. అ. అట్టహాసాన్ = అట్టహాసములను, విముఞ్చన్తః = విడచుచు, ఘననాదసమస్వనాః = మేఘధ్వనులతో సమానమైన ధ్వనికలవారుగా, అయిరి. తత్ర = అక్కడ, ఘోరదర్శనాః = భయంకరమైనదర్శనముగల, శివాః = నక్కలు. దారుణమ్ = భయంకరముగా, వాశన్త్యః = కూయుచు (ఉండెను).

తా. కొన్ని భూతములు అట్టహాసములు (పెద్ద నవ్వులు) చేయుచు ఉరు ముల వలె అరచుచుండెను. చూచుటకు భయంకరముగా ఉన్న ఆడనక్కలు భయంకరముగా అరచుచుండెను.

వి. ఇక్కడ పూర్వార్ధానికి సరిగా అర్థం కుదురుటలేదు. కొందరు వ్యాఖ్యా తలు "సముద్రములు అట్టహాసములు చేయుచు మేఘధ్వని వంటి ధ్వనితో కూడి నవై..."అని వెనుకకు అన్వయించినారు. 'అట్టహాసాన్విముఞ్చన్తః' అనేది సముద్రపక్షంలో సరిగా కుదరదు. అందుచేత "కొన్ని భూతాలు"అని అధ్యాహారం తెచ్చుకొని అర్థం వ్రాసినాము. ప్రాచ్యపాఠం స్పష్టంగా ఉన్నది. ఈ శ్లోకార్థం తరవాత - "భూతాశ్చ పరినృత్యన్తి ఉద్యన్తస్తే సహస్రశః"అను శ్లోకార్ధం ఉన్నది.

మూ. సంపతన్త్యథ భూతాని దృశ్యన్తే చ యథాక్రమమ్,
గృధ్రచక్రం మహచ్చాత్ర ప్రజ్వాలోద్గారిభిర్ముఖైః. 56
రక్షోగణస్యోపరిష్టాత్పరిభ్రమతి కాలవత్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, భూతాని = పృథివ్యాది భూతములు (లేదా ప్రాణులు) యథాక్రమమ్=క్రమానుసారముగా, సంపతన్తి=పడిపోవుచున్నవిగా, దృశ్యన్తే = కనబడుచున్నవి. అత్ర = ఇక్కడ, మహత్ = గొప్పదైన, గృధ్రచక్రమ్ = గ్రద్దల సముదాయము, ప్రజ్వాలోద్గారిభిః = గొప్ప జ్వాలలను విడచుచున్న, ముఖైః = ముఖములతో, కాలవత్ = యముడువలె, రక్షోగణస్య=రాక్షస సముదాయము యొక్క, ఉపరి = పైన, భ్రమతి = తిరుగుచున్నది.

తా పృథివ్యాదిమహాభూతములు (లేదా ప్రాణులు) క్రమానుసారముగా పడిపోవుచున్నట్లు కనబడెను. గ్రద్దల పెద్ద గుంపు జ్వాలలు కక్కుచున్న ముఖాలతో యముడు వలె రాక్షసులపైన తిరుగుచుండెను. 56

మూ. కపోతా రక్తపాదాశ్చ సారికా విద్రుతా యయుః, 57
కాకా వాశ్యన్తి తత్రైవ బిడాలాశ్చ ద్విపాదికాః.

ప్ర అ. రక్తపాదాః = ఎఱ్ఱని పాదములు గల, కపోతాః=పావురములు, సారికాః = గోరింకలు, విద్రుతాః=పరుగెత్తినవై, యయుః=వెళ్ళినవి. తత్రైవ= అక్కడనే, కాకాః = కాకులు, బిడాలాశ్చ = పిల్లులు, ద్విపాదికాః = రెండు పాదములు గలవి, వాశ్యన్తి = కూయుచున్నవి.

తా. ఎఱ్ఱని పాదాలు గల పావురములు, గోరింకలు పరుగెత్తుచు అక్కడికి వచ్చెను. కాకులు, పిల్లులు, ద్విపాదికలు కూయుచుండెను. 57

మూ. ఉత్పాతాంస్తాననాదృత్య రాక్షసా బలదర్పితాః, 58
యాన్త్యేవ న నివర్తన్తే మృత్యుపాశావపాశితాః.

ప్ర. అ. బలదర్పితాః = బలముచేత గర్వించిన, రాక్షసాః = రాక్షసులు, తాన్ = ఆ, ఉత్పాతాన్ = అపశకునములను, అనాదృత్య = అనాదరము చేసి, మృత్యుపాశావపాశితాః = మృత్యుపాశముచేత కట్టబడినవారై, యాన్త్యేవ = వెళ్ళుచునే ఉన్నారు, న నివర్తన్తే = మరలుట లేదు.

తా. బలముచేత గర్వించిన ఆ రాక్షసులు ఆ ఉత్పాతాలను లెక్క చేయక, కాలపాశముచేత బద్ధులై యుద్ధమునకు వెళ్ళిరే కాని, వెనుకకు మరల లేదు. 58

మూ. మాల్యవాంశ్చ సుమాలీ చ మారీచః సుమహాబలః, 59
పురఃసరా రాక్షసానాం జ్వలితా ఇవ పావకాః.

ప్ర. అ. రాక్షసానామ్ = రాక్షసులకు, పురఃసరాః = ముందు నడచుచున్న, మాల్యవాంశ్చ = మాల్యవంతుడు, సుమాలీ చ = సుమాలి, సుమహాబలః = చాల గొప్ప బలము గల, మాలీ చ = మాలి, జ్వలితాః = ప్రజ్వలించుచున్న, పావకాః ఇవ = అగ్నులు వలె ఉండిరి.

తా. ఆ రాక్షసుల ముందు వెళ్ళుచున్న మాల్యవంతుడు, సుమాలి, మహా బలశాలి అయిన మాలి మండుచున్న అగ్నుల వలె ఉండిరి. 59

మూ. మాల్యవన్తం తు తే సర్వే మాల్యవన్తమివాచలమ్, 60
నిశాచరా ఆశ్రయన్తి ధాతారమివ దేవతాః.

ప్ర. అ. తే = ఆ, సర్వే = సమస్తమైన, నిశాచరాః = రాక్షసులు, మాల్యవన్తమ్ = మాల్యవంతుణ్ణి, మాల్యవన్తమ్ = మాల్యవంత మనే, అచలమివ = పర్వతమును వలె, దేవతాః = దేవతలు, ధాతారమ్ ఇవ = బ్రహ్మదేవుని వలె, ఆశ్రయన్తి = ఆశ్రయించుచున్నారు.

తా. ఆ రాక్షసు లందరూ ఆ మాల్యవంతుణ్ణి మాల్యవత్పర్వతమును వలె, దేవతలు బ్రహ్మదేవుని వలె ఆశ్రయించి ఉండిరి. 60

మూ. తద్బలం రాక్షసేన్ద్రాణాం మహాభ్రఘననాదితమ్, 61
జయేప్సయా దేవలోకం యయౌ మాలివశే స్థితమ్.

ప్ర. అ. మాలివశే = మాలియొక్క వశమునందు, స్థితమ్ = ఉన్న, మహాభ్రఘననాదితమ్ = మహామేఘముల వంటి గొప్ప ధ్వని గల, తత్ = ఆ, రాక్షసేన్ద్రాణామ్ = రాక్షసనాయకులయొక్క, బలమ్ = సైన్యము, జయేప్సయా = జయమును పొందవలె నను కోరికతో, దేవలోకమ్ = దేవలోకమును గూర్చి, యయౌ = వెళ్ళెను.

తా. మహామేఘముల వలె అధికముగా గర్జించుచున్న ఆ రాక్షససైన్యము మాలి నాయకత్వములో, జయమును కోరుచు దేవలోకమునకు వెళ్ళెను. 61

మూ. రాక్షసానాం సముద్యోగం తం తు నారాయణః ప్రభుః,
దేవదూతాదుపశ్రుత్య చక్రే యుద్ధే తదా మనః. 62

ప్ర. అ. తదా = అప్పుడు, ప్రభుః = ప్రభువైన, నారాయణః = విష్ణువు, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, తమ్ = ఆ, సముద్యోగమ్ = ప్రయత్నమును, దేవదూతాత్ = దేవదూతవలన, ఉపశ్రుత్య = విని, యుద్ధాయ = యుద్ధముకొరకు, మనః = మనస్సును, చక్రే = చేసెను.

తా. అప్పుడు ప్రభువైన శ్రీ మహావిష్ణువు దేవదూతద్వారా రాక్షసుల ప్రయత్నమును గూర్చి విని యుద్ధము చేయవలె నని సంకల్పించెను. 62

మూ. స సజ్జాయుధతూణీరో వైనతేయోపరి స్థితః, 63
ఆసాద్య కవచం దివ్యం సహస్రార్కసమద్యుతి,
ఆబధ్య శరసంపూర్ణే ఇషుధీ విమలే తదా. 64

శ్రోణిసూత్రం చ ఖడ్గం చ విమలం కమలేక్షణః,
శఙ్ఖచక్రగదాశార్ఙ్గఖడ్గాంశ్చైవ వరాయుధాన్ 65

సుపర్ణం గిరిసంకాశం వైనతేయమథాస్థితః,
రాక్షసానామభావాయ యయౌ తూర్ణతరం ప్రభుః. 66

ప్ర. అ. తదా = అప్పుడు, కమలేక్షణః = పద్మముల వంటి నేత్రములు గల, ప్రభుః = ప్రభువైన, సః = ఆ విష్ణువు, సజ్జాయుధతూణీరః = సిద్ధముగా ఉన్న ఆయుధములు అంబులపొదలు గలవాడై, వైనతేయోపరి = గరుత్మంతుని పైన, స్థితః = ఉన్నవాడై, సహస్రార్కసమద్యుతి = వేయి సూర్యులతో సమానమైన కాంతి గల, దివ్యమ్ = దివ్యమైన, కవచమ్ = కవచమును, ఆసాద్య = పొంది, శరసంపూర్ణే = బాణములతో నిండిన, విమలే = నిర్మలమైన, ఇషుధీ = అంబులపొదులను, ఆబధ్య = కట్టుకొని, శ్రోణిసూత్రం చ = నడుముకు కట్టుకొను త్రాడును, విమలమ్ = నిర్మలమైన, ఖడ్గం చ = ఖడ్గమును, శఙ్ఖచక్రగదాశార్ఙ్గ

ఖడ్గాంశ్చైవ = శంఖచక్రగదాశార్ఙ్గ ఖడ్గములను, వరాయుధాన్ = శ్రేష్ఠములైన ఆయుధములను, ధరించి, అథ = అటుపిమ్మట, సుపర్ణమ్ = మంచి రెక్కలు గల, గిరిసంకాశమ్ = పర్వతముతో సమానమైన, వైనతేయమ్ = గరుత్మంతుణ్ణి, ఆస్థితః = అధిష్ఠించినవాడై, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, అభావాయ = వినాశముకొరకు, తూర్ణతరమ్ = అతి శీఘ్రముగా, యయౌ = వెళ్లెను.

తా. అప్పుడు పద్మములవంటి నేత్రములు గల ప్రభువైన ఆ శ్రీమహావిష్ణువు ఆయుధములను, అంబులపొదులను సిద్ధము చేసికొని, గరుత్మంతునిపైన ఉన్నవాడై, వేయి సూర్యులతో సమానమైన దివ్యమైన కవచమును పొంది, బాణములతో నిండిన నిర్మలములైన అంబులపొదులు కట్టుకొని, నడుముత్రాడును, నిర్మలమైన ఖడ్గమును కట్టుకొని, శంఖ - చక్ర - గదా, శార్ఙ్గము లను శ్రేష్ఠములైన ఆయుధములు ధరించి, మంచి రెక్కలు గల, పర్వతము వలె ఉన్న గరుత్మంతునిపై ఎక్కి, రాక్షసవినాశమునకై అతిశీఘ్రముగా వెళ్లెను. 63 - 66

మూ. సుపర్ణపృష్ఠే స బభౌ శ్యామః పీతామ్బరో హరిః,
కాఞ్చనస్య గిరేః శృఙ్గే సతడిత్తోయదో యథా. 67

ప్ర. అ. శ్యామః = నల్లనైన, పీతామ్బరః = పచ్చనివస్త్రముగల, సః = ఆ, హరిః = విష్ణువు, సుపర్ణపృష్ఠే = గరుత్మంతుని వీపుమీద, కాఞ్చనస్య = బంగారము వికారమైన, గిరేః = పర్వతముయొక్క, శృఙ్గే = శిఖరమునందు, సతడిత్ = మెరుపులతో కూడిన, తోయదః యథా = మేఘము వలె, బభౌ = ప్రకాశించెను.

తా. పచ్చని వస్త్రమును ధరించి, గరుత్మంతుని వీపుమీద ఉన్న నల్లని దేహచ్ఛాయ గల ఆ శ్రీమహావిష్ణువు, బంగారుకొండ శిఖరముమీద ఉన్న మెరుపుతో కూడిన మేఘము వలె ప్రకాశించెను. 67

మూ. స సిద్ధదేవర్షిమహోరగైశ్చ
గన్ధర్వయక్షైరుపగీయమానః,
సమాససాదాసురసైన్యశత్రు
శ్చక్రాసిశార్ఙ్గాయుధశఙ్ఖపాణిః. 68

ప్ర. అ. అసురసైన్యశత్రుః = రాక్షససైన్యసంహారకుడైన, సః = ఆ విష్ణువు,

సిద్ధదేవర్షిమహోరగైశ్చ = సిద్ధులచేతను, దేవర్షులచేతను, మహోరగులచేతను, గన్ధర్వయక్షైః = గంధర్వులచేతను, యక్షులచేతను, ఉపగీయమానః = స్తుతింప బడుచున్నవాడై, చక్రాసిశార్ఙ్గాయుధ శఙ్ఖపాణిః = చక్రము, ఖడ్గము, శార్ఙ్గము అను ఆయుధములు, శంఖము హస్తములందు గలవాడై, సమాససాద = సమీపించెను

తా. ఆ శ్రీమహావిష్ణువు, సిద్ధులు, దేవర్షులు, మహోరగులు, గంధర్వులు, యక్షులు స్తుతించుచుండగా, చక్ర - ఖడ్గ - శార్ఙ్గ - శంఖములను హస్తములందు ధరించి, రాక్షససైన్యసంహారము చేయువాడై ఆ సైన్యమును సమీపించెను.

మూ. సుపర్ణపక్షానిలనున్నపక్షం
భ్రమత్పతాకం ప్రవికీర్ణశస్త్రమ్,
చచాల తద్రాక్షసరాజసైన్యం
చలోపలం నీలమివాచలాగ్రమ్. 69

ప్ర. అ. సుపర్ణపక్షానిల నున్నపక్షమ్ = గరుత్మంతుని రెక్కల గాలిచేత ఎగురకొట్టబడిన వీరులు గలది, భ్రమత్పతాకమ్ = తిరుగుచున్న పతాకలు గలది, ప్రవికీర్ణశస్త్రమ్ = చిమ్మివేయబడిన ఆయుధములు గలది అయిన, తత్ = ఆ, రాక్షసరాజసైన్యమ్ = రాక్షసరాజుయొక్క సైన్యము, చలోపలమ్ = కదలుచున్న రాళ్ళు గల, నీలమ్ = నల్లని, అచలాగ్రమివ = పర్వతశిఖరము వలె, చచాల = చలించెను.

తా. గరుత్మంతుని రెక్కల గాలిచే ఆ రాక్షససైన్యము ఎగిరిపోవుచుండెను. పతాకలు తిరిగిపోవుచుండెను. ఆయుధములు చెల్లాచెదరగుచుండెను. ఆ విధముగ ఆ రాక్షససైన్యము ఎగురుచున్న రాళ్ళు గల నల్లని పర్వతశిఖరము వలె కదలిపోయెను. 69

మూ. తతః శితైః శోణితమాంసరూషితై
ర్యుగాన్తవైశ్వానరతుల్యవిగ్రహైః,
నిశాచరాః సంపరివార్య మాధవం
వరాయుధైర్నిర్బిభిదుః సహస్రశః. 70

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే షష్ఠః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సహస్రశః = వేలకొలది, నిశాచరాః = రాక్షసులు, మాధవమ్ = విష్ణువును, సంపరివార్య = చుట్టుముట్టి, శోణితమాంస రూషితైః = రక్తమాంసములచేత పూయబడిన, యుగాన్తవైశ్వానరతుల్య విగ్రహైః = ప్రలయకాలమునందలి అగ్నితో సమానమైన ఆకారము గల, శితైః = వాడియైన, వరాయుధైః = శ్రేష్ఠములైన ఆయుధములచేత, నిర్బిభిదుః = భేదించిరి.

తా. అప్పుడు వేలకొలది రాక్షసులు శ్రీమహావిష్ణువును చుట్టుముట్టి రక్త మాంసములచేత పూయబడిన, ప్రళయకాలాగ్ని వలె ఉన్న వాడియైన శ్రేష్ఠము లైన ఆయుధాలతో అతనిని కొట్టిరి.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఆరవసర్గ సమాప్తము.

అథ సప్తమః సర్గః

[శ్రీమహావిష్ణువు రాక్షసులను సంహరించుట. రాక్షసులు పారి పోవుట]

మూ. నారాయణగిరిం తే తు గర్జన్తో రాక్షసామ్బుదాః,
వవర్షుః శరవర్షేణ వర్షేణేవాద్రిమమ్బుదాః. 1

ప్ర. అ. తే = ఆ, రాక్షసామ్బుదాః = రాక్షసు లనే మేఘములు, గర్జన్తః = గర్జించుచున్నవై, అమ్బుదాః = మేఘములు, వర్షేణ = వర్షముచేత, అద్రిమివ = పర్వతమును వలె, నారాయణగిరిమ్ = నారాయణు డనే పర్వతమును, శరవర్షేణ = బాణవర్షముచేత, వవర్షుః = వర్షించినవి.

తా. రాక్షసు లనే మేఘములు, గర్జించుచు, మేఘములు పర్వతము మీద వర్షించినట్లు నారాయణు డనే పర్వతముమీద బాణవర్షము కురిపించిరి. 1

మూ. శ్యామావదాతస్తైర్విష్ణుర్నీలైర్నక్తంచరోత్తమైః,
వృతోఽఞ్జనగిరివాసీద్వర్షమాణైః పయోధరైః. 2

ప్ర. అ. నీలైః = నల్లనైన, తైః = ఆ, నక్తంచరోత్తమైః = రాక్షసశ్రేష్ఠులచేత, వృతః = చుట్టుముట్టబడిన, శ్యామావదాతః = నల్లగాను, శుభ్రముగాను ఉన్న, విష్ణుః = విష్ణువు, వర్షమాణైః = వర్షించుచున్న, పయోధరైః = మేఘములచేత కప్పబడిన, అఞ్జనగిరిః ఇవ = అంజనపర్వతము వలె, ఆసీత్ = ఉండెను.

తా. నల్లని రాక్షసు లందరూ చుట్టుముట్టగా, నల్లగా శుభ్రముగా ఉన్న విష్ణువు వర్షించుచున్న మేఘములచేత కప్పబడిన అంజనగిరి వలె ఉండెను. 2

మూ. శలభా ఇవ కేదారం మశకా ఇవ పావకమ్,
యథామృతఘటం దంశా మకరా ఇవ చార్ణవమ్. 3

తథా రక్షోధనుర్ముక్తా వజ్రానిలమనోజవాః,
హరిం విశన్తి స్మ శరా లోకా ఇవ విపర్యయే. 4

ప్ర. అ. రక్షోధనుర్ముక్తాః = రాక్షసుల ధనస్సులనుండి విడువబడిన, వజ్రానిలమనోజవాః=వజ్రమువంటి, వాయువువంటి, మనస్సువంటి వేగము గల, శరాః = బాణములు, శలభాః = మిడతలు, కేదారమ్ ఇవ = పొలమును వలె, మశకాః = దోమలు, పావకమ్ ఇవ = అగ్నిని వలె, అమృతఘటమ్ = అమృత కలశను, దంశాః యథా = ఈగలు వలె, మకరాః = మొసళ్ళు, అర్ణవమ్ ఇవ = సముద్రమును వలె, విపర్యయే=ప్రళయకాలమునందు, లోకాః ఇవ=లోకములు వలె, హరిమ్ = విష్ణువును, విశన్తి = ప్రవేశించుచున్నవి.

తా. రాక్షసుల ధనస్సులనుండి బయలుదేరి వజ్ర - వాయు - మనస్సుల వేగము వంటి వేగముతో వచ్చిన బాణములు, మిడతలు పంటచేనును వలె, దోమలు అగ్నిని వలె, ఈగలు అమృతకలశమును వలె, ప్రళయకాలమునందు లోకములు వలె, విష్ణువు శరీరములో ప్రవేశించినవి. 3, 4

మూ. స్యన్దనైః స్యన్దనగతా గజైశ్చ గజమూర్ధగాః,
అశ్వారోహా స్తథాశ్వైశ్చ పాదాతాశ్చామ్బరే స్థితాః. 5

రాక్షసేన్ద్రా గిరినిభాః శరైః శక్త్యృష్టితోమరైః,
నిరుచ్ఛ్వాసం హరిం చక్రుః ప్రాణాయామా ఇవ ద్విజమ్. 6

ప్ర. అ. స్యన్దనైః = రథములచేత వచ్చిన, స్యన్దనగతాః = రథములమీద ఉన్నవారు, గజైః = గజములచేత వచ్చిన, గజమూర్ధగాః = ఏనుగుల పైన ఉన్న వారు, అశ్వైశ్చ=గుఱ్ఱములచేత వచ్చిన, అశ్వారోహాః=గుఱ్ఱముల పై ఉన్నవారు, అమ్బరే=ఆకాశమునందు, స్థితాః=నిలచిన, పాదాతాశ్చ=కాలిబంట్లు, గిరినిభాః= పర్వతములతో సమానులైన, రాక్షసేన్ద్రాః = రాక్షసశ్రేష్ఠులు, శరైః = బాణముల చేతను, శక్త్యృష్టితోమరైః = శక్తులచేతను, ఋష్టులచేతను, తోమరములచేతను, హరిమ్ = విష్ణువును, ప్రాణాయామాః = ప్రాణాయామములు, ద్విజమ్ ఇవ = బ్రాహ్మణుని వలె, నిరుచ్ఛ్వాసమ్ = ఊపిరి లేనివానినిగా, చక్రుః = చేసిరి.

తా. రథముల నెక్కి వచ్చిన రథికులు, గజముల నెక్కి వచ్చిన గజా

రూఢులు, అశ్వముల నెక్కి వచ్చిన ఆశ్వికులు, ఆకాశముమీద నిలచిన కాలిబంట్లు, పర్వతములవంటి రాక్షసశ్రేష్ఠులు బాణములచేతను, శక్తులచేతను, ఋష్టులచేతను, తోమరములచేతను, విష్ణుమూర్తిని, ప్రాణాయామములు బ్రాహ్మణుని వలె ఊపిరి లేనివానినిగా చేసిరి (ఊపిరిసలపకుండా చేసిరి). 5, 6

మూ. నిశాచరైస్తాడ్యమానో మీనైరివ మహోదధిః,
శార్ఙ్గమాయమ్య దుర్ధర్షో రాక్షసేభ్యోఽసృజచ్ఛరాన్. 7

ప్ర. అ. మీనైః = మీనములచేత, మహోదధిః ఇవ = మహాసముద్రము వలె, నిశాచరైః = రాక్షసులచేత, తాడ్యమానః = కొట్టబడుచున్న, దుర్ధర్షః = ఎదిరింప శక్యము కాని విష్ణువు, శార్ఙ్గమ్ = శార్ఙ్గధనస్సును, ఆయమ్య = వంచి, రాక్షసేభ్యః = రాక్షసులకు, శరాన్ = బాణములను, అసృజత్ = విడచెను.

తా. మీనములు మహాసముద్రమును కొట్టినట్లు రాక్షసులు కొట్టుచుండగా, ఎదురింప శక్యముకాని ఆ మహావిష్ణువు శార్ఙ్గధనస్సును ఎక్కుపెట్టి రాక్షసులపై బాణములు ప్రయోగించెను. 7

మూ. శరైః పూర్ణాయతోత్సృష్టైః వజ్రకల్పైర్మనోజవైః,
చిచ్ఛేద విష్ణుర్నిశితైః శతశోఽథ సహస్రశః 8

ప్ర. అ. అథ = అటుపిమ్మట, విష్ణుః = విష్ణువు, పూర్ణాయతోత్సృష్టైః = పూర్తిగా లాగుటచేత విడవబడిన, వజ్రకల్పైః = వజ్రముతో సమానమైన, నిశితైః = వాడియైన, శతశః = వందలకొలది, సహస్రశః = వేలకొలది, శరైః = బాణములచేత, చిచ్ఛేద = భేదించెను.

తా. పిమ్మట శ్రీమహావిష్ణువు వజ్రముతో సమానములైన, మనోవేగమువంటి వేగము గల వందలకొలది వేలకొలది బాణములను పూర్తిగా లాగి రాక్షసులను చేదించెను. 8

మూ. విద్రావ్య శరవర్షేణ వర్షం వాయురివోత్థితమ్,
పాఞ్చజన్యం మహాశఙ్ఖం ప్రదధ్మౌ పురుషోత్తమః. 9

ప్ర. అ. పురుషోత్తమః = విష్ణువు, ఉత్థితమ్ = బయలుదేరిన, వర్షమ్ = వర్షమును, వాయురివ=వాయువు వలె, శరవర్షేణ = బాణవర్షముచేత, విద్రావ్య= తరిమివేసి, మహాశఙ్ఖమ్ = గొప్ప శంఖమైన, పాఞ్చజన్యమ్ = పాంచజన్యమును, ప్రదధ్మౌ = పూరించెను.

తా. శ్రీ మహావిష్ణువు, ప్రారంభమైన వర్షమును వాయువు వలె, ఆ రాక్షసులను బాణవర్షముచేత తరిమివేసి పాంచజన్య మను మహాశంఖమును పూరించెను. 9

మూ. సోఽమ్బుజో హరిణాధ్మాతః సర్వప్రాణేన శఙ్ఖరాట్,
రరాస భీమనిర్హ్రాదస్త్రైలోక్యం వ్యథయన్నివ. 10

ప్ర. అ. హరిణా = విష్ణువుచేత, సర్వప్రాణేన = సమస్తప్రాణశక్తిచేత, ఆధ్మాతః = పూరింపబడిన, శఙ్ఖరాట్ = శంఖరాజైన, సః = ఆ, అమ్బుజః = శంఖము, భీమనిర్హ్రాదః = భయంకరమైన ధ్వని గలదై, త్రైలోక్యమ్ = మూడు లోకములను, వ్యథయన్నివ = బాధించుచున్నది వలె, రరాస = ధ్వనిచేసెను.

తా. ప్రాణబలము నంతను ఉపయోగించి శ్రీ మహావిష్ణువు పూరించిన, శంఖములలో శ్రేష్ఠమైన ఆ పాంచజన్యము మూడు లోకములను భయపెట్టు చున్నదా అన్నట్లు భయంకరశబ్దముతో ధ్వని చేసెను. 10

మూ. శఙ్ఖరాజరవః సోఽథ త్రాసయామాస రాక్షసాన్,
మృగరాజరవోఽరణ్యే సమదానివ కుఞ్జరాన్. 11

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సః శఙ్ఖరాజరవః = ఆ శ్రేష్ఠమైన శంఖము ధ్వని, అరణ్యే = అరణ్యమునందు, మృగరాజరవః = సింహగర్జనము, సమదాన్ = మదముతో కూడిన, కుఞ్జరానివ=ఏనుగులను వలె, రాక్షసాన్ = రాక్షసులను, త్రాసయామాస = భయపెట్టెను.

తా. అప్పుడు శంఖములలో శ్రేష్ఠమైన ఆ పాంచజన్యము ధ్వని, అరణ్యములో సింహగర్జనము మదించిన ఏనుగులకు వలె రాక్షసులకు భయము కలిగించెను. 11

మూ. న శేకురశ్వాః సంస్థాతుం విమదాః కుఞ్జరాభవన్,
స్యన్దనేభ్యశ్చ్యుతా వీరాః శఙ్ఖరావితదుర్బలాః. 12

ప్ర. అ. శఙ్ఖరావితదుర్బలాః = శంఖధ్వనిచేత దుర్బలములై, అశ్వాః = గుఱ్ఱములు, సంస్థాతుమ్ = నిలచుటకు, న శేకుః = సమర్థములుకాలేదు. కుఞ్జరాః = ఏనుగులు, విమదాః = మదములేనివి, అభవన్ = అయినవి. వీరాః = వీరులు, స్యన్దనేభ్యః = రథములనుండి, చ్యుతాః = జారిపడిరి.

తా. శంఖధ్వని వినగానే బలము ఉడిగిపోయి అశ్వములు నిలవలేక పోయినది. ఏనుగుల మదము అణగిపోయెను వీరులు రథములనుండి జారిపడి పోయిరి. 12

మూ. శార్ఙ్గచాపవినిర్ముక్తా వజ్రతుల్యాననాః శరాః,
విదార్య తాని రక్షాంసి సుపుఙ్ఖా వివిశుః క్షితిమ్. 13

ప్ర. అ. శార్ఙ్గచాపవినిర్ముక్తాః = శార్ఙ్గ మను ధనస్సునుండి విడువబడిన, వజ్రతుల్యాననాః = వజ్రముతో సమానమైన అగ్రభాగములుగల, సుపుఙ్ఖాః = మంచి పొన్నులుగల, శరాః = బాణములు, తాని రక్షాంసి = ఆ రాక్షసులను, విదార్య = చీల్చి, క్షితిమ్ = భూమిని, వివిశుః = ప్రవేశించినవి.

తా. శార్ఙ్గధనస్సునుండి బయలుదేరిన, వజ్రమువంటి అగ్రభాగములు, అందమైన పొన్నులు గల బాణములు ఆ రాక్షసులను చీల్చివేసి నేలలో ప్రవేశించినవి. 13

మూ. భిద్యమానాః శరైః సంఖ్యే నారాయణకరచ్యుతైః,
నిపేతూ రాక్షసా భూమౌ శైలా వజ్రహతా ఇవ 14

ప్ర. అ. నారాయణకరచ్యుతైః = విష్ణువుయొక్క హస్తములనుండి జారిన, శరైః = బాణములచేత, సంఖ్యే = యుద్ధమునందు, భిద్యమానాః = బ్రద్దలుకొట్టబడు చున్న, రాక్షసాః = రాక్షసులు, వజ్రహతాః = వజ్రముచేత కొట్టబడిన, శైలాః ఇవ = పర్వతములు వలె, భూమౌ = నేలమీద, నిపేతుః = పడిరి.

తా. శ్రీ మహావిష్ణువు ప్రయోగించిన బాణములచేత యుద్ధమునందు బ్రద్దలు

కొట్టబడిన రాక్షసులు వజ్రముచేత కొట్టబడిన పర్వతములు వలె నేలమీద పడిరి. 14

మూ. వ్రణాని పరగాత్రేభ్యో విష్ణుచక్రకృతాని హి,
అసృక్ క్షరన్తి ధారాభిః స్వర్ణధారా ఇవాచలాః. 15

ప్ర. అ. విష్ణుచక్రకృతాని = విష్ణువుయొక్క చక్రముచేత చేయబడిన, వ్రణాని = గాయములు, పరగాత్రేభ్యః = శత్రువుల అవయవములనుండి, ధారాభిః = ధారలచేత, అచలాః = పర్వతములు, స్వర్ణధారాః ఇవ = బంగారముయొక్క ధారలనువలె, అసృక్ = రక్తమును, క్షరన్తి = స్రవించుచున్నవి.

తా. శత్రువుల శరీరములపై విష్ణుచక్రముచేత చేయబడిన వ్రణములు పర్వతములు సువర్ణధారలను వలె, రక్తధారలను స్రవించెను. 15

మూ. శఙ్ఖరాజరవశ్చాపి శార్ఙ్గచాపరవస్తథా,
రాక్షసానాం రవాంశ్చాపి గ్రసతే వైష్ణవో రవః. 16

ప్ర. అ. శఙ్ఖరాజరవశ్చాపి = శ్రేష్ఠమైన శంఖము ధ్వని, తథా = మరియు, శార్ఙ్గచాపరవః = శార్ఙ్గముయొక్క ధ్వని, వైష్ణవః = విష్ణుసంబంధమైన, రవః = ధ్వని, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, రవాంశ్చాపి = ధ్వనులను, గ్రసతే = మ్రింగివేయుచున్నది.

తా. శ్రేష్ఠమైన శంఖముయొక్క ధ్వని, శార్ఙ్గ మను ధనస్సుయొక్క ధ్వని, విష్ణుమూర్తి చేయు ధ్వని రాక్షసుల ధ్వనిని మ్రింగివేసెను. 16

మూ. తేషాం శిరోధరాన్ ధూతాన్ శరధ్వజధనూంషి చ,
రథాన్ పతాకాంస్తూణీరాంశ్చిచ్ఛేద స హరిః శరైః. 17

ప్ర. అ. సః హరిః = ఆ విష్ణువు, శరైః = బాణములచేత, తేషామ్ = ఆ రాక్షసులయొక్క, ధూతాన్ = కదల్చబడిన, శిరోధరాన్ = కంఠములను, శరధ్వజధనూంషి చ = బాణములను, ధ్వజములను; ధనస్సులను, రథాన్ = రథములను, పతాకాన్ = పతాకలను, తూణీరాన్ = అంబులపొదులను, చిచ్ఛేద = ఛేదించెను.

తా. ఆ శ్రీమహావిష్ణువు బాణాలచేత ఆ రాక్షసుల కదల్చబడుచున్న కంఠములను, బాణములను, ధ్వజములను, ధనస్సులను, రథములను, పతాకలను, అంబులపొందులను ఛేదించెను. 17

మూ. సూర్యాదివ కరా ఘోరా వార్యోఘా ఇవ సాగరాత్,
పర్వతాదివ నాగేన్ద్రా ధారౌఘా ఇవ చామ్బుదాత్. 18

తథా శార్ఙ్గవినిర్ముక్తాః శరా నారాయణేరితాః,
నిర్ధావన్తీషవస్తూర్ణం శతశోఽథ సహస్రశః. 19

ప్ర. అ. అథ = అటుపిమ్మట, నారాయణేరితాః = విష్ణువుచేత ప్రయోగించబడిన, శార్ఙ్గవినిర్ముక్తాః = శార్ఙ్గమునుండి విడువబడిన, శతశః = వందలకొలది, సహస్రశః = వేలకొలది, శరాః = సంహారకములైన, ఇషవః = బాణములు, సూర్యాత్ = సూర్యునినుండి, ఘోరాః = భయంకరములైన, కరాః ఇవ = కిరణములు వలె, సాగరాత్ = సముద్రమునుండి, వార్యోఘాః ఇవ = జలప్రవాహములు వలె, పర్వతాత్ = పర్వతమునుండి, నాగేన్ద్రాః ఇవ = గజేంద్రములు వలె, అమ్బుదాత్ = మేఘమునుండి, ధారౌఘాః ఇవ = జలధారాసముదాయములు వలె, తథా = అట్లు, తూర్ణమ్ = శీఘ్రముగా, నిర్ధావన్తి = పరుగెత్తివచ్చినవి.

తా. విష్ణువు ప్రయోగింపగా శార్ఙ్గమునుండి బయల్వెడలిన, శత్రువులను హింసించు, వందలకొలది వేలకొలది బాణములు సూర్యునినుండి భయంకరములైన కిరణములు వలె, సముద్రమునుండి జలప్రవాహములు వలె, పర్వతములనుండి గజేంద్రముల వలె, మేఘమునుండి జలప్రవాహము వలె శీఘ్రముగా వచ్చినవి. 18,19

మూ. శరభేణ యథా సింహాః సింహేన ద్విరదా యథా,
ద్విరదేన యథా వ్యాఘ్రా వ్యాఘ్రేణ ద్వీపినో యథా.

ద్వీపినేవ యథా శ్వానః శునా మార్జారకో యథా,
మార్జారేణ యథా సర్పాః సర్పేణ చ యథాఖవః. 21

తథా తే రాక్షసాః సర్వే విష్ణునా ప్రభవిష్ణునా,
ద్రవన్తి ద్రావితా శ్చాన్యే శాయితాశ్చ మహీతలే. 22

ప్ర. అ. శరభేణ = శరభమృగముచేత, సింహాః యథా = సింహములు వలె, సింహేన = సింహముచేత, ద్విరదాః యథా = ఏనుగులు వలె, ద్విరదేన = = ఏనుగుచేత, వ్యాఘ్రాః యథా = పెద్దపులుల వలె, వ్యాఘ్రేణ = పెద్దపులిచేత, ద్వీపినః యథా = చిరుతపులుల వలె, ద్వీపినా = చిరుతపులిచేత. శ్వానః యథా = కుక్కలు వలె, శునా = కుక్కచేత, మార్జారకో యథా = పిల్లి వలె, మార్జారేణ = పిల్లిచేత, సర్పాః యథా = సర్పముల వలె, సర్పేణ = సర్పము చేత, ఆఖవః యథా = ఎలుకల వలె, తథా = ఆ విధముగా, సర్వే = సమస్తమైన. తే రాక్షసాః = ఆ రాక్షసులు, ప్రభవిష్ణునా = సమర్థుడైన. విష్ణునా = విష్ణువు చేత, ద్రావితాః = తరిమివేయబడినవారై, ద్రవన్తి = పారిపోవుచున్నారు. అన్యే = మరికొందరు, మహీతలే = నేలమీద, శాయితాః చ = పండుకొనునట్లు చేయబడిరి.

తా. సమర్థుడైన శ్రీమహావిష్ణువు ఆ రాక్షసులను, శరభమృగము సింహములను వలె, సింహము ఏనుగులను వలె, ఏనుగ పెద్దపులిని వలె, పెద్దపులి చిరుతపులిని వలె, చిరుతపులి కుక్కలను వలె, కుక్క పిల్లులను వలె, పిల్లి సర్పములను వలె, సర్పము ఎలుకలను వలె తరిమివేయగా వాళ్ళందరు పారిపోయిరి. మరికొందరు నేలపై పడిపోయిరి. 20-22

మూ. రాక్షసానాం సహస్రాణి నిహత్య మధుసూదనః,
వారిజం పూరయామాస తోయదం సురరాడివ. 23

ప్ర. అ. మధుసూదనః = విష్ణువు, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, సహస్రాణి = సహస్రములను, నిహత్య = చంపి, సురరాట్ = దేవేంద్రుడు, తోయదమ్ ఇవ = మేఘమును వలె, వారిజమ్ = శంఖమును, పూరయామాస = నింపెను.

తా. శ్రీమహావిష్ణువు వేలకొలది రాక్షసులను చంపి దేవేంద్రుడు మేఘమును పూరించినట్లు శంఖమును పూరించెను. 23

మూ. నారాయణశరత్రస్తం శఙ్ఖనాదసువిహ్వలమ్,
యయౌ లఙ్కామభిముఖం ప్రభగ్నం రాక్షసం బలమ్.

ప్ర. అ. నారాయణశరత్రస్తమ్ = నారాయణుని బాణములనుండి భయ

వడిన, శఙ్ఖనాదసువిహ్వలమ్ = శంఖధ్వనిచేత చాల వ్యాకులమైన, రాక్షసం బలమ్ = రాక్షససేన, ప్రభగ్నమ్ = ఓడిపోయినదై, లఙ్కామ్ అభిముఖమ్ = లంకను గూర్చి అభిముఖమై, యయౌ = వెళ్లెను.

తా. ఆ రాక్షససైన్యము నారాయణుని బాణాలకు భయపడి, శంఖధ్వని చేత వ్యాకులత చెంది, ఓడిపోయి లంకవైపు పారిపోయెను. 24

మూ. ప్రభగ్నే రాక్షసబలే నారాయణశరాహతే,
సుమాలీ శరవర్షేణ నివవార రణే హరిమ్. 25

ప్ర. అ. రాక్షసబలే=రాక్షససైన్యము. నారాయణశరాహతే=నారాయణుని శరములచేత కొట్టబడినదై. ప్రభగ్నే = భగ్నమైన దగుచుండగా, సుమాలీ = సుమాలి, రణే = యుద్ధమునందు, హరిమ్ = విష్ణువును, శరవర్షేణ = బాణవర్షము చేత, నివవార = వారించెను.

తా. ఆ రాక్షససైన్యము నారాయణుని బాణములచేత కొట్టబడి ఓడిపోవుట చూచి సుమాలి బాణవర్షముచేత విష్ణువును నివారించెను. 25

మూ. స తు తం ఛాదయామాస నీహార ఇవ భాస్కరమ్,
రాక్షసాః సత్త్వసంపన్నాః పునర్ధైర్యం సమాదదుః. 26

ప్ర. అ. సః తు = ఆ సుమాలియైతే, తమ్ = విష్ణువును, నీహారః = పొగ మంచు, భాస్కరం యథా = సూర్యుణ్ణి వలె, ఛాదయామాస = కప్పివేసెను. సత్త్వసంపన్నాః = బలముతో కూడిన, రాక్షసాః = రాక్షసులు, పునః = మరల, ధైర్యమ్ = ధైర్యమును, సమాదదుః = పొందిరి.

తా. ఆ సుమాలి విష్ణువును, పొగమంచు సూర్యుణ్ణి కప్పివేసినట్లు బాణాలతో కప్పివేసెను. అప్పుడు బలవంతులైన రాక్షసులకు మరల ధైర్యము కలిగెను. 26

మూ. అథ సోఽభ్యపతద్రోషాద్రాక్షసో బలదర్పితః,
మహానాదం ప్రకుర్వాణో రాక్షసాన్ జీవయన్నివ. 27

ప్ర. అ. అథ = అటుపిమ్మట, బలదర్పితః = బలముచేత గర్వించిన, సః=ఆ, రాక్షసః = రాక్షసుడు, మహానాదమ్=గొప్ప ధ్వనిని, ప్రకుర్వాణః =

చేయుచు, రాక్షసాన్ = రాక్షసులను, జీవయన్నివ = జీవింపచేయుచున్నాడా అన్నట్లు, రోషాత్ = కోపమువలన, అభ్యపతత్ = ఎదురుగా వెళ్ళెను.

తా. బలముచేత గర్వించిన ఆ రాక్షసుడు రాక్షసులను జీవింపచేయుచున్నాడా అన్నట్లు గొప్ప ధ్వనిచేయుచు విష్ణువుమీదకు శీఘ్రముగా వెళ్ళెను. 27

మూ. ఉత్క్షిప్య లమ్బాభరణం ధున్వన్ కరమివ ద్విపః,
రరాస రాక్షసో హర్షాత్సతడిత్తోయదో యథా. 28

ప్ర. అ. రాక్షసః=రాక్షసుడు, ద్విపః ఇవ=ఏనుగ వలె, లమ్బాభరణమ్ =ప్రేలాడుచున్న ఆభరణములు గల, కరమ్=హస్తమును, ఉత్క్షిప్య=ఎత్తి, ధున్వన్=కదల్చుచు, సతడిత్=మెరుపులతో కూడిన, తోయదః యథా= మేఘము వలె, హర్షాత్=సంతోషమువలన, రరాస=ధ్వనిచేసెను.

తా. ఆ రాక్షసుడు ఏనుగు వలె, అలంకారములు ప్రేలాడుచున్న హస్తమును ఎత్తి కదల్చుచు, సంతోషముతో మెరుపులతో కూడిన మేఘము వలె ధ్వనిచేసెను. 28

మూ. సుమాలేర్నర్దతస్తస్య శిరో జ్వలితకుణ్డలమ్,
చిచ్ఛేద యన్తురశ్వాశ్చ భ్రాన్తాస్తస్య తు రక్షసః. 29

ప్ర. అ. తస్య=ఆ, సుమాలేః = సుమాలి, నర్దతః=ధ్వనిచేయుచుండగా, యన్తుః = సారథియొక్క, జ్వలితకుణ్డలమ్ = ప్రకాశించుచున్న కుండలములు గల, శిరః=శిరస్సును, చిచ్ఛేద=ఛేదించెను. తస్య రక్షసః= ఆ రాక్షసునియొక్క, అశ్వాః చ=గుఱ్ఱములు కూడ, భ్రాన్తాః=తిరిగిపోయినవి

తా. ఆ సుమాలి అరచుచుండగా విష్ణువు ఆతని సారథియొక్క ప్రకాశించుచున్న కుండలములు గల శిరస్సును ఖండించెను. అప్పుడా రాక్షసుని గుఱ్ఱములు అటు ఇటు తిరిగినవి. 29

మూ. తైరశ్వైర్భ్రామ్యతే భ్రాన్తైః సుమాలీ రాక్షసేశ్వరః,
ఇన్ద్రియాశ్వైః పరిభ్రాన్తైర్ధృతిహీనో యథా నరః. 30

ప్ర. అ. రాక్షసేశ్వరః = రాక్షసప్రభువైన, సుమాలీ = సుమాలి, భ్రాన్తైః = తిరిగిపోవుచున్న, తైః = ఆ, అశ్వైః = అశ్వములచేత, పరిభ్రాన్తైః = తిరిగిపోవుచున్న, ఇన్ద్రియాశ్వైః = ఇంద్రియము లనే అశ్వములచేత, ధృతిహీనః = ధైర్యవిహీనుడైన, నరః యథా = నరుడు వలె, భ్రామ్యతే = త్రిప్పివేయబడుచున్నాడు.

తా. సారథి లేని గుఱ్ఱాలు స్వేచ్ఛగా తిరుగుటతో, ఇంద్రియము లనే గుఱ్ఱములు స్వేచ్ఛగా తిరుగుచుండగా నిలకడలేని మానవుడు వలె, రాక్షసప్రభువైన సుమాలి తిరిగిపోయెను. 30

మూ. తతో విష్ణుం మహాబాహుం ప్రపతన్తం రణాజిరే,
హృతే సుమాలేరశ్వైశ్చ రథే విష్ణురథం ప్రతి,
మాలీ చాభ్యద్రవద్యుక్తః ప్రగృహ్య సశరాసనమ్. 31

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సుమాలేః = సుమాలియొక్క, రథే = రథము, అశ్వైః = అశ్వములచేత, హృతే = హరించబడిన దగుచుండగా, సః = ఆ, మాలీ = మాలి, యుక్తః = సన్నద్ధుడై, శరాసనమ్ = ధనస్సును, ప్రగృహ్య = గ్రహించి, రణాజిరే = యుద్ధభూమియందు, ప్రపతన్తమ్ = వచ్చి మీదపడుచున్న, మహాబాహుమ్ = గొప్ప బాహువులు గల, విష్ణుమ్ = విష్ణువును గూర్చి, విష్ణురథం ప్రతి = విష్ణువుయొక్క రథమును గూర్చి, అభ్యద్రవత్ = శీఘ్రముగా పరుగెత్తెను.

తా. సుమాలిరథమును గుఱ్ఱములు దూరముగా తీసికొనిపోయెను. అప్పుడు మాలి యుద్ధసన్నద్ధుడై ధనస్సు ధరించి, యుద్ధభూమిలో వచ్చుచున్న మహాబాహువైన విష్ణువు మీదికి, ఆతని రథముమీదికి శీఘ్రముగా వెళ్లెను. 31

మూ. మాలేర్ధనుశ్చ్యుతా బాణాః కార్తస్వరవిభూషితాః,
వివిశుర్హరిమాసాద్య క్రౌఞ్చం పత్త్రరథా ఇవ. 32

ప్ర. అ. మాలేః = మాలియొక్క, ధనుశ్చ్యుతాః = ధనస్సునుండి జారిన, కార్తస్వరవిభూషితాః = బంగారముచేత అలంకరించబడిన, బాణాః = బాణములు, పత్త్రరథాః = పక్షులు, క్రౌఞ్చమ్ ఇవ = క్రౌంచపర్వతమును వలె, హరిమ్ = విష్ణువును, ఆసాద్య = సమీపించి, వివిశుః = ప్రవేశించినవి.

తా. మాలి ధనస్సునుండి బయల్వెడలిన, బంగారముచేత అలంకరింప బడిన బాణములు పక్షులు క్రౌంచపర్వతమును వలె విష్ణుమూర్తిని సమీపించి అతని దేహములో ప్రవేశించినవి. 32

మూ. అర్ద్యమానః శరైః సోఽథ మాలిముక్తైః సహస్రశః,
చుక్షుభే న రణే విష్ణుర్జితేన్ద్రియ ఇవాధిభిః. 33

ప్ర. అ. అథ = అటుపిమ్మట, మాలిముక్తైః = మాలిచేత విడవబడిన, సహస్రశః = వేలకొలది, శరైః = బాణములచేత, అర్ద్యమానః = పీడించబడుచున్న, సః విష్ణుః = ఆ విష్ణువు, జితేన్ద్రియః = జయించబడిన ఇంద్రియములు కలవాడు, ఆధిభిః ఇవ = మనోవ్యథలచేత వలె, రణే = యుద్ధమునందు, న చుక్షుభే = క్షోభ చెందలేదు.

తా. అప్పుడు మాలి వేలకొలది బాణములు ప్రయోగించి బాధించుచున్నను శ్రీమహావిష్ణువు, ఇంద్రియములను జయించినవాడు మనోవ్యథలచేత ఎట్లు క్షోభ చెందడో అట్లే రణరంగమునందు క్షోభ చెందలేదు. 33

మూ. అథ మౌర్వీస్వనం కృత్వా భగవాన్ భూతభావనః,
మాలినం ప్రతి బాణౌఘాన్ ససర్జాసిగదాధరః. 34

ప్ర. అ. అసిగదాధరః = ఖడ్గమును గదను ధరించిన, భూతభావనః = భూతముల సంరక్షకుడైన, భగవాన్ = భగవంతుడు, అథ = అటుపిమ్మట, మౌర్వీస్వనమ్ = నారి ధ్వనిని, కృత్వా = చేసి, మాలినం ప్రతి = మాలినిగూర్చి, బాణౌఘాన్ = బాణసముదాయములను, ససర్జ = విడచెను.

తా. పిమ్మట ఖడ్గగదాధారియైన, లోకరక్షకుడైన ఆ మహావిష్ణువు ధనుష్టంకారము చేసి మాలిపై బాణసముదాయమును విడచెను. 34

మూ. తే మాలిదేహమాసాద్య వజ్రవిద్యుత్ప్రభాః శరాః,
పిబన్తి రుధిరం తస్య నాగా ఇవ సుధారసమ్. 35

ప్ర. అ. వజ్రవిద్యుత్ప్రభాః = వజ్రమువంటి, మెరుపువంటి కాంతి గల, తే శరాః = ఆ బాణములు, మాలిదేహమ్ = మాలియొక్క దేహమును, ఆసాద్య

= పొంది నాగాః = సర్పములు, సుధారసమ్ ఇవ = అమృతరసమును వలె, తస్య = వానియొక్క, రుధిరమ్ = రక్తమును, పిబన్తి = త్రాగుచున్నవి.

తా. వజ్రాయుధము వలె, మెరపుల వలె ప్రకాశించుచున్న ఆ బాణములు మాలి దేహమును సమీపించి, సర్పములు అమృతమును త్రాగి నట్లు ఆతని రక్తమును త్రాగినవి 35

మూ. మాలినం విముఖం కృత్వా శఙ్ఖచక్రగదాధరః,
మాలిమౌలిం ధ్వజం చాపం వాజినశ్చాప్యపాతయత్. 36

ప్ర. అ. శఙ్ఖచక్రగదాధరః = శంఖచక్రగదలను ధరించిన ఆ విష్ణువు, మాలినమ్ = మాలిని, విముఖమ్ = విముఖుణ్ణిగా, కృత్వా = చేసి, మాలిమౌలిమ్ = మాలియొక్క కిరీటమును, ధ్వజమ్ = ధ్వజమును, చాపమ్ = ధనస్సును, వాజినశ్చాపి = గుఱ్ఱములను, అపాతయత్ = పడగొట్టెను.

తా. శంఖ-చక్ర-గదలు ధరించిన శ్రీమహావిష్ణువు మాలిని యుద్ధవిముఖునిగా చేసి ఆతని కిరీటమును, ధ్వజమును, ధనస్సును, గుఱ్ఱములను పడగొట్టెను.

మూ. విరథస్తు గదాం గృహ్య మాలీ నక్తంచరోత్తమః,
ఆపుప్లువే గదాపాణిర్గిర్యగ్రాదివ కేసరీ. 37

ప్ర. అ. నక్తంచరోత్తమః = రాక్షసులలో శ్రేష్ఠుడైన, మాలీ = మాలి, విరథః = రథము లేనివాడై, గదామ్ = గదను, గృహ్య = గ్రహించి, గదాపాణిః = గద హస్తమునందు కలవాడై, గిర్యగ్రాత్ = పర్వతాగ్రమునుండి, కేసరీ ఇవ = సింహము వలె, ఆపుప్లువే = దుమికెను.

తా. రథము లేని మాలి గద ధరించి, పర్వతాగ్రమునుండి సింహము వలె, క్రిందికి దుమికెను. 37

మూ. గదయా గరుడేశానమీశానమివ చాన్తకః,
లలాటదేశేఽభ్యహనద్వజ్రేణేవ యథాచలమ్. 38

ప్ర. అ. అన్తకః = యముడు, ఈశానమివ = ఈశ్వరుణ్ణి వలె, వజ్రేణ = వజ్రముచేత, ఇన్ద్రః = ఇంద్రుడు, అచలమివ = పర్వతమును వలె, గదయా =

గదచేత, గరుడేశానమ్ = గరుత్మంతుణ్ణి, లలాటదేశే = లలాటప్రదేశమునందు, అభ్యహనత్ = కొట్టెను.

తా. మాలి గదతో, యముడు ఈశ్వరుణ్ణి వలె, ఇంద్రుడు వజ్రాయుధము చేత పర్వతమును వలె గరుత్మంతుని లలాటప్రదేశముమీద కొట్టెను. 38

మూ. గదయాభిహతస్తేన మాలినా గరుడో భృశమ్,
రణాత్పరాఙ్ముఖం దేవం కృతవాన్వేదనాతురః. 39

ప్ర. అ. తేన మాలినా = ఆ మాలిచేత, భృశమ్ = మిక్కిలి, గదయా = గదతో, అభిహతః = కొట్టబడిన, గరుడః = గరుత్మంతుడు, వేదనాతురః = బాధ చేత పీడితుడై, దేవమ్ = విష్ణువును, రణాత్ = రణమునుండి, పరాఙ్ముఖమ్ = పరాఙ్ముఖునిగా, కృతవాన్ = చేసినాడు.

తా. మాలి గదతో గట్టిగా కొట్టగా గరుత్మంతుడు దెబ్బకు బాధపడుచు మహావిష్ణువు యుద్ధమునుండి వెనుకకు మరలిపోవునట్లు చేసెను. 39

మూ. పరాఙ్ముఖే కృతే దేవే మాలినా గరుడేన వై,
ఉదతిష్ఠన్ మహాన్ శబ్దో రక్షసామభినర్దతామ్. 40

ప్ర. అ. మాలినా = మాలిచేత, గరుడేన = గరుత్మంతునిద్వారా, దేవే = విష్ణువు, పరాఙ్ముఖే = పరాఙ్ముఖుడుగా, కృతే = చేయబడినవా డగుచుండగా, అభినర్దతామ్ = ధ్వనిచేయుచున్న, రక్షసామ్ = రాక్షసులయొక్క, మహాన్ = గొప్ప, శబ్దః = శబ్దము, ఉదతిష్ఠత్ = బయల్వెడలెను.

తా. మాలి గరుత్మంతుని కొట్టుటద్వారా విష్ణువును పరాఙ్ముఖుని చేయగా రాక్షసులు బిగ్గరగా గర్జించిరి. 40

మూ. రక్షసాం రువతాం రావం శ్రుత్వా హరిహయానుజః,
తిర్యగాస్థాయ సంక్రుద్ధః పక్షీశే భగవాన్ హరిః. 41
పరాఙ్ముఖోఽప్యుత్ససర్జ మాలేశ్చక్రం జిఘాంసయా.

ప్ర. అ. హరిహయానుజః = ఇంద్రుని తమ్ముడు, భగవాన్ = పూజ్యుడు అయిన, హరిః = విష్ణువు, రువతామ్ = ధ్వనిచేయుచున్న, రక్షసామ్ = రాక్షసుల

యొక్క, రావమ్ = ధ్వనిని, శ్రుత్వా = విని, సంక్రుద్ధః = కోపించినవాడై, పక్షిశే = గరుత్మంతునియందు, తిర్యక్ = అడ్డముగా, అస్థాయ = కూర్చుండి, పరాఙ్ముఖః = వెనుకకు తిరిగిన ముఖము గలవాడైనను, మాలేః = మాలియొక్క, జిఘాంసయా = చంపవలె నను ఇచ్చచేత, చక్రమ్ = చక్రమును, ఉత్ససర్జ = విడచెను.

తా. ఇంద్రుని తమ్ముడైన భగవంతుడైన శ్రీమహావిష్ణువు అరచుచున్న ఆ రాక్షసుల అరపులు విని, గరుత్మంతునిమీద అడ్డముగా కూర్చుండి, మాలిని చంపుటకై, వెనుకకు తిరిగి ఉండియే చక్రమును ప్రయోగించెను. 41

మూ. తత్సూర్యమణ్డలాభాసం స్వభాసా భాసయన్నభః, 42
కాలచక్రనిభం చక్రం మాలేః శీర్షమపాతయత్.

ప్ర. అ. సూర్యమణ్డలాభాసమ్ = సూర్యమండలము వలె ప్రకాశించుచున్న, కాలచక్రనిభమ్ = కాలచక్రముతో సమానమైన, తత్ చక్రమ్ = ఆ చక్రము, స్వభాసా = తన కాంతిచేత, నభః = ఆకాశమును, భాసయత్ = ప్రకాశింపచేయుచు, మాలేః = మాలియొక్క, శీర్షమ్ = శిరస్సును. అపాతయత్ = పడవేసెను.

తా. కాలచక్రము వలె తిరుగుచున్న, సూర్యమండలము వంటి కాంతి గల ఆ చక్రము తన కాంతిచేత ఆకాశమును ప్రకాశింపచేయుచు మాలి శిరస్సును పడగొట్టెను. 42

మూ. తచ్ఛిరో రాక్షసేన్ద్రస్య చక్రోత్కృత్తం విభీషణమ్,
పపాత రుధిరోద్గారి పురా రాహుశిరో యథా. 43

ప్ర. అ. రాక్షసేన్ద్రస్య = రాక్షసరాజుయొక్క, చక్రోత్కృత్తమ్ = చక్రముచేత నరికివేయబడిన, విభీషణమ్ = భయంకరమైన, తత్ శిరః = ఆ శిరస్సు, రుధిరోద్గారి = రక్తమును కార్చుచున్నదై, పురా = పూర్వము, రాహుశిరో యథా = రాహువు శిరస్సు వలె, పపాత = పడెను.

తా. చక్రముచేత ఛేదించబడిన ఆ రాక్షసుని భయంకరమైన శిరస్సు, పూర్వము రాహువు శిరస్సు వలె, రక్తము కార్చుచు క్రింద పడెను. 43

మూ. తతః సురైః సంప్రహృష్టైః సర్వప్రాణసమీరితః,
సింహనాదరవో ముక్తః సాధు దేవేతి వాదిభిః. 44

ప్ర. అ. తతః=అటుపిమ్మట, దేవ = దేవా ! సాధు=బాగు బాగు, ఇతి= అని, వాదిభిః = పలుకుచున్న, సంప్రహృష్టైః = సంతోషించిన, సురైః=దేవతల చేత, సర్వప్రాణసమీరితః = సమస్తప్రాణశక్తితో పలకబడిన, సింహనాదరవః= సింహనాదము వంటి ధ్వని, ముక్తః=విడువబడినది.

తా. పిమ్మట సంతోషించిన దేవతలు "దేవా ! బాగు బాగు" అని అనుచు చాల బిగ్గరగా సింహనాదము చేసిరి. 44

మూ. మాలినం నిహతం దృష్ట్వా సుమాలీ మాల్యవానపి,
సబలౌ శోకసంతప్తౌ లఙ్కామేవ ప్రధావితౌ. 45

ప్ర. అ. సుమాలీ = సుమాలి, మాల్యవానపి=మాల్యవంతుడు, మాలినమ్ = మాలిని, నిహతమ్ = చంపబడినవానినిగా, దృష్ట్వా = చూచి, సబలౌ = సైన్యముతో కూడినవారై, శోకసంతప్తౌ = దుఃఖపీడితులై, లఙ్కామేవ = లంకను గూర్చియే, ప్రధావితౌ = పారిపోయిరి.

తా. మాలి చంపబడినట్లు చూడగానే సుమాలి- మాల్యవంతులు దుఃఖముచే పీడింపబడినవారై, సైన్యముతో లంకకు పారిపోయిరి. 45

మూ. గరుడస్తు సమాశ్వస్తః సంనివృత్య యథా పురా,
రాక్షసాన్ ద్రావయామాస పక్షవాతేన కోపితః. 46

ప్ర. అ. గరుడస్తు = గరుత్మంతుడైతే, సమాశ్వస్తః = తెప్పరిల్లినవాడై, కోపితః = కోపింపచేయబడినవాడై, సంనివృత్య = వెనుకకు మరలి, పక్షవాతేన = రెక్కల గాలిచేత, యథా పురా = పూర్వమునందు వలె, రాక్షసాన్ = రాక్షసులను, ధ్రావయామాస = పారద్రోలెను.

తా. గరుత్మంతుడు తెప్పరిల్లి, వెనుకకు మరలి వచ్చి, పూర్వమునందు వలె చాల కోపముతో రెక్కల గాలిచేత రాక్షసులను ఎగురగొట్టెను. 46

మూ. చక్రకృత్తాస్యకమలా గదాసంచూర్ణితోరసః,
లాఙ్గలగ్లపితగ్రీవా ముసలైర్భిన్నమస్తకాః. 47
కేచిచ్ఛైవాసినా ఛిన్నా స్తథాన్యే శరతాడితాః,
నిపేతురమ్బరాత్తూర్ణం రాక్షసాః సాగరామ్భసి. 48

ప్ర. అ. కేచిత్ = కొందరు, రాక్షసాః = రాక్షసులు, చక్రకృత్తాస్యకమలాః = చక్రముచేత ఛేదించబడిన ముఖపద్మములు గలవారై, గదాసంచూర్ణితోరసః = గదచేత చూర్ణముచేయబడిన వక్షఃస్థలములుగలవారై, లాఙ్గలగ్లపితగ్రీవాః = నాగలిచేత వాడిపోవునట్లు చేయబడిన కంఠములు గలవారై, ముసలైః = రోకళ్లచేత, భిన్నమస్తకాః = బ్రద్దలుకొట్టబడిన శిరస్సులు కలవారై, అసినా = ఖడ్గముచేత, ఛిన్నాః = ఛేదించబడినవారై, తథా = మరియు, అన్యే = మరికొందరు, శరతాడితాః = బాణములచేత కొట్టబడినవారై, తూర్ణమ్ = శీఘ్రముగా, అమ్బరాత్ = ఆకాశము నుండి, సాగరామ్భసి = సముద్రజలమునందు, నిపేతుః = పడిరి.

తా. కొందరు రాక్షసుల ముఖపద్మములు చక్రముచేత ఛేదింపబడెను. కొందరి వక్షఃస్థలములు గదచేత చూర్ణము చేయబడెను. కొందరి కంఠములు నాగలి దెబ్బకు వాడిపోవునట్లు చేయబడెను. కొందరి తలలు ముసలముచేత బద్దలు కొట్టబడెను. కొందరు ఖడ్గముచేత ఛేదించబడిరి. మరికొందరు బాణములచేత కొట్టబడిరి. ఈ విధముగా ఆ రాక్షసులు ఆకాశమునుండి వెంటనే సముద్రములో పడిపోయిరి. 47, 48

మూ. నారాయణోఽపీషువరాశనీభి
ర్విదారయామాస ధనుర్విముక్తైః,
నక్తంచరాన్ ధూతవిముక్తకేశాన్
యథాశనీభిః సతడిన్మహాభ్రః. 49

ప్ర. అ. నారాయణోఽపి = విష్ణువు, సతడిత్ = మెరుపులతో కూడిన, మహాభ్రః = మహామేఘము, అశనీభిః యథా = పిడుగులచేత వలె, ధనుర్విముక్తైః = ధనస్సునుండి విడవబడిన, ఇషువరాశనీభిః = పిడుగులవంటి శ్రేష్ఠములైన బాణములచేత, ధూతవిముక్తకేశాన్ = కదల్పబడిన విడిపోయిన కేశములు గల, నక్తంచరాన్ = రాక్షసులను, విదారయామాస = చీల్చివేసెను.

తా. నారాయణుడు జుట్టుముడులు విడిపోయిన ఆ రాక్షసులను, ధనస్సు నుండి విడువబడిన పిడుగులవంటి బాణాలచేత, మెరుపులతో కూడిన పెద్ద మేఘము పిడుగులచేత వలె, చీల్చివేసెను. 49

మూ. భిన్నాతపత్రం పతమానశస్త్రం
శరైరపధ్వస్తవినీతవేషమ్,
వినిఃసృతాన్త్రం భయలోలనేత్రం
బలం తదున్మత్తతరం బభూవ. 50

ప్ర. అ. భిన్నాతపత్రమ్ = విరుగగొట్టబడిన గొడుగులు గలది, పతమానశస్త్రమ్ = పడిపోవుచున్న ఆయుధములు గలది, శరైః = బాణములచేత, అపధ్వస్తవినీతవేషమ్ = నశింపచేయబడిన తొలగించబడిన వేషములు కలది, వినిఃసృతాన్త్రమ్ = బైటకు వచ్చిన ప్రేగులు గలది, భయలోలనేత్రమ్ = భయముచేత చంచలములైన నేత్రములు గలది అయిన, తత్ బలమ్ = ఆ సైన్యము, ఉన్మత్తతరమ్ = మిక్కిలి ఉన్మత్తముగా, బభూవ = ఆయెను.

తా. ఆ సైన్యములోని గొడుగులు విరిగిపోయెను. ఆయుధములు జారిపోవుచుండెను. బాణాలచేత రాక్షసుల వస్త్రములు చినిగి తొలగిపోయెను. వాళ్ళ ప్రేగులు బైటకు వచ్చుచుండెను. నేత్రములు భయముచేత చలించుచుండెను. ఈ విధముగా ఆ సైన్యము మిక్కిలి ఉన్మాదమును చెందెను. 50

మూ. సింహార్దితానామివ కుఞ్జరాణాం
నిశాచరాణాం సహకుఞ్జరాణామ్,
రవాశ్చ వేగాశ్చ సమం బభూవుః
పురాణసింహేన విమర్దితానామ్. 51

ప్ర. అ. పురాణసింహేన = ప్రాచీనసింహమైన అనగా పూర్వము నరసింహరూపము ధరించిన విష్ణువుచేత, విమర్దితానామ్ = పీడించబడిన, సహకుఞ్జరాణామ్ = ఏనుగులతో కూడిన, నిశాచరాణామ్ = రాక్షసులయొక్క, రవాశ్చ = ధ్వనులు, వేగాశ్చ = వేగములు, సింహార్దితానామ్ = సింహముచేత పీడించబడిన, కుఞ్జరాణామివ = ఏనుగులయొక్క వలె, సమమ్ = సమముగా, బభూవుః = అయినవి.

తా. శ్రీమహావిష్ణువు మర్దించగా ఏనుగులతో సహా రాక్షసుల ధ్వనులు, వేగము సింహముచేత ఆక్రమించబడిన ఏనుగుల ధ్వనివేగముల వలె ఉండెను.

మూ. తే వార్యమాణా హరిబాణజాలైః
స్వబాణజాలాని సముత్సృజన్తః,
ధావన్తి నక్తంచరకాలమేఘా
వాయుప్రణున్నా ఇవ కాలమేఘాః. 52

ప్ర. అ. హరిబాణజాలైః = విష్ణువుయొక్క బాణముల సముదాయముల చేత, వార్యమాణాః = నివారింపబడుచున్న, స్వబాణజాలాని = తమ బాణముల సముదాయములను, సముత్సృజన్తః = విడచుచున్న, తే = ఆ, నక్తంచరకాలమేఘాః = కాలమేఘముల వంటి రాక్షసులు, వాయుప్రణున్నాః = వాయువుచేత ఎగరగొట్టబడిన, కాలమేఘా ఇవ = నల్లని మేఘములు వలె, ధావన్తి = పరుగెత్తుచున్నారు.

తా. విష్ణువు ప్రయోగించిన బాణములచేత నివారింపబడుచు, తమ బాణములను విడచుచున్న, కాలమేఘముల వంటి ఆ రాక్షసులు వాయువుచేత ఎగురగొట్టబడిన నల్లని మేఘములు వలె పారిపోయిరి. 52

మూ. చక్రప్రహారైర్వినికృత్తశీర్షాః
సంచూర్ణితాఙ్గాశ్చ గదాప్రహారైః,
అసిప్రహారైర్ద్వివిధా విభిన్నాః
పతన్తి శైలా ఇవ రాక్షసేన్ద్రాః. 53

ప్ర. అ. చక్రప్రహారైః = చక్రము దెబ్బలచేత, వినికృత్తశీర్షాః = ఛేదించబడిన శిరస్సులు కలవారు, గదాప్రహారైః = గద దెబ్బలచేత, సంచూర్ణితాఙ్గాశ్చ = చూర్ణముచేయబడిన శరీరములు గలవారు, అసిప్రహారైః = ఖడ్గప్రహారములచేత, ద్వివిధాః = రెండు ముక్కలుగా, విభిన్నాః = భేదింపబడినవారు అయిన, రాక్షసేన్ద్రాః = రాక్షసనాయకులు, శైలాః ఇవ = పర్వతములు వలె, పతన్తి = పడుచున్నారు.

తా. ఆ రాక్షసవీరు లందరు చక్రము దెబ్బలచేత శిరస్సులు తెగి, గద

దెబ్బలకు శరీరములు చూర్ణమై, ఖడ్గప్రహారములచేత రెండేసి ముక్కలై పర్వత
ములవలె నేలమీద కూలిరి. 53

మూ. విలమ్బమానై ర్మణిహారకుణ్డలై
ర్నిశాచరై ర్నీల వలాహకోపమైః,
నిపాత్యమానై ర్దదృశే నిరన్తరం
నిపాత్యమానై రివ నీలపర్వతైః. 54

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తమః సర్గః.

ప్ర. అ. విలమ్బమానైః = వ్రేలాడుచున్న, మణిహారకుణ్డలైః = మణుల హారములతోను, కుండలములతోను కూడిన, నీలవలాహకోపమైః = నల్లని మేఘ ములతో సమానులైన, నిరన్తరమ్ = అవిచ్ఛిన్నముగా, నిపాత్యమానైః = పడగొట్ట బడుచున్న, నిశాచరైః = రాక్షసులతో, నిపాత్యమానైః = పడగొట్టబడుచున్న, నీలపర్వతై రివ = నల్లని పర్వతములతో వలె, దదృశే = కనబడెను.

తా. మణిహారములు, కుండలములు వ్రేలాడగా, ఎడతెరిపి లేకుండగా పడగొట్టబడుచున్న నల్లని మేఘముల వంటి ఆ రాక్షసులతో ఆకాశము పడగొట్ట బడుచున్న నల్లని పర్వతములతో వలె దట్టముగా కనబడెను. 54.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
ఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టమః సర్గః

[మాల్యవంతుడు యుద్ధము చేసి పరాజితు డగుట, సుమాలి మొదలైన రాక్షసులు రసాతలములో ప్రవేశించుట.]

మూ. హన్యమానే బలే తస్మిన్ పద్మనాభేన పృష్ఠతః,
మాల్యవాన్ సంనివృత్తోఽథ వేలామేత్య ఇవార్ణవః. 1

ప్ర. అ. తస్మిన్ = ఆ, బలే = సేన, పద్మనాభేన = విష్ణువుచేత, పృష్ఠతః = వెనుకనుండి, హన్యమానే = చంపబడుచుండగా, అథ = అటుపిమ్మట, మాల్యవాన్ = మాల్యవంతుడు, వేలామ్ = తీరమును, ఏత్య = పొంది, అర్ణవః ఇవ = సముద్రము వలె, సంనివృత్తః = మరలినాడు.

తా విష్ణువు సైన్యమును వెనుకనుండి చంపివేయుచుండగా మాల్యవంతుడు, తీరమును దాటి సముద్రము వచ్చినట్లు, వెనుకకు వచ్చెను. 1

మూ. సంరక్తనయనః క్రోధాచ్చలన్మౌలిర్నిశాచరః,
పద్మనాభమిదం ప్రాహ వచనం పురుషోత్తమమ్. 2

ప్ర. అ. నిశాచరః = ఆ రాక్షసుడు, సంరక్తనయనః = ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, క్రోధాత్ = కోపమువలన, చలన్మౌలిః = కదలుచున్న శిరస్సు కలవాడై, పురుషోత్తమమ్ = పురుషులలో శ్రేష్ఠుడైన, పద్మనాభమ్ = విష్ణువును గూర్చి, ఇదం వచనమ్ = ఈ వచనమును, ప్రాహ = పలికెను.

తా. మాల్యవంతుడు కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో, శిరస్సు కదలుచుండగా పురుషోత్తముడైన పద్మనాభునితో ఇట్లు పలికెను 2

మూ. నారాయణ న జానీషే క్షాత్రధర్మం పురాతనమ్,
అయుద్ధమనసో భీతానస్మాన్ హంసి యథేతరః. 3

ప్ర. అ నారాయణ = ఓ! విష్ణూ! పురాతనమ్ = ప్రాచీనమైన, క్షాత్ర ధర్మమ్ = క్షత్రియధర్మమును, న జానీషే = ఎరుగవా? ఇతరః యథా = సామాన్యుడవు వలె, అయుద్ధమనసః = యుద్ధమునందు మనస్సు లేని, భీతాన్ = భయపడిన, అస్మాన్ = మమ్ములను, హంసి = చంపుచున్నావు.

తా. ఓ! నారాయణా! సామాన్యుడు వలె నీవు, యుద్ధమునందు మనస్సు లేనివారమై భయపడి ఉన్న మమ్ములను చంపుచున్నావు; ప్రాచీనమైన క్షత్రియ ధర్మమును ఎరుగవా? 3

మూ. పరాఙ్ముఖవధం పాపం యః కరోతి సురేశ్వర,
స హన్తా న గతః స్వర్గం లభతే పుణ్యకర్మణామ్. 4

ప్ర. అ. సురేశ్వర = దేవతల ప్రభువైన ఓ! విష్ణూ! యః = ఎవడు, పాపమ్ = పాపమైన, పరాఙ్ముఖవధమ్ = పరాఙ్ముఖుల వధను, కరోతి = చేయునో, సః హన్తా = అట్టి చంపువాడు, గతః = వెళ్ళినవాడై, పుణ్యకర్మణామ్ = పుణ్య కర్మలు కలవారియొక్క, స్వర్గమ్ = స్వర్గమును, న లభతే = పొందడు.

తా. ఓ! విష్ణూ! పాపమైన యుద్ధపరాఙ్ముఖుల వధను చేయువాడు పుణ్య కర్మలు చేయువారికి లభించు స్వర్గమును పొందజాలడు. 4

మూ. యుద్ధశ్రద్ధాథవా తేఽస్తి శఙ్ఖచక్రగదాధర,
అహం స్థితోఽస్మి పశ్యామి బలం దర్శయ యత్తవ. 5

ప్ర. అ. శఙ్ఖచక్రగదాధర = శంఖచక్రగదలను ధరించినవాడా! అథవా = లేక, తే = నీకు, యుద్ధశ్రద్ధా = యుద్ధమునందు శ్రద్ధ, అస్తి = ఉన్నట్లయితే, తవ = నీయొక్క, యత్ = ఏ, బలమ్ = బలమున్నదో దానిని, దర్శయ = చూపుము. అహమ్ = నేను, స్థితః అస్మి = నిలచి ఉన్నాను. పశ్యామి = చాలా చూచుచున్నాను.

తా. శంఖచక్రగదలను ధరించిన ఓ! విష్ణూ! నీకు యుద్ధమునందు ఆసక్తి ఉన్నచో, నే నిక్కడ నిలచి ఉన్నాను. నీ కెంత బల మున్నదో చూపుము, చూచెదను. 5

మూ. మాల్యవన్తం స్థితం దృష్ట్వా మాల్యవన్తమివాచలమ్,
ఉవాచ రాక్షసేన్ద్రం తం దేవరాజానుజో బలీ. 6

ప్ర. అ. బలీ=బలవంతుడైన, దేవరాజానుజః=విష్ణువు; మాలవ్యన్తమ్= మాల్యవంత మను; అచలమివ = పర్వతము వలె; స్థితమ్ = నిలచిన, రాక్షసేన్ద్రమ్ = రాక్షసరాజైన, తం మాల్యవన్తమ్=ఆ మాల్యవంతుణ్ణి, దృష్ట్వా=చూచి, ఉవాచ = పలకెను.

తా. బలవంతుడైన శ్రీమహావిష్ణువు మాల్యవత్పర్వతము వలె నిలచిన రాక్షసరాజైన ఆ మాల్యవంతుణ్ణి చూచి ఇట్లనెను. 6

మూ. యుష్మత్తో భయభీతానాం దేవానాం వై మయాభయమ్,
రాక్షసోత్సాదనం దత్తం తదేతదనుపాల్యతే. 7

ప్ర. అ. మయా = నాచేత; యుష్మత్తః = మీనుండి; భయభీతానామ్ = భయకారణమువలన భయపడిన; దేవానామ్ = దేవతలకు; రాక్షసోత్సాదనమ్ = రాక్షససంహార రూపమైన; అభయమ్=అభయము; దత్తమ్=ఇవ్వబడినది. తదేవ=అదియే; అనుపాల్యతే=పాలింపబడుచున్నది.

తా. మీవలన వచ్చిన అపాయమునుండి భయపడిన దేవతలకు నేను, రాక్షససంహారము చేయుదు నని అభయ మిచ్చి ఉన్నాను. ఆ ప్రతిజ్ఞనే పాలించుచున్నాను. 7

మూ. ప్రాణైరపి ప్రియం కార్యం దేవానాం హి సదా మయా,
సోఽహం వో నిహనిష్యామి రసాతలగతానపి. 8

ప్ర. అ. మయా = నాచేత, సదా = ఎల్లప్పుడు, దేవానామ్ = దేవతలకు ప్రాణైరపి = ప్రాణములచేత కూడ, ప్రియమ్ = ప్రియము, కార్యమ్ = చేయదగినది. సః అహమ్ = అట్టి నేను, రసాతలగతానపి = రసాతలమును పొందినను, వః = మిమ్ములను, నిహనిష్యామి = చంపెదను.

తా. నేను నా ప్రాణములైన ఇచ్చి ఎల్లప్పుడు దేవతలకు ప్రియము చేయవలసి ఉన్నది. అట్టి నేను మీరు రసాతలమునకు వెళ్ళినను మిమ్ములను చంపెదను. 8

మూ. దేవదేవం బ్రువాణం తం రక్తామ్బురుహలోచనమ్,
శక్త్యా బిభేద సంక్రుద్ధో రాక్షసేన్ద్రో భుజాన్తరే. 9

ప్ర. అ. సంక్రుద్ధః = కోపించిన, రాక్షసేన్ద్రః = మాల్యవంతుడు, బ్రువాణమ్=ఇట్లు పలుకుచున్న, రక్తామ్బురుహలోచనమ్=ఎఱ్ఱని పద్మములవంటి నేత్రములుగల, తం దేవదేవమ్ = ఆ మహావిష్ణువును, శక్త్యా = శక్తిచేత, భుజాన్తరే= వక్షఃస్థలమునందు, బిభేద=భేదించెను.

తా. ఎఱ్ఱని పద్మముల వంటి నేత్రములు గల ఆ శ్రీమహావిష్ణువు ఇట్లు పలుకుచుండగా మాల్యవంతుడు కోపించి, శక్తితో అతని వక్షఃస్థలముమీద కొట్టెను. 9

మూ. మాల్యవద్భుజనిర్ముక్తా శక్తిర్ఘణ్టాకృతస్వనా,
హరేరురసి బభ్రాజ మేఘస్థేవ శతహ్రదా. 10

ప్ర. అ. మాల్యవద్భుజనిర్ముక్తా= మాల్యవంతుని భుజములచేత విడువబడిన, ఘణ్టాకృతస్వనా = ఘంటలచేత చేయబడిన ధ్వని గల, శక్తిః = శక్తి, హరేః = విష్ణువుయొక్క, ఉరసి = వక్షఃస్థలముమీద, మేఘస్థా = మేఘమునందున్న, శతహ్రదా ఇవ= మెరుపు వలె, బభ్రాజ=ప్రకాశించెను.

తా. మాల్యవంతుడు భుజములతో పట్టి విడచిన, ఘంటాధ్వని చేయుచున్న ఆ శక్తి విష్ణువక్షఃస్థలమునందు మేఘముమీద ఉన్న మెరుపు వలె ప్రకాశించెను.

మూ. తతస్తామేవ చోత్కృష్య శక్తిం శక్తిధరప్రియః,
మాల్యవన్తం సముద్దిశ్య చిక్షేపామ్బురుహేక్షణః. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శక్తిధరప్రియః = కుమారస్వామికి ఇష్టుడైన, అమ్బురుహేక్షణః = పద్మలోచనుడు, తామ్ = ఆ, శక్తిమేవ = శక్తినే, ఉత్కృష్య = లాగి, మాల్యవన్తం సముద్దిశ్య = మాల్యవంతుణ్ణి ఉద్దేశించి, చిక్షేప = విసరెను.

తా. కుమారస్వామికి ఇష్టుడైన ఆ విష్ణువు ఆ శక్తినే పైకి లాగి మాల్యవంతునిపై విసరెను. 11

మూ. స్కన్దోత్సృష్టేవ సా శక్తిర్గోవిన్దకరనిఃసృతా,
కాఙ్క్షన్తీ రాక్షసం ప్రాయాన్మహోల్కేవాఞ్జనాచలమ్. 12

ప్ర. అ. గోవిన్దకరనిఃసృతా = విష్ణుహస్తమునుండి బయల్వెడలిన, సా శక్తిః = ఆ శక్తి, స్కన్దోత్సృష్టేవ = కుమారస్వామిచేత విడవబడిన శక్తి వలె, రాక్షసమ్ = రాక్షసుణ్ణి, కాఙ్క్షన్తీ = కోరుచున్నదై, మహోల్కా = గొప్ప ఉల్క, అఞ్జనాచలమ్ ఇవ = అంజనాచలమును గూర్చి వలె, ప్రాయాత్ = వెళ్ళెను.

తా. విష్ణువు హస్తమునుండి బయల్వెడలిన ఆ శక్తి కుమారస్వామి ప్రయోగించిన శక్తి వలె, ఆ రాక్షసుని మీదకు, కొరవి అంజన పర్వతముమీదికి వెళ్ళినట్లు వెళ్ళెను. 12

మూ. సా తస్యోరసి విస్తీర్ణే హారభారావభాసితే,
ఆపతద్రాక్షసేన్ద్రస్య గిరికూట ఇవాశనిః. 13

ప్ర. అ. సా = ఆ శక్తి, హారభారావభాసితే = హారముల భారముచేత ప్రకాశింపచేయబడిన, విస్తీర్ణే = విశాలమైన, తస్య రాక్షసేన్ద్రస్య = ఆ రాక్షస రాజుయొక్క, ఉరసి = వక్షఃస్థలమునందు, గిరికూటే = పర్వతశిఖరమునందు, అశనిః ఇవ = పిడుగు వలె, అపతత్ = పడెను.

తా. ఆ శక్తి హారముల సముదాయముతో ప్రకాశించుచున్న, విశాలమైన ఆ రాక్షసరాజు వక్షఃస్థలముమీద పర్వతశిఖరముమీద పిడుగు పడినట్లు పడెను.

మూ. తయా భిన్నతనుత్రాణః ప్రావిశద్విపులం తమః,
మాల్యవాన్ పునరాశ్వస్తస్తస్థౌ గిరిరివాచలః. 14

ప్ర. అ. తయా = దానిచేత, భిన్నతనుత్రాణః = భేదించబడిన కవచము గలవాడై, మాల్యవాన్ = మాల్యవంతుడు, విపులమ్=అధికమైన, తమః=చీకటిని (మోహమును), ప్రావిశత్ = ప్రవేశించెను. పునః=మరల, ఆశ్వస్తః=తెప్పిరిల్లిన వాడై, గిరిరివ = పర్వతమువలె, అచలః = చలించనివాడై, తస్థౌ = నిలచెను.

తా. ఆ శక్తి దెబ్బకు కవచము బ్రద్దలైపోగా మాల్యవంతుడు మూర్ఛ పోయెను. మరల తెప్పిరిల్లి పర్వతము వలె కదలకుండ నిలబడెను. 14

మూ. తతః కాలాయసం శూలం కణ్టకైర్బహుభిశ్చితమ్,
ప్రగృహ్యాభ్యహనద్దేవం స్తనయోరన్తరే దృఢమ్. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట, బహుభిః = అనేకములైన, కణ్టకైః = ముండ్లతో, చితమ్ = వ్యాప్తమైన, కాలాయసమ్ = ఇనుము వికారమైన, శూలమ్ = శూలమును, ప్రగృహ్య = గ్రహించి, దేవమ్ = విష్ణువును, స్తనయోః = స్తనముల యొక్క, అన్తరే = మధ్యభాగమునందు, దృఢమ్ = గట్టిగా, అభ్యహనత్ = కొట్టెను.

తా. పిమ్మట అతడు చాలా ముండ్లతో నిండిన ఇనుప శూలమును గ్రహించి దానితో విష్ణువు వక్షఃస్థలమునందు గట్టిగా కొట్టెను. 15

మూ. తథైవ రణరక్తస్తు ముష్టినా వాసవానుజమ్,
తాడయిత్వా ధనుర్మాత్రమపక్రాన్తో నిశాచరః. 16

ప్ర. అ. తథైవ = అట్లే, రణరక్తః = యుక్తమునందు ఆసక్తి గల, నిశాచరః = ఆ రాక్షసుడు, ముష్టినా = పిడికిలిచేత, వాసవానుజమ్ = మహావిష్ణువును, తాడయిత్వా = కొట్టి, ధనుర్మాత్రమ్ = ధనస్సు దూరమును, అపక్రాన్తః = తొలగెను.

తా. యుద్ధమునందు చాల ఆసక్తి గల ఆ మాల్యవంతుడు మహావిష్ణువును పిడికిలితో గ్రుద్ది ధనస్సంత దూరము వైదొలగెను. 16

మూ. తతోఽమ్బరే మహాన్ శబ్దః సాధు సాధ్వితి చోత్థితః,
ఆహత్య రాక్షసో విష్ణుం గరుడం చాప్యతాడయత్. 17

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సాధు సాధు ఇతి = బాగు బాగు అని, మహాన్ = గొప్ప, శబ్దః = శబ్దము, అమ్బరే = ఆకాశమునందు, ఉత్థితః చ = బయల్వెడలినది. రాక్షసః = రాక్షసుడు, విష్ణుమ్ = విష్ణువును, ఆహత్య = కొట్టి, గరుడం చ = గరుత్మంతుణ్ణి కూడ, అతాడయత్ = కొట్టెను.

తా. అప్పుడు "బాగు బాగు"అని గొప్ప శబ్దము ఆకాశమునందు వ్యాపించెను. ఆ రాక్షసుడు విష్ణువును కొట్టిన పిమ్మట గరుత్మంతుణ్ణి కూడ కొట్టెను. 17

మూ. వైనతేయస్తతః క్రుద్ధః పక్షవాతేన రాక్షసమ్,
వ్యపోహద్బలవాన్వాయుః శుష్కపర్ణచయం యథా. 18

ప్ర. ప. తతః = అటుపిమ్మట, వైనతేయః = గరుత్మంతుడు, క్రుద్ధః = కోపించినవాడై, రాక్షసమ్ = ఆ రాక్షసుణ్ణి, పక్షవాతేన = రెక్కల గాలిచేత, బలవాన్ = బలముగల, వాయుః = వాయువు, శుష్కపత్రచయం యథా = ఎండుటాకుల ప్రోగును వలె, వ్యపోహత్ = ఎగురగొట్టెను

తా. అప్పుడు గరుత్మంతుడు కోపించి, బలముగల వాయువు ఎండుటాకుల ప్రోగును ఎగురగొట్టినట్లు, ఆ రాక్షసుణ్ణి రెక్కల గాలిచేత ఎగురగొట్టెను. 18

మూ. ద్విజేన్ద్రపక్షవాతేన ద్రావితం వీక్ష్య పూర్వజమ్,
సుమాలీ స్వబలైః సార్ధం లఙ్కామభిముఖో యయౌ. 19

ప్ర. అ. ద్విజేన్ద్రపక్షవాతేన = గరుత్మంతుని రెక్కల గాలిచేత, ద్రావితమ్ = ఎగురగొట్టబడిన, పూర్వజమ్ = అన్నను, వీక్ష్య = చూచి, సుమాలీ = సుమాలి, స్వబలైః సార్ధమ్ = తన సేనలతో కూడ, లఙ్కామ్ = లంకను గూర్చి, అభిముఖః = అభిముఖుడై, యయౌ = వెళ్ళెను.

తా. తన అన్నయైన మాల్యవంతుడు గరుత్మంతుని రెక్కల గాలికి ఎగిరిపోవుట చూచి సుమాలి సైన్యముతో లంక వైపు వెళ్ళిపోయెను. 19

మూ. పక్షవాతబలోద్ధూతో మాల్యవానపి రాక్షసః,
స్వబలేన సమాగమ్య యయౌ లఙ్కాం హ్రియా వృతః.

ప్ర. అ. పక్షవాతబలోద్ధూతః = రెక్కల గాలియొక్క బలముచేత ఎగురగొట్టబడిన, రాక్షసః = రాక్షసుడైన, మాల్యవానపి = మాల్యవంతుడు కూడ, స్వబలేన = తన సైన్యముతో, సమాగమ్య = కలిసి, హ్రియా = సిగ్గుతో, వృతః = కూడినవాడై, లఙ్కామ్ = లంకను గూర్చి, యయౌ = వెళ్ళెను.

తా. బలమైన గరుత్మంతుని రెక్కల గాలి ఎగురగొట్టివేయగా మాల్యవంతుడు కూడ సిగ్గుపడుచు సైన్యముతో లంకలో ప్రవేశించెను. 20

మూ. ఏవం తే రాక్షసా రామ హరిణా కమలేక్షణ,
బహుశః సంయుగే భగ్నా హతప్రవరనాయకాః. 21

ప్ర. అ. కమలేక్షణ = కమలములవంటి నేత్రములు గల, రామ = రామా! ఏవమ్ = ఈ విధముగా, తే రాక్షసాః = ఆ రాక్షసులు, హరిణా = విష్ణువుచేత, హతప్రవరనాయకాః = చంపబడిన శ్రేష్ఠులైన నాయకులు గలవారై, సంయుగే = యుద్ధమునందు, బహుశః = అనేకపర్యాయములు, భగ్నాః = ఓడింపబడినారు.

తా. పద్మములవంటి నేత్రములు గల రామా! శ్రీమహావిష్ణువు ఈ విధముగా ఆ రాక్షసులను యుద్ధమునందు అనేకపర్యాయములు, వారి ప్రధానులైన నాయకులను చంపివేసి ఓడించెను. 21

మూ. అశక్నువన్తస్తే విష్ణుం ప్రతియోద్ధుం భయార్దితాః,
త్యక్త్వా లఙ్కాం గతా వస్తుం పాతాలం సహపత్నయః.

ప్ర. అ. తే = వాళ్ళు, విష్ణుమ్ = విష్ణువును, ప్రతియోద్ధుమ్ = ఎదిరించి యుద్ధము చేయుటకు, అశక్నువన్తః = అసమర్థులై, భయార్దితాః = భయపీడితులై, సహపత్నయః = భార్యాసహితులై, లఙ్కామ్ = లంకను, త్యక్త్వా = విడచి, పాతాలమ్ = పాతాళమును గూర్చి, వస్తుమ్ = నివసించుటకు, గతాః = వెళ్ళిరి.

తా. ఆ రాక్షసులు విష్ణువును ఎదిరించి యుద్ధము చేయజాలక, భయపీడితులై, లంకను విడచి, భార్యాసహితులై నివాసార్థమై పాతాళమునకు వెళ్ళిపోయిరి. 22

మూ. సుమాలినం సమాసాద్య రాక్షసం రఘుసత్తమ,
స్థితాః ప్రఖ్యాతవీర్యాస్తే వంశే సాలకటఙ్కటే. 23

ప్ర. అ. రఘుసత్తమ = రామా! సాలకటఙ్కటే = సాలకటంకటకు సంబంధించిన, వంశే = వంశమునందు, ప్రఖ్యాతవీర్యాః = ప్రసిద్ధమైన పరాక్రమము గల, తే = ఆ రాక్షసులు, రాక్షసమ్ = రాక్షసుడైన, సుమాలినమ్ = సుమాలిని, సమాసాద్య = చేరి, స్థితాః = ఉండిరి.

తా. రామా! సాలకటంకటవంశమునందు ప్రసిద్ధమైన పరాక్రమము గల

ఆ రాక్షసులు సుమాలి పాలనలో ఉండిరి. (సాలకటంకట మాల్యవంతుడు మొద లైనవాళ్ళ పితామహి, విద్యుత్కేశుని భార్య). 23

మూ. యే త్వయా నిహతాస్తే తు పౌలస్త్యా నామ రాక్షసాః,
సుమాలీ మాల్యవాన్మాలీ యే చ తేషాం పురఃసరాః,
సర్వ ఏతే మహాభాగా రావణాద్బలవత్తరాః. 24

ప్ర. అ. త్వయా = నీచేత, యే రాక్షసాః = ఏ రాక్షసులు, నిహతాః = చంపబడినారో, తే తు = వారు, పౌలస్త్యాః నామ = పౌలస్త్య లను పేరు గలవారు. సుమాలీ = సుమాలి, మాల్యవాన్ = మాల్యవంతుడు, మాలీ = మాలి, తేషామ్ = వాళ్ళకు, పురఃసరాః = ముందు ఉన్న, యే చ = ఎవరు గలరో, సర్వే = సమస్తమైన, మహాభాగాః = మహాభాగ్యవంతులైన, సర్వే = అందరూ, రావణాత్ = రావణునికంటె, బలవత్తరాః = ఎక్కువ బలము గలవారు.

తా. నీవు చంపిన రాక్షసులు పులస్త్యవంశమునకు చెందినవారు. సుమాలి, మాల్యవంతుడు, మాలి, వాళ్ళ పూర్వీకులు, వాళ్ళందరూ చాల గొప్పవాళ్లు. రావణునికంటె కూడ అధికబలవంతులు. 24

మూ. న చాన్యో రాక్షసాన్ హన్తా సురారీన్ దేవకణ్టకాన్,
ఋతే నారాయణం దేవం శఙ్ఖచక్రగదాధరమ్. 25

ప్ర. అ. శఙ్ఖచక్రగదాధరమ్ = శంఖచక్రగదాధారియైన, దేవమ్ = ప్రభువైన, నారాయణమ్ ఋతే = నారాయణుడు తప్ప, అన్యః = మరి యెవ్వడును. సురారీన్ = దేవతాశత్రువులు, దేవకణ్టకాన్ = దేవతలకు బాధ కలిగించువారు అయిన, రాక్షసాన్ = రాక్షసులను, న హన్తా = చంపగలవాడు కాదు.

తా. శంఖచక్రగదాధారి, భగవంతుడు, నారాయణుడు తప్ప మరెవ్వడూ దేవతాశత్రువులు, దేవతలకు బాధ కలిగించువారు అయిన రాక్షసులను చంపగల వాడు లేడు. 25

మూ. భవాన్నారాయణో దేవశ్చతుర్బాహుః సనాతనః,
రాక్షసాన్ హన్తుముత్పన్నో హ్యజయ్యః ప్రభురవ్యయః.

ప్ర. అ. భవాన్=నీవు, దేవః=ప్రభువు, చతుర్బాహుః = నాలుగు బాహువులు గలవాడు, సనాతనః = ప్రాచీనుడు అయిన, నారాయణః=నారాయణుడవు, రాక్షసాన్ = రాక్షసులను, హన్తుమ్=చంపుటకు, ఉత్పన్నః=పుట్టినావు, అజయ్యః = జయించ శక్యము కాని, అవ్యయః = వినాశము లేని, ప్రభుః = ప్రభువు.

తా. నీవు నాలుగు బాహువులు గల, ప్రాచీనుడవైన దేవుడవైన నారాయణుడవు. జయింప శక్యము కానివాడవు, సర్వసమర్థుడవు, వినాశరహితుడవు అయిన నీవు రాక్షసులను చంపుటకు పుట్టినావు. 26

మూ. నష్టధర్మవ్యవస్థాతా కాలే కాలే ప్రజాకరః,
ఉత్పద్యతే దస్యువధే శరణాగతవత్సలః. 27

ప్ర. అ. నష్టధర్మవ్యవస్థాతా = నష్టమైన ధర్మమును నిలుపువాడు, శరణాగతవత్సలః = శరణుజొచ్చినవారియందు జాలి గల, ప్రజాకరః=ప్రజలను సృష్టించు విష్ణువు, కాలే కాలే = ఆ యా కాలమునందు, దస్యువధే = దుర్మార్గుల వధనిమిత్తము, ఉత్పద్యతే = పుట్టుచుండును.

తా. నష్టమైన ధర్మమును నిలుపువాడు, శరణుజొచ్చినవారియందు జాలి గలవాడు, ప్రజలను సృజించువాడు అయిన శ్రీమహావిష్ణువు దుష్టులను వధించుటకై ఆ యా కాలములందు జనించుచుండును. 27

మూ. ఏషా మయా తవ నరాధిప రాక్షసానా
ముత్పత్తిరద్య కథితా సకలా యథావత్,
భూయో నిబోధ రఘుసత్తమ రావణస్య
జన్మ ప్రభావమతులం ససుతస్య సర్వమ్. 28

ప్ర. అ. నరాధిప = మహారాజా ! రఘుసత్తమ = రామా ! మయా = నాచేత, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, ఏషా = ఈ. సకలా = సమస్తమైన. ఉత్పత్తిః = పుట్టుక. యథావత్ = యథార్థముగా, కథితా = చెప్పబడినది. అద్య = ఇప్పుడు, భూయః = మరల. ససుతస్య = కుమారులతో కూడిన, రావణస్య= రావణునియొక్క, జన్మ = జన్మను. అతులమ్ = సాటిలేని, సర్వమ్ = సమస్తమైన, ప్రభావమ్ = ప్రభావమును, నిబోధ = తెలిసికొనుము.

తా. మహారాజా ! రామా ! రాక్షసుల జన్మవృత్తాంతమును గూర్చి నీకింత వరకు నివేదించితిని. ఇప్పుడు రావణునియొక్క, ఆతని పుత్రులయొక్క జన్మ వృత్తాంతమును, సాటి లేని వాళ్ళ ప్రభావము నంతనూ గూర్చి చెప్పెదను; వినుము. 28

మూ. చిరాత్సుమాలీ వ్యచరద్రసాతలం
సరాక్షసో విష్ణుభయార్దిత స్తదా,
పుత్రైశ్చ పౌత్రైశ్చ సమన్వితో బలీ
తతస్తు లఙ్కామవసద్ధనేశ్వరః. 29

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టమః సర్గః.

ప్ర. అ. తదా = అప్పుడు, సుమాలీ = సుమాలి, విష్ణుభయార్దితః = విష్ణువు వలన భయముచేత పీడితుడై, సరాక్షసః = రాక్షసులతో కూడినవాడై, చిరాత్ = చిరకాలము, రసాతలమ్ = పాతాళమును, వ్యచరత్ = సంచరించెను. తతః = అటు పిమ్మట, బలీ = బలవంతుడైన, ధనేశ్వరః = కుబేరుడు, పుత్రైశ్చ = పుత్రుల తోను, పౌత్రైశ్చ = పౌత్రులతోను, సమన్వితః = కూడినవాడై, లఙ్కామ్ = లంకను, అవసత్ = నివసించెను.

తా. అప్పుడు సుమాలి, విష్ణువునకు భయపడి, రాక్షసులతో కూడి చాల కాలము రసాతలములో సంచరించెను. అటు పిమ్మట బలశాలియైన కుబేరుడు పుత్ర పౌత్రులతో కలిసి లంకలో నివసించెను. 29

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
అష్టమ సర్గ సమాప్తము.

అథ నవమః సర్గః

[రావణాదుల జన్మ. వారు తపస్సుకై గోకర్ణాశ్రమమునకు వెళ్ళుట.]

మూ. కస్య చిత్త్వథ కాలస్య సుమాలీ నామ రాక్షసః,
రసాతలాన్మర్త్యలోకం సర్వం వై విచచార హ. 1

ప్ర. అ. అథ = అటుపిమ్మట, కస్యచిత్ కాలస్య = కొంత కాలమునకు, సుమాలీ నామ = సుమాలి అను, రాక్షసః = రాక్షసుడు, రసాతలాత్ = పాతాళము నుండి, సర్వమ్ = సమస్తమైన, మర్త్యలోకమ్=మనుష్యలోకమును, విచచార హ = సంచరించెను.

తా. కొంత కాలము పిదప సుమాలి రసాతలమునుండి వచ్చి భూలోకమునందు అంతటా సంచరించెను. 1

మూ. నీలజీమూతసంకాశ స్తప్తకాఞ్చనకుణ్డలః,
కన్యాం దుహితరం గృహ్య వినా పద్మమివ శ్రియమ్. 2

రాక్షసేన్ద్రః స తు తదా విచరన్వై మహీతలే,
తదాపశ్యత్స గచ్ఛన్తం పుష్పకేణ ధనేశ్వరమ్. 3

ప్ర. అ. తదా = అప్పుడు, వినా పద్మమ్=పద్మములులేని, శ్రియమ్ ఇవ = లక్ష్మి వలె ఉన్న, కన్యామ్ = అవివాహిత యైన, దుహితరమ్ = కుమార్తెను, గృహ్య = గ్రహించి, మహీతలే=భూలోకమునందు, విచరన్=సంచరించుచున్న, నీలజీమూతసంకాశః = నల్లని మేఘముతో సమానుడైన, తప్తకాఞ్చనకుణ్డలః = పరిశుద్ధమైన బంగారము వికారమైన కుండలములు గల, సః రాక్షసేన్ద్రః = ఆ రాక్షసరాజు, తదా = అప్పుడు, పుష్పకేణ = పుష్పకవిమానముచేత, గచ్ఛన్తమ్ = వెళ్ళుచున్న, ధనేశ్వరమ్ = కుబేరుణ్ణి, అపశ్యత్ = చూచెను.

తా అప్పుడు పద్మములు ధరించని లక్ష్మి వలె ఉన్న, అవివాహితయైన కుమార్తెను వెంటబెట్టుకొని భూలోకమునందు సంచరించుచున్న, నీలమేఘసమానుడు, పరిశుద్ధమైన బంగారు కుండలములు ధరించినవాడు అయిన ఆ సుమాలి, పుష్పకముమీద ఎక్కి వెళ్ళుచున్న కుబేరుణ్ణి చూచెను. 2, 3

మూ. గచ్ఛన్తం పితరం ద్రష్టుం పులస్త్యతనయం విభుమ్,
తం దృష్ట్వామరసంకాశం స్వచ్ఛన్దం పావకోపమమ్, 4

రసాతలం ప్రవిష్టః సన్ మర్త్యలోకాత్సవిస్మయః.
ఇత్యేవం చిన్తయామాస రాక్షసానాం మహామతిః, 5
కిం కృత్వా శ్రేయ ఇత్యేవం వర్ధేమహి కథం వయమ్.

ప్ర. అ. మహామతిః = గొప్ప బుద్ధి గల అతడు, పితరమ్ = తండ్రిని, ద్రష్టుమ్ = చూచుటకు, గచ్ఛన్తమ్=వెళ్ళుచున్నవాడు, విభుమ్=సమర్థుడు, అమరసంకాశమ్=దేవతాతుల్యుడు, స్వచ్ఛన్దమ్ = స్వేచ్ఛగా ఉన్నవాడు, పావకోపమమ్ = అగ్నితో సమానుడు అయిన, పులస్త్యతనయమ్ = పులస్త్యుని పుత్రుడైన కుబేరుణ్ణి, దృష్ట్వా=చూచి, సవిస్మయః = ఆశ్చర్యముతో కూడినవాడై, మర్త్యలోకాత్ = మనుష్యలోకమునుండి, రసాతలమ్ = పాతాళమును, ప్రవిష్టః సన్ = ప్రవేశించినవాడై, రాక్షసానామ్ = రాక్షసులవిషయమున, ఇత్యేవమ్=ఇట్లు, చిన్తయామాస = ఆలోచించెను. శ్రేయః = శ్రేయస్కరమైన, కిమ్ = ఏమి, కృత్వా = చేసి, వయమ్ = మనము, కథమ్ = ఎట్లు, ఇత్యేవమ్ = ఈ విధముగా, వర్ధేమహి= వృద్ధిపొందెదము ?

తా. పులస్త్యుని కుమారుడైన ఆ కుబేరుడు తండ్రిని చూచుటకై వెళ్ళుచుండెను. సర్వసమర్థుడైన, స్వేచ్ఛగా సంచరించుచున్న, అతడు దేవతుల్యుడై, అగ్నివలె ప్రకాశించుచుండెను. మహాబుద్ధిశాలియైన సుమాలి అతనిని చూచి, ఆశ్చర్యచకితుడై, భూలోకమునుండి రసాతలమునకు తిరిగి వెళ్ళి రాక్షసులను గూర్చి ఇట్లు ఆలోచించెను. "మనము ఏ మంచి పనులు చేసినచో ఎట్లు ఈ కుబేరుడు వలె వృద్ధిపొందెదము ?" 4, 5

మూ. అథాబ్రవీత్సుతాం రక్షః కైకసీం నామ నామతః, 6
పుత్రి ప్రదానకాలోఽయం యౌవనం వ్యతివర్తతే.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రక్షః = ఆ రాక్షసుడు, నామతః = పేరు వలన, కైకసీం నామ = కైకసి అను ప్రసిద్ధిగల, సుతామ్ = కుమార్తెను గూర్చి, అబ్రవీత్ = పలికెను. పుత్రి = ఓ! పుత్రీ! అయమ్ = ఇది, ప్రదానకాలః = నిన్ను వరున కిచ్చే కాలము. యౌవనమ్ = యౌవనము, అతివర్తతే = దాటిపోవుచున్నది.

తా. పిమ్మట ఆ రాక్షసుడు కైకసి అను తన కుమార్తెతో ఇట్లు పలికెను. "పుత్రీ! ఇది నీకు వివాహము చేయవలసి కాలము. నీ యౌవనము దాటిపోవుచున్నది. 6

మూ. ప్రత్యాఖ్యానాచ్చ భీతైస్త్వం న వరైః పరిగృహ్యసే, 7
త్వత్కృతే చ వయం సర్వే యన్త్రితా ధర్మబుద్ధయః.

ప్ర. అ. ప్రత్యాఖ్యానాత్ = ప్రత్యాఖ్యానమువలన, భీతైః = భయపడిన మాచేత, త్వమ్ = నీవు, వరైః = వరులచేత, న ప్రతిగృహ్యసే = ప్రతిగ్రహింప చేయబడుటలేదు. ధర్మబుద్ధయః = ధర్మమునందు బుద్ధి గల, వయం సర్వే = మేమందరమూ, త్వత్కృతే = నీనిమిత్తమై, యన్త్రితాః = పీడితులము.

తా. అడిగిన ఎక్కడ ప్రత్యాఖ్యానము చేయుదురో అని భయపడి మేము నిన్ను వరులకు ఈయచూపుటలేదు. ధర్మమునందు ఆసక్తి గల మేము అందరము నీ నిమిత్తమై చాల ప్రయాసపడుచున్నాము. 7

మూ. త్వం హి సర్వగుణోపేతా శ్రీః సాక్షాదివ పుత్రికే, 8
కన్యాపితృత్వం దుఃఖం హి సర్వేషాం మానకాఙ్క్షిణామ్,
న జ్ఞాయతే చ కః కన్యాం వరయేదితి పుత్రికే. 9

ప్ర. అ. పుత్రికే = ఓ! పుత్రీ! త్వమ్ = నీవు, సాక్షాత్ = సాక్షాత్తు, శ్రీః ఇవ = లక్ష్మి వలె, సర్వగుణోపేతా హి = సమస్తగుణములతో కూడినదానవు కదా! మానకాఙ్క్షిణామ్ = గౌరవమును కోరు, సర్వేషామ్ = అందరికీ, కన్యాపితృత్వమ్ = కన్యకు తలితండ్రులగుట, దుఃఖం హి = దుఃఖకరము కదా. పుత్రికే = ఓ! పుత్రీ! కన్యామ్ = కన్యను, కః = ఎవడు, వరయేదితి = కోరును అని, న జ్ఞాయతే చ = తెలియబడదు కూడ.

తా. ఓ! పుత్రీ! సమస్తసద్గుణములతో నీవు సాక్షాత్తు లక్ష్మి వలె ఉన్నావు.

ఆత్మాభిమానవంతు లందరికీ కన్యకు తలిదండ్రులై ఉండుట దుఃఖకారణము. ఎట్టి వాడు, వచ్చి కన్యను వరించునో తెలియదు కదా ? 8, 9

మూ. మాతుః కులం పితృకులం యత్ర చైవ చ దీయతే,
కులత్రయం సదా కన్యా సంశయే స్థాప్య తిష్ఠతి. 10

ప్ర. అ. కన్యా = కన్య, మాతుః = తల్లియొక్క, కులమ్ = కులమును, పితృకులమ్ = తండ్రియొక్క కులమును, యత్ర = ఏ కులమునందు, దీయతే = ఇవ్వబడుచున్నదో ఆ కులమును, కులత్రయమ్ = కులముల త్రయమును, సదా = ఎల్లప్పుడూ, సంశయే = సంశయమునందు, స్థాప్య = ఉంచి, తిష్ఠతి = ఉండును.

తా. కన్య తల్లివంశము, తండ్రివంశము, ఏ వంశమునకు వెళ్ళునో ఆ వంశము, ఈ మూడు వంశములను సర్వదా సంశయములో ఉంచును. 10

మూ. సా త్వం మునివరం శ్రేష్ఠం ప్రజాపతికులోద్భవమ్,
భజ విశ్రవసం పుత్రి పౌలస్త్యం వరయ స్వయమ్. 11

ప్ర. అ. పుత్రి = ఓ ! పుత్రీ ! సా త్వమ్ = అట్టి నీవు, మునివరమ్ = మునులలో ఉత్తముడు, శ్రేష్ఠమ్ = శ్రేష్ఠుడు, ప్రజాపతికులోద్భవమ్ = బ్రహ్మ యొక్క కులమునందు పుట్టినవాడు అయిన, విశ్రవసమ్ = విశ్రవసుణ్ణి, భజ = సేవించుము. పౌలస్త్యమ్ = పులస్త్యుని పుత్రుడైన ఆతనిని, స్వయమ్ = స్వయముగా, వరయ = వరించుము.

తా. పుత్రీ ! నీవు మునులలో గొప్పవాడు, శ్రేష్ఠుడు, ప్రజాపతివంశములో పుట్టినవాడు అయిన విశ్రవసుణ్ణి సేవించుము. నీవు స్వయముగా ఆ పులస్త్య కుమారుణ్ణి వరించుము. 11

మూ. ఈదృశాస్తే భవిష్యన్తి పుత్రాః పుత్రి న సంశయః,
తేజసా భాస్కరసమో యాదృశోఽయం ధనేశ్వరః. 12

ప్ర. అ. పుత్రి = పుత్రీ! తేజసా = తేజస్సుచేత, భాస్కరసమః = సూర్యునితో సమానుడైన, అయం ధనేశ్వరః = ఈ కుబేరుడు, యాదృశః = ఎట్టివాడో, ఈదృశాః = ఇట్టి, పుత్రాః = పుత్రులు, తే = నీకు, భవిష్యన్తి = పుట్టగలరు. సంశయః = సంశయము, న = లేదు.

తా. పుత్రీ ! నీకు తేజస్సుచేత సూర్యుడు వలె ఉన్న ఈ కుబేరుడు ఎట్లున్నాడో అట్టి పుత్రులు పుట్టగలరు; సందేహము లేదు. 12

మూ. సా తు తద్వచనం శ్రుత్వా కన్యకా పితృగౌరవాత్,
తత్ర గత్వా చ సా తస్థౌ విశ్రవా యత్ర తప్యతే. 13

ప్ర. అ. సా కన్యకా = ఆ కన్యక, తద్వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, పితృగౌరవాత్ = తండ్రియందు గౌరవమువలన, విశ్రవాః = విశ్రవస్సు, యత్ర = ఎక్కడ, తప్యతే = తపస్సుచేయుచున్నాడో, తత్ర = అక్కడికి, గత్వా = వెళ్ళి, సా = ఆమె, తస్థౌ = నిలచెను.

తా. ఆ కన్యక ఆ మాటలు విని, తండ్రియందున్న గౌరవముచేత, విశ్రవస్సు తపస్సుచేయుచున్న చోటికి వెళ్ళి అక్కడ నిలచెను. 13

మూ. ఏతస్మిన్నన్తరే రామ పులస్త్యతనయో ద్విజః,
అగ్నిహోత్రముపాతిష్ఠచ్చతుర్థ ఇవ పావకః. 14

ప్ర. అ. రామ = రామా ! ద్విజః = బ్రాహ్మణుడైన, పులస్త్యతనయః = పులస్త్యుని కుమారుడైన విశ్రవస్సు, ఏతస్మిన్ = ఈ, అన్తరే = అవసరమునందు, చతుర్థః = నాల్గవ, పావకః ఇవ = అగ్ని వలె, అగ్నిహోత్రమ్ = అగ్నిహోత్రమను సాయంకాలకర్తవ్యకర్మను, ఉపాతిష్ఠత = చేయుచుండెను.

తా. ఆమె వెళ్ళు సమయానికి విశ్రవస్సు నాల్గవ అగ్ని వలె సాయంకాలాగ్నిహోత్రము చేయుచుండెను. 14

మూ. అవిచిన్త్య తు తాం వేలాం దారుణాం పితృగౌరవాత్,
ఉపసృత్యాగ్రతస్తస్య చరణాధోముఖీ స్థితా, 15
విలిఖన్తీ ముహుర్భూమిమఙ్గుష్ఠాగ్రేణ భామినీ

ప్ర. అ. భామినీ = ఆ స్త్రీ, పితృగౌరవాత్ = తండ్రియందు గౌరవమువలన, తామ్ = ఆ, దారుణామ్ = దారుణమైన, వేలామ్ = సమయమును, అవిచిన్త్య = ఆలోచించక, ఉపసృత్య = సమీపించి, అఙ్గుష్ఠాగ్రేణ = కాలి బొటనవ్రేలికొనచేత, ముహుః = మాటిమాటికి, భూమిమ్ = భూమిని, విలిఖన్తీ = వ్రాయు

చున్నదై, చరణాధోముఖీ = చరణము వైపు క్రిందికి ఉన్న ముఖము గలదై, తస్య = ఆతనియొక్క, అగ్రతః = ఎదుట, స్థితా = నిలచినది.

తా. ఆ కైకసి తండ్రియందున్న గౌరవముచేత, ఆ సమయము దారుణమైన దని కూడ ఆలోచించక, ఆ ముని పాదముల వైపు చూచుచు, కాలి బొటన వ్రేలిచేత మాటిమాటికి నేల వ్రాయుచు, ఆతని ఎదుట నిలచెను. 15

మూ. స తు తాం వీక్ష్య సుశ్రోణీం పూర్ణచన్ద్రనిభాననామ్, 16
అబ్రవీత్పరమోదారో దీప్యమానాం స్వతేజసా.

ప్ర. అ. పరమోదారః = చాల ఉత్తమస్వభావము గల, సః = విశ్రవస్సు, సుశ్రోణీమ్ = అందమైన పిరుదులు గల, పూర్ణచన్ద్రనిభాననామ్ = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గల, స్వతేజసా = తన తేజస్సుతో, దీవ్యమానామ్ = ప్రకాశించుచున్న, తామ్ = ఆమెను, వీక్ష్య = చూచి, అబ్రవీత్ = పలికెను.

తా. చాల ఉత్తమమైన స్వభావము గల ఆ విశ్రవస్సు, అందమైన కటి ప్రదేశము, పూర్ణచంద్రుని వంటి ముఖమూ గల, సహజతేజస్సుతో ప్రకాశించుచున్న ఆ కైకసిని చూచి ఇట్లు పలికెను. 16

మూ. భద్రే కస్యాసి దుహితా కుతో వా త్వమిహాగతా,
కిం కార్యం కస్య వా హేతో స్తత్త్వతో బ్రూహి శోభనే.

ప్ర. అ. భద్రే = మంగళప్రదురాలా ! త్వమ్ = నీవు, కస్య = ఎవనియొక్క, దుహితా = కుమార్తెవు, అసి = అయిఉన్నావు ? శోభనే = ఓ ! సుందరీ ! కుతః వా = ఎక్కడినుండి, కస్య వా హేతోః = ఏ కారణమువలన, ఇహ = ఇక్కడికి, ఆగతా = వచ్చినావు ? కార్యమ్ = పని, కిమ్ = ఏమి ?

తా. మంగళప్రదురాలా ! నీవు ఎవరి కుమార్తెవు? ఎక్కడినుండి, ఎందుకు ఇక్కడికి వచ్చినావు ? ఓ ! సుందరీ ! నీవు ఏపనిమీద ఇక్కడికి వచ్చినావు? 17

మూ. ఏవముక్తా తు సా కన్యా కృతాఞ్జలిరథాబ్రవీత్,
ఆత్మప్రభావేణ మునే జ్ఞాతుమర్హసి మే మతమ్. 18

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తా = పలకబడిన, సా కన్యా = ఆ కన్య, అథ

= అటుపిమ్మట, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలదై, అబ్రవీత్ = పలికెను. మునే = ఓ! మునీ! ఆత్మప్రభావేణ = నీ ప్రభావముచేత, మే = నాయొక్క, మతమ్ = కోరికను, జ్ఞాతుమ్ = తెలిసికొనుటకు, అర్హసి = తగిఉన్నావు.

తా. ఆ కన్యక ఆ ముని మాటలు విని అంజలి ఘటించి ఇట్లు పలికెను. "ఓ! మునీ! నా అభిప్రాయ మేమో నీ తపఃప్రభావముచేత తెలుసుకొనుము. 18

మూ. కిం తు మాం విద్ధి బ్రహ్మర్షే శాసనాత్పితురాగతామ్,
కైకసీ నామ నామ్నాహం శేషం త్వం జ్ఞాతుమర్హసి. 19

ప్ర. అ. బ్రహ్మర్షే = ఓ! బ్రహ్మర్షీ! కిం తు = కాని, మామ్ = నన్ను, పితుః = తండ్రియొక్క, శాసనాత్ = ఆజ్ఞవలన, ఆగతామ్ = వచ్చినదానినిగా, విద్ధి = తెలుసుకొనుము. అహమ్ = నేను, నామ్నా = పేరుచేత, కైకసీ నామ = కైకసి అను ప్రసిద్ధి గలదానను. శేషమ్ = మిగిలినదానిని, త్వమ్ = నీవు, జ్ఞాతుమ్ = తెలిసికొనుటకు, అర్హసి = తగిఉన్నావు.

తా. ఓ! బ్రహ్మర్షీ! నేను నా తండ్రి ఆజ్ఞ వలన వచ్చినాననను విషయము మాత్రము తెలిసికొనుము. నా పేరు కైకసి. మిగిలిన విషయ మంతా నీవే గ్రహించుము. 19

మూ. స తు గత్వా మునిర్ధ్యానం వాక్యమేతదువాచ హ,
విజ్ఞాతం తే మయా భద్రే కారణం యన్మనోగతమ్. 20

ప్ర. అ. సః మునిస్తు = ఆ ముని యైతే, ధ్యానం గత్వా = ధ్యానమును పొంది, ఏతత్ వాక్యమ్ = ఈ వాక్యమును, ఉవాచ హ = పలికెను. భద్రే = మంగళప్రదురాలా! మయా = నాచేత, యత్ = ఏది, తే = నీయొక్క, మనోగతమ్ = మనస్సులో ఉన్నదో, కారణమ్ = ఆ కారణము, విజ్ఞాతమ్ = తెలియబడినది.

తా. ఆ ముని ధ్యానము చేసి తెలిసికొని ఇట్లు పలికెను. "ఓ! మంగళప్రదురాలా! నీ మనస్సులో ఉన్న కారణ మేదో నాకు తెలిసినది." 20

మూ. సుతాభిలాషో మత్తస్తే మత్తమాతఙ్గగామిని,
దారుణాయాం తు వేలాయాం యస్మాత్త్వం మాముపస్థితా.

శృణు తస్మాత్సుతాన్ భద్రే యాదృశాన్ జనయిష్యసి,
దారుణాన్ దారుణాకారాన్ దారుణాభిజనప్రియాన్. 22
ప్రసవిష్యసి సుశ్రోణి రాక్షసాన్ క్రూరకర్మణః.

ప్ర. అ. మత్తమాతఙ్గగామిని = మదించిన ఏనుగు వలె నడచుదానా! మత్తః = నావలన, తే = నీకు, సుతాభిలాషః = పుత్రుల అభిలాష ఉన్నది. తు = కాని, త్వమ్ = నీవు, యస్మాత్ = ఏ కారణమువలన, దారుణాయామ్ = దారుణమైన, వేలాయామ్ = సమయమునందు, మామ్ = నన్ను, ఉపస్థితా = చేరినావో, తస్మాత్ = అందువలన, భద్రే = మంగళప్రదురాలా! యాదృశాన్ = ఎట్టి, సుతాన్ = కుమారులను, జనయిష్యసి = కనెదవో, శృణు = వినుము. సుశ్రోణి = అందమైన పిరుదులు గలదానా! దారుణాన్ = క్రూరులు, దారుణాకారాన్ = భయంకరమైన ఆకారము గలవారు, దారుణాభిజనప్రియాన్ = దారుణులైన బంధుజనులు ప్రియులుగా గలవారు, క్రూరకర్మణః = క్రూరమైన కర్మలు గలవారు అయిన, రాక్షసాన్ = రాక్షసులను, ప్రసవిష్యసి = కనగలవు.

తా. ఓ! మత్తగజగమనా! నీకు నావలన పుత్రులు కలగవలెనను కోరిక ఉన్నది. కాని నీవు నా వద్దకు దారుణమైన సంధ్యాసమయమునందు వచ్చినావు. అందుచే నీకు ఎట్టి పుత్రులు కలిగెదరో వినుము. నీకు భయంకరులు, భయంకరమైన ఆకారము గలవారు, క్రూరులైన బంధువులయందు ప్రీతి కలవారు, క్రూరములైన పనులు చేయువారు అయిన రాక్షసులు పుత్రులుగా పుట్టెదరు. 21,22

మూ. సా తు తద్వచనం శ్రుత్వా ప్రణిపత్యాబ్రవీద్వచః. 23
భగవన్నీదృశాన్ పుత్రాం స్త్వత్తోఽహం బ్రహ్మవాదినః,
నేచ్ఛామి సుదురాచారాన్ ప్రసాదం కర్తుమర్హసి. 24

ప్ర. అ. సా తు = ఆమె యైతే, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, ప్రణిపత్య = నమస్కరించి, వచః = వచనమును, అబ్రవీత్ = పలికెను. భగవన్ = పూజ్యుడా! బ్రహ్మవాదినః = వేదాద్వైతవైన, త్వత్తః = నీనుండి, అహమ్ = నేను, ఈదృశాన్ = ఇట్టి, సుదురాచారాన్ = చాల చెడ్డ నడవడిక గల, పుత్రాన్ = పుత్రులను, నేచ్ఛామి = కోరను, ప్రసాదమ్ = అనుగ్రహమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగిఉన్నావు.

తా. కైకసి విశ్రవసుని మాటలు విని అంజలి ఘటించి ఇట్లు పలికెను. "పూజ్యుడా! బ్రహ్మవాదివైన నీనుండి నాకు ఇట్టి దురాచారులైన పుత్రులు కలుగుట నా కిష్టము కాదు అనుగ్రహింపుము." 23, 24

మూ. కన్యయా త్వేవముక్తస్తు విశ్రవా మునిపుఙ్గవః,
ఉవాచ కైకసీం భూయః పూర్ణేన్దురివ రోహిణీమ్. 25

ప్ర. అ. కన్యయా = ఆ కన్యకచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడైన, విశ్రవాః = విశ్రవసుడు, పూర్ణేన్దుః = పూర్ణ చంద్రుడు, రోహిణీమివ = రోహిణిని వలె, కైకసీమ్ = కైకసిని గూర్చి, భూయః = మరల, ఉవాచ = పలికెను.

తా. మునిశ్రేష్ఠుడైన విశ్రవసుడు కైకసి మాటలు విని, పూర్ణచంద్రుడు రోహిణితో వలె ఆమెతో ఇట్లు పలికెను. 25

మూ. పశ్చిమో యస్తవ సుతో భవిష్యతి శుభాననే,
మమ వంశానురూపః స ధర్మాత్మా చ న సంశయః. 26

ప్ర. అ. శుభాననే = మంగళప్రదమైన ముఖము గలదానా! తవ = నీయొక్క, యః = ఏ, పశ్చిమః సుతః = చివరి పుత్రుడు ఉండునో, సః = అతడు, మమ = నాయొక్క, వంశానురూపః = వంశమునకు తగినవాడుగాను, ధర్మాత్మా = ధర్మాత్ముడుగాను, భవిష్యతి = కాగలడు. సంశయః = సంశయము, న = లేదు.

తా. మంగళకరమైన ముఖము గలదానా! నీ చివరి పుత్రుడు ధర్మాత్ముడై నా వంశానికి తగినవాడు అగును. సందేహము లేదు. 26

మూ. ఏవముక్తా తు సా కన్యా రామ కాలేన కేన చిత్,
జనయామాస బీభత్సం రక్షోరూపం సుదారుణమ్. 27

రామ = రామా! ఏవమ్ = ఇట్లు, ఉక్తా = పలకబడిన, సా కన్యా = ఆ కన్య, కేనచిత్ = ఒకానొక (కొంత), కాలేన = కాలముచేత, సుదారుణమ్ = చాల క్రూరుడైన, బీభత్సమ్ = భయంకరుడైన, రక్షోరూపమ్ = రాక్షసరూపముగల పుత్రుని, జనయామాస = కనెను.

తా. రామా! విశ్రవసుడు ఇట్లు చెప్పిన కొంతకాలానికి ఆ కన్య, భయంకరుడు, చాలక్రూరుడు అయిన, రాక్షసరూపము గల పుత్రుని కనెను. 27

మూ. దశగ్రీవం మహాదంష్ట్రం నీలాఞ్జనచయోపమమ్,
తామ్రోష్ఠం వింశతిభుజం మహాస్యం దీప్తమూర్ధజమ్. 28

ప్ర. అ. దశగ్రీవమ్ = పది కంఠములు గలవాడు, మహాదంష్ట్రమ్ = గొప్ప కోరలు గలవాడు, నీలాఞ్జనచయోపమమ్ = నల్లని కాటుకతో సమానుడు, తామ్రోష్ఠమ్ = ఎఱ్ఱని పెదవులు గలవాడు, వింశతిభుజమ్ = ఇరువది భుజములు గలవాడు, మహాస్యమ్ = గొప్ప ముఖములు గలవాడు, దీప్తమూర్ధజమ్ = ప్రకాశించుచున్న కేశములు గలవాడు అయిన (పుత్రుని కనెను).

తా. ఆ పిల్లవానికి పది కంఠములు, పెద్ద కోరలు, ఎఱ్ఱని పెదవులు, ఇరవై చేతులు, పెద్ద నోళ్లు, ప్రకాశించుచున్న జుట్టు ఉండెను. అతడు నల్లని కాటుక కుప్ప వలె ఉండెను. 28

మూ. తస్మిన్ జాతే తు తత్కాలే సజ్వాలకవలాః శివాః,
క్రవ్యాదాశ్చాపసవ్యాని మణ్డలాని ప్రచక్రముః. 29

ప్ర. అ. తత్కాలే = ఆ కాలమునందు, తతః = అటుపిమ్మట, తస్మిన్ = అతడు, జాతే = పుట్టినవాడగుచుండగా, సజ్వాలకవలాః = జ్వాలాకబళములతో కూడిన, శివాః = ఆడనక్కలు, క్రవ్యాదాశ్చ = మాంసము తిను మృగములు, అపసవ్యాని = అపసవ్యములైన, మణ్డలాని = మండలములను, ప్రచక్రముః = తిరిగినవి.

తా. అతడు పుట్టగానే నిప్పు ముద్దలు నోళ్ళలో ఉన్న ఆడు నక్కలు, మాంసము తిను మృగాలు, అపసవ్యముగా, గుండ్రముగా తిరిగినవి.

మూ. వవర్ష రుధిరం దేవో మేఘాశ్చ ఖరనిఃస్వనాః,
ప్రబభౌ న చ సూర్యో వై మహోల్కాశ్చాపతన్ భువి. 30

ప్ర. అ. దేవః = దేవుడు, రుధిరమ్ = రక్తమును, వవర్ష = వర్షించెను. మేఘాశ్చ = మేఘములు కూడ, ఖరనిఃస్వనాః = కటువైన ధ్వని గలవి. సూర్యః

చ = సూర్యుడు కూడ, న ప్రబభౌ వై = ప్రకాశించలేదు మహోల్కాః = గొప్ప ఉల్కలు, భువి = నేలమీద, అపతన్ = పడినవి.

తా. అప్పుడు దేవుడు రక్తము కురిపించెను. మేఘములు కటువుగా ఉరిమెను. సూర్యుడు ప్రకాశించలేదు. భూమిపై పెద్ద ఉల్కలు పడెను. 30

మూ. చకమ్పే జగతీ చైవ వవుర్వాతాః సుదారుణాః,
అక్షోభ్యః క్షుభితశ్చైవ సముద్రః సరితాం పతిః. 31

ప్ర. అ. జగతీ = భూమి, చకమ్పే చైవ = కంపించినది. సుదారుణాః = చాల దారుణములైన, వాతాః = వాయువులు, వవుః = వీచినవి. అక్షోభ్యః = క్షోభింప శక్యము కాని, సరితాం పతిః = నదులపతియైన, సముద్రః = సముద్రము, క్షుభితః = క్షోభింపచేయబడెను.

తా. భూమి అదిరెను. దారుణములైన గాలులు వీచెను. క్షోభింప శక్యము కాని నదీపతియైన సముద్రము క్షోభ చెందెను. 31

మూ అథ నామాకరోత్తస్య పితామహసమః పితా,
దశగ్రీవః ప్రసూతోఽయం దశగ్రీవో భవిష్యతి. 32

ప్ర. అ. అథ = అటు పిమ్మట, పితామహసమః = బ్రహ్మదేవునితో సమానుడైన, పితా = తండ్రి, తస్య = వానికి, నామ = పేరును, అకరోత్ = చేసెను. దశగ్రీవః = పదికంఠములు కలవాడుగా, ప్రసూతః = పుట్టిన, అయమ్ = ఇతడు, దశగ్రీవః = దశగ్రీవుడుగా, భవిష్యతి = కాగలడు.

తా. పిమ్మట బ్రహ్మదేవునితో సమానుడైన తండ్రి ఆ పిల్లవానికి పేరు పెట్టెను. ఇతడు పదికంఠములతో పుట్టినాడు గాన ఇతని పేరు "దశగ్రీవుడు". 32

మూ. తస్య త్వనన్తరం జాతః కుమ్భకర్ణో మహాబలః,
ప్రమాణాద్యస్య విపులం ప్రమాణం నేహ విద్యతే 33

ప్ర. అ. యస్య = ఎవనియొక్క, ప్రమాణాత్ = ప్రమాణముకంటె, విపులమ్ = పెద్దదైన, ప్రమాణమ్ = ప్రమాణము, ఇహ = ఈ లోకమునందు, న విద్యతే = లేదో అట్టి, మహాబలః = గొప్ప బలము గల, కుమ్భకర్ణః = కుంభకర్ణుడు, తస్య = వానియొక్క, అనన్తరమ్ = అనంతరము, జాతః = పుట్టెను.

తా. దశగ్రీవుని తరవాత మహాబలవంతుడైన కుంభకర్ణుడు పుట్టెను. అతని శరీర ప్రమాణమును మించిన ప్రమాణము ఈ లోకములో లేదు. 33

మూ. తతః శూర్పణఖా నామ సంజజ్ఞే వికృతాననా,
విభీషణశ్చ ధర్మాత్మా కైకస్యాః పశ్చిమః సుతః. 34

ప్ర. అ. తతః = పిమ్మట, వికృతాననా = వికృతమైన ముఖము గల, శూర్పణఖా నామ = శూర్పణఖ అనునది, సంజజ్ఞే = పుట్టెను, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, విభీషణశ్చ = విభీషణుడు, కైకస్యాః = కైకసియొక్క, పశ్చిమః సుతః = చివరి పుత్రుడుగా జనించెను.

తా. పిమ్మట వికృతమైన ముఖము గల శూర్పణఖ పుట్టెను. ధర్మాత్ముడైన విభీషణుడు కైకసి చివరి పుత్రుడుగా జనించెను. 34

మూ. తస్మిన్ జాతే మహాసత్త్వే పుష్పవర్షం పపాత హ,
నభఃస్థలే దున్దుభయో దేవానాం ప్రాణదంస్తథా.
వాక్యం చైవాన్తరిక్షే చ సాధు సాధ్వితి తత్తదా. 35

ప్ర. అ. మహాసత్త్వే = గొప్ప బుద్ధి గల, తస్మిన్ = అతడు, జాతే = పుట్టినవాడగుచుండగా, పుష్పవర్షమ్ = పుష్పవర్షము, పపాత హ = పడెను, తథా = మరియు, నభఃస్థలే = ఆకాశమునందు, దేవదున్దుభయః = దేవతల దుందుభులు, ప్రాణదన్ = ధ్వనిచేసినవి. తదా = అప్పుడు, అన్తరిక్షే = ఆకాశమునందు, సాధు సాధు ఇతి = బాగు బాగు అని, వాక్యమ్ = వాక్యము (వినబడెను).

తా. మహాబుద్ధిశాలియైన విభీషణుడు పుట్టినప్పుడు పుష్పవర్షము కురిసెను. ఆకాశమునందు దేవదుందుభులు మ్రోగెను. ఆకాశమునందు "బాగు బాగు" అను మాటలు వినబడెను. 35

మూ. తౌ తు తత్ర మహారణ్యే వవృధాతే మహౌజసౌ,
కుమ్భకర్ణదశగ్రీవౌ లోకోద్వేగకరౌ తదా. 36

ప్ర. అ. తదా = అప్పుడు, మహౌజసౌ = గొప్ప తేజస్సు గల, లోకోద్వేగకరౌ = లోకమునకు భయము కలిగించు, తౌ = ఆ, కుమ్భకర్ణదశగ్రీవౌ

= కుంభకర్ణ దశగ్రీవులు, తత్ర = ఆ, మహారణ్యే = మహారణ్యమునందు, వవృధాతే = వృద్ధిపొందిరి.

తా. గొప్ప తేజస్సు గలవారు, లోకమునకు ఉపద్రవము కలిగించువారు అయిన ఆ కుంభకర్ణదశగ్రీవులు ఆ మహారణ్యములో పెరిగిరి. 36

మూ. కుమ్భకర్ణః ప్రమత్తస్తు మహర్షీన్ ధర్మవత్సలాన్,
త్రైలోక్యం భక్షయన్నిత్యాసంతుష్టో విచచార హ. 37

ప్ర. అ. ప్రమత్తః = మిక్కిలి మదించిన, కుమ్భకర్ణస్తు=కుంభకర్ణుడైతే, ధర్మవత్సలాన్ = ధర్మమునందు ప్రేమ గల, మహర్షీన్ = మహర్షులను, భక్షయన్ = భక్షించుచు, నిత్యాసంతుష్టః = నిత్యము తృప్తిచెందనివాడై, త్రైలోక్యమ్ = మూడు లోకములను, విచచార హ = సంచరించెను.

తా. కుంభకర్ణుడు మిక్కిలి మదించి ధర్మాత్ములైన మహర్షులను నిత్యము భక్షించుచు తృప్తి చెందక మూడు లోకాలలో సంచరించెను. 37

మూ. విభీషణస్తు ధర్మాత్మా నిత్యం ధర్మవ్యవస్థితః,
స్వాధ్యాయనియతాహార ఉవాస విజితేన్ద్రియః. 38

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, విభీషణస్తు = విభీషణుడైతే, నిత్యమ్ = ఎల్లప్పుడు, ధర్మవ్యవస్థితః = ధర్మమునందే నిలచినవాడై, స్వాధ్యాయ నియతాహారః=స్వాధ్యాయము నియతమైన ఆహారము గలవాడై, విజితేన్ద్రియః= జయించబడిన ఇంద్రియములు గలవాడై, ఉవాస = నివసించెను.

తా. ధర్మాత్ముడైన విభీషణుడు మాత్రము నిత్యము ధర్మమునందే స్థిరుడై, స్వాధ్యాయము చేయుచు, ఆహారనియమము పాటించుచు, ఇంద్రియములను వశములో ఉంచుకొని ఉండెను. 38

మూ. అథ వైశ్రవణో దేవస్తత్ర కాలేన కేన చిత్,
ఆగతః పితరం ద్రష్టుం పుష్పకేణ ధనేశ్వరః. 39

ప్ర. అ. అథ = అటుపిమ్మట, కేన చిత్ = ఒకానొక, కాలేన = కాలము చేత, దేవః = ప్రభువైన, ధనేశ్వరః = ధనాధిపతియైన, వైశ్రవణః = కుబేరుడు,

పుష్పకేణ = పుష్పకముచేత, తత్ర = అక్కడికి, పితరమ్ = తండ్రిని, ద్రష్టుమ్ = చూచుటకు, ఆగతః = వచ్చినాడు.

తా. పిమ్మట కొంత కాలమునకు ధనాధిపతియైన దేవుడు కుబేరుడు తండ్రి దర్శనమునకై పుష్పకముమీద అక్కడికి వచ్చెను. 39

మూ. తం దృష్ట్వా కైకసీ తత్ర జ్వలన్తమివ తేజసా,
ఆగమ్య రాక్షసీ తత్ర దశగ్రీవమువాచ హ. 40

ప్ర. అ. తత్ర = ఆ సమయమునందు, రాక్షసీ = రాక్షసస్త్రీయైన, కైకసీ = కైకసి, తత్ర = అక్కడ, తేజసా = తేజస్సుతో, జ్వలన్తమివ = ప్రజ్వలించుచున్నట్లున్న, తమ్ = అతనిని, దృష్ట్వా = చూచి, ఆగమ్య = వచ్చి, దశగ్రీవమ్ = దశగ్రీవుణ్ణి గూర్చి, ఉవాచ హ = పలికెను.

తా. అపుడు రాక్షసియైన కైకసి అక్కడ తేజస్సుతో మండుచున్నాడా అన్నట్లు ఉన్న ఆ కుబేరుణ్ణి చూచి దశగ్రీవునివద్దకు వచ్చి ఇట్లు పలికెను. 40

మూ. పుత్ర వైశ్రవణం పశ్య భ్రాతరం తేజసావృతమ్,
భ్రాతృభావే సమానేఽపి పశ్యాత్మానం త్వమీదృశమ్. 41

ప్ర. అ. పుత్ర = పుత్రుడా ! తేజసా = తేజస్సుతో, వృతమ్ = కూడిన, భ్రాతరమ్ = సోదరుడైన, వైశ్రవణమ్ = కుబేరుణ్ణి, పశ్య = చూడుము. భ్రాతృభావే = సోదరత్వము, సమానేఽపి = సమానమే అయినను, త్వమ్ = నీవు, ఈదృశమ్ = ఈవిధముగా ఉన్న, ఆత్మానమ్ = తనను, పశ్య = చూచుకొనుము.

తా. పుత్రా ! నీ సోదరుడైన కుబేరుడు తేజస్సుతో ఎట్లు ప్రకాశించుచున్నాడో చూడుము. సోదరత్వము సమానమే అయినను ఈ విధముగా ఉన్న నిన్ను చూచుకొనుము. 41

మూ. దశగ్రీవ తథా యత్నం కురుష్వామితవిక్రమ,
యథా త్వమపి మే పుత్ర భవేర్వైశ్రవణోపమః. 42

ప్ర. అ. పుత్ర = కుమారా ! అమితవిక్రమ = సాటిలేని పరాక్రమము గలవాడా ! దశగ్రీవ = దశగ్రీవుడా ! త్వమపి = నీవు కూడ, యథా = ఎట్లు,

వైశ్రవణోపమః = కుబేరునితో సమానుడవు, భవేః = అగుదువో, తథా = అట్లు, యత్నమ్ = ప్రయత్నమును, కురుష్వ = చేయుము.

తా. నాయనా ! దశగ్రీవా ! సాటి లేని పరాక్రమముగలవాడా ! నీవు కూడ కుబేరుడంతటివాడవు అగుటకు ప్రయత్నము చేయుము. 42

మూ. మాతుస్తద్వచనం శ్రుత్వా దశగ్రీవః ప్రతాపవాన్,
అమర్షమతులం లేభే ప్రతిజ్ఞాం చాకరోత్తదా. 43

ప్ర. అ. ప్రతాపవాన్ = ప్రతాపవంతుడైన, దశగ్రీవః = దశగ్రీవుడు, మాతుః = తల్లియొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, అతులమ్ = సాటిలేని, అమర్షమ్ = కోపమును, లేభే = పొందెను. తదా = అప్పుడు, ప్రతిజ్ఞాం చ = ప్రతిజ్ఞను కూడ, అకరోత్ = చేసెను.

తా. ప్రతాపవంతుడైన దశగ్రీవుడు తల్లి మాటలు విని కుబేరుని విషయమునందు చాల అమర్షము చెంది అప్పుడు ప్రతిజ్ఞ చేసెను. 43

మూ. సత్యం తే ప్రతిజానామి భ్రాతృతుల్యోఽధికోఽపి వా,
భవిష్యామ్యోజసా చైవ సంతాపం త్యజ హృద్గతమ్. 44

ప్ర. అ. తే = నీకు, సత్యమ్ = సత్యముగా, ప్రతిజానామి = ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాను. ఓజసా = తేజస్సుచేత, భ్రాతృతుల్యః = సోదరునితో సమానుడను గాని, అధికో వాపి = అధికుడను గాని, భవిష్యామి = కాగలను. హృద్గతమ్ = మనస్సులో ఉన్న, సంతాపమ్ = సంతాపమును, త్యజ = విడువుము.

తా. నేను ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను - తేజస్సుచేత నా సోదరునితో సమానుడను గాని, అధికుడను గాని కాగలను. మనస్సులో ఉన్న సంతాపమును విడువుము.

మూ. తతః క్రోధేన తేనైవ దశగ్రీవః సహానుజః,
చికీర్షుర్దుష్కరం కర్మ తపసే ధృతమానసః. 45

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సహానుజః = తమ్ములతో కూడిన, దశగ్రీవః = దశగ్రీవుడు, తేన = ఆ, క్రోధేనైవ = క్రోధముతోనే, దుష్కరమ్ =

చేయ శక్యము కాని, కర్మ = పనిని, చికీర్షుః = చేయదలచినవాడై, తపసే = తపస్సుకొరకు, ధృతమానసః = నిశ్చయింపబడిన మనస్సుకలవా డయ్యెను.

తా. పిమ్మట సోదరసహితుడైన దశగ్రీవుడు ఆ కోపావేశముతోనె కూడి, ఎవ్వరూ చేయజాలని పని చేయ దలచినవాడై తపస్సు చేయుటకు నిశ్చయించుకొనెను.

మూ. ప్రాప్స్యామి తపసా కామమితి కృత్వాధ్యవస్య చ,
అగచ్ఛదాత్మసిద్ధ్యర్థం గోకర్ణస్యాశ్రమం శుభమ్. 46

ప్ర. అ. తపసా = తపస్సుచేత, కామమ్ = కోరికను, ప్రాప్స్యామి = పొందగలను, ఇతి = ఇట్లు, (మనః) కృత్వా = మనస్సు చేసి, అధ్యవస్య చ = నిర్ణయించి, ఆత్మసిద్ధ్యర్థమ్ = తన కార్యసిద్ధికొరకై, శుభమ్ = శుభమైన, గోకర్ణస్య = గోకర్ణక్షేత్రముయొక్క, ఆశ్రమం ప్రతి = ఆశ్రమమును గూర్చి, అగచ్ఛత్ = వచ్చెను.

తా. తపస్సుచేత కోరికను సాధించవలె నను దృఢసంకల్పముతో అతడు తన కార్యము సిద్ధించుటకై పవిత్రమైన గోకర్ణక్షేత్రమును చేరెను. 46

మూ. స రాక్షస స్తత్ర సహానుజ స్తదా
తపశ్చచారాతులముగ్రవిక్రమః,
అతోషయచ్చాపి పితామహం విభుం
దదౌ స తుష్టశ్చ వరాన్ జయావహాన్. 47

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
నవమః సర్గః.

ప్ర. అ. ఉగ్రపరాక్రమః = ఉగ్రమైన పరాక్రమము గల, సః రాక్షసః = ఆ రాక్షసుడు, సహానుజః = అనుజులతో కూడినవాడై, తదా = అప్పుడు, తత్ర = అక్కడ, అతులమ్ = సాటిలేని, తపః = తపస్సును, చచార = చేసెను. విభుమ్ = ప్రభువైన, పితామహమ్ = బ్రహ్మదేవుణ్ణి, అతోషయచ్చ = సంతోషపెట్టెను,

సః = అతడు, తుష్టః = సంతోషించినవాడై, జయావహాన్ = జయము నిచ్చు, వరాన్ = వరములను, దదౌ చ = ఇచ్చెను.

తా. ఉగ్రమైన పరాక్రమము గల ఆ దశగ్రీవుడు తమ్ములతో కలిసి ఆ గోకర్ణక్షేత్రములో సాటి లేని తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ణి సంతోషపెట్టెను. బ్రహ్మదేవుడు అతనికి జయమును కలిగించు వరములను ఇచ్చెను. 47

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో తొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ దశమః సర్గః

[రావణాదులు తపస్సు చేసి వరములు పొందుట.]

మూ. అథాబ్రవీన్మునిం రామః కథం తే భ్రాతరో వనే,
కీదృశం తు తదా బ్రహ్మంస్తపస్తేపుర్మహాబలాః. 1

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రామః = రాముడు, మునిమ్ = మునిని గూర్చి, అబ్రవీత్ = పలికెను. బ్రహ్మన్ = ఓ! బ్రాహ్మణోత్తముడా, మహాబలాః = గొప్ప బలము గల, తే భ్రాతరః = ఆ సోదరులు, వనే = వనమునందు, తదా = అప్పుడు, కీదృశమ్ = ఎట్టి, తపః = తపస్సు, తేపుః = చేసిరి.

తా. పిమ్మట రాముడు అగస్త్యమహామునిని - "ఓ! బ్రాహ్మణోత్తమా! అపుడు మహాబలశాలులైన ఆ సోదరులు ఎట్లు తపస్సు చేసిరి?"అని ప్రశ్నించెను.

మూ. అగస్త్యస్త్వబ్రవీత్తత్ర రామం సుప్రీతమానసమ్,
తాంస్తాన్ ధర్మవిధీంస్తత్ర భ్రాతరస్తే సమావిశన్.

ప్ర. అ. తత్ర = అక్కడ, సంప్రీతమానసమ్ = సంతోషించిన మనస్సు గల, రామమ్ = రాముణ్ణి గూర్చి, అగస్త్యస్తు = అగస్త్యుడు, అబ్రవీత్ = పలికెను. తే = ఆ, భ్రాతరః = సోదరులు, తత్ర = అక్కడ, తాంస్తాన్ = ఆ యా, ధర్మవిధీన్ = ధర్మవిధానములను, సమావిశన్ = ప్రవేశించిరి.

తా. చాల ఆసక్తితో కూడిన మనస్సు గల రామునితో అగస్త్యుడు ఇట్లు చెప్పెను-"ఆ సోదరులు ఆ యా ధర్మవిధానములను ఆచరించిరి". 2

మూ. కుమ్భకర్ణస్తతో యత్తో నిత్యం ధర్మపథే స్థితః,
తతాప గ్రీష్మకాలే తు పఞ్చాగ్నీన్ పరితః స్థితః. 3

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కుమ్భకర్ణః = కుంభకర్ణుడు, యత్తః =

ప్రయత్నశీలుడై, నిత్యమ్ = నిత్యము, ధర్మపథే=ధర్మమార్గమునందు, స్థితః = ఉన్నవాడై, పరితః = చుట్టూ, పఞ్చ = ఐదు, అగ్నీన్ = అగ్నులను ఉంచి, స్థితః = ఉన్నవాడై, గ్రీష్మకాలే = గ్రీష్మకాలమునందు, తతాప=తపస్సు చేసెను.

తా. కుంభకర్ణుడు ప్రయత్నశీలుడై, నిత్యము ధర్మమార్గమునందు ఉన్నవాడై, గ్రీష్మకాలమునందున చుట్టూ ఐదు అగ్నులను (నాల్గు ప్రక్కల నాలుగు అగ్నులు, పైన సూర్యుడు, పంచాగ్నులు) ఉంచుకొని తపస్సు చేసెను. 3

మూ. మేఘామ్బుసిక్తో వర్షాసు వీరాసనమసేవత,
నిత్యం చ శిశిరే కాలే జలమధ్యప్రతిశ్రయః. 4

ప్ర. అ. వర్షాసు = వర్షాకాలమునందు, మేఘామ్బుసిక్తః = మేఘోదకము చేత తడపబడినవాడై, వీరాసనమ్=వీరాసనమును (ఎడమ తొడమీద కుడిపాదము ఉంచి కూర్చుండుటకు వీరాసన మని పేరు), అసేవత=సేవించెను. శిశిరే కాలే= శిశిరర్తువునందు, నిత్యమ్ = నిత్యము, జలమధ్యప్రతిశ్రయః = జలమధ్యము ఆశ్రయముగా కలవా డయ్యెను.

తా. వర్షాకాలములో మేఘోదకమునకు తడియుచు వీరాసనముమీద కూర్చుండెను. శిశిరర్తువునందు నిత్యము జలమధ్యమునందు నిలచి తపస్సు చేసెను. 4

మూ. ఏవం వర్షసహస్రాణి దశ తస్యాపచక్రముః,
ధర్మే ప్రయతమానస్య సత్పథే నిష్ఠితస్య చ. 5

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ధర్మే = ధర్మమునందు, ప్రయతమానస్య = ప్రయత్నముచేయుచున్న, సత్పథే = సన్మార్గమునందు, నిష్ఠితస్య = స్థిరుడుగా ఉన్న, తస్య = అతనికి, దశ = పది, వర్షసహస్రాణి = వేల సంవత్సరములు, అపచక్రముః = గడచినవి

తా. ఈ విధముగ అతడు ధర్మము విషయమున ప్రయత్నము చేయుచు, సన్మార్గమునందు స్థిరుడుగా ఉండి తపస్సు చేయుచుండగా పది వేల సంవత్సరములు గడచినవి. 5

మూ. విభీషణస్తు ధర్మాత్మా నిత్యం ధర్మపరః శుచిః,
పఞ్చ వర్షసహస్రాణి పాదేనైకేన తస్థివాన్. 6

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ముడైన, విభీషణస్తు=విభీషణుడైతే, నిత్యమ్ = ఎల్లప్పుడు, ధర్మపరః = ధర్మాసక్తుడై, శుచిః = పవిత్రుడై, పఞ్చ = ఐదు, వర్షసహస్రాణి = సంవత్సరముల వేలు, ఏకేన = ఒక, పాదేన = పాదముచేత, తస్థివాన్ = నిలచినాడు.

తా. ధర్మాత్ముడైన విభీషణుడు నిత్యము ధర్మపరుడై, పవిత్రుడై ఐదు వేలసంవత్సరములు ఒక్క పాదముమీద నిలబడెను. 6

మూ. సమాప్తే నియమే తస్య ననృతుశ్చాప్సరోగణాః,
పపాత పుష్పవర్షం చ తుష్టువుశ్చాపి దేవతాః. 7

ప్ర. అ. తస్య = అతనియొక్క, నియమే = నియమము, సమాప్తే = సమాప్తమైనదగుచుండగా, అప్సరోగణాః = అప్సరఃస్త్రీగణములు, ననృతుశ్చ = నృత్యము చేసినవి. పుష్పవర్షం చ = పుష్పవర్షము కూడ, పపాత = పడెను. దేవ తాశ్చాపి = దేవతలు కూడ, తుష్టువుః = స్తోత్రము చేసిరి.

తా. అతని నియమము పూర్తి అయినప్పుడు అప్సరఃస్త్రీలు నృత్యము చేసిరి. పుష్పవర్షము కురిసెను. దేవతలు కూడ స్తుతించిరి. 7

మూ. పఞ్చ వర్షసహస్రాణి సూర్యం చైవాన్వవర్తత,
తస్థౌ చోర్ధ్వశిరోబాహుః స్వాధ్యాయే ధృతమానసః. 8

ప్ర. అ. పఞ్చ = ఐదు, వర్షసహస్రాణి=సంవత్సరముల వేలు, సూర్యమ్ = సూర్యుణ్ణి, అన్వవర్తతచ=అనుసరించెను. స్వాధ్యాయే=స్వాధ్యాయమునందు, ధృతమానసః = స్థిరముచేయబడిన మనస్సుగలవాడై, ఊర్ధ్వశిరోబాహుః = పైకి శిరస్సు బాహువులు కలవాడై, తస్థౌ = నిలచెను.

తా. స్వాధ్యాయమునందు మనస్సును స్థిరముగా నిలిపి, ముఖము బాహువులు పైకి ఎత్తి నిలచి ఐదు వేల సంవత్సరములు సూర్యుణ్ణి అనుసరించెను. (సూర్యుడు ఏ దిక్కున ఉండునో ఆ దిక్కుకు ముఖము త్రిప్పి సూర్యుని చూచుచు నిలచెను. 8

మూ. ఏవం విభీషణస్యాపి స్వర్గస్థస్యేవ నన్దనే,
దశ వర్షసహస్రాణి గతాని నియతాత్మనః. 9

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, నియతాత్మనః = నిగ్రహించబడిన మనస్సు గల, విభీషణస్యాపి=విభీషణునకు కూడ, నన్దనే=నందనవనమునందు, స్వర్గస్థస్యేవ = స్వర్గములో ఉన్నవానికి వలె, దశ = పది, వర్షసహస్రాణి = సంవత్సరముల వేలు, గతాని = గడచినవి.

తా. ఈ విధముగా మనోనిగ్రహవంతుడైన విభీషణుడు కూడ తపస్సు చేయుచుండగా స్వర్గములో ఉన్నవానికి నందనవనమునందు వలె, పది వేల సంవత్సరములు గడచినవి. 9

మూ. దశవర్షసహస్రం తు నిరాహారో దశాననః,
పూర్ణే వర్షసహస్రే తు శిరశ్చాగ్నౌ జుహావ సః. 10

ప్ర. అ. సః = ఆ, దశాననః తు = దశగ్రీవుడైతే, పూర్ణమ్ = పూర్ణమైన, దశవర్షసహస్రమ్ = పది వేల సంవత్సరములను, నిరాహారః = ఆహారము లేని వాడై, వర్షసహస్రే = వేయి సంవత్సరములు, పూర్ణే = నిండగా, అగ్నౌ = అగ్ని యందు, శిరః=శిరస్సును, జుహావ = హోమముచేసెను.

తా. దశాననుడు పూర్తి పది వేల సంవత్సరములు ఆహార మేమీ లేక తపస్సు చేయుచు వేయి సంవత్సరములు పూర్తియైనపుడెల్ల తన శిరస్సును అగ్నిలో హోమము చేసెను. 10

మూ. ఏవం వర్షసహస్రాణి నవ తస్యాతిచక్రముః,
శిరాంసి నవ చాప్యస్య ప్రవిష్టాని హుతాశనమ్. 11

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, తస్య=వీనికి, నవ=తొమ్మిది, వర్షసహస్రాణి = సంవత్సరముల సహస్రములు, అతిచక్రముః = అతిక్రమించినవి. అస్య = వీని యొక్క, నవ=తొమ్మిది, శిరాంసి చ=శిరస్సులు కూడ, హుతాశనమ్=అగ్నిని, ప్రవిష్టాని = ప్రవేశించినవి.

తా. ఈ విధముగా ఆ దశకంఠుడు తపస్సు చేయుచుండగా తొమ్మిది వేల

సంవత్సరములు గడచినవి. అతని తొమ్మిది శిరస్సులు అగ్నిలో హోమముచేయ బడినవి. 11

మూ. అథ వర్షసహస్రే తు దశమే దశమం శిరః,
చేత్తుకామే దశగ్రీవే ప్రాప్తస్తత్ర పితామహః. 12

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దశమే = పదవ, వర్షసహస్రే = సంవత్సరముల సహస్రమునందు, దశగ్రీవే = దశగ్రీవుడు, దశమమ్ = పదవ, శిరః = శిరస్సును, చేత్తుకామే = ఛేదించుటకు కోరికగలవాడగుచుండగా, పితామహః = బ్రహ్మదేవుడు, తత్ర = అక్కడికి, ప్రాప్తః = వచ్చినాడు

తా పదివేల సంవత్సరములు పూర్తి అయిన పిమ్మట దశగ్రీవుడు పదవ శిరస్సు ఛేదించుటకు ఉద్యుక్తుడగుచుండగా బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చెను.

మూ పితామహస్తు సుప్రీతః సార్ధం దేవైరుపస్థితః,
తవ తావద్దశగ్రీవ ప్రీతోఽస్మీత్యభ్యభాషత. 13

ప్ర అ పితామహస్తు = బ్రహ్మదేవుడైతే, సుప్రీతః = చాల సంతోషించినవాడై, దేవైః సార్ధమ్ = దేవతలతో కూడ, ఉపస్థితః = వచ్చినాడు. దశగ్రీవ = దశగ్రీవుడా ! తవ = నీకు, ప్రీతః = సంతోషించినవాడను, అస్మి తావత్ = అయినాను; ఇతి = అని, అభ్యభాషత = పలికెను.

తా. బ్రహ్మదేవుడు సంతోషించి, దేవతలతో కలిసి వచ్చి-"దశగ్రీవా ! నీ విషయమున సంతోషించినాను"అని పలికెను. 13

మూ శీఘ్రం వరయ ధర్మజ్ఞ వరో యస్తేఽభికాఙ్క్షితః,
కం తే కామం కరోమ్యద్య న వృథా తే పరిశ్రమః. 14

ప్ర. అ. ధర్మజ్ఞ = ధర్మములు తెలిసినవాడా ! తే = నీకు, యః = ఏ, వరః = వరము, అభికాఙ్క్షితః = కోరబడినదో, దానిని, శీఘ్రమ్ = శీఘ్రముగా, వరయ = కోరుము. అద్య = ఇప్పుడు, తే = నీయొక్క, కమ్ = ఏ, కామమ్ = కోరికను, కరోమి = చేయుదును ? తే = నీయొక్క, పరిశ్రమః = శ్రమ, వృథా = వ్యర్థముగా, న = కాకూడదు.

తా. ధర్మములు తెలిసినవాడా ! నీ కిష్టమైన వరము కోరుకొనుము. నీకు ఇప్పుడు నేను ఏ వరము ఇవ్వవలెను ? నీవు చేసిన ఈ తపస్సు వ్యర్థము కాకూడదు. 14

మూ అథాబ్రవీద్దశగ్రీవః ప్రహృష్టేనాన్తరాత్మనా,
ప్రణమ్య శిరసా దేవం హర్షగద్గదయా గిరా. 15

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దశగ్రీవః = దశగ్రీవుడు, ప్రహృష్టేన = సంతోషించిన, అన్తరాత్మనా = మనస్సుతో, దేవమ్ = బ్రహ్మదేవుణ్ణి, శిరసా = శిరస్సుచేత, ప్రణమ్య = నమస్కరించి, హర్షగద్గదయా = సంతోషముచేత గద్గదమైన, గిరా = వాక్కుతో, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు దశగ్రీవుడు సంతోషించిన మనస్సుతో తల వంచి బ్రహ్మదేవునకు నమస్కరించి, సంతోషముతో డగ్గుత్తిక చెందిన వాక్కుతో ఇట్లు పలికెను. 15

మూ. భగవన్ ప్రాణినాం నిత్యం నాన్యత్ర మరణాద్భయమ్,
నాస్తి మృత్యుసమః శత్రురమరత్వమహం వృణే. 16

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! ప్రాణినామ్ = ప్రాణులకు, నిత్యమ్ = నిత్యము, మరణాత్ = మరణముకంటె, అన్యత్ర = మరొక విషయమున, భయమ్ = భయము, న = లేదు. మృత్యుసమః = మృత్యువుతోసమమైన, శత్రుః = శత్రువు, నాస్తి = లేదు. అహమ్ = నేను, అమరత్వమ్ = మరణములేకుండుటను, వృణే = కోరుచున్నాను.

తా. పూజ్యుడా ! ప్రాణులకు మరణము తప్ప మరిదేనినుండి భయము లేదు. మృత్యువువంటి శత్రువు లేదు. మృత్యువులేకుండుటను కోరుచున్నాను. 16

మూ. ఏవముక్తస్తదా బ్రహ్మా దశగ్రీవమువాచ హ,
నాస్తి సర్వామరత్వం తే వరమన్యం వృణీష్వ మే. 17

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, బ్రహ్మా = బ్రహ్మ, దశగ్రీవమ్ = దశగ్రీవుణ్ణి గూర్చి, ఉవాచ హ = పలికెను. తే = నీకు, సర్వామరత్వమ్

= పూర్తిగా మరణము లేకపోవుట, నాస్తి = లేదు. అన్యమ్ = మరియొక, పరమ్ = వరమును, మే = నానుండి, వృణీష్వ = కోరుము.

తా. ఆ మాటలు విని బ్రహ్మదేవుడు దశగ్రీవునితో ఇట్లు పలికెను- "నీకు పూర్తిగా మరణము లేకుండుట అనునది లేదు. మరొక వరమేదైన కోరుకొనుము." 17

మూ. ఏవముక్తే తదా రామ బ్రహ్మణా లోకకర్తృణా,
దశగ్రీవ ఉవాచేదం కృతాఞ్జలిరథాగ్రతః. 18

ప్ర. అ. రామ = రామా ! తదా = అప్పుడు, లోకకర్తృణా = లోకముల సృష్టికర్తయైన, బ్రహ్మణా = బ్రహ్మచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తే = చెప్పబడగా, అథ = అటుపిమ్మట, దశగ్రీవః = దశగ్రీవుడు, అగ్రతః = ఎదుట, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలి కలవాడై, ఇదమ్ = ఈ వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. రామా ! లోకములను సృజించిన బ్రహ్మదేవుడు పలికిన మాటలు విని దశగ్రీవుడు అంజలి ఘటించి ఎదుట నిలచి ఇట్లు పలికెను. 18

మూ. సుపర్ణనాగయక్షాణాం దైత్యదానవరక్షసామ్,
అవధ్యోఽహం ప్రజాధ్యక్ష దేవతానాం చ శాశ్వత. 19

ప్ర. అ. ప్రజాధ్యక్ష = ప్రజల ప్రభువైనవాడా ! శాశ్వత = నిత్యుడా ! అహమ్ = నేను, సుపర్ణనాగయక్షాణామ్ = పక్షులకు, నాగులకు, యక్షులకు, దైత్యదానవరక్షసామ్ = దైత్యులకు, దానవులకు రాక్షసులకు, దేవతానాం చ = దేవతలకు, అవధ్యః = చంప శక్యము కానివాడను అగుదును గాక.

తా. నిత్యుడవైన ఓ ! ప్రజాపతీ ! నన్ను పక్షులు, నాగులు, యక్షులు, దైత్యులు, దానవులు, రాక్షసులు, దేవతలు చంపజాలకుండునట్లు వరమిమ్ము. 19

మూ. న హి చిన్తా మమాన్యేషు ప్రాణిష్వమరపూజిత,
తృణభూతా హి తే మన్యే ప్రాణినో మానుషాదయః. 20

ప్ర. అ. అమరపూజిత = దేవతలచేత పూజించబడినవాడా ! మమ = నాకు, అన్యేషు = ఇతరములైన, ప్రాణిషు = ప్రాణులవిషయమునందు, చిన్తా = చింత,

న హి = లేదు కదా ? మానుషాదయః = మనుష్యులు మొదలైనవారు, తృణభూతాః = తృణములు అని, మన్యే హి = తలచుచున్నాను కదా ?

తా. దేవతలచేత పూజింపబడినవాడా ! నాకు ఇతరప్రాణులవిషయమున చింత ఏదీ లేదు. మనుష్యులు మొదలైన ప్రాణులందరూ తృణములవంటి వారని తలచెదను. 20

మూ. ఏవముక్తస్తు ధర్మాత్మా దశగ్రీవేణ రక్షసా,
ఉవాచ వచనం దేవః సహ దేవైః పితామహః. 21

ప్ర. అ. రక్షసా = రాక్షసుడైన, దశగ్రీవేణ = దశగ్రీవునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ధర్మాత్మా = ధర్మాత్ముడు, సహదేవైః = దేవతలతో కూడినవాడు, దేవః = దేవుడూ అయిన, పితామహః = బ్రహ్మదేవుడు, వచనమ్ = వచనమును, ఉవాచ = పలికెను.

తా ధర్మాత్ముడు, దేవతాసహితుడు అయిన బ్రహ్మదేవుడు రాక్షసుడైన దశగ్రీవుని మాటలు విని ఇట్లు పలికెను. 21

మూ. భవిష్యత్యేవమేతత్తే వచో రాక్షసపుంగవ,
ఏవముక్త్వా తు తం రామ దశగ్రీవం పితామహః, 22
శృణు చాపి వరో భూయః ప్రీతస్యేహ శుభో మమ.

ప్ర. అ. రాక్షసపుంగవ = రాక్షసశ్రేష్ఠా ! తే = నీయొక్క, ఏతత్ = ఈ, వచః = వచనము, భవిష్యతి = కాగలదు. రామ = రామా ! పితామహః = బ్రహ్మదేవుడు, తం దశగ్రీవమ్ = ఆ దశగ్రీవుణ్ణిగూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, భూయః = మరల (పలికెను). ఇహ = ఇప్పుడు, ప్రీతస్య = సంతోషించిన, మమ = నాయొక్క, శుభః = శుభమైన, వరః = వరము (ఉన్నది). శృణు = వినుము.

తా. "ఓ ! రాక్షసశ్రేష్ఠా ! నీవు కోరినట్లే కాగలదు." బ్రహ్మదేవుడు దశగ్రీవునితో ఇట్లు పలికి మరల ఇట్లనెను. "నీ విషయమున సంతోషించిన నేను మరొక వరము ఇచ్చుచున్నాను; వినుము." 22

మూ. హుతాని యాని శీర్షాణి పూర్వమగ్నౌ త్వయానఘ, 23
పునస్తాని భవిష్యన్తి తథైవ తవ రాక్షస.

ప్ర. అ. అనఘ = దోషములు లేనివాడా ! రాక్షస = రాక్షసుడా ! త్వయా = నీచేత, పూర్వమ్ = పూర్వము, యాని శీర్షాణి = ఏ శిరస్సులు, అగ్నౌ = అగ్ని యందు, హుతాని = హోమము చేయబడినవో, తాని = అవి, తవ = నీకు, తథైవ = అట్లే, పునః = మరల, భవిష్యన్తి = కాగలవు.

తా. దోషములు లేని రాక్షసుడా ! పూర్వము నీవు అగ్నిలో హోమము చేసిన శిరస్సులు నీకు మరల పూర్వమువలెనే రాగలవు. 23

మూ. వితరామీహ తే సౌమ్య వరం చాన్యం దురాసదమ్, 24
ఛన్దత స్తవ రూపం చ మనసా యద్యదీప్సితమ్,
భవిష్యతి న సన్దేహో మద్వరాత్తవ రాక్షస. 25

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! ఇహ = ఇప్పుడు, దురాసదమ్ = పొంద శక్యముకాని, అన్యం వరం చ = మరియొక వరమును కూడ, వితరామి = ఇచ్చు చున్నాను. రాక్షస = రాక్షసుడా ! మనసా = మనస్సుచేత, యత్ = ఏది, యథా = ఎట్లు, ఈప్సితమ్ = ఇష్టమో, రూపం చ = అట్టి రూపము కూడ, తవ = నీయొక్క, ఛన్దతః = ఇచ్ఛవలన, మద్వరాత్ = నా వరమువలన, తవ = నీకు, భవిష్యతి = కాగలదు. సన్దేహః = సందేహము, న = లేదు.

తా. ఓ! సౌమ్యుడా ! చాల దుర్లభమైన మరొక వరము కూడ నీ కిచ్చు చున్నాను. నీ మనస్సుకు ఏ రూపము, ఎట్లు ఇష్టమో అది నీ ఇచ్ఛానుసారము, నా వరముచే లభించగలదు; సందేహము లేదు. 24, 25

మూ. ఏవం పితామహోక్తస్య దశగ్రీవస్య రక్షసః,
అగ్నౌ హుతాని శీర్షాణి పునస్తాన్యుత్థితాని వై. 26

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, పితామహోక్తస్య = బ్రహ్మదేవునిచేత చెప్పబడిన, రక్షసః = రాక్షసుడైన, దశగ్రీవస్య = దశగ్రీవునియొక్క, అగ్నౌ = అగ్నియందు, హుతాని = హోమముచేయబడిన, తాని = ఆ, శీర్షాణి = శిరస్సులు, పునః = మరల. ఉత్థితాని వై = మొలచినవి.

తా. బ్రహ్మదేవుడు చెప్పిన ప్రకారము, పూర్వము దశగ్రీవుడు హోమము చేసిన శిరస్సులన్నీ మరల మొలచెను. 26

మూ. ఏవముక్త్వా తు తం రామ దశగ్రీవం పితామహః,
విభీషణమథోవాచ వాక్యం లోకపితామహః. 27

ప్ర. అ. రామ = రామా ! లోకపితామహః = సమస్తలోకములకు పితామహుడైన, పితామహః = బ్రహ్మదేవుడు, దశగ్రీవమ్ = దశగ్రీవుణ్ణి గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, అథ = అటుపిమ్మట, విభీషణమ్ = విభీషణుణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. రామా ! సమస్తలోకములకు పితామహుడైన ఆ బ్రహ్మదేవుడు, రావణునితో ఇట్లు పలికి, పిదప విభీషణునితో ఇట్లనెను. 27

మూ. విభీషణ త్వయా వత్స ధర్మసంహితబుద్ధినా,
పరితుష్టోఽస్మి ధర్మాత్మన్వరం వరయ సువ్రత. 28

ప్ర. అ. వత్స = నాయనా ! ధర్మాత్మన్ = ధర్మాత్ముడా ! సువ్రత = మంచి వ్రతము గలవాడా ! విభీషణ = విభీషణా ! ధర్మసంహితబుద్ధినా = ధర్మమునందు నిలుపబడిన బుద్ధి గల, త్వయా = నీచేత, పరితుష్టః = సంతోషించినవాడను, అస్మి = అయి ఉన్నాను. వరమ్ = వరమును, వరయ = కోరుము.

తా. నాయనా ! ధర్మాత్ముడవు, మంచి వ్రతము కలవాడవు అయిన విభీషణా ! నీ విషయమున సంతోషించితిని, వరము కోరుకొనుము. 28

మూ. విభీషణస్తు ధర్మాత్మా వచనం ప్రాహ సాఞ్జలిః,
వృతః సర్వగుణైర్నిత్యం చన్ద్రమా రశ్మిభిర్యథా. 29

ప్ర. అ. రశ్మిభిః = కిరణములతో, చన్ద్రమాః యథా = చంద్రుడు వలె, నిత్యమ్ = ఎల్లప్పుడు, సర్వగుణైః = సమస్తగుణములతో, వృతః = కూడిన, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, విభీషణస్తు = విభీషణుడైతే, సాఞ్జలిః = అంజలితో కూడినవాడై, వచనమ్ = వచనమును, ప్రాహ = పలికెను.

తా. కిరణములతో చంద్రుడు వలె ఎల్లప్పుడు సర్వసద్గుణములతో కూడిన ధర్మాత్ముడైన విభీషణుడు చేతులు జోడించి నమస్కరించుచు ఇట్లు పలికెను. 29

మూ. భగవన్ కృతకృత్యోఽహం యన్మే లోకగురుః స్వయమ్,
ప్రీతేన యది దాతవ్యో వరో మే శృణు సువ్రత. 30

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! లోకగురుః = లోకమునకుగురువైన నీవు, స్వయమ్ = స్వయముగా, యత్ = ఏ కారణమువలన, మే = నావిషయమున (సంతోషించినావో) (అందువలన), అహమ్ = నేను, కృతకృత్యః = కృతకృత్యుడను. సువ్రత = మంచి వ్రతము గలవాడా ! ప్రీతేన = సంతోషించిన నీచేత, మే = నాకు, వరః = వరము, దాతవ్యః యది = ఇవ్వదగినచో, శృణు = వినుము.

తా. భగవంతుడా ! లోకమున కంతకు పూజ్యుడవైన నీవు స్వయముగా నా విషయమునందు సంతోషించినందుకు నేను కృతకృత్యుడను. ఆనందించిన నీవు నాకు వరము ఇవ్వదలచినచో, ఓ! మంచి నిర్ణయముగలవాడా ! వినుము. 30

మూ. పరమాపద్గతస్యాపి ధర్మే మమ మతిర్భవేత్,
అశిక్షితం చ బ్రహ్మాస్త్రం భగవన్ ప్రతిభాతు మే. 31

ప్ర. అ. పరమాపద్గతస్యాపి = గొప్ప ఆపదలను పొందినవాడనైనను, మమ = నాయొక్క, మతిః = బుద్ధి, ధర్మే = ధర్మమునందు భవేత్ = అగుగాక. భగవన్ = భగవంతుడా ! అశిక్షితమ్ = నేర్పబడకపోయినను, బ్రహ్మాస్త్రమ్ = బ్రహ్మాస్త్రము, మే = నాకు, ప్రతిభాతు = స్ఫురించుగాక.

తా. భగవంతుడా ! ఎట్టి ఆపదలలో ఉన్నను నా బుద్ధి ధర్మమునందే స్థిరముగా ఉండుగాక. ఉపదేశము లేకున్నను నాకు బ్రహ్మాస్త్రము స్ఫురించుగాక. 31

మూ. యా యా మే జాయతే బుద్ధిర్యేషు యేష్వాశ్రమేషు చ,
సా సా భవతు ధర్మిష్ఠా తం తం ధర్మం చ పాలయే. 32

ప్ర. అ. యేషు యేషు = ఏ యే, ఆశ్రమేషు = ఆశ్రమములయందు, మే = నాకు, యా యా = ఏ యే, బుద్ధిః = బుద్ధి, జాయతే = పుట్టునో, సా సా = ఆ యా బుద్ధి, ధర్మిష్ఠా = ధర్మ సంమతము, భవతు = అగుగాక. తం తమ్ = ఆ యా, ధర్మమ్ = ధర్మమును, పాలయే చ = పాలించెదను గాక.

తా. బ్రహ్మచార్యాద్యాశ్రమములలో ఏ ఆశ్రమములో ఉన్నను నాకు ధర్మ సంమతమైన బుద్ధియే కలుగుగాక. నేను ఆ ధర్మమును పాలింతునుగాక. 32

మూ. ఏష మే పరమోదార వరః పరమకో మతః,
న హి ధర్మాభిరక్తానాం లోకే కించన దుర్లభమ్. 33

ప్ర. అ. పరమోదార = చాల ఉదారుడవైనవాడా! ఏషః = ఇది, మే = నాకు, పరమకః = గొప్పదైన, వరః = వరముగా, మతః = ఇష్టమైనది. ధర్మాభిరక్తానామ్ = ధర్మమునందు ఆసక్తిగలవారికి, లోకే = లోకమునందు, దుర్లభమ్ = దుర్లభమైనది, కించన = ఏదీ, న హి = లేదు కదా?

తా. గొప్ప ఔదార్యముగలవాడా! ఇదే నాకు చాల గొప్ప వరముగా ఇష్టమైనది. ధర్మాసక్తులకు లోకములో దుర్లభమైనది ఏదీ లేదుకదా? 33

మూ. పునః ప్రజాపతిః ప్రీతో విభీషణమువాచ హ,
ధర్మిష్ఠ త్వం యథా వత్స తథా చైతద్భవిష్యతి. 34

ప్ర. అ. ప్రజాపతిః = బ్రహ్మదేవుడు, ప్రీతః = సంతోషించినవాడై, పునః = మరల, విభీషణమ్ = విభీషణుణ్ణి గూర్చి, ఉవాచ హ = పలికెను. ధర్మిష్ఠ = ధర్మాత్ముడా!, వత్స = నాయనా! త్వమ్ = నీవు, యథా = ఎట్లు అనుచున్నావో, ఏతత్ = ఇది, తథా = అట్లు, భవిష్యతి = కాగలదు.

తా. బ్రహ్మదేవుడు సంతోషించి విభీషణునితో మరల ఇట్లనెను-ధర్మాత్ముడవైన ఓ! విభీషణా! నాయనా! నీవు కోరినట్లే కాగలదు. 34

మూ. యస్మాద్రాక్షసయోనౌ తే జాతస్యామిత్రనాశన,
నాధర్మే జాయతే బుద్ధిరమరత్వం దదామి తే. 35

ప్ర. అ. అమిత్రనాశన = శత్రునాశము చేయువాడా! రాక్షసయోనౌ = రాక్షసజన్మయందు, జాతస్య = పుట్టిన, తే = నీయొక్క, బుద్ధిః = బుద్ధి, అధర్మే = అధర్మమునందు, యస్మాత్ = ఎందువలన, న జాయతే = కలుగుటలేదో, ఆ కారణమువలన, తే = నీకు, అమరత్వమ్ = మరణము లేకపోవుటను, దదామి = ఇచ్చుచున్నాను.

తా. శత్రుసంహారకా! నీవు రాక్షసవంశములో పుట్టినను నీ బుద్ధి అధర్మము నందు ప్రవసరించుటలేదు. అందుచేత నీకు మరణము లేకపోవుటను వరముగా ఇచ్చుచున్నాను. 35

మూ. ఇత్యుక్త్వా కుమ్భకర్ణాయ వరం దాతుమవస్థితమ్.
ప్రజాపతిం సురాః సర్వే వాక్యం ప్రాఞ్జలయోఽబ్రువన్.

ప్ర. అ. ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, కుమ్భకర్ణాయ = కుంభకర్ణుని కొరకు, వరమ్ = వరమును, దాతుమ్ = ఇచ్చుటకు, అవస్థితమ్ = నిలచిన, ప్రజాపతిమ్ = బ్రహ్మదేవుని గూర్చి, సర్వే = సమస్తమైన, సురాః = దేవతలు, ప్రాఞ్జలయః = కట్టబడిన దోసిళ్ళుగలవారై, వాక్యమ్ = వాక్యమును, అబ్రువన్ = పలికిరి.

తా. విభీషణునితో ఇట్లు పలికి కుంభకర్ణునికి వరము లిచ్చుటకై నిలచిన బ్రహ్మదేవునితో దేవత లందరు అంజలులు ఘటించి ఇట్లు పలికిరి. 36

మూ. న తావత్కుమ్భకర్ణాయ ప్రదాతవ్యో వరస్త్వయా,
జానీషే హి యథా లోకాంస్త్రాసయత్యేష దుర్మతిః. 37

ప్ర. అ. త్వయా = నీచేత, కుమ్భకర్ణాయ = కుంభకర్ణునకు, వరః = వరము, న ప్రదాతవ్యః తావత్ = ఇవ్వదగినది కాదు. దుర్మతిః = దుర్మతియైన, ఏషః = ఇతడు, లోకాన్ = లోకములను, యథా = ఎట్లు, త్రాసయతి = భయ పెట్టుచున్నాడో, జానీషే హి = ఎరుగుదువు కదా?

తా. నీవు కుంభకర్ణునకు వరము ఇవ్వవద్దు. దుర్మతియైన ఇతడు లోకములను ఎట్లు బాధించుచున్నాడో నీకు తెలియును కదా? 37

మూ. నన్దనేఽప్సరసః సప్త మహేన్ద్రానుచరా దశ,
అనేన భక్షితా బ్రహ్మన్నృషయో మానుషాస్తథా. 38

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రహ్మదేవుడా! అనేన = వీనిచేత, నన్దనే = నందనమునందు, సప్త = ఏడుగురు, అప్సరసః = అప్సరఃస్త్రీలు, దశ = పదిమంది, మహేన్ద్రానుచరాః = మహేంద్రుని అనుచరులు, ఋషయః = ఋషులు; తథా = మరియు, మానుషాః = మనుష్యులు, భక్షితాః = భక్షింపబడినారు.

తా. ఓ! బ్రహ్మదేవా! ఇతడు నందనవనములో ఏడుగురు అప్సరః స్త్రీలను, పదిమంది మహేంద్రుని అనుచరులను, ఋషులను, మనుష్యులను భక్షించినాడు. 38

మూ. అలబ్ధవరపూర్వేణ యత్కృతం రాక్షసేన తు,
యద్యేష వరలబ్ధః స్యాద్ భక్షయేద్భువనత్రయమ్. 39

ప్ర. అ. అలబ్ధవరపూర్వేణ = పూర్వము పొందబడని వరములు గల, రాక్షసేన = రాక్షసునిచేత, యత్ = ఏది, కృతమ్ = చేయబడినదో (అది ఇది). ఏషః = ఇతడు, వరలబ్ధః = పొందబడిన వరములు గలవాడు, స్యాద్యది = అయినట్లయితే, భువనత్రయమ్ = మూడు లోకములను, భక్షయేత్ = భక్షించును.

తా. ఈ రాక్షసుడు వరము పొందుటకు పూర్వమే ఇట్లు చేసినాడు. వరమును పొందినచో మూడు లోకములను భక్షించివేయును. 39

మూ. వరవ్యాజేన మోహోఽస్మై దీయతామమితప్రభ,
లోకానాం స్వస్తి చైవం స్యాద్భవేదస్య చ సంమతిః. 40

ప్ర. అ. అమితప్రభ = సాటిలేని కాంతి గలవాడా! వరవ్యాజేన = వరమను మిషచేత, అస్మై = వీనికి, మోహః = మోహము, దీయతామ్ = ఇవ్వబడుగాక. ఏవమ్ = ఇట్లు, లోకానామ్ = లోకములకు, స్వస్తి = క్షేమము, స్యాత్ = అగును. అస్య = వీనికి, సంమతిః చ = అంగీకారము కూడ, భవేత్ = అగును.

తా. సాటిలేని కాంతి గలవాడా! వరమను మిషచేత ఇతనికి మోహము నిమ్ము. ఇట్లు చేసినచో లోకములకు క్షేమమగును. వీని కోరిక కూడ తీరును 40

మూ. ఏవముక్తః సురైర్బ్రహ్మ చిన్తయత్పద్మసంభవః,
చిన్తితా చోపతస్థేఽస్య పార్శ్వం దేవీ సరస్వతీ. 41

ప్ర. అ. సురైః = దేవతలచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, పద్మసంభవః = పద్మమునుండి పుట్టిన, బ్రహ్మ = బ్రహ్మ, అచిన్తయత్ = ఆలోచించెను. చిన్తితా = చింతింపబడిన, దేవీ = దేవియైన, సరస్వతీ = సరస్వతి అస్య = వీనియొక్క, పార్శ్వమ్ = పార్శ్వమును, ఉపతస్థే = సమీపించెను.

తా. దేవతల మాట విని, పద్మమునందు పుట్టిన బ్రహ్మ సరస్వతిని తలచెను. ఆతడు తలచిన వెంటనే సరస్వతీదేవి ఆతనివద్దకు వచ్చెను.

మూ. ప్రాఞ్జలిః సా తు పార్శ్వస్థా ప్రాహ వాక్యం సరస్వతీ,
ఇయమస్మ్యాగతా దేవ కిం కార్యం కరవాణ్యహమ్. 42

ప్ర. అ. సా సరస్వతీ=ఆ సరస్వతి, ప్రార్శ్వస్థా=పార్శ్వమునందున్నదై, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలికలదై, వాక్యమ్ = వాక్యమును, ప్రాహ = పలికెను. దేవ = ఓ! ప్రభూ ! ఇయమ్ = ఈ నేను, అగతా అస్మి = వచ్చి ఉన్నాను. అహమ్ = నేను, కిమ్ = ఏ, కార్యమ్ = కార్యమును, కరవాణి = చేయుదును.

తా. ఆ సరస్వతి పార్శ్వమునందు నిలిచి, అంజలి ఘటించి ఇట్లు పలికెను. "ఓ! దేవా! ఇదిగో నేను వచ్చినాను. నేను ఏమి చేయవలెను? 42

మూ. ప్రజాపతిస్తు తాం ప్రాప్తాం ప్రాహ వాక్యం సరస్వతీమ్,
వాణి త్వం రాక్షసేన్ద్రస్య భవ వాగ్దేవతేప్సితా. 43

ప్ర. అ. ప్రజాపతిస్తు = బ్రహ్మదేవుడు, ప్రాప్తామ్ = వచ్చిన, తాం సరస్వతీమ్ = ఆ సరస్వతినిగూర్చి, వాక్యమ్ = వాక్యమును, ప్రాహ = పలికెను. వాణి = ఓ! సరస్వతీ! త్వమ్=నీవు, దేవతేప్సితా=దేవతలకు ఇష్టమైన, వాక్= వాక్కుగా, రాక్షసేన్ద్రస్య = కుంభకర్ణునకు, భవ = అగుము.

తా. బ్రహ్మదేవుడు వచ్చిన ఆ సరస్వతితో ఇట్లు పలికెను. ఓ! వాణీ! నీవు కుంభకర్ణునియందు, దేవతలకు ఇష్టమైన వాక్కుగా అగుము. 43

మూ. తథేత్యుక్త్వా ప్రవిష్టా సా ప్రజాపతిరథాబ్రవీత్,
కుమ్భకర్ణ మహాబాహో వరం వరయ యో మతః. 44

ప్ర. అ. సా = ఆమె, తథేతి = అట్లే అని, ఉక్త్వా = పలికి, ప్రవిష్టా = ప్రవేశించినది. అథ = అటుపిమ్మట, ప్రజాపతిః = బ్రహ్మదేవుడు, అబ్రవీత్ = పలికెను. మహాబాహో=గొప్ప బాహువులుగలవాడా! కుమ్భకర్ణ=కుంభకర్ణుడా! యః = ఏది, మతః = ఇష్టమో, వరమ్ = అట్టి వరమును, వరయ = కోరుము.

తా. "అట్లే చేసెదను" అని పలికి ఆ సరస్వతి వాని నోట ప్రవేశించెను.

పిమ్మట బ్రహ్మదేవుడు-"మహాబాహువైన కుంభకర్ణా! నీ కే వరము ఇష్టమో కోరు కొనుము"అని పలికెను. 44

మూ. కుమ్భకర్ణస్తు తద్వాక్యం శ్రుత్వా వచనమబ్రవీత్,
స్వప్తుం వర్షాణ్యనేకాని దేవదేవ మమేప్సితమ్. 45

ప్ర. అ. కుమ్భకర్ణస్తు = కుంభకర్ణుడైతే, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. దేవదేవ = ఓ! దేవదేవా!, అనేకాని వర్షాణి = అనేకసంవత్సరములు, స్వప్తుమ్ = నిద్రించుటకు, మమ = నాకు, ఈప్సితమ్ = ఇష్టము.

తా. కుంభకర్ణుడు ఆ వాక్యము విని ఇట్లు పలికెను-"దేవదేవా! అనేక సంవత్సరములపాటు నిద్రించవలె నని నేను కోరుచున్నాను." 45

మూ. ఏవమ స్త్వితి తం చోక్త్వా ప్రాయాద్బ్రహ్మ సురైః సమమ్,
దేవీ సరస్వతీ చైవ రాక్షసం తం జహౌ పునః. 46

ప్ర. అ. బ్రహ్మ = బ్రహ్మ, ఏవమ్ = ఇట్లు, అస్తు = అగుగాక, ఇతి = అని, తమ్ = వానిని గూర్చి, ఉక్త్వా = పలికి, సురైః సమమ్ = దేవతలతో కూడ, ప్రాయాత్ = వెళ్ళిపోయెను. దేవీ = దేవియైన, సరస్వతీ చ = సరస్వతికూడ, తం రాక్షసమ్ = ఆ రాక్షసుణ్ణి, పునః = మరల, జహౌ = విడచెను.

తా. "అట్లే అగుగాక" అని పలికి బ్రహ్మదేవుడు దేవతలతో కలిసి వెళ్ళిపోయెను. సరస్వతీదేవి కూడ ఆ రాక్షసుని విడిచెను. 46

మూ. బ్రహ్మణా సహ దేవేషు గతేషు చ నభఃస్థలమ్,
విముక్తోఽసౌ సరస్వత్యా స్వాం సంజ్ఞాం చ తతో గతః.

ప్ర. అ. బ్రహ్మణా సహ = బ్రహ్మతో కూడ, దేవేషు = దేవతలు, నభః స్థలమ్ = ఆకాశమును గూర్చి, గతేషు = వెళ్ళినవారగుచుండగా, తతః = అటు పిమ్మట, అసౌ = ఇతడు, సరస్వత్యా = సరస్వతిచేత, విముక్తః = విడవబడినవాడై, స్వామ్ = తనసంబంధమైన, సంజ్ఞామ్ = సంజ్ఞను, గతః = పొందెను.

తా. దేవతలందరు బ్రహ్మదేవునితో ఆకాశమార్గమున వెళ్ళిపోయిన పిమ్మట సరస్వతీదేవి కూడ విడచివేయగా ఆ రాక్షసునకు తన స్పృహ కలిగెను. 47

మూ. కుమ్భకర్ణస్తు దుష్టాత్మా చిన్తయామాస దుఃఖితః,
ఈదృశం కిమిదం వాక్యం మమాద్య వదనాచ్చ్యుతమ్,
అహం వ్యామోహితో దేవైరితి మన్యే తదాగతైః.

ప్ర. అ. దుష్టాత్మా = దుష్టబుద్ధి గల, కుమ్భకర్ణస్తు = కుంభకర్ణుడైతే, దుఃఖితః = దుఃఖించినవాడై, చిన్తయామాస = ఆలోచించెను. అద్య = ఇప్పుడు, మమ = నాయొక్క, వదనాత్ = ముఖమునుండి, ఈదృశమ్ = ఇట్టి, వాక్యమ్ = వాక్యము, చ్యుతమ్ = జారినది; ఇదమ్ = ఇది, కిమ్ = ఏమి? అహమ్ = నేను, తదా = అప్పుడు, ఆగతైః = వచ్చిన, దేవైః = దేవతలచేత, వ్యామోహితః = మోహింపచేయబడినాను, ఇతి = అని, మన్యే = తలచెదను.

తా. దుష్టాత్ముడైన కుంభకర్ణుడు దుఃఖించుచు ఇట్లు ఆలోచించెను- "నా నోటినుండి ఇప్పుడు ఇట్టి మాట జారినది; ఇది ఏమి ? ఇక్కడికి వచ్చిన ఆ దేవతలు నా కిట్లు మోహము కలిగించి ఉందురు". 48

మూ. ఏవం లబ్ధవరాః సర్వే భ్రాతరో దీప్తతేజసః, 49
శ్లేష్మాతకవనం గత్వా తత్ర తే న్యవసన్ సుఖమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
దశమః సర్గః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, లబ్ధవరాః = పొందబడిన వరములు గల, దీప్తతేజసః = ప్రకాశించుచున్న తేజస్సు గల, తే = ఆ, సర్వే=సమస్తమైన, భ్రాతరః = సోదరులు, శ్లేష్మాతకవనమ్=శ్లేష్మాతకవృక్షముల వనమును గూర్చి, గత్వా = వెళ్ళి, తత్ర = అక్కడ, సుఖమ్ = సుఖముగా, న్యవసన్ = నివసించిరి.

తా. తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ సోదరు లందరు ఈ విధముగా వరములు పొంది శ్లేష్మాతకవనమునకు వెళ్ళి అక్కడ సుఖముగా నివసించిరి. 49

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో దశమసర్గ సమాప్తము.

అథ ఏకాదశః సర్గః

[రావణుడు లంకను ఆక్రమించుట].

మూ. సుమాలీ వరలబ్ధాంస్తు జ్ఞాత్వా చైతన్నిశాచరాన్,
ఉదతిష్ఠద్భయం త్యక్త్వా సానుగః స రసాతలాత్. 1

ప్ర. అ. సుమాలీ = సుమాలి, ఏతాన్ = ఈ, నిశాచరాన్ = రాక్షసులను వరలబ్ధాన్ = పొందబడిన వరములు కలవాళ్ళనుగా, జ్ఞాత్వా = తెలిసికొని, భయమ్ = భయమును, త్యక్త్వా = విడచి, సానుగః = అనుచరులతో కూడినవారై, రసాతలాత్ = రసాతలమునుండి, ఉదతిష్ఠత్ = బైటకువచ్చెను.

తా. ఈ రాక్షసులు వరములు పొంది నట్లు తెలిసికొని సుమాలి భయము విడచి అనుచరులతో కూడ రసాతలమునుండి బైటకు వచ్చెను. 1

మూ. మారీచశ్చ ప్రహస్తశ్చ విరూపాక్షో మహోదరః,
ఉదతిష్ఠన్ సుసంరబ్ధాః సచివాస్తస్య రక్షసః. 2

ప్ర. అ. తస్య రక్షసః = ఆ రాక్షసునియొక్క, సచివాః = మంత్రులైన, మారీచశ్చ = మారీచుడు, ప్రహస్తశ్చ = ప్రహస్తుడు, విరూపాక్షః = విరూపాక్షుడు, మహోదరః = మహోదరుడు, సుసంరబ్ధాః = బాగా తొందరపడుచున్నవారై, ఉదతిష్ఠన్ = పైకి లేచిరి.

తా. సుమాలి మంత్రులైన మారీచుడు, ప్రహస్తుడు, విరూపాక్షుడు, మహోదరుడూ కూడ మంచి ఉత్సాహముతో పైకి వచ్చిరి. 2

మూ. సుమాలీ సచివైః సార్ధం వృతో రాక్షసపుంగవైః,
అభిగమ్య దశగ్రీవం పరిష్వజ్యేదమబ్రవీత్. 3

ప్ర. అ. సచివైః = మంత్రులైన, రాక్షసపుంగవైః సార్ధమ్ = రాక్షస

శ్రేష్ఠులతో కూడ, వృతః = కూడిన, సుమాలీ = సుమాలి, దశగ్రీవమ్ = దశగ్రీవుణ్ణి, అభిగమ్య = సమీపించి, పరిష్వజ్య = కౌగలించుకొని, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. సుమాలి మంత్రులైన రాక్షసశ్రేష్ఠులతో కలిసి వచ్చి దశగ్రీవుణ్ణి కౌగలించుకొని ఇట్లు పలికెను. 3

మూ. దిష్ట్యా తే వత్స సంప్రాప్తశ్చిన్తితోఽయం మనోరథః,
యస్త్వం త్రిభువనశ్రేష్ఠాల్లబ్ధవాన్వరముత్తమమ్. 4

ప్ర. అ. వత్స = నాయనా! యః = ఏ, త్వమ్ = నీవు, త్రిభువనశ్రేష్ఠాత్ = మూడు లోకాలలో శ్రేష్ఠుడైన బ్రహ్మదేవునినుండి, ఉత్తమమ్ = ఉత్తమమైన. వరమ్ = వరమును, ప్రాప్తః = పొందినావో, తే = అట్టి నీయొక్క, చిన్తితః = ఆలోచించబడిన, అయమ్ = ఈ, మనోరథః = మనోరథము, దిష్ట్యా = అదృష్టవశముచేత, లబ్ధః = పొందబడినది.

తా. నాయనా! నీవు బ్రహ్మదేవునినుండి ఉత్తమమైన వరమును పొందినావు. అదృష్టవశముచేత నీవు కోరిన కోరిక సిద్ధించినది. 4

మూ. యత్కృతే చ వయం లఙ్కాం త్యక్త్వా యాతా రసాతలమ్,
తద్గతం నో మహాబాహో మహద్విష్ణుకృతం భయమ్. 5

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా, వయమ్ = మేము, యత్కృతే చ = దేని మూలమున, లఙ్కామ్ = లంకను, త్యక్త్వా = విడచి, రసాతలమ్ = రసాతలమును గూర్చి, యాతాః = వెళ్ళినామో, తత్ = ఆ, నః = మాయొక్క, విష్ణుకృతమ్ = విష్ణువువలన ఏర్పడిన, మహత్ = గొప్ప, భయమ్ = భయము, గతమ్ = పోయినది.

తా. ఓ! మహాబాహూ! విష్ణువువలన కలిగిన ఏ మహాభయముచేత మేము లంకను విడచి రసాతలమునకు వెళ్ళితిమో ఆ భయము తొలగినది. 5

మూ. అసకృత్తద్భయాద్భగ్నాః పరిత్యజ్య స్వమాలయమ్,
విద్రుతాః సహితాః సర్వే ప్రవిష్టాః స్మ రసాతలమ్. 6

ప్ర. అ. సర్వే = మే మందరము, అసకృత్ = అనేకపర్యాయములు, తద్భయాత్ = అతనివలన భయమువలన, భగ్నాః = ఓడిపోయినవారమై, స్వమ్ = తమదైన, ఆలయమ్ = నివాసమును, పరిత్యజ్య = విడచి, విద్రుతాః = పారిపోయినవారమై, సహితాః = అందరము కలిసినవారమై, రసాతలమ్ = రసాతలమును, ప్రవిష్టాః స్మ = ప్రవేశించితిమి.

తా. మే మందరము ఆ విష్ణువునకు భయపడి, మా నివాసము విడచి, కలిసి పారిపోయి, రసాతలములో ప్రవేశించితిమి. 6

మూ. అస్మదీయా చ లఙ్కేయం నగరీ రాక్షసోషితా,
నివేశితా తవ భ్రాత్రా ధనాధ్యక్షేణ ధీమతా. 7

ప్ర. అ. రాక్షసోషితా = రాక్షసులచేత నివసించబడిన, అస్మదీయా = మనదైన, ఇయమ్ = ఈ, లఙ్కా నగరీ = లంకానగరము, ధీమతా = బుద్ధిమంతుడు, తవ భ్రాత్రా = నీ సోదరుడూ అయిన, ధనాధ్యక్షేణ = కుబేరునిచేత, నివేశితా = నివాసముగా చేసికొనబడినది.

తా. ఈ లంకానగరము మనది. రాక్షసులు నివసించిన నగరము. దీనిని నీ సోదరుడు బుద్ధిమంతుడైన కుబేరుడు నివాసముగా చేసికొనినాడు. 7

మూ. యది నామాత్ర శక్యం స్యాత్సామ్నా దానేన వానఘ,
తరసా వా మహాబాహో ప్రత్యానేతుం కృతం భవేత్. 8

ప్ర. అ. అనఘ = దోషములు లేనివాడా! మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! అత్ర = ఇక్కడ, సామ్నా = సామోపాయముచేత గాని, దానేన వా = దానముచేత గాని, తరసా వా = బలముచేతగాని, ప్రత్యానేతుమ్ = తిరిగి సంపాదించుటకు, శక్యమ్ = శక్యము, యది నామ స్యాత్ = అయినచో, కృతమ్ = చేయబడినది, భవేత్ = అగును.

తా. దోషములు లేని ఓ! మహాబాహూ! మనము సామోపాయముచేత గాని, దానముచేత గాని, బలప్రయోగముచేత గాని దీనిని మరల సంపాదించ కలిగినచో మంచి పని చేసినట్లు అగును. 8

మూ. త్వం చ లఙ్కేశ్వరస్తాత భవిష్యసి న సంశయః,
త్వయా రాక్షసవంశోఽయం నిమగ్నోఽపి సముద్ధృతః, 9
సర్వేషాం నః ప్రభుశ్చైవ భవిష్యసి మహాబల.

ప్ర. అ. తాత = నాయనా ! త్వంచ = నీవు, లఙ్కేశ్వరః = లంకాధిపతివిగా, భవిష్యసి = కాగలవు; సంశయః = సంశయము, న = లేదు. నిమగ్నోఽపి = మునిగిపోయినను, అయమ్ = ఈ, రాక్షసవంశః = రాక్షసవంశము, త్వయా = నీచేత, సముద్ధృతః=ఉద్ధరించబడినది. మహాబల=గొప్ప బలము గలవాడా! నః = మాకు, సర్వేషామ్ = అందరికీ, ప్రభుశ్చైవ = ప్రభువుగా కూడ, భవిష్యసి = కాగలవు.

తా. నాయనా ! నీవు ఈ లంకకు అధిపతివి కాగలవు. మునిగిపోయిన ఈ రాక్షసవంశమును నీవు ఉద్ధరించినావు. గొప్ప బలముగల నీవు మాకందరికీ ప్రభువు కాగలవు. 9

మూ. అథాబ్రవీద్దశగ్రీవో మాతామహముపస్థితమ్, 10
విత్తేశో గురురస్మాకం నార్హసే వక్తుమీదృశమ్.

ప్ర. అ. అథ = అటు పిమ్మట, దశగ్రీవః = దశగ్రీవుడు, ఉపస్థితమ్ = వచ్చిన, మాతామహమ్ = మాతామహుణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను. విత్తేశః = కుబేరుడు, అస్మాకమ్ = మాకు, గురుః = పూజ్యుడు. ఈదృశమ్ = ఇట్టి వాక్యమును, వక్తుమ్ = పలుకుటకు, నార్హసే = తగవు.

తా. అప్పుడు దశగ్రీవుడు దగ్గరకు వచ్చిన మాతామహునితో ఇట్లు పలికెను. "కుబేరుడు మాకు పూజ్యుడు; నీవు ఇట్లు పలుకుట తగదు." 10

మూ. సామ్నా హి రాక్షసేన్ద్రేణ ప్రత్యాఖ్యాతో గరీయసా, 11
కించిన్నాహ తదా రక్షో జ్ఞాత్వా తస్య చికీర్షితమ్.

ప్ర. అ. గరీయసా = గొప్పవాడైన, రాక్షసేన్ద్రేణ = రాక్షసశ్రేష్ఠుడైన రావణునిచేత, సామ్నా = సామముచేతనే, ప్రత్యాఖ్యాతః = ప్రత్యాఖ్యానముచేయబడిన, రక్షః = ఆ రాక్షసుడు, తదా=అప్పుడు, తస్య=వానియొక్క, చికీర్షితమ్

= చేయుటకు ఇచ్ఛయింపబడిన పనిని, జ్ఞాత్వా = తెలిసికొని, కించిత్ = ఏమీ, నాహ = పలకలేదు.

తా. గొప్పవాడైన ఆ రావణుడు మృదువుగానే తాను చెప్పిన మాటను తిరస్కరించగా సుమాలి ఆ సమయమునందు అతని అభిప్రాయము తెలిసికొని ఇంక ఏమీ మాటాడలేదు. 11

మూ. కస్య చిత్త్వథ కాలస్య వసన్తం రావణం తతః, 12
ప్రహస్తః ప్రశ్రితం వాక్యమిదమాహ సకారణమ్.

ప్ర. అ. అథ = అటు పిమ్మట, వసన్తమ్ = అక్కడనే నివసించుచున్న, రావణమ్ = రావణుని గూర్చి, కస్య చిత్ కాలస్య = కొంత కాలమునకు, తతః = అటుపిమ్మట, ప్రహస్తః = ప్రహస్తుడు, ప్రశ్రితమ్ = వినయయుక్తమైన, సకారణమ్ = కారణముతో కూడిన, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఆహ = పలికెను.

తా. పిమ్మట కొంత కాలానికి అక్కడనే నివసించుచున్న రావణునితో ప్రహస్తుడు, హేతుగర్భితమైన వాక్యమును సవినయముగా ఇట్లు పలికెను. 12

మూ. దశగ్రీవ మహాబాహో నార్హసే వక్తుమీదృశమ్, 13
సౌభ్రాత్రం నాస్తి శూరాణాం శృణు చేదం వచో మమ.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! దశగ్రీవ = దశగ్రీవుడా! ఈదృశమ్ = ఇట్టి వాక్యమును, వక్తుమ్ = పలుకుటకు, నార్హసే = తగవు. శూరాణామ్ = శూరులకు, సౌభ్రాత్రమ్ = భ్రాతృప్రేమ అనునది, నాస్తి = లేదు. మమ = నాయొక్క, ఇదమ్ = ఈ, వచః చ = వచనమును కూడ, శృణు = వినుము.

తా. మహాబాహువైన దశగ్రీవా! నీవు ఇట్లు పలుకుట తగదు. శూరులకు భ్రాతృప్రేమ అనునది ఉండకూడదు. నేను చెప్పు ఈ మాట కూడ వినుము. 13

మూ. అదితిశ్చ దితశ్చైవ భగిన్యౌ సహితే హి తే, 14
భార్యే పరమరూపిణ్యౌ కశ్యపస్య ప్రజాపతేః.

ప్ర. అ. పరమరూపిణ్యౌ = గొప్ప రూపము గల, భగిన్యౌ = సోదరీలు అయిన, తే = ఆ, అదితిశ్చ = అదితీ, దితిశ్చ = దితీ, సహితే = కలిసినవారై ప్రజాపతేః = ప్రజాపతియైన, కశ్యపస్య = కశ్యపునియొక్క, భార్యే = భార్యలు.

తా. పరమసౌందర్యవతులు, తోబుట్టువులూ అయిన అదితీ, దితీ ఇద్దరూ కూడ కశ్యపప్రజాపతి భార్యలు. 14

మూ. అదితిర్జనయామాస దేవాంస్త్రిభువనేశ్వరాన్, 15
దితి స్త్వజనయద్దైత్యాన్ కశ్యపస్యాత్మసంభవాన్.

ప్ర. అ. అదితిః = అదితి, త్రిభువనేశ్వరాన్ = మూడులోకాలకి ప్రభువులైన, దేవాన్ = దేవతలను, జనయామాస = కనెను. దితిస్తు = దితియైతే, కశ్యపస్య = కశ్యపునియొక్క, ఆత్మసంభవాన్ = కుమారులైన, దైత్యాన్ = దైత్యులను, అజనయత్ = కనెను.

తా. అదితి మూడు లోకాలకి ప్రభువులైన దేవతలను కనెను. దితి కశ్యపుని వలన దైత్యులను కనెను. 15

మూ. దైత్యానాం కిల ధర్మజ్ఞ పురేయం వసనార్ణవా, 16
సపర్వతా మహీ వీర తేఽభవన్ ప్రభవిష్ణవః.

ప్ర. అ. ధర్మజ్ఞ = ధర్మములు తెలిసినవాడా ! వీర = వీరుడా ! పురా = పూర్వము, వసనార్ణవా = సముద్రము వస్త్రముగా గల, సపర్వతా = పర్వతములతో కూడిన, ఇయం మహీ = ఈ భూమి, దైత్యానాం కిల = దైత్యులదట. తే = వాళ్ళు, ప్రభవిష్ణవః = ప్రభువులుగా; అభవన్ = ఉండిరి.

తా. ధర్మములు తెలిసిన ఓ ! వీరుడా ! సముద్రము వస్త్రముగా గల, పర్వతములతో కూడిన ఈ భూమి పూర్వము దైత్యులకు చెందినదై ఉండెను. ఆ దైత్యులు దీనిపై అధికారము కలవారై ఉండిరి. 16

మూ. నిహత్య తాంస్తు సమరే విష్ణునా ప్రభవిష్ణునా, 17
దేవానాం వశమానీతం త్రైలోక్యమిదమవ్యయమ్.

ప్ర. అ. ప్రభవిష్ణునా = సమర్థుడైన, విష్ణునా = విష్ణువుచేత, సమరే =

యుద్ధమునందు, తాన్ = వాళ్ళను, నిహత్య = చంపి, అవ్యయమ్ = వినాశరహిత మైన, ఇదమ్ = ఈ, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, దేవానామ్ = దేవతలయొక్క, వశమ్ = వశమును, ఆనీతమ్ = పొందించబడినది.

తా. సామర్థ్యశాలియైన విష్ణువు దైత్యులను యుద్ధములో చంపి అనంతములైన ఈ మూడు లోకాలను దేవతల వశము చేసెను. 17

మూ. నైతదేకో భవానేవ కరిష్యతి విపర్యయమ్, 18
సురాసురైరాచరితం తత్కురుష్వ వచో మమ.

ప్ర. అ. ఏతత్ = ఈ, విపర్యయమ్=విపరీతకార్యమును, భవాన్=నీవు, ఏకః ఏవ = ఒక్కడవే, న కరిష్యతి = చేయవు. సురాసురైః = సురాసురులచేత, ఆచరితమ్ = ఆచరించబడినది. తత్ = ఆ కారణమువలన, మమ = నాయొక్క, వచః = వచనమును, కురుష్వ = చేయుము.

తా. సోదరునితో విరోధము పెట్టుకొనుట అనే ఈ విపరీతకృత్యమును నీవు ఒక్కడవే చేయుటలేదు. పూర్వము సురాసురులే చేసి ఉన్నారు. అందుచేత నేను చెప్పినట్లు చేయుము. 18

మూ. ఏవముక్తో దశగ్రీవః ప్రహృష్టేనాన్తరాత్మనా, 19
చిన్తయిత్వా ముహూర్తం వై బాఢమిత్యేవ సోఽబ్రవీత్.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సః దశగ్రీవః = ఆ దశగ్రీవుడు. ప్రహృష్టేన=సంతోషించిన, అన్తరాత్మనా = మనస్సుతో, ముహూర్తమ్ = క్షణకాలము, చిన్తయిత్వా = ఆలోచించి, బాఢమ్ ఇత్యేవ = 'సరే' అని, అబ్రవీత్ = పలికెను.

తా. దశగ్రీవుడు ఆ మాటలు విని, మనస్సులో సంతోషించి, క్షణకాలము ఆలోచించి, "సరే; తప్పక అట్లే చేసెదను" అని పలికెను. 19

మూ. స తు తేనైవ హర్షేణ తస్మిన్నహని వీర్యవాన్, 20
వనం గతో దశగ్రీవః సహ తైః క్షణదాచరైః.

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన, సః దశగ్రీవః=ఆ దశగ్రీవుడు,

తస్మిన్ అహని = ఆ దివసమునందే, తేన హర్షేణైవ = ఆ ఉత్సాహముతోనే, తైః = ఆ, క్షణదాచరైః సహ = రాక్షసులతో కూడ, వనమ్ = వనమును గూర్చి, గతః = వెళ్ళినాడు.

తా. పరాక్రమవంతుడైన ఆ దశగ్రీవుడు ఆ ఉత్సాహముతోనే, ఆ రోజు నందే, ఆ రాక్షసు లందరితో కలిసి వనమునకు వెళ్లెను. 20

మూ. త్రికూటస్థః స తు తదా దశగ్రీవో నిశాచరః, 21
ప్రేషయామాస దౌత్యేన ప్రహస్తం వాక్యకోవిదమ్

ప్ర. అ. తదా = అప్పుడు, త్రికూటస్థః = త్రికూటపర్వతముమీద నున్న, నిశాచరః = రాక్షసుడైన, సః దశగ్రీవః = ఆ దశగ్రీవుడు, వాక్యకోవిదమ్ = వాక్యములు ఎరిగిన, ప్రహస్తమ్ = ప్రహస్తుణ్ణి, దౌత్యేన = దౌత్యముచేత, ప్రేషయామాస = పంపెను.

తా. అప్పుడు రాక్షసుడైన ఆ రావణుడు త్రికూటపర్వతముపై ఉండి, మాటలలో నేర్పరియైన ప్రహస్తుణ్ణి దౌత్యము చేయుటకై పంపెను. 21

మూ. ప్రహస్త శీఘ్రం గచ్ఛ త్వం బ్రూహి నైరృతపుంగవమ్,
వచసా మమ విత్తేశం సామపూర్వమిదం వచః.

ప్ర. అ. ప్రహస్త = ప్రహస్తుడా! త్వమ్ = నీవు, శీఘ్రమ్ = శీఘ్రముగా, గచ్ఛ = వెళ్ళుము, విత్తేశమ్ = ధనాధిపతియైన, నైరృత పుంగవమ్ = కుబేరుని గూర్చి, మమ = నాయొక్క, వచసా = వచనముచేత, సామపూర్వమ్ = సామపూర్వకముగా, ఇదమ్ = ఈ, వచః = వచనమును, బ్రూహి = చెప్పుము.

తా. ప్రహస్తా! నీవు శీఘ్రముగా వెళ్ళి ధనాధిపతియైన కుబేరునితో నా మాటగా ఇట్లు, సామపూర్వకముగా (బ్రతిమాలుకొనుచున్నట్లు) చెప్పుము. 22

మూ. ఇయం లఙ్కాపురీ రాజన్ రాక్షసానాం మహాత్మనామ్, 23
త్వయా నివేశితా సౌమ్య నైతద్యుక్తం తవానఘ.

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా, అనఘ = దోషములులేనివాడా! రాజన్ = ఓ! కుబేరా! మహాత్మనామ్ = మహాత్ములైన, రాక్షసానామ్ = రాక్షసులదైన,

ఇయమ్ = ఈ, లఙ్కా-పురీ = లంకాపట్టణము, త్వయా = నీచేత, నివేశితా = నివాసముగా చేసికొనబడినది. ఏతత్ = ఇది, తవ = నీకు, న యుక్తమ్ = యుక్తము కాదు.

తా. సౌమ్యుడవైన ఓ! కుబేరా! మహాత్ములైన రాక్షసులకు చెందిన ఈ లంకాపురములో నీవు నివాస మేర్పరచుకొన్నావు; దోషములు లేనివాడా! ఇది నీకు తగదు. 23

మూ. తద్భవాన్యది నో హ్యద్య దద్యాదతులవిక్రమ, 24
కృతా భవేన్మమ ప్రీతిర్ధర్మశ్చైవానుపాలితః.

ప్ర. అ. అతులవిక్రమ = సాటిలేని పరాక్రమము గలవాడా! తత్ = ఆ కారణమువలన, భవాన్ = నీవు, అద్య=ఇప్పుడు, నః = మాకు, దద్యాత్‌యది= ఇచ్చినట్లయితే, మమ = నాకు, ప్రీతిః = సంతోషము, కృతా = చేయబడినది, భవేత్=అగును, ధర్మశ్చైవ = ధర్మము కూడ, అనుపాలితః = పోషించబడినది అగును.

తా. సాటిలేని పరాక్రమము గలవాడా! అందువలన నీవు ఇపుడు ఈ లంకను మాకు ఇచ్చివేసినచో నాకు సంతోషము కలిగించినవాడవు, ధర్మమును పాలించినవాడవు అగుదువు. 24

మూ. స తు గత్వా పురీం లఙ్కాం ధనదేన సురక్షితామ్, 25
అబ్రవీత్పరమోదారం విత్తపాలమిదం వచః.

ప్ర. అ. సః = అతడు, ధనదేన = కుబేరునిచేత, సురక్షితామ్ = బాగా రక్షింపబడిన, లఙ్కాం పురీమ్ = లంకాపురమును గూర్చి, గత్వా = వెళ్ళి, విత్తపాలమ్=కుబేరునిగూర్చి, పరమోదారమ్ = చాల ఉదారమైన, ఇదం వచః= ఈ వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. ప్రహస్తుడు కుబేరునిచే రక్షింపబడుచున్న లంకానగరమునకు వెళ్ళి అతనితో చాల ఉదారమైన వాక్యమును ఇట్లు పలికెను. 25

మూ. ప్రేషితోఽహం తవ భ్రాత్రా దశగ్రీవేణ సువ్రత, 26
త్వత్సమీపం మహాబాహో సర్వశస్త్రభృతాం వర.

ప్ర. అ. సువ్రత=మంచి నియమములు కలవాడా! మహాబాహో=గొప్ప బాహువులు గలవాడా! సర్వశస్త్రభృతామ్ = సమస్తమైన శస్త్రధారులలో, వర = శ్రేష్ఠుడా! అహమ్=నేను, తవ=నీయొక్క, భ్రాతా=సోదరుడైన, దశగ్రీవేణ= దశగ్రీవునిచేత, త్వత్సమీపమ్ = నీ సమీపమును, ప్రేషితః=పంపబడితిని.

తా. మంచి నియమములు గలవాడా, మహాబాహూ! సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడా! నీ సోదరుడైన దశగ్రీవుడు నన్ను నీవద్దకు పంపినాడు. 26

మూ. తచ్ఛ్రూయతాం మహాప్రాజ్ఞ సర్వశాస్త్రవిశారద, 27
వచనం మమ విత్తేశ యద్బ్రవీతి దశాననః.

ప్ర. అ. మహాప్రాజ్ఞ = గొప్ప బుద్ధిమంతుడా! సర్వశాస్త్రవిశారద = సమస్తశాస్త్రములలో విశారదుడా! విత్తేశ = కుబేరుడా! దశాననః = దశాననుడు, యత్ = దేనిని, బ్రవీతి = చెప్పుచున్నాడో తత్ = ఆ, మమ వచనమ్ = నా వచనము, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. గొప్ప బుద్ధి గలవాడా! సకలశాస్త్రములందు పండితుడా! ధనాధీశా! దశానుని ఆజ్ఞచేత నేను చెప్పుచున్న వాక్యము వినుము. 27

మూ. ఇయం కిల పురీ రమ్యా సుమాలిప్రముఖైః పురా, 28
భుక్తపూర్వా విశాలాక్ష రాక్షసైర్భీమవిక్రమైః.

ప్ర. అ. విశాలాక్ష = విశాలములైన నేత్రములు గలవాడా! రమ్యా= రమ్యమైన, ఇయం పురీ=ఈ పట్టణము, పురా=పూర్వము, సుమాలిప్రముఖైః= సుమాలి మొదటగా గల, భీమవిక్రమైః = భయంకరమైన పరాక్రమము గల, రాక్షసైః = రాక్షసులచేత, భుక్తపూర్వాకిల = పూర్వము (ముందుగా) అనుభవించ బడినది కదా?

తా. విశాలములైన నేత్రములు గలవాడా! పూర్వము, రమ్యమైన ఈ లంకానగరమును భయంకరమైన పరాక్రమము గల సుమాలి మొదలైన రాక్షసులు ముందుగా అనుభవించినారు కదా? 28

మూ. తేన విజ్ఞాప్యతే సోఽయం సాంప్రతం విశ్రవాత్మజ, 29
తదేషా దీయతాం తాత యాచతస్తస్య సామతః.

ప్ర. అ. తాత = తండ్రీ! విశ్రవాత్మజ = కుబేరా! తత్ = ఆ కారణము వలన, ఏషా = ఇది, సామతః = సామమువలన, యాచతః = అడుగుచున్న, తస్య = వానికి, దీయతామ్ = ఇవ్వబడుగాక. తేన = ఆ కారణముచేత, సః అయమ్ = ఈ విషయము, సాంప్రతమ్ = ఇప్పుడు, విజ్ఞాప్యతే = తెలుపబడు చున్నది.

తా. అందువలన, నాయనా! కుబేరా! సామముచేత యాచించుచున్న దశగ్రీవునకు ఈ నగరమును ఇచ్చివేయుము. ఇప్పుడు నేను ఈ విషయమునే నీకు తెలుపుచున్నాను. 29

మూ. ప్రహస్తాదపి సంశ్రుత్య దేవో వైశ్రవణో వచః, 30
ప్రత్యువాచ ప్రహస్తం తం వాక్యం వాక్యవిదాం వరః.

ప్ర. అ. దేవః = దేవుడైన, వైశ్రవణః = కుబేరుడు, ప్రహస్తాత్ = ప్రహస్తునినుండి, సంశ్రుత్య = విని, వాక్యవిదాంవరః = వాక్యవేత్తలలో శ్రేష్ఠుడైన అతడు, తం ప్రహస్తమ్ = ఆ ప్రహస్తుణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ప్రత్యువాచ = తిరిగి పలికెను.

తా. మాటలు ఎరిగినవారిలో శ్రేష్ఠుడు, దేవుడు అయిన కుబేరుడు ప్రహస్తుని మాటలు విని అతనికి ఇట్లు బదులు చెప్పెను. 30

మూ. దత్తా మమేయం పిత్రా తు లజ్కా శూన్యా నిశాచరైః 31
నివేశితా చ మే రక్షో దానమానాదిభిర్గుణైః.

ప్ర. అ. రక్షః = ఓ! రాక్షసుడా! నిశాచరైః = రాక్షసులతో, శూన్యా = శూన్యమైన, ఇయం లజ్కా = ఈ లంక, పిత్రా = తండ్రిచేత, మమ=నాకు, దత్తా = ఇవ్వబడినది. దానమానాదిభిః = దానము గౌరవము మొదలైన, గుణైః= గుణములచేత, మే = నాకు, (నాచేత), నివేశితా=(నివాసయోగ్యముగా) ఏర్పరుప బడినది.

తా. ప్రహస్తా! రాక్షసు లెవ్వరూ లేని ఈ లంకను నాకు నా తండ్రి ఇచ్చినాడు. దీనిని నేను ప్రజలకు తగు దానగౌరవాదులు చేయుటద్వారా నివాస యోగ్యము చేసితిని. 31

మూ. బ్రూహి గచ్ఛ దశగ్రీవం పురీ రాజ్యం చ యన్మమ, 32
తవాప్యేతన్మహాబాహో భుఙ్క్ష్వ రాజ్యమకణ్టకమ్.
అవిభక్తం త్వయా సార్ధం రాజ్యం యచ్చాపి మే వసు, 33

ప్ర. అ. గచ్ఛ=వెళ్ళుము, దశగ్రీవమ్=దశగ్రీవుణ్ణి గూర్చి, బ్రూహి= చెప్పుము. మహాబాహో = మహాబాహూ! పురీ = పట్టణము, మమ = నాయొక్క, యత్ = ఏ, రాజ్యమ్ = రాజ్యమున్నదో, ఏతత్ = ఇది, తవాపి = నీకు కూడ సంబంధించినది. అకణ్టకమ్ = కంటకములు లేని, రాజ్యమ్ = రాజ్యమును, భుఙ్క్ష్వ = అనుభవింపుము. మే = నాయొక్క, రాజ్యమ్ = రాజ్యము, యత్ = ఏ, వసు చ అపి = ధనము కూడ ఉన్నదో అదీ, త్వయా సార్ధమ్ = నీతో కూడ, అవిభక్తమ్ = విభజింపబడనిది.

తా. నీవు వెళ్ళి దశగ్రీవునితో చెప్పుము-"ఓ! మహాబాహూ! ఈ పట్టణము, నా ఈరాజ్యమూ నీకు కూడ సంబంధించినవే. ఏ బాధలూ లేని రాజ్యమును అనుభవింపుము. నా రాజ్యము, ధనమూ కూడ నీతో నేను పంచుకొనవలసిన పనిలేదు. ఇవి మనమిద్దరము కలసి అనుభవించవలసినవి." 32, 33

మూ. ఏవముక్త్వా ధనాధ్యక్షో జగామ పితురన్తికమ్,
అభివాద్య గురుం ప్రాహ రావణస్య యదీప్సితమ్. 34

ప్ర. అ. ధనాధ్యక్షః=కుబేరుడు, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, పితుః= తండ్రియొక్క, అన్తికమ్ = సమీపమును గూర్చి, జగామ = వెళ్ళెను. గురుమ్ = తండ్రిని, అభివాద్య = నమస్కరించి, రావణస్య = రావణునియొక్క, యత్=ఏ, ఈప్సితమ్ = కోరిక గలదో దానిని, ప్రాహ = చెప్పెను.

తా. కుబేరుడు ఇట్లు పలికి తండ్రి దగ్గరకు వెళ్ళి ఆయనకు అభివాదనము చేసి, రావణుని మనస్సులోని కోరికను చెప్పెను. 34

మూ. ఏష తాత దశగ్రీవో దూతం ప్రేషితవాన్మమ
దీయతాం నగరీ లఙ్కా పూర్వం రక్షోగణోషితా, 35
మయాత్ర యదనుష్ఠేయం తన్మమాచక్ష్వ సువ్రత

ప్ర. అ. తాత = తండ్రీ ! ఏషః = ఈ, దశగ్రీవః=దశగ్రీవుడు, మమ=

నాకు, దూతమ్ = దూతను, ప్రేషితవాన్ = పంపినాడు, పూర్వమ్ = పూర్వము, రక్షోగణోషితా = రాక్షసులగణములచేత నివసించబడిన, లఙ్కా నగరీ = లంకా నగరము, దీయతామ్ = ఇవ్వబడుగాక, సువ్రత = మంచి నియమములు కలవాడా, అత్ర = ఈ విషయమునందు, మయా = నాచేత, యత్ = ఏది, అనుష్ఠేయమ్ = చేయదగినదో, తత్ = దానిని, మమ = నాకు, ఆచక్ష్వ = చెప్పుము.

తా. తండ్రీ ! ఈ దశగ్రీవుడు - "పూర్వము రాక్షసులు నివసించిన లంకను నాకు ఇచ్చివేయుము"అని కోరుచు నావద్దకు దూతను పంపినాడు. గొప్ప నియమము గలవాడా ! ఈ విషయమున నేనేమి చేయవలెనో చెప్పుము. 35

మూ. బ్రహ్మర్షిస్త్వేవముక్తోఽసౌ విశ్రవా మునిపుఙ్గవః, 36
ప్రాఞ్జలిం ధనదం ప్రాహ శృణు పుత్ర వచో మమ.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, బ్రహ్మర్షిః = బ్రహ్మర్షియైన, అసౌ = ఈ, మునిపుఙ్గవః = మునిశ్రేష్ఠుడైన, విశ్రవాః = విశ్రవసుడు, ప్రాఞ్జలిమ్ = కట్టబడిన దోసిలి గల, ధనదమ్ = కుబేరుణ్ణి గూర్చి, ప్రాహ = పలికెను, పుత్ర = పుత్రా ! మమ = నాయొక్క, వచః = వచనమును, శృణు = వినుము.

తా. మునిశ్రేష్ఠుడు, బ్రహ్మర్షి అయిన ఆ విశ్రవసుడు ఆ మాటలు విని, తన ఎదుట అంజలి ఘటించి నిలచి ఉన్న కుబేరునితో ఇట్లు పలికెను. "కుమారా! నేను చెప్పుచున్న మాట వినుము " 36

మూ. దశగ్రీవో మహాబాహురుక్తవాన్ మమ సంనిధౌ, 37
మయా నిర్భర్త్సితశ్చాసీద్ బహుశోక్తః సుదుర్మతిః.

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, దశగ్రీవః = దశగ్రీవుడు. మమ = నాయొక్క, సంనిధౌ = సంనిధియందు, ఉక్తవాన్ = చెప్పి ఉన్నాడు, సుదుర్మతిః = చాల చెడ్డ బుద్ధి గల అతడు, మయా = నాచేత, నిర్భర్త్సితః = భయ పెట్టబడినవాడై, బహుశః = అనేకవిధములుగా, ఉక్తః = చెప్పబడినవాడు, ఆసీత్ = ఆయెను.

తా. మహాబాహువైన ఆ దశగ్రీవుడు ఈ విషయమును నాదగ్గరకూడ చెప్పినాడు. నేను చాల దుష్టబుద్ధి గల వానిని మందలించి అనేకవిధాల చెప్పితిని. 37

మూ. సక్రోధేన మయా చోక్తో ధ్వంససే చ పునః పునః, 38
శ్రేయోభియుక్తం ధర్మ్యం చ శృణు పుత్ర వచో మమ.

ప్ర. అ. సక్రోధేన = కోపముతో కూడిన, మయా = నాచేత, ధ్వంససే = నశించుచున్నావు అని, పునః పునః = మాటిమాటికి, ఉక్తః = పలకబడినాడు, పుత్ర = పుత్రా ! శ్రేయోభియుక్తమ్ = శ్రేయస్సుతో కూడినది, ధర్మ్యం చ = ధర్మసంమతమూ అయిన, మమ = నాయొక్క, వచః = వచనమును, శృణు = వినుము.

తా. నేను కోపముతో - "ఇట్లు చేసినచో నీవు నశించెదవు"అని అనేక పర్యాయములు చెప్పినాను. కుమారా ! శ్రేయస్కరము, ధర్మసంమతమూ అయిన నేను చెప్పుచున్న మాట వినుము. 38

మూ. వరప్రదానసంమూఢో మాన్యామాన్యం సుదుర్మతిః, 39
న వేత్తి మమ శాపాచ్చ ప్రకృతిం దారుణాం గతః.

ప్ర. అ. వరప్రదానసంమూఢః = వరప్రదానముచేత మిక్కిలి మూఢుడై, మమ = నాయొక్క, శాపాత్ = శాపమువలన, దారుణామ్ = దారుణమైన, ప్రకృతిం చ = స్వభావమును కూడ, గతః = పొందిన, సుదుర్మతిః = మిక్కిలి దుర్మతి అయిన ఆ దశగ్రీవుడు, మాన్యామాన్యమ్ = గౌరవింపదగినదా (వా) నిని గూర్చి, గౌరవింపదగనిదా(వా)నినిగూర్చి, న వేత్తి = ఎరుగడు.

తా. వరప్రదానముచేత ఏమీ తెలియని స్థితిలో ఉన్న, చాల దుర్మతియైన ఆ రావణుడు నా శాపముచేత కూడ దారుణమైన స్వభావమును పొందినాడు. వాని కేమీ మంచిచెడ్డలు తెలియుటలేదు. 39

మూ. తస్మాద్గచ్ఛ మహాబాహో కైలాసం ధరణీధరమ్, 40
నివేశయ నివాసార్థం త్యక్త్వా లఙ్కాం సహానుగః.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా ! తస్మాత్ = ఆ కారణమువలన, లఙ్కామ్ = లంకను, త్యక్త్వా = విడచి, సహానుగః = అనుచరు

లతో కూడినవాడవై, కైలాసం ధరణీధరమ్ = కైలాసపర్వతమును గూర్చి, గచ్ఛ = వెళ్ళుము. నివాసార్థమ్ = నీనివాసముకొరకు, నివేశయ = పురమును ఏర్పరచుకొనుము.

తా. కుబేరా! అందుచేత నీవు లంకను విడచి, నీ అనుచరులతో కూడ కలిసి కైలాసపర్వతమునకు వెళ్ళి అక్కడ నివాసార్థమై నగరము ఏర్పరచుకొనుము. 40

మూ. తత్ర మన్దాకినీ రమ్యా నదీనాముత్తమా నదీ, 41
కాఞ్చనైః సూర్యసంకాశైః పఙ్కజైః సంవృతోదకా
కుముదైరుత్పలైశ్చైవ అన్యైశ్చైవ సుగన్ధిభిః. 42

ప్ర. అ. తత్ర = అక్కడ, కాఞ్చనైః = బంగారమువికారమైన, సూర్యసంకాశైః = సూర్యునితో సమానములైన, పఙ్కజైః = పద్మములతోను, కుముదైః = తెల్లకలవలతోను, ఉత్పలైశ్చైవ = నల్లకలవలతోను, సుగన్ధిభిః = మంచి సువాసన గల, అన్యైశ్చైవ = ఇతరపుష్పములతోను, సంవృతోదకా = కూడిన ఉదకము గలది, నదీనామ్ = నదులలో, ఉత్తమా = ఉత్తమమైన, నదీ = నదీ అయిన, రమ్యా = సుందరమైన, మన్దాకినీ = మందాకినీ నది, ఉన్నది.

తా. ఆ కైలాసప్రాంతమునందు నదులలో ఉత్తమమైన మందాకినీనది ఉన్నది. దాని జలము సూర్యునితో సమానములైన బంగారు పద్మములతోను, తెల్ల కలవలతోను, నల్ల కలవలతోను, సుగంధము గల ఇతరపుష్పములతోను నిండి ఉండును. 41, 42

మూ. తత్ర దేవాః సగన్ధర్వాః సాప్సరోరగకింనరాః,
విహారశీలాః సతతం రమన్తే సర్వదాశ్రితాః. 43

ప్ర. అ. సతతమ్ = ఎల్లప్పుడూ, విహారశీలాః = విహరించే స్వభావము గల, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, సాప్సరోగణకింనరాః = అప్సరఃస్త్రీగణములతోను, ఉరగులతోను, కింనరులతోను కూడిన, దేవాః = దేవతలు, సర్వదా = ఎల్లప్పుడు, తత్ర = అక్కడ, శ్రితాః = ఆశ్రయించినవారై; రమన్తే = క్రీడించుచుందురు.

తా. ఎల్లప్పుడూ విహరించే స్వభావము గల దేవతలు, గంధర్వులు, అప్సరఃస్త్రీలు, ఉరగులు, కింనరులు, సర్వదా ఆ ప్రాంతమునందు నివసించుచు క్రీడించుచుందురు. 43

మూ. న హి క్షమం తవానేన వైరం ధనద రక్షసా,
జానీషే హి యథానేన లబ్ధః పరమకో వరః. 44

ప్ర. అ. ధనద = కుబేరా ! తవ = నీకు, అనేన రక్షసా = ఈ రాక్షసునితో, వైరమ్ = వైరము, క్షమమ్ = యుక్తము, న హి = కాదు కదా ? అనేన = వీనిచేత, పరమకః = గొప్పదైన, వరః = వరము, యథా = ఎట్లు, లబ్ధః = పొందబడినదో, జానీషే హి = ఎరుగుదువు కదా ?

తా. కుబేరా ! నీవు ఈ రాక్షసునితో వైరము పెట్టుకొనుట మంచిది కాదు. ఇతడు గొప్ప వరమును సంపాదించిన విషయము నీకు తెలియును కదా ? 44

మూ. ఏవముక్తో గృహీత్వా తు తద్వచః పితృగౌరవాత్, 45
సదారపుత్రః సామాత్యః సవాహనధనో గతః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన కుబేరుడు, తత్ = ఆ, వచః = వచనమును, పితృగౌరవాత్ = తండ్రియందలి గౌరవముచేత, గృహీత్వా = గ్రహించి, సదారపుత్రః = భార్యాపుత్రులతో కూడినవాడై, సామాత్యః = మంత్రులతో కూడినవాడై, సవాహనధనః = వాహనములతోను, ధనములతోను కూడినవాడై, గతః = వెళ్ళిపోయినాడు.

తా. కుబేరుడు ఆ మాటలను తండ్రియందు ఉన్న గౌరవముచే అంగీకరించి, భార్యాపుత్రులతోను, అమాత్యులతోను కలిసి, వాహనములు, ధనములు వెంట తీసికొని వెళ్ళిపోయెను. 45

మూ. ప్రహస్తోఽథ దశగ్రీవం గత్వా వచనమబ్రవీత్,
ప్రహృష్టాత్మా మహాత్మానం సహామాత్యం సహానుజమ్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ప్రహస్తః = ప్రహస్తుడు, ప్రహృష్టాత్మా = సంతోషించిన మనస్సు గలవాడై, సహామాత్యమ్ = అమాత్యులతో కూడిన, సహానుజమ్ = తమ్ములతో కూడిన, మహాత్మానమ్ = మహాత్ముడైన, దశగ్రీవమ్ =

దశగ్రీవుణ్ణి గూర్చి, గత్వా = వెళ్ళి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట ప్రహస్తుడు మనస్సులో సంతోషించుచు, మంత్రులతోను, తమ్ములతోను కూడి ఉన్న మహాత్ముడైన దశగ్రీవుని వద్దకు వెళ్ళి ఇట్లు పలికెను.

మూ. శూన్యా సా నగరీ లఙ్కా త్యక్త్వైనాం ధనదో గతః,
ప్రవిశ్యతాం సహాస్మాభిః స్వధర్మం తత్ర పాలయ. 47

ప్ర. అ. సా = ఆ, లఙ్కానగరీ = లంకానగరము, శూన్యా = శూన్యమైనది. ధనదః = కుబేరుడు, ఏనామ్ = దీనిని, త్యక్త్వా = విడచి, గతః = వెళ్ళినాడు. అస్మాభిఃసహ = మాతో కూడ, తామ్ = ఆ లంకానగరమును, ప్రవిశ్య= ప్రవేశించి, తత్ర=అక్కడ, స్వధర్మమ్=స్వధర్మమును, పాలయ=పాలింపుము.

తా. లంకానగరము శూన్యముగా ఉన్నది. కుబేరుడు దానిని విడచి వెళ్ళిపోయినాడు. నీవు మాతో కలిసి దానిలో ప్రవేశించి అక్కడ నీ స్వధర్మమును పాలింపుము. 47

మూ. ఏవముక్తో దశగ్రీవః ప్రహస్తేన మహాబలః,
వివేశ నగరీం లఙ్కాం భ్రాతృభిః సబలానుగైః 48

ప్ర. అ. ప్రహస్తేన = ప్రహస్తునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః=పలుకబడిన, మహాబలః = గొప్ప బలము గల, దశగ్రీవః = దశగ్రీవుడు, సబలానుగైః=సైన్యములతోను, అనుచరులతోను కూడిన, భ్రాతృభిః = సోదరులతో, లఙ్కాం నగరీమ్ = లంకానగరమును, వివేశ = ప్రవేశించెను.

తా. మహాబలశాలియైన దశగ్రీవుడు ప్రహస్తుని మాటలు విని సోదరులతోను, సైన్యములతోను, అనుచరులతోను కలిసి లంకానగరములో ప్రవేశించెను.

మూ. ధనదేన పరిత్యక్తాం సువిభక్తమహాపథామ్,
ఆరురోహ స దేవారిః స్వర్గం దేవాధిపో యథా 49

ప్ర. అ. దేవారిః=దేవతల శత్రువైన, సః=అతడు, ధనదేన = కుబేరుని చేత, పరిత్యక్తామ్ = విడవబడిన, సువిభక్తమహాపథామ్ = బాగుగా విభజింవ

బడిన విశాలమార్గములు గల ఆ లంకను, దేవాధిపః = దేవేంద్రుడు, స్వర్గం యథా = స్వర్గమును వలె, ఆరురోహ = ఎక్కెను.

తా. దేవతల శత్రువైన ఆ రావణుడు కుబేరుడు విడిచిపెట్టివేసిన, బాగుగా విభజింపబడిన విశాలమార్గములు గల ఆ లంకలో, దేవేంద్రుడు స్వర్గములో ప్రవేశించినట్లు ప్రవేశించెను. 48

మూ. స చాభిషిక్తః క్షణదాచరైస్తదా,
నివేశయామాస పురీం దశాననః.
నికామపూర్ణా చ బభూవ సా పురీ,
నిశాచరైర్నీలబలాహకోపమైః. 50

ప్ర. అ. తదా = అప్పుడు, క్షణదాచరైః = రాక్షసులచేత, అభిషిక్తః = అభిషేకింపబడిన, సః దశాననః = ఆ రావణుడు, పురీమ్ = లంకను, నివేశయామాస = నివాసముగా చేసికొనెను. సా పురీ = ఆ పట్టణము, నీలబలాహకోపమైః = నల్లని మేఘములవంటి, నిశాచరైః = రాక్షసులతో, నికామపూర్ణా = చాలా నిండినది, బభూవ = ఆయెను.

తా. అప్పుడా దశాననుడు రాక్షసులచేత రాజ్యమునందు అభిషిక్తుడై ఆ నగరమును నివాసముగా ఏర్పరచుకొనెను. ఆ నగరము నల్లని మేఘముల వలె ఉన్న రాక్షసులతో పూర్తిగా నిండిపోయెను. 50

మూ. ధనేశ్వరస్త్వథ పితృవాక్యగౌరవా,
న్న్యవేశయచ్ఛశివిమలే గిరౌ పురీమ్.
స్వలంకృతైర్భవనవరైర్విభూషితాం,
పురందరః స్వరివ యథామరావతీమ్. 51

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకాదశః సర్గః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ధనేశ్వరస్తు = కుబేరుడైతే, పితృవాక్య గౌరవాత్ = తండ్రి మాటమీద గౌరవమువలన, శశివిమలే = చంద్రుడు వలె నిర్మలమైన, గిరౌ = కైలాసపర్వతముమీద, స్వలంకృతైః = బాగా అలకరించ

బడిన, భవనవరైః = శ్రేష్ఠములైన భవనముల చేత, విభూషితామ్ = అలంకరింప బడిన, పురీమ్ = పురమును, పురందరః = దేవేంద్రుడు, స్వరివ = స్వర్గమునందు వలె, అమరావతీం యథా = అమరావతిని వలె, న్యవేశయత్ = నెలకొల్పెను.

తా. అప్పుడు కుబేరుడు తండ్రి మాటలపై గౌరవముచేత, చంద్రుడు వలె తెల్లగా నున్న కైలాసపర్వతముమీద, దేవేంద్రుడు స్వర్గమునందు అమరావతిని నిర్మించినట్లు, బాగా అలంకరింపబడిన శ్రేష్ఠములైన భవనాలతో ప్రకాశించుచున్న నగరమును నిర్మించుకొనెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో పదకొండవ సర్గ సమాప్తము.

అథ ద్వాదశః సర్గః

[*శూర్పణఖ వివాహము; రావణాదుల వివాహములు, ఇంద్రజిత్తు పుట్టుట.*]

మూ. రాక్షసేన్ద్రోఽభిషిక్తస్తు భ్రాతృభ్యాం సహితస్తదా,
తతః ప్రదానం రాక్షస్యాః భగిన్యాః సమచిన్తయత్. 1

ప్ర అ. తదా = అప్పుడు, అభిషిక్తః = అభిషేకింపబడిన, రాక్షసేన్ద్రః = రావణుడు, తతః = అటుపిమ్మట, భ్రాతృభ్యామ్ = సోదరులతో, సహితః = కూడినవాడై, భగిన్యాః = సోదరియైన, రాక్షస్యాః = రాక్షసియొక్క, ప్రదానమ్= దానమును గూర్చి, సమచిన్తయత్ = ఆలోచించెను

తా. రాజ్యాభిషిక్తుడైన రావణుడు సోదరులతో కలిసి సోదరియైన శూర్పణఖ వివాహమును గూర్చి ఆలోచించెను. 1

మూ. స్వసారం కాలకేయాయ దానవేన్ద్రాయ రాక్షసీమ్,
దదౌ శూర్పణఖాం నామ విద్యుజ్జిహ్వాయ రాక్షసః. 2

ప్ర. అ. రాక్షసః = రావణుడు, రాక్షసీమ్ = రాక్షసియైన, శూర్పణఖాం నామ = శూర్పణఖ అను ప్రసిద్ధి గల, స్వసారమ్ = సోదరిని, కాలకేయాయ = కాలకుని పుత్రుడైన, దానవేన్ద్రాయ = దానవప్రభువైన, విద్యుజ్జిహ్వాయ = విద్యుజ్జిహ్వునకు, దదౌ = ఇచ్చెను.

తా. రావణుడు సోదరియైన శూర్పణఖను కాలకుని పుత్రుడైన, దానవ నాయకుడైన విద్యుజ్జిహ్వునకు ఇచ్చి వివాహము చేసెను. 2

మూ. అథ దత్త్వా స్వయం రక్షో మృగయామటతే స్మ తత్,
తత్రాపశ్యత్తతో రామ మయం నామ దితేః సుతమ్. 3

ప్ర. అ. రామ = రామా ! దత్త్వా = ఇచ్చి, తత్ = ఆ, రక్షః = రాక్షసుడు, అథ = అటుపిమ్మట, స్వయమ్ = తాను, మృగయామ్ = వేటను, అటతే స్మ = తిరుగుచుండెను. తతః = అటుపిమ్మట, తత్ర = అక్కడ, దితేః = దితియొక్క, సుతమ్ = కుమారుడైన, మయం నామ = మయు డనేవానిని, అపశ్యత్ = చూచెను.

తా. రామా ! ఆ రావణుడు శూర్పణఖకు వివాహము చేసిన పిమ్మట వేటకై వెళ్ళగా అక్కడ అతనికి దితి కుమారుడైన మయుడు కనబడెను. 3

మూ. కన్యాసహాయం తం దృష్ట్వా దశగ్రీవో నిశాచరః,
అపృచ్ఛత్కో భవానేకో నిర్మనుష్యమృగే వనే, 4
అనయా మృగశాబాక్ష్యా కిమర్థం సహ తిష్ఠసి.

ప్ర. అ. నిశాచరః = రాక్షసుడైన, దశగ్రీవః = రావణుడు, కన్యాసహాయమ్ = కన్యతో కూడిన, తమ్ = అతనిని, దృష్ట్వా = చూచి, అపృచ్ఛత్ = అడిగెను. భవాన్ = నీవు, కః = ఎవడవు ? నిర్మనుష్యమృగే = మనుష్యలూ మృగములూ లేని, వనే = వనమునందు, ఏకః = ఒంటరివాడవై, మృగశాబాక్ష్యా = లేడిపిల్ల కన్నుం వంటి కన్నులు గల, అనయా సహ = ఈమెతో కూడ, కిమర్థమ్ = ఎందువలన, తిష్ఠసి = ఉంటున్నావు ?

తా. రావణుడు కన్యతో కూడిన అతనిని చూచి- "నీవు ఎవ్వరవు ? మనుష్యలు గాని, మృగములు గాని లేని ఈ వనములో లేడికన్నులవంటి కన్నులు గల ఈమెతో ఒంటరిగా ఎందుకు ఉన్నావు ?" అని ప్రశ్నించెను. 4

మూ. మయ స్తదాబ్రవీద్రామ పృచ్ఛన్తం తం నిశాచరమ్, 5
శ్రూయతాం సర్వమాఖ్యాస్యే యథావృత్తమిదం తవ.

ప్ర. అ. రామ = రామా ! తదా = అప్పుడు, పృచ్ఛన్తమ్ = ప్రశ్నించుచున్న, తం నిశాచరమ్ = ఆ రాక్షసునిగూర్చి, మయః = మయుడు, అబ్రవీత్ = పలికెను. ఇదమ్ = ఇది, యథా = ఎట్లు, వృత్తమ్ = జరిగినదో, సర్వమ్ = అంతనూ, తవ = నీకు, ఆఖ్యాస్యే = చెప్పెదను; శ్రూయతామ్ = వినబడుగాక.

తా. రామా ! అప్పుడు ఆ విధముగా ప్రశ్నించుచున్న రావణునితో

మయుడు ఇట్లు పలికెను. ఇది ఎట్లు జరిగినదో దానిని అంతనూ నీకు చెప్పెదను: వినుము. 5.

మూ. హేమా నామాప్సరాస్తాత శ్రుతపూర్వా యది త్వయా, 6
దైవతైర్మమ సా దత్తా పౌలోమీవ శతక్రతోః.

ప్ర. అ. తాత = నాయనా! హేమా నామ = హేమ అను, అప్సరాః = అప్సరఃస్త్రీ, త్వయా = నీచేత, శ్రుతపూర్వా యది = పూర్వము వినబడి ఉండవచ్చును. సా = ఆమె, శతక్రతోః = దేవేంద్రునకు, పౌలోమీవ = శచీదేవి వలె, మమ = నాకు, దైవతైః = దేవతలచేత, దత్తా = ఇవ్వబడినది.

తా. నాయనా! హేమ అను అప్సరఃస్త్రీ ఉన్నది. నీవు వినిఉండవచ్చును. దేవతలు ఆమెను నాకు, దేవేంద్రునకు శచీదేవిని ఇచ్చినట్లు ఇచ్చినారు. 6

మూ. తస్యాం స క్తమనా హ్యాసం దశవర్షశతాన్యహమ్, 7
సా చ దైవతకార్యేణ త్రయోదశసమా గతాః,
వర్షం చతుర్దశం చైవ తతో హేమమయం పురమ్, 8
వజ్రవైదూర్యచిత్రం చ మాయయా నిర్మితం మయా.

ప్ర. అ. అహమ్ = నేను, దశ = పది, వర్షసహస్రాణి = సంవత్సరముల సహస్రములను, తస్యామ్ = ఆమెయందు, స క్తమనాః = లగ్నమైన మనస్సు కలవాడను, ఆసమ్ = అయితిని. సా చ = ఆమె, దైవతకార్యేణ = దేవతల కార్యముచేత, వెళ్ళినది. త్రయోదశ = పదమూడు, సమాః = సంవత్సరములు, గతాః = గడచినవి. చతుర్దశమ్ = పదునాల్గవ, వర్షం చ = సంవత్సరము కూడ, గడచి పోయినది. తతః = అటుపిమ్మట, మయా = నాచేత, మాయయా = మాయచేత, హేమమయమ్ = బంగారము వికారమైన, వజ్రవైదూర్యచిత్రం చ = వజ్రములతోను వైదూర్యములతోను చిత్రమైన, పురమ్ = పట్టణము, నిర్మితమ్ = నిర్మించబడినది.

తా. నేను పది వేల సంవత్సరముల కాలము ఆమెయందు లగ్నమైన మనస్సుతో గడిపితిని. ఆమె దేవతల పనిమీద వెళ్ళినది. పదమూడు సంవత్సరములు గడచినవి. పదునాల్గవ సంవత్సరము కూడ గడచిపోయినది. అప్పుడు

నేను వజ్రవైడూర్యములచేత చిత్రమైన బంగారు నగరమును మాయాశక్తిచేత నిర్మించితిని. 7, 8

మూ. తత్రాహమవసం దీనస్తయా హీనః సుదుఃఖితః, 9
తస్మాత్పురాద్దుహితరం గృహీత్వా వనమాగతః.

ప్ర. అ. తయా = ఆ హేమతో, హీనః = శూన్యుడనైన, అహమ్ = నేను, సుదుఃఖితః = మిక్కిలి దుఃఖితుడనై, దీనః = దీనుడనై, తత్ర = అక్కడ, అవసమ్ = నివసించితిని. తస్మాత్ = ఆ, పురాత్ = పట్టణమునుండి, దుహితరమ్ = కుమార్తెను, గృహీత్వా = గ్రహించి, వనమ్ = వనమునుగూర్చి, ఆగతః = వచ్చితిని.

తా. ఆ హేమ దగ్గర లేకపోవుటచేత చాల దుఃఖించుచు, దీనుడనై ఆ నగరమునందు నివసించితిని. ఈ కుమార్తెను తీసికొని ఆ పట్టణమునుండి వనమునకు వచ్చితిని. 9

మూ. ఇయం మమాత్మజా రాజంస్తస్యాః కుక్షౌ వివర్ధితా, 10
భర్తారమనయా సార్ధమస్యాః ప్రాప్తోఽస్మి మార్గితుమ్.

ప్ర. అ. రాజన్ = రాజా, ఇయమ్ = ఈమె, తస్యాః = ఆ హేమయొక్క, కుక్షౌ = కుక్షియందు, వివర్ధితా = పెంచబడిన, మమ = నాయొక్క, ఆత్మజా = కుమార్తె. అస్యాః = ఈమెకు, భర్తారమ్ = భర్తను, మార్గితుమ్ = వెదకుటకు, అనయా సార్ధమ్ = ఈమెతోకూడ, ప్రాప్తః అస్మి = వచ్చి ఉన్నాను.

తా. ఆహేమకు కుక్షిలో పెరిగిన ఈమె నా కుమార్తె. ఈమెకు భర్తను వెదకుచు ఈమెను కూడా తీసికొని వచ్చినాను. 10

మూ. కన్యాపితృత్వం దుఃఖం హి సర్వేషాం మానకాఙ్క్షిణామ్,
కన్యా హి ద్వే కులే నిత్యం సంశయే స్థాప్య తిష్ఠతి. 11

ప్ర. అ. మానకాఙ్క్షిణామ్ = గౌరవమును కోరు, సర్వేషామ్ = అందరికీ, కన్యాపితృత్వమ్ = కన్యకు తండ్రి అగుట, దుఃఖం హి = దుఃఖహేతువు కదా? కన్యా = కన్య, నిత్యమ్ = ఎల్లప్పుడూ, ద్వే కులే = రెండు కులములను, సంశయే = సంశయమునందు, స్థాప్య = ఉంచి, తిష్ఠతి = ఉండును.

తా. గౌరవమును కోరు ప్రతివారికీ కన్యకు తండ్రి అయి ఉండుట దుఃఖానికి కారణము కదా? కన్య తలితండ్రుల రెండు వంశాలను, నిత్యము సంశయ స్థితిలో ఉంచును కదా? 11

మూ. పుత్రద్వయం మమాప్యస్యాం భార్యాయాం సంబభూవ హ,
మాయావీ ప్రథమస్తాత దున్దుభి స్తదన న్తరః. 12

ప్ర. అ. మమ = నాకు, అస్యాం భార్యాయామ్ = ఈ భార్యయందు, పుత్రద్వయమ్=పుత్రులద్వయము, సంబభూవ హ = పుట్టెను. తాత=నాయనా! మాయావీ = మాయావి, ప్రథమః = మొదటివాడు. తదన న్తరః = వానితరవాతవాడు, దున్దుభిః = దుందుభి.

తా. నాకు ఈ భార్యయందు ఇద్దరు పుత్రులు పుట్టినారు. మాయావి మొదటివాడు, రెండవవాడు దుందుభి. 12

మూ. ఏవం తే సర్వమాఖ్యాతం యాథాతథ్యేన పృచ్ఛతః, 13
త్వమిదానీం కథం తాత జానీయాం కో భవానితి.

ప్ర. అ. పృచ్ఛతః=అడుగుచున్న, తే = నీకు, ఏవమ్ = ఇట్లు, సర్వమ్ = సమస్తమూ, యాథాతథ్యేన = యథార్థముగా, ఆఖ్యాతమ్ = చెప్పబడినది. తాత = నాయనా! త్వమ్ = నీవు, కథమ్ = ఎట్లు వచ్చినావు? భవాన్ = నీవు, కః ఇతి = ఎవ్వరవు అని, ఇదానీమ్ = ఇప్పుడు, జానీయామ్ = తెలిసికొందునా?

తా. నీవు ప్రశ్నించినావు గాన నేను ఈ విషయ మంతా యథార్థముగా చెప్పినాను. ఇప్పుడు నీవు ఎవరవో, ఇక్కడికి ఎందుకు వచ్చినావో తెలిసికొనగోరుచున్నాను. 13

మూ. ఏవముక్తం తు తద్రక్షో వినీతమిదమబ్రవీత్, 14
అహం పౌలస్త్యతనయో దశగ్రీవశ్చ నామతః,
మునేర్విశ్రవసో యస్తు తృతీయో బ్రహ్మణోఽభవత్. 15

ప్ర. అ. ఏవమ్=ఇట్లు, ఉక్తమ్=పలకబడిన, తత్ రక్షః=ఆ రాక్షసుడు, వినీతమ్ = వినయముకలవాడై, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

అహమ్ = నేను, పౌలస్త్యతనయః = పౌలస్త్యుని కుమారుడను, నామతః = పేరు వలన, దశగ్రీవశ్చ = దశగ్రీవుడను. యః = ఎవ్వడు, బ్రహ్మణః = బ్రహ్మదేవునినుండి, తృతీయః = మూడవవాడుగా, అభవత్ = ఉండెనో, అట్టి, విశ్రవసః = విశ్రవస్సు అను, మునేః = మునియొక్క కుమారుడను.

తా. ఆ మాటలు విని రావణుడు వినయపూర్వకముగా ఇట్లు పలికెను. "నేను పులస్త్యుని పుత్రుని పుత్రుడను. నా పేరు దశగ్రీవుడు. నా తండ్రియైన విశ్రవస్సు బ్రహ్మనుండి మూడవవాడు." 14, 15

మూ. ఏవముక్తస్తదా రామ రాక్షసేన్ద్రేణ దానవః,
మహర్షేస్తనయం జ్ఞాత్వా మయో హర్షముపాగతః, 16
దాతుం దుహితరం తస్మై రోచయామాస తత్రవై.

ప్ర. అ. రామ = రామా ! రాక్షసేన్ద్రేణ = దశగ్రీవునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, దానవః = దానవుడైన, మయః = మయుడు, మహర్షేః = మహర్షియొక్క, తనయమ్ = పుత్రుడ్నిగా, జ్ఞాత్వా = తెలిసికొని, హర్షమ్ = సంతోషమును, ఉపాగతః = పొందినాడు. తత్ర = అక్కడ, తస్మై = అతనికి, దుహితరమ్ = కుమార్తెను, దాతుమ్ = ఇచ్చుటకు, రోచయామాస = ఇష్టపడెను.

తా. రామా! దశగ్రీవుని మాటలు విని దానవుడైన మయుడు, అతడు మహర్షి కుమారు డని తెలుసుకొని సంతోషించెను. అక్కడనే అతనికి తన కుమార్తెను ఇచ్చుటకు ఇచ్ఛయించెను 16

మూ. కరేణ తు కరం తస్యా గ్రాహయిత్వా మయస్తదా, 17
ప్రహసన్ప్రాహ దైత్యేన్ద్రో రాక్షసేన్ద్రమిదం వచః.

ప్ర. అ. తదా = అప్పుడు, దైత్యేన్ద్రః = దైత్యప్రభువైన, మయః = మయుడు, కరేణ = రావణుని హస్తముచేత. తస్యాః = ఆమెయొక్క, కరమ్ = హస్తమును, గ్రాహయన్ = గ్రహింపచేయుచు, ప్రహసన్ = నవ్వుచు, రాక్షసేన్ద్రమ్ = రాక్షసప్రభువును గూర్చి, ఇదమ్ = ఈ, వచః = వచనమును, ప్రాహ = పలికెను.

తా. అప్పుడు దైత్యేంద్రుడైన మయుడు రావణుని హస్తముచేత తన కుమార్తె హస్తమును గ్రహింపచేసి, నవ్వుచు అతనితో ఇట్లు పలికెను. 17

మూ. ఇయం మమాత్మజా రాజన్ హేమయాప్సరసా ధృతా, 18
కన్యా మన్దోదరీ నామ పత్న్యర్థం ప్రతిగృహ్యతామ్.

ప్ర. అ. రాజన్ = రాజా! ఇయమ్ = ఈ, కన్యా = కన్య, అప్సరసా = అప్సరసయైన, హేమయా = హేమచేత, ధృతా = (గర్భములో) ధరించబడిన, మన్దోదరీ నామ = మందోదరి అను పేరు గల, మమ = నాయొక్క, ఆత్మజా = కుమార్తె. పత్న్యర్థమ్ = భార్య అగుటకొరకు, ప్రతిగృహ్యతామ్ = స్వీకరింపబడుగాక.

తా. రాజా! ఈమె అప్సరసయైన హేమ గర్భమునందు పుట్టిన మందోదరి అను నా కుమార్తెయైన కన్యక. ఈమెను పత్నిగా స్వీకరింపుము. 18

మూ. బాఢమిత్యేవ తం రామ దశగ్రీవోఽభ్యభాషత, 19
ప్రజ్వాల్య తత్ర చైవాగ్నిమకరోత్పాణిసంగ్రహమ్.

ప్ర. అ. రామ = రామా! దశగ్రీవః = దశగ్రీవుడు, తమ్ = అతనిని గూర్చి, బాఢమ్ ఇత్యేవ = తప్పక అట్లే అని, అభ్యభాషత = పలికెను. తత్ర = అక్కడ, అగ్నిమ్ = అగ్నిని, ప్రజ్వాల్య = మండించి, పాణిసంగ్రహమ్ = పాణిగ్రహణమును, అకరోత్ = చేసెను.

తా. రామా! దశగ్రీవుడు మయునితో "తప్పక అట్లే చేసెదను" అని చెప్పి, అక్కడ అగ్నిని ప్రజ్వలింపచేసి ఆమెను వివాహమాడెను. 19

మూ. స హి తస్య మయో రామ శాపాభిజ్ఞస్తపోధనాత్, 20
విదిత్వా తేన సా దత్తా తస్య పైతామహం కులమ్.

ప్ర. అ. రామ = రామా! సః మయః = ఆ మయుడు, తపోధనాత్ = విశ్రవసునుండి, తస్య = ఆ దశగ్రీవునియొక్క, శాపాభిజ్ఞః = శాపమును ఎరిగినవాడు. తేన = అతనిచేత, తస్య = వానియొక్క, పైతామహమ్ = పితామహునకు సంబంధించిన, కులమ్ = కులమును, విదిత్వా = తెలిసికొని, సా = ఆమె, దత్తా = ఇవ్వబడినది.

తా. "ఇతడు దారుణస్వభావుడు కాగలడు" అని విశ్రవసుడు రావణునికి

శాపమిచ్చి నట్లు మయునకు తెలియును. అయినను ఆతని తాత కులమును చూచి కూతురును ఇచ్చెను. 20

మూ. అమోఘాం తస్య శక్తిం చ ప్రదదౌ పరమాద్భుతామ్, 21
పరేణ తపసా లబ్ధాం జఘ్నివాన్ లక్ష్మణం యయా.

ప్ర. అ. తస్య=వానికి, అమోఘామ్=వ్యర్థము కానిదీ, పరమాద్భుతామ్= చాల ఆశ్చర్యకరము, పరేణ = గొప్పదైన, తపసా = తపస్సుచేత, లబ్ధామ్ = పొందబడినది అయిన, శక్తిం చ = శక్తిని కూడ, ప్రదదౌ=ఇచ్చెను. యయా= దేనిచేత, లక్ష్మణమ్ = లక్ష్మణుణ్ణి, జఘ్నివాన్ = కొట్టినాడో.

తా. ఆతనికి వ్యర్థము కానిది, చాల ఆశ్చర్యకరము, గొప్ప తపస్సుచేత పొందబడినదీ అయిన శక్తిని కూడ మయు డిచ్చెను. ఆ శక్తినే రావణుడు లక్ష్మణునిమీద ప్రయోగించినాడు. 21

మూ. ఏవం స కృత్వా దారాన్వై లఙ్కాయా ఈశ్వరః ప్రభుః,
గత్వా తు నగరీం భార్యే భ్రాతృభ్యాం సముపాహరత్.

ప్ర. అ. ప్రభుః = సమర్థుడైన, సః=ఆ, లఙ్కాయాః ఈశ్వరః=లంకాధిపతి, ఏవమ్ = ఇట్లు, దారాన్ కృత్వా = భార్యను చేసికొని, నగరీమ్ = పట్టణమును గూర్చి, గత్వా = వెళ్ళి, భ్రాతృభ్యామ్ = సోదరులకొరకు, భార్యే = భార్యలను, సముపాహరత్ = తీసికొనివచ్చెను.

తా. సమర్థుడైన ఆ రావణుడు తాను ఈ విధముగా వివాహము చేసికొని, నగరమునకు తిరిగి వెళ్ళి సోదరు లిద్దరికి కూడ భార్యలను తీసికొనివచ్చెను. 22

మూ. వైరోచనస్య దౌహిత్రీం వజ్రజ్వాలేతి నామతః, 23
తాం భార్యాం కుమ్భకర్ణస్య రావణః సమకల్పయత్.

ప్ర. అ. రావణః = రావణుడు, నామతః = పేరువలన, వజ్రజ్వాలేతి = వజ్రజ్వాల అను, వైరోచనస్య = వైరోచనుని, తాం దౌహిత్రీమ్ = ఆ దౌహిత్రిని, కుమ్భకర్ణస్య = కుంభకర్ణునియొక్క, భార్యామ్ = భార్యనుగా, సమకల్పయత్ = ఏర్పరచెను.

తా. రావణుడు వైరోచనుని దౌహిత్రి అయిన వజ్రజ్వాల అను కన్యను కుంభకర్ణునకు భార్యనుగా చేసెను.

మూ. గన్ధర్వరాజస్య సుతాం శైలూషస్య మహాత్మనః, 24
సరమాం నామ ధర్మజ్ఞాం లేభే భార్యాం విభీషణః.

ప్ర. అ. విభీషణః = విభీషణుడు, మహాత్మనః = మహాత్ముడైన, గన్ధర్వ రాజస్య = గంధర్వరాజైన, శైలూషస్య = శైలూషునియొక్క, సుతామ్ = కుమార్తె యైన, ధర్మజ్ఞామ్ = ధర్మములు తెలిసిన, సరమాం నామ = సరమ అను కన్యను, భార్యామ్ = భార్యనుగా, లేభే = పొందెను.

తా. విభీషణుడు మహాత్ముడైన గంధర్వరాజైన శైలూషుని కుమార్తెయైన, ధర్మము లన్నీ తెలిసిన సరమను వివాహ మాడెను. 24

మూ. తీరే తు సరసో వై తు సంజజ్ఞే మానసస్య హి, 25
సరస్తదా మానసం తు వవృధే జలదాగమే.

ప్ర. అ. మానసస్య = మానస మను, సరసః = సరస్సుయొక్క, తీరే = తీరమునందు, సంజజ్ఞే వై తు హి = పుట్టెను. తదా = అప్పుడు, జలదాగమే = వర్షాకాలమునందు, మానసం సరః తు = ఆ మానససరస్సు, వవృధే = వృద్ధి పొందెను.

తా. ఆ కన్య మానససరోవరతీరమునందు పుట్టెను. అప్పుడు వర్షాకాలము నందు ఆ మానససరస్సు వృద్ధి పొందెను. 25

మూ. మాత్రా తు తస్యాః కన్యాయాః స్నేహేనాక్రన్దితం వచః,
సరో మా వర్ధయస్వేతి తతః సా సరమాభవత్. 26

ప్ర. అ. తస్యాః కన్యాయాః = ఆ కన్యయొక్క, మాత్రా తు = తల్లిచేత, స్నేహేన = స్నేహముచేత, సరః = ఓ! సరస్సా ! మా వర్ధయస్వ = పెరగకుము, ఇతి = అని, వచః = వచనము, ఆక్రన్దితమ్ = అరవబడినది, తతః = ఆకారణము వలన, సా = ఆ కన్య, సరమా = సరమగా, అభవత్ = ఆయెను.

తా. అప్పుడు ఆ శిశువు తల్లి స్నేహముతో - "ఓ! సరస్సా! పెరగకుము" అని పలికినది, అందువలన ఆ కన్యకు 'సరమ' అను పేరు వచ్చెను.

మూ. ఏవం తే కృతదారా వై రేమిరే తత్ర రాక్షసాః, 27
స్వాం స్వాం భార్యాముపాదాయ గన్ధర్వా ఇవ నన్దనే.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, కృతదారాః = చేయబడిన భార్యలు గల, తే = ఆ, రాక్షసాః = రాక్షసులు, స్వాం స్వామ్ = తన తన, భార్యామ్ = భార్యను, ఉపాదాయ = గ్రహించి, గన్ధర్వాః = గంధర్వులు, నన్దనే ఇవ = నందనమునందు వలె, తత్ర = అక్కడ, రేమిరే = క్రీడించిరి.

తా. ఆ రాక్షసులు ఈ విధముగా వివాహములు చేసికొని, తమ తమ భార్యలతో, గంధర్వులు నందనవనమునందు క్రీడించినట్లు, ఆ లంకలో క్రీడించిరి. 27

మూ. తతో మన్దోదరీ పుత్రం మేఘనాదమజీజనత్, 28
స ఏష ఇన్ద్రజిన్నామ యుష్మాభిరభిధీయతే.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మన్దోదరీ = మండోదరి, మేఘనాదమ్ = మేఘనాదు డను, పుత్రమ్ = పుత్రుణ్ణి, అజీజనత్ = కనెను. సః ఏషః = ఆ ఇతడే, యుష్మాభిః = మీచేత, ఇన్ద్రజిన్నామ = ఇంద్రజిత్తు అను పేరు గల వాడుగా, అభిధీయతే = చెప్పబడుచున్నాడు.

తా. కొంతకాలానికి మండోదరి మేఘనాదు డను పుత్రుణ్ణి కనెను. ఆతనినే మీరందరూ ఇంద్రజిత్తు అని అనుచున్నారు. 28

మూ. జాతమాత్రేణ హి పురా తేన రావణసూనునా, 29
రుదతా సుమహాన్ముక్తో నాదో జలధరోపమః.

ప్ర. అ. పురా = పూర్వము, జాతమాత్రేణ = పుట్టినవాడు మాత్రమే అయిన, రుదతా = ఏడ్చుచున్న, తేన = ఆ. రావణసూనునా = రావణుని కుమారునిచేత, జలధరోపమః = మేఘముతో సమానమైన, సుమహాన్ = చాల గొప్పదైన, నాదః = ధ్వని, ముక్తః = విడవబడినది.

తా. పూర్వము ఆ రావణకుమారుడు పుట్టీ పుట్టగానే ఏడ్చుచు మేఘధ్వని వంటి ధ్వనిని చేసెను. 29

మూ. జడీకృతా చ సా లఙ్కా తస్య నాదేన రాఘవ, 30
పితా తస్యాకరోన్నామ మేఘనాద ఇతి స్వయమ్.

ప్ర. అ. రాఘవ = రామా ! తస్య = వానియొక్క, నాదేన = ధ్వనిచేత, సా లఙ్కా = ఆ లంక, జడీకృతా చ = జడముగా చేయబడినది, పితా = తండ్రి, తస్య = వానియొక్క, నామ = పేరును, మేఘనాదః ఇతి = మేఘనాదుడు అని, స్వయమ్ = స్వయముగా, అకరోత్ = చేసెను.

తా. రామా ! ఆతడు చేసిన ధ్వనికి లంకాపట్టణ మంతా జడమైపోయెను. తండ్రి ఆతనికి "మేఘనాదుడు" అని స్వయముగా నామకరణము చేసెను. 30

మూ. సోఽవర్ధత తదా రామ రావణాన్తఃపురే శుభే, 31
రక్ష్యమాణో వరస్త్రీభిశ్ఛన్నః కాష్ఠైరివానలః,
మాతాపిత్రోర్మహాహర్షం జనయన్ రావణాత్మజః. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్వాదశః సర్గః.

ప్ర. అ. రామ = రామా ! సః రావణాత్మజః = ఆ రావణపుత్రుడు, మాతాపిత్రోః = తలిదండ్రులకు, మహాహర్షమ్ = గొప్ప సంతోషమును, జనయన్ = పుట్టించుచు, వరస్త్రీభిః = ఉత్తమస్త్రీలచేత, రక్ష్యమాణః = రక్షింపబడుచు, కాష్ఠైః = కర్రలచేత, ఛన్నః = కప్పబడిన, అనలః ఇవ = అగ్ని వలె, తదా = అప్పుడు, శుభే = సుందరమైన, రావణాన్తఃపురే = రావణుని అంతఃపురమునందు, అవర్ధత = పెరిగెను.

తా. రామా ! అప్పుడా రావణపుత్రుడైన మేఘనాదుడు, తలిదండ్రులకు సంతోషము కలిగించుచు, ఉత్తమలైన స్త్రీల సంరక్షణమునందు, కర్రలు కప్పిన నిప్పు వలె, రమ్యమైన రావణాంతఃపురములో పెరిగెను.

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో పండ్రెండవ సర్గ సమాప్తము.

అథ త్రయోదశః సర్గః

[*రావణుడు నిర్మింపచేసిన శయనగృహములో కుంభకర్ణుడు శయనించుట. రావణుని దురాగతాలు. కుబేరుడు దూతను పంపి అతనికి ఉపదేశించుట. రావణుడు ఆ దూతను చంపివేయుట.*]

మూ. అథ లోకేశ్వరోత్సృష్టా తత్ర కాలేన కేన చిత్,
నిద్రా సమభవత్ తీవ్రా కుమ్భకర్ణస్య రూపిణీ. 1

ప్ర. అ. అథ = అటుపిమ్మట, కేనచిత్ = ఒకానొక, కాలేన = కాలము చేత, లోకేశ్వరోత్సృష్టా = లోకాధిపతియైన బ్రహ్మదేవునిచేత పంపబడిన, రూపిణీ = ఆవులింతలు మొదలైన రూపము గల, తీవ్రా = తీవ్రమైన, నిద్రా = నిద్ర, తత్ర = అక్కడ, కుమ్భకర్ణస్య = కుంభకర్ణునకు, సమభవత్ = ఆయెను (వచ్చెను).

తా. పిమ్మట కొంత కాలానికి బ్రహ్మదేవుడు పంపిన తీవ్రమైన నిద్ర ఆవులింతలు మొదలైన రూపములతో వచ్చి కుంభకర్ణుని ఆవహించెను. 1

మూ. తతో భ్రాతరమాసీనం కుమ్భకర్ణోఽబ్రవీద్వచః,
నిద్రా మాం బాధతే రాజన్కారయస్వ మమాలయమ్. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కుమ్భకర్ణః = కుంభకర్ణుడు, ఆసీనమ్ = కూర్చున్న, భ్రాతరమ్ = సోదరుణ్ణి గూర్చి, వచః = వచనమును, అబ్రవీత్ = పలికెను. రాజన్ = రాజా, నిద్రా = నిద్ర, మామ్ = నన్ను, బాధతే = బాధించు చున్నది, మమ = నాకు, ఆలయమ్ = నివాసమును, కారయస్వ = చేయించుము.

తా. పిమ్మట కుంభకర్ణుడు కూర్చొని ఉన్న సోదరునితో - "రాజా! నన్ను నిద్ర బాధించుచున్నది. నాకు గృహమును నిర్మింపచేయుము" అనెను. 2

మూ. వినియుక్తాస్తతో రాజ్ఞా శిల్పినో విశ్వకర్మవత్,
విస్తీర్ణం యోజనం స్నిగ్ధం తతో ద్విగుణమాయతమ్, 3
దర్శనీయం నిరాబాధం కుమ్భకర్ణస్య చక్రిరే.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాజ్ఞా = రాజుచేత, వినియుక్తాః = ఆజ్ఞాపింపబడిన, శిల్పినః = శిల్పులు, విశ్వకర్మవత్ = విశ్వకర్మ వలె, యోజనమ్ = యోజనము, విస్తీర్ణమ్ = విస్తృతమైనది, తతః = దానికంటె, ద్విగుణమ్ = రెండు రెట్లు, ఆయతమ్ = పొడవైనది, స్నిగ్ధమ్ = సుందరము, దర్శనీయమ్ = చూడదగినది, నిరాబాధమ్ = ఇరుకు లేనిది అయిన గృహమును, కుమ్భకర్ణస్య = కుంభకర్ణునకు, చక్రిరే = చేసిరి.

తా. అప్పుడు రావణుడు ఆజ్ఞాపించగా విశ్వకర్మ వంటి శిల్పులు ఒక యోజనము (ఎనిమిది లేదా పది మైళ్ళు) వెడల్పు, దానికి రెండు రెట్లు (మూడు యోజనములు) పొడవు ఉన్న, చూచుటకు అందముగా ఉన్న విశాలమైన గృహమును కుంభకర్ణునకై నిర్మించిరి. 2, 3

మూ. స్ఫాటికైః కాఞ్చనైశ్చిత్రైః స్తమ్భైః సర్వత్ర శోభితమ్,
వైడూర్యకృతసోపానం కిఙ్కిణీజాలకం తథా,
దాన్తతోరణవిన్యస్తం వజ్రస్ఫటికవేదికమ్, 5
మనోహరం సర్వసుఖం కారయామాస రాక్షసః.

ప్ర. అ. రాక్షసః = రావణుడు, స్ఫాటికైః = స్ఫటికవికారమైన, కాఞ్చనైః = బంగారువికారమైన, చిత్రైః = చిత్రములైన, స్తమ్భైః = స్తంభములతో, సర్వత్ర = అంతటా, శోభితమ్ = శోభింపచేయబడినది, వైడూర్యకృతసోపానమ్ = వైడూర్యమాణిక్యములతో చేయబడిన మెట్లు కలది, తథా = మరియు, కిఙ్కిణీజాలకమ్ = చిరుగంటల సముదాయము గలది, దాన్తతోరణవిన్యస్తమ్ = దంతవికారమైన ముఖద్వారవిన్యాసముగలది, వజ్రస్ఫటికవేదికమ్ = వజ్రవికారమైన, స్ఫటికమణిమయమైన అరుగులు గలది అయిన, మనోహరమ్ = అందముగా ఉన్న, సర్వసుఖమ్ = అన్ని సుఖములూ గల గృహమును, కారయామాస = చేయించెను.

తా. రావణుడు నిర్మింపచేసిన ఆ మనోహరమైన గృహము అన్ని సుఖ

ములతో నిండి ఉండెను. స్ఫటికమణులు పొదిగిన చిత్రవర్ణములైన బంగారు స్తంభములు అన్ని వైపులా ప్రకాశించుచుండెను. మెట్లు వైడూర్యమాణిక్యములు పొదిగి కట్టబడెను. అక్కడక్కడ చిరు గంటలు వ్రేలాడుచుండెను. దాని ముఖ ద్వారమునందు దంతముతో చేసిన శిల్పములుండెను. అరుగులు వజ్రములతోను, స్ఫటికమణులతోను కట్టబడెను. 4, 5

మూ. సర్వత్ర సుఖదం నిత్యం మేరోః పుణ్యాం గుహామివ, 6
తత్ర నిద్రాం సమావిష్టః కుమ్భకర్ణో మహాబలః,
బహూన్యబ్దసహస్రాణి శయానో న చ బుధ్యతే. 7

ప్ర. అ. సర్వత్ర = అంతటా, నిత్యమ్ = నిత్యమూ, సుఖదమ్ = సుఖము నిచ్చునది, పుణ్యామ్ = పుణ్యమైన, గుహామివ = గుహ వలె ఉన్న, ఆ గృహమును ప్రవేశించి, మహాబలః = గొప్ప బలము గల, కుమ్భకర్ణః = కుంభకర్ణుడు, తత్ర = అక్కడ, నిద్రామ్ = నిద్రను, సమావిష్టః = పొందినవాడై, బహూని = అనేకమైన, అబ్దసహస్రాణి = వేలకొలది సంవత్సరములను, శయానః = శయనించినవాడై, న చ బుధ్యతే = మేల్కొనలేదు.

తా. పుణ్యమైన మేరుపర్వతగుహ వలె ఉన్న, అంతటా సుఖకరమైన ఆ గృహములో ప్రవేశించిన మహాబలశాలియైన కుంభకర్ణుడు కొన్ని వేల సంవత్సరములు అట్లే శయనించి మేల్కొనలేదు. 6, 7

మూ. నిద్రాభిభూతే తు తదా కుమ్భకర్ణే దశాననః,
దేవర్షియక్షగన్ధర్వాన్ సంజఘ్నే హి నిరఙ్కుశః. 8

ప్ర. అ. తదా = అప్పుడు, కుమ్భకర్ణే = కుంభకర్ణుడు, నిద్రాభిభూతే = నిద్రచేత ఆక్రమించబడినవాడగుచుండగా, దశాననః = రావణుడు, నిరఙ్కుశః = అడ్డులేనివాడై, దేవర్షియక్షగన్ధర్వాన్ = దేవతలను, ఋషులను, యక్షులను, గంధర్వులను, సంజఘ్నే = కొట్టెను.

తా. కుంభకర్ణుడు ఆ విధముగా నిద్రాపరవశుడై పడియుండగా రావణుడు, అడ్డు లేనివాడై దేవతలను, ఋషులను, యక్షులను, గంధర్వులను పీడించెను 8

మూ. ఉద్యానాని విచిత్రాణి నన్దనాదీని యాని చ,
తాని గత్వా సుసంక్రుద్ధో భినత్తి స్మ దశాననః. 9

ప్ర. అ. విచిత్రాణి = విచిత్రములైన, నన్దనాదీని = నందనము మొదలైన, యాని = ఏ, ఉద్యానాని = ఉద్యానములు కలవో, తాని = వాటిని గూర్చి, గత్వా = వెళ్ళి, దశాననః = రావణుడు, సుసంక్రుద్ధః = మిక్కిలి కోపించినవాడై, భినత్తి స్మ = భేదించెను.

తా. చాల కోపించిన రావణుడు నందనము మొదలైన విచిత్రములైన ఉద్యానములకు వెళ్ళి వాటిని నశింపచేసెను. 9

మూ. నదీం గజ ఇవ క్రీడన్ వృక్షాన్ వాయురివ క్షిపన్,
నగాన్ వజ్ర ఇవోత్సృష్టో విధ్వంసయతి రాక్షసః. 10

ప్ర. అ. క్రీడన్ = క్రీడించుచున్న, గజః=ఏనుగు, నదీమివ=నదిని వలె, క్షిపన్ = విసిరివేయుచున్న, వాయుః = వాయువు, వృక్షానివ=వృక్షములను వలె, ఉత్సృష్టః = విడవబడిన, వజ్రః = వజ్రము, నగానివ = పర్వతములను వలె, రాక్షసః = రాక్షసుడు, విధ్వంసయతి = నశింపచేసెను.

తా. క్రీడించుచున్న ఏనుగ నదిని వలె, ఎగురగొట్టుచున్న వాయువు వృక్షములను వలె, విడవబడిన వజ్రాయుధము పర్వతములను వలె, రావణుడు ఉద్యానాదులను ధ్వంసము చేసెను. 10

మూ. తథావృత్తం తు విజ్ఞాయ దశగ్రీవం ధనేశ్వరః,
కులానురూపం ధర్మజ్ఞో వృత్తం సంస్మృత్య చాత్మనః.

సౌభ్రాత్రదర్శనార్థం తు దూతం వైశ్రవణస్తదా,
లఙ్కాం సంప్రేషయామాస దశగ్రీవస్య వై హితమ్. 12

ప్ర. అ. తదా = అప్పుడు, ధనేశ్వరః = ధనాధిపతి, ధర్మజ్ఞః = ధర్మములు తెలిసినవాడు అయిన, వైశ్రవణః = కుబేరుడు, దశగ్రీవమ్ = దశగ్రీవుణ్ణి, తథావృత్తమ్ = అట్టి నడవడిక గలవానినిగా, విజ్ఞాయ = తెలిసికొని, ఆత్మనః = తనయొక్క, కులానురూపమ్ = కులమునకు తగిన, వృత్తమ్ = ప్రవర్తనను,

సంస్మృత్య = స్మరించి, సౌభ్రాత్రదర్శనార్థమ్ = భ్రాతృప్రేమను చూపుటకై, దశగ్రీవస్య = దశగ్రీవునకు, హితమ్ = హితమును బోధించు, దూతమ్ = దూతను, లఙ్కామ్ = లంకను గూర్చి, సంప్రేషయామాస = పంపెను.

తా. అప్పుడు రావణుడు ఆ విధముగా ప్రవర్తించుచున్నాడని తెలిసిన ధనాధిపతి యైన, ధర్మవేత్త యైన కుబేరుడు తన వంశమునకు తగిన ప్రవృత్తిని దృష్టిలో ఉంచుకొని దశగ్రీవునకు హితమును ఉపదేశించుటకై ఒక దూతను లంకకు పంపెను. 11, 12

మూ. స గత్వా నగరీం లఙ్కామాససాద విభీషణమ్,
మానితస్తేన ధర్మేణ పృష్టశ్చాగమనం ప్రతి. 13

ప్ర. అ. సః = అతడు, లఙ్కాం నగరీమ్ = లంకానగరమును గూర్చి, గత్వా = వెళ్ళి, విభీషణమ్ = విభీషణుని, ఆససాద = సమీపించెను. తేన = ఆతనిచేత, ధర్మేణ = ధర్మముచేత, మానితః = గౌరవింపబడినవాడై, ఆగమనం ప్రతి = అతని రాకను గూర్చి, పృష్టశ్చ = అడగబడినాడు.

తా. ఆ దూత లంకానగరము చేరి విభీషణునివద్దకు వెళ్ళెను. విభీషణుడు ఆతనిని తగు విధముగా సత్కరించి వచ్చిన పనిని గూర్చి అడిగెను. 13

మూ. పృష్ట్వా చ కుశలం రాజ్ఞో జ్ఞాతీనాం చ విభీషణః,
సభాయాం దర్శయామాస తమాసీనం దశాననమ్. 14

ప్ర. అ. విభీషణః=విభీషణుడు, రాజ్ఞః=కుబేరుని యొక్క, జ్ఞాతీనాం చ = జ్ఞాతులయొక్క, కుశలమ్ = కుశలమును, పృష్ట్వా చ = అడిగి, సభాయామ్ = సభయందు, ఆసీనమ్ = కూర్చొని ఉన్న, తం దశాననమ్ = ఆ రావణుని, దర్శయామాస = చూపెను.

తా. విభీషణుడు కుబేరుడు మొదలైన బంధువుల కుశలవృత్తాంతము అడిగి, ఆ దూతకు సభలో కూర్చొని ఉన్న రావణుని చూపించెను. 14

మూ. స దృష్ట్వా తత్ర రాజానం దీప్యమానం స్వతేజసా,
జయేతి వాచా సంపూజ్య తూష్ణీం సమభివర్తత. 15

ప్ర. అ. సః = ఆ దూత, తత్ర = అక్కడ, స్వతేజసా = తన తేజస్సుతో, దీప్యమానమ్ = ప్రకాశించుచున్న, రాజానమ్ = రాక్షసరాజును, దృష్ట్వా = చూచి, జయ ఇతి = జయ అను, వాచా = వాక్కుచేత, సంపూజ్య = పూజించి, తూష్ణీమ్ = మౌనముగా, సమభివర్తత = ఉండెను.

తా. ఆ దూత, అక్కడ తన సహజతేజస్సుతో ప్రజ్వలించుచున్న ఆ రాక్షసరాజును చూచి "జయ విజయీ భవ"అని పలికి క్షణకాలము ఊరకుండెను.

మూ. తం తత్రోత్తమపర్యఙ్కే వరాస్తరణశోభితే,
ఉపవిష్టం దశగ్రీవం దూతో వాక్యమథాబ్రవీత్. 16

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దూతః = దూత, తత్ర = అక్కడ, వరాస్తరణశోభితే = శ్రేష్ఠమైన ఆస్తరణముచేత ప్రకాశింపచేయబడిన, ఉత్తమ పర్యఙ్కే = ఉత్తమమైన పర్యంకము (సోఫా) నందు, ఉపవిష్టమ్ = కూర్చున్న, దశగ్రీవమ్ = దశగ్రీవుణ్ణి గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట ఆ దూత, శ్రేష్ఠమైన ఆస్తరణముతో ప్రకాశించుచున్న ఉత్తమ మైన పర్యంకముపై కూర్చొని ఉన్న రావణునితో ఇట్లు పలికెను. 16

మూ. రాజన్ వదామి తే సర్వం భ్రాతా తవ యదబ్రవీత్,
ఉభయోః సదృశం వీర వృత్తస్య చ కులస్య చ. 17

ప్ర. అ. వీర = వీరుడా, రాజన్ = రాజా, తవ భ్రాతా = నీ సోదరుడు, ఉభయోః = మీ ఇద్దరియొక్క, వృత్తస్య = చరిత్రకు, కులస్య చ = కులమునకు, సదృశమ్ = తగిన, యత్ = దేనిని, అబ్రవీత్ = పలికెనో, సర్వమ్ = దాని నంతనూ, తే = నీకు, వదామి = చెప్పుచున్నాను.

తా. వీరుడవైన రాజా! మీ ఇద్దరి చరిత్రకు, కులమునకు తగు విధముగా నీ సోదరుడు చెప్పిన దంతా చెప్పెదను. 17

మూ. సాధు పర్యాప్తమేతావత్కృతశ్చారిత్రసంగ్రహః,
సాధు ధర్మే వ్యవస్థానం క్రియతాం యది శక్యతే. 18

ప్ర. అ. చారిత్రసంగ్రహః = సచ్చరితసంపాదనము, కృతః = చేయ

బడినట్లయితే, ఏతావత్ = ఇంతమాత్రము, సాధు = మంచిది, పర్యాప్తమ్ = చాలును. శక్యతే యది = శక్యమైనట్లయితే, ధర్మే = ధర్మమునందు; సాధు = బాగుగా, వ్యవస్థానమ్ = స్థితి, క్రియతామ్ = చేయబడుగాక.

తా. మంచి నడవడికతో ఉన్నచో అదే చాలును. అందుచేత శక్యమైనచో నీవు ధర్మమార్గమును అవలంబించుము. 18

మూ. దృష్టం మే నన్దనం భగ్నమృషయో నిహతాః శ్రుతాః,
దేవతానాం సముద్యోగస్త్వత్తో రాజన్ మయా శ్రుతః. 19

ప్ర. అ. రాజన్ = రాక్షసరాజా! భగ్నమ్ = విరుగగొట్టబడిన, నన్దనమ్ = నందనవనము, మే = నాకు, (నాచేత), దృష్టమ్ = చూడబడినది. ఋషయః = ఋషులు, నిహతాః = చంపబడినవారుగా, శ్రుతాః = వినబడినారు. త్వత్తః = నీమూలమున, దేవతానామ్ = దేవతలయొక్క, సముద్యోగః = ప్రయత్నము, మయా = నాచేత, శ్రుతః = వినబడినది.

తా. రాక్షసరాజా! నీవు భగ్నముచేసిన నందనవనమును నేను చూచితిని. నీవు ఋషులను చంపినట్లుగా విన్నాను. నీ మూలమున దేవతలు నీ సంహారము కొరకై ప్రయత్నించుచున్నట్లు నేను విన్నాను. 19

మూ. నిరాకృతశ్చ బహుశస్త్వయాహం రాక్షసాధిప,
సాపరాధోఽపి బాలో హి రక్షితవ్యః స్వబాన్ధవైః. 20

ప్ర. అ. రాక్షసాధిప = రాక్షసరాజా! అహమ్ = నేను, త్వయా = నీచేత, బహుశః = అనేకపర్యాయములు, నిరాకృతశ్చ = నిరాకరించబడితిని. సాపరాధోఽపి = అపరాధముతో కూడినవాడైనను, బాలః = బాలుడు, స్వబాన్ధవైః = తన బంధువులచేత, రక్షితవ్యః హి = రక్షించదగినవాడు కదా!

తా. రాక్షసరాజా! నీవు నన్ను కూడ అనేకపర్యాయములు నిరాకరించినావు. బాలుడు అపరాధము చేసినను అతనిని బంధువులు రక్షించవలెను కదా? 20

మూ. అహం తు హిమవత్పృష్ఠం గతో ధర్మముపాసితుమ్,
రౌద్రం వ్రతం సమాస్థాయ నియతో నియతేన్ద్రియః. 21

ప్ర. అ. అహమ్=నేను, రౌద్రమ్=రుద్రునకు సంబంధించిన, వ్రతమ్=వ్రతమును, సమాస్థాయ = అవలంబించి, నియతః = నియమవంతుడనై, నియతేన్ద్రియః=నియమించబడిన ఇంద్రియములుగలవాడనై, ధర్మమ్=ధర్మమును, ఉపాసితుమ్=ఉపాసించుటకు, హిమవత్పృష్ఠమ్ = హిమవత్పర్వతము పైభాగమును గూర్చి, గతః=వెళ్ళితిని.

తా. నేను రుద్రుని అనుగ్రహమును సంపాదించు వ్రతమును అవలంబించి నియమవంతుడనై, ఇంద్రియములను నిగ్రహించుకొని ధర్మమును ఉపాసించుటకై హిమవత్పర్వతము పైకి వెళ్ళితిని. 21

మూ. తత్ర దేవో మయా దృష్ట ఉమయా సహితః ప్రభుః,
సవ్యం చక్షుర్మయా దైవా త్తత్ర దేవ్యాం నిపాతితమ్. 22

ప్ర. అ. తత్ర = అక్కడ, ఉమయా = పార్వతితో, సహితః = కూడిన, ప్రభుః = సర్వసమర్థుడైన, దేవః = మహాదేవుడు, మయా = నా చేత, దృష్టః = చూడబడినాడు. దైవాత్ = దైవమువలన, తత్ర = అక్కడ, మయా = నాచేత, సవ్యమ్ = ఎడమదైన, చక్షుః = నేత్రము, దేవ్యామ్ = దేవిమీద, నిపాతితమ్ = పడవేయబడినది.

తా. అక్కడ నేను పార్వతితో కూడి ఉన్న సర్వసమర్థుడైన పరమేశ్వరుణ్ణి చూచితిని. దైవవశముచేత నా ఎడమ కన్ను అక్కడ ఉన్న పార్వతి దేవి పై ప్రసరించినది. 32

మూ. కాన్వేషేతి మహారాజ న ఖల్వన్యేన హేతునా,
రూపం చానుపమం కృత్వా రుద్రాణీ తత్ర తిష్ఠతి. 23

ప్ర. అ. మహారాజ = మహారాజా! ఏషా = ఈమె, కా ను = ఎవరు, ఇతి = అని నా నేత్రము ప్రసరించినది. అన్యేన = మరియొక, హేతునా = హేతువు చేత, న ఖలు = కాదు. రుద్రాణీ = పార్వతి, అనుపమమ్ = సాటి లేని, రూపమ్ = రూపమును, కృత్వా = చేసి, తత్ర = అక్కడ, తిష్ఠతి = ఉన్నది.

తా. రాక్షసరాజా ! ఈమె ఎవరై ఉండునా అను ఉద్దేశముతోనే

నేను అట్లు చూచినాను. కాని మరొకకారణముచేత కాదు. పార్వతి సాటి లేని రూపము ధరించి అక్కడ ఉండెను. 23

మూ. దేవ్యా దివ్యప్రభావేణ దగ్ధం సవ్యం మమేక్షణమ్,
రేణుధ్వస్తమివ జ్యోతిః పిఙ్గలత్వముపాగతమ్. 24

ప్ర. అ. దేవ్యాః = దేవియొక్క, దివ్యప్రభావేణ = దివ్యమైన ప్రభావముచేత, మమ = నా యొక్క, సవ్యమ్ ఈక్షణమ్ = ఎడమ కన్ను, దగ్ధమ్ = కాల్చబడినది. జ్యోతిః = ఆ నేత్రమునందలి కాంతి, రేణుధ్వస్తమివ = పరాగముచేత కొట్టబడినది వలె, పిఙ్గలత్వమ్ = పచ్చదనమును, ఉపాగతమ్ = పొందినది.

తా. దేవి దివ్య ప్రభావముచేత నా ఎడమకన్ను మాడిపోయినది. దాని కాంతి బూడిద చల్లినట్లు పచ్చగా అయిపోయినది. 24

మూ. తతోఽహమన్యద్విస్తీర్ణం గత్వా తస్య గిరేస్తటమ్,
తూష్ణీం వర్షశతాన్యష్టౌ సమధారం మహావ్రతమ్. 25

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అహమ్ = నేను, తస్య గిరేః = ఆ పర్వతముయొక్క, విస్తీర్ణమ్ = విశాలమైన, అన్యత్ = మరియొక, తటమ్ = చరియనుగూర్చి, గత్వా = వెళ్ళి, అష్టౌ వర్షశతాని = ఎనిమిదివందల సంవత్సరములు, తూష్ణీమ్ = మౌనముగా, మహావ్రతమ్ = ఆ గొప్పవ్రతమును, సమధారమ్ = ధరించితిని.

తా. పిమ్మట నేను ఆ పర్వతముమీదనే మరి యొక విశాలమైన చరియకు వెళ్ళి ఎనిమిదివందల సంవత్సరములు మౌనముతో ఆ మహావ్రతమును ఆచరించితిని. 25

మూ. సమాప్తే నియమే తస్మిం స్తత్ర దేవో మహేశ్వరః,
తతః ప్రీతేన మనసా ప్రాహ వాక్యమిదం ప్రభుః. 26

ప్ర. అ. తతః = అటు పిమ్మట, తత్ర = అక్కడ, తస్మిన్ నియమే = ఆ నియమము, సమాప్తే = సమాప్తమైనదగు చుండగా, ప్రభుః = సర్వసమర్థుడు, దేవః = దేవుడు అయిన, మహేశ్వరః = మహేశ్వరుడు, ప్రీతేన = సంతోషించిన, మనసా = మనస్సుతో, మామ్ = నన్ను గూర్చి, ఇదమ్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ప్రాహ = పలికెను.

తా. ఆ నియమము పూర్తియైన పిమ్మట అక్కడ, సమర్థుడైన మహేశ్వరుడు సంతోషించిన మనస్సుతో, నాతో ఇట్లు పలికెను. 26

మూ. ప్రీతోఽస్మి తవ ధర్మజ్ఞ తపసానేన సువ్రత,
మయా చైతద్వ్రతం. చీర్ణం త్వయా చైవ ధనాధిప. 27

ప్ర. అ. ధర్మజ్ఞ = ధర్మములు తెలిసినవాడా! సువ్రత = మంచి నియమము గలవాడా! ధనాధిప = కుబేరా! తవ = నీకు, ప్రీతః అస్మి = సంతోషించితిని. ఏతత్ = ఈ, వ్రతమ్ = వ్రతము, మయా చ = నాచేతను, త్వయా చైవ = నీచేతను, చీర్ణమ్ = చేయబడినది.

తా. ధర్మములు తెలిసిన, మంచి నియమములు గల ఓ! కుబేరా! నీ విషయమునందు సంతోషించితిని. ఈ వ్రతమును నేను చేసితిని; ఇప్పుడు నీవు చేసినావు. 27

మూ. తృతీయః పురుషో నాస్తి యశ్చరేద్వ్రతమీదృశమ్,
వ్రతం సుదుష్కరం హ్యేత న్మయైవోత్పాదితం పురా.

ప్ర. అ. ఈదృశమ్ = ఇట్టి, వ్రతమ్ = వ్రతమును, యః = ఎవడు, చరేత్ = ఆచరించునో, అట్టి, తృతీయః = మూడవ, పురుషః = పురుషుడు, నాస్తి = లేడు. సుదుష్కరమ్ = చేయుటకు చాల కష్టమైన, ఏతత్ = ఈ, వ్రతమ్ = వ్రతము, పురా = పూర్వము, మయైవ = నా చేతనే, ఉత్పాదితమ్ = పుట్టింపబడినది.

తా. ఇట్టి వ్రతము చేయగల మూడవవాడు ఎవ్వడూ లేడు. చేయుటకు చాల కష్టమైన ఈ వ్రతమును పూర్వము నేనే కనుగొన్నాను. 28

మూ. తత్సఖిత్వం మయా సౌమ్య రోచయస్వ ధనేశ్వర,
తపసా నిర్జిత శ్చైవ సఖా భవ మమానఘ. 29

ప్ర. అ. ధనేశ్వర = కుబేరా! తత్ = ఆ కారణమువలన, మయా = నాతో, సఖిత్వమ్ = మిత్రత్వమును, రోచయస్వ = అంగీకరించుము. అనఘ = దోషములు లేనివాడా! మమ = నాకు, తపసా = తపస్సుచేత, నిర్జితః చైవ = జయింపబడిన, సఖా = మిత్రుడవుగా, భవ = అగుము.

తా. అందువలన, ఓ! కుబేరా! నీవు నాతో స్నేహమును అంగీకరించుము. తపస్సుచేత జయింపబడిన మిత్రుడవు అగుము. 29

మూ. దేవ్యా దగ్ధం ప్రభావేణ యచ్చ సవ్యం తవేక్షణమ్,
పైఙ్గల్యం యదవాప్తం హి దేవ్యా రూపనిరీక్షణాత్. 30
ఏకాక్షిపిఙ్గలీత్యేవ నామ స్థాస్యతి శాశ్వతమ్.

ప్ర. అ. తవ = నీయొక్క, సవ్యమ్ ఈక్షణమ్ = ఎడమ కన్ను, యత్ = ఏ కారణమువలన, దేవ్యాః = దేవియొక్క, ప్రభావేణ = ప్రభావముచేత, దగ్ధమ్ = కాల్చబడినదో, దేవ్యాః = దేవియొక్క, రూపనిరీక్షణాత్ = రూపమును చూచుటవలన, యత్ = ఏ కారణమువలన, పైఙ్గల్యమ్ = పచ్చదనమును, అవాప్తమ్ = పొందినదో అందువలన, ఏకాక్షిపిఙ్గలీత్యేవ = 'ఏకాక్షిపింగళి' అను (ఒక 'పచ్చకన్ను కలవాడు' అను) నామ = పేరు, శాశ్వతమ్ = శాశ్వతముగా, స్థాస్యతి = ఉండగలదు.

తా. దేవి ప్రభావముచేత నీ ఎడమకన్ను కాలిపోయినది. దేవి రూపమును చూచుటవలన ఆ కన్ను పచ్చగా కూడ అయినది. అందువలన నీకు "ఏకాక్షి పింగళి" అను పేరు స్థిరముగా ఉండగలదు. 30

మూ. ఏవం తేన సఖిత్వం చ ప్రాప్యానుజ్ఞాం చ శంకరాత్. 31
ఆగతేన మయా చైవం శ్రుతస్తే పాపనిశ్చయః.

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, తేన = శివునితో, సఖిత్వమ్ = స్నేహమును, ప్రాప్య = పొంది, శంకరాత్ = శంకరునివలన, అనుజ్ఞాం చ = అనుజ్ఞను కూడ (పొంది), ఆగతేన = వచ్చిన, మయా = నాచేత, తే = నీయొక్క, పాపనిశ్చయః = పాపనిశ్చయము, శ్రుతః = వినబడినది.

తా. ఈ విధముగా శంకరునితో స్నేహమును పొంది, అతని అనుజ్ఞ తీసుకొని వచ్చిన నేను నీవు చేయుచున్న పాపకార్యములను గూర్చి వింటిని. 31

మూ. తదధర్మిష్ఠసంయోగాన్నివర్త కులదూషణాత్, 32
చిన్త్యతే హి వధోపాయః సర్షిసంఘైః సురైస్తవ.

ప్ర. అ. తత్ = ఆ కారణమువలన, కులదూషణాత్ = కులమును దూషించు, అధర్మిష్ఠసంయోగాత్ = ధర్మసమ్మతము కాని కార్యముతో సంబంధమునుండి, నివర్త = మరలుము. సర్షిసంఘైః = ఋషుల సంఘములతో కూడిన, సురైః = దేవతలచేత, తవ = నీయొక్క, వధోపాయః = వధకు ఉపాయము, చిన్త్యతే = ఆలోచించబడుచున్నది.

తా. అందువలన కులమునకు అపకీర్తిని తెచ్చు అధర్మకార్యములనుండి దూరముగా ఉండుము. ఋషులు, దేవతలు కలిసి నిన్ను చంపుటకు ఉపాయమును ఆలోచించుచున్నారు. 32

మూ. ఏవముక్తో దశగ్రీవః కోపసంరక్తలోచనః, 33
హస్తాన్ దన్తాంశ్చ సంపీడ్య వాక్యమేతదువాచ హ

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, దశగ్రీవః = రావణుడు, కోపసంరక్తలోచనః = కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములు గలవాడై, హస్తాన్ = హస్తములను, దన్తాంశ్చ = దంతములను, సంపీడ్య = పీడించి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. ఆ మాటలు విన్న రావణుడు కోపముచేత కళ్లు ఎఱ్ఱబడగా, చేతులు చరచి, పళ్లు కొరుకుచు ఇట్లు పలికెను. 33

మూ. విజ్ఞాతం తే మయా దూత వాక్యం యత్త్వం ప్రభాషసే,
నైవ త్వమసి నైవాసౌ భ్రాతా యేనాసి చోదితః.

ప్ర. అ. దూత = దూతా ! త్వమ్ = నీవు, యత్ = ఏ, వాక్యమ్ = వాక్యమును, ప్రభాషసే = మాటలాడుచున్నావో, తే = నీయొక్క ఆ వాక్యము, విజ్ఞాతమ్ = తెలియబడినది. త్వమ్ = నీవు, నైవ అసి = ఇంక లేవు. యేన = ఏ, భ్రాతా = సోదరునిచేత, చోదితః = ప్రేరేపింపబడితివో, అసౌ = ఇతడు కూడ, నైవ = లేడు.

తా. ఓ ! దూతా ! నీవు పలికిన మాటలు విన్నాను. నీవు గాని, నిన్ను పంపిన నా సోదరుడు గాని ఇంక ఉండరు. 34

మూ. హితం నైష మమైతద్ధి బ్రవీతి ధనరక్షకః, 35
మహేశ్వరసఖిత్వం తు మూఢః శ్రావయతే కిల.

ప్ర. అ. ఏషః = ఈ, ధనరక్షకః = కుబేరుడు, బ్రవీతి=(దేనిని) పలుకుచున్నాడో, ఏతత్ = ఇది, మమ = నాకు, హితమ్ = హితము, న హి = కాదు కదా. మూఢః = మూఢుడైన ఆ కుబేరుడు, మహేశ్వరసఖిత్వమ్ = మహేశ్వరుని మిత్రత్వమును, శ్రావయతే కిల = వినిపించుచున్నాడు కదా.

తా. ఆ కుబేరుడు చెప్పుచున్నది నాకు హితముకాదు. ఆ మూఢుడు తనకు మహేశ్వరునితో మైత్రి ఏర్పడినట్లు చెప్పుకొనుచున్నాడు కదా ! 35

మూ. నైవ చ క్షమణీయం మే యదేతద్భాషితం త్వయా. 36
యదేతావన్మయా కాలం దూత తస్య తు మర్షితమ్,
న హన్తవ్యో గురుర్జ్యేష్ఠో మమాయమితి మన్యతే. 37

ప్ర. అ. త్వయా = నీచేత, యత్ = ఏది, భాషితమ్ = పలకబడినదో, ఏతత్ = ఇది, మే = నాకు, క్షమణీయమ్ = క్షమించదగినది, నైవ చ = కాదు. దూత = దూతా! మయా = నాచేత, ఏతావత్ = ఇంత, కాలమ్ = కాలమును, తస్య=వానికి, యత్ = ఏ కారణమువలన, మర్షితమ్ = సహింపబడినదో, అందువలన, అయమ్ = ఇతడు, గురుః = పూజ్యుడైన, జ్యేష్ఠః = అన్న, మమ = నాకు, న హన్తవ్యః = చంపదగినవాడు కాదు, ఇతి = అని, మన్యతే = తలచుచున్నాడు.

తా. ఓ! దూతా! నీ వింతవరకు మాటలాడినది క్షమింపదగినది కాదు. నే నింతవరకు ఆ కుబేరుణ్ణి సహించుటచే "అన్న అగుటచే పూజ్యుడనైన నన్ను చంపడు"అని నన్ను గూర్చి అతడు అనుకొనుచున్నాడు. 36, 37

మూ. తస్య త్విదానీం శ్రుత్వా మే వాక్యమేషా కృతా మతిః,
త్రీన్ లోకానపి జేష్యామి బాహువీర్యముపాశ్రితః. 38

ప్ర. అ. తు = కాని, ఇదానీమ్=ఇప్పుడు, తస్య=వానియొక్క, వాక్యమ్ =వాక్యమును, శ్రుత్వా = విని, మే = నాకు, ఏషా=ఈ, మతిః=బుద్ధి, కృతా= చేయబడినది. బాహువీర్యమ్ = బాహువుల పరాక్రమమును, ఉపాశ్రితః = ఆశ్రయించినవాడనై, త్రీనపి = మూడు, లోకాన్ = లోకములను, విజేష్యామి = జయించెదను.

తా. కాని, ఇప్పుడు వాని మాటలు విన్న పిమ్మట బాహుపరాక్రమముచేత మూడు లోకములను జయింపవలె నని నిశ్చయించుకొన్నాను. 38

మూ. ఏతన్ముహూర్తమేవాహం తస్యైకస్య తు వై కృతే,
చతురో లోకపాలాంస్తాన్నయిష్యామి యమక్షయమ్. 39

ప్ర. అ. అహమ్=నేను, ఏతన్ముహూర్తమేవ=ఈ క్షణమునందే, ఏకస్య=ఒక్క, తస్య కృతే=వానిమూలమున, తాన్=ఆ, చతురః=నలుగురు, లోకపాలాన్=లోకపాలకులను, యమక్షయమ్=యమలోకమును, నయిష్యామి=పొందించెదను.

తా. ఆ కుబేరుడు ఇట్లు పలికినందుకు నేను ఈ క్షణమునందే ఆ నలుగురు లోకపాలకులను యమలోకమునకు పంపివేసెదను. 39

మూ. ఏవముక్త్వా తు లఙ్కేశో దూతం ఖడ్గేన జఘ్నివాన్,
దదౌ భక్షయితుం హ్యేనం రాక్షసానాం దురాత్మనామ్.

ప్ర. అ. లఙ్కేశః = రావణుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా=పలికి, దూతమ్=దూతను, ఖడ్గేన=ఖడ్గముచేత, జఘ్నివాన్=చంపినవాడై, ఏనమ్=వీనిని, దురాత్మనామ్=దుష్టులైన, రాక్షసానామ్=రాక్షసులకు, భక్షయితుమ్=భక్షించుటకు, దదౌ=ఇచ్చెను.

తా. రావణుడు ఇట్లు పలికి, ఖడ్గముతో ఆ దూతను చంపి వానిని దుష్టులైన రాక్షసులకు భక్షించుటకై ఇచ్చెను. 40

మూ. తతః కృతస్వస్త్యయనో రథమారుహ్య రావణః,
త్రైలోక్యవిజయాకాఙ్క్షీ యయౌ యత్ర ధనేశ్వరః. 41

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్రయోదశః సర్గః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రావణః=రావణుడు, కృతస్వస్త్యయనః=చేయబడిన స్వస్త్యయనము కలవాడై, రథమ్=రథమును, ఆరుహ్య=ఎక్కి,

త్రైలోక్యవిజయాకాఙ్క్షీ = మూడులోకముల విజయమును కోరుచు, ధనేశ్వరః = కుబేరుడు, యత్ర = ఎక్కడ ఉన్నాడో అక్కడికి, యయౌ = వెళ్ళెను.

తా. పిమ్మట రావణుడు స్వస్త్యయనము చేయించుకొని, రథము నెక్కి, మూడు లోకములు జయించవలె నను కోరికతో కుబేరు డున్న చోటికి వెళ్ళెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో పదమూడవ సర్గ సమాప్తము.

అథ చతుర్దశః సర్గః

[రావణుడు మంత్రులతో కలిసి వెళ్లి యక్షులపై ఆక్రమణము చేయుట: యక్షులు ఓడిపోవుట.]

మూ. తతః స సచివైః సార్ధం షడ్భిర్నిత్యబలోద్ధతః,
మహోదరప్రహస్తాభ్యాం మారీచశుకసారణైః. 1

ధూమ్రాక్షేణ చ వీరేణ నిత్యం సమరగర్ధినా,
వృతః సంప్రయయౌ శ్రీమాన్ క్రోధాల్లోకాన్ దహన్నివ.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, నిత్యబలోద్ధతః = నిత్యమూ బలముచేత ఉద్ధతుడైన, శ్రీమాన్ = శ్రీమంతుడైన, సః = ఆ రావణుడు, మహోదర ప్రహస్తాభ్యామ్ = మహోదర ప్రహస్తులతోను, మారీచశుకసారణైః = మారీచ-శుక-సారణులతోను, నిత్యమ్ = ఎల్లప్పుడు, సమరగర్ధినా = యుద్ధమునందు ఆసక్తి గల, వీరేణ = వీరుడైన, ధూమ్రాక్షేణ = ధూమ్రాక్షునితోను, షడ్భిః = ఆరుగురు, సచివైః సార్ధమ్ = మంత్రులతో, వృతః = కూడినవాడై, క్రోధాత్ = కోపమువలన, లోకాన్ = లోకములను, దహన్నివ = కాల్చుచున్నవాడు వలె, సంప్రయయౌ = బయలుదేరి వెళ్ళెను.

తా. నిత్యము బలముచేత ఉద్ధతుడైన శ్రీమంతుడైన ఆ రావణుడు, మహోదర-ప్రహస్త-మారీచ-శుక-సారణులతోను, నిత్యము యుద్ధమును కోరు వీరుడైన ధూమ్రాక్షునితోను, ఈ ఆరుగురు సచివులతో కలిసి, కోపమువలన లోకములను కాల్చివేయుచున్నాడా అన్నట్లు బయలుదేరి వెళ్ళెను. 1, 2

మూ. పురాణి స నదీః శైలాన్వనాన్యుపవనాని చ,
అతిక్రమ్య ముహూర్తేన కైలాసం గిరిమాగమత్. 3

ప్ర. అ. ముహూర్తేన = ముహూర్తకాలముచేత, పురాణి = పట్టణములను,

నదీః = నదులను, శైలాన్ = పర్వతములను, వనాని = వనములను, ఉపవనాని చ = ఉద్యానములను, అతిక్రమ్య = దాటి, సః = అతడు, కైలాసం గిరిమ్ = కైలాస పర్వతమును, ఆగమత్ = పొందెను.

తా. ఆ రావణుడు అత్యల్పకాలములో పట్టణములు, నదులు, పర్వతములు, వనములు, ఉద్యానములు దాటి కైలాసపర్వతమును చేరెను. 3

మూ. సంనివిష్టం గిరౌ తస్మిన్రాక్షసేన్ద్రం నిశమ్య తు,
యుద్ధేప్సుం తం కృతోత్సాహం దురాత్మానం సమన్త్రిణమ్,
యక్షా న శేకుః సంస్థాతుం ప్రముఖే తస్య రక్షసః.

ప్ర. అ. యక్షాః = యక్షులు, తస్మిన్ = ఆ, గిరౌ = పర్వతమునందు, సంనివిష్టమ్ = విడిదిచేసి ఉన్న, దురాత్మానమ్ = దురాత్ముడైన, సమన్త్రిణమ్ = మంత్రులతో కూడిన, తం రాక్షసేన్ద్రమ్ = ఆ రావణుని, యుద్ధేప్సుమ్ = యుద్ధమునందు అభిలాషగలవానినిగా, నిశమ్య = విని, తస్య రక్షసః = ఆ రాక్షసునియొక్క, ప్రముఖే = ఎదుట, స్థాతుమ్ = నిలచుటకు, న శేకుః = సమర్థులు కాలేదు.

తా. ఆ పర్వతముమీద విడిసి ఉన్న, మంత్రులతో కూడిన, ఉత్సాహవంతుడైన, దురాత్ముడైన ఆ రాక్షసరాజు యుద్ధాభిలాషతో ఉన్నట్లు విని యక్షులు ఆ రాక్షసుని ఎదుట నిలబడజాలకపోయిరి. 4

మూ. రాజ్ఞో భ్రాతేతి విజ్ఞాయ గతా యత్ర ధనేశ్వరః, 5
తే గత్వా సర్వమాచఖ్యుర్భ్రాతుస్తస్య చికీర్షితమ్.

ప్ర. అ. రాజ్ఞః = రాజుయొక్క, భ్రాతా ఇతి = సోదరుడు అని, విజ్ఞాయ = తెలిసికొని, ధనేశ్వరః = కుబేరుడు, యత్ర = ఎక్కడ ఉన్నాడో అక్కడికి, గతాః = వెళ్ళినారు తే = వాళ్ళు, గత్వా = వెళ్ళి, భ్రాతుః = సోదరుడైన, తస్య = వానియొక్క, చికీర్షితమ్ = చేయ నిశ్చయింపబడిన కార్యమును; సర్వమ్ = అంతనూ, ఆచఖ్యుః = చెప్పిరి.

తా. అతడు కుబేరుని సోదరుడని తెలిసికొని ఆ యక్షులు కుబేరుని వద్దకు వెళ్ళి అతని సోదరుడైన రావణుడు చేయదలచినది అంతా తెలిపిరి. 5

మూ. అనుజ్ఞాతా యయుర్హృష్టా యుద్ధాయ ధనదేన తే, 6
తతో బలానాం సంక్షోభో వ్యవర్ధత ఇవోదధేః.
తస్య నైర్ఋతరాజస్య శైలం సంచలయన్నివ. 7

ప్ర. అ. తే = వాళ్ళు, ధనదేన = కుబేరునిచేత, అనుజ్ఞాతాః = అనుజ్ఞ ఇవ్వబడినవారై, హృష్టాః = సంతోషించినవారై, యుద్ధాయ = యుద్ధముకొరకు, యయుః = వెళ్ళిరి. తతః = అటుపిమ్మట, తస్య = ఆ, నైర్ఋతరాజస్య = కుబేరుని యొక్క, బలానామ్ = సైన్యములయొక్క, సంక్షోభః = సంక్షోభము, ఉదధేః ఇవ = సముద్రము సంక్షోభము వలె, శైలమ్ = పర్వతమును, సంచలయన్నివ = కదల్చుచున్నదివలె, వ్యవర్ధత = వృద్ధిపొందెను.

తా. పిమ్మట ఆ యక్షులు కుబేరుని అనుమతి పొంది సంతోషించుచు యుద్ధమునకు వెళ్ళిరి. అప్పుడు ఆ కుబేరుని సైన్యముల సంక్షోభము సముద్ర సంక్షోభము వలె. ఆ పర్వతముమ కదల్చి వేయుచున్నదా అన్నట్లు వృద్ధి పొందెను. 6, 7

మూ. తతో యుద్ధం సమభవద్యక్షరాక్షససంకులమ్,
వ్యథితాశ్చాభవం స్తత్ర సచివా రాక్షసస్య తే. 8

ప్ర. అ. తతః = అటు పిమ్మట, యక్షరాక్షససంకులమ్ = యక్షులతోను, రాక్షసులతోను వ్యాకులమైన, యుద్ధమ్ = యుద్ధము, సమభవత్ = ఆయెను. తత్ర = అక్కడ, రాక్షసస్య = రాక్షసునియొక్క, తే = ఆ, సచివాః = మంత్రులు, వ్యథితాః = వ్యథచెందినవారుగా, అభవన్ = అయిరి.

తా. అప్పుడు యక్షరాక్షసుల మధ్య సంకులమైన యుద్ధము జరిగెను. అప్పుడు రావణుని మంత్రులు వ్యథ చెందిరి. 8

మూ. స దృష్ట్వా తాదృశం సైన్యం దశగ్రీవో నిశాచరః,
హర్షనాదాన్ బహూన్ కృత్వా స క్రోధా దభ్యధావత. 9

ప్ర. అ. సః = ప్రసిద్ధుడైన, సః = ఆ, నిశాచరః = రాక్షసుడైన, దశగ్రీవః = రావణుడు, తాదృశమ్ = అట్టి, సైన్యమ్ = సైన్యమును, దృష్ట్వా = చూచి,

బహూన్ = అనేకమైన, హర్షనాదాన్ = హర్షధ్వనులను, కృత్వా = చేసి, క్రోధాత్ = కోపమువలన, అభ్యధావత = ఎదురుగా శీఘ్రముగా వెళ్ళెను.

తా. రావణుడు ఆ సైన్యమును చూచి, సంతోషముతో బిగ్గరగా అరచుచు, కోపముతో వెంటనే దాని కెదురుగా వెళ్లెను. 9

మూ. యే తు తే రాక్షసేన్ద్రస్య సచివా ఘోరవిక్రమాః,
తేషాం సహస్రమేకైకో యక్షాణాం సమయోధయత్. 10

ప్ర. అ. రాక్షసేన్ద్రస్య=రావణునియొక్క, ఘోరవిక్రమాః=భయంకరమైన పరాక్రమము గల, యే = ఏ, తే = ఆ, సచివాః = మంత్రులు గలరో, తేషామ్ = వారిలో, ఏకైకః = ఒక్కొక్కడు, యక్షాణామ్ = యక్షులయొక్క, సహస్రమ్ = సహస్రమును, సమయోధయత్ = యుద్ధము చేయించెను.

తా. ఆ రావణుని భయంకరమైన పరాక్రమము గల మంత్రులలో ఒక్కొక్కడు వేయిమంది యక్షులతో యుద్ధము చేసెను. 10

మూ. తతో గదాభిర్ముసలైరసిభిః శక్తితోమరైః,
హన్యమానో దశగ్రీవస్తత్సైన్యం సమగాహత. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, గదాభిః = గదలచేతను, ముసలైః = రోకళ్ళచేతను, అసిభిః = కత్తులచేతను, శక్తితోమరైః=శక్తులచేతను తోమరముల చేతను, హన్యమానః = కొట్టబడుచున్న, దశగ్రీవః = రావణుడు, తత్ = ఆ, సైన్యమ్ = సైన్యమును, సమగాహత = ప్రవేశించెను.

తా. అప్పుడు ఆ యక్షులు గదలతోను, ముసలములతోను, ఖడ్గములతోను, శక్తులతోను, తోమరములతోను కొట్టుచుండగా రావణుడు ఆ సైన్యములోనికి చొరబడెను. 11

మూ. స నిరుచ్ఛ్వాసవత్తత్ర వధ్యమానో దశాననః,
వర్షద్భిరివ జీమూతైర్ధారాభిరవరుధ్యత. 12

ప్ర. అ. వర్షద్భిః = వర్షించుచున్న, జీమూతైరివ = మేఘములచేత వలె, తత్ర = అక్కడ, ధారాభిః = బాణాదుల ధారలచేత, నిరుచ్ఛ్వాసవత్ = ఊపిరి

అడకుండగా, వధ్యమానః=కొట్టబడు, సః దశాననః=ఆ రావణుడు, అవరుద్ధ్యత=అడ్డుకొనబడెను.

తా. వర్షించుచున్న మేఘములు వలె ఆ యక్షులు బాణాదులధారలతో ఊపిరి ఆడకుండే టట్లు కొట్టుచు ఆ రావణుని అడ్డుకొనిరి. 12

మూ. న చకార వ్యథాం చైవ యక్షశస్త్రైః సమాహతః,
మహీధర ఇవామ్భోదైర్ధారాశతసముక్షితః. 13

ప్ర. అ. యక్షశస్త్రైః = యక్షుల శస్త్రములచేత, సమాహతః = కొట్టబడిన ఆ రావణుడు, అమ్భోదైః = మేఘములచేత, ధారాశతసముక్షితః = అనేక జలధారలచేత తడబడిన, మహీధరః ఇవ=పర్వతము వలె, వ్యథామ్=వ్యథను, న చకార = చేయలేదు.

తా. యక్షులు ఆయుధముతో కొట్టుచున్నను ఆ రావణుడు, మేఘముల చేత, జలధారలతో కొట్టబడిన పర్వతము వలె, ఏ మాత్రము వ్యథ చెందలేదు. 13

మూ. స మహాత్మా సముద్యమ్య కాలదణ్డోపమాం గదామ్,
ప్రవివేశ తతః సైన్యం నయన్ యక్షాన్ యమక్షయమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాత్మా=గొప్ప మనస్సు గల, సః=అతడు, కాలదణ్డోపమామ్ = యమదండముతో సమానమైన, గదామ్ = గదను, సముద్యమ్య = ఎత్తి, యక్షాన్ = యక్షులను, యమక్షయమ్ = యమలోకమును, నయన్ = పొందించుచు, సైన్యమ్ = సైన్యమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. అపుడు ఆ రావణుడు యమదండముతో సమానమైన గదను గ్రహించి యక్షులను యమలోకమునకు పంపుచు ఆ సైన్యములో ప్రవేశించెను. 14

మూ. స కక్షమివ విస్తీర్ణం శుష్కేన్ధనమివాకులమ్,
వాతేనాగ్నిరివాదీప్తో యక్షసైన్యం దదాహ తత్. 15

ప్ర. అ. సః = అతడు, వాతేన = వాయువుచేత, ఆదీప్తః = ప్రజ్వలించు చున్న, అగ్నిరివ = అగ్ని వలె, విస్తీర్ణమ్ = విశాలమైన, శుష్కేన్ధనమ్=ఎండిన కట్టెలు గల, ఆకులమ్=వ్యాకులమైన, కక్షమివ=దొంకను వలె, తత్=ఆ, యక్షసైన్యమ్=యక్షులసైన్యమును, దదాహ = కాల్చెను.

తా. ఆ రావణుడు, వాయువుచే మండింపచేయబడిన అగ్ని ఎండిన కట్టెలతో చిందరవందరగా ఉన్న విశాలమైన దొంకను కాల్చివేసినట్లు ఆ యక్షుల సైన్యమును కాల్చివేసెను. 15

మూ. తైస్తు తత్ర మహామాత్యైర్మహోదరశుకాదిభిః,
అల్పావశేషాస్తే యక్షాః కృతా వాతైరివామ్బుదాః. 16

ప్ర. అ. తత్ర = అక్కడ, మహోదరశుకాదిభిః = మహోదరుడు, శుకుడు మొదలైన, తైః = ఆ, మహామాత్యైః = మహామంత్రులచేత, తే యక్షాః = ఆ యక్షులు, వాతైః = వాయువులచేత, అమ్బుదాః ఇవ = మేఘములు వలె, అల్పావశేషాః = కొంచెమే మిగిలినవారుగా, కృతాః = చేయబడిరి.

తా. అక్కడ మహోదరుడు, శుకుడు మొదలైన మహామాత్యులు, వాయువులు మేఘములను వలె, ఆ యక్షులను కొంచెమే మిగులునట్లు చేసిరి. 16

మూ. కేచిత్సమాహతా భగ్నాః పతితాః సమరే క్షితౌ,
ఓష్ఠాంశ్చ దశనైస్తీక్ష్ణైరదశన్ కుపితా రణే. 17

ప్ర. అ. కేచిత్ = కొందరు, సమాహతాః = కొట్టబడినవారై, సమరే = యుద్ధమునందు, భగ్నాః = ఓడిపోయినవారై. క్షితౌ = నేలమీద, పతితాః = పడిరి, కుపితాః = కోపించిన కొందరు, రణే = యుద్ధమునందు, తీక్ష్ణైః = తీక్ష్ణములైన, దశనైః = దంతములచేత, ఓష్ఠాన్ = పెదవులను, అదశన్ చ = కరచిరి.

తా. ఆ యుద్ధములో కొందరు దెబ్బలు తిని, పరాజితులై నేలమీద పడిపోయిరి. మరి కొందరు కోపముతో వాడియైన పండ్లతో పెదవులు కొరికిరి. 17

మూ. శ్రాన్తాశ్చాన్యోన్యమాలిఙ్గ్య భ్రష్టశస్త్రా రణాజిరే,
సీదన్తి చ తదా యక్షాః కూలా ఇవ జలేన హ. 18

ప్ర. అ. రణాజిరే = యుద్ధభూమియందు, శ్రాన్తాః = అలసిపోయిన, యక్షాః = యక్షులు, తదా = అప్పుడు, భ్రష్టశస్త్రాః = జారిపోయిన ఆయుధములు గలవారై, అన్యోన్యమ్ = పరస్పరము, ఆలిఙ్గ్య = కౌగలించుకొని, జలేన = నీటిచేత, కూలా ఇవ = ఒడ్డువలె, సీదన్తి = నశించుచున్నారు.

తా. అప్పుడు కొందరు యక్షులు అలసిపోయి, శస్త్రములు జారవిడచి, ఒకరి నొకరు కౌగలించుకొనుచు, నీటిచేత నదుల ఒడ్లు వలె కూలిపోయిరి. 18

మూ. హతానాం గచ్ఛతాం స్వర్గం యుధ్యతామథ ధావతామ్,
ప్రేక్షతామృషిసంఘానాం బభూవ న తదాన్తరమ్. 19

ప్ర. అ. అథ = అటుపిమ్మట, హతానామ్ = చంపబడిన యక్షులు, స్వర్గమ్ = స్వర్గమును గూర్చి, గచ్ఛతామ్ = వెళ్ళుచుండగా, యుధ్యతామ్ = యుద్ధముచేయుచున్నవాళ్ళు, ధావతామ్ = పారిపోవుచుండగా, తదా = అప్పుడు, ప్రేక్షతామ్ = చూచుచున్న, ఋషిసంఘానామ్ = ఋషుల సముదాయములకు, అన్తరమ్ = అవకాశము, న బభూవ = లేకపోయెను.

తా. చంపబడిన యక్షు లందరు స్వర్గమునకు పోవుచుండిరి. యుద్ధము చేయుచున్న కొందరు పారిపోవుచుండిరి. అందుచే అక్కడ చూచుటకై వచ్చిన ఋషులకు ఆకాశమున నిలచుటకు చోటు లేకపోయెను. 19

మూ. భగ్నాంస్తు తాన్ సమాలక్ష్య యక్షేన్ద్రాంస్తు మహాబలాన్,
ధనాధ్యక్షో మహాబాహుః ప్రేషయామాస యక్షకాన్. 20

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల, ధనాధ్యక్షః = కుబేరుడు, భగ్నాన్ = ఓడిపోయిన, మహాబలాన్ = గొప్ప బలముగల, తాన్ = ఆ, యక్షేన్ద్రాన్ = యక్షాధిపతులను, సమాలక్ష్య = చూచి, యక్షకాన్ = యక్షులను, ప్రేషయామాస = పంపెను.

తా. గొప్ప బాహువులు గల కుబేరుడు ఆ యక్షనాయకులు ఓడిపోవుట చూచి మరికొందరు యక్షులను పంపెను. 20

మూ. ఏతస్మిన్నన్తరే రామ విస్తీర్ణబలవాహనః,
ప్రేషితో న్యపతద్యక్షో నామ్నా సంయోధకణ్టకః. 21

ప్ర. అ రామ = రామా! ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యయందు, విస్తీర్ణ బలవాహనః = అధికమైన సైన్యము వాహనములు గల, నామ్నా = పేరుచేత, సంయోధకణ్టకః = సంయోధకంటకుడను, యక్షః = యక్షుడు, ప్రేషితః = పంపబడినవాడై, న్యపతత్ = శీఘ్రముగా వచ్చెను.

తా. రామా! ఈలోపుగా అధికమైన సైన్యముతోను, వాహనములంతోను సంయోధకంటకు దను యక్షుడు కుబేరుడు పంపగా శీఘ్రముగా రణరంగమునకు వచ్చెను. 21

మూ. తేన చక్రేణ మారీచో విష్ణునేవ రణే హతః,
పతితో భూతలే శైలాత్ క్షీణపుణ్య ఇవ గ్రహః. 22

ప్ర. అ. తేన = ఆ యక్షునిచేత, విష్ణునేవ = విష్ణువుచేత వలె, చక్రేణ = చక్రముచేత, మారీచః = మారీచుడు, రణే = యుద్ధమునందు, హతః = కొట్టబడినవాడై, క్షీణపుణ్యః = క్షీణించిన పుణ్యము గల, గ్రహః ఇవ = గ్రహము వలె, శైలాత్ = పర్వతమునుండి, భూతలే = నేలమీద, పతితః = పడెను.

తా. ఆ యక్షుడు విష్ణువు వలె, యుద్ధమునందు చక్రముతో కొట్టగా మారీచుడు, పుణ్యము క్షీణించిన నక్షత్రము వలె పర్వతమునుండి నేలమీద పడెను. 22

మూ ససంజ్ఞస్తు ముహూర్తేన స విశ్రమ్య నిశాచరః,
తం యక్షం యోధయామాస స చ భగ్నః ప్రదుద్రువే. 23

ప్ర. అ. ముహూర్తేన = ముహూర్తకాలముచేత, ససంజ్ఞః = సంజ్ఞతో కూడిన, సః నిశాచరః = ఆ రాక్షసుడు, విశ్రమ్య = విశ్రమించి, తమ్ = ఆ, యక్షమ్ = యక్షుణ్ణి, యోధయామాస = యుద్ధము చేయించెను. సః చ = అతడు, భగ్నః = ఓడిపోయినవాడై, ప్రదుద్రువే = పారిపోయెను.

తా. ఆ మారీచుడు ముహూర్తకాలములో స్పృహ చెంది, కొంచెము విశ్రమించి ఆ యక్షునితో యుద్ధము చేసెను. అతడు పరాజితుడై పారిపోయెను. 23

మూ. తతః కాఞ్చనచిత్రాఙ్గం వైదూర్యరజసోక్షితమ్,
మర్యాదాం ప్రతిహారాణాం తోరణాన్తరమావిశత్. 24

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కాఞ్చనచిత్రాఙ్గమ్ = బంగారముచేత విచిత్రములైన అవయవములు గలది, వైదూర్యరజసా = వైదూర్యముల పరాగముచేత, ఉక్షితమ్ = చల్లబడినది, ప్రతిహారాణామ్ = ద్వారపాలకులయొక్క,

మర్యాదామ్ = హద్దు అయిన, తోరణాన్తరమ్ = ముఖద్వారమధ్యమును, ఆవిశత్ = ప్రవేశించెను.

తా. పిమ్మట రావణుడు ద్వారపాలకులు నిలచు సరిహద్దు అయిన ముఖ ద్వార మధ్యభాగములో ప్రవేశించెను. దాని భాగములు బంగారముచేత విచిత్రములుగా ఉండెను. ఆప్రాంతములందు వైడూర్యమాణిక్యముల పొడి చల్లబడెను. 24

మూ. తం తు రాజన్ దశగ్రీవం ప్రవిశన్తం నిశాచరమ్,
సూర్యభానురితి ఖ్యాతో ద్వారపాలో న్యవారయత్. 25

ప్ర. అ. రాజన్ = రాజా! ప్రవిశన్తమ్ = ప్రవేశించుచున్న, నిశాచరమ్ = రాక్షసుడైన, తమ్ = ఆ, దశగ్రీవమ్ = రాక్షసుణ్ణి, సూర్యభానుః ఇతి = సూర్యభానుడు అని, ఖ్యాతః = ప్రసిద్ధి చెందిన, ద్వారపాలః = ద్వారపాలుడు, న్యవారయత్ = నివారించెను.

తా. రామా! నిశాచరుడైన రావణుడు ప్రవేశించుచుండగా అతనిని సూర్యపాలు డను ద్వారపాలుడు అడ్డుకొనెను. 25

మూ. స వార్యమాణో యక్షేణ ప్రవివేశ నిశాచరః,
యదా తు వారితో రామ న వ్యతిష్ఠత్సరాక్షసః, 26
తతస్తోరణముత్పాట్య తేన యక్షేణ తాడితః.

ప్ర. అ. సః నిశాచరః = ఆ రావణుడు, యక్షేణ = యక్షునిచేత, వార్యమాణః = నివారింపబడుచున్నను, ప్రవివేశ = ప్రవేశించెను. రామ = రామా! వారితః = నివారింపబడిన, సః రాక్షసః = ఆ రాక్షసుడు, యదా = ఎప్పుడు, న వ్యతిష్ఠత్ = నిలబడలేదో, తతః = అటుపిమ్మట, తోరణమ్ = తోరణమును, ఉత్పాట్య = పెకలించి, తేన యక్షేణ = ఆ యక్షునిచేత, తాడితః = కొట్టబడెను. 26

తా. ఆ విధముగా యక్షునిచేత నివారింపబడుచున్నను రావణుడు ప్రవేశించెను. రామా! నివారించినను ఆగని ఆ రాక్షసుణ్ణి యక్షుడు ఆ తోరణమును పెకలించి కొట్టెను. 26

మూ. రుధిరం ప్రస్రవన్ భాతి శైలో ధాతుస్రవైరివ, 27
స శైలశిఖరాభేణ తోరణేన సమాహతః,
జగామ న క్షతిం వీరో వరదానాత్ స్వయంభువః. 28

ప్ర. అ. శైలశిఖరాభేణ = పర్వతశిఖరము వంటి, తోరణేన = తోరణము చేత, సమాహతః = కొట్టబడిన, వీరః = వీరుడైన, సః = ఆ రావణుడు, రుధిరమ్ = రక్తమును, ప్రస్రవన్ = స్రవించుచు, ధాతుస్రవైః = ధాతుస్రావములచేత, శైలః ఇవ = పర్వతము వలె, భాతి = ప్రకాశించుచున్నాడు. స్వయంభువః = బ్రహ్మయొక్క, వరదానాత్ = వరదానమువలన, క్షతిమ్ = వినాశమును, న జగామ = పొందలేదు.

తా. వీరుడైన రావణుడు పర్వతశిఖరము వంటి ఆ తోరణముచేత కొట్టబడి రక్తము కార్చుచు గైరికాది ధాతుస్రావములతో (పర్వతాళ్లమీద వేరు వేరు రంగుల రాళ్ళు కరిగి కారుచుండును. వాటిలో గైరికధాతువు ఎఱ్ఱగా ఉండును. ఆ రంగులకు ధాతువు లని పేరు) పర్వతమువలె ప్రకాశించెను. కాని బ్రహ్మవరము లిచ్చి ఉండుటచే మరణించలేదు. 27, 28

మూ. తేనైవ తోరణేనాథ యక్షస్తేనాభితాడితః,
నాదృశ్యత తదా యక్షో భస్మీకృతతనుస్తదా. 29

ప్ర. అ. అథ = అటుపిమ్మట, యక్షః = యక్షుడు, తేన = వానిచేత, తేన తోరణేనైవ = ఆ తోరణముచేతనే, అభితాడితః = కొట్టబడెను. తదా = అప్పుడు, భస్మీకృతతనుః = భస్మముచేయబడిన శరీరము గల, యక్షః = యక్షుడు, తదా = అప్పుడు, నాదృశ్యత = చూడబడలేదు.

తా. పిమ్మట రావణుడు ఆ తోరణముతోనే ఆ యక్షుణ్ణి కొట్టగా అతని శరీరము చూర్ణమైపోగా అతడు కనబడలేదు. 29

మూ. తతః ప్రదుద్రువుః సర్వే దృష్ట్వా రక్షఃపరాక్రమమ్,
తతో నదీర్గుహాశ్చైవ వివిశుర్భయపీడితాః, 30
త్యక్తప్రహరణాః శ్రాన్తా వివర్ణవదనాస్తదా.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుర్దశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సర్వే = అందరూ, రక్షఃపరాక్రమమ్ = రాక్షసుని పరాక్రమమును, దృష్ట్వా = చూచి, ప్రదుద్రువుః = పారిపోయిరి. తతః

=అటుపిమ్మట, భయపీడితాః=భయముచేత పీడింపబడినవారై, త్యక్తప్రహరణాః =విడవబడిన ఆయుధములు గలవారై, శ్రాన్తాః=అలసినవారై, తదా=అప్పుడు, వివర్ణవదనాః = రంగులు చెడిన ముఖములు గలవారై, నదీః = నదులను, గుహాశ్చైవ = గుహలను, వివిశుః = ప్రవేశించిరి.

తా. పిమ్మట యక్షులందరూ ఆ రాక్షసుని పరాక్రమమును చూచి పారిపోయిరి. భయపీడితులై, అలసి, ఆయుధములు విడచి, రంగుమారిపోయిన ముఖాలతో నదులలోను, గుహలలోను ప్రవేశించిరి. 30

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో పదునాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చదశః సర్గః

[మాణిభద్రకుబేరులు ఓడిపోవుట. రావణుడు పుష్పకమును అపహరించుట].

మూ. తతస్తాంల్లక్ష్య విత్రస్తాన్ యక్షేన్ద్రాంశ్చ సహస్రశః,
ధనాధ్యక్షో మహాయక్షం మాణిభద్రమథాబ్రవీత్. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ధనాధ్యక్షః = కుబేరుడు, విత్రస్తాన్ = భయపడిన, సహస్రశః = వేలకొలది, తాన్ = ఆ, యక్షేన్ద్రాన్ = యక్షనాయకులను, లక్ష్య = చూచి, మహాయక్షమ్ = గొప్ప యక్షుడైన, మాణిభద్రమ్ = మణిభద్రుణ్ణిగూర్చి. అథ = అటుపిమ్మట, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట కుబేరుడు భయపడి పారిపోవుచున్న వేలకొలది యక్షనాయకులను చూచి మహాయక్షుడైన మాణిభద్రునితో ఇట్లు పలికెను. 1

మూ. రావణం జహి యక్షేన్ద్ర దుర్వృత్తం పాపచేతసమ్,
శరణం భవ వీరాణాం యక్షాణాం యుద్ధశాలినామ్. 2

ప్ర. అ. యక్షేన్ద్ర = యక్షనాయకుడా! దుర్వృత్తమ్ = చెడ్డ నడవడిక గల, పాపచేతసమ్ = పాపమైన చిత్తము గల, రావణమ్ = రావణుణ్ణి, జహి = చంపుము. వీరాణామ్ = వీరులు, యుద్ధశాలినామ్=యుద్ధములో ప్రకాశించువారూ అయిన, యక్షాణామ్ = యక్షులకు, శరణమ్ = రక్షకుడవుగా, భవ = అగుము.

తా. ఓ! యక్షనాయకా! దుష్టప్రవృత్తి, పాపమైన మనస్సు గల రావణుణ్ణి చంపుము. యుద్ధములో ప్రకాశించు వీరులైన యక్షులకు శరణము అగుము.

మూ. ఏవముక్తో మహాబాహుర్మాణిభద్రః సుదుర్జయః,
వృతో యక్షసహస్రైస్తు చతుర్భిః సమయోధయత్. 3

ప్ర అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, మహాబాహుః = గొప్ప బాహువులు గల, సుదుర్జయః = జయించుటకు మిక్కిలి శక్యము కాని, మాణిభద్రః = మాణిభద్రుడు, చతుర్భిః = నాలుగు, యక్షసహస్రైః = యక్షుల సహస్రములతో, వృతః = కూడినవాడై, సమయోధయత్ = యుద్ధము చేయించెను.

తా. గొప్ప బాహువులు గల, జయించుటకు ఏ మాత్రమూ శక్యము కాని ఆ మాణిభద్రుడు ఆ మాటలు విని, నాలుగువేలమంది యక్షులతో కలిసి వెళ్ళి యుద్ధము చేసెను. 3

మూ. తే గదాముసలప్రాసైః శక్తితోమరముద్గరైః,
అభిఘ్నన్తస్తదా యక్షా రాక్షసాన్ సముపాద్రవన్. 4

ప్ర. అ. తదా = అప్పుడు, తే యక్షాః = ఆ యక్షులు, రాక్షసాన్ = రాక్షసులను, గదాముసలప్రాసైః = గదలతోను, రోకళ్ళతోను, ప్రాసలతోను, శక్తితోమరముద్గరైః = శక్తులతోను తోమరములతోను, ముద్గరములతోను, అభిఘ్నన్తః = కొట్టుచు, సముపాద్రవన్ = శీఘ్రముగా వెళ్ళిరి.

తా. అప్పుడు ఆ యక్షులు రాక్షసులను గదలతోను, ముసలములతోను, ప్రాసలతోను, శక్తులతోను, తోమరములతోను, ముద్గరములతోను కొట్టుచు, శీఘ్రముగా వాళ్ళమీదికి పరుగెత్తి వెళ్ళిరి. 4

మూ. కుర్వన్తస్తుములం యుద్ధం చరన్తః శ్యేనవల్లఘు,
బాఢం ప్రయచ్ఛ నేచ్ఛామి దీయతామితి భాషిణః. 5

ప్ర. అ. తుములమ్ = వ్యాకులమైన, యుద్ధమ్ = యుద్ధమును, కుర్వన్తః = చేయుచున్నవారై, శ్యేనవత్ = డేగల వలె, లఘు = శీఘ్రముగా, చరన్తః = సంచరించుచున్నవారై, బాఢమ్ = తప్పక, ప్రయచ్ఛ = ఇమ్ము. న ఇచ్ఛామి = ఇచ్ఛయించను. దీయతామ్ = ఖండించబడుగాక. ఇతి = అని, భాషిణః = మాటలాడుచు, (వెళ్ళిరి).

తా. ఆ యక్షులు చాల వ్యాకులమైన యుద్ధము చేయుచు, డేగల వలె శీఘ్రముగా సంచరించుచు, "తప్పక (యుద్ధమును)ఇమ్ము; (వెనుకకు మరలుటకు) ఇచ్ఛయించను. (వాని ఆయుధాదికము) ఖండించుము"అని పలుకుచు వెళ్ళిరి. 5

మూ. తతో దేవాః సగన్ధర్వా ఋషయో బ్రహ్మవాదినః,
దృష్ట్వా తత్తుములం యుద్ధం పరం విస్మయమాగమన్. 6

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, దేవాః = దేవతలు, బ్రహ్మవాదినః = వేదాధ్యయనము చేయు, ఋషయః = ఋషులు, తుములమ్ = వ్యాకులమైన, తత్ = ఆ, యుద్ధమ్ = యుద్ధమును, దృష్ట్వా = చూచి, పరమ్ = అధికమైన, విస్మయమ్ = ఆశ్చర్యమును, ఆగమన్ = పొందిరి.

తా. అప్పుడు దేవతలు, గంధర్వులు, వేదాధ్యయనము చేయు ఋషులు వ్యాకులమైన ఆ యుద్ధమును చూచి ఆశ్చర్యపడిరి. 6

మూ. యక్షాణాం తు ప్రహస్తేన సహస్రం నిహతం రణే,
మహోదరేణ చానిన్ద్యం సహస్రమపరం హతమ్. 7

ప్ర. అ. రణే = యుద్ధమునందు, ప్రహస్తేన = ప్రహస్తునిచేత, యక్షాణామ్ = యక్షులయొక్క, సహస్రమ్ = సహస్రము, నిహతమ్ = చంపబడినది. మహోదరేణ = మహోదరునిచేత. అనిన్ద్యమ్ = నిందింపదగని, అపరమ్ = మరియొక, సహస్రమ్ = సహస్రము, హతమ్ = చంపబడినది.

తా. యుద్ధములో ప్రహస్తుడు వెయ్యిమంది యక్షులను చంపెను. మహోదరుడు నిందింపదగని వెయ్యిమంది యక్షులను చంపెను. 7

మూ. క్రుద్ధేన చ తదా రాజన్ మారీచేన యుయుత్సునా,
నిమేషాన్తరమాత్రేణ ద్వే సహస్రే నిపాతితే. 8

ప్ర. అ. రాజన = రాజా! తదా = అప్పుడు, క్రుద్ధేన = కోపించిన, యుయుత్సునా = యుద్ధముచేయ దలచిన, మారీచేన = మారీచునిచేత, నిమేషాన్తరమాత్రేణ = నిమేషము మాత్రము వ్యవధానములో, ద్వే సహస్రే = రెండు వేలు, నిపాతితే = పడగొట్టబడినవి.

తా. రాజా! అప్పుడు కోపించిన, యుద్ధోత్సాహ వంతుడైన మారీచుడు నిమేషము కాలములో రెండు వేలమంది యక్షులను చంపెను. 8

మూ. క్వ చ యక్షార్జవం యుద్ధం క్వ చ మాయాబలాశ్రయమ్,
రక్షసాం పురుషవ్యాఘ్ర తేన తేఽభ్యధికా యుధి. 9

ప్ర. అ. పురుషవ్యాఘ్ర = పురుషులలో శ్రేష్ఠుడవైన రామా ! యక్షార్జవమ్ = యక్షుల ఆర్జవముతో కూడిన (కపటములేని), యుద్ధమ్=యుద్ధము, క్వ చ = ఎక్కడ ? రక్షసామ్=రాక్షసులయొక్క, మాయాబలాశ్రయమ్=మాయాబలము ఆశ్రయముగా గల యుద్ధము, క్వ చ = ఎక్కడ ? తేన = ఆ కారణముచేత, తే = ఆ రాక్షసులు, యుధి = యుద్ధమునందు, అభ్యధికాః = అధికులు.

తా. పురుషశ్రేష్ఠుడవైన రామా ! కపటము లేని యక్షుల యుద్ధ మెక్కడ; మాయాబలముమీద ఆధారపడిన రాక్షసుల యుద్ధము ఎక్కడ ? ఆ కారణము చేతనే రాక్షసులు యుద్ధములో అధికులు. 9

మూ. ధూమ్రాక్షేణ సమాగమ్య మాణిభద్రో మహారణే,
ముసలేనోరసి క్రోధాత్తాడితో న చ కమ్పితః. 10

ప్ర. అ. మహారణే = మహాయుద్ధమునందు, ధూమ్రాక్షేణ = ధూమ్రాక్షుని చేత, సమాగమ్య = వచ్చి, మాణిభద్రః = మాణిభద్రుడు, ముసలేన = ముసలము చేత, క్రోధాత్ = కోపమువలన, ఉరసి=వక్షఃస్థలముమీద, తాడితః=కొట్టబడెను; న చ కమ్పితః = కంపించలేదు.

తా. ఆ మహాయుద్ధములో ధూమ్రాక్షుడు మాణిభద్రుని సమీపించి ముసలముతో అతని వక్షఃస్థలముమీద కొట్టెను; కాని అతడు కంపించలేదు. 10

మూ. తతో గదాం సమావిధ్య మాణిభద్రేణ రాక్షసః,
ధూమ్రాక్షస్తాడితో మూర్ధ్ని విహ్వలః స పపాత హ. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాక్షసః = రాక్షసుడైన, ధూమ్రాక్షః = ధూమ్రాక్షుడు, మాణిభద్రేణ = మాణిభద్రునిచేత, గదామ్ = గదను, సమావిధ్య= గట్టిగా ఊపి, మూర్ధ్ని = శిరస్సుపై, తాడితః = కొట్టబడెను. సః = అతడు, విహ్వలః = వ్యాకులుడై, పపాత హ = పడెను.

తా. పిమ్మట మాణిభద్రుడు గదను వేగముగా ఊపి ధూమ్రాక్షుని వక్షఃస్థలముమీద కొట్టగా అతడు వ్యాకులుడై పడిపోయెను. 11

మూ. ధూమ్రాక్షం తాడితం దృష్ట్వా పతితం శోణితోక్షితమ్,
అభ్యధావత సంగ్రామే మాణిభద్రం దశాననః. 12

ప్ర. అ. తాడితమ్=కొట్టబడిన, పతితమ్=పడిపోయిన, శోణితోక్షితమ్=రక్తముచేత పూయబడిన, ధూమ్రాక్షమ్=ధూమ్రాక్షుణ్ణి, దృష్ట్వా = చూచి, దశాననః = రావణుడు, సంగ్రామే = యుద్ధమునందు, మాణిభద్రమ్ = మాణిభద్రుణ్ణి గూర్చి, అభ్యధావత = పరుగెత్తెను.

తా. ధూమ్రాక్షుడు కొట్టబడి రక్తము స్రవించుచు పడిపోవుట చూచి రావణుడు యుద్ధరంగములో మాణిభద్రునిమీదికి పరుగెత్తెను. 12

మూ. సంక్రుద్ధమభిధావన్తం మాణిభద్రో దశాననమ్,
శక్తిభిస్తాడయామాస తిసృభిర్యక్షపుంగవః. 13

ప్ర. అ. యక్షపుంగవః = యక్షశ్రేష్ఠుడైన, మాణిభద్రః=మాణిభద్రుడు, సంక్రుద్ధమ్ = కోపించిన, అభిధావన్తమ్ = పరుగెత్తి వచ్చుచున్న, దశాననమ్ = రావణుణ్ణి, తిసృభిః = మూడు, శక్తిభిః = శక్తులతో, తాడయామాస=కొట్టెను.

తా. కోపముతో తనమీదికి వచ్చుచున్న ఆ రావణుణ్ణి, యక్షులలో శ్రేష్ఠుడైన మాణిభద్రుడు మూడు శక్తులతో కొట్టెను. 13

మూ. తాడితో మాణిభద్రస్య ముకుటే ప్రాహరద్రణే,
తస్య తేన ప్రహారేణ ముకుటం పర్యవస్థితమ్. 14

ప్ర. అ. తాడితః = కొట్టబడిన రావణుడు, రణే=యుద్ధమునందు, మాణిభద్రస్య = మాణిభద్రునియొక్క, ముకుటే=కిరీటముపైన, ప్రాహరత్=కొట్టెను, తస్య = వానియొక్క, తేన ప్రహారేణ = ఆ దెబ్బచేత, ముకుటమ్ = కిరీటము, పర్యవస్థితమ్=వంకర తిరిగినది.

తా. ఆ విధముగా యుద్ధములో కొట్టబడిన రావణుడు మాణిభద్రుని కిరీటముమీద కొట్టగా ఆ దెబ్బకు అతని కిరీటము ప్రక్కకు తిరిగిపోయెను. 14

మూ. తతః సంయుధ్యమానేన విష్టబ్ధో న వ్యకమ్పత,
తతః ప్రభృతి యక్షోఽసౌ పార్శ్వమౌలిరభూత్కిల. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సంయుధ్యమానేన=యుద్ధముచేయుచున్న మాణిభద్రునిచేత, విష్టబ్ధః = ఎదిరించబడినవాడై, న వ్యకమ్పత = కంపించలేదు,

తతః ప్రభృతి = అది మొదలు, అసౌ యక్షః = ఈ యక్షుడు, పార్శ్వమౌలిః = పార్శ్వమౌలిగా (ప్రక్కకు శిరస్సు కలవాడుగా) అభూత్ కిల = అయెనట.

తా. పిమ్మట ఆ మాణిభద్రుడు యుద్ధముచేయుచు ఎదిరించినను రావణుడు కంపించలేదు. అది మొదలు మణిభద్రుడు 'పార్శ్వమౌలి'గా ప్రసిద్ధి చెందెను. 15

మూ. తస్మింస్తు విముఖీభూతే మాణిభద్రే మహాత్మని,
సంనాదః సుమహాన్ రాజంస్తస్మిన్ శైలే వ్యవర్ధత. 16

ప్ర. అ. రాజన్ = రాజా! మహాత్మని = మహాత్ముడైన, తస్మిన్ = ఆ, మాణిభద్రే = మాణిభద్రుడు, విముఖీభూతే = విముఖు డగుచుండగా, తస్మిన్ శైలే = ఆ పర్వతమునందు, సుమహాన్ = చాల గొప్పదైన, సంనాదః = ధ్వని, వ్యవర్ధత = పెరిగెను.

తా. రాజా! మహాత్ముడైన ఆ మాణిభద్రుడు విముఖుడై వెళ్ళిపోగా ఆ పర్వతము మీద చాల అధికమైన శబ్దము వృద్ధి పొందెను. 16

మూ. తతో దూరాత్ప్రదదృశే ధనాధ్యక్షో గదాధరః,
శుక్రప్రౌష్ఠపదాభ్యాం చ పద్మశఙ్ఖసమావృతః. 17

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ధనాధ్యక్షః = కుబేరుడు, గదాధరః = గదను ధరించినవాడై, శుక్రప్రౌష్ఠపదాభ్యాం చ = శుక్రప్రౌష్ఠపదులతో, పద్మశఙ్ఖసమావృతః = పద్మము, శంఖము అను నిధులతో కూడినవాడై, దూరాత్ = దూరమునుండి, ప్రదదృశే = చూడబడెను.

తా. పిమ్మట కుబేరుడు శుక్రుడు, ప్రౌష్ఠపదుడు అను మంత్రులతోను, పద్మము, శంఖము అను నిధుల అధిష్ఠానదేవతలలోను కూడి, గద ధరించి దూరమునుండి కనబడెను. 17

మూ. స దృష్ట్వా భ్రాతరం సంఖ్యే శాపాద్విభ్రష్టగౌరవమ్,
ఉవాచ వచనం ధీమాన్ యుక్తం పైతామహే కులే. 18

ప్ర. అ. ధీమాన్ = బుద్ధిమంతుడైన, సః = ఆ కుబేరుడు, సంఖ్యే = యుద్ధమునందు, శాపాత్ = శాపమువలన, విభ్రష్టగౌరవమ్ = నశించిన గౌరవము

గల, భ్రాతరమ్ = సోదరుణ్ణి, దృష్ట్వా = చూచి, పైతామహే కులే = బ్రహ్మ కులమునందు, యుక్తమ్ = తగిన, వచనమ్ = వచనమును, ఉవాచ = పలికెను.

తా. బుద్ధిమంతుడైన ఆ కుబేరుడు శాపవశముచేత గౌరవమును పోగొట్టు కొనిన ఆ రావణుణ్ణి యుద్ధములో చూచి, బ్రహ్మదేవుని కులములో పుట్టినవాడు పలకదగిన మాట పలికెను. 18

మూ. యన్మయా వార్యమాణస్త్వం నావగచ్ఛసి దుర్మతే,
పశ్చాదస్య ఫలం ప్రాప్య జ్ఞాస్యసే నిరయం గతః. 19

ప్ర. అ. దుర్మతే = దుష్టబుద్ధి గలవాడా ! మయా = నాచేత, వార్యమాణః = నివారించబడుచున్నను, త్వమ్ = నీవు, యత్ = ఏ కారణమువలన, నావగచ్ఛసే = తెలుసుకొనుటలేదో, ఆ కారణమువలన, పశ్చాత్ = పిమ్మట, నిరయమ్ = నరకమును, గతః = పొందినవాడవై, అస్య = దీనియొక్క, ఫలమ్ = ఫలమును, జ్ఞాస్యసే = తెలిసికొనగలవు.

తా. ఓ ! దుర్బుద్ధీ ! నేను నివారించుచున్నను నీవు తెలుసుకొనుటలేదు. కొంత కాలము తరవాత నరకములో పడి నీవు దీనిఫలమును తెలిసికొనగలవు.

మూ. యో హి మోహాద్విషం పీత్వా నావగచ్ఛతి దుర్మతిః,
స తస్య పరిణామాన్తే జానీతే కర్మణః ఫలమ్. 20

ప్ర. అ. దుర్మతిః = దుష్టబుద్ధి గల, యః = ఎవడు, మోహాత్ = అజ్ఞానము వలన, విషమ్ = విషమును, పీత్వా = త్రాగి నావగచ్ఛతి = తెలుసుకొనడో, సః = అతడు, పరిణామాన్తే = జీర్ణించిన పిమ్మట, తస్య కర్మణః = ఆ కర్మ యొక్క, ఫలమ్ = ఫలమును, జానీతే = తెలుసుకొనును.

తా. తెలివితక్కువతనముచేత విషము త్రాగిన బుద్ధివిహీనుడు అది జీర్ణించినప్పుడు తాను చేసిన కర్మఫలమును తెలిసికొనును. 20

మూ. దేవతా నాభినన్దన్తి ధర్మయుక్తేన కేన చిత్,
యేన త్వమీదృశం భావం నీతస్తచ్చ న బుధ్యసే. 21

ప్ర. అ. ధర్మయుక్తేన = ధర్మముతో కూడిన, కేనచిత్ = ఒకానొక పని

చేత, దేవతాః = దేవతలు, నాభినన్దన్తి = అభినందించరు. త్వమ్ = నీవు, యేన = దేనిచేత, ఈదృశమ్ = ఇట్టి భావమ్ = భావమును, నీతః = పొందించబడితివో, తచ్చ = దానిని కూడ, నావబుధ్యసే = తెలిసికొనుటలేదు.

తా. నీవు ఏదైన ధర్మసంమతమైన పని చేసినను దేవతలు అభినందించరు. నీకు ఇట్టి దుష్టబుద్ధి ఎందుకు కలిగినదో ఆ విషయమును తెలిసికొనజాలకున్నావు.

మూ. మాతరం పితరం విప్రమాచార్యం చావమన్య వై,
స పశ్యతి ఫలం తస్య ప్రేతరాజవశం గతః. 22

ప్ర. అ. మాతరమ్ = తల్లిని, పితరమ్ = తండ్రిని, విప్రమ్ = బ్రాహ్మణుని, ఆచార్యమ్ = గురువును, అవమన్య వై = అవమానించి, సః = వాడు, ప్రేతరాజవశమ్ = యముని వశమును, గతః = పొందినవాడై, తస్య ఫలమ్ = దాని ఫలమును, పశ్యతి = చూచును.

తా. తల్లిని, తండ్రిని, బ్రాహ్మణుని, గురువును అవమానించినవాడు మరణానంతరము తాను చేసిన పనికి ఫలము అనుభవించగలడు. 22

మూ. అధ్రువే హి శరీరే యో న కరోతి తపోర్జనమ్,
స పశ్చాత్తప్యతే మూఢో మృతో గత్వాత్మనో గతిమ్. 23

ప్ర. అ. శరీరే = శరీరము, అధ్రువే = అస్థిరమై ఉండగా, యః = ఎవడు, తపోర్జనమ్ = తపఃసంపాదనమును, న కరోతి = చేయడో, మూఢః = మూఢుడైన, సః = అతడు, మృతః = మరణించినవాడై, ఆత్మనః = తనయొక్క, గతిమ్ = గతిని, గత్వా = పొంది, పశ్చాత్ = తరువాత, తప్యతే = దుఃఖించును.

తా. ఈ శరీరము అస్థిరము. అట్టి ఈ శరీర మున్నప్పుడే తపస్సంపాదన చేయని మూఢుడు మరణానంతరము తాను పొందవలసిన దుర్గతిని పొంది పశ్చాత్తాపపడును. 23

మూ. ధర్మాద్రాజ్యం ధనం సౌఖ్యమధర్మాద్దుఃఖమేవ చ,
తస్మాద్ధర్మం సుఖార్థాయ కుర్యాత్పాపం విసర్జయేత్. 24

ప్ర. అ. ధర్మాత్ = ధర్మమువలన, రాజ్యమ్ = రాజ్యము, ధనమ్ = ధనము,

సౌఖ్యమ్ = సౌఖ్యము కలుగును, అధర్మాత్ = అధర్మమువలన, దుఃఖమేవ చ = దుఃఖము కలుగును, తస్మాత్ = ఆ కారణమువలన, సుఖార్థాయ = సుఖముకొరకై, ధర్మమ్ = ధర్మమును, కుర్యాత్ = చేయవలెను. పాపమ్ = పాపమును, విసర్జయేత్ = విడువవలెను.

తా. ధర్మమువలన రాజ్యము, ధనము, సౌఖ్యమూ కలుగును. అధర్మమువలన దుఃఖము కలుగును. అందువలన సుఖము కావలె నన్నచో ధర్మము ఆచరించవలెను. పాపమును విడువవలెను. 24

మూ. పాపస్య హి ఫలం దుఃఖం తద్భోక్తవ్యమిహాత్మనా,
తస్మాదాత్మాపఘాతార్థం మూఢః పాపం కరిష్యతి. 25

ప్ర. అ. పాపస్య = పాపమునకు, ఫలమ్ = ఫలము, దుఃఖమ్ = దుఃఖము. తత్ = అది, ఇహ = ఇక్కడ, ఆత్మనా = తనచేతనే, భోక్తవ్యమ్ = అనుభవించదగినది. తస్మాత్ = ఆ కారణమువలన, మూఢః = మూఢుడు, ఆత్మాపఘాతార్థమ్ = ఆత్మవినాశముకొరకే, పాపమ్ = పాపమును, కరిష్యతి = చేయగలడు.

తా. పాపమునకు ఫలము దుఃఖము, ఆ దుఃఖమును ఇక్కడ చేసినవాడే అనుభవించవలసి ఉండును. అందుచేత ఎవ్వడూ కూడ మూఢుడై, తన వినాశము కొరకే పాపమును చేయడు. 25

మూ. కస్యచిన్న హి దుర్బుద్ధేశ్ఛన్దతో జాయతే మతిః,
యాదృశం కురుతే కర్మ తాదృశం ఫలమశ్నుతే. 26

ప్ర. అ. దుర్బుద్ధేః = బుద్ధివిహీనుడైన, కస్య చిత్ = ఎవనికిని, మతిః = సద్బుద్ధి, ఛన్దతః = స్వేచ్ఛగా (దానంతట అదిగా) న జాయతే = పుట్టదు. యాదృశమ్ = ఎట్టి, కర్మ = కర్మను, కురుతే = చేయునో, తాదృశమ్ = అట్టి, ఫలమ్ = ఫలమును, అశ్నుతే = పొందును.

తా. బుద్ధివిహీనుడైన ఎవ్వనికీ కూడ మాతృపిత్రాదుల సేవచేయకుండగా తనంతట తానుగా సద్బుద్ధి పుట్టదు. మానవుడు ఎట్టి కర్మ చేయునో అట్టి ఫలమునే పొందును. 26

మూ. బుద్ధిరూపం ఫలం పుత్రాన్విత్తం శూరత్వమేవ చ,
ప్రాప్నువన్తి నరా లోకే నిర్జితం పుణ్యకర్మభిః. 27

ప్ర. అ. లోకే = లోకమునందు, నరాః = మానవులు, పుణ్యకర్మభిః = పుణ్యకర్మలచేత, నిర్జితమ్ = జయింపబడిన, బుద్ధిరూపమ్ = బుద్ధిరూపమైన, ఫలమ్ = ఫలమును, పుత్రాన్ = పుత్రులను, విత్తమ్ = ధనమును, శూరత్వమేవ చ = శూరత్వమును, ప్రాప్నువన్తి = పొందుదురు.

తా. లోకములో నరులు పుణ్యకర్మలచేత జయించి బుద్ధిరూపమైన ఫలమును, పుత్రులను, ధనమును, శూరత్వమును పొందుదురు 27

మూ. ఏవం నిరయగామీ త్వం యస్య తే మతిరీదృశీ,
న త్వాం సమభిభాషిష్యేఽసద్వృత్తేష్వేష నిర్ణయః. 28

ప్ర. అ. యస్య తే = ఏ నీయొక్క, మతిః = బుద్ధి, ఈదృశీ = ఇట్టిదో, త్వమ్ = అట్టి నీవు, ఏవమ్ = ఇట్లు, నిరయగామీ = నరకమునకు వెళ్ళువాడవు. త్వామ్ = నిన్ను (నీతో), న సమభిభాషిష్యే = మాటలాడను. దుర్వృత్తేషు = చెడ్డ నడవడిక కలవారి విషయమునందు, ఏషః = ఇదే, నిర్ణయః = నిర్ణయము.

తా. ఇట్టి దుర్బుద్ధి గల నీవు నరకమునకే వెళ్ళనున్నావు. నేను నీతో మాటలాడను. చెడ్డ నడవడిక గలవారివిషయమునందు ఇదే నిర్ణయము. 28

మూ. ఏవముక్తాస్తతస్తేన తస్యామాత్యాః సమాహతాః,
మారీచప్రముఖాః సర్వే విముఖా విప్రదుద్రువుః. 29

ప్ర. అ. తేన = అతనిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తాః = పలకబడిన, మారీచప్రముఖాః = మారీచుడు మొదలైన, సర్వే = సమస్తమైన, అమాత్యాః = అమాత్యులు, సమాహతాః = కొట్టబడినవారై, విముఖాః = విముఖులై, విప్రదుద్రువుః = పారిపోయిరి.

తా. మారీచుడు మొదలైన రావణుని అమాత్యు లందరితోను కూడ కుబేరుడు ఇట్లు పలికి వాళ్ళను కొట్టగా వాళ్ళు యుద్ధవిముఖులై పారిపోయిరి.

మూ. తతస్తేన దశగ్రీవో యక్షేన్ద్రేణ మహాత్మనా,
గదయాఽభిహతో మూర్ధ్ని న చ స్థానాత్ప్రకమ్పితః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాత్మనా = మహాత్ముడైన, తేన యక్షేన్ద్రేణ = ఆ కుబేరునిచేత, గదయా = గదతో, మూర్ధ్ని = శిరస్సుమీద, అభిహతః = కొట్టబడిన, దశగ్రీవః = రావణుడు, స్థానాత్ = స్థానమునుండి, న ప్రకమ్పితః = కదల్చబడలేదు.

తా. పిమ్మట మహాత్ముడైన ఆ కుబేరుడు దశగ్రీవుని శిరస్సుమీద గదతో కొట్టెను అయినను అతడు ఉన్న చోటునుండి చలించలేదు. 30

మూ. తతస్తౌ రామ నిఘ్నన్తౌ తదాన్యోన్యం మహామృధే,
న విహ్వలౌ న చ శ్రాన్తౌ బభూవతురమర్షణౌ. 31

ప్ర. అ. రామ = రామా! తతః = అటుపిమ్మట, తదా = అప్పుడు, మహామృధే = మహాయుద్ధమునందు, అన్యోన్యమ్ = పరస్పరము, నిఘ్నన్తౌ = కొట్టుచున్న, అమర్షణౌ = కోపవంతులైన, తౌ = వాళ్ళిద్దరూ, విహ్వలౌ = వ్యాకులులు, న బభూవతుః = కాలేదు, శ్రాన్తౌ చ = అలసట చెందినవారు కూడ, న = కాలేదు.

తా. రామా! అప్పు డా మహాయుద్ధమునందు కోపముతో ఒకరి నొకరు కొట్టుకొనుచున్న ఆ కుబేరరావణులు వ్యాకులత చెందలేదు; అలసట పొందలేదు. 31

మూ. ఆగ్నేయమస్త్రం తస్మై స ముమోచ ధనదస్తదా,
రాక్షసేన్ద్రో వారుణేన తదస్త్రం ప్రత్యవారయత్. 32

ప్ర. అ. తదా = అప్పుడు, ధనదః = కుబేరుడు, తస్మై = వానికి, ఆగ్నేయమ్ అస్త్రమ్ = ఆగ్నేయాస్త్రమును, ముమోచ = విడచెను. రాక్షసేన్ద్రః = రావణుడు, తత్ అస్త్రమ్ = ఆ అస్త్రమును, వారుణేన = వారుణాస్త్రముచేత, ప్రత్యవారయత్ = నివారించెను.

తా. అప్పుడు కుబేరుడు రావణునిపై ఆగ్నేయాస్త్రమును ప్రయోగించగా అతడు వారుణాస్త్రముచేత ఆ అస్త్రమును నివారించెను. 32

మూ. తతో మాయాం ప్రవిష్టోఽసౌ రాక్షసీం రాక్షసేశ్వరః,
రూపాణాం శతసాహస్రం వినాశాయ చకార చ. 33

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాక్షసీమ్ = రాక్షససంబంధమైన, మాయామ్ = మాయను, ప్రవిష్టః = ప్రవేశించిన, అసౌ = ఈ, రాక్షసేశ్వరః = రావణుడు, వినాశాయ = కుబేరుని నాశముకొరకు, రూపాణామ్ = రూపముల యొక్క, శతసాహస్రమ్ = నూరు సహస్రములను, చకార = చేసెను.

తా. అప్పుడు రావణుడు రాక్షసమాయలో ప్రవేశించి కుబేరుని నశింప చేయుటకై ఎన్నో వేల రూపములు సృజించెను. 33

మూ. వ్యాఘ్రో వరాహో జీమూతః పర్వతః సాగరో ద్రుమః,
యక్షో దైత్యస్వరూపీ చ సోఽదృశ్యత దశాననః. 34

ప్ర. అ. సః దశాననః = ఆ రావణుడు, వ్యాఘ్రః = పెద్దపులిగాను, వరాహః = వరాహముగాను, జీమూతః = మేఘముగాను, పర్వతః = పర్వతముగాను, సాగరః = సముద్రముగాను, ద్రుమః = వృక్షముగాను, యక్షః = యక్షుడుగాను, దైత్యస్వరూపీ చ = దైత్యరూపము గలవాడుగాను, అదృశ్యత = చూడబడెను.

తా. రావణుడు పెద్దపులిగాను, వరాహముగాను, మేఘముగాను, పర్వతముగాను, సముద్రముగాను, వృక్షముగాను, యక్షుడుగాను, దైత్యుడుగాను కనబడెను. 34

మూ. బహూని చ కరోతి స్మ దృశ్యతే న త్వసౌ తతః,
ప్రతిగృహ్య తతో రామ మహదస్త్రం దశాననః, 35
జఘాన మూర్ధ్ని ధనదం వ్యావిద్ధ్య మహతీం గదామ్.

ప్ర. అ. బహూని చ = అనేకరూపములను కూడ, కరోతి స్మ = చేసెను. అసౌ తు = ఇతడైతే, న దృశ్యతే = కనబడుటలేదు. తతః = అటుపిమ్మట, రామ = రామా! దశాననః = రావణుడు, మహత్ = గొప్ప, అస్త్రమ్ = అస్త్రమైన, మహతీమ్ = గొప్ప, గదామ్ = గదను, ప్రతిగృహ్య = గ్రహించి, వ్యావిద్ధ్య = గట్టిగా ఊపి, ధనదమ్ = కుబేరుణ్ణి, మూర్ధ్ని = శిరస్సుమీద, జఘాన = కొట్టెను.

తా. రామా! రావణుడు ఇంకా అనేకరూపములు కూడ సృజించెను. తాను

మాత్రము కనబడలేదు. పిమ్మట గొప్ప గద అను ఆయుధమును తీసికొని, దానిని గట్టిగా ఊపి కుబేరుని శిరస్సుమీద కొట్టెను. 35

మూ. ఏవం స తేనాభిహతో విహ్వలః శోణితోక్షితః, 36
కృత్తమూల ఇవాశోకో నిపపాత ధనాధిపః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, తేన = వానిచేత, అభిహతః=కొట్టబడిన, సః= ఆ, ధనాధిపః = కుబేరుడు, విహ్వలః = వ్యాకులుడై, శోణితోక్షితః=రక్తముచేత తడపబడినవాడై, కృత్తమూలః = చేదించబడిన మొదలు గల, అశోకః ఇవ = అశోకవృక్షము వలె, నిపపాత = పడెను.

తా. ఈ విధముగా అతడు కొట్టగా కుబేరుడు వ్యాకులుడై, రక్తముచేత తడిసి, మొదలు చేదించిన అశోకవృక్షము వలె పడిపోయెను. 36

మూ. తతః పద్మాదిభిస్తత్ర నిధిభిః స తదావృతః, 37
ధనదోచ్ఛ్వాసితస్తైస్తు వనమానీయ నన్దనమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః ధనదః = ఆ కుబేరుడు, తత్ర = అక్కడ, పద్మాదిభిః = పద్మము మొదలైన, నిధిభిః = నిధులచేత, ఆవృతః = ఆవరింపబడినవాడై, తైః = ఆ నిధులచేత, నన్దనమ్ = నందన మను, వనమ్ = వనమును గూర్చి, ఆనీయ = తీసికొనివచ్చి, ఉచ్ఛ్వాసితః = ఉచ్ఛ్వసింపచేయబడినాడు.

తా. అప్పుడు పద్మము మొదలైన నిధులు (పద్మాదినిధ్యధిష్ఠానదేవతలు) ఆ కుబేరుని చుట్టూ చేరి, ఆతనిని నందనవనము చేర్చి సేదదీర్చిరి. 37

మూ. నిర్జిత్య రాక్షసేన్ద్రస్తం ధనదం హృష్టమానసః 38
పుష్పకం తస్య జగ్రాహ విమానం జయలక్షణమ్.

ప్ర. అ. రాక్షసేన్ద్రః = రావణుడు, తం ధనదమ్ = ఆ కుబేరుణ్ణి, నిర్జిత్య జయించి, హృష్టమానసః = సంతోషించిన మనస్సు కలవాడై, జయలక్షణమ్ = జయమునకు చిహ్నముగా, తస్య=ఆతనియొక్క, పుష్పకం విమానమ్=పుష్పక విమానమును, జగ్రాహ = గ్రహించెను.

తా. రావణుడు ఆ కుబేరుని జయించి, మనస్సులో సంతోషించుచు, అతని పుష్పకవిమానమును విజయచిహ్నముగా అపహరించెను. 38

మూ. కాఞ్చనస్తమ్భసంవీతం వైదూర్యమణితోరణమ్. 39
ముక్తాజాలప్రతిచ్ఛన్నం సర్వకాలఫలద్రుమమ్,
మనోజవం కామగమం కామరూపం విహంగమమ్. 40

మణికాఞ్చనసోపానం తప్తకాఞ్చనవేదికమ్,
దేవోపవాహ్యమక్షయ్యం సదాదృష్టిమనఃసుఖమ్. 41

బహ్వాశ్చర్యం భక్తిచిత్రం బ్రహ్మణా పరినిర్మితమ్,
నిర్మితం సర్వకామైస్తు మనోహరమనుత్తమమ్. 42

న తు శీతం న చోష్ణం చ సర్వర్తుసుఖదం శుభమ్,
స తం రాజా సమారుహ్య కామగం వీర్యనిర్జితమ్. 43

జితం త్రిభువనం మేనే దర్పోత్సేకాత్సుదుర్మతిః,
జిత్వా వైశ్రవణం దేవం కైలాసాత్సమవాతరత్. 44

ప్ర. అ. సుదుర్మతిః = చాల దుష్టబుద్ధి గల, సః రాజా = ఆ రాక్షస రాజు, కాఞ్చనస్తమ్భసంవీతమ్ = బంగారు స్తంభములతో కూడినది, వైదూర్యమణితోరణమ్ = వైడూర్యమణుల ముఖద్వారము గలది; ముక్తాజాలప్రతిచ్ఛన్నమ్ = ముత్యముల గుంపులచేత కప్పబడినది, సర్వకాలఫలద్రుమమ్ = సమస్తకాలములందు పండ్లు ఇచ్చు వృక్షములు గలది, మనోజవమ్ = మనస్సువంటి వేగము గలది, కామగమమ్ = ఇచ్ఛానుసారము వెళ్ళునది, కామరూపమ్ = ఇచ్ఛానుసారము రూపము గలది, విహఙ్గమమ్ = ఆకాశమునందు పోవునది, మణికాఞ్చనసోపానమ్ = మాణిక్యసువర్ణవికారమైన మెట్లు గలది, తప్తకాఞ్చనవేదికమ్ = శుద్ధమైన బంగారము వికారమైన అరుగులు గలది, దేవోపవాహ్యమ్ = దేవతలకు వాహనము, అక్షయ్యమ్ = నాశము లేనిది, సదా = ఎల్లప్పుడూ, దృష్టిమనఃసుఖమ్ = దృష్టికి మనస్సుకూ సుఖకరమూ, బహ్వాశ్చర్యమ్ = చాల ఆశ్చర్యకరము, భక్తిచిత్రమ్ = నగిషీలచేత చిత్రముగా ఉన్నదీ, బ్రహ్మణా = బ్రహ్మచేత, పరినిర్మితమ్ = నిర్మింపబడినది, సర్వకామైః = సమస్తకామములతో, నిర్మితమ్ =

నిర్మింపబడినది, మనోహరమ్ = మనోహరము, అనుత్తమమ్ = చాల ఉత్తమము, న తు శీతమ్ = చల్లనిది కానిది, న ఉష్ణం చ = వేడిగా లేనిది, సర్వర్తుసుఖదమ్ = అన్ని ఋతువులయందు సుఖము నిచ్చునది, శుభమ్ = మంగళప్రదము, కామగమ్ = స్వేచ్ఛగా సంచరించునది, వీర్యనిర్జితమ్ = పరాక్రమముచేత జయింపబడినది అయిన, తమ్ = ఆ విమానమును, సమారుహ్య = ఎక్కి, దర్పోత్సేకాత్ = గర్వాతిశయమువలన, త్రిభువనమ్ = మూడు లోకములను, జితమ్ = జయింపబడినట్లుగా, మేనే = తలచెను. దేవమ్ = ప్రభువైన, వైశ్రవణమ్ = కుబేరుణ్ణి, జిత్వా = జయించి, కైలాసాత్ = కైలాసమునుండి, సమవాతరత్ = దిగెను.

తా. ఆ పుష్పకవిమానమునందు బంగారు స్తంభములు, వైడూర్యమణులతో నిర్మించిన ముఖద్వారము ఉండెను. అది ముత్యముల సముదాయము చేత కప్పబడి ఉండెను. మనస్సుతో సమానమైన వేగముతో ఇష్టమైన రూపము ధరించి ఇష్టానుసారము ఆకాశములో ఎగురు ఆ విమానములో అన్ని కాలములందు పండ్లు ఇచ్చు వృక్షము లుండెను. మణులు పొదిగిన బంగారపు మెట్లు, శుద్ధమైన బంగారముతో కట్టిన అరుగులుగల ఆ విమానము దేవతల వాహనము. నాశము లేనిది. ఎల్లప్పుడు చూచుటకు మనస్సుకు సుఖకరముగా ఉండునది. నగిషీలతో చిత్రమై చాల ఆశ్చర్యకరమైన ఆ విమానమును బ్రహ్మ నిర్మించెను. అన్ని భోగ్యపదార్థాలతో నిర్మించిన ఆ విమానము మనోహరముగా ఉండెను. చాల ఉత్తమమైన ఆ విమానము చల్లగా కాక, వేడిలేక అన్ని ఋతువులలోను సుఖకరముగా ఉండెను. దుర్బుద్ధియైన ఆ రావణుడు తన పరాక్రమముచేత జయింపబడిన ఇచ్ఛానుసారము ప్రయాణము చేయు ఆ విమానమును ఎక్కి గర్వాతిశయముచేత మూడులోకాలను జయించి నట్లు భావించెను. ఈ విధముగా కుబేరుణ్ణి జయించి కైలాసమునుండి క్రిందికి దిగెను. 39-44

మూ. స తేజసా విపులమవాప్య తం జయం
ప్రతాపవాన్విమలకిరీటహారవాన్,
రరాజ వై పరమవిమానమాస్థితో
నిశాచరః సదసి గతో యథానలః. 45

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చదశః సర్గః.

ప్ర. అ. ప్రతాపవాన్ = ప్రతాపము గలవాడు, విమలకిరీటహారవాన్ = నిర్మలమైన కిరీటము హారములు కలవాడు అయిన, సః నిశాచరః = ఆ రాక్షసుడు, తేజసా = తేజస్సుచేత, విపులమ్ = అధికమైన, జయమ్ = ఆ జయమును, అవాప్య = పొంది, తం పరమవిమానమ్ = ఆ గొప్ప విమానమును, ఆస్థితః = అధిష్ఠించినవాడై, సదసి = యజ్ఞసదస్సునందు, గతః = ఉన్న, అనలః యథా = అగ్ని వలె, రరాజ వై = ప్రకాశించెను.

తా. నిర్మలములైన కిరీటము, హారములు ధరించిన ప్రతాపవంతుడైన ఆ రావణుడు తేజస్సుచేత గొప్ప విజయమును పొంది, ఆ గొప్ప విమానమును అధిష్ఠించి, యజ్ఞశాలలో ఉన్న అగ్ని వలె ప్రకాశించెను. 41

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో పదునైదవ సర్గ సమాప్తము.

అథ షోడశః సర్గః

[నందీశ్వరుడు రావణుని శపించుట. పరమేశ్వరుడు రావణుని గర్వమును అణచుట. పరమేశ్వరునినుండి రావణుడు ఖడ్గమును పొందుట]

మూ. స జిత్వా ధనదం రామ భ్రాతరం రాక్షసాధిపః,
మహాసేనప్రసూతిం తద్యయౌ శరవణం మహత్. 1

ప్ర. అ. రామ = రామా ! సః రాక్షసాధిపః = ఆ రావణుడు, భ్రాతరమ్ సోదరుడైన, ధనదమ్ = కుబేరుణ్ణి, జిత్వా = జయించి, మహాసేనప్రసూతిమ్ = మహాసేనుని ఉత్పత్తిస్థానమైన, తత్ = ఆ, మహత్ = గొప్పదైన, శరవణమ్= శరవణమును (రెల్లుగడ్డి అడవిని) గూర్చి, యయౌ = వెళ్లెను.

తా. రామా ! ఆ రావణుడు సోదరుడైన కుబేరుణ్ణి జయించి మహాసేనుడు జనించిన స్థానమైన ఆ శరవణమునకు వెళ్లెను. 1

మూ అథాపశ్యద్దశగ్రీవో రౌక్మం శరవణం మహత్,
గభస్తిజాలసంవీతం ద్వితీయమివ భాస్కరమ్. 2

ప్ర అ. అథ = అటుపిమ్మట, దశగ్రీవః = రావణుడు, గభస్తిజాల సంవీతమ్=కిరణముల సముదాయములచేత కప్పబడినది, ద్వితీయమ్=రెండవ, భాస్కరమివ = సూర్యుడు వలె ఉన్నది అయిన, మహత్ =గొప్పదైన, రౌక్మమ్ = బంగారువికారమైన, శరవణమ్ = రెల్లుగడ్డి వనమును, అపశ్యత్ = చూచెను.

తా. పిమ్మట రావణుడు గొప్ప బంగారు శరవణమును చూచెను. కిరణములచేత కప్పబడిన ఆ శరవణము రెండవ సూర్యుడు వలె ఉండెను. 2

మూ. స పర్వతం సమారుహ్య కంచిద్రమ్యవనాన్తరమ్,
అపశ్యత్పుష్పకం తత్ర రామ విష్టమ్భితం తదా. 3

ప్ర. అ. రామ = రామా! సః = అతడు, రమ్యవనాన్తరమ్ = సుందరములైన వనమధ్యప్రదేశములు గల, కం చిత్ = ఒకానొక, పర్వతమ్ = పర్వతమును, సమారుహ్య = ఎక్కి, తదా = అప్పుడు, తత్ర = అక్కడ, విష్టమ్భితమ్ = కదలకుండ చేయబడిన, పుష్పకమ్ = పుష్పకమును, అపశ్యత్ = చూచెను.

తా. రామా! అతడు రమ్యములైన వనమధ్యప్రదేశములు గల ఒక పర్వతము నెక్కెను. అప్పుడు తన పుష్పకము అక్కడ కదలకుండా నిలచిపోవుట చూచెను. 3

మూ. విష్టబ్ధం పుష్పకం దృష్ట్వా హ్యగమం కామగం కృతమ్,
అచిన్తయద్రాక్షసేన్ద్రః సచివైః స్తైః సమావృతః. 4

ప్ర. అ. సచివైః = మంత్రులతో, సమావృతః = కూడిన, రాక్షసేన్ద్రః = రావణుడు, కామగమ్ = ఇచ్ఛానుసారము వెళ్ల, పుష్పకమ్ = పుష్పకమును, అగమమ్ = వెళ్లనిదిగా, కృతమ్ = చేయబడినదిగాను, విష్టబ్ధమ్ = నిలచిపోయిన దానినిగాను, దృష్ట్వా = చూచి, అచిన్తయత్ = ఆలోచించెను.

తా. స్వేచ్ఛగా సంచరించు ఆ పుష్పకము ముందుకు వెళ్లకుండ చేయబడినదై కదలకుండా నిలచిపోవుటను చూచి రావణుడు మంత్రులతో కలిసి ఆలోచించెను. 4

మూ. కింనిమిత్తం చేచ్ఛయా మే నేదం గచ్ఛతి పుష్పకమ్,
పర్వతస్యోపరిష్ఠస్య కర్మేదం కస్య చిద్భవేత్. 5

ప్ర. అ ఇదం పుష్పకమ్ = ఈ పుష్పకము, మే = నాయొక్క, ఇచ్ఛయా = ఇచ్ఛచేత, న గచ్ఛతి = వెళ్ళుట లేదు. నిమిత్తమ్ = కారణము, కిమ్ = ఏమి? ఇదమ్ = ఇది, పర్వతస్య = పర్వతముయొక్క, ఉపరిష్ఠస్య = పైన ఉన్న, కస్య చిత్ = ఎవనియొక్కయో, కర్మ = పని, భవేత్ = ...యి ఉండును.

తా. ఈ పుష్పకము నా ఇచ్ఛ ప్రకారము నడుచుటలేదు. కారణము ఏమై ఉండును? ఇది పర్వతముపీద ఉన్న ఎవని పనియో అయి ఉండును. 5

మూ. తతోఽబ్రవీత్తదా రామ మారీచో బుద్ధికోవిదః,
నేదం నిష్కారణం రాజన్ పుష్పకం యన్న గచ్ఛతి. 6

ప్ర. అ. రామ = రామా! తతః = అటుపిమ్మట, బుద్ధికోవిదః = బుద్ధి యందు నేర్పు గల, మారీచః = మారీచుడు, అబ్రవీత్ = పలికెను. రాజన్ = రాజా! పుష్పకమ్ = పుష్పకము, న గచ్ఛతి ఇతి యత్ = వెళ్ళుటలేదు అనునది ఏది కలదో, ఇదమ్ = ఇది, నిష్కారణమ్ = కారణము లేనిది, న = కాదు.

తా. అప్పుడు బుద్ధిశాలియైన మారీచుడు ఇట్లు పలికెను. "రామా! ఈ పుష్పకము కదలుట లేదనగా దీనికి ఏదియో కారణము ఉండి ఉండును." 6

మూ. అథవా పుష్పకమిదం ధనదాన్నాన్యవాహనమ్,
అతో నిష్పన్దమభవద్ధనాధ్యక్షవినాకృతమ్. 7

ప్ర. అ. అథవా = లేదా, ఇదమ్ = ఈ, పుష్పకమ్ = పుష్పకము, ధనదాత్ = కుబేరునికంటె, అన్యవాహనమ్ = ఇతరుని వాహనము, న = కాదు. అతః = ఆ కారణమువలన, ధనాధ్యక్షవినాకృతమ్ = కుబేరుడు లేకుండా చేయబడినదై, నిష్పన్దమ్ = నిశ్చలము, అభవత్ = అయెను.

తా. లేదా ఈ పుష్పకము కుబేరుడు తప్ప ఇతరులకు వాహనముగా ఉపయోగించదు. అందుచేతనే ఆతనికి దూర మగుటచేత ఇది ఆగిపోయినది. 7

మూ. ఇతి వాక్యాన్తరే తస్య కరాలః కృష్ణపిఙ్గలః,
వామనో వికటో ముణ్డీ నన్దీ హ్రస్వభుజో బలీ. 8

తతః పార్శ్వముపాగమ్య భవస్యానుచరోఽబ్రవీత్,
నన్దీశ్వరో వచశ్చేదం రాక్షసేన్ద్రమశఙ్కితః. 9

ప్ర. అ. ఇతి = ఇట్లు, తస్య = వానియొక్క, వాక్యాన్తరే = వాక్యము మధ్యయందు, కరాలః = భయంకరుడు, కృష్ణపిఙ్గలః = నల్లగాను పచ్చగాను ఉన్నవాడు, వామనః = పొట్టివాడు. వికటః = వికృతముగా ఉన్నవాడు, ముణ్డీ = బోడితలవాడు, హ్రస్వభుజః = పొట్టి చేతులు గలవాడు, బలీ = బలవంతుడు, భవస్య = ఈశ్వరునియొక్క, అనుచరః = అనుచరుడు అయిన, నన్దీ = నిత్యానంద వంతుడైన, నన్దీశ్వరః = నందీశ్వరుడు, తతః = అటుపిమ్మట, పార్శ్వమ్ = పార్శ్వమును, ఉపాగమ్య = పొంది, అశఙ్కితః = భయములేనివాడై, రాక్షసే

న్ధ్రిమ్ = రావణుని గూర్చి, ఇదమ్ = ఈ, వచః చ = వచనమును కూడ, అబ్రవీత్ = పలికెను.

తా. ఆతని మాట పూర్తికాకుండగానే, ఇంతలో శివుని అనుచరుడు, నిత్యానందవంతుడు అయిన నందీశ్వరుడు నిర్భయముగా రావణునివద్దకు వచ్చి ఇట్లు చెప్పెను. దూసరవర్ణములో ఉన్న అతడు ముండితశిరస్కుడై పొట్టిగా, వికృతముగా, భయంకరుడుగా ఉండెను. బలవంతుడైన అతని భుజములు పొట్టిగా ఉండెను.
8, 9

మూ. నివర్తస్వ దశగ్రీవ శైలే క్రీడతి శంకరః,
సుపర్ణనాగయక్షాణాం దేవగన్ధర్వరక్షసామ్. 10

సర్వేషామేవ భూతానామగమ్యః పర్వతః కృతః,
తన్నివర్తస్వ దుర్బుద్ధే మా వినాశమవాప్స్యసి. 11

ప్ర. అ. దశగ్రీవ = రావణా! నివర్తస్వ = మరలుము, శైలే = పర్వతముపీద, శంకరః = శివుడు, క్రీడతి = క్రీడించుచున్నాడు. పర్వతః = పర్వతము, సుపర్ణనాగయక్షాణామ్ = పక్షులకు, నాగులకు, యక్షులకు, దేవగన్ధర్వరక్షసామ్ = దేవతలకు, గంధర్వులకు, రాక్షసులకు, సర్వేషామ్ = సమస్తమైన, భూతానామ్ = ప్రాణులకు, అగమ్యః = పొంద శక్యము కానిదిగా, కృతః = చేయబడినది. దుర్బుద్ధే = ఓ! చెడ్డబుద్ధి గలవాడా! తత్ = ఆ కారణమువలన, నివర్తస్వ = మరలుము. వినాశమ్ = నాశమును, మా అవాప్స్యసి = పొందకుండెదవుగాక.

తా. రావణా! వెనుకకు మరలి పొమ్ము. పర్వతముమీద శంకరుడు క్రీడించుచున్నాడు. పక్షులు, నాగులు, యక్షులు, దేవతలు, గంధర్వులు, రాక్షసులు, ఏ ఇతర భూతములూ, (ప్రాణులూ) కూడ ఈ పర్వతముమీదికి రాకూడదని శాసింపబడినది. అందువలన, ఓ! దుర్బుద్ధీ! వెనుకకు మరలుము. లేకున్నచో నశించగలవు.
10, 11

మూ. ఇతి నన్దివచః శ్రుత్వా క్రోధాత్కమ్పితకుణ్డలః,
రోషాత్తు తామ్రనయనః పుష్పకాదవరుహ్య సః. 12

కో ఽయం శంకర ఇత్యుక్త్వా శైలమూలముపాగతః,

ప్ర. అ. ఇతి = ఇట్లు, నన్దివచః=నందియొక్క వచనమును, శ్రుత్వా = విని, క్రోధాత్ = కోపమువలన, కమ్పితకుణ్డలః = కదల్చబడిన కుండలములు గలవాడై, సః = ఆ రావణుడు, రోషాత్ = కోపమువలన తామ్రనయనః = ఎఱ్ఱనైన నేత్రములు గలవాడై, పుష్పకాత్ = పుష్పకమునుండి, అవరుహ్య = దిగి, అయమ్ = ఈ, శంకరః = శంకరుడు, కః = ఎవడు, ఇతి = అని, ఉక్త్వా = పలికి, శైలమూలమ్ = పర్వతమూలమును, ఉపాగతః = పొందెను.

తా. ఆ రావణుడు నందీ మాటలు విని, కోపముచేత కుండలములు కదలగా, పుష్పకమునుండి దిగి, కోపముచేత ఎఱ్ఱనైన నేత్రాలతో "ఈ శంకరుడు ఎవడు?"అని అనుచు పర్వతమూలమునకు వచ్చెను. 12

మూ. సోఽపశ్యన్నన్దినం తత్ర దేవస్యాదూరతః స్థితమ్, 13
దీప్తం శూలమవష్టభ్య ద్వితీయమివ శంకరమ్.

ప్ర. అ. సః = అతడు, తత్ర = అక్కడ, దేవస్య = శంకరునకు, అదూరతః = సమీపమున, స్థితమ్ = ఉన్నవాడు, దీప్తమ్ = ప్రకాశించుచున్న, శూలమ్ = శూలమును, అవష్టభ్య = ఊతగా గొని, ద్వితీయమ్ = రెండవ, శంకరమివ = శంకరుడువలె ఉన్న, నన్దినమ్ = నందిని, అపశ్యత్ = చూచెను.

తా. అతడు అక్కడ శివుని సమీపమునందున్న నందీశ్వరుణ్ణి చూచెను. ప్రకాశించుచున్న శూలమును ఆనుకొని ఉన్న ఆతడు రెండవ శంకరుడు వలె ఉండెను. 13

మూ. తం దృష్ట్వా వానరముఖమవజ్ఞాయ స రాక్షసః, 14
ప్రహాసం ముముచే తత్ర సతోయ ఇవ తోయదః.

ప్ర. అ. వానరముఖమ్=వానరుని వంటి ముఖము గల, తమ్=ఆతనిని, దృష్ట్వా = చూచి, సః రాక్షసః=ఆ రాక్షసుడు, అవజ్ఞాయ = అవమానించి, తత్ర = అక్కడ, సతోయః = నీటితో కూడిన, తోయదః ఇవ = మేఘము వలె, ప్రహాసమ్ = అట్టహాసమును, ముముచే = విడచెను.

తా. ఆ రావణుడు అక్కడ వానరుని ముఖము వంటి ముగము గల ఆ నందీశ్వరుణ్ణి చూచి, అవమానించుచు, నీటితో నిండిన మేఘము వలె బిగ్గరగా నవ్వెను. 14

మూ. తం క్రుద్ధో భగవాన్నన్దీ శంకరస్యాపరా తనుః, 15
అబ్రవీత్తత్ర తద్రక్షో దశాననముపస్థితమ్.

ప్ర. అ. శంకరస్య = శంకరునియొక్క, అపరా = మరియొక, తనుః = శరీరమైన, భగవాన్ = పూజ్యుడైన, నన్దీ = నంది, తత్ర = అక్కడ, ఉపస్థితమ్ = వచ్చి ఉన్న, తం దశాననమ్ = ఆ రావణుని గూర్చి, క్రుద్ధః = కోపించినవాడై, తత్ రక్షః = ఆ రాక్షసుణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. శంకరుని రెండవ రూపమువంటివాడైన పూజ్యుడైన ఆ నందీశ్వరుడు కోపించి, అక్కడకు వచ్చిన ఆ రావణునితో ఇట్లు పలికెను. 15

మూ. యస్మాద్వానరరూపం మామవజ్ఞాయ దశానన, 16
అశనీపాతసంకాశమపహాసం ప్రముక్తవాన్,
తస్మాన్మద్రూపసంపన్నా మద్వీర్యసమతేజసః. 17
ఉత్పత్స్యన్తి వధార్థం హి కులస్య తవ వానరాః.

ప్ర. అ. దశానన = రావణా ! యస్మాత్ = ఏ కారణమువలన, వానర రూపమ్ = వానరునివంటి రూపము గల, మామ్ = నన్ను, అవజ్ఞాయ = అనాదరముచేసి, అశనీపాతసంకాశమ్ = వజ్రపాతముతో సమానమైన, అపహాసమ్ = నవ్వును, ప్రముక్తవాన్ = ప్రయోగించినావో, తస్మాత్ = ఆకారణమువలన, మద్రూపసంపన్నాః = నా రూపము వంటి రూపముతో కూడిన, మద్వీర్యసమతేజస. = నా పరాక్రమముతో సమానమైన తేజస్సు గల, వానరాః = వానరులు, తవ = నీయొక్క, కులస్య = కులముయొక్క, వధార్థమ్ = వధకొరకు, ఉత్పత్స్యన్తి = పుట్టగలరు

తా. ఓ రావణా! నా వానరరూపము వంటి రూపమును చూచి, నన్ను అవమానించుచు పిడుగువలె ధ్వని చేయుచు నవ్వినావు. అందుచేత నావంటి రూపము, నాతో సమానమైన పరాక్రమము గల వానరులు నీ కులమును నశింపచేయుటకై పుట్టగలరు. 16, 17

మూ. నఖదంష్ట్రాయుధాః క్రూర మనఃసంపాతరంహసః, 18
యుద్ధోన్మత్తా బలోద్రిక్తాః శైలా ఇవ విసర్పిణః,

తే తవ ప్రబలం దర్పముత్సేధం చ పృథగ్విధమ్, 19
వ్యపనేష్యన్తి సంభూయ సహామాత్యసుతస్య చ.

ప్ర. అ. క్రూర=క్రూరుడా ! నఖదంష్ట్రాయుధాః = గోళ్లు కోరలు ఆయుధములుగా గలవారు, మనఃసంపాతరంహసః=మనోగమనము వంటి వేగము గలవారు, యుద్ధోన్మత్తాః = యుద్ధమునందు మదించినవారు, బలోద్రిక్తాః = బలముచేత విజృంభించినవారు, విసర్పిణః = నడచుచున్న, శైలాః ఇవ = పర్వతముల వలె ఉన్నవారు అయిన, తే = ఆ వానరులు, సంభూయ = కలిసి, సహామాత్యసుతస్య = అమాత్యులతోను, పుత్రులతోను కూడిన, తవ=నీయొక్క, ప్రబలమ్=అధికమైన బలమును, దర్పమ్ = దర్పమును, పృథగ్విధమ్ = వేరు వేరు విధములైన, ఉత్సేధమ్ = ఔన్నత్యమును, వ్యపనేష్యన్తి = తొలగించగలరు.

తా. ఓ ! క్రూరుడా ! గోళ్లు, కోరలు ఆయుధములుగా ఉపయోగించువారు, మనోవేగము వంటి వేగము గలవారు, యుద్ధమునందు బాగుగా మదించినవారు, బలముతో విజృంభించువారు, నడచే పర్వతమువలె ఉండువారు అయిన ఆ వానరులందరు కలిసి అమాత్యపుత్రసహితుడవైన నీ బలమును, దర్పమును, అనేకవిధములైన ఔన్నత్యమును తొలగించగలరు. 18, 19

మూ. కిం త్విదానీం మయా శక్యం హన్తుం త్వాం హే నిశాచర,
న హన్తవ్యో హతస్త్వం హి పూర్వమేవ స్వకర్మభిః.

ప్ర. అ. హే నిశాచర = ఓ! రాక్షసుడా ! మయా = నాచేత, ఇదానీమ్= ఇప్పుడే, త్వామ్ = నిన్ను, హన్తుమ్ = చంపుటకు, శక్యమ్=శక్యమైనది. కిం తు = కాని, స్వకర్మభిః = నీ కర్మలచేత, పూర్వమేవ = పూర్వమే. హతః = చంపబడిన, త్వమ్ = నీవు, న హన్తవ్యః హి = చంపదగినవాడవు కాదు కదా.?

తా. ఓ ! రాక్షసుడా ! నేను నిన్ను ఇప్పుడే చంపగలను కాని నీ పాపకర్మచేత పూర్వమే చచ్చి ఉన్న నిన్ను చంపుట యుక్తము కాదు. 20

మూ. ఇత్యుదీరితవాక్యే తు దేవే తస్మిన్ మహాత్మని, 21
దేవదున్దుభయో నేదుః పుష్పవృష్టిశ్చ ఖాచ్చ్యుతా.

ప్ర. అ. మహాత్మని = మహాత్ముడైన, తస్మిన్=ఆ, దేవే=నందీశ్వరుడు,

ఇతి = ఇట్లు, ఉదీరితవాక్యే = పలకబడిన వాక్యము కలవాడగుచుండగా, దేవదున్దుభయః = దేవతల దుందుభులు, నేదుః = ధ్వని చేసినవి. ఖాత్ = ఆకాశమునుండి, పుష్పవృష్టిశ్చ = పుష్పవర్షము కూడ, చ్యుతా = జారినది.

తా. మహాత్ముడైన ఆ నందీశ్వరుడు ఇట్లు పలకగానే దేవదుందుభులు మ్రోగినవి. ఆకాశమునుండి పుష్పవర్షము కూడ పడినది. 21

మూ. అచిన్తయిత్వా స తదా నన్దివాక్యం మహాబలః, 22
పర్వతం తు సమాసాద్య వాక్యమాహ దశాననః.

ప్ర. అ. తదా = అప్పుడు, మహాబలః = గొప్ప బలము గల, సః దశాననః = ఆ రావణుడు, నన్దివాక్యమ్ = నంది మాటను, అచిన్తయిత్వా = ఆలోచించక, పర్వతం తు = పర్వతమును, సమాసాద్య = పొంది, వాక్యమ్ = వాక్యమును, ఆహ = పలికెను.

తా. అప్పుడు గొప్ప బలము గల దశాననుడు నంది మాటలను లెక్కచేయక పర్వతమును సమీపించి ఇట్లు పలికెను. 22

మూ. పుష్పకస్య గతిశ్ఛిన్నా యత్కృతే మమ గచ్ఛతః, 23
త మిమం శైలమున్మూలం కరోమి తవ గోపతే.

ప్ర. అ. గోపతే = ఈశ్వరుడా! యత్కృతే = దేని మూలమున, గచ్ఛతః = వెళ్ళుచున్న, మమ = నాయొక్క, పుష్పకస్య = పుష్పకముయొక్క, గతిః = గమనము, ఛిన్నా = ఛేదించబడినదో, తవ = నీయొక్క, ఇమమ్ = ఈ, తం శైలమ్ = ఆ పర్వతమును, ఉన్మూలమ్ = పెకలించబడినదానినిగా, కరోమి = చేయుచున్నాను.

తా. ఈశ్వరుడా! నేను వెళ్లుచుండగా దేని మూలమున నా పుష్పకము నడక ఆగిపోయినదో అట్టి ఈ నీ పర్వతమును పెకలించివేసెదను. 23

మూ. కేన ప్రభావేణ భవో నిత్యం క్రీడతి రాజవత్, 24
విజ్ఞాతవ్యం న జానీతే భయస్థానముపస్థితమ్.

ప్ర. అ. భవః = ఈశ్వరుడు, కేన ప్రభావేణ = ఏ ప్రభావముచేత, నిత్యమ్

= నిత్యమూ, రాజవత్ = రాజు వలె, క్రీడతి = క్రీడించుచున్నాడు ? ఉపస్థితమ్ = వచ్చిన, విజ్ఞాతవ్యమ్ = తెలియదగిన, భయస్థానమ్ = భయస్థానమును, న జానీతే = తెలిసికొనకున్నాడు.

తా. ఈశ్వరుడు ఏ ప్రభావము చూచుకొని రాజు వలె నిత్యము క్రీడించుచున్నాడు ? భయపడవలసిన పరిస్థితి వచ్చినట్లు తెలిసికొనవలసి ఉన్నా తెలిసికొనుటలేదు. 24

మూ. ఏవముక్త్వా తతో రామ భుజాన్విక్షిప్య పర్వతే, 25
తోలయామాస తం శీఘ్రం స శైలః సమకమ్పత.

ప్ర. అ. రామ = రామా ! ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తతః = అటు పిమ్మట, భుజాన్ = భుజములను, పర్వతే = పర్వతమునందు, విక్షిప్య = విసరి, శీఘ్రమ్ = శీఘ్రముగా, తమ్ = ఆ పర్వతమును, తోలయామాస = కదల్చెను. సః శైలః = ఆ పర్వతము, సమకమ్పత = కంపించెను.

తా. రామా ! ఆతడిట్లు పలికి పర్వతముమీద భుజములను వేసి శీఘ్రముగా దానిని కదల్చెను. ఆ పర్వతము కంపించెను. 25

మూ. చాలనాత్పర్వతస్యైవ గణా దేవస్య కమ్పితాః, 26
చచాల పార్వతీ చాపి తదాశ్లిష్టా మహేశ్వరమ్.

ప్ర. అ. పర్వతస్య = పర్వతముయొక్క, చాలనాత్ = కదల్చుటవలన, దేవస్య = ఈశ్వరునియొక్క, గణాః = ప్రమథగణములు, కమ్పితాః = కదల్చబడిరి. పార్వతీ చాపి = పార్వతికూడ, చచాల = చలించెను. తదా = అప్పుడు, మహేశ్వరమ్ = మహేశ్వరుణ్ణి, ఆశ్లిష్టా = కౌగలించుకొనెను.

తా. పర్వతమును కదల్చగానే ఈశ్వరుని ప్రమథగణాలు చలించెను. పార్వతి కూడ చలించెను. ఆమె అప్పుడు ఈశ్వరుణ్ణి కౌగలించుకొనెను. 26

మూ. తతో రామ మహాదేవో దేవానాం ప్రవరో హరః, 27
పాదాఙ్గుష్ఠేన తం శైలం పీడయామాస లీలయా.

ప్ర. అ. రామ = రామా ! తతః = అటు పిమ్మట, దేవానామ్ = దేవతలలో,

ప్రవరః = శ్రేష్ఠుడు, హరః = పాపములను హరించువాడూ అయిన, మహాదేవః = మహేశ్వరుడు, తం శైలమ్ = ఆ పర్వతమును, లీలయా = విలాసచేత, పాదాఙ్గుష్ఠేన = కాలి బొటనవ్రేలితో, పీడయామాస = పీడించెను.

తా. రామా! అప్పుడు, దేవతలలో శ్రేష్ఠుడు, సకల పాపహరుడు అయిన మహేశ్వరుడు కాలి బొటనవ్రేలితో, అనాయాసముగా ఆ పర్వతమును నొక్కెను.

మూ. పీడితాస్తు తత స్తస్య శైలస్యాధోగతా భుజాః, 28
విస్మితాశ్చాభవం స్తత్ర సచివా స్తస్య రక్షసః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, శైలస్య=పర్వతముయొక్క, అధోగతాః= క్రింద ఉన్న, తస్య భుజాః = వాని భుజములు, పీడితాః తు = పీడింపబడినవి, తత్ర = అక్కడ, తస్య రక్షసః = ఆ రాక్షసునియొక్క, సచివాః = మంత్రులు, విస్మితాః చ = ఆశ్చర్యము చెందినవారు, అభవన్ = అయిరి.

తా. అప్పుడు ఆ పర్వతము క్రింద పడి అతని చేతులు నలిగిపోయినవి. అక్కడ ఉన్న అతని సచివులు ఆశ్చర్యపడిరి. 28

మూ. రక్షసా తేన రోషాచ్చ భుజానాం పీడనాత్తదా, 29
ముక్తో విరావః సహసా త్రైలోక్యం యేన కమ్పితమ్.

ప్ర. అ. తేన రక్షసా = ఆ రాక్షసునిచేత, రోషాచ్చ = కోపమువలనా, తథా = మరియు, భుజానామ్ = భుజములయొక్క, పీడనాత్ = పీడనమువలనా, సహసా = వెంటనే, విరావః = ధ్వని, ముక్తః = విడవబడినది, యేన = దేనిచేత, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, కమ్పితమ్=కంపింపబడినదో.

తా. అప్పుడు ఆ రాక్షసుడు రోషమువలనా, భుజములు నలిగిపోవుట వలనా వెంటనే బిగ్గరగా అరచెను. దానితో మూడులోకములు అదరిపోయెను. 29

మూ. మేనిరే వజ్రనిష్పేషం తస్యామాత్యా యుగక్షయే, 30
తదా వర్త్మసు చలితా దేవా ఇన్ద్రపురోగమాః.

ప్ర. అ. తస్య = వానియొక్క, అమాత్యాః = మంత్రులు, యుగక్షయే = యుగాంతమునందు, వజ్రనిష్పేషమ్ = వజ్రమువలన కలిగిన నలుగుటనుగా,

లేదా వజ్రభేదనమునుగా, మేనిరే = తలచిరి. తదా = అప్పుడు, వర్త్మను = మార్గములలో ఉన్న, ఇన్ద్రపురోగమాః = ఇంద్రుడు మొదలైన, దేవాః = దేవతలు, చలితాః = ఉలికిపడిరి.

తా. అప్పుడు అతని అమాత్యులు ఆ శబ్దమును ప్రలయకాలమునందు వజ్రముల నలిగిపోవుటనుగా లేదా ఉరుములనుగా తలచిరి. మార్గములలో సంచరించుచున్న ఇంద్రుడు మొదలైన దేవతలు ఉలికిపడిరి. 30

మూ. సముద్రాశ్చాపి సంక్షుబ్ధాశ్చలితాశ్చాపి పర్వతాః,
యక్షా విద్యాధరాః సిద్ధాః కిమేతదితి చాబ్రువన్.

ప్ర. అ. సముద్రాశ్చాపి = సముద్రములు కూడ, సంక్షుబ్ధాః = క్షోభ చెందినవి, పర్వతాశ్చాపి = పర్వతములు కూడ, చలితాః = ఊగినవి, యక్షాః = యక్షులు, విద్యాధరాః = విద్యాధరులు, సిద్ధాః = సిద్ధులు, ఏతత్ = ఇది, కిమ్ = ఏమి, ఇతి = అని, అబ్రువన్ చ = పలికిరి.

తా. సముద్రములు క్షోభ చెందెను. పర్వతములు కదలెను. యక్షులు, విద్యాధరులు, సిద్ధులు "ఇది ఏమి ?" అని పలికిరి. 31

మూ. అథ తే మన్త్రిణస్తస్య విక్రోశన్తమథాబ్రువన్, 32
తోషయస్వ మహాదేవం నీలకణ్ఠముమాపతిమ్,
తమృతే శరణం నాన్యం పశ్యామోఽత్ర దశానన. 33

ప్ర. అ. అథ = అటుపిమ్మట, తస్య = వానియొక్క, తే మన్త్రిణః = ఆ మంత్రులు, అథ = పిమ్మట, విక్రోశన్తమ్ = అరచుచున్న అతనిని గూర్చి, అబ్రువన్ = పలికిరి. దశానన = రావణా ! నీలకణ్ఠమ్ = నల్లని కంఠము గల, ఉమాపతిమ్ = పార్వతీపతి అయిన, మహాదేవమ్ = మహాదేవుణ్ణి, తోషయస్వ = సంతోషపెట్టుము. అత్ర = ఇక్కడ, తమ్ ఋతే = అతడు తప్ప, అన్యమ్ = మరియొక, శరణమ్ = శరణమును, న పశ్యామః = చూడము.

తా. పిమ్మట అతని మంత్రులు అరచుచున్న అతనితో ఇట్లు పలికిరి - "దశాననా ! నల్లని కంఠము గలవాడు, ఉమాపతీ, అయిన మహాదేవుణ్ణి సంతోష

పెట్టుము. ఈ విషయమున రక్షించగలవాడు అతడు తప్ప మరెవ్వడూ మాకు కనబడుటలేదు." 32, 33

మూ. స్తుతిభిః ప్రణతో భూత్వా తమేవ శరణం వ్రజ,
కృపాలుః శఙ్కరస్తుష్టః ప్రసాదం తే విధాస్యతి. 34

ప్ర. అ. స్తుతిభిః = స్తోత్రములతో, ప్రణతః = వంగినవాడవు, భూత్వా = అయి, తమేవ = ఆ మహాదేవుణ్ణే, శరణమ్ = శరణమునుగా, వ్రజ = పొందుము. కృపాలుః = కృపగల, శంకరః = శంకరుడు, తుష్టః = సంతోషించినవాడై, తే = నీకు, ప్రసాదమ్ = అనుగ్రహమును, కరిష్యతి = చేయగలడు.

తా నీవు స్తుతించుచు నమస్కరించి ఆ మహాదేవుణ్ణే శరణుపొందుము. దయాశాలియైన ఆ శంకరుడు సంతోషించి నిన్ను అనుగ్రహించగలడు. 34

మూ. ఏవముక్తస్తదామాత్యైస్తుష్టావ వృషభధ్వజమ్,
సామభిర్వివిధైః స్తోత్రైః ప్రణమ్య స దశాననః. 35

ప్ర. అ. తదా = అప్పుడు, అమాత్యైః = మంత్రులచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సః దశాననః = ఆ దశాననుడు, ప్రణమ్య = నమస్కరించి, సామభిః = సామలచేతను, వివిధైః = అనేకవిధములైన, స్తోత్రైః = స్తోత్రముల చేతను, వృషభధ్వజమ్ = పరమేశ్వరుణ్ణి, తుష్టావ = స్తుతించెను.

తా. అమాత్యుల మాటలు విని దశాననుడు ఆ శివునకు నమస్కరించి, సామలచేతను, అనేకవిధములైన స్తోత్రములచేతను ఆయనను స్తుతించెను. 35

మూ. సంవత్సరసహస్రం తు రుదతో రక్షసో గతమ్,
తతః ప్రీతో మహాదేవః శైలాగ్రే విష్ఠితః ప్రభుః, 36
ముక్త్వా చాస్య భుజాన్ రామ ప్రాహ వాక్యం దశాననమ్.

ప్ర. అ. రక్షసః = ఆ రాక్షసుడు, రుదతః = ఏడ్చుచుండగా, సంవత్సర సహస్రమ్ = వేయి సంవత్సరముల కాలము, గతమ్ = వెళ్ళినది. రామ = రామా ! తతః = అటు పిమ్మట, శైలాగ్రే = పర్వతశిఖరమునందు, విష్ఠితః = నిలచిన, ప్రభుః = సర్వసమర్థుడైన, మహాదేవః = మహాదేవుడు, ప్రీతః = సంతోషించిన

వాడై, అస్య=వీనియొక్క, భుజాన్=భుజములను, ముక్త్వా=విడచి, దశాననమ్=ఆ దశాననుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ప్రాహ = పలికెను.

తా. ఆ రాక్షసుడు ఏడ్చుచుండగా వేయి సంవత్సరములు గడచెను. రామా! పిమ్మట పర్వతాగ్రమునందున్న సర్వసమర్థుడైన మహాదేవుడు సంతోషించి ఆ దశాననుని భుజములను విడచి (పైకి వచ్చునట్లు చేసి) ఇట్లు పలికెను. 36

మూ. ప్రీతోఽస్మి తవ వీరస్య శౌటీర్యాచ్చ దశానన, 37
శైలాక్రాన్తేన యో ముక్తస్త్వయా రావః సుదారుణః,
యస్మాల్లోకత్రయం చైతద్రావితం భయమాగతమ్,
తస్మాత్త్వం రావణో నామ నామ్నా రాజన్ భవిష్యసి.

ప్ర. అ. దశానన = దశాననుడా! వీరస్య = వీరుడవైన, తవ=నీయొక్క, శౌటీర్యాత్ = దర్పమువలన, ప్రీతః = సంతోషించినవాడను, అస్మి = అయితిని. రాజన్ = ఓ! రాజా! శైలాక్రాన్తేన = శైలముచేత అక్రమించబడిన, త్వయా = నీచేత, సుదారుణః = చాల దారుణమైన, యః = ఏ, రావః = ధ్వని, ముక్తః = విడవబడినదో (దానిచేత), యస్మాత్ = ఏ కారణమువలన, ఏతత్ = ఈ, లోకత్రయమ్=లోకముల త్రయము, భయమ్ = భయమును, ఆగతమ్=పొందినదై, రావితమ్ = ధ్వనింపచే యబడినదో, తస్మాత్ = ఆ కారణమువలన, త్వమ్=నీవు, నామ్నా = పేరుచేత, రావణో నామ = రావణు డను ప్రసిద్ధి కలవాడవుగా, భవిష్యసి = కాగలవు.

తా. ఓ! దశాననా! వీరుడవైన నీ దర్పానికి సంతోషించినాను. ఓ! రాక్షస రాజా! శైలము క్రింద నలిగిపోవుచు నీవు చాల భయంకరమైన ధ్వని చేసినావు. ఆ ధ్వని విని ఈ మూడులోకములు భయపడి ఏడ్చినవి. అందువలన నీకు 'రావణుడు' అను పేరు ప్రసిద్ధిలోనికి రాగలదు. 37,38

మూ. దేవతా మానుషా యక్షా యే చాన్యే జగతీతలే, 39
ఏవం త్వామభిధాస్యన్తి రావణం లోకరావణమ్.

ప్ర. అ. దేవతాః = దేవతలు, మానుషాః = మనుష్యులు, యక్షాః = యక్షులు, జగతీతలే = భూమిమీద, యే = ఏ, అన్యే చ = ఇతరులు గలరో

వారందరూ, త్వామ్ = నిన్ను, ఏవమ్ = ఇట్లు, లోకరావణమ్ = లోకములను ఏడ్పించిన, రావణమ్ = రావణునిగా, అభిధాస్యన్తి = చెప్పగలరు.

తా. దేవతలు, మానవులు, యక్షులు, భూమిమీద ఉన్న ఇతరులు నిన్ను ఈ విధముగా లోకమును ఏడ్పించిన రావణుణ్ణిగా చెప్పుచుందురు. 39

మూ. గచ్ఛ పౌలస్త్య విస్రబ్ధం పథా యేన త్వమిచ్ఛసి, 40
మయా చైవాభ్యనుజ్ఞాతో రాక్షసాధిప గమ్యతామ్.

ప్ర. అ. పౌలస్త్య = రావణా ! త్వమ్ = నీవు, యేన పథా = ఏ మార్గము చేత, ఇచ్ఛసి = కోరుచున్నావో ఆ మార్గముచేత, విస్రబ్ధమ్ = నమ్మకముగా, గచ్ఛ = వెళ్ళుము. రాక్షసాధిప=రాక్షసరాజా, మయా=నాచేత, అభ్యనుజ్ఞాతః= అనుమతింపబడితివి; గమ్యతామ్ = వెళ్ళుము.

తా. రావణా ! నీవు ఏ మార్గమున వెళ్ళవలె నని కోరుకొనుచున్నావో ఆ మార్గమున నిర్భయముగా వెళ్ళుము. రాక్షసరాజా ! నేను అనుజ్ఞ ఇచ్చుచున్నాను, వెళ్ళుము. 40

మూ. ఏవముక్తస్తు లఙ్కేశః శంభునా స్వయమబ్రవీత్, 41
ప్రీతో యది మహాదేవ వరం మే దేహి యాచతః.

ప్ర. అ. శంభునా = ఈశ్వరునిచేత, స్వయమ్=స్వయముగా, ఏవమ్= ఇట్లు, ఉక్తః = పలకబడిన, లఙ్కేశః = రావణుడు, అబ్రవీత్ = పలికెను. మహాదేవ = ఓ ! మహాదేవా ! ప్రీతః యది = సంతోషించినట్లయితే, యాచతః = కోరుచున్న, మే = నాకు, వరమ్ = వరమును, దేహి = ఇమ్ము.

తా. మహేశ్వరుడు స్వయముగా పలికిన మాటలు విని రావణుడు ఇట్లు అనెను. "మహాదేవా ! నీవు అనుగ్రహించినట్లయితే యాచించుచున్న నాకు ఒక వరము ఇమ్ము. 41

మూ. అవధ్యత్వం మయా ప్రాప్తం దేవగన్ధర్వదానవైః, 42
రాక్షసైర్గుహ్యకైర్నాగైర్యే చాన్యే బలవత్తరాః.

ప్ర. అ. దేవగన్ధర్వదానవైః = దేవతలచేతా, గంధర్వులచేతా, దానవుల

చేతా, రాక్షసైః = రాక్షసులచేతా, గుహ్యకైః = యక్షులచేతా, నాగైః = నాగుల చేతా, బలవత్తరాః = అధికమైన బలముగల, యే = ఏ, అన్యే = ఇతరులు గలరో వారిచేతా, అవధ్యత్వమ్ = చంప శక్యము కాకపోవుట, మయా = నాచేత, ప్రాప్తమ్ = పొందబడినది.

తా. దేవతలు గాని, గంధర్వులు గాని, దానవులు గాని, రాక్షసులు గాని, యక్షులు గాని, నాగులు గాని, బలవంతులైన ఏ ఇతరులుగాని నన్ను చంపజాల కుండే టట్లు నేను వరమును పొందితిని. 42

మూ. మానుషాన్న గణే దేవ స్వల్పాస్తే మమ సంమతాః. 43
దీర్ఘమాయుశ్చ మే ప్రాప్తం బ్రహ్మణస్త్రిపురాన్తక,
వాఞ్ఛితం చాయుషః శేషం శస్త్రం త్వం చ ప్రయచ్ఛ మే.

ప్ర. అ. దేవ = దేవా! మానుషాన్ = మనుష్యులను, న గణే = లెక్క చేయను. తే = వాళ్ళు. స్వల్పాః = స్వల్పమైనవాళ్ళుగా, మమ = నాకు, సంమతాః = ఇష్టులు. త్రిపురాన్తక = త్రిపురములను సంహరించిన మహేశ్వరా! బ్రహ్మణః = బ్రహ్మనుండి, దీర్ఘమ్ = దీర్ఘమైన, ఆయుశ్చ = ఆయుర్దాయము కూడ, మే = నాకు, ప్రాప్తమ్ = పొందబడినది. త్వం చ = నీవుకూడా, మే = నాకు, వాఞ్ఛితమ్ = కోరబడిన, ఆయుషః = ఆయుర్దాయముయొక్క, శేషమ్ = శేషమును, శస్త్రమ్ = ఆయుధమును, ప్రయచ్ఛ = ఇమ్ము.

తా. దేవా! నేను మానవులను లెక్కచేయను. వాళ్ళు చాల తక్కువవాళ్లని నా అభిప్రాయము. మహేశ్వరా! బ్రహ్మనుండి నేను దీర్ఘాయుర్దాయమును కూడ పొందితిని. నీవు కూడ నాకు గడచిపోగా మిగిలిన ఆయుర్దాయమును, ఆయుధ మును ఇమ్ము.

వి. "పాపకర్మాదులచేత నాకింకా మిగిలిన ఆయుర్దాయము తగ్గిపోకుండే టట్లు చేయుము"అని భావము అని వ్యాఖ్యాతలు వ్రాసినారు. 43,44

మూ. ఏవముక్తస్తతస్తేన రావణేవ స శంకరః,
దదౌ ఖడ్గం మహాదీప్తం చన్ద్రహాసమితి శ్రుతమ్, 45
ఆయుషశ్చావశేషం చ దదౌ భూతపతిస్తదా.

ప్ర. అ. తేన రావణేన = ఆ రావణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుక బడిన, సః శఙ్కరః = ఆ శంకరుడు, చన్ద్రహాసమితి = చంద్రహాసము అని, శ్రుతమ్ = ప్రసిద్ధమైన, మహాదీప్తమ్ = గొప్ప కాంతి గల, ఖడ్గమ్ = ఖడ్గమును, దదౌ = ఇచ్చెను. తదా = అప్పుడు, భూతపతిః = ఈశ్వరుడు, ఆయుషః = ఆయుస్సుయొక్క. శేషం చ = శేషమును కూడ, దదౌ = ఇచ్చెను.

తా. అప్పుడు రావణుడు అట్లు కోరగా శంకరుడు ఆతనికి చంద్రహాస మని ప్రసిద్ధి పొందిన గొప్ప కాంతి గల ఖడ్గమును, ఆయుర్దాయశేషమును, అనగా అతడు చేయు పాపకృత్యములకు ఫలితముగా అకాలమృత్యువు రాకుండు నట్లు వరమును ఇచ్చెను. 45

మూ. దత్త్వోవాచ తతః శమ్భుర్నావజ్ఞేయమిదం త్వయా, 46
అవజ్ఞాతం యది హి తే మామేవైష్యత్యసంశయః.

ప్ర. అ. శమ్భుః = ఈశ్వరుడు, దత్త్వా = ఇచ్చి, తతః = అటుపిమ్మట, ఉవాచ = పలికెను. ఇదమ్ = ఈ ఖడ్గము, త్వయా = నీచేత, నావజ్ఞేయమ్ = అనాదరింపదగినదికాదు. తే = నీకు (నీచేత) అవజ్ఞాతం యది = అవమానించ బడినట్లయితే, మామేవ = నన్నే, ఏష్యతి = పొందగలదు. అసంశయః = సంశ యము లేదు.

తా. శివుడు ఆ ఖడ్గమును ఇచ్చి-"నీవు దీనిని అవమానించకూడదు. అవమానించినట్లైతే ఇది మరల నా దగ్గరికి వచ్చివేయును; సందేహము లేదు"అని పలికెను. 46

వి. 41-46½ శ్లోకాలు ప్రాచ్యప్రతిలో లేవు.

మూ. ఏవం మహేశ్వరేణైవ కృతనామా స రావణః, 47
అభివాద్య మహాదేవమారురోహాథ పుష్పకమ్.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, మహేశ్వరేణైవ = మహేశ్వరునిచేతనే, కృతనామా = చేయబడిన పేరుగల, సః = అ. రావణః = రావణుడు, మహాదేవమ్ = మహేశ్వరుణ్ణి, అభివాద్య = నమస్కరించి, అథ = అటుపిమ్మట, పుష్పకమ్ = పుష్పకమును, ఆరురోహ = ఎక్కెను.

తా. ఈ విధముగా మహేశ్వరుడు పేరు పెట్టిన ఆ రావణుడు మహాదేవునకు నమస్కరించి పిమ్మట పుష్పకవిమానమును ఎక్కెను. 47

మూ. తతో మహీతలం రామ పర్యక్రామత రావణః, 48
క్షత్రియాన్ సుమహావీర్యాన్ బాధమానస్తతస్తతః.

ప్ర. అ. రామ = రామా! తతః = అటుపిమ్మట, రావణః = రావణుడు, సుమహావీర్యాన్ = గొప్ప పరాక్రమము గల, క్షత్రియాన్ = క్షత్రియులను, తత స్తతః = అక్కడక్కడ, బాధమానః = బాధించుచు, మహీతలమ్ = భూమిని, పర్యక్రామత = సంచరించెను.

తా. రామా! పిమ్మట ఆ రావణుడు అక్కడక్కడ ఉన్న గొప్ప పరాక్రమము గల క్షత్రియులను బాధించుచు భూలోకమునందు సంచరించెను. 48

మూ. కేచిత్తేజస్వినః శూరాః క్షత్రియాః యుద్ధదుర్మదాః,
తచ్ఛాసనమకుర్వన్తో వినేశుః సపరిచ్ఛదాః. 49

ప్ర. అ. తేజస్వినః = తేజస్సు కలవారు, శూరాః = శూరులు, యుద్ధదుర్మదాః = యుద్ధమునందు మదము కలవారు అయిన, కేచిత్ = కొందరు, క్షత్రియాః = క్షత్రియులు, తచ్ఛాసనమ్ = అతని ఆజ్ఞను, అకుర్వన్తః = చేయనివారై, సపరిచ్ఛదాః = పరివారముతో కూడినవారై, వినేశుః = నశించిరి.

తా. తేజశ్శాలులు, శూరులు, యుద్ధమునందు మదించినవారు (యుద్ధానికి వెనుదీయనివారు) అయిన కొందరు క్షత్రియులు ఆ రావణుని ఆజ్ఞ, ప్రకారము చేయకపోవుటచేత పరివారములతో నశించిరి. 49

మూ. అపరే దుర్జయం రక్షో జానన్తః ప్రాజ్ఞసంమతాః, 50
జితాః స్మ ఇత్యభాషన్త రాక్షసం బలదర్పితమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షోడశః సర్గః.

ప్ర. అ. ప్రాజ్ఞసంమతాః = బుద్ధిమంతులకు ఇష్టులైన, అపరే = మరి కొందరు, రక్షః = ఆ రాక్షసుణ్ణి, దుర్జయమ్ = జయింప శక్యము కానివానినిగా,

జానన్తః=ఎగిరినవారై, బలదర్పితమ్=బలముచేత గర్వించి ఉన్న, రాక్షసమ్=ఆ రాక్షసుణ్ణి గూర్చి, జితాః స్మః=జయించబడినాము, ఇతి=అని, అభాషన్త=పలికిరి.

తా. బుద్ధిమంతులైన మరి కొందరు క్షత్రియులు ఈ రాక్షసుణ్ణి జయించుట కష్టమని గ్రహించి, బలముచేత దృప్తుడై ఉన్న అతనితో "మేము ఓడిపోయినాము" అని పలికిరి.

"బాలానందిని' అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో పదహారవ సర్గ సమాప్తము.

అథ సప్తదశః సర్గః

[రావణుడు అవమానించుటచే బ్రహ్మర్షి కుమార్తె యైన వేదవతి వానిని శపించి అగ్నిలో ప్రవేశించుట. జన్మాంతరమునందు ఆమెయే సీతగా జన్మించుట].

మూ. అథ రాజన్ మహాబాహుర్విచరన్ పృథివీతలే,
హిమవద్వనమాసాద్య పరిచక్రామ రావణః. 1

ప్ర. అ. రాజన్ = రాజా ! అథ = అటుపిమ్మట, పృథివీతలే = భూమండలముమీద, విచరన్ = సంచరించుచు, మహాబాహుః = గొప్ప బాహువులు గల, రావణః = రావణుడు, హిమవద్వనమ్ = హిమవత్పర్వతప్రాంతవనమును, ఆసాద్య = సమీపించి, పరిచక్రామ = పరిక్రమించెను.

తా. రామా ! అటుపిమ్మట మహాభుజములు గల ఆ రావణుడు భూమిమీద సంచరించుచు హిమవత్పర్వతప్రాంతారణ్యమునకు వెళ్ళి అక్కడ సంచరించెను.

మూ. తత్రాపశ్యత్స వై కన్యాం కృష్ణాజినజటాధరామ్,
ఆర్షేణ విధినా యుక్తాం దీప్యన్తీం దేవతామివ. 2

ప్ర. అ. సః = అతడు, తత్ర = అక్కడ, కృష్ణాజినజటాధరామ్=కృష్ణాజినమును జటలను ధరించినది, ఆర్షేణ=వేదప్రోక్తమైన, విధినా=నియమముతో, యుక్తామ్ = కూడినదీ అయిన, దేవతామివ = దేవత వలె, దీప్యన్తీమ్=ప్రకాశించుచున్న, కన్యామ్ = కన్యను, అపశ్యత్ వై = చూచెను.

తా. అక్కడ రావణుడు దేవతాకన్య వలె ప్రకాశించుచున్న ఒక కన్యకను చూచెను. ఆమె వేదప్రోక్తములైన నియమములు పాటించుచు కృష్ణాజినమును, జటలను ధరించి ఉండెను.

మూ. స దృష్ట్వా రూపసంపన్నాం కన్యాం తాం సుమహావ్రతామ్,
కామమోహపరీతాత్మా పప్రచ్ఛ ప్రహసన్నివ. 3

ప్ర. అ. రూపసంపన్నామ్=రూపముతో కూడిన, సుమహావ్రతామ్=చాల గొప్ప వ్రతము గల, తాం కన్యామ్=ఆ కన్యను, దృష్ట్వా=చూచి, సః=అతడు, కామమోహపరీతాత్మా = కామమోహములతో నిండిన మనస్సు గలవాడై, ప్రహసన్నివ = నవ్వుచు, పప్రచ్ఛ = అడిగెను.

తా. ఆ రావణుడు గొప్ప నియమమును అవలంబించి ఉన్న మంచి సౌందర్యముగల, ఆ కన్యను చూడగానే కామమోహములతో నిండిన మనస్సుతో నవ్వుచు ఇట్లు పలికెను. 3

మూ. కిమిదం వర్తసే భద్రే విరుద్ధం యౌవనస్య తే,
న హి యుక్తా తవైతస్య రూపస్యేదం ప్రతిక్రియా. 4

ప్ర. అ. భద్రే = మంగళప్రదురాలా ! తే = నీయొక్క, యౌవనస్య = యౌవనమునకు, విరుద్ధమ్ = విరుద్ధముగా, వర్తసే = ప్రవర్తించుచున్నావు; ఇదమ్ = ఇది, కిమ్ = ఏమి ? తవ=నీయొక్క, ఏతస్య రూపస్య= ఈ రూపమునకు, ఇదంప్రతిక్రియా = ఈ విరుద్ధమైన క్రియ, న యుక్తా హి = యుక్తము కాదు కదా.

తా. ''మంగళప్రదురాలా ! ఏమిది! నీవు నీ యౌవనమునకు విరుద్ధముగా ప్రవర్తించుచున్నావు ? నీ ఈ సౌందర్యమునకు విరుద్ధముగా ఇట్టి ప్రవర్తన యుక్తము కాదు కదా ?" 4

మూ. రూపం తేఽనుపమం భీరు కామోన్మాదకరం నృణామ్,
న యుక్తం తపసి స్థాతుం నిర్గతో హ్యేష నిర్ణయః. 5

ప్ర. అ. భీరు = భయస్వభావము గలదానా ! తే = నీయొక్క, అనుపమమ్ = సాటిలేని, రూపమ్ = రూపము, నృణామ్ = మానవులకు, కామోన్మాదకరమ్ = కామోన్మాదమును కలిగించునది, తపసి = తపస్సునందు, స్థాతుమ్ = ఉండుటకు, న యుక్తమ్ = యుక్తము కాదు. ఏషః = ఈ, నిర్ణయః = నిర్ణయము, నిర్గతః హి = ప్రసిద్ధము కదా ?

తా. "ఓ! భయస్వభావముగలదానా! సాటిలేని నీ రూపము పురుషులకు కామోన్మాదమును కలిగించునది. తపస్సు చేయుటకు తగినది కాదు. ఇది లోక ప్రసిద్ధమైన నిర్ణయము కదా?" 5

మూ. కస్యాసి కిమిదం భద్రే కశ్చ భర్తా వరాననే,
యేన సంభుజ్యసే భీరు స నరః పుణ్యభాగ్భువి. 6

ప్ర. అ. భద్రే = మంగళప్రదురాలా! కస్య = ఎవనిదానవు, అసి = అయి ఉన్నావు? ఇదమ్ = ఇది, కిమ్ = ఏమి? వరాననే = శ్రేష్ఠమైన ముఖము గల దానా! భర్తా = భర్త, కః చ = ఎవడు? భీరు = భయస్వభావము గలదానా, యేన = ఎవనిచేత, సంభుజ్యసే = అనుభవించబడుచున్నావో, సః నరః = ఆ పురుషుడు, భువి = ఈ భూలోకమునందు, పుణ్యభాక్ = పుణ్యమును పొందిన వాడు.

తా. "ఓ! భద్రురాలా! నీవు ఎవరిదానవు. ఇది ఏమి? సుందరముఖీ! నీ భర్తఎవరు? ఓ! భయశీలా! నిన్ను అనుభవించు పురుషుడు ఈ లోకములో పుణ్యాత్ముడు." 6

మూ. పృచ్ఛతః శంస మే సర్వం కస్య హేతోః పరిశ్రమః,
ఏవముక్తా తు సా కన్యా రావణేన యశస్వినీ, 7
అబ్రవీద్విధివత్కృత్వా తస్యాతిథ్యం తపోధనా.

ప్ర. అ. కస్య హేతోః = ఏ హేతువునకై, (ఏ కారణమువలన), పరిశ్రమః = ఈ తపోరూపమైన శ్రమ? పృచ్ఛతః = అడుగుచున్న, మే = నాకు, సర్వమ్ = సమస్తమునూ, శంస = చెప్పుము. రావణేన = రావణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తా = పలకబడిన, యశస్వినీ = కీర్తిమంతురాలైన, తపోధనా = తపస్సే ధనముగా గల, సా కన్యా = ఆ కన్య, విధివత్ = యథాశాస్త్రముగా, తస్య = వానికి, ఆతిథ్యమ్ = ఆతిథ్యమును, కృత్వా = చేసి, అబ్రవీత్ = పలికెను.

తా. "నీ వీ తపస్సు ఎందుకు చేయుచున్నావు? అడుగుచున్న నాకు అంతా చెప్పుము." కీర్తిమంతురాలు, తపోధనురాలూ అయిన ఆ కన్య రావణుని మాటలు విని, వానికి యథాశాస్త్రముగా ఆతిథ్య మిచ్చి ఇట్లు పలికెను.

మూ. కుశధ్వజో నామ పితా బ్రహ్మర్షిరమితప్రభః, 8
బృహస్పతిసుతః శ్రీమాన్ బుద్ధ్యా తుల్యో బృహస్పతేః.

ప్ర. అ. అమితప్రభః = గొప్ప కాంతి గలవాడు, బృహస్పతిసుతః = బృహస్పతి కుమారుడు, శ్రీమాన్ = శోభాయుక్తుడు, బుద్ధ్యా = బుద్ధిచేత, బృహస్పతేః = బృహస్పతికి, తుల్యః = సమానుడు అయిన, కుశధ్వజో నామ = కుశధ్వజు డను, బ్రహ్మర్షిః = బ్రహ్మర్షి, పితా = నా తండ్రి.

తా. గొప్ప తేజస్సు గలవాడు, బృహస్పతి కుమారుడు, బుద్ధిచేత బృహస్పతితో సమానుడు, శోభావంతుడు అయిన కుశధ్వజు డనే బ్రహ్మర్షి నా తండ్రి.

మూ. తస్యాహం కుర్వతో నిత్యం వేదాభ్యాసం మహాత్మనః,
సంభూతా వాఙ్మయీ కన్యా నామ్నా వేదవతీ స్మృతా.

ప్ర. అ నిత్యమ్ = నిత్యమూ, వేదాభ్యాసమ్ = వేదాభ్యాసమును, కుర్వతః = చేయుచున్న, మహాత్మనః = మహాత్ముడైన, తస్య = ఆతనికి, అహమ్ = నేను, వాఙ్మయీ = వేదవాఙ్మయురాలైన, కన్యా = కన్యనుగా, సంభూతా = పుట్టితిని. నామ్నా = పేరుచేత, వేదవతీ = వేదవతిగా, స్మృతా = చెప్పబడితిని.

తా. నిత్యమూ వేదాభ్యాసము చేయు ఆ మహాత్మునకు వేదవాఙ్మయ స్వరూపిణినైన నేను కన్యగా పుట్టినాను. నా పేరు వేదవతి. 9

మూ. తతో దేవాః సగన్ధర్వా యక్షరాక్షసపన్నగాః,
తే చాపి గత్వా పితరం వరణం రోచయన్తి మే. 10

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, దేవాః = దేవతలు, తే = ఆ, యక్షరాక్షసపన్నగాః చాపి = యక్షులు, రాక్షసులు, పన్నగులు కూడ, పితరమ్ = తండ్రిని గూర్చి, గత్వా = వెళ్ళి. మే = నాయొక్క, వరణమ్ = వరణమును గూర్చి, రోచయన్తి = ఇష్టపడిరి.

తా. అప్పుడు దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు నా తండ్రి దగ్గరకు వెళ్ళి తమకు నన్ను ఇమ్మని కోరిరి. 10

మూ. న చ మాం స పితా తేభ్యో దత్తవాన్ రాక్షసేశ్వర,
కారణం తద్వదిష్యామి నిశామయ మహాభుజ. 11

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసరాజా ! పితా = తండ్రి, మామ్ = నన్ను, తేభ్యః = వాళ్ళకొరకు, న దత్తవాన్ = ఇవ్వలేదు. మహాభుజ = గొప్ప భుజములు గలవాడా ! తత్ = ఆ, కారణమ్ = కారణమును, వదిష్యామి = చెప్పెదను, నిశామయ = వినుము.

తా. రాక్షసరాజా! నా తండ్రి నన్ను వాళ్ళకి ఇవ్వలేదు. ఓ ! మహాభుజా! అందుకు కారణము చెప్పుచున్నాను; వినుము. 11

మూ. పితుస్తు మమ జామాతా విష్ణుః కిల సురేశ్వరః,
అభిప్రేతస్త్రిలోకేశ స్తస్మాన్నాన్యస్య మే పితా. 12

దాతుమిచ్ఛతి తస్మై తు తచ్ఛ్రుత్వా బలదర్పితః,
శమ్భుర్నామ తతో రాజా దైత్యానాం కుపితోఽభవత్,
తేన రాత్రౌ శయానో మే పితా పాపేన హింసితః. 13

ప్ర. అ. మమ పితుః = నా తండ్రికి, సురేశ్వరః = దేవతాప్రభువు, త్రిలోకేశః = మూడు లోకములకు ప్రభువూ అయిన, విష్ణుః = విష్ణువు, జామాతా = అల్లుడుగా, అభిప్రేతః కిల = ఇష్టమైనవాడట. తస్మాత్ = ఆ కారణమువలన, మే పితా = నా తండ్రి, అన్యస్య = ఇతరునకు, దాతుమ్ = ఇచ్చుటకు, న ఇచ్ఛతి ఇచ్ఛయించుటలేదు. తత్ = దానిని, శ్రుత్వా = విని, దైత్యానామ్ = దైత్యుల యొక్క, రాజా = రాజైన, శమ్భుర్నామ = శంభువు అనువాడు. తస్మై = నా తండ్రికి, కుపితః = కోపించినవాడు. అభవత్ = ఆయెను. పాపేన = పాపాత్ముడైన, తేన = వానిచేత, రాత్రౌ = రాత్రియందు, శయానః = నిద్రించుచున్న, మే పితా = నా తండ్రి, హింసితః = చంపబడినాడు.

తా. దేవతల ప్రభువు, మూడు లోకాలకు అధిపతీ అయిన విష్ణువు తన అల్లుడు కావలె నని నా తండ్రికి కోరిక ఉండెను. అందుచే అతడు నన్ను మరెవ్వరికీ ఇచ్చుటకు అంగీకరించలేదు. శంభువు అనే దైత్యరాజు ఇందుకు కోపించెను. ఆ పాపాత్ముడు నా తండ్రిని రాత్రి నిద్రించిఉండగా చంపివేసెను.

మూ. తతో మే జననీ దీనా తచ్ఛరీరం పితుర్మమ,
పరిష్వజ్య మహాభాగా ప్రవిష్టా హవ్యవాహనమ్. 14

ప్ర. అ. తతః = అటు పిమ్మట, మహాభాగా = మహాభాగ్యవంతురాలైన, మే జననీ = నా తల్లి, దీనా = దీనురాలై, మమ పితుః = నా తండ్రియొక్క, తత్ = ఆ, శరీరమ్ = శరీరమును, పరిష్వజ్య = కౌగలించుకొని, హవ్యవాహనమ్ = అగ్నిని, ప్రవిష్టా = ప్రవేశించినది.

తా. పిమ్మట మహాభాగ్యవంతురాలైన నా తల్లి దీనురాలై నా తండ్రి శరీరమును కౌగలించుకొని అగ్నిలో ప్రవేశించినది. 14

మూ. తతో మనోరథం సత్యం పితుర్నారాయణం ప్రతి,
కరోమీతి తమేవాహం హృదయేన సముద్వహే. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అహమ్ = నేను, నారాయణం ప్రతి = విష్ణువును గూర్చి, పితుః = తండ్రియొక్క, మనోరథమ్ = మనోరథమును, సత్యమ్ = సత్యమైనదానినిగా, కరోమీతి = చేయుదును అని, తమేవ = ఆ నారాయణునే, హృదయేన = హృదయముచేత, సముద్వహే = వహించుచున్నాను.

తా. నారాయణుణ్ణి గూర్చి మా తండ్రికి ఉన్న మనోరథమును సత్యమైన దానినిగా చేయవలె నని నిశ్చయించుకొని నేను ఆ నారాయణుణ్ణే హృదయములో ఉంచుకొని ఉన్నాను. 15

మూ. ఇతి ప్రతిజ్ఞామారుహ్య చరామి విపులం తపః,
ఏతత్తే సర్వమాఖ్యాతం మయా రాక్షసపుంగవ. 16

ప్ర. అ. ఇతి = ఇట్లు, ప్రతిజ్ఞామ్ = ప్రతిజ్ఞను, ఆరుహ్య = అధిష్ఠించి, విపులమ్ = అధికమైన, తపః = తపస్సును, చరామి = ఆచరించుచున్నాను. రాక్షసపుంగవ = రాక్షసశ్రేష్ఠుడా! మయా = నాచేత, ఏతత్ = ఈ, సర్వమ్ = అంతా, తే = నీకు, ఆఖ్యాతమ్ = చెప్పబడినది.

తా. ఈ విధముగా ప్రతిజ్ఞ చేసి గొప్ప తపస్సు చేయుచున్నాను. రాక్షస శ్రేష్ఠుడా! ఈ విషయ మంతా నీకు చెప్పినాను. 16

మూ. నారాయణో మమ పతిర్న త్వన్యః పురుషోత్తమాత్,
ఆశ్రయే నియమం ఘోరం నారాయణపరీప్సయా. 17

ప్ర. అ. నారాయణః = నారాయణుడే ... = నాయొక్క, పతిః = భర్త. పురుషోత్తమాత్ = పురుషశ్రేష్ఠుడైన ఆ నారాయణునికంటె, అన్యః = మరియొకడు, న తు = లేడు. నారాయణపరీప్సయా = నారాయణుని పొందవలెనను కోరికచేత, ఘోరమ్ = భయంకరమైన, నియమమ్ = నియమమును. ఆశ్రయే = ఆశ్రయించుచున్నాను.

తా. నాకు నారాయణుడే భర్త. అతడు తప్ప మరొక డెవ్వడూ కాడు. ఆ నారాయణుణ్ణి పొందవలెనను కోరికచేతనే భయంకరమైన నియమమును అవలంబించి ఉన్నాను. 17

మూ. విజ్ఞాతస్త్వం హి మే రాజన్ గచ్ఛ పౌలస్త్యనందన,
జానామి తపసా సర్వం త్రైలోక్యే యద్ధి వర్తతే. 18

ప్ర. అ. పౌలస్త్యనన్దన = పులస్త్యుని పుత్రుడైన విశ్రవసుని కుమారుడవైన, రాజన్ = రాక్షసరాజా! త్వమ్ = నీవు, మే = నాకు, విజ్ఞాతః = తెలియబడినావు. గచ్ఛ = వెళ్ళుము. త్రైలోక్యే = మూడు లోకముల సముదాయమునందు, యత్ = ఏది, వర్తతే = ఉన్నదో, సర్వమ్ = దానిని అంతా, తపసా = తపస్సుచేత, జానామి హి = ఎరుగుదును కదా.

తా. రాక్షసరాజువైన రావణా! నిన్ను గూర్చి నాకు తెలియును. ఇంక వెళ్ళుము. మూడు లోకములలో ఉన్నది అంతా నాకు తపోబలముచేత తెలియును.

మూ. సోఽబ్రవీద్రావణో భూయస్తాం కన్యాం సుమహావ్రతామ్,
అవరుహ్య విమానాగ్రాత్కన్దర్పశరపీడితః. 19

ప్ర. అ. కన్దర్పశరపీడితః = మన్మథబాణములచేత పీడింపబడిన, సః రావణః = ఆ రావణుడు, విమానాగ్రాత్ = విమానము పైభాగమునుండి, అవరుహ్య = దిగి. సుమహావ్రతామ్ = చాల గొప్ప వ్రతము గల, తాం కన్యామ్ = ఆ కన్యను గూర్చి, భూయః = మరల, అబ్రవీత్ = పలికెను.

తా. మన్మథశరములచేత పీడింపబడిన ఆ రావణుడు విమానాగ్రభాగము నుండి దిగి, గొప్ప తపస్సు చేయుచున్న ఆ కన్యతో మరల ఇట్లనెను. 19

మూ. అవలిప్తాసి సుశ్రోణి యస్యాస్తే మతిరీదృశీ,
వృద్ధానాం మృగశాబాక్షి భ్రాజతే పుణ్యసంచయః. 20

ప్ర. అ. సుశ్రోణి = అందమైన పిరుదులు గలదానా ! యస్యాః = ఏ, తే = నీయొక్క, మతిః = బుద్ధి, ఈదృశీ = ఈ విధముగా ఉన్నదో (అట్టి నీవు), అవలిప్తా = గర్వించినదానవు, అసి = అయి ఉన్నావు. మృగశాబాక్షి = లేడిపిల్ల నేత్రములవంటి నేత్రములు గలదానా ! పుణ్యసంచయః = పుణ్యమును ప్రోగు చేయుట, వృద్ధానామ్ = ముసలివాళ్ళకు, శోభతే = శోభించును.

తా. ఓ ! సుశ్రోణీ ! ఇట్టి ఆలోచన గల నీవు గర్వముతో ఉన్నావు. ఓ ! బాలమృగనయనా ! ఈ విధముగా తపస్సు చేయుట అనునది ముసలివాళ్ళకు మాత్రమే తగిన పని. 20

మూ. త్వం సర్వగుణసంపన్నా నార్హసే వక్తుమీదృశమ్,
త్రైలోక్యసున్దరి భీరు యౌవనం తేఽతివర్తతే. 21

ప్ర. అ. భీరు = భయస్వభావముగలదానా ! త్వమ్ = నీవు, సర్వగుణ సంపన్నా = సమస్తగుణములతో కూడినదానవు. త్రైలోక్యసున్దరీ = మూడు లోకముల సముదాయమునందూ సుందరివి. ఈదృశమ్ = ఈ విధమైన వాక్యమును, వక్తుమ్ = చెప్పుటకు, నార్హసే = తగవు. తే = నీయొక్క, యౌవనమ్ = యౌవనము, అతివర్తతే = దాటిపోవుచున్నది.

తా. భయస్వభావముగలదానా! సమస్తసద్గుణములు ఉన్నదానవు. మూడు లోకములలో సుందరివి అయిన నీవు ఇట్లు పలుకుట తగదు. నీ యౌవనము దాటి పోవుచున్నది. 21

మూ. అహం లఙ్కాపతిర్భద్రే దశగ్రీవ ఇతి శ్రుతః,
తస్య మే భవ భార్యా త్వం భుఙ్క్ష్వ భోగాన్యథాసుఖమ్.

ప్ర. అ. భద్రే = మంగళప్రదురాలా ! అహమ్ = నేను, లఙ్కాపతిః = లంకాధిపతిని. దశగ్రీవః ఇతి = దశగ్రీవుడు అని, శ్రుతః = ప్రసిద్ధుడను. త్వమ్

= నీవు, తస్య = అట్టి, మే = నాకు, భార్యా = భార్యవు, భవ = అగుము. యథాసుఖమ్ = సుఖముగా, భోగాన్ = భోగములను, భుజ్క్ష్వ = అనుభవింపుము.

తా. ఓ ! మంగళప్రదురాలా ! నేను లంకాధిపతిని. దశగ్రీవుడు అని ప్రసిద్ధి చెందినవాడను. అట్టి నాకు భార్యవై నీవు సుఖముగా భోగములు అనుభవింపుము. 22

మూ. కశ్చ తావదసౌ యం త్వం విష్ణురిత్యభిభాషసే,
వీర్యేణ తపసా చైవ భోగేన చ బలేన చ,
స మయా నో సమో భద్రే యం త్వం కామయసేఽఙ్గనే.

ప్ర. అ. త్వమ్ = నీవు, యమ్ = ఎవనిని గూర్చి, విష్ణురితి = విష్ణువు అని, అభిభాషసే = పలుకుచున్నావో, అసౌ = ఇతడు, కశ్చ తావత్ = ఎవడు ? (ఎంతటి వాడు ?) భద్రే = మంగళప్రదురాలవైన, అఙ్గనే = ఓ ! తరుణీ ! త్వమ్ = నీవు, యమ్ = ఎవనిని, కామయసే = కోరుచున్నావో, సః = అతడు, వీర్యేణ = పరాక్రమముచేతా, తపసా చైవ = తపస్సుచేతా, భోగేన = భోగముచేత, బలేన చ = బలముచేత, మయా = నాతో, సమః = సమానుడు, న = కాడు.

తా నీవు విష్ణువని అనుచున్నవాడు ఎంతటివాడు ! మంగళప్రదురాలా! నీవు కోరుచున్న ఆ విష్ణువు వీర్యముచేత గాని, తపస్సుచేత గాని, భోగముచేత గాని, బలముచేత గాని నాతో సమానుడు కాడు. 23

మూ. ఇత్యుక్తవతి తస్మింస్తు వేదవత్యథ సాఽబ్రవీత్,
మా మైవమితి సా కన్యా తమువాచ నిశాచరమ్. 24

ప్ర. అ. తస్మిన్ = అతడు, ఏవమ్ = ఇట్లు, ఉక్తవతి = పలికినవాడగుచుండగా, సా = ఆ, వేదవతీ = వేదవతి, ఏవమ్ = ఇట్లు, మా మా = అనవద్దు అనవద్దు, ఇతి = అని, అబ్రవీత్ = పలికెను. సా కన్యా = ఆ కన్య, తమ్ = ఆ, నిశాచరమ్ = రాక్షసుణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. అతని మాటలు విని వేదవతి "అట్లనకుము, అట్లనకుము" అని పలికెను. ఆ కన్య ఆ రాక్షసునితో మరల ఇట్లనెను. 24

మూ. త్రైలోక్యాధిపతిం విష్ణుం సర్వలోకనమస్కృతమ్,
త్వదృతే రాక్షసేన్ద్రాన్యః కోఽవమన్యేత బుద్ధిమాన్. 25

ప్ర. అ. రాక్షసేన్ద్ర = రాక్షసరాజా ! త్వదృతే = నీవు తప్ప, బుద్ధిమాన్ = బుద్ధిమంతుడైన, అన్యః = మరొకడు, కః = ఎవడు, త్రైలోక్యాధిపతిమ్ = మూడు లోకముల అధిపతి, సర్వలోకనమస్కృతమ్ = సమస్తలోకములచేత నమస్కరించబడినవాడు అయిన, విష్ణుమ్ = విష్ణువును, అవమన్యేత = అవమానించును ?

తా. రాక్షసరాజా ! నీవు తప్ప బుద్ధిమంతుడైన మరెవ్వడైనా, మూడు లోకముల అధిపతీ, సర్వలోకములచేత నమస్కరింపబడేవాడూ అయిన విష్ణువును అవమానించునా ? 25

మూ. ఏవముక్తస్తయా తత్ర వేదవత్యా నిశాచరః,
మూర్ధజేషు తదా కన్యాం కరాగ్రేణ పరామృశత్. 26

ప్ర. అ. తత్ర = అక్కడ, తయా = ఆ, వేదవత్యా = వేదవతిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, నిశాచరః = రాక్షసుడు, తదా = అప్పుడు, కన్యామ్ = ఆ కన్యను, కరాగ్రేణ = హస్తాగ్రముచేత, మూర్ధజేషు = కేశముల యందు, పరామృశత్ = స్పృశించెను.

తా. ఆ వేదవతి అట్లు చెప్పుచుండగా రావణుడు హస్తాగ్రముతో ఆమె శిరోజములను పట్టుకొనెను. 26

మూ. తతో వేదవతీ క్రుద్ధా కేశాన్ హస్తేన సాచ్ఛినత్,
అసిర్భూత్వా కరస్తస్యాః కేశాంశ్ఛిన్నాంస్తదాకరోత్. 27

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సా = ఆ, వేదవతీ = వేదవతి, క్రుద్ధా = కోపించినదై, హస్తేన = హస్తముచేత, కేశాన్ = కేశములను, అచ్ఛినత్ = ఛేదించెను. తదా = అప్పుడు, తస్యాః = ఆమెయొక్క, కరః = హస్తము, అసిః = కత్తిగా, భూత్వా = అయి, కేశాన్ = కేశములను, ఛిన్నాన్ = ఛేదింపబడినవాటినిగా, అకరోత్ = చేసెను.

తా. అప్పుడు ఆ వేదవతి కోపించినదై హస్తముచేత కేశములను ఛేదించెను. అప్పుడు ఆమె హస్తము కత్తిగా అయి కేశములను ఛేదించెను. 27

మూ. సా జ్వలన్తీవ రోషేణ దహన్తీవ నిశాచరమ్,
ఉవాచాగ్నిం సమాధాయ మరణాయ కృతత్వరా. 28

ప్ర. అ. సా = ఆమె, రోషేణ = కోపముతో, జ్వలన్తీవ = మండుచున్నది వలె, నిశాచరమ్ = రాక్షసుణ్ణి, దహన్తీవ = కాల్చుచున్నది వలె, అగ్నిమ్ = అగ్నిని, సమాధాయ = ఏర్పరచి, మరణాయ = మరణముకొరకు, కృతత్వరా = చేయబడిన తొందర గలదై, ఉవాచ = పలికెను.

తా. రోషముతో మండుచున్నదా అన్నట్లున్న ఆమె రావణున్ని కాల్చివేయుచున్నదా అన్నట్టు చూచుచు, అగ్నిని ఏర్పరచుకొని, మరణించుటకు తొందరపడుచు రావణునితో ఇట్లనెను. 28

మూ. ధర్షితాయా స్త్వయానార్య న మే జీవితమిష్యతే,
రక్ష స్తస్మాత్ప్రవేక్ష్యామి పశ్యత స్తే హుతాశనమ్. 29

ప్ర. అ. అనార్య = చెడ్డవాడా ! త్వయా = నీచేత, ధర్షితాయాః = అవమానింపబడిన. మే = నాకు, జీవితమ్ = జీవితము, న ఇష్యతే = ఇష్టము కాదు. రక్షః = రాక్షసుడా ! తస్మాత్ = ఆ కారణమువలన, తే = నీవు, పశ్యతః = చూచుచుండగా, హుతాశనమ్ = అగ్నిని, ప్రవేక్ష్యామి = ప్రవేశించెదను.

తా. ఓ ! చెడ్డ రాక్షసుడా ! నీనుండి అవమానము పొందిన పిమ్మట ఇక నేను జీవించుటకు ఇచ్ఛయించను. నీవు చూచుచుండగానే అగ్నిలో ప్రవేశించెదను. 29

మూ. యస్మాత్తు ధర్షితా చాహం త్వయా పాపాత్మనా వనే,
తస్మాత్తవ వధార్థం హి సముత్పత్స్యే హ్యహం పునః. 30

ప్ర. అ. అహమ్ = నేను, పాపాత్మనా = పాపాత్ముడవైన, త్వయా = నీచేత, వనే = వనమునందు, యస్మాత్ = ఏ కారణమువలన, ధర్షితా = అవమానించబడితినో, తస్మాత్ = ఆ కారణమువలన, తవ = నీయొక్క, వధార్థాయ = వధకొరకు, అహమ్ = నేను, పునః = మరల, సముత్పత్స్యే = పుట్టగలను.

తా. పాపాత్ముడవైన నీవు నన్ను వనములో అవమానించినావు. అందు వలన నిన్ను చంపుటకై నేను మరల జన్మించెదను. 30

మూ. న హి శక్యః స్త్రియా హన్తుం పురుషః పాపనిశ్చయః,
శాపే త్వయి మయోత్సృష్టే తపసశ్చ వ్యయో భవేత్. 31

ప్ర. అ. పాపనిశ్చయః = పాపమైన నిశ్చయము గల, పురుషః = పురుషుడు, స్త్రియా = స్త్రీచేత, హన్తుమ్ = చంపుటకు, న శక్యః హి = శక్యమైనవాడు కాడు కదా ? త్వయి = నీయందు, శాపే = శాపము, మయా = నాచేత, ఉత్సృష్టే = విడవబడినదగుచుండగా, తపసః = తపస్సుయొక్క, వ్యయశ్చ = వ్యయము కూడ, భవేత్ = అగును.

తా. పాపనిశ్చయము గల పురుషుణ్ణి స్త్రీ చంపజాలదుకదా ? నీకు శాపమిచ్చినచో నా తపస్సు వ్యయమైపోవును. 31

మూ. యది త్వస్తి మయా కించిత్కృతం దత్తం హుతం తథా,
తస్మాత్త్వయోనిజా సాధ్వీ భవేయం ధర్మిణః సుతా. 32

ప్ర. అ. మయా = నాచేత, కించిత్ = ఏమైనా, కృతమ్ = చేయబడినది, దత్తమ్ = ఇవ్వబడినది. తథా = మరియు, హుతమ్ = హోమముచేయబడినదీ, అస్తి యది = ఉన్నట్లయితే, తస్మాత్ = దానివలన, అయోనిజా = అయోనిజ (గర్భవాసము చేసి జనించనిది)యైన, సాధ్వీ = పతివ్రతయైన, ధర్మిణః సుతా = ధర్మాత్ముని కుమార్తెగా, భవేయమ్ = అగుదును.

తా. నేను ఏదైన మంచి పని కాని, దానము కాని, హోమము కాని చేసి ఉన్నచో దానికి ఫలితముగా రాబోవు జన్మలో ఒక ధర్మాత్ముని అయోనిజయైన కుమార్తెగా, పతివ్రతగా పుట్టగలను. 32

మూ. ఏవముక్త్వా ప్రవిష్టా సా జ్వలితం జాతవేదసమ్,
పపాత చ దివో దివ్యా పుష్పవృష్టిః సమన్తతః. 33

ప్ర. అ. సా = ఆమె, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, జ్వలితమ్ = ప్రజ్వలింపచేయబడిన, జాతవేదసమ్ = అగ్నిని, ప్రవిష్టా = ప్రవేశించినది. దివః

= స్వర్గమునుండి, సమన్తతః = నలు వైపులా, దివ్యా = దివ్యమైన, పుష్పవృష్టిః = పుష్పవృష్టి, పపాత చ = పడెను.

తా. ఆమె ఇట్లు పలికి ప్రజ్వలించుచున్న అగ్నిలో ప్రవేశించెను. అప్పుడు అంతటా దివ్యమైన పుష్పవృష్టి కురిసెను. 33

మూ. పునరేవ సముద్భూతా పద్మే పద్మసమప్రభా,
తస్మాదపి పునః ప్రాప్తా పూర్వవత్తేన రక్షసా. 34

ప్ర. అ. పద్మసమప్రభా = పద్మముతో సమానమైన కాంతి గల ఆమె, పునరేవ = మరల, పద్మే = పద్మమునందు, సముద్భూతా = పుట్టినది. తస్మాదపి = దానినుండి కూడ, తేన రక్షసా = ఆ రాక్షసునిచేత, పూర్వవత్ = పూర్వము నందు వలె, పునః = మరల, ప్రాప్తా = పొందబడినది.

తా. పద్మము వంటి కాంతి గల ఆమె మరల పద్మములో జనించెను. ఆ రాక్షసుడు మరల ఆమెను గ్రహించెను. 34

మూ. కన్యాం కమలగర్భాభాం ప్రగృహ్య స్వగృహం యయౌ,
ప్రగృహ్య రావణస్త్వేతాం దర్శయామాస మన్త్రిణే. 35

ప్ర. అ. రావణస్తు = రావణుడైతే, కమలగర్భాభామ్ = పద్మగర్భము వంటి కాంతి గల, కన్యామ్ = కన్యను, ప్రగృహ్య = గ్రహించి, స్వగృహమ్ = తన గృహమును గూర్చి, యయౌ = వెళ్ళెను. ఏతామ్ = ఈమెను, ప్రగృహ్య = గ్రహించి, మన్త్రిణే = మంత్రికి, దర్శయామాస = చూపెను.

తా. పద్మమధ్యభాగము వంటి కాంతి గల ఆ కన్యను గ్రహించి ఆ రావణుడు తన ఇంటికి వెళ్ళెను. ఈమెను తీసికొని వెళ్ళి మంత్రికి చూపెను. 35

మూ. లక్షణజ్ఞో నిరీక్ష్యైవ రావణం చైవమబ్రవీత్,
గృహస్థైషా హి సుశ్రోణీ త్వద్వధాయైవ దృశ్యతే. 36

ప్ర. అ. లక్షణజ్ఞః = లక్షణములు ఎరిగిన ఆ మంత్రి, నిరీక్ష్యైవ = చూడగానే, రావణమ్ = రావణుని గూర్చి, ఏవమ్ = ఇట్లు, అబ్రవీత్ = పలికెను. ఏషా = ఈ, సుశ్రోణీ = అందమైన కటి ప్రదేశము గలది, త్వద్వధాయైవ = నీ వధ కొరకే, గృహస్థా = గృహములో ఉన్నదిగా, దృశ్యతే = కనబడుచున్నది.

తా. సాముద్రికలక్షణములు తెలిసిన ఆ మంత్రి ఆ శిశువును చూడగానే రావణునితో "ఈమె నీ వధకొరకే గృహము చేరినది"అని పలికెను. 36

మూ. ఏతచ్ఛ్రుత్వార్ణవే రామ తాం ప్రచిక్షేప రావణః,
సా చైవ క్షితిమాసాద్య యజ్ఞాయతనమధ్యగా,
రాజ్ఞో హలముఖోత్కృష్టా పునరప్యుత్థితా సతీ. 37

ప్ర. అ. రామ = రామా ! ఏతత్ = దీనిని, శ్రుత్వా = విని, రావణః = రావణుడు, తామ్ = ఆమెను, అర్ణవే = సముద్రమునందు, చిక్షేప = విసిరివేసెను. సతీ = ఉత్తమురాలైన, సా చైవ = ఆమె, క్షితిమ్ = భూమిని, ఆసాద్య = పొంది, యజ్ఞాయతనమధ్యగా= యజ్ఞగృహమధ్యమును పొందినదై, రాజ్ఞః=రాజుయొక్క, హలముఖోత్కృష్టా = నాగలి అగ్రభాగముచేత రాయబడినదై, పునరపి = మరల, ఉత్థితా= పైకి లేచినది.

తా. రామా ! ఆ మాట విని రావణుడు ఆమెను సముద్రములోనికి విసిరివేసెను. ఉత్తమురాలైన ఆమె భూమిని చేరి, జనకుని నాగలి అగ్రభాగముచేత గీయబడినదై మరల పైకి వచ్చినది.

వి. 34-37 శ్లోకాలు చాలా ప్రతులలో లేవు. వ్యాఖ్యాతలు కూడ వ్యాఖ్యానించలేదు. 37

మూ. సైషా జనకరాజస్య ప్రసూతా తనయా ప్రభో,
తవ భార్యా మహాబాహో విష్ణుస్త్వం హి సనాతనః. 38

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా ! ప్రభో = ఓ ! ప్రభూ ! జనకరాజస్య = జనకమహారాజుయొక్క, తనయా = కుమారైగా, ప్రసూతా = పుట్టిన, సా ఏషా = అట్టి ఈమెయే, తవ = నీయొక్క, భార్యా = భార్య. త్వమ్ = నీవు, సనాతనః = సనాతనుడవైన, విష్ణుః హి = విష్ణువుకదా !

తా. ఓ ! ప్రభూ ! జనకుని కుమార్తెగా పుట్టిన ఈమెయే నీ భార్య. ఓ ! మహాబాహూ ! నీవు సనాతనుడవైన విష్ణుమూర్తివే కదా! 38

మూ. పూర్వం క్రోధహతః శత్రు ర్యయాసౌ నిహత స్త్వయా;
ఉపాశ్రయిత్వా శైలాభ స్తవ వీర్యమనుత్తమమ్. 39

ప్ర. అ. యయా = ఏ వేదవతిచేత, పూర్వమ్=పూర్వము, క్రోధహతః= క్రోధముచేత హతుడైనాడో (హతప్రాయుడైనాడో), అసౌ = ఈ, శైలాభః = శైలము వంటి కాంతి గల, శత్రుః = శత్రువు, అనుత్తమమ్ = చాల గొప్పదైన, తవ వీర్యమ్ = నీ పరాక్రమమును, ఉపాశ్రయిత్వా = ఆశ్రయించి, తయా=ఆమె చేతనే, నిహతః = చంపబడినాడు.

తా. పర్వతమువంటి ఈ శత్రువును పూర్వమే వేదవతి తన కోపముచేత పరాక్రమవిహీనునిగా చేసినది. ఆమెయే శ్రేష్ఠమైన నీ పరాక్రమము సాహాయ్యముతో వీనిని సంహరించినది. 39

మూ. ఏవమేషా మహాభాగా మర్త్యేషూత్పత్స్యతే పునః,
క్షేత్రే హలముఖోత్కృష్టే వేద్యామగ్నిశిఖోపమా. 40

ప్ర. అ. ("ఏవమేషా మహాభాగా పునర్మర్త్యేష్వజాయత"అనే ప్రాచ్య పాఠము బాగున్నది). వేద్యామ్ = వేదియందు, అగ్నిశిఖోపమా = అగ్నిశిఖతో సమానురాలైన, ఏషా= ఈ, మహాభాగా = మహాభాగ్యవంతురాలు, ఏవమ్=ఇట్లు, హలముఖోత్కృష్టే = నాగలి అగ్రముచేత రాయబడిన, క్షేత్రే=క్షేత్రమునందు, పునః = మరల, మర్త్యేషు = మానవులలో, అజాయత = జన్మించెను.

తా. వేదికలోని అగ్నిశిఖతో సమానురాలైన ఈ మహాభాగ్యవంతురాలైన వేదవతి, నాగలిచేత దున్నిన క్షేత్రమునందు, మరల మానవులలో పుట్టినది. 40

మూ. ఏషా వేదవతీ నామ పూర్వమాసీత్కృతే యుగే,
త్రేతాయుగమనుప్రాప్య వధార్థం తస్య రక్షసః, 41

ఉత్పన్నా మైథిలకులే జనకస్య మహాత్మనః,
సీతోత్పన్నా తు సీతేతి మానుషైః పునరుచ్యతే. 42

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తదశః సర్గః.

ప్ర. అ. పూర్వమ్ = పూర్వము, కృతే యుగే = కృతయుగమునందు, ఏషా = ఈమె, వేదవతీ నామ = వేదవతి అను పేరు గలది, ఆసీత్ = ఆయెను.

త్రేతాయుగమ్ = త్రేతాయుగమును, అనుప్రాప్య = పొంది, తస్య రక్షసః = ఆ రాక్షసునియొక్క, వధార్థమ్ = వధకొరకు, మహాత్మనః = మహాత్ముడైన, జనకస్య = జనకునియొక్క, మైథిలకులే = మిథిలానగరమునకు చెందిన వంశమునందు, ఉత్పన్నా = పుట్టినది. పునః = మరల, సీతోత్పన్నా = నాగలిచాలునుండి పుట్టిన ఈమె, మానుషైః = మానవులచేత, సీతేతి = సీత అని, ఉచ్యతే = చెప్పబడు చున్నది.

తా. పూర్వము కృతయుగమునందు వేదవతి అను పేరుతో ఉన్న ఈమె త్రేతాయుగమునందు రావణుని సంహరించుటకై మహాత్ముడైన జనకుని కులము నందు జనించినది. సీతనుండి (నాగలిచాలునుండి) జనించుటచే ఈమెను మాన వులు 'సీత'అని అనుచున్నారు 42

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో పదిహేడవ సర్గ సమాప్తము.

అథ అష్టాదశః సర్గః

[రావణుడు మరుత్తుని జయించుట. ఇంద్రాదిదేవతలు నెమళ్ళు మొదలైనవానికి వరములు ఇచ్చుట.]

మూ. ప్రవిష్టాయాం హుతాశం తు వేదవత్యాం స రావణః,
పుష్పకం తు సమారుహ్య పరిచక్రామ మేదినీమ్. 1

ప్ర. అ. వేదవత్యామ్=వేదవతి, హుతాశమ్=అగ్నిని, ప్రవిష్టాయాం తు=ప్రవేశించిన దగుచుండగా, సః రావణః=ఆ రావణుడు, పుష్పకమ్=పుష్పకమును, సమారుహ్య=ఎక్కి, మేదినీమ్=భూమిని, పరిచక్రామ=సంచరించెను.

తా. వేదవతి అగ్నిలో ప్రవేశించిన పిమ్మట ఆ రావణుడు పుష్పకమును ఎక్కి భూలోకమునందు సంచరించెను. 1

మూ. తతో మరుత్తం నృపతిం యజన్తం సహ దైవతైః,
ఉశీరబీజమాసాద్య దదర్శ స తు రావణః. 2

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః రావణః=ఆ రావణుడు, ఉశీరబీజమ్=ఉశీరబీజక్షేత్రమును, ఆసాద్య=పొంది, యజన్తమ్=యాగముచేయుచున్న, మరుత్తమ్=మరుత్తు దను, నృపతిమ్=రాజును, దైవతైః సహ=దేవతలతో కూడ, దదర్శ=చూచెను.

తా. పిమ్మట ఆ రావణుడు ఉశీరబీజ మను క్షేత్రమునకు వెళ్ళి అక్కడ యాగము చేయుచున్న మరుత్తమహారాజును, హవిర్భాగములకొరకు వచ్చి ఉన్న దేవతలను చూచెను. 2

మూ. సంవర్తో నామ బ్రహ్మర్షిః సాక్షాద్భ్రాతా బృహస్పతేః,
యాజయామాస ధర్మజ్ఞః సర్వైర్దేవగణైర్వృతః. 3

ప్ర. అ. బృహస్పతేః = బృహస్పతియొక్క, సాక్షాత్ భ్రాతా = సాక్షాత్తు సోదరుడు, ధర్మజ్ఞః=ధర్మములు తెలిసినవాడు అయిన, సంవర్తో నామ=సంవర్తు డను, బ్రహ్మర్షిః = బ్రహ్మర్షి, సర్వైః = సమస్తమైన, దేవగణైః = దేవతాగణము లతో, వృతః = కూడినవాడై, యాజయామాస = యాగము చేయించెను.

తా. సాక్షాత్తు బృహస్పతి సోదరుడు, ధర్మములు ఎరిగినవాడూ అయిన సంవర్తు డను బ్రహ్మర్షి సమస్తదేవతాగణములతో కూడినవాడై యాగము చేయించెను. 3

మూ. దృష్ట్వా దేవాస్తు తద్రక్షో వరదానేన దుర్జయమ్,
తిర్యగ్యోనిసమావిష్టాస్తస్య ధర్షణభీరవః. 4

ప్ర అ. దేవాః తు=దేవతలు, వరదానేన=వరదానముచేత, దుర్జయమ్= జయింప శక్యముకాని, తత్ రక్షః = ఆ రాక్షసుణ్ణి, దృష్ట్వా = చూచి, తస్య = వానియొక్క, ధర్షణభీరవః = ఎదిరించుటనుండి భయపడుచున్నవారై, తిర్యగ్యోని సమావిష్టాః = తిర్యగ్ జంతువులయందు ప్రవేశించిరి.

తా. వరదానముచేత జయింప శక్యము కాని ఆ రాక్షసుణ్ణి చూచి, దేవతలు ఆతడు ఎదిరించు నని భయపడి తిర్యగ్జంతువులలో ప్రవేశించిరి. 4

మూ. ఇన్ద్రో మయూరః సంవృత్తో ధర్మరాజస్తు వాయసః,
కృకలాసో ధనాధ్యక్షో హంసశ్చ వరుణోఽభవత్. 5

ప్ర. అ. ఇన్ద్రః = ఇంద్రుడు, మయూరః = నెమలిగా, సంవృత్తః = అయినాడు, ధర్మరాజస్తు = యమధర్మరాజు, వాయసః = కాకి అయినాడు, ధనాధ్యక్షః = కుబేరుడు, కృకలాసః = తొండగాను, వరుణః=వరుణుడు, హంసశ్చ= హంసగాను, అభవత్ = ఆయెను.

తా. ఇంద్రుడు నెమలిగాను, యముడు కాకిగాను, కుబేరుడు తొండగాను, వరుణుడు హంసగాను ఆయెను. 5

మూ. అన్యేష్వపి గతేష్వేవం దేవేష్వరినిషూదన,
రావణః ప్రావిశద్యజ్ఞం సారమేయ ఇవాశుచిః. 6

ప్ర. అ. అరినిషూదన = శత్రుసంహారకుడా ! అన్యేషు = ఇతరులైన, దేవేష్వపి = దేవతలు కూడ, ఏవమ్ = ఇట్లు తిర్యగ్జంతురూపములను, గతేషు = పొందినవారగుచుండగా, రావణః = రావణుడు, అశుచిః = అపవిత్రమైన, సారమేయః ఇవ = కుక్క వలె, యజ్ఞమ్ = యజ్ఞమును, ప్రావిశత్ = ప్రవేశించెను.

తా. శత్రుసంహారకుడవైన రామా ! ఇతరదేవతలు కూడ ఈ విధముగా ఆ యా తిర్యగ్జంతువుల రూపములు ధరించిరి. అప్పుడు రావణుడు అశుచియైన కుక్క వలె యజ్ఞశాలలో ప్రవేశించెను. 6

మూ. తం చ రాజానమాసాద్య రావణో రాక్షసాధిపః,
ప్రాహ యుద్ధం ప్రయచ్ఛేతి నిర్జితోఽస్మీతి వా వద. 7

ప్ర. అ. రాక్షసాధిపః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, తం రాజానమ్ = ఆ రాజును, ఆసాద్య = సమీపించి, యుద్ధమ్ = యుద్ధమును, ప్రయచ్ఛ = ఇమ్ము ; వా = లేదా, నిర్జితః = జయించబడినవాడను, అస్మి = అయి ఉన్నాను, ఇతి = అని, వద = పలుకుము, ఇతి = అని, ప్రాహ = పలికెను.

తా. రాక్షసరాజైన రావణుడు ఆ రాజువద్దకు వెళ్ళి "నాతో యుద్ధమైనా చేయుము ; లేదా ఓడిపోయినా నని అంగీకరించుము" అని పలికెను. 7

మూ. తతో మరుత్తో నృపతిః కో భవానిత్యువాచ తమ్,
అవహాసం తతో ముక్త్వా రావణో వాక్యమబ్రవీత్. 8

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మరుత్తః నృపతిః = మరుత్తమహారాజు, భవాన్ = నీవు, కః = ఎవడవు, ఇతి = అని, తమ్ = వానిని గూర్చి, ఉవాచ = పలికెను. తతః = అటుపిమ్మట, రావణః = రావణుడు, అవహాసమ్ = పెద్ద నవ్వును, ముక్త్వా = విడచి (చేసి), వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు మరుత్తమహారాజు "నీవు ఎవ్వడవు ?" అని అతనిని అడిగెను. అది విని రావణుడు బిగ్గరగా నవ్వి ఇట్లు పలికెను. 8

మూ. అకుతూహలభావేన ప్రీతోఽస్మి తవ పార్థివ,
ధనదస్యానుజం యో మాం నావగచ్ఛసి రావణమ్. 9

ప్ర. అ. పార్థివ = రాజా! యః = ఏ నీవు, ధనదస్య=కుబేరునియొక్క, అనుజమ్ = తమ్ముడనైన, రావణమ్ = రావణుడనైన, మామ్ = నన్ను గూర్చి, నావగచ్ఛసి=తెలుసుకొనుటలేదో, తవ = అట్టి నీయొక్క, అకుతూహలభావేన = ఆశ్చర్యము లేకపోవుటచేత, ప్రీతః = సంతోషించినవాడను, అస్మి = అయి ఉన్నాను.

తా. రాజా! కుబేరుని తమ్ముడను, రావణుడను అయిన నన్ను కూడ నీవు గుర్తించలేదన్నచో నీలో ఉన్న ఆశ్చర్యపడకపోవుట (తెలియవలసిన విషయములు కూడ తెలిసికొనకపోవుట) అనే గుణము చూచి నేను సంతోషించుచున్నాను. 9

మూ. త్రిషు లోకేషు కోఽన్యోఽస్తి యో న జానాతి మే బలమ్,
భ్రాతరం యేన నిర్జిత్య విమానమిదమాహృతమ్. 10

ప్ర. అ. యేన = ఏ నాచేత, భ్రాతరమ్ = సోదరుణ్ణి, నిర్జిత్య=జయించి, ఇదమ్ = ఈ, విమానమ్ = విమానము, ఆహృతమ్ = తీసికొనిరాబడినదో, మే= అట్టి నాయొక్క, బలమ్ = బలమును, యః = ఎవడు, న జానాతి = ఎరుగడో అట్టి, అన్యః = మరియొకడు, కః = ఎవడు, త్రిషు = మూడు, లోకేషు=లోకములలో, అస్తి = ఉన్నాడు.

తా. సోదరుణ్ణి జయించి ఈ విమానమును హరించిన నా బలమును గూర్చి తెలియనివాడు ఈ మూడు లోకాలలో నీవు తప్ప మరొకడు ఎవడు ఉన్నాడు?

మూ. తతో మరుత్తః స నృపస్తం రావణమథాబ్రవీత్,
ధన్యః ఖలు భవాన్యేన జ్యేష్ఠో భ్రాతా రణే జితః. 11

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః = ఆ, నృపః = రాజైన, మరుత్తః= మరుత్తుడు, అథ = అటుపిమ్మట, రావణమ్ = రావణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను. యేన = ఏ నీచేత, రణే = యుద్ధమునందు, జ్యేష్ఠః= పెద్దవాడైన, భ్రాతా సోదరుడు, జితః = జయింపబడినాడో, భవాన్ = అట్టి నీవు, ధన్యః ఖలు = అదృష్టవంతుడవు కదా!

తా. అప్పుడు మరుత్తమహారాజు రావణునితో ఇట్లు పలికెను-"యుద్ధములో అన్నగారిని జయించిన నీవు ఎంత ధన్యుడవు!" 11

మూ. న త్వయా సదృశః శ్లాఘ్యస్త్రిషు లోకేషు విద్యతే,
నాధర్మసహితం శ్లాఘ్యం తల్లోకే ప్రతిసంహితమ్. 12
కర్మ దౌరాత్మ్యకం కృత్వా శ్లాఘసే భ్రాతృనిర్జయాత్.

ప్ర. అ. త్వయా = నీతో, సదృశః = సమానుడైన, శ్లాఘ్యః = శ్లాఘింప దగినవాడు, త్రిషు లోకేషు = మూడు లోకములలో, న విద్యతే = లేడు. లోకే = లోకమునందు, ప్రతిసంహితమ్ = విరుద్ధమైన, అధర్మసహితమ్ = అధర్మముతో కూడిన, తత్ = ఆ కర్మ, న శ్లాఘ్యమ్=శ్లాఘించదగినది కాదు. దౌరాత్మ్యకమ్= చెడ్డతనముతో కూడిన, కర్మ =పనిని, కృత్వా=చేసి, భ్రాతృనిర్జయాత్=సోదరుని జయించుటవలన, శ్లాఘసే = బడాయి చెప్పుకొనుచున్నావు.

తా. నీవంటి శ్లాఘ్యుడు (పొగడతగినవాడు) ఈ మూడు లోకాలలోను లేడు ! లోకవిరుద్ధమైన, అధర్మరూపమైన కర్మను ఎవరూ శ్లాఘించరు. నీవు దురాత్ములు చేయు పని చేసి సోదరుణ్ణి జయించినా నని బడాయి చెప్పుకొను చున్నావు. 12

మూ. కం త్వం ప్రాక్కేవలం ధర్మం చరిత్వా లబ్ధవాన్ వరమ్,
శ్రుతపూర్వం హి న మయా భాషసే యాదృశం స్వయమ్.

ప్ర. అ. త్వమ్ = నీవు, ప్రాక్ = పూర్వము, కేవలమ్ = కేవలమైన, కం ధర్మమ్ = ఏ ధర్మమును, చరిత్వా = ఆచరించి, వరమ్ = వరమును, లబ్ధవాన్ = పొందినావు ? యాదృశమ్ = ఎట్టి దానిని గూర్చి, స్వయమ్ = స్వయముగా, భాషసే = మాటలాడుచున్నావో, అది, మయా = నాచేత, న శ్రుతపూర్వం హి= పూర్వము వినబడలేదు కదా ?

తా నీవు ఏ ధర్మమును మాత్రము ఆచరించి వరమును పొందినావు ? నీవు స్వయముగా చెప్పుకొనుచున్న ఆ విషయమును నేను పూర్వము వినలేదు.

మూ. తిష్ఠేదానీం న మే జీవన్ ప్రతియాస్యసి దుర్మతే, 14
అద్య త్వాం నిశితైర్బాణైః ప్రేషయామి యమక్షయమ్.

ప్ర. అ. దుర్మతే = ఓ ! దుర్మతీ ! ఇదానీమ్=ఇప్పుడు, తిష్ఠ=ఆగుము. జీవన్ = జీవించి ఉన్నవాడవై, మే = నాకు (నానుండి), న ప్రతియాస్యసి =

తిరిగి వెళ్ళవు. అద్య = ఇప్పుడు, నిశితైః = వాడియైన, బాణైః = బాణములచేత, త్వామ్ = నిన్ను, యమక్షయమ్ = యమలోకమును గూర్చి, ప్రేషయామి = పంపుచున్నాను.

తా. ఓ! దుర్మతీ! నిలబడుము; నీవు ప్రాణాలతో తిరిగి వెళ్ళవు. ఇపుడు వాడియైన బాణాలచేత నిన్ను యమలోకమునకు పంపెదను. 14

మూ. తతః శరాసనం గృహ్య సాయకాంశ్చ నరాధిపః, 15
రణాయ నిర్యయౌ క్రుద్ధః సంవర్తో మార్గమావృణోత్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, నరాధిపః = ఆ రాజు, క్రుద్ధః = కోపించినవాడై, శరాసనమ్ = ధనస్సును, సాయకాంశ్చ = బాణములను, గృహ్య = గ్రహించి, రణాయ = యుద్ధముకొరకు, నిర్యయౌ = బయలువెడలెను. సంవర్తః = సంవర్తుడు, మార్గమ్ = మార్గమును, అవృణోత్ = ఆవరించెను.

తా. పిమ్మట ఆ మరుత్తుడు కోపించి, ధనస్సును, బాణములను గ్రహించి యుద్ధమునకై బయలుదేరగా సంవర్తుడు అతనిని అడ్డగించెను. 15

మూ. సోఽబ్రవీత్స్నేహసంయుక్తం మరుత్తం తం మహానృషిః,
శ్రోతవ్యం యది మద్వాక్యం సంప్రహారో న తే క్షమః.

ప్ర. అ. సః = ఆ, మహాన్ = గొప్పవాడైన, ఋషిః = ఋషి, తం మరుత్తమ్ = ఆ మరుత్తుణ్ణి గూర్చి, స్నేహసంయుక్తమ్ = స్నేహముతో కూడుకొన్నట్లుగా, అబ్రవీత్ = పలికెను. మద్వాక్యమ్ = నా వాక్యము, శ్రోతవ్యం యది = వినదగినట్లయితే, తే = నీకు, సంప్రహారః = యుద్ధము, న క్షమః = తగినది కాదు.

తా. మహాఋషియైన ఆ సంవర్తుడు మరుత్తునితో స్నేహపూర్వకముగా ఇట్లు పలికెను. "నీవు నా మాట విన్నచో-ఇప్పుడు యుద్ధము చేయుట తగదు."

మూ. మాహేశ్వరమిదం సత్రమసమాప్తం కులం దహేత్. 17
దీక్షితస్య కుతో యుద్ధం క్రోధిత్వం దీక్షితే కుతః.

ప్ర. అ. మాహేశ్వరమ్ = మహేశ్వరసంబంధమైన, ఇదమ్ = ఈ,

సత్రమ్ = యజ్ఞము, అసమాప్తమ్ = సమాప్తిచెందనిదై, కులమ్ = కులమును, దహేత్ = కాల్చివేయును. దీక్షితస్య = దీక్ష వహించినవానికి, యుద్ధమ్ = యుద్ధము, కుతః = ఎట్లు? దీక్షితే = దీక్షితునియందు, క్రోధిత్వమ్ = క్రోధము కలిగి యుండుట, కుతః = ఎట్లు?

తా. మహేశ్వరుని ఉద్దేశించి చేయుచున్న ఈ యజ్ఞము సమాప్తము కానిచో కులమును దహించివేయును. దీక్షలో ఉన్నవాడు కోపము చెందకూడదు, యుద్ధము చేయగూడదు కదా ?" 17

మూ. సంశయశ్చ జయే నిత్యం రాక్షసశ్చ సుదుర్జయః, 18
స నివృత్తో గురోర్వాక్యాన్మరుత్తః పృథివీపతిః,
విసృజ్య సశరం చాపం స్వస్థో మఖముఖోఽభవత్. 19

ప్ర. అ. జయే = జయము విషయమునందు, నిత్యమ్ = ఎల్లప్పుడూ, సంశయః = సంశయ ముండును. రాక్షసశ్చ = రాక్షసుడు కూడ, సుదుర్జయః = చాల జయింపశక్యము కానివాడు. సః = ఆ, పృథివీపతిః = రాజైన, మరుత్తః = మరుత్తుడు, గురోః = గురువుయొక్క, వాక్యాత్ = వాక్యమువలన, నివృత్తః = మరలినవాడై, సశరమ్ = శరములతో కూడిన, చాపమ్ = ధనస్సును, విసృజ్య = విడచి, స్వస్థః = స్వస్థుడై, మఖముఖః = యజ్ఞమువైపు ముఖము కలవాడు, అభవత్ = అయెను.

తా. "జయము ఎల్లప్పుడూ సంశయాస్పదమే. ఈ రాక్షసుడు జయింప శక్యము కానివాడు." మరుత్తుడు గురువు పలికిన ఈ మాటలు విని ధనుర్బాణము లను విడచి, స్వస్థచిత్తుడై యజ్ఞశాలాభిముఖు డయ్యెను. 18, 19

మూ. తతస్తం నిర్జితం మత్వా ఘోషయామాస వై శుకః,
రావణో జయతీత్యుచ్చైర్హర్షాన్నాదం విముక్తవాన్. 20

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తమ్ = వానిని, నిర్జితమ్ = జయింప బడినవానినిగా, మత్వా = తలచి, శుకః = శుకుడు, ఘోషయామాస = చాటింప చేసెను. హర్షాత్ = సంతోషమువలన, రావణః = రావణుడు, జయతి = జయించు చున్నాడు, ఇతి = అని, నాదమ్ = ధ్వనిని, విముక్తవాన్ = విడచెను.

తా. పిమ్మట శుకుడు అతడు జయింపబడినట్లు గ్రహించి ఆ విధముగా చాటించెను. "రావణుడు సర్వోత్కర్షగా ఉన్నాడు" అని బిగ్గరగా అరచెను. 20

మూ. తాన్ భక్షయిత్వా తత్రస్థాన్ మహర్షీన్ యజ్ఞమాగతాన్,
వితృప్తో రుధిరైస్తేషాం పునః సంప్రయయౌ మహీమ్.

ప్ర. అ. యజ్ఞమ్ = యజ్ఞమును గూర్చి, ఆగతాన్ = వచ్చిన, తత్రస్థాన్ = అక్కడ ఉన్న, ఋషీన్ = ఋషులను, భక్షయిత్వా = భక్షించి, తేషామ్ = వాళ్ళయొక్క, రుధిరైః = రక్తములచేత, వితృప్తః = బాగా తృప్తిచెందినవాడై, పునః = మరల, మహీమ్ = భూమిని గూర్చి, సంప్రయయౌ = వెళ్ళెను.

తా. యజ్ఞము నిమిత్తమై వచ్చి అక్కడ ఉన్న ఋషులను భక్షించి, వాళ్ళ రక్తముచేత బాగా తృప్తిచెంది రావణుడు మరల భూలోకమునకు వెళ్ళెను.

మూ. రావణే తు గతే దేవాః సేన్ద్రాశ్చైవ దివౌకసః,
తతః స్వాం యోనిమాసాద్య తాని సత్త్వాని చాబ్రువన్.

ప్ర. అ. రావణే = రావణుడు, గతే = వెళ్ళినవాడగుచుండగా, దేవాః = ప్రకాశించువారైన, సేన్ద్రాశ్చైవ = ఇంద్రునితో కూడిన, దివౌకసః = దేవతలు, తతః = అటుపిమ్మట, స్వామ్ = తమ సంబంధమైన, యోనిమ్ = జన్మను (రూపమును), ఆసాద్య = పొంది, తాని = ఆ. సత్త్వాని = జంతువులను గూర్చి, అబ్రువన్ = పలికిరి.

తా. రావణుడు వెళ్ళిపోయిన పిమ్మట ఇంద్రుడు మొదలైన ఆ దేవతలు తమ తమ రూపములు దాల్చి ఆ జంతువులతో ఇట్లు పలికిరి. 22

మూ. హర్షాత్తదాబ్రవీదిన్ద్రో మయూరం నీలబర్హిణమ్,
ప్రీతోఽస్మి తవ ధర్మజ్ఞ భుజంగాద్ధి న తే భయమ్. 23

ప్ర. అ. తదా = అప్పుడు, ఇన్ద్రః = ఇంద్రుడు, హర్షాత్ = సంతోషమువలన, నీలబర్హిణమ్ = నల్లని పింఛము గల, మయూరమ్ = నెమలిని గూర్చి, అబ్రవీత్ = పలికెను. ధర్మజ్ఞ = ధర్మము తెలిసినవాడా! తవ = నీకు, ప్రీతః = సంతోషించినవాడను, అస్మి = అయి ఉన్నాను. తే = నీకు, భుజంగాత్ = సర్పమువలన, భయమ్ = భయము, న హి = ఉండదు.

తా. అప్పుడు ఇంద్రుడు నల్లని పింఛము గల నెమలితో సంతోష పూర్వకముగా ఇట్లు పలికెను. "ధర్మములు తెలిసినదానా ! నీ విషయమున సంతోషించినాను. నీకు సర్పములవలన భయము ఉండదు." 23

మూ. ఇదం నేత్రసహస్రం తు యత్తద్బర్హే భవిష్యతి,
వర్షమాణే మయి ముదం ప్రాప్స్యసే ప్రీతిలక్షణామ్, 24
ఏవమిన్ద్రో వరం ప్రాదాన్మయూరస్య సురేశ్వరః.

ప్ర. అ. ఇదమ్ = ఈ, యత్ = ఏ, నేత్రసహస్రమ్ = నేత్రముల సహస్రము గలదో, తత్ = అది, బర్హే = నీ పింఛమునందు, భవిష్యతి = ఉండ గలదు, మయి = నేను, వర్షమాణే = వర్షించుచుండగా, ప్రీతిలక్షణామ్ = సంతోష రూపమైన, ముదమ్ = ఆనందమును, ప్రాప్స్యసే = పొందగలవు. సురేశ్వరః = దేవతాప్రభువైన, ఇన్ద్రః = ఇంద్రుడు, మయూరస్య = నెమలికి, వరమ్ = వర మును, ప్రాదాత్ = ఇచ్చెను.

తా. నా కున్న ఈ వేయి కళ్లు నీ పింఛముమీద ఉండగలవు. నేను వర్షములు కురిపించునప్పుడు నీకు ఆనందసంతోషములు కలుగగలవు" సురే శ్వరుడైన ఇంద్రుడు నెమలికి ఈ విధముగా వర మిచ్చెను. 24

మూ. నీలాః కిల పురా బర్హా మయూరాణాం నరాధిప. 25
సురాధిపాద్వరం ప్రాప్య గతాః సర్వేఽపి బర్హిణః.

ప్ర. అ. నరాధిప = రాజా! పురా = పూర్వము, మయూరాణామ్ = నెమళ్ల యొక్క, బర్హాః = పింఛములు, నీలాః కిల = నల్లగా ఉండేవట, సురాధిపాత్ = ఇంద్రునినుండి, వరమ్ = వరమును, ప్రాప్య = పొంది, సర్వేఽపి = సమస్తమైన, బర్హిణః = నెమళ్లు, గతాః = వెళ్ళినవి.

తా. రాజా! పూర్వము నెమళ్ళ పింఛములు నల్లగా (నీలముగా) ఉండెడి వట. నెమళ్ళన్నీ ఇంద్రునివలన వరము పొంది వెళ్ళిపోయినవి. 25

మూ. ధర్మరాజోఽబ్రవీద్వాక్యం ప్రాగ్వంశే వాయసం ప్రతి 26
పక్షింస్తవాస్మి సుప్రీతః ప్రీతస్య వచనం శృణు.

ప్ర. అ. ధర్మరాజః = యమధర్మరాజు, ప్రాగ్వంశే = యజ్ఞశాలలోని కఱ్ఱమీద ఉన్న, వాయసం ప్రతి = కాకిని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. పక్షిన్ = ఓ! పక్షీ! తవ = నీకు, సుప్రీతః = చాల సంతోషించినవాడను, అస్మి = అయిఉన్నాను. ప్రీతస్య = సంతోషించుచున్న నాయొక్క, వచనమ్ = వచనమును, శృణు = వినుము.

తా. యజ్ఞశాలలోని కఱ్ఱమీద ఉన్న కాకితో యముడు ఇట్లు పలికెను. "ఓ! పక్షీ! నీ విషయమున సంతోషించితిని. సంతోషించుచున్న నా మాట వినుము." 26

మూ. యథాన్యే వివిధై రోగైః పీడ్యన్తే ప్రాణినో మయా, 27
తే న తే ప్రభవిష్యన్తి మయి ప్రీతే న సంశయః.

ప్ర. అ. అన్యే = ఇతరములైన, ప్రాణినః = ప్రాణులు, మయా = నాచేత, వివిధైః = అనేకవిధములైన, రోగైః = రోగములచేత, యథా = ఎట్లు, పీడ్యన్తే = పీడింపబడుచున్నారో, ఆ విధముగా, తే = ఆ రోగములు, మయి = నేను, ప్రీతే = సంతోషించిన వాడనగుచుండగా, తే = నీ విషయమునందు, న ప్రభవన్తి = సమర్థములు కావు. సంశయః = సంశయము, న = లేదు.

తా. "ఇతరప్రాణులను నేను వివిధరోగాలచే పీడించుచుందును. కాని నీ విషయమున సంతోషించినాను గాన నీకు ఆ రోగాల బాధ ఉండదు. సందేహము లేదు." 27

మూ. మృత్యుతస్తే భయం నాస్తి వరాన్మమ విహంగమ, 28
యావత్త్వాం న వధిష్యన్తి నరాస్తావద్భవిష్యసి.

ప్ర. అ. విహంగమ = ఓ! పక్షీ! మమ = నాయొక్క, వరాత్ = వరమువలన, తే = నీకు, మృత్యుతః = మృత్యువువలన, భయమ్ = భయము, నాస్తి = లేదు. నరాః = నరులు, త్వామ్ = నిన్ను, యావత్ = ఎంతవరకు, న వధిష్యన్తి = చంపరో, తావత్ = అంతవరకు, భవిష్యసి = ఉండగలవు.

తా. ఓ! పక్షీ! నేను వరము ఇచ్చుచున్నాను; నీకు మృత్యుభయము లేదు. నరులు నిన్ను చంపేవరకు నీవు జీవించి ఉందువు." 28

మూ. యే చ మద్విషయస్థా వై మానవాః క్షుధయార్దితాః, 29
త్వయి భుక్తే తు తృప్తాస్తే భవిష్యన్తి సబాన్ధవాః.

ప్ర. అ. త్వయి=నీవు, భుక్తే= తిన్నదానవగుచుండగా, మద్విషయస్థాః =నాదేశములో ఉన్న, క్షుధయా=ఆకలిచేత, అర్దితాః=పీడింపబడిన, యే మానవాః = ఏ మానవులు గలరో, తే = వారు, సబాన్ధవాః = బంధుసహితులై, తృప్తాః = తృప్తిచెందినవారు, భవిష్యన్తి = కాగలరు.

తా. నీవు భుజించినచో నా లోకములో ఆకలితో బాధపడుచు ఉన్న మానవులు, వారి బంధువులు తృప్తి పొందెదరు. 29

మూ. వరుణస్త్వబ్రవీద్ధంసం గఙ్గాతోయవిచారిణమ్, 30
శ్రూయతాం ప్రీతిసంయుక్తం తతః పత్రరథేశ్వరమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వరుణస్తు = వరుణుడైతే, గఙ్గాతోయవిచారిణమ్=గంగాజలమునందు సంచరించుచున్న, పత్రరథేశ్వరమ్=పక్షిరాజైన, హంసమ్ = హంసను గూర్చి, ప్రీతిసంయుక్తమ్ = ప్రేమపూర్వకముగా, అబ్రవీత్ = పలికెను. శ్రూయతామ్ = వినబడుగాక.

తా. పిమ్మట వరుణుడు గంగాజలమునందు సంచరించు, పక్షిరాజైన హంసతో ప్రేమపూర్వకముగా ఇట్లు పలికెను-"వినుము." 30

మూ. వర్ణో మనోరమః సౌమ్యశ్చన్ద్రమణ్డలసంనిభః, 31
భవిష్యతి తవోదగ్రః శుద్ధఫేనసమప్రభః.

ప్ర. అ. తవ = నీయొక్క, వర్ణః = రంగు, మనోరమః = మనోహరము, సౌమ్యః = సుందరము, చన్ద్రమణ్డలసంనిభః = చంద్రమండలముతో సమానము, ఉదగ్రః = గొప్పది, శుద్ధఫేనసమప్రభః = తెల్లని నురుగుతో సమానమైన కాంతి గలది, భవిష్యతి = కాగలదు.

తా. "నీ రంగు మనోహరము, సుందరము, చంద్రమండలముతో సమానము, ఉత్తమము, పరిశుద్ధమైన నురుగువంటి కాంతి గలది అయి ఉండగలదు."

మూ. మచ్ఛరీరం సమాసాద్య కాన్తో నిత్యం భవిష్యసి, 32
ప్రాప్స్యసే చాతులాం ప్రీతిమేతన్మే ప్రీతిలక్షణమ్.

ప్ర. అ. మచ్ఛరీరమ్ = నా శరీరమును, సమాసాద్య = పొంది, నిత్యమ్ = ఎల్లప్పుడూ, కాన్తః = సుందరమైనదానవు, భవిష్యసి = కాగలవు. అతులామ్ = సాటిలేని, ప్రీతిం = సంతోషమును, ప్రాప్స్యసే చ = పొందగలవు. ఏతత్ = ఇది, మే = నాయొక్క, ప్రీతిలక్షణమ్ = ప్రేమకు లక్షణము.

తా. "నీవు నా శరీరమైన జలముమీద ఎల్లప్పుడూ విహరించుచు, మనోహరముగా ఉందువు; అధికమైన సంతోషము పొందెదవు. ఇది నాకు నీ విషయమున కలిగిన సంతోషమునకు లక్షణము(గుర్తు)." 32

మూ. హంసానాం హి పురా రామ న వర్ణః సర్వపాణ్డురః, 33
పక్షా నీలాగ్రసంవీతాః క్రోడాః శష్పాగ్రనిర్మలాః.

ప్ర. అ. రామ = రామా! పురా = పూర్వము, హంసానామ్ = హంసలయొక్క, వర్ణః = రంగు, సర్వపాణ్డురః = పూర్తిగా తెల్లనిదిగా, న = లేదు. పక్షాః = రెక్కలు, నీలాగ్రసంవీతాః = నీలమైన అగ్రభాగములతో కూడినవి. క్రోడాః = వక్షఃస్థలములు, శష్పాగ్రసంనిభాః = పచ్చగడ్డి చిగుళ్ళతో సమానలు.

తా. రామా! పూర్వము హంసలు పూర్తిగా తెల్లగా ఉండేవి కాదు. వాటి రెక్కల చివరి భాగములు నీలవర్ణముతోను, వక్షఃస్థలము పచ్చగడ్డి చిగుళ్ళ రంగులోను ఉండెడివి. 33

మూ. అథాబ్రవీద్వైశ్రవణః కృకలాసం గిరౌ స్థితమ్, 34
హైరణ్యం సంప్రయచ్ఛామి వర్ణం ప్రీతస్తవాప్యహమ్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, వైశ్రవణః = కుబేరుడు, గిరౌ = పర్వతముమీద, స్థితమ్ = ఉన్న, కృకలాసమ్ = తొండను గూర్చి, అబ్రవీత్ = పలికెను. అహమ్ = నేను, తవాపి = నీ విషయమునందు కూడా, ప్రీతః = సంతోషించితిని.

హైరణ్యమ్ = బంగారమునకు సంబంధించిన, వర్ణమ్=రంగును, సంప్రయచ్ఛామి = ఇచ్చుచున్నాను.

తా. పిమ్మట కుబేరుడు పర్వతముమీద ఉన్న తొండతో ఇట్లనెను. "నీ విషయమున నాకు సంతోషము కలిగినది. నీకు బంగారు రంగు ఇచ్చుచున్నాను." 34

మూ. సద్రవ్యం చ శిరో నిత్యం భవిష్యతి తవాక్షయమ్, 35
ఏష కాఞ్చనకో వర్ణో మత్ప్రీత్యా తే భవిష్యతి.

ప్ర. అ. తవ = నీయొక్క, శిరః = శిరస్సు, నిత్యమ్ = నిత్యమూ, అక్షయమ్=అక్షయముగా, సద్రవ్యమ్=ద్రవ్యముతో కూడినది, భవిష్యతి=కాగలదు. మత్ప్రీత్యా = నా సంతోషము చేత, ఏషః = ఈ, కాఞ్చనకః = బంగారమునకు సంబంధించిన, వర్ణః = వర్ణము, భవిష్యతి = కాగలదు.

తా. నీ శిరస్సు అక్షయముగా ద్రవ్యముతో (పదార్థముతో) నిండి ఉండును. నేను సంతోషించినాను గాన నీ వర్ణము బంగారు వర్ణము కాగలదు.

వి. సద్రవ్యమ్ అనగా బంగారముతో కూడినది, సువర్ణమయము అని వ్యాఖ్యాతలు వ్రాసినారు. తొండ తల శరీరం ప్రమాణం దృష్ట్యా పెద్ద ప్రమాణంలో ఉండును గాన ఎక్కువ పదార్థము (mass) ఉన్న దని కాని, ఆహార పదార్థాలు నిలవ చేసుకొనుటకు వీలుగా పెద్దదిగా ఉండు నని గాని చెప్పవచ్చునేమో. 35

మూ. ఏవం దత్త్వా వరాంస్తేభ్యస్తస్మిన్యజ్ఞోత్సవే సురాః, 36
నివృత్తాః సహ రాజ్ఞా తే పునః స్వభవనం గతాః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టాదశః సర్గః.

ప్ర. అ. తస్మిన్ = ఆ, యజ్ఞోత్సవే = యజ్ఞోత్సవమునందు, తే = ఆ, సురాః = దేవతలు, తేభ్యః = వారికొరకు, ఏవమ్ = ఇట్లు, వరాన్=వరములను,

దత్త్వా = ఇచ్చి, రాజ్ఞా సహ = రాజుతో కూడ, నివృత్తాః = మరలినవారై, పునః = మరల, స్వభవనమ్ = తమ భవనమును గూర్చి, గతాః = వెళ్ళిరి.

తా. ఆ యజ్ఞమహోత్సవమునందు ఆ దేవతలు వాటికి ఈ విధముగా వరములు ఇచ్చి ఆ రాజుతో కలిసి వెళ్ళి మరల తమ ఇండ్లకు వెళ్ళిపోయిరి. 36

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో పద్దెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనవింశః సర్గః

[రావణుడు అనరణ్యుణ్ణి వధించుట. మరణానికి ముందు అతడు రావణుని శపించుట.]

మూ. అథ జిత్వా మరుత్తం స ప్రయయౌ రాక్షసాధిపః,
నగరాణి నరేన్ద్రాణాం యుద్ధకాఙ్క్షీ దశాననః. 1

ప్ర. అ. రాక్షసాధిపః = రాక్షసరాజైన, సః దశాననః = ఆ రావణుడు, మరుత్తమ్ = మరుత్తుని, జిత్వా = జయించి, అథ = అటుపిమ్మట, యుద్ధకాఙ్క్షీ = యుద్ధమును కోరుచున్నవాడై, నరేన్ద్రాణామ్ = రాజులయొక్క, నగరాణి=నగరములను గూర్చి, ప్రయయౌ=వెళ్ళెను.

తా. రాక్షసరాజైన ఆ రావణుడు మరుత్తుని జయించి, యుద్ధమునుకోరుచు, రాజుల నగరములకు వెళ్ళెను. 1

మూ. సమాసాద్య తు రాజేన్ద్రాన్ మహేన్ద్రవరుణోపమాన్,
అబ్రవీద్రాక్షసేన్ద్రస్తు యుద్ధం మే దీయతామితి. 2

ప్ర. అ. రాక్షసేన్ద్రః=రాక్షసరాజు, మహేన్ద్రవరుణోపమాన్=మహేంద్ర వరుణులతో సమానులైన, రాజేన్ద్రాన్ = రాజశ్రేష్ఠులను, సమాసాద్య = పొంది, మే = నాకు, యుద్ధమ్ = యుద్ధము, దీయతామ్ = ఇవ్వబడుగాక, ఇతి = అని, అబ్రవీత్ = పలికెను.

తా. రావణుడు మహేంద్రవరుణుల వంటి ఉత్తములైన రాజులవద్దకు వెళ్లి నాకు యుద్ధమును ఇవ్వండి (నాతో యుద్ధానికి రండి) అని పలికెను. 2

మూ. నిర్జితాః స్మేతి వా బ్రూత ఏష మే హి సునిశ్చయః,
అన్యథా కుర్వతామేవం మోక్షో నైవోపపద్యతే. 3

ప్ర. అ. వా = లేదా, నిర్జితాః స్మ = జయింపబడితిమి, ఇతి = అని,

బ్రూత = చెప్పండి. ఏషః = ఇది, మే = నాయొక్క, సునిశ్చయః హి = దృఢ మైన నిశ్చయము కదా ? అన్యథా = మరియొక విధముగా, కుర్వతామ్ = చేయు వారికి, ఏవమ్ = ఇట్లు, మోక్షః = మోక్షము, నైవోపపద్యతే = ఉపపన్నము కాదు.

తా. లేదా ఓడిపోయినా మని ఒప్పుకొనండి. ఇదే నా దృఢమైన నిశ్చయము. మరొక విధముగా చేసినచో మీకు మోక్షము (విడుదల) లేదు. 3

మూ. తత స్త్వభీరవః ప్రాజ్ఞాః పార్థివా ధర్మనిశ్చయాః,
మ న్త్రయిత్వా తతోఽన్యోన్యం రాజానః సమహాబలాః.
నిర్జితాః స్మేత్యభాష న్త జ్ఞాత్వా వరబలం రిపోః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అభీరవః = భయము లేనివారు, ప్రాజ్ఞాః = బుద్ధిమంతులు, పార్థివాః = భూమికి అధిపతులు, ధర్మనిశ్చయాః = ధర్మనిశ్చ యము గలవారు, సమహాబలాః = గొప్ప బలములతో కూడినవారు అయిన, రాజానః = రాజులు, అన్యోన్యమ్ = పరస్పరము, మన్త్రయిత్వా = ఆలోచించు కొని, రిపోః = శత్రువుయొక్క, వరబలమ్ = వరములవల్ల లభించిన బలమును, జ్ఞాత్వా = తెలిసికొని, తతః = అటుపిమ్మట, నిర్జితాః స్మః = జయింపబడినాము, ఇతి = అని, అభాష న్త = పలికిరి.

తా. అప్పుడు భయము లేనివారు, బుద్ధిమంతులు, భూమికి ప్రభువులు, ధర్మసంమతమైన నిశ్చయము గలవారు. సైన్యములతో కూడినవారు అయిన రాజులు ఒకరితో ఒకరు ఆలోచించుకొని, శత్రువున కున్న వరబలమును తెలిసి కొని "ఓడిపోయినాము" అని ఒప్పుకొనిరి. 4

మూ. దుష్య న్తః సురథో గాధిర్గయో రాజా పురూరవః, 5
ఏతే సర్వేఽబ్రువంస్తాత నిర్జితాః స్మేతి పార్థివాః.

ప్ర. అ. తాత = తండ్రీ! దుష్య న్తః = దుష్యంతుడు, సురథః = సురథుడు, గాధిః = గాధి, గయః = గయుడు, రాజా = రాజైన, పురూరవః = పురూరవుడు, ఏతే సర్వే = ఈ సమ స్తమైన, పార్థివాః = రాజులు, నిర్జితాః స్మ = జయించబడి నాము, ఇతి = అని, అబ్రువన్ = పలికిరి.

తా. రామా! దుష్యంతుడు, సురథుడు, గాధి, గయుడు, పురూరవుడు, ఈ రాజులందరూ ఓడిపోయినా మని అంగీకరించిరి. 5

మూ. అథాయోధ్యాం సమాసాద్య రావణో రాక్షసాధిపః, 6
సుగుప్తామనరణ్యేన శక్రేణేవామరావతీమ్.
స తం పురుషశార్దూలం పురందరసమం బలే, 7

ప్రాహ రాజానమాసాద్య యుద్ధం దేహీతి రావణ,
నిర్జితోఽస్మీతి వా బ్రూహి త్వమేవం మమ శాసనమ్. 8

ప్ర. అ. రాక్షసాధిపః = రాక్షసరాజైన, సః = ప్రసిద్ధుడైన, రావణః = లోకములను ఏడ్పించిన, సః = ఆ, రావణః = రావణుడు, అథ = అటుపిమ్మట, శక్రేణ = దేవేంద్రునిచేత, అమరావతీమివ = అమరావతిని వలె, అనరణ్యేన = అనరణ్యునిచేత, సుగుప్తామ్ = బాగుగా రక్షించబడిన, అయోధ్యామ్ = అయోధ్యను, సమాసాద్య = పొంది, పురుషశార్దూలమ్ = పురుషశ్రేష్ఠుడు, బలే = బలమునందు, పురన్దరసమమ్ = దేవేంద్రునితో సమానుడు అయిన, తం రాజానమ్ = ఆ రాజును, ఆసాద్య = సమీపించి, త్వమ్ = నీవు, యుద్ధమ్ = యుద్ధమును, దేహి = ఇమ్ము, వా = లేదా, నిర్జితః అస్మి = జయింపబడితిని, ఇతి = అని, బ్రూహి = పలుకుము; ఏవమ్ = ఇట్లు, మమ = నాయొక్క, శాసనమ్ = శాసనము, ఇతి = అని, ప్రాహ = పలికెను.

తా. రాక్షసరాజు, లోకములను ఏడ్పించినవాడూ, ప్రసిద్ధుడూ అయిన ఆ రావణుడు దేవేంద్రునిచేత అమరావతి వలె అనరణ్యమహారాజుచేత రక్షింపబడు చున్న అయోధ్యకు వెళ్ళి, దేవేంద్రునివంటి బలము గల ఆ రాజును సమీపించి, "నీవు నాతో యుద్ధమైనా చేయుము; లేదా ఓడిపోయినా నని పలుకుము, ఇది నా శాసనము"అని పలికెను. 6-8

మూ. అయోధ్యాధిపతిస్తస్య శ్రుత్వా పాపాత్మనో వచః,
అనరణ్యస్తు సంక్రుద్ధో రాక్షసేన్ద్రమథాబ్రవీత్. 9

ప్ర. అ. అయోధ్యాధిపతిః = అయోధ్యాప్రభువైన, అనరణ్యస్తు = అనరణ్యుడైతే, పాపాత్మనః = పాపాత్ముడైన, తస్య = వానియొక్క, వచః = వచనమును,

శ్రుత్వా=విని, అథ = అటుపిమ్మట, సంక్రుద్ధః=కోపించినవాడై, రాక్షసేన్ద్రమ్= ఆ రాక్షసరాజును గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. అయోధ్యాప్రభులైన ఆ అనరణ్యుడు పాపాత్ముడైన అతని మాటలు విని, మిక్కిలి కోపించి ఇట్లు పలికెను. 9

మూ. దీయతే ద్వన్ద్వయుద్ధం తే రాక్షసాధిపతే మయా,
సంతిష్ఠ క్షిప్రమాయత్తో భవ చైవం భవామ్యహమ్. 10

ప్ర. అ. రాక్షసాధిపతే = రాక్షసరాజా! తే = నీకు, మయా = నా చేత, ద్వన్ద్వయుద్ధమ్ = ద్వంద్వయుద్ధము, దీయతే = ఇవ్వబడుచున్నది. సంతిష్ఠ = నిలబడుము. క్షిప్రమ్ = శీఘ్రముగా, ఆయత్తః = సంనద్ధుడవు, భవ = అగుము. అహమ్ = నేను కూడా, ఏవమ్=ఇట్లు, (సన్నద్ధుడను), భవామి=అగుచున్నాను.

తా. "రాక్షసరాజా! నీకు నేను యుద్ధము నిచ్చెదను. నిలువుము. వెంటనే సన్నద్ధుడవు అగుము; నేను కూడ సిద్ధ మగుచున్నాను." 10

మూ. అథ పూర్వం శ్రుతార్థేన నిర్జితం సుమహద్బలమ్,
నిష్క్రామత్తన్నరేన్ద్రస్య బలం రక్షోవధోద్యతమ్. 11

ప్ర. అ. ఈ శ్లోకం అన్వయం సరిగా కుదురుటలేదు. ప్రాచ్యపాఠం బాగున్నది:—

"అథ పూర్వం శ్రుతార్థేన నిశ్చితం సుమహద్బలమ్
నిశ్చక్రామ నరేన్ద్రశ్చ రాక్షసేన్ద్రవధే ద్రుతమ్."

ప్ర. అ. అథ = అటుపిమ్మట, శ్రుతార్థేన = వినబడిన విషయము గల అనరణ్యునిచేత, పూర్వమ్=పూర్వమే, నిశ్చితమ్=నిశ్చయింపబడిన, సుమహత్ = చాల గొప్పదైన, బలమ్ = సైన్యము, నరేన్ద్రశ్చ = రాజూ, రాక్షసేన్ద్రవధే = రావణుని వధనిమిత్తమై, ద్రుతమ్ = శీఘ్రముగా, నిశ్చక్రామ = బయలుదేరెను.

తా. రావణుని గూర్చి విని ఉన్న అనరణ్యుడు ముందుగానే నిశ్చయించిన చాల పెద్ద సైన్యము, ఆ రాజూ కూడా రావణుని చంపుటకై శీఘ్రముగా బయలు దేరిరి. 11

మూ. నాగానాం దశసాహస్రం వాజినాం నియుతం తథా,
రథానాం బహుసాహస్రం పత్తీనాం చ నరోత్తమ. 12
మహీం సంఛాద్య నిష్క్రాన్తం సపదాతిరథం రణే.

ప్ర. అ. నరోత్తమ=నరులలో ఉత్తముడా! నాగానామ్=ఏనుగులయొక్క, దశసాహస్రమ్ = పది వేలు, తథా = మరియు, వాజినామ్ = గుఱ్ఱములయొక్క, నియుతమ్ = నియుతము, రథానామ్ = రథములయొక్క, పత్తీనాం చ = కాలిబంటులయొక్క, బహుసాహస్రమ్ = అనేక సహస్రములు, బయలుదేరెను. సపదాతిరథమ్=కాలిబంటులతోను రథములతోను కూడిన ఆ సైన్యము, మహీమ్= భూమిని, సంఛాద్య=కప్పి, రణే=యుద్ధమునందు, నిష్క్రాన్తమ్ = బయలుదేరినది.

తా. రామా! పది వేల ఏనుగులు, లక్ష గుఱ్ఱాలు, ఎన్నో వేల రథాలు, కాలిబంట్లు వెడలెను. కాలిబంటుల, రథములు ఉన్న ఆ సైన్యము భూమిని కప్పివేసి యుద్ధమునకు బయలుదేరెను.

మూ. తతః ప్రవృత్తం సుమహద్యుద్ధం యుద్ధవిశారద, 13
అనరణ్యస్య నృపతే రాక్షసేన్ద్రస్య చాద్భుతమ్.

ప్ర అ. యుద్ధవిశారద = యుద్ధమునందు నేర్పు గల రామా! తతః = అటుపిమ్మట, నృపతేః=రాజైన, అనరణ్యస్య = అనరణ్యునకు, రాక్షసేన్ద్రస్య చ = రావణునకు, సుమహత్ = చాల గొప్పదైన, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, యుద్ధమ్ = యుద్ధము, ప్రవృత్తమ్ = జరిగినది.

తా. రామా! పిమ్మట అనరణ్యమహారాజునకు, రావణునకు మధ్య ఆశ్చర్యకరమైన గొప్ప యుద్ధము జరిగినది. 13

మూ. తద్రావణబలం ప్రాప్య బలం తస్య మహీపతేః, 14
ప్రాణశ్యత తదా సర్వం హవ్యం హుతమివానలే.

ప్ర. అ. తదా = అప్పుడు, తస్య మహీపతేః = ఆ రాజుయొక్క, సర్వమ్ = సమస్తమైన, తత్ బలమ్=ఆ సైన్యము, రావణబలమ్=రావణుని సైన్యమును,

ప్రావ్య = పొంది, అనలే=అగ్నియందు, హుతమ్ = హోమముచేయబడిన, హవ్యమివ = హోమద్రవ్యము వలె, ప్రాణశ్యత = నశించెను.

తా. అప్పుడు ఆ రాజు సైన్యమంతా రావణసైన్యమును చేరి, అగ్నిలో హోమము చేసిన హోమద్రవ్యము వలె నశించెను. 14

మూ. యుద్ధ్వా చ సుచిరం కాలం కృత్వా విక్రమముత్తమమ్,
ప్రజ్వలన్తం తమాసాద్య క్షిప్రమేవావశేషితమ్.
ప్రావిశత్సంకులం తత్ర శలభా ఇవ పావకమ్. 16

ప్ర. అ. అవశేషితమ్ = మిగిలిన సైన్యము, సుచిరం కాలమ్ = చాల కాలము, యుద్ధ్వా చ=యుద్ధము చేసి, ఉత్తమమ్=ఉత్తమమైన, విక్రమమ్=పరాక్రమమును, కృత్వా=చేసి, ప్రజ్వలన్తమ్ = ప్రజ్వలించుచున్న, తమ్=ఆతనిని, సమాసాద్య = సమీపించి, సంకులమ్ = వ్యాకులమై, శలభాః = మిడతలు, పావకమివ = అగ్నిని వలె, తత్ర = వానియందు, ప్రావిశత్ = ప్రవేశించెను.

తా. మిగిలిన సైన్యము చాల సేపు యుద్ధము చేసి, గొప్ప పరాక్రమము చూపి, ప్రజ్వలించుచున్న ఆ రావణుని సమీపించి, వ్యాకులమై, అగ్నిలో మిడతలు ప్రవేశించి నట్లు ఆతనిలో ప్రవేశించినది. 15,16

మూ. సోఽపశ్యత్తన్నరేన్ద్రస్తు నశ్యమానం మహాబలమ్,
మహార్ణవం సమాసాద్య వనాపగశతం యథా. 17

ప్ర. అ. సః నరేన్ద్రః తు = ఆ రాజు, మహార్ణవమ్=మహాసముద్రమును, సమాసాద్య=పొంది, వనాపగశతం యథా=నీటితో నిండిన నదుల శతము వలె, నశ్యమానమ్ = నశించుచున్న, తత్ = ఆ, మహాబలమ్ = గొప్ప సైన్యమును, అపశ్యత్ = చూచెను.

తా. మహాసముద్రమును చేరి అదృశ్యమై పోవుచున్న వందలకొలది నదుల వలె నశించి పోవుచున్న ఆ మహాసైన్యమును రాజు చూచెను. 17

మూ. తతః శక్రధనుఃప్రఖ్యం ధనుర్విస్ఫారయన్ స్వయమ్,
ఆససాద నరేన్ద్రస్తం రావణం క్రోధమూర్ఛితః. 18

ప్ర. అ. తతః = అటుపిమ్మట, నరేన్ద్రః = రాజు, క్రోధమూర్ఛితః = క్రోధముతో నిండినవాడై, స్వయమ్ = స్వయముగా, శక్రధనుఃప్రఖ్యమ్ = ఇంద్ర ధనస్సుతో సమానమైన, ధనుః = ధనస్సును, విస్ఫారయన్ = చరచుచు, తం రావణమ్ = ఆ రావణుణ్ణి, ఆససాద = సమీపించెను.

తా. అప్పుడు ఆ రాజు కోపావేశముతో ఇంద్రధనుస్సు వంటి ధనస్సును చరచుచు స్వయముగా రావణునిమీదికి యుద్ధమునకై వెళ్ళెను. 18

మూ. అనరణ్యేన తేఽమాత్యా మారీచశుకసారణాః,
ప్రహస్తసహితా భగ్నా వ్యద్రవన్త మృగా ఇవ 19

ప్ర. అ. అమాత్యాః = అమాత్యులైన, ప్రహస్తసహితాః = ప్రహస్తునితో కూడిన, మారీచశుకసారణాః = మారీచశుకసారణులు, అనరణ్యేన = అనరణ్యుని చేత, భగ్నాః = ఓడింపబడినవారై, మృగా ఇవ = లేళ్ళ వలె, వ్యద్రవన్త = పారి పోయిరి.

తా. రావణుని అమాత్యులైన ప్రహస్త-మారీచ-శుక-సారణులు అనరణ్యుని చేత ఓడింపబడినవారై పారిపోయిరి. 19

మూ. తతో బాణశతాన్యష్టౌ పాతయామాస మూర్ధని,
తస్య రాక్షసరాజస్య ఇక్ష్వాకుకులనన్దనః. 20

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఇక్ష్వాకుకులనందనః = ఇక్ష్వాకువంశ మునకు ఆనందకరుడైన ఆ అనరణ్యుడు, తస్య = ఆ, రాక్షసరాజస్య = రావణుని యొక్క, మూర్ధని = శిరస్సుపై, అష్టౌ = ఎనిమిది, బాణశతాని = బాణముల శత ములను, పాతయామాస = పడవేసెను.

తా. అప్పుడు అనరణ్యుడు ఎనిమిదివందల బాణములను ఆ రావణుని శిరస్సుపై వర్షించెను. 20

మూ. తస్య బాణాః పతన్తస్తే చక్రిరే న క్షతం క్వచిత్,
వారిధారా ఇవాభ్రేభ్యః పతన్త్యో గిరిమూర్ధని. 21

ప్ర. అ. పతన్తః = పడుచున్న, తే బాణాః = ఆ బాణములు, అభ్రేభ్యః =

మేఘములనుండి. గిరిమూర్ధని = పర్వతశిఖరమునందు, పతన్త్యః = పడుచున్న, వారిధారాః ఇవ = జలధారలు వలె, తస్య = వానికి, క్వచిత్ = ఎక్కడను, క్షతమ్ = దెబ్బను, న చక్రిరే = చేయలేదు.

తా. రావణునిమీద పడుచున్న ఆ బాణములు, మేఘములనుండి పర్వత శిఖరముమీద పడుచున్న జలధారలు వలె అతనికి ఏ మాత్రము పీడ కలిగించ లేదు. 21

మూ. తతో రాక్షసరాజేన క్రుద్ధేన నృపతిస్తదా,
తలేనాభిహతో మూర్ధ్ని స రథాన్నిపపాత హ. 22

ప్ర. అ. తతః = అటుపిమ్మట, క్రుద్ధేన = కోపించిన, రాక్షసరాజేన = రావణునిచేత, తదా = అప్పుడు, తలేన = అరచేతితో, మూర్ధ్ని = శిరస్సుమీద, అభిహతః = కొట్టబడెను. సః నృపతిః = ఆ రాజు, రథాత్ = రథమునుండి, నిపపాత హ = పడిపోయెను.

తా. అపుడు కోపించిన రావణుడు అరచేతితో శిరస్సుమీద కొట్టగా ఆ రాజు రథమునుండి పడిపోయెను. 22

మూ. స రాజా పతితో భూమౌ విహ్వలః పరివేపితః,
వజ్రదగ్ధ ఇవారణ్యే సాలో నిపతితో యథా. 23

ప్ర. అ. సః రాజా = ఆ రాజు, అరణ్యే = అరణ్యమునందు, వజ్రదగ్ధః = పిడుగుచేత కాల్చబడిన, నిపతితః = పడిన, సాలో యథా = సాలవృక్షము వలె, విహ్వలః = వ్యాకులుడై, పరివేపితః = వణకుచున్నవాడై, భూమౌ = నేలమీద, పతితః = పడినాడు.

తా. ఆ రాజు వ్యాకులుడై, వణకుచు, అరణ్యములో పిడుగుపాటుకు కాలి పడిపోయిన సాలవృక్షము వలె నేలపై కూలెను. 23

మూ. తం ప్రహస్యాబ్రవీద్రక్ష ఇక్ష్వాకుం పృథివీపతిమ్,
కిమిదానీం ఫలం ప్రాప్తం మాం త్వయా ప్రతియుధ్యతా.

ప్ర. అ. రక్షః = రావణుడు, ప్రహస్య = నవ్వి, ఇక్ష్వాకుమ్ = ఇక్ష్వాకు

వంశమునందు పుట్టిన, తం పృథివీపతిమ్ = ఆ రాజును గూర్చి, అబ్రవీత్ = పలికెను. మామ్ = నన్ను, ప్రతియుధ్యతా = ఎదిరించి యుద్ధము చేసిన, త్వయా = నీచేత, ఇదానీమ్ = ఇప్పుడు, కిమ్ = ఏమి, ఫలమ్ = ఫలము, ప్రాప్తమ్ = పొందబడినది.

తా. రావణుడు నవ్వి ఇక్ష్వాకువంశమునందు పుట్టిన ఆ రాజుతో ఇట్లు పలికెను-"నన్ను ఎదిరించి యుద్ధము చేసిన నీవు ఇప్పుడు ఏమి ఫలమును పొందినావు?" 24

మూ. త్రైలోక్యే నాస్తి యో ద్వన్ద్వం మమ దద్యాన్నరాధిప,
శఙ్కే ప్రసక్తో భోగేషు న శృణోషి బలం మమ- 25

ప్ర. అ. నరాధిప = రాజా, యః = ఎవడు, మమ = నాకు, ద్వన్ద్వమ్ = ద్వంద్వయుద్ధమును, దద్యాత్ = ఇచ్చునో వాడు, త్రైలోక్యే = మూడు లోకములయందు, నాస్తి = లేడు. భోగేషు = భోగములయందు, ప్రసక్తః = ఆసక్తుడవై, మమ = నాయొక్క, బలమ్ = బలమును, న శృణోషి = వినుటలేదు అని, శఙ్కే = ఊహించుచున్నాను.

తా. రాజా! నాతో ద్వంద్వయుద్ధము చేయగలవాడు మూడు లోకములలోనూ లేడు. నీవు భోగాసక్తుడవై నా బలమును గూర్చి విని ఉండవని తలచెదను. 25

మూ. తస్యైవం బ్రువతో రాజా మన్దాసుర్వాక్యమబ్రవీత్,
కిం శక్యమిహ కర్తుం వై కాలో హి దురతిక్రమః. 26

ప్ర. అ. తస్య = అతడు, ఏవమ్ = ఇట్లు, బ్రువతః = పలుకుచుండగా, మన్దాసుః = మందములైన ప్రాణములు గల, రాజా = రాజు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ఇహ = ఈ విషయమునందు, కిమ్ = ఏమి, కర్తుమ్ = చేయుటకు, శక్యమ్ = శక్యమైనది? కాలః = కాలము, దురతిక్రమః హి = అతిక్రమింప శక్యము కానిది కదా?

తా. అతని మాటలు విని ప్రాణబలము తగ్గిపోవుచున్న ఆ రాజు ఇట్లు పలికెను-"ఈ విషయమున ఏమి చేయగలను? కాలమును అతిక్రమింపజాలము కదా?" 26

మూ. న హ్యహం నిర్జితో రక్షస్త్వయా వీరప్రశంసినా,
కాలేనైవ విపన్నోఽహం హేతుభూతస్తు మే భవాన్. 27

ప్ర. అ. రక్షః = ఓ! రాక్షసుడా, అహమ్ = నేను, వీరప్రశంసినా = వీరుడ నని ప్రశంసించుకొనుచున్న, త్వయా = నీచేత, న నిర్జితః హి = జయింప బడలేదు కదా! అహమ్ = నేను, కాలేనైవ = కాలముచేతనే, విపన్నః = ఆపదను చెందితిని. భవాన్ తు = నీవైతే, హేతుభూతః = కారణమైనవాడవు.

తా. ఓ! రాక్షసుడా ! వీరుడ నని చెప్పుకొనుచున్న నీవు నన్ను జయించ లేదు. కాలమే నా కీ ఆపద కలిగించినది. నీవు కేవలము నిమిత్త మాత్ర మైనావు."

మూ. కిం త్విదానీం మయా శక్యం కర్తుం ప్రాణపరిక్షయే,
న హ్యహం విముఖీ రక్షో యుధ్యమానస్త్వయా హతః.

ప్ర. అ. రక్షః = ఓ ! రాక్షసుడా ! ప్రాణపరిక్షయే = ప్రాణములకు క్షయము కలిగినప్పుడు, ఇదానీమ్ = ఇప్పుడు, మయా = నాచేత, కిం తు=ఏమి, కర్తుమ్=చేయుటకు, శక్యమ్ = శక్యమైనది? అహమ్=నేను, విముఖీ= యుద్ధము నుండి) విముఖుడను, న హి = కాను కదా? యుధ్యమానః = యుద్ధము చేయు చున్న నేను, త్వయా = నీచేత, హతః = కొట్టబడితిని.

తా. రాక్షసుడా! కాలప్రభావముచేత ప్రాణాపాయము వచ్చినపుడు నేను ఏమి చేయగలుగుదును? నేను యుద్ధమునుండి పారిపోలేదుకదా ? యుద్ధము చేయు చుండగానే నన్ను నీవు చంపినావు (మరణించేటట్లు కొట్టినావు). 28

మూ. ఇక్ష్వాకుపరిభావిత్వాద్వచో వక్ష్యామి రాక్షస,
యది దత్తం యది హుతం యది మే సుకృతం తపః. 29
యది గుప్తాః ప్రజాః సమ్యక్తదా సత్యం వచోఽస్తు మే.

ప్ర. అ. రాక్షస = రాక్షసుడా! ఇక్ష్వాకుపరిభావిత్వాత్ = ఇక్ష్వాకురాజులను తిరస్కరించినవాడ వగుటవలన, వచః = వాక్యమును, వక్ష్యామి = పలికెదను. దత్తం యది = దానము చేయబడినట్లతే, యది హుతమ్ = హోమము చేయబడిన ట్లయితే, మే = నాకు, (నాచేత) తపః = తపస్సు, సుకృతమ్ = బాగా చేయబడి నట్లయితే, ప్రజాః = ప్రజలు, సమ్యక్ = బాగుగా, గుప్తాః యది = రక్షించబడి

నట్లయితే, తదా=అప్పుడు, మే వచః=నా వచనము, సత్యమ్=సత్యము, అస్తు=అగుగాక.

తా. రాక్షసుడా! నీవు ఇక్ష్వాకువంశమును అవమానించితివి. అందుచేత చెప్పుచున్నాను. నేను దానములు చేసినట్లయితే, హోమములు చేసినట్లయితే, గొప్ప తపస్సు చేసి ఉన్నట్లయితే, ప్రజలను బాగుగా రక్షించినట్లయితే నా వాక్యము సత్యము అగుగాక. 29

మూ. ఉత్పత్స్యతే కులే హ్యస్మిన్నిక్ష్వాకుణాం మహాత్మనామ్,
రామో దాశరథిర్నామ యస్తే ప్రాణాన్ హరిష్యతి.

ప్ర. అ. మహాత్మనామ్ = మహాత్ములైన, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకు రాజులయొక్క, అస్మిన్=ఈ, కులే=కులమునందు, రామో నామ = రాము డను పేరు గల, దాశరథిః= దశరథకుమారుడు, ఉత్పత్స్యతే= పుట్టగలడు, యః= ఎవడు, తే=నీయొక్క, ప్రాణాన్=ప్రాణములను, హరిష్యతి=హరించగలడో.

తా. మహాత్ములైన ఇక్ష్వాకురాజుల ఈ వంశమునందు దశరథుని కుమారుడు రాముడు పుట్టి నీ ప్రాణములను తీయగలడు. 30

మూ. తతో జలధరోదగ్రస్తాడితో దేవదున్దుభిః, 31
తస్మిన్నుదాహృతే శాపే పుష్పవృష్టిశ్చ ఖాచ్చ్యుతా.

ప్ర. అ. తస్మిన్ శాపే= ఆ శాపము, ఉదాహృతే= పలకబడిన దగుచుండగా, తతః= అటుపిమ్మట, జలధరోదగ్రః= మేఘము వలె గంభీరమైన, దేవదున్దుభిః= దేవతల దుందుభి, తాడితః= కొట్టబడినది, ఖాత్ = ఆకాశము నుండి, పుష్పవృష్టిశ్చ= పుష్పవర్షము కూడా, చ్యుతా= జారినది.

తా. అనరణ్యుడు ఆ శాపవాక్యమును పలుకుచున్నప్పుడు గంభీరముగా దేవదుందుభి మ్రోగెను. ఆకాశమునుండి పుష్పవర్షము కురిసెను. 31

మూ. తతః స రాజా రాజేన్ద్ర గతః స్థానం త్రివిష్టపమ్, 32
స్వర్గతే చ నృపే తస్మిన్రాక్షసః సోఽపసర్పత.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోనవింశః సర్గః.

ప్ర. అ. రాజేన్ద్ర = రామా ! తతః = అటుపిమ్మట, సః రాజా = ఆ రాజు, త్రివిష్టపమ్ = స్వర్గము అను, స్థానమ్ = స్థానమును గూర్చి, గతః = వెళ్లెను, తస్మిన్ = ఆ, నృపే = రాజు, స్వర్గతే = స్వర్గమునకు వెళ్ళినవాడగుచుండగా, సః రాక్షసః = ఆ రాక్షసుడు, అపసర్పత = వెళ్ళెను.

తా. రామా ! అటుపిమ్మట అనరణ్యుడు స్వర్గస్థు డయ్యెను. ఆతడు స్వర్గస్థుడైన పిమ్మట రావణుడు అచటినుండి వెళ్ళిపోయెను. 32

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
పందొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ వింశః సర్గః

[నారదుడు రావణునకు బోధించుట. అతని ప్రేరణచేత రావణుడు యుద్ధమునకై యమలోకమునకు వెళ్లుట. ఆ విషయమునందు నారదుడు ఆలోచించుట.]

మూ. తతో విత్రాసయన్ మర్త్యాన్ పృథివ్యాం రాక్షసాధిపః,
అససాద ఘనే తస్మిన్ నారదం మునిపుఙ్గవమ్. 1

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రాక్షసాధిపః = రావణుడు, పృథివ్యామ్= భూమియందు, మర్త్యాన్=మానవులను, విత్రాసయన్ = భయపెట్టుచు, తస్మిన్= ఆ, ఘనే= మేఘమునందు, మునిపుఙ్గవమ్ = మునిశ్రేష్ఠుడైన, నారదమ్=నారదుని. ఆససాద = సమీపించెను.

తా. పిమ్మట భూలోకమునందున్న మానవులను భయపెట్టుచు సంచరించుచున్న రావణుడు మేఘమండల సమీపమునందు మునిశ్రేష్ఠుడైన నారదుని చూచెను. 1

మూ. తస్యాభివాదనం కృత్వా దశగ్రీవో నిశాచరః,
అబ్రవీత్కుశలం పృష్ట్వా హేతుమాగమనస్య చ. 2

ప్ర. అ. నిశాచరః = రాక్షసుడైన, దశగ్రీవః = రావణుడు, తస్య = అతనియొక్క, అభివాదనమ్ = నమస్కారమును, కృత్వా = చేసి, కుశలమ్ = కుశలమును, పృష్ట్వా = అడిగి, అగమనస్య = రాకకు, హేతుమ్ = కారణమును, అబ్రవీత్ = పలికెను.

తా. నిశాచరుడైన ఆ రావణుడు నారదునకు నమస్కరించి, కుశలమును ప్రశ్నించి, అతని రాకకు కారణమును అడిగెను. 2

మూ. నారదస్తు మహాతేజా దేవర్షిరమితప్రభః,
అబ్రవీన్మేఘపృష్ఠస్థో రావణం పుష్పకే స్థితమ్. 3

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గలవాడు, దేవర్షిః = దేవర్షి, అమితప్రభః = సాటిలేని కాంతి గలవాడు అయిన, నారదస్తు = నారదుడు, మేఘపృష్ఠస్థః = మేఘము పైభాగమునందున్నవాడై, పుష్పకే = పుష్పకమునందు, స్థితమ్ = ఉన్న, రావణమ్ = రావణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. గొప్ప తేజస్సు, అధికమైన కాంతి గల, దేవర్షియైన నారదుడు మేఘముపైన ఉండి, పుష్పకములో ఉన్న రావణునితో ఇట్లు పలికెను. 3

మూ. రాక్షసాధిపతే సౌమ్య తిష్ఠ విశ్రవసః సుత,
ప్రీతోఽస్మ్యభిజనోపేత విక్రమైరూర్జితైస్తవ. 4

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా! విశ్రవసః సుత = విశ్రవసుని కూమారుడా! రాక్షసాధిపతే = రాక్షసరాజా! తిష్ఠ = నిలువుము, అభిజనోపేత = మంచి బంధు జనముతో కూడినవాడా! తవ = నీయొక్క, ఊర్జితైః = గొప్ప, విక్రమైః = పరాక్రమములచేత, ప్రీతః = సంతోషించినవాడను, అస్మి = అయితిని.

తా. విశ్రవసుని కుమారుడవు, సౌమ్యుడవు అయిన ఓ! రాక్షసరాజా! ఆగుము. మంచి బంధువులు కలవాడా! నీ గొప్ప పరాక్రమములకు సంతోషించితిని. 4

మూ. విష్ణునా దైత్యఘాతైశ్చ గన్ధర్వోరగఘర్షణైః,
త్వయా సమం విమర్దైశ్చ భృశం హి పరితోషితః 5

ప్ర. అ. విష్ణునా = విష్ణువుచేత, దైత్యఘాతైశ్చ = దైత్యుల సంహారముల చేతను, గన్ధర్వోరగఘర్షణైః = గంధర్వోరగుల యుద్ధములచేతను, త్వయా సమమ్ = నీతో కూడ, విమర్దైశ్చ = యుద్ధములచేతను, భృశమ్ = మిక్కిలి, పరితోషితో హి = సంతోషింప చేయబడితిని కదా?

తా. విష్ణువు చేసిన దైత్యసంహారములు, గంధర్వ-ఉరగుల మధ్య జరిగిన యుద్ధాలు నీవు చేసిన యుద్ధాలు చూచి సంతోషించితిని. 5

మూ. కిం చిద్వక్ష్యామి తావత్తు శ్రోతవ్యం శ్రోష్యసే యది,
శ్రుత్వా చానన్తరం కార్యం త్వయా రాక్షససత్తమ. 6
తన్మే నిగదతస్తాత సమాధిం శ్రవణే కురు,

ప్ర. అ. రాక్షససత్తమ = రాక్షసశ్రేష్ఠుడా! కించిత్ = కొంచెము, వక్ష్యామి తావత్ = చెప్పెదను. శ్రోష్యసే యది = నీవు వినబోయినచో, శ్రోతవ్యమ్ = వినదగినది. శ్రుత్వా చ = విని, అనన్తరమ్ = పిదప, త్వయా = నీచేత, కార్యమ్ = చేయదగినది. తాత = తండ్రీ! తత్ = ఆ కారణమువలన, నిగదతః = చెప్పుచున్న, మే = నాయొక్క, శ్రవణే = వినుటయందు, సమాధిమ్ = ఏకాగ్రతను, కురు = చేయుము.

తా. ఓ! రాక్షసశ్రేష్ఠుడా! ఒక విషయము చెప్పెదను. వినుటకు ఇష్టమైనచో వినుము. విన్నపిమ్మట చేయవలసిన కార్యము చేయుము. తండ్రీ! అందువలన నేను చెప్పుమాటలు సావధానముగా వినుము. 6

మూ. కిమయం వధ్యతే తాత త్వయావధ్యేన దైవతైః 7
హత ఏవ హ్యయం లోకో యదా మృత్యువశం గతః.

ప్ర. అ. తాత = తండ్రీ! దైవతైః = దేవతలచేత, అవధ్యేన = వధింప శక్యముకాని, త్వయా = నీచేత, అయమ్ = ఈ మనుష్యలోకము, కిమ్ = ఎందుకు, వధ్యతే = చంపబడుచున్నది? అయమ్ = ఈ, లోకః = మనుష్యలోకము, యదా = ఎప్పుడు, మృత్యువశమ్ = మృత్యువునకు వశమును, గతః = పొందినదో, హతః = చంపబడినదే.

తా. నాయనా! దేవతలు కూడ చంపుటకు శక్యము కాని నీవు ఈ మర్త్య లోకమును ఎందుకు చంపెదవు? మర్త్యలోకము మృత్యువునకు వశమైనది. అందు చేత ఇది చంపబడినట్లే. 7

మూ. దేవదానవదైత్యానాం యక్షగన్ధర్వ రక్షసామ్, 8
అవధ్యేన త్వయా లోకః క్లేష్టుం యోగ్యో న మానుషః.

ప్ర. అ. దేవదానవదైత్యానామ్ = దేవతలకు, దానవులకు, దైత్యులకు, యక్షగన్ధర్వ రక్షసామ్ = యక్షులకు, గంధర్వులకు, రాక్షసులకు, అవధ్యేన =

వద్యుడవు కాని, త్వయా = నీచేత, మానుష్యః లోకః = మనుష్యసంబంధ మైన లోకము, క్లేష్టుమ్ = బాధించుటకు, న యోగ్యః = యోగ్యము కాదు.

తా. నిన్ను దేవ-దానవ-దైత్యులు గాని, యక్ష-గంధర్వ-రాక్షసులు గాని చంప జాలరు కదా. అట్టి నీవు మనుష్యలోకమును బాధించుట యుక్తము కాదు. 8

మూ. నిత్యం శ్రేయసి సంమూఢం మహద్భిర్వ్యసనైర్వృతమ్, 9
హన్యాత్క_స్తాదృశం లోకం జరావ్యాధిశతైర్యుతమ్.

ప్ర. అ. నిత్యమ్ = నిత్యమూ, శ్రేయసి = శ్రేయస్సు విషయమునందు, సంమూఢమ్ = మూఢముగా (తెలియనిదిగా) ఉన్నది, మహద్భిః = గొప్ప, వ్యసనైః = వ్యసనములతో, వృతమ్ = కూడినదీ, జరావ్యాధిశతైః=ముసలితనము తోను, అనేక వ్యాధులతోను కూడినదీ అయిన, తాదృశమ్ = అట్టి, లోకమ్ = లోకమును, కః = ఎవడు, హన్యాత్ = చంపును.

తా. ఈ మనుష్యలోకము ఏది తనకు శ్రేయస్కరమో తెలియని స్థితిలో ఉన్నది. అనేకములైన గొప్ప ఆపదలలో చిక్కు_కొను చుండును. ముసలితనము చేత, వందలకొలది రోగములచేత బాధింపబడుచున్నది. అట్టి ఈ భూలోకమును ఎవరు చంపుదురు ? 9

మూ. తైస్తైరనిష్టోపగమైరజస్రం యత్ర కుత్ర కః, 10
మతిమాన్మానుషే లోకే యుద్ధేన ప్రణయీ భవేత్.

ప్ర. అ. అజస్రమ్ = ఎల్లప్పుడూ తైః తైః = ఆ యా, అనిష్టోపగమైః = అనిష్టముల ప్రాప్తిచేత (బాధింపబడుచున్న), కః=ఏ, మతిమాన్=బుద్ధిమంతుడు, మానుషే = మనుష్యసంబంధమైన, లోకే = లోకమునందు, యత్ర కుత్ర = ఎక్కడనైనా, యుద్ధేన = యుద్ధముచేత (యుద్ధమునందు), ప్రణయీ = కోరిక గలవాడు, భవేత్ = అగునా?

తా. ఎల్లప్పుడూ ఆ యా అనిష్టములు ప్రాప్తించుటచేత బాధ పడుచు ఉండు ఎవడైనా మనుష్యలోకములో, ఎక్కడనైనా, యుద్ధమునందు ఆసక్తి కలిగి ఉండునా? 10

మూ. క్షీయమాణం దైవహతం క్షుత్పిపాసాజరాదిభిః, 11
విషాదశోకసంమూఢం లోకం త్వం క్షపయస్వ మా.

ప్ర. అ. క్షీయమాణమ్ = క్షీణించుచున్నది, దైవహతమ్ = దైవముచేతనే పీడింపబడినదీ, క్షుత్పిపాసాజరాదిభిః = ఆకలి, దప్పిక, ముసలితనము మొదలైన వాటిచేత, విషాదశోకసంమూఢమ్ = దిగులుతోను, శోకముతోను మూఢమైన, లోకమ్ = లోకమును, త్వమ్ = నీవు, మా క్షపయస్వ = నశింపచేయకుము.

తా. క్షీణించుచున్నది, దైవము చేతనే పీడింపబడుచున్నదీ, ఆకలి, దప్పిక ముసలితనము మొదలైన వాటితో దిగాలు చెంది దుఃఖాక్రాంతమూ అయిన మనుష్య లోకమును నశింప చేయకుము. 11

మూ. పశ్య తావన్మహాబాహో రాక్షసేశ్వర మానుషమ్, 12
మూఢమేవం విచిత్రార్థం యస్య న జ్ఞాయతే గతిః.

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! రాక్షసేశ్వర = రాక్షసరాజా! యస్య = ఏ మనుష్యుని, గతిః = గతి, న జ్ఞాయతే = తెలియబడదో అట్టి, మూఢమ్ = మూఢుడైన, ఏవమ్ = ఇట్లు, విచిత్రార్థమ్ = విచిత్రమైన ప్రయోజనము గల, మానుషమ్ = మనుష్యుణ్ణి, పశ్య తావత్ = చూడుము.

తా. గొప్ప బాహువులు గల రాక్షస రాజా! ఏమి చేయవలెనో తోచని, విచిత్రప్రయోజనవంతుడైన ఈ మానవుణ్ణి చూడుము! వీని గమ్యమేదో తెలియదు. 12

మూ. క్వచిద్వాదిత్రనృత్యాది సేవ్యతే ముదితైర్జనైః, 13
రుద్యతే చాపరైరార్తైర్ధారాశ్రునయనాననైః.

ప్ర. అ. క్వచిత్ = ఒకచోట, ముదితైః = సంతోషించిన, జనైః = జనుల చేత, వాదిత్రనృత్యాది = వాద్యము, నృత్యము మొదలైనది, సేవ్యతే = సేవింపబడుచుండును. ఆర్తైః = దుఃఖితులు, ధారాశ్రునయనాననైః = ధారారూపములైన కన్నీళ్ళు గల నేత్రములు ముఖములు గల, అపరైః = ఇతరులచే, రుద్యతే = ఏడ్చుట జరుగుచుండును.

తా. కొన్ని చోట్ల సంతోషముతో కొందరు నృత్యవాద్యాదులు సేవించు

చుందురు. మరి కొన్ని చోట్ల కొందరు దుఃఖితులై కన్నీళ్ళతో నిండిన నేత్రము లతో, ముఖములతో ఏడ్చుచుందురు. 13

మూ. మాతాపితృసుతస్నేహభార్యాబన్ధుమనోరమైః, 14
మోహితోఽయం జనో ధ్వస్తః క్లేశం స్వం నావబుధ్యతే.

ప్ర. అ. అయమ్ = ఈ, జనః = జనము, మాతాపితృసుతస్నేహభార్యాబన్ధుమనోరమైః = తల్లిదండ్రులయందు, సుతులయందు స్నేహముచేత, భార్యల యందు, బంధువులయందు ప్రేమచేత, మోహితః = మోహింపబడినదై, ధ్వస్తః = నశింపచేయబడి, స్వమ్ = తన సంబంధమైన, క్లేశమ్ = క్లేశమును, నావబుధ్యతే = తెలుసుకొనుటలేదు.

తా. మనుష్యలోకములోని జనులు తల్లి, తండ్రి, పుత్రులు, భార్య, బంధువులు మొదలైనవారిపై ప్రేమచేత మోహము చెంది, దానితో బాధపడుచున్నను తమ క్లేమును గుర్తించజాలకున్నారు. 14

మూ. తత్కిమేవం పరిక్లిశ్య లోకం మోహనిరాకృతమ్, 15
జిత ఏవ త్వయా సౌమ్య మర్త్యలోకో న సంశయః.

ప్ర. అ. సౌమ్య = ఓ! సౌమ్యుడా! ఏవమ్ = ఇట్లు, మోహనిరాకృతమ్ = మోహముచేత తిరస్కృతమై ఉన్న, లోకమ్ = లోకమును, పరిక్లిశ్య = బాధించి, కిమ్ = ఏమి ప్రయోజనము. త్వయా = నీచేత, మర్త్యలోకః = మర్త్యలోకము, జితః ఏవ = జయింపబడినదే; సంశయః = సంశయము, న = లేదు.

తా. ఓ! సౌమ్యుడా! ఈ విధముగా మోహముతో కొట్టుమిట్లాడుచున్న ఈ లోకాన్ని ఇంకా బాధపెట్టి ఏమి ప్రయోజనము? దీనిని నీవు జయించినట్లే; సందేహము లేదు. 15

మూ. అవశ్యమేభిః సర్వైశ్చ గన్తవ్యం యమసాదనమ్, 16
తన్నిగృహ్ణీష్వ పౌలస్త్య యమం పరపురంజయ.

ప్ర. అ. ఏభిః = ఈ, సర్వైః = అందరిచేత, యమసాదనమ్ = యమలోకమును గూర్చి, గన్తవ్యమేవ = వెళ్ళవలసియే ఉన్నది. పరపురంజయ =

శత్రుపురములను జయించువాడా! పౌలస్త్య = రావణుడా! తత్ = ఆ కారణము వలన, యమమ్ = యముణ్ణి, నిగృహీష్వ = నిగ్రహించుము.

తా. శత్రుపురములను జయించు ఓ! రావణా! ఈ మానవులందరూ ఏనాటికైనా యమలోకమునకు వెళ్ళవలసినవారే, అందువలన యముణ్ణి ఓడించుము. 16

మూ. తస్మిన్ జితే జితం సర్వం భవత్యేవ న సంశయః, 17
ఏవముక్తస్తు లఙ్కేశో దీప్యమానం స్వతేజసా,
అబ్రవీన్నారదం తత్ర సంప్రహస్యాభివాద్య చ. 18

ప్ర. అ. తస్మిన్ = అతడు, జితే = జయించబడినవాడగుచుండగా, సర్వమ్ = సమస్తమూ, జితమ్ = జయించబడినది, భవత్యేవ = అగును. సంశయః = సంశయము, న = లేదు. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, లఙ్కేశః = రావణుడు, స్వతేజసా = తన తేజస్సుతో, తత్ర = అక్కడ, దీప్యమానమ్ = ప్రకాశించుచున్న, నారదమ్ = నారదుని, అభివాద్య = నమస్కరించి, సంప్రహస్య చ = నవ్వి, అబ్రవీత్ = పలికెను.

తా. "నీవు ఆ యముణ్ణి జయించినచో అందరినీ జయించినట్లే." ఈ మాటలు విని రావణుడు, అక్కడ తన తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ నారదునకు నమస్కరించి, నవ్వుచు ఇట్లు పలికెను. 17, 18

మూ. మహర్షే దేవగన్ధర్వవిహార సమరప్రియ,
అహం సముద్యతో గన్తుం విజయార్థం రసాతలమ్. 19

ప్ర. అ. మహర్షే = ఓ! మహర్షీ! దేవగన్ధర్వవిహార = దేవగంధర్వులతో విహరించువాడా! సమరప్రియ = యుద్ధప్రియుడా! అహమ్ = నేను, విజయార్థమ్ = విజయముకొరకు, రసాతలమ్ = పాతాళమును గూర్చి, గన్తుమ్ = వెళ్ళుటకు, సముద్యతః = సిద్ధముగా ఉన్నాను.

తా. దేవగంధర్వలోకములలో విహరించు యుద్ధప్రియుడవైన ఓ! మహర్షీ! నేను ఇప్పుడు విజయముకొరకై రసాతలమునకు వెళ్లుటకు సిద్ధముగా ఉన్నాను. 19

మూ. తతో లోకత్రయం జిత్వా స్థాప్య నాగాన్ సురాన్ వశే,
సముద్రమమృతార్థం చ మథిష్యామి రసాలయమ్. 20

ప్ర. అ. తతః=అటు పిమ్మట, లోకత్రయమ్=లోకముల త్రయమును, జిత్వా = జయించి, నాగాన్ = నాగులను, సురాన్ = దేవతలను, వశే = వశము నందు, స్థాప్య = ఉంచి, అమృతార్థమ్ = అమృతముకొరకు, రసాలయమ్ = జల మునకు స్థానమైన, సముద్రమ్ = సముద్రమును, మథిష్యామి = మథించగలను.

తా. పిమ్మట మూడు లోకములను జయించి, నాగులను, దేవతలను వశము చేసికొని, అమృతము కొరకై సముద్రమును మథించెదను. 20

మూ. అథాబ్రవీద్దశగ్రీవం నారదో భగవానృషిః,
క్వ ఖల్విదానీం మార్గేణ త్వయా హ్యన్యేన గమ్యతే. 21

ప్ర. అ. అథ = అటు పిమ్మట, భగవాన్ = పూజ్యుడైన, నారదఃఋషిః = నారదమహర్షి, దశగ్రీవమ్ = రావణుణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను. ఇదానీమ్ = ఇప్పుడు, త్వయా = నీచేత, అన్యేన మార్గేణ = మరొక మార్గము చేత, క్వ ఖలు = ఎక్కడికి, గమ్యతే = గమనము చేయబడుచున్నది.

తా. అప్పుడు భగవంతుడైన నారదమహర్షి రావణునితో ఇట్లనెను. "నీవు ఇప్పుడు మరొక మార్గముచేత ఎక్కడికి వెళ్ళుచున్నావు ?" (రసాతలమునకు వెళ్ల దలచిన నీవు మరొక మార్గమున వెళ్ళుచున్నావేమి ? అని భావము). 21

మూ. అయం ఖలు సుదుర్గమ్యః ప్రేతరాజపురం ప్రతి,
మార్గో గచ్ఛతి దుర్ధర్ష యమస్యామిత్రకర్శన. 22

ప్ర. అ. దుర్ధర్ష = ఎదిరింప శక్యము కానివాడా ! అమిత్రకర్శన = శత్రువులను పీడించువాడా ! సుదుర్గమ్యః = వెళ్ళుటకు చాల కష్టమైన, అయమ్ = ఈ, మార్గః = మార్గము, యమస్య = యమునియొక్క, ప్రేతరాజపురం ప్రతి = యమ లోకమును గూర్చి, గచ్ఛతి = వెళ్లును.

తా. ఎదిరింప శక్యముకానివాడా ! శత్రువులను పీడించువాడా ! వెళ్లుటకు చాల కష్టమైన ఈ మార్గము యమలోకమునకు వెళ్లును. (రసాతలమునకు వెళ్ళే మార్గము కాదు అని అర్థము). 22

మూ. స తు శారదమేఘాభం హాసం ముక్త్వా దశాననః,
ఉవాచ కృతమిత్యేవ వచనం చేదమబ్రవీత్, 23

ప్ర. అ. సః = ఆ, దశాననః తు = రావణుడైతే, హాసమ్ = నవ్వును. ముక్త్వా = విడచి, శారదమేఘాభమ్ = శరత్కాలమేఘము వంటి కాంతి గల నారదుని గూర్చి, కృతమ్ ఇత్యేవ = చేయబడినదే అని, ఉవాచ = పలికెను. ఇదమ్ = ఈ, వచనం చ = వచనమును కూడ, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ రావణుడు బిగ్గరగా నవ్వి శరత్కాలమేఘము వలె తెల్లగా ఉన్న నారదునితో "నీవు చెప్పిన పని పూర్తి అయినట్లే"అని పలికి మరల ఇట్లు అనెను.

మూ. తస్మాదేవం మహాబ్రహ్మన్ వైవస్వతవధోద్యతః,
గచ్ఛామి దక్షిణామాశాం యత్ర సూర్యాత్మజో నృపః. 24

ప్ర. అ. మహాబ్రహ్మన్ = గొప్పబ్రాహ్మణుడా ! తస్మాత్ = ఆ కారణము వలన, వైవస్వతవధోద్యతః = యముని చంపుటయందు ఉద్యుక్తుడనై, ఏవమ్ = ఇట్లు, సూర్యాత్మజః = సూర్యుని కుమారుడైన, నృపః = రాజు, యత్ర = ఎక్కడ ఉన్నాడో ఆ, దక్షిణామ్ ఆశామ్ = దక్షిణదిక్కును గూర్చి, గచ్ఛామి = వెళ్ళుచున్నాను.

తా. ఓ ! మహాబ్రహ్మ ! అందువలన యముణ్ణి చంపుటకై అతడున్న దక్షిణదిక్కునకు వెళ్ళుచున్నాను. 24

మూ. మయా హి భగవన్ క్రోధాత్ప్రతిజ్ఞాతం రణార్థినా,
అవజేష్యామి చతురో లోకపాలానితి ప్రభో. 25

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా ! ప్రభో = సమర్థుడా ! రణార్థినా = యుద్ధమును కోరుచున్న, మయా = నాచేత, చతురః = నలుగురు, లోకపాలాన్ = లోకపాలులను, అవజేష్యామి = జయింపగలను అని, క్రోధాత్ = క్రోధము వలన, ప్రతిజ్ఞాతం హి = ప్రతిజ్ఞ చేయబడినది కదా.

తా. పూజ్యుడవూ, సమర్థుడవూ అయిన నారదా ! యుద్ధమునందు అభిలాష గల నేను కోపించి "నలుగురు లోకపాలకులను జయించెదను"అని ప్రతిజ్ఞ చేసితిని కదా ? 25

మూ. తదిహ ప్రస్థితోఽహం వై యమరాజపురం ప్రతి,
ప్రాణిసంక్లేశకర్తారం యోజయిష్యామి మృత్యునా. 26

ప్ర. అ. తత్ = ఆ కారణమువలన, అహమ్ = నేను, ఇహ = ఇప్పుడు, యమరాజపురం ప్రతి = యముని నగరమును గూర్చి, ప్రస్థితః = ప్రయాణమైనాను. ప్రాణిసంక్లేశకర్తారమ్ = ప్రాణులకు క్లేశము కలిగించు అతనిని, మృత్యునా = మృత్యువుతో, యోజయిష్యామి = చేర్చెదను.

తా. అందువలన నేనిప్పుడు యమలోకమునకు వెళ్ళి ప్రాణులకు క్లేశము కలిగించు ఆ యముణ్ణి చంపివేసెదను. 26

మూ. ఏవముక్త్వా దశగ్రీవో మునిం తమభివాద్య చ,
ప్రయయౌ దక్షిణామాశాం ప్రవిష్టః సహ మన్త్రిభిః. 27

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తం మునిమ్ = ఆ మునీశ్వరుణ్ణి. అభివాద్య చ = నమస్కరించి, దక్షిణామ్ ఆశామ్ = దక్షిణదిక్కును గూర్చి, ప్రయయౌ = వెళ్ళెను. సహ మన్త్రిభిః = మంత్రులతో కూడ ప్రవిష్టః = ప్రవేశించెను.

తా. రావణుడు ఇట్లు పలికి, నారదునకు అభివాదనము చేసి, దక్షిణపు దిక్కు వైపు వెళ్ళి మంత్రులతో కూడ ఆ దక్షిణదిగ్భాగమును ప్రవేశించెను. 27

మూ. నారదస్తు మహాతేజా ముహూర్తం ధ్యానమాస్థితః,
చిన్తయామాస విప్రేన్ద్రో విధూమ ఇవ పావకః. 28

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, విధూమః = ధూమము లేని, పావకః ఇవ = అగ్నివలె ఉన్న, విప్రేన్ద్రః = బ్రాహ్మణశ్రేష్ఠుడైన, నారదస్తు = నారదుడైతే, ముహూర్తమ్ = ముహూర్తకాలమును, ధ్యానమ్ = ధ్యానమును, ఆస్థితః = అవలంబించినవాడై, చిన్తయామాస = ఆలోచించెను.

తా. గొప్ప తేజస్సు గలవాడు, ధూమము లేని అగ్ని వలె ఉన్నవాడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు అయిన నారదుడు క్షణకాలము ధ్యానములో ఉండి ఇట్లు ఆలోచించెను. 28

మూ. యేన లోకాస్త్రయః సేన్ద్రాః క్లిశ్యన్తే సచరాచరాః 29
క్షీణే చాయుషి ధర్మేణ స కాలో జేష్యతే కథమ్.

ప్ర అ. యేన=ఎవనిచేత, ఆయుషి = ఆయుర్దాయము, క్షీణే=క్షీణించిన దగుచుండగా, సేన్ద్రాః = ఇంద్రునితో కూడిన, సచరాచరాః=స్థావరజంగమములతో కూడిన, లోకాః=లోకములు, ధర్మేణ = ధర్మముచేత, క్లిశ్యన్తే = క్లేశ పెట్టబడుచుండునో, సః=అట్టి, కాలః = యముడు, కథమ్=ఎట్లు, జేష్యతే=జయింపబడును.

తా. ఏ యముడు ఆయుర్దాయము క్షీణించిన జంగమస్థావరరూపమైన మూడు లోకాలను, ఇంద్రునితో సహా, ధర్మానుసారము నిగ్రహించునో అట్టి యముణ్ణి ఇతడు ఎట్లు జయించగలడు? 29

మూ. స్వదత్తకృతసాక్షీ యో ద్వితీయ ఇవ పావకః, 30
లబ్ధసంజ్ఞా విచేష్టన్తే లోకా యస్య మహాత్మనః.
యస్య నిత్యం త్రయో లోకా విద్రవన్తి భయార్దితాః, 31
తం కథం రాక్షసేన్ద్రోఽసౌ స్వయమేవ గమిష్యతి.

ప్ర. అ. యః=ఎవడు, స్వదత్తకృతసాక్షీ = తమచేత ఇవ్వబడినదానికీ, చేయబడినదానికీ సాక్షియో, ద్వితీయః = రెండవ, పావకః ఇవ = అగ్ని వలె ఉన్నాడో, మహాత్మనః = మహాత్ముడైన, యస్య = ఎవని అనుగ్రహముచేత, లోకాః=లోకములు, లబ్ధసంజ్ఞాః = పొందబడిన సంజ్ఞ గలవై, విచేష్టన్తే=కదలుచున్నవో, నిత్యమ్=ఎల్లప్పుడూ, యస్య=ఎవనియొక్క, భయార్దితాః=భయముచేత పీడింపబడినవై, త్రయః = మూడు, లోకాః = లోకములు, విద్రవన్తి = పరుగెత్తు చుండునో, తమ్ = అట్టి యముణ్ణి, అసౌ=ఈ, రాక్షసేన్ద్రః = రాక్షసరాజు, స్వయమేవ = స్వయముగా, కథమ్ = ఎట్లు, గమిష్యతి = పొందగలడు.

తా. రెండవ అగ్ని వలె ఉండు యముడు లోకులు చేసిన దానాలకు, ఆ యా కర్మలకు సాక్షి. ఆ మహాత్ముని అనుగ్రహముచేతనే సంజ్ఞతో ఉండి ప్రాణుల తమ తమ వ్యవహారములు చేసికొనుచుండును. అతనికి భయపడి మూడు లోకాలూ కూడ పారిపోవుచుండును. అట్టి యమునితో యుద్ధము చేయుటకు ఈ రావణుడు ఎట్లు వెళ్లగలడు? 30, 31

మూ. యో విధాతా చ ధాతా చ సుకృతం దుష్కృతం తథా,
త్రైలోక్యం విజితం యేన తం కథం విజయష్యతే.
అపరం కిం తు కృత్వాయం విధానం సంవిధాస్యతి. 33

ప్ర. అ. యః = ఎవడు, ధాతా = (లోకమునకు) కర్తయో, విధాతా చ = విశేషముగా కర్తయో, తథా = మరియు, సుకృతమ్ = పుణ్యమో, దుష్కృతమ్ = పాపమో, యేన = ఎవనిచేత, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, విజితమ్ = జయించబడినదో, తమ్ = అట్టి యముణ్ణి, కథమ్ = ఎట్లు, విజేష్యతే = జయించగలడు? అయమ్ = ఇతడు, అపరమ్ = మరియొక, విధానమ్ = విధానమును (ఉపాయమును), కృత్వా = చేసి, సంవిధాస్యతి కిమ్ = జయమును చేయునా?

తా. లోకమును సామాన్యరూపమున, విశేషరూపమున సృష్టించినవాడు యముడు. పుణ్యపాపఫలములను ఇచ్చువాడు; మూడు లోకములను జయించినవాడు. అట్టి యముణ్ణి మరేదైనా ఉపాయము అవలంబించి ఇతడు జయించునా?

మూ. కౌతూహలసముత్పన్నో యాస్యామి యమసాదనమ్,
విమర్దం ద్రష్టుమనయోర్యమరాక్షసయోః స్వయమ్. 34

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
వింశః సర్గః.

ప్ర. అ. కౌతూహలసముత్పన్నః = పుట్టిన కుతూహలము గల నేను, అనయోః = ఈ, యమరాక్షసయోః = యమరాక్షసులయొక్క, విమర్దమ్ = యుద్ధమును, స్వయమ్ = స్వయముగా, ద్రష్టుమ్ = చూచుటకు, యమసాదనమ్ = యమలోకమును గూర్చి, యాస్యామి = వెళ్లెదను.

తా. ఈ యమ-రావణ యుద్ధమును స్వయముగా చూడవలెనని నాకు కుతూహలముగా ఉన్నది. అందుచేత యమలోకమునకే వెళ్లెదను. 34

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఇరువదవ సర్గ సమాప్తము.

అథ ఏకవింశః సర్గః

[రావణుడు యమలోకముపై ఆక్రమణము చేసి యముని సైన్యములను సంహరించుట.]

మూ. ఏవం సంచిన్త్య విప్రేన్ద్రో జగామ లఘువిక్రమః,
అఖ్యాతుం తద్యథావృత్తం యమస్య సదనం ప్రతి. 1

ప్ర. అ. విప్రేన్ద్రః = బ్రాహ్మణశ్రేష్ఠుడు, ఏవమ్ = ఇట్లు, సంచిన్త్య = ఆలోచించి, తత్ = దానిని, యథావృత్తమ్ = జరిగినది జరిగినట్లుగా, అఖ్యాతుమ్ = చెప్పుటకు, యమస్య = యమునియొక్క, సదనం ప్రతి = గృహమును గూర్చి, లఘువిక్రమః = శీఘ్రగమనము కలవాడై, జగామ = వెళ్లెను.

తా. నారదుడు ఈ విధముగా ఆలోచించి, జరిగిన విషయమును యథాతథముగా చెప్పుటకై యమలోకమునకు శీఘ్రముగా వెళ్లెను. 1

మూ. అపశ్యత్స యమం తత్ర దేవమగ్నిపురస్కృతమ్,
విధానమనుతిష్ఠన్తం ప్రాణినో యస్య యాదృశమ్. 2

ప్ర. అ. సః = అతడు, తత్ర = అక్కడ, అగ్నిపురస్కృతమ్ = ముందు ఉంచుకొనబడిన అగ్నిదేవుడు గల, యస్య = ఏ, ప్రాణినః = ప్రాణికి, యాదృశమ్ = ఎట్టిది తగినదో, విధానమ్ = అట్టి విధిని, అనుతిష్ఠన్తమ్ = చేయుచున్న, దేవమ్ = దేవుడైన, యమమ్ = యముణ్ణి, అపశ్యత్ = చూచెను.

తా. అక్కడ యముడు ఏ ప్రాణులకు ఎట్టి ఫలమును ఇవ్వవలెనో అట్టి ఫలమును, అగ్నిదేవుని సాక్షిగా ముందు ఉంచుకొని, ఇచ్చుచుండెను. అట్టి యముణ్ణి నారదుడు చూచెను. 2

మూ. స తు దృష్ట్వా యమః ప్రాప్తం మహర్షిం తత్ర నారదమ్,
అబ్రవీత్సుఖమాసీనమర్ఘ్యమావేద్య ధర్మతః. 3

ప్ర. అ. సః = ఆ, యమః తు = యముడు, తత్ర = అక్కడికి, ఆగతమ్ = వచ్చిన, మహర్షిమ్ = మహర్షియైన, నారదమ్ = నారదుణ్ణి, దృష్ట్వా = చూచి, ధర్మతః = ధర్మానుసారము, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, ఆవేద్య = తెలిపి (ఇచ్చి), సుఖమ్ = సుఖముగా, ఆసీనమ్ = కూర్చొని ఉన్న అతనిని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. యముడు అక్కడికి వచ్చిన నారదమహర్షిని చూచి, ధర్మానుసారము అర్ఘ్యము సమర్పించి, సుఖముగా కూర్చున్న అతనితో ఇట్లు పలికెను. 3

మూ. కచ్చిత్ క్షేమం ను దేవర్షే కచ్చిద్ధర్మో న నశ్యతి,
కిమాగమనకృత్యం తే దేవగన్ధర్వసేవిత. 4

ప్ర. అ. దేవర్షే = ఓ ! దేవర్షి ! క్షేమం కచ్చిత్ ను = క్షేమమే కదా? ధర్మః = ధర్మము, న నశ్యతి కచ్చిత్=నశించుటలదు కదా? దేవగన్ధర్వసేవిత= దేవతలచేతను గంధర్వులచేతను సేవించబడినవాడా ! తే = నీయొక్క, ఆగమనకృత్యమ్ = వచ్చుటకు పని, కిమ్ = ఏమి?

తా. దేవర్షి! అంతా క్షేమమే కద? ధర్మము నశించుటలేదు కద? దేవతలచేతను, గంధర్వులచేతను సేవించబడే ఓ! మునీ! నీవు వచ్చిన పని ఏమి? 4

మూ. అబ్రవీత్తు తదా వాక్యం నారదో భగవానృషిః,
శ్రూయతామభిధాస్యామి విధానం చ విధీయతామ్. 5

ప్ర. అ. తదా=అప్పుడు, భగవాన్=పూజ్యుడైన, నారదః ఋషిః=నారదమహర్షి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను, అభిధాస్యామి=చెప్పెదను. శ్రూయతామ్ = వినబడుగాక, విధానం చ = ఉపాయము, విధీయతామ్ = చేయబడుగాక.

తా. నారదమహర్షి ఆ వాక్యము విని ఇట్లు పలికెను. చెప్పెదను, వినుము. తగు ఉపాయము కూడ చేయుము. 5

మూ. ఏష నామ్నా దశగ్రీవః పితృరాజ నిశాచరః,
ఉపయాతి వశం నేతుం విక్రమైస్త్వాం సుదుర్జయమ్. 6

ప్ర. అ. పితృరాజ=యమధర్మరాజా ! నామ్నా=పేరుచేత, దశగ్రీవః= దశగ్రీవు డను, ఏషః = ఈ, నిశాచరః = రాక్షసుడు, సుదుర్జయమ్ = జయింప శక్యము కాని, త్వామ్ = నిన్ను, విక్రమైః = పరాక్రమములచేత, వశం నేతుమ్= వశము పొందించుకొనుటకు, ఉపయాతి = వచ్చుచున్నాడు.

తా. యమధర్మరాజా ! దశగ్రీవు డనే ఈ రాక్షసుడు జయింప శక్యము కాని నిన్ను పరాక్రమములచేత జయించుటకై వచ్చుచున్నాడు. 6

మూ. ఏతేన కారణేనాహం త్వరితో హ్యాగతః ప్రభో,
దణ్డప్రహరణస్యాద్య తవ కిం ను భవిష్యతి. 7

ప్ర. అ. ప్రభో = సమర్థుడా ! ఏతేన = ఈ, కారణేన = కారణముచేత, అహమ్ = నేను, త్వరితః = తొందరపడుచున్నవాడనై, ఆగతః హి=వచ్చినాను. దణ్డప్రహరణస్య = దండము ఆయుధముగా గల, తవ=నీకు, అద్య=ఇప్పుడు, కిమ్ = ఏమి, భవిష్యతి ను = కాగలదో.

తా. ప్రభూ ! ఈ కారణముచేత నేను దండము ఆయుధముగా ధరించిన నీకు ఇప్పుడు ఏమగునో చూచుటకై తొందరగా వచ్చినాను. 7

మూ. ఏతస్మిన్నన్తరే దూరాదంశుమన్తమివోదితమ్,
దదృశుర్దీప్తమాయాన్తం విమానం తస్య రక్షసః. 8

ప్ర. అ. ఏతస్మిన్ అన్తరే = ఈ మధ్యలో, తస్య రక్షసః = ఆ రాక్షసుని యొక్క, ఉదితమ్ = ఉదయించిన, అంశుమన్తమివ = సూర్యుడు వలె ఉన్న, ఆయాన్తమ్ = వచ్చుచున్న, దీప్తమ్ = ప్రకాశించుచున్న, విమానమ్ = విమానమును, దూరాత్ = దూరమునుండియే, దదృశుః = చూచిరి.

తా. ఇంతలో వారికి ఆ రాక్షసుని విమానము దూరమునుండి కనబడెను. అది ఉదయించిన సూర్యుడు వలె ప్రకాశించుచుండెను. 8

మూ. తం దేశం ప్రభయా తస్య పుష్పకస్య మహాబలః,
కృత్వా వితిమిరం సర్వం సమీపమభ్యవర్తత. 9

ప్ర. అ. మహాబలః=గొప్ప బలము గల రావణుడు, తస్య పుష్పకస్య=

ఆ పుష్పకముయొక్క, ప్రభయా = కాంతిచేత, తం దేశమ్ = ఆ ప్రదేశమును, సర్వమ్=అంతనూ, వితిమిరమ్=చీకటి లేనిదానినిగా, కృత్వా=చేసి, సమీపమ్= సమీపమును, అభ్యవర్తత = చేరెను.

తా. మహాబలవంతుడైన ఆ రావణుడు ఆ విమానము కాంతిచేత ఆ ప్రదేశము నంతనూ చీకటి లేనిదానినిగా చేయుచు సమీపించెను. 9

మూ. సోఽపశ్యత్స మహాబాహుర్దశగ్రీవస్తత స్తతః,
ప్రాణినః సుకృతం చైవ భుఞ్జానాంశ్చైవ దుష్కృతమ్.

ప్ర. అ. సః = ప్రసిద్ధుడైన, మహాబాహుః = గొప్ప బాహువులు గల, సః దశగ్రీవః = ఆ రావణుడు, తతస్తతః=ఆ యా ప్రదేశములలో, సుకృతం చైవ= పుణ్యమును, దుష్కృతం చైవ = పాపమును, భుఞ్జానాన్ = అనుభవించుచున్న, ప్రాణినః = ప్రాణులను, అపశ్యత్ = చూచెను.

తా. మహాబాహువైన ఆ రావణుడు అక్కడక్కడ పుణ్యఫలమును, పాప ఫలమునూ అనుభవించుచున్న ప్రాణులను చూచెను. 10

మూ. అపశ్యత్ సైనికాంశ్చాస్య యమస్యానుచరైః సహ,
యమస్య పురుషైరుగ్రై ర్ఘోరరూపైర్భయానకైః. 11
దదర్శ వధ్యమానాంశ్చ క్లిశ్యమానాంశ్చ దేహినః,
క్రోశతశ్చ మహానాదం తీవ్రనిష్టనతత్పరాన్. 12

ప్ర. అ. తత్ర = అక్కడ, యమస్య = యమునియొక్క, అనుచరైః సహ = అనుచరులతో కూడ, అస్య = వీనియొక్క, సైనికాంశ్చ = సైనికులను కూడ, అపశ్యత్ = చూచెను. ఉగ్రైః = ఉగ్రులైన, ఘోరరూపైః = ఘోరములైన రూపములు గల, భయానకైః=భయంకరులైన, యమస్య పురుషైః=యమ భటులచేత, వధ్యమానాన్ చ = కొట్టబడుచున్న, క్లిశ్యమానాన్ = బాధ పెట్టబడు చున్న, మహానాదమ్ = గొప్ప ధ్వని కలుగునట్లుగా, క్రోశతః చ=అరచుచున్న, తీవ్రనిష్టనతత్పరాన్ = తీవ్రమైన ధ్వనియందు ఆసక్తులైన, దేహినః చ = ప్రాణులను కూడ, దదర్శ = చూచెను.

తా. అక్కడ అతడు యముని అనుచరులను, సైనికులను చూచెను. క్రూరులు, ఘోరములైన రూపములు గలవారు, భయంకరులు అయిన యమ భటులు కొట్టుచు బాధించుచుండగా బిగ్గరగా గొప్పధ్వనితో అరచుచున్న ప్రాణులను కూడ చూచెను. 11, 12

మూ. కృమిభిర్భక్ష్యమాణాంశ్చ సారమేయైశ్చ దారుణైః,
శ్రోత్రాయాసకరా వాచో వదతశ్చ భయావహాః. 13

ప్ర. అ. కృమిభిః = కృములచేతను, దారుణైః = భయంకరములైన, సారమేయైశ్చ = కుక్కలచేతను, భక్ష్యమాణాన్ = భక్షింపబడుచున్నవారిని, శ్రోత్రాయాసకరాః = చెవులకు శ్రమను కలిగించు, భయావహాః = భయంకరములైన, వాచః = వాక్కులను, వదతశ్చ = పలుకుచున్నవారినీ (చూచెను.)

తా. కొందరు ప్రాణులను కృములు (పురుగులు), భయంకరములైన కుక్కలు తినివేయుచుండెను. కొందరు చెవులకు చాలా పరుషముగా ఉన్న భయంకరములైన మాటలు పలుకుచుండిరి. 13

మూ. సంతార్యమాణాన్ వైతరిణీం బహుశః శోణితోదకామ్,
వాలుకాసు చ తప్తాసు తప్యమానాన్ ముహుర్ముహుః. 14

ప్ర. అ. బహుశః = అనేకవిధములుగా, శోణితోదకామ్ = రక్తము ఉదకముగా గల, వైతరిణీమ్ = వైతరిణీనదిని, సంతార్యమాణాన్ = దాటింపచేయబడుచున్నవారిని, తప్తాసు = వేడిచేయబడిన, వాలుకాసు = ఇసుకలమీద, ముహుర్ముహుః = మాటిమాటికి, తప్యమానాన్ = కాల్చబడుచున్నవారిని (చూచెను).

తా. కొందరిని అనేకవిధములుగా రక్తమే ఉదకముగా గల వైతరిణీ నదిని దాటించుచుండిరి. మరికొందరిని బాగా వేడిచేసిన ఇసుకమీద పడవేసి మాటి మాటికి కాల్చుచుండిరి. 14

మూ. అసిపత్రవనే చైవ భిద్యమానానధార్మికాన్,
రౌరవే క్షారనద్యాం చ క్షురధారాసు చైవ హి. 15

ప్ర. అ. అసిపత్రవనే చైవ = కత్తుల వంటి ఆకులు గల వనమునందు,

భిద్యమానాన్ = భేదింపబడుచున్న, అధార్మికాన్ = పాపాత్ములను, రౌరవే = రౌరవనరకమునందు, క్షారనద్యాం చ = కారమునీళ్ళు ఉన్న నదియందు, క్షుర ధారాసు చైవ = కత్తుల పదనైన అగ్రభాగములమీదా బాధింపబడుచున్నవారిని (చూచెను).

తా. కొందరు పాపాత్ములను అసిపత్రవనములో నడిపించి వారి దేహములు తెగిపోవునట్లు చేయుచుండిరి. కొందరిని రౌరవనరకములోని క్షారనది లోను, కత్తుల అగ్రభాగములమీద పడవేయుచుండిరి. 15

మూ. పానీయం యాచమానాంశ్చ తృషితాన్ క్షుధితానపి,
శవభూతాన్ కృశాన్ దీనాన్ వివర్ణాన్ ముక్తమూర్ధజాన్.

ప్ర. అ. పానీయమ్ = జలమును, యాచమానాన్ = యాచించుచున్న, తృషితాన్ = దప్పికొన్నవాళ్ళను, క్షుధితానపి = ఆకలిగొన్నవాళ్ళను, శవభూతాన్ = శవముల వలె అయిపోయినవాళ్ళను, కృశాన్ = చిక్కినవాళ్ళను, దీనాన్ = దీనులను, వివర్ణాన్ = మారిపోయిన రంగు గలవార్లను, ముక్తమూర్ధజాన్ = విడవ బడిన కేశములు కలవాళ్ళను (చూచెను).

తా. అక్కడ ఆకలితో, దప్పికతో బాధపడుచున్న కొందరు జలమును యాచించుచుండిరి. కొందరు కృశించి, దీనులై, రంగు మారి, జుట్టు విరబోసికొని శవముల వలె ఉండిరి. 16

మూ. మలపఙ్కధరాన్ దీనాన్ రూక్షాంశ్చ పరిధావతః,
దదర్శ రావణో మార్గే శతశోఽథ సహస్రశః. 17

ప్ర. అ. రావణః = రావణుడు, మార్గే = మార్గమునందు, మలపఙ్కధ రాన్ = మలమును బురదను ధరించినవారిని, దీనాన్ = దీనులను, రూక్షాన్ = మొరటుగా ఉన్నవాళ్ళను, పరిధావతః = ఇటు అటు పరుగెత్తుచున్నవాళ్ళను, శతశః = వందలకొలది, అథ = మరియు, సహస్రశః = వేలకొలది, దదర్శ = చూచెను.

తా. రావణుడు మార్గములో మలముతోను, పంకముతోను నిండిన దేహాలు కలవారిని దీనులను, మొరటుగా ఉన్నవారిని, ఇటు అటు పరుగులెత్తుచున్న వాళ్ళను, వందలకొలది, వేలకొలది ప్రాణులను చూచెను. 17

మూ. కాంశ్చిచ్చ గృహముఖ్యేషు గీతవాదిత్రనిస్వనైః,
ప్రమోదమానానద్రాక్షీద్రావణః సుకృతైః స్వకైః. 18

ప్ర. అ. స్వకైః = తమ సంబంధమైన, సుకృతైః = పుణ్యములచేత, గృహముఖ్యేషు = శ్రేష్ఠములైన గృహములలో, గీతవాదిత్రనిస్వనైః = గీతముల యొక్క వాద్యములయొక్క ధ్వనులతో, మోదమానాన్ = సంతోషించుచున్న, కాంశ్చిత్ చ = కొందరిని కూడ, రావణః = రావణుడు, అద్రాక్షీత్ = చూచెను.

తా. కొందరు తాము చేసిన పుణ్యములకు ఫలముగా ఉత్తమములైన గృహములలో సంగీతవాద్యధ్వనులతో సంతోషించుచుండిరి. వారిని కూడ రావణుడు చూచెను. 18

మూ. గోరసం గోప్రదాతారో అన్నం చైవాన్నదాయినః,
గృహాంశ్చ గృహదాతారః స్వకర్మఫలమశ్నతః. 19

ప్ర. అ. గోరసమ్ = గోరసమును (పాలుపెరుగు నెయ్యి మొదలైన వాటిని) అనుభవించుచున్న, గోప్రదాతారః = గోదానము చేసినవాళ్ళను, అన్నం చైవ = అన్నమును తినుచున్న, అన్నదాతారః = అన్నదాతలను, గృహాన్ చ = గృహములను అనుభవించుచున్న, గృహదాతారః=గృహదానము చేసినవాళ్ళను, స్వకర్మఫలమ్ = తమ కర్మల ఫలమును, అశ్నతః = అనుభవించుచున్నవారిని, చూచెను.

తా. గోదానములు చేసినవాళ్ళు గోరసమును, అన్నదానము చేసినవాళ్ళు అన్నమును, గృహదానము చేసినవారు గృహాలను ఈ విధముగ ఆ పుణ్యాత్ములు తమ తమ పుణ్యముల ఫలములను అనుభవించుచుండిరి. 19

మూ. సువర్ణమణిముక్తాభిః ప్రమదాభిరలంకృతాన్.
ధార్మికానపరాంస్తత్ర దీప్యమానాన్ స్వతేజసా. 20
దదర్శ స మహాబాహూ రావణో రాక్షసాధిపః.

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులుకల, రాక్షసాధిపః = రాక్షసరాజైన, సః = ఆ, రావణః = రావణుడు, సువర్ణ మణిముక్తాభిః = బంగారముచేతను, మణులచేతను, ముత్యములచేతను, అలంకృతాన్ = అలంకరించబడినవారు, ప్రమ

దాభిః=స్త్రీలతో కూడిన వారు, స్వతేజసా=తమ తేజస్సుతో, దీప్యమానాన్=ప్రకాశించుచున్నవారు అయిన, అపరాన్ = మరి కొందరు, ధార్మికాన్ = ధార్మికులను, దదర్శ=చూచెను.

తా. గొప్ప బాహువులు గల, రాక్షసరాజైన ఆ రావణుడు అక్కడ తమ తేజస్సుతో ప్రకాశించుచున్న మరికొందరు ధార్మికులను కూడ చూచెను. వారు బంగారము, మణులు, ముత్యములు అలంకరించుకొని స్త్రీలతో విహరించుచుండిరి. 20

మూ. తతస్తాన్భిద్యమానాంశ్చ కర్మభిర్దుష్కృతైః స్వకైః, 21
రావణో మోచయామాన విక్రమేణ బలాద్బలీ.

ప్ర. అ. తతః=అటు పిమ్మట, బలీ=బలవంతుడైన, రావణః=రావణుడు, స్వకైః=తమ సంబంధమైన, దుష్కృతైః=పాపరూపములైన, కర్మభిః=కర్మలచేత, భిద్యమానాన్ = భేదించబడుచున్న, తాన్ = ఆ పాపాత్ములను, బలాత్= బలాత్కారముగా, విక్రమేణ = పరాక్రమముచేత, మోచయామాస=విడిపించెను.

తా. పిమ్మట బలవంతుడైన రావణుడు తమ పాపములకు ఫలితముగా చీల్చివేయబడుచున్న ఆ పాపాత్ములను బలాత్కారముగా, పరాక్రమముచేత విడిపించెను. 21

మూ. ప్రాణినో మోక్షితాస్తేన దశగ్రీవేణ రక్షసా, 22
సుఖమాపుర్ముహూర్తం తే హ్యతర్కితమచిన్తితమ్.

ప్ర. అ. రక్షసా = రాక్షసుడైన, తేన దశగ్రీవేణ= ఆ రావణునిచేత, మోక్షితాః = విడిపించబడిన, తే = ఆ, ప్రాణినః = ప్రాణులు, అతర్కితమ్ = ఊహించబడని, అచిన్తితమ్ = ఆలోచించబడని, సుఖమ్ = సుఖమును, ముహూర్తమ్ = ముహూర్తకాలము, ఆపుః = పొందిరి.

తా. రావణునిచేత విడిపింపబడిన ఆ ప్రాణులు క్షణకాలముపాటు తలవని విధముగా, ఊహింప శక్యముకాకుండగా వచ్చిన సుఖమును పొందిరి. 22

మూ. ప్రేతేషు ముచ్యమానేషు రాక్షసేన మహీయసా, 23
ప్రేతగోపాః సుసంక్రుద్ధా రాక్షసేన్ద్రమభిద్రవన్.

ప్ర. అ. మహీయసా=గొప్పవాడైన, రాక్షసేన=రాక్షసునిచేత, ప్రేతేషు = ఆ ప్రేతలు, ముచ్యమానేషు = విడిపింపబడుచున్నవారగుచుండగా, ప్రేతగోపాః=ప్రేతలను రక్షించేవారు, సుసంక్రుద్ధాః=చాల కోపించినవారై, రాక్షసేన్ద్రమ్=రాక్షసరాజును గూర్చి, అభిద్రవన్=పరుగెత్తి వెళ్ళిరి.

తా. మహాబలశాలియైన ఆ రావణుడు ప్రేతలను (మరణించి యమలోకములో ఉన్నవారిని) విడిపించుచుండగా, ఆ ప్రేతలకు కావలాగా ఉన్న వాళ్ళు చాల కోపముతో ఆ రావణునిమీదికి శీఘ్రముగా యుద్ధానికి వెళ్ళిరి. 23

మూ. తతో హలహలాశబ్దః సర్వదిగ్భ్యః సముత్థితః, 24
ధర్మరాజస్య యోధానాం శూరాణాం సంప్రధావతామ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సంప్రధావతామ్=పరుగెత్తి వచ్చుచున్న, శూరాణామ్=శూరులైన, ధర్మరాజస్య=యమధర్మరాజుయొక్క, యోధానామ్ = యోధులయొక్క, హలహలాశబ్దః=కోలాహలము, సర్వదిగ్భ్యః=అన్ని దిక్కులనుండి, సముత్థితః=లేచినది.

తా. అప్పుడు యముని యోధులు పరుగెత్తి వచ్చుచుండగా అన్ని దిక్కులనుండి కోలాహలము వినబడెను. 24

మూ. తే ప్రాసైః పరిఘైః శూలైర్ముసలైః శక్తితోమరైః, 25
పుష్పకం సమవర్షన్త శూరాః శతసహస్రశః.

ప్ర. అ. శతసహస్రశః = వందలకొలది వేలకొలది, తే శూరాః=ఆ శూరులు, ప్రాసైః=ప్రాసలచేతను, పరిఘైః=పరిఘలచేతను, శూలైః=శూలములచేతను, ముసలైః=ముసలములచేతను, శక్తితోమరైః=శక్తులచేతను తోమరములచేతను, పుష్పకమ్=పుష్పకమును, సమవర్షన్త=వర్షించిరి.

తా. వందలకొలది, వేలకొలది ఉన్న ఆ శూరులైన యోధులు ప్రాసలు, పరిఘలు, శూలములు, ముసలములు, శక్తులు, తోమరములు పుష్పకముమీద వర్షించిరి. 25

మూ. తస్యాసనాని ప్రాసాదాన్వేదికాస్తోరణాని చ, 26
పుష్పకస్య బభఞ్జుస్తే శీఘ్రం మధుకరా ఇవ.

ప్ర. అ. తే = ఆ యోధులు, మధుకరా ఇవ = తేనెటీగల వలె, తస్య పుష్పకస్య = ఆ పుష్పకముయొక్క, ఆసనాని = ఆసనములను, ప్రాసాదాన్ = మేడలను, వేదికాః = అరుగులను, తోరణాని చ = ముఖద్వారములను, శీఘ్రమ్ = శీఘ్రముగా, బభఞ్జుః = విరిచివేసిరి.

తా. ఆ యోధులు తేనెటీగల వలె శీఘ్రముగా ముసురుకొని ఆ పుష్పకములోని ఆసనాలను, ప్రాసాదములను, వేదికలను, తోరణాలను విరుగగొట్టిరి. 26

మూ. దేవనిష్ఠానభూతం తద్విమానం పుష్పకం మృధే, 27
భజ్యమానం తథైవాసీదక్షయ్యం బ్రహ్మతేజసా.

ప్ర. అ. మృధే = యుద్ధమునందు, భజ్యమానమ్ = విరుగగొట్టబడుచున్న, దేవనిష్ఠానభూతమ్ = దేవతలకు స్థానమైన, తత్ = ఆ, పుష్పకం విమానమ్ = పుష్పకవిమానము, బ్రహ్మతేజసా = బ్రహ్మదేవుని తేజస్సుచేత, అక్షయమ్ = నాశరహితమై, తథైవ = వెనుకటి వలెనే, ఆసీత్ = ఉండెను.

తా. దేవతలు ఎక్కే ఆ పుష్పకవిమానము యుద్ధములో యోధులు పగలగొట్టుచున్నను బ్రహ్మదేవుని తేజస్సుచేత నశించకుండా పూర్వమువలెనే ఉండెను.

మూ. అసంఖ్యా సుమహత్యాసీత్తస్య సేనా మహాత్మనః, 28
శూరాణామగ్రయాత్యాణాం సహస్రాణి శతాని చ.

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, తస్య = యమునియొక్క, సేనా = సేన, అసంఖ్యా = సంఖ్య లేనిదై, సుమహతీ = చాల పెద్దదిగా, ఆసీత్ = ఉండెను. అగ్రయాత్యాణామ్ = ముందు వెళ్ళే, శూరాణామ్ = శూరులయొక్క, సహస్రాణి చ = సహస్రములు, శతాని చ = శతములు ఉండెను.

తా. మహాత్ముడైన ఆ యముని గొప్ప సేన లెక్కలేకుండ ఉండెను. వందలకొలది, వేలకొలది శూరులు ముందుకు వచ్చుచుండిరి. 28

మూ. తతో వృక్షైశ్చ శైలైశ్చ ప్రాసాదానాం శతైస్తథా, 29
తతస్తే సచివాస్తస్య యథాకామం యథాబలమ్,
అయుధ్యన్త మహావీరాః స చ రాజా దశాననః. 30

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తస్య = రావణునియొక్క, మహావీరాః = గొప్ప వీరులైన, తే సచివాః = ఆ సచివులు, తతః = అటుపిమ్మట, వృక్షైశ్చ = వృక్షములచేతా, శైలైశ్చ = పర్వతములచేతా, తథా = మరియు, ప్రాసాదానామ్ = ప్రాసాదములయొక్క, శతైః = శతములచేత, యథాకామమ్ = కోరికను అనుసరించి, యథాబలమ్ = బలమును అనుసరించి, అయుధ్యన్త = యుద్ధము చేసిరి. రాజా = రాజైన, సః దశాననః చ = ఆ రావణుడు కూడ యుద్ధముచేసెను.

తా. పిమ్మట మహావీరులైన ఆ రావణుని మంత్రులు, రావణుడు కూడ వృక్షములతోను, పర్వతములతోను, వందలకొలది ప్రాసాదములతోను యథేష్టముగా, బలానుసారముగా యుద్ధము చేసిరి. 29, 30

మూ. తే తు శోణితదిగ్ధాఙ్గాః సర్వశస్త్రసమాహతాః,
అమాత్యా రాక్షసేన్ద్రస్య చక్రురాయోధనం మహత్. 31

ప్ర. అ. శోణితదిగ్ధాఙ్గాః = రక్తముచేత పూయబడిన శరీరములు గల, సర్వశస్త్రసమాహతాః = అన్ని ఆయుధములచేత కొట్టబడిన, తే = ఆ, రాక్షసేన్ద్రస్య అమాత్యాః = రావణుని అమాత్యులు, మహత్ = గొప్ప, ఆయోధనమ్ = యుద్ధమును, చక్రుః = చేసిరి.

తా. అన్ని ఆయుధముల దెబ్బలు తిని రక్తముతో నిండిన దేహములు గల వారైన ఆ రావణుని అమాత్యులు గొప్ప యుద్ధము చేసిరి. 31

మూ. అన్యోన్యం తే మహాభాగా జఘ్నుః ప్రహరణైర్భృశమ్,
యమస్య చ మహాబాహో రావణస్య చ మన్త్రిణః. 32

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! యమస్య చ = యమునియొక్క, రావణస్య చ = రావణునియొక్క, మహాభాగాః = మహాభాగ్యవంతులైన, మన్త్రిణః = మంత్రులు, అన్యోన్యమ్ = పరస్పరము, ప్రహరణైః = ఆయుధములచేత, భృశమ్ = మిక్కిలి, జఘ్నుః = కొట్టిరి.

తా. రామా! యముని యోధులు మహాభాగ్యవంతులైన రావణుని మంత్రులు ఆయుధములతో పరస్పరమును అధికముగా కొట్టిరి. 32

మూ. అమాత్యాంస్తాంస్తు సంత్యజ్య యమయోధా మహాబలాః,
తమేవ చాభ్యధావన్త శూలవర్షైర్దశాననమ్. 33

ప్ర. అ. మహాబలాః = గొప్ప బలము గల, యమయోధాః = యముని యోధులు, తాన్ = ఆ, అమాత్యాన్ = అమాత్యులను, సంత్యజ్య = విడచి, శూల వర్షైః = శూలముల వర్షములచేత, తమ్ = ఆ, దశాననమేవ = రావణుని గూర్చి, అభ్యధావన్త = ఎదురుగా పరుగెత్తిరి.

తా. గొప్ప బలము గల ఆ యమయోధులు ఆ మంత్రులను విడచి, శూలములు వర్షించుచు ఆ రావణునిమీదికి శీఘ్రముగా వెళ్ళిరి. 33

మూ. తతః శోణితదిగ్ధాఙ్గః ప్రహారైర్జర్జరీకృతః,
ఫుల్లాశోక ఇవాభాతి పుష్పకే రాక్షసాధిపః. 34

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శోణితదిగ్ధాఙ్గః = రక్తముచేత పూయబడిన శరీరము గల, ప్రహారైః = ఆయుధములచేత, జర్జరీకృతః = శిథిలముగా చేయబడిన, రాక్షసాధిపః = రావణుడు, పుష్పకే = పుష్పకమునందు, ఫుల్లాశోక ఇవ = వికసించిన అశోకము వలె, ఆభాతి = ప్రకాశించుచున్నాడు.

తా. ఆయుధములచేత తూట్లుపడిన శరీరముపై రక్తముతో నిండిన ఆ రావణుడు పుష్పకవిమానమునందు వికసించిన అశోకవనము వలె ఉండెను. 34

మూ. స తు శూలగదాప్రాసా శక్తితోమరసాయకాన్,
ముసలాని శిలావృక్షాన్ముమోచాస్త్రబలాద్బలీ. 35

ప్ర. అ. బలీ = బలము గల, స చ = ఆ రావణుడు కూడ, అస్త్రబలాత్ = అస్త్రబలమువలన, శూలగదాప్రాసాన్ = శూలములను, గదలను, ప్రాసలను, శక్తితోమరసాయకాన్ = శక్తులను, తోమరములను, బాణములను, ముసలాని = ముసలములను, శిలావృక్షాన్ = శిలలను, వృక్షములను, ముమోచ = విడచెను.

తా. బలవంతుడైన ఆ రావణుడైతే అస్త్రబలమువలన శూల-గదా-ప్రాస-శక్తి-తోమర-బాణములను, శిలలను, వృక్షములను ప్రయోగించెను. 35

మూ. తరూణాం చ శిలానాం చ శస్త్రాణాం చాతిదారుణమ్,
యమసైన్యేషు తద్వర్షం పపాత ధరణీతలే. 36

ప్ర. అ. తరూణాం చ=వృక్షములయొక్క, శిలానాం చ=శిలలయొక్క, శస్త్రాణాం చ = ఆయుధములయొక్క, అతిదారుణమ్= చాల దారుణమైన, తత్ = ఆ, వర్షమ్= వర్షము, యమసైన్యేషు= యముని సైన్యములయందు, ధరణీతలే= నేలమీదా, పపాత = పడెను.

తా. రావణుడు కురిపించిన చాల భయంకరమైన ఆ వృక్ష-శిలా-శస్త్రముల వర్షము యముని సైన్యములమీదా నేలమీదా పడెను. 36

మూ. తాంస్తు సర్వాన్ వినిర్భిద్య తదస్త్రమపహత్య చ,
జఘ్నుస్తే రాక్షసం ఘోరమేకం శతసహస్రశః. 37

ప్ర. అ. శతసహస్రశః = వందలకొలది వేలకొలది ఉన్న, తే= ఆ యోధులు, తాన్ = ఆ, సర్వాన్ = అన్నింటిని, వినిర్భిద్య= బ్రద్దలుకొట్టి, తదస్త్రమ్= వాని అస్త్రమును, అపహత్య చ = కొట్టి, ఘోరమ్= భయంకరుడైన, ఏకమ్=ఒక్క, తం రాక్షసమ్=ఆ రాక్షసుణ్ణి, జఘ్నుః=కొట్టిరి.

తా. వందలకొలది వేలకొలది ఉన్న ఆ యోధులు వాటిని అన్నింటిని బ్రద్దలుకొట్టి, రావణుని అస్త్రమును కొట్టివేసి భయంకరుడైన ఆ ఒక్క రాక్షసుణ్ణి కొట్టిరి. 37

మూ. పరివార్య చ తం సర్వే శైలం మేఘోత్కరా ఇవ,
భిన్దిపాలైశ్చ శూలైశ్చ నిరుచ్ఛ్వాసమపోథయన్. 38

ప్ర. అ. సర్వే= వాళ్ళందరూ, మేఘోత్కరాః=మేఘసముదాయములు, శైలమివ= పర్వతమును వలె, తమ్= వానిని, పరివార్య= చుట్టుముట్టి, భిన్దిపాలైశ్చ= భిందిపాలములచేత, శూలైశ్చ=శూలములచేత, నిరుచ్ఛ్వాసమ్=ఊపిరి తిరగకుండేటట్లు, అపోథయన్=కుమ్మివేసిరి.

తా. ఆ యోధు లందరూ, మేఘముల సముదాయము పర్వతమును వలె అతనిని చుట్టుముట్టి భిందిపాలములచేత, శూలముచేత అతనిని ఊపిరి సలపకుండా కుమ్మివేసిరి. 38

మూ. విముక్తకవచః క్రుద్ధః సిక్తః శోణితవిస్రవైః,
తతః స పుష్పకం త్యక్త్వా పృథివ్యామవతిష్ఠత. 39

ప్ర. అ. తతః = అటు పిమ్మట, విముక్తకవచః = విడవబడిన కవచము గలవాడు, శోణితవిస్రవైః = రక్తప్రవాహములచేత, సిక్తః = తడపబడినవాడు అయిన, సః = అతడు, క్రుద్ధః = కోపించినవాడై, పుష్పకమ్ = పుష్పకమును, త్యక్త్వా = విడచి, పృథివ్యామ్ = నేలమీద, అవతిష్ఠత = నిలచెను.

తా. అప్పుడు కవచము జారిపోగా, రక్తప్రవాహములచేత తడిసిన రావణుడు కోపించి, పుష్పకమును వదలి నేలమీద నిలచెను. 39

మూ. తతః సకార్ముకీ బాణీ సమరే చాభివర్ధత,
లబ్ధసంజ్ఞో ముహూర్తేన క్రుద్ధస్తస్థౌ యథాన్తకః. 40

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కార్ముకీ = ధనస్సు కలవాడు, బాణీ = బాణములు గలవాడు అయిన, సః = అతడు, సమరే = యుద్ధమునందు, అభివర్ధత = వృద్ధిపొందెను. ముహూర్తేన = ముహూర్తముచేత, లబ్ధసంజ్ఞః = పొందబడిన సంజ్ఞగల, క్రుద్ధః = కోపించిన అతడు, అన్తకఃయథా = యముడు వలె, తస్థౌ = నిలచెను.

తా. పిమ్మట ధనుర్బాణములు ధరించిన ఆతడు యుద్ధమునందు ఉత్సాహవంతు డయ్యెను. ముహూర్తకాలములో సంజ్ఞ పొందిన ఆతడు కోపించి యముడు వలె నిలచెను. 40

మూ. తతః పాశుపతం దివ్యమస్త్రం సంధాయ కార్ముకే,
తిష్ఠ తిష్ఠేతి తానుక్త్వా తచ్చాపం వ్యపకర్షత. 41

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దివ్యమ్ = దివ్యమైన, పాశుపతమ్ అస్త్రమ్ = పాశుపతాస్త్రమును, కార్ముకే = ధనస్సునందు, సంధాయ = సంధించి, తిష్ఠ తిష్ఠ ఇతి = నిలువుము, నిలువుము అని, తాన్ = వాళ్ళను గూర్చి, ఉక్త్వా = పలికి, తత్ = ఆ, చాపమ్ = ధనస్సును, వ్యపకర్షత = లాగెను.

తా. పిమ్మట అతడు పాశుపతాస్త్రమును ధనస్సుమీద సంధించి "నిలువుము, నిలువుము" అని వాళ్ళతో పలుకుచు ఆ ధనస్సును లాగెను. 41

మూ. ఆకర్ణాత్స వికృష్యాథ చాపమిన్ద్రారిరాహవే,
ముమోచ తం శరం క్రుద్ధస్త్రిపురే శంకరో యథా. 42

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ఇన్ద్రారిః = ఇంద్రునిశత్రువైన, సః = ఆ రావణుడు, ఆహవే = యుద్ధమునందు, చాపమ్ = ధనస్సును, వికృష్య = లాగి, క్రుద్ధః = కోపించినవాడై, త్రిపురే = త్రిపురమునందు, శంకరో యథా = శంకరుడు వలె, తం శరమ్ = ఆ బాణమును, ముమోచ = విడచెను.

తా. పిమ్మట యుద్ధములో ఆ ధనస్సును లాగి, రావణుడు చాల కోపించి, త్రిపురములమీద శంకరుడు ప్రయోగించి నట్లు ఆ బాణమును ప్రయోగించెను. 42

మూ. తస్య రూపం శరస్యాసీత్సధూమజ్వాలమణ్డలమ్,
వనం దహిష్యతో ఘర్మే దావాగ్నేరివ మూర్ఛతః. 43

ఘర్మే = గ్రీష్మమునందు, వనమ్ = వనమును, దహిష్యతః = కాల్చనున్న, మూర్ఛతః = వ్యాపించుచున్న, దావాగ్నేరివ = దావాగ్నియొక్క వలె, తస్య శరస్య = ఆ బాణముయొక్క, రూపమ్ = రూపము, సధూమజ్వాలమణ్డలమ్ = ధూమముతోను జ్వాలామండలముతోను కూడినది, ఆసీత్ = ఆయెను.

తా. ఆ బాణము రూపము, గ్రీష్మకాలములో వనమును కాల్చివేయ నున్న వ్యాపించుచున్న దావాగ్ని రూపము వలె ధూమముతోను, జ్వాలామండలముతోను నిండి ఉండెను. 43

మూ. జ్వాలామాలీ స తు శరః క్రవ్యాదానుగతో రణే,
ముక్తో గుల్మాన్ ద్రుమాంశ్చాపి భస్మ కృత్వా ప్రధావతి.

ప్ర. అ. జ్వాలామాలీ = జ్వాలామాలలు గలది, క్రవ్యాదానుగతః = క్రూరమృగములచేత అనుసరించబడినది, రణే = యుద్ధమునందు, ముక్తః = విడవబడినదీ అయిన, సః శరః = ఆ బాణము, గుల్మాన్ = పొదలను, ద్రుమాంశ్చాపి = వృక్షములను, భస్మ = భస్మగా, కృత్వా = చేసి, ప్రధావతి = పరుగెత్తుచున్నది.

తా. యుద్ధములో ప్రయోగింపబడి జ్వాలల పంక్తులతో నిండినదై, తన

నుండియే పుట్టిన క్రూరమృగాంచేత అనుసరించబడిన ఆ బాణము పొదలను, వృక్షాలను భస్మముచేయుచు శీఘ్రముగా వెళ్లెను. 44

మూ. తే తస్య తేజసా దగ్ధాః సైన్యా వైవస్వతస్య తు,
బలే తస్మిన్నిపతితా మాహేన్ద్రా ఇవ కేతవః. 45

ప్ర. అ. తస్య = దానియొక్క, తేజసా = తేజస్సుచేత, దగ్ధాః = కాల్చి వేయబడిన, తే = ఆ, వైవస్యతస్య సైన్యాః = యముని సైన్యములు, మాహేన్ద్రాః = మహేంద్రుని సంబంధమైన, కేతవః ఇవ = ధ్వజములు వలె, తస్మిన్ = ఆ, బలే = సైన్యమునందు, నిపతితాః = పడిపోయిరి.

తా. ఆ యముని సైన్యములోని సైనికులు ఆ బాణము తేజస్సుచేత కాల్చ బడి, ఇంద్రధ్వజముల వలె పడిపోయిరి. 45

మూ. తతస్తు సచివైః సార్ధం రాక్షసో భీమవిక్రమః,
ననాద సుమహానాదం కమ్పయన్నివ మేదినీమ్. 46

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకవింశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, భీమవిక్రమః = భయంకరమైన పరాక్ర మము గల, రాక్షసః = రాక్షసుడు, సచివైః సార్ధమ్ = మంత్రులతో కూడ, మేదినీమ్ = భూమిని, కమ్పయన్నివ = కంపింపచేయుచున్నవాడు వలె, సుమహా నాదమ్ = చాల గొప్ప ధ్వని కలుగునట్లుగా, ననాద = ధ్వని చేసెను.

తా. అప్పుడు మంత్రులతో కూడిన ఆ భయంకర పరాక్రమవంతుడైన రావణుడు భూమిని కంపింపచేయుచున్నాడా అన్నట్లు బిగ్గరగా సింహనాదము చేసెను. 46

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
ఇరవైఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్వావింశః సర్గః

[*యమరావణుల మధ్య యుద్ధము జరుగుట, రావణుని చంపుటకై ఎత్తిన యమదండమును యముడు బ్రహ్మదేవుని ఆజ్ఞచేత ఉపసంహరించుట, రావణుడు విజయవంతుడై యమలోకమునుండి తిరిగి వెళ్లుట.*]

మూ. స తస్య తు మహానాదం శ్రుత్వా వైవస్వతః ప్రభుః,
శత్రుం విజయినం మేనే స్వబలస్య చ సంక్షయమ్. 1

ప్ర. అ. ప్రభుః = ప్రభువైన, సః వైవస్వతః = ఆ యముడు, తస్య = వానియొక్క, మహానాదమ్ = గొప్ప ధ్వనిని, శ్రుత్వా = విని, శత్రుమ్ = శత్రువును, విజయినమ్ = విజయవంతునిగా, మేనే = తలంచెను. స్వబలస్య = తన సైన్యముయొక్క, సంక్షయం చ = క్షయమును కూడ (తెలిసికొనెను.)

తా. ప్రభువైన యముడు అతని గొప్ప ధ్వనిని విని శత్రువు జయించినట్లు, తన సైన్యము క్షీణించినట్లు తెలుసుకొనెను. 1

మూ. స హి యోధాన్ హతాన్ మత్వా క్రోధసంరక్తలోచనః,
అబ్రవీత్త్వరితం సూతం రథో మ ఉపనీయతామ్. 2

ప్ర. అ. సః = అతడు, యోధాన్ = యోధులను, హతాన్ = చంపబడినవాళ్లనుగా, మత్వా = గ్రహించి, క్రోధసంరక్తలోచనః = క్రోధముచేత ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, మే = నాయొక్క, రథః=రథము, త్వరితమ్=శీఘ్రముగా, ఉపనీయతామ్ = తీసికొని రాబడుగాక అని, సూతమ్ = సారథిని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. తన యోధులు చంపబడినట్లు తెలిసికొని యముడు కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో "నా రథమును శీఘ్రముగా తీసికొని రమ్ము"అని సారథితో పలికెను. 2

మూ. తస్య సూతస్తదా దివ్యముపస్థాప్య మహారథమ్,
స్థితః స చ మహాతేజా అధ్యారోహత తం రథమ్. 3

ప్ర. అ. తదా = అప్పుడు, సూతః = సారథి, తస్య = అతనియొక్క, దివ్యమ్ = దివ్యమైన, మహారథమ్ = మహారథమును, ఉపస్థాప్య = తీసికొనివచ్చి, స్థితః = నిలబడినాడు. సః చ = అతడు, తం మహారథమ్ = ఆ మహారథమును, అధ్యారోహత = ఎక్కెను.

తా. అప్పుడా సారథి అతని దివ్యమైన రథమును తీసికొని వచ్చి నిలచెను. ఆ యముడు ఆ మహారథమును ఎక్కెను. 3

మూ. ప్రాసముద్గరహస్తశ్చ మృత్యుస్తస్యాగ్రతః స్థితః,
యేన సంక్షిప్యతే సర్వం త్రైలోక్యమిదమవ్యయమ్. 4

ప్ర. అ. యేన = ఏ మృత్యువుచేత, ఇదమ్ = ఈ, అవ్యయమ్ = నిత్యమైన, సర్వమ్ = సమస్తమైన, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, సంక్షిప్యతే = నశింపచేయబడునో, మృత్యుః = అట్టి మృత్యువు, ప్రాసముద్గరహస్తశ్చ = ప్రాసముద్గరములు హస్తములందు గలవాడై, తస్య = యముని యొక్క, అగ్రతః = ఎదుట, స్థితః = నిలచెను.

తా. నిత్యమైన ఈ మూడు లోకములను నశింపచేయుచుండు మృత్యు దేవుడు ప్రాసముద్గరములు హస్తములలో ధరించి వచ్చి యముని ఎదుట నిలబడెను.

మూ. కాలదణ్డస్తు పార్శ్వస్థో మూర్తిమానస్య చాభవత్,
యమప్రహరణం దివ్యం తేజసా జ్వలదగ్నిమత్. 5

ప్ర. అ. తేజసా = తేజస్సుతో, జ్వలత్ = మండుచున్న, అగ్నిమత్ = అగ్నికల, దివ్యమ్ = దివ్యమైన, యమప్రహరణమ్ = యముని ఆయుధము అయిన, కాలదణ్డః తు = కాలదండమైతే, మూర్తిమాన్ = మూర్తి ధరించినదై, అస్య = యమునకు, పార్శ్వస్థః = పార్శ్వమునం దున్నది, అభవత్ = ఆయెను.

తా. తేజస్సుతో ప్రజ్వలించుచున్నది, అగ్నితో కూడినది, యముని దివ్యమైన ఆయుధమూ అయిన కాలదండము ఆకారమును ధరించి యముని ప్రక్క నిలబడెను. 5

మూ. తస్య పార్శ్వేషు నిశ్ఛిద్రాః కాలపాశాః ప్రతిష్ఠితాః,
పావకస్పర్శసంకాశః స్థితో మూర్తశ్చ ముద్గరః. 6

ప్ర. అ. కాలపాశాః=కాలపాశములు, తస్య=అతనియొక్క, పార్శ్వేషు= పార్శ్వములయందు, నిశ్ఛిద్రాః = ఛిద్రము (అవకాశము) లేనివై, ప్రతిష్ఠితాః = నిలచినవి, పావకస్పర్శసంకాశః = అగ్నిస్పర్శతో సమానమైన, ముద్గరశ్చ = ముద్గరముకూడ, మూర్తః = మూర్తి ధరించినదై, స్థితః = నిలచినది.

తా. కాలపాశములు వచ్చి ఆతని ప్రక్కలయందు ఒకదాని ప్రక్క ఒకటిగా ఎడము లేకుండా నిలచినవి. అగ్నిస్పర్శ వంటి స్పర్శ గల ముద్గరము కూడ శరీరము ధరించి నిలచినది. 6

మూ. తతో లోకత్రయం క్షుబ్ధమకమ్పన్త దివౌకసః,
కాలం దృష్ట్వా తథా క్రుద్ధం సర్వలోకభయావహమ్. 7

ప్ర. అ. తతః = పిమ్మట, తథా = అట్లు, క్రుద్ధమ్ = కోపించిన, సర్వలోకభయావహమ్ = సకలలోకములకు భయము కలిగించు, కాలమ్ = యముణ్ణి, దృష్ట్వా = చూచి, లోకత్రయమ్ = లోకముల త్రయము, క్షుబ్ధమ్=క్షోభ చెందినది. దివౌకసః=దేవతలు, అకమ్పన్త = కంపించిరి.

తా. కోపించి సకలలోకములకు భయమును కలిగించుచున్న ఆ యముణ్ణి చూచి మూడు లోకములు క్షోభ చెందినవి. దేవతలు వణకి పోయిరి. 7

మూ. తతస్త్వచోదయత్సూతస్తానశ్వాన్ రుచిరప్రభాన్,
ప్రయయౌ భీమసంనాదో యత్ర రక్షఃపతిః స్థితః. 8

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సూతః తు = సారథి, రుచిరప్రభాన్ = అందమైన కాంతి గల, తాన్ = ఆ, అశ్వాన్ = గుఱ్ఱములను, అచోదయత్ = ప్రేరేపించెను. భీమసంనాదః=భయంకరమైన ధ్వని గల ఆ రథము, రక్షఃపతిః= రావణుడు, యత్ర = ఎక్కడ, స్థితః = ఉన్నాడో, అక్కడికి, ప్రయయౌ = వెళ్ళెను.

తా. పిదప సారథి అందమైన కాంతి గల అశ్వములను తోలెను. భయంకరమైన ధ్వని గల ఆ రథము రావణుడు ఉన్న చోటికి వెళ్ళెను. 8

మూ. ముహూర్తేన యమం తే తు హయా హరిహయోపమాః,
ప్రాపయన్ మనసస్తుల్యా యత్ర తత్ప్రస్తుతం రణమ్. 9

ప్ర. అ. హరిహయోపమాః = ఇంద్రుని అశ్వములతో సమానములైన, మనసః = మనస్సుకు, తుల్యాః = సమానములైన, తే హయాః = ఆ గుఱ్ఱములు, ముహూర్తేన = ముహూర్తకాలములో, తత్ = ఆ, రణమ్ = యుద్ధము, యత్ర = ఎక్కడ, ప్రస్తుతమ్ = ప్రారంభించబడినదో అక్కడికి, యమమ్ = యముణ్ణి, ప్రాపయన్ = పొందించినవి.

తా. మనోవేగము వంటి వేగము గల, ఇంద్రుని అశ్వముల వంటి అశ్వములు ముహూర్తకాలములో యముణ్ణి యుద్ధము జరుగుచున్న ప్రదేశమునకు తీసికొనివెళ్ళినవి. 9

మూ. దృష్ట్వా తథైవ వికృతం రథం మృత్యుసమన్వితమ్,
సచివా రాక్షసేన్ద్రస్య సహసా విప్రదుద్రువుః. 10

ప్ర. అ. రాక్షసేన్ద్రస్య = రావణునియొక్క, సచివాః = మంత్రులు, తథైవ = ఆ విధముగా, వికృతమ్ = భయంకరముగా ఉన్న, మృత్యుసమన్వితమ్ = మృత్యువుతో కూడిన, రథమ్ = రథమును, దృష్ట్వా = చూచి, సహసా = వెంటనే, విప్రదుద్రువుః = పారిపోయిరి.

తా. మృత్యుదేవతలతో కూడి భయంకరముగా ఉన్న ఆ రథమును చూడగానే రావణుని మంత్రులు పారిపోయిరి. 10

మూ. లఘుసత్త్వతయా తే హి నష్టసంజ్ఞా భయార్దితాః,
నేహ యోద్ధుం సమర్థాః స్మ ఇత్యుక్త్వా ప్రయయుర్దిశః.

ప్ర. అ. తే = వారు, లఘుసత్త్వతయా = అల్పబలము గలవారగుట చేత, నష్టసంజ్ఞాః = నష్టమైన సంజ్ఞ గలవారై, భయార్దితాః = భయపీడితులై, ఇహ = ఇక్కడ, యోద్ధుమ్ = యుద్ధముచేయుటకు, సమర్థాః = సమర్థులము, న స్మః = కాము, ఇతి = అని, ఉక్త్వా = పలికి, దిశః = దిక్కులను గూర్చి, ప్రయయుః = వెళ్ళిరి.

తా. వారు అల్పబలము కలవారగుటచేత సంజ్ఞ కోల్పోయి, భయపీడితులై

ఇక్కడ యుద్ధము చేయుటకు సమర్థులము కాము అని పలికి దిక్కులు పట్టి పారిపోయిరి. 11

మూ. స తు తం తాదృశం దృష్ట్వా రథం లోకభయావహమ్,
నాక్షుభ్యత దశగ్రీవో న చాపి భయమావిశత్. 12

ప్ర. అ. సః దశగ్రీవః తు = ఆ రావణుడైతే, లోకభయావహమ్ = లోకములకు భయమును కలిగించు, తం రథమ్ = ఆ రథమును, దృష్ట్వా = చూచి, నాక్షుభ్యత = కంగారుపడలేదు. భయం చాపి = భయమును కూడ, నావిశత్ = పొందలేదు.

తా. ఆ రావణుడు లోకములకు భయమును కలిగించు ఆ రథమును చూచి కంగారుపడలేదు, భయపడలేదు. 12

మూ. స తు రావణమాసాద్య వ్యసృజచ్ఛక్తితోమరాన్,
యమో మర్మాణి సంక్రుద్ధో రావణస్య న్యకృన్తత. 13

ప్ర. అ. సంక్రుద్ధః = కోపించిన, సః యమః = ఆ యముడు, రావణమ్ = రావణుని, ఆసాద్య = పొంది, శక్తితోమరాన్ = శక్తులను తోమరములను, వ్యసృజత్ = విడచెను. రావణస్య = రావణునియొక్క, మర్మాణి = మర్మస్థానములను, న్యకృన్తత = ఛేదించెను.

తా. ఆ యముడు కోపించి రావణుని సమీపించి శక్తులను తోమరములను వర్షించి వాని మర్మస్థానములను ఛేదించెను. 13

మూ. రావణస్తు తతః స్వస్థః శరవర్షం ముమోచ హ,
తస్మిన్ వైవస్వతరథే తోయవర్షమివామ్బుదః. 14

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రావణః = రావణుడు, స్వస్థః = స్వస్థుడై, తస్మిన్ = ఆ, వైవస్వతరథే = యముని రథముమీద, అమ్బుదః = మేఘము, తోయవర్షమివ = జలవర్షమును వలె, శరవర్షమ్ = బాణముల వర్షమును, వవర్ష హ = వర్షించెను.

తా. పిమ్మట రావణుడు స్వస్థుడై, మేఘము జలమును వర్షించినట్లు ఆ యముని రథముమీద బాణములు వర్షించెను. 14

మూ. తతో మహాశక్తిశతైః పాత్యమానైర్మహోరసి,
నాశక్నోత్ప్రతికర్తుం స రాక్షసః శరపీడితః. 15

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శరపీడితః = బాణములచేత పీడింపబడిన, సః రాక్షసః = ఆ రాక్షసుడు, మహోరసి = విశాలమైన వక్షస్థలముమీద, పాత్యమానైః = పడవేయబడుచున్న, మహాశక్తిశతైః = గొప్ప శక్తుల శతములచేత, ప్రతికర్తుమ్ = ప్రతిక్రియ చేయుటకు, నాశక్నోత్ = సమర్థుడు కాలేదు.

తా. బాణములచేత పీడింపబడిన ఆ రాక్షసుడు వందలకొలది శక్తులు తన విశాలమైన వక్షఃస్థలముమీద పడవేయబడుచుండగా వాటికి ప్రతిక్రియ చేయజాలకపోయెను. 15

మూ. ఏవం నానాప్రహరణైర్యమేనామిత్రకర్శిణా,
స సప్తరాత్రం కృతః సంఖ్యే విసంజ్ఞో విముఖో రిపుః. 16

ప్ర. అ. అమిత్రకర్శిణా = శత్రువులను పీడించు, యమేన = యముని చేత, నానాప్రహరణైః = అనేకవిధములైన ఆయుధములచేత, రిపుః = శత్రువు, సంఖ్యే = యుద్ధమునందు, సప్తరాత్రమ్ = ఏడు రాత్రులను, ఏవమ్ = ఈ విధముగా, విసంజ్ఞః = సంజ్ఞ లేనివాడుగాను. విముఖః = విముఖుడుగాను, కృతః = చేయబడినాడు.

తా. శత్రువులను పీడించు యముడు యుద్ధములో అనేకవిధములైన ఆయుధములు ప్రయోగించి ఏడు రోజులపాటు శత్రువును సంజ్ఞ లేనివానిని గాను యుద్ధపరాఙ్ముఖునిగాను చేసెను. 16

మూ. తదాసీత్తుములం యుద్ధం యమరాక్షసయోర్ద్వయోః,
జయమాకాఙ్క్షతోర్వీర సమరేష్వనివర్తినోః. 17

ప్ర. అ. వీర = వీరుడా ! జయమ్ = జయమును, ఆకాఙ్క్షతోః = కోరుచున్న, సమరేషు = యుద్ధములయందు, అనివర్తినోః = వెనకకు మరలని,

యమరాక్షసయోః = యమరాక్షసులకు, ద్వయోః = ఇద్దరికీ, తదా = అప్పుడు, తుములమ్ = వ్యాకులమైన, యుద్ధమ్ = యుద్ధము, ఆసీత్ = ఆయెను.

తా. వీరుడవైన రామా! జయమును కోరుచున్నవారూ, యుద్ధములనుండి ఎన్నడూ వెనుకకు మరలనివారూ అయిన ఆ యమరావణు లిద్దరికీ అప్పుడు చాల వ్యాకులమైన యుద్ధము జరిగెను. 17

మూ. తతో దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,
ప్రజాపతిం పురస్కృత్య సమేతా స్తత్రదణాజిరే. 18

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దేవాః = దేవతలు, సగన్ధర్వాః = గంధర్వులతో కూడిన, సిద్ధాశ్చ = సిద్ధులు, పరమర్షయః = గొప్ప ఋషులు, ప్రజాపతిమ్ = బ్రహ్మదేవుణ్ణి, పురస్కృత్య = ముందు ఉంచుకొని, తత్రదణాజిరే = ఆ యుద్ధభూమియందు, సమేతాః = కలిసిరి.

తా. అప్పుడు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు బ్రహ్మదేవునితో కలిసి ఆ యుద్ధరంగమునకు వచ్చిరి. 18

మూ. సంవర్త ఇవ లోకానాం యుధ్యతోరభవత్తదా,
రాక్షసానాం చ ముఖ్యస్య ప్రేతానామీశ్వరస్య చ. 19

ప్ర. అ. తదా = అప్పుడు, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, ముఖ్యస్య = ప్రభువు, ప్రేతానామ్ = మరణించినవారి, ఈశ్వరస్య చ = ప్రభువూ, యుధ్యతోః = యుద్ధముచేయుచుండగా, లోకానామ్ = లోకములయొక్క, సంవర్తః ఇవ = ప్రలయము వలె, అభవత్ = ఆయెను.

తా. అప్పుడు రావణుడు యముడు యుద్ధము చేయుచుండగా లోకములకు ప్రళయము వలె ఆయెను. 19

మూ. రాక్షసేన్ద్రోఽపి విస్ఫార్య చాపమిన్ద్రాశనిప్రభమ్,
నిరన్తరమివాకాశం కుర్వన్ బాణాం స్తతోఽసృజత్. 20

ప్ర. అ. రాక్షసేన్ద్రః అపి = రావణుడు కూడ, ఇన్ద్రాశనిప్రభమ్ = ఇంద్రుని వజ్రాయుధము వంటి కాంతి గల, చాపమ్ = ధనస్సును, విస్ఫార్య =

చరచి, తతః = అటుపిమ్మట, ఆకాశమ్ = ఆకాశమును, నిరన్తరమివ = అవకాశము లేనిదానిని వలె, కుర్వన్ = చేయుచు, బాణాన్ = బాణములను, అసృజత్ = విడచెను.

తా. రావణుడు కూడ ఇంద్రుని వజ్రాయుధము వంటి కాంతి గల ధనస్సును చరచి, ఆకాశమునందు అవకాశము లేకుండ చేయుచు బాణములు విడచెను. 20

మూ. మృత్యుం చతుర్భిర్విశిఖైః సూతం సప్తభిరార్దయత్,
యమం శతసహస్రేణ శీఘ్రం మర్మస్వతాడయత్. 21

ప్ర. అ. చతుర్భిః = నాలుగు, విశిఖైః = బాణములచేత, మృత్యుమ్ = మృత్యువును, సప్తభిః = ఏడు బాణములచేత, సూతమ్ = సారథిని, అర్దయత్ = పీడించెను. శతసహస్రేణ = లక్ష బాణములచేత, యమమ్ = యముణ్ణి, శీఘ్రమ్ = శీఘ్రముగా, మర్మసు = మర్మస్థానములయందు, అతాడయత్ = కొట్టెను.

తా. నాలుగు బాణాలతో మృత్యువును, ఏడు బాణాలతో సారథిని పీడించి లక్ష బాణములతో యముని మర్మస్థానములయందు కొట్టెను. 21

మూ. తతః క్రుద్ధస్య వదనాద్యమస్య సమజాయత,
జ్వాలామాలీ సనిఃశ్వాసః సధూమః కోపపావకః. 22

ప్ర. అ. తతః = అటుపిమ్మట, క్రుద్ధస్య = కోపించిన, యమస్య = యమునియొక్క, వదనాత్ = ముఖమునుండి, జ్వాలామాలీ = జ్వాలామాలలు గల, సధూమః = ధూమముతో కూడిన, సనిఃశ్వాసః=నిట్టూర్పులతో కూడిన, కోపపావకః = కోపాగ్ని, సమజాయత = పుట్టెను.

తా. అప్పుడు కోపించిన యముని ముఖమునుండి నిట్టూర్పులతో కలిసి జ్వాలామాలలతోను ధూమముతోను కూడిన కోపాగ్ని బయలుదేరెను. 22

మూ. తదాశ్చర్యమథో దృష్ట్వా దేవదానవసంనిధౌ,
ప్రహర్షితౌ సుసంరబ్ధౌ మృత్యుకాలౌ బభూవతుః. 23

ప్ర. అ. అథో = అటుపిమ్మట, దేవదానవసంనిధౌ=దేవదానవుల సంనిధి

యందు, తత్ = ఆ, ఆశ్చర్యమ్ = ఆశ్చర్యమును, దృష్ట్వా = చూచి, మృత్యుకాలౌ = మృత్యువు, కాలుఁడు, ప్రహర్షితౌ = సంతోషించినవారై, సుసంరబ్ధౌ = చాల తొందరపడుచున్నవారుగా, బభూవతుః = అయిరి.

తా. దేవదానవుల సంనిధియందు జరిగిన ఆ ఆశ్చర్యమును చూచి మృత్యుకాలులు సంతోషించుచు చాల తొందరపడిరి. 23

మూ. తతో మృత్యుః క్రుద్ధతరో వైవస్వతమభాషత,
ముఞ్చ మాం సమరే యావద్ధన్మీమం పాపరాక్షసమ్. 24

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మృత్యుః = మృత్యువు, క్రుద్ధతరః = మిక్కిలి కోపించినవాడై, వైవస్వతమ్ = యముణ్ణి గూర్చి, అభాషత = పలికెను. సమరే = యుద్ధమునందు, మామ్ = నన్ను, ముఞ్చ = విడువుము. ఇమమ్ = ఈ, పాపరాక్షసమ్ = పాపాత్ముడైన రాక్షసుణ్ణి, యావత్ హన్మి = చంపగలను.

తా. అప్పుడు మృత్యువు చాల కోపించి యమునితో ఇట్లు అనెను- "యుద్ధములో నన్ను ప్రయోగించుము. ఈ దుష్టరాక్షసుణ్ణి చంపివేసెదను. 24

మూ. నైషా రక్షో భవేదద్య మర్యాదా హి నిసర్గతః,
హిరణ్యకశిపుః శ్రీమాన్నముచిః శమ్బరస్తథా. 25

విసంధిర్ధూమకేతుశ్చ బలిర్వైరోచనోఽపి చ,
దమ్భుర్దైత్యో మహారాజో వృత్రో బాణస్తథైవ చ. 26

రాజర్షయః శాస్త్రవిదో గన్ధర్వాః సమహోరగాః,
ఋషయః పన్నగా దైత్యా యక్షాశ్చాప్యప్సరోగణాః. 27

యుగాన్తపరివర్తే చ పృథివీ సమహార్ణవా,
క్షయం నీతా మహారాజ సపర్వతసరిద్ద్రుమా. 28

ప్ర. అ. మహారాజ = మహారాజా ! అద్య = ఇప్పుడు, రక్షః = రాక్షసుడు, న భవేత్ = ఉండడు. ఏషా = ఇది, నిసర్గతః = స్వభావమువలన ఏర్పడిన, మర్యాదా హి = కట్టుబాటు కదా ? హిరణ్యకశిపుః = హిరణ్యకశిపుడు, శ్రీమాన్ =

శ్రీమంతుడైన, నముచిః = నముచి, తథా = మరియు, శమ్బరః = శంబరుడు, విసంధిః = విసంధి, ధూమకేతుశ్చ = ధూమకేతువు, వైరోచనః = విరోచనుని కుమారుడైన, బలిః = బలి, దైత్యః = దైత్యుడైన, దమ్భః = దంభుడు, మహారాజః = మహారాజైన, వృత్రః = వృత్రుడు, తథైవ చ = మరియు, బాణః = బాణుడు, శాస్త్రవిదః = శాస్త్రవేత్తలైన, రాజర్షయః = రాజర్షులు, సమహోరగాః = మహోరగులతో కూడిన, గన్ధర్వాః = గంధర్వులు, ఋషయః = ఋషులు, పన్నగాః = పన్నగులు, దైత్యాః = దైత్యులు, యక్షాః చ అపి = యక్షులు, అప్సరోగణాః = అప్సరఃస్త్రీగణములు, యుగాన్తపరివర్తే = యుగాంతమునందు వచ్చు ప్రళయమునందు, సమహార్ణవా = మహాసముద్రముతో కూడిన, సపర్వతసరిద్ద్రుమా = పర్వతములతోను నదులతోను వృక్షములతోను కూడిన, పృథివీ చ = భూమీ, క్షయమ్ = క్షయమును, నీతాః = పొందించబడిరి.

తా. మహారాజా! ఇప్పుడు ఈ రాక్షసుడు ఇంక జీవించకూడదు. ఇది స్వభావసిద్ధమైన మర్యాద (కట్టుబాటు)కదా? శ్రీమంతుడైన హిరణ్యకశిపుడు, నముచి, శంబరుడు, విసంధి, ధూమకేతువు, విరోచనుని కుమారుడైన బలి, దంభుడను దైత్యుడు, మహారాజైన వృత్రుడు, బాణుడు, శాస్త్రవేత్తలైన రాజర్షులు, గంధర్వులు, మహోరగులు, ఋషులు, పన్నగులు, దైత్యులు, యక్షులు, అప్సరసలు, ప్రళయకాలమునందు మహాసముద్రములతో, పర్వతములతో, నదులతో, వృక్షములతో కూడిన భూమీ నాచేత నశింపచేయబడినారు. 25-28

మూ. ఏతే చాన్యే చ బహవో బలవన్తో దురాసదాః,
వినిపన్నా మయా దృష్టాః కిముతాయం నిశాచరః. 29

ప్ర. అ. ఏతే చ = వీళ్లు, దురాసదాః = ఎదిరింప శక్యము కాని, బలవన్తః = బలవంతులైన, బహవః = అనేకులైన, అన్యే చ = ఇతరులు, మయా = నాచేత, దృష్టాః = చూడబడినవారై, విపన్నాః = నశించినారు. అయమ్ = ఈ, నిశాచరః = రాక్షసుడు, కిముత = చెప్పనేల?

తా. వీళ్ళు, ఎదిరింపశక్యము కాని బలవంతులైన ఇంకను ఎందరో వీరులు నేను చూడగానే నశించినారు. ఈ నిశాచరుని మాట చెప్పవలెనా? 29

మూ. ముఞ్చ మాం సాధు ధర్మజ్ఞ యావదేనం నిహన్మ్యహమ్,
న హి కశ్చిన్మయా దృష్టో బలవానపి జీవతి. 30

ప్ర. అ. ధర్మజ్ఞ = ధర్మము తెలిసినవాడా ! మామ్ = నన్ను, సాధు = బాగుగా, ముఞ్చ = విడువుము. అహమ్ = నేను, ఏనమ్ = వీనిని, నిహన్మి యావత్ = చంపెదను. బలవానపి = బలవంతుడైనను, మయా దృష్టః = నాచేత చూడబడినవాడు, కశ్చిత్ = ఎవ్వడూ, న జీవతి హి = జీవించడు కదా ?

తా. ధర్మములు తెలిసినవాడా ! నన్ను బాగుగా ప్రయోగించుము. నేను వీనిని చంపెదను. ఎంత బలవంతుడైనను నా కంట బడ్డవాడు జీవించడు కదా ?

మూ. బలం మమ న ఖల్వేతన్మర్యాదైషా నిసర్గతః,
స దృష్టో న మయా కాల ముహూర్తమపి జీవతి. 31

ప్ర. అ. ఏతత్ = ఇది, మమ = నాయొక్క, బలమ్ = బలము, న ఖలు = కాదు కదా. ఏషా = ఇది, నిసర్గతః = స్వభావమువలన ఏర్పడిన, మర్యాదా = కట్టుబాటు. కాల = కాలుడా ! మయా = నాచేత, దృష్టః = చూడబడిన, సః = అతడు, ముహూర్తమపి = ముహూర్తకాలమైనను, న జీవతి = జీవించడు.

తా. కాలుడా ! నేను నా బలమును గూర్చి చెప్పుకొనుటలేదు. ఇది స్వభావ సిద్ధమైన కట్టుబాటు. నా కంట బడినవాడు ముహూర్తమాత్రము కూడ జీవించడు. 31

మూ. తస్యైవం వచనం శ్రుత్వా ధర్మరాజః ప్రతాపవాన్,
అబ్రవీత్తత్ర తం మృత్యుం త్వం తిష్ఠైనం నిహన్మ్యహమ్.

ప్ర. అ. ప్రతాపవాన్ = ప్రతాపవంతుడైన, ధర్మరాజః = యమధర్మరాజు, ఏవమ్ = ఇట్లు, తస్య = ఆ మృత్యువుయొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, తం మృత్యుమ్ = ఆ మృత్యువును గూర్చి, అబ్రవీత్ = పలికెను. త్వమ్ = నీవు, తిష్ఠ = ఉండుము; అహమ్ = నేను, ఏనమ్ = వీనిని, నిహన్మి = చంపెదను.

తా. అతని మాటలు విని ప్రతాపవంతుడైన యమధర్మరాజు "నీవు ఆగుము. నేను వీనిని చంపెదను," అని పలికెను. 32

మూ. తతః సంరక్తనయనః క్రుద్ధో వైవస్వతః ప్రభుః,
కాలదణ్డమమోఘం తు తోలయామాస పాణినా. 33

ప్ర. అ. తతః = పిమట, క్రుద్ధః=కోపించిన, సంరక్తనయనః=ఎఱ్ఱనైన నేత్రములు గల, ప్రభుః=సమర్థుడైన, వైవస్వతః= యముడు, అమోఘమ్=వ్యర్థము కాని, కాలదణ్డమ్ = కాలదండమును, పాణినా = హస్తముచేత, తోలయామాస= కదల్చెను.

తా. పిమ్మట కోపముతో ఎఱ్ఱనైన నేత్రములు గల ప్రభువైన యముడు, వ్యర్థము కాని కాలదండమును చేతితో కదల్చెను (చేత పట్టెను). 33

మూ. యస్య పార్శ్వే సునిహితాః కాలపాశాః ప్రతిష్ఠితాః,
పావకాశనిసంకాశో ముద్గరో మూర్తిమాన్ స్థితః. 34

దర్శనాదేవ యః ప్రాణాన్ ప్రాణినామథ కర్షతి,
కిం పునః స్పృశ్యమానస్య పాత్యమానస్య వా పునః. 35

స జ్వాలాపరివారస్తు నిర్దహన్నివ రాక్షసమ్,
తేన స్పృష్టో బలవతా మహాప్రహరణోఽస్ఫురత్. 36

ప్ర. అ. యస్య=దేనియొక్క, పార్శ్వే=పార్శ్వమునందు, సునిహితాః= బాగుగా ఉంచబడిన, కాలపాశాః = కాలపాశములు, ప్రతిష్ఠితాః = స్థిరముగా ఉన్నవో, పావకాశనిసంకాశః = అగ్నితోను, వజ్రముతోను సమానమైన, మూర్తిమాన్ = మూర్తి గల, ముద్గరః = ముద్గరము, స్థితః = ఉన్నదో, యః = ఏది, దర్శనాదేవ = దర్శనమువలననే, ప్రాణినామ్ = ప్రాణులయొక్క, ప్రాణాన్= ప్రాణములను, అథ = పిమ్మట, కర్షతి = లాగివేయునో, స్పృశ్యమానస్య= స్పృశింపబడుచున్నది గాని, వా = లేదా, పాత్యమానస్య = మీద పడవేయబడు చున్నది గాని అయినచో, కిం పునః = చెప్పనేల, బలవతా = బలవంతుడైన, తేన = యమునిచేత, స్పృష్టః=స్పృశించబడిన, జ్వాలాపరివారః= అగ్నిజ్వాలల పరివారము గల, సః = ఆ, మహాప్రహరణః = గొప్ప ఆయుధము, రాక్షసమ్= రాక్షసుణ్ణి, నిర్దహన్నివ=కాల్చివేయుచున్నదా అన్నట్లు, అస్ఫురత్=ప్రకాశించెను.

తా. ఆ యమదండము ప్రక్కలయందు కాలపాశములు అమర్చబడి

ఉండెను. అగ్నితోను, వజ్రముతోను సమానమైన శరీరము దాల్చిన ముద్గరము కూడ దాని ప్రక్కనే ఉండెను. అది చూచినంతమాత్రముననే ప్రాణుల ప్రాణాలను తీసివేయును. దానిని స్పృశించినా, మీద ప్రయోగించినా చెప్పవలెనా! చుట్టూ అగ్నిజ్వాలలతో నిండి ఆ రాక్షసుణ్ణి కాల్చుచున్నదా అన్నట్లున్న ఆ గొప్ప ఆయుధము యమునిచేత గ్రహింపబడి ప్రకాశించుచుండెను. 34-36

మూ. తతో విదుద్రువుః సర్వే తస్మాత్త్రస్తా రణాజిరే,
సురాశ్చ క్షుభితాః సర్వే దృష్ట్వా దణ్డోద్యతం యమమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సర్వే = అందరూ, రణాజిరే = యుద్ధభూమియందు, తస్మాత్ = దానినుండి, త్రస్తాః = భయపడినవారై, విదుద్రువుః = పరుగెత్తిరి. దణ్డోద్యతమ్ = ఎత్తబడిన దండము గల, యమమ్ = యముణ్ణి, దృష్ట్వా = చూచి, సర్వే = సమస్తమైన, సురాశ్చ = దేవతలు కూడ, క్షుభితాః = క్షోభ చెందిరి.

తా. పిమ్మట యుద్ధభూమియందున్నవారు అందరూ ఆ యమదండమునకు భయపడి పారిపోయిరి. దండమును ఎత్తిన యముణ్ణి చూచి దేవతలు అందరూ కూడ క్షోభ చెందిరి. 37

మూ. తస్మిన్ ప్రహర్తుకామే తు యమే దణ్డేన రావణమ్,
యమం పితామహః సాక్షాద్దర్శయిత్వేదమబ్రవీత్. 38

ప్ర. అ. తస్మిన్ = ఆ, యమే = యముడు, దణ్డేన = దండముచేత, రావణమ్ = రావణుణ్ణి, ప్రహర్తుకామే = చంపుటకు కోరికకలవాడగుచుండగా, పితామహః = బ్రహ్మదేవుడు, సాక్షాత్ = సాక్షాత్తు, దర్శయిత్వా = (తనను) చూపించి, యమమ్ = యముణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. యముడు యమదండముతో రావణుణ్ణి కొట్టదలచినట్లు చూచి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఆతనితో ఇట్లనెను. 38

మూ. వైవస్వత మహాబాహో న ఖల్వమితవిక్రమ,
న హన్తవ్య స్త్వయైతేన దణ్డేనైష నిశాచరః. 39

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు కలవాడా ! అమితవిక్రమ = అమితమైన పరాక్రమము కలవాడా ! వైవస్వత=యముడా ! ఏషః నిశాచరః= ఈ రాక్షసుడు, త్వయా = నీ చేత, ఏతేన దణ్డేన = ఈ దండముచేత, న న హన్తవ్యః = చంపదగినవాడు కాడు, కాడు.

తా. గొప్ప బాహువులూ, అమితమైన పరాక్రమమూ గల ఓ యమధర్మ రాజా ! నీవు ఈ రాక్షసుణ్ణి ఈ దండముతో చంపవద్దు, చంపవద్దు. 39

మూ. వరః ఖలు మయైతస్మై దత్తస్త్రిదశపుంగవ,
స త్వయా నానృతః కార్యో యన్మయా వ్యాహృతం వచః.

ప్ర. అ. త్రిదశపుంగవ=దేవతలలో శ్రేష్ఠుడా, మయా=నాచేత, ఏతస్మై = ఇతనికి, వరః = వరము, దత్తః ఖలు = ఇవ్వబడినది కదా. సః = అది, త్వయా = నీచేత, అనృతః = అసత్య మైనదిగా, న కార్యః = చేయదగినది కాదు. మయా = నాచేత, యత్ = ఏ, వచః = వచనము, వ్యాహృతమ్ = పలకబడినదో అది, అసత్యః న కార్యః=అసత్యముగా చేయదగినది కాదు.

తా. ఓ ! దేవతాశ్రేష్ఠుడా ! నే నీతనికి వరము ఇచ్చినాను కదా? ఆ వరమును, నా మాటను నీవు అసత్య మయేటట్లు చేయవద్దు. 40

మూ. యో హి మామనృతం కుర్యాద్దేవో వా మానుషోఽపి వా,
త్రైలోక్యమనృతం తేన కృతం స్యాన్నాత్ర సంశయః. 41

ప్ర. అ. దేవో వా=దేవతాపురుషుడైనా, మానుషోఽపి వా = మనుష్యుడైనా, యః = ఎవడు, మామ్ = నన్ను, అనృతమ్ = అసత్యము పలికినవానినిగా, కుర్యాత్ = చేయునో, తేన=వానిచేత, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, అనృతమ్ = అసత్యముగా, కృతమ్ = చేయబడినది, స్యాత్ = అగును; అత్ర = ఈ విషయమున, సంశయః = సంశయము, న = లేదు.

తా. దేవతాపురుషుడే అయినా, మానవుడైనా ఎవడైన నా మాటను అసత్యము చేసినచో అతడు మూడు లోకాలను అసత్యము చేసినట్లే; సందేహము లేదు. 41

మూ. క్రుద్ధేన విప్రయుక్తోఽయం నిర్విశేషం ప్రియాప్రియే,
ప్రజాః సంహరతే రౌద్రో లోకత్రయభయావహః. 42

ప్ర. అ. రౌద్రః = భయంకరము, లోకత్రయభయావహః = మూడు లోకములకు భయము కలిగించేది అయిన, అయమ్ = ఈ దండము, క్రుద్ధేన = కోపించిన నీచేత, విప్రయుక్తః = విడువబడినదై, ప్రియాప్రియే = ప్రియాప్రియముల విషయమున, నిర్విశేషమ్ = భేదము లేకుండగా, ప్రజాః = ప్రజలను, సంహరతే = సంహరించును.

తా. భయంకరము, మూడు లోకములను భయపెట్టేదీ అయిన ఈ దండమును నీవు కోపించి ప్రయోగించినచో ఇది ఇష్టులు అనిష్టులు అను భేదము లేకుండ ప్రజల నందరిని సంహరించును. 42

మూ. అమోఘో హ్యేష సర్వేషాం ప్రాణినామమితప్రభః,
కాలదణ్డో మయా సృష్టః సర్వమృత్యుపురస్కృతః 43

ప్ర. అ. అమితప్రభః = గొప్ప కాంతి గలది, సర్వమృత్యుపురస్కృతః = అందరియొక్క మృత్యువుచేత పురస్కరించబడినది (ఇది వెళ్ళిన ప్రతిచోట మృత్యువు ముందు వెళ్ళుచుండు నని అర్థము,) మయా = నాచేత, సృష్టః = సృష్టింపబడినదీ అయిన, ఏషః కాలదణ్డః = ఈ కాలదండము, ప్రాణినామ్ = ప్రాణుల విషయమునందు, అమోఘః హి = వ్యర్థము కానిది కదా ?

తా. నేను సృష్టించిన, గొప్ప కాంతి గల ఈ యమదండము అందరినీ చంపివేయగలదు. ఇది ఏ ప్రాణుల విషయమునందూ కూడ వ్యర్థము కాదు. 43

మూ. తన్న ఖల్వేష తే సౌమ్య పాత్యో రావణమూర్ధని,
న హ్యస్మిన్ పతితే కశ్చిన్ముహూర్తమపి జీవతి. 44

ప్ర. అ. సౌమ్య = సౌమ్యుడా ! ఏషః = ఇది, రావణమూర్ధని = రావణుని శిరస్సుపై. తే = నీకు (నీచేత) న పాత్యః ఖలు = వదవేయదగినది కాదు. అస్మిన్ = ఇది, పతితే = పడినదగుచుండగా, కశ్చిత్ = ఎవ్వడూ, ముహూర్తమపి = ముహూర్త కాలము కూడ, న జీవతి హి = జీవించడు కదా ?

తా. సౌమ్యుడా! దీనిని రావణుని తలమీద ప్రయోగించవద్దు. ఇది పడినచో ఎవ్వడూ, ముహూర్తమాత్రము కూడ జీవించడు కదా ! 44

మూ. యది హ్యస్మిన్నిపతితే న మ్రియేతైష రాక్షసః,
మ్రియతే వా దశగ్రీవ స్తదాప్యుభయతో ఽనృతమ్. 45

ప్ర. అ. అస్మిన్ = ఇది, నిపతితే = పడిన దగుచుండగా, ఏషః = ఈ, రాక్షసః = రాక్షసుడైన, దశగ్రీవః = రావణుడు, న మ్రియేత యది = మరణించక పోయినట్లయితే, మ్రియతే వా = మరణించినట్లయినా, తదా = అప్పుడు, ఉభయతః అపి = రెండు విధాలా కూడ, అనృతమ్ = అసత్యము అగును.

తా. నీ దండము పడిన పిమ్మట ఈ రావణుడు మరణించినా, మరణించక పోయినా కూడ, రెండు విధాలా నా మాట అసత్య మగును. 45

మూ. తన్నివర్తయ లఙ్కేశాద్దణ్డ మేతం సముద్యతమ్,
సత్యం చ మాం కురుష్వాద్య లోకాం స్త్వం యద్యవేక్షసే. 46

ప్ర. అ. తత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, అద్య = ఇప్పుడు, లోకాన్ = లోకములను, అవేక్షసే యది = చూచినట్లయితే, సముద్యతమ్ = ఎత్తబడిన, ఏతం దణ్డమ్ = ఈ దండమును, లఙ్కేశాత్ = రావణునినుండి, నివర్తయ = మరల్చుము. మాం చ = నన్ను కూడ, సత్యమ్ = సత్యవాక్యము కలవానినిగా, కురుష్వ = చేయుము.

తా. అందువలన నీకు ఈ లోకాలను రక్షించ వలె నను అభిప్రాయ మున్నచో రావణుని మీద ప్రయోగించుటకు ఎత్తిన ఈ దండమును ఉపసంహరించుము. నా మాట సత్య మగునట్లు చేయుము. 46

మూ. ఏవముక్తస్తు ధర్మాత్మా ప్రత్యువాచ యమ స్తదా,
ఏష వ్యావర్తితో దణ్డః ప్రభవిష్ణుర్హి నో భవాన్. 47

ప్ర. అ. తదా = అప్పుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, యమః = యముడు, ప్రత్యువాచ = తిరిగి పలికెను. ఏషః = ఇదిగో, దణ్డః = దండము, వ్యావర్తితః = మరల్చబడినది. భవాన్ = నీవు, నః = మాకు, ప్రభవిష్ణుః హి = ప్రభువువు కదా ?

తా. ధర్మాత్ముడైన యముడు ఆ మాటలు విని ఇట్లు పలికెను. "ఇదిగో

ఈ దండమును ఉపసంహరించుచున్నాను. నీవు మా అందరిపైన అధికారము గల వాడవు కదా ?" 47

మూ. కిం న్విదానీం మయా శక్యం మయా రణగతేన హి,
న మయా యద్యయం శక్యో హన్తుం వరపురస్కృతః.48

ప్ర. అ. వరపురస్కృతః = వరములతో కూడిన, అయమ్ = ఇతడు, మయా = నాచేత, హన్తుమ్ = చంపుటకు, న శక్యః యది = శక్యమైనవాడు కానట్లయితే, రణగతేన = యుద్ధరంగములో ఉన్న, మయా = నాచేత, ఇదానీమ్ = ఇప్పుడు, కిం ను శక్యమ్ = ఏమి చేయ శక్యము ?

తా. "వరములు పొంది ఉన్న ఈతనిని నేను చంపజాలక పోయినచో రణరంగములో ఉన్న నేను ఇప్పుడు ఏమి చేయవలెను ?" 48

మూ. ఏష తస్మాత్ప్రణశ్యామి దర్శనాదస్య రక్షసః,
ఇత్యుక్త్వా సరథః సాశ్వస్తత్రైవాన్తరధీయత. 49

ప్ర అ. ఏషః = ఈ నేను, తస్మాత్ = ఆ కారణమువలన, అస్య = ఈ, రక్షసః = రాక్షసునియొక్క, దర్శనాత్ = దర్శనమునుండి, ప్రణశ్యామి = తొలగిపోయెదను. ఇతి = ఇట్లు, ఉక్త్వా = పలికి, సరథః = రథముతో కూడిన, సాశ్వః = గుఱ్ఱములతో కూడిన అతడు, తత్రైవ = అక్కడనే, అన్తరధీయత = అంతర్ధానము చెందెను.

తా. "అందువలన నేను ఈ రాక్షసునికి కనబడకుండ వెళ్ళిపోయెదను" అని పలికి రథముతో, అశ్వములతో సహా అంతర్ధానము చెందెను. 49

మూ. దశగ్రీవస్తు తం జిత్వా నామ విశ్రావ్య చాత్మనః,
ఆరుహ్య పుష్పకం భూయో నిష్క్రాన్తో యమసాదనాత్.

ప్ర. అ. దశగ్రీవస్తు = రావణుడు, తమ్ = యముణ్ణి, జిత్వా = జయించి, ఆత్మనః = తనయొక్క, నామ = పేరును, విశ్రావ్య చ = వినిపించి, పుష్పకమ్ = పుష్పకమును, భూయః = మరల, ఆరుహ్య = ఎక్కి, యమసాదనాత్ = యమలోకమునుండి, నిష్క్రాన్తః = బయల్వెడలినాడు.

రావణు డీ విధముగా యముణ్ణి జయించి, తన పేరు చాటి, మరల పుష్ప
కము ఎక్కి యమలోకమునుండి బయలుదేరి వెళ్ళెను. 50

మూ. స తు వైవస్వతో దేవైః సహ బ్రహ్మపురోగమైః,
జగామ త్రిదివం హృష్టో నారదశ్చ మహామునిః. 51

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్వావింశః సర్గః.

ప్ర. అ. సః = ఆ, వైవస్వతః తు = యముడైతే, బ్రహ్మపురోగమైః = బ్రహ్మ మొదలైన, దేవైః సహ = దేవతలతో కూడ, హృష్టః=సంతోషించినవాడై, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, జగామ = వెళ్లెను. మహామునిః = మహాముని యైన, నారదశ్చ = నారదుడు కూడ వెళ్లెను.

తా. బ్రహ్మ మొదలైన దేవతలతో కూడి యముడు సంతోషముతో స్వర్గము
నకు వెళ్ళెను. నారదమహాముని కూడ వెళ్ళెను. 51

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో ఇరువదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రయోవింశః సర్గః

[రావణుడు నివాతకవచములతో స్నేహము చేసికొని, కాలకేయులను వధించి వరుణపుత్రులను ఓడించుట.]

మూ. తతో జిత్వా దశగ్రీవో యమం త్రిదశపుఙ్గవమ్,
రావణస్తు రణశ్లాఘీ స్వసహాయాన్ దదర్శ హ. 1

ప్ర. అ. దశగ్రీవః = పది కంఠములు కలవాడు, రణశ్లాఘీ = రణమునందు శ్లాఘించుకొనువాడు అయిన, రావణః తు = రావణుడైతే, త్రిదశపుఙ్గవమ్ = దేవతాశ్రేష్ఠుడైన, యమమ్ = యముణ్ణి, జిత్వా = జయించి, తతః = అటుపిమ్మట, స్వసహాయాన్ = తన సహాయులను, దదర్శహ = చూచెను.

తా. పది కంఠములు కలవాడు, యుద్ధములో బడాయి చెప్పుకొనే వాడు అయిన రావణుడు దేవతాశ్రేష్ఠుడైన యముణ్ణి జయించి, పిమ్మట తన సహాయులైన మారీచాదులను చూచెను. 1

మూ. తతో రుధిరసిక్తాఙ్గం ప్రహారైర్జర్జరీకృతమ్,
రావణం రాక్షసా దృష్ట్వా విస్మయం సముపాగమన్. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రాక్షసాః = ఆ రాక్షసులు, రుధిరసిక్తాఙ్గమ్ = రక్తముచేత తడపబడిన శరీరము గలవాడు, ప్రహారైః = దెబ్బలచేత, జర్జరీకృతమ్ = శిథిలము చేయబడినవాడూ అయిన, రావణమ్ = రావణుని, దృష్ట్వా = చూచి, విస్మయమ్ = ఆశ్చర్యమును, సముపాగమన్ = పొందిరి.

తా. అప్పుడు దెబ్బలచేత శిథిలముచేయబడినవాడై రక్తముచేత తడసిన శరీరము గల ఆ రావణుణ్ణి చూచి ఆ రాక్షసులు ఆశ్చర్యపడిరి. 2

మూ. జయేన వర్ధయిత్వా చ మారీచప్రముఖాస్తతః,
పుష్పకం భేజిరే సర్వే సాన్త్వితా రావణేన తు. 3

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మారీచప్రముఖాః = మారీచుడు మొదలైన వాళ్లు, జయేన = జయశబ్దముచేత, వర్ధయిత్వా = వృద్ధి పొందించి, రావణేన = రావణునిచేత, సాన్త్వితాః = ఓదార్చబడినవారై, పుష్పకమ్ = పుష్పకమును, భేజిరే = పొందిరి.

తా. అప్పుడు మారీచుడు మొదలైన రాక్షసులు జయజయధ్వానములతో ఆ రావణుని అభినందించిరి. రావణుడు వారికి ధైర్యము చెప్పెను. వారందరూ పుష్పకమును ఎక్కిరి. 3

మూ. తతో రసాతలం రక్షః ప్రవిష్టః పయసాం నిధిమ్,
దైత్యోరగగణాధ్యుష్టం వరుణేన సురక్షితమ్. 4

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రక్షః = రావణుడు, రసాతలమ్ = రసాతలమును గూర్చి (వెళ్లుచు), దైత్యోరగగణాధ్యుష్టమ్ = దైత్యులయొక్క, ఉరగుల యొక్క సముదాయములచేత అధిష్ఠించబడినది, వరుణేన = వరుణునిచేత, సురక్షితమ్ = బాగుగా రక్షింపబడినదీ అయిన, పయసాం నిధిమ్ = సముద్రమును, ప్రవిష్టః = ప్రవేశించినాడు.

తా. పిమ్మట రావణుడు రసాతలమునకు వెళ్లుటకై దైత్యుల, ఉరగుల సముదాయములకు నివాసము, వరుణునిచేత బాగుగా రక్షింపబడినదీ అయిన సముద్రములో ప్రవేశించెను. 4

మూ. స తు భోగవతీం గత్వా పురీం వాసుకిపాలితామ్,
కృత్వా నాగాన్ వశే హృష్టో యయౌ మణిమయీం పురీమ్.

ప్ర. అ. సః = అతడు, వాసుకిపాలితామ్ = వాసుకిచేత పాలింపబడిన, భోగవతీమ్ = భోగవతిని గూర్చి, గత్వా = వెళ్ళి, నాగాన్ = నాగములను, వశే = వశమునందు, కృత్వా = చేసికొని, హృష్టః = సంతోషించినవాడై, మణిమయీమ్ = మణిమయి అను, పురీమ్ = పట్టణమును గూర్చి, యయౌ = వెళ్ళెను.

తా. రావణుడు వాసుకి పాలించుచున్న భోగవతీపురికి వెళ్ళి, నాగులను తన వశము చేసికొని మణిమయపురమునకు వెళ్ళెను. 5

మూ. నివాతకవచా స్తత్ర దైత్యా లబ్ధవరా వసన్,
రాక్షసస్తాన్ సమాగమ్య యుద్ధాయ సముపాహ్వయత్. 6

ప్ర. అ. తత్ర = అక్కడ, లబ్ధవరాః = పొందబడిన వరములు గల, నివాతకవచాః = నివాతకవచు లను, దైత్యాః = దైత్యులు, వసన్ = నివసించిరి. రాక్షసః = రావణుడు, తాన్ = వాళ్ళను, సమాగమ్య = పొంది, యుద్ధాయ = యుద్ధముకొరకు, సముపాహ్వయత్ = పిలచెను.

తా. అక్కడ వరములు పొందిన నివాతకవచులు నివసించుచుండిరి. రావణుడు వాళ్ళదగ్గరకు వెళ్ళి యుద్ధమునకు పిలచెను. 6

మూ. తే తు సర్వే సువిక్రాన్తా దైతేయా బలశాలినః,
నానాప్రహరణా స్తత్ర ప్రహృష్టా యుద్ధదుర్మదాః. 7

ప్ర. అ. తత్ర = అక్కడ, సర్వే = సమస్తమైన, తే = ఆ, దైతేయాః = దైత్యులు, సువిక్రాన్తాః = మంచి పరాక్రమము గలవారు. బలశాలినః = బలముతో ప్రకాశించువారు, నానాప్రహరణాః = అనేకవిధములైన ఆయుధములు గలవారు, ప్రహృష్టాః = సంతోషించినవారు, యుద్ధదుర్మదాః = యుద్ధమునందు మదము గలవారు.

తా. బలశాలులైన అక్కడ నున్న ఆ దైత్యు లందరు మంచి పరాక్రమము గలవారు. అనేకవిధములైన ఆయుధములు గలవారు. ఉత్సాహవంతులు. యుద్ధము నందు అత్యధికమైన మదము ఉన్నవారు. 7

మూ. శూలై స్త్రిశూలైః కులిశైః పట్టిశాసిపరశ్వధైః,
అన్యోన్యం బిభిదుః క్రుద్ధా రాక్షసా దానవా స్తథా. 8

ప్ర. అ. క్రుద్ధాః = కోపించిన, రాక్షసాః = రాక్షసులు, తథా = మరియు, దానవాః = దానవులు, శూలైః = శూలములచేత, త్రిశూలైః = త్రిశూలములచేత, కులిశైః = వజ్రాయుధములచేత, పట్టిశాసిపరశ్వధైః = పట్టిశములచేత, కత్తులచేత, గండ్ర గొడ్డళ్ళచేత, అన్యోన్యమ్ = పరస్పరము, బిభిదుః = భేదించిరి.

తా. క్రోధావిష్టులైన ఆ రాక్షసులు, దానవులు ఒకరి నొకరు శూలములు,

త్రిశూలములు, వజ్రాయుధములు, పట్టిశములు, ఖడ్గములు, గొడ్డళ్ళు మొదలైన ఆయుధాలతో బ్రద్దలు కొట్టిరి. 8

మూ. తేషాం తు యుధ్యమానానాం సాగ్రః సంవత్సరో గతః,
న చాన్యతరత స్తత్ర విజయో వా క్షయోఽపి వా. 9

ప్ర. అ. తేషామ్ = వాళ్ళు, యుధ్యమానానామ్ = యుద్ధముచేయుచుండగా, సాగ్రః = కొంత చివరి భాగముతో కూడిన, సంవత్సరః = సంవత్సరము, గతః = గడచినది. తత్ర = అక్కడ, అన్యతరతః = ఒక పక్షమునందు, విజయో వా = జయము కాని, క్షయోఽపి వా = పరాజయము గాని, న = లేకుండెను.

తా. వాళ్ళు ఆ విధముగా యుద్ధము చేయుచుండగా కొంచెము ఎక్కువగా సంవత్సరకాలము గడచెను. ఎవరికి కూడ జయము కాని, పరాజయము కాని కలగలేదు. 9

మూ. తతః పితామహ స్తత్ర త్రైలోక్యగతిరవ్యయః,
ఆజగామ ద్రుతం దేవో విమానవరమాస్థితః. 10

ప్ర. అ. తతః = అటు పిమ్మట, త్రైలోక్యగతిః = మూడు లోకములకు గతి అయినవాడు, అవ్యయః = నాశరహితుడు, దేవః = దేవుడు అయిన, పితామహః = బ్రహ్మ, విమానవరమ్ = శ్రేష్ఠమైన విమానమును, ఆస్థితః = అధిష్ఠించినవాడై, ద్రుతమ్ = శీఘ్రముగా, తత్ర = అక్కడికి, ఆజగామ = వచ్చెను.

తా. ఇంతలో మూడు లోకములకు గతి అయిన, నాశరహితుడైన బ్రహ్మ దేవుడు, శ్రేష్ఠమైన విమానము నెక్కి అచటికి వచ్చెను. 10

మూ. నివాతకవచానాం తు నివార్య రణకర్మ తత్,
వృద్ధః పితామహో వాక్యమువాచ విదితార్థవత్. 11

ప్ర. అ. వృద్ధః = వృద్ధుడైన, పితామహః = బ్రహ్మదేవుడు, నివాతకవచ నామ్ = నివాతకవచుల యొక్క, తత్ = ఆ, రణకర్మ = యుద్ధమును, నివార్య = నివారించి, విదితార్థవత్ = తెలియబడిన అర్థము గల, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. వృద్ధుడైన బ్రహ్మదేవుడు నివాతకవచులు చేయుచున్న ఆ యుద్ధమును నివారించి స్పష్టమైన అర్థము గల వాక్యమును ఇట్లు పలికెను. 11

మూ. న హ్యాయం రావణో యుద్ధే శక్యో జేతుం సురాసురైః,
న భవన్తః క్షయం నేతుమపి సామరదానవైః. 12

ప్ర. అ. అయమ్ = ఈ రావణః = రావణుడు, సురాసురైః = దేవతల చేతను అసురుల చేతను, యుద్ధే = యుద్ధమునందు, జేతుమ్ = జయించుటకు, న శక్యః హి = శక్యమైనవాడు కాడు కదా? భవన్తః=మీరు, సామరదానవైః అపి= దేవతలతో కూడిన దానవుల చేత కూడ, క్షయమ్ = నాశమును, నేతుమ్ = పొందించుటకు, న = శక్యమైనవారు కారు.

తా. సురులు అసురులు కూడ ఈ రావణుణ్ణి యుద్ధములో జయించ జాలరు, దానవులూ, దేవతలూ కలిసి వచ్చినా కూడ మిమ్ములను ఓడింపజాలరు.12

మూ. రాక్షసస్య సఖిత్వం చ భవద్భిః సహ రోచతే,
అవిభక్తాశ్చ సర్వార్థాః సుహృదాం నాత్ర సంశయః. 13

ప్ర. అ. భవద్భిః సహ = మీతో కూడ, రాక్షసస్య = రావణునియొక్క, సఖిత్వమ్ = స్నేహము, రోచతే = నాకు ఇష్ట మగుచున్నది. సుహృదామ్ = స్నేహితులయొక్క, సర్వార్థాః = అన్ని కార్యములు, అవిభక్తాః చ = విభజింప బడనివి. అత్ర = ఈ విషయమునందు, సంశయః = సంశయము, న = లేదు.

తా. మీరు ఈ రావణునితో మైత్రి వహించుట నా కిష్టము. మిత్రులు అన్ని భోగాదులను పంచుకొనకుండ కలసి అనుభవించవచ్చును. సందేహము లేదు. 13

మూ. తతోఽగ్నిసాక్షికం సఖ్యం కృతవాంస్తత్ర రావణః,
నివాతకవచైః సార్ధం ప్రీతిమానభవత్తదా. 14

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రావణః = రావణుడు, తత్ర = అక్కడ, నివాతకవచైః సార్ధమ్ = నివాతకవచులతో కూడ, అగ్నిసాక్షికమ్ = అగ్ని సాక్షికముగా, సఖ్యమ్ = సఖ్యమును, కృతవాన్ = చేసినాడు. తదా = అప్పుడు, ప్రీతిమాన్ = సంతోషము కలవాడు, అభవత్ = ఆయెను.

తా. పిమ్మట రావణుడు అగ్నిసాక్షికముగా అక్కడ నివాతకవచులతో స్నేహము చేసికొని చాల సంతోషించెను. 14

మూ. అర్చితస్తైర్యథాన్యాయం సంవత్సర మథోషితః,
స్వపురాన్నిర్విశేషం చ ప్రియం ప్రాప్తో దశాననః. 15

ప్ర. అ. తైః = వాళ్ళచేత, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, అర్చితః పూజింపబడిన, దశాననః = రావణుడు, అథ = పిమ్మట, తత్ర = అక్కడ, సంవత్సరమ్ = సంవత్సరకాలము, ఉషితః = నివసించినవాడై, స్వపురాత్ = తన పురముకంటె, నిర్విశేషమ్ = భేదములేని, ప్రియమ్ = సంతోషమును, ప్రాప్తః = పొందినాడు.

తా. రావణుడు న్యాయానుసారము వాళ్ళనుండి పూజలను అందుకొనుచు ఒక సంవత్సరము అక్కడ నివసించి తన పురమునందు వలెనే సంతోషమును పొందెను. 15

మూ. తత్రోపధార్య మాయానాం శతమేకం సమాప్తవాన్,
సలిలేన్ద్రపురాన్వేషీ భ్రమతి స్మ రసాతలమ్. 16

ప్ర. అ. తత్ర = అక్కడ, ఉపధార్య = వాళ్ళను అనుసరించి, మాయానామ్ = మాయలయొక్క, ఏకం శతమ్ = ఒక శతమును, సమాప్తవాన్ = పొందినాడు. సలిలేన్ద్రపురాన్వేషీ = వరుణుని పురమును వెదకుచున్న వాడై, రసాతలమ్ = రసాతలమును, భ్రమతి స్మ = తిరిగెను.

తా. రావణుడు ఆ మణిమయపురమునందు ఆ నివాతకవచులకు అనుగుణముగా ప్రవర్తించుచు నూరు మాయలను నేర్చుకొనెను. వరుణుని పురము కొరకు అన్వేషించుచు రసాతలమునందు సంచరించెను. 16

మూ. తతోఽశ్మనగరం నామ కాలకేయైరధిష్ఠితమ్,
గత్వా తు కాలకేయాంశ్చ హత్వా తత్ర బలోత్కటాన్. 17

శూర్పణఖాయాశ్చ భర్తారమసినా ప్రాచ్ఛినత్తదా,
శ్యాలం చ బలవన్తం చ విద్యుజ్జిహ్వాం బలోత్కటమ్. 18

ప్ర. అ. తతః = అటు పిమ్మట, కాలకేయైః = కాలకేయులచేత, అధిష్ఠితమ్ = అధిష్ఠించబడిన, అశ్మనగరం నామ = అశ్మనగర మను నగరమును గూర్చి, గత్వా = వెళ్ళి, తత్ర = అక్కడ, బలోత్కటాన్ = బలముచేత తీవ్రముగా ఉన్న, కాలకేయాన్ = కాలకేయులను, హత్వా చ = చంపి, తదా = అప్పుడు, శూర్పణఖ్యాః = శూర్పణఖయొక్క, భర్తారమ్ = భర్తా, శ్యాలం = బావా, బలవన్తం చ = బలవంతుడూ, బలోత్కటమ్ = బలముచేత గర్వించిన వాడూ అయిన, విద్యుజ్జిహ్వమ్ = విద్యుజ్జిహ్వుణ్ణి, అసినా = ఖడ్గముచేత, ప్రాచ్ఛినత్ = ఛేదించెను

తా. పిమ్మట కాలకేయుల నివాసమైన అశ్మనగరమునకు వెళ్ళి బలముచేత దృప్తులైన కాలకేయులను చంపి, అప్పుడు శూర్పణఖ భర్తా, తన బావా, బలవంతుడూ, బలముచేత దృప్తుడూ అయిన విద్యుజ్జిహ్వుణ్ణి ఖడ్గముచేత ఛేదించెను. 17, 18

మూ. జిహ్వయా సంలిహన్తం చ రాక్షసం సమరే తదా,
తం విజిత్య ముహూర్తేన జఘ్నే దైత్యాంశ్చతుఃశతమ్ 19

ప్ర అ. తదా = అప్పుడు, సమరే = యుద్ధమునందు, జిహ్వయా = నాలుకతో, సంలిహన్తమ్ = నాకుచున్న, తమ్ = వానిని, విజిత్య = జయించి, ముహూర్తేన = ముహూర్తకాలముచేత, చతుఃశతమ్ = నాల్గు వందలు, దైత్యాన్ = దైత్యులను, జఘ్నే = చంపెను.

తా. అప్పుడు యుద్ధరంగములో నాలుకతో నాకివేయుచున్న ఆ విద్యుజ్జిహ్వుణ్ణి జయించి, ముహూర్తకాలములో నాలుగువందల మంది దైత్యులను చంపెను. 19

మూ. తతః పాణ్డురమేఘాభం కైలాసమివ భాస్వరమ్,
వరుణస్యాలయం దివ్యమపశ్యద్రాక్షసాధిపః. 20

ప్ర. అ. తతః = పిమ్మట, రాక్షసాధిపః = రావణుడు, పాణ్డురమేఘాభమ్ = తెల్లని మేఘము వంటి కాంతి గలది, కైలాసమివ = కైలాసమువలె, భాస్వరమ్ = ప్రకాశించుచున్నది అయిన, దివ్యమ్ = దివ్యమైన, వరుణస్య ఆలయమ్ = వరుణుని గృహమును, అపశ్యత్ = చూచెను.

తా. పిమ్మట రావణుడు తెల్లని మేఘము వలె ఉన్న, కైలాసము వలె ప్రకాశించుచున్న దివ్యమైన వరుణుని గృహమును చూచెను. 20

మూ. క్షరన్తీం చ పయస్తత్ర సురభిం గామవస్థితామ్,
యస్యాః పయోఽభినిష్యన్దాత్ క్షీరోదో నామ సాగరః. 21

ప్ర. అ. యస్యాః = ఏ కామదేనువుయొక్క, పయోభినిష్యన్దాత్ = పాల యొక్క ప్రవాహము (కారుట)వలన, క్షీరోదో నామ=క్షీరసముద్ర మను, సాగరః = సముద్రము జన్మించెనో అట్టి, పయః = పాలను, క్షరన్తీమ్ = స్రవించుచున్న, అవస్థితామ్ = నిలచి ఉన్న, సురభిం గామ్ = కామధేనువును, తత్ర = అక్కడ, చూచెను.

తా. అక్కడ నిలచి పాలను స్రవించుచున్న కామధేనువును చూచెను. ఆ కామధేనువు కార్చుచున్న పాలవలననే క్షీరసముద్రము పుట్టినది. 21

మూ. దదర్శ రావణస్తత్ర గోవృషేన్ద్రవరారణిమ్,
యస్మాచ్చన్ద్రః ప్రభవతి శీతరశ్మిర్నిశాకరః. 22

యం సమాశ్రిత్య జీవన్తి ఫేనపాః పరమర్షయః,
అమృతం యత్ర చోత్పన్నం స్వధా చ స్వధభోజినామ్.

ప్ర. అ. రావణః = రావణుడు, తత్ర=అక్కడ, గోవృషేన్ద్రవరారణిమ్ = రుద్రుని వృషభరాజుకు కారణమైన (తల్లియైన) కామధేనువును, దదర్శ= చూచెను. యస్మాత్ = దేనినుండి, శీతరశ్మిః = చల్లని కిరణములుగల, నిశాకరః = రాత్రినిచేయు, చన్ద్రః = చంద్రుడు, ప్రభవతి = పుట్టుచున్నాడో, ఫేనపాః= నురుగును త్రాగు, పరమర్షయః = మహర్షులు, యమ్ = దేనిని, సమాశ్రిత్య = ఆశ్రయించి, జీవన్తి = జీవించుచుందురో, యత్ర = దేనియందు, అమృతమ్ = అమృతము, ఉత్పన్నమ్=పుట్టినదో, స్వధభోజినామ్=స్వధను తినేవారికి, స్వధా చ = స్వధయు, పుట్టినదో అట్టి క్షీరసముద్రమునకు కారణమైన కామధేనువును చూచెను.

తా. రావణుడు అక్కడ రుద్రుని వాహనమైన మహావృషభమునకు తల్లియైన కామధేనువును చూచెను. ఆ కామధేనువునుండి పుట్టిన క్షీరసముద్రమునుండి

చల్లని కిరణములు గలవాడు, రాత్రిని కల్పించువాడు అయిన చంద్రుడు జనించెను. ఆ క్షీరసముద్రమునే ఆశ్రయించుకొని నురుగును భుజించు మహర్షులు జీవించు చుందురు. స్వధను భుజించు పితృదేవతల స్వధ కూడ దీనినుండియే పుట్టినది.

మూ. యాం బ్రువన్తి నరా లోకే సురభిం నామ నామతః,
ప్రదక్షిణం తు తాం కృత్వా రావణః పరమాద్భుతమ్,
ప్రవివేశ మహాఘోరం గుప్తం బహువిధైర్బలైః.

ప్ర. అ. నరాః = నరులు, లోకే = లోకమునందు, యామ్ = దేనిని, నామతః = పేరువలన, సురభిం నామ = సురభి అను ప్రసిద్ధి కలదానినిగా, బ్రువన్తి = చెప్పుచున్నారో, పరమాద్భుతామ్ = చాల ఆశ్చర్యకరమైన, తామ్ = దానిని, ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణము చేసి, రావణః = రావణుడు, బహువిధైః = అనేకవిధములైన, బలైః = సైన్యములచేత, గుప్తమ్ = రక్షించబడిన, మహాఘోరమ్ = చాల భయంకరమైన ఆ గృహమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. లోకమునందు "సురభి"అను పేరుతో ప్రసిద్ధమైన ఆశ్చర్యకరమైన ఆ కామధేనువుకు ప్రదక్షిణము చేసి రావణుడు అనేకవిధములైన సైన్యములు రక్షించుచుండుటచేత భయంకరముగా ఉన్న ఆ భవనములో ప్రవేశించెను. 24

మూ. తతో ధారాశతాకీర్ణం శారదాభ్రనిభం తదా, 25
నిత్యప్రహృష్టం దదృశే వరుణస్య గృహోత్తమమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ధారాశతాకీర్ణమ్ = వందలకొలది జలధారల చేత వ్యాప్తము, శారదాభ్రనిభమ్ = శరత్కాలమేఘముతో సమానమూ, నిత్యప్రహృష్టమ్ = నిత్యము సంతోషముతో ఉన్నదీ అయిన, వరుణస్య = వరుణుని యొక్క, గృహోత్తమమ్ = ఉత్తమమైన గృహము, తదా = అప్పుడు, దదృశే = చూడబడెను.

తా. పిమ్మట అతడు అనేక జలధారలతో వ్యాప్తమైన నిత్యానందముతో కూడిన, శరత్కాలమేఘము వంటి వరుణుని శ్రేష్ఠమైన గృహమును చూచెను. 25

మూ. తతో హత్వా బలాధ్యక్షాన్ సమరే తైశ్చ తాడితః, 26
అబ్రవీచ్చ తతో యోధాన్ రాజా శీఘ్రం నివేద్యతామ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, బలాధ్యక్షాన్ = సేనాధ్యక్షులను, హత్వా = చంపి, సమరే = యుద్ధమునందు, తైః = వాళ్ళచేత, తాడితశ్చ = కొట్టబడిన వాడై (రావణుడు), తతః = పిమ్మట, యోధాన్ = యోధులను గూర్చి, అబ్రవీత్ చ = పలికెను. రాజా = మీ రాజు, శీఘ్రమ్ = శీఘ్రముగా, నివేద్యతామ్ = తెలుపబడుగాక.

తా. పిమ్మట రావణుడు యుద్ధమునందు సేనాధ్యక్షులను చంపి, వారి ప్రహారములను తిని, పిమ్మట ఆ యోధులతో ఇట్లు పలికెను. "శీఘ్రముగా వెళ్ళి మీ రాజుతో ఇట్లు చెప్పుడు. 26

మూ. యుద్ధార్థీ రావణః ప్రాప్తస్తస్య యుద్ధం ప్రదీయతామ్, 27
వద వా న భయం తేఽస్తి నిర్జితోఽస్మీతి సాఞ్జలిః.

ప్ర. అ. రావణః = రావణుడు, యుద్ధార్థీ = యుద్ధమును కోరుచున్నవాడై, ప్రాప్తః = వచ్చినాడు. తస్య = వానికి, యుద్ధమ్ = యుద్ధము, ప్రదీయతామ్ = ఇవ్వబడుగాక. తే = నీకు, భయమ్ = భయము, నాస్తి = లేదు అని గాని, వా = = లేక, సాఞ్జలిః = దోసిలితో కూడినవాడవై, నిర్జితః అస్మి ఇతి = జయింపబడినాను అని గాని, వద = చెప్పుము.

తా. "రావణుడు యుద్ధమును కోరి వచ్చినాడు. ఆతనికి యుద్ధము ఇమ్ము. నీకు భయము లేదని అయినా చెప్పుము; లేదా అంజలి ఘటించి జయింపబడినానని ఒప్పుకొనుము." 27

మూ. ఏతస్మిన్నన్తరే క్రుద్ధా వరుణస్య మహాత్మనః, 28
పుత్రాః పౌత్రాశ్చ నిష్క్రామన్ గౌశ్చ పుష్కర ఏవ చ.

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యయందు, మహాత్మనః = మహాత్ముడైన, వరుణస్య = వరుణునియొక్క, పుత్రాః = పుత్రులు, పౌత్రాశ్చ = పౌత్రులు, గౌశ్చ = గో అనువాడు, పుష్కర ఏవ చ = పుష్కరుడు, క్రుద్ధాః = కోపించినవారై, నిష్క్రామన్ = బైటకు వచ్చిరి.

తా. ఇంతలో మహాత్ముడైన వరుణుని పుత్రులు, పౌత్రులు, వాళ్ళ బలాధ్యక్షులైన గో-పుష్కరులు కోపముతో బైలుదేరి వచ్చిరి. 28

మూ. తే తు వీర్యగుణోపేతా బలైః పరివృతాః స్వకైః, 29
యుక్త్వా రథాన్ కామగమానుద్యద్భాస్కరవర్చసః.

ప్ర. అ. వీర్యగుణోపేతాః = పరాక్రమముతోను గుణములతోను కూడిన, తే = వారు, స్వకైః = తమ సంబంధమైన, బలైః = సైన్యములతో, పరివృతాః = కూడినవారై, కామగమాన్ = స్వేచ్ఛానుసారము సంచరించు, భాస్కరవర్చసః = సూర్యుని వంటి కాంతి గల, రథాన్ = రథములను, యుక్త్వా = కూర్చుకొని (బయలుదేరిరి).

తా. మంచి పరాక్రమము, సద్గుణములూ గల ఆ వరుణపుత్రపౌత్రులు తమ సైన్యములను వెంటబెట్టుకొని, స్వేచ్ఛానుసారము సంచరించు, సూర్యకాంతి వంటి కాంతి గల రథములను కూర్చుకొని బయలుదేరిరి. 29

మూ. తతో యుద్ధం సమభవద్దారుణం రోమహర్షణమ్, 30
సలిలేన్ద్రస్య పుత్రాణాం రావణస్య చ ధీమతః

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సలిలేన్ద్రస్య = వరుణునియొక్క, పుత్రాణామ్ = పుత్రులకు, ధీమతః = బుద్ధిమంతుడైన, రావణస్య = రావణునకూ, దారుణమ్ = భయంకరము, రోమహర్షణమ్ = రోమాంచము కలిగించేదీ అయిన, యుద్ధమ్ = యుద్ధము, సమభవత్ = ఆయెను.

తా. పిమ్మట వరుణుని పుత్రులకు, బుద్ధిమంతుడైన రావణునకూ భయంకరమూ, రోమాంచజనకమూ అయిన యుద్ధము జరిగెను. 30

మూ. అమాత్యైశ్చ మహావీర్యైర్దశగ్రీవస్య రక్షసః, 31
వారుణం తద్బలం సర్వం క్షణేన వినిపాతితమ్.

ప్ర. అ. రక్షసః = రాక్షసుడైన, దశగ్రీవస్య = రావణునియొక్క, మహావీర్యైః = గొప్ప పరాక్రమము గల, అమాత్యైః = మంత్రులచేత, వారుణమ్ = వరుణుని సంబంధమైన, తత్ = ఆ, సర్వమ్ = సమస్తమైన, బలమ్ = సైన్యము, క్షణేన = క్షణకాలముచేత, వినిపాతితమ్ = పడగొట్టబడినది.

తా. మహాపరాక్రమవంతులైన రావణుని అమాత్యులు ఆ వరుణసైన్యము నంతనూ క్షణకాలములో పడగొట్టిరి. 31

మూ. సమీక్ష్య స్వబలం సంఖ్యే వరుణస్య సుతాస్తదా, 32
అర్దితాః శరజాలేన నివృత్తా రణకర్మణః.

ప్ర. అ. తదా = అప్పుడు, వరుణస్య = వరుణునియొక్క, సుతాః = కుమారులు, సంఖ్యే = యుద్ధమునందు, స్వబలమ్ = తమ సైన్యమును, సమీక్ష్య= చూచి, శరజాలేన = బాణముల సముదాయముచేత, అర్దితాః = పీడింపబడినవారై, రణకర్మణః = యుద్ధముచేయుటనుండి, నివృత్తాః = మరలిరి.

తా. అప్పుడు వరుణుని కుమారులు యుద్ధములో తమ సైన్యములు పడిపోవుట చూచి, బాణములచేత పీడితులై యుద్ధమునుండి విరమించిరి. 32

మూ. మహీతలగతాస్తే తు రావణం దృశ్య పుష్పకే, 33
ఆకాశమాశు వివిశుః స్యన్దనైః శీఘ్రగామిభిః.

ప్ర. అ. మహీతలగతాః=నేలమీద ఉన్న, తే=వారు, పుష్పకే=పుష్పకమునందు, రావణమ్=రావణుణ్ణి, దృశ్య = చూచి, శీఘ్రగామిభిః = శీఘ్రముగా వెళ్లు, స్యన్దనైః = రథములతో, ఆకాశమ్ = ఆకాశమును, వివిశుః = ప్రవేశించిరి.

తా. నేలమీద ఉన్న ఆ వరుణపుత్రులు పుష్పకములో ఉన్న రావణుణ్ణి చూచి శీఘ్రముగా నడచు రథములతో ఆకాశములోనికి వెళ్ళిరి. 33

మూ. మహదాసీత్తతస్తేషాం తుల్యం స్థానమవాప్య తత్, 34
ఆకాశయుద్ధం తుములం దేవదానవయోరివ.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తత్ = ఆ, తుల్యమ్ = సమానమైన, స్థానమ్=స్థానమును, అవాప్య = పొంది, తేషామ్=వాళ్ళకు, దేవదానవయోరివ= దేవదానవులకు వలె, తుములమ్ = వ్యాకులమైన, మహత్ = గొప్ప, ఆకాశయుద్ధమ్ = ఆకాశమునందు యుద్ధము, ఆసీత్ = ఆయెను.

తా. పిమ్మట సమానస్థానములలో ఉన్న ఆ రావణ-వరుణ కుమారులకు దేవదానవులకు వలె, వ్యాకులమైన గొప్ప యుద్ధము జరిగెను. 34

మూ. తతస్తే రావణం యుద్ధే శరైః పావకసంనిభైః, 35
విముఖీకృత్య సంహృష్టా వినేదుర్వివిధాన్ రవాన్.

ప్ర. అ. తతః=పిమ్మట, తే = వారు, పావకసంనిభైః=అగ్నితో సమానమైన, శరైః=బాణములచేత, యుద్ధే=యుద్ధమునందు, రావణమ్=రావణుణ్ణి, విముఖీకృత్య = యుద్ధవిముఖునిగా చేసి, సంహృష్టాః=సంతోషించినవారై, వివిధాన్ = అనేక విధములైన, రవాన్ = శబ్దములను, వినేదుః = ధ్వనిచేసిరి (చేసిరి).

తా. ఆ వరుణకుమారులు అగ్నివంటి బాణములచేత రావణుణ్ణి యుద్ధమునందు విముఖుణ్ణిగా చేసి, సంతోషించుచు, అనేకవిధములైన శబ్దములు చేయుచు అరచిరి. 35

మూ. తతో మహోదరః క్రుద్ధో రాజానం వీక్ష్య ధర్షితమ్, 36
త్యక్త్వా మృత్యుభయం వీరో యుద్ధాకాఙ్క్షీ వ్యలోకయత్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వీరః = వీరుడైన, మహోదరః = మహోదరుడు, ధర్షితమ్=పరాభవముచేయబడిన, రాజానమ్ = రాజును, వీక్ష్య=చూచి, మృత్యుభయమ్ = మృత్యుభయమును, త్యక్త్వా = విడచి, యుద్ధాకాఙ్క్షీ = యుద్ధమును కోరుచున్నవాడై, వ్యలోకయత్ = చూచెను.

తా. అప్పుడు వీరుడైన మహోదరుడు తమ రాజు పరాభవము చెందుట చూచి, కోపించి, మృత్యుభయమును విడచి, యుద్ధమును చేయగోరుచు చూచెను.

మూ. తేన తే వారుణా యుద్ధే కామగాః పవనోపమాః, 37
మహోదరేణ గదయా హతా వై ప్రయయుః క్షితిమ్.

ప్ర. అ. యుద్ధే= యుద్ధమునందు, కామగాః = స్వేచ్ఛగా సంచరించు, పవనోపమాః = వాయుసమానులైన, తే వారుణాః = ఆ వరుణపుత్రులు, తేన మహోదరేణ = ఆ మహోదరునిచేత, గదయా = గదచేత, హతాః = కొట్టబడినవారై, క్షితిమ్ = భూమిని గూర్చి, ప్రయయుః = వెళ్ళిరి.

తా. యుద్ధమునందు వాయువువలె స్వేచ్ఛగా సంచరించగలిగిన ఆ వరుణపుత్రులను మహోదరుడు గదతో కొట్టగా వారు నేలమీదికి వెళ్ళిరి. 37

మూ. తేషాం వరుణసూనూనాం హత్వా యోధాన్ హయాంశ్చ తాన్,
ముమోచాశు మహానాదం విరథాన్ ప్రేక్ష్య తాన్ స్థితాన్.

ప్ర. అ. తేషామ్ = ఆ, వరుణసూనూనామ్ = వరుణపుత్రులయొక్క, యోధాన్ = యోధులను, తాన్ = ఆ, హయాన్ చ = గుఱ్ఱములను, హత్వా = చంపి, విరథాన్ = రథములు లేని, స్థితాన్ = నిలచి ఉన్న, తాన్ = వాళ్ళను, ప్రేక్ష్య = చూచి, ఆశు = శీఘ్రముగా, మహానాదమ్ = మహాధ్వనిని, ముమోచ = విడచెను.

తా. మహోదరుడు వరుణపుత్రుల యోధులను, గుఱ్ఱములను చంపి, రథములు లేక నేలమీద నిలచిన వాళ్ళను చూచి గొప్ప ధ్వని చేసెను. 38

మూ. తే తు తేషాం రథాః సాశ్వాః సహసారథిభిర్వరైః, 39
మహోదరేణ నిహతాః పతితాః పృథివీతలే.

ప్ర. అ. తేషామ్ = వాళ్ళయొక్క, సాశ్వాః = గుఱ్ఱములతో కూడిన, తే = ఆ, రథాః = రథములు, వరైః = శ్రేష్ఠులైన, సారథిభిః సహ = సారథులతో కూడ, మహోదరేణ = మహోదరునిచేత, నిహతాః = కొట్టబడినవై, పృథివీతలే = నేలమీద, పతితాః = పడినవి.

తా. మహోదరుడు కొట్టివేయగా అశ్వములతోను, శ్రేష్ఠులైన సారథులతోను సహా ఆ వరుణపుత్రుల రథములు నేలమీద కూలినవి. 39

మూ. తే తు త్యక్త్వా రథాన్ పుత్రా వరుణస్య మహాత్మనః, 40
ఆకాశే విష్ఠితాః శూరాః స్వప్రభావాన్న వివ్యథుః.

ప్ర. అ. మహాత్మనః = మహాత్ముడైన, వరుణస్య = వరుణునియొక్క, తే = ఆ, శూరాః = శూరులైన, పుత్రాః = పుత్రులు, రథాన్ = రథములను, త్యక్త్వా = విడచి, ఆకాశే = ఆకాశమునందు, విష్ఠితాః = నిలచినవారై, స్వప్రభావాత్ = తమ ప్రభావమువలన, న వివ్యథుః = వ్యథ చెందలేదు.

తా. మహాత్ముడైన వరుణుని శూరులైన కుమారులు రథములు విడచి, ఆకాశముమీద నిలచి సహజముగా ప్రభావవంతు లగుటచేత వ్యథ చెందలేదు. 40

మూ. ధనూంషి కృత్వా సజ్జాని వినిర్భిద్య మహోదరమ్, 41
రావణం సమరే క్రుద్ధాః సహితాః సమవారయన్.

ప్ర. అ. ధనూంషి=ధనస్సులను, సజ్జాని=సిద్ధమైనవాటినిగా, కృత్వా=చేసి, మహోదరమ్= మహోదరుణ్ణి, వినిర్భిద్య = బ్రద్దలుకొట్టి, క్రుద్ధాః = కోపించినవారై, సహితాః = కలిసినవారై, సమరే= యుద్ధమునందు, రావణమ్=రావణుణ్ణి, సమవారయన్ = చుట్టుముట్టిరి.

తా. ఆ వరుణపుత్రులు ధనస్సులు సిద్ధము చేసికొని, మహోదరుణ్ణి భేదించి, కోపించినవారై అందరూ కలసి యుద్ధములో రావణుణ్ణి చుట్టుముట్టిరి. 41

మూ. సాయకైశ్చాపవిభ్రష్టై ర్వజ్రకల్పైః సుదారుణైః, 42
దారయన్తి స్మ సంక్రుద్ధా మేఘా ఇవ మహాగిరిమ్.

ప్ర. అ. సంక్రుద్ధాః=కోపించినవారై, మేఘాః=మేఘములు, మహాగిరిమ్ ఇవ= మహాపర్వతమును వలె, చాపవిభ్రష్టైః= ధనస్సులనుండి బయల్వెడలిన, వజ్రకల్పైః=వజ్రాయుధముతో సమానములైన, సుదారుణైః=చాల భయంకరములైన, సాయకైః = బాణములచేత, దారయన్తి స్మ = చీల్చివేసిరి.

తా. కోపించినవారై వాళ్లు ధనస్సులనుంచి బయల్వెడలిన, వజ్రాయుధము వంటి చాల భయంకరములైన బాణాలతో ఆతనిని మేఘములు పర్వతమును వలె చీల్చిరి. 42

మూ. తతః క్రుద్ధో దశగ్రీవః కాలాగ్నిరివ మూర్ఛితః, 43
శరవర్షం మహాఘోరం తేషాం మర్మస్వపాతయత్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దశగ్రీవః = రావణుడు, క్రుద్ధః=కోపించినవాడై, కాలాగ్నిరివ = ప్రళయకాలాగ్ని వలె, మూర్ఛితః = విజృంభించినవాడై, తేషామ్= వాళ్ళ యొక్క, మర్మసు = మర్మస్థానములయందు, మహాఘోరమ్ = చాల భయంకరమైన, శరవర్షమ్ = బాణవర్షమును, అపాతయత్ = పడవేసెను.

తా. అప్పుడు కోపించిన రావణుడు ప్రళయకాలాగ్ని వలె విజృంభించి వాళ్ళ మర్మస్థానములయందు భయంకరమైన బాణవర్షమును కురిపించెను. 43

మూ. ముసలాని విచిత్రాణి తతో భల్లశతాని చ. 44
పట్టిశాంశ్చైవ శక్తీశ్చ శతఘ్నీర్మహతీరపి,
పాతయామాస దుర్ధర్షస్తేషాముపరి విష్ఠితః. 45

ప్ర. అ. దుర్ధర్షః = ఎదిరింప శక్యము కాని అతడు, విష్ఠితః = స్థిరముగా నిలచినవాడై, తతః = అటుపిమ్మట, విచిత్రాణి = విచిత్రములైన, ముసలాని = ముసలములను, భల్లశతాని చ = వందలకొలది భల్ల బాణములను, పట్టిశాన్ చైవ = పట్టిశములను, శక్తీః = శక్తులను, మహతీః = గొప్ప, శతఘ్నీః = శతఘ్నులను, తేషామ్ = వాళ్లయొక్క, ఉపరి = పైన, పాతయామాస = పడవేసెను.

తా. ఎదురింప శక్యము కాని ఆ రావణుడు స్థిరముగా నిలచి విచిత్రములైన ముసలములను, వందలకొలది భల్ల బాణములను, పట్టిశములను, శక్తులను, గొప్ప శతఘ్నులను వాళ్లపై ప్రయోగించెను. 44, 45

మూ. అపవిద్ధాస్తు తే వీరా వినిష్పేతుః పదాతయః,
తతస్తేనైవ సహసా సీదన్తి స్మ పదాతినః, 46
మహాపఙ్క మివాసాద్య కుఞ్జరాః షష్టిహాయనాః.

ప్ర. అ. అపవిద్ధాః = చెదరగొట్టబడిన, పదాతయః = కాలిబంటులైన, తే వీరాః = ఆ వీరులు, వినిష్పేతుః = శీఘ్రముగా వచ్చిరి. తతః అటుపిమ్మట, తేనైవ = ఆ ఆయుధవర్షముచేతనే, పదాతినః = కాళ్ళతో నడచుచున్న ఆ వరుణపుత్రులు, మహాపఙ్కమ్ = గొప్ప బురదను, ఆసాద్య = పొంది, షష్టిహాయనాః = అరువది సంవత్సరములు గల, కుఞ్జరాః ఇవ = ఏనుగులు వలె, సహసా = వెంటనే, సీదన్తి స్మ = క్షీణించుచుండిరి.

తా. ఆ విధముగా చెదరగొట్టబడిన, పాదచారులైన ఆ వీరులు శీఘ్రముగా అతనిపైదికి వచ్చిరి. పిమ్మట ఆ ఆయుధవర్షముచేత నడచుచు యుద్ధము చేయుచున్న ఆ వరుణపుత్రులు గొప్ప బురదలో చిక్కుకొన్న, అరవై సంవత్సరాల వయస్సు గల ఏనుగులు వలె క్షీణించుచుండిరి. 46

మూ. సీదమానాన్సుతాన్ దృష్ట్వా విహ్వలాన్ స మహాబలః,
ననాద రావణో హర్షాన్మహానమ్బుధరో యథా.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, సః రావణః = ఆ రావణుడు, సీదమానాన్ = క్షీణించుచున్న, విహ్వలాన్ = వ్యాకులులైన, సుతాన్ = వరుణుని పుత్రులను, దృష్ట్వా = చూచి, మహాన్ = గొప్ప, అమ్బుధరో యథా = మేఘము వలె, హర్షాత్ = సంతోషమువలన, ననాద = ధ్వని చేసెను.

తా. గొప్ప బలము గల ఆ రావణుడు క్షీణించుచున్న, వ్యాకులులైన వరుణ పుత్రులను చూచి సంతోషముతో పెద్ద మేఘము వలె ధ్వని చేసెను. 47

మూ. తతో రక్షో మహానాదాన్ ముక్త్వా హన్తి స్మ వారుణాన్,
నానాప్రహరణోపేతైర్ధారాపాతైరివామ్బుదః.

ప్ర అ. తతః = అటుపిమ్మట, రక్షః = రావణుడు, మహానాదాన్ = గొప్ప ధ్వనులను, ముక్త్వా = విడచి, నానాప్రహరణోపేతైః = దగ్గరగా అందిన అనేకవిధములైన ఆయుధములచేత, ధారాపాతైః = జలధారాపాతములచేత, అమ్బుదః ఇవ = మేఘము వలె, వారుణాన్ = వరుణపుత్రులను, హన్తి స్మ = కొట్టెను.

తా పిమ్మట ఆ రావణుడు గొప్ప ధ్వని చేయుచు, చేతికి అందిన ఆయుధములతో జలధారాపాతములచేత మేఘము వలె వరుణకుమారులను కొట్టెను. 48

మూ. తతస్తే విముఖాః సర్వే పతితా ధరణీతలే, 49
రణాత్స్వపురుషైః శీఘ్రం గృహాణ్యేవ ప్రవేశితాః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, విముఖాః = విముఖులైన, ధరణీతలే = నేలమీద, పతితాః = పడిన, తే = వారు, సర్వే = అందరూ, స్వపురుషైః = తమ మనుష్యులచేత, రణాత్ = యుద్ధమునుండి, శీఘ్రమ్ = శీఘ్రముముగా, గృహాణ్యేవ = గృహములను, ప్రవేశితాః = ప్రవేశపెట్టబడిరి.

తా. యుద్ధపరాఙ్ముఖులై నేలమీద పడిన వారినందరినీ వారి మనుష్యులు యుద్ధరంగమునుండి ఇండ్లకు తీసికొనిపోయిరి. 49

మూ. తానబ్రవీత్తతో రక్షో వరుణాయ నివేద్యతామ్, 50
రావణం త్వబ్రవీన్మన్త్రి ప్రహాసో నామ వారుణః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రక్షః = రావణుడు, తాన్ = వాళ్లను గూర్చి, అబ్రవీత్ = పలికెను. వరుణాయ = వరుణునకు, నివేద్యతామ్ = తెలుపబడుగాక. ప్రహాసో నామ = ప్రహాసు డను, వారుణః = వరుణుని సంబంధమైన, మన్త్రీ = మంత్రి, రావణమ్ = రావణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు రావణుడు వారితో "వరుణునికి చెప్పుడు" అని పలికెను. ప్రహాసు డను వరుణుని మంత్రి రావణునితో ఇట్లనెను. 50

మూ. గతః ఖలు మహారాజో బ్రహ్మలోకం జలేశ్వరః, 51
గాన్ధర్వం వరుణః శ్రోతుం యం త్వమాహ్వయసే యుధి.

ప్ర. అ. యమ్ = ఎవనిని, త్వమ్ = నీవు, యుధి = యుద్ధమునందు, ఆహ్వయసే = పిలచుచున్నావో, అట్టి, మహారాజః = మహారాజైన, జలేశ్వరః = జలముల అధిపతియైన, వరుణః = వరుణుడు, గాన్ధర్వమ్ = సంగీతమును, శ్రోతుమ్ = వినుటకు, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును గూర్చి, గతః ఖలు = వెళ్ళినాడు కదా.

తా. నీవు ఎవనిని యుద్ధానికి పిలచుచున్నావో ఆ మహారాజా, జలాధిపతీ అయిన వరుణుడు సంగీతము వినుటకై బ్రహ్మలోకమునకు వెళ్ళినాడు. 51

మూ. తత్కిం తవ వృథా వీర పరిశ్రమ్య గతే నృపే, 52
యే తు సంనిహితా వీరాః కుమారాస్తే పరాజితాః.

ప్ర. అ. వీర = ఓ! వీరుడా! తత్ = ఆ కారణమువలన, నృపే = రాజు, గతే = వెళ్ళిన వాడగుచుండగా, తవ = నీకు, వృథా = వ్యర్థముగా, పరిశ్రమ్య = పరిశ్రమించి, కిమ్ = ఏమి ప్రయోజనము? వీరాః = వీరులైన, యే = ఏ, కుమారాః = కుమారులు, సంనిహితాః = సంనిహితులో, తే = వారు, పరాజితాః = ఓడింపబడినారు.

తా. "అందువలన ఓ వీరుడా! రాజు లేనప్పుడు నీవు వ్యర్థముగా పరిశ్రమ చేసి ఏమి ప్రయోజనము? ఇక్కడ ఉన్న వీరులైన వరుణుని పుత్రులను నీవు ఓడించే ఉన్నావు కదా?" 52

మూ. రాక్షసేన్ద్రస్తు తచ్ఛ్రుత్వా నామ విశ్రావ్య చాత్మనః, 53
హర్షాన్నాదం విముఞ్చన్వై నిష్క్రాన్తో వరుణాలయాత్.

ప్ర. అ. రాక్షసేన్ద్రస్తు = రావణుడైతే, తత్ = దానిని, శ్రుత్వా = విని, ఆత్మనః = తనయొక్క, నామ = పేరును, విశ్రావ్య = వినిపింపచేసి, హర్షాత్ = సంతోషమువలన, నాదమ్ = ధ్వనిని, విముఞ్చన్ = విడచుచు, వరుణాలయాత్ = వరుణుని లోకమునుండి, నిష్క్రాన్తః వై = వెళ్ళిపోయెను.

తా. రావణుడు ఆ మాటలు విని తన పేరు చాటుకొని, సంతోషముతో ధ్వని చేయుచు వరుణలోకమునుండి వెళ్ళిపోయెను. 53

మూ. ఆగతస్తు పథా యేన తేనైవ వినివృత్య సః, 54
లఙ్కామభిముఖో రక్షో నభస్తలగతో యయౌ.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్రయోవింశః సర్గః.

ప్ర. అ. సః రక్షః = ఆ రాక్షసుడు, యేన = ఏ, పథా = మార్గముచేత, ఆగతః = వచ్చినాడో, తేనైవ = ఆ మార్గముచేతనే, వినివృత్య = మరలి, నభస్తలగతః = ఆకాశమును పొందినవాడై, లఙ్కామ్ = లంకను గూర్చి, అభిముఖః = అభిముఖుడై, యయౌ = వెళ్ళెను.

తా. ఆ రావణుడు ఏ దారిన వచ్చెనో ఆ దారినే వెనుకకు మరలి లంకాభిముఖుడై ఆకాశమార్గమున వెళ్ళెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ఇరువదిమూడవ సర్గ సమాప్తము.

అథ ప్రక్షిప్తాః పఞ్చ సర్గాః

(రాబోవు ఐదు సర్గలు ప్రక్షిప్త సర్గలు. వ్యాఖ్యాతలు వీటికి వ్యాఖ్యలు వ్రాయలేదు.)

[రావణుడు బలిచక్రవర్తి నివసించు అశ్మనగరమునకు వెళ్లి ఆతనిని చూచి మాటలాడుట.]

మూ. తతోఽశ్మనగరం భూయో విచేరుర్యుద్ధదుర్మదాః,
యత్రాపశ్యద్దశగ్రీవో గృహం పరమభాస్వరమ్. 1

వైదూర్యతోరణాకీర్ణం ముక్తాజాలవిభూషితమ్,
సువర్ణస్తమ్భగహనం వేదికాభిః సమన్తతః. 2

వజ్రస్ఫటికసోపానం కిఙ్కిణీజాల సంవృతమ్,
బహ్వాసనయుతం రమ్యం మహేన్ద్రభవనోపమమ్. 3

ప్ర. అ. తతః = అటుపిమ్మట, యుద్ధదుర్మదాః = యుద్ధమునందు పెద్ద మదము గల ఆ రాక్షసులు, భూయః = మరల, అశ్మనగరమ్ = అశ్మనగరమును, విచేరుః = సంచరించిరి. యత్ర = ఏ నగరమునందు. దశగ్రీవః = రావణుడు, పరమభాస్వరమ్ = చాల ప్రకాశించుచున్నది, వైదూర్య తోరణాకీర్ణమ్ = వైదూర్య మాణిక్యముల వికారమైన ముఖద్వారములతో వ్యాప్తము, ముక్తాజాలవిభూషితమ్ = ముత్యముల సముదాయముచేత అలంకరించ బడినదీ, సువర్ణస్తమ్భగహనమ్ = బంగారు స్తంభములతో ప్రవేశింప శక్యముకానిదీ, సమన్తతః = అన్ని వైపులా, వేదికాభిః = అరుగులతో కూడినదీ, వజ్రస్ఫటిక సోపానమ్ = వజ్రములయొక్క, స్ఫటికములయొక్క మెట్లు గలది, కిఙ్కిణీజాలసంయుతమ్ = చిరుగంటల సముదాయముతో కూడినదీ, బహ్వాసనయుతమ్ = అనేకమైన ఆసనములతో కూడినదీ, రమ్యమ్ = సుందరము, మహేన్ద్రభవనోపమమ్ = మహేంద్రుని భవనముతో సమానమూ అయిన, గృహమ్ = గృహమును, అపశ్యత్ = చూచెనో.

తా. పిమ్మట యుద్ధమునందు అత్యధికమైన మదము గల ఆ రాక్షసులు

మరల అశ్మనగరములో సంచరించిరి. అక్కడ రావణునకు చాల ప్రకాశించుచున్న ఒక గృహము కనబడెను. వైదూర్యమాణిక్యముల ముఖద్వారములతో నిండిన ఆ గృహము ముత్యముల జాలములచే (అల్లికలచే) అలంకరింపబడెను. బంగారు స్తంభములతో నిండిన ఆ గృహమునందు నలు మూలలా అరుగులు ఉండెను. మెట్లు వజ్రములతోను, స్ఫటికములతోను నిర్మింపబడెను. అంతటా చిరుగంటలు కట్టబడెను. అనేకములైన ఆసనములతో ఆ గృహము మహేంద్ర భవనము వలె సుందరముగా ఉండెను. 1-3

మూ. దృష్ట్వా గృహవరం రమ్యం దశగ్రీవః ప్రతాపవాన్,
కస్యేదం భవనం రమ్యం మేరుమన్దరసంనిభమ్. 4
గచ్ఛ ప్రహస్త శీఘ్రం త్వం జానీష్వ భవనోత్తమమ్.

ప్ర. అ. ప్రతాపవాన్ = ప్రతాపవంతుడైన, దశగ్రీవః = రావణుడు, రమ్యమ్ = సుందరమైన, గృహవరమ్ = గృహశ్రేష్ఠమును, దృష్ట్వా = చూచి, మేరుమన్దరసంనిభమ్ = మేరుపర్వతముతోను, మందరపర్వతముతోను సమానమైన, రమ్యమ్ = సుందరమైన, భవనమ్ = భవనము, కస్య = ఎవనిదో ! ప్రహస్త = ప్రహస్తుడా ! త్వమ్ = నీవు, శీఘ్రమ్ = శీఘ్రముగా, గచ్ఛ = వెళ్లుము. భవనోత్తమమ్ = ఉత్తమమైన భవనమును గూర్చి, జానీష్వ = తెలుసుకొనుము.

తా. ప్రతాపవంతుడైన రావణుడు రమ్యమైన ఆ శ్రేష్ఠమైన గృహమును చూచి, "మేరుమందరపర్వతములతో సమానమైన సుందరమైన ఈ భవనము ఎవరిదో"అని అనుకొనుచు "ప్రహస్తా ! నీవు శీఘ్రముగా వెళ్ళి శ్రేష్ఠమైన ఈ భవనమును గూర్చి తెలుసుకొనుము"అని ఆతనిని ఆదేశించెను. 4

మూ. ఏవముక్తః ప్రహస్తస్తు ప్రవివేశ గృహోత్తమమ్, 5
నిఃశూన్యం ప్రైక్షత వరం పునః కక్ష్యాన్తరే యయౌ.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, ప్రహస్తః తు = ప్రహస్తుడు, గృహోత్తమమ్ = ఉత్తమమైన గృహమును, ప్రవివేశ = ప్రవేశించెను. వరమ్ = శ్రేష్ఠమైన ఆ స్థానమును, నిఃశూన్యమ్ = శూన్యమైనదానినిగా, ప్రైక్షత = చూచెను. పునః = మరల, కక్ష్యాన్తరే = మరియొక వాకలియందు, యయౌ = వెళ్ళెను.

తా. ప్రహస్తుడు అతని ఆజ్ఞ ప్రకారము ఆ గృహశ్రేష్ఠములో ప్రవేశించెను. కాని ఆ ప్రదేశము జనశూన్యమై ఉండుట చూచి మరియొక వాకలిలో ప్రవేశించెను.

మూ. సప్త కక్ష్యాన్తరం గత్వా తతో జ్వాలామపశ్యత, 6
తతో దృష్టః పుమాంస్తత్ర హృష్టో హాసం ముమోచ సః.

ప్ర. అ. సప్తకక్ష్యాన్తరమ్=ఏడు వాకిళ్ల మధ్య భాగమును గూర్చి, గత్వా = వెళ్ళి, తతః = అటుపిమ్మట, జ్వాలామ్ = జ్వాలను, అపశ్యత = చూచెను. తతః = అటుపిమ్మట, తత్ర = అక్కడ, పుమాన్ = ఒక పురుషుడు, దృష్టః = చూడబడెను. హృష్టః=సంతోషించిన, సః=అతడు, హాసమ్=నవ్వును, ముమోచ = విడచెను.

తా. ఏడు వాకిళ్ళ లోపలికి వెళ్ళి అతడు జ్వాలను చూచెను. పిమ్మట ఒక పురుషుడు కనబడెను. అతడు సంతోషించి బిగ్గరగా నవ్వెను. 6

మూ. శ్రుత్వా స తు మహాహాసమూర్ధ్వరోమాభవత్తదా, 7
జ్వాలామధ్యే స్థిత స్తత్ర హేమమాలీ న్యదృశ్యత,
ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్యః సాక్షాదివ యమః స్థితః. 8

ప్ర. అ. సః = అతడు, తదా=అప్పుడు, మహాహాసమ్=గొప్ప నవ్వును, శ్రుత్వా=విని, ఊర్ధ్వరోమా = పైకి రోమములు కలవాడుగా, అభవత్=అయెను. తత్ర=అక్కడ, జ్వాలామధ్యే=జ్వాల మధ్యయందు, స్థితః=ఉన్న, హేమమాలీ= బంగారు మాల గల పురుషుడు, న్యదృశ్యత = చూడబడెను. ఆదిత్యః ఇవ= సూర్యుడు వలె, దుష్ప్రేక్ష్యః=చూడ శక్యము కాని అతడు, సాక్షాత్=సాక్షాత్తు, యమః ఇవ = యముడు వలె, స్థితః = ఉండెను.

తా. ఆ అట్టహాసము వినగానే అతని ఒడలు గగుర్పొడిచెను. ఆ జ్వాలా మధ్యమునందు బంగారు మాల ధరించిన పురుషుడు కనబడెను. సూర్యుడు వలె చూడశక్యముకాని ఆ పురుషుడు సాక్షాత్తు యముడు వలె ఉండెను. 7,8

మూ. తథా దృష్ట్వా తు వృష్టాన్తం త్వరమాణో వినిర్గతః,
వినిర్గమ్యాబ్రవీత్సర్వం రావణాయ నిశాచరః. 9

ప్ర. అ. నిశాచరః = ఆ రాక్షసుడు, తథా = అట్లు, వృత్తాన్తమ్ = వృత్తాంతమును, దృష్ట్వా = చూచి, త్వరమాణః = తొందరపడుచు, వినిర్గతః = బయలు వెడలెను. వినిర్గమ్య = బైటకు వచ్చి, సర్వమ్ = సమస్తమును, రావణాయ = రావణునకు, అబ్రవీత్ = చెప్పెను.

తా. ప్రహస్తుడు ఆ విషయమును చూచి తొందరగా బైటకు వచ్చి అది అంతా రావణునకు తెలిపెను. 9

మూ. అథ రామ దశగ్రీవః పుష్పకాదవరుహ్య సః,
ప్రవేష్టుమిచ్ఛన్ వేశ్మాథ భిన్నాఞ్జనచయోపమః. 10

ప్ర. అ. రామ = రామా! అథ = అటుపిమ్మట, భిన్నాఞ్జనచయోపమః = విరగొట్టబడిన కాటుకరాసితో సమానుడైన, సః దశగ్రీవః = ఆ రావణుడు, పుష్పకాత్ = పుష్పకమునుండి, అవరుహ్య = దిగి, అథ = పిమ్మట, వేశ్మ = గృహమును, ప్రవేష్టుమ్ = ప్రవేశించుటకు, ఇచ్ఛన్ = కోరుచు (ఉండెను).

తా. రామా! విరగొట్టిన కాటుక రాసివలె ఉన్న ఆ రావణుడు పుష్పకమునుండి దిగి ఆగృహములో ప్రవేశించుటకు ప్రయత్నించెను. 10

మూ. చన్ద్రమౌలిర్వపుష్మాంశ్చ పురుషోఽస్యాగ్రతః స్థితః,
ద్వారమావృత్య సహసా జ్వాలాజిహ్వో భయానకః. 11

రక్తాక్షశ్చారుదశనో బిమ్బోష్ఠ శ్చారుదర్శనః,
మహాభీషణనాసశ్చ కమ్బుగ్రీవో మహాహనుః. 12

ప్ర. అ. చన్ద్రమౌలిః = చంద్రుడు శిరస్సుపై కలవాడు, వపుష్మాన్ = పెద్ద శరీరము గలవాడు, జ్వాలాజిహ్వః = జ్వాలవంటి నాలుక గలవాడు, భయానకః = భయంకరుడు, రక్తాక్షః = ఎఱ్ఱని కళ్ళు గలవాడు, చారుదశనః = అందమైన దంతములు గలవాడు, బిమ్బోష్ఠః = దొండపండు వంటి పెదవులు గలవాడు, చారుదర్శనః = అందమైన దర్శనము గలవాడు, మహాభీషణనాసశ్చ = చాల భయంకరమైన ముక్కు గలవాడు, కమ్బుగ్రీవః = శంఖము వంటి కంఠము గలవాడు, మహాహనుః = పెద్ద దవుడలు గలవాడు అయిన, పురుషః = పురుషుడు,

సహసా = వెంటనే, ద్వారమ్ = ద్వారమును, అవృత్య = కప్పి, అస్య = వీని యొక్క, అగ్రతః = ఎదుట, స్థితః = నిలబడెను.

తా. శిరస్సుపై చంద్రుణ్ణి ధరించిన పెద్ద శరీరము గల ఒక భయంకరుడైన పురుషుడు హటాత్తుగా వచ్చి ద్వారమునకు అడ్డముగా రావణుని ఎదుట నిలబడెను. అతని నాలుక అగ్నిజ్వాల వలె ఉండెను. కళ్ళు ఎఱ్ఱగా ఉండెను. దంతములు అందముగా ఉండెను. పెదవులు దొండపండు వలె ఎఱ్ఱగా ఉండెను. అతడు చూచుటకు అందముగా ఉండెను. ముక్కు చాల భయంకరముగా ఉండెను. శంఖము వంటి కంఠము గల అతని దవుడలు చాల పెద్దవిగా ఉండెను. 11, 12

మూ. రూఢశ్మశ్రుర్నిగూఢాస్థిర్దంష్ట్రిలో లోమహర్షణః,
గృహీత్వా లోహముసలం ద్వారం విష్టభ్య తిష్ఠతి. 13

ప్ర. అ. రూఢశ్మశ్రుః = (దట్టముగా) మొలచిన మీసము గలవాడు, నిగూఢాస్థిః = అణగిన (ఎముకలు) గలవాడు, దంష్ట్రిలః = పెద్ద కోరలు గలవాడు, లోమహర్షణః = రోమాంచమును కలిగించువాడు అయిన ఆ పురుషుడు, లోహముసలమ్ = ఇనుప ముసలమును, గృహీత్వా = గ్రహించి, ద్వారమ్ = ద్వారమును, విష్టభ్య = అడ్డుకొని, తిష్ఠతి = నిలచి ఉన్నాడు.

తా. ఇనుప రోకలిని చేతిలో ధరించి, ద్వారానికి అడ్డముగా నిలచిన అతని మీసములు చాలా దట్టముగా ఉండెను. ఎముకలు పైకి కనబడుటలేదు. (కండరముల పుష్టితో ఉండెను). పెద్ద కోరలతో గగుర్పాటు కలిగించేటట్లు ఉండెను. 13

మూ. అథ సందర్శనాత్తస్య ఊర్ధ్వరోమా బభూవ సః,
హృదయం కమ్పతే చాస్య వేపథుశ్చాప్యజాయత. 14

ప్ర. అ. అథ = పిమ్మట, తస్య = వానియొక్క, సందర్శనాత్ = చూచుట వలన, సః = అతడు, ఊర్ధ్వలోమా = పైకి లేచిన రోమములు కలవాడు, బభూవ = ఆయెను. అస్య = వీనియొక్క, హృదయమ్ = హృదయము, కమ్పతే = కంపించుచున్నది. వేపథుః చ = వణకు కూడ, అజాయత = పుట్టెను.

తా. అతనివి చూడగానే రావణుని ఒడలు గగుర్పొడిచెను. గుండె కొట్టుకొనెను. వణకు పుట్టెను. 14

మూ. నిమిత్తాన్యమనోజ్ఞాని దృష్ట్వా రామ వ్యచిన్తయత్,
అథ చిన్తయతస్తస్య స ఏవ పురుషోఽబ్రవీత్. 15

ప్ర. అ. రామ = రామా! అమనోజ్ఞాని = మనోహరములు కాని, నిమిత్తాని = శకునములను, దృష్ట్వా = చూచి, వ్యచిన్తయత్ = ఆలోచించెను. తస్య = అతడు, చిన్తయతః = ఆలోచించుచుండగా, సః = ఆ, పురుషః ఏవ = పురుషుడే, అబ్రవీత్ = పలికెను.

తా. రామా! ప్రతికూలముగా ఉన్న శకునములను చూచి రావణుడు ఆలోచించుచుండెను. అతడు ఆలోచించుచుండగా ఆ పురుషుడే ఇట్లు పలికెను. 15

మూ. కిం త్వం చిన్తయసే రక్షో బ్రూహి విస్రబ్ధమానసః,
యుద్ధాతిథ్యమహం వీర కరిష్యే రజనీచర. 16

ప్ర. అ. రక్షః = రాక్షసుడా! త్వమ్ = నీవు, కిమ్ = ఏమి, చిన్తయసే = ఆలోచించుచున్నావు? విస్రబ్ధమానసః = నమ్మకము గల మనస్సు కలవాడవై, బ్రూహి = చెప్పుము. వీర = ఓ! వీరుడా! రజనీచర = రాక్షసుడా! అహమ్ = నేను, యుద్ధాతిథ్యమ్ = యుద్ధరూపమైన అతిథ్యమును, కరిష్యే = చేయగలను.

తా. రాక్షసుడా! నీవు ఏమి ఆలోచించుచున్నావు? నిఃసంకోచముగా చెప్పుము. ఓ! వీరుడవైన రాక్షసుడా! నీకు నేను యుద్ధరూపమైన అతిథ్యము ఇచ్చెదను. 16

మూ. ఏవముక్త్వా స తద్రక్షః పునర్వచనమబ్రవీత్,
యోత్స్యసే బలినా సార్ధమథవా మన్యసే కథమ్. 17

ప్ర. అ. సః = ఆ పురుషుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తత్ = ఆ, రక్షః = రాక్షసుని గూర్చి, పునః = మరల, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. బలినా సార్ధమ్ = బలితో కూడ, యోత్స్యసే = యుద్ధము చేసెదవా? అథవా = లేక, కథమ్ = ఎట్లు, మన్యసే = తలచుచున్నావు?

తా. ఆ పురుషుడు ఇట్లు పలికి మరల రావణునితో ఇట్లనెను-"బలితో కూడ యుద్ధము చేసెదవా? లేక మరొక విధముగా ఆలోచించుచున్నావా?" 17

మూ. రావణోఽభిహితో భూయ ఊర్ధ్వరోమా వ్యజాయత,
అథ ధైర్యం సమాలమ్బ్య రావణో వాక్యమబ్రవీత్. 18

ప్ర. అ. అభిహితః=ఇట్లు పలకబడిన, రావణః=రావణుడు, భూయః= మరల, ఊర్ధ్వరోమా = లేచిన రోమములు గలవాడుగా, వ్యజాయత = అయెను. అథ = పిమ్మట, రావణః = రావణుడు, ధైర్యమ్ = ధైర్యమును, సమాలమ్బ్య = అవలంబించి, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. అతని మాటలు వినగానే రావణునకు మరల గగుర్పాటు కలిగెను. పిదప అతడు ధైర్యము అవలంబించి ఇట్లు పలికెను. 18

మూ. గృహేషు తిష్ఠతే కో హి తద్ బ్రూహి వదతాం వర,
తేనైవ సహ యోత్స్యామి యథా వా మన్యతే భవాన్. 19

ప్ర. అ. వదతామ్ = మాటలాడుచున్నవారిలో, వర = శ్రేష్ఠుడా ! గృహేషు = గృహమునందు, కః హి = ఎవడు, తిష్ఠతే = ఉన్నాడో, తత్ = దానిని, బ్రూహి=చెప్పుము. తేనైవ సహ = అతనితోనే, యోత్స్యామి=యుద్ధము చేసెదను. భవాన్ = నీవు, యథా వా = ఎట్లు, మన్యసే = తలచుచున్నావో.

తా. మాటలాడువారిలో శ్రేష్ఠుడా! ఈ గృహములో ఎవరున్నారో చెప్పుము; అతనితోనే యుద్ధము చేసెదను. లేదా నీవు ఎట్లు తలచెదవో అట్లే చేసెదను.

మూ. స ఏనం పునరప్యాహ దానవేన్ద్రోఽత్ర తిష్ఠతి,
ఏష వై పరమోదారః శూరః సత్యపరాక్రమః. 20

ప్ర. అ. సః = అతడు, పునరపి = మరల, ఏనమ్ = ఇతనిని గూర్చి, ఆహ = పలికెను. అత్ర = ఇక్కడ, దానవేన్ద్రః = దానవుల ప్రభువు, తిష్ఠతి = ఉన్నాడు. ఏషః = ఇతడు, పరమోదారః=మిక్కిలి ఉదారుడు, శూరః = శూరుడు, సత్యపరాక్రమః వై = సత్యమైన పరాక్రమము గలవాడు.

తా. ఆ పురుషుడు మరల ఇట్లు పలికెను–"ఈ గృహములో దానవప్రభువు నివసించుచున్నాడు. ఇతడు చాల ఔదార్యవంతుడు; శూరుడు; సత్యమైన పరాక్రమము గలవాడు. 20

మూ. వీరో బహుగుణోపేతః పాశహస్త ఇవాన్తకః,
బాలార్క ఇవ తేజస్వీ సమరేష్వనివర్తకః. 21

ప్ర. అ. వీరః = వీరుడు, బహుగుణోపేతః = అనేకసద్గుణములతో కూడినవాడు, పాశహస్తః=పాశము హస్తమునందు గల, అన్తకః ఇవ=యముని వంటివాడు, బాలార్కః ఇవ= ఉదయసూర్యుడు వలె, తేజస్వీ = తేజస్సు గల వాడు, సమరేషు = యుద్ధములయందు, అనివర్తనః = మరలనివాడు.

తా. ఇతడు వీరుడు. చాల సద్గుణములు గలవాడు. పాశము హస్తము నందున్న యమునివంటివాడు. ఉదయకాలసూర్యుడు వలె తేజస్సు కలవాడు. యుద్ధములలో వెనుకకు తిరగనివాడు. 21

మూ. అమర్షీ దుర్జయో జేతా బలవాన్ గుణసాగరః,
ప్రియంవదః సంవిభాగీ గురువిప్రప్రియః సదా. 22

ప్ర. అ. అమర్షీ= కోపముగలవాడు, దుర్జయః = జయింప శక్యముకాని వాడు, జేతా = జయించేవాడు. బలవాన్ = బలవంతుడు. గుణసాగరః = గుణము లకు సముద్రుడు. ప్రియంవదః=ప్రియమును పలుకువాడు. సంవిభాగీ=దానము చేయువాడు. సదా = ఎల్లప్పుడూ, గురువిప్రప్రియః = గురువులు, బ్రాహ్మణులు ప్రియులుగా కలవాడు.

తా. ఇతడు పట్టుదల కలవాడు. జయింప శక్యముకానివాడు. జయించు వాడు. బలవంతుడు. గుణసముద్రుడు. ప్రియముగా మాటలాడువాడు. దానగుణ వంతుడు గురువులన్నా, బ్రాహ్మణులన్నా ఇష్ట మున్నవాడు. 22

మూ. కాలాకాఙ్క్షీ మహాసత్త్వః సత్యవాక్ సౌమ్యదర్శనః,
దక్షః సర్వగుణోపేతః శూరః స్వాధ్యాయతత్పరః, 23
ఏష గచ్ఛతి వాత్యేష జ్వలతే తపతే తథా.

ప్ర. అ. కాలాకాఙ్క్షీ= కాలమును కోరువాడు, మహాసత్త్వః = గొప్ప ధైర్యము గలవాడు, సత్యవాక్ = సత్యమైన వాక్కుగలవాడు. సౌమ్యదర్శనః= సౌమ్యమైన దర్శనము కలవాడు. దక్షః=సమర్థుడు. సర్వగుణోపేతః = సమస్త గుణములతో కూడినవాడు, శూరః = శూరుడు, స్వాధ్యాయతత్పరః = స్వాధ్యాయ

మునందు ఆసక్తి గలవాడు, ఏషః = ఇతడు, గచ్ఛతి = వెళ్లుచున్నాడు; ఏషః = ఇతడు, వాతి = వీచుచున్నాడు, జ్వలతే = మండుచున్నాడు; తథా = మరియు, తపతే = తపించుచున్నాడు.

తా. గొప్ప ధైర్యము గల ఇతడు తొందరపాటు లేక తగు సమయము నకై వేచి ఉండువాడు, సత్యము పలుకువాడు. ఈతడు చూచుటకు చాల సౌమ్యుడు. కార్యసమర్థుడు. సద్గుణములు ఉన్నవాడు, శూరుడు. వేదాధ్యయనమునందు ఆసక్తి గలవాడు. ఇతడు నడచును. ఇతడు వీచును. ఇతడు ప్రజ్వలించును. వేడి కలిగించును. (అనగా వాయ్వగ్న్యాదుల శక్తి ఇతని కున్నదని భావము) 23

మూ. దేవైశ్చ భూతసంఘైశ్చ పన్నగైశ్చ పతత్రిభిః 24
భయం యో నాభిజానాతి తేన త్వం యోద్ధుమిచ్ఛసి.

ప్ర. అ. యః = ఎవడు, దేవైశ్చ = దేవతలతోను, భూతసంఘైశ్చ = భూతముల సముదాయములతోను, పన్నగైశ్చ = సర్పములతోను, పతత్రిభిః = పక్షులతోను, భయమ్ = భయమును, నాభిజానాతి = ఎరుగడో, తేన = అట్టి వానితో, త్వమ్ = నీవు, యోద్ధుమ్ = యుద్ధముచేయుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు.

తా. ఇతడు దేవతలకు గాని, భూతముల సముదాయములకు గాని, సర్పములకు గాని, పక్షులకు గాని భయపడి ఎరుగడు. అట్టి వానితో నీవు యుద్ధము చేయవలె నని కోరుచున్నావు! 24

మూ. బలినా యది తే యోద్ధుం రోచతే రాక్షసేశ్వర, 25
ప్రవిశ త్వం మహాసత్త్వ సంగ్రామం కురు మా చిరమ్.

ప్ర. అ. మహాసత్త్వ = గొప్ప బలము గలవాడా! రాక్షసేశ్వర = రాక్షస రాజా! బలినా = బలితో, యోద్ధుమ్ = యుద్ధముచేయుటకు, తే = నీకు, రోచతే యది = ఇష్టమైనచో, త్వమ్ = నీవు, ప్రవిశ = ప్రవేశించుము. సంగ్రామమ్ = యుద్ధమును, కురు = చేయుము, చిరమ్ = చిరకాలము (ఆలస్యము), మా = వద్దు.

తా. మహాబలవంతుడవైన రాక్షసరాజా! నీకు బలితో యుద్ధము చేయుట ఇష్టమైనచో లోపలికి వెళ్ళుము. యుద్ధము చేయుము. ఆలస్యము చేయకుము. 25

మూ. ఏవముక్తో దశగ్రీవః ప్రవివేశ యతో బలిః, 26
స విలోక్యాథ లఙ్కేశం జహాస దహనోపమః.
ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్యః స్థితో దానవసత్తమః. 27

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, దశగ్రీవః = రావణుడు, బలిః = బలి, యతః = ఎటు వైపున ఉండెనో అటు వైపు, ప్రవివేశ = ప్రవేశించెను. అథ = పిమ్మట, దహనోపమః = అగ్నితో సమానుడు, ఆదిత్యః ఇవ = సూర్యుడు వలె, దుష్ప్రేక్ష్యః = చూడ శక్యము కానివాడుగా, స్థితః = ఉన్న, సః దానవసత్తమః = ఆ దానవశ్రేష్ఠుడు, లఙ్కేశమ్ = రావణుని, విలోక్య = చూచి, జహాస = బిగ్గరగా నవ్వెను.

తా. ఆ మాటలు విని రావణుడు బలి ఉన్న వైపు ప్రవేశించెను. అగ్నితో సమానుడు, సూర్యుడు వలె చూడ శక్యము కానివాడు అయిన ఆ దానవాధిపతి రావణుని చూచి బిగ్గరగా నవ్వెను. 26, 27

మూ. అథ సందర్శనాదేవ బలిర్వై విశ్వరూపవాన్,
స గృహీత్వా చ తద్రక్ష ఉత్సఙ్గే స్థాప్య చాబ్రవీత్. 28

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సందర్శనాదేవ = చూచిన వెంటనే, విశ్వరూపవాన్ = వివిధరూపములు గల, సః = ఆ, బలిః = బలి, తత్ రక్షః = ఆ రాక్షసుణ్ణి గృహీత్వా = పట్టుకొని, ఉత్సఙ్గే = ఒడిలో, స్థాప్య = ఉంచుకొని, అబ్రవీత్ చ = పలికెను.

తా. వివిధరూపములు ధరించ గల ఆ బలి చూడగానే రావణుణ్ణి పైకి లేవదీసి తన ఒడిలో (లేదా దగ్గర) కూర్చుండబెట్టుకొని ఇట్లు పలికెను. 28

మూ. దశగ్రీవ మహాబాహో కం తే కామం కరోమ్యహమ్,
కిమాగమనకృత్యం తే బ్రూహి త్వం రాక్షసేశ్వర. 29

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గల, దశగ్రీవ = రావణా! అహమ్ = నేను, తే = నీకు, కమ్ = ఏ, కామమ్ = కోరికను, కరోమి = చేయుదును? రాక్షసేశ్వర = రాక్షసరాజా! తే = నీయొక్క, ఆగమనకృత్యమ్ = వచ్చుటకు పని, కిమ్ = ఏమి? త్వమ్ = నీవు, బ్రూహి = చెప్పుము.

తా. గొప్ప బాహువులు గల రావణా! నీకు నేను ఏమి కోరిక తీర్చవలెను? రాక్షసరాజా! నీవు వచ్చిన పని యేమి? చెప్పుము. 29

మూ. ఏవముక్తస్తు బలినా రావణో వాక్యమబ్రవీత్,
శ్రుతం మయా మహాభాగ బద్ధస్త్వం విష్ణునా పురా, 30
సోఽహం మోక్షయితుం శక్తో బన్ధనాత్త్వాం న సంశయః.

ప్ర. అ. బలినా = బలిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, రావణః=రావణుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. మహాభాగ= మహాభాగ్యవంతుడా! త్వమ్ = నీవు, పురా = పూర్వము, విష్ణునా = విష్ణువుచేత, బద్ధః = కట్టబడినావు అని, మయా = నాచేత, శ్రుతమ్ = వినబడినది. సః అహమ్ = అట్టి నేను, త్వామ్ = నిన్ను, బన్ధనాత్ = బంధనమునుండి, మోక్షయితుమ్=విడిపించుటకు, శక్తః=సమర్థుడను. సంశయః=సంశయము, న=లేదు.

తా. బలి మాటలు విని రావణుడు ఇట్లు పలికెను-"పూర్వము నిన్ను విష్ణువు బంధించినా డని వింటిని. నేను నిన్ను బంధనమునుండి విడిపించగలను. సందేహము లేదు". 30

మూ. ఏవముక్తే తతో హాసం బలిర్ముక్త్వైనమబ్రవీత్, 31
శ్రూయతామభిధాస్యామి యత్త్వం పృచ్ఛసి రావణ.

ప్ర. అ. ఏవమ్=ఇట్లు, ఉక్తే= పలకబడగా, తతః=పిమ్మట, బలిః= బలి, హాసమ్ = నవ్వును, ముక్త్వా = విడచి, ఏనమ్ = ఇతనిని గూర్చి, అబ్రవీత్ = పలికెను. రావణ = రావణా! త్వమ్ = నీవు యత్ = దేనిని, పృచ్ఛసి = అడుగుచున్నావో, అభిధాస్యామి = చెప్పెదను. శ్రూయతామ్ = వినబడుగాక.

తా. బలి ఆ మాటలు విని నవ్వి ఇట్లు పలికెను-"రావణా! నీవు అడిగిన దానిని గూర్చి చెప్పెదను, వినుము. 31

మూ. య ఏష పురుషః శ్యామో ద్వారే తిష్ఠతి నిత్యదా, 32
ఏతేన దానవేన్ద్రాశ్చ తథాన్యే బలవత్తరాః,
వశం నీతా బలవతా పూర్వే పూర్వతరాశ్చ తే. 33

ప్ర. అ. శ్యామః=శ్యామవర్ణము గల, యః=ఏ, ఏషః=ఈ, పురుషః= పురుషుడు, నిత్యదా = ఎల్లప్పుడూ, ద్వారే=ద్వారమునందు, తిష్ఠతి = ఉన్నాడో, బలవతా = బలవంతుడైన, ఏతేన= వీనిచేత, దానవేన్ద్రాః చ=దానవనాయకులు, తథా = మరియు, బలవత్తరాః = మిక్కిలి బలము గల, అన్యే చ = ఇతరులు, తే = నీయొక్క, పూర్వే = పూర్వీకులు, పూర్వతరాశ్చ = ఇంకా పూర్వీకులైన వారు, వశమ్ = స్వాధీనత్వమును, నీతాః = పొందించబడినారు.

తా. నిత్యమూ ద్వారము వద్ద నిలచి ఉన్న మహాబలశాలి యైన ఈ పురుషుడు దానవనాయకులను, గొప్ప బలము గల ఇతరులను, నీ పూర్వీకులను, వాళ్ళ పూర్వీకులను కూడ వశము చేసికొనినాడు. 32, 33

మూ. బద్ధః సోఽహమనేనైవం కృతాన్తో దురతిక్రమః,
క ఏనం పురుషో లోకే వఞ్చయిష్యతి మానవః. 34

ప్ర. అ. సః = అట్టి, అహమ్ = నేను, అనేన = వీనిచేత, ఏవమ్=ఇట్లు, బద్ధః = కట్టబడితిని. కృతాన్తః=దైవము, దురతిక్రమః = దాట శక్యము కానిది. లోకే = లోకమునందు, కః = ఏ, పురుషః = పురుషుడు, మానవః = మానవుడు, ఏనమ్ = ఈ దైవమును. వఞ్చయిష్యతే = వంచించగలడు?

తా. ఈతడే నన్నీవిధముగా బంధించినాడు. దైవము అతిక్రమింప శక్యము కాదు. లోకములో ఏ పురుషుడు, ఏ మానవుడు ఈ దైవమును వంచింపగలడు ?

మూ. సర్వభూతాపహర్తా వై య ఏష ద్వారి తిష్ఠతి,
కర్తా కారయితా చైవ ధాతా చ భువనేశ్వరః. 35

ప్ర. అ. యః ఏషః=ఏ ఇతడు, ద్వారి = ద్వారమునందు, తిష్ఠతి=నిలచి ఉన్నాడో అతడు, సర్వభూతాపహర్తా = సకలభూతములను అపహరించువాడు. కర్తా=చేయువాడు, కారయితా చైవ = చేయించేవాడు. ధాతా చ=పోషించేవాడు. భువనేశ్వరః = లోకముల ప్రభువు.

తా. ద్వారమునందు నిలచిన ఆ పురుషుడు సకలభూతములను సంహరించువాడు. కార్యములు చేయువాడు, చేయించువాడు ఇతడే. లోకముల పోషకుడు ప్రభువు ఇతడే. 35

మూ. నత్వం వేద న చైవాహం భూతభవ్యభవత్ప్రభుః,
కలిశ్చైవైష కాలశ్చ సర్వభూతాపహారకః. 36

ప్ర. అ. త్వమ్ = నీవు, న వేద = ఎరుగవు. అహం చ = నేను కూడ, నైవ = ఎరుగను. భూతభవ్యభవత్ప్రభుః = జరిగిపోయినదానికి జరగనున్న దానికి, జరుగుచున్నదానికి ప్రభువు. ఏషః = ఇతడు, కలిశ్చ = కలి పురుషుడు. కాలశ్చ = కాలము, సర్వభూతపహారకః = సమస్తప్రాణులను సంహరించువాడు.

తా. ఇతడు జరిగిపోయినదానికి, జరగనున్నదానికి, జరుగుచున్నదానికి ప్రభువు. ఇతడే కలి; ఇతడే కాలము. సకలప్రాణులను సంహరించువాడు. ఇతని గూర్చి నీవు గాని నేను గాని తెలిసికొనజాలము. 36

మూ. లోకత్రయస్య సర్వస్య హర్తా స్రష్టా తథైవ చ,
సంహరత్యేష భూతాని స్థావరాణి చరాణి చ. 37

ప్ర. అ. సర్వస్య = సమస్తమైన, లోకత్రయస్య = లోకత్రయమునకు, హర్తా = సంహారకుడు. తథైవ చ = మరియు, స్రష్టా = సృజించువాడు. ఏషః = ఇతడు, స్థావరాణి = స్థిరములు, చరాణి చ = చరములు అయిన, భూతాని = భూతములను (ప్రాణులను), సంహరతి = సంహరించును.

తా. ఇతడు మూడు లోకములనూ సంహరించును; సృజించును. ఇతడు స్థావరములు, జంగమములు అయిన ప్రాణులను సంహరించుచుండును. 37

మూ. పునశ్చ సృజతే సర్వమనాద్యన్తో మహేశ్వరః,
ఇష్టం చైవ హి దత్తం చ హుతం చైవ నిశాచర. 38

ప్ర. అ. నిశాచర = రాక్షసుడా! అనాద్యన్తః = ఆది కాని అంతము కాని లేని, మహేశ్వరః = మహేశ్వరుడు. సర్వమ్ = సమస్తమునూ, పునశ్చ = మరల, సృజతే = సృజించును. ఇష్టమ్ = యాగము, దత్తం చ = దానము, హుతం చైవ = హోమమూ కూడ ఇతడే.

తా. రావణా! ఆది కాని అంతము కాని లేని ఈ మహేశ్వరుడు సంహరించినదానిని అంతనూ మరల సృజించుచుండును. ఇతడు యాగస్వరూపుడు; దానస్వరూపుడు; హోమస్వరూపుడు. 38

మూ. సర్వమేవ హి లోకేశో ధాతా గోప్తా న సంశయః,
నైవంవిధం మహద్భూతం విద్యతే భువనత్రయే. 39

ప్ర. అ. సర్వమేవ = సమస్తమూ కూడ, లోకేశః = లోకాధిపతియైన ఇతడే. ధాతా=పోషించువాడు; గోప్తా=రక్షించువాడు. సంశయః=సంశయము, న = లేదు. ఏవంవిధమ్ = ఈ విధమైన, మహత్=గొప్ప, భూతమ్ = భూతము, భువనత్రయే = మూడు లోకములయందు, న విద్యతే = లేదు.

తా. లోకాధీశుడైన ఇతడు సకలజగత్స్వరూపుడు. ఇతడే పోషించువాడు. ఇతడే రక్షించువాడు. సంశయము లేదు. ఇట్టి మహాభూతము మరొకటి మూడు లోకములలోనూ లేదు. 39

మూ. అహం త్వం చైవ పౌలస్త్య యే చాన్యే పూర్వవత్తరాః,
నేతా హ్యేషాం మహాత్మైష పశుం రశనయా యథా. 40

ప్ర. అ. పౌలస్త్య=రావణా! అహమ్=నేను, త్వం చైవ=నీవు, అన్యే= ఇతరులైన, యే= ఏ, పూర్వవత్తరాః = చాల పూర్వమునం దున్నవారు కలరో, ఏషామ్ = వీరికి, మహాత్మా = మహాత్ముడైన, ఏషః=ఇతడు, రశనయా=త్రాడు చేత, పశుం యథా = పశువును వలె, నేతా హి = నడిపించువాడు కదా ?

తా. రావణా! మహాత్ముడైన ఇతడు నన్ను, నిన్ను, ఇంకా చాల కాలము క్రితము ఉన్నవాళ్లనీ కూడ తాడుచేత పశువును నడిపించినట్లు నడిపించుచుండును.

మూ. వృత్రో దనుః శుకః శమ్భుర్నిశుమ్భః శుమ్భ ఏవ చ,
కాలనేమిశ్చ ప్రాహ్లాదిః కూటో వైరోచనో మృదుః. 41

యమలార్జునౌ చ కంసశ్చ కైటభో మధునా సహ,
ఏతే తపన్తి ద్యోతన్తి వాన్తి వర్షన్తి చైవ హి. 42

ప్ర. అ. వృత్రః=వృత్రుడు, దనుః=దనువు, శుకః=శుకుడు, శంభుః= శంభుడు, నిశుమ్భః = నిశుంభుడు. శుమ్భః ఏవ చ = శుంభుడు, కాలనేమిశ్చ= కాలనేమి, ప్రాహ్లాదిః = ప్రహ్లాదుని కుమారుడు, కూటః = కూటుడు, వైరోచనః= విరోచనుని కుమారుడు బలి, (అనగా తానే), మృదుః=మృదుడు, యమలార్జునౌ

చ=యమలార్జునులు, కంసశ్చ=కంసుడు, మధునా సహ=మధువుతో కూడ, కైటభః=కైటభుడు, ఏతే=వీరందరు, తపన్తి=తపించుదురు (వేడి కలిగింతురు), ద్యోతన్తి=ప్రకాశించుచుందురు. వాన్తి=వీచుదురు; వర్షన్తి చైవ హి=వర్షింతురు.

తా. వృత్రుడు, దనువు, శుకుడు, శంభుడు, నిశుంభుడు, శుంభుడు, కాలనేమి, ప్రహ్లాదునికుమారుడు, కూటుడు. విరోచనుని పుత్రుడు, మృదువు, యమలార్జునులు, కంసుడు, కైటభుడు, మధువు వీరందరూ తపించగలరు; ప్రకాశించగలరు; వీచగలరు; వర్షించగలరు. 41,42

మూ. సర్వైః క్రతుశతైరిష్టం సర్వైస్తప్తం మహత్తపః,
సర్వే తే సుమహాత్మానః సర్వే వై యోగధర్మిణః. 43

ప్ర. అ. సర్వైః=వాళ్ల అందరిచేత, క్రతుశతైః=వందలకొలది క్రతువులచేత, ఇష్టమ్=యాగము చేయబడినది. మహత్=గొప్ప, తపః=తపస్సు, తప్తమ్=చేయబడినది. సర్వే=సమస్తమైన, తే=వారు, సుమహాత్మానః=చాల మహాత్ములు. సర్వే = అందరూ, యోగధర్మిణః వై=యోగధర్మము గలవారే.

తా. వాళ్ళందరూ వందలకొలది యజ్ఞములు చేసిరి. అందరూ గొప్ప తపస్సుచేసిరి. వారందరూ చాల మహాత్ములే. అందరూ యోగాభ్యాసము చేసినవారే.

మూ. సర్వైరైశ్వర్యమాసాద్య భుక్తం భోగైర్మహత్తరైః,
దత్తమిష్టమధీతం చ ప్రజాశ్చ పరిపాలితాః. 44

ప్ర. అ. సర్వైః=అందరిచేతను, ఐశ్వర్యమ్=ఐశ్వర్యమును, ఆసాద్య=పొంది, మహత్తరైః= చాల గొప్ప, భోగైః=భోగములచేత, భుక్తమ్=అనుభవించుట చేయబడినది. దత్తమ్=ఇవ్వబడినది. ఇష్టమ్=యాగము చేయబడినది. అధీతం చ=అధ్యయనము చేయబడినది. ప్రజాశ్చ=ప్రజలు కూడ, పరిపాలితాః=పాలింపబడిరి.

తా. వారందరూ కూడ ఐశ్వర్యము పొంది చాల గొప్ప భోగములు అనుభవించినారు. దానములు, యాగములు చేసినారు. అధ్యయనము చేసినారు. ప్రజలను పాలించినారు. 44

మూ. స్వపక్షేష్వనుగోప్తారః ప్రహర్తారః పరేష్వపి,
సామరేష్వపి లోకేషు నైతేషాం విద్యతే సమమ్. 45

ప్ర. అ. స్వపక్షేషు=తమ పక్షమువారియందు, అనుగోప్తారః = రక్షించు వారు. పరేషు = ఇతరుల విషయమునందు, ప్రహర్తారః అపి = దెబ్బతీయువారు. సామరేషు=దేవతలతో కూడిన, లోకేష్వపి=లోకములయందు కూడ, ఏతేషామ్= వీరికి, సమమ్ = సమానమైనది, న విద్యతే = లేదు.

తా. వారందరూ తమ పక్షమునకు చెందిన వారిని రక్షించేవారు; శత్రువులను నశింపచేసేవారు. దేవతలున్న లోకాలలో కూడ వారికి సమానమైనది లేదు.

మూ. శూరా స్త్వభిజనోపేతాః సర్వశాస్త్రార్థపారగాః,
సర్వవిద్యాప్రవేత్తారః సంగ్రామేష్వనివర్తకాః. 46

ప్ర. అ. శూరాః తు = శూరులు. అభిజనోపేతాః=ఉత్తమవంశజన్మగలవారు. సర్వశాస్త్రార్థపారగాః = అన్ని శాస్త్రార్థముల పారము పొందినవారు. సర్వవిద్యాప్రవేత్తారః = సకలవిద్యలు ఎరిగినవారు. సంగ్రామేషు = యుద్ధములయందు, అనివర్తకాః = వెనుకకు మరలని వారు.

తా. వారు శూరులు. ఉత్తమవంశమునందు పుట్టినవారు. సకలశాస్త్రార్థ పారంగతులు. సకల విద్యావేత్తలు. యుద్ధమునుండి వెనుకకు పోనివారు. 46

మూ. సర్వైస్త్రిదశరాజ్యాని కారితాని మహాత్మభిః,
యుద్ధే సురగణాః సర్వే నిర్జితాశ్చ సహస్రశః. 47

ప్ర. అ. మహాత్మభిః = మహాత్ములైన, సర్వైః = అందరిచేతా, త్రిదశరాజ్యాని = దేవతలరాజ్యములు, కారితాని = చేయించబడినవి. యుద్ధే = యుద్ధమునందు, సహస్రశః = వేలకొలంది, సురగణాః=దేవతల గణములు, నిర్జితాః చ = జయించబడిరి.

తా. మహాత్ములైన వారందరూ దేవతల రాజ్యములను పాలించిరి. యుద్ధములో వేలకొలంది దేవతాగణములను జయించిరి. 47

మూ. దేవానామప్రియే సక్తాః స్వపక్షపరిపాలకాః,
ప్రమత్తాశ్చోపసక్తాశ్చ బాలార్కసమతేజసః. 48

ప్ర. అ. దేవానామ్=దేవతలకు, అప్రియే=అప్రియము చేయుటయందు, సక్తాః=ఆసక్తులు. స్వపక్షపరిపాలకాః=తమ పక్షమును పాలించువారు. ప్రమత్తాః = బాగా మదించినవారు. ఉపసక్తాశ్చ=(భోగములయందు) ఆసక్తులు. బాలార్కసమతేజసః = బాలసూర్యునితో సమానమైన తేజస్సు కలవారు.

తా. దేవతలకు అపకారము చేయుటయందు అసక్తి గలవారు. తమ పక్షమును పాలించువారు. మదించినవారు. భోగాసక్తులు. బాలసూర్యునితో సమానమైన తేజస్సు గలవారు. 48

మూ. యే తు దేవాన్ ప్రధర్షన్తే తదేషాం విష్ణురీశ్వరః,
ఉపాయపూర్వకం నాశం సంవేత్తా భగవాన్ హరిః. 49

ప్ర. అ. యే తు = ఎవరు, దేవాన్ = దేవతలను, ప్రధర్షన్తే = అవమానింతురో, తదేషామ్ = అట్టివారియొక్క, ఉపాయపూర్వకమ్ = ఉపాయపూర్వకముగా, నాశమ్=నాశమును గూర్చి, ఈశ్వరః = ప్రభువూ, భగవాన్ = భగవంతుడైన, విష్ణుః = సర్వవ్యాపకుడైన, హరిః = విష్ణువు, సంవేత్తా = ఎరిగినవాడు.

తా. సర్వసమర్థుడు, సర్వవ్యాపకుడూ, భగవంతుడూ అయిన విష్ణువు దేవతలను అవమానించువారిని ఉపాయపూర్వకముగా ఎట్లు నశింపచేయవలెనో బాగుగా తెలిసినవాడు. 49

మూ. ప్రాదుర్భావం వికురుతే యేనైతన్నిధనం భవేత్,
పునరేవాత్మనాత్మానమధిష్ఠాయ స తిష్ఠతి. 50

ప్ర. అ. యేన = దేనిచేత, ఏతన్నిధనమ్ = వీళ్ళ నాశనము, భవేత్ = అగునో, అట్టి, ప్రాదుర్భావమ్=పుట్టుకను, వికురుతే=చేయును. పునరేవ=తిరిగి, ఆత్మానమ్=తనను, ఆత్మనా = తనచేత, అధిష్ఠాయ = అధిష్ఠించి, సః=అతడు, తిష్ఠతి = ఉండును.

తా. అతడు దేవతలను బాధించువారి నాశము చేయుటకే అవతారము లెత్తుచుండును. మరల తన స్వరూపముతో ఉండిపోవును. 50

మూ. ఏవమేతేన దేవేన దానవేన్ద్రా మహాత్మనా,
తే హి సర్వే క్షయం నీతా బలినః కామరూపిణః. 51

ప్ర. అ. మహాత్మనా = మహాత్ముడైన, ఏతేన = ఈ, దేవేన = దేవునిచేత, బలినః = బలవంతులు, కామరూపిణః = స్వేచ్ఛారూపములు కలవారు అయిన, సర్వే = సమస్తమైన, తే = ఆ, దానవేన్ద్రాః = దానవనాయకులు, సర్వే = అందరూ, ఏవమ్ = ఇట్లు, క్షయమ్ = నాశమును, నీతాః = పొందింపబడినారు.

తా. మహాత్ముడైన ఈ దేవుడు ఈ విధముగా బలవంతులు, కామరూపములు గలవారు అయిన దానవప్రభువుల నందరినీ నశింపచేసినాడు. 51

మూ. సమరే చ దురాధర్షాః శ్రూయన్తే యేఽపరాజితాః,
తేఽపి నీతా మహద్భూతాః కృతాన్తబలచోదితాః. 52

ప్ర. అ. సమరే = యుద్ధమునందు, దురాధర్షాః = ఎదిరింప శక్యముకాని వారుగాను, అపరాజితాః = ఓడింపబడనివారుగాను, యే = ఎవరు, శ్రూయన్తే = వినబడుచున్నారో, తే = అట్టి, మహద్భూతాః అపి = గొప్పభూతములు (ప్రాణులు) కూడా, కృతాన్తబలచోదితాః = దైవబలముచేత పేరేపింపబడినవారై, నీతాః = తీసికొనివెళ్ళబడిరి.

తా. యుద్ధములో జయింప శక్యముకానివారనీ, ఓడింపబడనివారనీ ప్రసిద్ధులైన గొప్ప వ్యక్తులనుకూడ దైవబలమునకు లొంగిపోవునట్లు చేసి విష్ణువు తీసికొని పోయినాడు. 52

మూ. ఏవముక్త్వాథ ప్రోవాచ రాక్షసం దానవేశ్వరః,
యదేతద్దృశ్యతే వీర చక్రం దీప్తానలోపమమ్, 53
ఏతద్గృహీత్వాగచ్ఛ త్వం మమ పార్శ్వం మహాబల.

ప్ర. అ. దానవేశ్వరః = దానవుల ప్రభువు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, అథ = అటుపిమ్మట, రాక్షసమ్ = రాక్షసుణ్ణి గూర్చి, ప్రోవాచ = పలికెను. వీర = వీరుడా! మహాబల = గొప్ప బలము కలవాడా! దీప్తానలోపమమ్ = మండుచున్న అగ్నితో సమానమైన, యత్ = ఏ, ఏతత్ = ఈ, చక్రమ్ = చక్రము, దృశ్యతే = కనబడుచున్నదో, ఏతత్ = దీనిని, గృహీత్వా = గ్రహించి, మమ = నాయొక్క, పార్శ్వమ్ = సమీపమును గూర్చి, త్వమ్ = నీవు, ఆగచ్ఛ = రమ్ము.

తా. బలి చక్రవర్తి ఇట్లు పలికి రావణునితో మరల ఇట్లనెను. "గొప్ప బలముగల ఓ ! వీరుడా ! ప్రజ్వలించుచున్న అగ్ని వలె ఉన్న ఆ చక్రమును నా వద్దకు తీసికొని రమ్ము." 53

మూ. తతోఽహం తవ వ్యాఖ్యాస్యే ముక్తికారణమవ్యయమ్, 54
తత్కురుష్వ మహాబాహో మా విలమ్బస్వ రావణ.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అహమ్ = నేను, అవ్యయమ్ = మార్పులేని, ముక్తికారణమ్ = నా విముక్తికి కారణమును, తవ = నీకు, ఆఖ్యాస్యే = చెప్పగలను. మహాబాహో = గొప్ప బాహువులు గల, రావణ = రావణా ! తత్ = దానిని, కురుష్వ = చేయుము. మా విలమ్బస్వ = ఆలస్యము చేయకుము.

తా. "తరువాత నేను నీకు నా విడుదలకు తిరుగులేని ఉపాయమును చెప్పెదను. గొప్ప బాహువులు గల రావణా! ఆ పని చేయుము. ఆలసించకుము." 54

మూ. ఏతచ్ఛ్రుత్వా గతో రక్షః ప్రహసంశ్చ మహాబలః, 55
యత్ర స్థితం మహద్దివ్యం కుణ్డలం రఘునన్దన.

ప్ర. అ. రఘునన్దన = రామా ! మహాబలః = గొప్ప బలము గల, రక్షః = రాక్షసుడు, ఏతత్ = ఈ వాక్యమును, శ్రుత్వా = విని, ప్రహసన్ చ = నవ్వుచు, దివ్యమ్ = దివ్యమైన, మహత్ = గొప్ప, కుణ్డలమ్ = కుండలము, యత్ర = ఎక్కడ, స్థితమ్ = ఉన్నదో అక్కడికి, గతః = వెళ్ళెను.

తా. రామా ! గొప్ప బలము గల ఆ రాక్షసుడు ఈ మాట విని నవ్వుచు దివ్యమైన ఆ గొప్ప కుండల మున్న చోటికి వెళ్లెను. 55

మూ. లీలయోత్పాటనం చక్రే రావణో బలదర్పితః, 56
న చ చాలయితుం శక్తో రావణోఽభూత్కథం చన.

ప్ర. అ. బలదర్పితః = బలముచేత గర్వించిన, రావణః = రావణుడు, లీలయా = విలాసతో, ఉత్పాటనమ్ = పైకి లాగుటను, చక్రే = చేసెను. రావణః = రావణుడు, కథం చన = ఏ విధముగానూ కూడ, చాలయితుమ్ = కదల్చుటకు, శక్తః = సమర్థుడు, న చ అభూత్ = కాలేదు.

తా. బలముచేత గర్వించిన ఆ రావణుడు దానిని విలాసంగా పైకి లేవ ప్రయత్నించెను. కాని ఏ విధముగానూ కూడ దానిని కదల్పలేకపోయెను.

మూ. లజ్జయా స పునర్భూయో యత్నం చక్రే మహాబలః, 57
ఉత్క్షిప్తమాత్రే దివ్యే చ పపాత భువి రాక్షసః,
భిన్నమూలో యథా శాలో రుధిరౌఘపరిప్లుతః. 58

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, సః = అతడు, లజ్జయా = సిగ్గుతో, పునః భూయః = మరల, యత్నమ్ = ప్రయత్నమును, చక్రే = చేసెను. రాక్షసః = రావణుడు, దివ్యే = దివ్యమైన ఆ కుండలము, ఉత్క్షిప్తమాత్రే = ఎత్తబడగానే, భిన్నమూలః = నరకబడిన మొదలు గల, శాలః యథా = శాలవృక్షము వలె, రుధిరౌఘపరిప్లుతః = రక్తముచేత నింపబడినవాడై, భువి = నేలమీద, పపాత = పడెను.

తా. మహాబలవంతుడైన ఆ రావణుడు సిగ్గుపడి దానిని ఎత్తుటకై మరల ప్రయత్నము చేసెను. దివ్యమైన ఆ కుండలమును ఎత్తగానే అతడు రక్తప్రవాహము కారగా నరికిన సాలవృక్షము వలె పడిపోయెను. 57, 58

మూ. ఏతస్మిన్నన్తరే జజ్ఞే శబ్దః పుష్పకసంభవః,
రాక్షసేన్ద్రస్య సచివైర్ముక్తో హాహాకృతో మహాన్. 59

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యయందు, రాక్షసేన్ద్రస్య = రావణునియొక్క, సచివైః = మంత్రులచేత, ముక్తః = విడవబడిన, హాహాకృతః = హాహాకారరూపమైన, మహాన్ = గొప్ప, పుష్పకసంభవః = పుష్పకమునుండి పుట్టిన, శబ్దః = శబ్దము, జజ్ఞే = పుట్టెను.

తా. ఇంతలో పుష్పకమునుండి రావణుని మంత్రులు "అయ్యో! అయ్యో!" అని బిగ్గరగా అరచిరి. 59

మూ. తతో రక్షో ముహూర్తేన చేతనాం లబ్ధ్వా చోత్థితమ్,
లజ్జయావనతీభూతం బలిర్వాక్యమువాచ హ. 60

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ముహూర్తేన = ముహూర్తకాలముచేత,

చేతనామ్ = చేతనను, లబ్ధ్వ = పొంది, ఉత్థితమ్ = లేచిన, లజ్జయా = సిగ్గుచేత, అవనతీభూతమ్ = వంగిన, రక్షః = రాక్షసుని గూర్చి, బలిః = బలి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. పిమ్మట ముహూర్తకాలములో స్పృహ వచ్చి సిగ్గుతో తలవంచుకొని ఉన్న రావణునితో బలి ఇట్లు పలికెను. 60

మూ. ఆగచ్ఛ రాక్షసశ్రేష్ఠ వాక్యం శృణు మయోదితమ్,
యత్త్వయా చోద్యతం వీర కుణ్డలం మణిభూషితమ్, 61
ఏతద్ధి పూర్వజస్యాసీత్కర్ణాభరణమీక్ష్యతామ్.

ప్ర. అ. రాక్షసశ్రేష్ఠ = రాక్షసులలో శ్రేష్ఠుడా! ఆగచ్ఛ = రమ్ము. మయా = నాచేత, ఉదితమ్ = పలకబడిన, వాక్యమ్ = వాక్యమును, శృణు = వినుము. వీర = వీరుడా! మణిభూషితమ్ = మణులచేత అలంకరించబడిన, యత్ = ఏ, కుణ్డలమ్ = కుండలము, ఉద్యతమ్ = ఎత్తబడినదో, ఏతత్ హి = ఇది, పూర్వజస్య = నా వంశములో పూర్వము పుట్టినవానియొక్క, కర్ణాభరణమ్ = చెవికి అలంకారముగా, ఆసీత్ = ఉండెను. ఈక్ష్యతామ్ = చూడబడుగాక.

తా. రావణా! రమ్ము; నేను చెప్పు మాటలు వినుము. నీవు ఎత్తిన, మణి భూషితమైన ఈ కుండలము మా ముత్తాతగారైన హిరణ్యకశిపుని చెవికి అలంకారముగా ఉండెడిది; చూడుము. 61

మూ. ఏతత్పతితవచ్చైవమత్ర భూమౌ మహాబల, 62
అన్యత్ పర్వతసానౌ హి పతితం కుణ్డలాదను,
ముకుటం వేదిసామీప్యే పతితం యుధ్యతో భువి, 63
హిరణ్యకశిపోః పూర్వం మమ పూర్వపితామహాత్.

ప్ర. అ. మహాబల = గొప్ప బలముగలవాడా! పూర్వమ్ = పూర్వము, యుధ్యతః = యుద్ధముచేయుచున్న, మమ పూర్వపితామహాత్ = నా ముత్తాతయైన, హిరణ్యకశిపోః = హిరణ్యకశిపునినుండి, ఏతత్ = ఇది, ఏవమ్ = ఇట్లు, అత్ర = ఈ, భూమౌ = భూమిమీద, పతితవత్ = పడినది. అన్యత్ = మరియొకటి, పర్వత సానౌ = పర్వతము చరియమీద, పతితమ్ = పడినది. కుణ్డలాదను = కుండలమును

అనుసరించి, ముకుటమ్ = కిరీటము, వేదిసామీప్యే = వేది సమీపమున, పతితమ్ = పడినది.

తా. గొప్పబలముగల రావణా ! నా ముత్తాతగారైన హిరణ్యకశిపుడు పూర్వము యుద్ధము చేయుచుండగా ఈ కుండలము ఇక్కడ నేలమీద పడినది. రెండవది పర్వతము చరియమీద పడినది. కుండలముల వెనుక కిరీటము వేది దగ్గర పడినది. 62, 63

మూ. న తస్య కాలో మృత్యుర్వా న వ్యాధిర్న విహింసకాః,
న దివా మరణం తస్య న రాత్రౌ సంధ్యయోర్న హి,
న శుష్కేణ న చార్ద్రేణ న చ శస్త్రేణ కేన చిత్. 65
విద్యతే రాక్షసశ్రేష్ఠ తస్య నాస్త్రేణ కేన చిత్.

ప్ర. అ రాక్షసశ్రేష్ఠ = రాక్షసులలో శ్రేష్ఠుడా ! తస్య = ఆతనికి, కాలః = కాలము కాని, మృత్యుర్వా = మృత్యువు కాని, న = లేదు. వ్యాధిః = వ్యాధి, న = లేదు. విహింసకాః = హింసించువారు, న = లేరు. తస్య = ఆతనికి, దివా = పగలు, మరణమ్ = మరణము, న విద్యతే = లేదు. రాత్రౌ = రాత్రియందు, న = లేదు. సంధ్యయోః = సంధ్యాకాలములయందు, న హి = లేదు. శుష్కేణ = ఎండినదానిచేత, న = లేదు. ఆర్ద్రేణ చ = తడిసినదానిచేత, న = లేదు. కేనచిత్ = ఏ, శస్త్రేణ = శస్త్రముచేత కూడ, న = లేదు. కేనచిత్ అస్త్రేణ = ఏ అస్త్రము చేతా కూడ, న = లేదు.

తా. రావణా ! ఆతనికి కాలము (అవసానకాలము; లేదా యముడు) కాని, మృత్యువు కాని వ్యాధి గాని, లేదు. హింసించువారు లేరు. పగలు గాని, రాత్రి గాని, సంధ్యాసమయములయందు గాని మరణము లేదు. ఎండినదానిచేత గాని, తడిగా ఉన్నదానిచేత గాని, ఏ ఆయుధముచేతా గాని, ఏ అస్త్రముచేతా గాని మరణము లేదు. 64, 65

మూ. ప్రహ్లాదేన సమం చక్రే వాదం పరమదారుణమ్. 66
తస్య వాదే సముత్పన్నే ఘోరో లోకభయంకరః.
సర్వైశ్వర్యస్య వీరస్య ప్రహ్లాదస్య మహాత్మనః. 67
ఉత్పన్నో రాక్షసశ్రేష్ఠ నృసింహాకృతిరూపధృక్.

ప్ర. అ. రాక్షసశ్రేష్ఠ = రాక్షసులలో శ్రేష్ఠుడా ! ప్రహ్లాదేన సమమ్ = ప్రహ్లాదునితో, వరమదారుణమ్ = చాల దారుణమైన, వాదమ్ = వాదమును, చక్రే = చేసెను. తస్య = ఆతనికి, సర్వవర్యస్య = అందరికి పూజ్యుడైన, వీరస్య = వీరుడైన, మహాత్మనః = మహాత్ముడైన, ప్రహ్లాదస్య = ప్రహ్లాదునికి, వాదే = వాదము, సముత్పన్నే = పుట్టినదగుచుండగా, లోకభయంకరః = లోకములకు భయము కలిగించు, నృసింహాకృతిరూపధృక్ = నృసింహాకారమును, రూపమును ధరించిన, ధీరః = ధీరుడు, ఉత్పన్నః = పుట్టినాడు.

తా. రావణా ! హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో చాల క్రూరమైన వాదమును చేసెను. అందరికి పూజ్యుడూ, మహాత్ముడూ, వీరుడూ అయిన ప్రహ్లాదునకూ, ఆ హిరణ్యకశిపునకూ వాదము ఏర్పడగా నృసింహాకారమును ధరించి లోకములకు భయము కలిగించు వీరుడు ఆవిర్భవించెను. 66, 67

మూ. దృష్టం చ తేన రౌద్రేణ క్షుబ్ధం సర్వమశేషతః, 68
తత ఉద్ధృత్య బాహుభ్యాం నఖైర్నిన్యే యమక్షయమ్,
ఏష తిష్ఠతి ద్వారస్థో వాసుదేవో నిరఞ్జనః. 69

ప్ర. అ. రౌద్రేణ = భయంకరుడైన, తేన = ఆ నృసింహునిచేత; దృష్టమ్ = చూడబడిన, సర్వమ్ = అంతయూ, క్షుబ్ధమ్ = క్షోభింపచేయబడినది. తతః = అటుపిమ్మట, బాహుభ్యామ్ = బాహువులచేత, ఉద్ధృత్య = ఎత్తి, నఖైః = గోళ్ళ చేత, యమక్షయమ్ = యమలోకమును, నిన్యే = పొందించబడెను. నిరఞ్జనః = దోషములు లేని, ఏషః = ఈ, వాసుదేవః = వాసుదేవుడు, ద్వారస్థః = ద్వారపాలకుడుగా, తిష్ఠతి = ఉన్నాడు.

తా. భయంకరుడైన ఆ నృసింహుడు చూచిన ప్రతివస్తువును చెల్లా చెదరు చేసి, చేతులతో ఆ హిరణ్యకశిపుణ్ణి ఎత్తి, గోళ్లతో చంపివేసినాడు. ఇదిగో, ఏ దోషములూ అంటని ఆ వాసుదేవుడే ద్వారపాలకుడై నిలచి ఉన్నాడు. 68,69

మూ. తస్య దేవాధిదేవస్య గదతో మే శృణుష్వ హ,
వాక్యం పరమభావేన యది తే వర్తతే హృది. 70

ప్ర. అ. తస్య = ఆ, దేవాధిదేవస్య = దేవతలకు ఆదిదేవుడైన విష్ణువు

యొక్క విషయమునందు, గదతః=చెప్పుచున్న, మే=నాయొక్క, వాక్యమ్=వాక్యమును, పరమభావేన=గొప్ప గౌరవభావముతో, తే హృది=నీ మనస్సులో, వర్తతే యది=ఉన్నట్లయితే, శృణుష్వ హ=వినుము.

తా. ఆ దేవాదిదేవుణ్ణి గూర్చి చెప్పెదను. నా మాటలను నీ మనస్సులో మంచి గౌరవభావ మున్నచో వినుము. 70

మూ. ఇన్ద్రాణాం చ సహస్రాణి సురాణామయుతాని చ,
ఋషీణాం చైవ ముఖ్యానాం శతాన్యబ్దసహస్రశః. 71
వశం నీతాని సర్వాణి స ఏష ద్వారి తిష్ఠతి.

ప్ర. అ. (యేన=ఎవనిచేత), ఇన్ద్రాణామ్=ఇంద్రులయొక్క, సహస్రాణి=వేలు, సురాణామ్=దేవతలయొక్క, అయుతాని చ=అయుతములు (అయుత మనగా పది వేలు), ముఖ్యానామ్=ముఖ్యులైన, ఋషీణాం చైవ=ఋషుల యొక్క, శతాని=శతములు, సర్వాణి=అన్నీ, అబ్దసహస్రశః=వేలకొలది సంవత్సరములు, వశం=వశమును, నీతాని=పొందించబడినవో, సః ఏషః=అట్టి ఇతడు, ద్వారి=ద్వారమునందు, తిష్ఠతి=ఉన్నాడు.

తా. ఏ విష్ణువు కొన్ని వేల సంవత్సరములపాటు వేలకొలది ఇంద్రులను, అయుతములకొలది దేవతలను, వందలకొలది ముఖ్యులైన ఋషులను తన వశములో ఉంచుకొనెనో అట్టి విష్ణువు ద్వారమునందు ఉన్నాడు. 71

మూ. తస్య తద్వచనం శ్రుత్వా రావణో వాక్యమబ్రవీత్. 72
మయా ప్రేతేశ్వరో దృష్టః కృతాన్తః సహ మృత్యునా,
పాశహస్తో మహాజ్వాల ఊర్ధ్వరోమా భయానకః. 73

దంష్ట్రాలో విద్యుజ్జిహ్వశ్చ సర్పవృశ్చికరోమవాన్,
రక్తాక్షో భీమవేగశ్చ సర్వసత్త్వభయంకరః. 74

ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్యః సమరేష్వనివర్తకః,
పాపానాం శాసితాచైవ స మయా యుధి నిర్జితః. 75

ప్ర. అ. తస్య=వానియొక్క, తత్ వచనమ్=ఆ వచనమును, శ్రుత్వా=

విని, రావణః=రావణుడు, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. మయా=నాచేత, ప్రేతేశ్వరః=మరణించినవాళ్ళ ప్రభువు, మృత్యునా సహ=మృత్యువుతో కూడిన, కృతాన్తః = యముడు, దృష్టః=చూడబడినాడు. పాశహస్తః = పాశము హస్తమునందు గలవాడు, మహాజ్వాలః=గొప్ప జ్వాలలు కలవాడు, ఊర్ధ్వరోమా=పైకి నిలచిన రోమములు గలవాడు, భయానకః = భయంకరుడు, దంష్ట్రిలః=కోరలు గలవాడు, విద్యుజ్జిహ్వశ్చ=మెరపువంటి నాలుక గలవాడు, సర్పవృశ్చిక రోమవాన్ = సర్పములు, తేళ్లు రోమములుగా కలవాడు, రక్తాక్షః = ఎఱ్ఱని కళ్లు గలవాడు, భీమవేగః చ = భయంకరమైన వేగము గలవాడు, సర్వసత్త్వ భయంకరః = అన్ని ప్రాణులకు భయము కలిగించువాడు, ఆదిత్యః ఇవ = సూర్యుడు వలె, దుష్ప్రేక్ష్యః = చూడశక్యము కానివాడు, సమరేషు = యుద్ధములయందు, అనివర్తకః = మరలనివాడు, పాపానామ్ = పాపాత్ములకు, శాసితా = శిక్షకుడు అయిన, సః=ఆ యముడు, మయా=నాచేత, యుధి = యుద్ధమునందు, నిర్జితః=జయింపబడినాడు.

తా. బలిచక్రవర్తి మాటలు విని రావణు డిట్లు పలికెను-"నేను ప్రేత ప్రభువైన యముణ్ణి,మృత్యువును చూచితిని. హస్తమునందు పాశమునుధరించి పెద్ద జ్వాలలను కక్కుచు పైకి లేచిన రోమాలు గల అతడు చాల భయంకరుడు. పెద్ద కోరలు, మెరుపువంటి నాలుక గల అతనికి సర్పములు, తేళ్లు రోమములుగా ఉండును. ఎఱ్ఱని కళ్లు, భయంకరమైన వేగము గలవాడు, సూర్యుడు వలె చూడ శక్యము కానివాడు అయిన అతడు యుద్ధములలో వెనుకకు మరలనివాడు. పాపాత్ములను శిక్షించువాడు. అట్టి యముణ్ణి కూడ నేను జయించితిని. 72-75

మూ. న చ మే తత్ర భీః కాచిద్యథా వా దానవేశ్వర,
ఏనం తు నాభిజానామి తద్భవాన్ వక్తుమర్హసి. 76

ప్ర. అ. దానవేశ్వర = దానవరాజా ! మే = నాకు, తత్ర = ఆ విష్ణువు విషయమున, కాచిత్ = ఏమియు, భీః = భయము, యథా వా = ఎట్లైనను,న= లేదు. తు = కాని, ఏనమ్ = వీనిని, నాభిజానామి = గుర్తించను. తత్ = అందు వలన, భవాన్ = నీవు, వక్తుమ్ = చెప్పుటకు, అర్హసి = తగియున్నావు.

తా. దానవేంద్రా ! నేను ఆ విష్ణువునకు ఏమాత్రము భయపడను. కాని నేను అతనిని గుర్తించజాలను. అందుచేత నీవు అతనిని గూర్చి చెప్పుము". 76

మూ. రావణస్య వచః శ్రుత్వా బలిర్వైరోచనోఽబ్రవీత్,
ఏష త్రైలోక్యధాతా చ హరిర్నారాయణః ప్రభుః 77

ప్ర. అ. రావణస్య=రావణునియొక్క, వచః=వచనమును, శ్రుత్వా=విని, వైరోచనః=విరోచనుని కుమారుడైన, బలిః=బలి, అబ్రవీత్=పలికెను. ప్రభుః=ప్రభువు, ఏషః = ఈ, హరిః=పాపములు హరించువాడు అయిన, నారాయణః= విష్ణువు, త్రైలోక్యధాతా చ = మూడులోకాలను పోషించేవాడు.

తా. రావణుని మాటలు విని విరోచనుని పుత్రుడైన బలి ఇట్లు పలికెను. "ప్రభువు, పాపములను హరించువాడు అయిన ఈ మహావిష్ణువు మూడు లోకములను పోషించువాడు". 77

మూ. అనన్తః కపిలో జిష్ణుర్నరసింహో మహాద్యుతిః,
క్రతుధామా సుధామా చ పాశహస్తో భయానకః. 78

ప్ర. అ. అనన్తః = అంతములేనివాడు. కపిలః = కపిలవర్ణము (కృష్ణవర్ణము) కలవాడు. జిష్ణుః = జయించువాడు, నరసింహః = నరసింహుడు. మహాద్యుతిః = గొప్ప కాంతి గలవాడు. క్రతుధామా = యజ్ఞములకు స్థానమైనవాడు. సుధామా చ = మంచి స్థానము గలవాడు. పాశహస్తః = పాశము హస్తమునందు గలవాడు. భయానకః = భయంకరుడు.

తా. శ్రీ మహావిష్ణువు అంతము లేనివాడు. నల్లనివాడు. జయించు స్వభావము కలవాడు. నరసింహుడు. గొప్ప కాంతి గలవాడు. యజ్ఞముసందు నివసించువాడు. మంచి స్థానము గలవాడు. పాశము హస్తమునందు ధరించువాడు. భయము కలిగించువాడు. 78

మూ. ద్వాదశాదిత్యసదృశః పురాణపురుషోత్తమః,
నీలజీమూతసంకాశః సురనాథః సురోత్తమః. 79

ప్ర. అ. ద్వాదశాదిత్యసదృశః=పన్నెండుగురు సూర్యులతో సమానుడు. పురాణ పురుషోత్తమః = ప్రాచీనుడైన పురుషోత్తముడు. నీలజీమూతసంకాశః = నల్లని మేఘముతో సమానుడు. సురనాథః=సురుల ప్రభువు. సురోత్తమః = సురులలో శ్రేష్ఠుడు.

తా. శ్రీ మహావిష్ణువు పన్నెండుగురు సూర్యులతో సమానుడు. అతి ప్రాచీనుడైన (ఆది లేని) పురుషశ్రేష్ఠుడు. నల్లనిమేఘముతో సమానుడు. దేవతల ప్రభువు. దేవతలలో శ్రేష్ఠుడు. 79

మూ. జ్వాలామాలీ మహాబాహో యోగీ భక్తజనప్రియః,
ఏష ధారయతే లోకానేష వై సృజతే ప్రభుః. 80

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా, ప్రభుః=ప్రభువైన, ఏషః=ఇతడు, జ్వాలామాలీ = జ్వాలల మాలలు కలవాడు, యోగీ = యోగి, భక్తజనప్రియః = భక్తజనులు ప్రియులుగా కలవాడు, ఏషః = ఇతడే, లోకాన్= లోకములను, ధారయతే=ధరించుచున్నాడు (పోషించుచున్నాడు), సృజతే వై= సృజించుచున్నాడు.

తా. గొప్ప బాహువులు గలవాడా! ఇతని చుట్టూ జ్వాలల మాలలు ఉండును. ఇతడు యోగీశ్వరుడు. ఇతనికి భక్తులమీద ప్రేమ అధికము. సమర్థుడైన ఇతడే లోకములను సృజించును; వానిని రక్షించుచుండును. 80

మూ. ఏష సంహరతే చైవ కాలో భూత్వా మహాబలః,
ఏష యజ్ఞశ్చ యాజ్యశ్చ చక్రాయుధధరో హరిః. 81

ప్ర. అ. మహాబలః=గొప్పబలముగల, ఏషః=ఇతడు, కాలః=కాలముగా, భూత్వా = అయి, సంహరతే చైవ= సంహరించుచుండును, చక్రాయుధధరః = చక్రాయుధమును ధరించినన ఏషః= ఈ, హరిః = విష్ణువే, యజ్ఞః చ=యజ్ఞము; యాజ్యశ్చ= యజ్ఞముచేత పూజింపదగినవాడు.

తా. గొప్ప బలము గల ఈ మహావిష్ణువే కాలమై సంహారము చేయుచున్నాడు. యజ్ఞమూ, యజ్ఞము చేసి పూజింపదగినవాడూ కూడ చక్రాయుధధారియైన ఈ మహావిష్ణువే. 81

మూ. సర్వదేవమయశ్చైవ సర్వభూతమయస్తథా,
సర్వలోకమయశ్చైవ సర్వజ్ఞానమయస్తథా. 82

ప్ర. అ. సర్వదేవమయః చ ఏవ = సకలదేవతాస్వరూపుడు. తథా =

మరియు, సర్వభూతమయః=సకలభూతస్వరూపుడు, సర్వలోకమయః చ ఏవ= సకలలోకస్వరూపుడు, తథా=మరియు, సర్వజ్ఞానమయః=సకలజ్ఞానస్వరూపుడు.

తా. ఈ మహావిష్ణువే సకలదేవతాస్వరూపుడు; సకల భూతస్వరూపుడు; సకలలోకస్వరూపుడు; సర్వజ్ఞానస్వరూపుడు. 82

మూ. సర్వరూపీ మహారూపీ బలదేవో మహాభుజః,
వీరహా వీర చక్షుష్మాం స్త్రైలోక్యగురురవ్యయః. 83

ప్ర. అ. సర్వరూపీ=సమస్తరూపములు గలవాడు, మహారూపీ= గొప్ప రూపము గలవాడు, బలదేవః=గొప్ప బలము గల దేవుడు. మహాభుజః=గొప్ప భుజములు గలవాడు. వీర=వీరుడా! వీరహా=వీరులను చంపువాడు. చక్షుష్మాన్= నేత్రములు గలవాడు, త్రైలోక్యగురుః=మూడులోకములకు పూజ్యుడు, అవ్యయః = నాశము లేనివాడు.

తా. ఓ! వీరుడా! అన్ని రూపములూ కూడ గొప్ప రూపము గల ఈ మహావిష్ణువునకు సంబంధించినవే. గొప్ప భుజములు గల ఇతడు బలవంతుడైన దేవుడు. వీరులను చంపగలవాడు, అంతను చూడగలవాడు. మూడు లోకములకు గురువు. నాశము లేనివాడు. 83

మూ. ఏనం మునిగణాః సర్వే చిన్తయన్తీహ మోక్షిణః,
య ఏనం వేత్తి పురుషం న స పాపైర్విలిప్యతే, 84
స్మృత్వా స్తుత్వా తథేష్ట్వా చ సర్వమస్మాదవాప్యతే.

ప్ర. అ. ఇహ = ఇక్కడ, మోక్షిణః = మోక్షము గల, సర్వే = సమస్తమైన, మునిగణాః = మునిగణములు, ఏనమ్ = ఇతనిని, చిన్తయన్తి = ధ్యానింతురు. యః = ఎవడు, పురుషమ్ = శరీరములో ఉన్న, ఏనమ్=ఇతనిని, వేత్తి= తెలుసుకొనుచున్నాడో, సః = అతడు, పాపైః = పాపములచేత న విలిప్యతే = పూయబడడు. స్మృత్వా=స్మరించి, స్తుత్వా = స్తుతించి, తథా=మరియు, ఇష్ట్వా చ = పూజించి, అస్మాత్ = ఇతనివలన, సర్వమ్ = సమస్తము, అవాప్యతే = పొందబడును.

తా. మోక్షమును కోరు మును లందరూ ఇతనినే ధ్యానించుచుందురు. సకల శరీరములలో ఉన్న ఇతనిని తెలిసికొన్నవానికి పాపములు అంటవు. ఈ

మహావిష్ణువును స్మరించుటచేతను, స్తుతించుటచేతను, పూజించుటచేతను అన్ని కోరికలను పొందవచ్చును. 84

మూ. ఏతచ్ఛ్రుత్వా చ వచనం రావణో నిర్యయౌ తదా, 85
క్రోధసంరక్తనయన ఉద్యతాస్త్రో మహాబలః.

ప్ర. అ. ఏతత్ = ఈ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, తదా = అప్పుడు, మహాబలః = గొప్ప బలముగల, రావణః = రావణుడు, క్రోధసం రక్తనయనః = క్రోధముచేత ఎఱ్ఱనైన నేత్రములు గలవాడై, ఉద్యతాస్త్రః = ఎత్తబడిన అస్త్రములు గలవాడై, నిర్యయౌ = బయల్వెడలెను.

తా. గొప్ప బలము గల రావణుడు ఈ మాటలు విని క్రోధముచేత కన్ను ఎఱ్ఱజేసి ఆయుధము నెత్తి బయలుదేరెను. 85

మూ. తథాభూతం చ తం దృష్ట్వా హరిర్ముసలధృక్ప్రభుః, 86
నైనం హన్మ్యధునా పాపం చిన్తయిత్వేతి రూపధృక్,
అన్తర్ధానం గతో రామ బ్రహ్మణః ప్రియకామ్యయా. 87

ప్ర. అ. రామ = రామా! రూపధృక్ = రూపమును ధరించి ఉన్న, ముసలధృక్ = ముసలమును ధరించిన, ప్రభుః = సర్వసమర్థుడైన, హరిః = విష్ణువు, తథాభూతమ్ = అట్టి, తమ్ = వానిని, దృష్ట్వా చ = చూచి, పాపమ్ = పాపాత్ముడైన, ఏనమ్ = వీనిని, అధునా = ఇప్పుడు, న హన్మి = చంపను, ఇతి = అని, చిన్తయిత్వా = ఆలోచించి, బ్రహ్మణః = బ్రహ్మకు, ప్రియకామ్యయా = ప్రియము చేయవలెనను కోరికచేత, అన్తర్ధానమ్ = అంతర్ధానమును, గతః = పొందినాడు.

తా. కంటికి కనబడు రూపముతో ముసలము ధరించి ఉన్న మహావిష్ణువు ఆ విధముగా ఉన్న రావణుణ్ణి చూచి, "ఈ పాపాత్ముణ్ణి ఇప్పుడు చంపకూడదు" అని ఆలోచించుకొని, బ్రహ్మకు ప్రియము చేయవలెనను ఉద్దేశ్యముతో అంతర్ధానము చెందెను. 86,87

మూ. న చ తం పురుషం తత్ర పశ్యతే రజనీచరః,
హర్షాన్నాదం విముఞ్చన్వై నిష్క్రామన్వరుణాలయాత్,
యేనైవ సంప్రవిష్టః స పథా తేనైవ నిర్యయౌ. 88

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఉత్తరకాణ్డే ప్రథమః ప్రక్షిప్తః సర్గః.

ప్ర. అ. రజనీచరః = రావణుడు, తత్ర = అక్కడ. తం పురుషమ్ = ఆ పురుషుణ్ణి, న చ పశ్యతే = చూడలేదు. సః = అతడు, హర్షాత్ = సంతోషమువలన, నాదమ్ = ధ్వనిని, విముఞ్చన్ = విడచుచు, యేనైవ = ఏ మార్గము చేత, సంప్రవిష్టః = ప్రవేశించినాడో, తేన = ఆ, పథైవ = మార్గముచేతనే, వరుణాలయాత్ = వరుణ లోకమునుండి, నిర్యయౌ = బయలుదేరెను.

తా. రావణునకు అక్కడ ఆ పురుషుడు కనబడలేదు. అతడు సంతోషముతో ధ్వని చేయుచు ఏ మార్గము ద్వారా లోనికి ప్రవేశించెనో ఆ మార్గము నుండియే వరుణలోకమునుండి బైటకు వచ్చెను. 88

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో మొదటి ప్రక్షిప్త సర్గ సమాప్తము.

అథ ద్వితీయః ప్రక్షిప్తసర్గః

[రావణుడు సూర్యుని జయించుటకై సూర్యలోకమునకు వెళ్లుట.]

మూ. అథ సంచిన్త్య లఙ్కేశః సూర్యలోకం జగామ హ,
మేరుశృఙ్గే వరే రమ్యే ఉషిత్వా తత్ర శర్వరీమ్. 1

పుష్పకం తత్సమారుహ్య రవేస్తురగసంనిభమ్,
నానాపాతగతిర్దివ్యం విహారవియతి స్థితమ్. 2

ప్ర. అ. అథ = అటుపిమ్మట, లఙ్కేశః = రావణుడు, వరే = శ్రేష్ఠమైన, రమ్యే = సుందరమైన, తత్ర = ఆ, మేరుశృఙ్గే = మేరుపర్వతశిఖరమునందు, శర్వరీమ్ = రాత్రిని, ఉషిత్వా = ఉండి, సంచిన్త్య = ఆలోచించి, రవేః = సూర్యునియొక్క, తురగసంనిభమ్ = గుఱ్ఱముతో సమానమైన, దివ్యమ్ = దివ్యమైన, విహారవియతి = విహారము చేయుటకు తగు ఆకాశమునందు, స్థితమ్ = ఉన్న, తత్ = ఆ, పుష్పకమ్ = పుష్పకమును, సమారుహ్య = ఎక్కి, నానాపాతగతిః = అనేకవిధములుగా ఎగురుట అను గమనము కలవాడై, సూర్యలోకమ్ = సూర్యలోకమును గూర్చి, జగామ హ = వెళ్లెను.

తా. పిమ్మట రావణుడు శ్రేష్ఠమూ, సుందరమూ అయిన మేరుపర్వతశిఖరముపైద ఆ రాత్రి ఉండి ఆలోచించి, సూర్యాశ్వముతో సమానమూ, దివ్యమూ, ఆకాశమునందు విహరించుటకు యోగ్యము అయిన ఆ పుష్పకవిమానము నెక్కి, అది అనేకరీతులలో ఎగురునట్లు చేయుచు సూర్యలోకమునకు వెళ్లెను. 1,2

మూ. తత్రాపశ్యద్రవిం దేవం సర్వతేజోమయం శుభమ్,
వరకాఞ్చనకేయూరరత్నామ్బరవిభూషితమ్. 3

ప్ర. అ. తత్ర = అక్కడ, దేవమ్ = దేవుడు, సర్వతేజోమయమ్ = సమస్తతేజఃస్వరూపుడు, శుభమ్ = మంగళప్రదుడు, వరకాఞ్చన కేయూర రత్నా

మ్బరవిభూషితమ్ = శ్రేష్ఠములైన బంగారు దండకడియములతోను, రత్నముల తోను, వస్త్రములతోను అలంకరించబడినవాడు అయిన, రవిమ్ = సూర్యుణ్ణి, అప శ్యత్ = చూచెను.

తా. అక్కడ సకలతేజస్స్వరూపుడైన మంగళప్రదుడైన సూర్యదేవుణ్ణి చూచెను. ఆ సూర్యదేవుడు శ్రేష్ఠములైన బంగారు బాహుపురులను, రత్నములను, వస్త్రములను అలంకరించుకొని ఉండెను. 3

మూ. కుణ్డలాభ్యాం శుభాభ్యాం తు భ్రాజన్ముఖవికాసితమ్,
కేయూరనిష్కాభరణం రక్తమాలావలమ్బినమ్. 4

ప్ర. అ. శుభాభ్యామ్ = సుందరములైన, కుణ్డలాభ్యామ్ = కుండలముల చేత, భ్రాజన్ముఖవికాసితమ్ = ప్రకాశించుచున్న ముఖముతో వికసించినవాడు, కేయూరనిష్కాభరణమ్ = బాహుపురులు, కంఠాభరణము అలంకారములుగా కలవాడు, రక్తమాలావలమ్బినమ్ = వ్రేలాడుచున్న ఎఱ్ఱని పుష్పమాలలు గల వాడు (అయిన సూర్యుణ్ణి చూచెను).

తా. ఆ సూర్యుని ముఖము సుందరములైన కుండలములతో ప్రకాశించుచు వికసించి ఉండెను. అతడు బాహుపురులు, కంఠాభరణము అలంకరించుకొని ఎఱ్ఱని వస్త్రములు ధరించి ఉండెను. 4

మూ. రక్తచన్దనదిగ్ధాఙ్గం సహస్రకిరణోజ్జ్వలమ్,
తమాదిదేవమాదిత్యముచ్చైఃశ్రవసవాహనమ్. 5

ప్ర. అ. రక్తచన్దనదిగ్ధాఙ్గమ్ = ఎఱ్ఱని మంచిగంధముతో పూయబడిన శరీరము గలవాడు, సహస్రకిరణోజ్జ్వలమ్ = వేయి కిరణములతో ప్రకాశించు చున్నవాడు, ఆదిదేవమ్ = మొదటి దేవుడు, ఉచ్చైఃశ్రవసవాహనమ్ = ఉచ్చైః శ్రవస్సు అను అశ్వము వాహనముగా గలవాడు అయిన, తమ్ = ఆ, ఆదిత్యమ్ = సూర్యుణ్ణి (చూచెను).

తా. ఆ సూర్యుడు శరీరమునకు ఎఱ్ఱని మంచిగంధము పూసికొనెను. వేయి కిరణములతో ప్రకాశించుచుండెను. ఉచ్చైఃశ్రవమును ఎక్కెను. 5

మూ. అనాద్యన్తమమధ్యం చ లోకసాక్షిం జగత్పతిమ్,
తం దృష్ట్వా ప్రవరం దేవం రావణో రక్షసాం వరః, 6
స ప్రహస్తమువాచేదం రవితేజోబలార్దితః.

ప్ర. అ. రక్షసామ్ = రాక్షసులలో, వరః = శ్రేష్ఠుడైన, సః రావణః = ఆ రావణుడు, అనాద్యన్తమ్=అది గాని అంతము గాని లేనివాడు, అమధ్యం చ= మధ్యము లేనివాడు, లోకసాక్షిమ్ = లోకమునకు సాక్షి. జగత్పతిమ్ = జగత్తుకు ప్రభువూ అయిన, తమ్=ఆ ప్రవరమ్ = శ్రేష్ఠుడైన. దేవమ్ = దేవుణ్ణి, దృష్ట్వా= చూచి, రవితేజోబలార్దితః = ఆ సూర్యుని తేజస్సుయొక్క బలముచేత పీడితుడై, అథ = పిమ్మట, ప్రహస్తమ్ = ప్రహస్తుని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. రాక్షసశ్రేష్ఠుడైన ఆ రావణుడు, ఆద్యంతములూ మధ్యమూ కూడ లేనివాడు, లోకమునకు సాక్షి, జగత్తునకు ప్రభువు అయిన శ్రేష్ఠుడైన ఆ సూర్యదేవుని చూచి ఆతని తేజోబలముచేత పీడింపబడినవాడై ప్రహస్తునితో ఇట్లు పలికెను. 6

మూ. గచ్ఛామాత్య వదస్వైనం నిదేశాన్మమ శాసనమ్, 7
యుద్ధార్థం రావణః ప్రాప్తో యుద్ధం తస్య ప్రదీయతామ్.
నిర్జితోఽస్మీతి వా బ్రూహి పక్షమేకతరం కురు. 8

ప్ర. అ. అమాత్య=అమాత్యుడా! గచ్ఛ = వెళ్లుము. మమ = నాయొక్క, నిదేశాత్ = ఆజ్ఞవలన, శాసనమ్ = నా శాసనమును, ఏనమ్ = వీనిని గూర్చి, వదస్వ=చెప్పుము. యుద్ధార్థమ్=యుద్ధముకొరకై, రావణః=రావణుడు, ప్రాప్తః = వచ్చినాడు. తస్య=వానికి. యుద్ధమ్=యుద్ధము, ప్రదీయతామ్ = ఇవ్వబడుగాక. వా = లేదా, నిర్జితః = జయించబడినవాడను, అస్మి = అయినాను, ఇతి= అని, బ్రూహి = చెప్పుము. ఏకతరమ్ = ఒక్క, పక్షమ్ = పక్షమును, కురు = చేయుము.

తా. ప్రహస్తా! నీవు వెళ్ళి నా ఆజ్ఞగా ఇతనితో చెప్పుము-"రావణుడు యుద్ధానికి వచ్చినాడు; ఆతనికి యుద్ధమైనా ఇమ్ము; లేదా ఓడిపోయినా నని చెప్పుము; ఏదో ఒక పక్షము చేయుము." 7,8

మూ. తస్య తద్వచనాద్రక్షః సూర్యస్యాన్తికమాగమత్,
పిఙ్గలం దణ్డినం చైవ సోఽపశ్యద్ద్వారపాలకౌ. 9

ప్ర. అ. రక్షః = రాక్షసుడు, తస్య = వానియొక్క, తద్వచనాత్ = ఆ వచనమువలన, సూర్యస్య=సూర్యునియొక్క, అన్తికమ్ = సమీపమును, అగమత్ = పొందెను. సః = అతడు, ద్వారపాలకౌ = ద్వారపాలకులైన, పిఙ్గలమ్= పింగలుణ్ణి, దణ్డినం చైవ = దండినీ, అపశ్యత్ = చూచెను.

తా. ప్రహస్తుడు రావణుని ఆజ్ఞ ప్రకారము సూర్యునివద్దకు వెళ్ళెను. అక్కడ అతనికి పింగలుడు. దండి అను ద్వారపాలకులు కనబడిరి. 9

మూ. తాభ్యామాఖ్యాయ తత్సర్వం రావణస్య వినిశ్చయమ్,
తూష్ణీమాస్తే ప్రహస్తస్తు తత్ర తేజోంశుదీపితః. 10

ప్ర. అ. ప్రహస్తస్తు=ప్రహస్తుడైతే, రావణస్య=రావణునియొక్క, సర్వమ్ = సమస్తమైన, తత్=ఆ, వినిశ్చయమ్=నిశ్చయమును, తాభ్యామ్=వారిద్దరికీ, ఆఖ్యాయ = చెప్పి, తత్ర = అక్కడ, తేజోంశుదీపితః=తేజస్సుచేత, కిరణముల చేత వేడిచేయబడుచు, తూష్ణీమ్ ఆస్తే = ఊరకుండెను.

తా. ప్రహస్తుడు వారిద్దరికీ రావణుని నిశ్చయమును గూర్చి పూర్తిగా తెలిపి అక్కడనే, సూర్యుని తేజస్సు, కిరణములు దహించివేయుచుండగా మౌనముగా నిలబడెను. 10

మూ. దణ్డీ గతో రవేః పార్శ్వం ప్రణమ్యాఖ్యాతవాన్ రవేః,
శ్రుత్వా తు సూర్యస్తద్వృత్తం దణ్డినో రావణస్య హ,
ఉవాచ వచనం ధీమాన్ బుద్ధిపూర్వం క్షపాపహః.

ప్ర. అ. దణ్డీ = దండి, రవేః = సూర్యునియొక్క, పార్శ్వమ్ = పార్శ్వమును గూర్చి, గతః=వెళ్ళినవాడై, ప్రణమ్య=నమస్కరించి, రవేః=సూర్యునకు, ఆఖ్యాతవాన్ = చెప్పినాడు. ధీమాన్ = బుద్ధిమంతుడు, క్షపాపహః = రాత్రిని తొలగించువాడూ అయిన, సూర్యః = సూర్యుడు, దణ్డినః = దండినుండి, రావణస్య = రావణునియొక్క, తత్ = ఆ, వృత్తమ్ = వృత్తాంతమును, శ్రుత్వా తు = విని, బుద్ధిపూర్వమ్ = బుద్ధిపూర్వకముగా, వచనమ్ = వచనమును, ఉవాచ = పలికెను.

తా. దండి సూర్యునివద్దకు వెళ్ళి, నమస్కరించి ఆయనకు చెప్పెను.

బుద్ధిమంతుడు, రాత్రిని తొలగించువాడు అయిన సూర్యుడు దండినుండి రావణుని వృత్తాంతము విని ఆలోచించి ఇట్లు పలికెను. 11

మూ. గచ్ఛ దణ్డిన్ జయస్వైనం నిర్జితోఽస్మీతి వా వద, 12
యత్తేఽభికాఙ్క్షితం కార్షీః కం చిత్కాలం క్షపాచరమ్.

ప్ర. అ. దణ్డిన్ = దండీ ! గచ్ఛ=వెళ్లుము. ఏనమ్ = వీనిని, జయస్వ= జయించుము. వా = లేదా, నిర్జితః అస్మీతి = జయించబడినాను అని, వద = చెప్పుము. తే = నీకు, యత్ = ఏది, అభికాఙ్క్షితమ్= ఇష్టమో, కంచిత్ కాలమ్= కొంచెము సమయమును, క్షపాచరమ్ = రాక్షసుని గూర్చి, కార్షీః = చేయుము.

తా. దండీ ! నీవు వెళ్ళి ఇతనిని జయింపుము; లేదా ఓడిపోయినా నని చెప్పుము. ఈ రాక్షసుని విషయమున కొంచెము కాలము నీ కెట్లు ఇష్టమో అట్లు చేయుము. 12

మూ. స గత్వా వచనాత్తస్య రాక్షసస్య మహాత్మనః, 13
కథయామాస తత్సర్వం సూర్యోక్తవచనం తదా.

ప్ర. అ. సః = అతడు, తస్య = సూర్యునియొక్క, వచనాత్ = వచనము వలన, గత్వా = వెళ్ళి, తదా = అప్పుడు, తత్ = ఆ, సర్వమ్ = సమస్తమైన, సూర్యోక్తవచనమ్ = సూర్యునిచేత పలకబడిన వాక్యమును, మహాత్మనః = మహాత్ముడైన, రాక్షసస్య = రాక్షసునకు, కథయామాస = చెప్పెను.

తా. అతడు సూర్యుని ఆజ్ఞ ప్రకారము వెళ్లి అతడు చెప్పిన మాటలను మహాత్ముడైన రావణునకు పూర్తిగా వివరించి చెప్పెను. 13

మూ. స శ్రుత్వా వచనం తస్య దణ్డినో రాక్షసేశ్వరః, 14
ఘోషయిత్వా జగామాథ స్వజయం రాక్షసాధిపః.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్వితీయః ప్రక్షిప్తః సర్గః.

ప్ర. అ. రాక్షసేశ్వరః రాక్షసుల ప్రభువైన, సః = ఆ, రాక్షసాధిపః = రావణుడు, తస్య దణ్డినః = ఆ దండియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా=

విని, అథ = అటుపిమ్మట, స్వజయమ్ = తన జయమును, ఘోషయిత్వా = ఘోషింపచేసికొని, జగామ = వెళ్ళెను.

తా. రాక్షసప్రభువైన ఆ రావణుడు దండి మాటలు విని తన జయమును చాటించుకొని వెళ్ళిపోయెను. 14

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో రెండవ ప్రక్షిప్త సర్గ సమాప్తము.

అథ తృతీయః ప్రక్షిప్తసర్గః

[రావణుడు చంద్రునితో యుద్ధానికి బయలుదేరి వెళ్ళుచు దారిలో స్వర్గలోకాలకు వెళ్ళుచున్న కొందరు పుణ్యాత్ములను చూచుట. మాంధాత కనబడగా ఆతనితో యుద్ధము చేయుట. పులస్త్యగాలవులు వచ్చి వారి యుద్ధము నిలుపుట.]

మూ. అథ సంచిన్త్య లఙ్కేశః సోమలోకం జగామ హ,
మేరుశృఙ్గవరే రమ్యే రజనీముష్య వీర్యవాన్. 1

ప్ర. అ. అథ=అటుపిమ్మట, వీర్యవాన్=పరాక్రమవంతుడైన, లఙ్కేశః =రావణుడు, రమ్యే=సుందరమైన, మేరుశృఙ్గవరే=శ్రేష్ఠమైన మేరుపర్వత శిఖరముపై, రజనీమ్=రాత్రిని, ఉష్య=ఉండి, సంచిన్త్య=ఆలోచించి, సోమలోకం=చంద్రలోకమును గూర్చి, జగామ హ=వెళ్ళెను.

తా. పిమ్మట రావణుడు సుందరమైన మేరుపర్వతశిఖరముమీద రాత్రి గడిపి, ఆలోచించి చంద్రలోకమునకు వెళ్ళెను. 1

మూ. అథ స్యన్దనమారూఢో దివ్యస్రగనులేపనః,
అప్సరోగణముఖ్యేన సేవ్యమానస్తు గచ్ఛతి. 2

ప్ర. అ. అథ=పిమ్మట, దివ్యస్రగనులేపనః=దివ్యములైన మాలలు అనులేపనములు (శరీరమునకు పూసికొను సుగంధద్రవ్యములు) గల, ఒక పురుషుడు, అప్సరోగణముఖ్యేన=అప్సరఃస్త్రీలలో ముఖ్యమైనవారి గుంపుచేత, సేవ్యమానః= సేవింపబడుచు, స్యన్దనమ్=రథమును, ఆరూఢః=ఎక్కినవాడై, గచ్ఛతి= వెళ్లుచున్నాడు.

తా. అప్పుడు ఒక పురుషుడు దివ్యములైన మాలలు ధరించి, అనులేపనము

పూసికొని, ప్రధానలైన అప్సరస్త్రీలు సేవించుచుండగా రథ మెక్కి వెళ్ళు చుండెను. 2

మూ. రతిశ్రాన్తోఽప్సరోజ్కేషు చుమ్బితః స విబుధ్యతే,
దృష్టస్తు పురుషస్తేన దృష్ట్వా కౌతూహలాన్వితః 3

ప్ర. అ. అప్సరోజ్కేషు = అప్సరఃస్త్రీల ఒడులలో, రతిశ్రాన్తః = రతిచేత అలసిన, సః = అతడు, చుమ్బితః = చుంబించబడినవాడై, విబుధ్యతే = మేల్కొనుచున్నాడు. తేన = అతనిచేత, పురుషః = ఇట్టి పురుషుడు, దృష్టః తు = చూడబడినాడు. దృష్ట్వా = చూచి, కౌతూహలాన్వితః = వేడుకతో కూడినవాడు అయ్యెను.

తా. రతిచేత అలసి తమ ఒడులలో శయనించి ఉన్న అతనిని ఆ అప్సరఃస్త్రీలు చుంబనములతో మేల్కొలుపుచుండిరి. అట్టి పురుషుణ్ణి రావణుడు చూచెను. అప్పుడు ఇత డెవ్వడా అని అతనికి కుతూహలము కలిగెను. 3

మూ. అథాపశ్యదృషిం తత్ర దృష్ట్వా చైనమువాచ తమ్,
స్వాగతం తవ దేవర్షే కాలేనై వాగతో హ్యసి. 4

ప్ర. అ. అథ = పిమ్మట, తత్ర = అక్కడ, ఋషిమ్ = ఋషిని, అపశ్యత్ = చూచెను. ఏనమ్ = ఇతనిని, దృష్ట్వా చ = చూచి, తమ్ = అతనిని గూర్చి, ఉవాచ = పలికెను. దేవర్షే = దేవర్షి, తవ = నీకు, స్వాగతమ్ = స్వాగతము. కాలేన = తగిన కాలముచేతనే, ఆగతః అసి హి = వచ్చినావు కదా.

తా. ఇంతలో అతనికి అక్కడ ఋషి కనబడెను. అతనిని చూచి ఇట్లు పలికెను- దేవర్షి, నీకు, స్వాగతము. నీవు తగిన సమయమునందు వచ్చినావు.

మూ. కోఽయం స్యన్దనమారూఢో హ్యప్సరోగణసేవితః,
నిర్లజ్జ ఇవ సంయాతి భయస్థానం న విన్దతి. 5

ప్ర. అ. అప్సరోగణసేవితః = అప్సరస్త్రీల సముదాయముచేత సేవింపబడినవాడు, స్యన్దనమ్ = రథమును, ఆరూఢః = ఎక్కినవాడు అయిన, అయమ్ = ఇతడు, కః = ఎవడు ? నిర్లజ్జః ఇవ = సిగ్గు లేనివాడు వలె, సంయాతి = వెళ్ళుచున్నాడు. భయస్థానమ్ = భయస్థానమును, న విన్దతి = తెలుసుకొనుటలేదు.

తా. అప్సరఃస్త్రీలు సేవించగా రథము నెక్కి వెళ్ళుచున్న ఇత దెవడు ? సిగ్గులేకుండా వెళ్ళుచున్నాడు. వచ్చిన భయ హేతువును గుర్తించకున్నాడు. 5

మూ. రావణేనైన ముక్తస్తు పర్వతో వాక్యమబ్రవీత్,
శృణు వత్స యథాతత్త్వం వక్ష్యే చాహం మహామతే. 6

ప్ర. అ. రావణేన = రావణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలక బడిన, పర్వతః = పర్వతుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. మహామతే = గొప్ప బుద్ధి గలవాడా ! వత్స = వత్సా ! శృణు = వినుము. అహమ్ = నేను, యథాతత్త్వమ్ = యథార్థముగా, వక్ష్యే = చెప్పగలను.

తా. పర్వతుడు రావణుని మాటలు విని ఇట్లనెను. గొప్ప బుద్ధి గల వత్సా ! వినుము; ఉన్నది ఉన్నట్లు చెప్పెదను. 6

మూ. అనేన నిర్జితా లోకా బ్రహ్మ చైవాభితోషితః,
ఏష గచ్ఛతి మోక్షాయ సుసుఖం స్థానముత్తమమ్. 7

ప్ర. అ. అనేన = ఏనిచేత, లోకాః = లోకములు, నిర్జితాః = జయించ బడినవి. బ్రహ్మ చైవ = బ్రహ్మకూడ, అభితోషితః = సంతోషింపచేయబడినాడు. ఏషః = ఇతడు, మోక్షాయ = మోక్షముకొరకు, సుసుఖమ్ = చాల సుఖకరమైన, ఉత్తమమ్ = ఉత్తమమైన, స్థానమ్ = స్థానమును గూర్చి, గచ్ఛతి = వెళ్ళు చున్నాడు.

తా. ఇతడు లోకాలను జయించినాడు అనగా ఏ లోకానికైనను వెళ్ళగలి గిన సామర్థ్యమును సంపాదించినాడు. బ్రహ్మదేవుణ్ణి సంతోషపెట్టినాడు. ఇప్పు డితడు మోక్షమునకై చాల సుఖకరమైన ఉత్తమస్థానమునకు వెళ్ళుచున్నాడు. 7

మూ. తపసా నిర్జితా యద్వద్భవతా రాక్షసాధిప,
ప్రయాతి పుణ్యకృత్తద్వత్సోమం పీత్వా న సంశయః. 8

ప్ర. అ. రాక్షసాధిప = రాక్షసరాజా ! భవతా = నీచేత, తపసా = తపస్సు చేత, యద్వత్ = ఏ విధముగా, నిర్జితాః = జయింపబడినవో, తద్వత్ = అట్లే, సోమమ్ = సోమమును, పీత్వా = త్రాగి, పుణ్యకృత్ = పుణ్యము చేసినవాడు, ప్రయాతి = వెళ్ళును. సంశయః = సంశయము, న = లేదు.

తా. రావణా! నీవు తపస్సుచేత లోకాలను జయించినట్లే సోమపానము చేసిన పుణ్యాత్ముడు ఉత్తమలోకములకు వెళ్ళును; సందేహము లేదు. 8

మూ. త్వం తు రాక్షసశార్దూల శూరః సత్యపరాక్రమః,
నైవేదృశేషు క్రుద్ధ్యన్తి బలినో ధర్మచారిషు. 9

ప్ర. అ. రాక్షసశార్దూల = ఓ! రాక్షసశ్రేష్ఠుడా! త్వం తు = నీవైతే, శూరః = శూరుడవు. సత్యపరాక్రమః = సత్యమైన పరాక్రమము గలవాడవు. బలినః = బలవంతులు, ఈదృశేషు = ఇట్టి, ధర్మచారిషు = ధర్మమును ఆచరించు వారివిషయమున, నైవ క్రుద్ధ్యన్తి = కోపించరు.

తా. ఓ! రాక్షసశ్రేష్ఠుడా! నీవు శూరుడవు. సత్యమైన పరాక్రమము కల వాడవు. బలవంతులు ఇట్టి ధర్మాత్ముల విషయమున కోపించరు. 9

మూ. అథాపశ్యద్రథవరం మహాకాయం మహాజనమ్,
జాజ్వల్యమానం వపుషా గీతవాదిత్రనిఃస్వనైః. 10

ప్ర. అ. అథ = అటుపిమ్మట, మహాకాయమ్ = గొప్ప శరీరము కలది, మహాజసమ్ = గొప్ప కాంతి గలది, గీతవాదిత్రనిఃస్వనైః = గీతవాద్యధ్వనులతో కూడినది, వపుషా = శరీరముతో, జాజ్వల్యమానమ్ = మిక్కిలి ప్రకాశించుచున్నదీ అయిన, రథవరమ్ = రథశ్రేష్ఠమును, అపశ్యత్ = చూచెను.

తా. పిమ్మట గొప్ప తేజస్సు, పెద్ద ప్రమాణమూ గల ఒక రథము కనబడెను. గీతవాద్యధ్వనులతో కూడిన ఆ రథము దేదీప్యమానముగా ఉండెను.

మూ. క్వైష గచ్ఛతి దేవర్షే భ్రాజమానో మహాద్యుతిః,
కింనరైశ్చ ప్రగాయద్భిర్నృత్యద్భిశ్చ మనోరమమ్. 11

ప్ర. అ. దేవర్షే = దేవర్షి! భ్రాజమానః = ప్రకాశించుచున్న, మహాద్యుతిః = గొప్ప కాంతి గల, ఏషః = ఇతడు, మనోరమమ్ = మనోహరముగా, ప్రగాయద్భిః = గానము చేయుచున్న, నృత్యద్భిశ్చ = నాట్యముచేయుచున్న, కింనరైః = కింనరులతో, క్వ = ఎచటికి, గచ్ఛతి = వెళ్ళుచున్నాడు?

తా. దేవర్షీ ! గొప్ప కాంతితో ప్రకాశించుచున్న ఇతడు మనోహరముగా గానము, నృత్యమూ చేయుచున్న కింనరులతో ఎక్కడికి వెళ్ళుచున్నాడు ? 11

మూ. శ్రుత్వా చైనమువాచాథ పర్వతో మునిసత్తమః,
ఏష శూరో రణే యోద్ధా సంగ్రామే ష్వనివర్తకః. 12

ప్ర. అ. అథ = పిమ్మట, మునిసత్తమః = మునిశ్రేష్ఠుడైన, పర్వతః = పర్వతుడు, శ్రుత్వా = విని, ఏనమ్ = ఇతనిని గూర్చి, ఉవాచ = పలికెను. ఏషః = ఇతడు, రణే = యుద్ధమునందు, యోద్ధా = యుద్ధముచేయు, సంగ్రామేషు = యుద్ధములయందు, అనివర్తకః = వెనుకకు మరలని, శూరః = శూరుడు.

తా. మునిశ్రేష్ఠుడైన పర్వతుడు ఆ మాటలు విని ఇట్లు పలికెను "ఇతడు యుద్ధరంగములో యుద్ధము చేయు శూరుడు. యుద్ధములలో వెనుకకు తిరగని వాడు. 12

మూ. యుధ్యమానస్తథైవైష ప్రహారైర్జర్జరీకృతః,
కృతీ శూరో రణే జేతా స్వామ్యర్థే త్యక్తజీవితః. 13

ప్ర. అ. ఏషః = ఇతడు, యుధ్యమానః = యుద్ధముచేయుచు, తథైవ = అట్లే, ప్రహారైః = దెబ్బలచేత, జర్జరీకృతః = జర్జరము చేయబడినాడు. రణే = యుద్ధమునందు, జేతా = జయించువాడు, కృతీ = కృతకృత్యుడు, శూరః = శూరుడూ అయిన ఇతడు, స్వామ్యర్థే = ప్రభువుకొరకై, త్యక్తజీవితః = విడవబడిన జీవితము గలవాడు.

తా. ఇతడు యుద్ధము చేయుచుండగా ఇతని దేహము దెబ్బలచేత తూట్లు పడినది. యుద్ధములలో జయించువాడు, కృతకృత్యుడు శూరుడూ అయిన ఇతడు ప్రభువుకొరకై తన జీవితమును త్యజించినాడు. 13

మూ. సంగ్రామే నిహతోఽమిత్రైర్హత్వా చ సమరే బహూన్,
ఇన్ద్రస్యాతిథిరేవైష అథవా యత్ర గచ్ఛతి. 14

ప్ర. అ. సమరే = యుద్ధమునందు, బహూన్ = చాలమందిని, హత్వా చ = చంపి, సంగ్రామే = యుద్ధమునందు, అమిత్రైః = శత్రువులచేత, నిహతః =

చంపబడిన, ఏషః = ఇతడు, ఇన్ద్రస్య = ఇంద్రునియొక్క, అతిథిః = అతిథిగా, అథవా = లేదా, యత్ర = ఎచ్చటికో, గచ్ఛతి = వెళ్ళుచున్నాడు.

తా. యుద్ధములో చాల మందిని చంపి, శత్రువులచేత చంపబడిన ఇతడు ఇంద్రునకు అతిథిగా వెళ్ళుచున్నాడు; లేదా మరెక్కడికో వెళ్లుచున్నాడు". 14

మూ. నృత్యగీతపరైర్లోకైః సేవ్యతే నరసత్తమః,
ప్రపచ్ఛ రావణో భూయః కోఽయం యాత్యర్కసంనిభః.

ప్ర. అ. నరసత్తమః = (ఒకానొక) మనుష్యశ్రేష్ఠుడు, నృత్యగీతపరైః = నృత్యగీతములందు సక్తులైన, లోకైః = జనులచేత, సేవ్యతే = సేవించబడుచున్నాడు. రావణః = రావణుడు, భూయః = మరల, ప్రపచ్ఛ = అడిగెను. అర్కసంనిభః = సూర్యునితో సమానుడైన, అయమ్ = ఇతడు, యాతి = వెళ్ళుచున్నాడు; కః = ఎవడు?

తా. ఇంతలో నృత్యము చేయుచు గీతములు పాడుచున్న నరులు సేవించగా వెళ్ళుచున్న ఒక మనుష్యశ్రేష్ఠుడు కనబడెను. అప్పుడు రావణుడు "సూర్యునితో సమానుడైన ఇతడెవడో వెళ్ళుచున్నాడు; ఎవ డితడు ?" అని మరల ప్రశ్నించెను. 15

మూ. రావణస్య వచః శ్రుత్వా పర్వతో వాక్యమబ్రవీత్,
య ఏష దృశ్యతే రాజన్విమానే సర్వకాఞ్చనే. 16

అప్సరోగణసంయుక్తే పూర్ణచన్ద్రనిభాననః,
సువర్ణదో మహారాజో విచిత్రాభరణామ్బరః. 17
ఏష గచ్ఛతి శీఘ్రేణ యానేన తు మహాద్యుతిః.

ప్ర. అ. రావణస్య = రావణునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, పర్వతః = పర్వతుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రాజన్ = రాజా ! సర్వకాఞ్చనే = అంతా బంగారమైన, అప్సరోగణసంయుక్తే = అప్సరఃస్త్రీల సముదాయముతో కూడిన, విమానే = విమానమునందు, విచిత్రాభరణామ్బరః = విచిత్రములైన ఆభరణములు, వస్త్రములు గల, యః = ఏ, పూర్ణచన్ద్రనిభాననః = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలవాడు, దృశ్యతే =

చూడబడుచున్నాడో, ఏషః = ఇతడు, సువర్ణదః = సువర్ణదుడు అను, మహా రాజః = మహారాజు. మహాద్యుతిః = గొప్ప కాంతి గల, ఏషః = ఇతడు, శీఘ్రేణ = శీఘ్రమైన, యానేన = వాహనముచేత, గచ్ఛతి = వెళ్ళుచున్నాడు.

తా. రావణుని మాటలు విని పర్వతు డిట్లు చెప్పెను'—రాజా! అప్సరఃస్త్రీ సముదాయముతో నిండిన, పూర్తిగా బంగారముతో చేసిన విమానమునందు కనబడు చున్న పూర్ణచంద్రుని వంటి ముఖముతో ఉన్న, విచిత్రములైన ఆభరణములు వస్త్రములు ధరించిన ఇతడు సువర్ణదుడు అను రాజు. గొప్ప తేజస్సు గల ఇతడు శీఘ్రమైన వాహనముపై వెళ్ళుచున్నాడు. 16, 17

మూ. పర్వతస్య వచః శ్రుత్వా రావణో వాక్యమబ్రవీత్. 18
ఏతే వై యాన్తి రాజానో బ్రూహి త్వమృషిసత్తమ,
కో హ్యత్ర యాచితో దద్యాద్యుద్ధాతిథ్యం మమాద్య వై.
తం మమాఖ్యాహి ధర్మజ్ఞ పితా త్వం మే హి ధర్మతః.

ప్ర. అ. పర్వతస్య = పర్వతునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, రావణః = రావణుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ఋషిసత్తమ = ఋషిశ్రేష్ఠుడా, త్వమ్ = నీవు, బ్రూహి = చెప్పుము. ఏతే = ఈ, రాజానః = రాజులు, యాన్తి వై = వెళ్ళుచున్నారు. అత్ర = వీరిలో, కః=ఎవడు, యాచితః = కోరబడినవాడై, అద్య = ఇప్పుడు, మమ = నాకు, యుద్ధాతిథ్యమ్= యుద్ధమనే ఆతిథ్యమును, దద్యాత్ = ఇచ్చును ? తమ్ = అట్టివానిని గూర్చి, మమ = నాకు, ఆఖ్యాహి = చెప్పుము. ధర్మజ్ఞ= ధర్మము తెలిసినవాడా! త్వమ్ = నీవు, మే = నాకు, ధర్మతః = ధర్మముచేత, పితా హి = తండ్రివి కదా ?

తా. పర్వతుని మాటలు విని రావణుడు ఇట్లు పలికెను -"ఓ! ఋషి శ్రేష్ఠుడా! నీవు చెప్పుము. ఈ రాజు లందరూ వెళ్ళుచున్నారు కదా; వీరిలో ఎవడు నేను కోరినచో నాకు ఇప్పుడు యుద్ధాతిథ్యము ఇచ్చును ? చెప్పుము. ధర్మములు తెలిసినవాడా! నీవు నాకు తండ్రివంటివాడవు కదా ? 18, 19

మూ. ఏవముక్తః ప్రత్యువాచ రావణం పర్వతస్తదా. 20
స్వర్గార్థినో మహారాజ నైతే యుద్ధార్థినో నృపాః,
వక్ష్యామి తే మహాభాగ యస్తే యుద్ధం ప్రదాస్యతి. 21

ప్ర. అ. తదా = అప్పుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, పర్వతః = పర్వతుడు, రావణమ్ = రావణుని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. మహారాజ = మహారాజా ! ఏతే = ఈ, నృపాః = రాజులు, స్వర్గార్థినః = స్వర్గమును కోరువారు. యుద్ధార్థినః = యుద్ధమును కోరువారు. న = కారు. మహాభాగ = మహాభాగ్యవంతుడా ! తే = నీకు, యః = ఎవడు, యుద్ధమ్ = యుద్ధమును, ప్రదాస్యతి = ఇవ్వగలడో, వక్ష్యామి = చెప్పెదను.

తా. పర్వతుడు రావణుని మాటలు విని అతనితో ఇట్లు పలికెను."మహారాజా ! ఈ రాజులు స్వర్గమును కోరువారేగాని యుద్ధమును కోరువారు కారు. మహాభాగ్యవంతుడా ! నీకు యుద్ధము ఎవ్వడు ఇవ్వగలడో చెప్పెదను.''20, 21

మూ. స తు రాజా మహాతేజాః సప్తద్వీపేశ్వరో మహాన్,
మాన్ధాతేత్యభివిఖ్యాతః స తే యుద్ధం ప్రదాస్యతి. 22

ప్ర. అ. మాన్ధాతేతి = మాంధాత అని, అభివిఖ్యాతః = ప్రసిద్ధుడైన, సః రాజా తు = ఆ రాజైతే, మహాతేజాః = గొప్ప తేజస్సు గలవాడు; సప్తద్వీపేశ్వరః = ఏడు ద్వీపములకూ ప్రభువు. మహాన్ = గొప్పవాడు. సః = అతడు, తే = నీకు, యుద్ధమ్ = యుద్ధమును, ప్రదాస్యతి = ఇవ్వగలడు.

తా. మాంధాత అని ప్రసిద్ధుడైన ఆ రాజు గొప్ప తేజస్సు కలవాడు. ఏడు ద్వీపములకు ప్రభువు. గొప్పవాడు. అతడు నీకు యుద్ధము ఇవ్వగలడు.

మూ. పర్వతస్య వచః శ్రుత్వా రావణో వాక్యమబ్రవీత్,
కుతోఽసౌ తిష్ఠతే రాజా తత్సమాచక్ష్వ సువ్రత. 23

ప్ర. అ. పర్వతస్య = పర్వతునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, రావణః = రావణుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. సువ్రత = మంచినియమములు కలవాడా ! అసౌ = ఈ, రాజా = రాజు, కుతః = ఎక్కడ, తిష్ఠతే = ఉన్నాడు ? తత్ = దానిని, సమాచక్ష్వ = చెప్పుము.

తా. పర్వతుని మాటలు విని రావణుడు ఇట్లు పలికెను."మంచి వ్రతములు కలవాడా ! ఆ రాజు ఎక్కడ ఉన్నాడో చెప్పుము." 23

మూ. సోఽహం యాస్యామి తత్రైవ యత్రాసౌ నరపుంగవః,
రావణస్య వచః శ్రుత్వా మునిర్వచనమబ్రవీత్. 24

ప్ర. అ. సః అహమ్ = నేను, అసౌ = ఈ, నరపుంగవః = నరశ్రేష్ఠుడు, యత్ర = ఎక్కడ ఉన్నాడో, తత్రైవ = అచటికే, యాస్యామి = వెళ్ళెదను. రావణస్య = రావణునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, మునిః = ముని, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. "ఆ నరశ్రేష్ఠుడు ఎక్కడ ఉన్నాడో అక్కడికే వెళ్ళెదను." రావణుని మాటలు విని ఆ ముని ఇట్లు పలికెను. 24

మూ. యువనాశ్వసుతో రాజా మాంధాతా రాజసత్తమః,
సప్తద్వీపసముద్రాన్తాం జిత్వేహాభ్యాగమిష్యతి. 25

ప్ర. అ. యువనాశ్వసుతః = యువనాశ్వునికుమారుడు, రాజసత్తమః = రాజశ్రేష్ఠుడూ అయిన, మాంధాతా = మాంధాత అను, రాజా = రాజు, సప్తద్వీప సముద్రాన్తామ్=సప్తద్వీపములు గల భూమిని, జిత్వా=జయించి, ఇహ=ఇచటికి, అభ్యాగమిష్యతి = రాగలడు.

తా. యువనాశ్వుని కుమారుడు, రాజులలో శ్రేష్ఠుడూ అయిన మాంధాత అను రాజు సప్తద్వీపములు గల భూమిని జయించి ఇక్కడికి రాగలడు. 25

మూ. అథాపశ్యన్మహాబాహుస్త్రైలోక్యే వరదర్పితః,
అయోధ్యాయాః పతిం వీరం మాంధాతారం నృపోత్తమమ్.
సప్తద్వీపాధిపం యాన్తం స్యన్దనేన విరాజతా,
కాఞ్చనేన విచిత్రేణ మాహేన్ద్రేణ భాస్వతా. 27

ప్ర. అ. అథ = అటుపిమ్మట; త్రైలోక్యే = మూడు లోకములయందు, వరదర్పితః = వరముచేత గర్వించిన, మహాబాహుః = గొప్ప బాహువులు గల రావణుడు, అయోధ్యాయాః = అయోధ్యయొక్క, పతిమ్ = ప్రభువు, వీరమ్ = వీరుడు, నృపోత్తమమ్ = రాజులలో శ్రేష్ఠుడు. సప్తద్వీపాధిపమ్ = ఏడు ద్వీపములకు ప్రభువు, విరాజతా = ప్రకాశించుచున్న, కాఞ్చనేన = బంగారువికారమైన, విచిత్రేణ = విచిత్రమైన, మాహేన్ద్రేణ=మహేంద్రుని రథమువంటి కాంతి గల,

భాస్వతా = కాంతి గల, స్యన్దనేన=రథముచేత, యాన్తమ్ = వెళ్లుచున్న, మాంధాతారమ్ = మాంధాతను, అపశ్యత్ = చూచెను.

తా. ఇంతలో, వరములచేత మూడు లోకాలలోను గర్వితుడైన ఆ రావణునకు అయోధ్యాధిపతి, వీరుడు, రాజులలో శ్రేష్ఠుడు, ఏడు ద్వీపములకు ప్రభువు అయిన మాంధాత కనబడెను. అతడు బంగారముతో చేసిన, విచిత్రమైన, ప్రకాశించుచున్న, మహేంద్రరథతుల్యమైన రథము నెక్కి వెళ్లుచుండెను. 26,27

మూ. జాజ్వల్యమానం రూపేణ దివ్యగన్ధానులేపనమ్,
తమువాచ దశగ్రీవో యుద్ధం మే దీయతామితి. 28

ప్ర. అ. రూపేణ = రూపముచేత, జాజ్వల్యమానమ్ = ప్రజ్వలించుచున్న, దివ్యగన్ధానులేపనమ్=దివ్యమైన గంధము అనులేపనముగా గల, తమ్ = అతనిని గూర్చి, దశగ్రీవః=రావణుడు, మే=నాకు, యుద్ధమ్ = యుద్ధము, దీయతామ్= ఇవ్వబడుగాక, ఇతి = అని, ఉవాచ = పలికెను.

తా. దివ్యమైన గంధమును పూసికొని అద్భుతమైన రూపముతో ప్రకాశించుచున్న ఆ మాంధాతతో రావణుడు -"నాకు యుద్ధము ఇమ్ము"అని పలికెను. 28

మూ. ఏవముక్తో దశగ్రీవం ప్రహస్యేదమువాచ హ,
యది తే జీవితం నేష్టం తతో యుధ్యస్వ రాక్షస. 29

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః=పలకబడిన అతడు, ప్రహస్య = నవ్వి, దశగ్రీవమ్ = రావణుని గూర్చి, ఉవాచ హ = పలికెను. రాక్షస = రాక్షసుడా! తే = నీకు, జీవితమ్ = జీవితము, న ఇష్టం యది = ఇష్టము కానిచో, తతః = అప్పుడు, యుధ్యస్వ = యుద్ధము చేయుము.

తా. రావణుని మాటలు విని మాంధాత ఇట్లనెను.-"రాక్షసా! నీకు జీవితము ఇష్టము కానిచో (జీవించవలె నని లేనిచో) యుద్ధము చేయుము. 29

మూ. మాంధాతుర్వచనం శ్రుత్వా రావణో వాక్యమబ్రవీత్,
వరుణస్య కుబేరస్య యమస్యాపి న వివ్యథే. 30
కిం పునర్మానుషాత్త్వత్తో రావణో భయమావిశేత్.

ప్ర. అ. మాంధాతుః = మాంధాతయొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, రావణః = రావణుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రావణః = ఏ రావణుడు, వరుణస్య = వరుణునకు, కుబేరస్య = కుబేరునకు, యమస్యాపి = యమునకూ కూడ, న వివ్యథే = భయపడలేదో, అట్టి రావణుడు, మానుషాత్ = మనుష్యుడవైన, త్వత్తః = నీనుండి, భయమ్ = భయమును, కిం పునః ఆవిశేత్ = పొందునా?

తా. మాంధాత మాటలు విని రావణుడు ఇట్లు పలికెను-"వరుణునికి, కుబేరునికి, యమునికీ కూడ భయపడని రావణుడు మనుష్యమాత్రుడవైన నీకు భయపడునా?" 30

మూ. ఏవముక్త్వా రాక్షసేన్ద్రః క్రోధాత్సంప్రజ్వలన్నివ, 31
అజ్ఞాపయామాస తదా రాక్షసాన్ యుద్ధదుర్మదాన్.

ప్ర. అ. రాక్షసేన్ద్రః = రావణుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, క్రోధాత్ = కోపమువలన, ప్రజ్వలన్నివ = మండుచున్నవాడువలె అయి, యుద్ధదుర్మదాన్ = యుద్ధమునందు చెడ్డ మదము గల, రాక్షసాన్ = రాక్షసులను, అజ్ఞాపయామాస = అజ్ఞాపించెను.

తా. ఆ రావణుడు ఇట్లు పలికి కోపముతో మండిపడుచు యుద్ధమునందు చెడ్డ మదము గల రాక్షసులతో ఇట్లనెను. 31

మూ. అథ క్రుద్ధాస్తు సచివా రావణస్య దురాత్మనః, 32
వవర్షుః శరజాలాని శూరా యుద్ధవిశారదాః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దురాత్మనః = దురాత్ముడైన, రావణస్య = రావణునియొక్క, యుద్ధవిశారదాః = యుద్ధమునందు నేర్పు గలవారు, శూరాః = శూరులూ అయిన, సచివాః = మంత్రులు, క్రుద్ధాః = కోపించినవారై, శరజాలాని = బాణసముదాయములను, వవర్షుః = వర్షించిరి.

తా. పిమ్మట యుద్ధములో సమర్థులైన, శూరులైన, దురాత్ముడైన రావణుని అమాత్యులు కోపముతో బాణముల సముదాయములను కురిపించిరి. 32

మూ. అథ రాజ్ఞా బలవతా కఙ్కపత్త్రైః శిలాశితైః, 33
ఇషుభిస్తాడితాః సర్వే ప్రహస్తశుకసారణాః,
మహోదరవిరూపాక్షమారీచాకమ్పనాదయః. 34

ప్ర. అ. అథ = అటు పిమ్మట, ప్రహస్తశుకసారణాః = ప్రహస్తశుకసారణులు, మహోదర విరూపాక్ష మారీచాకమ్పనాదయః = మహోదర - విరూపాక్ష - మారీచ-అకంపనాదులు, సర్వే = అందరూ, బలవతా = బలవంతుడైన, రాజ్ఞా = రాజుచేత, శిలాశితైః = రాళ్ళ వలె వాడియైన, కఙ్కపత్త్రైః = గ్రద్దల రెక్కలు గల, ఇషుభిః = బాణములచేత, తాడితాః = కొట్టబడిరి.

తా. పిమ్మట బలవంతుడైన ఆ మాంధాత గ్రద్దల రెక్కలు కట్టిన, రాళ్ళ వలె వాడియైన (గట్టివైన) బాణాలతో ప్రహస్త-శుకసారణులను, మహోదర - విరూపాక్ష-మారీచ-అకంపనాదులను కొట్టెను. 33, 34

మూ. అథ ప్రహస్తస్తు నృపమిషువర్షైరవాకిరత్,
అప్రాప్తానేవ తాన్ సర్వాన్ ప్రచిచ్ఛేద నృపోత్తమః. 35

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ప్రహస్తః తు = ప్రహస్తుడైతే, ఇషువర్షైః = బాణవర్షములచేత, నృపమ్ = రాజును, అవాకిరత్ = చల్లెను. నృపోత్తమః = రాజశ్రేష్ఠుడు, తాన్ = వాటిని, సర్వాన్ = అన్నింటినీ, అప్రాప్తానేవ = రాకుండగానే, ప్రచిచ్ఛేద = ఛేదించెను.

తా. పిమ్మట ప్రహస్తుడు మాంధాతపై బాణవర్షములు కురిపించెను. మాంధాత ఆ బాణములు తనవద్దకు రాకుండగనే వాటిని ఖండించెను. 35

మూ. తతో నృపవరః క్రుద్ధః పఞ్చభిః ప్రబిభేద తమ్,
తోమరైశ్చ మహావేగైః పునః క్రౌఞ్చమివాగ్నిజః. 36

ప్ర అ. తతః = అటుపిమ్మట, నృపవరః = రాజశ్రేష్ఠుడు, క్రుద్ధః = కోపించినవాడై, తమ్ = వానిని, అగ్నిజః = కుమారస్వామి, క్రౌఞ్చమివ = క్రౌంచ పర్వతమును వలె, మహావేగైః = గొప్ప వేగము గల, పఞ్చభిః = ఐదు, తోమరైః చ = తోమరములతో, పునః = మరల, ప్రబిభేద = భేదించెను.

తా. పిమ్మట మాంధాత కోపించి, కుమారస్వామి క్రౌంచపర్వతమును భేదించినట్లు, అతనిని మహావేగము గల ఐదు తోమరములచేత భేదించెను. 36

మూ. తతో ముహుర్భ్రామయిత్వా ముద్గరం యమసంనిభమ్,
ప్రాహరత్సోఽతివేగేన రాక్షసస్య రథం ప్రతి. 37

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సః = అతడు, యమసంనిభమ్ = యమునితో సమానముగా, ముద్గరమ్ = ముద్గరమును, ముహుః = మాటిమాటికి, భ్రామయిత్వా = త్రిప్పి, రాక్షసస్య = రావణునియొక్క, రథం ప్రతి = రథమును గూర్చి, అతివేగేన = చాల వేగముతో, ప్రాహరత్ = కొట్టెను.

తా. పిమ్మట మాంధాత యముడు వలె ముద్గరమును అనేకపర్యాయములు త్రిప్పి రావణుని రథముమీదికి చాల వేగముతో విసిరెను. 37

మూ. స పపాత మహావేగో ముద్గరో వజ్రసంనిభః,
స తూర్ణం పాతితస్తేన రావణః శక్రకేతువత్. 38

ప్ర. అ. వజ్రసంనిభః=వజ్రముతో సమానమైన, సః ముద్గరః = ఆ ముద్గరము, మహావేగః = గొప్ప వేగము గలదై, పపాత = పడెను. తేన = దానిచేత, సః = ఆ, రావణః = రావణుడు, శక్రకేతువత్ =ఇంద్రధ్వజము వలె, తూర్ణమ్= శీఘ్రముగా, పాతితః = పడగొట్టబడెను.

తా. వజ్రమువంటి ఆ ముద్గరము మహావేగముతో పడి శీఘ్రముగా రావణుని ఇంద్రధ్వజమును వలె పడగొట్టెను. 38

మూ. తదా స నృపతిః ప్రీత్యా హర్షోద్గతబలో బభౌ,
సకలేన్దుకలాః స్పృష్ట్వా యథామ్బు లవణామ్భసః. 39

ప్ర. అ. తదా = అప్పుడు, హర్షోద్గతబలః=సంతోషముచేత వృద్ధిచెందిన బలము గల, సః నృపతిః = ఆ రాజు. సకలేన్దుకలాః = పూర్ణచంద్రుని కళలను, స్పృష్ట్వా = స్పృశించి, లవణామ్భసః = లవణసముద్రము యొక్క, అమ్బు యథా = జలము వలె, ప్రీత్యా = ఆనందముతో, బభౌ = ప్రకాశించెను.

తా. అప్పు డా మాంధాత సంతోషముచేత బలము వృద్ధి చెందగా, పరి

పూర్ణుడైన చంద్రుని కిరణముల స్పర్శచేత లవణసముద్రము వలె, ఆనందముతో వృద్ధి చెందెను. 39

మూ. తతో రక్షోబలం సర్వం హాహాభూతమచేతనమ్,
పరివార్యాథ తం తస్థౌ రాక్షసేన్ద్రం సమన్తతః. 40

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సర్వమ్ = సమస్తమైన, రక్షోబలమ్ = రాక్షససైన్యము, హాహాభూతమ్ = హాహాకారము చేయుచు, అథ = పిమ్మట, అచేతనమ్ = చైతన్యములేని. తం రాక్షసేన్ద్రమ్ = ఆ రాక్షసరాజును, సమన్తతః = అంతటా, పరివార్య = చుట్టి, తస్థౌ = నిలచెను.

తా. అప్పుడు ఆ రాక్షససైన్య మంతా హాహాకారములు చేయుచు, చైతన్య విహీనుడైన రావణుని చుట్టూ నిలబడెను. 40

మూ. తతశ్చిరాత్సమాశ్వాస్య రావణో లోకరావణః,
మాంధాతుః పీడయామాస దేహం లఙ్కేశ్వరో భృశమ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, లోకరావణః = లోకమును ఏడ్పించిన, లఙ్కేశః = లంకాధిపతియైన, రావణః = రావణుడు, చిరాత్ = చిరకాలమునకు, సమాశ్వాస్య = ఊరడిల్లి, మాంధాతుః = మాంధాతయొక్క, దేహమ్ = దేహమును, పీడయామాస = పీడించెను.

తా. లంకాధిపతి, లోకములను ఏడ్పించినవాడూ అయిన రావణుడు చాల సేపటికి స్పృహలోనికి వచ్చి మాంధాత దేహమునకు చాల పీడ కలిగించెను. 41

మూ. మూర్ఛితం తు నృపం దృష్ట్వా ప్రహృష్టాస్తే నిశాచరాః,
చుక్రుశుః సింహనాదాంశ్చ ప్రక్ష్వేలన్తో మహాబలాః. 42

ప్ర. అ. మహాబలాః = గొప్ప బలము గల, తే నిశాచరాః = ఆ రాక్షసులు, మూర్ఛితమ్ = మూర్ఛచెందిన, నృపమ్ = రాజును, దృష్ట్వా = చూచి, ప్రహృష్టాః = సంతోషించినవారై, సింహనాదాన్ చ = సింహనాదములను, ప్రక్ష్వేలన్తః = అరచుచు, చుక్రుశుః = ధ్వనిచేసిరి.

తా. ఆ రాజు మూర్ఛ చెందుట చూచి మహాబలము గల ఆ రాక్షసులు సంతోషించుచు సింహనాదములు చేయుచు అరచిరి. 42

మూ. లబ్ధసంజ్ఞో ముహూర్తేన అయోధ్యాధిపతి స్తదా,
దృష్ట్వా తం మన్త్రిభిః శత్రుం పూజ్యమానం నిశాచరైః,
జాతకోపో దురాధర్షశ్చన్ద్రార్కసదృశద్యుతిః,
మహతా శరవర్షేణ పాతయద్రాక్షసం బలమ్. 44

ప్ర. అ. దురాధర్షః = ఎదిరింప శక్యము కానివాడు, చన్ద్రార్కసదృశద్యుతిః = చంద్రసూర్యులతో సమానమైన కాంతి గలవాడు అయిన, అయోధ్యాధిపతిః = అయోధ్య ప్రభువైన మాంధాత, తదా = అప్పుడు, ముహూర్తేన = ముహూర్తకాలముచేత, లబ్ధసంజ్ఞః = పొందబడిన సంజ్ఞ గలవాడై, మన్త్రిభిః = మంత్రులైన, నిశాచరైః = రాక్షసులచేత, పూజ్యమానమ్ = పూజింపబడుచున్న, తమ్ = అతనిని, దృష్ట్వా = చూచి, జాతకోపః = పుట్టిన కోపము గలవాడై, రాక్షసమ్ = రాక్షస సంబంధమైన, బలమ్ = సైన్యమును, మహతా = గొప్ప, శరవర్షేణ = బాణ వర్షముచేత, పాతయత్ = పడగొట్టెను.

తా. చంద్రసూర్యుల వంటి కాంతి గల, ఎదిరింప శక్యము కాని మాంధాత ముహూర్తకాలములో తేరికొని, మంత్రులైన రాక్షసుల మన్ననలు పొందుచున్న ఆ రావణుని చూచి, చాల కోపించి, గొప్ప బాణవర్షముచేత రాక్షససైన్యమును పడగొట్టెను. 43,44

మూ. చాపస్యైవ నినాదేన తస్య బాణరవేణ చ,
సంచచాల తతః సైన్యముద్ధూత ఇవ సాగరః. 45

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తస్య = వానియొక్క, చాపస్య = ధనస్సుయొక్క, నినాదేనైవ = ధ్వనిమాత్రముచేతనే, బాణరవేణ చ = బాణధ్వనిచేతను, సైన్యమ్ = సైన్యము, ఉద్ధూతః = ఎగరగొట్టబడిన, సాగరః ఇవ = సముద్రము వలె, సంచచాల = చలించెను.

తా. అప్పుడు అతని ధనుష్టంకారధ్వనిచేతను, బాణముల ధ్వనిచేతను ఆ సైన్యము ఎగురగొట్టబడిన సముద్రము వలె చలించెను. 45

మూ. తద్యుద్ధమభవద్ఘోరం నరరాక్షససంకులమ్,
అథావిష్టౌ మహాత్మానౌ నరరాక్షససత్తమౌ, 46
కార్ముకాసిధరౌ వీరౌ వీరాసనగతౌ తదా.

ప్ర అ. నరరాక్షస సంకులమ్ = నరులతోను, రాక్షసులతోను సంకుల మైన, తత్ = ఆ, యుద్ధమ్ = యుద్ధము, ఘోరమ్ = ఘోరముగా, అభవత్ = ఆయెను. అథ = అటుపిమ్మట, మహాత్మానౌ = మహాత్ములైన, కార్ముకాసిధరౌ = ధనస్సులను, ఖడ్గములను ధరించిన, వీరౌ = వీరులైన, వీరాసనగతౌ = వీరాసనమును పొందిన, నరరాక్షససత్తమౌ = నరశ్రేష్ఠ రాక్షసశ్రేష్ఠులు, తదా=అప్పుడు, ఆవిష్టౌ = క్రోధావేశము పొందిరి.

తా. నరరాక్షసుల మధ్య ఆ యుద్ధము సంకులముగా, భయంకరముగా జరిగెను. అప్పుడు ధనస్సులు ఖడ్గములు ధరించి వీరాసనమునందు ఉన్న (వీరులు నిలచు విధమున నిలచిన) వీరులైన ఆ మాంధాతృ రావణులు కోపావేశము చెందిరి. 46

మూ. మాంధాతా రావణం చైవ రావణశ్చైవ తం నృపమ్, 47
క్రోధేన మహతావిష్టౌ శరవర్షం ముమోచతుః
తౌ పరస్పరసంక్షోభాత్ప్రహారైః క్షతవిక్షతౌ. 48

ప్ర. అ. మాంధాతా = మాంధాత, రావణం చైవ = రావణునీ, రావణః = రావణుడు, తం నృపం చైవ= ఆ రాజునూ గూర్చి, మహతా=గొప్ప, క్రోధేన= కోపముచేత, ఆవిష్టౌ = ఆవేశించబడినవారై, శరవర్షమ్ = బాణవర్షమును, ముమోచతుః = విడచిరి, తౌ = వారిద్దరూ; పరస్పరసంక్షోభాత్ = ఒకరినొకరు పీడించుటవలన, ప్రహారైః = దెబ్బలచేత, క్షతవిక్షతౌ=బాగుగా కొట్టబడిరి.

తా. గొప్ప కోపావేశముతో మాంధాత రావణునిమీదా, రావణుడు మాంధాతమీదా బాణవర్షమును కురిపించెను. పరస్పరము పీడించుకొని వాళ్ళు ఇద్దరూ దెబ్బలచేత ఎక్కువగా నలిగిపోయిరి. 47, 48

మూ. కార్ముకేఽస్త్రం సమాధాయ రౌద్రమస్త్రమముఞ్చత,
ఆగ్నేయేన తు మాంధాతా తదస్త్రం పర్యవారయత్. 49

ప్ర. అ. కార్ముకే = ధనస్సుమీద, అస్త్రమ్ = అస్త్రమును, సమాధాయ = కూర్చి, రౌద్రమ్ అస్త్రమ్ = రౌద్రాస్త్రమును, అముఞ్చత=విడచెను. మాంధాతా= మాంధాత, ఆగ్నేయేన = ఆగ్నేయాస్త్రముచేత, తత్ = ఆ, అస్త్రమ్ = అస్త్రమును, పర్యవారయత్ = నివారించెను.

తా. (రావణుడు) ధనస్సుమీద రౌద్రాస్త్రమును సంధించి దానిని విడచెను. మాంధాత ఆగ్నేయాస్త్రముచే దానిని నివారించెను. 49

మూ. గాన్ధర్వేణ దశగ్రీవో వారుణేన చ రాజరాట్
గృహీత్వా స తు బ్రహ్మాస్త్రం సర్వభూతభయావహమ్.
వేదయామాస మాంధాతా దివ్యం పాశుపతం మహత్

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, గాన్ధర్వేణ = గాంధర్వాస్త్రముచేత, రాజరాట్ = రాజులరాజు, వారుణేన = వారుణాస్త్రముచేత (యుద్ధము చేసెను). సః = రావణుడు, సర్వభూతభయావహమ్ = సమస్తభూతములకు భయము కలిగించు, బ్రహ్మాస్త్రమ్ = బ్రహ్మాస్త్రమును, గృహీత్వా = గ్రహించి, వేదయామాస = తెలిపెను. మాంధాతా = మాంధాత, మహత్ = గొప్పదైన, దివ్యమ్ = దివ్యమైన, పాశుపతమ్ = పాశుపతాస్త్రమును ప్రయోగించెను.

తా. రావణుడు గాంధర్వాస్త్రమును ప్రయోగించగా మాంధాత దానిని వారుణాస్త్రముచేత కొట్టివేసెను. రావణుడు సకలభూతములకు భయమును కలిగించు బ్రహ్మాస్త్రమును ప్రయోగించగా మాంధాత గొప్పదైన, దివ్యమైన పాశుపతాస్త్రమును గ్రహించెను. 50

మూ. తదస్త్రం ఘోరరూపం తు త్రైలోక్య భయవర్ధనమ్ 51
దృష్ట్వా త్రస్తాని భూతాని స్థావరాణి చరాణి చ
వరదానాత్తు రుద్రస్య తపసాధిగతం మహత్. 52

ప్ర. అ. తపసా = తపస్సుచేత, రుద్రస్య = రుద్రునియొక్క, వరదానాత్ = వరము ఇచ్చుటవలన, అధిగతమ్ = పొందబడిన, మహత్ = గొప్పదైన, ఘోరరూపమ్ = భయంకరమైన రూపము గల, త్రైలోక్యభయవర్ధనమ్ = మూడు లోకముల భయమును వృద్ధిపొందించు, తత్ = ఆ, అస్త్రమ్ = అస్త్రమును, దృష్ట్వా = చూచి, స్థావరాణి = స్థావరములు, చరాణి చ = చరములు అయిన, భూతాని = భూతములు, త్రస్తాని = భయపడినవి.

తా. తపస్సు చేసి రుద్రుని వరముచేత పొందబడిన, భయంకరమైన రూపము గల, మూడు లోకములకు భయమును వృద్ధి పొందించు గొప్పదైన ఆ అస్త్రమును చూచి స్థావరములు, జంగమములు అయిన ప్రాణులు భయపడినవి.

మూ. తతః సంకమ్పతే సర్వం త్రైలోక్యం సచరాచరమ్
దేవాః సంకమ్పితాః సర్వే లయం నాగాశ్చ సంగతాః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సచరాచరమ్ = జంగమస్థావరములతో కూడిన, సర్వమ్=సమస్తమైన, త్రైలోక్యమ్=మూడు లోకముల సముదాయము, సంకమ్పతే = కంపించుచున్నది. సర్వే = సమస్తమైన, దేవాః = దేవతలు, సంకమ్పితాః = కంపింపచేయబడిరి. నాగాశ్చ = నాగులు కూడ, లయమ్=లయమును, సంగతాః = పొందిరి.

తా. అప్పుడు స్థావరజంగమాత్మకములైన మూడు లోకములు కంపించినవి. దేవతలు వణకిపోయిరి. నాగులు అణగిపోయిరి. 53

మూ. అథ తౌ మునిశార్దూలౌ ధ్యానయోగాదపశ్యతామ్
పులస్త్యో గాలవశ్చైవ వారయామాసతుర్నృపమ్. 54
సోపాలమ్భైశ్చ వివిధైర్వాక్యై రాక్షససత్తమమ్

ప్ర. అ. అథ=అటుపిమ్మట, మునిశార్దూలౌ=మునిశ్రేష్ఠులైన, పులస్త్యః= పులస్త్యుడు, గాలవశ్చైవ = గాలవుడు, ధ్యానయోగాత్ = ధ్యానమువలన, అపశ్యతామ్ = చూచిరి. తౌ = వారు, నృపమ్ = రాజును, సోపాలమ్భైః = నిందతో గూడిన, వివిధైః=అనేకవిధములైన, వాక్యైః=వాక్యములచేత, రాక్షససత్తమమ్= రాక్షసశ్రేష్ఠుణ్ణి, వారయామాసతుః = నివారించిరి.

తా. మునిశ్రేష్ఠులైన పులస్త్యుడు, గాలవుడు ధ్యానయోగముచేత ఈ విషయము తెలిసికొని ఆ రాజును నివారించిరి. నిందాపూర్వకములైన వివిధవాక్యములతో రావణుణ్ణి వారించిరి. 54

మూ. తౌ తు కృత్వా తదా ప్రీతిం నరరాక్షసయో స్తదా, 55
సంప్రస్థితౌ సుసంహృష్టౌ పథా యేనైవ చాగతౌ.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః సర్గః, తృతీయః

ప్ర. అ. తౌ = ఆ మునులు, తదా = అప్పుడు, నరరాక్షసయోః = నర

రాక్షసులకు, ప్రీతిమ్ = స్నేహమును, కృత్వా = చేసి, సుసంహృష్టౌ = బాగా సంతోషించినవారై, యేన = ఏ, పథా = మార్గముచేత, ఆగతౌ = వచ్చినారో, తేనైవ = ఆ మార్గముచేతనే, సంప్రస్థితౌ = ప్రయాణమైరి.

తా. ఆ మునులు మాంధాతకు రావణునకూ మధ్య స్నేహము ఏర్పరచి, సంతోషించుచు వచ్చిన మార్గముననే వెళ్ళిపోయిరి. 55

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో తృతీయ ప్రక్షిప్త సర్గ సమాప్తము.

అథ చతుర్థః ప్రక్షిప్తసర్గః

[రావణుడు చంద్రలోకమునకు వెళ్ళి చంద్రునితో యుద్ధము చేయుటకు ప్రారంభించగా బ్రహ్మదేవుడు వారించి రావణునకు పారమేశ్వరమంత్రమును ఉపదేశించుట].

మూ. గతాభ్యామథ విప్రాభ్యాం రావణో రాక్షసాధిపః,
దశయోజనసాహస్రం ప్రథమం తు మరుత్పథమ్. 1

అతిక్రామన్మహాతేజాః పుష్పకేణ మహాబలః,
యత్ర తిష్ఠన్తి నిత్యం హి హంసాః సర్వగుణాన్వితాః. 2

ప్ర. అ. విప్రాభ్యామ్ = బ్రాహ్మణులు, గతాభ్యామ్ = వెళ్ళినవారగుచుండగా, అథ = పిమ్మట, రాక్షసాధిపః = రాక్షసప్రభువు, మహాతేజాః = గొప్ప తేజస్సు కలవాడు, మహాబలః = గొప్ప బలము గలవాడూ అయిన, రావణః = రావణుడు, యత్ర = ఎక్కడ, సర్వగుణాన్వితాః = అన్ని గుణములతో కూడిన, హంసాః = హంసలు, నిత్యమ్ = నిత్యమూ, తిష్ఠన్తి = ఉందురో అట్టి, దశయోజనసాహస్రమ్ = పది వేల యోజనముల దూరమునం దున్న, ప్రథమమ్ = మొదటి, మరుత్పథమ్ = వాయుమార్గమును, పుష్పకేణ = పుష్పకముచేత, అతిక్రామత్ = దాటెను.

తా. ఆ మును లిద్దరూ వెళ్ళిపోయినపిమ్మట గొప్ప తేజస్సు, బలమూ గల రాక్షసరాజైన రావణుడు పుష్పక మెక్కి, సమస్తగుణములు గల హంసలు నిత్యమూ నివసించు పదివేల యోజనముల దూరమునందున్న మొదటి వాయు మార్గమును దాటి వెళ్ళెను. 1, 2

మూ. తత ఊర్ధ్వం తు గత్వా వై మరుత్పథమనుత్తమమ్,
దశయోజనసాహస్రం తదేవ పరిగణ్యతే. 3

ప్ర. అ. తతః = అంతకంటె, ఊర్ధ్వమ్ = పైన, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, మరుత్పథమ్ = వాయుమార్గమును, గత్వా = పొంది (వెళ్ళెను). తదేవ = అది, దశయోజనసాహస్రమ్ = పది వేల యోజనముల దూరమునం దున్నదిగా, పరిగణ్యతే = చెప్పబడును.

తా. అంతకంటె పైకి శ్రేష్ఠమైన, పదివేల యోజనముల దూరమునం దున్న వాయుమార్గమునకు వెళ్ళెను. 3

మూ. తత్ర సంనిహితా మేఘాస్త్రివిధాస్తత్ర నిత్యశః
అగ్నేయాః పక్షిణో బ్రాహ్మాస్త్రివిధా స్తత్ర తే స్థితాః. 4

ప్ర. అ. తత్ర = అక్కడ, నిత్యశః = ఎల్లప్పుడు, త్రివిధాః = మూడు విధములైన, మేఘాః = మేఘములు, సంనిహితాః = సంనిహితములై, స్థితాః = ఉన్నవి. తత్ర = అక్కడ, ఆగ్నేయాః = ఆగ్నేయములు, పక్షిణః = పక్షులు, బ్రాహ్మాః = బ్రాహ్మములు అని, త్రివిధాః = మూడు విధములైన, తే = ఆ మేఘములు, స్థితాః = ఉన్నవి.

తా. ఆ వాయుపథమునందు నిత్యము ఆగ్నేయములు, పక్షులు, బ్రాహ్మములు అను మూడు విధాలైన మేఘములు ఉండును 4

మూ. అథ గత్వా తృతీయం తు వాయోః పన్థానముత్తమమ్,
నిత్యం యత్ర స్థితాః సిద్ధాశ్చారణాశ్చ మనస్వినః. 5

ప్ర. అ. అథ = పిమ్మట, ఉత్తమమ్ = ఉత్తమమైన, వాయోః పన్థానమ్ = వాయువుయొక్క మార్గమును, గత్వా = పొంది (వెళ్లెను). యత్ర = ఎక్కడ, సిద్ధాః = సిద్ధులు, మనస్వినః = ఆత్మాభిమానవంతులైన, చారణాశ్చ = చారణులూ, నిత్యమ్ = ఎల్లప్పుడూ, స్థితాః = ఉన్నారో.

తా. పిమ్మట, సిద్ధులు, మానవంతులైన చారణులు నిత్యమూ నివసించు ఉత్తమమైన మూడవ వాయుమార్గమును పొందెను. 5

మూ. దశైవ తు సహస్రాణి యోజనానాం తథైవ చ,
చతుర్థం వాయుమార్గం తు శీఘ్రం గత్వా పరంతప. 6
వసన్తి యత్ర నిత్యస్థా భూతాశ్చ నవినాయకాః.

ప్ర. అ. పరంతప=శత్రుసంహారకుడవైన రామా! తత్రైవ=అట్టే, దశ=పది, యోజనానామ్=యోజనముల యొక్క, సహస్రాణి=సహస్రముల (దూరము నందు), యత్ర = ఎక్కడ, సవినాయకాః = వినాయకులతో కూడిన, భూతాః చ=భూతములు, నిత్యస్థాః= నిత్యమూ ఉన్నవై, వసన్తి= నివసించునో, అట్టి, చతుర్థమ్ = నాల్గవ, వాయుమార్గమ్ = వాయుమార్గమును, శీఘ్రమ్ = శీఘ్రముగా, గత్వా = పొంది (వెళ్లెను).

తా. రామా! భూతములూ, వినాయకుడు నిత్యమూ నివసించు, పదివేల యోజనముల దూరములో ఉన్న నాల్గవ వాయుమార్గమునకు శీఘ్రముగా వెళ్లెను.

మూ. అథ గత్వా స వై శీఘ్రం పఞ్చమం వాయుగోచరమ్, 7
దశైవ చ సహస్రాణి యోజనానాం తథైవ చ,
గఙ్గా యత్ర సరిచ్ఛ్రేష్ఠా నాగా వై కుముదాదయః, 8

కుఞ్జరా స్తత్ర తిష్ఠన్తి యే తు ముఞ్చన్తి శీకరమ్,
గఙ్గాతోయేషు క్రీడన్తి పుణ్యం వర్షన్తి సర్వతః. 9

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సః = అతడు, తత్రైవ = అట్లే, యోజనానామ్=యోజనములయొక్క, దశ=పది, సహస్రాణి=సహస్రములను, గత్వా= వెళ్ళి, యత్ర=ఎక్కడ, సరిచ్ఛ్రేష్ఠా = నదులలో శ్రేష్ఠురాలైన, గఙ్గా = గంగ, కుముదాదయః = కుముదము మొదలైన, నాగాః = ఏనుగలు (ఉన్నవో), అట్టి, పఞ్చమమ్=ఐదవ, వాయుగోచరమ్ = వాయుమార్గమును, శీఘ్రమ్=శీఘ్రముగా (పొందెను). తత్ర = అక్కడ, యే = ఏవి. శీకరమ్ = తుంపరను, ముఞ్చన్తి = విడచునో, గఙ్గాతోయేషు=గంగాజలములయందు, క్రీడన్తి=క్రీడించునో. పుణ్యమ్ = పుణ్యమైనజలము, సర్వతః = అన్నివైపులా, వర్షన్తి = వర్షించునో అట్టి, కుఞ్జరాః = ఏనుగులు, తిష్ఠన్తి=ఉండును.

తా. పిమ్మట అతడు పదివేల యోజనముల దూరమునందున్న ఐదవ వాయుమార్గమునకు వెళ్ళెను. ఆ వాయుమార్గమునందు గంగానదీ, కుముదము మొదలైన దిగ్గజాలూ ఉండును. ఆ దిగ్గజాలు గంగలో క్రీడించుచు, పుణ్యమైన ఆ గంగాజలమును తుంపర్లరూపమున విడచుచుండును. 7-9

మూ. తతో రవికరభ్రష్టం వాయునా పేశలీకృతమ్,
జలం పుణ్యం ప్రపతతి హిమం వర్షతి రాఘవ. 10

ప్ర అ. రాఘవ=రామా! తతః=దానివలన, రవికరభ్రష్టమ్=సూర్యుని కిరణములనుండి జారిన, వాయునా=వాయువుచేత, పేశలీకృతమ్=పల్చగా చేయబడిన, పుణ్యమ్=పుణ్యమైన, జలమ్=జలము, ప్రపతతి=పడును. హిమమ్=మంచుగా, వర్షతి= వర్షించును.

తా. రామా! ఆ తుంపర్లు సూర్యుని కిరణముల ద్వారా క్రిందికి జారి, గాలికి పల్చబడి, నీరుగాను, మంచుగాను వర్షించును (క్రిందపడును). 10

మూ. తతో జగామ షష్ఠం స వాయుమార్గం మహాద్యుతే,
యోజనానాం సహస్రాణి దశైవ తు స రాక్షసః, 11
యత్రాస్తే గరుడో నిత్యం జ్ఞాతిబాన్ధవసత్కృతః.

ప్ర. అ. మహాద్యుతే= గొప్ప కాంతి కలవాడా! సరాక్షసః=రాక్షసులతో కూడిన, సః=అతడు, తతః=అక్కడినుండి, యోజనానామ్= యోజనముల యొక్క, దశ ఏవ=పది, సహస్రాణి=సహస్రములను, షష్ఠమ్=ఆరవ, వాయుమార్గమ్=వాయుమార్గమును గూర్చి, జగామ=వెళ్లెను, యత్ర=ఎక్కడ, జ్ఞాతిబాన్ధవసత్కృతః=జ్ఞాతులచేత బంధువులచేత సత్కరించబడిన, గరుడః=గరుత్మంతుడు, నిత్యమ్=నిత్యమూ, ఆస్తే=ఉండునో.

తా. గొప్ప కాంతి గల రామా! ఆ రావణుడు రాక్షసులతో కలిసి అక్కడి నుండి పది వేల యోజనముల దూరమునం దున్న ఆరవ వాయుమార్గమునకు వెళ్లెను. జ్ఞాతులు, బంధువులు సత్కరించుచుండగా గరుత్మంతుడు నిత్యము అక్కడనే ఉండును. 11

మూ. దశైవ తు సహస్రాణి యోజనానాం తథోపరి, 12
సప్తమే వాయుమార్గే చ యత్రైతే ఋషయః స్మృతాః.

ప్ర. అ. తథా=అట్లే, యోజనానామ్=యోజనములయొక్క, దశ సహస్రాణి ఏవ=పదివేలు, ఉపరి=పైన, సప్తమే=ఏడవ, వాయుమార్గే=వాయు

మార్గమునందు, యత్ర=ఎక్కడ, ఏతే=ఈ, ఋషయః=ఋషులు, స్మృతాః= చెప్పబడినారో అక్కడికి వెళ్లెను.

తా. దానిపైన పదివేల యోజనముల దూరమునందు సప్తర్షులు ఉండు ఏడవ వాయుమార్గమునకు వెళ్లెను. 12

మూ. అత ఊర్ధ్వం తు గత్వా వై సహస్రాణి దశైవ తు, 13
అష్టమం వాయుమార్గం తు యత్ర గఙ్గా ప్రతిష్ఠితా,
ఆకాశగఙ్గా విఖ్యాతా ఆదిత్యపథసంస్థితా, 14
వాయునా ధార్యమాణా సా మహావేగా మహాస్వనా.

ప్ర. అ. అతః = దీనికంటె, ఊర్ధ్వమ్ = పైన, దశైవ తు = పది, సహస్రాణి = సహస్రములను, గత్వా వై = వెళ్ళి, యత్ర = ఎక్కడ, ఆకాశ గఙ్గా = ఆకాశగంగగా, విఖ్యాతా = ప్రసిద్ధి పొందిన, ఆదిత్యపథసంస్థితా = సూర్యమార్గమునందున్న, మహావేగా = గొప్ప వేగముగల, మహాస్వనా = గొప్ప ధ్వని గల, సా = ఆ, గఙ్గా = గంగ, వాయునా = వాయువుచేత, ధార్యమాణా= ధరించబడుచు, ప్రతిష్ఠితా = ప్రతిష్ఠింపబడి ఉన్నదో అట్టి, అష్టమమ్ = ఎనిమి దవ, వాయుమార్గమ్ = వాయుమార్గమును చేరెను.

తా. దానిపైన పదివేల యోజనముల దూరము వెళ్ళి ఆకాశగంగ అను ప్రసిద్ధి గల ఆదిత్యమార్గమునందున్న గంగ ఉన్న ఎనిమిదవ వాయుమార్గమును చేరెను. గొప్ప వేగముతో, గొప్ప ధ్వనితో ఆ ఆకాశగంగ వాయువుచేత ధరింప బడి అక్కడ ఉండును. 13, 14

మూ. అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి చన్ద్రమా యత్ర తిష్ఠతి, 15
అశీతిం తు సహస్రాణి యోజనానాం ప్రమాణతః.

ప్ర. అ. ప్రమాణతః = ప్రమాణమువలన, అతః = దీనికంటె, యోజనా నామ్=యోజనములయొక్క, అశీతిం సహస్రాణి=ఎనభైవేలు, ఊర్ధ్వమ్=పైన, యత్ర = ఎక్కడ, చన్ద్రమాః = చంద్రుడు, తిష్ఠతి = ఉన్నాడో (ఆ స్థానమును గూర్చి), ప్రవక్ష్యామి = చెప్పగలను.

తా. దానిపైన ఎనభైవేల యోజనాల దూరమునందు చంద్రుడున్న స్థానమును గూర్చి చెప్పెదను. 15

మూ. చన్ద్రమా స్తిష్ఠతే తత్ర నక్షత్రగ్రహసంయుతః, 16
శతం శతసహస్రాణి రశ్మయశ్చన్ద్రమణ్డలాత్,
ప్రకాశయన్తి లోకాంస్తు సర్వసత్త్వసుఖావహాః. 17

ప్ర. అ. తత్ర = అక్కడ, నక్షత్రగ్రహసంయుతః = నక్షత్రములతోను గ్రహములతోను కూడినవాడై, చన్ద్రమాః = చంద్రుడు, తిష్ఠతే = ఉండును. చన్ద్రమణ్డలాత్ = చంద్రమండలమునుండి, సర్వసత్త్వసుఖావహాః = సకల ప్రాణులకు సుఖము కలిగించు, శతమ్ = నూరు, శతసహస్రాణి = లక్షలు, రశ్మయః = కిరణములు, లోకాన్ = లోకాలను, ప్రకాశయన్తి = ప్రకాశింపచేయుచుండును.

తా. అక్కడ నక్షత్రాలతోను, గ్రహాలతోను కలిసి చంద్రుడు ఉండును. ఆ చంద్రమండలమునుండి బయల్వెదలిన నూరు లక్షల కిరణములు సకలప్రాణులకు భయమును కలిగించుచు లోకాలను ప్రకాశింపచేయుచుండును. 16, 17

మూ. తతో దృష్ట్వా దశగ్రీవం చన్ద్రమా నిర్దహన్నివ,
స తు శీతాగ్నినా శీఘ్రం ప్రాదహద్రావణం తదా. 18

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః చన్ద్రమాః = ఆ చంద్రుడు, దశగ్రీవమ్ = పది కంఠములు గల, రావణమ్ = రావణుణ్ణి, నిర్దహన్నివ = కాల్చివేయుచున్నవాడువలె, దృష్ట్వా = చూచి, తదా = అప్పుడు, శీఘ్రమ్ = శీఘ్రముగా, శీతాగ్నినా = చల్లదనమనే అగ్నిచేత, ప్రాదహత్ = కాల్చెను.

తా. అప్పుడు చంద్రుడు దశకంఠుడైన రావణుణ్ణి కాల్చివేయుచున్నట్లు చూచి, శీఘ్రముగా శీతాగ్నిచేత అతనిని కాల్చివేసెను. 18

మూ. నాసహం స్తస్య సచివాః శీతాగ్నిభయపీడితాః,
రావణం జయశబ్దేన ప్రహస్తోఽథైన మబ్రవీత్. 19

ప్ర. అ. తస్య = వానియొక్క, సచివాః = మంత్రులు, శీతాగ్ని భయపీడితాః = శీతాగ్నివలన భయముచేత పీడింపబడినవారై, నాసహన్ = సహించ

జాలకపోయిరి. అథ = అటుపిమ్మట, ప్రహస్తః = ప్రహస్తుడు, ఏనమ్ = ఈ, రావణమ్=రావణుని గూర్చి, జయశబ్దేన=జయశబ్దముతో, అబ్రవీత్=పలికెను.

తా. శీతాగ్నికి భయపడి అతని మంత్రులు దానికి తట్టుకొనలేకపోయిరి. అప్పుడు ప్రహస్తుడు జయశబ్దము పలుకుచు రావణునితో ఇట్లనెను. 19

మూ. రాజన్ శీతేన వధ్యామో నివర్తామ ఇతో వయమ్,
చన్ద్రరశ్మిప్రతాపేన రక్షసాం భయమావిశత్. 20

ప్ర. అ. రాజన్ = రాజా! శీతేన = శీతముచేత, వధ్యామః = చంపబడు చున్నాము. వయమ్=మనము, ఇతః = ఇక్కడినుండి, నివర్తామః=మరలెదము. చన్ద్రరశ్మిప్రతాపేన = చంద్రకిరణముల ప్రతాపముచేత, రక్షసామ్=రాక్షసులకు, భయమ్ = భయము, ఆవిశత్ = ఆవేశించెను.

తా. "రాజా! ఈ శీతము మనలను చంపివేయుచున్నది. ఇక్కడినుండి మరలి వెళ్ళిపోయెదము". చంద్రునికిరణముల తాపముచేత ఆ రాక్షసులను భయము ఆవహించెను. 20

మూ. స్వభావ ఏష రాజేన్ద్ర శీతాంశుర్దహనాత్మకః,
ఏవచ్ఛ్రుత్వా ప్రహస్తస్య రావణః క్రోధమూర్ఛితః, 21
విస్ఫార్య ధనురుద్యమ్య నారాచైస్తమపీడయత్.

ప్ర. అ. రాజేన్ద్ర=రామా! శీతాంశుః=చల్లని కిరణములు గల చంద్రుడు, దహనాత్మకః = అగ్నిరూపుడు, ఏషః = ఇది, స్వభావః = స్వభావము. ప్రహస్తస్య = ప్రహస్తునియొక్క, ఏతత్ = ఈ వాక్యమును, శ్రుత్వా = విని, రావణః= రావణుడు, క్రోధమూర్ఛితః=కోపముచేత వ్యాప్తుడై, ధనుః=ధనస్సును, ఉద్యమ్య = ఎత్తి, విస్ఫార్య= దాపి, నారాచైః = నారాచబాణములచేత, తమ్ = వానిని. అపీడయత్ = పీడించెను.

తా. రామా! చంద్రుడు అగ్నిస్వరూపుడు, ఇది స్వభావము, రావణుడు ప్రహస్తుని మాటలు విని, కోపముతో నిండినవాడై, ధనస్సు గ్రహించి, చరచి నారాచబాణములచేత చంద్రుణ్ణి పీడించెను. 21

మూ. అథ బ్రహ్మ తదాగచ్ఛత్సోమలోకం త్వరాన్వితః. 22
దశగ్రీవ మహాబాహో సాక్షాద్విశ్రవసః సుత,
గచ్ఛ శీఘ్రమితః సౌమ్య మా చన్ద్రం పీడయస్వ వై. 23

ప్ర. అ. అథ = అటుపిమ్మట, బ్రహ్మ = బ్రహ్మదేవుడు, త్వరాన్వితః = తొందరతో కూడినవాడై, తదా = అప్పుడు, సోమలోకమ్ = చంద్రలోకమును గూర్చి, అగచ్ఛత్ = వచ్చెను. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! సాక్షాత్ = సాక్షాత్తు, విశ్రవసః = విశ్రవసునియొక్క, సుత = కుమారుడా, సౌమ్య = సౌమ్యుడా! దశగ్రీవ = రావణా! ఇతః = ఇక్కడినుండి, శీఘ్రమ్ = శీఘ్రముగా, గచ్ఛ = వెళ్లుము. చన్ద్రమ్ = చంద్రుణ్ణి, మా పీడయస్వ వై = పీడించకుము.

తా. అప్పుడు బ్రహ్మదేవుడు తొందరగా చంద్రలోకమునకు వచ్చి ఇట్లు పలికెను-"గొప్ప బాహువులు గలవాడా! సాక్షాత్తు విశ్రవసుని కుమారుడవు, సౌమ్యుడవు అయిన ఓ! రావణా! ఇక్కడినుండి వెంటనే వెళ్ళిపొమ్ము. చంద్రుణ్ణి పీడించకుము. 22,23

మూ. లోకస్య హితకామో వై ద్విజరాజో మహాద్యుతిః,
మన్త్రం చ సంప్రదాస్యామి ప్రాణాత్యయగతిర్యదా. 24
యస్త్వేతం సంస్మరేన్మన్త్రం నాసౌ మృత్యుమవాప్నుయాత్.

ప్ర. అ. మహాద్యుతిః = గొప్ప కాంతి గల, ద్విజరాజః = చంద్రుడు, లోకస్య = లోకమునకు, హితకామః = హితమునందు కోరికగలవాడు. మన్త్రం చ = మంత్రమును, సంప్రదాస్యామి = ఇచ్చెదను. యదా = ఎప్పుడు, ప్రాణాత్యయ గతిః = ప్రాణాపాయస్థితి ఉండునో అప్పుడు, యః = ఎవడు, ఏతత్ మన్త్రమ్ = ఈ మంత్రమును, సంస్మరేత్ = స్మరించునో, అసౌ = వీడు, మృత్యుమ్ = మృత్యువును, న అవాప్నుయాత్ = పొందడు.

తా. గొప్ప కాంతి గల ఈ చంద్రుడు లోకహితము చేయుటయందు ఆసక్తి కలవాడు. నీకు ఒక మంత్రము ఇచ్చెదను. ప్రాణాపాయస్థితిలో ఈ మంత్రమును జపించువాడు మరణించడు." 24

మూ. ఏవముక్తో దశగ్రీవః ప్రాఞ్జలిర్దేవ మబ్రవీత్. 25
యది తుష్టోఽసి మే దేవ లోకనాథ మహావ్రత,
యది మన్త్రశ్చ మే దేయో దీయతాం మమ ధార్మిక. 26
యం జప్త్వాహం మహాభాగ సర్వదేవేషు నిర్భయః,
అసురేషు చ సర్వేషు దానవేషు పతత్రిషు. 27
త్వత్ప్రసాదాత్తు దేవేశ స్యామజేయో న సంశయః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, దశగ్రీవః = రావణుడు, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలి కలవాడై, దేవమ్ = ప్రభువును గూర్చి, అబ్రవీత్ = పలికెను. దేవ = దేవా! లోకనాథ = లోకములకు నాథుడా! మహావ్రత = గొప్ప నియమము గలవాడా! మే = నాకు, తుష్టః = సంతోషించినవాడవు, అసి యది = అయినట్లయితే, మే = నాకు. మన్త్రశ్చ = మంత్రము కూడా, దేయః యది = ఇవ్వదగినట్లయితే, దీయతామ్ = ఇవ్వబడుగాక. మహాభాగ = మహాభాగ్యవంతుడా! దేవేశ = దేవతలప్రభూ! యమ్ = ఏ మంత్రమును, జప్త్వా = జపించి, అహమ్ = నేను, సర్వదేవేషు = సమస్తదేవతలయందు, అసురేషు = అసురులయందు, సర్వేషు = సమస్తమైన, దానవేషు = దానవులయందు, పతత్రిషు = పక్షులయందు, త్వత్ప్రసాదాత్ = నీ అనుగ్రహమువలన, నిర్భయః = భయములేనివాడను, అజేయః = జయింప శక్యము కానివాడను, స్యామ్ = అగుదునో; సంశయః = సంశయము, న = లేదు.

తా. బ్రహ్మదేవుని మాటలు విని రావణుడు చేతులుజోడించి ఇట్లు పలికెను. "లోకములకు నాథుడవైన ఓ! దేవా! గొప్ప నియమములు గలవాడా! నీవు అనుగ్రహించినట్లయితే, నాకు మంత్రము ఇవ్వదలచినట్లయితే నాకు ఇమ్ము. మహాభాగ్యవంతుడా! దేవతాప్రభూ! నేను ఆ మంత్రమును జపించి, నీ అనుగ్రహము చేత దేవతలవలన గాని, అసురులవలన గాని, దానవులవలన గాని, పక్షులవలన గాని భయము లేనివాడనై, జయింప శక్యముకానివాడను అగుదును. సందేహము లేదు".

మూ. ఏవముక్తో దశగ్రీవం బ్రహ్మా వచనమబ్రవీత్. 28
ప్రాణాత్యయేషు జప్తవ్యో న నిత్యం రాక్షసాధిప.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, బ్రహ్మ = బ్రహ్మదేవుడు, దశగ్రీవమ్ = రావణునిగూర్చి, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను. రాక్షసాధిప = రాక్షసరాజా! ప్రాణాత్యయేషు = ప్రాణాపాయసమయములయందు, జప్తవ్యః = జపించదగినది. నిత్యమ్ = నిత్యమూ, న = కాదు.

తా. రావణుని మాటలు విని బ్రహ్మదేవు డిట్లు పలికెను - రావణా! ఈ మంత్రమును ప్రాణాపాయసమయములయందు మాత్రమే జపించవలెను; నిత్యమూ జపించకూడదు. 28

మూ. అక్షసూత్రం గృహీత్వా తు జపేన్మన్త్రమిమం శుభమ్,
జప్త్వా తు రాక్షసపతే త్వమజేయో భవిష్యసి,
అజప్త్వా రాక్షసపతే న తే సిద్ధిర్భవిష్యతి. 30

ప్ర. అ. శుభమ్ = మంగళప్రదమైన, ఇదం మన్త్రమ్ = ఈ మంత్రమును, అక్షసూత్రమ్ = జపమాలను, గృహీత్వా = గ్రహించి, జపేత్ = జపించవలెను. రాక్షసపతే = రాక్షసరాజా! జప్త్వా = జపించి, త్వమ్ = నీవు, అజేయః = జయింప శక్యముకానివాడవు, భవిష్యసి = కాగలవు. రాక్షసపతే = రాక్షసరాజా! అజప్త్వా = జపించకుండగా, తే = నీకు, సిద్ధిః = సిద్ధి, న భవిష్యతి = కలగదు.

తా. మంగళప్రదమైన ఈ మంత్రమును జపమాల (రుద్రాక్షమాల)తోనే జపించవలెను. రావణా! దీనిని జపించినచో నీకు సిద్ధి లభించును; జపించనిచో లభించదు. 29, 30

మూ. శృణు మన్త్రం ప్రవక్ష్యామి యేన రాక్షసపుంగవ,
మన్త్రస్య కీర్తనాదేవ ప్రాప్స్యసే సమరే జయమ్. 31

ప్ర. అ. రాక్షసపుంగవ = రాక్షసశ్రేష్ఠుడా! మన్త్రమ్ = మంత్రమును, ప్రవక్ష్యామి = చెప్పెదను, శృణు = వినుము. యేన = దేనిచేత, మన్త్రస్య = మంత్రముయొక్క, కీర్తనాదేవ = ఉచ్చారణమువల్లనే, సమరే = యుద్ధమునందు, జయమ్ = జయమును, ప్రాప్స్యసే = పొందగలవో.

తా. ఓ! రాక్షసశ్రేష్ఠుడా! మంత్రము చెప్పెదను వినుము. ఈ మంత్రమును ఉచ్చరించినంతమాత్రముననే నీకు యుద్ధములో జయము లభించగలదు.

మూ. నమస్తే దేవదేవేశ సురాసురనమస్కృత,
భూతభవ్య మహాదేవ హర పిఙ్గలలోచన. 32

ప్ర. అ. దేవదేవ = దేవతలకు దేవుడా! ఈశ = సర్వసమర్థుడా! సురాసుర నమస్కృత = సురులచేతను అసురులచేతను నమస్కరింపబడినవాడా! భూత భవ్య = భూతస్వరూపా! భవిష్యత్స్వరూపా! మహాదేవ = మహాదేవా! హర = పాపమును హరించువాడా! పిఙ్గలలోచన = పచ్చని నేత్రములు గలవాడా! తే = నీకు, నమః = నమస్కారము.

తా. దేవదేవా! ఈశ్వరా! సురులచేత అసురులచేత నమస్కరింపబడు చున్నవాడా! భూతభవిష్యత్కాలస్వరూపా! మహాదేవా! పాపహరా! పచ్చని నేత్రములు కలవాడా! నీకు నమస్కారము. 32

మూ బాలస్త్వం వృద్ధరూపీ చ వైయాఘ్రవసనచ్ఛద,
అర్చనీయోఽసి దేవ త్వం త్రైలోక్యప్రభురీశ్వరః. 33

ప్ర. అ. వైయాఘ్రవసనచ్ఛద = వ్యాఘ్రాజినము వస్త్రముగా గలవాడా! త్వమ్ = నీవు, బాలః = బాలుడవు; వృద్ధరూపీ చ = వృద్ధరూపములో ఉన్న వాడవు, దేవ = దేవా! త్వమ్ = నీవు, అర్చనీయః = పూజించతగినవాడవు, అసి = అయి ఉన్నావు. త్రైలోక్యప్రభుః = మూడు లోకములకు ప్రభువువు. ఈశ్వరః = సమర్థుడవు.

తా. వ్యాఘ్రచర్మము వస్త్రముగా ధరించినవాడా! నీవు బాలరూపములోను, వృద్ధరూపములోను ఉందువు. దేవా! నీవు పూజింపదగినవాడవు, మూడు లోకాలకు ప్రభువైనవాడవు, సర్వసమర్థుడవు. 33

మూ. హరో హరితనేమీ చ యుగాన్తదహనోఽనలః,
గణేశో లోకశంభుశ్చ లోకపాలో మహాభుజ. 34

ప్ర. అ. మహాభుజ = గొప్ప భుజములు కలవాడా! (నీవు), హరః = పాపములను హరించువాడవు, హరితనేమీ చ = దిక్కులు ఎల్లలుగా కలవాడవు, యుగాన్తదహనః = యుగాంతమునందు దహించు, అనలః = అగ్నివి, గణేశః =

గణముల ప్రభువు, లోకశంభుశ్చ = లోకముల సుఖమునకు కారణభూతుడవు, లోకపాలః = లోకములను పాలించువాడవు.

తా. గొప్ప భుజములు కలవాడా! నీవు పాపములను హరించువాడవు, దిక్కులు అంచులుగా కలవాడవు (అంతటా వ్యాపించినావు). యుగాంతమునందు దహింపచేయు అగ్నివి. గణముల నాయకుడవు. లోకములకు సుఖ మిచ్చు వాడవు. లోకములను పాలించువాడవు. 34

మూ. మహాభాగో మహాశూలీ మహాదంష్ట్రీ మహేశ్వరః,
కాలశ్చ బలరూపీ చ నీలగ్రీవో మహోదరః. 35

ప్ర. అ. మహాభాగః = గొప్ప భాగ్యము కలవాడవు, మహాశూలీ = గొప్ప శూలము గలవాడవు, మహాదంష్ట్రీ = పెద్ద కోరలు కలవాడవు, మహేశ్వరః = మహేశ్వరుడవు, కాలః చ = కాలస్వరూపుడవు, బలరూపీ చ = బలరూపుడవు, నీలగ్రీవః = నల్లని కంఠము గలవాడవు, మహోదరః = పెద్ద ఉదరము (పొట్ట) కలవాడవు.

తా. నీవు మహాభాగ్యశాలివి, గొప్ప శూలము ధరించినవాడవు, పెద్ద కోరలు కలవాడవు, మహేశ్వరుడవు. కాలరూపుడవు, బలరూపుడవు, నల్లని కంఠము, పెద్ద ఉదరము కలవాడవు. 35

మూ. దేవాన్తగ స్తపోన్తశ్చ పశూనాం పతిరవ్యయః,
శూలపాణిర్వృషః కేతుర్నేతా గోప్తా హరో హరిః. 36

ప్ర. అ. దేవాన్తగః = దేవతల అంతమును పొందినవాడవు, తపోన్తశ్చ = తపస్సుయొక్క అంతమైనవాడవు, పశూనామ్ = జీవులకు, పతిః = ప్రభువు అయినవాడవు, అవ్యయః = నాశము లేనివాడవు, శూలపాణిః = శూలము హస్తము నందు కలవాడవు, వృషః = ధర్మస్వరూపుడవు, కేతుః = కేతువువంటివాడవు (లేదా వృషకేతుః = వృషభము కేతువునందు గలవాడవు), నేతా = నాయకుడవు, గోప్తా = రక్షకుడవు, హరః = హరుడవు, హరిః = విష్ణుస్వరూపుడవు.

తా. దేవతలందరూ నశించినా నిలచువాడవు, తపస్సుకు లక్ష్యమైన వాడవు, జీవులకు పతివి. నాశరహితుడవు. శూలము హస్తమునం దున్నవాడవు.

ధర్మస్వరూపుడవు. ధ్వజమువంటివాడవు, (లేదా ధ్వజముమీద వృషభమున్న వాడవు), నాయకుడవు, రక్షకుడవు, హరుడవు; హరివి. 36

మూ. జటీ ముణ్డీ శిఖణ్డీ చ లకుటీ చ మహాయశాః,
భూతేశ్వరో గణాధ్యక్షః సర్వాత్మా సర్వభావనః. 37

ప్ర. అ. జటీ = జటాధారివి, ముణ్డీ = ముండనము కలవాడవు, శిఖణ్డీ చ = జుట్టు కలవాడవు, లకుటీ=కఱ్ఱ ఆయుధముగా కలవాడవు, మహాయశాః = గొప్ప కీర్తి గలవాడవు, భూతేశ్వరః=భూతములకు ఈశ్వరుడవు, గణాధ్యక్షః= ప్రమథగణముల నాయకుడవు. సర్వాత్మా = సకలాత్మస్వరూపుడవు, సర్వభావనః = అంతనూ గ్రహించే (తెలుసుకొనే) వాడవు.

తా. నీవు జడదారివి, శిరస్సు ముండనము చేయించుకున్న సన్యాసివి. జుట్టు ఉన్నవాడవు, దండమును ఆయుధముగా ధరించినవాడవు, గొప్ప కీర్తికలవాడవు, భూతేశ్వరుడవు, గణాధ్యక్షుడవు, సర్వాత్మస్వరూపుడవు, సర్వమును చూచువాడవు. 37

మూ. సర్వగః సర్వహారీ చ స్రష్టా చ గురురవ్యయః,
కమణ్డలుధరో దేవః పినాకీ ధూర్జటిస్తథా. 38

ప్ర. అ. సర్వగః = అంతటా సంచరించువాడవు, సర్వహారీ చ = సర్వమునూ హరించువాడవు, స్రష్టా చ = సృష్టించువాడవు, గురుః = పూజ్యుడవు, అవ్యయః = నాశనము లేనివాడవు, కమణ్డలుధరః = కమండలువును ధరించువాడవు, దేవః = ప్రకాశించువాడవు, పినాకీ = పినాక మను ధనస్సు కలవాడవు, తథా = మరియు, ధూర్జటిః = జటలయందు గంగ కలవాడవు లేదా జటాభారము కలవాడవు.

తా. నీవు అంతటా వ్యాపించిఉన్నవాడవు, సర్వమును సంహరించువాడవు, సృష్టికర్తవు, పూజ్యుడవు, నాశరహితుడవు, కమండలువు ధరించువాడవు, ప్రకాశించువాడవు. పినాక మను ధనస్సు కలవాడవు, ధూర్జటివి. 38

మూ. మానసీయశ్చ ఓంకారో వరిష్ఠో సామవేదగః,
మృత్యుశ్చ మృత్యుదూతశ్చ పారియాత్రశ్చ సువ్రతః.

ప్ర. అ. మాననీయః చ = గౌరవింపదగినవాడవు, ఓంకారః = ఓంకార రూపుడవు, వరిష్ఠః = గొప్పవాడవు, సామవేదగః = సామవేదమును పొందిన వాడవు, మృత్యుః చ = మృత్యువు, మృత్యుదూతశ్చ = మృత్యుదూతవు, పారియాత్రః చ = సంగవర్జితుడవు, సువ్రతః = మంచి నియమములు కలవాడవు.

తా. నీవు మాననీయుడవు. ఓంకారము. గొప్పవాడవు. సామవేదప్రతిపాద్యుడవు. మృత్యువు; మృత్యుదూతవు, పరివ్రాజకుడవు, మంచి నియమములు కలవాడవు. 39

మూ. బ్రహ్మచారీ గృహవాసీ వీణాపణవతూణవాన్,
అమరో దర్శనీయశ్చ బాలసూర్యనిభ స్తథా. 40

ప్ర. అ. బ్రహ్మచారీ = బ్రహ్మచారివి, గృహవాసీ = గృహస్థుడవు, వీణాపణవతూణవాన్ = వీణ, పణవము, తూణము అను వాద్యములు కలవాడవు, అమరః = మరణరహితుడవు, దర్శనీయశ్చ = సుందరుడవు, తథా = మరియు, బాలసూర్యనిభః = బాలసూర్యునితో సమానుడవు.

తా. నీవు బ్రహ్మచారివి, గృహస్థుడవు. వీణ, పణవము, తూణము అను వాద్యములను ప్రయోగించువాడవు. మరణరహితుడవు, సౌందర్యవంతుడవు, బాలసూర్యునితో సమానుడవు. 40

మూ. శ్మశానవాసీ భగవానుమాపతిరనిన్దితః,
భగస్యాక్షినిపాతీ చ పూష్ణో దశననాశనః. 41

ప్ర. అ. శ్మశానవాసీ = శ్మశానమునందు నివసించువాడవు, భగవాన్ = భగవంతుడవు, ఉమాపతిః = ఉమాపతివి, అనిన్దితః = నిందింపబడనివాడవు, భగస్య = భగునియొక్క, అక్షినిపాతీ చ = నేత్రములను పడగొట్టినవాడవు, పూష్ణః = పూషయొక్క, దశననాశనః = దంతములను నశింపచేసినవాడవు.

తా. శ్మశానమునందు నివసించువాడవు, భగవంతుడవు, ఉమాపతివి, నిందింపబడనివాడవు, భగుని నేత్రములు పడగొట్టినవాడవు, పూషుని దంతాలు రాల్చిన వాడవు. 41

మూ. జ్వరహర్తా పాశహస్తః ప్రలయః కాల ఏవ చ,
ఉల్కాముఖో౽గ్ని కేతుశ్చ మునిర్దీప్తో విశాంపతిః. 42

ప్ర. అ. జ్వరహర్తా = జ్వరమును హరించువాడవు, పాశహస్తః = పాశము హస్తమునందు కలవాడవు, ప్రలయః = ప్రలయము, కాలః ఏవ చ = కాలము, ఉల్కాముఖః = ఉల్కలు (కొరవులు) ముఖమునందు కలవాడవు, అగ్ని కేతుః చ = అగ్ని కేతువుగా గలవాడవు, మునిః = మునివి, దీప్తః = ప్రకాశించుచున్న వాడవు, విశాంపతిః = ప్రజలకు అధిపతివి.

తా. నీవు జ్వరమును హరించువాడవు, చేతిలో పాశ మున్నవాడవు, ప్రలయస్వరూపుడవు (ప్రలయకర్తవు), కాలస్వరూపుడవు, ఉల్కాముఖుడవు, అగ్ని కేతువు, మునివి, ప్రకాశించుచున్నవాడవు, మనుష్యులకు అధిపతివి. 42

మూ. ఉన్మాదవేపథుకరః సమర్థో లోకసత్తమః,
వామనో వామదేవశ్చ ప్రాగ్దక్షిణ్యశ్చ నామతః. 43

ప్ర. అ. ఉన్మాదవేపథుకరః = ఉన్మాదమును కంపమును కలిగించు వాడవు, సమర్థః = సమర్థుడవు, లోకసత్తమః = లోకములో శ్రేష్ఠుడగు, వామనః = పొట్టివాడవు, వామదేవశ్చ = వామదేవుడవు, నామతః = పేరుచేత, ప్రాగ్దక్షిణ్యః చ = ప్రాగ్దక్షిణ్యుడవు.

తా. ఉన్మాదమును, కంపమును కలిగించువాడవు. సమర్థుడవు. లోకములో శ్రేష్ఠుడవు. వామనుడవు. వామదేవుడవు. ప్రాగ్దక్షిణ్య దను పేరుగల వాడవు. 43

మూ. భిక్షుశ్చ భిక్షురూపీ చ త్రిజటీ జటిలః స్వయమ్,
శక్రహస్తప్రతిష్టమ్భీ వసూనాం స్తమ్భనస్తథా. 44

ప్ర. అ. భిక్షుశ్చ = భిక్షువు, భిక్షురూపీ = భిక్షురూపముకలవాడవు, త్రిజటీ = మూడు జటలు కలవాడవు, స్వయమ్ = స్వయముగా, జటిలః = జటలు ధరించినవాడవు, శక్రహస్తప్రతిష్టమ్భీ = దేవేంద్రుని హస్తమును స్తంభింప చేసినవాడవు, తథా = మరియు, వసూనామ్ = వసువులకు, స్తమ్భనః = స్తంభింప చేసినవాడవు.

తా. నీవు భిక్షుకుడవు, భిక్షురూపధారివి, మూడు జటలు కలవాడవు, జటాధారివి. ఇంద్రుని హస్తము స్తంభింపచేసినవాడవు, వసువులను స్తంభింప చేసినవాడవు. 44

మూ ఋతుర్ఋతుకరః కాలో మధుర్మధురలోచనః,
వానస్పత్యః శ్రీకరశ్చ నిత్యమాశ్రితపూజితః. 45

ప్ర. అ. ఋతుః = ఋతువు, ఋతుకరః = ఋతువులను చేయువాడవు, కాలః = కాలము, మధుః = వసంతము, మధురలోచనః = సుందరములైన నేత్రములు కలవాడవు, వానస్పత్యః=మహావృక్షములకు సంబంధించినవాడవు, శ్రీకరః చ = లక్ష్మిప్రదుడవు, నిత్యమ్ = నిత్యమూ, ఆశ్రితపూజితః = ఆశ్రయించిన వారిచేత పూజింపబడినవాడవు.

తా. ఋతుస్వరూపుడవు, ఋతువులను చేయువాడవు, కాలము, వసంత రూపుడవు. సుందరములైన నేత్రములు కలవాడవు, మహావృక్షములకు సంబంధించినవాడవు, ఐశ్వర్య మిచ్చువాడవు. నిత్యమూ ఆశ్రితులచేత పూజింపబడిన వాడవు. 45

మూ. జగద్ధాతా చ కర్తా చ పురుషః శాశ్వతో ధ్రువః,
ధర్మాధ్యక్షో విరూపాక్ష స్త్రివర్మా భూతభావనః. 46

ప్ర. అ. జగద్ధాతా చ = జగత్తును పోషించువాడవు, కర్తా చ = సృష్టించువాడవు, పురుషః = పురుషుడవు, శాశ్వతః = శాశ్వతుడవు, ధ్రువః = నిత్యుడవు. ధర్మాధ్యక్షః = ధర్మమునకు అధ్యక్షుడవు, విరూపాక్షః = వేసి కళ్ళు కలవాడవు, త్రివర్మా = మూడు మార్గములు కలవాడవు, భూతభావనః = భూతములను చూచువాడవు.

తా. జగత్తును పోషించువాడవు, జగత్తు సృజించువాడవు, పురుషుడవు (జీవుడవు), శాశ్వతుడవు, నిత్యుడవు, ధర్మసాక్షివి, మూడు కళ్ళు కలవాడవు, మూడు మార్గములు కలవాడవు (త్రిలోకసంచారివి), భూతములను చూచువాడవు.

మూ. త్రినేత్రో బహురూపశ్చ సూర్యాయుతసమప్రభః,
దేవదేవోఽతిదేవశ్చ చన్ద్రాఙ్కితజటస్తథా. 47

ప్ర. అ. త్రినేత్రః = మూడు నేత్రములు కలవాడవు, బహురూపః చ = చాల రూపములు కలవాడవు, సూర్యాయుతసమప్రభః = సూర్యుల అయుతము (10,000)తో సమానమైన కాంతి గలవాడవు, దేవదేవః = దేవతలకు దేవుడవు, అతిదేవః చ = దేవతలను అతిక్రమించినవాడవు, తథా = మరియు, చన్ద్రాఙ్కితజటః = చంద్రునిచేత చిహ్నితమైన జటలు కలవాడవు.

తా. త్రినేత్రుడవు, అనేకరూపములు కలవాడవు, పది వేల సూర్యులతో సమానమైన కాంతి గలవాడవు, దేవదేవుడవు, దేవతలను అతిక్రమించినవాడవు, చంద్రునిచే అలంకరించబడిన జటలు గలవాడవు. 47

మూ. నర్తకో లాసకశ్చైవ పూర్ణేన్దుసదృశాననః,
బ్రహ్మణ్యశ్చ శరణ్యశ్చ సర్వజీవమయస్తథా. 48

ప్ర. అ. నర్తకః = నృత్యము చేయువాడవు, లాసకశ్చైవ = లాస్యము చేయువాడవు, పూర్ణేన్దు సదృశాననః = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము కలవాడవు, బ్రహ్మణ్యః = వేదవేత్తవు, శరణ్యః చ = శరణాగతరక్షకుడవు, తథా = మరియు, సర్వజీవమయః = సకలజీవస్వరూపుడవు.

తా. నీవు నృత్యముచేయువాడవు, లాస్యము చేయువాడవు, పూర్ణచంద్రుని వంటి ముఖము కలవాడవు, బ్రహ్మవేత్తవు, శరణాగతరక్షకుడవు, సకలజీవ స్వరూపుడవు. 48

మూ. సర్వతూర్యనినాదీ చ సర్వబన్ధవిమోచకః,
మోహనో బన్ధకశ్చైవ సర్వదారీ వరోత్తమః. 49

ప్ర. అ. సర్వతూర్యనినాదీ చ = సమస్తవాద్యముల ధ్వని కలవాడవు, సర్వబన్ధవిమోచనః = సకలబంధములను విడిపించువాడవు, మోహనః = మోహింపచేయువాడవు, బన్ధకః చ ఏవ = బంధించువాడవు సర్వధారీ = సమస్తమును ధరించువాడవు, వరోత్తమః = వరములచేత ఉత్తముడవు.

తా. అన్ని వాద్యముల ధ్వని కలవాడవు, సమస్తబంధములనుండి విడిపించువాడవు, మోహము కలిగించువాడవు, బంధము కలిగించువాడవు. సమస్తమును ధరించువాడవు, ఉత్తమవరము లిచ్చువాడవు. 49

మూ. పుష్పదన్తో విభాగశ్చ ముఖ్యః సర్వహర స్తథా,
హరిశ్మశ్రుర్ధనుర్ధారీ భీమో భీమపరాక్రమః. 50

ప్ర. అ. పుష్పదన్తః = పుష్పదంతుడవు, విభాగః చ = విభాగము చేయువాడవు, ముఖ్యః = ముఖ్యుడవు, తథా = మరియు, సర్వహరః = సర్వమును హరించువాడవు. హరిశ్మశ్రుః = సింహము వంటి మీసములు కలవాడవు, ధనుర్ధారీ = ధనస్సు ధరించువాడవు, భీమః = భయంకరుడవు, భీమపరాక్రమః = భయంకరమైన పరాక్రమము కలవాడవు.

తా. నీవు పుష్పదంతుడవు, విభజించువాడవు, ముఖ్యుడవు, సర్వమును హరించువాడవు. పచ్చని మీసములు కలవాడవు. ధనస్సును ధరించువాడవు, భయంకరుడవు, భయంకరమైన పరాక్రమము కలవాడవు. 50

మూ. మయా ప్రోక్తమిదం పుణ్యం నామాష్టశతముత్తమమ్,
సర్వపాపహరం పుణ్యం శరణ్యం శరణార్థినామ్. 51
జప్తమేతద్దశగ్రీవ కుర్యాచ్ఛత్రువినాశనమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుర్థః ప్రక్షిప్తః సర్గః.

ప్ర. అ. మయా = నాచేత, ప్రోక్తమ్ = చెప్పబడిన, ఉత్తమమ్ = ఉత్తమమైన, పుణ్యమ్ = పుణ్యమైన, ఇదమ్ = ఈ, నామాష్టశతమ్ = నామములు నూట ఎనిమిది, సర్వపాపహరమ్ = సమస్తపాపములను హరించునది, పుణ్యమ్=పవిత్రమైనది, శరణార్థినామ్ = శరణము కోరువారికి, శరణ్యమ్=శరణు ఇచ్చునది, దశగ్రీవ = రావణా!, ఏతత్ = ఇది. జప్తమ్ = జపింపబడినదై, శత్రువినాశనమ్ = శత్రునాశనమును, కుర్యాత్ = చేయును.

తా. నేను చెప్పిన ఈ అష్టోత్తరశతనామస్తోత్రము పుణ్యప్రదము, ఉత్తమమైనది, సకలపాపములను తొలగించునది. పవిత్రము, శరణు కోరువారికి శరణు ఇచ్చునది. రావణా! దీనిని జపించినచో ఇది శత్రువినాశము చేయును. 51

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
నాల్గవ ప్రక్షిప్త సర్గ సమాప్తము.

అథ షష్ఠ సర్గః (ప్రక్షిప్తః)

[రావణుడు పశ్చిమసముద్రములో ఉన్న ఒక ద్వీపమునకు వెళ్ళుట. అక్కడ ఉన్న కపిలుని చేతిలో పరాభవము పొంది తిరిగి వచ్చుట.]

మూ. దత్త్వా తు రావణస్యైవం వరం స కమలోద్భవః,
పునరేవాగమత్ క్షిప్రం బ్రహ్మలోకం పితామహః. 1

ప్ర. అ. కమలోద్భవః = కమలము ఉత్పత్తిస్థానముగా గల, సః పితామహః = ఆ బ్రహ్మదేవుడు, రావణస్య = రావణునకు, ఏవమ్ = ఇట్లు, వరమ్ = వరమును, దత్త్వా = ఇచ్చి, పునరేవ = మరల, క్షిప్రమ్ = శీఘ్రముగా, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమును గూర్చి, అగమత్ = వెళ్ళెను.

తా. విష్ణునాభికమలమునుండి జనించిన ఆ బ్రహ్మదేవుడు రావణునకు ఈ విధముగా వర మిచ్చి తిరిగి శీఘ్రముగా బ్రహ్మలోకమునకు వెళ్ళెను. 1

మూ. రావణోఽపి వరం లబ్ధ్వా పునరేవాగమత్తదా,
కేన చిత్త్వథ కాలేన రావణో లోకరావణః, 2
పశ్చిమార్ణవమాగచ్ఛత్సచివైః సహ రాక్షసః.

ప్ర. అ. రావణోఽపి = రావణుడు కూడ, వరమ్ = వరమును, లబ్ధ్వా = పొంది, తదా = అప్పుడు, పునః ఏవ = మరల, అగమత్ = వెళ్ళిపోయెను, అథ = అటుపిమ్మట, కేన చిత్ = ఒకానొక, కాలేన = కాలముచేత, లోకరావణః = లోకములను ఏడ్పించిన, రాక్షసః = రాక్షసుడైన, సః = ఆ, రావణః = రావణుడు, సచివైః సహ = మంత్రులతో కూడ, పశ్చిమార్ణవమ్ = పశ్చిమసముద్రమును. ఆగచ్ఛత్ = పొందెను.

తా. రావణుడు కూడ వరములు పొంది అప్పుడు తిరిగి వెళ్ళిపోయెను.

కొంతకాలము పిమ్మట లోకములను ఏడ్పించు రావణుడు మంత్రులతో కలిసి పశ్చిమసముద్రమునకు వెళ్లెను. 2

మూ. ద్వీపస్థో దృశ్యతే తత్ర పురుషః పావకప్రభః, 3
మహాజామ్బూనదప్రఖ్య ఏక ఏవ వ్యవస్థితః.

ప్ర. అ. తత్ర = అక్కడ, పావకప్రభః=అగ్నివంటి కాంతి గల, మహాజామ్బూనదప్రఖ్యః=బంగారము వలె ఉన్న, ఏక ఏవ=ఒంటరిగానే, వ్యవస్థితః= ఉన్న, ద్వీపస్థః = ద్వీపమునందున్న, పురుషః=పురుషుడు, దృశ్యతే = కనబడుచున్నాడు.

తా. అక్కడ ద్వీపమునందు ఒంటరిగా ఉన్న అగ్ని వంటి కాంతి గల ఒక పురుషుడు కనబడెను. అతడు బంగారము వలె ఉండెను. 3

మూ. దృశ్యతే భీషణాకారో యుగాన్తానలసంనిభః, 4
దేవానామివ దేవేశో గ్రహాణామివ భాస్కరః,
శరభాణాం యథా సింహో హస్తిష్వైరావణో యథా, 5
పర్వతానాం యథా మేరుః పారిజాతశ్చ శాఖినామ్.

ప్ర. అ. భీషణాకారః = భయంకరమైన ఆకారము గల, యుగాన్తానిల సంనిభః = ప్రళయకాలాగ్నితో సమానుడైన అతడు, దేవానామ్ = దేవతలలో, దేవేశః ఇవ = ఇంద్రుడువలె, గ్రహాణామ్ = గ్రహములలో, భాస్కరః ఇవ = సూర్యుడు వలె, శరభాణామ్ = శరభమృగములలో, సింహః యథా = సింహము వలె, హస్తిషు = ఏనుగులలో, ఐరావతః యథా=ఐరావతము వలె, పర్వతానామ్= పర్వతములలో, మేరుః యథా = మేరుపర్వతము వలె, శాఖినామ్ = వృక్షములలో, పారిజాతశ్చ యథా = పారిజాతము వలె, దృశ్యతే=చూడబడుచున్నాడు.

తా. భయంకరమైన ఆకారముతో ప్రళయకాలాగ్ని వలె ఉన్న అతడు దేవతలలో దేవేంద్రుడు వలె, గ్రహాలలో సూర్యుడు వలె, శరభమృగములలో సింహము వలె. ఏనుగులలో ఐరావతము వలె, పర్వతములలో మేరుపర్వతము వలె, వృక్షములలో పారిజాతము వలె కనబడుచుండెను. 4, 5

మూ. తథా తం పురుషం దృష్ట్వా స్థితం మధ్యే మహాబలమ్, 6
అబ్రవీచ్చ దశగ్రీవో యుద్ధం మే దీయతామితి.

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, మధ్యే = ద్వీపమధ్యమునందు, తథా = అట్లు, స్థితమ్ = ఉన్న, తం పురుషమ్ = ఆ పురుషుణ్ణి, దృష్ట్వా = చూచి, మే = నాకు, యుద్ధమ్ = యుద్ధము, దీయతామ్ = ఇవ్వబడుగాక, ఇతి = అని, అబ్రవీచ్చ = పలికెను.

తా. రావణుడు ద్వీపమధ్యమునం దున్న ఆ పురుషుణ్ణి చూచి "నాతో యుద్ధానికి రమ్ము"అని పలికెను. 6

మూ. అథవత్తస్య సా దృష్టిర్గ్రహమాలా ఇవాకులా, 7
దన్తాన్ సందశతః శబ్దో యన్త్రస్యేవాభిభిద్యతః,
జగర్జోచ్చైః స బలవాన్ సహామాత్యో దశాననః. 8

ప్ర. అ. తస్య = ఆ రావణునియొక్క, సా దృష్టిః = ఆ చూపు, గ్రహమాలా ఇవ = గ్రహపంక్తి వలె, ఆకులా = వ్యాకులము, అభవత్ = ఆయెను. దన్తాన్ = దంతములను, సందశతః = కొరుకుచున్న వానియొక్క, శబ్దః = శబ్దము, అభిభిద్యతః = బ్రద్దలగుచున్న, యన్త్రస్యేవ = యంత్రముయొక్క ధ్వని వలె, ఆయెను. బలవాన్ = బలము గల, సహామాత్యః = మంత్రులతో కూడిన, సః దశాననః = ఆ రావణుడు, ఉచ్చైః = బిగ్గరగా, జగర్జ = గర్జించెను.

తా. అతని దృష్టి గ్రహముల పంక్తివలె వ్యాకులముగా ఉండెను. అతడు దంతములు కొరుకుచుండగా ఆ ధ్వని యంత్రధ్వని వలె ఉండెను. బలవంతుడైన ఆ రావణుడు, అతని మంత్రులు బిగ్గరగా గర్జించిరి. 7, 8

మూ. స గర్జన్ వివిధైర్నాదైర్దృష్ట్వాహ స్తం భయానకమ్,
దంష్ట్రాలం వికటం చైవ కమ్బుగ్రీవం మహోరసమ్. 9

మణ్డూకకుక్షిం సింహాస్యం కైలాసశిఖరోపమమ్,
పద్మపాదతలం భీమం రక్తతాలుకరామ్బుజమ్. 10

మహానాదం మహాకాయం మహానిలసమం జవే,
భీమమాబద్ధతూణీరం సఘణ్టాబద్ధచామరమ్.

జ్వాలామాలాపరిక్షిప్తం కిఙ్కిణీజాలనిఃస్వనమ్,
మాలయా స్వర్ణపద్మానాం కణ్ఠదేశేఽవలమ్బయా. 12

ఋగ్వేదమివ శోభన్తం పద్మమాలావిభూషితమ్,
సోఽఞ్జనాచలసంకాశం కాఞ్చనాచలసంనిభమ్, 13
ప్రాహరద్రాక్షసపతిః శూలశక్త్యృష్టిపట్టిశైః.

ప్ర. అ. సః = ప్రసిద్ధుడైన, సః = ఆ, రాక్షసపతిః = రావణుడు, వివిధైః = అనేకవిధములైన, నాదైః = ధ్వనులతో, గర్జన్ = గర్జించుచు, లమ్బహస్తమ్ = పొడవైన హస్తములు గలవాడు, భయానకమ్ = భయంకరుడు, దంష్ట్రిణమ్ = కోరలతో కూడినవాడు, వికటం చైవ = వికటముగా ఉన్నవాడు, కమ్బుగ్రీవమ్ = శంఖమువంటి కంఠముకలవాడు, మహోరసమ్ = గొప్ప వక్షఃస్థలము గలవాడు, మణ్డూకకుక్షిమ్ = కప్పకడుపు వంటి కడుపు కలవాడు, సింహాస్యమ్ = సింహము వంటి ముఖము కలవాడు, కైలాసశిఖరోపమమ్ = కైలాసశిఖరముతో సమానుడు, పద్మపాదతలమ్ = పద్మముల వంటి అరికాళ్ళు గలవాడు, భీమమ్ = భయంకరుడు, రక్తతాలుకరామ్బుజమ్ = ఎఱ్ఱని చెలివి, హస్తపద్మములు కలవాడు, మహానాదమ్ = గొప్ప ధ్వనికలవాడు, మహాకాయమ్ = పెద్ద దేహము కలవాడు, జవే = వేగమునందు, మనోనిలసమమ్ = మనస్సుతోను వాయువుతోను సమానుడు, భీమమ్ = భయంకరుడు, ఆబద్ధతూణీరమ్ = కట్టబడిన అంబుల పొదులు కలవాడు, సఘణ్టాబద్ధచామరమ్ = ఘంటలతో కూడినట్లు కట్టబడిన చామరములు కలవాడు, జ్వాలామాలాపరిక్షిప్తమ్ = జ్వాలల మాలలచేత చుట్టబడి ఉన్నవాడు, కిఙ్కిణీజాలనిఃస్వనమ్ = చిరుగుంటల సముదాయము ధ్వని కలవాడు, కణ్ఠదేశే = కంఠప్రదేశమునందు, అవలమ్బయా = వ్రేలాడుచున్న, స్వర్ణపద్మానామ్ = బంగారు పద్మములయొక్క, మాలయా = మాలచేత, ఋగ్వేదమివ = ఋగ్వేదమువలె, శోభన్తమ్ = శోభించుచున్నవాడు, పద్మమాలావిభూషితమ్ = పద్మమాలలచేత అలంకరించబడినవాడు, అఞ్జనాచలసంకాశమ్ = అంజనాచలముతో సమానుడు, కాఞ్చనాచలసంనిభమ్ = మేరుపర్వతముతో సమానుడు అయిన ఆ పురుషుణ్ణి, శూలశక్త్యృష్టిపట్టిశైః = శూలములతోను, శక్తులతోను, ఋష్టులతోను, పట్టిశములతోను, ప్రాహరత్ = కొట్టెను.

తా. రావణుడు అనేకవిధములుగా గర్జించుచు దీర్ఘములైన భుజములతో,

పెద్దకోరలతో వికటముగా, భయంకరుడుగా, అంజనాద్రి వలె, మేరుపర్వతము వలె ఉన్న ఆ పురుషునిపై శూల శక్తి-ఋష్టి-పట్టిశములు ప్రయోగించెను. శంఖము వంటి కంఠము విశాలమైన వక్షఃస్థలము, కప్ప పొట్ట వంటి పొట్ట, సింహము ముఖము వంటి ముఖమూ గల ఆపురుషుడు కైలాసశిఖరము వలె ఉండెను. భయం కరుడైన అతని అరికాళ్లు పద్మములవలె ఉండెను. చెలువులు, హస్తపద్మములు ఎఱ్ఱగా ఉండెను. పెద్ద దేహముతో గొప్ప ధ్వని చేయుచున్న అతడు వేగమునందు మనస్సుతోను, వాయువుతోను, సమముగా ఉండెను. నడుమున, అంబులపొదులు కట్టుకొనెను. ఘంటలతో కూడిన చామరములు ధరించెను. అతని చుట్టూ మంటలు మండుచుండెను. చిరుగంటలు మ్రోగుచుండెను. కంఠప్రదేశమునందు వ్రేలాడు చున్న బంగారుపద్మముల మాలతో అతడు ఋగ్వేదము వలె శోభిల్లుచుండెను(?). పద్మమాలలు అలంకరించుకొనెను. 9-13

మూ. స ద్వీపినా సింహ ఇవ ఋషభేణేవ కుఞ్జరః, 14
సుమేరురివ నాగేన్ద్రైర్నదీవేగైరివార్ణవః,

అకమ్పమానః పురుషో రాక్షసం వాక్యమబ్రవీత్, 15
యుద్ధశ్రద్ధాం హి తే రక్షో నాశయిష్యామి దుర్మతే.

ప్ర. అ. సః పురుషః=ఆ పురుషుడు, ద్వీపినా = పులిచేత. సింహః ఇవ= సింహము వలె, ఋషభేణ=వృషభముచేత, కుఞ్జరః ఇవ=ఏనుగ వలె, నాగేన్ద్రైః= గజేంద్రములచేత, సుమేరురివ= మేరుపర్వతము వలె, నదీవేగైః=నదుల వేగముల చేత, అర్ణవః ఇవ = సముద్రము వలె, అకమ్పమానః = కంపించనివాడై, పురుషమ్ = పురుషుడ్ని గూర్చి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్ = పలికెను. దుర్మతే = దుష్టబుద్ధిగల, రక్షః = రాక్షసుడా! తే = నీయొక్క, యుద్ధశ్రద్ధామ్ = యుద్ధా సక్తిని, నాశయిష్యామి = నశింపచేసెదను.

తా. ఆ పురుషుడు పులికి సింహము వలె, ఎద్దుకు ఏనుగవలె, ఏనుగులకు మేరుపర్వతము వలె, నదీవేగములకు సముద్రము వలె ఏ మాత్రము చలించక అతనితో-"ఓ! దుర్మతీ! రాక్షసుడా! నీకున్న యుద్ధాసక్తిని పోగొట్టెదను" అని పలికెను. 14,15

మూ. రావణస్య చ యో వేగః సర్వలోకభయంకరః, 16
తథా వేగసహస్రాణి సంశ్రితాని తమేవ హి.

ప్ర. అ. సర్వలోకభయంకరః = సకలలోకములకు భయంకరమైన, రావణస్య = రావణునియొక్క, యః వేగః = ఏ వేగము గలదో, తథా = అట్లు, వేగసహస్రాణి = వేగములయొక్క సహస్రములు, తమ్ = ఆ పురుషుణ్ణి, సంశ్రితాని ఏవ హి = ఆశ్రయించి ఉన్నవి కదా.

తా. రావణునిలో సకలలోకములకు భయము కలిగించు ఏ వేగము కలదో అట్టి వేలకొలది వేగములు ఆ పురుషుణ్ణి ఆశ్రయించి ఉన్నవి. 16

మూ. ధర్మ స్తస్య తపశ్చైవ జగతః సిద్ధిహేతుకౌ, 17
ఊరూ హ్యాశ్రిత్య తస్థాతే మన్మథః శిశ్నమాశ్రితః.
విశ్వేదేవాః కటీభాగే మరుతో బస్తిపార్శ్వయోః. 18

ప్ర. అ. జగతః = జగత్తుయొక్క, సిద్ధిహేతుకౌ = సిద్ధికి హేతువులైన, ధర్మః = ధర్మము, తపశ్చైవ = తపస్సు, తస్య = వానియొక్క, ఊరూ = తొడలను, ఆశ్రిత్య = ఆశ్రయించి, తస్థాతే = ఉన్నవి. మన్మథః = మన్మథుడు, శిశ్నమ్ = శిశ్నమును, ఆశ్రితః = ఆశ్రయించినాడు. విశ్వేదేవాః = విశ్వేదేవతలు, కటీభాగే = కటిప్రదేశమునందు, మరుతః = మరుత్తులు, బస్తిపార్శ్వయోః = బస్తియందు, పార్శ్వములయందు ఉండెను.

తా. జగత్తు సిద్ధికి హేతువులైన ధర్మము, తపస్సు ఆ పురుషుని తొడలను ఆశ్రయించి ఉన్నవి. మన్మథుడు శిశ్నమును, విశ్వేదేవతలు కటిప్రదేశమును, మరుత్తులు బస్తిని పార్శ్వములను ఆశ్రయించి ఉండెను. 17,18

మూ. మధ్యేఽష్టౌ వసవ స్తస్య సముద్రాః కుక్షితః స్థితాః,
పార్శ్వేదిషు దిశః సర్వాః సర్వసంధిషు మారుతః. 19

ప్ర. అ. తస్య = అతనియొక్క, మధ్యే = మధ్యప్రదేశమునందు, అష్టౌ = ఎనమండుగురు, వసవః = వసువులు, కుక్షితః = కుక్షియందు, సముద్రాః = సముద్రములు, స్థితాః = ఉన్నవి. పార్శ్వేదిషు = పార్శ్వేదిస్థానములయందు, సర్వాః =

సమస్తమైన, దిశః = దిక్కులు, మారుతః = వాయువు, సర్వసంధిషు = అన్ని సందులయందు ఉండెను.

తా. ఆ పురుషుని నడుమునందు అష్టవసువులు, కుక్షియందు సముద్రాలు, పార్శ్వాదిభాగములందు సకలదిక్కులు, అన్ని సందులయందు వాయువుఉండెను.

మూ. పృష్ఠం చ భగవాన్రుద్రో హృదయం చ పితామహః,
పితరశ్చాశ్రితాః పృష్ఠం హృదయం చ పితామహాః. 20

ప్ర. అ. భగవాన్ = పూజ్యుడైన, రుద్రః = రుద్రుడు, పృష్ఠం చ = వీపును, పితామహః = బ్రహ్మదేవుడు, హృదయం చ = హృదయమును, పితరః = పితృదేవతలు, పృష్ఠమ్ = వీపును, పితామహాః = తాతలు, హృదయం చ = హృదయమును, శ్రితాః = ఆశ్రయించినారు.

తా. భగవంతుడైన రుద్రుడు, పితృదేవతలు వీపుమీద ఉండిరి. బ్రహ్మదేవుడు, పితామహాలు హృదయమునం దుండిరి. 20

మూ. గోదానాని పవిత్రాణి భూమిదానాని యాని చ,
సువర్ణవరదానాని కక్షలోమానుగాని చ. 21

ప్ర. అ. పవిత్రాణి = పవిత్రములైన, గోదానాని = గోదానములు, యాని = ఏ, భూమిదానాని = భూదానములు కలవో అవీ, సువర్ణవరదానాని = శ్రేష్ఠమైన సువర్ణదానములు, కక్షలోమానుగాని చ = చంకలోని రోమములను ఆశ్రయించి ఉన్నవి.

తా. పవిత్రములైన గోదానములు, భూదానములు, సువర్ణదానములు ఆ పురుషుని చంకలలోని రోమములను ఆశ్రయించి ఉండెను. 21

మూ. హిమవాన్ హేమకూటశ్చ మన్దరో మేరురేవ చ,
నరం తు తం సమాశ్రిత్య అస్థిభూతా వ్యవస్థితాః. 22

ప్ర. అ. హిమవాన్ = హిమవత్పర్వతము, హేమకూటశ్చ = హేమకూటము, మన్దరః = మందరపర్వతము, మేరురేవ చ = మేరుపర్వతము, అస్థిభూతాః = ఎముకలుగా అయినవై, తం నరమ్ = ఆ పురుషుణ్ణి, సమాశ్రిత్య = ఆశ్రయించి, వ్యవస్థితాః = ఉన్నవి.

తా. హిమవత్పర్వతము, హేమకూటము, మందరము, మేరుపర్వతమూ కూడా ఎముకలుగా అయి ఆ పురుషుణ్ణి ఆశ్రయించుకొని ఉండెను. 22

మూ. పాణిర్వజ్రో౽భవత్తస్య శరీరే ద్యౌరపి స్థితా,
కృకాటికాయాం సన్ధ్యా చ జలవాహాశ్చ యే ఘనాః. 23

ప్ర. అ. వజ్రః = వజ్రాయుధము, తస్య = వానియొక్క, పాణిః = హస్తముగా, అభవత్ = ఆయెను. శరీరే = శరీరమునందు. ద్యౌః అపి = ఆకాశముకూడ, స్థితా = ఉన్నది. కృకాటికాయామ్ = మెడ వెనుకభాగమునందు, సన్ధ్యా చ = సంధ్య, జలవాహాః = జలమును మోసికొని వెళ్లు, యే = ఏ, ఘనాః = మేఘములున్నవో అవీ ఉండెను.

తా. వజ్రాయుధము అతని హస్తముగా ఆయెను. శరీరమునందు ఆకాశము, మెడ వెనుకభాగమునందు సంధ్యా, మేఘములూ ఉండెను. 23

మూ. బాహూ ధాతా విధాతా చ తథా విద్యాధరాదయః,
శేషశ్చ వాసుకిశ్చైవ విశాలాక్ష ఇరావతః. 24

కమ్బలాశ్వతరౌ చోభౌ కర్కోటకధనంజయౌ,
స చ ఘోరవిషో నాగ స్తక్షకః సోపతక్షకః. 25

కరజానాశ్రితాశ్చైవ విషవీర్యముముక్షవః,
అగ్నిరాస్యమభూత్తస్య స్కన్ధౌ రుద్రైరధిష్ఠితౌ. 26

ప్ర. అ. ధాతా = ధాత, విధాతా చ = విధాత. తథా = మరియు, విద్యాధరాదయః = విద్యాధరులు మొదలైనవారు, బాహూ = బాహువులను ఆశ్రయించి ఉండిరి శేషశ్చ = శేషుడు, వాసుకిః చైవ = వాసుకి. విశాలాక్షః = విశాలాక్షుడు, ఐరావతః = ఐరావతుడు, ఉభౌ = ఇద్దరైన, కమ్బలాశ్వతరౌ = కంబలుడు, అశ్వతరుడు. కర్కోటక ధనంజయౌ = కర్కోటకధనంజయులు, సోపతక్షకః = ఉపతక్షకునితో కూడిన, ఘోరవిషః = ఘోరమైన విషము గల, సః = ఆ, తక్షకః నాగః = తక్షకు డను నాగుడు, విషవీర్యమ్ = విషముయొక్క వీర్యమును, ముముక్షవః = విడవదలచుకొన్నవారై, కరజాన్ = గోళ్ళను, ఆశ్రితాః చైవ = ఆశ్రయించిరి. అగ్నిః = అగ్ని, తస్య = అతనియొక్క, ఆస్యమ్ = ముఖముగా,

అభూత్ = అయెను. స్కన్ధౌ = భుజములు, రుద్రైః = రుద్రులచేత, అధిష్ఠితౌ = అధిష్ఠింపబడినవి.

తా. ధాత, విధాత, విద్యాధరులు మొదలైనవారు అతని బాహువులను ఆశ్రయించిరి. ఆదిశేషుడు, వాసుకి, విశాలాక్షుడు, ఐరావతుడు, కంబలుడు, అశ్వతరుడు, కర్కోటకుడు, ధనంజయుడు, ఘోరమైన విషము గల తక్షకుడు, ఉపతక్షకుడు ఆ పురుషుని గోళ్ళను ఆశ్రయించి, విషమును విడచుటకు సిద్ధముగా ఉండిరి. అగ్ని అతని ముఖమును, రుద్రులు భుజములను ఆశ్రయించి ఉండిరి.

మూ. పక్షమాసర్తవశ్చైవ దంష్ట్రయోరుభయోః స్థితాః,
నాసే కుహూరమావాస్యా ఛిద్రేషు వాయవః స్థితాః. 27

ప్ర. అ. పక్షమాసర్తవః చ ఏవ = పక్షములు, మాసములు, ఋతువులు, ఉభయోః = రెండు, దంష్ట్రయోః = కోరలయందు, స్థితాః = ఉన్నవి. నాసే = ముక్కునందు, కుహూః = "కుహూ" అను (అనగా పూర్తిగా చంద్రుడు కనబడని), అమావాస్యా = అమావాస్య, ఛిద్రేషు = రంధ్రములయందు, వాయవః = వాయువులు, స్థితాః = ఉన్నవి.

తా. అతని రెండు కోరలయందు పక్షములు, మాసములు, ఋతువులు ఉండెను. కుహూవు ముక్కులోను, ఛిద్రములలో వాయువులు ఉండెను. 27

మూ. గ్రీవా తస్యాభవద్దేవీ వీణా చాపి సరస్వతీ,
నాసత్యౌ శ్రవణే చోభే నేత్రే చ శశిభాస్కరౌ. 28

ప్ర. అ. దేవీ = దేవియైన, సరస్వతీ = సరస్వతి, వీణా చాపి = వీణయు, తస్య = వానియొక్క, గ్రీవా = కంఠముగా, అభవత్ = ఆయెను. ఉభౌ = ఇద్దరైన, నాసత్యౌ = అశ్వినీదేవతలు, శ్రవణౌ = చెవులుగాను, శశిభాస్కరౌ = చంద్రసూర్యులు, నేత్రే చ = నేత్రములు గాను ఉండిరి.

తా. సరస్వతీదేవి వీణ అతని కంఠముగాను, అశ్వినీదేవతలు చెవులుగాను, చంద్రసూర్యులు నేత్రములుగాను ఉండెను. 28

మూ. వేదాఙ్గాని చ యజ్ఞాశ్చ తారారూపాణి యాని చ,
సువృత్తాని చ వాక్యాని తేజాంసి చ తపాంసి చ, 29
ఏతాని నరరూపస్య తస్య దేహాశ్రితాని వై.

ప్ర. అ. వేదాఙ్గాని=వేదాంగములు, యజ్ఞాః చ=యజ్ఞములు, యాని=ఏ, తారారూపాణి=నక్షత్రరూపము లున్నవో అవి, సువృత్తాని చ = మంచి వృత్తములు, వాక్యాని = వాక్యములు, తేజాంసి చ = తేజస్సులు, తపాంసి చ = తపస్సులు, ఏతాని = ఇవి, నరరూపస్య = నరరూపుడైన, తస్య = వానియొక్క, దేహాశ్రితాని వై = దేహమును ఆశ్రయించుకొని ఉన్నవి.

తా. వేదాంగములు, యజ్ఞములు, నక్షత్రములు, మంచి వృత్తములు, వాక్యములు, తేజస్సులు, తపస్సులు, ఆ పురుషుని దేహమును ఆశ్రయించుకొని ఉండెను. 29

మూ. తేన ముష్టిప్రహారేణ స్వల్పమాత్రేణ లీలయా, 30
పాణినా పీడితం రక్షో నిపపాత మహీతలే.

ప్ర. అ. తేన = అతనిచేత, స్వల్పమాత్రేణ = స్వల్పమైన, ముష్టిప్రహారేణ = గుద్దుచేత, పాణినా = హస్తముచేత, లీలయా = లీలతో, పీడితమ్ = పీడించబడిన, రక్షః = రాక్షసుడు, మహీతలే = నేలమీద, నిపపాత = పడెను.

తా. ఆ పురుషుడు లీలగా చెయ్యి ఎత్తి పిడికిలి బిగించి మెల్లగా కొట్టగానే ఆ రాక్షసుడు పడిపోయెను. 30

మూ. పతితం రాక్షసం జ్ఞాత్వా విద్రావ్య స నిశాచరాన్, 31
ఋగ్వేదప్రతిమః సోఽథ పద్మమాలావిభూషితః,
ప్రవివేశ చ పాతాలం నిజం పర్వతసంనిభః. 32

ప్ర. అ. పర్వతసంనిభః = పర్వతముతో సమానుడైన, పద్మమాలావిభూషితః = పద్మమాలలచేత అలంకరించబడిన, సః = ఆ, ఋగ్వేదప్రతిమః = ఋగ్వేదముతో సమానుడైన, సః = అతడు, రాక్షసమ్ = రావణుణ్ణి, పతితమ్ = పడినవానినిగా, జ్ఞాత్వా = తెలుసుకొని, నిశాచరాన్ = రాక్షసులను, విద్రావ్య = తరిమివేసి, నిజమ్ = తనసంబంధమైన, పాతాలమ్ = పాతాలమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. పద్మమాలలు అలంకరించుకొని ఋగ్వేదము వలె ఉన్న, పర్వతము వంటి ఆకారము గల ఆ పురుషుడు రావణుడు పడిపోయినట్లు చూచి రాక్షసులను తరిమివేసి తన నివాసమైన పాతాళములోనికి వెళ్ళిపోయెను. 31, 32

మూ. ఉత్థాయ చ దశగ్రీవ ఆహూయ సచివాన్ స్వయమ్,
క్వ గతః సహసా బ్రూత ప్రహస్తశుకసారణాః. 33

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, ఉత్థాయ చ = లేచి, స్వయమ్ = స్వయముగా, సచివాన్ = మంత్రులను, ఆహూయచ = పిలచి, ప్రహస్తశుక సారణాః = ఓ! ప్రహస్త-శుక-సారణులారా! క్వ = ఎక్కడికి, గతః = వెళ్ళినాడు, సహసా = వెంటనే, బ్రూత = చెప్పండి అని అడిగెను.

తా. రావణుడు లేచి, మంత్రులను పిలచి - "ప్రహస్త శుకసారణులారా! ఆ పురుషుడు ఎక్కడికి వెళ్ళినాడో వెంటనే చెప్పండి"అని పలికెను. 33

మూ. ఏవముక్తా రావణేన రాక్షసాస్తే తదాబ్రువన్,
ప్రవిష్టః స నరోఽత్రైవ దేవదానవదర్పహా. 34

ప్ర. అ. రావణేన = రావణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తాః = పలకబడిన, తే రాక్షసాః = ఆ రాక్షసులు, తదా = అప్పుడు, అబ్రువన్ = పలికిరి. దేవ దానవదర్పహా = దేవతలయొక్క, దానవులయొక్క దర్పమును పోగొట్టిన, సః నరః = ఆ పురుషుడు, అత్రైవ = ఇక్కడనే, ప్రవిష్టః = ప్రవేశించినాడు.

తా. రావణుని మాటలు విని ఆ రాక్షసులు - "దేవదానవుల దర్పమును అణచిన ఆ పురుషుడు ఇక్కడనే బిలములో ప్రవేశించినాడు"అని చెప్పిరి. 34

మూ. అథాసిం గృహ్య వేగేన గరుత్మానివ పన్నగమ్,
స తు శీఘ్రం బిలద్వారం సంప్రవిశ్య చ దుర్మతిః. 35
ప్రవివేశ చ తద్ద్వారం రావణో నిర్భయస్తదా.

ప్ర. అ. తదా = అప్పుడు, దుర్మతిః = దుష్టబుద్ధి గల, సః రావణః = ఆ రావణుడు, నిర్భయః = భయము లేనివాడై, అథ = అటుపిమ్మట, వేగేన = వేగముతో, గరుత్మాన్ = గరుత్మంతుడు, పన్నగమ్ ఇవ = సర్పమును వలె, అసిమ్ = ఖడ్గమును, గృహ్య = గ్రహించి, శీఘ్రమ్ = శీఘ్రముగా, బిలద్వారమ్ = బిలద్వారమును, సంప్రవిశ్య = ప్రవేశించి, తత్ ద్వారమ్ = ఆ ద్వారమును, ప్రవివేశ చ = ప్రవేశించెను.

తా. అప్పుడు దుర్మతియైన రావణుడు వేగముగా, గరుత్మంతుడు సర్పమును గ్రహించినట్లు ఖడ్గమును గ్రహించి, శీఘ్రముగా బిలద్వారము సమీపించి, భయము లేనివాడై ఆ ద్వారములోనికి ప్రవేశించెను. 35

మూ. స ప్రవిశ్య చ పశ్యద్వై నీలాఞ్జనచయోపమాన్, 36
కేయూరధారిణః శూరాన్ రక్తమాల్యానులేపనాన్,
వరహాటకరత్నాద్యైర్వివిధైశ్చ విభూషితాన్. 37

ప్ర. అ. సః=రావణుడు, ప్రవిశ్య=ప్రవేశించి, నీలాఞ్జనచయోపమాన్=నల్లని కాటుకరాసితో సమానులు, కేయూరధారిణః=బాహుపురులు ధరించినవారు, రక్తమాల్యానులేపనాన్ = ఎఱ్ఱని పుష్పమాలలు, అనులేపనములు కలవారు, వివిధైః = అనేకవిధములైన, వరహాటకరత్నాద్యైః = శ్రేష్ఠమైన బంగారము, రత్నములు మొదలైనవాటితో, విభూషితాన్ = అలంకరించబడినవారూ అయిన, శూరాన్ = శూరులను, పశ్యత్ వై = చూచెను.

తా. రావణుడు బిలములో ప్రవేశించి అక్కడ నల్లని కాటుకరాసులవంటి శూరులను చూచెను. వారు బాహుపురులు, బంగారము, రత్నములు అలంకరించుకొని ఎఱ్ఱని మాలలు ధరించి అనులేపనములు పూసికొని ఉండిరి. 36, 37

మూ. దృశ్యన్తే తత్ర నృత్యన్త్యస్తిస్రః కోట్యో మహాత్మనామ్,
నృత్యోత్సవా వీతభయా విమలాః పావకప్రభాః. 38

ప్ర. అ. తత్ర = అక్కడ, నృత్యోత్సవాః = నృత్యము ఉత్సవముగా గల, వీతభయాః = పోయిన భయము గల, విమలాః = నిర్మలములైన, పావకప్రభాః = అగ్నివంటి కాంతి గల, మహాత్మనామ్=మహాత్ములయొక్క, తిస్రః= మూడు, కోట్యః=కోటులు, నృత్యన్త్యః=నాట్యముచేయుచు దృశ్యన్తే=చూడబడుచున్నవి.

తా. అక్కడ నృత్యోత్సవము చేసికొనుచున్న, భయములేని, నిర్మలులైన అగ్ని వంటి కాంతి గల మూడు కోట్లమంది మహాత్ములు నృత్యము చేయుచు అతనికి కనబడిరి. 38

మూ. క్రీడతః పశ్యతే తాంస్తు రావణో భీమవిక్రమః,
ద్వారస్థో రావణస్తత్ర తాను కోటిమ నిర్భయః. 39

ప్ర. అ. భీమవిక్రమః = భయంకరమైన పరాక్రమము గల, రావణః = రావణుడు, క్రీడతః = క్రీడించుచున్న, తాన్ = వాళ్ళను, పశ్యతే = చూచెను. రావణః = రావణుడు, తాసు = ఆ, కోటిషు = కోట్లవిషయమునందు, నిర్భయః = భయములేనివాడై, ద్వారస్థః = ద్వారమునందున్నాడు.

తా. భయంకరమైన పరాక్రమము గల రావణుడు క్రీడించుచున్న వాళ్లను చూచెను. అతడు ఆ కోట్లమంది శూరులను చూచినను భయపడక ద్వారమునందు నిలచెను. 39

మూ. యథా దృష్టః స తు నరస్తుల్యాంస్తానపి సర్వశః,
ఏకవర్ణానేకవేషానేకరూపాన్ మహౌజసః. 40

చతుర్భుజాన్ మహోత్సాహాం స్తత్రాపశ్యత్స రాక్షసః,
తాంస్తు దృష్ట్వా దశగ్రీవ ఊర్ధ్వరోమా బభూవ హ. 41

ప్ర. అ. సః రాక్షసః = ఆ రాక్షసుడు, సః = ఆ, నరః = పురుషుడు, యథా = ఎట్లు, దృష్టః = చూడబడినాడో, సర్వశః = అన్ని విధములా; తుల్యాన్ = సమానులు, ఏకవర్ణాన్ = ఒకే రంగుగలవారు, ఏకవేషాన్ = ఒకే వేషముగల వారు, ఏకరూపాన్ = ఒకే రూపము గలవారు, మహౌజసః = గొప్ప కాంతి గల వారు, చతుర్భుజాన్ = నాలుగు భుజములు గలవారు, మహోత్సాహాన్ = గొప్ప ఉత్సాహము గలవారు అయిన, తాన్ = ఆ పురుషులను; తత్ర = అక్కడ, అపశ్యత్ = చూచెను. తాన్ తు = వాళ్ళను, దృష్ట్వా = చూచి, దశగ్రీవః = రావణుడు, ఊర్ధ్వరోమా = పైకి లేచిన రోమములు గలవాడుగా, బభూవ హ = అయెను.

తా. ఒకేవిధమైన రంగు, ఒకేవిధమైన వేషము, ఒకేవిధమైన రూపము గల, మహాతేజశ్శాలులైన ఆ పురుషులు, అన్ని విధాలా తాను వెనుక చూచిన పురుషుని వలెనే ఉండిరి. నాలుగు భుజములు గల, మహోత్సాహవంతులైన ఆ పురుషులను చూడగానే రావణుని ఒడలు గగుర్పొడిచెను. 40, 41

మూ. స్వయంభువా దత్తవర స్తతః శీఘ్రం వినిర్యయౌ,
అథాపశ్యత్పరం తత్ర పురుషం శయనే స్థితమ్, 42
పాణ్డురేణ మహార్హేణ శయనాసనవేశ్మనా.

ప్ర. అ. స్వయంభువా = బ్రహ్మదేవునిచేత, దత్తవరః = ఇవ్వబడిన వరములు గల ఆతడు, తతః=అక్కడినుండి, పాణ్డురేణ=తెల్లని, మహార్హేణ= గొప్ప విలువగల, శయనాసనవేశ్మనా = శయనములు, ఆసనములు ఉండు గృహము ద్వారా, శీఘ్రమ్ = శీఘ్రముగా, వినిర్యయౌ = బయల్వెదలెను, అథ= పిమ్మట, తత్ర=అక్కడ, శయనే=శయనమునందు, స్థితమ్=ఉన్న, పరమ్= ఉత్తముడైన, పురుషమ్ = పురుషుణ్ణి, అపశ్యత్ = చూచెను.

తా. బ్రహ్మనుండి వరములు పొందిన ఆ రావణుడు అక్కడినుండి గొప్పవిలువ గల తెల్లని శయనములు, ఆసనములు ఉన్న గృహము ద్వారా శీఘ్రముగా ముందుకు వెళ్ళి అక్కడ శయనముపైన ఉన్న ఒక ఉత్తమపురుషుణ్ణి చూచెను. 42

మూ. శేతే స పురుషస్తత్ర పావకేనావగుణ్ఠితః. 43
దివ్యస్రగనులేపా చ దివ్యాభరణభూషితా,
దివ్యామ్బరధరా సాధ్వీ త్రైలోక్యస్యైకభూషణమ్. 44

వాలవ్యజనహస్తా చ దేవీ తత్ర వ్యవస్థితా,
లక్ష్మీదేవీ సపద్మా వై భ్రాజతే లోకసున్దరీ. 45

ప్ర. అ. సః పురుషః=ఆ పురుషుడు, పావకేన=అగ్నిచేత, అవగుణ్ఠితః= కప్పబడినవాడై, తత్ర = అక్కడ, శేతే = శయనించి ఉన్నాడు, దివ్యస్రగను లేపా చ = దివ్యములైన మాలలు, అనులేపనము గల, దివ్యాభరణభూషితా = దివ్యములైన ఆభరణములచేత అలంకరించబడిన, దివ్యామ్బరధరా = దివ్యము లైన వస్త్రములు ధరించిన, సాధ్వీ = పతివ్రతయైన, త్రైలోక్యస్య = మూడు లోకముల సముదాయమునకు, ఏకభూషణమ్ = ఒకే అలంకారమైన, దేవీ=దేవి, వాలవ్యజనహస్తా = వింజామర హస్తమునందు కలదై, తత్ర = అక్కడ, వ్యవ స్థితా = నిలచినది. లోకసున్దరీ = లోకములలో సుందరియైన, లక్ష్మీదేవీ = లక్ష్మీ దేవి, సపద్మా = పద్మములతో కూడినదై, భ్రాజతే = ప్రకాశించుచున్నది.

తా. ఆ పురుషుడు అగ్నిచేత కప్పబడినవాడై అక్కడ శయనించి ఉండెను. అక్కడ ఒక దేవి వింజామర చేతిలో గ్రహించి నిలబడి ఉండెను. పతివ్రత మూడు లోకములకు అలంకారమూ అయిన ఆమె దివ్యములైన మాలలు,

అనులేపనము, ఆభరణములు, వస్త్రములు ధరించి ఉండెను. త్రిలోకసుందరియైన లక్ష్మీదేవి అక్కడ పద్మములు ధరించి ప్రకాశించుచుండెను. 43 - 45

మూ. ప్రవిష్టః స తు రక్షేన్ద్రో దృష్ట్వా తాం చారుహాసినీమ్,
జిఘృక్షుః సహసా సాధ్వీం సింహాసనసమాస్థితామ్. 46

ప్ర. అ. సః = ఆ, రక్షేన్ద్రః = రాక్షసరాజు, చారుహాసినీమ్ = సుందరమైన నవ్వు గల, సాధ్వీమ్ = పతివ్రతయైన, సింహాసనసమాస్థితామ్ = సింహాసనమును ఆశ్రయించి ఉన్న, తామ్ = ఆమెను, దృష్ట్వా = చూచి, సహసా = వెంటనే, జిఘృక్షుః = గ్రహింపకోరుచున్నవాడై, ప్రవిష్టః = ప్రవేశించెను.

తా. ఆ రావణుడు, సింహాసనముపై కూర్చొని ఉన్న, అందమైన చిరునవ్వు గల ఆ సాధ్విని చూచి వెంటనే ఆమెను పట్టుకొనుటకై ప్రవేశించెను. 46

మూ. వినాపి సచివైస్తత్ర రావణో దుర్మతిస్తదా,
హస్తే గ్రహీతుమన్విచ్ఛన్మన్మథేన వశీకృతః. 47
సుప్తమాశీవిషం యద్వద్రావణః కాలనోదితః.

ప్ర. అ. తదా = అప్పుడు, దుర్మతిః = చెడ్డబుద్ధి గల, రావణః = లోకమును ఏడ్పించిన, రావణః = రావణుడు, తత్ర = అక్కడ, సచివైః వినాపి = మంత్రులు లేకుండ ఉన్నను, కాలనోదితః = కాలముచేత ప్రేరితుడై, మన్మథేన = మన్మథునిచేత, వశీకృతః = వశము చేసికొనబడినవాడై, సుప్తమ్ = నిద్రించుచున్న, ఆశీవిషం యద్వత్ = సర్పమునువలె, హస్తే = హస్తమునందు, గ్రహీతుమ్ = గ్రహించుటకు, అన్విచ్ఛత్ = ఇచ్ఛయించెను.

తా. దుర్మతియైన లోకములను ఏడ్పించిన రావణుడు అప్పుడు కాలప్రేరితుడై మన్మథునికి వశుడై, అక్కడ తన మంత్రులెవ్వరూ సహాయులుగా లేకపోయినను. నిద్రించుచున్న సర్పమును వలె ఆమె హస్తమును పట్టుకొనుటకు ఇచ్ఛయించెను. 47

మూ. అథ సుప్తో మహాబాహుః పావకేనావగుణ్ఠితః, 48
గ్రహీతుకామం తం జ్ఞాత్వా వ్యపవిద్ధ్య పటం తదా,
జహాసోచ్చైర్భృశం దేవస్తం దృష్ట్వా రాక్షసాధిపమ్. 49

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సుప్తః = నిద్రించిన, మహాబాహుః = గొప్పబాహువులు గల. పావకేన = అగ్నిచేత, అవగుణ్ఠితః=కప్పబడిన, దేవః= ఆ దేవుడు, తమ్ = ఆతనిని, గ్రహీతుకామమ్ = గ్రహించుటకు కోరిక కల వానినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, తదా = అప్పుడు, పటమ్ = వస్త్రమును, వ్యప విధ్య = తొలగించి, తం రాక్షసాధిపమ్ = ఆ రావణుణ్ణి, దృష్ట్వా = చూచి, భృశమ్ = మిక్కిలి, ఉచ్చైః = గట్టిగా, జహాస = నవ్వెను.

తా. అప్పుడు అగ్నిచేత ఆవరింపబడి నిద్రించుచున్న మహాబాహువైన ఆ దేవుడు, రావణుడు ఆ సాధ్విని గ్రహించనున్నట్లు తెలిసికొని, కప్పుకొనిన వస్త్రమును తొలగించి, బిగ్గరగా నవ్వెను. 48, 49

మూ. తేజసా సహసా దీప్తో రావణో లోకరావణః,
కృత్తమూలో యథా శాఖీ నిపపాత మహీతలే. 50

ప్ర. అ. సహసా = వెంటనే, తేజసా=తేజస్సుచేత, దీప్తః=కాల్చబడిన లోకరావణః = లోకములను ఏడ్పించు, రావణః = రావణుడు, కృత్తమూలః = ఛేదించబడిన మొదలు గల, శాఖీ యథా=వృక్షము వలె, మహీతలే=నేలమీద, నిపపాత = పడెను.

తా. లోకములను ఏడ్పించు ఆ రావణుడు ఆ తేజస్సుకు కాలిపోయిన వాడై, మొదలు నరికిన చెట్టువలె వెంటనే నేలమీద పడెను. 50

మూ. పతితం రాక్షసం జ్ఞాత్వా వచనం చేదమబ్రవీత్,
ఉత్తిష్ఠ రాక్షసశ్రేష్ఠ మృత్యుస్తే నాద్య విద్యతే. 51

ప్ర. అ. రాక్షసమ్ = ఆ రాక్షసుణ్ణి, పతితమ్ = పడిపోయినవానినిగా, జ్ఞాత్వా = తెలుసుకొని, ఇదమ్ = ఈ, వచనం చ = వచనమును కూడ, అబ్రవీత్ = పలికెను. రాక్షసశ్రేష్ఠ = ఓ! రాక్షసశ్రేష్ఠుడా! ఉత్తిష్ఠ = లెమ్ము, అద్య= ఇప్పుడు, తే = నీకు, మృత్యుః = మృత్యువు, న విద్యతే = లేదు.

తా. రావణుడు పడిపోయినట్లు చూచి ఆ పురుషుడు ఇట్లు పలికెను. "రాక్షసశ్రేష్ఠుడా లెమ్ము, నీకింకా ఇప్పుడు మరణము లేదు." 51

మూ. ప్రజాపతివరో రక్ష్యస్తేన జీవసి రాక్షస,
గచ్ఛ రావణ విస్రబ్ధో నాధునా మరణం తవ. 52

ప్ర. అ. రాక్షస = రాక్షసుడా! ప్రజాపతివరః = బ్రహ్మదేవుని వరము, రక్ష్యః = రక్షించదగినది. తేన = ఆ కారణముచేత, జీవసి = జీవించి ఉన్నావు. రావణ = రావణా! విస్రబ్ధః = నమ్మకము కలవాడవై, గచ్ఛ = వెళ్ళుము. అధునా = ఇప్పుడు, తవ = నీకు, మరణమ్ = మరణము, న = లేదు.

తా. ఓ! రాక్షసుడా! నీకు బ్రహ్మదేవు డిచ్చిన వరమును రక్షింపవలసి యున్నది గాన బ్రతికిపోయినావు. రావణా! నిర్భయముగా వెళ్ళుము. నీకు ఇప్పుడు మరణము లేదు. 52

మూ. లబ్ధసంజ్ఞో ముహూర్తేన రావణో భయమావిశత్,
ఏవముక్తస్తదోత్థాయ రావణో దేవకణ్టకః, 53
లోమహర్షణమాపన్నో హ్యబ్రవీత్తం మహాద్యుతిమ్.

ప్ర. అ. ముహూర్తేన = ముహూర్తకాలముచేత, లబ్ధసంజ్ఞః = పొందబడిన సంజ్ఞ గల, రావణః = రావణుడు, భయమ్ = భయమును, ఆవిశత్ = పొందెను. తదా = అప్పుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, దేవకణ్టకః = దేవతలకుముల్లువంటివాడైన, రావణః=రావణుడు, ఉత్థాయ = లేచి, లోమహర్షణమ్ = రోమాంచమును, ఆపన్నః = పొందినవాడై, మహాద్యుతిమ్ = గొప్ప కాంతి గల, తమ్ = అతనిని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. ముహూర్తకాలములో స్పృహ వచ్చిన ఆ రావణుణ్ణి భయము ఆవహించెను. దేవతలను పీడించు, రావణుడు ఆ పురుషుని మాటలు విని గగుర్పాటు చెంది మహాతేజఃశాలియైన అతనితో ఇట్లనెను. 53

మూ. కో భవాన్వీర్యసంపన్నో యుగాన్తానలసంనిభః, 54
బ్రూహి త్వం కో భవాన్ దేవ కుతో భూత్వా వ్యవస్థితః.

ప్ర. అ. వీర్యసంపన్నః=పరాక్రమవంతుడవైన, యుగాన్తానలసంనిభః= ప్రళయకాలాగ్నితో సమానుడవైన, భవాన్ = నీవు, కః = ఎవడవు ? దేవ =

దేవా! త్వమ్ = నీవు, బ్రూహి = చెప్పుము. భవాన్ = నీవు, కుతః=ఎందువలన, భూత్వా = ఇట్లు అయి, వ్యవస్థితః = ఉన్నావు ?

తా. "పరాక్రమవంతుడవు, ప్రళయకాలాగ్నివంటివాడవు అయిన నీవు ఎవ్వరవు ? ఓ! దేవా! చెప్పుము నీవు ఇట్లు ఇక్కడ ఎందు కున్నావు ?" 54

మూ. ఏవముక్తస్తతో దేవో రావణేన దురాత్మనా, 55
ప్రత్యువాచ హసన్ దేవో మేఘగమ్భీరయా గిరా.

ప్ర. అ. దురాత్మనా=దుష్టబుద్ధి గల, రావణేన=రావణునిచేత, ఏవమ్= ఇట్లు, ఉక్తః = పలకబడిన, దేవః = ప్రకాశించుచున్న, దేవః = ఆ దేవుడు, ప్రహసన్ = నవ్వుచు, మేఘగమ్భీరయా = మేఘము వలె గంభీరమైన, గిరా= వాక్కుతో, ప్రత్యువాచ = పలికెను.

తా. ఆ దేవుడు దురాత్ముడైన రావణుని మాటలు విని నవ్వుచు, మేఘ ధ్వని వలె గంభీరమైన వాక్కుతో ఇట్లు బదులు చెప్పెను. 55

మూ. కిం తే మయా దశగ్రీవ వధ్యోఽసి నచిరాన్మమ, 56
ఏవముక్తో దశగ్రీవః ప్రాఞ్జలిర్వాక్యమబ్రవీత్.

ప్ర. అ. దశగ్రీవ = రావణా! తే = నీకు, మయా = నాచేత, కిమ్=ఏమి ప్రయోజనము ? నచిరాత్ = అచిరకాలములో, మమ = నాకు. వధ్యః = చంప దగినవాడవు, అసి = అయిఉన్నావు. ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, దశ గ్రీవః=రావణుడు, ప్రాఞ్జలిః=కట్టబడిన దోసిలికలవాడై, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. "రావణా! నేను ఎవరినైతే మాత్రము నీకెందుకు ? నిన్ను కొద్ది కాలములో నేను చంపనున్నాను". రావణుడు ఆ మాటలు విని అంజలి ఘటించి ఇట్లు పలికెను. 56

మూ. ప్రజాపతేస్తు వచనాన్నాహం మృత్యుపథం గతః,
న స జాతో జనిష్యో వా మమ తుల్యః సురేష్వపి. 57

ప్ర. అ. ప్రజాపతేః = బ్రహ్మదేవునియొక్క, వచనాత్ =వచనమువలన,

అహమ్ = నేను, మృత్యుపథమ్ = మృత్యుమార్గమును, న గతః = పొందలేదు. (ఎవడు) మమ = నాకు, తుల్యః=సమానుడో, సురేష్వపి = దేవతలలోకూడ, సః = అట్టివాడు, న జాతః = పుట్టలేదు. (న) జనిష్యే వా = పుట్టబోడు.

తా. బ్రహ్మదేవుని మాట ప్రకారము నాకు మరణము లేదు. నాతో సమానుడు దేవతలలో కూడ పుట్టలేదు; పుట్టబోడు. 57

మూ. ప్రజాపతివరం యో హి లఙ్ఘయేద్వీర్యమాశ్రితః, 58
న తత్ర పరిహారోఽస్తి ప్రయత్నశ్చాపి దుర్బలః.

ప్ర. అ. యః = ఎవడు, వీర్యమ్ = పరాక్రమమును, ఆశ్రితః = ఆశ్రయించినవాడై, ప్రజాపతివరమ్=బ్రహ్మయొక్క వరమును, లఙ్ఘయేత్ = లంఘించునో, (అట్టివాడు పుట్టలేదు, పుట్టబోడు), తత్ర = దానివిషయమునందు, పరిహారః = పరిహారము, నాస్తి = లేదు. ప్రయత్నః చాపి = ప్రయత్నము కూడ దుర్బలః = దుర్బలమైనది.

తా. తన పరాక్రమముచేత ప్రజాపతి ఇచ్చిన వరమును దాటగలవాడు కూడ పుట్టలేదు, పుట్టబోడు. ఆ వరము విషయమున పరిహారము లేదు. ప్రయత్నము కూడ దుర్బలమే (బలవిహీనమే) అగును. 58

మూ. త్రైలోక్యే తం న పశ్యామి యో మే కుర్యాద్వరం వృథా,
అమరోఽహం సురశ్రేష్ఠ తేన మాం నావిశద్భయమ్. 59

ప్ర. అ. యః=ఎవడు, మే = నాయొక్క, వరమ్=వరమును, వృథా= వ్యర్థమైనదానినిగా, కుర్యాత్ = చేయునో, తమ్ = అట్టివానిని, త్రైలోక్యే=మూడు లోకములలో, న పశ్యామి = చూడను. సురశ్రేష్ఠ=ఓ! దేవతాశ్రేష్ఠుడా! అహమ్= నేను, అమరః = మరణరహితుడను. తేన = ఆ కారణముచేతనే, మామ్=నన్ను, భయమ్ = భయము, నావిశత్ = ఆవేశించలేదు.

తా. నా వరమును వ్యర్థము చేయగలవాడు మూడు లోకాలలోనూ కూడ లేదు. ఓ! దేవతాశ్రేష్ఠుడా! నాకు మరణము లేదు. అందుచేతనే నాకు భయము కలగలేదు. 59

మూ. అథాపి చ భవేన్మృత్యు_స్త్వద్ధస్తాన్నాన్యతః ప్రభో, 60
యశస్యం శ్లాఘనీయం చ త్వద్ధస్తాన్మరణం మమ.

ప్ర. అ. ప్రభో = ఓ! ప్రభూ! మృత్యుః = మృత్యువు, అథాపి చ భవేత్ = కలిగినను, త్వద్ధస్తాత్ = నీ హస్తమువలననే, అన్యతః = మరొకనివలన, న = కలగకూడదు. త్వద్ధస్తాత్ = నీ హస్తమువలన, మరణమ్ = మరణము, మమ = నాకు, యశస్యమ్ = యశస్సును కలిగించునది. శ్లాఘనీయంచ = శ్లాఘించదగినది.

తా. ప్రభూ! నాకు మరణము వచ్చినను నీచేతనే రావచ్చును. నీవలన నాకు మరణము వచ్చినచో అది శ్లాఘింపదగినది, యశస్కరమూ కూడ అగును. 60

మూ. అథాస్య గాత్రే సంపశ్యద్రావణో భీమవిక్రమః, 61
తస్య దేవస్య సకలం త్రైలోక్యం సచరాచరమ్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, భీమవిక్రమః = భయంకరమైన పరాక్రమము గల, రావణః = రావణుడు, తస్య = ప్రసిద్ధుడైన, అస్య దేవస్య = ఈ దేవుని యొక్క, గాత్రే = శరీరమునందు, సకలమ్ = సమస్తమైన, సచరాచరమ్ = చరాచరములతో కూడిన, త్రైలోక్యమ్ = మూడు లోకములను, సంపశ్యత్ = చూచెను.

తా. పిమ్మట భయంకరమైన పరాక్రమము గల రావణుడు ఆ దేవుని శరీరమునందు స్థావరజంగమాత్మకమైన మూడు లోకముల సముదాయమును చూచెను. 61

మూ. ఆదిత్యా మరుతః సాధ్యా వసవోఽథాశ్వినావపి, 62
రుద్రాశ్చ పితరశ్చైవ యమో వైశ్రవణస్తథా,
సముద్రా గిరయో నద్యో వేదా విద్యాస్త్రయోఽగ్నయః.

గ్రహాస్తారాగణా వ్యోమ సిద్ధా గన్ధర్వచారణాః,
మహర్షయో వేదవిదో గరుడోఽథ భుజఙ్గమాః. 64

యే చాన్యే దేవతాసంఘాః సంస్థితా దైత్యరాక్షసాః,
గాత్రేషు శయనస్థస్య దృశ్యన్తే సూక్ష్మమూర్తయః 65

ప్ర. అ. ఆదిత్యాః = పన్నెండుగురు ఆదిత్యులు, మరుతః = ఏడుగురు

మరుత్తులు, సాధ్యాః = సాధ్యులు, వసవః = అష్టవసువులు, రుద్రాశ్చ = ఏకాదశ రుద్రులు, పితరశ్చైవ = పితృదేవతలు, యమః = యముడు, తథా = మరియు, వైశ్రవణః = కుబేరుడు, సముద్రాః = సముద్రములు, గిరయః = పర్వతములు, నద్యః = నదులు, వేదాః = వేదములు, విద్యాః = విద్యలు, త్రయః = మూడు, అగ్నయః = అగ్నులు, గ్రహాః = గ్రహములు, తారాగణాః = నక్షత్రగణములు, వ్యోమ = ఆకాశము, సిద్ధాః = సిద్ధులు, గన్ధర్వచారణాః = గంధర్వులు చారణులు, వేదవిదః = వేదవేత్తలైన, మహర్షయః = మహర్షులు, గరుడః = గరుత్మంతుడు, అథ = మరియు, భుజఙ్గమాః = సర్పములు, అన్యే = ఇతరమైన, యే = ఏ, దేవతా సంఘాః = దేవతలసంఘములు, సంస్థితాః = ఉన్నవో అవి, దైత్యరాక్షసాః = దైత్యులు, రాక్షసులు, శయనస్థస్య = శయనమునందున్న అతనియొక్క, గాత్రేషు = అవయవములయందు, సూక్ష్మమూర్తయః = సూక్ష్మములైన మూర్తులు గలవై, దృశ్యన్తే = చూడబడుచున్నవి.

తా. ఆదిత్యులు, మరుత్తులు, సాధ్యులు, వసువులు, అశ్వినీదేవతలు, రుద్రులు, పితృదేవతలు, యముడు, కుబేరుడు, సముద్రములు, పర్వతములు, నదులు, వేదములు, విద్యలు, మూడు అగ్నులు, గ్రహములు, నక్షత్రగణములు, ఆకాశము, సిద్ధులు, గంధర్వులు, చారణులు, వేదవేత్తలైన మహర్షులు, గరుత్మంతుడు, సర్పాలు, ఇంకా మిగిలిన దేవతాసంఘాలు, దైత్యులు, రాక్షసులు, సూక్ష్మ రూపములతో శయనించి ఉన్న ఆ పురుషుని అవయవాలలో కనబడెను. 62-65

> మూ. ఆహ రామోఽథ ధర్మాత్మా హ్యగస్త్యం మునిసత్తమమ్,
> ద్వీపస్థః పురుషః కోఽసౌ తిస్రః కోట్యస్తు కాశ్చ తాః. 66
> శయానః పురుషః కోఽసౌ దైత్యదానవదర్పహా.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ధర్మాత్మా = ధర్మాత్ముడైన, రామః = రాముడు, మునిసత్తమమ్ = మునిశ్రేష్ఠుడైన, అగస్త్యమ్ = అగస్త్యుణ్ణి గూర్చి, ఆహ = పలికెను. ద్వీపస్థః = ద్వీపమునందు ఉన్న, అసౌ పురుషః = ఆ పురుషుడు, కః = ఎవరు? తాః = ఆ, తిస్రః కోట్యః = మూడు కోట్లు, కాః = ఎవరు? దైత్య దానవదర్పహా = దైత్యులయొక్క, దానవులయొక్క దర్పమును పోగొట్టిన, శయానః = శయనించి ఉన్న, అసౌ పురుషః = ఆ పురుషుడు, కః = ఎవరు?

తా. అప్పుడు ధర్మాత్ముడైన రాముడు మునిశ్రేష్ఠుడైన అగస్త్యుణ్ణి ఇట్లు ప్రశ్నించెను. "ద్వీపమునం దున్న ఆ పురుషుడు ఎవడు? ఆ మూడు కోట్లమంది జనులు ఎవరు? దైత్యదానవుల దర్పము అడచిన, శయనించి ఉన్న ఆ పురుషుడు ఎవడు?". 66

మూ. రామస్య వచనం శ్రుత్వా హ్యగస్త్యో వాక్యమబ్రవీత్. 67
శ్రూయతామభిధాస్యామి దేవదేవః సనాతనః,
భగవాన్ కపిలో నామ ద్వీపస్థో నర ఉచ్యతే. 68

ప్ర. అ. రామస్య=రామునియొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా= విని, అగస్త్యః = అగస్త్యుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. అభిధాస్యామి = చెప్పెదను. శ్రూయతామ్ = వినబడుగాక. ద్వీపస్థః = ద్వీపము నందున్న, నరః=నరుడు, దేవదేవః = దేవదేవుడు, సనాతనః=నిత్యుడు అయిన, భగవాన్ = భగవంతుడైన, కపిలః నామ = కపిలుడుగా, ఉచ్యతే = చెప్పబడు చున్నాడు".

తా. రాముని మాటలు విని అగస్త్యుడు ఇట్లనెను. "చెప్పెదను; వినుము. ద్వీపమునందున్న పురుషుడు దేవదేవుడు, సనాతనుడు అయిన భగవంతుడైన కపిలుడు" 67,68

మూ. యే తు నృత్యన్తి వై తత్ర సురాస్తే తస్య ధీమతః,
తుల్యతేజఃప్రభావాస్తే కపిలస్య నరస్య వై. 69

ప్ర. అ. తత్ర = అక్కడ, యే = ఎవరు, నృత్యన్తి = నాట్యముచేయు చున్నారో, తే = వారు, ధీమతః = బుద్ధిమంతుడైన; తస్య = అతనియొక్క; సురాః = దేవతలు. తే = వారు, నరస్య = నరుడైన కపిలునికి; తుల్యతేజః ప్రభావాః = తుల్యమైన తేజస్సు ప్రభావము గలవారు.

తా. అక్కడ నృత్యముచేయుచున్నవారు బుద్ధిమంతుడైన అతనికి సంబంధించిన దేవతలు; వాళ్ళు కపిలు డనే ఆ పురుషునితో సమానమైన తేజస్సు, ప్రభావమూ గలవారు. 69

మూ. నాసౌ క్రుద్ధేన దృష్టస్తు రాక్షసః పాపనిశ్చయః,
న బభూవ తదా తేన భస్మసాద్రామ రావణః. 70

ప్ర. అ. పాపనిశ్చయః = పాపనిశ్చయము గల, అసౌ రాక్షసః = ఈ రాక్షసుడు, క్రుద్ధేన = కోపించిన ఆ పురుషునిచేత, న దృష్టః = చూడబడలేదు. రామ = రామా! తేన = ఆ కారణముచేతనే, తదా = అప్పుడు, రావణః = రావణుడు, భస్మసాత్ = భస్మముగా, న బభూవ = కాలేదు.

తా. రామా! పాపనిశ్చయము గల ఆ రాక్షసుణ్ణి ఆ పురుషుడు కోపముతో చూడలేదు. అందుచేతనే అతడు భస్మము కాలేదు. 70

మూ. స్విన్నగాత్రో నగప్రఖ్యో రావణః పతితో భువి,
వాక్శరైస్తం బిభేదాశు రహస్యం పిశునో యథా. 71

ప్ర. అ. నగప్రఖ్యః = పర్వతతుల్యుడైన, రావణః = రావణుడు, స్విన్నగాత్రః = చెమటపట్టిన శరీరము గలవాడై, భువి = నేలమీద, పతితః = పడెను. తమ్ = ఆ రావణుణ్ణి, వాక్శరైః = వాక్కు లనే బాణములచేత, పిశునః = చాడీలు చెప్పువాడు, రహస్యం యథా = రహస్యమునువలె, ఆశు = శీఘ్రముగా, బిభేద = భేదించెను.

తా. పర్వతము వంటి ఆ రావణుడు శరీర మంతా చెమటకు తడిసిపోగా, నేలమీద పడిపోయెను. ఆ పురుషుడు వానిని సంహరించకుండగా, చాడీలు చెప్పువాడు రహస్యమును భేదించినట్లు (బట్టబైలుచేసినట్లు), మాట లనే బాణాలతో వానిని భేదించెను. 71

మూ. అథ దీర్ఘేణ కాలేన లబ్ధసంజ్ఞః స రాక్షసః,
ఆజగామ మహాతేజా యత్ర తే సచివాః స్థితాః. 72

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః సర్గః పఞ్చమః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, మహాతేజాః = గొప్పతేజస్సుగల, సః రాక్షసః = ఆ రాక్షసుడు, దీర్ఘేణ = దీర్ఘమైన, కాలేన = కాలముచేత, లబ్ధసంజ్ఞః = పొంద

బడిన సంజ్ఞ కలవారై, తే=ఆ, సచివాః=మంత్రులు, యత్ర=ఎక్కడ, స్థితాః= ఉన్నారో, అక్కడికి, అజగామ=వచ్చెను.

తా. గొప్ప తేజస్సు గల ఆ రావణుడు చాల సేపటికి స్పృహ రాగా తన మంత్రులున్న చోటికి వచ్చెను. 72

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ఐదవ ప్రక్షిప్త సర్గ సమాప్తము.

అథ చతుర్వింశః సర్గః

[*రావణుడు అపహరించిన దేవతాకన్యాదులు, స్త్రీలు విలపించుట. వారు రావణునకు శాపము ఇచ్చుట. రావణుడు శూర్పణఖను ఓదార్చుట, ఆమెను ఖరునితో కూడ దండకారణ్యమునకు పంపుట*].

మూ. నివర్తమానః సంహృష్టో రావణః స దురాత్మవాన్,
జహ్రే పథి నరేన్ద్రర్షిదేవదానవకన్యకాః. 1

ప్ర. అ. సంహృష్టః = సంతోషించినవాడై, నివర్తమానః = తిరిగివచ్చుచున్న, దురాత్మవాన్ = దుర్బుద్ధి గల, సః = ఆ, రావణః = రావణుడు, పథి = మార్గమునందు, నరేన్ద్రర్షిదేవదానవకన్యకాః = రాజ-ఋషి-దేవ-దానవుల కన్యకలను, జహ్రే = హరించెను.

తా. సంతోషముతో తిరిగి వచ్చుచున్న దురాత్ముడైన ఆ రావణుడు మార్గమునందు కనబడిన రాజకన్యలను, ఋషికన్యలను, దేవకన్యలను, దానవ కన్యలను హరించెను. 1

మూ. దర్శనీయాం హి యాం రక్షః కన్యాం స్త్రీం వాపి పశ్యతి,
హత్వా బన్ధుజనం తస్యా విమానే తాం రురోధ సః. 2

ప్ర. అ. రక్షః = రాక్షసుడైన, సః = రావణుడు, దర్శనీయామ్ = సుందరియైన, యామ్ = ఏ, కన్యామ్ = కన్యను గాని, స్త్రీం వాపి = స్త్రీని గాని, పశ్యతి = చూచెనో, తామ్ = ఆమెను, తస్యాః = ఆమెయొక్క, బన్ధుజనమ్ = బంధుజనమును, హత్వా = చంపి, విమానే = విమానమునందు, రురోధ = నిరోధించెను.

తా. ఆ రావణునకు సుందరియైన కన్య గాని, స్త్రీ గాని కనబడగానే అతడు ఆమె బంధువులను చంపి ఆమెను విమానములో నిర్బంధించెను. 2

మూ. ఏవం పన్నగకన్యాశ్చ రాక్షసాసురమానుషీః,
యక్షదానవకన్యాశ్చ విమానే సోఽధ్యరోపయత్. 3

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, సః = అతడు, పన్నగకన్యాః చ = నాగకన్యలను, రాక్షసాసురమానుషీః = రాక్షస-అసుర-మనుష్యస్త్రీలను, యక్షదానవకన్యాః చ = యక్షదానవకన్యలను, విమానే = విమానమునందు, అధ్యరోపయత్ = ఎక్కించెను.

తా. ఈ విధముగా అతడు నాగ-రాక్షస-అసుర-మనుష్య-యక్ష-దానవ కన్యలను విమానము మీద ఎక్కించుకుని తీసికొనిపోయెను. 3

మూ. తా హి సర్వాః సమం దుఃఖాన్ముముచుర్బాష్పజం జలమ్,
తుల్యమగ్న్యర్చిషాం తత్ర శోకాగ్నిభయసంభవమ్. 4

ప్ర. అ. తాః = ఆ స్త్రీలు, సర్వాః = అందరూ, తత్ర = అక్కడ, దుఃఖాత్ = దుఃఖమువలన, అగ్న్యర్చిషామ్ = అగ్నిజ్వాలలకు, తుల్యమ్ = సమానము, శోకాగ్నిభయసంభవమ్ = శోకాగ్నివలన భయమువలనా పుట్టిన, బాష్పమ్బుజమ్ = కన్నీళ్ళవంన పుట్టిన, జలమ్ = జలమును, సమమ్ = సమముగా, ముముచుః = విడచిరి.

తా. ఆ కన్యలందరూ దుఃఖించుచు శోకాగ్నివలన భయమువలనా జనించిన, అగ్నిజ్వాలలతో సమానమైన కన్నీటిని సమముగా విడచిరి. 4

మూ. తాభిః సర్వానవద్యాభిర్నదీభిరివ సాగరః,
ఆపూరితం విమానం తద్ భయశోకాశివాశ్రుభిః. 5

ప్ర. అ. సర్వానవద్యాభిః = పూర్తిగా దోషరహితలైన, భయశోకాశివాశ్రుభిః = భయముచేత, శోకముచేత అమంగళప్రదమైన కన్నీళ్ళు గల, తాభిః = ఆ కన్యలచేత, తత్ = ఆ, విమానమ్ = విమానము, నదీభిః = నదులచేత, సాగరః ఇవ = సముద్రము వలె, ఆపూరితమ్ = నింపబడినది.

తా. భయముచేత శోకముచేత కన్నీళ్ళు కార్చుచున్న, ఎట్టి దోషములూ లేని ఆ కన్యలచేత, ఆ విమానము, నదులచేత సముద్రము వలె నింపబడెను. 5

మూ. నాగగన్ధర్వకన్యాశ్చ మహర్షితనయాశ్చ యాః,
దైత్యదానవకన్యాశ్చ విమానే శతశోఽరుదన్. 6

ప్ర. అ. విమానే = విమానమునందు, శతశః = వందలకొలది, యాః = ఏ, నాగగన్ధర్వకన్యాః = నాగగంధర్వకన్యలు, మహర్షితనయాశ్చ = మహర్షుల కుమార్తెలు, దైత్యదానవకన్యాశ్చ = దైత్య-దానవకన్యలు ఉన్నారో వారు, అరుదన్ = ఏడ్చిరి.

తా. ఆ విమానములో ఉన్న వందలకొలది నాగగంధర్వకన్యలు, మహర్షుల కన్యలు, దైత్య-దానవకన్యలు ఏడ్చిరి. 6

మూ. దీర్ఘకేశ్యః సుచార్వఙ్గ్యః పూర్ణచన్ద్రనిభాననాః,
పీనస్తనతటా మధ్యే వజ్రవేదిసమప్రభాః. 7

రథకూబరసంకాశైః శ్రోణిదేశైర్మనోహరాః,
స్త్రియః సురాఙ్గనాప్రఖ్యా నిష్టప్తకనకప్రభాః, 8
శోకదుఃఖభయత్రస్తా విహ్వలాశ్చ సుమధ్యమాః.

ప్ర. అ. దీర్ఘకేశ్యః = దీర్ఘములైన కేశములు కలవారు, సుచార్వఙ్గ్యః = చాల అందమైన శరీరములు కలవారు, పూర్ణచన్ద్రనిభాననాః = పూర్ణచంద్రునితో సమానమైన ముఖములు కలవారు, పీనస్తనతటాః = బలిసిన స్తనప్రదేశములు కలవారు, మధ్యే = నడుమునందు, వజ్రవేదిసమప్రభాః = వజ్రములతో కూడిన వేదికలతో సమానకాంతి గలవారు, రథకూబరసంకాశైః = రథముల ఇరుసులతో సమానములైన, శ్రోణిదేశైః = పిరుదులతో, మనోహరాః = మనోహరులు, సురాఙ్గనాప్రఖ్యాః = దేవతాస్త్రీలతో సమానలు, నిష్టప్తకనకప్రభాః = కరిగించిన బంగారము వంటి కాంతి గలవారు, సుమధ్యమాః = మంచి నడుములు గలవారు అయిన, స్త్రియః = స్త్రీలు, శోకదుఃఖభయత్రస్తాః = శోకముతోను, దుఃఖముతోను, భయముతోను కంగారుపడుచున్నవారై, విహ్వలాః చ = వ్యాకులలుగా ఉండిరి.

తా. పొడవైన జుట్టు, చాల అందమైన శరీరము, పూర్ణచంద్రుని వంటి ముఖము, బలిసిన స్తనములు, వజ్రములు పొదిగిన వేదికవంటి నడుము గల ఆ స్త్రీలు దేవతాస్త్రీల వలె ఉండిరి. రథముల ఇరుసుల వలె ఉన్న పిరుదులతో

మనోహరముగా ఉన్న, చక్కనినడుములు గల ఆ స్త్రీలు శోకదుఃఖములతో కలత చెంది ఉండిరి. 7, 8

మూ. తాసాం నిఃశ్వాసవాతేన సర్వతః సంప్రదీపితమ్, 9
అగ్నిహోత్రమివాభాతి సంనిరుద్ధాగ్ని పుష్పకమ్.

ప్ర. అ. తాసామ్=ఆ స్త్రీలయొక్క, నిఃశ్వాసవాతేన=నిట్టూర్పుగాలిచేత, సర్వతః = అంతటా, సంప్రదీపితమ్ = మండింపచేయబడిన, పుష్పకమ్ = పుష్పకము, సంనిరుద్ధాగ్ని = దగ్గరగా చేర్చి నిరోధింపబడిన అగ్ని గల, అగ్నిహోత్రమివ = అగ్నికుండము వలె, ఆభాతి = ప్రకాశించుచున్నది.

తా. వాళ్ళ నిట్టూర్పుల గాలులచేత అంతటా ప్రజ్వలింపచేయబడిన పుష్పకము నిరోధింపబడిన అగ్నులు గల అగ్నికుండము వలె ఉండెను. 9

మూ. దశగ్రీవవశం ప్రాప్తాస్తాస్తు శోకాకులాః స్త్రియః, 10
దీనవక్త్రేక్షణాః శ్యామా మృగ్యః సింహవశా ఇవ.

ప్ర. అ. దశగ్రీవవశమ్ = రావణుని వశమును, ప్రాప్తాః = పొందిన, శ్యామాః = యౌవనమధ్యమునందున్న, తాః స్త్రియః = ఆ స్త్రీలు, సింహవశాః = సింహమునకు లొంగిన, మృగ్యః ఇవ = ఆడ లేళ్ళు వలె, దీనవక్త్రేక్షణాః = దీనములైన ముఖములు, నేత్రములు కలవారై, శోకాకులాః = శోకముచే ఆకులలు అయిరి.

తా. రావణునికి చిక్కిన యౌవనమధ్యమునందున్న ఆ స్త్రీలు సింహవశములో ఉన్న ఆడలేళ్ళ వలె దైన్యము చెందిన ముఖములతో నేత్రములతో శోకాక్రాంతలైరి. 10

మూ. కాచిచ్చిన్తయతీ తత్ర కిం ను మాం భక్షయిష్యతి, 11
కాచిద్దధ్యౌ సుదుఃఖార్తా అపి మాం మారయేదయమ్.

ప్ర. అ. తత్ర = వారిలో, కాచిత్ = ఒక స్త్రీ, మామ్ = నన్ను, కిం ను భక్షయిష్యతి = భక్షించునా అని, చిన్తయతీ = చింతించుచు ఉండెను. మామ్ = నన్ను, అయమ్ = ఇతడు, అపి మారయేత్ = చంపివేయునా అని, కా చిత్ =

మరొక స్త్రీ, సుదుఃఖార్తా = చాల దుఃఖముచేత పీడితురాలై, దధ్యౌ = ఆలోచించు చుండెను.

తా. వాళ్ళలో ఒక స్త్రీ "ఇతడు నన్ను భక్షించివేయునా ?"అని అనుకొను చుండెను. మిక్కిలి దుఃఖించుచు మరొక స్త్రీ "ఇతడు నన్ను చంపివేయునా ?" అని అనుకొనుచుండెను. 11

మూ. ఇతి మాతౄః పితౄన్ స్మృత్వా భర్తౄన్ భ్రాతౄంస్త
థైవ చ, 12
దుఃఖశోకసమావిష్టా విలేపుః సహితాః స్త్రియః.

ప్ర. అ. ఇతి = ఈ విధముగా, స్త్రియః = స్త్రీలు, సహితాః = కలిసినవారై, మాతౄః = తల్లులను, పితౄన్ = తండ్రులను, భర్తౄన్ = భర్తలను, తథైవ చ = మరియు, భ్రాతౄన్ = సోదరులను, స్మృత్వా = స్మరించి, దుఃఖశోక సమావిష్టాః = దుఃఖశోకములతో కూడినవారై, విలేపుః = విలపించిరి.

తా. ఈ విధముగా ఆ స్త్రీలందరూ కలిసి తల్లులను, తండ్రులను, భర్త లను, సోదరులను స్మరించుచు, దుఃఖశోకములతో కూడినవారై ఏడ్చిరి. 12

మూ. కథం ను ఖలు మే పుత్రో భవిష్యతి మయా వినా, 13
కథం మాతా కథం భ్రాతా నిమగ్నాః శోకసాగరే.

ప్ర. అ. మే పుత్రః = నా పుత్రుడు, మయా వినా = నేను లేకుండగా, కథమ్ = ఎట్లు, భవిష్యతి = ఉండగలడో ! మాతా = తల్లి, కథమ్ = ఎట్లుండగలదో, భ్రాతా = సోదరుడు, కథమ్ = ఎట్లుండగలడో అని, శోకసాగరే = శోకసముద్రము నందు, నిమగ్నాః = మునిగిరి.

తా. నేను లేకుండా నా పుత్రుడు ఎట్లుండునో కదా! నా తల్లి ఎట్లుండునో కదా! నా సోదరుడు ఎట్లుండునో కదా! అని అనుచు ఆ స్త్రీలు శోకసాగరములో మునిగిరి. 13

మూ. హా కథం ను కరిష్యామి భర్తుస్తస్మాదహం వినా, 14
మృత్యో ప్రసాదయామి త్వాం నయ మాం దుఃఖభాగినీమ్,
కిం ను తద్దుష్కృతం కర్మ పురా దేహాన్తరే కృతమ్. 15

ప్ర. అ. హా = అయ్యో! అహమ్ = నేను, తస్మాత్ = ఆ, భర్తుః వినా = భర్త లేకుండా, కథమ్ = ఎట్లు, కరిష్యామి = చేయుదును? మృత్యో=ఓ! మృత్యు దేవతా! త్వామ్=నిన్ను, ప్రసాదయామి=ప్రతిమాలుచున్నాను. దుఃఖభాగినీమ్= దుఃఖమును పొందిన, మామ్=నన్ను, నయ=తీసికొనిపొమ్ము. పురా=పూర్వము, దేహాన్తరే = మరియొక దేహమునందు, తత్ = ఆ, కిం ను = ఏ, దుష్కృతమ్ = పాపరూపమైన, కర్మ = కర్మ, కృతమ్ = చేయబడినదో కదా!

తా. ఆ భర్త లేకుండా నేనేమి చేయుదును? ఓ! మృత్యుదేవతా! నిన్ను ప్రతిమాలుకొనుచున్నాను. దుఃఖము అనుభవించవలసి ఉన్న నన్ను తీసికొని పొమ్ము పూర్వజన్మలో నేనెట్టి పాపము చేసి ఉన్నానో కదా! 14,15

మూ. ఏవం స్మ దుఃఖితాః సర్వాః పతితాః శోకసాగరే,
న ఖల్విదానీం పశ్యామో దుఃఖస్యాస్యాన్తమాత్మనః. 16

ప్ర. అ. దుఃఖితాః = దుఃఖించుచున్న, సర్వాః = మే మందరమూ, శోకసాగరే = దుఃఖసముద్రమునందు, ఏవమ్ = ఈ విధముగా, పతితాః స్మ = పడిపోయినాము. ఇదానీమ్ = ఇప్పుడు, ఆత్మనః = మాయొక్క, అస్య దుఃఖస్య = ఈ దుఃఖమునకు, అన్తమ్ = అంతమును, న పశ్యామః ఖలు=చూచుటలేదు కదా!

తా. ఈ విధముగా దుఃఖము చెంది శోకసాగరములో పడిన మాకు ఈ దుఃఖమునకు అంతము కనబడుటలేదు. 16

మూ. అహో ధిఙ్మానుషం లోకం నాస్తి ఖల్వధమః పరః,
యద్దుర్బలా బలవతా భర్తారో రావణేన నః. 17
సూర్యేణోదయతా కాలే నక్షత్రాణీవ నాశితాః.

ప్ర. అ. అహో=అయ్యో! మానుషం లోకమ్=మనుష్యలోకమునుగూర్చి, ధిక్ = నింద అగుగాక! పరః=దీనిని మించిన, అధమః = అధమలోకము, నాస్తి ఖలు = లేదు కదా! యత్ = ఎందువలన, దుర్బలాః = దుర్బలులైన, నః భర్తారః = మన భర్తలు, బలవతా = బలవంతుడైన, రావణేన = రావణునిచేత, కాలే=ప్రాతఃకాలమునందు, ఉదయతా = ఉదయించుచున్న, సూర్యేణ=సూర్యుని చేత, నక్షత్రాణీవ = నక్షత్రములు వలె, నాశితాః = నశింప చేయబడినారో!

తా. ఛీ! ఈ మనుష్యలోకము ఎంత చెడ్డది. దీనికంటె అధమమైన లోకము లేదు. ఎందుచేత ననగా బలవంతుడైన రావణుడు దుర్బలులైన మన భర్తలను ఉదయించుచున్న సూర్యుడు నక్షత్రములను వలె నశింపచేసిచేసినాడు! 17

మూ. అహో సుబలవద్రక్షో వధోపాయేన రజ్యతే, 18
అహో దుర్వృత్తమాస్థాయ నాత్మానం వై జుగుప్సతే.

ప్ర. అ. అహో = ఏమి ఆశ్చర్యము, సుబలవత్ = గొప్ప బలము గల, రక్షః = ఈ రాక్షసుడు, వధోపాయేన = ఇతరులను వధించు ఉపాయముచేత, రజ్యతే = సంతోషించుచున్నాడు, అహో=ఏమి ఆశ్చర్యము, దుర్వృత్తమ్ = చెడ్డ నడవడికను, ఆస్థాయ=అవలంబించి, ఆత్మానమ్=తనను గూర్చి, న జుగుప్సతే= జుగుప్స పొందుటలేదు.

తా. ఏమి ఆశ్చర్యము! ఈ మహాబలవంతుడైన రాక్షసుడు ఇతరులను చంపు ఉపాయములున్నందుకు సంతోషించుచున్నాడు కాని చెడ్డ పనులు చేయుచున్న తనను గూర్చి అసహ్యించుకొనుటలేదు. 18

మూ. సర్వథా సదృశస్తావద్విక్రమోఽస్య దురాత్మనః, 19
ఇదం త్వసదృశం కర్మ పరదారాభిమర్శనమ్.

ప్ర. అ. దురాత్మనః = దుర్బుద్ధియైన, అస్య = వీనియొక్క, విక్రమః = పరాక్రమము, సర్వథా = అన్ని విధములా, సదృశః = తగిఉన్నది. తు = కాని, ఇదమ్ = ఈ, పరదారాభిమర్శనమ్ = పరభార్యలను స్పృశించుట అను, కర్మ = పని, అసదృశమ్ = తగనిది

తా. ఈ దురాత్ముని పరాక్రమము ఇతడు చేసిన తపస్సు మొదలైనవాటికి అన్ని విధాలా తగి ఉన్నది. కాని పరస్త్రీస్పర్శరూపమైన ఈ పని మాత్రము తగినది కాదు. 19

మూ. యస్మాదేష పరక్యాసు రమతే రాక్షసాధమః, 20
తస్మాద్వై స్త్రీకృతేనైవ వధం ప్రాప్స్యతి దుర్మతిః.

ప్ర. అ. దుర్మతిః = చెడ్డ బుద్ధి గల, ఏషః రాక్షసాధమః = ఈ రాక్షసాధముడు, యస్మాత్ = ఏకారణమువలన, పరక్యాసు = పరస్త్రీలయందు, రమతే =

క్రీడించుచున్నాడో, తస్మాత్ = ఆకారణమువలన, స్త్రీకృతేనైవ = స్త్రీ మూలము గానే, వధమ్ = వధను, ప్రాప్స్యతి వై = పొందగలడు.

తా. దుర్బుద్ధియైన ఈ రాక్షసాధముడు పరభార్యలయందు అభిలాష కలిగి ఉన్నాడు; అందువలన ఇతడు స్త్రీ మూలముననే మరణించగలడు. 20

మూ. సతీభిర్వరనారీభిరేవం వాక్యేఽభ్యుదీరితే, 21
నేదుర్దున్దుభయః ఖస్థాః పుష్పవృష్టిః పపాత హ.

ప్ర. అ. సతీభిః = పవిత్రలైన, వరనారీభిః = ఉత్తమస్త్రీంచేత, ఏవమ్= ఇట్లు, వాక్యే=వాక్యము, అభ్యుదీరితే=పలకబడినదగుచుండగా, ఖస్థాః=ఆకాశము నందున్న, దున్దుభయః = దుందుభులు, నేదుః = ధ్వనిచేసినవి. పుష్పవృష్టిః చ= పుష్పవర్షముకూడ, పపాత = పడెను.

తా. పతివ్రతలైన ఆ ఉత్తమస్త్రీలు ఇట్లు పలకగానే ఆకాశమునందున్న దుందుభులు మ్రోగెను. పుష్పవర్షము కురిసెను. 21

మూ. శప్తః స్త్రీభిః స తు సమం హతౌజా ఇవ నిష్ప్రభః, 22
పతివ్రతాభిః సాధ్వీభిర్బభూవ విమనా ఇవ.

ప్ర. అ. పతివ్రతాభిః = పతివ్రతలు, సాధ్వీభిః = మంచివాళ్లు అయిన, స్త్రీభిః = స్త్రీలచేత, సమమ్ = ఒక్కమారుగా, శప్తః = శపించబడిన, సః తు = అతడైతే, హతౌజాః ఇవ=కొట్టబడిన తేజస్సు గలవాడు వలె, నిష్ప్రభః=కాంతి శూన్యుడుగాను, విమనాః ఇవ = వికారము చెందిన మనస్సుకలవాడు వలెను, బభూవ = అయెను.

తా. పతివ్రతలైన ఆ ఉత్తమస్త్రీలు కలిసి ఒక్కమారుగా ఈ విధముగా శపించగానే ఆ రావణుని తేజస్సు అణచివేయబడిన ట్లయి అతడు కాంతివిహీను డయ్యెను. అతని మనస్సు చెదిరిపోయినట్లు అయ్యెను. 22

మూ. ఏవం విలపితం తాసాం శృణ్వన్ రాక్షసపుంగవః, 23
ప్రవివేశ పురీం లఙ్కాం పూజ్యమానో నిశాచరైః.

ప్ర. అ. రాక్షసపుంగవః = ఆ రాక్షసశ్రేష్ఠుడు, తాసామ్ = వాళ్లయొక్క,

ఏవమ్ = ఇట్లు, విలపితమ్ = విలాపమును, శృణ్వన్ = వినుచు, నిశాచరైః = రాక్షసులచేత, పూజ్యమానః = పూజింపబడుచున్నవాడై, లఙ్కాం పురీమ్ = లంకా పురమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. ఆ రాక్షసరాజు ఆ స్త్రీల ఈ విలాపమును వినుచు, రాక్షసుల పూజలు అందికొనుచు లంకాపురములో ప్రవేశించెను. 23

మూ. ఏతస్మిన్నన్తరే ఘోరా రాక్షసీ కామరూపిణీ, 24
సహసా పతితా భూమౌ భగినీ రావణస్య సా.

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యకాలములో, ఘోరా = భయంకరురాలు, కామరూపిణీ = స్వేచ్ఛానుసారము రూపము ధరించు, రాక్షసీ = రాక్షసియు అయిన, సా = ఆ, రావణస్య = రావణునియొక్క, భగినీ = సోదరి, సహసా = శీఘ్రముగా, భూమౌ = భూమిమీద, పతితా = పడినది.

తా. ఇంతలో రావణుని సోదరి, భయంకరురాలు, కామరూపముగలది అయిన శూర్పణఖ వచ్చి అతని పాదములమీద పడెను. 24

మూ. తాం స్వసారం సముత్థాప్య రావణః పరిసాన్త్వయన్, 25
అబ్రవీత్కిమిదం భద్రే వక్తుకామాసి మాం ద్రుతమ్.
సా బాష్పపరిరుద్ధాక్షీ రక్తాక్షీ వాక్యమబ్రవీత్. 26

ప్ర. అ. రావణః = రావణుడు, తామ్ = ఆ, స్వసారమ్ = సోదరిని, సముత్థాప్య = లేవదీసి, పరిసాన్త్వయన్ = ఓదార్చుచు, అబ్రవీత్ = పలికెను. భద్రే = మంగళప్రదురాలా! మామ్ = నన్ను గూర్చి, ద్రుతమ్ = శీఘ్రముగా, కిమ్ = ఏ, ఇదమ్ = దీనిని, వక్తుకామా = చెప్పుటకు కోరికగలదానవుగా, అసి = అయి ఉన్నావు? బాష్పపరిరుద్ధాక్షీ = కన్నీళ్లచేత కప్పబడిన నేత్రములు గల, రక్తాక్షీ = ఎఱ్ఱని నేత్రములు గల, సా = ఆమె, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. అతడు సోదరిని లేవదీసి ఓదార్చుచు-"ఓ! మంగళప్రదురాలా! నీవు నాతో ఏదో తొందరగా చెప్పదలచుచున్నట్లు ఉన్నావు. అది ఏమి?"అని పలికెను. అప్పుడు కన్నీళ్లతో నిండిన, ఎఱ్ఱనైన కండ్లతో ఆమె ఇట్లు పలికెను. 25,26

మూ. కృతాస్మి విధవా రాజం స్త్వయా బలవతా బలాత్,
ఏతే రాజం స్త్వయా వీర్యాద్దైత్యా వినిహతా రణే. 27
కాలకేయా ఇతి ఖ్యాతాః సహస్రాణి చతుర్దశ,

ప్ర. అ. రాజన్ = రాజా! బలవతా = బలవంతుడవైన, త్వయా = నీచేత, బలాత్ = బలాత్కారముగా, విధవా = విధవగా, కృతా = చేయబడినదానను, అస్మి = అయిఉన్నాను. రాజన్ = రాజా! కాలకేయాః ఇతి = కాలకేయులు అని, ఖ్యాతాః = ప్రసిద్ధులైన, ఏతే = ఈ, చతుర్దశ సహస్రాణి = పదునాలుగు వేల, దైత్యాః = దైత్యులు, రణే = యుద్ధమునందు, త్వయా = నీచేత, వీర్యాత్ = పరాక్రమమువలన, వినిహతాః = చంపబడిరి.

తా. రాజా! బలవంతుడవైన నీవు నాకు, బలాత్కారముగా వైధవ్యము కల్పించినావు. నీవు కాలకేయు లని ప్రసిద్ధి చెందిన పదునాలుగు వేలమంది దైత్యులను యుద్ధములో నీ పరాక్రమముచేత చంపివేసినావు. 27

మూ. ప్రాణేభ్యోఽపి గరీయాన్మే తత్ర భర్తా మహాబలః, 28
సోఽపి త్వయా హతస్తాత రిపుణా భ్రాతృగన్ధినా.

ప్ర. అ. తత్ర = వారిలో, ప్రాణేభ్యః అపి = ప్రాణములకంటె కూడ, గరీయాన్ = గొప్పవాడైన, మహాబలః = గొప్ప బలము గల, మే భర్తా = నా భర్త ఉండెను. తాత = తండ్రీ! సః అపి = అతడు కూడ, భ్రాతృగన్ధినా = సోదరుడను గంధము గల, రిపుణా = శత్రువైన, త్వయా = నీచేత, హతః = చంపబడినాడు.

తా. నాయనా! నా ప్రాణాలకంటె కూడ ప్రియుడైన బలవంతుడైన నా భర్త వారిలో ఉండెను. సోదరుడను పేరుతో నా శత్రువై నీవు అతనిని కూడ చంపివేసినావు. 28

మూ. త్వయాస్మి నిహతా రాజన్ స్వయమేవ హి బన్ధునా, 29
రాజన్వైధవ్యశబ్దం చ భోక్ష్యామి త్వత్కృతం హ్యహమ్.

ప్ర. అ. రాజన్ = రాజా! బన్ధునా = బంధువైన, త్వయా = నీచేత, స్వయమేవ = స్వయముగానే, నిహతా అస్మి హి = బాధించబడితిని కదా? రాజన్ = రాజా!

అహమ్ = నేను, త్వత్కృతమ్ = నీచేత కలిగించబడిన, వైధవ్యశబ్దమ్ = వైధవ్య శబ్దమును, భోక్ష్యామి = అనుభవించగలను.

తా. రాజా! బంధువైన నీవే స్వయముగా నాకు గొప్ప ఆపద కలగచేసినావు; నాకు నీవే వైధవ్యమును కలిగించినావు. 29

మూ. నను నామ త్వయా రక్ష్యో జామాతా సమరేష్వపి, 30
స త్వయా నిహతో యుద్ధే స్వయమేవ న లజ్జసే.

ప్ర. అ. సమరేష్వపి = యుద్ధములలో కూడ, త్వయా = నీచేత, జామాతా = అల్లుడు, రక్ష్యః నను నామ = రక్షించదగినవాడు కదా! సః = అతడే, త్వయా = నీచేత, స్వయమేవ = స్వయముగానే, నిహతః = చంపబడినాడు; న లజ్జసే = సిగ్గు పడుటలేదు.

తా. యుద్ధాలలో ఇంటి అల్లుణ్ణి నీవు రక్షించవలెను కదా? అట్టి అల్లుణ్ణి నీవే స్వయముగా చంపికూడ సిగ్గు చెందుట లేదు! 30

మూ. ఏవముక్తో దశగ్రీవో భగిన్యా క్రోశమానయా, 31
అబ్రవీత్సాన్త్వయిత్వా తాం సామపూర్వమిదం వచః.

ప్ర. అ. క్రోశమానయా = ఏడ్చుచున్న, భగిన్యా = సోదరిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, దశగ్రీవః = రావణుడు, తామ్ = ఆమెను, సాన్త్వయిత్వా = ఓదార్చి, సామపూర్వమ్ = ఓదార్చుట పూర్వమునందు కలుగునట్లుగా, ఇదమ్ = ఈ, వచః = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. సోదరి ఏడ్చుచు పలికిన ఆ మాటలు విని రావణుడు ఆమెను ఓదార్చి, బ్రతిమాలుచు ఇట్లు పలికెను. 31

మూ. అలం వత్సే రుదిత్వా తే న భేతవ్యం చ సర్వశః, 32
దానమానప్రసాదైస్త్వాం తోషయిష్యామి యత్నతః.

ప్ర. అ. వత్సే = ఓ! వత్సా! రుదిత్వా = ఏడ్చి. అలమ్ = చాలును. తే = నీకు, సర్వశః = అన్ని వైపులనుండి, న భేతవ్యమ్ = భయపడకూడదు. త్వామ్ = నిన్ను

దానమానప్రసాదైః=దానముచేత, గౌరవముచేత, అనుగ్రహించుటచేత, యత్నతః =ప్రయత్నపూర్వకముగా, తోషయిష్యామి = సంతోషపెట్టెదను.

తా. చెల్లెలా! ఏడవకుము. నీకు ఏ విధముగానూ భయపడవలసిన పని లేదు. నీకు దాన-మాన-ప్రసాదములచేత ప్రయత్నపూర్వకముగా సంతోషము కలిగించెదను. 32

మూ. యుద్ధప్రమత్తో వ్యాక్షిప్తో జయాకాఙ్క్షీ క్షిపన్ శరాన్, 33
నాహమజ్ఞాసిషం యుధ్యన్ స్వాన్ పరాన్వాపి సంయుగే.

ప్ర. అ. యుద్ధప్రమత్తః = యుద్ధములో పొరబాటు పడినవాడను, వ్యాక్షిప్తః = మనస్సు చెదిరిన వాడనూ అయిన, అహమ్ = నేను, జయాకాఙ్క్షీ = జయమును కోరుచున్నవాడనై, శరాన్ = బాణములను, క్షిపన్ = విసరుచు, యుధ్యన్ = యుద్ధముచేయుచు, సంయుగే = యుద్ధమునందు, స్వాన్ = తన వాళ్ళను, పరానపి = ఇతరులనూ కూడ, నాజ్ఞాసిషమ్ = తెలిసికొనలేదు.

తా. యుద్ధములో జయమును కోరుచు బాణములను విడచుచు మనస్సు చెదిరి యుద్ధమునందు పొరబడిన నాకు తనవా రెవరో, ఇతరు లెవరో తెలియలేదు.

మూ. జామాతరం న జానే స్మ ప్రహరన్ యుద్ధదుర్మదః,
తేనాసౌ నిహతః సంఖ్యే మయా భర్తా తవ స్వసః.

ప్ర. అ. స్వసః = ఓ! సోదరి! యుద్ధదుర్మదః = యుద్ధమునందు చెడ్డ మదముకలవాడనై, ప్రహరన్ = కొట్టుచున్న నేను, జామాతరమ్ = అల్లుణ్ణి, న జానే స్మ = గుర్తించలేదు. తేన = ఆ కారణముచేత, అసౌ = ఈ, తవ భర్తా = నీ భర్త, సంఖ్యే = యుద్ధమునందు, నిహతః = చంపబడినాడు.

తా. సోదరీ! యుద్ధమునందు దురావేశములో ఉన్న నేను కొట్టే సమయమునందు అల్లుణ్ణి గుర్తించలేదు. అందుచేతనే నీభర్తను యుద్ధములో చంపి వేసితిని. 34

మూ. అస్మిన్ కాలే తు యత్ప్రాప్తం తత్కరిష్యామి తే హితమ్,
భ్రాతురైశ్వర్యయుక్తస్య ఖరస్య వస పార్శ్వతః.

ప్ర. అ. తే = నీకు, మాతృష్వసేయః = తల్లి సోదరి కుమారుడైన, భ్రాతా = సోదరుడైన, అయమ్ = ఈ, నిశాచరః = రాక్షసుడైన, ఖరః = ఖరుడు, తత్ర = అక్కడ, సదా = ఎల్లప్పుడూ, తవ = నీయొక్క, ఆదేశమ్ = ఆజ్ఞను, కుర్వన్ = చేయుచు, ప్రభుః = ప్రభువుగా, భవిష్యతి = ఉండగలడు.

తా. నీ తల్లి సోదరి కుమారు డగుటచే నీకు భ్రాత అయిన ఆ రాక్షసుడైన ఖరుడు ఎల్లప్పుడూ నీవు చెప్పినట్లు చేయుచు అక్కడ ప్రభువుగా ఉండగలడు.

మూ. శీఘ్రం గచ్ఛత్వయం వీరో దణ్డకాన్ పరిరక్షితుమ్, 38
దూషణోఽస్య బలాధ్యక్షో భవిష్యతి మహాబలః.

ప్ర. అ. అయం వీరః = ఈ వీరుడు, దణ్డకాన్ = దండకను, పరిరక్షితుమ్ = రక్షించుటకు, శీఘ్రమ్ = శీఘ్రముగా, గచ్ఛతు = వెళ్ళుగాక, మహాబలః = గొప్ప బలము గల, దూషణః = దూషణుడు, అస్య = వీనికి, బలాధ్యక్షః = సేనాపతి, భవిష్యతి = కాగలడు.

తా. ఈ వీరుడు దండకారణ్యమును రక్షించుటకు శీఘ్రముగా వెళ్ళుగాక, మహాబలవంతుడైన దూషణుడు ఇతని సేనాధిపతి కాగలడు. 38

మూ. తత్ర తే వచనం శూరః కరిష్యతి సదా ఖరః, 39
రక్షసాం కామరూపాణాం ప్రభురేష భవిష్యతి.

ప్ర. అ. శూరః = శూరుడైన, ఖరః = ఖరుడు, తత్ర = అక్కడ, తే = నీయొక్క, వచనమ్ = వచనమును, సదా = ఎల్లపుడు, కరిష్యతి = చేయగలడు. ఏషః = ఇతడు, కామరూపాణామ్ = స్వేచ్ఛారూపము గల, రక్షసామ్ = రాక్షసుల యొక్క, ప్రభుః = ప్రభువు, భవిష్యతి = కాగలడు.

తా. ఈ ఖరుడు అక్కడ ఎల్లప్పుడూ నీ మాట ప్రకారము చేయగలడు. ఇతడు ఇచ్ఛానుసారము రూపములు ధరించగలిగిన రాక్షసుల నాయకుడై ఉండగలడు. 39

మూ. ఏవముక్త్వా దశగ్రీవః సైన్యమస్యాదిదేశ హ, 40
చతుర్దశ సహస్రాణి రక్షసాం వీర్యశాలినామ్.

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, అస్య = వీనియొక్క, సైన్యమ్ = సైన్యమునుగా, వీర్యశాలినామ్ = పరాక్రమసంపన్నులైన, రక్షసామ్ = రాక్షసులయొక్క, చతుర్దశ సహస్రాణి = పదునాలుగు వేలు, ఆదిదేశ హ = ఆజ్ఞాపించెను.

తా. రావణుడు ఇట్లు పలికి ఇతనికి సైన్యముగా ఉండవలసినదిగా పరాక్రమవంతులైన పదునాలుగువేలమంది రాక్షసులను ఆదేశించెను. 40

మూ. స తైః పరివృతః సర్వై రాక్షసైర్ఘోరదర్శనైః, 41
ఆగచ్ఛత ఖరః శీఘ్రం దణ్డకానకుతోభయః.

ప్ర. అ. సః ఖరః = ఆ ఖరుడు, ఘోరదర్శనైః = భయంకరమైన దర్శనము గల, తైః = ఆ, రాక్షసైః = రాక్షసులతో, సర్వైః = అందరితోను, పరివృతః = కూడినవాడై, అకుతోభయః = ఎటునుండి భయము లేనివాడై, శీఘ్రమ్ = శీఘ్రముగా, దణ్డకాన్ = దండకారణ్యమును గూర్చి, ఆగచ్ఛత = వచ్చెను.

తా. ఆ ఖరుడు చూచువారికి భయము కలిగించు ఆ రాక్షసు లందరితో కూడి, ఏ మాత్రమూ భయము లేనివాడై శీఘ్రముగా దండకారణ్యమునకు వచ్చెను. 41

మూ. స తత్ర కారయామాస రాజ్యం నిహతకణ్టకమ్, 42
సా చ శూర్పణఖా తత్ర న్యవసద్దణ్డకే వనే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుర్వింశః సర్గః.

ప్ర. అ. సః = అతడు, తత్ర = అక్కడ, నిహతకణ్టకమ్ = సంహరింపబడిన శత్రువులు గల, రాజ్యమ్ = రాజ్యమును, కారయామాస = ఏర్పాటుచేసెను. సా శూర్పణఖా చ = ఆ శూర్పణఖ కూడ, తత్ర = ఆ, దణ్డకే వనే = దండకావనమునందు, న్యవసత్ = నివసించెను.

తా. అతడు అక్కడ శత్రుబాధ లేని రాజ్యమును నెలకొల్పెను. ఆ శూర్పణఖ కూడ ఆ దండకవనమునందు నివసించెను. 42

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
ఇరువది నాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చవింశః సర్గః

[మేఘనాదుడు యజ్ఞములు చేసి సఫలత్వము పొందుట. విభీష ణుడు పరస్త్రీహరణము మంచిది కాదని రావణునకు బోధించుట. రావ ణుడు కుంభనసిని ఓదార్చి మధువుతో కలిసి దేవలోకమును ఆక్ర మించుటకై వెళ్ళుట.]

మూ. స తు దత్త్వా దశగ్రీవో బలం ఘోరం ఖరస్య తత్,
భగినీం చ సమాశ్వాస్య హృష్టః స్వస్థతరోఽభవత్. 1

ప్ర. అ. సః = ప్రసిద్ధుడైన, సః = ఆ, దశగ్రీవః = రావణుడు, ఖరస్య = ఖరునకు, తత్ = ఆ, ఘోరమ్ = భయంకరమైన, బలమ్ = సైన్యమును. దత్త్వా = ఇచ్చి, భగినీమ్ = సోదరిని, సమాశ్వాస్య = ఓదార్చి, హృష్టః = సంతోషించిన వాడై, స్వస్థతరః = మిక్కిలి స్వస్థుడు, అభవత్ = అయెను.

తా. రావణుడు ఖరునకు భయంకరమైన సైన్యము నిచ్చి, సోదరిని ఓదార్చి, సంతోషించుచు స్వస్థచిత్తు డయ్యెను. 1

మూ. తతో నికుమ్భిలా నామ లఙ్కోపవనముత్తమమ్,
తద్రాక్షసేన్ద్రో బలవాన్ ప్రవివేశ సహానుగః. 2

ప్ర. అ. నికుమ్భిలా నామ = నికుంభిల అను, ఉత్తమమ్ = ఉత్తమమైన, లఙ్కోపవనమ్ = లంకోద్యానము ఉండెను. తతః = అటుపిమ్మట, బలవాన్ = బలవంతుడైన, రాక్షసేన్ద్రః = రాక్షసరాజు, సహానుగః = అనుచరులతో కూడిన వాడై, తత్ = దానిని, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. పిమ్మట బలవంతుడైన రావణుడు, అనుచరులతో కలిసి నికుంభిల అను ఉత్తమమైన లంక దగ్గర నున్న ఉద్యానమునకు వెళ్ళెను. 2

మూ. తతో యూపశతాకీర్ణం సౌమ్యచైత్యోపశోభితమ్,
దదర్శ విష్ఠితం యజ్ఞం శ్రియా సంప్రజ్వలన్నివ. 3

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శ్రియా = శోభతో, సంప్రజ్వలన్నివ = మండుచున్నాడా అన్నట్లున్న రావణుడు, యూపశతాకీర్ణమ్ = యూపముల శతములచేత వ్యాప్తము, సౌమ్యచైత్యోపశోభితమ్ = సుందరమైన దేవాలయముచేత ప్రకాశింపచేయబడినది అయిన, విష్ఠితమ్ = జరుగుచున్న, యజ్ఞమ్ = యజ్ఞమును, దదర్శ = చూచెను.

తా. శోభతో వెలుగుచున్న ఆ రావణుడు అక్కడ వందలకొలది యూప స్తంభములతో వ్యాప్తము, అందమైన దేవాలయముతో ప్రకాశించుచున్నదీ అయిన యజ్ఞము జరుగుచుండుట చూచెను. 3

మూ. తతః కృష్ణాజినధరం కమణ్డలుశిఖాధ్వజమ్,
దదర్శ స్వసుతం తత్ర మేఘనాదం భయావహమ్. 4

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తత్ర = అక్కడ, కృష్ణాజినధరమ్ = కృష్ణాజినమును ధరించినవాడు, కమణ్డలుశిఖాధ్వజమ్ = కమండలువు, శిఖ, దండమూ కలవాడు అయిన, స్వసుతమ్ = తన కుమారుడైన, భయావహమ్ = భయంకరుడైన, మేఘనాదమ్ = మేఘనాదుణ్ణి, దదర్శ = చూచెను.

తా. పిమ్మట అతడు అక్కడ తన కుమారుడైన భయంకరుడైన మేఘనాదుణ్ణి చూచెను. అతడు కృష్ణాజినము కట్టుకొని కమండలువు, శిఖ, దండము ధరించి ఉండెను. 4

మూ. తం సమాసాద్య లఙ్కేశః పరిష్వజ్యాథ బాహుభిః,
అబ్రవీత్కిమిదం వత్స వర్తసే బ్రూహి తత్త్వతః. 5

ప్ర. అ. లఙ్కేశః = రావణుడు, తమ్ = అతనిని, సమాసాద్య = పొంది, అథ = పిమ్మట, బాహుభిః = బాహువులచేత, పరిష్వజ్య = కౌగలించుకొని, అబ్రవీత్ = పలికెను. వత్స = వత్సా! ఇదమ్ = ఈ, కిమ్ = దేనిని, వర్తసే = చేయుచున్నావు ? తత్త్వతః = యథార్థముగా, బ్రూహి = చెప్పుము.

తా. రావణుడు అతని దగ్గరకు వెళ్ళి బాహువులతో కౌగలించుకొని, "వత్సా! ఇది ఏమి చేయుచున్నావు ? యథార్థముగా చెప్పుము" అని అడిగెను. 5

మూ. ఉశనా త్వబ్రవీ త్తత్ర యజ్ఞసంపత్సమృద్ధయే,
రావణం రాక్షసశ్రేష్ఠం ద్విజశ్రేష్ఠో మహాతపాః. 6

ప్ర. అ. తత్ర = అక్కడ, ద్విజశ్రేష్ఠః = బ్రాహ్మణశ్రేష్ఠుడు, మహాతపాః = గొప్ప తపస్సు కలవాడూ అయిన, ఉశనా = శుక్రుడు, యజ్ఞసంపత్సమృద్ధయే = యజ్ఞసంపద సమృద్ధమగుటకు, రాక్షసశ్రేష్ఠమ్ = రాక్షసశ్రేష్ఠుడైన, రావణమ్ = రావణుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు ద్విజులలో శ్రేష్ఠుడు, గొప్ప తపస్సు కలవాడు అయిన శుక్రుడు యజ్ఞసిద్ధి పరిపూర్ణ మగుటకై రాక్షసశ్రేష్ఠుడైన రావణునితో ఇట్లుపలికెను. మౌనవ్రతము పాటించుచున్న యజమానుడైన మేఘనాదుడు మాటలాడినచో యజ్ఞము అసమృద్ధము (అసంపూర్ణము) అగును గాన శుక్రుడు సమాధానము చెప్పెను. 6

మూ. అహమాఖ్యామి తే రాజన్ శ్రూయతాం సర్వమేవ తత్,
యజ్ఞాస్తే సప్త పుత్రేణ ప్రాప్తాస్తు బహువిస్తరాః. 7

ప్ర. అ. రాజన్ = రాజా ! అహమ్ = నేను, తే = నీకు, ఆఖ్యామి = చెప్పెదను, తత్ = అది, సర్వమేవ = అంతా, శ్రూయతామ్ = వినబడుగాక. తే = నీయొక్క, పుత్రేణ = పుత్రునిచేత, బహువిస్తరాః = అతివిస్తృతములైన, సప్త = ఏడు, యజ్ఞాః = యజ్ఞములు, ప్రాప్తాః = పొందబడినవి.

తా. రాజా ! నేను నీకు ఆ విషయమంతా చెప్పెదను వినుము. నీ పుత్రుడు చాల పెద్దవైన ఏడు యజ్ఞాలు పూర్తిచేసినాడు. 7

మూ. అగ్నిష్టోమోఽశ్వమేధశ్చ యజ్ఞో బహుసువర్ణకః,
రాజసూయ స్తథా యజ్ఞో గోమేధో వైష్ణవ స్తథా. 8

ప్ర. అ. అగ్నిష్టోమః = అగ్నిష్టోమము, బహుసువర్ణకః = అధికమైన బంగారము గల, అశ్వమేధః యజ్ఞశ్చ = అశ్వమేధయజ్ఞము, తథా = మరియు, రాజసూయః యజ్ఞః = రాజసూయ మను యజ్ఞము, గోమేధః = గోమేధము, తథా = మరియు, వైష్ణవః = వైష్ణవయజ్ఞము చేయబడినవి.

తా. అగ్నిష్టోమము, అధికముగా బంగారము దాన మీయవలసిన అశ్వమేధము, రాజసూయము, గోమేధము, వైష్ణవము అను యజ్ఞాలు పూర్తి అయినవి.

మూ. మాహేశ్వరే ప్రవృత్తే తు యజ్ఞే పుంభిః సుదుర్లభే,
వరాంస్తే లబ్ధవాన్ పుత్రః సాక్షాత్ పశుపతేరిహ. 9

ప్ర. అ. పుంభిః = పురుషులచేత, సుదుర్లభే = మిక్కిలి దుర్లభమైన, మాహేశ్వరే యజ్ఞే = మాహేశ్వరయజ్ఞము, ప్రవృత్తే = జరిగిన దగుచుండగా, తే పుత్రః = నీ పుత్రుడు, సాక్షాత్ = సాక్షాత్తు, పశుపతేః = మహేశ్వరునినుండి, వరాన్ = వరములను, లబ్ధవాన్ = పొందినాడు.

తా. ఇతరులు ఎవ్వరూ చేయ జాలని మాహేశ్వరయజ్ఞము పూర్తికాగానే నీ కుమారునకు సాక్షాత్తు మహేశ్వరుడు వరములను ఇచ్చినాడు. 9

మూ. కామగం స్యన్దనం దివ్యమన్తరిక్షచరం ధ్రువమ్,
మాయాం చ తామసీం నామ యయా సంపద్యతే తమః.

ప్ర. అ. కామగమ్ = ఇష్టానుసారము నడిచేదీ, దివ్యమ్ = దివ్యమూ, అన్తరిక్షచరమ్ = ఆకాశముమీద నడిచేదీ, ధ్రువమ్ = స్థిరమూ అయిన, స్యన్దనమ్ = రథమునూ, యయా = దేనిచేత, తమః = చీకటి, సంపద్యతే = పుట్టునో అట్టి, తామసీం నామ = తామసి అను, మాయాం చ = మాయను (పొందినాడు).

తా. స్వేచ్ఛానుసారము నడిచే, ఆకాశములో కూడా సంచరించే దివ్యమూ, స్థిరమూ (దృఢమూ) అయిన రథమునూ, చీకటిని సృష్టించే తామసి అను మాయను వరములుగా పొందెను. 10

మూ. ఏతయా కిల సంగ్రామే మాయయా రాక్షసేశ్వర,
ప్రయుక్తయా గతిః శక్యా న హి జ్ఞాతుం సురాసురైః. 11

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసరాజా! సంగ్రామే = యుద్ధమునందు, ప్రయుక్తయా = ప్రయోగించబడిన, ఏతయా = ఈ, మాయయా = మాయచేత, గతిః = సంచారము, సురాసురైః = సురులచేతను, అసురులచేతను కూడ, జ్ఞాతుమ్ = తెలిసికొనుటకు, న శక్యా హి = శక్యము కాదుకదా.

తా. రాక్షసరాజా! యుద్ధములో ఈ మాయను ప్రయోగించినచో సురులు అసురులూ కూడ ఇతని సంచారమును తెలిసికొనజాలరు. 11

మూ. అక్షయావిషుధీ బాణైశ్చాపం చాపి సుదుర్జయమ్,
అస్త్రం చ బలవద్రాజన్ శత్రువిధ్వంసనం రణే. 12

ప్ర. అ. రాజన్ = రాజా! బాణైః = బాణములతో కూడిన, అక్షయా = అక్షయములైన, ఇషుధీ = అంబులపొదులను, సుదుర్జయమ్ = జయింప శక్యము కాని, చాపమ్ = ధనస్సును, రణే = యుద్ధమునందు, శత్రువిధ్వంసనమ్ = శత్రువులను నశింపచేయు, బలవత్ = బలము గల, అస్త్రం చ = అస్త్రమును, పొందెను.

తా. బాణములతో నిండిన అక్షయములైన అంబులపొదులను, జయింప శక్యము కాని ధనస్సును, యుద్ధములో శత్రువులను నశింపచేయు బలము గల అస్త్రమునూ కూడ పొందెను. 12

మూ. ఏతాన్ సర్వాన్ వరాన్ లబ్ధ్వా పుత్రస్తేఽయం దశానన,
అద్య యజ్ఞసమాప్తౌ చ త్వాం దిదృక్షన్ స్థితో హ్యయమ్.

ప్ర. అ. దశానన = రావణా! అయం తే పుత్రః = ఈ నీ పుత్రుడు, ఏతాన్ = ఈ, సర్వాన్ = సమస్తమైన, వరాన్ = వరములను, లబ్ధ్వా = పొంది, అద్య = ఇప్పుడు, యజ్ఞసమాప్తౌ = యజ్ఞసమాప్తి సమయమునందు, త్వామ్ = నిన్ను, దిదృక్షన్ = చూడదలచుచున్నవాడై, స్థితః = ఉన్నాడు.

తా. రావణా! నీ కుమారుడు ఈ వరము లన్నీ సంపాదించి, ఈనాడు, యజ్ఞసమాప్తి దివసమునందు, నిన్ను చూడవలె నను కోరికతో ఉన్నాడు. 13

మూ. తతోఽబ్రవీద్దశగ్రీవో న శోభనమిదం కృతమ్,
పూజితాః శత్రవో యస్మాద్ద్రవ్యైరిన్ద్రపురోగమాః. 14

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దశగ్రీవః = రావణుడు, అబ్రవీత్ = పలికెను. కృతమ్ = చేయబడిన, ఇదమ్ = ఇది, శోభనమ్ = మంచిది, న = కాదు. యస్మాత్ = ఎందువలన, ఇన్ద్రపురోగమాః = ఇంద్రుడు మొదలైన, శత్రవః = శత్రువులు, ద్రవ్యైః = వస్తువులతో, పూజితాః = పూజించబడినారో.

తా. అప్పుడు రావణు డిట్లు పలికెను-"ఈ చేసిన పని మంచిది కాదు; ఎందుచేత ననగా మన శత్రువులైన ఇంద్రాదులను ఆ యా ద్రవ్యములు సమర్పించి పూజించినారు. 14

మూ. ఏహీదానీం కృతం యద్ధి తదకర్తుం న శక్యతే,
ఆగచ్ఛ సౌమ్య గచ్ఛామః స్వమేవ భవనం ప్రతి. 15

ప్ర. అ. ఏహి=రమ్ము. యత్=ఏది, కృతమ్ = చేయబడినదో, తత్= అది, ఇదానీమ్=ఇప్పుడు, అకర్తుమ్ = చేయకుండుటకు (మార్చుటకు), న శక్యతే హి=శక్యము కాదు కదా. సౌమ్య = సౌమ్యుడా! ఆగచ్ఛ = రమ్ము. స్వమ్= తమసంబంధమైన, భవనం ప్రతి = గృహమునుగూర్చి, గచ్ఛామః = వెళ్లదము.

తా. సౌమ్యుడా! రమ్ము; జరిగిపోయినదానిని మార్చజాలము కదా? మన గృహమునకు వెళ్ళుదము; రమ్ము. 15

మూ. తతో గత్వా దశగ్రీవః సపుత్రః సవిభీషణః,
స్త్రియోఽవతారయామాస సర్వాస్తా బాష్పగద్గదాః. 16

ప్ర. అ. తతః = ఆటుపిమ్మట, దశగ్రీవః=రావణుడు, సపుత్రః = పుత్రసహితుడై, సవిభీషణః = విభీషణసహితుడై, గత్వా = వెళ్ళి, బాష్పగద్గదాః = కన్నీటితో గద్గదస్వరము గల, తాః=ఆ, సర్వాః=సమస్తమైన, స్త్రియః=స్త్రీలను, అవతారయామాస = క్రిందికి దింపెను.

తా. పిమ్మట రావణుడు పుత్రునితోను, విభీషణునితోను కలిసి వెళ్ళి కన్నీటితో డగ్గుత్తిక చెంది ఉన్న ఆ స్త్రీలను అందరినీ విమానమునుండి దింపెను. 16

మూ. లక్షిణ్యో రత్నభూతాశ్చ దేవదానవరక్షసామ్,
తస్య తాసు మతిం జ్ఞాత్వా ధర్మాత్మా వాక్యమబ్రవీత్.

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ముడైన విభీషణుడు, లక్షిణ్యః=ఉత్తమ లక్షణములు గలవారు, దేవదానవరక్షసామ్ = దేవదానవరాక్షసులలో, రత్నభూతాః చ = రత్నములూ అయిన, తాః = ఆ స్త్రీలను, (చూచి), తాసు = వాళ్ళ విషయమునందు, తస్య=వానియొక్క, మతిమ్=అభిప్రాయమును, జ్ఞాత్వా=తెలిసికొని, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. ధర్మాత్ముడైన విభీషణుడు దేవదానవరాక్షసులలో రత్నములైన, సర్వలక్షణ సంపన్నలైన ఆ స్త్రీలను చూచి, వాళ్ళ విషయమునందు రావణుని అభిప్రాయము తెలిసికొని ఇట్లు పలికెను. 17

మూ. ఈదృశైస్త్వం సమాచారైర్యశోర్థకులనాశనైః,
దర్షణం ప్రాణినాం జ్ఞాత్వా స్వమతేన విచేష్టసే. 18

ప్ర. అ. త్వమ్ = నీవు, జ్ఞాత్వా = తెలిసి కూడ, యశోర్థకులనాశనైః = యశస్సును, ధనమును, కులమును నశింపచేయు, ఈదృశైః = ఇట్టి; సమాచారైః = ప్రవర్తనలచేత, స్వమతేన = తన ఇష్టముచేత, ప్రాణినామ్ = ప్రాణులయొక్క, ధర్షణమ్ = పీడను, విచేష్టసే = చేయుచున్నావు.

తా. నీవు కీర్తిని, అర్థమును, కాలమునూ నశింపచేసే ఈ విధమైన ప్రవృత్తిని అవలంబించి, మంచిచెడ్డలు తెలిసి ఉండి కూడ ఇష్టము వచ్చినట్లు ప్రాణులను హింసించుచున్నావు. 18

మూ. జ్ఞాతీంస్తాన్దర్షయిత్వేమాం స్త్వయానీతా వరాఙ్గనాః,
త్వామతిక్రమ్య మధునా రాజన్ కుమ్భీనసీ హృతా. 19

ప్ర. అ. రాజన్ = రాజా! తాన్ = ఆ, జ్ఞాతీన్ = జ్ఞాతులను, ధర్షయిత్వా = పీడించి, త్వయా = నీచేత, వరాఙ్గనాః = శ్రేష్ఠలైన స్త్రీలు, ఆనీతాః = తీసికొని రాబడినారు. త్వామ్ = నిన్ను, అతిక్రమ్య = అతిక్రమించి, మధునా = మధువుచేత, కుమ్భీనసీ = కుంభీనసి, హృతా = హరించబడినది.

తా. రాజా! నీవు వీరి బంధువులను పీడించి ఈ స్త్రీలను తీసికొనివచ్చినావు. మధువు నిన్ను లెక్కచేయక కుంభీనసిని హరించినాడు. 19

మూ. రావణస్త్వబ్రవీద్వాక్యం నావగచ్ఛామి కిం త్విదమ్,
కోఽయం యస్తు త్వయాఖ్యాతో మధురిత్యేవ నామతః.

ప్ర. అ. రావణః తు = రావణుడైతే, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. ఇదమ్ = ఇది, కిం తు = ఏమో, త్వయా = నీచేత, ఆఖ్యాతః = చెప్పబడిన, నామతః = పేరుచేత, మధురితి ఏవ = మధువు అను, అయమ్ = ఇతడు, కః = ఎవరో, నావగచ్ఛామి = తెలుసుకొనజాలకున్నాను.

తా. రావణుడు అది విని-"ఏమి జరిగినదో, నీవు చెప్పుచున్న మధువు అనే వాడు ఎవడో నాకు అర్థము కాలేదు"అని పలికెను. 20

మూ. విభీషణస్తు సంక్రుద్ధో భ్రాతరం వాక్యమబ్రవీత్,
శ్రూయతామస్య పాపస్య కర్మణః ఫలమాగతమ్. 21

ప్ర. అ. విభీషణస్తు=విభీషణుడైతే, సంక్రుద్ధః = కోపించినవాడై, భ్రాతరమ్=సోదరుణ్ణిగూర్చి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను. అస్య=ఈ, పాపస్య కర్మణః = పాపకర్మయొక్క, ఆగతమ్ = వచ్చిన, ఫలమ్ = ఫలము, శ్రూయతామ్=వినబడుగాక.

తా. విభీషణుడు కోపముతో సోదరునితో ఇట్లు పలికెను-"నీవు చేయుచున్న పాపకర్మకు ఎట్టి ఫలము సంప్రాప్తించినదో వినుము." 21

మూ. మాతామహస్య యోఽస్మాకం జ్యేష్ఠో భ్రాతా సుమాలినః,
మాల్యవానితి విఖ్యాతో వృద్ధః ప్రాజ్ఞో నిశాచరః. 22

పితా జ్యేష్ఠో జనన్యా నో హ్యస్మాకం చార్యకోఽభవత్,
తస్య కుమ్భీనసీ నామ దుహితుర్దుహితాభవత్. 23

ప్ర. అ. అస్మాకమ్ = మనయొక్క, మాతామహస్య = మాతామహుడైన, సుమాలినః = సుమాలియొక్క, జ్యేష్ఠః = పెద్ద, భ్రాతా = సోదరుడైన, మాల్యవానితి = మాల్యవంతుడు అని, విఖ్యాతః = ప్రసిద్ధుడైన, ప్రాజ్ఞః=బుద్ధిశాలియైన, యః నిశాచరః = ఏ రాక్షసుడు, నః = మనయొక్క, జనన్యాః = తల్లియొక్క, జ్యేష్ఠః పితా = పెదతండ్రి, అస్మాకమ్ = మనయొక్క, ఆర్యకః = పూజ్యుడూ, అభవత్ = ఆయెనో, తస్య = ఆతనియొక్క, దుహితుః = కుమార్తెయొక్క, దుహితా = కుమార్తెయైన, కుమ్భీనసీ నామ = కుంభీనసి అను పేరు గంది, అభవత్ = ఉండెను.

తా. మన మాతామహుడైన సుమాలికి అన్న, మన తల్లికి పెదతండ్రి, మనకు పూజ్యుడూ అయిన మాల్యవంతు డని ప్రసిద్ధి చెందిన బుద్ధిశాలియైన రాక్షసుని కుమార్తెకు కుమార్తె అయిన (దౌహిత్రి) కుంభీనసి ఉన్నది కదా. 22, 23

మూ. మాతృష్వసురథాస్మాకం సా చ కన్యానలోద్భవా,
భవత్యస్మాకమేవైషా భ్రాతౄణాం ధర్మతః స్వసా. 24

ప్ర. అ. అథ = మరియు, అస్మాకమ్ = మనయొక్క, మాతృష్వసుః = తల్లి సోదరియొక్క, కన్యా = కన్యయైన, అనలోద్భవా = అనలనుండి పుట్టిన, సా = ఆ, ఏషా = ఈమె, భ్రాతౄణామ్ = సోదరులమైన, అస్మాకమ్ = మనకు, ధర్మతః = ధర్మమువలన, స్వసా ఏవ = సోదరియే, భవతి = అగును.

తా. మన తల్లి సోదరియైన అనల కుమార్తె యైన ఆ కుంభీనసి సోదరుల మైన మనకు అందరికీ వరసకు చెల్లెలు అగును. 24

మూ. సా హృతా మధునా రాజన్ రాక్షసేన బలీయసా,
యజ్ఞప్రవృత్తే పుత్రే తు మయి చాన్తర్జలోషితే. 25

ప్ర. అ. రాజన్ = రాజా ! పుత్రే = నీ పుత్రుడైన మేఘనాదుడు, యజ్ఞ ప్రవృత్తే = యజ్ఞమునందు ప్రవర్తించినవా డగుచుండగా, మయి చ = నేను, అన్తర్జలోషితే = నీటిలో నివసించి ఉండగా, సా = ఆమె, బలీయసా = బలవంతు డైన, రాక్షసేన = రాక్షసుడైన, మధునా = మధువుచేత, హృతా = హరించబడినది.

తా. రాజా ! మేఘనాదుడు యజ్ఞము చేయుచుండగా, నేను తపస్సు నిమిత్తము జలములో మునిగి ఉండగా బలవంతుడైన మధువు అను రాక్షసుడు ఆమెను హరించినాడు. 25

మూ కుమ్భకర్ణో మహారాజ నిద్రామనుభవత్యథ,
నిహత్య రాక్షసశ్రేష్ఠానమాత్యానిహ సంమతాన్. 26
ధర్షయిత్వా హృతా రాజన్ గుప్తాప్యన్తఃపురే తవ.

ప్ర అ మహారాజ = మహారాజా ! కుమ్భకర్ణః = కుంభకర్ణుడు, నిద్రామ్ = నిద్రను, అనుభవతి = అనుభవించుచున్నాడు. అథ = అటుపిమ్మట, రాజన్ = రాజా! ఇహ = ఇక్కడ, సంమతాన్ = పూజింపబడిన, రాక్షసశ్రేష్ఠాన్ = రాక్షసశ్రేష్ఠులైన, అమాత్యాన్ = మంత్రులను, నిహత్య = చంపి, తవ = నీయొక్క, అన్తః పురే = అంతఃపురమునందు, గుప్తాపి = రక్షింపబడినదైనను ఆమె, ధర్షయిత్వా = బలాత్కరించి, హృతా = హరించబడినది.

తా. మహారాజా! ఆ సమయమునందు కుంభకర్ణుడు నిద్రించుచుండెను. అప్పుడు మధువు గౌరవింపదగిన రాక్షసశ్రేష్ఠులైన అమాత్యులను చంపి నీ అంతఃపురములో రక్షింపబడుచున్నా కూడ ఆమెను బలాత్కారముగా అపహరించెను.

మూ. శ్రుత్వాపి తన్మహారాజ క్షాన్తమేవ హతో న సః, 27
యస్మాదవశ్యం దాతవ్యా కన్యా భర్త్రే హి భ్రాతృభిః.

ప్ర. అ. మహారాజ = మహారాజా! తత్ = దానిని, శ్రుత్వాపి = విని కూడ, క్షాన్తమ్ ఏవ = క్షమించబడినది. సః = అతడు, న హతః = చంపబడ లేదు, యస్మాత్ = ఎందువలన అనగా, కన్యా = కన్య, భ్రాతృభిః = సోదరుల చేత, అవశ్యమ్ = తప్పక, భర్త్రే = భర్తకొరకు, దాతవ్యా హి = ఇవ్వదగినది కదా ?

తా. మహారాజా! ఈ విషయము తెలిసిన తరవాత కూడ మేము క్షమించినాము. ఆతనిని చంపలేదు. సోదరులు కన్యను ఏ నాటికైనను భర్తకు ఇవ్వవలసినదే కదా ? 27

మూ. తదేతత్కర్మణో హ్యస్య ఫలం పాపస్య దుర్మతేః, 28
అస్మిన్నేవాభిసంప్రాప్తం లోకే విదితమస్తు తే.

ప్ర. అ. దుర్మతేః = చెడ్డ బుద్ధి గల నీయొక్క, అస్య = ఈ, పాపస్య కర్మణః = పాపకర్మయొక్క, తత్ ఏతత్ = అట్టి ఈ, ఫలమ్ = ఫలము, అస్మిన్ = ఈ, లోకే ఏవ = లోకమునందే, సంప్రాప్తమ్ = వచ్చినది. తే = నీకు, విదితమ్ = తెలియబడినది, అస్తు = అగుగాక.

తా. దుర్మతివైన నీవు చేయుచున్న పాపకర్మలకు ఫలితముగా ఇది ఈలోకములో (జన్మలో)నే వచ్చినది అను విషయము తెలిసికొనుము. 28

మూ. విభీషణవచః శ్రుత్వా రాక్షసేన్ద్రః స రావణః, 29
దౌరాత్మ్యేనాత్మనోద్ధూతస్తప్తామ్బు ఇవ సాగరః

ప్ర. అ. రాక్షసేన్ద్రః = రాక్షసరాజైన, సః రావణః = ఆ రావణుడు, విభీషణవచః = విభీషణుని వచనమును, శ్రుత్వా = విని, ఆత్మనా = తనచేత

చేయబడిన, దౌరాత్మ్యేన = దుష్టత్వముచేత, ఉద్ధూతః = కదల్చివేయబడినవాడై, తప్తాంబుః = కాచబడిన నీళ్ళు గల, సాగరః ఇవ = సముద్రము వలె ఆయెను.

తా. రాక్షసరాజైన ఆ రావణుడు విభీషణుని మాటలు విని, తాను చేసిన చెడ్డపనులచేత పీడింపబడి, మరుగుచున్న నీళ్ళు గల సముద్రము వలె అయెను. 29

మూ. తతోఽబ్రవీద్దశగ్రీవః క్రుద్ధః సంరక్తలోచనః, 30
కల్ప్యతాం మే రథః శీఘ్రం శూరాః సజ్జీభవన్తు నః.,

ప్ర. అ. తతః = అటుపిమ్మట, క్రుద్ధః = కోపించిన, సంరక్తలోచనః = ఎఱ్ఱనైన నేత్రములు గల, దశగ్రీవః = రావణుడు, అబ్రవీత్ = పలికెను, మే = నాయొక్క, రథః = రథము, శీఘ్రమ్ = శీఘ్రముగా, కల్ప్యతామ్ = ఏర్పరుపబడుగాక; నః = మనయొక్క, శూరాః = శూరులు; సజ్జీభవన్తు = సిద్ధ మగుదురుగాక.

తా. అప్పుడు కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములు గల రావణుడు ఇట్లు పలికెను. "శీఘ్రముగా నా రథమును సిద్ధము చేయుడు. మన శూరులు సిద్ధమగుదురు గాక". 30

మూ. భ్రాతా మే కుమ్భకర్ణశ్చ యే చ ముఖ్యా నిశాచరాః, 31
వాహనాన్యధిరోహన్తు నానాప్రహరణాయుధాః.

ప్ర. అ. మే భ్రాతా = నా సోదరుడైన, కుమ్భకర్ణశ్చ = కుంభకర్ణుడు, ముఖ్యాః = ముఖ్యులైన, యే నిశాచరాః = ఏ రాక్షసు లున్నారో వాళ్ళు, నానా ప్రహరణాయుధాః = అనేకవిధములైన కొట్టుటకు ఉపయోగించే ఆయుధములు గలవారై, వాహనాని = వాహనములను, అధిరోహన్తు = ఎక్కెదరుగాక.

తా. నా సోదరుడైన కుంభకర్ణుడు, ప్రధానులైన రాక్షసులు వివిధములైన ఆయుధములు ధరించి వాహనములను ఎక్కెదరుగాక. 31

మూ. అద్య తం సమరే హత్వా మధుం రావణనిర్భయమ్, 32
సురలోకం గమిష్యామి యుద్ధాకాఙ్క్షీ సుహృద్వృతః.

ప్ర. అ. అద్య = ఇప్పుడు, రావణనిర్భయమ్ = రావణునినుండి భయము

లేని, తం మధుమ్ = ఆ మధువును, సమరే = యుద్ధమునందు, హత్వా = చంపి, సుహృద్వృతః = స్నేహితులతో కూడినవారనై, యుద్ధాకాఙ్క్షీ = యుద్ధమును కోరుచున్నవాడనై, సురలోకమ్ = దేవలోకమును గూర్చి, గమిష్యామి = వెళ్లెదను.

తా. "రావణునికి భయపడక అట్టి దుష్కార్యము చేసిన మధువును ఇప్పుడు యుద్ధములో చంపి, స్నేహితులతో కలిసి యుద్ధానికై దేవలోకమునకు వెళ్లెదను." 32

మూ. అక్షౌహిణీసహస్రాణి చత్వార్యగ్ర్యాణి రక్షసామ్, 33
నానాప్రహరణాన్యాశు నిర్యయుర్యుద్ధకాఙ్క్షిణామ్.

ప్ర. అ. యుద్ధకాఙ్క్షిణామ్ = యుద్ధమును కోరుచున్న, రక్షసామ్ = రాక్షసుల యొక్క, నానాప్రహరణాని = అనేకవిధములైన ఆయుధములు గల, అగ్ర్యాణి = శ్రేష్ఠములైన, చత్వారి = నాలుగు, అక్షౌహిణీసహస్రాణి = అక్షౌహిణుల సహస్రములు, ఆశు = శీఘ్రముగా, నిర్యయుః = బయలుదేరినవి.

తా. అప్పుడు శ్రేష్ఠములైన నాలుగువేల అక్షౌహిణుల రాక్షససైన్యము అనేకవిధములైన ఆయుధములు ధరించి యుద్ధమునకు వెడలినవి. 33

మూ. ఇన్ద్రజిత్త్వగ్రతః సైన్యాత్సైనికాన్ పరిగృహ్య చ, 34
జగామ రావణో మధ్యే కుమ్భకర్ణశ్చ పృష్ఠతః.

ప్ర. అ. ఇన్ద్రజిత్తు = ఇంద్రజిత్తైతే, సైనికాన్ = సైనికులను, పరిగృహ్య = గ్రహించి, సైన్యాత్ = సైన్యముకంటె, అగ్రతః = ఎదుట, జగామ = వెళ్లెను. రావణః = రావణుడు, మధ్యే = మధ్యయందు, కుమ్భకర్ణః చ = కుంభకర్ణుడు, పృష్ఠతః = వెనుక, వెళ్లెను.

తా. ఇంద్రజిత్తు కొందరు సైనికులతో సైన్యానికి ముందు వెళ్లెను. రావణుడు సైన్యమధ్యమునందు, కుంభకర్ణుడు సైన్యానికి వెనుక భాగమునందు ఉండెను. 34

మూ. విభీషణశ్చ ధర్మాత్మా లఙ్కాయాం ధర్మమాచరన్, 35
శేషాః సర్వే మహాభాగా యయుర్మధుపురం ప్రతి.

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడైన, విభీషణః చ = విభీషణుడు, లఙ్కా

యామ్ = లంకయందు, ధర్మమ్=ధర్మమును, ఆచరన్=ఆచరించుచు ఉండెను. శేషాః=మిగిలిన, సర్వే = సమస్తమైన, మహాభాగాః=మహానుభావులు, మధుపురం ప్రతి = మధుపురమును గూర్చి, యయుః = వెళ్ళిరి.

తా. ధర్మాత్ముడైన విభీషణుడు ధర్మము పాలించుచు లంకలోనే ఉండి పోయెను. మిగిలిన మహానుభావులైన రాక్షసులు మధువు నివసించు పురమునకు వెళ్ళిరి. 35

మూ. ఖరైరుష్ట్రైర్హయైర్దీప్తైః శింశుమారైర్మహోరగైః, 36
రాక్షసాః ప్రయయుః సర్వే కృత్వాకాశం నిరన్తరమ్.

ప్ర. అ. సర్వే = సమస్తమైన, రాక్షసాః=రాక్షసులు, ఆకాశమ్ = ఆకాశమును, నిరన్తరమ్ = అవకాశము లేనిదానినిగా, కృత్వా = చేసి, ఖరైః = గాడిదలతోను, ఉష్ట్రైః = ఒంటెలతోను, హయైః = గుఱ్ఱములతోను, దీప్తైః = ప్రకాశించుచున్న, శింశుమారైః=శింశుమారములతోను, మహోరగైః=మహాసర్పములతోను, ప్రయయుః = వెళ్ళిరి.

తా. ఆ రాక్షసులందరూ ఆకాశమునందు అవకాశము లేకుండు నట్లు చేయుచు, గాడిదలు, ఒంటెలు, గుఱ్ఱములు, ప్రకాశించుచున్న శింశుమారములు (మొసళ్లు) మహాసర్పములు ఎక్కి వెళ్ళిరి. 36

మూ. దైత్యాశ్చ శతశస్తత్ర కృతవైరాశ్చ దైవతైః, 37
రావణం ప్రేక్ష్య గచ్ఛన్తమన్వగచ్ఛన్తి పృష్ఠతః.

ప్ర. అ. దైవతైః=దేవతలతో, కృతవైరాః= చేయబడిన వైరము గల, దైత్యాశ్చ = దైత్యులు కూడ, శతశః = వందలకొలది, తత్ర = అక్కడ, గచ్ఛన్తమ్ = వెళ్ళుచున్న, రావణమ్ = రావణుని, ప్రేక్ష్య = చూచి, పృష్ఠతః = వెనుకనే, అన్వగచ్ఛన్తి = అనుసరించినారు.

తా. దేవతలతో వైరము పెట్టుకొని ఉన్న వందలకొలది దైత్యులు కూడ, అక్కడ వెళ్ళుచున్న రావణుని చూచి ఆతని వెనుకనే వెళ్ళిరి. 37

మూ. స తు గత్వా మధుపురం ప్రవిశ్య చ దశాననః, 38
న దదర్శ మధుం తత్ర భగినీం తత్ర దృష్టవాన్.

ప్ర. అ. సః దశాననః = ఆ రావణుడు, మధుపురమ్ = మధువు నగరమును గూర్చి, గత్వా = వెళ్ళి, ప్రవిశ్య చ = ప్రవేశించి, తత్ర = అక్కడ, మధుమ్ = మధువును, న దదర్శ = చూడలేదు; తత్ర = అక్కడ, భగినీమ్ = సోదరిని, దృష్టవాన్ = చూచినాడు

తా. రావణుడు మధువు నగరమును చూచి, ప్రవేశించెను. అక్కడ ఆతనికి మధువు కనబడ లేదు, తన సోదరి కనబడెను. 38

మూ. సా చ ప్రహ్వాఞ్జలిర్భూత్వా శిరసా చరణౌ గతా, 39
తస్య రాక్షసరాజస్య త్రస్తా కుమ్భీనసీ తదా.

ప్ర. అ. తదా = అప్పుడు సా = ఆ, కుమ్భీనసీ = కుంభీనసి, త్రస్తా = భయపడినదై, ప్రహ్వాఞ్జలిః = వంగిన దోసిలికలదై, తస్య రాక్షసరాజస్య = ఆ రాక్షసరాజుయొక్క, చరణౌ = పాదములను, శిరసా = శిరస్సుతో, గతా = పొందినది.

తా. ఆ కుంభీనసి భయపడి అంజలి వంచి, ఆ రావణుని పాదములను తన శిరస్సుతో స్పృశించి నమస్కరించెను. 39

మూ. తాం సముత్థాపయామాస న భేతవ్యమితి బ్రువన్, 40
రావణో రాక్షసశ్రేష్ఠః కిం చాపి కరవాణి తే.

ప్ర. అ. రాక్షసశ్రేష్ఠః = రాక్షసశ్రేష్ఠుడైన రావణః = రావణుడు, న భేతవ్యమ్ = భయపడవద్దు, ఇతి = అని, బ్రువన్ = పలుకుచు, తామ్ = ఆమెను, సముత్థాపయామాస = లేవదీసెను. తే = నీకు, కిం కరవాణి = ఏమి చేయుదును (అని పలికెను.)

తా. రాక్షస శ్రేష్ఠుడైన రావణుడు "భయపడకుము"అని పలుకుచు ఆమెను లేవదీసి, "నీకు నే నేమి చెయవలెను ?"అని ప్రశ్నించెను. 40

మూ. సాబ్రవీద్యది మే రాజన్ ప్రసన్నస్త్వం మహాభుజ, 41
భర్తారం న మమేహాద్య హన్తుమర్హసి మానద.

ప్ర. అ. సా = ఆమె, అబ్రవీత్ = పలికెను, మహాభుజ = గొప్ప భుజ

ములు గలవాడా ! మానద=మానమును ఇచ్చువాడా ! రాజన్=రాజా ! త్వమ్=నీవు, మే = నాకు, ప్రసన్నః యది = ప్రసన్నుడవైనట్లయితే, అద్య = ఇప్పుడు, మమ=నాయొక్క, భర్తారమ్=భర్తను, హన్తుమ్=చంపుటకు, నార్హసి = తగవు.

తా. ఆమె ఇట్లు పలికెను - "మానమును సంరక్షించు మహాభుజుడవైన ఓ! రాజా ! నీవు నాయందు ప్రసన్నుడ వైనచో ఇప్పుడు నా భర్తను చంపకుము".

మూ. న హీదృశం భయం కించిత్ కులస్త్రీణామిహోచ్యతే, 42
భయానామపి సర్వేషాం వైధవ్యం వ్యసనం మహత్.

ప్ర. అ. కులస్త్రీణామ్ = కులస్త్రీలకు, ఈదృశమ్ = ఇట్టి, భయమ్ = భయము, కించిత్ = ఏదీ, ఇహ = ఈ లోకమునందు, న ఉచ్యతే హి = చెప్పబడదు కదా. వైధవ్యమ్=వైధవ్యము, సర్వేషామ్=సమస్తమైన, భయానామపి= భయములలో కూడ, మహత్ = గొప్ప, వ్యసనమ్ = వ్యసనము.

తా. "కులస్త్రీలకు ఈ లోకములో అన్ని భయములలోను వైధవ్యము అనేది గొప్ప వ్యసనము. ఇట్టి భయము మరొకటి లేదు అని అందురు కదా ?"

మూ. సత్యవాగ్భవ రాజేన్ద్ర మామవేక్షస్వ యాచతీమ్, 43
త్వయాప్యుక్తం మహాభాగ న భేతవ్యమితి స్వయమ్.

ప్ర. అ. రాజేన్ద్ర = ఓ రాజేంద్రా ! సత్యవాక్ = సత్యమైన వాక్కు గలవాడవు, భవ = అగుము. యాచతీమ్ = యాచించుచున్న, మామ్ = నన్ను, అవేక్షస్వ = చూడుము. మహాభాగ = మహాభాగ్యవంతుడా! న భేతవ్యమ్ ఇతి = భయపడవద్దు అని, స్వయమ్ = స్వయముగా, త్వయాపి = నీచేతనే, ఉక్తమ్= పలకబడినది.

తా. "ఓ ! రాజశ్రేష్ఠుడా ! ప్రతిమాలుచున్న నన్ను చూడుము. మహాభాగ్యవంతుడా ! "భయపడకుము" అని నీవే పలికినావుకదా ? నీ మాట నిలబెట్టుకొనుము". 43

మూ. రావణస్త్వ బ్రవీద్ధృష్టః స్వసారం తత్ర సంస్థితామ్, 44
క్వ చాసౌ తవ భర్తా వై మమ శీఘ్రం నివేద్యతామ్.

ప్ర. అ. రావణస్తు = రావణుడైతే, హృష్టః=సంతోషించినవాడై, తత్ర= అక్కడు, సంస్థితామ్=ఉన్న, స్వసారమ్=సోదరిని గూర్చి, అబ్రవీత్=పలికెను. తవ = నీయొక్క, భర్తా = భర్తయైన, అసౌ = ఈ మధువు, క్వ చ = ఎక్కడ. శీఘ్రమ్ = శీఘ్రముగా, మమ = నాకు, నివేద్యతామ్ = తెలుపబడుగాక.

తా. రావణుడు సంతోషించి అక్కడ నిలచి ఉన్న సోదరితో ఇట్లు పలికెను. "నీ భర్తయైన మధువు ఎక్కడ ? నాకు శీఘ్రముగా తెలుపుము." 44

మూ. సహ తేన గమిష్యామి సురలోకం జయాయ హి, 45
తవ కారుణ్యసౌహార్దాన్నివృత్తోఽస్మి మధోర్వధాత్.

ప్ర. అ. తేన సహ = వానితో కూడ, జయాయ = జయముకొరకు, సుర లోకమ్ = దేవలోకమును గూర్చి, గమిష్యామి = వెళ్లెదను. తవ = నీయొక్క, కారుణ్య సౌహార్దాత్ = జాలివలన, స్నేహమువలనా, మధోః = మధువుయొక్క, వధాత్ = వధనుండి, నివృత్తః = మరలినవాడను, అస్మి = అయి ఉన్నాను.

తా. "అతనితో కలిసి సురలోకమును జయించుటకు వెళ్లెదను; నీపై ఉన్న కరుణచేతను, స్నేహము చేతను ఆ మధువును చంపుట మానుకొన్నాను" 45

మూ. ఇత్యుక్తా తం సముత్థాప్య ప్రసుప్తం తం నిశాచరమ్, 46
అబ్రవీత్సంప్రహృష్టేవ రాక్షసీ సా పతిం వచః.

ప్ర. అ. ఇతి = ఇట్లు, ఉక్తా = పలకబడిన, సా రాక్షసీ=ఆరాక్షసి, ప్రసుప్తమ్ = నిద్రించిన, తం నిశాచరమ్ = ఆ రాక్షసుణ్ణి, సముత్థాప్య = లేపి, సంప్రహృష్టేవ = సంతోషించినదై, పతిమ్ = భర్తను గూర్చి, వచః = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. కుంభీనసి ఆ మాటలు విని సంతోషించి, నిద్రపోవుచున్న భర్తయైన మధువును మేల్కొలిపి, అతనితో ఇట్లనెను. 46

మూ. ఏష ప్రాప్తో దశగ్రీవో మమ భ్రాతా మహాబలః, 47
సురలోకజయాకాఙ్క్షీ సాహాయ్యే త్వాం వృణోతి చ.

ప్ర. అ. మహాబలః = గొప్ప బలము గల, మమ భ్రాతా = నా సోదరు

దైన, ఏషః = ఈ, దశగ్రీవః = రావణుడు, ప్రాప్తః = వచ్చినాడు. సురలోక జయాకాంక్షీ = సురలోకముయొక్క జయమును కోరుచున్న ఇతడు, త్వామ్ = నిన్ను, సాహాయ్యే = సాహాయ్యమునందు, వృణోతి చ = కోరుచున్నాడు కూడ

తా. "ఇదిగో మహాబలశాలియైన నా సోదరుడు రావణుడు వచ్చినాడు, సురలోకమును జయించగోరుచున్న ఇతడు నీ సాహాయ్యము కోరుచున్నాడు. 47

మూ. తదస్య త్వం సహాయార్థం సబన్ధుర్గచ్ఛ రాక్షస, 48
స్నిగ్ధస్య భజమానస్య యుక్తమర్థాయ కల్పితుమ్.

ప్ర. అ. రాక్షస = రాక్షసుడా! తత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, సబన్ధుః = బంధువులతో కూడినవాడవై, అస్య = ఈతనియొక్క, సహాయార్థమ్ = సహాయుడుగా ఉండుటకొరకు, గచ్ఛ = వెళ్లుము. భజమానస్య = సేవించుచున్న, స్నిగ్ధస్య = స్నేహముకలవానియొక్క, అర్థాయ = ప్రయోజనము కొరకు, కల్పితుమ్ = అగుటకు, యుక్తమ్ = యుక్తమైనది.

తా. అందువలన, ఓ! రాక్షసా! నీవు సపరివారముగా వెళ్ళి ఇతనికి సాహాయ్యము చేయుము. స్నేహము కలవారు కోరుచున్నప్పుడు వారికి ఉపకరించుట యుక్తము". 48

మూ. తస్యాస్తద్వచనం శ్రుత్వా తథేత్యాహ మధుర్వచః, 49
దదర్శ రాక్షసశ్రేష్ఠం యథాన్యాయముపేత్య సః,
పూజయామాస ధర్మేణ రావణం రాక్షసాధిపమ్. 50

ప్ర. అ. మధుః = మధువు, తస్యాః = ఆమెయొక్క, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, తథేతి = అట్లే అని, అహ = పలికెను; సః = అతడు, ఉపేత్య = వచ్చి, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, రాక్షసశ్రేష్ఠమ్ = రాక్షసరాజును, దదర్శ = చూచెను. రాక్షసాధిపమ్ = రాక్షసప్రభువైన, రావణమ్ = రావణుడ్ని, ధర్మేణ = ధర్మముచేత, పూజయామాస = పూజించెను.

తా. మధువు ఆమె మాటలు విని "అట్లే చేసెదను" అని పలికి, న్యాయానుసారముగా రావణునివద్దకు వచ్చి కలిసికొని, ఆ రాక్షసరాజును యథావిధిగా సత్కరించెను 49,50

మూ. ప్రాప్య పూజాం దశగ్రీవో మధువేశ్మని వీర్యవాన్,
తత్ర చైకాం నిశాముష్య గమనాయోపచక్రమే. 51

ప్ర. అ. వీర్యవాన్=పరాక్రమవంతుడైన, దశగ్రీవః = రావణుడు, మధువేశ్మని = మధువు ఇంటిలో, పూజామ్ = పూజను, ప్రాప్య = పొంది, తత్ర = అక్కడ. ఏకామ్ = ఒక, నిశామ్ = రాత్రిని, ఉష్య = నివసించి, గమనాయ = వెళ్ళుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. పరాక్రమవంతుడైన రావణుడు మధువు గృహములో సత్కారములు అందికొని, ఒక రాత్రి అక్కడ ఉండి వెళ్ళుటకు ప్రయాణ మాయెను. 51

మూ. తతః కైలాసమాసాద్య శైలం వైశ్రవణాలయమ్,
రాక్షసేన్ద్రో మహేన్ద్రాభః సేనాముపనివేశయత్. 52

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చవింశః సర్గః.

మహేన్ద్రాభః = మహేంద్రునివంటి కాంతి గల, రాక్షసేన్ద్రః=రావణుడు, తతః=అటుపిమ్మట, వైశ్రవణాలయమ్=కుబేరుని నివాసమైన, కైలాసం శైలమ్ = కైలాసపర్వతము ప, ఆసాద్య = చేరి, సేనామ్ = సేనను, ఉపనివేశయత్ = విడిదిచేయించెను.

తా. మహేంద్రునితో సమానుడైన రావణుడు పిమ్మట, కుబేరుని నివాసమైన కైలాసముచేరి అక్కడ సైన్యమును నిలిపెను.

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో ఇరువది యైదవ సర్గ సమాప్తము.

అథ షడ్వింశః సర్గః

[రావణుడు రంభను బలాత్కరించుట; నలకూబరుడు రావణుని శపించుట.]

మూ. స తు తత్ర దశగ్రీవః సహ సైన్యేన వీర్యవాన్,
అస్తం ప్రాప్తే దినకరే నివాసం సమరోచయత్. 1

ప్ర. అ. దినకరే = సూర్యుడు, అస్తమ్ = అస్తాద్రిని, ప్రాప్తే = పొందినవాడగుచుండగా, వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, సః దశగ్రీవః = ఆ రావణుడు, సైన్యేన సహ = సైన్యముతో కూడ, తత్ర = అక్కడ, నివాసమ్ = నివాసమును, సమరోచయత్ = ఇష్టపడెను.

తా. సూర్యుడు అస్తమించగానే పరాక్రమవంతుడైన ఆ రావణుడు సైన్యముతో అక్కడ నివసించుటకు ఇచ్ఛయించెను. 1

మూ. ఉదితే విమలే చన్ద్రే తుల్యపర్వతవర్చసి,
ప్రసుప్తం సుమహత్సైన్యం నానాప్రహరణాయుధమ్. 2

ప్ర. అ. తుల్యపర్వతవర్చసి = సమానమైన కైలాసపర్వతకాంతి గల, విమలే = స్వచ్ఛుడైన, చన్ద్రే = చంద్రుడు, ఉదితే = ఉదయించినవాడగుచుండగా, నానాప్రహరణా యుధమ్ = అనేకవిధములైన, శత్రువులను కొట్టే ఆయుధములు గల, సుమహత్ = చాల పెద్దదైన, సైన్యమ్ = సైన్యము, ప్రసుప్తమ్ = నిద్రించినది.

తా. తాము విడిసిన కైలాసపర్వతము వంటి కాంతి గల నిర్మలమైన చంద్రబింబము ఉదయించగానే అనేక విధములైన ఆయుధములు ధరించిన ఆ గొప్ప సైన్యము నిద్రించినది. 2

మూ. రావణస్తు మహావీర్యో నిషణ్ణః శైలమూర్ధని,
స దదర్శ గుణాంస్తత్ర చన్ద్రపాదోపశోభితాన్. 3

ప్ర. అ. శైలమూర్ధని=పర్వతశిఖరమునందు, నిషణ్ణః=కూర్చొని ఉన్న, మహావీర్యః=గొప్ప పరాక్రమము గల, సః రావణః తు=ఆ రావణుడైతే, తత్ర=అక్కడ, చన్ద్రపాదోపశోభితాన్=చంద్రుని కిరణములచేత ప్రకాశింపచేయబడిన, గుణాన్ = భోగ్యవస్తువులను, దదర్శ = చూచెను.

తా. పర్వతము పైభాగమున కూర్చొని ఉన్న మహాపరాక్రమవంతుడైన రావణుడు చంద్రకిరణములచేత ప్రకాశింపచేయబడిన ఆ పర్వతమునందలి భోగ్యవస్తువులను చూచెను. 3

మూ. కర్ణికారవనైర్దీప్తైః కదమ్బవకులైస్తథా,
పద్మినీభిశ్చ ఫుల్లాభిర్మన్దాకిన్యా జలైరపి. 4

చమ్పకాశోకపుంనాగ మన్దారతరుభిస్తథా,
చూతపాటలలోధ్రైశ్చ ప్రియఙ్గ్వర్జునకేతకైః. 5

తగరైర్నారికేలైశ్చ ప్రియాలపనసైస్తథా,
ఏతైరన్యైశ్చ తరుభిరుద్భాసితవనాన్తరే. 6

కింనరా మదనేనార్తా రక్తా మధురకణ్ఠినః,
సమం సంప్రజగుర్యత్ర మనస్తుష్టివివర్ధనమ్. 7

ప్ర. అ. యత్ర = ఏ కైలాసపర్వతమునందు, దీప్తైః=ప్రకాశించుచున్న, కర్ణికారవనైః = కర్ణికారవృక్షముల వనములచేతను, తథా = మరియు, కదమ్బవకులైః = కదంబవకులవృక్షములచేతను, ఫుల్లాభిః=వికసించిన, పద్మినీభిశ్చ = పద్మలతలచేతను, మన్దాకిన్యాః = మందాకినీనదియొక్క, జలైరపి = జలముల చేతను, తథా = మరియు, చమ్పకాశోక పుంనాగమన్దారతరుభిః = చంపక-అశోక-పుంనాగ-మందార వృక్షములచేతను, చూతపాటలలోధ్రైశ్చ=చూత-పాటల-లోధ్ర వృక్షములచేతను, ప్రియఙ్గ్వర్జున కేతకైః = ప్రియంగు-అర్జునవృక్షములచేతను, మొగలిపొదలచేతను, తగరైః = తగరవృక్షములచేతను, నారికేలైః చ = కొబ్బరి చెట్ల చేతను, తథా = మరియు, ప్రియాలపనసైః=ప్రియాలవృక్షములచేతను, పనస వృక్షములచేతను, ఏతైః = వీటిచేతను, అన్యైః చ = ఇతరములైన, తరుభిః = వృక్షములచేత, ఉద్భాసితవనాన్తరే = ప్రకాశింపచేయబడిన వనమధ్యమునందు,

రక్తాః = అనురాగవంతులైన, మధురకంఠినః = మధురమైన కంఠస్వరము గల, కింనరాః = కింనరులు, మదనేన = మన్మథునిచేత, ఆర్తాః = పీడింపబడినవారై, సమమ్ = తమ స్త్రీలతో కూడ, మనస్తుష్టివివర్ధనమ్ = మనస్సుకు ప్రీతిని వృద్ధి పొందించునట్లుగా, సంప్రజగుః = గానము చేసిరో.

తా. ఆ కైలాసపర్వతమునందున్న వనప్రాంతములు ప్రకాశించుచున్న కర్ణికారవనములతోను, కదంబ-వకుల వృక్షములతోను, వికసించిన పద్మలతలతోను, మందాకినీ జలములతోను, చంపక-అశోక-పుంనాగ-మందార-చూత-పాటల-లోధ్ర-ప్రియంగు-అర్జున-కేతక-తగర-నారికేల-ప్రియాల-పనసవృక్షములతోను, ఇంకా ఇతరవృక్షములతోను, ప్రకాశించుచుండెను. అట్టి వనప్రాంతములలో మధురమైన కంఠస్వరము గల అనురాగవంతులైన కింనరులు మన్మథపీడితులై తమ ప్రియురాళ్ళతో కూడ మనస్సుకు ఆనందము కలుగునట్లుగా గానము చేయుచుండిరి.

మూ. విద్యాధరా మదక్షీబా మదరక్తాన్తలోచనాః,
యోషిద్భిః సహ సంక్రాన్తాశ్చిక్రీడుర్జహృషుశ్చ వై. 8

ప్ర. అ. విద్యాధరాః = విద్యాధరులు, మదక్షీబాః = మదముచేత మత్తులై, మదరక్తాన్తలోచనాః = మదముచేత ఎఱ్ఱనైన అంతములు గల నేత్రములు గలవారై, యోషిద్భిః సహ = స్త్రీలతో కూడ, సంక్రాన్తాః = కలిసినవారై, చిక్రీడుః = క్రీడించిరి. జహృషుః చ వై = సంతోషించిరి కూడ.

తా. విద్యాధరులు మదముచేత మత్తులై, మదముచేత ఎఱ్ఱనైన నేత్రాంతములు కలవారై స్త్రీలను కలిసి క్రీడించిరి; ఆనందించిరి. 8

మూ. ఘణ్టానామివ సంనాదః శుశ్రువే మధురస్వనః,
అప్సరోగణసంఘానాం గాయతాం ధనదాలయే. 9

ప్ర. అ. ధనదాలయే = కుబేరుని గృహమునందు, గాయతామ్ = గానము చేయుచున్న, అప్సరోగణసంఘానామ్ = అప్సరః స్త్రీలగణములతో కూడిన సంఘములయొక్క, మధురస్వనః = మధురధ్వని, ఘణ్టానామివ = ఘంటల ధ్వని వలె, శుశ్రువే = వినబడెను.

తా. కుబేరుని భవనములో గానము చేయుచున్న అప్సరఃస్త్రీసంఘాల మధురధ్వని ఘంటానినాదము వలె వినబడెను. 9

మూ. పుష్పవర్షాణి ముఞ్చన్తో నగాః పవనతాడితాః,
శైలం తం వాసయన్తీవ మధుమాధవగన్ధినః. 10

ప్ర. అ. పవనతాడితాః = వాయువుచేత కొట్టబడినవై, పుష్పవర్షాణి = పుష్పవర్షములను, ముఞ్చన్తః = విడచుచున్న, మధుమాధవగన్ధినః = మధువుతో కూడిన వసంతుని గంధముగల, నగాః = వృక్షములు, తం శైలమ్ = ఆ పర్వతమును, వాసయన్తీవ = సుగంధము కలదానినిగా చేయుచున్నట్లున్నవి.

తా. గాలికి కదలుచు పుష్పములు కురియుచున్న, మకరందముతో కూడిన వసంతర్తువు సుగంధము గల వృక్షములు ఆ పర్వతమునకు సువాసన కలిగించుచున్నట్లు ఉండెను. 10

మూ. మధుపుష్పరజఃపృక్తం గన్ధమాదాయ పుష్కలమ్,
ప్రవవౌ వర్ధయన్ కామం రావణస్య సుఖోఽనిలః. 11

ప్ర. అ. సుఖః = సుఖకరమైన, అనిలః = వాయువు, మధుపుష్పరజఃపృక్తమ్ = మకరందముతోను పుప్పొడితోను కూడిన, పుష్కలమ్ = అధికమైన, గన్ధమ్ = గంధమును, ఆదాయ = గ్రహించి, రావణస్య = రావణునియొక్క, కామమ్ = కామమును, వర్ధయన్ = వృద్ధిపొందించుచు, ప్రవవౌ = వీచెను.

తా. మకరందముతోను, పుప్పొడితోను కలిసిన అత్యధికమైన సువాసనతో నిండి సుఖకరముగ ఉన్న గాలి రావణునికి కామోద్రేకము కలిగించుచు వీచుచుండెను. 11

మూ. గేయాత్పుష్పసమృద్ధ్యా చ శైత్యాద్వాయోర్గిరేర్గుణాత్,
ప్రవృత్తాయాం రజన్యాం చ చన్ద్రస్యోదయనేన చ. 12

రావణః స మహావీర్యః కామస్య వశమాగతః,
వినిఃశ్వస్య వినిఃశ్వస్య శశినం సమవైక్షత. 13

ప్ర. అ. గేయాత్ = గానమువలనను, పుష్పసమృద్ధ్యా చ = పుష్పముల సమృద్ధిచేతను, వాయోః = వాయువుయొక్క, శైత్యాత్ = శైత్యమువలనను, గిరేః = పర్వతముయొక్క, గుణాత్ = సౌందర్యగుణమువలనను, రజన్యామ్ = రాత్రి,

ప్రవృత్తాయామ్ = ప్రారంభమైన దగుచుండగా, చన్ద్రస్య = చంద్రుని యొక్క, ఉదయనేన చ = ఉదయించుటచేతను, కామస్య = కామమునకు, వశమ్ = వశమును, ఆగతః = పొందిన, మహావీర్యః = గొప్ప పరాక్రమము గల, సః రావణః = ఆ రావణుడు, వినిఃశ్వస్య వినిఃశ్వస్య = నిట్టూర్చి నిట్టూర్చి, శశినమ్ = చంద్రుణ్ణి, సమవైక్షత = చూచెను.

తా. సంగీతము వినబడుచుండుటచేత, పుష్పసమృద్ధిచేత, వాయువు చల్లగా ఉండుటచేత, పర్వతసౌందర్యముచేత, రాత్రి ప్రారంభము కాగానే చంద్రుడు ఉదయించుటచేత మహాపరాక్రమవంతుడైన ఆ రావణుడు కామవశుడై మాటిమాటికి నిట్టూర్చుచు చంద్రుని వంక చూచుచుండెను. 12,13

మూ. ఏతస్మిన్నన్తరే తత్ర దివ్యాభరణభూషితా,
సర్వాప్సరోవరా రమ్భా పూర్ణచన్ద్రనిభాననా. 14

దివ్యచన్దనలిప్తాఙ్గీ మన్దారకృతమూర్ధజా,
దివ్యోత్సవకృతారమ్భా దివ్యపుష్పవిభూషితా. 15

చక్షుర్మనోహరం పీనం మేఖలాదామభూషితమ్
సముద్వహన్తీ జఘనం రతిప్రాభృతముత్తమమ్. 16

కృతైర్విశేషకైరార్ద్రైః షడర్తుకుసుమోద్భవైః
బభావన్యతమేవ శ్రీః కాన్తిశ్రీద్యుతికీర్తిభిః. 17

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యకాలములో, దివ్యాభరణభూషితా = దివ్యములైన అలంకారములచేత అలంకరింపబడినది, పూర్ణచన్ద్రనిభాననా = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలది, దివ్యచన్దనలిప్తాఙ్గీ = దివ్యమైన చందనముచేత పూయబడిన శరీరము గలది, మన్దారకృతమూర్ధజా = మందార పుష్పములచేత అలంకరించబడిన కేశములు గలది, దివ్యోత్సవకృతారమ్భా = దివ్యమైన సురతోత్సవముకొరకై చేయబడిన ఆరంభము కలది, దివ్యపుష్పవిభూషితా = దివ్యములైన పుష్పములచేత అలంకరించబడినది, చక్షుర్మనోహరమ్ = నేత్రములను మనస్సును ఆకర్షించు, మేఖలాదామభూషితమ్ = వడ్డాణముచేత అలంకరించబడిన, ఉత్తమం రతిప్రాభృతమ్ = ఉత్తమమైన రతికి కానుక యైన,

పీనమ్ = బలిసిన, జఘనమ్ = జఘనమును, సముద్వహన్తీ = మోయుచున్నదీ (కలిగి ఉన్నదీ), కృతైః = అప్పుడే చేయబడిన, ఆర్ద్రైః = తడిగా ఉన్న, విశేషకైః = తిలకములతోను, షడృతుకుసుమోద్భవైః = ఆరు ఋతువులకు సంబంధించిన పుష్పములనుండి పుట్టిన అలంకారములతోను కూడినదీ అయిన, సర్వాప్సరోవరా = అప్సరస లందరిలోను శ్రేష్ఠురాలైన, రమ్భా = రంభ, తత్ర = అక్కడ, కాన్తిశ్రీద్యుతికీర్తిభిః = కాంతిచేతను, శోభచేతను, లావణ్యముచేతను, అన్యా = మరియొక్క, శ్రీః ఇవ = లక్ష్మి వలె, బభౌ = ప్రకాశించెను.

తా. ఇంతలో అప్సరః స్త్రీలందరిలోను శ్రేష్ఠురాలైన రంభ అక్కడ ప్రకాశించెను (ప్రకాశించుచు కనబడెను). పూర్ణచంద్రుని వంటి ముఖము గల ఆమె దివ్యములైన ఆభరణములు అలంకరించుకొని, శరీరమునకు దివ్యమైన చందనము అలముకొని కేశపాశములో మందారపుష్పములు ధరించెను. దివ్యములైన పుష్పములు అలంకరించుకొని ఉన్న ఆమె అద్భుతమైన రత్యుత్సవమునకు సన్నాహము చేయుచుండెను. రతికై ఆమె సమర్పించు ఉత్తమోపాయనమైన, వస్త్రాభరణముచేత అలంకరింపబడిన బలిసిన జఘనము నేత్రములను మనస్సును ఆకర్షించునదై ఉండెను. ఆ యా ప్రదేశములలో అప్పుడే ఏర్పరచిన తిలకములు ఇంకను తడిగా ఉండెను. ఆరు ఋతువులకు సంబంధించిన పుష్పములతో నిర్మించిన అలంకారములు ధరించెను. కాంతిచేత, శోభచేత, లావణ్యముచేత, కీర్తిచేత ఆమె రెండవ లక్ష్మి వలె ఉండెను. 14-17

మూ. నీలం సతోయమేఘాభం వస్త్రం సమవగుణ్ఠితా,
యస్యా వక్త్రం శశినిభం భ్రువౌ చాపనిభే శుభే. 18

ఊరూ కరికరాకారౌ కరౌ పల్లవకోమలౌ
సైన్యమధ్యేన గచ్ఛన్తీ రావణేనోపలక్షితా. 19

ప్ర. అ. సతోయమేఘాభమ్ = నీటితో కూడిన మేఘము వంటి కాంతి గల, నీలమ్ = నల్లని, వస్త్రమ్ = వస్త్రమును, సమవగుణ్ఠితా = కప్పుకొన్నది. యస్యాః = ఏరంభయొక్క, వక్త్రమ్ = ముఖము, శశినిభమ్ = చంద్రునితో సమానమో; శుభౌ = సుందరములైన, భ్రువౌ = కనుబొమ్మలు, చాపనిభే = ధనస్సులతో సమానములో, ఊరూ = తొడలు, కరికరాకారౌ = ఏనుగు తొండము వంటి ఆకారము

గలవో, కరౌ = చేతులు, పల్లవకోమలౌ = చిగుళ్ళ వలె కోమలముగా ఉన్నవో అట్టి రంభ, సైన్యమధ్యేన = సైన్యముయొక్క మధ్యచేత, గచ్ఛన్తీ=వెళ్ళుచున్నదై, రావణేన = రావణునిచేత, ఉపలక్షితా = చూడబడినది.

తా. చంద్రుని వంటి ముఖము, ధనస్సువంటి అందమైన కనుబొమ్మలు, ఏనుగు తొండము వంటి తొడలు, చిగుళ్ళ వలె కోమలములైన హస్తములు గల ఆ రంభ నీటితో నిండిన మేఘము వంటి కాంతి గల నీలవస్త్రము మేలిముసుగు వేసికొని సైన్యమధ్యములో నడచి వెళ్లుచుండగా రావణుడు ఆమెను చూచెను. 18,19

మూ. తాం సముత్థాయ గచ్ఛన్తీం కామబాణవశం గతః,
కరే గృహీత్వా లజ్జన్తీం స్మయమానోఽభ్యభాషత. 20

ప్ర. అ. కామబాణవశమ్ = మన్మథబాణవశమును, గతః = పొందిన ఆ రావణుడు, సముత్థాయ = లేచి, గచ్ఛన్తీమ్ = వెళ్ళుచున్న, లజ్జన్తీమ్ = సిగ్గుపడుచున్న, తామ్=ఆమెను, కరే=హస్తము నందు, గృహీత్వా = గ్రహించి, స్మయమానః = నవ్వుచు, అభ్యభాషత = పలికెను.

తా. మన్మథబాణములకు వశుడైపోయిన ఆ రావణుడు లేచి అట్లు వెళ్ళుచున్న, సిగ్గుపడుచున్న ఆ రంభ చేయి పట్టుకొని నవ్వుచు ఇట్లనెను. 20

మూ. క్వ గచ్ఛసి వరారోహే కాం సిద్ధిం భజసే స్వయమ్,
కస్యాభ్యుదయకాలోఽయం యస్త్వాం సముపభోక్ష్యతే.

ప్ర. అ. వరారోహే = శ్రేష్ఠమైన కటిప్రదేశము గలదానా ! క్వ = ఎక్కడికి, గచ్ఛసి= వెళ్ళుచున్నావు ? కామ్=ఏ, సిద్ధిమ్=భోగసిద్ధిని గూర్చి, స్వయమ్ = స్వయముగా, భజసే = పొందుచున్నావు (పొందించుచున్నావు)? త్వామ్ = నిన్ను, యః = ఎవడు, సముపభోక్ష్యతే = అనుభవించగలడో, అట్టి, కస్య=ఎవనికి, అయమ్ = ఇది, అభ్యుదయ కాలః = అభ్యుదయమునకు కాలము ?

తా. అందమైన కటిప్రదేశము గలదానా ! నీవు ఎక్కడికి వెళ్లుచున్నావు ? నీవు స్వయముగా ఎవనికి భోగసిద్ధిని కూర్చుటకై వెళ్ళుచున్నావు ? ఇది నిన్ను అనుభవించనున్న ఎవనికి అభ్యుదయము కలిగే సమయము ? 21

మూ. త్వదాననరసస్యాద్య పద్మోత్పలసుగన్ధినః,
సుధామృతరసస్యేవ కోఽద్య తృప్తిం గమిష్యతి. 22

ప్ర. అ. అద్య = ఇప్పుడు, పద్మోత్పలసుగన్ధినః = పద్మముయొక్క, కలవయొక్క సుగంధము గల, సుధామృతరసస్యేవ = అమృతరసము వంటి, త్వదాననరసస్య = నీ ముఖరసముయొక్క, తృప్తిమ్ = తృప్తిని, కః = ఎవడు, గమిష్యతి = పొందగలడు ?

తా. పద్మము, కలవ వంటి సుగంధము గల, అమృతము వంటి నీ అధరామృతమును, ఆస్వాదించి ఇప్పుడు ఎవడు తృప్తి చెంద నున్నాడు ? 22

మూ. స్వర్ణకుమ్భనిభౌ పీనౌ శుభౌ భీరు నిరన్తరౌ,
కస్యోరఃస్థలసంస్పర్శం దాస్యతస్తే కుచావిమౌ. 23

ప్ర. అ. భీరు = భయస్వభావము గలదానా, స్వర్ణకుమ్భనిభౌ = బంగారు కుంభములతో సమానములు, శుభౌ = సుందరములు, నిరన్తరౌ = ఎడము లేనివి అయిన, ఇమౌ = ఈ, తే కుచౌ = నీ కుచములు, కస్య = ఎవనియొక్క, ఉరఃస్థలసంస్పర్శమ్ = వక్షఃస్థలస్పర్శను, దాస్యేతే = ఇవ్వగలవు?

తా. భయస్వభావము గలదానా! బంగారు కుంభముల వలె ఉన్న. బలిసిన, ఎడములేని ఈ నీ కుచములు ఎవని వక్షఃస్థలమును స్పృశించ నున్నవి? 23

మూ. సువర్ణచక్రప్రతిమం స్వర్ణదామచితం పృథు,
అధ్యారోక్ష్యతి కస్తేఽద్య జఘనం స్వర్గరూపిణమ్. 24

ప్ర. అ. సువర్ణచక్రప్రతిమమ్ = బంగారు చక్రముతో సమానము. స్వర్ణదామచితమ్ = బంగారు త్రాడుతో కూడినది, పృథు = విశాలము, స్వర్గరూపిణమ్ = స్వర్గమువంటి. తే జఘనమ్ = నీ జఘనమును, అద్య = ఇప్పుడు, కః = ఎవడు, అధ్యారోక్ష్యతి = ఆరోహించగలడు?

తా. బంగారువడ్డాణము అలంకరించి బంగారు చక్రము వలె ఉన్న విశాలమైన, స్వర్ణము వంటి నీ జఘనమును ఎవడు ఆరోహించ నున్నాడు? 24

మూ. మద్విశిష్టః పుమాన్ కోఽద్య శక్రో విష్ణురథాశ్వినౌ,
మామతీత్య హి యచ్ఛ త్వం యాసి భీరు న శోభనమ్. 25

ప్ర. అ. అద్య = ఇప్పుడు, మద్విశిష్టః = నాకంటె శ్రేష్ఠుడైన, పుమాన్ = పురుషుడు, కః = ఎవడు ? శక్రః = ఇంద్రుడా ? విష్ణుః = విష్ణువా ? అథ = లేక, అశ్వినౌ = అశ్వినీ దేవతలా ? భీరు = భయస్వభావముగలదానా ! త్వమ్ = నీవు, మామ్ = నను, అతీత్య = దాటి, యాసి ఇతి యత్ = వెళ్లుచున్నావు అనునది ఏది కలదో, అది, న శోభనమ్ = మంచిదికాదు.

తా. ఇప్పుడు నాకంటె గొప్పవాడు ఎవడున్నాడు ? ఇంద్రుడా ! విష్ణువా లేక అశ్వినీదేవతలా ? ఓ ! భయస్వభావముగలదానా ! నీవు నన్ను దాటి వెళ్లుచున్నావు; ఇది మంచి పనికాదు. 25

మూ. విశ్రమ త్వం పృథుశ్రోణి శిలాతలమిదం శుభమ్,
త్రైలోక్యే యః ప్రభుశ్చైవ మదన్యో నైవ విద్యతే. 26

ప్ర. అ. పృథుశ్రోణి = పెద్ద కటిప్రదేశము కలదానా ! త్వమ్ = నీవు, విశ్రమ = విశ్రమించుము. ఇదమ్ = ఈ, శిలాతలమ్=శిలాఫలకము, శుభమ్ = సుందరమైనది. యః = ఎవడు, ప్రభుః=సర్వసమర్థుడో అట్టి, మదన్యః=నాకంటె అన్యుడు, త్రైలోక్యే = మూడు లోకములందు, నైవ విద్యతే = లేడు.

తా. విశాలమైన కటిప్రదేశము గలదానా, సుందరమైన ఈ శిలాఫలకము మీద విశ్రమించుము. నేను తప్ప ఈ మూడులోకములలో ప్రభువైనవాడు ఎవ్వడూ లేడు. 26

మూ. తదేవం ప్రాఞ్జలిః ప్రహ్వో యాచతే త్వాం దశాననః,
భర్తుర్భర్తా విధాతా చ త్రైలోక్యస్య భజస్వ మామ్. 27

ప్ర. అ. తత్ = అందువలన, త్రైలోక్యస్య = మూడులోకముల సముదాయముయొక్క, భర్తుః = ప్రభువుకు, భర్తా = ప్రభువు, విధాతా చ = పాలకుడూ అయిన, దశాననః = రావణుడు, ప్రహ్వః = వంగినవాడై, ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలికలవాడై, త్వామ్ = నిన్ను, ఏవమ్= ఇట్లు, యాచతే=యాచించుచున్నాడు. మామ్ = నన్ను, భజస్వ = పొందుము.

తా. మూడు లోకముల ప్రభువునకు కూడ ప్రభువూ, మూడు లోకములకు పాలకుడూ అయిన రావణుడు వంగి నమస్కరించుచు నిన్ను ప్రార్థించుచున్నాడు. నన్ను పొందుము. 27

మూ. ఏవముక్తాబ్రవీద్రమ్భా వేపమానా కృతాఞ్జలిః,
ప్రసీద నార్హసే వక్తుమీదృశం త్వం హి మే గురుః. 28

ప్ర. అ. ఏవమ్=ఇట్లు, ఉక్తా=పలకబడిన, రమ్భా=రంభ, వేపమానా=వణకుచున్నదై, కృతాఞ్జలిః= చేయబడిన దోసిలికలదై, అబ్రవీత్ = పలికెను. ప్రసీద =అనుగ్రహించుము. ఈదృశమ్= ఇట్టి వాక్యమును, వక్తుమ్= చెప్పుటకు, నార్హసే = తగవు. త్వమ్= నీవు, మే = నాకు, గురుః హి = పూజ్యుడవు కదా?

తా. రంభ ఆ మాటలు విని వణకుచు అంజలి ఘటించి ఇట్లు పలికెను "నన్ను అనుగ్రహించుము. నీవు ఇట్లు పలుకుట తగదు. నీవు నాకు పూజ్యుడవు కదా?" 28

మూ. అన్యేభ్యోఽపి త్వయా రక్ష్యా ప్రాప్నుయాం ధర్షణం యది,
తద్ధర్మతః స్నుషా తేఽహం తత్త్వమేతద్బ్రవీమి తే. 29

ప్ర. అ. ధర్మతః= ధర్మమువలన, తే = నీయొక్క, స్నుషా = కోడలినైన, అహమ్=నేను, అన్యేభ్యః అపి=ఇతరులవలన కూడ, ధర్షణమ్=అవమానమును, ప్రాప్నుయాం యది=పొందినట్లయితే, త్వయా=నీచేత రక్ష్యా = రక్షింపదగినదానను. తే = నీకు, తత్త్వమ్= యథార్థమైన, ఏతత్=దీనిని, బ్రవీమి = చెప్పుచున్నాను.

తా. "ధర్మానుసారము నేను నీకు కోడలిని, నిజము చెప్పుచున్నాను. నన్ను ఎవరైన ఈ విధముగా అవమానింపచూచినచో నువ్వు నన్ను రక్షింపవలసినవాడవు". 29

మూ. అథాబ్రవీద్దశగ్రీవశ్చరణాధోముఖీం స్థితామ్,
రోమహర్షమనుప్రాప్తాం దృష్టమాత్రేణ తాం తదా. 30

ప్ర. అ. అథ=అటుపిమ్మట, దశగ్రీవః=రావణుడు, తదా = అప్పుడు,

దృష్టమాత్రేణ = చూచినంత మాత్రముచేతనే, రోమహర్షమ్ = రోమాంచమును, అనుప్రాప్తామ్ = పొందిన, చరణాధోముఖీమ్ = పాదముల వైపు క్రిందికి ముఖము కలదై, స్థితామ్ = నిలచిన, తామ్ = ఆమెకు గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. తనను చూడగానే భయముచేత ఒడలు గగుర్పొడిచి తల వంచి పాదముల వైపు చూచుచు నిలచి ఉన్న ఆమెతో రావణుడిట్లు పలికెను. 30

మూ. సుతస్య యది మే భార్యా తతస్త్వం హి స్నుషా భవేః,
బాఢమిత్యేవ సా రమ్భా ప్రాహ రావణముత్తరమ్. 31

ప్ర. అ. త్వమ్ = నీవు, మే = నాయొక్క, సుతస్య = కుమారునియొక్క, భార్యా యది = భార్యవైనట్లయితే, తతః హి = అప్పుడు మాత్రమే, స్నుషా = కోడలివి, భవేః హి = అగుదువు. సా రమ్భా = ఆ రంభ, బాఢమ్ ఇత్యేవ = తప్పక కోడలినే అని, రావణమ్ = రావణుని గూర్చి, ఉత్తరమ్ = జవాబును, ప్రాహ = పలికెను.

తా. "నీవు నా పుత్రుని భార్యవైతే కదా నాకు కోడలివి అగుదువు". ఆ మాట విని రంభ "తప్పక కోడలినే"అని ఆతనికి బదులు చెప్పెను. 31

మూ. ధర్మతస్తే సుతస్యాహం భార్యా రాక్షసపుంగవ,
పుత్రః ప్రియతరః ప్రాణైర్భ్రాతుర్వైశ్రవణస్య తే. 32
విఖ్యాతస్త్రిషు లోకేషు నలకూబర ఇత్యయమ్.

ప్ర. అ. రాక్షసపుంగవ = రాక్షసశ్రేష్ఠుడా! అహమ్ = నేను, ధర్మతః = ధర్మమువలన. తే సుతస్య = నీ కుమారునియొక్క. భార్యా = భార్యను తే భ్రాతుః = నీ సోదరుడైన, వైశ్రవణస్య = కుబేరునియొక్క, ప్రాణైః = ప్రాణములతో (కంటె), ప్రియతరః = ఎక్కువ ప్రియుడైన, పుత్రః = పుత్రుడైన, నలకూబరః ఇతి = నలకూబరుడు అను. అయమ్ = ఇతడు, త్రిషు లోకేషు = మూడు లోకములయందు, విఖ్యాతః = ప్రసిద్ధుడు.

తా. రాక్షసశ్రేష్ఠుడా! నేను ధర్మానుసారము నీ కుమారుడైనవాని భార్యను. నీ సోదరుడైన కుబేరునికి ప్రాణములకంటె కూడ ప్రియుడైన పుత్రుడైన నలకూబరుడు మూడు లోకములలో ప్రసిద్ధుడు. 32

మూ. ధర్మతో యో భవేద్విప్రః క్షత్రియో వీర్యతో భవేత్, 33
క్రోధాద్యశ్చ భవేదగ్నిః క్షాన్త్యా చ వసుధాసమః,
తస్యాస్మి కృతసంకేతా లోకపాలసుతస్య వై 34

ప్ర. అ. యః = ఎవడు, ధర్మతః = ధర్మమువలన, విప్రః = బ్రాహ్మణుడు, భవేత్ = అగునో, వీర్యతః = పరాక్రమమువలన, క్షత్రియః = క్షత్రియుడు, భవేత్ = అగునో, యః = ఎవడు, క్రోధాత్ = కోపమువలన, అగ్నిః = అగ్నిగా, భవేత్ = అగునో, క్షాన్త్యా = ఓర్పుచేత, వసుధాసమః చ = భూమితో సమానుడగునో, లోకపాలసుతస్య = కుబేరపుత్రుడైన, తస్య = వానికి, కృతసంకేతా = చేయబడిన సంకేతము గలదానను, అస్మి = అయి ఉన్నాను.

తా. నేను లోకపాలుడైన కుబేరుని కుమారుడైన ఆ నలకూబరునితో సంకేతము ఏర్పరచుకొని ఉన్నాను. అతడు ధర్మమునందు బ్రాహ్మణుడు. పరాక్రమమునందు క్షత్రియుడు. కోపము వచ్చినచో అగ్ని. ఓర్పుచేత భూమివంటివాడు.

మూ. తముద్దిశ్య తు మే సర్వం విభూషణమిదం కృతమ్,
యథా తస్య హి నాన్యస్య భావో మాం ప్రతి తిష్ఠతి, 35
తేన సత్యేన మాం రాజన్ మోక్తుమర్హస్యరిందమ.

ప్ర. అ. మే = నాయొక్క, ఇదమ్ = ఈ, సర్వమ్ = సమస్తమైన, విభూషణమ్ = అలంకారము, తమ్ = అతనిని, ఉద్దిశ్య = ఉద్దేశించి, కృతమ్ = చేయబడినది. అరిందమ = శత్రుసంహారకుడవైన, రాజన్ = రాజా ! తస్య = అతని యొక్క, భావః = భావము, మాం ప్రతి = నన్ను గూర్చి, యథా = ఎట్లు, తిష్ఠతి = ఉన్నదో, అన్యస్య = ఇతరునిగూర్చి, (నా భావము), న = లేదో, తేన = ఆ, సత్యేన = సత్యముచేత, మామ్ = నన్ను, మోక్తుమ్ = విడచుటకు, అర్హసి = తగి ఉన్నావు.

తా. నేను ఈ అలంకరణము అంతా అతనికోసమే చేసుకొన్నాను. శత్రుసంహారకుడవైన రాజా ! అతనికి నామీదనే ప్రేమ ఉన్నట్లు, నాకు కూడ అతని మీదనే ప్రేమ ఉన్నది. ఈ సత్యమును గ్రహించి నన్ను విడిచిపెట్టుము 35

మూ. స హి తిష్ఠతి ధర్మాత్మా మాం ప్రతీక్ష్య సముత్సుకః, 36
తత్ర విఘ్నం తు తస్యేహ కర్తుం నార్హసి ముఞ్చ మామ్.

ప్ర. అ. ధర్మాత్మా=ధర్మాత్ముడైన, సః=అతడు, సముత్సుకః= వేడుక గలవాడై, మామ్ = నన్ను, ప్రతీక్ష్య = ప్రతీక్షించి, తిష్ఠతి హి=ఉన్నాడు కదా? తత్ర = ఆ విషయమునందు, ఇహ = ఇక్కడ, తస్య = వానికి, విఘ్నమ్ = విఘ్నమును, కర్తుమ్ = చేయుటకు, నార్హసి=తగవు. మామ్ = నన్ను, ముఞ్చ= విడువుము.

తా. ధర్మాత్ముడైన ఆతడు ఆతురతతో నాకోసము ఎదురుచూచుచుండును. ఈ విషయమునందు ఆతనికి విఘ్నము చేయకుము. నన్ను విడిచిపెట్టుము. 36

మూ. సద్భిరాచరితం మార్గం గచ్ఛ రాక్షసపుంగవ, 37
మాననీయో మమ త్వం హి పాలనీయా తథాస్మి తే.

ప. అ. రాక్షసపుంగవ = రాక్షసశ్రేష్ఠుడా! సద్భిః = సత్పురుషులచేత, ఆచరితమ్ = నడవబడిన, మార్గమ్ = మార్గమును, గచ్ఛ = పొందుము. త్వమ్= నీవు, మమ = నాకు, మాననీయః హి = గౌరవింపదగినవాడవు కదా ? తథా = అట్లే, తే=నీకు, పాలనీయా=పాలింపదగినదానను, అస్మి=అయి ఉన్నాను.

తా. రాక్షసశ్రేష్ఠుడా! సత్పురుషులు అనుసరించిన మార్గమును అనుసరించుము. నీవు నాకు గౌరవింపదగినవాడవు. నేను నీకు పాలింపదగినదానను. 37

మూ. ఏవముక్తో దశగ్రీవః ప్రత్యువాచ వినీతవత్, 38
స్నుషాస్మి యదవోచ స్త్వమేకపత్నీష్వయం క్రమః.

ప్ర. అ. వినీతవత్ = వినయపూర్వకముగా, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, దశగ్రీవః = రావణుడు, ప్రత్యువాచ=తిరిగి పలికెను. స్నుషా అస్మి = కోడలను అయి ఉన్నాను అని, త్వమ్ = నీవు, యత్ = ఏ వాక్యమును, అవోచః = పలికితివో, ఏకపత్నీషు = ఒకనికే భార్యగా ఉన్నవారిలో, అయమ్= ఈ, క్రమః = పద్ధతి.

తా. ఆమె వినయపూర్వకముగా పలికిన మాటలు విని రావణు డిట్లనెను- "నేను నీ కోడలిని" అని నీవు అన్నావే ఈ నియమము ఒక్కనికి మాత్రమే భార్యగా ఉండువాళ్ళ విషయమునందు మాత్రమే. 38

మూ. దేవలోకస్థితిరియం సురాణాం శాశ్వతీ మతా, 39
పతిరప్సరసాం నాస్తి న చైకస్త్రీపరిగ్రహః.

ప్ర. అ. అప్సరసామ్ = అప్సరసలకు, పతిః = భర్త, నాస్తి = లేదు. ఏక స్త్రీపరిగ్రహః చ = ఒక స్త్రీని మాత్రమే గ్రహించుట అనేది కూడ, న = లేదు. ఇయమ్ = ఇది, సురాణామ్ = దేవతలయొక్క, శాశ్వతీ = శాశ్వతమైన, దేవలోక స్థితిః = దేవలోకములోని ఆచారముగా, మతా = అంగీకరించబడినది.

తా. అప్సరసలకు భర్త అనేవాడు ఉండడు. ఒక్క స్త్రీని మాత్రమే వివాహ మాడుట అనేది కూడ లేదు. ఇది దేవలోకములో దేవతల శాశ్వతమైన ఆచారము.

మూ. ఏవముక్త్వా స తాం రక్షో నివేశ్య చ శిలాతలే, 40
కామభోగాభిసంరక్తో మైథునాయోపచక్రమే.

ప్ర. అ. సః రక్షః = ఆ రాక్షసుడు, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తామ్ = ఆమెను, శిలాతలే = శిలాఫలకముమీద, నివేశ్య = పరుండబెట్టి, కామ భోగాభిసంరక్తః = కామమును అనుభవించుటయందు ఆసక్తి కలవాడై, మైథు నాయ = మైథునముకొరకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. రావణుడు ఇట్లు పలికి, కామమును అనుభవించుటయందు ఆసక్తుడై ఆమెను శిలాఫలకముమీద పరుండబెట్టి మైథునమునకు ప్రారంభించెను. 40

మూ. సా విముక్తా తతో రమ్భా భ్రష్టమాల్యవిభూషణా, 41
గజేన్ద్రాక్రీడమథితా నదీవాకులతాం గతా.

ప్ర. అ. తతః = మైథునానంతరము, విముక్తా = విడవబడిన, భ్రష్టమాల్య విభూషణా = జారిపోయిన పుష్పమాలలు అలంకారములూ గల, సా రమ్భా = ఆ రంభ, గజేన్ద్రాక్రీడమథితా = శ్రేష్ఠమైన గజముయొక్క క్రీడించుటచేత మథించ బడిన, నదీవ = నది వలె, ఆకులతామ్ = వ్యాకులత్వమును, గతా = పొందినది.

తా. పిమ్మట ఆతడు విడిచిపెట్టివేయగా మాలలు అలంకారములు జారి పోయి ఆ రంభ మహాగజము క్రీడించుటచేత కలిగిపోయిన నదివలె వ్యాకులత్వము చెందెను. 41

మూ. లులితాకులకేశాన్తా కరవేపితపల్లవా, 42
పవనేనావధూతేవ లతా కుసుమశాలినీ,
సా వేపమానా లజ్జన్తీ భీతా కరకృతాఞ్జలిః, 43
నలకూబరమాసాద్య పాదయోర్నిపపాత హ.

ప్ర. అ. లులితాకులకేశాన్తా=నలిపివేయబడిన వ్యాకులమైన కేశాగ్రములు కలది, కరవేపితపల్లవా=కదల్చబడిన చిగుళ్ళ వంటి హస్తములు కలది, పవనేన=వాయువుచేత, అవధూతా = కదల్చబడిన, కుసుమశాలినీ = పుష్పములతో ప్రకాశించుచున్న, లతేవ=లత వలె, వేపమానా=వణకిపోవుచున్నదీఅయిన, సా=ఆమె, లజ్జన్తీ= సిగ్గుపడుచున్నదై, కరకృతాఞ్జలిః = హస్తములచేత చేయబడిన దోసిలి కలదై, నలకూబరమ్=నలకూబరుణ్ణి, ఆసాద్య = పొంది, పాదయోః = పాదముల మీద, నిపపాత హ = పడెను.

తా. ఆమె జుట్టు నలిగి చిక్కువడిపోయెను. చిగుళ్ళవంటి చేతులు వణకుచుండెను. ఆమె భయముతో గాలికి కదలుచున్న, పుష్పములతో నిండిన లత వలె వణకిపోవుచు, సిగ్గుతో అంజలి ఘటించి, నలకూబరుని దగ్గరకు వెళ్ళి అతని పాదములమీద వ్రాలెను. 42,43

మూ. తదవస్థాం చ తాం దృష్ట్వా మహాత్మా నలకూబరః, 44
అబ్రవీత్ కిమిదం భద్రే పాదయోః పతితాసి మే.

ప్ర. అ. మహాత్మా = మహాత్ముడైన, నలకూబరః=నలకూబరుడు, తదవస్థామ్ = అట్టి అవస్థ గల, తామ్ = ఆమెను, దృష్ట్వా = చూచి, అబ్రవీత్ = పలికెను. భద్రే = మంగళప్రదురాలా! ఇదమ్=ఇది, కిమ్ = ఏమి? మే = నాయొక్క, పాదయోః = పాదములమీద, పతితా అసి = పడినావు ?

తా. మహాత్ముడైన నలకూబరుడు అట్టి అవస్థలో ఉన్న ఆమెను చూచి"ఓ! మంగళప్రదురాలా! ఇది ఏమి? నా కాళ్ళమీద పడుచున్నావేమి?"అని ప్రశ్నించెను.

మూ. సా వై నిఃశ్వసమానా తు వేపమానా కృతాఞ్జలిః, 45
తస్మై సర్వం యథాతత్త్వమాఖ్యాతుముపచక్రమే.

ప్ర. అ. సా తు = ఆమెయైతే, నిఃశ్వసమానా = నిట్టూర్పుచున్నదై; వేప

మానా = వణకుచు, కృతాఞ్జలిః = చేయబడిన దోసిలికలదై, తస్మై = వానికి, యథాతత్త్వమ్ = యథార్థముగా, సర్వమ్ = సమస్తమునూ, ఆఖ్యాతుమ్ = చెప్పుటకు, ఉపచక్రమే = ఉపక్రమించెను.

తా. వణకిపోవుచున్న ఆమె దోసిలి ఒగ్గి నమస్కరించుచు, నిట్టూర్చుచు జరిగినది అంతా ఆతనికి తెలిపెను. 45

మూ. ఏష దేవ దశగ్రీవః ప్రాప్తో గన్తుం త్రివిష్టపమ్, 46
తేన సైన్యసహాయేన నిశేయం పరిణామితా.

ప్ర. అ. దేవ = దేవా! ఏషః = ఈ, దశగ్రీవః = రావణుడు, త్రివిష్టపమ్ = స్వర్గమును గూర్చి, గన్తుమ్ = వెళ్లుటకు, ప్రాప్తః = వచ్చినాడు. సైన్యసహాయేన = సైన్యము సహాయముగా గల, తేన = వానిచేత, ఇయమ్ = ఈ, నిశా = రాత్రి, పరిణామితా = గడపబడినది.

తా. దేవా! రావణుడు స్వర్గలోకమునకు వెళ్లుచు సైన్యముతో కూడ ఈ రాత్రి ఇక్కడ గడపినాడు. 46

మూ. ఆయాన్తీ తేన దృష్టాస్మి త్వత్సకాశమరిందమ, 47
గృహీతా తేన పృష్టాస్మి కస్య త్వమితి రక్షసా.

ప్ర. అ. అరిందమ = శత్రుసంహారకుడా! త్వత్సకాశమ్ = నీ సమీపమును గూర్చి, ఆయాన్తీ = వచ్చుచున్న నేను, తేన = వానిచేత, దృష్టా = చూడబడిన దానను, అస్మి = అయినాను. తేన రక్షసా = ఆ రాక్షసునిచేత, గృహీతా = పట్టుకొనబడినదాననై, త్వమ్ = నీవు, కస్య = ఎవనియొక్క (భార్యవు) ఇతి = అని, పృష్టా అస్మి = అడగబడితిని.

తా. శత్రుసంహారకుడా! నీవద్దకు వచ్చుచున్న నన్ను చూచి ఆ రాక్షసుడు అడ్డగించి "నీవు ఎవనిదానవు?" అని ప్రశ్నించినాడు. 47

మూ. మయా తు సర్వం యత్సత్యం తస్మై సర్వం నివేదితమ్,
కామమోహాభిభూతాత్మా నాశ్రౌషీత్తద్వచో మమ,
యాచ్యమానో మయా దేవ స్నుషా తేఽహమితి ప్రభో.

ప్ర. అ. దేవ = దేవా! మయా తు = నాచేతనైతే, సర్వమ్ = సమస్తమైన, యత్ = ఏది, సత్యమ్ = సత్యమో, సర్వమ్ = అది అంతా, తస్మై = వానికి, నివేదితమ్ = తెలుపబడినది. ప్రభో = ప్రభూ! అహమ్ = నేను, తే = నీకు! స్నుషా = కోడలిని, ఇతి = అని, మయా = నాచేత, యాచ్యమానః = ప్రార్థింపబడుచున్న వాడైనను, కామమోహాభిభూతాత్మా = కామముచేత, మోహముచేత ఆవరింపబడిన మనస్సు కలవాడై, మమ = నాయొక్క, తత్ = ఆ, వచః = వచనమును, నాశ్రౌషీత్ = వినలేదు.

తా. దేవా! అతనికి సత్యమైన విషయమును అంతా తెలిపితిని. "ప్రభూ! నేను నీ కోడలిని"అని ప్రార్థించుచున్నను కామమోహములు ఆవేశించిన మనస్సుతో అతడు నా మాటలు వినలేదు. 48,49

మూ. తత్సర్వం పృష్ఠతః కృత్వా బలాత్తేనాస్మి ధర్షితా,
ఏవం త్వమపరాధం మే క్షన్తుమర్హసి సువ్రత, 50
న హి తుల్యం బలం సౌమ్య స్త్రియాశ్చ పురుషస్య హి.

ప్ర. అ. తత్ = దానిని, సర్వమ్ = అంతనూ, పృష్ఠతః కృత్వా = వెనకకు నెట్టి, తేన = వానిచేత, బలాత్ = బలాత్కారమువలన, ధర్షితా అస్మి = అవమానింపబడితిని. సువ్రత = మంచి నియమములు కలవాడా! ఏవమ్ = ఈ విధముగా జరిగిన, మే అపరాధమ్ = నా అపరాధమును, క్షన్తుమ్ = క్షమించుటకు, అర్హసి = తగి ఉన్నావు. సౌమ్య = సౌమ్యుడా! స్త్రియాశ్చ = స్త్రీయొక్క, పురుషస్య = పురుషునియొక్క, బలమ్ = బలము, తుల్యమ్ = సమానము, న హి = కాదు కదా ?

తా. మంచి నియమములు గల ఓ! సౌమ్యుడా! అతడు నేను చెప్పిన దేదీ లెక్కచేయక బలాత్కారముగా నన్ను అవమానించినాడు. నీవు నా ఈ అపరాధమును క్షమించుము. స్త్రీబలము పురుషుని బలముతో సమానము కాదు కదా ? 50

మూ. ఏతచ్ఛ్రుత్వా తు సంక్రుద్ధస్తదా వైశ్రవణాత్మజః, 51
ధర్షణాం తాం పరాం శ్రుత్వా ధ్యానం సంప్రవివేశ హ.

ప్ర. అ. తదా = అప్పుడు, వైశ్రవణాత్మజః = కుబేరుని కుమారుడైన

నలకూబరుడు, ఏతత్ = దీనిని, శ్రుత్వా = విని, సంక్రుద్ధః = కోపించినాడు. తామ్ = ఆ, పరామ్ = గొప్పదైన, ధర్షణామ్ = అవమానమును, శ్రుత్వా = విని, ధ్యానమ్ = ధ్యానమును, సంప్రవివేశ హ = ప్రవేశించెను.

తా. నలకూబరుడు ఆ మాటలు విని, ఆమెకు జరిగిన గొప్ప అవమానమును గూర్చి తెలిసికొని చాల కోపించి కొంచెముసేపు ధ్యానము చేసెను. 51

మూ. తస్య తత్కర్మ విజ్ఞాయ తదా వైశ్రవణాత్మజః, 52
ముహూర్తాత్క్రోధతామ్రాక్షస్తోయం జగ్రాహ పాణినా.

ప్ర. అ. తదా = అప్పుడు, వైశ్రవణాత్మజః = నలకూబరుడు, తస్య = వానియొక్క, తత్ కర్మ = ఆ పనిని, ముహూర్తాత్ = ముహూర్తకాలమువలన, విజ్ఞాయ = తెలిసికొని, క్రోధతామ్రాక్షః = కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములు కలవాడై, పాణినా = హస్తముచేత, తోయమ్ = జలమును, జగ్రాహ = గ్రహించెను.

తా. అప్పుడు నలకూబరుడు ముహూర్తకాలములో రావణుడు చేసిన పని తెలిసికొని, కోపముతో కళ్ళు ఎఱ్ఱబడగా, హస్తమునందు జలము గ్రహించెను. 52

మూ. గృహీత్వా సలిలం సర్వముపస్పృశ్య యథావిధి,
ఉత్ససర్జ తదా శాపం రాక్షసేన్ద్రాయ దారుణమ్. 53

ప్ర. అ. తదా = అప్పుడు, సలిలమ్ = ఉదకమును, గృహీత్వా = గ్రహించి, సర్వమ్ = సమస్తమును, యథావిధి = యథావిధిగా, ఉపస్పృశ్య చ = ఆచమనము చేసి, రాక్షసేన్ద్రాయ = రావణునకు, దారుణమ్ = భయంకరమైన, శాపమ్ = శాపమును. ఉత్ససర్జ = విడచెను.

తా. అతడు ఉదకము తీసికొని, యథావిధిగా దాని నంతను ఆచమనము చేసి, రావణునకు భయంకరమైన శాపమును ఇచ్చెను. 53

మూ. అకామా తేన యస్మాత్త్వం బలాద్భద్రే ప్రధర్షితా, 54
తస్మాత్స యువతీమన్యాం నాకామాముపయాస్యతి

ప్ర. అ. భద్రే = మంగళప్రదురాలా! యస్మాత్ = ఏ కారణమువలన, తేన = వానిచేత, అకామా = కామము లేని, త్వమ్ = నీవు, బలాత్ = బలాత్కారము

వలన, ప్రధర్షితా = అవమానించబడితివో, తస్మాత్ = ఆ కారణమువలన, సః = అతడు, అకామామ్ = కామములేని, అన్యామ్ = మరియొక, యువతీమ్ = స్త్రీని, నోపయాస్యతి = పొందడు.

తా. మంగళప్రదురాలా ! అతడు కామము లేని నిన్ను బలాత్కరించి అవమానించినాడు గాన ఇటుపై అతడు కామము లేని మరియొక ఏ స్త్రీని కూడ పొందజాలడు. 54

మూ. యదా హ్యకామాం కామార్తో ధర్షయిష్యతి యోషితమ్, 55
మూర్ధా తు సప్తధా తస్య శకలీభవితా తదా.

ప్ర. అ. కామార్తః = కామపీడితుడైన అతడు, యదా = ఎప్పుడు, అకామామ్ = కామము లేని, యోషితమ్ = స్త్రీని, ధర్షయిష్యతి = అవమానించునో, తదా = అప్పుడు, తస్య = వానియొక్క, మూర్ధా = శిరస్సు, సప్తధా = ఏడు భాగములుగా, శకలీభవితా = ముక్కలు కాగలదు.

తా. కామార్తుడైన ఈ రావణుడు కామము లేని స్త్రీని ఎవ్వరినైన అవమానించినచో అప్పుడు ఈతని శిరస్సు ఏడు ముక్కలుగా బ్రద్దలగును. 55

మూ. తస్మిన్నుదాహృతే శాపే జ్వలితాగ్నిసమప్రభే, 56
దేవదున్దుభయో నేదుః పుష్పవృష్టిశ్చ ఖాచ్చ్యుతా.

ప్ర. అ. జ్వలితాగ్నిసమప్రభే = ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమైన కాంతి గల, తస్మిన్ = ఆ, శాపే = శాపము, ఉదాహృతే = పలకబడిన దగుచుండగా, దేవదున్దుభయః = దేవతల దుందుభులు, నేదుః = మ్రోగినవి. ఖాత్ = ఆకాశమునుండి, పుష్పవృష్టిశ్చ = పుష్పవర్షము కూడ, చ్యుతా = జారినది.

తా అతడు ప్రజ్వలించుచున్న అగ్ని వలె తీవ్రమైన ఆ శాపవాక్యమును ఉచ్చరించగానే దేవదుందుభులు మ్రోగెను. ఆకాశమునుండి పుష్పవృష్టి కురిసెను.

మూ. పితామహముఖాశ్చైవ సర్వే దేవాః ప్రహర్షితాః, 57
జ్ఞాత్వా లోకగతిం సర్వాం తస్య మృత్యుం చ రక్షసః,
ఋషయః పితరశ్చైవ ప్రీతిమాపురనుత్తమామ్. 58

ప్ర. అ. సర్వామ్ = సమస్తమైన,. లోకగతిమ్ = లోకప్రవృత్తిని, తస్య రక్షసః = ఆ రాక్షసునియొక్క, మృత్యుం చ = మృత్యువును, జ్ఞాత్వా = తెలిసికొని, పితామహముఖాః = బ్రహ్మదేవుడు మొదలైన, సర్వే = సమస్తమైన, దేవాః = దేవతలు, ప్రహర్షితాః = సంతోషించినారు. ఋషయః = ఋషులు, పితరః చైవ = పితృదేవతలు, అనుత్తమామ్ = గొప్పదైన, ప్రీతిమ్ = సంతోషమును, ఆపుః = పొందిరి.

తా. లోకములో జరుగుచున్న ఆ ప్రవృత్తిని, రాక్షసునికి రానున్న మరణమునూ గూర్చి తెలిసికొని బ్రహ్మదేవుడు మొదలైన దేవత లందరు సంతోషించిరి. ఋషులు. పితృదేవతలూ కూడ గొప్ప సంతోషము పొందిరి. 57;58

మూ. శ్రుత్వా తు స దశగ్రీవ స్తం శాపం రోమహర్షణమ్,
నారీషు మైథునీభావం నాకామాస్వభ్యరోచయత్. 59

ప్ర. అ. సః దశగ్రీవః = ఆ రావణుడు, రోమహర్షణమ్ = రోమాంచజనకమైన, తం శాపమ్ = ఆ శాపమును, శ్రుత్వా = విని, అకామాసు = కామము లేని, నారీషు = స్త్రీలయందు, మైథునీభావమ్ = మైథునమును, న అభ్యరోచయత్ = ఇష్టపడలేదు.

తా. రావణుడు భయంకరమైన ఆ శాపమును గూర్చి విన్నది మొదలు తనపై కోరిక లేని స్త్రీలతో మైథునమునకు ఉద్యమించలేదు. 59

మూ. తేన నీతాః స్త్రియః ప్రీతిమాపుః సర్వాః పతివ్రతాః,
నలకూబరనిర్ముక్తం శాపం శ్రుత్వా మనఃప్రియమ్. 60

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షడ్వింశః సర్గః.

ప్ర. అ. తేన = వానిచేత, నీతాః = అపహరింపబడిన, పతివ్రతాః = పతివ్రతలైన, సర్వాః = సమస్తమైన, స్త్రియః = స్త్రీలు, మనఃప్రియమ్ = మనస్సుకు ఇష్టమైన, నలకూబరనిర్ముక్తమ్ = నలకూబరునిచేత విడవబడిన, శాపమ్ = శాపమును, శ్రుత్వా = విని, ప్రీతిమ్ = సంతోషమును, ఆపుః = పొందిరి.

తా. రావణుడు అపహరించుకొని వచ్చిన పతివ్రతలైన స్త్రీ లందరు తమ మనస్సుకు ఆనందము కలిగించు, నలకూబరు డిచ్చిన శాపమును గూర్చి విని సంతోషించిరి. 60

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ఇరువదిఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తవింశః సర్గః

[రావణుడు సైన్యముతో ఇంద్రుని లోకమును ముట్టడించుట. ఇంద్రుడు సాహాయ్యముకొరకు విష్ణువును అర్థించగా "భవిష్యత్తులో రావణుని చంపెదను" అని చెప్పి విష్ణువు ఇంద్రుణ్ణి వెనుకకు పంపుట; దేవతలకు రాక్షసులకు యుద్ధము జరుగుట; వసువు సుమాలిని సంహరించుట.]

మూ. కైలాసం లఙ్ఘయిత్వా తు ససైన్యబలవాహనః,
ఆససాద మహాతేజా ఇన్ద్రలోకం దశాననః. 1

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, దశాననః = రావణుడు, ససైన్యబలవాహనః = సైన్యముతోను, వాహనములతోను కూడినవాడై, కైలాసమ్ = కైలాసమును, లఙ్ఘయిత్వా = దాటి, ఇన్ద్రలోకమ్ = ఇంద్రలోకమును, ఆససాద = సమీపించెను.

తా. గొప్ప తేజస్సు గల రావణుడు సైన్యవాహనాదులతో కూడినవాడై కైలాసమును దాటి ఇంద్రలోకమును చేరెను. 1

మూ. తస్య రాక్షససైన్యస్య సమన్తాదుపయాస్యతః,
దేవలోకే బభౌ శబ్దో భిద్యమానార్ణవోపమః. 2

ప్ర. అ. సమన్తాత్ = అన్ని వైపులా, ఉపయాస్యతః = వచ్చుచున్న, తస్య = ఆ, రాక్షససైన్యస్య = రాక్షససైన్యముయొక్క, శబ్దః = శబ్దము, దేవలోకే = దేవలోకమునందు, భిద్యమానార్ణవోపమః = భేదింపబడుచున్న సముద్రముతో సమానముగా, బభౌ = ప్రకాశించెను.

తా. ఆ రాక్షససైన్యము నలువైపులనుండి దేవలోకములో ప్రవేశించుచుండగా సముద్రము బ్రద్దలుకొట్టబడినప్పుడు కలిగినట్లు శబ్దము కలిగెను. 2

మూ. శ్రుత్వా తు రావణం ప్రాప్తమిన్ద్రశ్చలిత ఆసనాత్,
వేవానథాబ్రవీత్తత్ర సర్వానేవ సమాగతాన్. 3

ఆదిత్యాంశ్చ వసూన్ రుద్రాన్ సాధ్యాంశ్చ సమరుద్గణాన్,
సజ్జా భవత యుద్ధార్థం రావణస్య దురాత్మనః. 4

ప్ర. అ. రావణమ్ = రావణుణ్ణి, ప్రాప్తమ్=వచ్చినవానినిగా, శ్రుత్వా= విని, ఇన్ద్రః = ఇంద్రుడు, ఆసనాత్ = ఆసనమునుండి, చలితః=చలించినవాడై, అథ = అటుపిమ్మట, తత్ర = అక్కడ, సమాగతాన్=వచ్చి ఉన్న, సర్వాన్= సమస్తమైన, దేవాన్=దేవతలను, ఆదిత్యాన్ చ = ఆదిత్యులను, వసూన్ = వసువులను, రుద్రాన్ = రుద్రులను, సమరుద్గణాన్ = మరుద్గణముతో కూడిన, సాధ్యాన్ చ = సాధ్యులను గూర్చి, అబ్రవీత్=వలికెను. దురాత్మనః=దురాత్ముడైన, రావణస్య = రావణునియొక్క, యుద్ధార్థమ్ = యుద్ధముకొరకు, సజ్జాః = సన్నద్ధులు, భవత = అవండి.

తా. రావణుడు వచ్చినట్లు విని ఇంద్రుడు ఆసనమునుండి చలించి, అక్కడికి వచ్చి ఉన్న దేవత లందరినీ, ఆదిత్యులనూ, వసువులను, రుద్రులను, సాధ్యులను, మరుత్తులను "దురాత్ముడైన రావణునితో యుద్ధానికి సిద్ధము అవండి" అని ఆజ్ఞాపించెను. 3, 4

మూ. ఏవముక్తాస్తు శక్రేణ దేవాః శక్రసమా యుధి,
సంనహ్య సుమహాసత్త్వా యుద్ధశ్రద్ధాసమన్వితాః. 5

ప్ర. అ. శక్రేణ = ఇంద్రునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తాః = వలకబడిన, యుధి=యుద్ధమునందు, శక్రసమాః=ఇంద్రునితో సమానులైన, సుమహాసత్త్వాః= చాల గొప్ప బలము గల, దేవాః = దేవతలు, సంనహ్య = సిద్ధమై, యుద్ధశ్రద్ధాసమన్వితాః = యుద్ధమునందు శ్రద్ధతో కూడినవారు అయిరి.

తా. యుద్ధమునందు ఇంద్రునితో సమానులు, మహాబలవంతులు అయిన దేవతలు ఇంద్రుని మాటలు విని యుద్ధమునందు శ్రద్ధ గలవారై సిద్ధమైరి. 5

మూ. స తు దీనః పరిత్రస్తో మహేన్ద్రో రావణం ప్రతి,
విష్ణోః సమీపమాగత్య వాక్యమేతదువాచ హ. 6

ప్ర. అ. రావణం ప్రతి = రావణుని గూర్చి, పరిత్రస్తః = భయపడిన, సః మహేన్ద్రః = ఆ మహేంద్రుడు, దీనః = దీనుడై, విష్ణోః = విష్ణువుయొక్క, సమీపమ్ = సమీపమును, ఆగత్య = పొంది, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ హ = పలికెను.

తా. రావణునికి భయపడిన ఆ మహేంద్రుడు దీనుడై విష్ణువవద్దకు వెళ్ళి ఈ వాక్యమును పలికెను. 6

మూ. విష్ణో కథం కరిష్యామి రావణం రాక్షసం ప్రతి,
అహోఽతిబలవద్రక్షో యుద్ధార్థమభివర్తతే. 7

ప్ర. అ. విష్ణో = విష్ణూ! రాక్షసమ్ = రాక్షసుడైన, రావణం ప్రతి = రావణుణ్ణి గూర్చి, కథమ్ = ఎట్లు, కరిష్యామి = చేయుదును? అహో = అహా! అతిబలవత్ = చాల బలము గల, రక్షః = రాక్షసుడు, యుద్ధార్థమ్ = యుద్ధము కొరకు, అభివర్తతే = వచ్చుచున్నాడు.

తా. విష్ణూ! రాక్షసుడైన రావణుని విషయమున నేనేమి చేయవలెను? ఆహా! బలవంతుడైన ఆ రాక్షసుడు యుద్ధమునిమిత్తము వచ్చుచున్నాడు. 7

మూ. వరప్రదానాద్బలవాన్న ఖల్వన్యేన హేతునా,
తత్తు సత్యం వచః కార్యం యదుక్తం పద్మయోనినా. 8

ప్ర. అ. వరప్రదానాత్ = వరప్రదానమువలన, బలవాన్ = బలవంతుడు, అన్యేన = మరియొక, హేతునా = హేతువుచేత, న ఖలు = కాదు. పద్మయోనినా = బ్రహ్మదేవునిచేత, యత్ = ఏది, ఉక్తమ్ = చెప్పబడినదో, తత్ = ఆ, వచః తు = వాక్యమైతే, సత్యమ్ = సత్యమైనదిగా, కార్యమ్ = చేయదగినది.

తా. ఇతడు వరములు పొంది ఉండుటచేతమాత్రమే బలవంతుడు గాని మరొక కారణముచేత కాదు. బ్రహ్మదేవుడు చెప్పిన వచనము సత్యము అగునట్లు చేయవలెను కదా? 8

మూ. తద్యథా నముచిర్వృత్రో బలిర్నరకశమ్బరౌ,
త్వద్బలం సమవష్టభ్య మయా దగ్ధాస్తథా కురు. 9

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, త్వద్బలమ్=నీ బలమును, సమవష్టభ్య=ఊతగా గొని, నముచిః=నముచి, వృత్రః=వృత్రాసురుడు, బలిః=బలి, నరకశమ్బరౌ=నరకుడు, శంబరుడు, మయా=నాచేత, యథా=ఎట్లు, దగ్ధాః=కాల్చివేయబడినారో; తథా=అట్లు, కురు=చేయుము.

తా. అందువలన, నీ బలమును ఊతగాగొని నేను ఏ విధముగా నముచి-వృత్ర-బలి-నరక-శంబరులను నశింపచేసితినో ఇతని విషయమునందు కూడ అట్లు చేయుము. 9

మూ. న హ్యన్యో దేవదేవేశ త్వదృతే మధుసూదన,
గతిః పరాయణం చాపి త్రైలోక్యే సచరాచరే. 10

ప్ర. అ. దేవ=దేవా! దేవేశ=దేవతల ప్రభువైనవాడా! మధుసూదన=మధుసూదనా! సచరాచరే=చరాచరములతో కూడిన, త్రైలోక్యే=మూడు లోకములయందు, గతిః=గతి అయినవాడు, పరాయణం చాపి=శ్రేష్ఠమైన స్థానమైన వాడు, త్వదృతే=నీవు తప్ప, అన్యః=మరి యొకడు; న హి=లేడు కదా?

తా. ఓ! దేవా! ఓ! దేవేశా! ఓ! మధుసూదనా! జంగమస్థావరాత్మకమైన ఈ మూడులోకములలో నీవు తప్ప మరొక గతి, మరొక ఉత్తమస్థానము లేదు కదా? 10

మూ. త్వం హి నారాయణః శ్రీమాన్ పద్మనాభః సనాతనః,
త్వయేమే స్థాపితా లోకాః శక్రశ్చాహం సురేశ్వరః. 11

ప్ర. అ. త్వమ్=నీవు, నారాయణః=జలము స్థానముగా గలవాడవు. శ్రీమాన్=లక్ష్మి గలవాడవు. పద్మనాభః=పద్మము నాభియందు కలవాడవు. సనాతనః=అతిప్రాచీనుడవు. ఇమే లోకాః=ఈ లోకములు, త్వయా=నీచేత, స్థాపితాః=స్థాపింపబడినవి. అహం చ=నేను కూడ, సురేశ్వరః=దేవతల ప్రభువుగా స్థాపింపబడినాను.

తా. నీవు నారాయణుడవు. లక్ష్మీపతివి. పద్మనాభుడవు. సనాతనుడవు. నీవే ఈ లోకములను నిలబెట్టినావు. నన్ను దేవేంద్రుని చేసినావు. 11

మూ. త్వయా సృష్టమిదం సర్వం త్రైలోక్యం సచరాచరమ్,
త్వామేవ భగవన్ సర్వే ప్రవిశన్తి యుగక్షయే. 12

ప్ర. అ. సచరాచరమ్=చరాచరములతో కూడిన, ఇదమ్=ఈ, సర్వమ్ = సమస్తమైన, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, త్వయైవ = నీచేతనే, సృష్టమ్ = సృజించబడినది. భగవన్ = భగవంతుడా! యుగక్షయే = ప్రళయకాలమునందు, సర్వే = అందరూ, త్వామేవ = నిన్నే, ప్రవిశన్తి=ప్రవేశించుచున్నారు.

తా. స్థావరజంగమాత్మకమైన ఈ ప్రపంచకమును నీవే సృష్టించినావు. ప్రళయకాలమునందు అందరూ నీలోనే ప్రవేశించుచున్నారు. 12

మూ. తదాచక్ష్వ యథాతత్త్వం దేవదేవ మమ స్వయమ్,
అపి చక్రసహాయస్త్వం యోత్స్యసే రావణం ప్రతి. 13

ప్ర. అ. దేవదేవ=దేవదేవా! తత్=ఆ కారణమువలన; యథాతత్త్వమ్= యథార్థముగా, స్వయమ్ = స్వయముగా, మమ = నాకు, ఆచక్ష్వ = చెప్పుము, చక్రసహాయః=చక్రమునహాయముగాగల, త్వమ్=నీవు, రావణం ప్రతి=రావణుని గూర్చి, అపి యోత్స్యసే = యుద్ధము చేసెదవా?

తా. దేవదేవా! చక్రము ధరించి నీవు రావణునితో యుద్ధము చేసెదవో లేదో స్వయముగా యథార్థమును చెప్పుము. 13

మూ. ఏవముక్తః స శక్రేణ దేవో నారాయణః ప్రభుః,
అబ్రవీన్న పరిత్రాసః కర్తవ్యః శ్రూయతాం చ మే. 14

ప్ర. అ. శక్రేణ = ఇంద్రునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, దేవః = దేవుడైన, ప్రభుః = ప్రభువైన, సః = ఆ, నారాయణః = నారాయణుడు, అబ్రవీత్ = పలికెను. పరిత్రాసః = భయము, న కర్తవ్యః=చేయదగినది కాదు. మే = నామాట, శ్రూయతాం చ = వినబడుగాక.

తా. ప్రభువైన నారాయణుడు ఇంద్రుని మాటలు విని ఇట్లు పలికెను- "భయపడవలసిన పని లేదు. నేను చెప్పునది వినుము". 14

మూ. న తావదేష దుష్టాత్మా శక్యో జేతుం సురాసురైః,
హన్తుం చాపి సమాసాద్య వరదానేన దుర్జయః. 15

ప్ర. అ. వరదానేన = వరదానముచేత, దుర్జయః = జయింప శక్యము కాని, దుష్టాత్మా = దుష్టాత్ముడైన, ఏషః = ఇతడు, సురాసురైః = సురులచేతను అసురులచేతనూ కూడ, సమాసాద్య = పొంది, జేతుమ్ = జయించుటకు, హన్తుం చాపి = చంపుటకు, న శక్యః తావత్ = శక్యమైనవాడు కాడు.

తా. వరదానముచేత జయింప శక్యము కాని దుష్టుడైన ఈతనిని సురాసురులు కూడ ఎదిరించి ఓడించజాలరు; చంపజాలరు. 15

మూ. సర్వథా సుమహత్కర్మ కరిష్యతి బలోత్కటః,
రాక్షసః పుత్రసహితో దృష్టమేతన్నిసర్గతః. 16

ప్ర. అ. బలోత్కటః = బలముచేత దృప్తుడైన, పుత్రసహితః = పుత్రునితో కూడిన, రాక్షసః = ఈ రాక్షసుడు, సర్వథా = అన్ని విధములా, సుమహత్ = చాల గొప్పదైన, కర్మ = పనిని, కరిష్యతి = చేయగలడు. ఏతత్ = ఇది, నిసర్గతః = స్వభావముచేత, దృష్టమ్ = చూడబడినది.

తా. బలముచేత దృప్తుడైన, పుత్రసహితుడైన ఈ రాక్షసుడు అన్ని విధములా గొప్ప పని చేయనున్నాడు. ప్రస్తుతస్థితిని పట్టి ఇట్లు కనబడుచున్నది. 16

మూ. యత్తు మాం త్వమభాషిష్ఠా యుధ్యస్వేతి సురేశ్వర,
నాహం తం ప్రతియోత్స్యామి రావణం రాక్షసం యుధి.

ప్ర. అ. సురేశ్వర = దేవేంద్రా! యుధ్యస్వ ఇతి = యుద్ధము చేయుము అని, మామ్ = నన్ను గూర్చి, యత్తు అభాషిష్ఠాః = ఏది పలికితివో (దానికి సమాధాన మేమనగా), రాక్షసమ్ = రాక్షసుడైన, తం రావణమ్ = ఆ రావణుణ్ణి; అహమ్ = నేను. యుధి = యుద్ధమునందు, న ప్రతియోత్స్యామి = ఎదిరించి యుద్ధము చేయను.

తా. దేవేంద్రా! "యుద్ధము చేయుము" అని నీవు నన్ను కోరినావు. కాని నేను యుద్ధరంగములో ఆ రావణుణ్ణి ఎదిరించి యుద్ధము చేయను. 17

మూ. అహత్వా సమరే శత్రుం విష్ణుః ప్రతినివర్తతే,
దుర్లభశ్చైవ కామోఽద్య వరగుప్తాద్ధి రావణాత్. 18

ప్ర. అ. విష్ణుః=విష్ణువు, సమరే=యుద్ధమునందు, శత్రుమ్=శత్రువును, అహత్వా=చంపకుండగా, న ప్రతినివర్తతే=వెనకకు మరలడు. వరగుప్తాత్=వరముచేత రక్షించబడిన, రావణాత్=రావణునివలన, కామః=ఈ కోరిక, అద్య=ఇప్పుడు, దుర్లభః=పొంద శక్యముకానిది.

తా. యుద్ధములో శత్రువును చంపకుండగా విష్ణువు వెనుకకు మరలడు. రావణుణ్ణి వరము రక్షించుచున్నది. అందుచేత ఇప్పుడు ఈ కోరిక సిద్ధించదు.

మూ ప్రతిజానే చ దేవేన్ద్ర త్వత్సమీపే శతక్రతో,
భవితాస్మి యథాఽస్యాహం రక్షసో మృత్యుకారణమ్. 19

ప్ర. అ. శతక్రతో=నూరు యజ్ఞములు కలవాడా! దేవేన్ద్ర=దేవేంద్రా! అహమ్=నేను, అస్య రక్షసః=ఈ రాక్షసునియొక్క, మృత్యుకారణమ్=మృత్యువుకు కారణముగా, యథా=ఎట్లు, భవితాస్మి=కాగలనో, త్వత్సమీపే=నీ సమీపమునందు, ప్రతిజానే చ=ప్రతిజ్ఞ చేయుచున్నాను.

తా. నూరు క్రతువులు ఆచరించిన దేవేంద్రా! "ఈ రాక్షసుణ్ణి చంపెదను" అని నీముందు ప్రతిజ్ఞ చేయుచున్నాను. 19

మూ. అహమేవ నిహన్తాస్మి రావణం సపురఃసరమ్,
దేవతా నన్దయిష్యామి జ్ఞాత్వా కాలముపాగతమ్. 20

ప్ర. అ కాలమ్=కాలమును, ఉపాగతమ్=వచ్చినదానినిగా, జ్ఞాత్వా=తెలిసికొని, అహమేవ=నేనే, సపురఃసరమ్=ముందునడిచేవారితో కూడిన, రావణమ్=రావణుణ్ణి, నిహన్తాస్మి=చంపగలను. దేవతాః=దేవతలను, నన్దయిష్యామి=ఆనందింపచేయగలను.

తా. తగిన సమయము చూచి నేనే పరివారసహితుడైన రావణుణ్ణి చంపి దేవతలకు ఆనందము కలిగించెదను. 20

మూ. ఏతత్తే కథితం తత్త్వం దేవరాజ శచీపతే,
యుధ్యస్వ విగతత్రాసః సురైః సార్ధం మహాబల. 21

ప్ర. అ. శచీపతే = శచీదేవికి పతివైన, దేవరాజ = దేవేంద్రా ! ఏతత్ = ఈ, తత్త్వమ్ = యథార్థము, తే = నీకు, కథితమ్ = చెప్పబడినది. మహాబల = గొప్ప బలము గలవాడా ! విగతత్రాసః = పోయిన భయము గలవాడవై, సురైః సార్ధమ్ = దేవతలతో కూడినవాడవై, యుధ్యస్వ = యుద్ధము చేయుము.

తా. శచీపతి వైన దేవేంద్రా ! నీకు ఈ యథార్థవిషయమును చెప్పినాను. మహాబలశాలీ ! భయపడక, దేవతలతో కలిసి రావణునితో యుద్ధము చేయుము.

మూ. తతో రుద్రాః సహాదిత్యా వసవో మరుతోఽశ్వినౌ,
సంనద్ధా నిర్యయుస్తూర్ణం రాక్షసానభితః పురాత్. 22

ప్ర. అ. తతః = అటుపిమ్మట, రుద్రాః = రుద్రులు, సహాదిత్యాః = ఆదిత్యులతో కూడిన, వసవః = వసువులు, మరుతః = మరుత్తులు, అశ్వినౌ = అశ్వినీ దేవతలు, సంనద్ధాః = యుద్ధానికి సిద్ధమైనవారై, తూర్ణమ్ = శీఘ్రముగా, పురాత్ = పట్టణమునుండి, రాక్షసాన్ అభితః = రాక్షసులకు చుట్టూ, నిర్యయుః = బయలు దేరిరి

తా. పిమ్మట రుద్రులు, ఆదిత్యులు, వసువులు, మరుత్తులు, అశ్వినీ దేవతలు యుద్ధసన్నద్ధులై వెంటనే నగరమునుండి రాక్షసులను చుట్టుటకై బయలు దేరిరి. 22

మూ. ఏతస్మిన్నన్తరే నాదః శుశ్రువే రజనీక్షయే,
తస్య రావణసైన్యస్య ప్రయుద్ధస్య సమన్తతః. 23

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యయందు, రజనీక్షయే = రాత్రి చివర, సమన్తతః = అంతటా, ప్రయుద్ధస్య = యుద్ధముచేయుచున్న, రావణ సైన్యస్య = రావణుని సైన్యముయొక్క, నాదః = ధ్వని, శుశ్రువే = వినబడెను.

తా. ఇంతలో రాత్రి గడచినపిమ్మట యుద్ధము చేయుచున్న రావణ సైన్యము ధ్వని నలుమూలలనుండి వినవచ్చెను. 23

మూ. తే ప్రయుద్ధా మహావీర్యా అన్యోన్యమభివీక్ష్య వై,
సఙ్గ్రామమేవాభిముఖా అభ్యవర్తన్త హృష్టవత్. 24

ప్ర. అ. అన్యోన్యమ్ = పరస్పరము, అభివీక్ష్య = చూచి, మహావీర్యాః = గొప్పపరాక్రమము గల, తే = వారు, ప్రయుద్ధాః = యుద్ధోద్యుక్తులై, హృష్టవత్ = సంతోషించినవారై, అభిముఖాః = అభిముఖులై, సఙ్గ్రామమ్ ఏవ = యుద్ధరంగమును గూర్చి, అభ్యవర్తన్త = వెళ్ళిరి.

తా. మహాపరాక్రమవంతులైన వాళ్ళు ఒకరి నొకరు చూచి, యుద్ధసంనద్ధులై, సంతోషించుచు, ఎదురెదురుగా యుద్ధరంగమునకు వెళ్ళిరి. 24

మూ. తతో దైవతసైన్యానాం సంక్షోభః సమజాయత,
తదక్షయం మహాసైన్యం దృష్ట్వా సమరమూర్ధని. 25

ప్ర. అ. సమరమూర్ధని = యుద్ధాగ్రమునందు, అక్షయమ్ = అక్షయమైన, తత్ = ఆ, మహాసైన్యమ్ = మహాసైన్యమును, దృష్ట్వా = చూచి, తతః = అటుపిమ్మట, దైవతసైన్యానామ్ = దేవతలసైన్యములకు, సంక్షోభః = సంక్షోభము, సమజాయత = కలిగెను.

తా. అప్పుడు యుద్ధరంగమునందు అనంతమైన ఆ రాక్షససైన్యమును చూడగానే దేవతల సైన్యమునందు సంక్షోభము ఏర్పడెను. 25

మూ. తతో యుద్ధం సమభవద్దేవదానవరక్షసామ్,
ఘోరం తుములనిర్హ్రాదం నానాప్రహరణోద్యతమ్. 26

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దేవదానవరక్షసామ్ = దేవతలకు, దానవులకు, రాక్షసులకు, ఘోరమ్ = ఘోరము, తుములనిర్హ్రాదమ్ = వ్యాకులమైన ధ్వని గలది, నానాప్రహరణోద్యతమ్ = ఎత్తబడిన అనేకవిధములైన ఆయుధములు కలదీ అయిన, యుద్ధమ్ = యుద్ధము, సమభవత్ = ఆయెను.

తా. పిమ్మట దేవ-దానవ-రాక్షసుల మధ్య అనేకవిధములైన ఆయుధములను ప్రయోగించుటచే వ్యాకులమైన ధ్వని గల, ఘోరమైన యుద్ధము జరిగెను.

మూ. ఏతస్మిన్నన్తరే శూరా రాక్షసా ఘోరదర్శనాః,
యుద్ధార్థం సమవర్తన్త సచివా రావణస్య తే. 27

మారీచశ్చ ప్రహస్తశ్చ మహాపార్శ్వమహోదరౌ,
అకమ్పనో నికుమ్భశ్చ శుకః సారణ ఏవ చ. 28

సంహ్రాదో ధూమకేతుశ్చ మహాదంష్ట్రో ఘటోదరః,
జమ్బుమాలీ మహాహ్రాదో విరూపాక్షశ్చ రాక్షసః. 29

సుప్తఘ్నో యజ్ఞకోపశ్చ దుర్ముఖో దూషణః ఖరః,
త్రిశిరాః కరవీరాక్షః సూర్యశత్రుశ్చ రాక్షసః, 30
మహాకాయోఽతికాయశ్చ దేవాన్తకనరాన్తకౌ.

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యకాలమునందు, రావణస్య = రావణునియొక్క, సచివాః = మంత్రులైన, శూరాః = శూరులు, ఘోరదర్శనాః = భయంకరమైన దర్శనము కలవారు అయిన, మారీచశ్చ = మారీచుడు, ప్రహస్తః చ = ప్రహస్తుడు, మహాపార్శ్వమహోదరౌ = మహాపార్శ్వమహోదరులు, అకమ్పనః = అకంపనుడు, నికుమ్భః చ = నికుంభుడు, శుకః = శుకుడు, సారణః ఏవ చ = సారణుడు, సంహ్రాదః = సంహ్రాదుడు, ధూమకేతుశ్చ = ధూమకేతువు, మహాదంష్ట్రః = మహాదంష్ట్రుడు, ఘటోదరః = ఘటోదరుడు, జమ్బుమాలీ = జంబుమాలి, మహాహ్రాదః = మహాహ్రాదుడు, రాక్షసః = రాక్షసుడైన, విరూపాక్షశ్చ = విరూపాక్షుడు, సుప్తఘ్నః = సుప్తఘ్నుడు, యజ్ఞకోపః చ = యజ్ఞకోపుడు, దుర్ముఖః = దుర్ముఖుడు, దూషణః = దూషణుడు, ఖరః = ఖరుడు, త్రిశిరాః = త్రిశిరస్సు, కరవీరాక్షః = కరవీరాక్షుడు, రాక్షసః = రాక్షసుడైన, సూర్యశత్రుః = సూర్యశత్రువు, మహాకాయః = మహాకాయుడు, అతికాయః చ = అతికాయుడు, దేవాన్తకనరాన్తకౌ = దేవాంతకనరాంతకులు అను, తే రాక్షసాః = ఆ రాక్షసులు, యుద్ధార్థమ్ = యుద్ధముకొరకు, సమవర్తన్త = వచ్చి చేరిరి.

తా. ఇంతలో శూరులు, చూచుటకు భయంకరులూ అయిన, రావణుని సచివులైన, మారీచ-ప్రహస్త-మహాపార్శ్వ-మహోదరులు, అకంపన-నికుంభ-శుక సారణులు, సంహ్రాద-ధూమకేతు-మహాదంష్ట్ర-ఘటోదర-జంబుమాలి-మహాహ్రాద విరూపాక్షులు, సుప్తఘ్న-యజ్ఞకోప-దుర్ముఖ-దూషణ-ఖరులు, త్రిశిరస్సు. కరవీరాక్ష-సూర్యశత్రు-మహాకాయ- అతికాయ-దేవాంతక- నరాంతకులు అను రాక్షసులు యుద్ధములో పాల్గొనిరి. 27-30

మూ. ఏతైః సర్వైః పరివృతో మహావీర్యైర్మహాబలః, 31
రావణస్యార్యకః సైన్యం సుమాలీ ప్రవివేశ హ.

ప్ర. అ. మహావీర్యైః = గొప్ప పరాక్రమము గల. సర్వైః = సమస్తమైన, ఏతైః = వీరితో, పరివృతః = కూడిన, మహాబలః = గొప్ప బలము గల, రావణస్య ఆర్యకః = రావణునికి పూజ్యుడు అయిన, సుమాలీ = సుమాలి, సైన్యమ్ = సైన్యమును, ప్రవివేశ హ = ప్రవేశించెను.

తా. రావణుని మాతామహుని సోదరుడైన గొప్ప బలము గల సుమాలి మహాపరాక్రమవంతులైన ఆ రాక్షసులందరితో కలిసి సైన్యములో ప్రవేశించెను. 31

మూ సదైవతగణాన్ సర్వాన్ నానాప్రహరణైః శితైః, 32
వ్యధ్వంసయత్సమం క్రుద్ధో వాయుర్జలచరానివ.

ప్ర అ. క్రుద్ధః = కోపించిన, సః = అతడు, శితైః = వాడియైన, నానా ప్రహరణైః = అనేకవిధములైన ఆయుధములచేత, సర్వాన్ = సమస్తమైన, దైవతగణాన్ = దేవతాగణములను, సమమ్ = ఒక్కమారుగా, వాయుః = మేఘము, జలచరానివ = మేఘములనువలె, వ్యధ్వంసయత్ = ఎగురగొట్టెను.

తా. అతడు కోపించి దేవతాసముదాయములను అన్నింటిని, వాడియైన అనేకవిధములైన ఆయుధాలతో, వాయువు మేఘములను వలె, ఒక్కమారుగా ఎగురగొట్టెను. 32

మూ. తద్దైవతబలం రామ హన్యమానం నిశాచరైః, 33
ప్రణున్నం సర్వతో దిగ్భ్యః సింహనున్నా మృగా ఇవ.

ప్ర. అ. రామ = రామా ! నిశాచరైః = రాక్షసులచేత, హన్యమానమ్ = కొట్టబడుచున్న, తత్ = ఆ, దైవతబలమ్ = దేవతాసైన్యము, సింహనున్నాః = సింహముచేత పారద్రోలబడిన, మృగాః ఇవ = మృగములు వలె, సర్వతః = నలువైపులా, దిగ్భ్యః = దిక్కులకొరకు, ప్రణున్నమ్ = పారద్రోలబడినది.

తా. రామా ! రాక్షసులచేత కొట్టబడుచున్న ఆ దేవతాసైన్యము సింహముచేత లేళ్ళ వలె నలుదిక్కులకు పారద్రోలబడెను. 33

మూ. ఏతస్మిన్నన్తరే శూరో వసూనామష్టమో వసుః, 34
సావిత్ర ఇతి విఖ్యాతః ప్రవివేశ రణాజిరమ్.

ప్ర. అ. ఏతస్మిన్ అన్తరే = ఈ మధ్యలో, సావిత్రః ఇతి = సావిత్రుడు అని, విఖ్యాతః = ప్రసిద్ధుడైన, శూరః = శూరుడైన, వసూనామ్ = వసువులలో, అష్టమః = ఎనిమిదవవాడైన, వసుః = వసువు, రణాజిరమ్ = యుద్ధభూమిని, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. ఇంతలో సావిత్రు డను పేరు గల శూరుడైన, వసువులలో ఎనిమిదవవాడైన వసువు యుద్ధభూమిలో ప్రవేశించెను. 34

మూ. సైన్యైః పరివృతో హృష్టైర్నానాప్రహరణోద్యతైః, 35
త్రాసయన్ శత్రుసైన్యాని ప్రవివేశ రణాజిరమ్.

ప్ర. అ. హృష్టైః = సంతోషించిన, నానాప్రహరణోద్యతైః = ఎత్తబడిన అనేకవిధములైన ఆయుధములు గల, సైన్యైః = సైన్యములతో, పరివృతః = కూడినవాడై, శత్రుసైన్యాని = శత్రుసైన్యములను, త్రాసయన్ = భయపెట్టుచు, రణాజిరమ్ = యుద్ధభూమిని, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. ఉత్సాహముతో అనేకవిధములైన ఆయుధములను ఎత్తిన సైన్యములతో కూడినవాడై సావిత్రుడు యుద్ధరంగములో ప్రవేశించెను. 35

మూ. తథాదిత్యౌ మహావీర్యౌ త్వష్టా పూషా చ తౌ సమమ్, 36
నిర్భయౌ సహ సైన్యేన తదా ప్రావిశతాం రణే.

ప్ర. అ. తథా = మరియు, మహావీర్యౌ = గొప్ప పరాక్రమము గల, తౌ = ఆ, త్వష్టా = త్వష్ట, పూషా చ = పూష అను, ఆదిత్యౌ = ఆదిత్యులు, నిర్భయౌ = భయము లేనివారై, సైన్యేన = సైన్యముతో, సమమ్ = ఒక్కమారుగా, రణే = యుద్ధమునందు, ప్రావిశతామ్ = ప్రవేశించిరి.

తా. గొప్ప పరాక్రమము గల త్వష్ట, పూష అను ఆదిత్యులు కూడ భయము లేనివారై, సైన్యముతో ఒక్కమారుగా రణరంగమును ప్రవేశించిరి. 36

మూ. తతో యుద్ధం సమభవత్సురాణాం సహ రాక్షసైః, 37
క్రుద్ధానాం రక్షసాం కీర్తిం సమరేష్వనివర్తినామ్.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, రక్షసామ్=రాక్షసులయొక్క, కీర్తిమ్=కీర్తిని గూర్చి, క్రుద్ధానామ్=కోపించిన, సమరేషు=యుద్ధములయందు, అనివర్తినామ్=వెనుకకు మరలని, సురాణామ్=దేవతలకు, రాక్షసైః సహ=రాక్షసులతో కూడ, యుద్ధమ్=యుద్ధము, సమభవత్=ఆయెను.

తా. అప్పుడు, రాక్షసుల కున్న కీర్తిని గూర్చి కోపించిన, యుద్ధములందు వెనుకకు తిరగని దేవతలకు రాక్షసులతో యుద్ధము జరిగెను. 37

మూ. తతస్తే రాక్షసాః సర్వే విబుధాన్ సమరే స్థితాన్, 38
నానాప్రహరణైర్ఘోరైర్జఘ్నుః శతసహస్రశః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సర్వే=సమస్తమైన, తే రాక్షసాః=ఆ రాక్షసులు, సమరే=యుద్ధమునందు, స్థితాన్=ఉన్న, విబుధాన్=దేవతలను, శతసహస్రశః=వందలకొలది, వేలకొలది, ఘోరైః=భయంకరములైన, నానాప్రహరణైః=అనేకవిధములైన ఆయుధములచేత, నిజఘ్నుః=కొట్టిరి.

తా. అప్పుడు ఆ రాక్షసు లందరూ వందలకొలది, వేలకొలది భయంకరములైన ఆయుధములను యుద్ధరంగములో ఉన్న దేవతలపై ప్రయోగించిరి. 38

మూ. దేవాశ్చ రాక్షసాన్ ఘోరాన్ మహాబలపరాక్రమాన్, 39
సమరే విమలైః శస్త్రైరుపనిన్యుర్యమక్షయమ్.

ప్ర. అ. దేవాశ్చ=దేవతలు కూడ, సమరే=యుద్ధమునందు, మహాబలపరాక్రమాన్=గొప్పబలము, పరాక్రమము గల, ఘోరాన్=భయంకరులైన, రాక్షసాన్=రాక్షసులను, విమలైః=నిర్మలములైన, శస్త్రైః=ఆయుధముల చేత, యమక్షయమ్=యమలోకమును, ఉపనిన్యుః=పొందించిరి.

తా. దేవతలు కూడ గొప్ప బలపరాక్రమములు గల భయంకరులైన రాక్షసులను, యుద్ధరంగమునందు, స్వచ్ఛములైన ఆయుధములచేత యమలోకమునకు పంపిరి. 39

మూ. ఏతస్మిన్నన్తరే రామ సుమాలీ నామ రాక్షసః,
నానాప్రహరణైః క్రుద్ధస్తత్సైన్యం సోఽభ్యవర్తత. 40

ప్ర. అ. రామ = రామా ! ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యకాలములో, సుమాలీ నామ = సుమాలి అను, రాక్షసః = రాక్షసుడు, క్రుద్ధః = కోపించినవాడై, నానాప్రహరణైః = అనేక విధములైన ఆయుధములతో, తత్ = ఆ, సైన్యమ్ = సైన్యమును, అభ్యవర్తత = సమీపించెను.

తా. రామా ! ఇంతలో సుమాలి అను రాక్షసుడు కోపించి, అనేకవిధములైన ఆయుధములతో ఆ దేవతాసైన్యమును ప్రవేశించెను. 40

మూ. స దైవతబలం సర్వం నానాప్రహరణైః శితైః,
వ్యధ్వంసయత సంక్రుద్ధో వాయుర్జలధరం యథా. 41

ప్ర. అ. సః = అతడు, సంక్రుద్ధః = కోపించినవాడై, శితైః = వాడియైన, నానాప్రహరణైః = అనేకవిధములైన ఆయుధములతో, సర్వమ్ = సమస్తమైన, దైవతబలమ్ = దేవతల సైన్యమును, వాయుః = వాయువు, జలధరం యథా = మేఘమునువలె, వ్యధ్వంసయత్ = నశింపచేసెను.

తా. అతడు కోపించి, వాయువు మేఘమును వలె, దేవతాసైన్యము నంతను వాడిగా ఉన్న అనేకవిధములైన ఆయుధములతో నశింపచేసెను. 41

మూ. తే మహాబాణవర్షైశ్చ శూలప్రాసైః సుదారుణైః,
హన్యమానాః సురాః సర్వే న వ్యతిష్ఠన్త సంహతాః. 42

ప్ర. అ. మహాబాణవర్షైః చ = గొప్ప బాణవర్షములచేత, సుదారుణైః = చాల భయంకరములైన, శూలప్రాసైః = శూలములచేత, ప్రాసలచేత, హన్యమానాః = కొట్టబడుచున్న, తే = ఆ, సర్వే = సమస్తమైన, సురాః = దేవతలు, సంహతాః = కలసినవారై, న వ్యతిష్ఠన్త = నిలబడజాలకపోయిరి.

తా. బాణవర్షములతోను, చాల భయంకరములైన శూలములతోను, ప్రాసలతోను అతడు కొట్టుచుండగా ఆ దేవతలందరూ ఒకచోట కలిసి నిలవజాలక పోయిరి. 42

మూ. తతో విద్రావ్యమాణేషు దైవతేషు సుమాలినా,
వసూనామష్టమః క్రుద్ధః సావిత్రో వై వ్యవస్థితః. 43

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సుమాలినా = సుమాలిచేత. దైవతేషు = దేవతలు, విద్రావ్యమాణేషు = పారద్రోలబడుచుండగా, వసూనామ్ = వసువులలో, అష్టమః = ఎనిమిదవవాడైన, సావిత్రః = సావిత్రుడు, క్రుద్ధః = కోపించినవాడై, వ్యవస్థితః = నిలచెను.

తా. దేవత లా విధముగ సుమాలిచేత పారద్రోలబడుచుండగా వసువులలో ఎనిమిదవవాడైన సావిత్రుడు కోపముతో నిలచెను. 43

మూ. సంవృతః స్వైరథానీకైః ప్రహరన్తం నిశాచరమ్,
విక్రమేణ మహాతేజా వారయామాస సంయుగే. 44

ప్ర. అ. అథ = అటుపిమ్మట. మహాతేజాః = గొప్పతేజస్సుగల ఆ సావిత్రుడు, స్వైః = తన సంబంధమైన, అనీకైః = సైన్యములతో, సంవృతః = కూడినవాడై, సంయుగే = యుద్ధమునందు, ప్రహరన్తమ్ = కొట్టుచున్న, నిశాచరమ్ = ఆ రాక్షసుణ్ణి, విక్రమేణ = పరాక్రమముచేత, వారయామాస = నివారించెను.

తా. గొప్ప తేజస్సు గల ఆ సావిత్రుడు తన సైన్యముతో కూడినవాడై, యుద్ధములో ఆ విధముగా కొట్టుచున్న ఆ సుమాలిని పరాక్రమముచేత అడ్డగించెను. 44

మూ. తతస్తయోర్మహద్యుద్ధమభవద్రోమహర్షణమ్,
సుమాలినో వసోశ్చైవ సమరేష్వనివర్తినోః. 45

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సమరేషు = యుద్ధములయందు, అనివర్తినోః = వెనుకకు మరలని, తయోః = ఆ, సుమాలినః = సుమాలికి, వసోః చైవ = వసువుకు. రోమహర్షణమ్ = రోమాంచమును కలిగించు, సుమహత్ = చాల గొప్పదైన, యుద్ధమ్ = యుద్ధము, అభవత్ = అయెను.

తా. పిమ్మట, యుద్ధములో వెనుకకు మరలని ఆ వసు-సుమాలుల మధ్య రోమాంచజనకమైన యుద్ధము జరిగెను. 45

మూ. తత స్తస్య మహాబాణై ర్వసునా సుమహాత్మనా,
నిహతః పన్నగరథః క్షణేన వినిపాతితః. 46

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సుమహాత్మనా = చాల గొప్పవాడైన, వసునా = వసువుచేత, తస్య = ఆ సుమాలియొక్క, పన్నగరథః = సర్పరూపమైన రథము, మహాబాణైః = గొప్ప బాణములచేత, నిహతః = కొట్టబడినదై, క్షణేన = క్షణకాలముచేత, వినిపాతితః = పడగొట్టబడినది.

తా. అప్పుడు మహాత్ముడైన వసువు గొప్ప బాణములు ప్రయోగించి ఆ ఆ సుమాలి వాహనమైన సర్పమును క్షణకాలములో క్రింద పడగొట్టెను. 46

మూ. హత్వా తు సంయుగే తస్య రథం బాణశతై శ్చితమ్,
గదాం తస్య వధార్థాయ వసుర్జగ్రాహ పాణినా. 47

ప్ర. అ. వసుః = వసువు, సంయుగే = యుద్ధమునందు, బాణశతైః = బాణములయొక్క శతములచేత, చితమ్ = వ్యాప్తమైన, తస్య రథమ్ = అతని రథమును, హత్వా = చంపి, తస్య = వానియొక్క, వధార్థాయ = వధకొరకు, పాణినా = హస్తముచేత, గదామ్ = గదను, జగ్రాహ = గ్రహించెను.

తా. వసువు వందలకొలది బాణములు ప్రయోగించి ఆ సుమాలి రథమును చంపి అతనిని చంపుటకై గదను చేతిలో తీసికొనెను. 47

మూ. తతః ప్రగృహ్య దీప్తాగ్రాం కాలదణ్డోపమాం గదామ్,
తాం మూర్ధ్ని పాతయామాస సావిత్రో వై సుమాలినః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సావిత్రః = సావిత్రుడు, దీప్తాగ్రామ్ = ప్రజ్వలించుచున్న అగ్రభాగము గల, కాలదణ్డోపమామ్ = యమదండముతో సమానమైన, గదామ్ = గదను, ప్రగృహ్య = గ్రహించి, తామ్ = దానిని, సుమాలినః = సుమాలియొక్క, మూర్ధ్ని = శిరస్సుమీద, పాతయామాస = పడవేసెను.

తా. సావిత్రుడు మండుచున్న అగ్రభాగము గల, యమదండముతో సమానమైన ఆ గదను సుమాలి శిరస్సుమీద పడవేసెను. 48

మూ. సా తస్యోపరి చోల్కాభా పతన్తీ విబభౌ గదా,
ఇన్ద్రప్రయుక్తా గర్జన్తీ గిరావివ శతహ్రదా. 49

ప్ర. అ. తస్య = వానియొక్క, ఉపరి = పైన, పతన్తీ = పడుచున్న, ఉల్కాభా = కొరవి వంటి కాంతి గల, సా గదా = ఆ గద, గిరౌ = పర్వతము మీద, ఇన్ద్రప్రయుక్తా = ఇంద్రునిచేత ప్రయోగింపబడిన, గర్జన్తీ = గర్జించుచున్న, శతహ్రదా ఇవ = పిడుగు వలె, విబభౌ = ప్రకాశించెను.

తా. ఆ సుమాలి మీద పడుచున్న, కొరవి వంటి ఆ గద ఇంద్రుడు ప్రయోగించగా, గర్జించుచు పర్వతముమీద పడుచున్న పిడుగు వలె ప్రకాశించెను. 49

మూ. తస్య నైవాస్థి న శిరో న మాంసం దదృశే తదా,
గదయా భస్మతాం నీతం నిహతస్య రణాజిరే. 50

ప్ర. అ. తదా = అప్పుడు, రణాజిరే = యుద్ధభూమియందు, నిహతస్య కొట్టబడిన, తస్య = వానియొక్క, అస్థి = ఎముక, నైవ దదృశే = చూడబడ లేదు. శిరః = శిరస్సు, న = చూడబడలేదు. మాంసమ్ = మాంసము, న = చూడబడలేదు. గదయా = గదచేత, భస్మతామ్ = భస్మత్వమును, నీతమ్ = పొందించ బడినది.

తా. అప్పుడు యుద్ధరంగమునందు గదాఘాతముచేత భస్మమైపోవుటచే ఆ సుమాలి ఎముకలు గాని, శిరస్సు గాని, మాంసము గాని కనబడలేదు. 50

మూ. తం దృష్ట్వా నిహతం సంఖ్యే రాక్షసాస్తే సమన్తతః,
వ్యద్రవన్ సహితాః సర్వే క్రోశమానాః పరస్పరమ్. 51
విద్రావ్యమాణా వసునా రాక్షసా నావతస్థిరే.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తవింశః సర్గః.

ప్ర. అ. సంఖ్యే = యుద్ధమునందు, నిహతమ్ = చంపబడిన, తమ్ = వానిని, దృష్ట్వా = చూచి, సర్వే = సమస్తమైన, తే రాక్షసాః = ఆ రాక్షసులు,

సహితాః=కలిసినవారై, పరస్పరమ్=పరస్పరమును, క్రోశమానాః=అరచుచున్న వారై, సమన్తతః = అన్ని వైపులా, వ్యద్రవన్ = పారిపోయిరి. వసువునా = వసువుచేత, విద్రావ్యమాణాః = తరుమబడుచున్నవారై, రాక్షసాః = రాక్షసులు, నావతస్థిరే = నిలవలేదు.

తా. యుద్ధములో సుమాలి మరణించుట చూచి ఆ రాక్షసు లందరూ ఒకరి నొకరు పిలచుకొనుచు, కలిసి, నాలుగు వైపులకు పారిపోయిరి. ఆ వసువు తరిమివేయుచుండగా, రాక్షసులు నిలవజాలకపోయిరి. 51

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ఇరువది ఏడవ సర్గ సమాప్తము.

అథ అష్టావింశః సర్గః

[మేఘనాద-జయంతులు యుద్ధముచేయుట. పులోముడు జయంతుని మరియొకచోటుకి తీసికొనిపోవుట. ఇంద్రుడు యుద్ధరంగములో ప్రవేశించుట. రుద్రులు మరుత్తులు రాక్షససైన్యమును సంహరించుట. ఇంద్రరావణుల యుద్ధము]

మూ. సుమాలినం హతం దృష్ట్వా వసునా భస్మసాత్ కృతమ్,
స్వసైన్యం విద్రుతం చాపి లక్షయిత్వార్దితం సురైః. 1
తతః స బలవాన్ క్రుద్ధో రావణస్య సుతస్తదా,
నివర్త్య రాక్షసాన్ సర్వాన్ మేఘనాదో వ్యవస్థితః. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, బలవాన్ = బలవంతుడైన, సః = ఆ, రావణస్య = రావణునియొక్క, సుతః = కుమారుడైన, మేఘనాదః = మేఘనాదుడు, తదా = అప్పుడు, సుమాలినమ్ = సుమాలిని, హతమ్ = చంపబడిన వానినిగాను, వసునా = వసువుచేత, భస్మసాత్ = భస్మముగా, కృతమ్ = చేయబడిన వానినిగాను, దృష్ట్వా = చూచి, సురైః = దేవతలచేత, అర్దితమ్ = పీడింపబడిన, స్వసైన్యమ్ = తన సైన్యమును, విద్రుతం చాపి = పారిపోవుచున్నదానినిగా, లక్షయిత్వా = గుర్తించి, క్రుద్ధః = కోపించినవాడై, రాక్షసాన్ = రాక్షసులను, సర్వాన్ = అందరినీ, నివర్త్య = మరల్చి, వ్యవస్థితః = నిలబడెను.

తా. అప్పుడు రావణుని కుమారుడూ, బలవంతుడూ అయిన మేఘనాదుడు వసువుచేత సుమాలి భస్మముగా చేయబడి చంపబడినట్లుగాను, దేవతలచేత పీడింపబడిన తన సైన్యము పారిపోవుచున్నట్లూ చూచి, కోపించి ఆ రాక్షసులందరిని వెనుకకు మరల్చి స్థిరముగా నిలబడెను. 1,2

మూ. స రథేనాగ్నివర్ణేన కామగేన మహారథః,
అభిదుద్రావ సేనాం తాం వనాన్యగ్నిరివ జ్వలన్. 3

ప్ర. అ. మహారథః = మహారథుడైన, సః = అతడు, అగ్నివర్ణేన = అగ్నివంటి వర్ణము గల, కామగేన = ఇచ్ఛాప్రకారము నడుచు, రథేన = రథముతో, జ్వలన్ = మండుచున్న, అగ్నిః = అగ్ని, వనానీవ = వనములను వలె. తామ్ = ఆ, సేనామ్ = సేనను గూర్చి, అభిదుద్రావ = ఎదురుగా పరుగెత్తెను.

తా. అతడు అగ్నివంటి వర్ణము గల, తన ఇష్టము ప్రకారము నడిచే రథమును ఎక్కి, మండుచున్న అగ్ని వనముల వైపు శీఘ్రముగా వెళ్ళినట్లు ఆ దేవతాసైన్యముల వైపు శీఘ్రముగా వెళ్ళెను. 3

మూ. తతః ప్రవిశత స్తస్య వివిధాయుధధారిణః,
విదుద్రువుర్దిశః సర్వా దర్శనాదేవ దేవతాః. 4

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ప్రవిశతః = ప్రవేశించుచున్న, వివిధాయుధధారిణః = అనేకవిధములైన ఆయుధములను ధరించుచున్న, తస్య = వాని యొక్క, దర్శనాదేవ = దర్శనమువల్లనే, సర్వాః = సమస్తమైన, దేవతాః = దేవతలు, దిశః = దిక్కులను గూర్చి, విదుద్రువుః = పారిపోయిరి.

తా. అప్పుడు అనేక విధములైన ఆయుధములు ధరించి ప్రవేశించుచున్న అతనిని చూడగానే దేవత లందరూ పారిపోయిరి. 4

మూ. న బభూవ తదా కశ్చిద్యుయుత్సోరస్య సంముఖే,
సర్వానావిద్ధ్య విత్రస్తాం స్తతః శక్రోఽబ్రవీత్సురాన్. 5

ప్ర. అ. తదా = అప్పుడు, యుయుత్సోః = యుద్ధముచేయదలచిన, అస్య = ఈతనియొక్క, సంముఖే = ఎదుట, కశ్చిత్ = ఎవ్వడును, న బభూవ = ఉండలేదు. తతః = అటుపిమ్మట, శక్రః = దేవేంద్రుడు, సర్వాన్ = సమస్తమైన, తాన్ = ఆ, సురాన్ = దేవతలను, ఆవిద్ధ్య = (మాటలతో) కొట్టి, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు యుద్ధము చేయుటకై వచ్చిన ఆ మేఘనాదుని ఎదుట ఎవ్వడూ లేకుండెను. అప్పుడు దేవేంద్రుడు ఆ దేవతల నందరినీ మాటలతో కొట్టి ఇట్లు పలికెను. 5

మూ. న భేతవ్యం న గన్తవ్యం నివర్తధ్వం రణే సురాః,
ఏష గచ్ఛతి పుత్రో మే యుద్ధార్థమపరాజితః. 6

ప్ర. అ. సురాః = దేవతలారా ! న భేతవ్యమ్ = భయపడదగినది కాదు. న గన్తవ్యమ్ = వెళ్ళిపోగూడదు. రణే = యుద్ధమునందు, నివర్తధ్వమ్ = మరలండి. అపరాజితః = ఓడింపబడని, ఏషః = ఈ, మే పుత్రః = నా పుత్రుడు, యుద్ధార్థమ్ = యుద్ధముకొరకు, గచ్ఛతి = వెళ్ళుచున్నాడు.

తా. దేవతలారా ! భయపడవద్దు; పారిపోవద్దు. యుద్ధరంగానికి తిరిగి రండి. ఇదిగో, పరాజయము పొందని నా కుమారుడు యుద్ధానికి వచ్చుచున్నాడు.

మూ. తతః శక్రసుతో దేవో జయన్త ఇతి విశ్రుతః,
రథేనాద్భుతకల్పేన సఙ్గ్రామే సోఽభ్యవర్తత. 7

ప్ర అ. తతః = అటుపిమ్మట, జయన్తః ఇతి = జయంతుడు అని, విశ్రుతః = ప్రసిద్ధుడైన, శక్రసుతః = ఇంద్రుని కుమారుడైన, సః = ఆ, దేవః = దేవుడు, అద్భుతకల్పేన = ఆశ్చర్యకరముగా ఉన్న, రథేన = రథముతో, సఙ్గ్రామే = యుద్ధమునందు, అభ్యవర్తత = వచ్చెను.

తా. అప్పుడు దేవేంద్రుని కుమారుడైన జయంతుడు ఆశ్చర్యకరమైన రథము నెక్కి, యుద్ధమునకు వచ్చెను. 7

మూ. తతస్తే త్రిదశాః సర్వే పరివార్య శచీసుతమ్,
రావణస్య సుతం యుద్ధే సమాసాద్య ప్రజఘ్నిరే. 8

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సర్వే = సమస్తమైన, తే త్రిదశాః = ఆ దేవతలు, శచీసుతమ్ = శచీపుత్రుడైన జయంతుణ్ణి, పరివార్య = చుట్టి, యుద్ధే = యుద్ధమునందు, రావణస్య = రావణునియొక్క, సుతమ్ = కుమారుణ్ణి, సమాసాద్య = సమీపించి, ప్రజఘ్నిరే = కొట్టిరి.

తా. అప్పుడు దేవతలందరూ జయంతుని చుట్టూ చేరి యుద్ధరంగమునకు వెళ్ళి రావణుని కుమారుడైన మేఘనాదునిపై ఆయుధములు ప్రయోగించిరి. 8

మూ. తేషాం యుద్ధం సమభవత్సదృశం దేవరక్షసామ్,
మహేన్ద్రస్య చ పుత్రస్య రాక్షసేన్ద్రసుతస్య చ. 9

ప్ర. అ. తేషామ్ = ఆ, దేవరక్షసామ్ = దేవతలకు రాక్షసులకు, మహేన్ద్రస్య = మహేంద్రునియొక్క, పుత్రస్య చ = పుత్రునకు, రాక్షసేన్ద్రసుతస్య చ = రావణుని పుత్రునకు, సదృశమ్ = తగిన, యుద్ధమ్ = యుద్ధము, సమభవత్ = జరిగెను.

తా. ఆ దేవరాక్షసులకూ, జయంత మేఘనాదులకు మధ్య తగిన యుద్ధము జరిగెను. 9

మూ. తతో మాతలిపుత్రస్య గోముఖస్య స రావణిః,
సారథేః పాతయామాస శరాన్ కనకభూషణాన్. 10

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః రావణిః = ఆ ఇంద్రజిత్తు, సారథేః = సారథియైన, మాతలిపుత్రస్య = మాతలి కుమారుడైన, గోముఖస్య = గోముఖునికి, కనకభూషణాన్ = బంగారము అలంకారముగా గల, శరాన్ = బాణములను, పాతయామాస = పడవేసెను.

తా. అప్పుడు ఆ మేఘనాదుడు జయంతుని సారథిగా ఉన్న, మాతలి పుత్రుడైన గోముఖునిపై బంగారముచేత అలంకరింపబడిన బాణములు కురిపించెను. 10

మూ. శచీసుతశ్చాపి తథా జయన్తస్తస్య సారథిమ్,
తం చాపి రావణిః క్రుద్ధః సమన్తాత్ప్రత్యవిధ్యత. 11

ప్ర. అ. తథా = అట్లే, శచీసుతః = శచీదేవి పుత్రుడైన, జయన్తః = జయంతుడు, తస్య = వానియొక్క, సారథిమ్ = సారథిని, క్రుద్ధః = కోపించిన, రావణిః చాపి = మేఘనాదుడు, తం చాపి = అతనినీ, సమన్తాత్ = అంతటా, ప్రత్యవిధ్యత = కొట్టెను.

తా. శచీపుత్రుడైన జయంతుడు మేఘనాదుని సారథిని కొట్టగా, మేఘనాదుడు కోపముతో జయంతుణ్ణి బాణాలతో వేధించెను. 11

మూ. స హి క్రోధసమావిష్టో బలీ విస్ఫారితేక్షణః,
రావణిః శక్రతనయం శరవర్షైరవాకిరత్. 12

ప్ర. అ. బలీ = బలవంతుడైన, సః = ఆ, రావణిః = రావణపుత్రుడు, క్రోధసమావిష్టః = క్రోధముతో నిండినవాడై. విస్ఫారితేక్షణః = పెద్దవి చేయబడిన నేత్రములు కలవాడై. శక్రతనయమ్ = శక్రుని కుమారుణ్ణి. శరవర్షైః = బాణ వర్షములచేత, ఆవాకిరత్ = చిమ్మెను.

తా. బలశాలియైన ఇంద్రజిత్తు కోపావేశముతో కళ్ళు పెద్దవి చేసి జయంతునిమీద శరవర్షము కురిపించెను. 12

మూ. తతో నానాప్రహరణాన్ శితధారాన్ సహస్రశః,
పాతయామాస సంక్రుద్ధః సురసైన్యేషు రావణిః. 13

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సంక్రుద్ధః = కోపించిన, రావణిః = మేఘనాదుడు, శితధారాన్ = వాడియైన అంచులు గల, సహస్రశః = వేలకొలది, నానాప్రహరణాన్ = అనేకవిధములైన ఆయుధములను, సురసైన్యేషు = దేవతల సైన్యములమీద, పాతయామాస = పడవేసెను.

తా. అప్పుడు మేఘనాదుడు కోపముతో వాడియైన అంచులు ఉన్న వేలకొలది ఆయుధములను దేవతల సైన్యముమీద ప్రయోగించెను. 13

మూ. శతఘ్నీముసలప్రాసగదాఖడ్గపరశ్వధాన్,
మహాన్తి గిరిశృఙ్గాణి పాతయామాస రావణిః. 14

ప్ర. అ. రావణిః = రావణుని కుమారుడు, శతఘ్నీముసలప్రాసగదాఖడ్గ పరశ్వధాన్ = శతఘ్నులను, రోకళ్ళను, ప్రాసములను, గదలను, ఖడ్గములను, గొడ్డళ్ళను, మహాన్తి = గొప్పవైన, గిరిశృఙ్గాణి = పర్వతశిఖరములను, పాతయామాస = పడవేసెను.

తా. మేఘనాదుడు శతఘ్నీ-ముసల-ప్రాస-గదా-ఖడ్గ-పరశ్వధములను, పెద్ద పర్వతశిఖరములను దేవతాసైన్యముమీద ప్రయోగించెను. 14

మూ. తతః ప్రవ్యథితా లోకాః సంజజ్ఞే చ తమో మహత్,
తస్య రావణపుత్రస్య శత్రుసైన్యాని నిఘ్నతః. 15

ప్ర. అ. తస్య = ఆ, రావణపుత్రస్య = మేఘనాదుడు, శత్రుసైన్యాని =

శత్రుసైన్యములను, నిఘ్నతః = కొట్టుచుండగా, తతః = అటుపిమ్మట, లోకాః = లోకములు, ప్రవ్యథితాః = వ్యథ చెందినవి. మహత్ = గొప్ప. తమః = చీకటి, సంజజ్ఞే = పుట్టెను.

తా. ఆ మేఘనాదుడు శత్రుసైన్యములను సంహరించుచున్నప్పుడు లోకములన్నీ వ్యథ చెందినవి. దట్టమైన చీకటి అలముకొనెను. 15

మూ. తతస్తద్దైవతబలం సమన్తాత్తం శచీసుతమ్,
బహుప్రకారమస్వస్థమభవచ్ఛరపీడితమ్. 16

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తం శచీసుతం సమన్తాత్ = ఆ జయంతుని చుట్టూ ఉన్న, తత్ = ఆ, దైవతబలమ్ = దేవతాసైన్యము, శరపీడితమ్ = బాణముల చేత పీడింపబడినదై, బహుప్రకారమ్ = అనేకవిధముల, అస్వస్థమ్ = స్వాస్థ్యము లేనిది, అభవత్ = అయెను.

తా. అప్పుడు జయంతుని చుట్టూ ఉన్న ఆ దేవతాసైన్యము బాణములచేత పీడింపబడినదై అనేకవిధముల అస్వస్థము అయినది. 16

మూ. నాభ్యజానన్త చాన్యోన్యం రక్షో వా దేవతాథవా,
తత్ర తత్ర విపర్యస్తం సమన్తాత్పర్యధావత. 17

ప్ర. అ. రక్షో వా = రాక్షసుడా, అథవా = లేక, దేవతా = దేవతయా అని, పరస్పరమ్ = ఒకరిని నొకరు, నాభ్యజానన్త = గుర్తుపట్టలేదు. తత్ర తత్ర = ఆ యా ప్రదేశములయందు, విపర్యస్తమ్ = విపర్యాసమును చెందినదై, సమన్తాత్ = అన్నివైపులా, పర్యధావత = పరుగెత్తెను.

తా. ఆసైన్యములలోనివారు ఎవరు రాక్షసులో, ఎవరు దేవతలో గుర్తించజాలకపోయిరి. ఆ సైన్య మంతా ఇటు అటు తారుమారగుచు అన్ని వైపులా పరుగెత్తెను. 17

మూ. దేవా దేవాన్నిజఘ్నుస్తే రాక్షసా రాక్షసాంస్తథా,
సంమూఢాస్తమసా ఛన్నా వ్యద్రవన్నపరే తథా. 18

ప్ర. అ. తమసా = చీకటిచేత, ఛన్నాః = కప్పబడినవారై, సంమూఢాః

=ఏమీ తెలియనివారై, తే=ఆ, దేవాః=దేవతలు, దేవాన్ = దేవతలను, తథా= మరియు, రాక్షసాః = రాక్షసులు, రాక్షసాన్ = రాక్షసులను, నిజఘ్నుః=కొట్టిరి. తథా=మరియు, అపరే = ఇతరులు, వ్యద్రవన్=పారిపోయిరి.

తా. చీకటి ఆవరించుటచేత ఏమీ తెలియక దేవతలు దేవతలను, రాక్షసులు రాక్షసులను కొట్టిరి. మరికొందరు దూరముగా పారిపోయిరి. 18

మూ. ఏతస్మిన్నన్తరే వీరః పులోమా నామ వీర్యవాన్,
దైత్యేన్ద్రస్తేన సంగృహ్య శచీపుత్రోఽపవాహితః. 19

ప్ర. అ. పులోమా నామ = పులోము డను, వీర్యవాన్ = పరాక్రమవంతు డైన, వీరః = వీరుడైన, దైత్యేన్ద్రః = దైత్యుల ప్రభువు ఉన్నాడు. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యకాలమునందు, తేన = అతనిచేత, శచీపుత్రః=జయంతుడు, సంగృహ్య = పట్టుకొని, అపవాహితః = దూరముగా తొలగించబడినాడు.

తా. ఇంతలో పరాక్రమవంతుడు, వీరుడు అయిన పులోము అను దైత్యరాజు వచ్చి జయంతుణ్ణి అక్కడినుండి దూరముగా తీసుకొనిపోయెను. 19

మూ. సంగృహ్య తం తు దౌహిత్రం ప్రవిష్టః సాగరం తదా,
ఆర్యకః స హి తస్యాసీత్పులోమా యేన సా శచీ. 20

ప్ర. అ. తదా = అప్పుడు, దౌహిత్రమ్ = దౌహిత్రుడైన, తమ్ = ఆ జయంతుణ్ణి, సంగృహ్య = గ్రహించి, సాగరమ్ = సముద్రమును, ప్రవిష్టః = ప్రవేశించినాడు. సా = ఆ, శచీ = శచీదేవి, యేన = ఎవనిచేత పుట్టినదో, సః = అట్టి పులోమా = పులోము, తస్య = వానియొక్క, ఆర్యకః = పూజ్యుడైన మాతామహుడు, ఆసీత్ హి = అయి ఉండెను కదా?

తా. శచీదేవి తండ్రియైన ఆ పులోముడు జయంతునకు మాతామహుడు, అందుచే అతడు ఆ జయంతుణ్ణి తీసికొనిపోయి సముద్రములో ప్రవేశించెను. 20

మూ. జ్ఞాత్వా ప్రణాశం తు తదా జయన్తస్యాథ దేవతాః,
అప్రహృష్టాస్తత స్సర్వా వ్యథితాః సంప్రదుద్రువుః. 21

ప్ర. అ. తదా=అప్పుడు, దేవతాః=దేవతలు, జయన్తస్య=జయంతుని

యొక్క, ప్రణాశమ్=కనబడకపోవుటను, జ్ఞాత్వా=తెలిసికొని, అప్రహృష్టాః=సంతోషము లేనివారై, వ్యథితాః=వ్యథచెందినవారై, సర్వాః=అందరూ కూడ, సంప్రదుద్రువుః = పారిపోయిరి.

తా. అప్పుడు జయంతుడు కనబడకపోవుటచే వ్యథ చెందిన దేవతలందరూ సంతోషవిహీనులై పారిపోయిరి. 21

మూ. రావణిస్త్వథ సంక్రుద్ధో బలైః పరివృతః స్వకైః,
అభ్యధావత దేవాంస్తాన్ ముమోచ చ మహాస్వనమ్. 22

ప్ర. అ. అథ=అటు పిమ్మట, రావణిః తు=మేఘనాదుడైతే, సంక్రుద్ధః=కోపించినవాడై, స్వకైః = తన సంబంధమైన, బలైః = సేనలతో, పరివృతః = కూడినవాడై, తాన్ = ఆ, దేవాన్=దేవతలను గూర్చి, అభ్యధావత = పరుగెత్తెను. మహాస్వనమ్ = గొప్ప ధ్వనిని, ముమోచ చ = విడచెను. కూడ.

తా. అప్పుడు కోపించిన మేఘనాదుడు గొప్ప ధ్వని చేయుచు, తన సైన్యముతో దేవతలమీదికి పరుగెత్తెను. 22

మూ. దృష్ట్వా ప్రణాశం పుత్రస్య దైవతేషు చ విద్రుతమ్,
మాతలిం చాహ దేవేశో రథః సముపనీయతామ్. 23

ప్ర. అ. పుత్రస్య=కుమారునియొక్క, ప్రణాశమ్ = కనబడపోవుటను, దైవతేషు = దేవతలయందు, విద్రుతం చ = పారిపోవుటను, దృష్ట్వా = చూచి, దేవేశః = దేవేంద్రుడు, మాతలిమ్ = మాతలిని గూర్చి, ఆహ చ = పలికెను. రథః = రథము, సముపనీయతామ్ = తీసికొని రాబడుగాక.

తా. పుత్రుడైన జయంతుడు కనబడకపోవుటను, దేవతలు పారిపోవుటను చూచి దేవేంద్రుడు మాతలిని "నా రథము తీసికొనిరమ్ము"అని ఆజ్ఞాపించెను. 23

మూ. స తు దివ్యో మహాభీమః సజ్జ ఏవ మహారథః,
ఉపస్థితో మాతలినా వాహ్యమానో మహాజవః. 24

ప్ర. అ. సజ్జః ఏవ = సిద్ధముగానే ఉన్న, మహాభీమః = చాల భయంకరమైన, దివ్యః=దివ్యమైన, మాతలినా=మాతలిచేత, వాహ్యమానః=తోలబడుచున్న,

మహాజవః = గొప్ప వేగము గల, సః మహారథః తు = ఆ మహారథమైతే, ఉప స్థితః = వచ్చినది.

తా. చాల భయంకరమైన దివ్యమైన ఆ మహారథము సిద్ధముగానే ఉండెను. మాతలి మహావేగముతో తోలుకొని రాగా అది వచ్చి నిలిచెను. 24

మూ. తతో మేఘా రథే తస్మిం స్తడిత్వన్తో మహాబలాః,
అగ్రతో వాయుచపలా నేదుః పరమనిఃస్వనాః. 25

ప్ర. అ. తతః=అటుపిమ్మట, తడిత్వన్తః=మెరుపులు గల, మహాబలాః = గొప్ప బలము గల, వాయుచపలాః = గాలిచేత కదలుచున్న, పరమనిః స్వనాః=గొప్ప ధ్వని గల, మేఘాః = మేఘములు, తస్మిన్ = ఆ, రథే=రథమునందు, అగ్రతః = ఎదట, నేదుః = ధ్వనిచేసినవి.

తా. అప్పుడు మెరుపులతో కూడిన, గొప్ప బలము గల, అధికమైన ధ్వని గల, గాలికి కదలుచున్న మేఘాలు ఆ రథమునకు ముందు భాగమునందు ధ్వని చేసినవి. 25

మూ. నానావాద్యాని వాద్యన్త గన్ధర్వాశ్చ సమాహితాః,
ననృతుశ్చాప్సరఃసంఘా నిర్యాతే త్రిదశేశ్వరే. 26

ప్ర. అ. త్రిదశేశ్వరే = దేవేంద్రుడు, నిర్యాతే = బయలుదేరినవాడగుచుండగా, గన్ధర్వాః=గంధర్వులు, సమాహితాః=సావధానచిత్తులై, నానావాద్యాని= అనేకవిధములైన వాద్యములను, వాద్యన్త = ప్రమోగించిరి. అప్సరఃసంఘాః చ = అప్సరసల సముదాయములుకూడ, ననృతుః = నృత్యము చేసినవి.

తా. దేవేంద్రుడు బయలుదేరగానే గంధర్వులు సావధానచిత్తులై అనేకవిధములైన వాద్యములను ప్రమోగించిరి. అప్సరఃస్త్రీలు నృత్యము చేసిరి. 26

మూ. రుద్రైర్వసుభిరాదిత్యైరశ్విభ్యాం స మరుద్గణైః,
వృతో నానాప్రహరణైర్నిర్యయౌ త్రిదశాధిపః. 27

ప్ర. అ. సః త్రిదశాధిపః=ఆ దేవేంద్రుడు, నానాప్రహరణైః=అనేకవిధములైన ఆయుధములు గల, రుద్రైః = రుద్రులతోను, వసుభిః = వసువులతోను,

అశ్విభ్యామ్ = అశ్వినీదేవతలతోను, వృతః = కూడినవాడై, నిర్యయౌ = బయ లేవెడలెను.

తా. దేవేంద్రుడు అనేకవిధములైన ఆయుధములు ధరించిన రుద్రులతోను, వసువులతోను, ఆదిత్యులతోను, అశ్వినీదేవతలతోను, మరుద్గణములతోను కలిసి బయలుదేరెను. 27

మూ. నిర్గచ్ఛతస్తు శక్రస్య పరుషః పవనో వవౌ,
భాస్కరో నిష్ప్రభశ్చైవ మహోల్కాశ్చ ప్రపేదిరే. 28

ప్ర. అ. శక్రస్య = దేవేంద్రుడు, నిర్గచ్ఛతః = బయలుదేరుచుండగా, పవనః = వాయువు, పరుషః = పరుషమై, వవౌ = వీచెను. భాస్కరః చైవ = సూర్యుడు కూడ, నిష్ప్రభః=కాంతివిహీను డయ్యెను. మహోల్కాః చ = గొప్ప ఉల్కలు, ప్రపేదిరే = పొందినవి.

తా. దేవేంద్రుడు బయలుదేరు సమయమునందు గాలి పరుషముగా వీచెను. సూర్యుని కాంతి తగ్గెను. పెద్ద ఉల్కలు (కొరవులవంటి నిప్పుముద్దలు) పడెను.

మూ. ఏతస్మిన్నన్తరే శూరో దశగ్రీవః ప్రతాపవాన్,
ఆరురోహ రథం దివ్యం నిర్మితం విశ్వకర్మణా. 29

ప్ర. అ. ఏతస్మిన్ అన్తరే = ఈ మధ్యకాలములో, శూరః = శూరుడు, ప్రతాపవాన్ = ప్రతాపవంతుడూ అయిన, దశగ్రీవః=రావణుడు, విశ్వకర్మణా= విశ్వకర్మచేత, నిర్మితమ్ = నిర్మించబడిన, దివ్యమ్ = దివ్యమైన, రథమ్ = రథమును, ఆరురోహ = ఎక్కెను.

తా. ఇంతలో శూరుడు, ప్రతాపవంతుడూ అయిన రావణుడు విశ్వకర్మ నిర్మించిన దివ్యమైన రథము నెక్కెను. 29

మూ. పన్నగైః సుమహాకాయైర్వేష్టితం లోమహర్షణైః,
యేషాం నిఃశ్వాసవాతేన ప్రదీప్తమివ సంయుగే. 30

ప్ర. అ. సుమహాకాయైః = చాల పెద్ద శరీరములు గల, లోమహర్షణైః= రోమాంచమును కలిగించు, పన్నగైః=సర్పములచేత, వేష్టితమ్ = చుట్టుకొనబడిన

(రథము నెక్కెను). యేషామ్ = వేటియొక్క, నిఃశ్వాసవాతేన = నిట్టూర్పుల గాలిచేత, సంయుగే = యుద్ధమునందు, ప్రదీప్తమ్ ఇవ = మండుచున్నట్లు ఉండెనో.

తా. ఆ రథమును పెద్ద శరీరములు గల భయంకరములైన సర్పములు చుట్టుకొని ఉండెను. వాటి శ్వాసవాయువులచే యుద్ధములో మంటలు చెలరేగు చుండెను. 30

మూ. దైత్యైర్నిశాచరైశ్చైవ స రథః పరివారితః,
సమరాభిముఖో దైత్యో మహేన్ద్రం సోఽభ్యవర్తత. 31

ప్ర. అ. సః రథః = ఆ రథము, దైత్యైః = దైత్యులచేతను, నిశాచరైశ్చైవ = రాక్షసులచేతను, పరివారితః = చుట్టబడినది. సమరాభిముఖః = యుద్ధమునకు అభిముఖుడైన, సః దైత్యః = ఆ రాక్షసుడు, మహేన్ద్రమ్ = మహేంద్రుణ్ణి, అభ్యవర్తత = ఎదురుగా వెళ్ళి సమీపించెను.

తా. ఆ రథము చుట్టూ దైత్యులు, రాక్షసులు చేరిరి. ఆ రాక్షసుడు యుద్ధాభిముఖుడై మహేంద్రునకు ఎదురుగా వెళ్ళెను. 31

మూ. పుత్రం తం వారయిత్వా తు స్వయమేవ వ్యవస్థితః,
సోఽపి యుద్ధాద్వినిష్క్రమ్య రావణిః సముపావిశత్. 32

ప్ర. అ. తం పుత్రమ్ = ఆ పుత్రుణ్ణి, వారయిత్వా = నివారించి, స్వయమేవ = స్వయంగానే, వ్యవస్థితః = నిలచెను. సః రావణిః అపి = ఆ మేఘనాదుడు కూడ, యుద్ధాత్ = యుద్ధమునుండి, వినిష్క్రమ్య = బైటకువచ్చి, సముపావిశత్ = కూర్చుండెను.

తా. అతడు కుమారుడైన మేఘనాదుణ్ణి నివారించి స్వయముగ యుద్ధము చేయుటకు నిలచెను. మేఘనాదుడు యుద్ధరంగమునుండి బైటకు వచ్చి కూర్చుండెను. 32

మూ. తతో యుద్ధం ప్రవృత్తం తు సురాణాం రాక్షసైః సహ,
శస్త్రాణి వర్షతాం తేషాం మేఘానామివ సంయుగే. 33

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సంయుగే = యుద్ధమునందు, మేఘానా

మివ = మేఘముల వలె, శస్త్రాణి=ఆయుధములను, వర్షతామ్ = వర్షించుచున్న, తేషామ్ = ఆ, సురాణామ్ = దేవతలకు, రాక్షసైః సహ = రాక్షసులతో కూడ, యుద్ధమ్ = యుద్ధము, ప్రవృత్తమ్ = ప్రారంభమైనది.

తా. పిమ్మట మేఘముల వలె, యుద్ధములో శస్త్రములు వర్షించుచున్న దేవతలకు రాక్షసులతో యుద్ధము ప్రారంభ మయ్యెను 33

మూ. కుమ్భకర్ణస్తు దుష్టాత్మా నానాప్రహరణోద్యతః,
నాజ్ఞాయత తదా రాజన్ యుద్ధం కేనాభ్యపద్యత. 34

ప్ర. అ. రాజన్ = రాజా ! నానాప్రహరణోద్యతః = ఎత్తబడిన అనేక విధములైన ఆయుధములు గల, దుష్టాత్మా = దుష్టబుద్ధియైన, కుమ్భకర్ణస్తు = కుంభకర్ణుడైతే, తదా = అప్పుడు, కేన = ఎవనితో, యుద్ధమ్ = యుద్ధమును, అభ్యపద్యత = పొందెనో, నాజ్ఞాయత = తెలియబడలేదు.

తా. రామా! ఆ సమయమునందు అనేక విధములైన ఆయుధములు ధరించిన దుష్టాత్ముడైన కుంభకర్ణుడు ఎవరితో యుద్ధము చేసినాడో తెలియలేదు. 34

మూ. దన్తైః పాదైర్భుజైర్హస్తైః శక్తితోమరముద్గరైః,
యేన తేనైవ సంక్రుద్ధస్తాడయామాస దేవతాః. 35

ప్ర. అ. సంక్రుద్ధః = కోపించిన ఆ కుంభకర్ణుడు, దన్తైః = దంతముల చేత, పాదైః=పాదములచేత, భుజైః=భుజములచేత, హస్తైః=చేతులచేత, శక్తితోమరముద్గరైః = శక్తి-తోమర-ముద్గరములచేత, యేన తేనైవ = ఏదో ఒకదానిచేత, దేవతాః = దేవతలను, తాడయామాస = కొట్టెను.

తా. కోపావేశముతో అతడు దంతాలచేత, పాదాలచేత, భుజాలచేత, హస్తాలచేత, శక్తులచేత, తోమరములచేత, ముద్గరములచేత, ఏది దొరికితే దానిచేత రాక్షసులను కొట్టెను. 35

మూ. స తు రుద్రైర్మహాఘోరైః సంగమ్యాథ నిశాచరం,
ప్రయుద్ధ సైశ్చ సఙ్గ్రామే క్షతః శస్త్రైర్నిరన్తరమ్. 36

ప్ర. అ. అథ = అటుపిమ్మట, ప్రయుద్ధః=బాగా యుద్ధము చేయుచున్న, సః నిశాచరః తు= ఆ రాక్షసుడు, సఙ్గ్రామే = యుద్ధమునందు, మహాఘోరైః =

చాల భయంకరులైన, రుద్రైః = రుద్రులచేత, సఙ్గమ్య = కలసి, నిరన్తరమ్ = అవకాశము లేకుండు నట్లు, శస్త్రైః = ఆయుధములచేత, క్షతః = కొట్టబడెను.

తా. చాల భయంకరులైన రుద్రులు యుద్ధమునందు కలసి వచ్చి, యుద్ధము చేయుచున్న ఆ కుంభకర్ణుణ్ణి ఎడతెరిపి లేకుండా ఆయుధాలతో కొట్టిరి. 36

మూ. బభౌ శస్త్రాచితతనుః కుమ్భకర్ణః క్షరన్నసృక్,
విద్యుత్ స్తనితనిర్ఘోషో ధారావానివ తోయదః. 37

ప్ర. అ. శస్త్రాచితతనుః = ఆయుధములచేత వ్యాప్తమైన శరీరము గల, అసృక్ = రక్తమును, క్షరన్ = స్రవించుచున్న, కుమ్భకర్ణః = కుంభకర్ణుడు, విద్యుత్ స్తనితనిర్ఘోషః = మెరుపులతో ఉరుములతో కూడిన, ధారావాన్ = జలధార గల, తోయదః ఇవ = మేఘము వలె, బభౌ = ప్రకాశించెను.

తా. శరీరమంతా ఆయుధములు గ్రుచ్చుకొని, రక్తమును స్రవించుచున్న ఆ కుంభకర్ణుడు మెరుపులతో, పిడుగులతో కూడిన మేఘమువలె ప్రకాశించెను.

మూ. తతస్తద్రాక్షసం సైన్యం ప్రయుద్ధం సమరుద్గణైః,
రణే విద్రావితం సర్వం నానాప్రహరణైస్తదా. 38

ప్ర. అ. తతః = అటు పిమ్మట, సమరుద్గణైః = మరుద్గణములతో కూడిన రుద్రులచేత, ప్రయుద్ధమ్ = యుద్ధముచేయుచున్న, సర్వమ్ = సమస్తమైన, తత్ = ఆ, రాక్షసమ్ = రాక్షసులకు సంబంధించిన, సైన్యమ్ = సైన్యము, తదా = అప్పుడు, నానాప్రహరణైః = అనేకవిధములైన ఆయుధములచేత, రణే = యుద్ధమునందు, విద్రావితమ్ = పారద్రోలబడినది.

తా. అప్పుడు యుద్ధరంగములో బాగా యుద్ధము చేయుచున్న ఆ రాక్షస సైన్యమును అంతనూ మరుద్గణములతో కూడిన రుద్రులు, అనేకవిధములైన ఆయుధములు ప్రయోగించి పారిపోవునట్లు చేసిరి. 38

మూ. కేచిద్వినిహతాః కృత్తాశ్చేష్టన్తి స్మ మహీతలే,
వాహనేష్వవసక్తాశ్చ స్థితా ఏవాపరే రణే. 39

ప్ర. అ. వినిహతాః = కొట్టబడిన, కేచిత్ = కొందరు, కృత్తాః = ఛేదించ

బడినవారై, మహీతలే = నేలమీద, చేష్టన్తి స్మ = కొట్టుకొనుచున్నారు. అపరే = ఇతరులు, రణే = యుద్ధమునందు, వాహనేషు = వాహనములయందు, అవసక్తాః = తగుల్కొన్నవారై, స్థితాః ఏవ = అట్లే ఉండిపోయిరి.

తా. దెబ్బలు తిన్న కొందరు దేహాలు తెగిపోవుటచే నేలమీద పడి కాళ్ళు చేతులు కొట్టుకొనుచుండిరి. మరికొందరు వాహనాలపై తగుల్కొని అట్లే ఉండి పోయిరి. 39

మూ. రథాన్నాగాన్ ఖరానుష్ట్రాన్ పన్నగాంస్తురగాంస్తథా,
శింశుమారాన్వరాహాంశ్చ పిశాచవదనానపి. 40

తాన్ సమాలిఙ్గ్య బాహుభ్యాం విష్టబ్ధాః కేచిదుత్థితాః,
దేవైస్తు శస్త్రసంభిన్నా మమ్రిరే చ నిశాచరాః. 41

ప్ర అ. విష్టబ్ధాః = బిగిసికొనిపోయిన, కేచిత్ = కొందరు, నిశాచరాః = రాక్షసులు, రథాన్ = రథములను, నాగాన్ = ఏనుగులను, ఖరాన్ = గాడిదలను, ఉష్ట్రాన్ = ఒంటెలను, పన్నగాన్ = సర్పములను, తథా మరియు, తురగాన్ = గుఱ్ఱములను, శింశుమారాన్ = శింశుమారములను, వరాహాన్ చ = వరాహములను, పిశాచవదనానపి = పిశాచముల వంటి ముఖములు గల, తాన్ = ఆ జంతువులను, బాహుభ్యామ్ = చేతులచేత, సమాలిఙ్గ్య = కౌగలించుకొని, ఉత్థితాః = లేచినవారై, దేవైః = దేవతలచేత, శస్త్రసంభిన్నాః = ఆయుధములచేత బ్రద్దలుకొట్టబడినవారై, మమ్రిరే = మరణించిరి.

తా. దేహము బిగిసిపోయిన కొందరు రాక్షసులు బాహువులతో తమ ప్రక్క నున్న రథాలను, ఏనుగులను, గాడిదలను, ఒంటెలను, సర్పాలను, గుఱ్ఱములను, శింశుమారములను, వరాహములను పిశాచముఖములు గల జంతువులను, పట్టుకొని లేచుచుండగా వాళ్ళను దేవతలు ఆయుధాలచేత చేదించివేయుటచేత వాళ్లు మరణించిరి. 40,41

మూ. చిత్రకర్మ ఇవాభాతి సర్వేషాం రణసంప్లవః,
నిహతానాం ప్రసుప్తానాం రాక్షసానాం మహీతలే. 42

ప్ర. అ. నిహతానామ్ = చంపబడిన, మహీతలే = నేలమీద, ప్రసుప్తానామ్ =

న్రిదించిన, సర్వేషామ్ = సమస్తమైన, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, రణ సంప్లవః = యుద్ధరంగములో సంమర్దము, చిత్రకర్మ ఇవ = చిత్రకర్మవలె, అభాతి = ప్రకాశించుచున్నది.

తా. ఆ రాక్షసులందరూ చచ్చి నేలమీద పడి ఉండుటచే ఆ యుద్ధభూమి అంతా చిత్తరువులో చిత్రించినట్లు ఉండెను. 42

మూ. శోణితోదకనిష్యన్దా కాకగృధ్రసమాకులా,
ప్రవృత్తా సంగరముఖే శస్త్రగ్రాహవతీ నదీ. 43

ప్ర. అ. సంగరముఖే=యుద్ధరంగముఖమునందు, శోణితోదకనిష్యన్దా= రక్తమనే ఉదకముయొక్క ప్రవాహము గల, కాకగృధ్రసమాకులా = కాకులతోను, గ్రద్దలతోను వ్యాకులముగా ఉన్న, శస్త్రగ్రాహవతీ = ఆయుధములే మొసళ్లుగా గల, నదీ = నది, ప్రవృత్తా = ప్రవహించినది.

తా. ఆ రణరంగమునందు రక్తమనే ఉదకప్రవాహముతో, ఆయుధము లనే మొసళ్ళతో కూడి, కాకులతోను, గ్రద్దలతోను నిండిన నది ప్రవహించినది. 43

మూ. ఏతస్మిన్నన్తరే క్రుద్ధో దశగ్రీవః ప్రతాపవాన్,
నిరీక్ష్య తు బలం సర్వం దైవతైర్వినిపాతితమ్. 44

స తం ప్రతివిగాహ్యాశు ప్రవృద్ధం సైన్యసాగరమ్,
త్రిదశాన్ సమరే నిఘ్నన్ శక్రమేవాభ్యవర్తత. 45

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యకాలములో, ప్రతాపవాన్ = ప్రతాపవంతుడైన, సః = ఆ, దశగ్రీవః = రావణుడు, దైవతైః = దేవతలచేత, వినిపాతితమ్=పడగొట్టబడిన, సర్వమ్ = సమస్తమైన, బలమ్=సేనను, నిరీక్ష్య= చూచి, క్రుద్ధః = కోపించినవాడై, ఆశు = శీఘ్రము, ప్రవృద్ధమ్ = వృద్ధిపొందిన, తం సైన్యసాగరమ్ = ఆ సైన్యసముద్రమును, ప్రతివిగాహ్య = ప్రవేశించి, సమరే = యుద్ధమునందు, త్రిదశాన్=దేవతలను, నిఘ్నన్ = కొట్టుచు శక్రమ్ ఏవ= దేవేంద్రుడ్డే, అభ్యవర్తత = ఎదిరించి వెళ్ళెను.

తా. ఇంతలో ప్రతాపవంతుడైన రావణుడు తన సైన్యమును దేవతలు పడ

గొట్టుటచూచి, కోపించి, పెరిగిపోవుచున్న ఆ దేవతాసైన్య సముద్రములో వెంటనే ప్రవేశించి, దేవతలను యుద్ధములో కొట్టుచు ఇంద్రునిమీదికి వెళ్ళెను. 44,45

మూ. ఆగాచ్ఛక్రో మహచ్చాపం విస్ఫార్య సుమహాస్వనమ్,
యస్య విస్ఫారఘోషేణ స్వనన్తి స్మ దిశో దశ. 46

ప్ర. అ. శక్రః=దేవేంద్రుడు, యస్య=దేనియొక్క, విస్ఫారఘోషేణ=చరచుటవలన కలిగిన ధ్వనిచేత, దశ=పది, దిశః = దిక్కులు, స్వనన్తి=ధ్వని చేయుచున్నవో అట్టి, సుమహాస్వనమ్ = చాల గొప్ప ధ్వని గల, మహత్ = గొప్పదైన, చాపమ్ = ధనస్సును విస్ఫార్య = చరచి, ఆగాత్ = ముందుకు వచ్చెను.

తా. దేవేంద్రుడు గొప్ప ధ్వని గల పెద్ద ధనస్సును చరచుచు ముందుకు వచ్చెను. దానిని చరచుటవలన కలిగిన ధ్వనికి పది దిక్కులూ మార్మ్రోగుచుండెను. 46

మూ. తద్వికృష్య మహచ్చాపమిన్ద్రో రావణమూర్ధని,
పాతయామాస స శరాన్ పావకాదిత్యవర్చసః. 47

ప్ర. అ. సః = ఆ, ఇన్ద్రః = ఇంద్రుడు, మహత్ = గొప్పదైన, తత్ చాపమ్ = ఆ ధనస్సును, వికృష్య = లాగి, పావకాదిత్యవర్చసః = అగ్నివంటి సూర్యునివంటి కాంతి గల, శరాన్ = బాణములను, రావణమూర్ధని = రావణుని శిరస్సుమీద, పాతయామాస = పడవేసెను.

తా. ఇంద్రుడు ఆ ధనస్సును లాగి, రావణుని శిరస్సుమీద, అగ్ని-సూర్యుల తేజస్సు వంటి తేజస్సు గల బాణములను ప్రయోగించెను. 47

మూ. తథైవ చ మహాబాహుర్దశగ్రీవో నిశాచరః,
శక్రం కార్ముకవిభ్రష్టైః శరవర్షైరవాకిరత్. 48

ప్ర. అ. తథైవ = అట్లే, మహాబాహుః = గొప్ప బాహువులు గల, నిశాచరః=రాక్షసుడైన, దశగ్రీవః చ=రావణుడు కూడ, కార్ముకవిభ్రష్టైః=ధనస్సునుండి జారిన, శరవర్షైః = బాణవర్షముంచేత, శక్రమ్ = ఇంద్రుణ్ణి, అవాకిరత్ = చల్లెను.

తా. అట్లే నిశాచరుడు, మహాబాహువూ అయిన రావణుడు కూడ ధనస్సు లాగి ప్రయోగించిన బాణాల వర్షములతో ఇంద్రుణ్ణి నింపివేసెను. 48

మూ. ప్రయుధ్యతోరథ తయోర్బాణవర్షైః సమన్తతః,
నాజ్ఞాయత తదా కించిత్సర్వం హి తమసా వృతమ్. 49

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
అష్టావింశః సర్గః.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, తయోః = వారిద్దరూ, బాణవర్షైః = బాణ వర్షములచేత, ప్రయుధ్యతోః = యుద్ధముచేయుచుండగా, సమన్తతః = చుట్టు ప్రక్కల, తదా = అప్పుడు, కించిత్ = ఏదీ కూడ, నాజ్ఞాయత = తెలియబడలేదు. సర్వమ్ = సమస్తమూ, తమసా = అంధకారముచేత, వృతం హి = కప్పబడినది కదా.

తా. వాళ్ళిద్దరూ బాణవర్షములు కురిపించుచు యుద్ధము చేయుచుండగా అప్పుడు అంతా అంధకారముచేత నిండిపోవుటచే ఏదీ కనబడలేదు. 49

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో ఇరవై యెనిమిదవ సర్గ సమాప్తము.

అథ ఏకోనత్రింశః సర్గః

[రావణుడు దేవతల సైన్యమునుండి బైటకు పోవుట. ఆతని పట్టుకొనుటకై దేవతలు ప్రయత్నించుట. ఇంతలో మేఘనాదుడు మాయా ప్రయోగముచేత ఇంద్రుణ్ణి బంధించి విజయవంతుడై సైన్యముతో లంకకు ప్రయాణ మగుట.]

మూ. తత స్తమసి సంజాతే సర్వే తే దేవరాక్షసాః,
అయుధ్యన్త బలోన్మత్తాః సూదయన్తః పరస్పరమ్. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తమసి = చీకటి, సంజాతే = పుట్టినదగుచుండగా, సర్వే = సమస్తమైన, తే = ఆ, దేవరాక్షసాః = దేవతలు, రాక్షసులు, పరస్పరమ్ = పరస్పరమును, సూదయన్తః = నశింపచేసికొనుచు, బలోన్మత్తాః = బలముచేత మదించినవారై, అయుధ్యన్త = యుద్ధముచేసిరి.

తా. చీకటి అవరించిన ఆ సమయమునందు దేవతలు, రాక్షసులు బలముచేత ఉన్మత్తులై ఒకరి నొకరు చంపుకొనుచు యుద్ధము చేసిరి. 1

మూ. తతస్తు దేవసైన్యేన రాక్షసానాం బృహద్బలమ్,
దశాంశం స్థాపితం యుద్ధే శేషం నీతం యమక్షయమ్. 2

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దేవసైన్యేన = దేవతల సైన్యముచేత, రాక్షసానామ్ = రాక్షసులయొక్క, బృహత్ = గొప్పదైన, బలమ్ = సైన్యము, దశాంశమ్ = పదవ వంతు మాత్రము, స్థాపితమ్ = ఉంచబడినది. శేషమ్ = మిగిలినది, యుద్ధే = యుద్ధమునందు, యమక్షయమ్ = యమలోకమును, నీతమ్ = పొందించబడినది.

తా. పెద్దదైన రాక్షససైన్యములో దేవతాసైన్యము యుద్ధమునందు పదవ వంతు మాత్రమే మిగిల్చి, మిగిలిన దానినంతనూ నశింపచేసెను. 2

మూ. తస్మింస్తు తామసే యుద్ధే సర్వే తే దేవరాక్షసాః,
అన్యోన్యం నాభ్యజానన్త యుధ్యమానాః పరస్పరమ్. 3

ప్ర. అ తస్మిన్ = అ, తామసే = చీకటికి సంబంధించిన, యుద్ధే = యుద్ధమునందు. సర్వే = సమస్తమైన, తే = అ. దేవరాక్షసాః = దేవతలు రాక్షసులు, పరస్పరమ్ = పరస్పరము, యుధ్యమానాః = యుద్ధముచేయుచున్న వారై, అన్యోన్యమ్=ఒకరి నొకరు, నాభ్యజానన్త = గుర్తించలేదు.

తా. చీకటిలో జరిగిన అ యుద్ధములో అ దేవతలూ రాక్షసులూ ఒకరితో ఒకరు యుద్ధముచేయుచు, ఒకరి నొకరు గుర్తించలేదు. 3

మూ. ఇన్ద్రశ్చ రావణశ్చైవ రావణిశ్చ మహాబలః,
తస్మింస్తమోజాలవృతే మోహమీయుర్న తే త్రయః. 4

ప్ర. అ. తమోజాలయుతే=చీకటిసముదాయముతో కూడిన, తస్మిన్=అ యుద్ధమునందు, ఇన్ద్రః చ = ఇంద్రుడు, రావణః చ ఏవ=రావణుడు, మహాబలః =గొప్ప బలము గల, రావణిః చ= మేఘనాదుడు, తే=అ, త్రయః=ముగ్గురూ, మోహమ్ = మోహమును, న ఈయుః = పొందలేదు.

తా. చీకటి కప్పివేసిన అ యుద్ధరంగములో ఇంద్రుడు, రావణుడు, మహాబలవంతుడైన మేఘనాదుడు ఈ ముగ్గురు మాత్రమే మోహముచెందలేదు. 4

మూ. స తు దృష్ట్వా బలం సర్వం రావణో నిహతం క్షణాత్,
క్రోధమభ్యగమత్తీవ్రం మహానాదం చ ముక్తవాన్. 5

ప్ర. అ. సః = అ, రావణః = రావణుడు, క్షణాత్ = క్షణకాలములో, నిహతమ్ = చంపబడిన, సర్వమ్=సమస్తమైన, బలమ్=సైన్యమును, దృష్ట్వా= చూచి, తీవ్రమ్ = తీవ్రమైన, క్రోధమ్ = క్రోధమును, అభ్యగమత్ = పొందెను. మహానాదం చ = గొప్ప ధ్వనిని కూడ ముక్తవాన్ = విడచినాడు.

తా. రావణుడు క్షణకాలములో తన సైన్యమంతా చంపబడి నట్లు చూచి, తీవ్రముగా కోపించి బిగ్గరగా సింహగర్జనము చేసెను. 5

మూ. క్రోధా త్సూతం చ దుర్ధర్షః స్యన్దనస్థమువాచ హ,
పరసైన్యస్య మధ్యేన యావదన్తో నయస్వ మామ్. 6

ప్ర. అ దుర్ధర్షః = ఎదిరింప శక్యముకానివాడైన అతడు, స్యన్దనస్థమ్ = రథమునందున్న, సూతమ్ = సారథిని గూర్చి, క్రోధాత్ = కోపమువలన, ఉవాచ హ = పలికెను. అన్తః యావత్ = (శత్రువుల) అంతము అయ్యే వరకు, మామ్ = నన్ను, పరసైన్యస్య = శత్రుసైన్యముయొక్క, మధ్యేన = మధ్యచేత, నయస్వ = తీసుకొని వెళ్ళుము.

తా. ఎదిరింప శక్యము కాని ఆ రావణుడు రథమునందున్న సారథితో ఇట్లు పలికెను. "శత్రువులు పూర్తిగా నశించేవరకు నన్ను వాళ్ళ మధ్య నుండి తీసుకొని వెళ్ళుము". 6

మూ. అద్యైవ త్రిదశాన్ సర్వాన్ విక్రమైః సమరే స్వయమ్,
నానాశస్త్రమహాసారైర్నయామి యమసాదనమ్. 7

ప్ర. అ. సమరే = యుద్ధమునందు, అద్యైవ = ఇప్పుడే, సర్వాన్ = సమస్తమైన, త్రిదశాన్ = దేవతలను, స్వయమ్ = స్వయముగా, విక్రమైః = పరాక్రమములచేత, నానాశస్త్రమహాసారైః = అనేకవిధములైన ఆయుధముల మహాప్రవాహములచేత, యమసాదనమ్ = యమలోకమును, నయామి = పొందించెదను.

తా. నేను ఇప్పుడే, స్వయముగా, దేవతల నందరినీ పరాక్రమముచేత అనేకవిధములైన ఆయుధములు నిరంతరముగా వర్షించి యమలోకమునకు పంపెదను. 7

మూ. అహమిన్ద్రం వధిష్యామి ధనదం వరుణం యమమ్,
త్రిదశాన్వినిహత్యాశు స్వయం స్థాస్యామ్యథోపరి. 8

ప్ర. అ. అహమ్ = నేను, ఇన్ద్రమ్ = ఇంద్రుణ్ణి, ధనదమ్ = కుబేరుణ్ణి, వరుణమ్ = వరుణుణ్ణి, యమమ్ = యముణ్ణి, వధిష్యామి = చంపెదను. త్రిదశాన్ = దేవతలను, ఆశు = శీఘ్రముగా, వినిహత్య = చంపి, స్వయమ్ = తాను, అథ = పిమ్మట, ఉపరి = పైన, స్థాస్యామి = ఉండగలను.

తా. నేను ఇంద్రుణ్ణి, కుబేరుణ్ణి, వరుణుణ్ణి, యముణ్ణి వధించి, దేవతల నందరినీ చంపి ఉన్నతస్థానమును పొందగలను. 8

మూ. విషాదో నైవ కర్తవ్యః శీఘ్రం వాహయ మే రథమ్,
ద్విః ఖలు త్వాం బ్రవీమ్యద్య యావదన్తం నయస్వ మామ్. 9

ప్ర. అ. విషాదః = దుఃఖము, నైవ కర్తవ్యః = చేయదగినదికాదు. మే రథమ్ = నా రథమును, శీఘ్రమ్ = శీఘ్రముగా, వాహయ = నడిపించుము. ద్విః = రెండు మార్లు, బ్రవీమి ఖలు = చెప్పుచున్నాను కదా. యావదన్తమ్ = దేవతల అంత మయే వరకు, మామ్ = నన్ను, నయస్వ = తీసికొనివెళ్ళుము.

తా. భయపడకుము. నా రథమును శీఘ్రముగా నడుపుము. రెండు మార్లు చెప్పుచున్నాను. దేవతలు అంతమయేవరకు నన్ను వాళ్ళ సైన్యములో నడుపుము. 9

మూ. అయం స నన్దనోద్దేశో యత్ర వర్తామహే వయమ్,
నయ మామద్య తత్ర త్వముదయో యత్ర పర్వతః. 10

ప్ర. అ. వయమ్ = మనము, యత్ర = ఎక్కడ, వర్తామహే = ఉంటున్నామో, అయమ్ = ఇది, నన్దనోద్దేశః = నందనవనప్రదేశము. అద్య = ఇప్పుడు, త్వమ్ = నీవు. ఉదయః పర్వతః = ఉదయపర్వతము, యత్ర = ఎక్కడ ఉన్నదో, తత్ర = అక్కడికి, మామ్ = నన్ను, నయ = తీసికొనివెళ్ళుము.

తా. మనము ఇప్పుడు నందనవనప్రాంతమునం దున్నాము ఇప్పుడు నన్ను ఉదయపర్వతము వైపు తీసికొని వెళ్ళుము. 10

మూ. తస్య తద్వచనం శ్రుత్వా తురగాన్ స మనోజవాన్,
ఆదిదేశాథ శత్రూణాం మధ్యేనైవ చ సారథిః. 11

ప్ర. అ. సారథిః = సారథి, తస్య = వానియొక్క, తత్ వచనమ్ = ఆ వచనమును, శ్రుత్వా = విని, అథ = అటుపిమ్మట, మనోజవాన్ = మనోవేగము గల, తురగాన్ = గుఱ్ఱములను, శత్రూణామ్ = శత్రువులయొక్క, మధ్యేనైవ = మధ్యచేతనే, ఆదిదేశ = తోలెను.

తా. సారథి రావణుని మాటలు విని మనోవేగము గల గుఱ్ఱములను శత్రువుల మధ్యనుండి నడిపెను. 11

మూ. తస్య తం నిశ్చయం జ్ఞాత్వా శక్రో దేవేశ్వర స్తదా,
రథస్థః సమరస్థ స్తాన్దేవాన్వాక్యమథాబ్రవీత్. 12

ప్ర. అ. తదా=అప్పుడు,దేవేశ్వరః=దేవతల ప్రభువైన,శక్రః=ఇంద్రుడు, తస్య=వానియొక్క, తమ్=ఆ, నిశ్చయమ్=నిశ్చయమును, జ్ఞాత్వా=తెలిసికొని, సమరస్థః=యుద్ధమునం దున్నవాడై, రథస్థః=రథమునందున్నవాడై, అథ=అటుపిమ్మట, దేవాన్=దేవతలను గూర్చి, వాక్యమ్=వాక్యమును, అబ్రవీత్=పలికెను.

తా. అప్పుడు యుద్ధరంగములో రథమునందున్న దేవేంద్రుడు ఆ రావణుని నిశ్చయమును తెలిసికొని దేవతలతో ఇట్లు పలికెను. 12

మూ. దేవాః శృణుత మద్వాక్యం యత్తావన్మమ రోచతే,
జీవన్నేవ దశగ్రీవః సాధు రక్షో నిగృహ్యతామ్. 13

ప్ర. అ. దేవాః=దేవతలారా! యత్=ఏది, మమ=నాకు, రోచతే తావత్=ఇష్టమగుచున్నదో, అట్టి. మద్వాక్యమ్=నా వాక్యమును, శృణుత=వినండి. రక్షః=రాక్షసుడైన, దశగ్రీవః=రావణుడు, జీవన్నేవ=జీవించిఉండగానే, సాధు=బాగుగా, నిగృహ్యతామ్=పట్టుకొనబడుగాక.

తా. దేవతలారా! నాకు అభిమతమైన మాట చెప్పుచున్నాను. వినండి రావణుణ్ణి బ్రతికి ఉండగానే పట్టుకొనండి. 13

మూ. ఏష హ్యతిబలః సైన్యే రథేన పవనౌజసా,
గమిష్యతి ప్రవృద్ధోర్మిః సముద్ర ఇవ పర్వణి. 14

ప్ర. అ. అతిబలః=గొప్పబలము గల, ఏషః=ఇతడు, పర్వణి=పర్వదివసమునందు, ప్రవృద్ధోర్మిః=వృద్ధి చెందిన తరంగములు గల, సముద్రః ఇవ=సముద్రము వలె, పవనౌజసా=వాయువేగము గల, రథేన=రథేముతో, సైన్యే=సైన్యమునందు, గమిష్యతి=వెళ్ళగలడు.

తా. గొప్ప బలము గల ఇతడు, పర్వదినమునందు సముద్రము తరంగములతో పెరిగి విజృంభించినట్లు విజృంభించి, వాయువేగము వంటి వేగము గల రథముతో మన సైన్యమధ్యమునుండి వెళ్ళనున్నాడు. 14

మూ. న హ్యేష హన్తుం శక్యోఽద్య వరదానాత్సునిర్భయః,
తద్గ్రహీష్యామహే రక్షో యత్తా భవత సంయుగే. 15

ప్ర. అ. వరదానాత్ = వరదానమువలన, సునిర్భయః = ఏ మాత్రమూ భయములేని, ఏషః = ఇతడు, అద్య = ఇప్పుడు, హన్తుమ్ = చంపుటకు, న శక్యః హి = శక్యమైనవాడు కాడు కదా? తత్ = ఆ కారణమువలన, రక్షః = రాక్షసుని, గ్రహీష్యామహే = గ్రహించెదము. సంయుగే = యుద్ధమునందు, యత్తాః = సంనద్ధులు, భవత = కండు.

తా. వరదానమువలన భయము లేని ఇతనిని చంపుట శక్యము కాదు. అందుచేత వీనిని బంధించెదము. మీరు యుద్ధములో ప్రయత్నపూర్వకముగా సిద్ధముగా ఉండుడు. 15

మూ. యథా బలౌ నిరుద్ధే చ త్రైలోక్యం భుజ్యతే మయా,
ఏవమేతస్య పాపస్య నిరోధో మమ రోచతే. 16

ప్ర. అ. బలౌ = బలిచక్రవర్తి, నిరుద్ధే = బంధింపబడినవాడగుచుండగా, యథా = ఏ విధముగా, మయా = నాచేత, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, భుజ్యతే = అనుభవించబడుచున్నదో, ఏవమ్ = ఇట్లు, పాపస్య = పాపాత్ముడైన, ఏతస్య = వీనియొక్క, నిరోధః = బంధనము, మమ = నాకు, రోచతే = ఇష్టమగుచున్నది.

తా. బలిచక్రవర్తిని బంధించిన పిదప నేను మూడు లోకములను అనుభవించుచున్నట్లు పాపాత్ముడైన వీనిని కూడ బంధించవలె నని నేను కోరుచున్నాను.

మూ. తతోఽన్యం దేశమాస్థాయ శక్రః సంత్యజ్య రావణమ్,
అయుధ్యత మహారాజ రాక్షసాంస్త్రాసయన్ రణే. 17

ప్ర. అ. మహారాజ = మహారాజా! తతః = అటుపిమ్మట, శక్రః = ఇంద్రుడు, రావణమ్ = రావణుణ్ణి, సంత్యజ్య = విడచి, అన్యమ్ = మరియొక, దేశమ్ = దేశమును, ఆస్థాయ = అధిష్ఠించి, రణే = యుద్ధమునందు, రాక్షసాన్ = రాక్షసులను, త్రాసయన్ = భయపెట్టుచు, అయుధ్యత = యుద్ధము చేసెను.

తా. రామా! పిమ్మట దేవేంద్రుడు రావణుణ్ణి విడిచి, సురౌక ప్రదేశమునకు వెళ్ళి యుద్ధమునందు రాక్షసులకు భయము కలిగించుచు యుద్ధముచేసెను. 17

మూ. ఉత్తరేణ దశగ్రీవః ప్రవివేశానివర్తకః,
దక్షిణేన తు పార్శ్వేన ప్రవివేశ శతక్రతుః. 18

ప్ర. అ. దశగ్రీవః = రావణుడు, అనివర్తకః = వెనుకకు మరలనివాడై, ఉత్తరేణ = ఉత్తరపార్శ్వముచేత, ప్రవివేశ = ప్రవేశించెను. శతక్రతుః తు = దేవేంద్రుడైతే, దక్షిణేన = దక్షిణపుదైన, పార్శ్వేన = పార్శ్వముచేత, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. రావణుడు వెనుకకు మరలకుండా ఉత్తరపార్శ్వమునుండి సైన్యములో ప్రవేశించగా దేవేంద్రుడు దక్షిణపార్శ్వమునుండి ప్రవేశించెను. 18

మూ. తతః స యోజనశతం ప్రవిష్టో రాక్షసాధిపః,
దేవతానాం బలం సర్వం శరవర్షైరవాకిరత్. 19

ప్ర. అ. తతః = అటుపిమ్మట, యోజనశతమ్ = యోజనముల శతమును, ప్రవిష్టః = ప్రవేశించిన, సః రాక్షసాధిపః = ఆ రావణుడు, సర్వమ్ = సమస్తమైన, దేవతానామ్ = దేవతలయొక్క, బలమ్ = సైన్యమును, శరవర్షైః = బాణవర్షముల చేత, అవాకిరత్ = చల్లెను.

తా. అప్పుడు నూరు యోజనముల దూరమువరకు సైన్యములోనికి దూసికొనిపోయి రావణుడు దేవతాసైన్యముపై బాణవర్షము కురిపించెను. 19

మూ. తతః శక్రో నిరీక్ష్యాథ ప్రణష్టం తు స్వకం బలమ్,
న్యవర్తయదసంభ్రాన్తః సమావృత్య దశాననమ్. 20

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శక్రః = ఇంద్రుడు, స్వకమ్ = తన సంబంధమైన, బలమ్ = సైన్యమును, ప్రణష్టమ్ = నశించినదానినిగా, నిరీక్ష్య = చూచి, అథ = అటుపిమ్మట, సమావృత్య = తిరిగి వచ్చి, అసంభ్రాన్తః = కంగారు లేనివాడై, దశాననమ్ = రావణుణ్ణి, న్యవర్తయత్ = వెనుకకు మరలింపచేసెను.

తా. అప్పుడు ఇంద్రుడు తన సైన్యము నశించిపోవుచుండుట చూచి, కంగారు పడకుండగా వెనుకకు తిరిగి వచ్చి రావణుణ్ణి వెనుకకు మరలునట్లు చేసెను. 20

మూ. ఏతస్మిన్నన్తరే నాదో ముక్తో దానవరాక్షసైః,
హా హతాః స్మ ఇతి గ్రస్తం దృష్ట్వా శక్రేణ రావణమ్.

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యయందు, శక్రేణ = ఇంద్రునిచేత, గ్రస్తమ్ = మింగబడిన, రావణమ్ = రావణుణ్ణి, దృష్ట్వా = చూచి, దానవరాక్షసైః = దానవులచేతా రాక్షసులచేత, హా = అయ్యో! హతాః స్మ = చంపబడితిమి, ఇతి = అని, నాదః = ధ్వని, ముక్తః = విడువబడినది.

తా. ఇంతలో ఇంద్రుడు రావణుణ్ణి ఆక్రమించుట చూచిన దానవులు, రాక్షసులూ "అయ్యో! చచ్చినాము!" అని అరచిరి. 21

మూ. తతో రథం సమాస్థాయ రావణిః క్రోధమూర్ఛితః,
తత్సైన్యమతిసంక్రుద్ధః ప్రవివేశ సుదారుణమ్. 22

ప్ర. అ. తతః = అటుపిమ్మట, క్రోధమూర్ఛితః = క్రోధముతో వ్యాప్తుడైన, రావణిః = మేఘనాదుడు, రథమ్ = రథమును, సమాస్థాయ = అధిష్ఠించి, అతిసంక్రుద్ధః = చాలకోపించినవాడై, సుదారుణమ్ = చాల భయంకరమైన, తత్ = ఆ, సైన్యమ్ = సైన్యమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. అప్పుడు కోపావేశముతో మేఘనాదుడు రథము నెక్కి, చాల కోపించి, చాల భయంకరమైన ఆ దేవతాసైన్యములో ప్రవేశించెను. 22

మూ. తాం ప్రవిశ్య మహామాయాం ప్రాప్తాం పశుపతేః పురా,
ప్రవివేశ సుసంరబ్ధస్తత్సైన్యం సమభిద్రవత్. 23

ప్ర. అ. పురా = పూర్వము, పశుపతేః = ఈశ్వరునినుండి, ప్రాప్తామ్ = పొందబడిన, తామ్ = ఆ, మాయామ్ = మాయను, ప్రవిశ్య = ప్రవేశించి, సుసంరబ్ధః = చాల తొందరపడుచున్నవాడై, ప్రవివేశ = ప్రవేశించెను. తత్ సైన్యమ్ = ఆ సైన్యము, సమభిద్రవత్ = పారిపోయెను.

తా. అతడు పూర్వము శివునినుండి లభించిన మాయను అవలంబించి శీఘ్రముగా సైన్యములో ప్రవేశించెను. ఆ సైన్యము పారిపోయెను. 23

మూ. స సర్వా దేవతా స్త్యక్త్వా శక్రమేవాభ్యధావత,
మహేన్ద్రశ్చ మహాతేజా నాపశ్యచ్చ సుతం రిపోః. 24

ప్ర. అ. సః = అతడు, సర్వాః = సమస్తమైన, దేవతాః = దేవతలను, త్యక్త్వా = విడచి, శక్రమేవ = దేవేంద్రుణ్ణి గూర్చియే, అభ్యధావత = పరుగెత్తెను. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మహేన్ద్రశ్చ = మహేంద్రుడు, రిపోః = శత్రువు యొక్క, సుతమ్ = కుమారుణ్ణి, నాపశ్యత్ చ = చూడలేదు.

తా. అతడు దేవత లందరినీ విడచి ఇంద్రునిమీదికే పరుగెత్తెను. కాని మహాతేజఃశాలియైన ఇంద్రునకు అతడు కనబడలేదు. 24

మూ. విముక్తకవచ స్తత్ర వధ్యమానోఽపి రావణిః,
త్రిదశైః సుమహావీర్యైర్న చకార చ కించన. 25

ప్ర. అ. తత్ర = అక్కడ, విముక్తకవచః = విడవబడిన కవచముగల, రావణిః = మేఘనాదుడు, మహావీర్యైః = గొప్ప పరాక్రమము గల, త్రిదశైః = దేవతలచేత, వధ్యమానః అపి = చంపబడుచున్నను, కించన = ఏమీ (భయమును లేదా అపకారమును) న చకార = చేయలేదు.

తా. కవచము జారిపోయిన మేఘనాదుడు గొప్ప పరాక్రమము గల దేవతలు కొట్టుచున్నను వారి నేమీ చేయలేదు. లేదా భయపడలేదు. 25

మూ. స మాతలిం సమాయాన్తం తాడయిత్వా శరోత్తమైః,
మహేన్ద్రం శరవర్షేణ భూయ ఏవాభ్యవాకిరత్. 26

ప్ర. అ. సః = అతడు, సమాయాన్తమ్ = వచ్చుచున్న, మాతలిమ్ = మాతలిని, శరోత్తమైః = శ్రేష్ఠములైన బాణములచేత, తాడయిత్వా = కొట్టి, భూయః ఏవ = మరల, మహేన్ద్రమ్ = మహేంద్రుణ్ణి, శరవర్షేణ = బాణవర్షముచేత, అభ్యవాకిరత్ = చల్లెను.

తా. అతడు వచ్చుచున్న మాతలిమీద ఉత్తమములైన బాణములు ప్రయోగించి, మరల దేవేంద్రునిమీద శరవర్షము కురిపించెను. 26

మూ. తత స్త్యక్త్వా రథం శక్రో విససర్జ చ సారథిమ్,
ఐరావతం సమారుహ్య మృగయామాస రావణిమ్. 27

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శక్రః = దేవేంద్రుడు. రథమ్ = రథమును, త్యక్త్వా = విడచి, సారథిమ్ = సారథిని, విససర్జ చ = విడచివేసెను. ఐరావతమ్ = ఐరావతమును, సమారుహ్య = ఎక్కి, రావణిమ్ = రావణుని పుత్రుణ్ణి, మృగయామాస = వెదకెను.

తా. అప్పుడు ఇంద్రుడు రథమును విడచి సారథిని పంపివేసి, ఐరావతమును ఎక్కి, మేఘనాదునికోసము వెదకెను. 27

మూ. స తత్ర మాయాబలవానదృశ్యోఽథాన్తరిక్షగః,
ఇన్ద్రం మాయాపరిక్షిప్తం కృత్వా స ప్రాద్రవచ్ఛరైః.

ప్ర. అ. మాయాబలవాన్ = మాయాబలము గల, సః = అతడు, తత్ర = అక్కడ, అదృశ్యః = కనబడనివాడై, అథ = అటుపిమ్మట, అన్తరిక్షగః = ఆకాశమును చేరినవాడై, ఇన్ద్రమ్ = ఇంద్రుణ్ణి, మాయాపరిక్షిప్తమ్ = మాయచేత కప్పబడినవానినిగా, కృత్వా = చేసి, సః = అతడు, శరైః = వాణములతో, ప్రాద్రవత్ = పరుగెత్తెను.

తా. మాయాబలము గల ఆ మేఘనాదుడు కనబడకుండ అయి, ఆకాశముపైన ఉండి ఇంద్రుణ్ణి మాయచేత కప్పివేసి, బాణాలు ప్రయోగించుచు అతనిమీదికి శీఘ్రముగా వెళ్లెను. 28

మూ. స తం యదా పరిశ్రాన్తమిన్ద్రం జజ్ఞేథ రావణిః,
తదైనం మాయయా బద్ధ్వా స్వసైన్యమభితోఽనయత్. 29

ప్ర. అ. సః రావణిః = ఆ మేఘనాదుడు, యదా = ఎప్పుడు, తమ్ ఇన్ద్రమ్ = ఆ ఇంద్రుణ్ణి, పరిశ్రాన్తమ్ = అలసినవానినిగా, జజ్ఞే = తెలుసుకొనెనో, తదా = అప్పుడు, ఏనమ్ = వీనిని, మాయయా = మాయచేత, బద్ధ్వా = బంధించి, అథ = పిమ్మట, స్వసైన్యమ్ అభితః = తన సైన్యము దగ్గరకు, అనయత్ = తీసికొని వెళ్లెను

తా. ఇంద్రుడు అలసిపోయినట్లు తెలిసికొని ఆ మేఘనాదుడు అతనిని మాయచేత బంధించి, తన సైన్యము దగ్గరికి తీసికొనివెళ్లెను. 29

మూ. తం తు దృష్ట్వా బలాత్తేన నీయమానం మహారణాత్,
మహేన్ద్రమమరాః సర్వే కిం ను స్యాదిత్యచిన్తయన్. 30

ప్ర. అ. తేన = వానిచేత, మహారణాత్ = మహాయుద్ధమునుండి, బలాత్ = బలాత్కారముగా, నీయమానమ్ = తీసికొనివెళ్లబడుచున్న, తమ్ = ఆ, మహేన్ద్రమ్ = మహేంద్రుణ్ణి, దృష్ట్వా = చూచి, సర్వే = సమస్తమైన, అమరాః = దేవతలు, కిం ను స్యాత్ ఇతి = ఏమి అగునో కదా అని, అచిన్తయన్ = ఆలోచించిరి.

తా. ఆ యుద్ధరంగమునుండి మేఘనాదుడు మహేంద్రుణ్ణి బలాత్కారముగా తీసికొనిపోవుటను చూచి దేవతలు "ఏ మగునో కదా?"అని అనుకొనిరి. 30

మూ. దృశ్యతే న స మాయావీ శక్రజిత్సమితింజయః,
విద్యావానపి యేనేన్ద్రో మాయయాపహృతో బలాత్. 31

ప్ర. అ. సమితింజయః = యుద్ధమునందు జయించు, మాయావీ = మాయావియైన, సః శక్రజిత్ = ఆ ఇంద్రజిత్తు, న దృశ్యతే = కనబడుటలేదు. యేన = ఎవనిచేత, విద్యావానపి = విద్యకలవాడైనను, ఇన్ద్రః = ఇంద్రుడు, బలాత్ = బలాత్కారముగా, అపహృతః = అపహరించబడినాడో.

తా. "అసురుల మాయలను జయించు విద్యలు ఉన్న ఇంద్రుణ్ణి కూడ బలాత్కారముగా తీసికొనిపోయిన, మాయావి, యుద్ధములలో జయము పొందువాడూ అయిన ఇంద్రజిత్తు కనబడుటలేదు"అని అనుకొనిరి. 31

మూ. ఏతస్మిన్నన్తరే క్రుద్ధాః సర్వే సురగణాస్తదా,
రావణం విముఖీకృత్య శరవర్షైరవాకిరన్. 32

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అంతరే = మధ్యకాలమునందు, క్రుద్ధాః = కోపించిన, సర్వే = సమస్తమైన, సురగణాః = దేవతాగణములు, తదా = అప్పుడు, రావణమ్ = రావణుణ్ణి, విముఖీకృత్య = విముఖునిగా చేసి, శరవర్షైః = బాణవర్షముల చేత, అవాకిరన్ = చల్లిరి.

తా. ఇంతలో దేవతాగణము లన్నీ కోపించి, అప్పుడు రావణుణ్ణి యుద్ధమునుండి విముఖు డగు నట్లు చేసి బాణవర్షములు కురిపించినవి. 32

మూ. రావణస్తు సమాసాద్య అదిత్యాంశ్చ వసూం స్తదా,
న శశాక స సంగ్రామే యోద్ధుం శత్రుభిరర్దితః. 33

ప్ర. అ. శత్రుభిః = శత్రువుంచేత, అర్దితః = పీడింపబడిన, రావణస్తు = రావణుడైతే, తదా = అప్పుడు, ఆదిత్యాన్ చ = ఆదిత్యులను, వసూన్ = వసువులను, సంగ్రామే = యుద్ధమునందు, సమాసాద్య = పొంది, యోద్ధుమ్ = యుద్ధము చేయుటకు, న శశాక = సమర్థుడు కాలేదు.

తా. రావణుడు యుద్ధరంగమునందు ఆదిత్యులను, వసువులను ఎదిరించి, వాళ్లచే పీడింపబడినవాడై, యుద్ధము చేయజాలకపోయెను. 33

మూ స తం దృష్ట్వా పరిమ్లానం ప్రహారైర్జర్జరీకృతమ్,
రావణిః పితరం యుద్ధే దర్శనస్థోఽబ్రవీదిదమ్. 34

ప్ర. అ. సః రావణిః = ఆ ఇంద్రజిత్తు, యుద్ధే = యుద్ధమునందు, పరిమ్లానమ్ = వాడిపోయిన ప్రహారైః = దెబ్బలచేత, జర్జరీకృతమ్ = జర్జరముగా చేయబడిన, పితరమ్ = తండ్రిని, దృష్ట్వా = చూచి, దర్శనస్థః = దర్శనమునందు ఉన్నవాడై, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. యుద్ధములో దెబ్బలచేత జర్జరుడై వాడిపోయిన తండ్రిని చూచి ఇంద్రజిత్తు పైకి వచ్చి కనబడుచు ఇట్లు పలికెను. 34

మూ. ఆగచ్ఛ తాత గచ్ఛామో రణకర్మ నివర్తతామ్,
జితం నో విదితం తేఽస్తు స్వస్థో భవ గతజ్వరః 35

ప్ర. అ. తాత = తండ్రీ! ఆగచ్ఛ = రమ్ము. గచ్ఛామః = వెళ్లెదము. రణకర్మ = యుద్ధము, నివర్తతామ్ = నివర్తించుగాక. నః = మనయొక్క జితమ్ = జయము, తే = నీకు, విదితమ్ = తెలియబడినది, అస్తు = అగుగాక. గతజ్వరః = పోయిన మనోవ్యథ కలవాడవై, స్వస్థః = స్వస్థుడవు, భవ = అగుము.

తా. తండ్రీ! మనము వెళ్లుదాము, రమ్ము, యుద్ధము ఆపివేయుము. మనకు విజయము లభించినదను విషయమును తెలిసికొనుము, మనోవ్యథ తొలంగి స్వస్థుడవు అగుము. 35

మూ. అయం హి సురసైన్యస్య త్రైలోక్యస్య చ యః ప్రభుః,
స గృహీతో దేవ బలాద్భగ్నదర్పాః సురాః కృతాః. 36

ప్ర. అ. యః = ఎవడు, సురసైన్యస్య=సురులసైన్యమునకు, త్రైలోకస్య చ = మూడు లోకములకు, ప్రభుః = ప్రభువో, సః = అట్టి, అయమ్ = ఈ ఇంద్రుడు, దేవబలాత్ = పరమేశ్వరుని బలమువలన, గృహీతః = పట్టుకొనబడినాడు. సురాః = దేవతలు, భగ్నదర్పాః = భగ్నమైన దర్పము కలవారుగా, కృతాః = చేయబడినారు.

తా. దేవతాసైన్యమునకు, మూడు లోకాలకూ ప్రభువైన ఈ దేవేంద్రుణ్ణి, పరమేశ్వరునివలన లభించిన బలముచేత బంధించినాను. దేవతల దర్పమును భగ్నము చేసినాను. 36

మూ. యథేష్టం భుङ్క్ష్వ లోకాంస్త్రీన్నిగృహ్యారాతిమోజసా,
వృథా కిం తే శ్రమేణేహ యుద్ధమద్య తు నిష్ఫలమ్. 37

ప్ర. అ. అరాతిమ్ = శత్రువును, ఓజసా = తేజస్సుచేత, నిగృహ్య = నిగ్రహించి, యథేష్టమ్=ఇష్టమువచ్చినట్లు, త్రీన్ = మూడు, లోకాన్=లోకములను, భుङ్క్ష్వ = అనుభవింపుము. ఇహ = ఇక్కడ, వృథా = వ్యర్థముగా, తే = నీయొక్క, శ్రమేణ = శ్రమచేత, కిమ్ = ఏమిప్రయోజనము ? అద్య = ఇప్పుడు, యుద్ధం తు = యుద్ధమైతే, నిష్ఫలమ్ = వ్యర్థము.

తా. నీ శత్రువును తేజస్సుచేత నిగ్రహించి మూడు లోకాలను ఇష్టము వచ్చినట్లు అనుభవించుము. ఇప్పు డిక్కడ వ్యర్థమైన ఈ శ్రమ నీ కెందుకు? ఇప్పుడు యుద్ధమువలన ప్రయోజనము లేదు. 37

మూ. తతస్తే దేవతగణా నివృత్తా రణకర్మణః,
తచ్ఛ్రుత్వా రావణేర్వాక్యం శక్రహీనాః సురా గతాః. 38

ప్ర. అ. రావణేః=రావణపుత్రునియొక్క, తత్ వాక్యమ్=ఆ వాక్యమును, శ్రుత్వా=విని, దేవతగణాః = దేవతాగణములు, రణకర్మణః=యుద్ధకర్మనుండి, నివృత్తాః=మరలిరి.సురాః=దేవతలు,శక్రహీనాః=ఇంద్రునితో శూన్యులై, గతాః= వెళ్ళిపోయిరి.

తా. ఇంద్రజిత్తు మాటలు విని దేవతలు యుద్ధమునుండి విరమించిరి. దేవేంద్రుడు లేని ఆ దేవతలు వెనుకకు వెళ్ళి పోయిరి. 38

మూ. అథ స రణవిగత ఉత్తమౌజా,
త్రిదశరిపుః ప్రథితో నిశాచరేన్ద్రః,
స్వసుతవచనమాదృతః ప్రియం త-
త్సమనునిశమ్య జగాద చైవ సూనుమ్. 39

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రణవిగతః = పోయిన (పూర్తియైన) యుద్ధము గలవాడు, ఉత్తమౌజాః = ఉత్తమమైన తేజస్సు కలవాడు, త్రిదశరిపుః = దేవతల శత్రువు, ప్రథితః = ప్రసిద్ధుడూ అయిన, సః నిశాచరేన్ద్రః = ఆ రాక్షసరాజు, ప్రియమ్ = ప్రియమైన, తత్ = ఆ, స్వసుతవచనమ్ = తన పుత్రుని వచనమును, సమనునిశమ్య = విని, ఆదృతః = ఆదరముకలవాడై, సూనుమ్ = కుమారుణ్ణి గూర్చి, జగాద చైవ = పలికెను.

తా. అప్పుడు యుద్ధము పూర్తి అయిన పిమ్మట, గొప్ప తేజస్సు గలవాడు, దేవతాశత్రువు, ప్రసిద్ధుడూ అయిన ఆ రావణుడు తన పుత్రుడు పలికిన ప్రియమైన ఆ మాట విని ఆదరపూర్వకముగా అతనితో ఇట్లనెను. 39

మూ. అతిబలసదృశైః పరాక్రమైస్త్వం
మమకులవంశవివర్ధనః ప్రభో,
యదయమతులబలస్త్వయాద్య వై
త్రిదశపతిస్త్రిదశాశ్చ నిర్జితాః. 40

ప్ర. అ. అతిబల = గొప్ప బలము గలవాడా! ప్రభో = సమర్థుడా! త్వమ్ = నీవు, సదృశైః = తగిన, పరాక్రమైః = పరాక్రమముంచేత, మమ = నా యొక్క, కులవంశవివర్ధనః = కులమును వంశమును వృద్ధి పొందించిన వాడవు. యత్ = ఏ కారణము వలన, అద్య = ఇప్పుడు, త్వయా = నీ చేత, అతులబలః = సాటిలేని బలము గల, అయమ్ = ఈ, త్రిదశపతిః = ఇంద్రుడు, త్రిదశాః చ = దేవతలూ, నిర్జితాః = జయింపబడినారో.

తా. గొప్ప బలము, సామర్థ్యము గల ఓ! కుమారా! మన వంశమునకు

తగిన పరాక్రమములచేత నీవు నా వంశమును, కులమును వృద్ధి పొందించినావు. ఎందువలన అనగా నీవు సాటి లేని బలము గల ఈ ఇంద్రుణ్ణి, దేవతలను జయించినావు. 40

మూ. నయ రథమధిరోప్య వాసవం
నగరమితో వ్రజ సేనయా వృతస్త్వమ్,
అహమపి తవ పృష్ఠతో ద్రుతం
సహ సచివైరనుయామి హృష్టవత్. 41

ప్ర. అ. వాసవమ్=ఇంద్రుణ్ణి, రథమ్=రథమును, అధిరోప్య=ఎక్కించి, నయ = తీసికొనివెళ్లుము. త్వమ్ = నీవు, సేనయా = సేనతో, వృతః = కూడిన వాడవై, ఇతః = ఇక్కడినుండి, నగరమ్=నగరమును గూర్చి, వ్రజ=వెళ్లుము. అహమపి = నేను కూడ, సచివైః సమమ్ = మంత్రులతో కూడ, హృష్టవత్ = సంతోషముగా, ద్రుతమ్ = శీఘ్రముగా, తవ = నీయొక్క, పృష్ఠతః = వెనుకనే, అనుయామి = అనుసరించి వచ్చుచున్నాను.

తా. నీవు దేవేంద్రుణ్ణి రథమునందు ఎక్కించుకొని సేనాసమేతుడవై ఇక్కడినుండి నగరమునకు నడువుము. నేను కూడా సంతోషపూర్వకముగా మంత్రులతో కలిసి వెంటనే నీ వెనుకనే వచ్చుచున్నాను. 41

మూ. అథ స బలవృతః సవాహన-
స్త్రిదశపతిం పరిగృహ్య రావణిః,
స్వభవనమధిగమ్య వీర్యవాన్
కృతసమరాన్ విససర్జ రాక్షసాన్. 42

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకోనత్రింశః సర్గః.

ప్ర. అ. అథ=అటు పిమ్మట, వీర్యవాన్=పరాక్రమవంతుడైన, సః=ఆ, రావణిః = ఇంద్రజిత్తు, త్రిదశపతిమ్ = ఇంద్రుణ్ణి, పరిగృహ్య = గ్రహించి, బలవృతః = సైన్యముతో కూడినవాడై, సవాహనః=వాహనములతో కూడినవాడై,

స్వభవనమ్ = తన గృహమును, అధిగమ్య = పొంది, కృతసమరాన్ = చేయ బడిన యుద్ధము గల, రాక్షసాన్ = రాక్షసులను, విససర్జ = విడచెను.

తా. పిమ్మట పరాక్రమవంతుడైన ఆ ఇంద్రజిత్తు ఇంద్రుణ్ణి తీసికొని, సైన్యముతోను, వాహనములతోను కూడినవాడై, తన గృహము చేరి యుద్ధము చేసిన రాక్షసులను తమ ఇండ్లకు పంపివేసెను. 42

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ఇరవైతొమ్మిదవ సర్గ సమాప్తము.

అథ త్రింశః సర్గః

[బ్రహ్మదేవుడు ఇంద్రజిత్తుకు వరము ఇచ్చి ఇంద్రుణ్ణి బంధనము నుండి విడిపించుట. ఇంద్రుడు పూర్వము చేసిన పాపకృత్యమును అతనికి గుర్తుచేసి వైష్ణవ యాగము చేయుటకు సంమతి ఇచ్చుట. యజ్ఞమును పూర్తిచేసి ఇంద్రుడు స్వర్గమునకు వెళ్లుట.]

మూ. జితే మహేన్ద్రేఽతిబలే రావణస్య సుతేన వై,
ప్రజాపతిం పురస్కృత్య యయుర్లఙ్కాం సురాస్తదా. 1

ప్ర. అ. రావణస్య=రావణునియొక్క, సుతేన=కుమారునిచేత, అతిబలే = గొప్ప బలముగల, మహేన్ద్రే = మహేంద్రుడు, జితే=జయించబడినవాడగు చుండగా, తదా = అప్పుడు, సురాః = దేవతలు, ప్రజాపతిమ్ = బ్రహ్మదేవుణ్ణి, పురస్కృత్య=ముందు ఉంచుకొని, లఙ్కామ్=లంకను గూర్చి, యయుః=వెళ్ళిరి.

తా. అప్పుడు గొప్ప బలము గల దేవేంద్రుడు ఇంద్రజిత్తు చేత జయించబడిన పిమ్మట దేవతలు బ్రహ్మదేవుణ్ణి ముందు ఉంచుకొని లంకకు వెళ్ళిరి.

మూ. తత్ర రావణమాసాద్య పుత్రభ్రాతృభిరావృతమ్,
అబ్రవీద్గగనే తిష్ఠన్ సామపూర్వం ప్రజాపతిః. 2

ప్ర. అ. ప్రజాపతిః=బ్రహ్మదేవుడు, తత్ర=అక్కడ, పుత్రభ్రాతృభిః= పుత్రులచేత సోదరులచేత, ఆవృతమ్ = చుట్టబడిన, రావణమ్ = రావణుణ్ణి, ఆసాద్య = సమీపించి, గగనే = ఆకాశమునందు, తిష్ఠన్ = నిలచినవాడై, సామపూర్వమ్ = ప్రతిమాలుట పూర్వమునందు కలుగునట్లు, అబ్రవీత్ = పలికెను.

తా. బ్రహ్మదేవుడు అక్కడ పుత్రులతోను సోదరులతోను కలిసి ఉన్న రావణునివద్దకు వెళ్ళి, ఆకాశమునందు నిలచి, సామపూర్వకముగా ఇట్లు చెప్పెను. 2

మూ. వత్స రావణ తుష్టోఽస్మి పుత్రస్య తవ సంయుగే,
అహోఽస్య విక్రమౌదార్యం తవ తుల్యోఽధికోఽపివా. 3

ప్ర, అ. వత్స = నాయనా ! రావణ = రావణా ! సంయుగే = యుద్ధమునందు, తవ పుత్రస్య = నీ కుమారునకు, తుష్టః అస్మి = సంతోషించినాను. అస్య = వీనియొక్క, విక్రమౌదార్యమ్ = పరాక్రమముయొక్క గొప్పతనము, అహో = ఎంత ఆశ్చర్యకరమైనది ! తవ = నీకు, తుల్యః = తుల్యుడు, వా = లేక, అధికః = అధికుడు.

తా. నాయనా ! రావణా ! యుద్ధములో నీ పుత్రుని పరాక్రమము చూచి సంతోషించినాను. ఇతని పరాక్రమము ఎంత ఆశ్చర్యకర మైనది ! ఇతడు నీతో సమానుడు; లేదా నీ కంటె కూడ గొప్పవాడు. 3

మూ. జితం హి భవతా సర్వం త్రైలోక్యం స్వేన తేజసా,
కృతా ప్రతిజ్ఞా సఫలా ప్రీతోఽస్మి ససుతస్య తే. 4

ప్ర. అ. భవతా = నీచేత, సర్వమ్ = సమస్తమైన, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, స్వేన తేజసా = తన తేజస్సు చేత, జితంహి = జయించబడినది కదా ? ప్రతిజ్ఞా = ప్రతిజ్ఞ, కృతా = చేయబడినది. ససుతస్య = కుమారునితో కూడిన, తే = నీకు, ప్రీతః = సంతోషించినవాడను, అస్మి = అయి ఉన్నాను.

తా. నీవు నీ తేజస్సుచేత మూడు లోకములను జయించినావు. ప్రతిజ్ఞ పూర్తి చేసికొన్నావు. నీ విషయమునందు, నీ కుమారుని విషయమునందు సంతోషించుచున్నాను. 4

మూ. అయం చ పుత్రోఽతిబలస్తవ రావణ వీర్యవాన్,
జగతీన్ద్రజిదిత్యేవ పరిఖ్యాతో భవిష్యతి 5

ప్ర, అ. రావణ = రావణా ! అతిబలః = గొప్ప బలము గల, వీర్యవాన్ = పరాక్రమవంతుడైన, అయమ్ = ఈ, తవ పుత్రః = నీ పుత్రుడు, జగతి = జగత్తులో, ఇన్ద్రజిత్ ఇత్యేవ = ఇంద్రజిత్తు (ఇంద్రుణ్ణి జయించినవాడు) అని, పరిఖ్యాతః = ప్రసిద్ధుడు, భవిష్యతి = కాగలడు.

తా. రావణా! అతిబలవంతుడు, వీర్యవంతుడు అయిన ఈ నీ కుమారుడు, జగత్తులో "ఇంద్రజిత్తు" అని ప్రసిద్ధి పొందగలడు. 5

మూ. బలవాన్ దుర్జయ శ్చైవ భవిష్యత్యేవ రాక్షసః,
యం సమాశ్రిత్య తే రాజన్ స్థాపితాస్త్రిదశా వశే. 6

ప్ర. అ. యమ్=ఎవనిని, సమాశ్రిత్య=ఆశ్రయించి, త్రిదశాః=దేవతలు, తే=నీయొక్క, వశే=వశమునందు, స్థాపితాః=ఉంచుకొనబడినారో అట్టి, రాక్షసః=ఈ రాక్షసుడు, బలవాన్=బలవంతుడు, దుర్జయః చైవ=జయింప శక్యము కానివాడు, భవిష్యత్యేవ=అగును.

తా. ఎవని సహాయముచేత నీవు దేవతలను వశములో ఉంచుకొంటివో అట్టి ఈ రాక్షసుడు తప్పక మహాబలవంతుడుగాను, జయింప శక్యము కానివాడుగాను ఉండగలడు. 6

మూ. తన్ముచ్యతాం మహాబాహో మహేన్ద్రః పాకశాసనః,
కిం చాస్య మోక్షణార్థాయ ప్రయచ్ఛన్తు దివౌకసః. 7

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులు కలవాడా, తత్=ఆకారణమువలన, పాకశాసనః=పాకాసురునకు శాసకుడైన, మహేన్ద్రః=మహేంద్రుడు, ముచ్యతామ్=విడవబడుగాక. అస్య=ఈతనియొక్క, మోక్షణాయ=విడచుట కొరకు, దివౌకసః=దేవతలు, కిం చ=ఏమి, ప్రయచ్ఛన్తు=ఇవ్వవలెను.

తా. మహాబాహూ! అందువలన పాకశాసనుడైన మహేంద్రుణ్ణి విడిచి పెట్టుము. ఇతనిని విడిచిపెట్టినందుకు దేవతలు ఏమి ఇవ్వవలెను? 7

మూ. అథాబ్రవీన్మహాతేజా ఇన్ద్రజిత్సమితింజయః,
అమరత్వమహం దేవ వృణే యద్యేష ముచ్యతే. 8

ప్ర. అ. అథ=అటు పిమ్మట, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, సమితింజయః=యుద్ధమును జయించు, ఇన్ద్రజిత్=ఇంద్రజిత్తు, అబ్రవీత్=పలికెను. దేవ=దేవా! ఏషః=ఇతడు, ముచ్యతే యది=విడువబడినట్లయితే అహమ్=నేను, అమరత్వమ్=మరణము లేకుండుటను, వృణే=కోరుచున్నాను.

తా. అప్పుడు మహాతేజశ్శాలీ, యుద్ధములలో జయించువాడూ అయిన

ఇంద్రజిత్తు ఇట్లు పలికెను "దేవా ! ఇతనిని విడువవలె నన్నచో నాకు మరణము లేకుండు నట్లు వరము ఇమ్ము". 8

మూ. చతుష్పదాం ఖేచరాణామన్యేషాం వా మహౌజసామ్,
వృక్షగుల్మక్షుపలతాతృణోపలమహీభృతామ్. 9

సర్వేఽపి జన్తవోఽన్యోన్యం భేతవ్యే సతి బిభ్యతి,
అతోఽత్ర లోకే సర్వేషాం సర్వస్మాచ్చ భవేద్భయమ్.

ప్ర. అ. చతుష్పదామ్ = నాలుగు పాదములున్నవాటిలోను, ఖేచరాణామ్ = ఆకాశమునందు సంచరించువాటిలోను, మహౌజసామ్ = గొప్ప తేజస్సుగల, అన్యేషాం వా = ఇతరులలోను, వృక్షగుల్మక్షుపలతా తృణోపల మహీభృతామ్ = వృక్షములు, పొదలు, చిన్నమొక్కలు, లతలు, తృణములు, రాళ్ళు, పర్వతములు—వీటిలోను, సర్వే అపి = సమస్తమైన, జన్తవః = జంతువులు, భేతవ్యే సతి = భయపడవలసి నప్పుడు, అన్యోన్యమ్ = పరస్పరము, బిభ్యతి = భయపడుదురు. అతః = అందువలన, అత్ర = ఈ, లోకే = లోకమునందు, సర్వేషామ్ = అందరికి, సర్వస్మాత్ = అందరివలన, భయమ్ = భయము, భవేత్ = కలుగును.

తా. చతుష్పాజ్జంతువులలోను, ఆకాశమునందు సంచరించేవాటిలోను, గొప్ప తేజస్సు గల ఇతరులలోను, వృక్ష - గుల్మ - క్షుప - లతా - తృణ - శిలా పర్వతములలోను అన్ని జంతువులూ కూడ భయకారణ మేర్పడినప్పుడు ఒక దాని కొకటి భయపడుచుండును. అందువలన ఈ లోకములో అందరికీ అందరి వలనా భయము ఉండును. 9, 10

మూ. తతోఽబ్రవీన్మహాతేజా మేఘనాదం ప్రజాపతిః,
నాస్తి సర్వామరత్వం హి కస్యచిత్ప్రాణినో భువి. 11

ప్ర. అ. తతః = అటు పిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, ప్రజాపతిః = బ్రహ్మదేవుడు, మేఘనాదమ్ = మేఘనాదుణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను. భువి = భూలోకమునందు, కస్యచిత్ ప్రాణినః = ఏ ప్రాణికి కూడ, సర్వామరత్వమ్ = పూర్తిగా మరణము లేకపోవుట, నాస్తి హి = లేదు కదా.

తా. అప్పుడు గొప్ప తేజస్సు గల బ్రహ్మదేవుడు మేఘనాదునితో ఇట్ల

నెను - "ఈ భూలోకములో ఏ ప్రాణికి కూడ ఎన్నటికి మరణము లేకపోవుట అనేది లేదు కదా ?" 11

మూ. పక్షిణశ్చతుష్పదో వా భూతానాం వా మహౌజసామ్,
శ్రుత్వా పితామహే నోక్తమిన్ద్రజిత్ప్రభుణావ్యయమ్, 12
అథాబ్రవీత్స తత్రస్థం మేఘనాదో మహాబలః.

ప్ర. అ. పక్షిణః = పక్షికి గాని, చతుష్పదో వా = చతుష్పాజ్జంతువుకు గాని, మహౌజసామ్ = గొప్ప తేజస్సు గల, భూతానాం వా=భూతములకు గాని (అమరత్వము లేదు). ఇన్ద్రజిత్ = ఇంద్రుణ్ణి జయించిన, మహాబలః = గొప్ప బలము గల, సః = ఆ, మేఘనాదః = మేఘనాదుడు, ప్రభుణా = ప్రభువైన, పితామహేన = పితామహునిచేత, ఉక్తమ్ = పలకబడిన వాక్యమును, శ్రుత్వా = విని, అథ = అటుపిమ్మట, తత్రస్థమ్ = అక్కడ ఉన్న, అవ్యయమ్ = నాశ రహితుడైన ఆ బ్రహ్మదేవుని గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. "పక్షులకు గాని, చతుష్పాజ్జంతువులకు గాని, గొప్పతేజస్సు గల ఇతర భూతములకు గాని అమరత్వము లేదు". అప్పుడు ఇంద్రుణ్ణి జయించిన, మహాబలశాలియైన మేఘనాదుడు, బ్రహ్మదేవుడు పలికిన ఆ మాటలు విని అక్కడనే ఉన్న వినాశరహితుడైన ఆ బ్రహ్మదేవునితో ఇట్లనెను. 12

మూ. శ్రూయతాం వా భవేత్సిద్ధిః శతక్రతువిమోక్షణే, 13
మమేష్టం నిత్యశో హవ్యైర్మన్త్రైః సంపూజ్య పావకమ్.
సఙ్గ్రామమవతర్తుం చ శత్రునిర్జయకాఙ్క్షిణః, 14
అశ్వయుక్తో రథో మహ్యముత్తిష్ఠేత్తు విభావసోః.

ప్ర. అ. వా = లేక, శతక్రతువిమోక్షణే=ఇంద్రునియొక్క విడిపించుట యందు, సిద్ధిః=సిద్ధి, శ్రూయతామ్=వినబడుగాక. మమ=నాయొక్క, ఇష్టమ్= ఇష్టము (వినబడుగాక). శత్రునిర్జయకాఙ్క్షిణః=శత్రువుల జయమును కోరుచున్న, మమ = నాకు, నిత్యశః = ఎల్లప్పుడు, హవ్యైః = హవ్యములచేత, మన్త్రైః = మంత్రములచేత, పావకమ్ = అగ్నిని, సంపూజ్య = పూజించి, సఙ్గ్రామమ్ = యుద్ధమును, అవతర్తుమ్ = ప్రవేశించుటకు, మహ్యమ్=నాకొరకు, విభావసోః=

అగ్నినుండి, అశ్వయుక్తః=గుఱ్ఱములతో కూడిన, రథః=రథము, ఉత్తిష్ఠేత్ తు=లేచుగాక.

తా. ఇంద్రుణ్ణి విడువవలె నన్నచో నాకు ఏ సిద్ధి కావలెనో, నాకు ఏది ఇష్టమో వినుము. శత్రు జయమును కోరుచు నిత్యము హవ్యములచేతను, మంత్రముల చేతను అగ్నిలో హోమము చేసి నేను యుద్ధములో ప్రవేశించగానే నాకొరకై అగ్నినుండి గుఱ్ఱములతో కూడిన రథము బైటకు వచ్చుగాక. 13, 14

మూ. తత్థస్యామరతా స్యాన్మే ఏష మే నిశ్చితో వరః, 15
తస్మిన్న్యద్యసమాప్తే చ జప్యహోమే విభావసౌ,
యుద్ధ్యేయం దేవ సంగ్రామే తదా మే స్యాద్వినాశనమ్.

ప్ర. అ. తత్థస్య=ఆ రథమునందున్న, మే=నాకు, అమరతా=మరణము లేకపోవుట, స్యాత్ = అగుగాక. ఏషః=ఇది, మే=నాయొక్క, నిశ్చితః=నిశ్చితమైన, వరః=వరము. విభావసౌ=అగ్నియందు, తస్మిన్=ఆ, జప్యహోమే=మంత్రజపముతో కూడిన హోమము, అసమాప్తే చ=సమాప్తము కాకుండా, యుద్ధ్యేయమ్=నేను యుద్ధము చేసినట్లయితే, దేవ=ప్రభూ! తదా=అప్పుడు, సంగ్రామే=యుద్ధమునందు, మే=నాయొక్క, వినాశనమ్=నాశనము, స్యాత్=అగుగాక.

తా. దేవా! నేను ఆ రథమునందు ఉన్నంతవరకు నాకు మరణము రాకూడదు. ఇదే నా నిశ్చితమైన వరము. అగ్నిలో సమంత్రకముగా నేను చేయు హోమము పూర్తికాకుండా నేను యుద్ధము చేసినచో అప్పుడు నాకు వినాశము కలుగవచ్చును. 15, 16

మూ. సర్వో హి తపసా దేవ వృణోత్యమరతాం పుమాన్,
విక్రమేణ మయా త్వేతదమరత్వం ప్రవర్తితమ్. 17

ప్ర. అ. దేవ=దేవా! సర్వః=సమస్తమైన, పుమాన్ = పురుషుడు, తపసా=తపస్సుచేత, అమరతామ్=మరణరాహిత్యమును. వృణోతి హి=కోరును కదా? మయా తు=నాచేత నైతే, ఏతత్=ఈ. అమరత్వమ్=మరణము లేకపోవుట, విక్రమేణ=పరాక్రమముచేత, ప్రవర్తితమ్=ప్రవర్తింపచేయబడినది.

తా. దేవా ! ప్రతీ పురుషుడూ తపస్సు చేసి అమరత్వమును వరముగా కోరునుకదా ? నేనుమాత్రము నా పరాక్రమము చూపి అమరత్వమును సంపాదింప కోరుచున్నాను. 17

మూ. ఏవమస్త్వితి తం చాహ వాక్యం దేవః పితామహః,
ముక్తశ్చేన్ద్రజితా శక్రో గతాశ్చ త్రిదివం సురాః. 18

ప్ర. అ. దేవః = దేవుడైన, పితామహః = పితామహుడు, ఏవమ్ = ఇట్లే, అస్తు = అగుగాక. ఇతి = అని, వాక్యమ్ = వాక్యమును, ఆహ = పలికెను. శక్రః = ఇంద్రుడు, ఇన్ద్రజితా = ఇంద్రజిత్తుచేత, ముక్తః = విడవబడినాడు. సురాశ్చ = దేవతలు కూడ, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి. గతాః = వెళ్ళినారు.

తా. బ్రహ్మదేవుడు "అట్లే అగుగాక" అని పలికెను. ఇంద్రజిత్తు ఇంద్రుణ్ణి విడచిపెట్టగా దేవత లందరు స్వర్గానికి వెళ్ళిరి. 18

మూ. ఏతస్మిన్నన్తరే రామ దీనో భ్రష్టామరద్యుతిః,
ఇన్ద్రశ్చిన్తాపరీతాత్మా ధ్యానతత్పరతాం గతః. 19

ప్ర. అ. రామ = రామా ! ఏతస్మిన్ = ఈ, అన్తరే = మధ్యకాలమునందు, దీనః = దీనుడు, భ్రష్టామరద్యుతిః = భ్రష్టమైన దేవతాతేజస్సు కలవాడు అయిన, ఇన్ద్రః = ఇంద్రుడు. చిన్తాపరీతాత్మా = చింతతో కూడిన మనస్సు కలవాడై, ధ్యానతత్పరతామ్ = ఆలోచనలో మునిగిపోవుటను, గతః = పొందినాడు.

తా. రామా! ఇంతలో ఇంద్రుడు దేవతల కుండవలసిన కాంతి తొలగి పోవుటచేత దీనుడై, చింతాక్రాంతుడై ఏదో ఆలోచనలో మునిగి ఉండెను. 19

మూ. తం తు దృష్ట్వా తథాభూతం ప్రాహ దేవః పితామహః,
శతక్రతో కిము పురా కరోతి స్మ సుదుష్కృతమ్. 20

ప్ర. అ. తథాభూతమ్ = అట్లు ఉన్న, తమ్ = అతనిని, దృష్ట్వా = చూచి, దేవః = ప్రభువైన, పితామహః = పితామహుడు, ప్రాహ = పలికెను. శతక్రతో = దేవేంద్రా! పురా = పూర్వము, సుదుష్కృతమ్ = చాల చెడ్డ పనిని, కిము కరోతి స్మ = ఏమిచేసితివి ?

తా. ఆ విధముగా ఉన్న ఇంద్రుణ్ణి చూచి బ్రహ్మదేవుడు ఇట్లు పలికెను. 'ఇంద్రా! పూర్వము చేయకూడని మహాపాపమును ఎందుకు చేసితివి ?" 20

మూ. అమరేన్ద్ర మయా బుద్ధ్యా ప్రజాః సృష్టాస్తథా ప్రభో,
ఏకవర్ణాః సమాభాషా ఏకరూపాశ్చ సర్వశః. 21

ప్ర. అ. ప్రభో = సమర్థుడా! అమరేన్ద్ర = దేవేంద్రా! మయా = నాచేత, సర్వశః = అంతటా, ఏకవర్ణాః = ఒకే వర్ణము గల వారూ, సమాభాషాః = సమానమైన భాషగలవారు, ఏకరూపాశ్చ = ఒకే రూపము గలవారు అయిన, ప్రజాః = ప్రజలు, తథా = ఆ విధముగా, బుద్ధ్యా = బుద్ధిచేత. సృష్టాః = సృజింపబడినారు.

తా. సమర్థుడవైన ఓ! దేవేంద్రా! నేను బుద్ధిచేత (ఆలోచించి) అన్ని విధాలా ఒకే రంగు, ఒకే విధమైన భాష, ఒకే విధమైన రూపమూ గల ప్రజలను సృష్టించితిని. 21

మూ. తాసాం నాస్తి విశేషో హి దర్శనే లక్షణేఽపి వా,
తతోఽహమేకాగ్రమనాస్తాః ప్రజాః సమచిన్తయమ్. 22

ప్ర. అ. దర్శనే = చూచుటయందుగాని, లక్షణేఽపి వా = లక్షణమునందుగాని, తాసామ్ = ఆ ప్రజలకు, విశేషః = విశేషము, నాస్తి = లేదు. తతః = అటుపిమ్మట, అహమ్ = నేను, ఏకాగ్రమనాః = ఏకాగ్రమైన చిత్తముగలవాడనై, తాః ప్రజాః = ఆ ప్రజలను గూర్చి, సమచిన్తయమ్ = ఆలోచించితిని.

తా. చూచుటకు గాని, లక్షణములలో గాని ఆ ప్రజలలో భేదమేమీ లేకుండెను. అప్పుడు నేను ఏకాగ్రచిత్తముతో ఆ ప్రజలను గూర్చి ఆలోచించితిని.

మూ. సోఽహం తాసాం విశేషార్థం స్త్రియమేకాం వినిర్మమే,
యద్యత్ప్రజానాం ప్రత్యఙ్గం విశిష్టం తత్తదుద్ధృతమ్. 23

ప్ర. అ. సః అహమ్ = అట్టి నేను, తాసామ్ = ఆ ప్రజలలో, విశేషార్థమ్ = విశేషముకొరకు, ఏకామ్ = ఒక, స్త్రియమ్ = స్త్రీని, వినిర్మమే = నిర్మించితిని. ప్రజానామ్ = ప్రజలయొక్క, ప్రత్యఙ్గమ్ = ప్రతి అవయవమునందు, యద్యత్ = ఏది యేది, విశిష్టమ్ = విశిష్టమైనదో, తత్తత్ = అది అంతా, ఉద్ధృతమ్ = తీయబడినది.

తా. నేను అప్పుడు ప్రజల ప్రతి అవయవమునందు ఏది యేది శ్రేష్ఠముగా ఉండునో దానిని తీసి వాటితో, ప్రజలలో విశేషముగా ఉండుటకై ఒక స్త్రీని నిర్మించితిని. 23

మూ. తతో మయా రూపగుణైరహల్యా స్త్రీ వినిర్మితా,
హలం నామేతి వైరూప్యం హల్యం తత్ప్రభవం భవేత్.

యస్యా న విద్యతే హల్యం తేనాహల్యేతి విశ్రుతా,
అహల్యేత్యేవ చ మయా తస్యా నామ ప్రకీర్తితమ్. 25

ప్ర. అ. తతః = పిమ్మట, మయా = నాచేత, రూపగుణైః = రూపముతోను, గుణములతోను, అహల్యా = అహల్య అయిన, స్త్రీ = స్త్రీ. వినిర్మితా = నిర్మించబడినది. హలం నామ=హలము అనగా, ఇహ = ఇక్కడ, వైరూప్యమ్= విరూపముగా ఉండుట. తత్ప్రభవమ్ = ఆ హలమువలన (విరూపత్వమువలన) పుట్టినది, హల్యమ్ = హల్యముగా, భవేత్ = అగును. యస్యాః = ఏ స్త్రీకి, హల్యమ్ = హల్యము, న విద్యతే = లేదో ఆమె, తేన = ఆ కారణముచేత, అహల్యేతి=అహల్య అని, విశ్రుతా = ప్రసిద్ధి కెక్కినది. తస్యాః=ఆమెయొక్క, నామ = పేరు, మయా = నాచేత, అహల్యేత్యేవ = అహల్య అనియే, ప్రకీర్తితమ్= చెప్పబడినది.

తా. అప్పుడు నేను రూపముతోను, గుణములతోను అహల్య అయిన స్త్రీని సృష్టించితిని. "హలము" అనగా రూపములో వికారము. అట్టి వికారమువలన కలిగినది హల్యము. అట్టి హల్యము లేని దానికి 'అహల్య' అని ప్రసిద్ధి. నేను ఆ స్త్రీకి కూడ 'అహల్య' అనియే పేరు పెట్టితిని. 24, 25

మూ. నిర్మితాయాం చ దేవేన్ద్ర తస్యాం నార్యాం సురర్షభ,
భవిష్యతీతి కస్యైషా మమ చిన్తా తతోఽభవత్. 26

ప్ర. అ. సురర్షభ = దేవతలలో శ్రేష్ఠుడా ! దేవేన్ద్ర = దేవేంద్రా! తస్యాం నార్యామ్ = ఆ స్త్రీ, నిర్మితాయామ్ = నిర్మించబడిన దగుచుండగా, తతః = అటు పిమ్మట, ఏషా = ఈమె, కస్య = ఎవనిది, భవిష్యతి = కాగలదు, ఇతి = అని, మమ = నాకు, చిన్తా = చింత, అభవత్ = ఆయెను.

తా. దేవతాశ్రేష్ఠుడవైన దేవేంద్రా! ఆ స్త్రీని సృజించిన పిమ్మట "ఈమె ఎవని భార్య అయినచో బాగుండును?" అని నాకు ఆలోచన కలిగినది. 26

మూ. త్వం తు శక్ర తదా నారీం జానీషే మనసా ప్రభో,
స్థానాధికతయా పత్నీ మమైషేతి పురన్దర. 27

ప్ర. అ. ప్రభో = సమర్థుడవైన, పురన్దర=ఇంద్రా! త్వం తు = నీవైతే, తదా = అప్పుడు, తాం నారీమ్ = ఆ స్త్రీని గూర్చి, స్థానాధికతయా = స్థానముచేత అధికుడను అగుటచేత, ఏషా = ఈమె, మమ = నాయొక్క, పత్నీ = భార్య, ఇతి = అని, మనసా = మనస్సుచేత, జానీషే = తలచినావు.

తా. ఇంద్రా! నీవు అప్పుడు "నేను ఉన్నతస్థానములో ఉన్నాను గాన ఈమె నా భార్యయే కావలెను" అని తలచినావు. 27

మూ. సా మయా న్యాసభూతా తు గౌతమస్య మహాత్మనః,
న్యస్తా బహూని వర్షాణి తేన నిర్యాతితా చ హ. 28

ప్ర. అ. సా = ఆమె, మయా = నాచేత, మహాత్మనః = మహాత్ముడైన, గౌతమస్య = గౌతముని సమీపమునందు, న్యాసభూతా = న్యాసముగా (దాచుటకై ఇచ్చిన వస్తువు 'న్యాసము'), బహూని = అనేకమైన, వర్షాణి = సంవత్సరములు, న్యస్తా = ఉంచబడినది. తేన = ఆతనిచేత, నిర్యాతితా చ హ = తిరిగి ఇచ్చివేయ బడినది కూడ.

తా. నేను ఆమెను చాల సంవత్సరములపాటు మహాత్ముడైన గౌతమునివద్ద న్యాసముగా ఉంచితిని. అతడు ఆమెను తిరిగి నాకు అప్పగించివేసినాడు. 28

మూ. తతస్తస్య పరిజ్ఞాయ మహాస్థైర్యం మహామునేః,
జ్ఞాత్వా తపసి సిద్ధిం చ పత్న్యర్థం స్పర్శితా తదా. 29

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తస్య = ఆ, మహామునేః = మహాముని యొక్క, మహాస్థైర్యమ్ = గొప్ప స్థిరత్వమును, పరిజ్ఞాయ = తెలుసుకొని, తపసి = తపస్సునందు, సిద్ధిం చ = సిద్ధిని కూడ, జ్ఞాత్వా = తెలుసుకొని, తదా = అపుడు, పత్న్యర్థమ్ = భార్యగా ఉండుటకు, స్పర్శితా = స్పృశింపచేయబడినది.

తా. అప్పుడు ఆ మహామునిలో ఉన్న గొప్ప మానసికస్థైర్యమును చూచి, ఆతని తపఃసిద్ధిని కూడ గుర్తించి ఆమెను ఆతనికి భార్యనుగా ఇచ్చితిని. 29

మూ. స తయా సహ ధర్మాత్మా రమతే స్మ మహామతిః,
ఆసన్నిరాశా దేవాస్తు గౌతమే దత్తయా తయా. 30

ప్ర. అ. మహామతిః = గొప్ప బుద్ధి గల, సః = ఆ, ధర్మాత్మా = ధర్మాత్ముడు, తయా సహ = ఆమెతో కూడ, రమతే = క్రీడించుచున్నాడు. గౌతమే = గౌతమునియందు, దత్తయా = ఇవ్వబడిన, తయా = ఆమెచేత, దేవాస్తు = దేవతలైతే, నిరాశాః = నిరాశులు, ఆసన్ = అయిరి.

తా. గొప్ప బుద్ధి గల, ధర్మాత్ముడైన ఆ గౌతముడు ఆమెతో ఆనందించు చుండెను. ఆమెను గౌతమునకు ఇచ్చివేయుటచేత దేవతలు నిరాశు లయిరి. 30

మూ. త్వం క్రుద్ధస్త్విహ కామాత్మా గత్వా తస్యాశ్రమం మునేః,
దృష్టవాంశ్చ తదా తాం స్త్రీం దీప్తామగ్నిశిఖామివ. 31

ప్ర. అ కామాత్మా = కామస్వభావుడవైన, త్వం తు = నీవైతే, ఇహ = ఇక్కడ, క్రుద్ధః = కోపించినవాడవై, తస్య మునేః = ఆ మునీశ్వరునియొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, గత్వా = వెళ్ళి, తదా = అప్పుడు, దీప్తామ్ = మండుచున్న, అగ్నిశిఖామ్ ఇవ = అగ్నిశిఖ వలె ఉన్న, తాం స్త్రీమ్ = ఆ స్త్రీని, దృష్టవాన్ చ = చూచినావు.

తా. కామముతో కూడిన మనస్సు గల నీవు కోపించి ఆ మునీశ్వరుని ఆశ్రమమునకు వెళ్ళి అప్పుడు మండుచున్న అగ్నిజ్వాల వలె ఉన్న ఆ అహల్యను చూచితివి. 31

మూ. సా త్వయా ధర్షితా తత్ర కామార్తేన సమన్యునా,
దృష్టస్త్వం స తదా తేన ఆశ్రమే పరమర్షిణా. 32

ప్ర. అ. కామార్తేన = కామపీడితుడవైన, సమన్యునా = కోపముతో కూడిన, త్వయా = నీచేత, సా = ఆమె, తత్ర = అక్కడ, ధర్షితా = ధర్షించబడినది. తదా = అప్పుడు, సః త్వమ్ = అట్టి నీవు, ఆశ్రమే = ఆశ్రమమునందు, తేన పరమర్షిణా = ఆ మహర్షిచేత, దృష్టః = చూడబడితివి.

తా. ఆమె లభించలేదను కోపముతో బాధపడుచున్న నీవు కామార్తుడవై అక్కడ ఆమెను చెరచితివి. అప్పుడా మహర్షి నిన్ను ఆ ఆశ్రమములో చూచెను.

మూ. తతః క్రుద్ధేన తేనాసి శప్తః పరమతేజసా,
గతోఽసి యేన దేవేన్ద్ర దశావిపర్యయమ్. 33

ప్ర. అ. దేవేన్ద్ర = దేవేంద్రుడా! తతః = అటుపిమ్మట, క్రుద్ధేన = కోపించిన, పరమతేజసా = గొప్ప తేజస్సు గల, తేన = ఆతనిచేత, శప్తః = శపించబడిన వాడవు, అసి = అయితివి, యేన = దేనిచేత, దశాభాగవిపర్యయమ్ = అవస్థలో విపరీతత్వమును, గతః = పొందినవాడవు, అసి = అయితివో.

తా. దేవేంద్రా! అప్పుడు గొప్ప తేజస్సు గల ఆ గౌతముడు నిన్ను శపించినాడు, దానిచేతనే నీవు ఇట్టి దుఃస్థితిని పొందినావు. 33

మూ. యస్మాన్మే ధర్షితా పత్నీ త్వయా వాసవ నిర్భయాత్,
తస్మాత్త్వం సమరే శక్ర శత్రుహస్తం గమిష్యసి. 34

ప్ర. అ వాసవ = ఇంద్రా, నిర్భయాత్ = భయము లేకుండగా, త్వయా = నీచేత, మే ధర్మపత్నీ = నా ధర్మపత్ని, యస్మాత్ = ఏ కారణమువలన, ధర్షితా = చెరపబడినదో, తస్మాత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, సమరే = యుద్ధమునందు, శక్రశత్రుహస్తమ్ = శక్రుని (నీ) శత్రువుయొక్క హస్తమును, గమిష్యసి = పొందగలవు.

తా. "ఇంద్రా! నీవు నా భార్యను నిర్భయముగా చెరచినావు. అందుచే నీవు యుద్ధములో నీ శత్రువు చేతిలో పడి బంధింపబడెదవు". 34

మూ. అయం తు భావో దుర్బుద్ధే యస్త్వయేహ ప్రవర్తితః,
మానుషేష్వపి లోకేషు భవిష్యతి న సంశయః. 35

ప్ర. అ. దుర్బుద్ధే = చెడ్డ బుద్ధిగలవాడా! యః = ఏ, భావః = భావము, త్వయా = నీచేత, ఇహ = ఇక్కడ, ప్రవర్తితః = ప్రారంభించబడినదో, అయమ్ = ఇది, మానుషేషు = మనుష్యులకు సంబంధించిన, లోకేష్వపి = లోకులలో కూడ, భవిష్యతి = ఉండగలదు. సంశయః = సంశయము, న = లేదు.

తా. "ఓ! దుర్బుద్ధీ! నీవు ఇక్కడ ప్రారంభించిన చెడు ప్రవర్తన ఇతర మనుష్యులలో కూడ పుట్టగలదు, సందేహము లేదు" 35

మూ. తత్రార్ధం తస్య యః కర్తా త్వయ్యర్ధం నిపతిష్యతి,
న చ తే స్థావరం స్థానం భవిష్యతి న సంశయః. 36

ప్ర. అ. తస్య = ఆ చెడ్డ పనికి, కర్తా = కర్త, యః = ఎవడో, తత్ర = వానియందు, అర్ధమ్ = సగము, త్వయి = నీయందు, అర్ధమ్ = సగము, నిపతిష్యతి = పడగలదు. తే = నీ యొక్క, స్థానమ్ = స్థానము, స్థావరమ్ = స్థిరము, న భవిష్యతి = కాదు. సంశయః = సంశయము, న = లేదు.

తా. "ఇతర మానవులు ఇట్టి చెడ్డ పని చేసినప్పుడు చేసినవానికి సగము పాపము, నీకు సగము పాపము చెందుచుండును. నీ ఇంద్రపదవి స్థిరముగా ఉండదు, సందేహము లేదు." 36

మూ. యశ్చ యశ్చ సురేన్ద్రః స్యా ద్ధ్రువః స న భవిష్యతి,
ఏష శాపో మయా ముక్త ఇత్యసౌ త్వాం తదాబ్రవీత్. 37

ప్ర. అ. యః చ యః చ = ఎవ డెవడు, సురేన్ద్రః = ఇంద్రుడు, స్యాత్ = అగునో, సః = అతడు, ధ్రువః = స్థిరుడు, న భవిష్యతి = కాడు, ఏషః = ఈ, శాపః = శాపము, మయా = నాచేత, ముక్తః = ఇవ్వబడినది, ఇతి = అని, అసౌ = ఇతడు, తదా = అప్పుడు, త్వామ్ = నిన్ను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. "ఎవ్వడెవడు ఇంద్రపదవి అధిష్ఠించునో అతడు ఆ పదవిలో స్థిరముగా ఉండడు. నేను నీకు ఈ శాపమిచ్చుచున్నాను" అని అతడప్పుడు నీతో అనెను. 37

మూ. తాం తు భార్యాం సునిర్భర్త్స్య సోఽబ్రవీత్సుమహాతపాః,
దుర్వినీతే వినిధ్వంస మమాశ్రమసమీపతః. 38

ప్ర. అ. సుమహాతపాః = చాల గొప్ప తపస్సు గల, సః = అతడు, తామ్ = ఆ, భార్యామ్ = భార్యను, సునిర్భర్త్స్య = బాగా నిందించి, అబ్రవీత్ = పలికెను. దుర్వినీతే = చెడ్డ నడవడిక గలదానా! మమ = నాయొక్క, ఆశ్రమ సమీపతః = ఆశ్రమసమీపమునుండి, వినిధ్వంస = దూరముగా తొలగుము.

తా. గొప్ప తపస్సు గల అతడు భార్యను కూడ బాగా జిపించి ఇట్లు పలికెను. "చెడునడవడిక గలదానా! నా ఆశ్రమమునుండి దూరముగా వెళ్ళి పొమ్ము. 38

మూ. రూపయౌవనసంపన్నా యస్మాత్త్వ మనవస్థితా,
తస్మాద్రూపవతీ లోకే న త్వమేకా భవిష్యతి. 39

ప్ర. అ. రూపయౌవనసంపన్నా = రూపయౌవనములతో కూడిన, త్వమ్ = నీవు, యస్మాత్ = ఏ కారణమువలన, అనవస్థితా = చంచలస్వభావము కల దాన వైనావో, తస్మాత్ = ఆ కారణమువలన, త్వమ్ = నీవు, ఏకా = ఒక్క దానవే, రూపవతీ = రూపవంతురాలవు, న భవిష్యసి = కావు.

తా. రూప యౌవన సంపన్నురాలవైన నీవు చపలచిత్తముతో ప్రవర్తించితివి. అందువలన రూపమంతురాలవు నీవు ఒక్కతివే కాక ఇంకను చాలమంది ఉండగలరు. 39

మూ. రూపం చ తే ప్రజాః సర్వా గమిష్యన్తి న సంశయః,
యత్తదేకం సమాశ్రిత్య విభ్రమోఽయముపస్థితః. 40

ప్ర. అ. ఏకమ్ = ఒక్క, యత్ = దేనిని, సమాశ్రిత్య = ఆశ్రయించి, అయమ్ = ఈ, విభ్రమః = పొరబాటు. ఉపస్థితః = జరిగినదో, తత్ = ఆ, తే రూపమ్ = నీ రూపమును, సర్వాః = సమస్తమైన, ప్రజాః = ప్రజలు, గమిష్యన్తి = పొందగలరు. సంశయః = సంశయము, న = లేదు.

తా. నీకు ఒక్కదానికే ఉన్న ఏ రూపము మూలమున ఈ పొరబాటు జరిగినదో అట్టి రూపమును ప్రజలందరూ గూడ పొందగలరు. సంశయము లేదు. 40

మూ. తదా ప్రభృతి భూయిష్ఠం ప్రజా రూపసమన్వితా,
సా తం ప్రసాదయామాస మహర్షిం గౌతమం తదా. 41

ప్ర. అ. తదా ప్రభృతి = అది మొదలు, భూయిష్ఠమ్ = చాలవరకు, ప్రజా = ప్రజ, రూపసమన్వితా = రూపముతో కూడినది అయినది. తదా =

అప్పుడు, సా = ఆమె, మహర్షిమ్ = మహర్షియైన, తం గౌతమమ్ = ఆ గౌతముణ్ణి, ప్రసాదయామాస = అనుగ్రహింపచేసుకొనెను.

తా. అది మొదలు ప్రజలు చాలవరకు రూపసంపన్నులు అయిరి. అప్పుడు ఆ అహల్య ఆ గౌతమమహామునిని అనుగ్రహింపచేసికొనెను. 41

మూ. అజ్ఞానాద్ధర్షితా విప్ర త్వద్రూపేణ దివౌకసా,
న కామకారాద్విప్రర్షే ప్రసాదం కర్తుమర్హసి. 42

ప్ర. అ. విప్ర = బ్రాహ్మణుడా! త్వద్రూపేణ = నీ రూపము గల, దివౌకసా = సురుని చేత, అజ్ఞానాత్ = అజ్ఞానమువలన, ధర్షితా = అవమానించ బడితిని. కామకారాత్ = కోరి చేయుట వలన, న = కాదు. విప్రర్షే = బ్రహ్మర్షి! ప్రసాదమ్ = అనుగ్రహమును, కర్తుమ్ = చేయుటకు, అర్హసి = తగిఉన్నావు.

తా. ఓ! బ్రహ్మర్షి! ఇంద్రుడు నీ రూపము ధరించి వచ్చి నాకు తెలియక పోవుటచే నన్ను అపమానించినాడు. ఇది నాకు తెలిసి జరగలేదు. అందుచేత అనుగ్రహించుము. 42

మూ. అహల్యయా త్వేవముక్తః ప్రత్యువాచ స గౌతమః,
ఉత్పత్స్యతి మహాతేజా ఇక్ష్వాకూణాం మహారథః. 43

రామో నామ శ్రుతో లోకే వనం చాప్యుపయాస్యతి,
బ్రాహ్మణార్థే మహాబాహుర్విష్ణుర్మానుషవిగ్రహః. 44

ప్ర. అ. అహల్యయా = అహల్యచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలకబడిన, సః గౌతమః = ఆ గౌతముడు, ప్రత్యువాచ = తిరిగి పలికెను. ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశరాజులలో, మహాతేజాః = గొప్ప తేజస్సుగల, మహారథః = మహారథుడు, ఉత్పత్స్యతి = పుట్టగలడు. రామో నామ = రాముడు అను పేరు గల వాడుగా, లోకే = లోకమునందు, శ్రుతః = ప్రసిద్ధుడైన, మానుషవిగ్రహః = మనుష్యశరీరము గల, విష్ణుః = విష్ణువైన, మహాబాహుః = గొప్ప బాహువులు గల అతడు, బ్రాహ్మణార్థే = బ్రాహ్మణుని నిమిత్తమై, వనమ్ = వనమును, ఉపయాస్యతి = పొందగలడు.

తా. అహల్య మాటలు విని గౌతముడిట్లు పలికెను- "ఇక్ష్వాకువంశీయులలో గొప్ప తేజస్సు గల మహారథుడు పుట్టగలడు. లోకములో రాముడు అను పేరుతో ప్రసిద్ధుడు కాబోవు ఆ మహాబాహువు మనుష్యరూపములో ఉండు విష్ణువే. అతడు ఒక బ్రాహ్మణుని వనిమీద వనమునకు వెళ్ళును. 43, 44

మూ. తం ద్రక్ష్యసి యదా భద్రే తతః పూతా భవిష్యసి,
స హి పావయితుం శక్తస్త్వయా యద్దుష్కృతం కృతమ్.

ప్ర. అ. భద్రే = మంగళప్రదురాలా! యదా = ఎప్పుడు, తమ్ = వానిని, ద్రక్ష్యసి = చూడగలవో, తతః = అటు పిమ్మట, పూతా = పవిత్రము చేయబడిన దానవు, భవిష్యసి = కాగలవు. త్వయా = నీ చేత, యత్ = ఏ, దుష్కృతమ్ = పాపము, కృతమ్ = చేయబడినదో దానిని, పావయితుమ్ = పవిత్రింపచేయుటకు, సః = అతడు, శక్తః హి = సమర్థుడు కదా.

తా. మంగళప్రదురాలా! ఆ రాముణ్ణి చూడగానే నీవు పవిత్రురాలవు కాగలవు. నీవు చేసిన పాపమును తొలగించి నిన్ను పవిత్రురాలిని చేయుటకు అతడు సమర్థుడు.

మూ. తస్యాతిథ్యం చ కృత్వా వై మత్సమీపం గమిష్యసి,
వత్స్యసి త్వం మయా సార్ధం తదా హి వరవర్ణిని. 46

ప్ర. అ. వరవర్ణిని = శ్రేష్ఠమైన శరీరచ్ఛాయ గలదానా! తస్య = అతని యొక్క, ఆతిథ్యమ్ = ఆతిథ్యమును, కృత్వా = చేసి, మత్సమీపమ్ = నాసమీపమును గూర్చి, గమిష్యసి = వెళ్లగలవు. తదా = అప్పుడు, త్వమ్ = నీవు, మయా సార్ధమ్ = నాతో కూడ, వత్స్యసి = నివసించగలవు.

తా. శ్రేష్ఠమైన శరీరవర్ణముగలదానా! ఆ రామునకు ఆతిథ్యము చేసి నా దగ్గరకు రాగలవు. అప్పుడు నాతో కలిసి నివసించగలవు. 46

మూ. ఏవముక్త్వా స విప్రర్షిరాజగామ స్వమాశ్రమమ్,
తపశ్చచార సుమహత్సా పత్నీ బ్రహ్మవాదినః. 47

ప్ర. అ. సః = ఆ, విప్రర్షిః = బ్రహ్మర్షి. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, స్వమ్ = తనసంబంధమైన, ఆశ్రమమ్ = ఆశ్రమమును గూర్చి, ఆజగామ = వచ్చెను. బ్రహ్మవాదినః = వేదవేత్తయైన అతనియొక్క, సా = ఆ, పత్నీ = భార్య, సుమహత్ = చాల గొప్పదైన, తపః = తపస్సును, చచార = చేసెను.

తా. ఆ బ్రహ్మర్షి ఇట్లు పలికి తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను. వేదవేత్త యైన ఆ గౌతముని భార్యయైన ఆ అహల్య చాల గొప్ప తపస్సు చేసెను. 47

మూ. శాపోత్సర్గాద్ధి తస్యేదం మునేః సర్వముపస్థితమ్,
తత్స్మర త్వం మహాబాహో దుష్కృతం యత్త్వయా కృతమ్,

ప్ర. అ. తస్య మునేః = ఆ మునీశ్వరునియొక్క, శాపోత్సర్గాత్ = శాపము ఇచ్చుటవలననే, ఇదమ్ = ఇది, సర్వమ్ = అంతా, ఉపస్థితమ్ = వచ్చినది. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా, యత్ = ఏ, దుష్కృతమ్ = దుష్ట కార్యము, త్వయా = నీ చేత, కృతమ్ = చేయబడినదో, తత్ = దానిని, స్మర = స్మరించుము.

తా. ఆ ముని శాపము ఇచ్చుటచేతనే నీకు ఈ ఆపద వచ్చి పడినది. ఓ! మహాబాహూ! నీవు పూర్వము చేసిన దుష్టకార్యమును గుర్తుకు తెచ్చుకొనుము. 48

మూ. తేన త్వం గ్రహణం శత్రోర్యాతో నాన్యేన వాసవ,
శీఘ్రం వై యజ యజ్ఞం త్వం వైష్ణవం సుసమాహితః.

ప్ర. అ. వాసవ = దేవేంద్రా! త్వమ్ = నీవు, తేన = ఆ దుష్కార్యముచేతనే, శత్రోః = శత్రువుయొక్క, గ్రహణమ్ = గ్రహణమును, యాతః = పొందినావు. అన్యేన = మరియొక కారణముచేత, న = కాదు. త్వమ్ = నీవు, సమాహితః = సావధానచిత్తుడవై, శీఘ్రమ్ = శీఘ్రముగా, వైష్ణవమ్ = విష్ణుదేవతాకమైన, యజ్ఞమ్ = యజ్ఞమును, యజ = యజించుము.

తా. ఇంద్రా! నీవు ఆ పాపము మూలముననే శత్రువుచేత బంధింపబడినావు. సావధానచిత్తుడవై వెంటనే వైష్ణవయజ్ఞమును (విష్ణుప్రీతికరమైన యజ్ఞమును) చేయుము. 49

మూ. పావితస్తేన యజ్ఞేన యాస్యసే త్రిదివం తతః,
పుత్రశ్చ తవ దేవేన్ద్ర న వినష్టో మహారణే. 50
నీతః సంనిహితశ్చైవ ఆర్యకేణ మహోదధౌ.

ప్ర. అ. తేన యజ్ఞేన = ఆ యజ్ఞముచేత, పావితః = పవిత్రింపబడినవాడవై,

తతః = పిమ్మట, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, యాస్యసే = వెళ్ళగలవు. దేవేన్ద్ర = దేవేంద్రా ! తవ = నీయొక్క, పుత్రః చ = పుత్రుడు, మహారణే = గొప్ప యుద్ధమునందు, న వినష్టః = మరణించలేదు. ఆర్యకేణ = మాతామహుని చేత, నీతః = తీసికొనివెళ్ళబడినాడు; మహోదధౌ = మహాసముద్రమునందు, సంనిహితః చ = ఉంచబడినాడు.

తా. దేవేంద్రా! నీవు ఆ యజ్ఞము చేయుటచే పవిత్రుడవై పిమ్మట స్వర్గమునకు వెళ్ళగలవు. నీ పుత్రుడు మహాయుద్ధమునందు మరణించలేదు. అతని మాతామహుడు తీసికొని పోయి మహాసముద్రములో దాచినాడు. 50

మూ. ఏతచ్ఛ్రుత్వా మహేన్ద్రస్తు యజ్ఞమిష్ట్వా చ వైష్ణవమ్, 51
పునస్త్రిదివమాక్రామదన్వశాసచ్చ దేవరాట్.

ప్ర. అ. మహేన్ద్రః తు = మహేంద్రుడు, ఏతత్ = దీనిని, శ్రుత్వా = విని, వైష్ణవం యజ్ఞమ్ = వైష్ణవయజ్ఞమును, ఇష్ట్వా = యజించి, పునః = మరల, త్రిదివమ్ = స్వర్గమును, ఆక్రామత్ = ఆక్రమించెను. దేవరాట్ = దేవతలంరాజై, అన్వశాసత్ చ = పరిపాలించెను

తా. మహేంద్రుడు వైష్ణవయజ్ఞము చేసి మరల స్వర్గమును ఆక్రమించి దేవతల ప్రభువై పాలించెను. 51

మూ. ఏతదిన్ద్రజితో రామ బలం యత్కీర్తితం మయా, 52
నిర్జితస్తేన దేవేన్ద్రః ప్రాణినోఽన్యే తు కిం పునః.

ప్ర. అ. రామ = రామా ! మయా = నాచేత, యత్ = ఏది, కీర్తితమ్ = చెప్పబడినదో, ఏతత్ = ఇది, ఇన్ద్రజితః = ఇంద్రజిత్తుయొక్క, బలమ్ = బలము. తేన = వానిచేత, దేవేన్ద్రః = దేవేంద్రుడు, నిర్జితః = జయింపబడినాడు. అన్యే = ఇతరములైన, ప్రాణినః = ప్రాణులు, కిం పునః = చెప్పనేల ?

తా. రామా ! నీకు ఇంద్రజిత్తు బలమును చెప్పినాను. అతడు దేవేంద్రుణ్ణే జయించినాడు అనగా ఇతరుల మాట చెప్పవలెనా ! 52

మూ. ఆశ్చర్యమితి రామశ్చ లక్ష్మణశ్చాబ్రవీత్తదా, 53
అగస్త్యవచనం శ్రుత్వా వానరా రాక్షసాస్తదా.

ప్ర. అ. తదా = అప్పుడు, అగస్త్యవచనమ్ = అగస్త్యుని వచనమును, శ్రుత్వా = విని, తదా = అప్పుడు, రామశ్చ = రాముడు, ఆశ్చర్యమ్ ఇతి = ఆశ్చర్యముఅని, అబ్రవీత్ = పలికెను. లక్ష్మణః చ = లక్ష్మణుడు, వానరాః చ = వానరులు, రాక్షసాః చ = రాక్షసులూ కూడ ఆశ్చర్యము అని పలికిరి.

తా. అగస్త్యుని వచనమును విని రాముడు, లక్ష్మణుడు, వానరులు, రాక్షసులూ కూడ "ఎంత ఆశ్చర్యము!" అని పలికిరి. 53

మూ. విభీషణస్తు రామస్య పార్శ్వస్థో వాక్యమబ్రవీత్. 54
ఆశ్చర్యం స్మారితోఽస్మ్యద్య యత్తద్దృష్టం పురాతనమ్.

ప్ర. అ. రామస్య = రామునియొక్క, పార్శ్వస్థః = పార్శ్వమునందున్న, విభీషణః తు = విభీషణుడైతే, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. యత్ = ఏది, దృష్టమ్ = చూడబడినదో, పురాతనమ్ = ప్రాచీనమైన, తత్ = అ, ఆశ్చర్యమ్ = ఆశ్చర్యమును గూర్చి, అద్య = ఇప్పుడు, స్మారితః = స్మరింప చేయబడినవాడను, అస్మి = అయిఉన్నాను.

తా. రాముని ప్రక్కనే కూర్చొని ఉన్న విభీషణుడు - "పూర్వ మెన్నడో నేను చూచిన ఆశ్చర్యకరమైన విషయము నాకిపుడు జ్ఞాపకము చేయబడినది" అని పలికెను. 54

మూ. అగస్త్యం త్వబ్రవీద్రామః సత్యమేతచ్ఛ్రుతం చ మే. 55
ఏవం రామ సముద్భూతో రావణో లోకకణ్టకః,
సపుత్రో యేన సఙ్గ్రామే జితః శక్రః సురేశ్వరః. 56

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్రింశః సర్గః.

ప్ర. అ. రామః = రాముడు, అగస్త్యమ్ = అగస్త్యుణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను. ఏతత్ = ఇది. సత్యమ్ = సత్యము. మే = నాకు, శ్రుతం చ = వినబడినది. రామ = రామా! యేన = ఎవనిచేత, సఙ్గ్రామే = యుద్ధమునందు. సపుత్రః = పుత్రసహితుడైన, సురేశ్వరః = దేవతలప్రభువైన, శక్రః = దేవేంద్రుడు, జితః =

జయింపబడినాడో అట్టి, లోకకణ్టకః = లోకములకు ముల్లు అయిన, రావణః = రావణుడు, ఏవమ్ = ఇట్లు, సముద్భూతః = పుట్టినాడు.

తా. రాముడు అగస్త్యునితో - "ఇదంతా సత్యమే; నేను కూడ (విభీషణాదులనుండి) విని ఉన్నాను" అని పలికెను. "రామా! యుద్ధములో పుత్రసహితుడైన దేవతాప్రభువైన ఇంద్రుణ్ణి జయించిన లోకములను పీడించిన రావణుని జన్మ వృత్తాంతము ఇట్టిది" అని అగస్త్యుడు పలికెను. 55, 56

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ముప్పదవ సర్గ సమాప్తము.

అథ ఏకత్రింశః సర్గః

[రావణుడు మాహిష్మతికి వెళ్ళుట, అక్కడ కార్తవీర్యార్జునుని కానక మంత్రులతో కలిసి వింధ్యగిరిప్రాంతమునందున్న నర్మదా నదిలో స్నానముచేసి శివుణ్ణి ఆరాధించుట].

మూ. తతో రామో మహాతేజా విస్మయాత్ పునరేవ హి,
ఉవాచ ప్రణతో వాక్యమగస్త్యమృషిసత్తమమ్. 1

ప్ర. అ తతః = అటుపిమ్మట, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, రామః = రాముడు, ప్రణతః = నమస్కరించుచున్నవాడై, ఋషిసత్తమమ్ = ఋషులలో శ్రేష్ఠుడైన, అగస్త్యమ్ = అగస్త్యుణ్ణి గూర్చి, విస్మయాత్ = ఆశ్చర్యమువలన, పునరేవ హి = మరల, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. అప్పుడు మహాతేజఃశాలియైన రాముడు నమస్కరించుచు, ఋషులలో శ్రేష్ఠుడైన అగస్త్యునితో ఆశ్చర్యపూర్వకముగ మరల ఇట్లు పలికెను. 1

మూ. భగవన్ రాక్షసః క్రూరో యదాప్రభృతి మేదినీమ్,
పర్యటత్కిం తదా లోకాః శూన్యా ఆసన్ ద్విజోత్తమ. 2

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! ద్విజోత్తమ = బ్రాహ్మణశ్రేష్ఠుడా! క్రూరః = క్రూరుడైన, రాక్షసః = రావణుడు, యదా ప్రభృతి = ఎప్పుడు మొదలు, మేదినీమ్ = భూమిని, పర్యటత్ = పర్యటించెనో, తదా = అప్పుడు, లోకాః = లోకములు, శూన్యాః = శూన్యములుగా, ఆసన్ కిమ్ = ఉండినవా?

తా. పూజ్యుడవైన ఓ! బ్రాహ్మణ శ్రేష్ఠుడా! క్రూరుడైన రావణుడు సంచరించు కాలమునందు లోకములలో ఎవరూ శూరులే లేకపోయిరా? 2

మూ. రాజా వా రాజమాత్రో వా కిం తదా నాత్ర కశ్చన,
ధర్షణం యత్ర న ప్రాప్తో రావణో రాక్షసేశ్వరః. 3

ప్ర. అ. తదా = అప్పుడు, రాక్షసేశ్వరః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, యత్ర = ఎవనియందు (ఎవనివలన), ధర్షణమ్ = ఎదిరించుటను, న ప్రాప్తః = పొందలేదో అట్టి, రాజా వా = రాజు గాని, రాజమాత్రః వా = క్షత్రియుడు కాని రాజ్యపాలకుడు గాని, కశ్చన = ఎవడూ, అత్ర = ఈ లోకము నందు, న కిమ్ = లేకుండెనా ?

తా. రాక్షసరాజైన రావణుణ్ణి ఎదిరించ గలిగిన క్షత్రియుడైన రాజ్యపాలకుడు గాని, క్షత్రియేతరుడైన రాజ్యపాలకుడు గాని లేకుండెనా ? 3

మూ. ఉతాహో హతవీర్యాస్తే బభూవుః పృథివీక్షితః,
బహిష్కృతా వరాస్త్రైశ్చ బహవో నిర్జితా నృపాః. 4

ప్ర. అ. ఉత అహో = లేదా, తే = ఆ, పృథివీక్షితః = రాజులు, హత వీర్యాః = తొలగింపబడిన పరాక్రమముగలవారు, బభూవుః = అయిరా ? (దేనిచేత), బహవః = చాలమంది, నృపాః = ఆ రాజులు, వరాస్త్రైః = శ్రేష్ఠములైన అస్త్రములచేత, బహిష్కృతాః = బహిష్కరింపబడినవారై, నిర్జితాః = జయింపబడిరో.

తా. లేదా రాజులందరూ హతవీర్యులై, పరాక్రమము కోల్పోయి, శ్రేష్ఠములైన అస్త్రాల జ్ఞానము లేనివారై ఓడిపోయినారా ? 4

మూ. రాఘవస్య వచః శ్రుత్వా అగస్త్యో భగవాన్ ఋషిః,
ఉవాచ రామం ప్రహసన్ పితామహ ఇవేశ్వరమ్. 5

ప్ర. అ. భగవాన్ = పూజ్యుడైన, అగస్త్యః ఋషిః = అగస్త్యఋషి, రాఘవస్య = రామునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, ప్రహసన్ = నవ్వుచు, పితామహః = బ్రహ్మదేవుడు, ఈశ్వరమ్ ఇవ = ఈశ్వరుణ్ణి గూర్చి వలె, రామమ్ = రాముణ్ణి గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పూజ్యుడైన అగస్త్యమహాముని రాముని మాటలు విని, నవ్వుచు, బ్రహ్మదేవుడు ఈశ్వరునితో చెప్పినట్లు అతనికి ఇట్లు చెప్పెను. 5

మూ. ఇత్యేవం బాధమానస్తు పార్థివాన్ పార్థివర్షభ,
చచార రావణో రామ పృథివీం పృథివీపతే. 6

ప్ర. అ. పృథివీపతే = భూమికి ప్రభువైనవాడా ! పార్థివర్షభ=రాజులలో శ్రేష్ఠుడా! రామ = రామా! ఇత్యేవమ్ = ఈ విధముగా, పార్థివాన్ = రాజులను, బాధమానః = బాధించుచు, రావణః=రావణుడు, పృథివీమ్=భూమిని, చచార= సంచరించెను.

తా. రాజులలో శ్రేష్ఠుడా ! మహారాజా! రామా! రావణుడు ఈ విధముగా రాజులను పీడించుచు భూమియందు సంచరించెను. 6

మూ తతో మాహిష్మతీం నామ పురీం స్వర్గపురీప్రభామ్,
సంప్రాప్తో యత్ర సాంనిధ్యం సదాసీద్వసురేతసః. 7

ప్ర. అ. తతః = అటుపిమ్మట, స్వర్గపురీప్రభామ్=స్వర్గలోకపత్తనముతో సమానమైన, మాహిష్మతీం నామ = మాహిష్మతి అను, పురీమ్ = పట్టణమును, సంప్రాప్తః = పొందినాడు, యత్ర = ఎక్కడ, సదా=ఎల్లప్పుడు, వసురేతసః= అగ్నియొక్క, సాంనిధ్యమ్ = సాంనిధ్యము, ఆసీత్ = ఉండెనో.

తా. అతడు అమరావతితో సమానమైన మాహిష్మతీపురమును చేరెను. ఆ పురమునందు అగ్నిదేవుడు ఎల్లప్పుడు సంనిహితుడై ఉండెడివాడు. 7

మూ. తుల్య ఆసీన్నృపస్తస్య ప్రభావాద్వసురేతసః,
అర్జునో నామ యత్రాగ్నిః శరకుణ్డేశయః సదా. 8

ప్ర. అ. యత్ర=ఏ నగరమునందు, అగ్నిః=అగ్ని, సదా=ఎల్లప్పుడూ, శరకుణ్డేశయః = (అభిచారిక క్రియలనిమిత్తము) రెల్లుగడ్డి ఆస్తరించిన కుండమునందు ఉండేవాడో, ఆ నగరమునందు, ప్రభావాత్ = ప్రభావమువలన, తస్య=ఆ, వసురేతసః = అగ్నికి, తుల్యః = సమానుడైన, అర్జునో నామ = అర్జునుడు అనువాడు, ఆసీత్ = ఉండెను.

తా. శత్రుబాధానివృత్తికొరకై చేయు అభిచారప్రయోగముకోసమై ఆ నగరములో నిత్యము శరములు (రెల్లుగడ్డి చుట్టూ కప్పిన అగ్నికుండములో అగ్ని ఉండేది. అట్టి ఆ నగరములో ఆ అగ్నితో సమానమైన ప్రభావము గల అర్జునుడు ఉండెడివాడు. 8

మూ. తమేవ దివసం సోఽథ హైహయాధిపతిర్బలీ,
అర్జునో నర్మదాం రన్తుం గతః స్త్రీభిః సహేశ్వరః. 9

ప్ర. అ. అథ = పిమ్మట (అప్పుడు), బలీ = బలవంతుడైన, ఈశ్వరః = సమర్థుడైన, సః హైహయాధిపతిః = ఆ అర్జునుడు, తం దివసమ్ = ఆ రోజునే, రన్తుమ్ = విహరించుటకు, స్త్రీభిః సహ = స్త్రీలతో కూడ, నర్మదామ్ = నర్మదా నదిని గూర్చి, గతః = వెళ్ళినాడు.

తా. బలశాలి, సమర్థుడూ అయిన కార్తవీర్యార్జునుడు ఆ రోజునే నర్మదలో స్త్రీలతో కలిసి విహరించుటకై వెళ్ళెను. 9

మూ. తమేవ దివసం సోఽథ రావణస్తత్ర ఆగతః,
రావణో రాక్షసేన్ద్రస్తు తస్యామాత్యానపృచ్ఛత. 10

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సః రావణః = ఆ రావణుడు, తం దివసమ్ ఏవ = ఆ దివసముననే, తత్ర = అక్కడ, ఆగతః = వచ్చెను. రాక్షసేన్ద్రః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, తస్య = అతనియొక్క, అమాత్యాన్ = అమాత్యులను, అపృచ్ఛత = అడిగెను.

తా. ఆ రోజునే రావణుడు అక్కడికి వచ్చెను. రాక్షసరాజైన ఆ రావణుడు అతని అమాత్యులను అడిగెను. 10

మూ. క్వార్జునో నృపతిః శీఘ్రం సమ్యగాఖ్యాతుమర్హథ,
రావణోఽహమనుప్రాప్తో యుద్ధేప్సుర్నృవరేణ హ. 11

ప్ర. అ. నృపతిః = రాజైన, అర్జునః = అర్జునుడు, క్వ = ఎక్కడ ? సమ్యక్ = బాగుగా, ఆఖ్యాతుమ్ = చెప్పుటకు, అర్హథ = తగి ఉన్నారు. రావణః = రావణుడనైన, అహమ్ = నేను, నృవరేణ = ఆ మనుష్యశ్రేష్ఠునితో, యుద్ధేప్సుః = యుద్ధము పొంద దలచుచున్నవాడనై, అనుప్రాప్తః = వచ్చినాను.

తా. "రాజైన కార్తవీర్యార్జునుడు ఎక్కడున్నారో చెప్పుడు. నేను రావణుడను. ఆ రాజుతో యుద్ధము చేయుటకై వచ్చినాను". 11

మూ. మమాగమనమప్యగ్రే యుష్మాభిః సంనివేద్యతామ్,
ఇత్యేవం రావణేనోక్తాస్తేఽమాత్యాః సువిపశ్చితః, 12
అబ్రువన్ రాక్షసపతిమసాంనిధ్యం మహీపతేః.

ప్ర. అ. మమ = నాయొక్క, అగమనమపి = రాక కూడ, యుష్మాభిః = మీచేత, అగ్రే = అతనిఎదుట, సంనివేద్యతామ్ = తెలుపబడుగాక. ఇత్యేవమ్ = ఇట్లు. రావణేన = రావణునిచేత, ఉక్తాః = పలకబడిన, సువిపశ్చితః = గొప్ప విద్వాంసులైన, తే అమాత్యాః = ఆ మంత్రులు, మహీపతేః = రాజుయొక్క, అసాంనిధ్యమ్ = అక్కడ లేకపోవుటను, రాక్షసపతిమ్ = రావణుని గూర్చి. అబ్రువన్ = చెప్పిరి.

తా. "మీరు నేను వచ్చినట్లుగా అతనికి తెలుపుడు". రావణుని మాటలు విని మంచి పండితులైన ఆ అమాత్యులు రాజు అక్కడ లేదను విషయమును రావణునకు తెలిపిరి. 12

మూ. శ్రుత్వా విశ్రవసః పుత్రః పౌరాణామర్జునం గతమ్, 13
అపసృత్యాగతో విన్ధ్యం హిమవత్సంనిభం గిరిమ్.

ప్ర. అ. విశ్రవసః = విశ్రవస్సుయొక్క, పుత్రః = పుత్రుడు, అర్జునమ్ = అర్జునుడ్ని, గతమ్ = వెళ్ళినవానినిగా, పౌరాణామ్ = పౌరులయొక్క మాటను, శ్రుత్వా = విని, అపసృత్య = అక్కడినుండి కదలి, హిమవత్సంనిభమ్ = హిమవత్పర్వతముతో సమానమైన, విన్ధ్యం గిరిమ్ = వింధ్యపర్వతమును గూర్చి, ఆగతః = వచ్చినాడు

తా. అర్జునుడు ఎక్కడికో వెళ్ళినట్లు పౌరులవలన తెలిసికొని రావణుడు హిమవత్పర్వతముతో సమానమైన వింధ్యపర్వతమునకు వెళ్లెను. 13

మూ. స తమభ్రమివావిష్టముద్భ్రాన్తమివ మేదినీమ్, 14
అపశ్యద్రావణో విన్ధ్యమాలిఖన్తమివామ్బరమ్.
సహస్రశిఖరోపేతం సింహాధ్యుషితకన్దరమ్. 15

ప్ర. అ. సః రావణః = ఆ రావణుడు, అభ్రమ్ = ఆకాశమును, ఆవిష్టమ్ = ప్రవేశించినది వలె ఉన్నది, మేదినీమ్ = భూమిని, ఉద్భ్రాన్తమ్ ఇవ = చుట్టుకొని పుట్టినది వలె ఉన్నది, అమ్బరమ్ = ఆకాశమును, ఆలిఖన్తమివ = ఒరయు

చున్నది వలె ఉన్నదీ, సహస్రశిఖరోపేతమ్ = వేయి శిఖరములతో కూడినది, సింహాధ్యుషితకన్దరమ్ = సింహములచేత అధిష్ఠించబడిన గుహలు కలదీ అయిన, తం విన్ధ్యమ్ = ఆ వింధ్యపర్వతమును, అపశ్యత్ = చూచెను.

తా. ఆ రావణుడు ఆకాశములో ప్రవేశించినదా అన్నట్లు, భూమిని చీల్చు కొని వచ్చినదా అన్నట్లు ఉన్న ఆ వింధ్యపర్వతమును చూచెను. అనేకశిఖరములతో, సింహములు నివసించుచున్న గుహలతో ప్రకాశించుచున్న ఆ పర్వతము ఆకాశ మును ఒరయుచున్నట్లు ఉండెను. 14,15

మూ. ప్రపాతపతితైః శీఘ్రైః సాట్టహాసమివామ్బుభిః,
దేవదానవగన్ధర్వైః సాప్సరోభిః సకింనరైః. 16

స్వస్త్రీభిః క్రీడమానైశ్చ స్వర్గభూతం మహోచ్ఛ్రియమ్,
నదీభిః స్యన్దమానాభిః స్ఫటికప్రతిమం జలమ్. 17

ఫణాభిశ్చలజిహ్వాభిరనన్తమివ విష్ఠితమ్.
ఉత్క్రామన్తం దరీమన్తం హిమవత్సంనిభం గిరిమ్, 18
పశ్యమానస్తతో విన్ధ్యం రావణో నర్మదాం యయౌ.

ప్ర. అ. ప్రపాతపతితైః = ఎత్తు ప్రదేశమునుండి పడిన, శీఘ్రైః = వేగముగల, అమ్బుభిః = ఉదకములతో, సాట్టహాసమ్ = అట్టహాసముతో కూడినది వలె ఉన్నదీ, సాప్సరోభిః = అప్సరఃస్త్రీలతో కూడిన, సకింనరైః = కింనరులతో కూడిన, స్వస్త్రీభిః = తమ స్త్రీలతో, క్రీడమానైః చ = క్రీడించుచున్న, దేవదానవ గన్ధర్వైః = దేవదానవగంధర్వులతో, స్వర్గభూతమ్ = స్వర్గముగా అయినదీ, మహోచ్ఛ్రియమ్ = గొప్ప ఎత్తు గలదీ. స్ఫటికప్రతిమమ్ = స్ఫటికమాణిక్యముతో సమానమైన, జలమ్ = జలమును, స్యన్దమానాభిః = స్రవించుచున్న, నదీభిః = నదులతో, చలజిహ్వాభిః = చంచలములైన నాలుకలు గల, ఫణాభిః = పడగలతో, అనన్తమివ = ఆదిశేషుడు వలె, విష్ఠితమ్ = నిలచి ఉన్నదీ, ఉత్క్రామన్తమ్ = పైకి లేచుచున్నదీ, దరీమన్తమ్ = గుహలు గలదీ, హిమవత్సంనిభమ్ = హిమవత్పర్వతముతో సమానము అయిన, విన్ధ్యం గిరిమ్ = వింధ్యపర్వతమును, పశ్యమానః = చూచుచు, రావణః = రావణుడు, నర్మదామ్ = నర్మదానదిని గూర్చి, యయౌ = వెళ్లెను.

తా. ఆ వింధ్యపర్వతము ఎత్తైన ప్రదేశములనుండి వేగముగా క్రిందికి పడు చున్న జలములతో అట్టహాసము చేయుచున్నట్లు ఉండెను. దేవ-దానవ-గంధర్వులు అప్సరఃస్త్రీలతోను, కిన్నరులు తమ స్త్రీలతోను అక్కడ క్రీడించుచుండుటచే అది స్వర్గమువలె ఉండెను. చాల ఎత్తైన ఆ పర్వతము స్ఫటికము వంటి శుభ్రమైన జలముతో ప్రవహించుచున్న నదులతో, కదలుచున్న నాలుకలు గల పడగలతో నిలచిన ఆదిశేషుడు వలె ఉండెను. పైకి లేచుచున్నట్లు కనబడుచు, అనేకగుహలతో నిండి ఉన్న ఆ పర్వతము హిమవత్పర్వతము వలె ఉండెను. అట్టి వింధ్యగిరిని చూచుచు రావణుడు నర్మదానది దగ్గరకు వెళ్లెను. 16-18

మూ. చలోపలజలాం పుణ్యాం పశ్చిమోదధిగామినీమ్, 19
మహిషైః సృమరైః సింహైః శార్దూలర్క్షగజోత్తమైః,
ఉష్ణాభితప్తైస్తృషితైః సంక్షోభితజలాశయామ్. 20

చక్రవాకైః సకారణ్డైః సహంసజలకుక్కుటైః,
సారసైశ్చ సదా మత్తైః కూజద్భిః సుసమావృతామ్. 21

ఫుల్లద్రుమకృతోత్తంసాం చక్రవాకయుగస్తనీమ్,
విస్తీర్ణపులినశ్రోణీం హంసావలిసుమేఖలామ్. 22

పుష్పరేణ్వనులిప్తాఙ్గీం జలఫేనామలాంశుకామ్,
జలావగాహసుస్పర్శాం పుల్లోత్పలశుభేక్షణామ్. 23

పుష్పకాదవరుహ్యాశు నర్మదాం సరితాం వరమ్,
ఇష్టామివ వరాం నారీ మవగాహ్య దశాననః. 24

స తస్యాః పులినే రమ్యే నానామునినిషేవితే,
ఉపోపవిష్టః సచివైః సార్ధం రాక్షసపుంగవః. 25

ప్ర. అ. చలోపలజలామ్=కదలుచున్న రాళ్లు, జలమూ కలది, పుణ్యామ్ =పవిత్రమైనది, పశ్చిమోదధిగామినీమ్ = పశ్చిమసముద్రమును గూర్చి వెళ్లేది, ఉష్ణాభితప్తైః = వేడిచేత తపింపచేయబడిన, తృషితైః = దప్పికొన్న, మహిషైః= మహిషములచేత, సృమరైః = సృమరమృగములచేత, సింహైః=సింహములచేత,

శార్దూలర్క్షగజోత్తమైః = శార్దూలములచేత, భల్లూకములచేత, గజేంద్రములచేత, సంక్షోభితజలాశయామ్ = క్షోభింపచేయబడిన జలస్థానములుకలదీ, మత్తైః = మదించిన, కూజద్భిః = ధ్వనిచేయుచున్న, సకారండైః = కారండవపక్షులతో కూడిన, సహంసజలకుక్కుటైః = హంసలతోను, నీటికోళ్ళతోను కూడిన, చక్రవాకైః = చక్రవాకములతోను, సారసైః చ=సారసపక్షులతోను, సదా=ఎల్లప్పుడూ, సమావృతామ్ = కూడినదీ, పుల్లద్రుమకృతోత్తంసామ్ = వికసించిన వృక్షములచేత చేయబడిన శిరోభూషణము కలదీ, చక్రవాకయుగస్తనీమ్ = చక్రవాకముల జంట స్తనములుగా కలదీ, విస్తీర్ణపులినశ్రోణీమ్ = విశాలములైన ఇసుక తిన్నెలు పిరుదులుగా గలది, హంసావలిసుమేఖలామ్=హంసల పంక్తియే మంచి వడ్డాణముగా గలదీ, పుష్పరేణ్వనులిప్తాఙ్గీమ్=పుష్పపరాగముచేత పూయబడిన శరీరము గలది, జలఫేనామలాంశుకామ్ = నీటి నురుగు అనే నిర్మలమైన వస్త్రము గలదీ, జలావగాహసుస్పర్శామ్=జలమునందు మునుగుట అనే మంచి స్పర్శ గలదీ, పుల్లోత్పలశుభేక్షణామ్=వికసించిన నల్లకలువ లనే సుందరములైన నేత్రములు కలదీ, సరితామ్ నదులలో, వరామ్ = శ్రేష్ఠమూ అయిన, నర్మదామ్ = నర్మదను, దశాననః = రావణుడు, పుష్పకాత్ = పుష్పకమునుండి, ఆశు=శీఘ్రముగా, అవరుహ్య=దిగి, ఇష్టామ్ = ఇష్టురాలైన, వరామ్ = శ్రేష్ఠయైన, నారీమివ = స్త్రీని వలె, అవగాహ్య = ప్రవేశించి, సః రాక్షసపుంగవః = ఆ రాక్షసశ్రేష్ఠుడు, సచివైః సార్ధమ్ = మంత్రులతో కూడ, తస్యాః=ఆ నదియొక్క, రమ్యే=సుందరమైన, నానామునినిషేవితే = అనేకమునులచేత సేవించబడిన, పులినే = ఇసుకతిన్నెమీద, ఉపోపవిష్టః = దగ్గరగా కూర్చుండెను.

తా. పవిత్రమైన ఆ నర్మదానదిలో రాళ్ళు దొర్లుచుండెను. నీరు ప్రవహించుచుండెను. ఆ నది పశ్చిమసముద్రము వైపు ప్రవహించుచుండెను (?). వేడికి బాధపడుచు దప్పికొన్న మహిషములు, సృమరములు, సింహములు, పులులు, భల్లూకములు, ఉత్తమ గజములు దీనిలో ప్రవేశించి జలమును కలుషము చేయుచుండెను. చక్రవాకములు, కారండవములు, హంసలు, నీటికోళ్ళు, సారసపక్షులు మొదలైన మదించి కూయుచున్న జలపక్షులు అంతటా దీనిని ఆవరించి ఉండెను. (శిరముమీద ఉన్న) వికసించిన (పూవులతో నిండిన) వృక్షములే శిరోభూషణముగా ధరించి, చక్రవాకముల జంట లనెడు స్తనములతో, విశాలములైన ఇసుక తిన్నె లనెడు పిరుదులతో, హంసపంక్తు లనే వడ్డాణముతో, పుప్పొడి అనే అంగ

రాగము పూసికొని, సిటిసురుగు అనే తెల్లని వస్త్రము ధరించి, వికసించిన నల్ల కలువలు అనే సుందరములైన నేత్రములతో ఆ నర్మద ఒక సుందరి వలె ఉండెను. నీటిలో ప్రవేశించుటచే సుఖకరమైన స్పర్శను కలిగించుచుండెను. ఇట్లు ఇష్టురాలైన స్త్రీ వలె ఉన్న నదులలో శ్రేష్ఠమైన ఆ నర్మదను చూచి, రావణుడు పుష్పకము నుండి దిగి, (యువతిని ఆశ్లేషించి నట్లు) ఆ నదిలో ప్రవేశించెను. పిమ్మట ఆ రాక్షసశ్రేష్ఠుడు అనేకమునులచేత సేవింపబడిన దాని ఇసుకతిన్నెపై మంత్రులతో కలిసి కూర్చుండెను. 19.25

మూ. ప్రఖ్యాయ నర్మదాం సోఽథ గఙ్గేయమితి రావణః,
నర్మదాదర్శనే హర్షమాప్తవాన్ స దశాననః, 26
ఉవాచ సచివాంస్తత్ర సలీలం శుకసారణౌ.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, సః రావణః = ఆ రావణుడు, ఇయమ్ = ఇది, గఙ్గా = గంగ, ఇతి = అని, నర్మదామ్ = నర్మదను, ప్రఖ్యాయ = శ్లాఘించి, నర్మదాదర్శనే = నర్మదయొక్క దర్శనమునందు, హర్షమ్ = సంతోషమును, ఆప్తవాన్ = పొందినాడు. సః దశాననః = ఆ రావణుడు, తత్ర = అక్కడ, శుకసారణౌ = శుకసారణులను గూర్చి, సచివాన్ = మంత్రులను గూర్చి, సలీలమ్ = విలాసతో కూడినట్లుగా. ఉవాచ = పలికెను.

తా. పిమ్మట ఆ రావణుడు ఈ నదియే గంగ యని నర్మదను శ్లాఘించి, ఆ నదిని చూచినందుకు సంతోషించుచు, విలాసపూర్వకముగా మంత్రులతోను, శుకసారణులతోను ఇట్లు పలికెను.

మూ. ఏష రశ్మిసహస్రేణ జగత్కృత్వేవ కాఞ్చనమ్, 27
తీక్ష్ణతాపకరః సూర్యో నభసో మధ్యమాస్థితః,
మామాసీనం విదిత్వైవ చన్ద్రాయతి దివాకరః. 28

ప్ర. అ. ఏషః = ఈ, సూర్యః = సూర్యుడు, రశ్మిసహస్రేణ = కిరణములయొక్క సహస్రముచేత. జగత్ = జగత్తును, కాఞ్చనమ్ ఇవ = బంగారము వికారమైనదానిని వలె, కృత్వా = చేసి, తీక్ష్ణతాపకరః = తీక్ష్ణమైన తాపమును చేయుచు, నభసః = ఆకాశముయొక్క, మధ్యమ్ = మధ్యమును, ఆస్థితః = అధిష్ఠించి

ఉన్నాడు. దివాకరః = సూర్యుడు, మామ్ = నన్ను, ఆసీనమ్ = కూర్చొని ఉన్న వానినిగా, విదిత్వైవ = తెలిసికొనియే, చన్ద్రాయతి = చంద్రుడు వలె అయినాడు.

తా. ఈ సూర్యుడు సహస్రకిరణములచేత జగత్తును కనకమయమైనట్లు చేసి, తీవ్రమైన తాపము కలిగించుచు ఆకాశమధ్యము చేరినాడు. నేను ఇక్కడ కూర్చొని ఉన్నా నని తెలియగానే ఈ సూర్యుడు చంద్రుడు వలె చల్లగా ప్రకాశించుచున్నాడు. 27,28

మూ. నర్మదాజలశీతశ్చ సుగన్ధిః శ్రమనాశనః,
మద్భయాదనిలో హ్యేష వాత్యసౌ సుసమాహితః. 29

ప్ర. అ నర్మదాజలశీతః = నర్మదాజలముచేత చల్లనిది, సుగన్ధిః = మంచి సువాసన గలది, శ్రమనాశనః = శ్రమను నశింపచేయునది అయిన, ఏషః = ఈ, అనిలః చ = గాలి కూడ, మద్భయాత్ = నావల్ల భయమువలన, సుసమాహితః = చాల సావధానమై, అసౌ = ఇది, వాతి = వీచుచున్నది.

తా. గాలి కూడ నాకు భయపడి నర్మదానదీజలముచేత చల్లనై, మంచి సువాసన కలదై, శ్రమను తొలగించుచు, చాల సావధానమై వీచుచున్నది. (వాయుదేవుడు వీచుచున్నాడు అని భావము) 29

మూ. ఇయం చాపి సరిచ్ఛ్రేష్ఠా నర్మదా శర్మవర్ధనీ,
నక్రమీనవిహఙ్గోర్మిః సభయేవాఙ్గనా స్థితా. 30

ప్ర. అ. నక్రమీనవిహఙ్గోర్మిః = మొసళ్ళు, చేపలు, పక్షులు, తరంగములు గల, శర్మవర్ధనీ = సుఖమును వృద్ధి పొందించు, సరిచ్ఛ్రేష్ఠా = నదులలో శ్రేష్ఠమైన, ఇయమ్ = ఈ, నర్మదా చాపి = నర్మద కూడ, సభయా = భయముతో కూడిన, అఙ్గనా ఇవ = స్త్రీ వలె, స్థితా = ఉన్నది.

తా. మొసళ్ళతోను, మీనములతోను, పక్షులతోను, తరంగములతోను కూడిన, సుఖమును వృద్ధిపొందించే, నదులలో శ్రేష్ఠమైన ఈ నర్మదానది భయపడుచున్న స్త్రీ వలె ఉన్నది. 30

మూ. తద్భవన్తః క్షతాః శస్త్రైర్నృపైరిన్ద్రసమైర్యుధి,
చన్దనస్య రసేనేవ రుధిరేణ సముక్షితాః. 31

ప్ర. అ యుధి = యుద్ధమునందు, ఇన్ద్రసమైః = ఇంద్రునితో సమానులైన, నృపైః = రాజులచేత, శస్త్రైః = ఆయుధములచేత, క్షతాః = కొట్టబడిన, భవన్తః = మీరు, తత్ = ఆ కారణమువలన, చన్దనస్య = చందనముయొక్క, రసేనేవ = రసముచేత వలె, రుధిరేణ = రక్తముచేత, సముక్షితాః = పూయబడినారు.

తా. ఇంద్రునితో సమానులైన రాజులు యుద్ధమునందు ఆయుధములచే కొట్టుటచే మీరు (ఎట్టిని) చందనరసము వంటి రక్తముచేత పూయబడి ఉన్నారు.

మూ. తే యూయమవగాహధ్వం నర్మదాం శర్మదాం శుభామ్,
సార్వభౌమముఖా మత్తా గఙ్గామివ మహాగజాః. 32

ప్ర. అ. తే = అట్టి, యూయమ్ = మీరు, సార్వభౌమముఖాః = సార్వభౌమము మొదలైన, మత్తాః = మదించిన, మహాగజాః = మహాగజములు, గఙ్గామ్ ఇవ = గంగను వలె, శర్మదామ్ = సుఖము నిచ్చు, శుభామ్ = మంగళకరమైన, నర్మదామ్ = నర్మదను, అవగాహధ్వమ్ = ప్రవేశించుడు.

తా. అందుచేత మీరు సార్వభౌమము మొదలైన మదించిన దిగ్గజములు గంగలో ప్రవేశించినట్లు సుఖము నిచ్చే, పవిత్రమైన నర్మదలో దిగి స్నానము చేయుడు. 32

మూ. అస్యాం స్నాత్వా మహానద్యాం పాప్మనో విప్రమోక్ష్యథ,
అహమప్యద్య పులినే శరదిన్దుసమప్రభే, 33
పుష్పోపహారం శనకైః కరిష్యామి కపర్దినః.

ప్ర. అ. అస్యామ్ = ఈ, మహానద్యామ్ = మహానదిలో, స్నాత్వా = స్నానముచేసి, పాప్మనః = పాపమునుండి, విప్రమోక్ష్యథ = ముక్తులు అవండి. అహమపి = నేను కూడ, అద్య = ఇప్పుడు, శరదిన్దుసమప్రభే = శరత్కాల చంద్రునితో సమానమైన కాంతి గల, పులినే = ఇసుకతిన్నెమీద, శనకైః = మెల్లగా, కపర్దినః = శివునకు, పుష్పోపహారమ్ = పుష్పసమర్పణను, కరిష్యామి = చేయగలను.

తా. ఈ మహానదిలో స్నానము చేసి పాపవిముక్తులు అవండి, నేను కూడ

ఇప్పుడు చంద్రుని వంటి కాంతి గల ఇసుకతిన్నెమీద మెల్లగా శివునకు పుష్పములు సమర్పించి పూజచేసెదను. 33

మూ రావణేనైవముక్తాస్తు ప్రహస్తశుకసారణాః, 34
సమహోదరధూమ్రాక్షా నర్మదాం విజగాహిరే.

ప్ర. అ. రావణేన = రావణునిచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తాః = పలకబడిన, సమహోదరధూమ్రాక్షాః = మహోదరధూమ్రాక్షులతో కూడిన, ప్రహస్తశుకసారణాః = ప్రహస్త-శుక - సారణులు, నర్మదామ్ = నర్మదానదిని, విజగాహిరే = ప్రవేశించిరి.

తా. రావణుడు చెప్పిన విధముగా ప్రహస్త-శుక-సారణ- మహోదర-ధూమ్రాక్షులు నర్మదానదిలో ప్రవేశించిరి. 34

మూ. రాక్షసేన్ద్రగజైస్తైస్తు క్షోభితా నర్మదా నదీ, 35
వామనాఞ్జనపద్మాద్యైర్గఙ్గా ఇవ మహాగజైః.

ప్ర. అ. నర్మదానదీ = నర్మదానది, వామనాఞ్జనపద్మాద్యైః = వామన - అంజన - పద్మాదులైన, మహాగజైః = గొప్ప గజములచేత, గఙ్గా ఇవ = గంగ వలె, తైః = ఆ, రాక్షసేన్ద్రమహాగజైః = రాక్షసనాయకు లను గజములచేత, క్షోభితా = క్షోభింపచేయబడినది.

తా. ఆ నర్మదానదిని, వామనము, అంజనము, పద్మము మొదలైన దిగ్గజములు గంగానదిని వలె రాక్షసేంద్రు లనే గజములు కలచి వేసెను. 35

మూ. తతస్తే రాక్షసాః స్నాత్వా నర్మదాయాం మహాబలాః, 36
ఉత్తీర్య పుష్పాణ్యాజహ్రుర్బల్యర్థం రావణస్య తు.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మహాబలాః = గొప్పబలము గల, తే రాక్షసాః = ఆ రాక్షసులు, నర్మదాయామ్ = నర్మదయందు, స్నాత్వా = స్నానము చేసి, ఉత్తీర్య = పైకివచ్చి, రావణస్య = రావణునకు, బల్యర్థమ్ = పూజకొరకు, పుష్పాణి = పుష్పములను, ఆజహ్రుః = తీసికొనివచ్చిరి.

తా. పిదప ఆ బలశాలులైన రాక్షసులు నర్మదలో స్నానము చేసి, పైకి లేచి వచ్చి రావణుని పూజకొరకై పుష్పములు తీసికొనివచ్చిరి. 36

మూ. నర్మదాపులినే హృద్యే శుభ్రాభ్రసదృశప్రభే, 37
రాక్షసైస్తు ముహూర్తేన కృతః పుష్పమయో గిరిః.

ప్ర. అ. శుభ్రాభ్రసదృశప్రభే = తెల్లని మేఘముతో సమానమైన కాంతి గల, హృద్యే = మనోహరమైన, నర్మదాపులినే = నర్మదానది ఇసుకతిన్నెమీద, ముహూర్తేన = ముహూర్తకాలముచేత, రాక్షసైః = రాక్షసులచేత, పుష్పమయః = పుష్పవికారమైన, గిరిః = పర్వతము, కృతః = నిర్మించబడినది.

తా. తెల్లని మేఘము వంటి కాంతి గల మనోహరమైన నర్మదానది ఇసుకతిన్నెమీద ఆ రాక్షసులు ముహూర్తకాలములో పుష్పముల పర్వతమును ఏర్పరచిరి. 37

మూ. పుష్పేషూపహృతేష్వేవం రావణో రాక్షసేశ్వరః, 38
అవతీర్ణో నదీం స్నాతుం గఙ్గామివ మహాగజః.

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, పుష్పేషు = పుష్పములు, ఉపహృతేషు = తీసికొనిరాబడిన వగుచుండగా, రాక్షసేశ్వరః = రాక్షసప్రభువైన, రావణః = రావణుడు, మహాగజః = గొప్ప గజము, గఙ్గామ్ ఇవ = గంగను వలె, స్నాతుమ్ = స్నానము చేయుటకు, నదీమ్ = నదిని, అవతీర్ణః = దిగినాడు.

తా. ఈ విధముగ పుష్పములు తీసికొనివచ్చిన పిమ్మట రాక్షసరాజైన రావణుడు, మహాగజము గంగలో ప్రవేశించినట్లు, స్నానము చేయుటకై నర్మదలో దిగెను. 38

మూ. తత్ర స్నాత్వా చ విధివజ్జప్త్వా జప్యమనుత్తమమ్, 39
నర్మదాసలిలాత్తస్మాదుత్తతార స రావణః.

ప్ర. అ. సః రావణః = ఆ రావణుడు, తత్ర = దానియందు, స్నాత్వా = స్నానముచేసి, అనుత్తమమ్ = శ్రేష్ఠమైన, జప్యమ్ = జపించ దగిన మంత్రమును, విధివత్ = యథావిధిగా, జప్త్వా చ = జపించి, తస్మాత్ = ఆ, నర్మదాసలిలాత్ = నర్మదోదకమునుండి, ఉత్తతార = లేచెను.

తా. రావణుడు ఆ నదిలో స్నానము చేసి, శ్రేష్ఠమైన జపించదగిన మంత్రమును జపించి, ఆ నర్మదాజలమునుండి పైకి లేచెను. 39

మూ. తతః క్లిన్నామ్బరం త్యక్త్వా శుక్లవస్త్రసమావృతః, 40
రావణం ప్రాఞ్జలిం యాన్తమన్వయుః సర్వరాక్షసాః,
తద్గతీవశమాపన్నా మూర్తిమన్త ఇవాచలాః. 41

ప్ర. అ. తతః = అటుపిమ్మట, క్లిన్నామ్బరమ్ = తడిసిన వస్త్రమును, త్యక్త్వా = విడచి, శుక్లవస్త్రసమావృతః = తెల్లని వస్త్రముచేత కప్పబడిన వాడయ్యెను. ప్రాఞ్జలిమ్ = కట్టబడిన దోసిలి గల, యాన్తమ్ = వెళ్ళుచున్న, రావణమ్ = రావణుణ్ణి, సర్వరాక్షసాః = సమస్తమైన రాక్షసులు, తద్గతీవశమ్ = ఆతని గమనమునకు వశమును, ఆపన్నమ్ = పొందిన, మూర్తిమన్తః = మూర్తి గల, అచలాః ఇవ = పర్వతములు వలె, అన్వయుః = అనుసరించిరి.

తా. తడిసిన వస్త్రము విడచి తెల్లని వస్త్రము ధరించి, అంజలి ఘటించి వెళ్ళుచున్న ఆ రావణుని వెనుకనే మిగిలిన రాక్షసులందరూ ఆతని గతికి వశములైన, మనుష్య (రాక్షస) మూర్తి ధరించిన పర్వతముల వలె వెళ్ళిరి. 41

మూ. యత్ర యత్ర చ యాతి స్మ రావణో రాక్షసేశ్వరః,
జామ్బూనదమయం లిఙ్గం తత్ర తత్ర స్మ నీయతే. 42

ప్ర. అ. రాక్షసేశ్వరః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, యత్ర యత్ర = ఎక్కడికి ఎక్కడికి, యాతి స్మ = వెళ్ళెనో, తత్ర తత్ర = ఆ యా ప్రదేశమునందు, జామ్బూనదమయమ్ = బంగారము వికారమైన, లిఙ్గమ్ = లింగము, నీయతే స్మ = తీసికొనివెళ్ళబడెను.

తా. రావణుడు ఏ యే ప్రదేశములకు వెళ్ళేవాడో ఆ యా ప్రదేశములకు (రాక్షసులు) బంగారు శివలింగమును తీసికొని వెళ్ళుచుండిరి. 42

మూ. వాలుకావేదిమధ్యే తు తల్లిఙ్గం స్థాప్య రావణః,
అర్చయామాస గన్ధైశ్చ పుష్పైశ్చామృతగన్ధిభిః. 43

ప్ర. అ. రావణః = రావణుడు, తత్ = ఆ, లిఙ్గమ్ = లింగమును, వాలు

కావేదిమధ్యే = ఇసుకతో ఏర్పరచిన వేదిక మధ్యయందు, స్థాప్య = ఉంచి, గన్ధైః చ = గంధములతోను, అమృతగన్ధిభిః = అమృతము వంటి సువాసన గల, లేదా నాశము లేని సువాసన గల, పుష్పైః = పుష్పములతోను, అర్చయామాస = పూజించెను.

తా. రావణుడు ఆ బంగారులింగమును ఇసుకతో నిర్మించిన తిన్నె మధ్యయందు నిలిపి, దానికి చందనాదిగంధములచేతా, అమృతగంధములైన పుష్పములచేతా పూజ చేసెను

వి. కైలాసముదగ్గర శివుని చేతిలో పరాభవము పొందినది మొదలు రావణుడు ప్రతినిత్యము శివపూజ చేసేవాడు. శివలింగమును ఎక్కడికి వెళ్ళినా అక్కడికి తీసికొనివెళ్లేవాడు. సువర్ణలింగపూజ ఐశ్వర్యప్రదము (వ్యాఖ్యాతలు). 43

మూ తతః సతామార్తిహరం పరం వరం
వరప్రదం చన్ద్రమయూఖభూషణమ్,
సమర్చయిత్వా స నిశాచరో జగౌ
ప్రసార్య హస్తాన్ ప్రణనర్త చాగ్రతః. 44

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ఏకత్రింశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సః = ఆ. నిశాచరః = రాక్షసుడు, సతామ్ = సత్పురుషులయొక్క, ఆర్తిహరమ్=పీడను తొలగించువాడు, పరమ్= సర్వోత్తముడు, వరమ్ = శ్రేష్ఠుడు, వరప్రదమ్ = వరములు ఇచ్చువాడు, చన్ద్రమయూఖభూషణమ్ = చంద్రకిరణములు భూషణములుగా కలవాడు అయిన శివుణ్ణి, సమర్చయిత్వా = పూజించి, జగౌ = సామగానము చేసెను. అగ్రతః= ఎదుట, హస్తాన్ = హస్తములను, ప్రసార్య = చాపి, ప్రణనర్త చ = నృత్యము చేసెను కూడ.

తా. పిమ్మట రావణుడు, సత్పురుషుల పీడలను పోగొట్టువాడు, సర్వోత్తముడు, శ్రేష్ఠుడు, వరములను ఇచ్చువాడూ చంద్రుణ్ణి శిరోభూషణముగా ధరించిన

వాడూ అయిన ఆ మహేశ్వరుణ్ణి పూజించి, సామగానము చేసెను. ఆ శివుని ఎదుట హస్తములు చాపి నృత్యము కూడ చేసెను. 44

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ముప్పది ఒకటవ సర్గ సమాప్తము.

అథ ద్వాత్రింశః సర్గః

[కార్తవీర్యార్జునుడు భుజములచేత నర్మదాప్రవాహమును నిలిపి వేయగా రావణుడు శివలింగముపై పూజించిన పుష్పము లన్నీ కొట్టుకొని పోవుట. రావణామలతో కార్తవీర్యార్జునుడు యుద్ధము చేయుట. రావణుణ్ణి బంధించి అతడు తన నగరమునకు బయలుదేరి వెళ్ళుట.]

మూ. నర్మదాపులినే యత్ర రాక్షసేన్ద్రః స దారుణః,
పుష్పోపహారం కురుతే తస్మాద్దేశాదదూరతః. 1

అర్జునో జయతాం శ్రేష్ఠో మాహిష్మత్యాః పతిః ప్రభుః,
క్రీడతే సహ నారీభిర్నర్మదాతోయమాశ్రితః. 2

ప్ర. అ. దారుణః = భయంకరుడైన, సః రాక్షసేన్ద్రః = ఆ రాక్షసరాజు, నర్మదాపులినే = నర్మదానది ఇసుకతిన్నెమీద, యత్ర = ఎచట, పుష్పోపహారమ్ = పుష్పముల సమర్పణను, కురుతే = చేయుచున్నాడో తస్మాత్ = ఆ దేశాత్ = దేశమునుండి, అదూరతః = సమీపమునందు, జయతామ్ = జయించువారిలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడు, మాహిష్మత్యాః = మాహిష్మతీపురికి, పతిః = అధిపతి, ప్రభుః = సమర్థుడూ అయిన, అర్జునః = అర్జునుడు, నర్మదాతోయమ్ = నర్మదానదీ జలమును, ఆశ్రితః = ఆశ్రయించినవాడై, నారీభిః సహ = స్త్రీలతో కూడ, క్రీడతే = ఆడుకొనుచున్నాడు

తా. భయంకరుడైన ఆ రావణుడు నర్మదానది ఇసుకతిన్నెమీద పుష్పములతో శివపూజ చేయుచున్న ప్రదేశమునకు సమీపమునందే, విజయవంతులలో శ్రేష్ఠుడు, మాహిష్మతీనగర ప్రభువు, సమర్థుడూ అయిన అర్జునుడు నర్మదానదిలో, స్త్రీలతో కలిసి జలక్రీడలాడు చుండెను. 1,2

మూ. తాసాం మధ్యగతో రాజా రరాజ చ తదార్జునః,
కరేణూనాం సహస్రస్య మధ్యస్థ ఇవ కుఞ్జరః. 3

ప్ర. అ. తదా = అప్పుడు, తాసామ్ = ఆ స్త్రీలయొక్క, మధ్యగతః = మధ్యయందున్న, రాజా = రాజైన, అర్జునః = అర్జునుడు, కరేణూనామ్ = ఆడ ఏనుగులయొక్క, సహస్రస్య = సహస్రముయొక్క, మధ్యస్థః = మధ్యయందున్న, కుఞ్జరః ఇవ = ఏనుగు వలె, రరాజ చ = ప్రకాశించెను.

తా. అప్పుడు ఆ స్త్రీల మధ్య నున్న రాజైన ఆ కార్తవీర్యార్జునుడు వేయి ఆడఏనుగుల మధ్య నున్న గజేంద్రము వలె ప్రకాశించెను. 3

మూ. జిజ్ఞాసుః స చ బాహూనాం సహస్రస్యోత్తమం బలమ్,
రురోధ నర్మదావేగం బాహుభిర్బహుభిర్వృతః. 4

ప్ర. అ. బహుభిః = అనేకమైన, బాహుభిః = బాహువులతో, వృతః = కూడిన, సః = అతడు, బాహూనామ్ = బాహువులయొక్క, సహస్రస్య = సహస్రముయొక్క, బలమ్ = బలమును, జిజ్ఞాసుః = తెలిసికొనదలంచినవాడై, నర్మదా వేగమ్ = నర్మదయొక్క వేగమును, రురోధ = అడ్డుకొనెను.

తా. అనేకములైన బాహువులు గల ఆ కార్తవీర్యార్జునుడు తన వేయి బాహువుల గొప్ప బలమును తెలిసికొన దలంచి నర్మదానదీప్రవాహమును అడ్డుకొనెను. 4

మూ. కార్తవీర్యభుజాసక్తం తజ్జలం ప్రాప్య నిర్మలమ్,
కూలోపహారం కుర్వాణం ప్రతిస్రోతః ప్రధావతి. 5

ప్ర. అ. కార్తవీర్యభుజాసక్తమ్ = కార్తవీర్యుని భుజములతో లగ్నమైన, తత్ = ఆ, నిర్మలమ్ = నిర్మలమైన, జలమ్ = జలము, కూలోపహారమ్ = కూలమునందు పుష్పసమర్పణమును, కుర్వాణమ్ = చేయుచున్న రావణుని, ప్రాప్య = పొంది, ప్రతిస్రోతః = ప్రవాహమునకు ఎదురుగా, ప్రధావతి = పరుగెత్తుచున్నది.

తా. నిర్మలమైన ఆ జలము కార్తవీర్యుని భుజములచేత అడ్డుకొనబడినదై, తీరముమీద పుష్పసమర్పణము చేయుచున్న ఆ రావణుని సమీపించుచు, ప్రవాహమునకు ఎదురుగా ప్రవహింప మొదలిడెను. 5

మూ. సమీననక్రమకరః సపుష్పకుశసంస్తరః,
స నర్మదామ్భసో వేగః ప్రావృట్కాల ఇవాబభౌ. 6

ప్ర. అ. సమీననక్రమకరః = మీనములతోను, నక్రములతోను, మకరములతోను కూడిన, స పుష్పకుశసంస్తరః = పుష్పములతోను, కుశాస్తరణములతోను కూడిన, సః = అ, నర్మదామ్భసః = నర్మదాజలము యొక్క, వేగః = వేగము, ప్రావృట్ కాలే ఇవ = వర్షాకాలమునందు వలె, ఆబభౌ = ప్రకాశించెను.

తా. అ నర్మదాజలప్రవాహములో మీనములు, నక్రములు, మకరములు, పుష్పములు, దర్భాస్తరణములు కొట్టుకొని పోవుచుండగా అది వర్షాకాలనదీ ప్రవాహము వలె ఉండెను. 6

మూ. స వేగః కార్తవీర్యేణ సంప్రేషిత ఇవామ్భసః,
పుష్పోపహారం సకలం రావణస్య జహార హ. 7

ప్ర. అ. కార్తవీర్యేణ = కార్తవీర్యునిచేత, సంప్రేషితః ఇవ = పంపబడినది వలె, అమ్భసః = జలముయొక్క, సః వేగః = అ వేగము, రావణస్య = రావణునియొక్క, సకలమ్ = సమస్తమైన, పుష్పోపహారమ్ = పుష్పపూజను, జహార హ = హరించెను.

తా. కార్తవీర్యుడు పంపినాడా అన్నట్లు వచ్చిన జలప్రవాహములో రావణుడు చేసిన పుష్పపూజ అంతా కొట్టుకొనిపోయెను. 7

మూ. రావణోఽర్ధసమాప్తం తముత్సృజ్య నియమం తదా,
నర్మదాం పశ్యతే కాన్తాం ప్రతికూలాం యథా ప్రియామ్. 8

ప్ర. అ. తదా = అప్పుడు, రావణః = రావణుడు, అర్ధసమాప్తమ్ = సగము పూర్తి అయిన, తం నియమమ్ = అ నియమమును, ఉత్సృజ్య = విడచి, ప్రతికూలామ్ = ఎదురుగా ప్రవహించుచున్న, ప్రతికూలామ్ = ప్రతికూలురాలైన, ప్రియామ్ = ప్రియురాలైన, కాన్తామ్ ఇవ = స్త్రీ వలె ఉన్న, నర్మదామ్ = నర్మదను, పశ్యతే = చూచుచున్నాడు.

తా. అప్పుడు రావణుడు అ నియమమును మధ్యలో వదలివేసి, ప్రతికూలమైన ప్రియురాలు వలె ఉన్న, ఒడ్డుకు (ప్రవాహానికి) ఎదురుగా ప్రవహించుచున్న నర్మదను చూచెను. 8

మూ. పశ్చిమేన తు తం దృష్ట్వా సాగరోద్గారసంనిభమ్,
వర్ధన్తమమ్భసో వేగం పూర్వామాశాం ప్రవిశ్య తు. 9

తతోఽనుద్భ్రాన్తశకునాం స్వభావే పరమే స్థితామ్,
నిర్వికారాఙ్గనాభాసామపశ్యద్రావణో నదీమ్. 10

ప్ర. అ. రావణః = రావణుడు, పశ్చిమేన = పశ్చిమమువైపున, సాగరోద్గారసంనిభమ్=సముద్రపు పోటుతో సమానమైన, వర్ధన్తమ్=వృద్ధిపొందుచున్న, అమ్భసః జలముయొక్క, తం వేగమ్ = ఆ వేగమును, దృష్ట్వా = చూచి, తతః = అటుపిమ్మట, పూర్వామ్ ఆశామ్ = తూర్పుదిక్కును, అనుప్రవిశ్య = ప్రవేశించి, అనుద్భ్రాన్తశకునామ్ = బెదరని పక్షులు కలదీ, పరమే = ఉత్తమమైన, స్వభావే = స్వస్వరూపమునందు, స్థితామ్ = ఉన్న, నిర్వికారాఙ్గనాభాసామ్ = వికారములు లేని స్త్రీవంటి కాంతి గల, నదీమ్ = నదిని, అపశ్యత్ = చూచెను.

తా. రావణుడు పశ్చిమము వైపున సముద్రము పోటు వలె ఉన్న పెరిగి పోతూన్న జలవేగమును చూచెను. పిమ్మట ఆ జలము తూర్పు దిక్కునకు ఎగ తన్ని విస్తృతమైన ఆకారములో ఉండెను. అక్కడ పక్షులు కూడ బెదురు లేకుండా ఉండెను. ఆ విధముగా అక్కడ వికార మేమీ లేని స్త్రీ వలె ఉన్న ఆ నదిని చూచెను 9, 10

మూ. సవ్యేతరకరాఙ్గుల్యా హ్యశబ్దాస్యో దశాననః,
వేగప్రభవమన్వేష్టుం సోఽదిశచ్ఛుకసారణౌ. 11

ప్ర. అ. సః = ఆ, దశాననః = రావణుడు, వేగప్రభవమ్ = వేగము యొక్క ఉత్పత్తిస్థానమును, అన్వేష్టుమ్=వెదకుటకు, అశబ్దాస్యః=శబ్దములేనివాడై, సవ్యేతరకరాఙ్గుల్యా = కుడిచేతి వ్రేలిచేత, శుకసారణౌ = శుకసారణులను, ఆదిశత్ = ఆజ్ఞాపించెను.

తా. ఆ రావణుడు మాటలాడకుండగా, కుడిచేతి వ్రేలితో సంజ్ఞ చేసి ఆ జలవేగమునకు కారణమేమో తెలిసికొనుటకై శుకసారణులను ఆదేశించెను. 11

మూ. తౌ తు రావణసందిష్టౌ భ్రాతరౌ శుకసారణౌ,
వ్యోమాన్తరగతౌ వీరౌ ప్రస్థితౌ పశ్చిమాముఖే. 12

ప్ర. అ. వీరౌ = వీరులైన, భ్రాతరౌ = సోదరులైన, తౌ శుకసారణౌ = ఆ శుకసారణులు, రావణసందిష్టౌ = రావణునిచేత ఆజ్ఞాపించబడినవారై, వ్యోమాన్తరగతౌ = ఆకాశమధ్యమును పొందినవారై, పశ్చిమాముఖౌ = పశ్చిమదిక్కుకు ముఖము కలవారై, ప్రస్థితౌ = ప్రయాణమైరి.

తా. రావణునిచేత ఆజ్ఞాపించబడిన వీరులైన ఆ శుకసారణ సోదరులు ఆకాశమధ్యమును పొంది పశ్చిమాభిముఖముగా వెళ్ళిరి. 12

మూ. అర్ధయోజనమాత్రం తు గత్వా తౌ రజనీచరౌ,
పశ్యేతాం పురుషం తోయే క్రీడన్తం సహయోషితమ్. 13

ప్ర. అ. తౌ రజనీచరౌ = ఆ రాక్షసులు, అర్ధయోజనమాత్రమ్ = అర్ధయోజనము దూరము, గత్వా = వెళ్ళి, తోయే = ఉదకమునందు, క్రీడన్తమ్ = క్రీడించుచున్న, సహయోషితమ్ = స్త్రీలతో కూడిన, పురుషమ్ = పురుషుణ్ణి, పశ్యేతామ్ = చూచిరి.

తా. ఆ రాక్షసు లిద్దరూ అర్ధయోజనము దూరము వెళ్ళి, స్త్రీసమేతుడై జలక్రీడలు చేయుచున్న పురుషుణ్ణి చూచిరి. 13

మూ బృహత్సాలప్రతీకాశం తోయవ్యాకులమూర్ధజమ్,
మదరక్తాన్తనయనం మదవ్యాకులచేతసమ్. 14

ప్ర. అ. బృహత్సాలప్రతీకాశమ్ = పెద్ద సాలవృక్షముతో సమానుడు, తోయవ్యాకులమూర్ధజమ్ = ఉదకముచేత వ్యాకులములైన కేశములు కలవాడు, మదరక్తాన్తనయనమ్ = మదముచేత ఎఱ్ఱగా ఉన్న నేత్రాంతములు గలవాడు, మదవ్యాకులచేతసమ్ = మదముచేత వ్యాకులమైన చిత్తముకలవాడూ అయిన (పురుషుణ్ణి చూచిరి).

తా. పెద్ద మద్దిచెట్టు వలె ఉన్న ఆ పురుషుని కేశములు నీటికి తడిసి చెదరి ఉండెను. నేత్రముల కొనలు మదముచేత ఎఱ్ఱగా ఉండెను. అతని మనస్సు మదముచేత వ్యాకులముగా ఉండెను. 14

మూ. నదీం బాహుసహస్రేణ రున్ధన్తమరిమర్దనమ్,
గిరిం పాదసహస్రేణ రున్ధన్తమివ మేదినీమ్. 15

ప్ర. అ. బాహుసహస్రేణ = వేయి బాహువులచేత, నదీమ్ = నదిని, రుద్ధ న్తమ్ = అడ్డుకొనుచున్నవాడు, అరిమర్దనమ్ = శత్రువులను మర్దించువాడు, పాద సహస్రేణ = పాదముల సహస్రముచేత, మేదినీమ్ = భూమిని, రుద్ధ న్తమ్ = అడ్డు కొని ఉన్న, గిరిమ్ ఇవ=పర్వతమువలె ఉన్నవాడు అయిన (పురుషుణ్ణి చూచిరి.)

తా. శత్రుసంహారకుడైన ఆ పురుషుడు వేయి బాహువులచేత నదిని అడ్డు కొని, వేయి పాదాలచేత భూమిని ఆక్రమించిన పర్వతము వలె ఉండెను. 15

మూ. బాలానాం వరనారీణాం సహస్రేణ సమావృతమ్,
సమదానాం కరేణూనాం సహస్రేణేవ కుఞ్జరమ్. 16

తమద్భుతతరం దృష్ట్వా రాక్షసౌ శుకసారణౌ,
సంనివృత్తావుపాగమ్య రావణా న్తమథోచతుః. 17

ప్ర. అ. బాలానామ్=యువతులైన, వరనారీణామ్=శ్రేష్ఠలైన స్త్రీలయొక్క, సహస్రేణ = సహస్రముతో, సమావృతమ్ = కూడినవాడు, సమదానామ్ = మద ముతో కూడిన, కరేణూనామ్ = ఆడ ఏనుగులయొక్క, సహస్రేణ=సహస్రముతో కూడిన, కుఞ్జరమ్ ఇవ = ఏనుగవలె ఉన్నవాడూ అయిన, అద్భుతతరమ్ = చాల ఆశ్చర్యకరుడైన, తమ్ = ఆ పురుషుణ్ణి, దృష్ట్వా=చూచి, రాక్షసౌ = రాక్షసులైన, శుకసారణౌ = శుకసారణులు, సంనివృత్తౌ = మరలినవారై, అథ = పిమ్మట, రావణా న్తమ్ = రావణుని సమీపమును, ఉపాగమ్య = పొంది, ఊచతుః=పలికిరి.

తా. యువతులైన వేయిమంది శ్రేష్ఠస్త్రీలు చుట్టూ ఉన్న ఆ పురుషుడు మదించిన వేయి ఆడ ఏనుగుల మధ్య ఉన్న మదగజము వలె ఉండెను. ఆశ్చర్య కరుడైన ఆ పురుషుణ్ణి చూచి, శుకసారణులు వెనుకకు మరలి రావణునివద్దకు వచ్చి ఇట్లు చెప్పిరి. 16, 17

మూ. బృహత్సాలప్రతీకాశః కోఽప్యసౌ రాక్షసేశ్వర,
నర్మదాం రోధవద్రుద్ధ్వా క్రీడాపయతి యోషితః. 18

ప్ర. అ. రాక్షసేశ్వర = రాక్షసరాజా ! బృహత్సాలప్రతీకాశః = పెద్ద సాలవృక్షముతో సమానుడైన, అసౌ = ఇతడు, కోఽపి = ఎవడో, నర్మదామ్=

నర్మదను, రోధవత్ = ఆనకట్ట వలె, రుద్ధ్వా = అరికట్టి, యోషితః = స్త్రీలను, క్రీడాపయతి = ఆడించుచున్నాడు.

తా. రాక్షసరాజా ! పెద్ద సాలవృక్షము వలె ఉన్న ఇతడెవరో ఆనకట్ట వలె నర్మదానదిని అడ్డగించి స్త్రీలను క్రీడింపచేయుచున్నాడు. 18

మూ. తేన బాహుసహస్రేణ సంనిరుద్ధజలా నదీ,
సాగరోద్గారసంకాశానుద్గారాన్ సృజతే ముహుః. 19

ప్ర. అ. తేన=ఆతనిచేత, బాహుసహస్రేణ=బాహువుల సహస్రముచేత, సంనిరుద్ధజలా = అడ్డుకొనబడిన జలము గల, నదీ=నది, సాగరోద్గారసంకాశాన్ =సముద్రముయొక్క ఉద్గారముతో (నీటిని వ్యాపింపచేయుటతో) సమానములైన, ఉద్గారాన్=ఉద్గారములను, ముహుః = మాటిమాటికి, సృజతే=సృష్టించుచున్నది.

తా. ఆతడు వేయి బాహువులతో నీటిని ఆపివేయుటచే ఈ నది సముద్రము ఎదురుతన్ని నీరు వ్యాపింపచేయు నట్లు నీటిని వ్యాపింపచేయుచున్నది. 19

మూ. ఇత్యేవం భాషమాణౌ తౌ నిశమ్య శుకసారణౌ,
రావణోఽర్జున ఇత్యుక్త్వా స యయౌ యుద్ధలాలసః. 20

ప్ర. అ. ఇత్యేవమ్ = ఇట్లు, భాషమాణౌ = మాటలాడుచున్న, తౌ = ఆ, శుకసారణౌ = శుకసారణులను, నిశమ్య = విని, సః రావణః = ఆ రావణుడు, అర్జునః ఇతి = అర్జునుడు అని, ఉక్త్వా = పలికి, యుద్ధలాలసః = యుద్ధాసక్తుడై, యయౌ = వెళ్ళెను.

తా. శుకసారణుల మాటలు విన్న రావణుడు "ఇతడే అర్జునుడు"అని అనుచు, యుద్ధముకొరకై ఆసక్తితో వెళ్ళెను. 20

మూ. అర్జునాభిముఖే తస్మిన్ రావణే రాక్షసాధిపే,
చణ్డః ప్రవాతి పవనః సనాదః సరజాస్తథా. 21

ప్ర. అ. రాక్షసాధిపే = రాక్షసరాజైన, తస్మిన్=ఆ, రావణే=రావణుడు, అర్జునాభిముఖే = అర్జునునకు అభిముఖు డగుచుండగా, సనాదః = ధ్వనితో కూడిన, తథా = మరియు, సరజాః = పరాగముతో కూడిన, చణ్డః = తీవ్రమైన, పవనః= వాయువు, ప్రవాతి = వీచుచున్నది.

తా. రాక్షసరాజైన ఆ రావణుడు కార్తవీర్యార్జునుని ఎదురించుటకై వెళ్లు చుండగా వాయువు తీవ్రమైన ధ్వనిచేయుచు, వరాగములతో నిండి వీచెను. 21

మూ. సకృదేవ కృతో రావః సరక్తపృషతో ఘనైః,
మహోదరమహాపార్శ్వధూమ్రాక్షశుకసారణైః, 22
సంవృతో రాక్షసేన్ద్రస్తు తత్రాగాద్యత్ర చార్జునః.

ప్ర. అ. ఘనైః = మేఘములచేత, సకృదేవ = ఒక్కమారుగా, సరక్తపృషతః = రక్తబిందువులతో కూడిన, రావః = ధ్వని, కృతః = చేయబడినది. రాక్షసేన్ద్రః తు = రాక్షసరాజైతే, మహోదరమహాపార్శ్వధూమ్రాక్షశుకసారణైః = మహోదర-మహాపార్శ్వ-ధూమ్రాక్ష-శుక-సారణులతో, సంవృతః = కూడినవాడై, అర్జునః = అర్జునుడు, యత్ర = ఎక్కడనో, తత్ర = అక్కడికి, అగాత్ = వెళ్ళెను.

తా. మేఘములు హటాత్తుగా రక్తబిందువులు కురియుచు ఉరిమెను. రావణుడు మహోదర-మహాపార్శ్వ-ధూమ్రాక్ష-శుక-సారణులతో కలిసి అర్జును డున్న చోటికి వెళ్ళెను. 22

మూ. అదీర్ఘేణైవ కాలేన స తదా రాక్షసో బలీ, 23
తం నర్మదాహ్రదం భీమమాజగామాఞ్జనప్రభః.

ప్ర. అ. తదా = అప్పుడు, బలీ = బలవంతుడు, అఞ్జనప్రభః = కాటుక వంటి కాంతిగలవాడూ అయిన, సః రాక్షసః = ఆ రాక్షసుడు, అదీర్ఘేణ = దీర్ఘము కాని, కాలేనైవ = కాలముచేతనే, భీమమ్ = భయంకరమైన, తమ్ = ఆ, నర్మదాహ్రదమ్ = నర్మదవలన ఏర్పడిన హ్రదమును, ఆజగామ = పొందెను.

తా. బలశాలి, కాటుకవంటి కాంతి కలవాడూ అయిన ఆ రాక్షసుడు అప్పుడు కొంచెము సేపటిలోనే భయంకరమైన ఆ నర్మదాహ్రదమును చేరెను. 23

మూ. స తత్ర స్త్రీపరివృతం వాశితాభిరివ ద్విపమ్, 24
నరేన్ద్రం పశ్యతే రాజా రాక్షసానాం తదార్జునమ్.

ప్ర. అ. తదా = అప్పుడు, సః = ఆ, రాక్షసానాం రాజా = రాక్షసరాజు, వాశితాభిః = ఆడఏనుగులచేత, ద్విపమ్ ఇవ = ఏనుగును వలె, స్త్రీపరివృతమ్ =

స్త్రీలచేత చుట్టువారుకొనబడిన, నరేన్ద్రమ్ = రాజైన, అర్జునమ్ = అర్జునుణ్ణి, తత్ర = అక్కడ, పశ్యతే = చూచెను.

తా. అప్పుడు రావణుడు చుట్టూ ఆడఏనుగు లున్న ఏనుగ వలె చుట్టూ స్త్రీలు ఉన్న కార్తవీర్యార్జునుణ్ణి చూచెను. 24

మూ. స రోషాద్రక్తనయనో రాక్షసేన్ద్రో బలోద్ధతః, 25
ఇత్యేవమర్జునామాత్యానాహ గమ్భీరయా గిరా.

ప్ర. అ. రోషాత్ = కోపమువలన, రక్తనయనః = ఎఱ్ఱనైన నేత్రములు గల, బలోద్ధతః = బలముచేత గర్వించి ఉన్న, సః రాక్షసేన్ద్రః = ఆ రావణుడు, అర్జునామాత్యాన్ = అర్జునుని అమాత్యులను గూర్చి, గమ్భీరయా = గంభీరమైన, గిరా = వాక్కుతో, ఇత్యేవమ్ = ఇట్లు, ఆహ = పలికెను.

తా. బలముచేత దృప్తుడై రోషముచేత ఎఱ్ఱబడిన నేత్రములతో ఆ రావణుడు గంభీరమైన వాక్కుతో అర్జునుని అమాత్యులతో ఇట్లు పలికెను. 25

మూ. అమాత్యాః క్షిప్రమాఖ్యాత హైహయస్య నృపస్య వై, 26
యుద్ధార్థం సమనుప్రాప్తో రావణో నామ నామతః.

ప్ర. అ. అమాత్యాః = మంత్రులారా! హైహయస్య = హేహయవంశమునందు పుట్టిన, నృపస్య = రాజునకు, క్షిప్రమ్ = శీఘ్రముగా, ఆఖ్యాత వై = చెప్పండి. నామతః = పేరువలన. రావణో నామ = రావణు డని ప్రసిద్ధి పొందినవాడు, యుద్ధార్థమ్ = యుద్ధముకొరకు, సమనుప్రాప్తః = వచ్చినాడు.

తా. అమాత్యులారా! "రావణుడు యుద్ధము చేయుటకై వచ్చినాడు" అని వెంటనే కార్తవీర్యార్జునునకు చెప్పండి. 26

మూ. రావణస్య వచః శ్రుత్వా మన్త్రిణోఽథార్జునస్య తే, 27
ఉత్తస్థుః సాయుధాస్తం చ రావణం వాక్యమబ్రువన్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, తే = ఆ, అర్జునస్య మన్త్రిణః = అర్జునుని మంత్రులు, రావణస్య = రావణునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, సాయుధాః = ఆయుధములతో కూడినవారై, ఉత్తస్థుః = లేచిరి. రావణమ్ = రావణుని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, అబ్రువన్ = పలికిరి.

తా. అప్పుడు కార్తవీర్యార్జునుని మంత్రులు రావణుని మాటలు విని, ఆయుధములతో లేచి రావణునితో ఇట్లు పలికిరి. 27

మూ. యుద్ధస్య కాలో విజ్ఞాతః సాధు భో సాధు రావణ, 28
యః క్షీబం స్త్రీగతం చైవ యోద్ధుముత్సహసే నృపమ్.

ప్ర. అ. భో రావణ=ఓ! రావణా! సాధు సాధు = బాగు బాగు. యుద్ధస్య = యుద్ధముయొక్క, కాలః = కాలము, విజ్ఞాతః = తెలియబడినది. యః = ఏ నీవు, క్షీబమ్=మత్తులో ఉన్న, స్త్రీగతం చైవ=స్త్రీలను పొంది ఉన్న, నృపమ్= రాజును, యోద్ధుమ్ = యుద్ధముచేయుటకు, ఉత్సహసే = కోరుచున్నావో.

తా. రావణా! మత్తులో ఉండి స్త్రీలతో కలిసి ఉన్న రాజుతో యుద్ధము చేయగోరు చున్నావు. సరియైన యుద్ధసమయమునే గుర్తించితివి! బాగు! బాగు!28

మూ. స్త్రీసమక్షగతం యత్త్వం యోద్ధుముత్సహసే నృపమ్,
వాశితామధ్యగం మత్తం శార్దూల ఇవ కుఞ్జరమ్.

ప్ర. అ. యత్ = ఎందువలన, త్వమ్ = నీవు, వాశితామధ్యగమ్ = ఆడ ఏనుగుల మధ్య నున్న, మత్తమ్ = మదించిన, కుఞ్జరమ్ = ఏనుగును, శార్దూలః ఇవ = పెద్దపులి వలె, స్త్రీసమక్షగతమ్ = స్త్రీల సమక్షమునందున్న, నృపమ్ = రాజును, యోద్ధుమ్=యుద్ధముచేయుటకై, ఉత్సహసే=కోరుచున్నావో.

తా. ఆడ ఏనుగుల మధ్యలో ఉన్న మదించిన ఏనుగుతో పెద్ద పులి యుద్ధమునకు వచ్చినట్లు నీవు స్త్రీల ఎదుట ఉన్న రాజుతో యుద్ధానికి వచ్చినావు! బాగు! బాగు! 29

మూ. క్షమస్వాద్య దశగ్రీవ ఉష్యతాం రజనీ త్వయా, 30
యుద్ధే శ్రద్ధా తు యద్యస్తి శ్వస్తాత సమరేఽర్జునమ్.

ప్ర. అ. దశగ్రీవ = రావణా! అద్య=ఇప్పుడు, క్షమస్వ=ఓపికవట్టుము. త్వయా=నీచేత, రజనీ = రాత్రి, ఉష్యతామ్=ఉండబడుగాక (రాత్రికి ఆగుము). శ్రద్ధా = ఆసక్తి,అస్తి యది = ఉన్నట్లయితే, తాత = నాయనా! శ్వః = రేపు, సమరే = యుద్ధమునందు, అర్జునమ్ = అర్జునుణ్ణి, యుద్ధ్య=యుద్ధముచేయుము.

తా. నాయనా! రావణా! ఇప్పుడు ఓపిక పట్టుము. ఈ రాత్రి అగుము. నీకు అసక్తి ఉన్నచో రేపు అర్జునునితో యుద్ధము చేయుము. 30

మూ. యది వాపి త్వరా తుభ్యం యుద్ధతృష్ణాసమావృత, 31
నిపాత్యాస్మాన్ రణే యుద్ధమార్జునేనోపయాస్యసి.

ప్ర. అ. యుద్ధతృష్ణాసమావృత = యుద్ధమునందు ఆసక్తితో కూడిన వాడా! తుభ్యమ్ = నీకు, త్వరా యది వాపి = తొందర ఉన్నచో, రణే = యుద్ధమునందు, అస్మాన్ = మమ్ములను, నిపాత్య = పడగొట్టి, అర్జునేన = అర్జునునుతో, యుద్ధమ్ = యుద్ధమును, ఉపయాస్యసి = పొందగలవు.

తా. యుద్ధమునందు అత్యాసక్తి కలవాడా! నీకు తొందరగా ఉన్నచో నీవు ముందు యుద్ధములో మమ్ములను పడగొట్టి తరవాత అర్జునునితో యుద్ధము చేయవచ్చును. 31

మూ. తతస్తై రావణామాత్యైరమాత్యాస్తే నృపస్య తు, 32
సూదితాశ్చాపి తే యుద్ధే భక్షితాశ్చ బుభుక్షితైః

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తైః = ఆ, రావణామాత్యైః = రావణుని అమాత్యులచేత, నృపస్య = రాజుయొక్క, తే = ఆ, అమాత్యాః = అమాత్యులు, యుద్ధే = యుద్ధమునందు, సూదితాః చ అపి = చంపబడినారు. బుభుక్షితైః = ఆకలిగొన్న, తైః = వారిచేత, భక్షితాః చ = భక్షింపబడిరి.

తా. పిమ్మట రావణుని అమాత్యులు యుద్ధములో రాజామాత్యులను చంపి ఆకలికొని ఉన్న వాళ్ళు వాళ్ళని భక్షించివేసిరి. 32

మూ. తతో హలహలాశబ్దో నర్మదాతీరగో బభౌ, 33
అర్జునస్యానుయాత్రాణాం రావణస్య చ మన్త్రిణామ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అర్జునస్య = అర్జునునియొక్క, అనుయాత్రాణామ్ = అనుచరులయొక్క, రావణస్య = రావణునియొక్క, మన్త్రిణాం చ = మంత్రులయొక్క, నర్మదాతీరగః = నర్మదాతీరమును పొందిన, హలహలాశబ్దః = హలహలాశబ్దము, బభౌ = ప్రకాశించెను.

తా. అప్పుడు అర్జునుని అనుచరులు రావణుని మంత్రులు చేసిన కోలాహల ధ్వని నర్మదాతీరమునందు వ్యాపించెను. 33

మూ. ఇషుభిస్తోమరైః ప్రాసైస్త్రిశూలైర్వజ్రకర్షణైః, 34
సరావణానర్దయన్తః సమన్తాత్సమభిద్రుతాః.

ప్ర. అ. ఇషుభిః = బాణములచేత, తోమరైః = తోమరములచేత, ప్రాసైః = ప్రాసలచేత, త్రిశూలైః = త్రిశూలములచేత, వజ్రకర్షణైః = వజ్రములతో లాగుటచేత, సరావణాన్ = రావణునితో కూడిన రాక్షసులను, అర్దయన్తః = పీడించుచు, సమన్తాత్ = అన్ని వైపులా, సమభిద్రుతాః = పరుగెత్తి వచ్చిరి.

తా. అర్జునుని అనుచరులు బాణాలతోను, తోమరములతోను, ప్రాసలతోను, త్రిశూలములతోను, వజ్రములతోను రావణుణ్ణి, ఆతని అనుచరులనూ కూడా పీడించుచు నలువైపులనుండి శీఘ్రముగా వచ్చిరి. 34

మూ. హైహయాధిపయోధానాం వేగ ఆసీత్సుదారుణః, 35
సనక్రమీనమకరసముద్రస్యేవ నిఃస్వనః.

ప్ర. అ. హైహయాధిపయోధానామ్ = అర్జునుని యోధులయొక్క, వేగః = వేగము, సనక్రమీనమకరసముద్రస్య = నక్రములతోను, మీనములతోను, మకరములతోను కూడిన సముద్రముయొక్క, నిఃస్వనః ఇవ = ధ్వని వలె, సుదారుణః = చాల భయంకరముగా, ఆసీత్ = ఉండెను.

తా. కార్తవీర్యార్జునుని యోధుల వేగము నక్ర-మీన-మకరములతో కూడిన సముద్రము ధ్వని వలె చాల భయంకరముగా ఉండెను. 35

మూ. రావణస్య తు తేఽమాత్యాః ప్రహస్తశుకసారణాః, 36
కార్తవీర్యబలం క్రుద్ధా నిహన్తి స్మ స్వతేజసా.

ప్ర. అ. రావణస్య = రావణునియొక్క, అమాత్యాః = అమాత్యులైన, తే = ఆ, ప్రహస్తశుకసారణాః = ప్రహస్త శుక-సారణులు, క్రుద్ధాః = కోపించిన వారై, కార్తవీర్యబలమ్ = కార్తవీర్యుని సైన్యమును, స్వతేజసా = తమ తేజస్సు చేత, నిహన్తి స్మ = చంపిరి.

తా. రావణుని అమాత్యులైన ప్రహస్త-శుక-సారణులు కోపించి తమ తేజస్సుతో కార్తవీర్యార్జునుని సైన్యమును సంహరించిరి. 36

మూ. అర్జునాయ తు తత్కర్మ రావణస్య సమన్త్రిణః, 37
క్రీడమానాయ కథితం పురుషైర్భయవిహ్వలైః.

ప్ర. అ. భయవిహ్వలైః = భయముచేత వ్యాకులులైన, పురుషైః=పురుషులచేత, సమన్త్రిణః = మంత్రులతో కూడిన, రావణస్య = రావణునియొక్క, తత్ = ఆ, కర్మ = పని, క్రీడమానాయ = క్రీడించుచున్న, అర్జునాయ=అర్జునునకు, కథితమ్ = చెప్పబడినది

తా. భయక్రాంతులైన కొందరు పురుషులు వెళ్ళి మంత్రిసహితుడై రావణుడు చేసిన ఆ పని గూర్చి క్రీడించుచున్న కార్తవీర్యార్జునునకు తెలిపిరి. 37

మూ. శ్రుత్వా న భేతవ్యమితి స్త్రీజనం స తదార్జునః, 38
ఉత్తతార జలాత్తస్మాద్గఙ్గాతోయాదివాఞ్జనః.

ప్ర. అ. తదా = అప్పుడు, సః అర్జునః = ఆ అర్జునుడు, శ్రుత్వా=విని, న భేతవ్యమ్ ఇతి=భయపడదగినది కాదు అని, స్త్రీజనమ్=స్త్రీజనమును గూర్చి (పలికి), గఙ్గాతోయాత్ = గంగోదకమునుండి, అఞ్జనః ఇవ = అంజన మను గజము వలె, తస్మాత్ జలాత్ = ఆ జలమునుండి, ఉత్తతార = పైకి లేచెను.

తా. అప్పుడా అర్జునుడు "భయపడకుడు" అని ఆ స్త్రీలతో చెప్పి గంగా జలమునుండి అంజన మను దిగ్గజము లేచినట్లు ఆ జలమునుండి పైకి లేచెను.

మూ. క్రోధదూషితనేత్రస్తు స తదార్జునపావకః, 39
ప్రజజ్వాల మహాఘోరో యుగాన్త ఇవ పావకః.

ప్ర. అ. తదా = అప్పుడు, క్రోధదూషితనేత్రః = క్రోధముచేత, దూషింపబడిన నేత్రములు గల, సః అర్జునపావకః=ఆ కార్తవీర్యార్జును డనే అగ్ని, మహాఘోరః = చాల ఘోరమైన, యుగాన్తే = ప్రళయకాలమునందలి, పావకః ఇవ= అగ్ని వలె, ప్రజజ్వాల = ప్రజ్వలించెను

తా. అప్పుడు క్రోధముచేత ఎఱ్ఱబడిన నేత్రములు గల కార్తవీర్యార్జును డనే అగ్ని మహాభయంకరమైన ప్రలయకాలాగ్ని వలె మండిపడెను. 39

మూ. సతూర్ణతరమాదాయ వరహేమాఙ్గదో గదామ్, 40
అభిదుద్రావ రక్షాంసి తమాంసీవ దివాకరః.

ప్ర. అ. వరహేమాఙ్గదః = శ్రేష్ఠములైన బంగారు బాహుపురులు గల, సః = అతడు, తూర్ణతరమ్ = అతిశీఘ్రముగా, గదామ్ = గదను, ఆదాయ = గ్రహించి, దివాకరః = సూర్యుడు, తమాంసి ఇవ = చీకట్లను వలె, రక్షాంసి = రాక్షసులను, అభిదుద్రావ = ఎదురుగా పరుగెత్తెను.

తా. శ్రేష్ఠములైన బంగారు అంగదములు ధరించిన ఆ కార్తవీర్యార్జునుడు గద ధరించి చీకట్లను ఎదిరించుటకు సూర్యుడు వలె ఆ రాక్షసులను ఎదిరించుటకై శీఘ్రముగా వెళ్ళెను. 40

మూ. బాహువిక్షేపకరణాం సముద్యమ్య మహాగదామ్, 41
గారుడం వేగమాస్థాయ అపపాతైవ సోఽర్జునః.

ప్ర. అ. సః అర్జునః = ఆ అర్జునుడు, బాహువిక్షేపకరణామ్ = బాహువుల చేత కదల్చుట గల, మహాగదామ్ = గొప్పగదను, సముద్యమ్య = ఎత్తి, గారుడమ్ గరుత్మంతుని సంబంధమైన, వేగమ్ = వేగమును, ఆస్థాయ = అవలంబించి, అపపాత ఏవ = వచ్చిపడెను.

తా. ఆ అర్జునుడు బాహువులచేత త్రిప్పబడుచున్న గొప్ప గదను ధరించి గరుత్మంతుని వంటి వేగముతో శీఘ్రముగా వచ్చెను. 41

మూ. తస్య మార్గం సమారుధ్య విన్ధ్యోఽర్కస్యేవ పర్వతః,
స్థితో విన్ధ్య ఇవాకమ్ప్యః ప్రహస్తో ముసలాయుధః.

ప్ర. అ. ముసలాయుధః = ముసలము ఆయుధముగా గల, ప్రహస్తః = ప్రహస్తుడు, విన్ధ్యః పర్వతః = వింధ్యపర్వతము అర్కస్యేవ = సూర్యుని యొక్క మార్గమును వలె, తస్య = అతనియొక్క, మార్గమ్ = మార్గమును, సమారుధ్య = అడ్డుకొని, విన్ధ్యః ఇవ = వింధ్యపర్వతము వలె, అప్రకమ్ప్యః = కదల్ప శక్యము కానివాడై, స్థితః = నిలబడెను.

తా. వింధ్యపర్వతము వలె కదల్ప శక్యము కానివాడైన ప్రహస్తుడు ముసలమును ధరించి వింధ్యపర్వతము సూర్యుని మార్గమును వలె అతని మార్గమును అడ్డుకొనెను. 42

మూ. తతోఽస్య ముసలం ఘోరం లోహబద్ధం మదోద్ధతః, 43
ప్రహస్తః ప్రేషయన్ క్రుద్ధో రరాస చ యథాన్తకః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, మదోద్ధతః = మదముచేత ఉద్ధతుడైన, ప్రహస్తః = ప్రహస్తుడు, లోహబద్ధమ్=లోహముచేత బిగించబడిన, ఘోరమ్= భయంకరమైన, ముసలమ్ = ముసలమును, ప్రేషయన్ = పంపుచు, క్రుద్ధః = కోపించినవాడై, అన్తకః యథా = యముడు వలె, రరాస చ = ధ్వనిచేసెను కూడ

తా. మదముచేత మితిమీరి ఉన్న ఆ ప్రహస్తుడు కోపించి, ఇనుముతో బిగించిన, భయంకరమైన ముసలమును అతనిపై ప్రయోగించుచు యముడు వలె అరచెను. 43

మూ. తస్యాగ్రే ముసలస్యాగ్నిరశోకాపీడసంనిభః, 44
ప్రహస్తకరముక్తస్య బభూవ ప్రదహన్నివ.

ప్ర. అ. ప్రహస్తకరముక్తస్య = ప్రహస్తుని హస్తముచేత విడువబడిన, తస్య ముసలస్య=ఆ ముసలముయొక్క, అగ్రే=అగ్రమునందు, ప్రదహన్నివ= దహించుచున్నదా అన్నట్లున్న, అశోకాపీడసంనిభః = అశోకపుష్పగుచ్ఛముతో సమానమైన, అగ్నిః = అగ్ని, బభూవ = పుట్టెను.

తా. ప్రహస్తుడు విడచిన ఆ ముసలము చివర అశోకపుష్పముల గుత్తి వలె ఎఱ్ఱగా ఉన్న, దహించుచున్న అగ్ని పుట్టెను. 44

మూ. ఆధావమానం ముసలం కార్తవీర్యస్తదార్జునః. 45
నిపుణం వఞ్చయామాస గదయా గతవిక్లబః.

ప్ర. అ. తదా = అప్పుడు, కార్తవీర్యః అర్జునః = కార్తవీర్యార్జునుడు, ఆధావమానమ్ = శీఘ్రముగా వచ్చి పడుచున్న, ముసలమ్ = ముసలమును, గతవిక్లబః = పోయిన దిగులు కలవాడై, గదయా = గదచేత, నిపుణమ్=నేర్పుగా, వఞ్చయామాస = తప్పించుకొనెను.

తా. అప్పుడు కార్తవీర్యార్జునుడు ఏ మాత్రము దిగులు చెందక, శీఘ్రముగా వచ్చి మీద పడుచున్న ముసలమును, గదతో నేర్పుగా తప్పించుకొనెను.

మూ. తత స్తమభిదుద్రావ సగదో హేహయాధిపః, 46
భ్రామయాణో గదాం గుర్వీం పఞ్చబాహుశతోచ్ఛ్రయామ్.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సగదః = గదతో కూడిన, హైహయాధిపః = కార్తవీర్యార్జునుడు, పఞ్చబాహుశతోచ్ఛ్రయామ్=ఐదువందల బాహువుల పొడవు గల, గుర్వీమ్ = గొప్పదైన, గదామ్ = గదను, భ్రామయాణః = త్రిప్పుచు, తమ్ = వానినిగూర్చి, అభిదుద్రావ = ఎదురుగా వెళ్ళెను.

తా. అప్పుడు గదాధారియైన కార్తవీర్యార్జునుడు ఐదువందల చేతుల పొడవు ఉన్న, పెద్దదైన ఆ గదను త్రిప్పుచు వానిమీదికి పరుగెత్తెను. 46

మూ. తతో హతోఽతివేగేన ప్రహస్తో గదయా తదా, 47
నిపపాత స్థితః శైలో వజ్రివజ్రాహతో యథా.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, గదయా = గదచేత, అతివేగేన = చాల వేగముచేత, హతః = కొట్టబడిన, ప్రహస్తః = ప్రహస్తుడు, తదా = అప్పుడు, స్థితః = నిలచి ఉన్న, వజ్రివజ్రాహతః=ఇంద్రుని వజ్రముచేత కొట్టబడిన, శైలః యథా = పర్వతము వలె, నిపపాత = పడిపోయెను.

తా. మహావేగముతో ఆ గదచేత కొట్టబడిన ప్రహస్తుడు అప్పుడు, ఇంద్రుని వజ్రముచేత కొట్టబడిన పర్వతము వలె పడిపోయెను. 47

మూ. ప్రహస్తం పతితం దృష్ట్వా మారీచశుకసారణాః, 48
సమహోదరధూమ్రాక్షా అపసృష్టా రణాజిరాత్.

ప్ర. అ. ప్రహస్తమ్ = ప్రహస్తుణ్ణి, పతితమ్ = పడిపోయినవానినిగా దృష్ట్వా = చూచి, సమహోదరధూమ్రాక్షాః = మహోదరధూమ్రాక్షులతో కూడిన, మారీచశుకసారణాః = మారీచశుకసారణులు, రణాజిరాత్ = యుద్ధభూమినుండి, అపసృష్టాః = తొలగిపోయిరి.

తా. ప్రహస్తుడు పడిపోవుట చూడగానే మారీచ-శుక-సారణ-మహోదర-ధూమ్రాక్షులు యుద్ధభూమినుండి పారిపోయిరి. 48

మూ. అపక్రాన్తేష్వమాత్యేషు ప్రహస్తే చ నిపాతితే, 49
రావణోఽభ్యద్రవత్తూర్ణమర్జునం నృపసత్తమమ్.

ప్ర. అ. అమాత్యేషు = అమాత్యులు, అపక్రాన్తేషు = తొలగిపోయిన వారగుచుండగా, ప్రహస్తే = ప్రహస్తుడు, నిపాతితే చ = పడగొట్టబడినవాడగుచుండగా, రావణః = రావణుడు, నృపసత్తమమ్ = రాజశ్రేష్ఠుడైన, అర్జునమ్ = అర్జునుణ్ణి గూర్చి, అభ్యద్రవత్ = శీఘ్రముగా వెళ్ళెను.

తా. ప్రహస్తుడు పడిపోయిన పిమ్మట అమాత్యులు పారిపోగా రావణుడు రాజశ్రేష్ఠుడైన కార్తవీర్యార్జునునిమీదికి శీఘ్రముగా వెళ్ళెను. 49

మూ. సహస్రబాహోస్తద్యుద్ధం వింశద్బాహోశ్చ దారుణమ్, 50
నృపరాక్షసయోస్తత్ర ఆరబ్ధం రోమహర్షణమ్.

ప్ర. అ. సహస్రబాహోః = వేయి బాహువులు కలవానికి, వింశద్బాహోః చ = ఇరవై బాహువులు కలవానికి, నృపరాక్షసయోః = రాజ-రాక్షసులిద్దరికీ, తత్ర = అక్కడ, దారుణమ్ = భయంకరము, రోమహర్షణమ్ = రోమాంచము కలిగించేదీ అయిన, తత్ = ఆ, యుద్ధమ్ = యుద్ధము, ఆరబ్ధమ్ = ప్రారంభమైనది.

తా. అక్కడ వేయి బాహువులున్న కార్తవీర్యార్జునునికీ ఇరవై బాహువులున్న రావణునికీ మధ్య భయంకరమూ, ఆశ్చర్యజనకమూ అయిన యుద్ధము ప్రారంభమయ్యెను.

మూ. సాగరావివ సంక్షుబ్ధౌ చలమూలావివాచలౌ, 51
తేజోయుక్తావివాదిత్యౌ ప్రదహన్తావివానలౌ.
బలోద్ధతౌ యథా నాగౌ వాసితార్థే యథా వృషౌ. 52

మేఘావివ వినర్దన్తౌ సింహావివ బలోత్కటౌ,
రుద్రకాలావివ క్రుద్ధౌ తౌ తదా రాక్షసార్జునౌ 53
పరస్పరం గదాం గృహ్య తాడయామాసతుర్భృశమ్.

ప్ర. అ. సంక్షుబ్ధౌ = క్షోభచెందిన, సాగరౌ ఇవ = రెండు సముద్రములు

వలె, చలమూలౌ = కదలిన మొదళ్ళు గల, అచలౌ ఇవ = రెండు పర్వతములు వలె, తేజోయుక్తౌ = తేజస్సుతో కూడిన, ఆదిత్యౌ ఇవ = ఇద్దరు సూర్యులు వలె, ప్రదహన్తౌ = కాల్చుకున్న, అనలౌ ఇవ = రెండుఅగ్నులు వలె, వాసితార్థే=ఆడ ఏనుగుకోసమై (పోరాడుచున్న), బలోద్ధతౌ = బలముచేత మితి మీరిన, నాగౌ యథా=రెండు ఏనుగులు వలె, వృషౌ యథా=రెండు ఆబోతులు వలె, వినర్దన్తౌ = ఉరుముచున్న, మేఘౌ ఇవ = రెండు మేఘములు వలె, బలోత్కటౌ = బలముచేత తీవ్రములైన, సింహౌ ఇవ = రెండు సింహములు వలె, క్రుద్ధౌ = కోపించిన, రుద్రకాలౌ ఇవ = రుద్రుడు యముడూ వలె ఉన్న, తౌ = ఆ, రాక్షసార్జునౌ = రాక్షస-అర్జునులు, గదామ్ = గదను, గృహ్య = గ్రహించి, పరస్పరమ్ = పరస్పరముగు, భృశమ్ = మిక్కిలి, తాడయామాసతుః = కొట్టుకొనిరి.

తా. క్రోధావేశముతో ఉన్న ఆ రావణ-కార్తవీర్యార్జునులు క్షోభ చెందిన రెండు సముద్రముల వలె, మొదళ్ళు కదలిన రెండు పర్వతముల వలె, తేజస్సు గల ఇద్దరు సూర్యుల వలె, కాల్చుకొనుచున్న రెండు అగ్నులు వలె, ఆడఏనుగ కోసమై పోరాడుచున్న (బలముచేత ఉద్ధతములై ఉన్న రెండు గజముల వలె, రెండు ఆబోతుల వలె, ఉరుముచున్న రెండు మేఘముల వలె, బలముచేత తీవ్రములుగా ఉన్న రెండు సింహములు వలె, రుద్ర-యముల వలె ఉండిరి. గదలు ధరించి ఒకరి నొకరు అధికముగా కొట్టుకొనిరి. 51-53

మూ. వజ్రప్రహారానచలా యథా ఘోరాన్విషేహిరే, 54
గదాప్రహారాంస్తౌ తత్ర సేహాతే నరరాక్షసౌ.

ప్ర. అ. అచలాః = పర్వతములు, ఘోరాన్ = ఘోరములైన, వజ్రప్రహారాన్ = వజ్రపు దెబ్బలను, యథా = ఎట్లు, విషేహిరే = సహించినవో, తౌ = ఆ, నరరాక్షసౌ = మానవరాక్షసులు, తత్ర = అక్కడ, గదాప్రహారాన్ = గదాఘాతములను, సేహాతే = సహించిరి.

తా. పర్వతములు ఘోరములైన వజ్రాయుధప్రహారములను సహించినట్లు ఆ అర్జునరావణులు ఆ యుద్ధమునందు, గదాప్రహారములను సహించిరి.

మూ. యథాశనిరవేభ్యస్తు జాయతేఽథ ప్రతిశ్రుతిః, 55
తథా తయోర్గదాపోథైర్దిశః సర్వాః ప్రతిశ్రుతాః.

ప్ర. అ. అథ = పిమ్మట, అశనిరవేభ్యః = పిడుగుల ధ్వనులవలన, యథా = ఎట్లు, ప్రతిశ్రుతిః = ప్రతిధ్వని, జాయతే = పుట్టునో, తథా = అట్లు, తయోః = వారియొక్క, గదాపోథైః = గదల కుమ్ములాటలచేత, సర్వాః = సమస్తమైన, దిశః = దిక్కులు, ప్రతిశ్రుతాః = ప్రతిధ్వనించినవి.

తా. ఉరుములవలన ప్రతిధ్వనులు పుట్టినట్లు వారిద్దరి గదల కుమ్ములాటలచేత అన్ని దిక్కులూ ప్రతిధ్వనించినవి. 55

మూ. అర్జునస్య గదా సా తు పాత్యమానాహితోరసి, 56
కాఞ్చనాభం నభశ్చక్రే విద్యుత్సౌదామనీ యథా.

ప్ర. అ. అహితోరసి = శత్రువుయొక్క వక్షఃస్థలముమీద, పాత్యమానా = పడవేయబడుచున్న, సా = ఆ, అర్జునస్య గదా తు = అర్జునుని గదయైతే, విద్యుత్ = బాగా ప్రకాశించుచున్న, సౌదామనీ యథా = మెరుపు వలె, నభః = ఆకాశమును, కాఞ్చనాభమ్ = బంగారు కాంతి గలదానినిగా, చక్రే = చేసెను.

తా. శత్రువు వక్షఃస్థలముమీద పడవేయబడిన అర్జునుని గద, బాగా ప్రకాశించుచున్న మెరుపు వలె, ఆకాశమును బంగారు రంగు గలదానిని చేసెను.

మూ. తథైవ రావణేనాపి పాత్యమానా ముహుర్ముహుః, 57
అర్జునోరసి నిర్భాతి గదోల్కేవ మహాగిరౌ.

ప్ర. అ. తథైవ = అట్లే. రావణేనాపి = రావణునిచేత, ముహుర్ముహుః = మాటిమాటికి, అర్జునోరసి = అర్జునుని వక్షఃస్థలముమీద, పాత్యమానా = పడవేయబడుచున్న, గదా = గద, మహాగిరౌ = గొప్ప పర్వతముమీద. ఉల్కేవ = ఉల్క (అగ్నిపిండము) వలె, నిర్భాతి = ప్రకాశించుచున్నది.

తా. అట్లే రావణుడు మాటి మాటికి అర్జునుని వక్షస్థలముమీద వేసి కొట్టుచున్న గద మహాపర్వతముమీద పడుచున్న ఉల్క వలె ప్రకాశించెను. 57

మూ. నార్జునః ఖేదమాయాతి న రాక్షసగణేశ్వరః, 58
సమమాసీత్తయోర్యుద్ధం యథా పూర్వం బలీన్ద్రయోః.

ప్ర. అ. అర్జునః = అర్జునుడు, ఖేదమ్ = అలసటను, నాయాతి = పొందుట

లేదు, రాక్షసగణేశ్వరః = రావణుడు, న = పొందుటలేదు, తయోః = వారిద్దరి యొక్క, యుద్ధమ్ = యుద్ధము, పూర్వమ్ = పూర్వము, బలీన్ద్రయోః యథా= బలియొక్క, ఇంద్రునియొక్క యుద్ధము వలె, సమమ్=సమానముగా, ఆసీత్= ఉండెను.

తా. కార్తవీర్యార్జునకు గాని రావణునకు గాని అలసట కలగలేదు. వారిద్దరి మధ్యా జరుగుచున్న యుద్ధము బలి-ఇంద్రుల యుద్ధము వలె హెచ్చుతగ్గులు లేకుండ ఉండెను. 58

మూ. శృఙ్గైరివ వృషౌ యుధ్యన్ దన్తాగ్రైరివ కుఞ్జరౌ, 59
పరస్పరం వినిఘ్నన్తౌ నరరాక్షససత్తమౌ.

ప్ర. అ. వృషౌ=వృషభములు, శృఙ్గైః ఇవ=కొమ్ములతోవలె, కుఞ్జరౌ= రెండు ఏనుగులు, దన్తాగ్రైః ఇవ=దంతాగ్రములచేత వలె, నరరాక్షససత్తమౌ= నరశ్రేష్ఠ - రాక్షసశ్రేష్ఠులు, పరస్పరమ్ = పరస్పరము, వినిఘ్నన్తౌ=కొట్టుకొను చున్నవారై, అయుధ్యన్ = యుద్ధముచేసిరి.

తా. రెండు ఆబోతులు కొమ్ములతో వలె, రెండు గజములు దంతాగ్ర ములచేత వలె, ఆ కార్తవీర్యార్జున- రావణులు పరస్పరము కొట్టుకొనుచు యుద్ధము చేసిరి. 59

మూ. తతోఽర్జునేన క్రుద్ధేన సర్వప్రాణేన సా గదా, 60
స్తనయోరన్తరే ముక్తా రావణస్య మహోరసి.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, క్రుద్ధేన=కోపించిన, అర్జునేన = అర్జునుని చేత, సర్వప్రాణేన = పూర్తి ప్రాణబలముచేత, సా గదా = ఆ గద, రావణస్య= రావణునియొక్క, మహోరసి = విశాలమైన వక్షఃస్థలమునందు, స్తనయోః= స్తన ములయొక్క, అన్తరే = మధ్యయందు, ముక్తా = విడవబడినది.

తా. అప్పుడు కోపించిన కార్తవీర్యార్జునుడు తన ప్రాణబలము నంతను ఉపయోగించి, ఆ గదను రావణుని విశాలమైన వక్షఃస్థలముమీద విడచెను. 60

మూ. వరదానకృతత్రాణే సా గదా రావణోరసి, 61
దుర్బలేవ యథావేగం ద్విధా భూతాపతత్క్షితౌ.

ప్ర. అ. సా = ఆ, గదా = గద, వరదానకృతత్రాణే = వరదానముచేత చేయబడిన రక్షణ గల, రావణోరసి = రావణుని వక్షఃస్థలముమీద, దుర్బలేవ = దుర్బలము వలె అయి, యథావేగమ్ = వేగానుసారముగా, క్షితౌ = నేలమీద, ద్విధా భూతా = రెండుగా అయి, అపతత్ = పడెను.

తా. ఆ గద వరదానముచేత రక్షింపబడుచున్న ఆ రావణుని వక్షఃస్థలము మీద బలహీనము వలె అయి, పడినవేగానికి రెండు ముక్కలై నేలమీద పడెను.

మూ. స త్వర్జునప్రయుక్తేన గదాఘాతేన రావణః, 62
అపాసర్పద్ధనుర్మాత్రం నిషసాద చ నిష్టనన్.

ప్ర. అ. సః రావణః తు = ఆ రావణుడైతే, అర్జునప్రయుక్తేన = అర్జునుని చేత ప్రయోగించబడిన, గదాఘాతేన = గదాప్రహారముచేత, ధనుర్మాత్రమ్ = ధనస్సంత దూరము, అపాసర్పత్ = తొలగెను. నిష్టనన్ = అరచుచు, నిషసాద చ = కూర్చుండెను.

తా. అర్జునుడు ప్రయోగించిన ఆ గద దెబ్బకు రావణుడు బారెడు దూరము వెనుకకు పోయి అరచుచు క్రింద పడిపోయెను. 62

మూ. స విహ్వలం తదాలక్ష్య దశగ్రీవం తతోఽర్జునః, 63
సహసోత్పత్య జగ్రాహ గరుత్మానివ పన్నగమ్.

ప్ర. అ. తదా = అప్పుడు, సః అర్జునః = ఆ అర్జునుడు, విహ్వలమ్ = వ్యాకులుడైన, దశగ్రీవమ్ = రావణుణ్ణి, ఆలక్ష్య = చూచి, తతః = అటుపిమ్మట, సహసా = వెంటనే, ఉత్పత్య = వానిపైకి ఎగిరి, గరుత్మాన్ = గరుత్మంతుడు, పన్నగమ్ ఇవ = సర్పమును వలె, జగ్రాహ = పట్టుకొనెను.

తా. కార్తవీర్యార్జునుడు అప్పుడు రావణుడు వ్యాకులుడై ఉండుట చూచి, వెంటనే ఎగిరి మీదపడి, గరుత్మంతుడు సర్పమును పట్టినట్లు వానిని పట్టుకొనెను.

మూ. స తు బాహుసహస్రేణ బలాద్గృహ్య దశాననమ్, 64
బబన్ధ బలవాన్ రాజా బలిం నారాయణో యథా.

ప్ర. అ. బలవాన్ = బలవంతుడైన, సః = ఆ, రాజా తు = రాజైతే,

బాహుసహస్రేణ = బాహువుల సహస్రముచేత, దశాననమ్=రావణుని, బలాత్=బలాత్కారముగా, గృహ్య = పట్టుకొని, బలిమ్ = బలిని, నారాయణో యథా= నారాయణుడు వలె, బబన్ధ = బంధించెను.

తా. బలవంతుడైన ఆ కార్తవీర్యార్జునుడు రావణుణ్ణి తన వేయి బాహువులతో బలాత్కారముగా పట్టి నారాయణుడు బలిని బంధించినట్లు వానిని బంధించెను. 64

మూ. బధ్యమానే దశగ్రీవే సిద్ధచారణదేవతాః, 65
సాధ్వితి వాదినః పుష్పైః కిరన్త్యర్జునమూర్ధని.

ప్ర. అ. దశగ్రీవే= రావణుడు, బధ్యమానే = బంధింపబడుచుండగా, సిద్ధచారణదేవతాః = సిద్ధులు, చారణులు, దేవతలు, సాధ్వితి = బాగు అని, వాదినః = పలుకుచున్నవారై, పుష్పైః = పుష్పములచేత, అర్జునమూర్ధని=అర్జునుని శిరస్సుపై, కిరన్తి = చల్లుచున్నారు.

తా. రావణుడు బంధింపబడుచున్నప్పుడు సిద్ధ-చారణ-దేవతలు "బాగు బాగు" అని అనుచు అర్జునుని శిరస్సుపై పుష్పములు చల్లిరి. 65

మూ. వ్యాఘ్రో మృగమివాదాయ మృగరాడివ కుఞ్జరమ్, 66
ररాస హైహయో రాజా హర్షాదమ్బుదవన్ముహుః.

ప్ర. అ. వ్యాఘ్రః=పెద్దపులి, మృగమ్ ఇవ=లేడిని వలె, మృగరాజః= సింహము, కుఞ్జరమ్ ఇవ=ఏనుగునువలె, ఆదాయ=పట్టి, రాజా=రాజైన, హైహయః = కార్తవీర్యార్జునుడు, హర్షాత్ = సంతోషమువలన, ముహుర్ముహుః = మాటిమాటికి, అమ్బుదవత్ = మేఘము వలె, రరాస=ధ్వనిచేసెను.

తా. పెద్దపులి లేడిని వలె, సింహము ఏనుగును వలె రావణుని పట్టి బంధించి కార్తవీర్యార్జునుడు, సంతోషముతో మాటిమాటికి మేఘము వలె గర్జించెను. 66

మూ. ప్రహస్తస్తు సమాశ్వస్తో దృష్ట్వా బద్ధం దశాననమ్, 67
సహసా రాక్షసః క్రుద్ధ అభిదుద్రావ హైహయమ్.

ప్ర. అ. రాక్షసః = రాక్షసుడైన, ప్రహస్తః తు = ప్రహస్తుడైతే, సమాశ్వస్తః=తెప్పరిల్లినవాడై, బద్ధమ్=బంధించబడిన, దశాననమ్=రావణుణ్ణి, దృష్ట్వా

చూచి, క్రుద్ధః = కోపించినవాడై, సహసా = శీఘ్రముగా, హైహయమ్ = కార్తవీర్యార్జునుణ్ణి గూర్చి, అభిదుద్రావ = శీఘ్రముగా పరుగెత్తెను.

తా. ప్రహస్తుడు తెప్పరిల్లి రావణుడు బంధింపబడి ఉండుటచూచి వెంటనే కోపముతో కార్తవీర్యార్జును మీదికి వెళ్లెను. 67

మూ. నక్తంచరణాం వేగస్తు తేషా మాపతతాం బభౌ, 68
ఉద్భూత ఆతపాపాయే పయోదానామివామ్బుధౌ.

ప్ర. అ. ఆపతతామ్ = వచ్చి పడుచున్న, తేషామ్ = ఆ, నక్తంచరాణామ్ = రాక్షసులయొక్క, వేగస్తు = వేగమైతే, ఆతపాపాయే = వర్షాకాలమునందు, అమ్బుధౌ = సముద్రమునందు, ఉద్భూతః = పుట్టిన, పయోదానామ్ ఇవ = మేఘములయొక్క వేగము వలె, బభౌ = ప్రకాశించెను.

తా. వచ్చిపడుచున్న ఆ రాక్షసుల వేగము వర్షాకాలమునందు సముద్రములో ఏర్పడిన మేఘముల వేగము వలె ఉండెను. 68

మూ. ముఞ్చ ముఞ్చేతి భాషన్తస్తిష్ఠ తిష్ఠేతి చాసకృత్, 69
ముసలాని చ శూలాని సోత్ససర్జ తదా రణే.

ప్ర. అ. ముఞ్చ ముఞ్చ = విడువుము, విడువుము, తిష్ఠ తిష్ఠ = నిలువుము నిలువుము, ఇతి = అని, అసకృత్ = మాటిమాటికి, భాషన్తః = పలుకుచు, (రాక్షసులు వచ్చిరి). తదా = అప్పుడు, సః = ప్రహస్తుడు, రణే = యుద్ధమునందు, ముసలాని చ = ముసలములను, శూలాని = శూలములను, ఉత్ససర్జ = విడచెను.

తా. "విడువుము విడువుము, ఆగుము ఆగుము" అని మాటిమాటికి అరచుచు రాక్షసులు వచ్చిరి. ప్రహస్తుడు అప్పుడు యుద్ధమునందు ముసలములు, శూలములు కురిపించెను. 69

మూ. అప్రాప్తాన్యేవ తాన్యాశు అసంభ్రాన్తస్తదార్జునః, 70
ఆయుధాన్యమరారీణాం జగ్రాహారినిషూదనః.

ప్ర. అ. తదా = అప్పుడు, అరినిషూదనః = శత్రువినాశకుడైన, అర్జునః = అర్జునుడు, అమరారీణామ్ = దేవతాశత్రువులయొక్క, తాని ఆయుధాని = ఆ

ఆయుధములను, అప్రాప్తాన్యేవ = దగ్గరకు రానివాటినే, అసంభ్రాన్తః = కంగారు లేనివాడై, జగ్రాహ = గ్రహించెను.

తా. అప్పుడు శత్రుసంహారకుడైన అర్జునుడు కంగారుపడక ఆ రాక్షసుల ఆయుధములు తన మీద పడకుండగనే శీఘ్రముగా పట్టుకొనెను. 70

మూ. తతస్తైరేవ రక్షాంసి దుర్ధరైః ప్రవరాయుధైః, 71
భిత్త్వా విద్రావయామాస వాయురమ్బుధరానివ.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, దుర్ధరైః = పట్టుకొనుటకు శక్యముకాని, తైః = ఆ, ప్రవరాయుధైః ఏవ = శ్రేష్ఠములైన ఆయుధములచేతనే, రక్షాంసి = రాక్షసులను, భిత్త్వా = భేదించి, వాయుః = వాయువు, అమ్బుధరానివ = మేఘములను వలె, విద్రావయామాస = పారద్రోలెను.

తా. పిమ్మట పట్టుకొనుటకు శక్యముకాని ఆ శ్రేష్ఠములైవ ఆయుధముల చేతనే రాక్షసులను భేదించి వాయువు మేఘములను ఎగురకొట్టినట్లు ఎగురకొట్టెను.

మూ. రాక్షసాంస్త్రాసయామాస కార్తవీర్యార్జునస్తదా, 72
రావణం గృహ్య నగరం ప్రవివేశ సుహృద్వృతః.

ప్ర. అ. తదా = అప్పుడు, కార్తవీర్యార్జునః = కార్తవీర్యార్జునుడు, రాక్షసాన్ = రాక్షసులను, త్రాసయామాస = భయపెట్టెను. రావణమ్ = రావణుణ్ణి, గృహ్య = గ్రహించి, సుహృద్వృతః = స్నేహితులతో కూడినవాడై, నగరమ్ = నగరమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. అప్పుడు కార్తవీర్యార్జునుడు రాక్షసులను భయపెట్టి రావణుని తీసికొని స్నేహితులతో కలిసి నగరములో ప్రవేశించెను. 72

మూ. స కీర్యమాణః కుసుమాక్షతోత్కరై
ర్ద్విజైః సపౌరైః పురుహూతసంనిభః,
తతోఽర్జునః స్వాం ప్రవివేశ తాం పురీం
బలిం నిగృహ్యేవ సహస్రలోచనః. 73

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ద్వాత్రింశః సర్గః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, పురుహూతసంనిభః = ఇంద్రునితో సమానుడైన, సః అర్జునః = ఆ అర్జునుడు, సపౌరైః = పౌరులతో కూడిన, ద్విజైః = బ్రాహ్మణులచేత, కుసుమాక్షతోత్కరైః = పుష్పములయొక్క, అక్షతలయొక్క సముదాయములచేత, కీర్యమాణః = చల్లబడుచున్నవాడై, బలిమ్ = బలిని, నిగృహ్య = నిగ్రహించి, సహస్రలోచనః ఇవ = ఇంద్రుడు వలె, స్వామ్ = తన సంబంధమైన, తాం పురీమ్ = ఆ పట్టణమును, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. పిమ్మట దేవేంద్రునితో సమానమైన ఆ కార్తవీర్యార్జునుడు బలిని నిగ్రహించి దేవేంద్రుడు వలె బ్రాహ్మణులు, పౌరులు, పుష్పములు, అక్షతలూ చల్లుచుండగా తన నగరములో ప్రవేశించెను. 73

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ముప్పదిరెండవ సర్గ సమాప్తము.

అథ త్రయస్త్రింశః సర్గః

[పులస్త్యుడు వచ్చి రావణుణ్ణి బంధనమునుండి విడిపించుట]

మూ. రావణగ్రహణం తత్తు వాయుగ్రహణసంనిభమ్,
తతః పులస్త్యః శుశ్రావ కథితం దివి దైవతైః. 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, పులస్త్యః = పులస్త్యుడు, దివి = స్వర్గలోకమునందు, దైవతైః = దేవతలచేత, కథితమ్ = చెప్పబడిన, వాయుగ్రహణసంనిభమ్ = వాయువును బంధించుటతో సమానమైన, తత్ = ఆ, రావణగ్రహణం తు = రావణుని బంధనమును, శుశ్రావ = వినెను.

తా. పిమ్మట వాయువును బంధించుట ఎంత ఆశ్చర్యకరమో అంత ఆశ్చర్యకరమైన రావణబంధనమును గూర్చి స్వర్గలోకములో దేవతలు చెప్పగా పులస్త్యుడు వినెను. 1

మూ. తతః పుత్రకృతస్నేహాత్కమ్ప్యమానో మహాధృతిః,
మాహిష్మతీపతిం ద్రష్టుమాజగామ మహాన్ ఋషిః 2

ప్ర. అ. తతః = అటు పిమ్మట, మహాధృతిః = గొప్ప ధైర్యముగల, మహాన్ = గొప్పవాడైన, ఋషిః = ఆ ఋషి, పుత్రకృతస్నేహాత్ = పుత్రుని యందు చేయబడిన స్నేహమువలన, కమ్ప్యమానః = కంపింపచేయబడుచు, మాహిష్మతీపతిమ్ = మాహిష్మతీనగరప్రభువును, ద్రష్టుమ్ = చూటకు, ఆజగామ = వచ్చెను.

తా. అప్పుడు మహాధైర్యవంతుడైన ఆ మహర్షి పుత్రప్రేమచేత కంపింప చేయబడినవాడై కార్తవీర్యార్జునుని చూచుటకు వచ్చెను. 2

మూ. స వాయుమార్గమాస్థాయ వాయుతుల్యగతిర్ద్విజః,
పురీం మాహిష్మతీం ప్రాప్తో మనఃసంపాతవిక్రమః 3

ప్ర. అ. వాయుతుల్యగతిః = వాయువుతో సమానమైన గమనము గల, సః ద్విజః = ఆ బ్రాహ్మణుడు, వాయుమార్గమ్ = వాయుమార్గమును, అస్థాయ= అధిష్ఠించి, మనఃసంపాతవిక్రమః = మనోగమనమువంటి గమనము కలవాడై, మాహిష్మతీం పురీమ్=మాహిష్మతీనగరమును, ప్రాప్తః = పొందినాడు.

తా. వాయువుతో సమానమైన గమనము గల ఆ పులస్త్యుడు వాయుమార్గమునందు ప్రయాణము చేసి, మనోవేగములో మాహిష్మతీనగరమును చేరెను. 3

మూ. సోఽమరావతిసంకాశాం హృష్టపుష్టజనావృతామ్,
ప్రవివేశ పురీం బ్రహ్మ ఇన్ద్రస్యేవామరావతీమ్. 4

ప్ర. అ. సః = అతడు, అమరావతిసంకాశామ్ = అమరావతితో సమానమైన, హృష్టపుష్టజనావృతామ్ = సంతోషించుచున్న బలిసిన జనులతో కూడిన, పురీమ్ = ఆ పట్టణమును, బ్రహ్మ = బ్రహ్మదేవుడు, ఇన్ద్రస్య=ఇంద్రునియొక్క, అమరావతీమ్ ఇవ = అమరావతిని వలె, ప్రవివేశ = ప్రవేశించెను.

తా. బ్రహ్మదేవుడు ఇంద్రుని అమరావతిలో ప్రవేశించినట్లు ఆ పులస్త్యుడు అమరావతితో సమానమై, బలిసి సంతోషముతో ఉన్న జనులతో నిండిన మాహిష్మతీపురమును ప్రవేశించెను. 4

మూ. పాదచారమివాదిత్యం నిష్పతన్తం సుదుర్దృశమ్,
తతస్తే ప్రత్యభిజ్ఞాయ అర్జునాయ న్యవేదయన్. 5

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తే = ఆ జనులు, పాదచారమ్ = పాదములతో నడచుచున్న, ఆదిత్యమివ = సూర్యుడు వలె ఉన్న, నిష్పతన్తమ్ = వచ్చుచున్న, సుదుర్దృశమ్ = మిక్కిలి చూచుటకు శక్యముకాకుండ ఉన్న అతనిని, ప్రత్యభిజ్ఞాయ = గుర్తించి, అర్జునాయ = అర్జునునికొరకు, న్యవేదయన్ = తెలిపిరి.

తా. అప్పుడు అక్కడి జనులు కాలినడకతో వచ్చుచున్న సూర్యుడు వలె ఉన్న, వచ్చుచున్న, చూచుటకు శక్యముకాకుండా ఉన్న ఆ పులస్త్యుణ్ణి చూచి, గుర్తించి, అర్జునునకు తెలిపిరి. 5

మూ. పులస్త్య ఇతి విజ్ఞాయ వచనాద్దైహయాధిపః,
శిరస్యఞ్జలిమాధాయ ప్రత్యుద్గచ్ఛత్తపస్వినమ్. 6

ప్ర. అ. హైహయాధిపః = హైహయవంశరాజు, వచనాత్ = వాళ్ళ మాట వలన, పులస్త్యః ఇతి = పులస్త్యుడు అని, విజ్ఞాయ = తెలుసుకొని, శిరసి = శిరస్సు మీద, అఞ్జలిమ్ = దోసిలిని, ఆధాయ = ఉంచి, తపస్వినమ్ = ఆ మునీశ్వరుణ్ణి, ప్రత్యుద్గచ్ఛత్ = ఎదుర్కొనెను (అయనకు ఎదురేగెను).

తా. కార్తవీర్యార్జునుడు వాళ్ళ మాటలవలన పులస్త్యుడు వచ్చి నట్లు తెలుసుకొని, శిరస్సుపై అంజలి ఘటించి అయనకు ఎదురేగెను. 6

మూ. పురోహితోఽస్య గృహ్యార్ఘ్యం మధుపర్కం తథైవ చ,
పురస్తాత్ప్రయయౌ రాజ్ఞః శక్రస్యేవ బృహస్పతిః. 7

ప్ర. అ. అస్య = ఈతనియొక్క, పురోహితః = పురోహితుడు, అర్ఘ్యమ్ = అర్ఘ్యమును, తథైవ చ = మరియు. మధుపర్కం చ = మధుపర్కమును. గృహ్య = గ్రహించి, రాజ్ఞః = రాజుయొక్క, పురస్తాత్ = ముందు, శక్రస్య = దేవేంద్రుని ముందు, బృహస్పతిః ఇవ = బృహస్పతి వలె, ప్రయయౌ = వెళ్లెను.

తా. కార్తవీర్యార్జునుని పురోహితుడు అర్ఘ్యమును మధుపర్కమును తీసికొని, బృహస్పతి దేవేంద్రుని ముందు వెళ్ళినట్లు అతని ముందు వెళ్ళెను. 7

మూ. తత స్తమృషిమాయాన్తముద్యన్తమివ భాస్కరమ్,
అర్జునో దృశ్య సంభ్రాన్తో వవన్దేన్ద్ర ఇవేశ్వరమ్. 8

ప్ర. అ. తతః = అటుపిమ్మట, అర్జునః = అర్జునుడు, ఉద్యన్తమ్ = ఉదయించుచున్న, భాస్కరమ్ ఇవ = సూర్యుడు వలె ఉన్న, ఆయాన్తమ్ = వచ్చుచున్న. తమ్ ఋషిమ్ = ఆ ఋషిని, దృశ్య = చూచి, సంభ్రాన్తః = తొందర పడుచున్నవాడై, ఇన్ద్రః = ఇంద్రుడు, ఈశ్వరమ్ ఇవ = ఈశ్వరుణ్ణి వలె, వవన్దే = నమస్కరించెను.

తా. పిమ్మట, ఉదయించుచున్న సూర్యుడు వలె ఉన్న, వచ్చుచున్న ఆ పులస్త్యమహర్షిని చూచి. అర్జునుడు కంగారుపడుచు, ఇంద్రుడు ఈశ్వరునకు నమస్కరించి నట్లు అతనికి నమస్కరించెను. 8

మూ. స తస్య మధుపర్కం గాం పాద్యమర్ఘ్యం నివేద్య చ,
పులస్త్యమాహ రాజేన్ద్రో హర్షగద్గదయా గిరా. 9

ప్ర. అ. సః రాజేన్ద్రః = ఆ రాజశ్రేష్ఠుడు, తస్య = ఆతనికి, మధుపర్కమ్ = మధుపర్కమును, గామ్ = గోవును, పాద్యమ్ = పాద్యమును, అర్ఘ్యం చ = అర్ఘ్యమును, నివేద్య = సమర్పించి, హర్షగద్గదయా = సంతోషముతో గద్గదమైన, గిరా = వాక్కుతో, పులస్త్యమ్ = పులస్త్యుణ్ణి గూర్చి, ఆహ = పలికెను

తా. ఆ రాజేంద్రుడు ఆ పులస్త్యునకు మధుపర్కము, గోవు, పాద్యము, అర్ఘ్యము సమర్పించి సంతోషముతో గద్గదమైన వాక్కుతో ఆతనితో ఇట్లనెను. 9

మూ. అద్యైవమమరావత్యా తుల్యా మాహిష్మతీ కృతా,
అద్యాహం తు ద్విజేన్ద్ర త్వాం యస్మాత్పశ్యామి దుర్దృశమ్.

ప్ర. అ. ద్విజేన్ద్ర = బ్రాహ్మణశ్రేష్ఠుడా! యస్మాత్ = ఏ కారణమువలన, అద్య = ఇప్పుడు, అహమ్ = నేను, దుర్దృశమ్ = చూడ శక్యము కాని, త్వామ్ = నిన్ను, పశ్యామి = చూచుచున్నానో, అందువలన, అద్య = ఇప్పుడు, ఏవమ్ = ఈ విధముగా, మాహిష్మతీ = మాహిష్మతీనగరము, అమరావత్యా = అమరావతితో, తుల్యా = సమానమైనదిగా, కృతా = చేయబడినది.

తా. ఓ! బ్రాహ్మణశ్రేష్ఠుడా! నేడు నేను చూచుటకు శక్యముకాని నిన్ను చూడగలుగుచున్నాను. అందుచే నేడు ఈ మాహిష్మతీనగరము అమరావతితో సమానమైనదిగా చేయబడినది. 10

మూ. అద్య మే కుశలం దేవ అద్య మే కుశలం వ్రతమ్,
అద్య మే సఫలం జన్మ అద్య మే సఫలం తపః, 11
యత్తే దేవగణైర్వన్ద్యౌ వన్దేఽహం చరణౌ తవ.

ప్ర. అ. దేవ = ఓ! దేవా! అద్య = నేడు, మే = నాకు, కుశలమ్ = క్షేమము. అద్య = నేడు, మే = నాయొక్క, వ్రతమ్ = వ్రతము, కుశలమ్ = కుశలమైనది. అద్య = నేడు, మే జన్మ = నా జన్మ, సఫలమ్ = సఫలమైనది. అద్య = నేడు, మే తపః = నా తపస్సు, సఫలమ్ = సఫలమైనది. యత్ = ఏ కారణమువలన, తే = నీయొక్క, దేవగణైః = దేవతాగణములచేత, వన్ద్యౌ =

నమస్కరించదగిన, తవ = నీయొక్క, చరణౌ = పాదములకు, అహమ్ = నేను, వన్దే = నమస్కరించుచున్నానో.

తా. దేవా! నేడు నేను దేవతాగణములచేత నమస్కరింపదగిన నీ పాదములకు నమస్కారము చేయుచున్నాను. అందుచేత నాకు కుశలము కలిగినది. నా వ్రతము క్షేమయుక్తమైనది. నా జన్మ సఫలమైనది. నా తపస్సు సఫలమైనది.

మూ. ఇదం రాజ్యమిమే పుత్రా ఇమే దారా ఇమే వయమ్, 12
బ్రహ్మన్ కిం కుర్మః కిం కార్యమాజ్ఞాపయతు నో భవాన్,

ప్ర. అ. బ్రహ్మన్ = బ్రాహ్మణోత్తమా! ఇదమ్ = ఈ, రాజ్యమ్ = రాజ్యము, ఇమే = ఈ, పుత్రాః = పుత్రులు, ఇమే = ఈ, దారాః = భార్య, ఇమే = ఈ, వయమ్ = మేము, కిమ్ = ఏమి, కుర్మః = చేయుదుము ? కిమ్ = ఏమి, కార్యమ్ = చేయదగినపని ఉన్నదో, భవాన్ = నీవు, నః = మమ్ములను, ఆజ్ఞాపయతు = ఆజ్ఞాపించెదవుగాక.

తా. బ్రాహ్మణోత్తమా! ఇదిగో రాజ్యము, ఇదిగో నా పుత్రులు, ఇదిగో నా భార్య. మేము ఇక్కడ ఉన్నాము. మేమందరము నీకేమి చేయవలెనో, నీ పని యేమో ఆజ్ఞాపించుము. 12

మూ. తం ధర్మేఽగ్నిషు పుత్రేషు శివం పృష్ట్వా చ పార్థివమ్,
పులస్త్యోవాచ రాజానం హైహయానాం తథార్జునమ్.

ప్ర. అ. పులస్త్యః = పులస్త్యుడు, హైహయానామ్ = హైహయులకు, రాజానమ్ = రాజైన, తమ్ అర్జునమ్ = ఆ అర్జునిని, ధర్మే = ధర్మమునందు, అగ్నిషు = అగ్నులయందు, పుత్రేషు = పుత్రులయందు, శివమ్ = మంగళమును పృష్ట్వా = అడిగి, తథా = మరియు, పార్థివమ్ = ఆ రాజును గూర్చి, ఉవాచ = పలికెను

తా. పులస్త్యుడు ఆ హైహయరాజును-"నీ ధర్మము నిర్విఘ్నముగ సాగుచున్నదా ? పుత్రులు కుశలముగా ఉన్నారా? అగ్నిహోత్రాదులు చక్కగ జరుగుచున్నవా?"అని ప్రశ్నించి మరల ఇట్లు పలికెను. 13

మూ. నరేన్ద్రామ్బుజపత్రాక్ష పూర్ణచన్ద్రనిభానన, 14
అతులం తే బలం యేన దశగ్రీవస్త్వయా జితః.

ప్ర. అ. అమ్బుజపత్రాక్ష = పద్మపత్రములవంటి నేత్రములు కలవాడా! పూర్ణచంద్రనిభానన = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలవాడా! నరేన్ద్ర = రాజా! యేన = ఏ నీచేత, దశగ్రీవః = రావణుడు, జితః = జయించబడినాడో, తే = అట్టి నీయొక్క, బలమ్ = బలము, అతులమ్ = సాటిలేనిది.

తా. పద్మపత్రముల వంటి నేత్రములు, పూర్ణచంద్రుని వంటి ముఖమూ గల ఓ! రాజా! రావణుణ్ణికూడ జయించిన నీ బలము సాటి లేనిది. 14

మూ. భయాద్యస్యోపతిష్ఠేతాం నిష్పన్దౌ సాగరానిలౌ, 15
సోఽయం మృధే త్వయా బద్ధః పౌత్రో మే రణదుర్జయః.

ప్ర. అ. యస్య = ఎవనియొక్క; భయాత్ = భయమువలన, నిష్పన్దౌ = చలించనివై, సాగరానిలౌ = సముద్రమూ వాయువూ, ఉపతిష్ఠేతామ్ = సేవ చేయునో, సః = అట్టి, రణదుర్జయః = రణమునందు జయింప శక్యము కాని, అయమ్ = ఈ, మే పౌత్రః = నా పౌత్రుడు, త్వయా = నీచేత. మృధే = యుద్ధమునందు, జితః = జయింపబడినాడు.

తా. సముద్రమూ వాయువూ కూడ ఎవనికి భయపడి, నిశ్చలములై సేవ చేయుచుండునో, అట్టి, యుద్ధములో జయింప శక్యము కాని నా పౌత్రుణ్ణి నీవు యుద్ధములో జయించినావు. 15

మూ. పుత్రకస్య యశః పీతం నామ విశ్రావితం త్వయా, 16
మద్వాక్యాద్యాచ్యమానోఽద్య ముఞ్చ వత్స దశాననమ్.

ప్ర. అ. వత్స = నాయనా! పుత్రకస్య = నా పిల్లవానియొక్క, యశః = కీర్తి, పీతమ్ = త్రాగివేయబడినది. త్వయా = నీచేత, నామ = పేరు, విశ్రావితమ్ = ప్రసిద్ధము చేయబడినది. అద్య = ఇప్పుడు, యాచ్యమానః = యాచింపబడుచున్న నీవు, మద్వాక్యాత్ = నా మాటవలన, దశాననమ్ = రావణుణ్ణి, ముఞ్చ = విడువుము.

తా. నాయనా! నీవు నా మనుమని కీర్తిని త్రాగివేసి 'రావణవిజేత' అను పేరు దాటుకొనినావు. నేను యాచించుచున్నాను. నా మాట విని రావణుణ్ణి విడిచి పెట్టుము. 16

మూ. పులస్త్యాజ్ఞాం ప్రగృహ్యాథ న కించన వచోఽర్జునః, 17
ముమోచ వై పార్థివేన్ద్రో రాక్షసేన్ద్రం ప్రహృష్టవత్.

ప్ర. అ. అథ = అటుపిమ్మట, అర్జునః = అర్జునుడు, పులస్త్యాజ్ఞామ్ = పులస్త్యుని ఆజ్ఞను, ప్రగృహ్య=గ్రహించి, కిం చన వచః = ఏ వచనమును, న= పలుకలేదు. పార్థివేన్ద్రః = ఆ రాజశ్రేష్ఠుడు, ప్రహృష్టవత్ = సంతోషించినవాడై, రాక్షసేన్ద్రమ్ = రావణుణ్ణి, ముమోచ వై = విడచెను.

తా. రాజశ్రేష్ఠుడైన కార్తవీర్యార్జునుడు పులస్త్యుని ఆజ్ఞను అంగీకరించి, ఏమీ మాటలాడక, సంతోషపూర్వకముగా రావణుణ్ణి విడిచిపెట్టెను. 17

మూ. స తం ప్రముచ్య త్రిదశారిమర్జునః
ప్రపూజ్య దివ్యాభరణస్రగమ్బరైః,
అహింసకం సఖ్యముపేత్య సాగ్నికం
ప్రణమ్య తం బ్రహ్మసుతం గృహం యయౌ. 18

ప్ర. అ. సః అర్జునః = ఆ అర్జునుడు, తం త్రిదశారిమ్=ఆ దేవతాశత్రువును, ప్రముచ్య = విడిచిపెట్టి, దివ్యాభరణస్రగమ్బరైః = దివ్యములైన ఆభరణములచేత, మాలలచేత, వస్త్రములచేత, ప్రపూజ్య=పూజించి, సాగ్నికమ్ = అగ్ని సహితముగా, అహింసకమ్=హింసచేయని, సఖ్యమ్ = స్నేహమును, ఉపేత్య= పొంది, తమ్ = ఆ, బ్రహ్మసుతమ్=బ్రహ్మదేవుని పుత్రుణ్ణి, ప్రణమ్య = నమస్కరించి, గృహమ్ = గృహమును గూర్చి, యయౌ = వెళ్లెను.

తా. అర్జునుడు దేవతల శత్రువైన ఆ రావణుణ్ణి విడిచిపెట్టి, దివ్యములైన అలంకారములచేత, మాలికలచేత, వస్త్రములచేత అతనిని సత్కరించి, "పరస్పరము మనము హింసించుకొనకూడదు"అని అగ్నిసాక్షికముగా స్నేహము చేసికొని, బ్రహ్మపుత్రుడైన పులస్త్యునకు ప్రణామముచేసి స్వగృహమునకు వెళ్లెను. 18

మూ. పులస్త్యేనాపి సంత్యక్తో రాక్షసేన్ద్రః ప్రతాపవాన్,
పరిష్వక్తః కృతాతిథ్యో లజ్జమానో వినిర్జితః. 19

ప్ర. అ. వినిర్జితః = జయింపబడినవాడై, లజ్జమానః = సిగ్గుపడుచున్న,

ప్రతాపవాన్=ప్రతాపవంతుడైన, రాక్షసేన్ద్రః=రావణుడు, కృతాతిథ్యః=అర్జునుని చేత చేయబడిన ఆతిథ్యము కలవాడై, పరిష్వక్తః=కౌగలించుకొనబడినవాడై, పులస్త్యేనాపి = పులస్త్యునిచేత కూడ, సంత్యక్తః = విడువబడెను.

తా. జయింపబడుటచే సిగ్గుపడుచున్న ప్రతాపవంతుడైన రావణునకు అర్జునుడు ఆతిథ్యము చేసి, కౌగలించుకొని పంపివేసెను. పులస్త్యుడు కూడ లంకకు వెళ్లుటకై అనుమతి ఇచ్చెను. 19

మూ. పితామహసుతశ్చాపి పులస్త్యో మునిపుంగవః,
మోచయిత్వా దశగ్రీవం బ్రహ్మలోకం జగామ హ. 20

ప్ర. అ. పితామహసుతః = బ్రహ్మదేవుని కుమారుడైన, మునిపుంగవః= మునిశ్రేష్ఠుడైన, పులస్త్యః = పులస్త్యుడు, దశగ్రీవమ్=రావణుణ్ణి, మోచయిత్వా= విడిపించి, బ్రహ్మలోకమ్ = బ్రహ్మలోకమునుగూర్చి, జగామ హ = వెళ్లెను.

తా. బ్రహ్మదేవుని కుమారుడు, మునిశ్రేష్ఠుడూ అయిన పులస్త్యుడు రావణుణ్ణి విడిపించి బ్రహ్మలోకమునకు వెళ్ళి పోయెను. 20

మూ. ఏవం స రావణః ప్రాప్తః కార్తవీర్యాత్ప్రధర్షణమ్,
పులస్త్యవచనాచ్చాపి పునర్ముక్తో మహాబలః. 21

ప్ర. అ. మహాబలః=గొప్ప బలము గల, సః=ఆ, రావణః=రావణుడు, ఏవమ్ = ఈ విధముగా, కార్తవీర్యాత్=కార్తవీర్యునివలన, ప్రధర్షణమ్=అవమానమును, ప్రాప్తః = పొందినాడు. పులస్త్యవచనాత్ = పులస్త్యునివచనమువలన, పునః = మరల, ముక్తః చ అపి = విడువబడినాడు.

తా. మహాబలశాలియైన ఆ రావణుడు ఈ విధముగ కార్తవీర్యునివలన అవమానమును పొందెను. పులస్త్యుని మాటలవలన మరల విడువబడెను. 21

మూ. ఏవం బలిభ్యో బలినః సన్తి రాఘవనన్దన,
నావజ్ఞా హి పరే కార్యా య ఇచ్ఛేచ్ఛ్రేయ ఆత్మనః. 22

ప్ర. అ. రాఘవనన్దన = రామా! ఏవమ్ = ఈ విధముగా, బలిభ్యః = బలవంతులకంటె, బలినః = బలవంతులు, సన్తి = ఉన్నారు. యః = ఎవడు,

ఆత్మనః = తనయొక్క, శ్రేయః = శ్రేయస్సును, ఇచ్ఛేత్ = ఇచ్ఛయించునో, (వానిచేత), పరే = శత్రువువిషయమున, అవజ్ఞా = అనాదరము, న కార్యా హి = చేయదగినది కాదు కదా?

తా. రామా! ఒకడు బలవంతుడు అయితే ఆతనికంటె బలవంతులు మరి కొందరు ఉందురు. అందుచేత తనకు శ్రేయస్సు కోరుకొనువాడు శత్రువు విషయమున అనాదరము చూపకూడదు. 22

మూ. తతః స రాజా పిశితాశనానాం
సహస్రబాహోరుపలభ్య మైత్రీమ్,
పునర్నృపాణాం కదనం చకార
చచార సర్వాం పృథివీం చ దర్పాత్. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
త్రయస్త్రింశః సర్గః.

ప్ర. అ తతః = అటుపిమ్మట, సః = ఆ, పిశితాశనానాం రాజా = రాక్షస రాజు, సహస్రబాహోః = కార్తవీర్యార్జునునియొక్క, మైత్రీమ్ = స్నేహమును, ఉపలభ్య = పొంది, పునః = మరల, నృపాణామ్ = రాజులయొక్క, కదనమ్ = సంహారమును, చకార = చేసెను. దర్పాత్ = గర్వమువలన, సర్వామ్ = సమస్తమైన, పృథివీమ్ = భూమిని, చచార = సంచరించెను.

తా. రావణుడు కార్తవీర్యార్జునునితో స్నేహము చేసికొని మరల రాజులను హింసించుచు, గర్వముతో భూలోకమునందంతటా సంచరించెను. 23

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో ముప్పైమూడవ సర్గ సమాప్తము.

అథ చతుస్త్రింశః సర్గః

[రావణుడు వాలినుండి పరాభవము పొంది అతనితో మైత్రి చేసుకొనుట.]

మూ. అర్జునేన విముక్తస్తు రావణో రాక్షసాధిపః,
చచార పృథివీం సర్వామనిర్విణ్ణస్తథా కృతః. 1

ప్ర. అ. అర్జునేన=అర్జుననిచేత, విముక్తః=విడువబడిన, రాక్షసాధిపః=రాక్షసరాజైన, రావణః తు = రావణుడైతే, తథా = అట్లు, కృతః = చేయబడినవాడై, అనిర్విణ్ణః = దిగులు చెందనివాడై, సర్వామ్ = సమస్తమైన, పృథివీమ్ = భూమిని, చచార = సంచరించెను.

తా. అర్జునునిచేత విడవబడిన రాక్షసప్రభువైన రావణుడు, అట్లు నిర్భయుడుగా చేయబడి, దిగులు లేక భూమిమీద అంతటా సంచరించెను. 1

మూ. రాక్షసం వా మనుష్యం వా శృణుతే యం బలాధికమ్,
రావణస్తం సమాసాద్య యుద్ధే హ్వాయతి దర్పితః. 2

ప్ర. అ. దర్పితః = గర్వించిన, రావణః = రావణుడు, రాక్షసం వా = రాక్షసుణ్ణి అయినా, మనుష్యం వా = మనుష్యుణ్ణి అయినా, యమ్ = ఎవనిని, బలాధికమ్ = బలముచేత అధికుణ్ణిగా, శృణుతే=వినునో, తమ్ = వానిని, సమాసాద్య = పొంది, యుద్ధే = యుద్ధమునందు, హ్వాయతి = పిలచును.

తా. దృప్తుడైన రావణుడు రాక్షసుడైనా. మనుష్యుడైనా ఎవడు గొప్ప బలము కలవాడు అని వినునో అతనివద్దకు వెళ్ళి యుద్ధమునకు పిలచుచుండెడివాడు. 2

మూ. తతః కదాచిత్ కిష్కిన్ధాం నగరీం వాలిపాలితామ్,
గత్వాహ్వయతి యుద్ధాయ వాలినం హేమమాలినమ్. 3

ప్ర. అ. తతః = అటుపిమ్మట, కదాచిత్ = ఒకనాడు, వాలిపాలితామ్= వాలిచేత పాలింపబడిన, కిష్కిన్ధామ్=కిష్కింధ అను, నగరీమ్ = నగరిని గూర్చి, గత్వా = వెళ్ళి, హేమమాలినమ్ = బంగారుమాల గల, వాలినమ్ = వాలిని, యుద్ధాయ = యుద్ధముకొరకు, హ్వయతి = పిలచెను.

తా. ఒకనాడు అతడు వాలి పాలించుచున్న కిష్కింధానగరికి వెళ్ళి బంగారు మాల ధరించిన వాలిని యుద్ధముకొరకు పిలచెను. 3

మూ. తతస్తు వానరామాత్యస్తారస్తారాపితా ప్రభుః,
ఉవాచ వానరో వాక్యం యుద్ధప్రేప్సుముపాగతమ్. 4

ప్ర. అ. తతః=అటుపిమ్మట, వానరామాత్యః=వాలియొక్క అమాత్యుడు, తారాపితా=తారయొక్క తండ్రి, ప్రభుః=సమర్థుడు, వానరః=వానరుడూఅయిన, తారః = తారుడు, యుద్ధప్రేప్సుమ్ = యుద్ధమును పొందదలచిన, ఉపాగతమ్= వచ్చిన అతనిని గూర్చి, వాక్యమ్ = వాక్యమును, ఉవాచ = పలికెను.

తా. అప్పుడు యుద్ధము కావలె నను కోరికతో వచ్చిన అతనితో వాలి మంత్రి, తార తండ్రి, సమర్థుడూ అయిన తారు డను వానరుడు ఇట్లు పలికెను.

మూ. రాక్షసేన్ద్ర గతో వాలీ యస్తే ప్రతిబలో భవేత్,
కోఽన్యః ప్రముఖతః స్థాతుం తవ శక్తః ప్లవంగమః. 5

ప్ర. అ. రాక్షసేన్ద్ర = రాక్షసరాజా! యః=ఏ వాలి, తే=నీకు, ప్రతిబలః ఎదిరించు బలము కలవాడు, భవేత్ = అగునో, వాలీ = అట్టి వాలి, గతః = (బైటకు) వెళ్ళినాడు. అన్యః=ఇతరుడైన, కః ప్లవంగమః = ఏ వానరుడు, తవ= నీయొక్క, ప్రముఖతః = ఎదుట, స్థాతుమ్ = నిలచుటకు, శక్తః = సమర్థుడు?

తా. రాక్షసరాజా! నిన్ను ఎదిరించగలిగిన వాలి బైటకు వెళ్ళినాడు. ఇంక నీ ఎదుట నిలవగలిగిన మరొక వానరుడు ఎవరున్నాడు? 5

మూ. చతుర్భ్యోఽపి సముద్రేభ్యః సంధ్యామన్వాస్య రావణ,
ఇదం ముహూర్తమాయాతి వాలీ తిష్ఠ ముహూర్తకమ్. 6

ప్ర. అ. రావణ = రావణా! వాలీ = వాలి, చతుర్భ్యః = నాలుగు, సము

ద్రేభ్యః అపి=సముద్రములనుండి కూడ, సంధ్యామ్ = సంధ్యను, ఉపాస్య=ఉపాసించి, ఇదం ముహూర్తమ్=ఈ ముహూర్తమునందే, ఆయాతి = వచ్చుచున్నారు. ముహూర్తకమ్ = ముహూర్తకాలము, తిష్ఠ = నిలువుము.

తా. రావణా! వాలి నాలుగు సముద్రములవద్దా సంధ్యోపాసన చేసి ఈ ముహూర్తకాలమునందే రాగలడు. ముహూర్తకాలము నిలబడుము. 6

మూ. ఏతానస్థిచయాన్ పశ్య య ఏతే శఙ్ఖపాణ్డురాః,
యుద్ధార్థినామిమే రాజన్వానరాధిపతేజసా. 7

ప్ర. అ. యే = ఏ, ఏతే = ఇవి, శఙ్ఖపాణ్డురాః = శంఖములవలె తెల్లగా నున్నవో, ఏతాన్ = ఈ, అస్థిచయాన్ = ఎముకల సముదాయములను, పశ్య = చూడుము, రాజన్ = రాజా! ఇమే = ఇవి, వానరాధిపతేజసా = వాలి తేజస్సుచేత (మరణించిన), యుద్ధార్థినామ్ = యుద్ధమును కోరి వచ్చినవారికి సంబంధించినవి.

తా. ఇక్కడ పడి ఉన్న శంఖములవలె తెల్లగా ఉన్న ఎముకల గుట్టలను చూడుము. ఇవి యుద్ధమును కోరి వచ్చి వాలి తేజస్సుచేత మరణించినవాళ్ళ ఎముకలు. 7

మూ. యద్వామృతరసః పీత స్త్వయా రావణ రాక్షస,
తదా వాలినమాసాద్య తద న్తం తవ జీవితమ్. 8

ప్ర. అ. రాక్షస = రాక్షసుడవైన, రావణ = రావణా! త్వయా = నీచేత, అమృతరసః = అమృతరసము, యద్వా పీతః = త్రాగబడినను, తదా = అట్లయినను, తవ జీవితమ్ = నీ జీవితము, వాలినమ్ = వాలిని, ఆసాద్య = పొంది, తదన్తమ్ = అదే అంతమునందు గలది.

తా. రాక్షసుడవైన రావణా! నీవు అమృతరసము త్రాగి ఉన్నా కూడ, నీవు వాలిని సమీపించితివా-నీజీవితము అంతటితో అఖరు. 8

మూ. పశ్యేదానీం జగచ్చిత్రమిమం విశ్రవసః సుత,
ఇదం ముహూర్తం తిష్ఠస్వ దుర్లభం తే భవిష్యతి. 9

ప్ర. అ. విశ్రవసః సుత=విశ్రవసుని కుమారుడా! ఇదానీమ్ = ఇప్పుడు,

జగచ్చిత్రమ్=జగత్తులో ఆశ్చర్యపరుచైన, ఇమమ్=ఈ వాలిని, పశ్య=చూడుము. ఇదమ్ = ఈ, ముహూర్తమ్ = ముహూర్తమును, తిష్ఠస్వ = ఉండుము. తే = నీకు, దుర్లభమ్ = దుర్లభము, భవిష్యతి = కాగలదు.

తా. రావణా! ఇప్పుడు జగదాశ్చర్యకరుడైన ఈ వాలిని చూడుము. ఒక్క ముహూర్తము ఆగుము. ఇటుపై నీకు ముహూర్తకాలము దొరకదు. లేదా-చిత్రమైన ఈ జగత్తును చూచుచు కొంచెము సేపైన ఆనందించుము. వాలితో యుద్ధానికి తల పడితివా నీకు ఈ అవకాశము దొరకదు. 9

మూ. అథవా త్వరసే మర్తుం గచ్ఛ దక్షిణసాగరమ్,
వాలినం ద్రక్ష్యసే తత్ర భూమిష్ఠమివ పావకమ్. 10

ప్ర. అ. అథవా = లేదా, మర్తుమ్ = మరణించుటకు, త్వరసే = తొందర పడుచున్నట్లయితే, దక్షిణసాగరమ్=దక్షిణసముద్రమును గూర్చి, గచ్ఛ=వెళ్లుము. తత్ర = అక్కడ, భూమిష్ఠమ్=భూమిపైఉన్న, పావకమ్ ఇవ=అగ్నివలె ఉన్న, వాలినమ్ = వాలిని, ద్రక్ష్యసే = చూడగలవు.

తా. లేదా నీకు ఇప్పుడే మరణించవలెనని ఉన్నచో దక్షిణసముద్రమునకు వెళ్లుము. అక్కడ భూమిపైన ఉన్న అగ్ని వలె ఉన్న వాలిని చూడగలవు. 10

మూ. స తు తారం వినిర్భర్త్స్య రావణో లోకరావణః,
పుష్పకం తత్సమారుహ్య ప్రయయౌ దక్షిణార్ణవమ్ .11

ప్ర. అ. లోకరావణః = లోకములను ఏడ్పించిన, సః రావణః = ఆ రావణుడు, తారమ్ = తారుణ్ణి, వినిర్భర్త్స్య = భయపెట్టి, తత్ = ఆ, పుష్పకమ్ = పుష్పకమును, సమారుహ్య=ఎక్కి, దక్షిణార్ణవమ్=దక్షిణసముద్రమును గూర్చి, ప్రయయౌ=వెళ్ళెను.

తా. లోకములను ఏడ్పించిన ఆ రావణుడు అట్లు మాట్లాడినందుకు తారుణ్ణి ఆళిపించి, పుష్పక మెక్కి, దక్షిణసముద్రమునకు వెళ్లెను. 11

మూ. తత్ర హేమగిరిప్రఖ్యం తరుణార్కనిభాననమ్,
రావణో వాలినం దృష్ట్వా సంధ్యోపాసనతత్పరమ్. 12

పుష్పకాదవరుహ్యాథ రావణో౽ఞ్జనసంనిభః,
గ్రహీతుం వాలినం తూర్ణం నిఃశబ్దపదమవ్రజత్. 13

ప్ర. అ. రావణః = రావణుడు, తత్ర = అక్కడ, హేమగిరిప్రఖ్యమ్ = మేరుపర్వతముతో సమానుడు, తరుణార్కనిభాననమ్ = లేతసూర్యుని వంటి ముఖముగలవాడు, సంధ్యోపాసనతత్పరమ్ = సంధ్యోపాసనయందు ఆసక్తుడూ అయిన, వాలినమ్=వాలిని, దృష్ట్వా=చూచి, అథ=అటుపిమ్మట, అఞ్జనసంనిభః = కాటుకతో సమానుడైన, రావణః = రావణుడు, పుష్పకాత్=పుష్పకమునుండి, అవరుహ్య = దిగి, వాలినమ్ = వాలిని, గ్రహీతుమ్ = గ్రహించుటకు, తూర్ణమ్= శీఘ్రముగా, నిఃశబ్దపదమ్ = శబ్దములేని అడుగులు కలుగునట్లుగా, అవ్రజత్ = వెళ్లెను.

తా. రావణుడు అక్కడ సంధ్యోపాసన చేయుచున్న వాలిని చూచెను. ఆతడు మేరుపర్వతమువలె ఉండెను. అతని ముఖము లేత సూర్యునివలె ఉండెను. పిమ్మట కాటుక వంటి శరీరచ్ఛాయ గల ఆ రావణుడు పుష్పకమునుండి దిగి వాలిని పట్టుకొనుటకై అడుగుల చప్పుడు కాకుండగా, శీఘ్రముగా వెళ్లెను. 12,13

మూ. యదృచ్ఛయా తదా దృష్టో వాలినాపి స రావణః,
పాపాభిప్రాయకం దృష్ట్వా చకార న తు సంభ్రమమ్. 14

ప్ర. అ. సః రావణః=ఆ రావణుడు, తదా = అప్పుడు, యదృచ్ఛయా= దైవవశముచేత, వాలినాపి=వాలిచేత కూడా, దృష్టః=చూడబడినాడు. తు=కాని, పాపాభిప్రాయకమ్ = చెడ్డ అభిప్రాయము కలవానినిగా, దృష్ట్వా=చూచి, సంభ్రమమ్ = తొందరను, న చకార = చేయలేదు.

తా. అప్పుడు వాలి కూడ రావణుణ్ణి దైవవశముచేత చూచెను. కాని అతడు వాని చెడ్డ అభిప్రాయమును తెలిసికొని కూడ కంగారుపడలేదు. 14

మూ. శశమాలక్ష్య సింహో వా పన్నగం గరుడో యథా,
న చిన్తయతి తం వాలీ రావణం పాపనిశ్చయమ్. 15

ప్ర. అ. శశమ్ = చెవులపిల్లిని, ఆలక్ష్య=చూచి, సింహో వా = సింహమువలె, పన్నగమ్=సర్పమును చూచి, గరుడో యథా=గరుత్మంతుడువలె, వాలీ=

వాలి, పాపనిశ్చయమ్ = చెడ్డ నిశ్చయము గల, తం రావణమ్ = ఆ రావణుణ్ణి, న చిన్తయతి = లెక్కచేయలేదు.

తా. చెవులపిల్లిని చూచి సింహము వలె, సర్పమును చూచి గరుత్మంతుడు వలె, చెడ్డ అభిప్రాయముతో ఉన్న ఆ రావణుణ్ణి చూచి వాలి ఏమీ లెక్కచేయలేదు.

మూ. జిఘృక్షమాణమాయాన్తం రావణం పాపచేతసమ్,
కక్షావలమ్బినం కృత్వా గమిష్యే త్రీన్ మహార్ణవాన్. 16

ప్ర. అ. జిఘృక్షమాణమ్ = నన్ను గ్రహింపదలచిన, ఆయాన్తమ్ = వచ్చుచున్న, పాపచేతసమ్ = పాపపు చిత్తము గల, రావణమ్ = రావణుణ్ణి, కక్షావలమ్బినమ్ = చంకలో వ్రేలాడుచున్నవానినిగా, కృత్వా = చేసి, త్రీన్ = మూడు, మహార్ణవాన్ = మహాసముద్రములను గూర్చి, గమిష్యే = వెళ్ళగలను.

తా. "నన్ను పట్టుకొనవలె నను చెడ్డ సంకల్పముతో వచ్చుచున్న ఈ రావణుణ్ణి చంకలో వ్రేలాడునట్లు ఉంచుకొని, మూడు మహాసముద్రములకు వెళ్లె దను." 16

మూ. ద్రక్ష్యన్త్యరిం మమాఙ్కస్థం స్రంసదూరుకరామ్బరమ్,
లమ్బమానం దశగ్రీవం గరుడస్యేవ పన్నగమ్. 17

ప్ర. అ. గరుడస్య = గరుత్మంతునియొక్క అంకమునందున్న, పన్నగమ్ ఇవ = సర్పమునువలె, మమ = నాయొక్క, అఙ్కస్థమ్ = ఒడిలో ఉన్న, స్రంసదూరుకరామ్బరమ్ = జారుచున్నతొడలు, హస్తములు, వస్త్రమూ గల, లమ్బమానమ్ = వ్రేలాడుచున్న, అరిమ్ = శత్రువైన, దశగ్రీవమ్ = రావణుణ్ణి, ద్రక్ష్యన్తి = చూడగలరు.

తా. "శత్రువైన ఈ రావణుడు, గరుత్మంతునికి చిక్కిన సర్పము వలె, నాకు చిక్కి చేతులూ, తొడలూ, వస్త్రమూ జార్చి వ్రేలాడుచుండగా జనులు చూచెదరుగాక". 17

మూ. ఇత్యేవం మతిమాస్థాయ వాలీ మౌనముపాస్థితః,
జపన్వై నైగమాన్ మన్త్రాంస్తస్థౌ పర్వతరాడివ. 18

ప్ర. అ. ఇత్యేవమ్ = ఇట్లు, మతిమ్ = బుద్ధిని, ఆస్థాయ = అవలంబించి, వాలీ = వాలి, మౌనమ్ = మౌనమును, ఉపాస్థితః = ఆశ్రయించినవాడై, నైగమాన్ = వేదములకు సంబంధించిన, మన్త్రాన్ = మంత్రములను, జపన్ = జపించుచు, పర్వతరాడివ = పర్వతరాజు వలె, తస్థౌ = ఉండెను.

తా. వాలి ఈ విధముగా ఆలోచించి, ఏమీ మాటలాడక, వేదమంత్రములు జపించుచు, పర్వతరాజువలె కదలకుండా ఉండెను. 18

మూ. తావన్యోన్యం జిఘృక్షన్తౌ హరిరాక్షసపార్థివౌ,
ప్రయత్నవన్తౌ తత్కర్మ ఈహతుర్బలదర్పితౌ. 19

ప్ర అ. అన్యోన్యమ్ = పరస్పరమును, జిఘృక్షన్తౌ = గ్రహింపదలచు చున్న, బలదర్పితౌ = బలముచేత దృప్తులైన, తౌ = ఆ, హరిరాక్షసపార్థివౌ = వానరరాక్షసరాజులు, ప్రయత్నవన్తౌ = ప్రయత్నము కలవారై, తత్ = ఆ, కర్మ = పనిని, ఈహతుః = కోరిరి.

తా. ఒకరి నొకరు పట్టుకొనగోరుచున్న, బలముచేత దృప్తులైన ఆ వాలి రావణులు ఆ పని సాధించుటకై ప్రయత్నము చేసిరి. 19

మూ. హస్తగ్రాహం తు తం మత్వా పాదశబ్దేన రావణమ్,
పరాఙ్ముఖోఽపి జగ్రాహ వాలీ సర్పమివాణ్డజః. 20

ప్ర. అ. వాలీ = వాలి, పరాఙ్ముఖోఽపి = పరాఙ్ముఖుడైనను, పాదశబ్దేన = అడుగుల చప్పుడుచేత, తం రావణమ్ = ఆ రావణుడ్ని, హస్తగ్రాహమ్ = చేతికి దొరికేవానినిగా, మత్వా = తెలిసికొని, అణ్డజః = పక్షి, సర్పమివ = సర్పమును వలె, జగ్రాహ = పట్టుకొనెను.

తా. వాలి అటు వైపు తిరిగి ఉన్నా కూడ అడుగుల చప్పుడును పట్టి ఆ రావణుడు చేతికి అందేటట్లు ఉన్నా డని గ్రహించి పక్షి సర్పమును పట్టుకొని నట్లు అతనిని పట్టుకొనెను. 20

మూ. గ్రహీతుకామం తం గృహ్య రక్షసామీశ్వరం హరిః,
ఖముత్పపాత వేగేన కృత్వా కక్షావలమ్బినమ్. 21

ప్ర. అ. హరిః = వానరుడు, గ్రహీతుకామమ్ = తనను పట్టుకొనుటకు కోరిక గల, తమ్ = ఆ, రక్షసామ్ ఈశ్వరమ్ = రాక్షసరాజును, గృహ్య = పట్టుకొని, కక్షావలమ్బినమ్ = చంకలో వ్రేలాడుచున్నవానినిగా, కృత్వా = చేసి, వేగేన = వేగముతో. ఖమ్ = ఆకాశమును గూర్చి. ఉత్పపాత = ఎగిరెను.

తా. వాలి, తనను పట్టుకొనుటకై వచ్చిన ఆ రావణుణ్ణి పట్టుకొని, చంకలో వ్రేలాడునట్లు చేసికొని వేగముగా ఆకాశములోనికి ఎగిరెను. 21

మూ. తం చ పీడయమానం తు వితుదన్తం నఖైర్ముహుః,
జహార రావణం వాలీ పవనస్తోయదం యథా. 22

ప్ర. అ. ముహుర్ముహుః = మాటిమాటికి, నఖైః = గోళ్ళతో, వితుదన్తమ్ = గీరుచున్న, పీడయమానమ్ = పీడించుచున్న, తం రావణమ్ = ఆ రావణుణ్ణి, వాలీ = వాలి, పవనః = గాలి, తోయదం యథా = మేఘమును వలె, జహార = హరించెను.

తా. మాటి మాటికి గోళ్ళతో గీరుచు బాధించుచున్న ఆ రావణుణ్ణి వాలి వాయువు మేఘమును అపహరించినట్లు ఎత్తుకొనిపోయెను. 22

మూ. అథ తే రాక్షసామాత్యా హ్రియమాణే దశాననే,
ముమోక్షయిషవో వాలిం రవమాణా అభిద్రుతాః. 23

ప్ర. అ. అథ = అటుపిమ్మట, దశాననే = రావణుడు, హ్రియమాణే = హరింపబడుచుండగా, తే = ఆ, రాక్షసామాత్యాః = రాక్షసుని అమాత్యులు, ముమోక్షయిషవః = అతనిని విడిపించదలచినవారై, రవమాణాః = అరచుచు, వాలినమ్ = వాలిని గూర్చి, అభిద్రుతాః = పరుగెత్తిరి.

తా. వాలి రావణుణ్ణి అపహరించుకొనిపోవుట చూచి అతని మంత్రులైన రాక్షసులు అతనిని విడిపించుటకై అరచుచు వాలిని వెంబడించిరి. 23

మూ. అన్వీయమానస్తైర్వాలీ భ్రాజతేఽమ్బరమధ్యగః,
అన్వీయమానో మేఘౌఘైరమ్బరస్థ ఇవాంశుమాన్. 24

ప్ర. అ. తైః = వాళ్ళచేత, అన్వీయమానః = అనుసరించబడుచున్న, అమ్బరమధ్యగః = ఆకాశమధ్యమునందున్న, వాలీ = వాలి, మేఘౌఘైః = మేఘ

సముదాయములచేత, అన్వీయమానః = అనుసరించబడుచున్న, అమ్బరస్థః = ఆకాశమునందున్న, అంశుమానివ = సూర్యుడు వలె, భ్రాజతే = ప్రకాశించు చున్నాడు.

తా. ఆ రాక్షసులు వెంబడించుచుండగా ఆకాశమధ్యమునందు ఉన్న ఆ వాలి, మేఘములచేత వెంబడింపబడిన, ఆకాశమునందున్న సూర్యుడు వలె ప్రకాశించెను. 24

మూ. తేఽశక్నువన్తః సంప్రాప్తుం వాలినం రాక్షసోత్తమాః,
తస్య బాహూరువేగేన పరిశ్రాన్తా వ్యవస్థితాః. 25

ప్ర. అ. తే రాక్షసోత్తమాః = ఆ రాక్షసశ్రేష్ఠులు, వాలినమ్ = వాలిని, సంప్రాప్తుమ్ = పొందుటకు, అశక్నువన్తః = సమర్థులు కానివారై, తస్య = అతనియొక్క, బాహూరువేగేన = బాహువులయొక్క ఊరువులయొక్క వేగము చేత. పరిశ్రాన్తాః = అలసినవారై, వ్యవస్థితాః = ఆగిపోయిరి.

తా ఆ రాక్షసశ్రేష్ఠులు వాలిని చేరజాలక అతని బాహువుల, తొడల వేగముచేత అలసిపోయినవారై ఆగిపోయిరి. 25

మూ. వాలిమార్గాదపాక్రామన్ పర్వతేన్ద్రాఽపి గచ్ఛతః,
కింపునర్జీవనప్రేప్సుర్బిభ్రద్వై మాంసశోణితమ్. 26

ప్ర. అ. గచ్ఛతః = వెళ్ళుచున్న, వాలిమార్గాత్ = వాలియొక్క మార్గము నుండి, పర్వతేన్ద్రాఽపి = పెద్ద పర్వతములు కూడ, అపాక్రామన్ = దూరముగా తొలగిపోయినవి. మాంసశోణితమ్ = మాంసమును రక్తమును, బిభ్రత్ = ధరించుచున్న, జీవనప్రేప్సుః = జీవనమును పొందదలచినవాడు, కిం పునః = చెప్పనేల ?

తా. వాలి వెళ్ళుచుండగా అతని మార్గమునుండి పెద్ద పర్వతములు కూడ తప్పుకొన్నవి. మాంసశోణితములు ఉన్న, ప్రాణములపై తీపి ఉన్నవాని మాట చెప్పవలెనా ? 26

మూ. అపక్షిగణసంపాతాన్వానరేన్ద్రో మహాజవః,
క్రమశః సాగరాన్సర్వాన్ సంధ్యాకాలమవన్దత. 27

ప్ర. అ. మహాజవః = గొప్ప వేగము గల, వానరేన్ద్రః = వాలి, సంధ్యాకాలమ్ = సంధ్యాకాలమును (నందు), అపక్షిగణసంపాతాన్ = పక్షిసముదాయముల ఎగురుటలేని, సర్వాన్ = సమస్తమైన, సాగరాన్ = సముద్రములను, క్రమశః = క్రమముగా, అవన్దత = నమస్కరించెను.

తా. గొప్ప వేగము గల ఆ వాలి సంధ్యాకాలమునందు, పక్షులు ఎగరని సముద్రములను అన్నింటినీ వరుసగా చూచి నమస్కరించెను. 27

మూ. సంపూజ్యమానో యాతస్తు ఖచరైః ఖచరోత్తమః,
పశ్చిమం సాగరం వాలీ ఆజగామ సరావణః. 28

ప్ర. అ. ఖచరైః = దేవతలచేత, సంపూజ్యమానః = పూజించబడుచున్న, ఖచరోత్తమః = ఆకాశమునందు సంచరించేవారిలో ఉత్తముడైన, వాలీ = వాలి, సరావణః = రావణునితో కూడినవాడై, పశ్చిమం సాగరమ్ = పశ్చిమసముద్రమును గూర్చి, ఆజగామ = వచ్చెను.

తా. ఆకాశమునందు సంచరించేవారిలో ఉత్తముడైన ఆ వాలి దేవతలచేత పూజింపబడుచు, రావణసహితుడై పశ్చిమసముద్రము చేరెను. 28

మూ. తస్మిన్ సంధ్యాముపాసిత్వా స్నాత్వా జప్త్వా చ వానరః,
ఉత్తరం సాగరం ప్రాయాద్వహమానో దశాననమ్. 29

ప్ర. అ. వానరః = వాలి, తస్మిన్ = దానియందు, స్నాత్వా = స్నానము చేసి, సంధ్యామ్ = సంధ్యను, ఉపాసిత్వా = ఉపాసించి, జప్త్వా చ = జపించి, దశాననమ్ = రావణుణ్ణి, వహమానః = మోయుచు, ఉత్తరం సాగరమ్ = ఉత్తర సముద్రమును గూర్చి, ప్రాయాత్ = వెళ్ళెను.

తా. వాలి ఆ సముద్రమునందు స్నానము చేసి, సంధ్యోపాసన చేసి, జపించి ఆ రావణుణ్ణి మోసికొనుచు ఉత్తరసముద్రమునకు వెళ్లెను. 29

మూ. బహుయోజనసాహస్రం వహమానో మహాహరిః,
వాయువచ్చ మనోవచ్చ జగామ సహ శత్రుణా. 30

ప్ర. అ. మహాహరిః = గొప్ప వానరుడు, బహుయోజనసాహస్రమ్ =

దాల వేల యోజనములను, వహమానః = మోయుచు (లేదా ఎగురుచు), శత్రుణా సహ = శత్రువుతో కూడ, వాయువచ్ఛ = వాయువు వలె, మనోవచ్ఛ = మనస్సు వలె, జగామ = వెళ్లెను.

తా. వాలి ఈ విధముగా శత్రువుతో కూడ ఎగురుచు ఎన్నో వేల యోజనముల దూరము వాయువు వలె, మనస్సు వలె వెళ్లెను. 30

మూ. ఉత్తరే సాగరే సంధ్యాముపాసిత్వా దశాననమ్,
వహమానోఽగమద్వాలీ పూర్వం వై స మహోదధిమ్.

ప్ర. అ. సః వాలీ = ఆ వాలి, ఉత్తరే సాగరే = ఉత్తరసముద్రమునందు, సంధ్యామ్ = సంధ్యను, ఉపాసిత్వా = ఉపాసించి, దశాననమ్ = రావణుణ్ణి, వహమానః = మోయుచు, పూర్వమ్ = తూర్పుదైన, మహోదధిమ్ = మహాసముద్రమును గూర్చి, అగమత్ = వెళ్ళెను.

తా. వాలి ఉత్తరసముద్రమునందు సంధ్యోపాసన చేసి రావణుణ్ణి మోసికొనుచూ తూర్పు సముద్రమునకు వెళ్ళెను. 31

మూ. తత్రాపి సంధ్యామన్వాస్య వాసవిః స హరీశ్వరః,
కిష్కిన్ధామభితో గృహ్య రావణం పునరాగమత్. 32

ప్ర. అ. వాసవిః = ఇంద్రుని కుమారుడైన, సః హరీశ్వరః = ఆ వాలి, తత్రాపి = అక్కడ కూడ, సంధ్యామ్ = సంధ్యను, అన్వాస్య = ఉపాసించి, రావణమ్ = రావణుణ్ణి, గృహ్య = గ్రహించి, పునః = తిరిగి, కిష్కిన్ధామ్ అభితః = కిష్కింధను గూర్చి, ఆగమత్ = వచ్చెను.

తా. ఇంద్రుని పుత్రుడైన ఆ వాలి అక్కడ కూడ సంధ్యోపాసన చేసి రావణుణ్ణి తీసికొని కిష్కింధవైపు వెళ్లెను. 32

మూ. చతుర్ష్వపి సముద్రేషు సంధ్యామన్వాస్య వానరః,
రావణోద్వహనశ్రాన్తః కిష్కిన్ధోపవనేఽపతత్. 33

ప్ర. అ. వానరః = వాలి, చతుర్షు = నాలుగు. సముద్రేషు అపి = సముద్రములయందూ కూడ, సంధ్యామ్ = సంధ్యను, అన్వాస్య = ఉపాసించి, రావణోద్వ

హస్తాన్తః=రావణుణ్ణి మోయుట చేత అలసినవాడై, కిష్కిన్ధోపవనే=కిష్కింధ దగ్గర నున్న వనమునందు, అపతత్ = దిగెను.

తా. వాలి ఈ విధముగ నాలుగు సముద్రముల వద్ద సంధ్యను ఉపాసించి రావణుణ్ణి మోయుటచేత అలసి కిష్కింధ దగ్గరనున్న ఉద్యానమునందు దిగెను. 33

మూ. రావణం తు ముమోచాథ స్వకక్షాత్కపిసత్తమః,
కుతస్త్వమితి చోవాచ ప్రహసన్ రావణం ముహుః. 34

ప్ర. అ. అథ = అటుపిమ్మట, కపిసత్తమః = కపిశ్రేష్ఠుడు, స్వకక్షాత్ = తన చంకనుండి, రావణమ్ = రావణుణ్ణి, ముమోచ = విడచెను. ముహుః = మాటి మాటికి, ప్రహసన్ = నవ్వుచు, త్వమ్ = నీవు, కుతః=ఎక్కడినుండి వచ్చినావు? ఇతి = అని, రావణమ్ = రావణుణ్ణి గూర్చి, ప్రోవాచ = పలికెను.

తా. అప్పుడు వాలి రావణుణ్ణి తన చంకనుండి క్రిందకు విడచి, నవ్వుచు "నీవు ఎక్కడినుండి వచ్చినావు" అని అతనిని అడిగెను. 34

మూ. విస్మయం తు మహద్గత్వా శ్రమలోలనిరీక్షణః,
రాక్షసేన్ద్రో హరీన్ద్రం తమిదం వచనమబ్రవీత్. 35

ప్ర. అ. రాక్షసేన్ద్రః = రావణుడు, మహత్ = గొప్ప, విస్మయమ్ = ఆశ్చర్యమును, గత్వా = పొంది, శ్రమలోలనిరీక్షణః = అలసటచేత కదలిపోవు చున్న చూపులు కలవాడై, తం హరీన్ద్రమ్ = ఆ వాలిని గూర్చి, ఇదం వచనమ్ = ఈ వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. రావణుడు చాల ఆశ్చర్యపడుచు, అలసటచేత కదలిపోవుచున్న చూపులతో ఆ వాలితో ఇట్లు పలికెను. 35

మూ. వానరేన్ద్ర మహేన్ద్రాభ రాక్షసేన్ద్రోఽస్మి రావణః,
యుద్ధేప్సురిహ సంప్రాప్తః స చాద్యాసాదితస్త్వయా. 36

ప్ర. అ. మహేన్ద్రాభ = మహేంద్రునివంటి కాంతి గలవాడా! వానరేన్ద్ర = వానరరాజా! రాక్షసేన్ద్రః = రాక్షసరాజైన. రావణః = రావణుడను, అస్మి =

అయి ఉన్నాను, యుద్ధేప్సుః = యుద్ధము పొందదలచినవాడనై, ఇహ = ఇక్కడికి, సంప్రాప్తః = వచ్చినాను, సః = అట్టి నేను, త్వయా = నీచేత, ఆసాదితః = పీడింపబడితిని.

తా. మహేంద్రునివంటి వానరేంద్రా! నేను రాక్షసరాజునైన రావణుడను. యుద్ధముకొరకై ఇక్కడికి వచ్చినాను. అట్టి నన్ను నీ వీ విధముగా పీడించితివి. 36

మూ. అహో బలమహో వీర్య మహో గామ్భీర్యమేవ చ,
యేనాహం పశువద్గృహ్య భ్రామితశ్చతురోఽర్ణవాన్. 37

ప్ర. అ. బలమ్ = బలము, అహో = ఎంత ఆశ్చర్యకరమైనది? వీర్యమ్ = వీర్యము, అహో = ఎంత ఆశ్చర్యకరమైనది! గామ్భీర్యమ ఏవ చ = గాంభీర్యము కూడ, అహో = ఎంత ఆశ్చర్యకరము! యేన = ఏ నీచేత, అహమ్ = నేను, పశువత్ = పశువు వలె, గృహ్య = గ్రహించి, చతురః = నాలుగు, అర్ణవాన్ = సముద్రములను, భ్రామితః = త్రిప్పబడితినో.

తా. నీవు నన్ను పశువును వలె పట్టి నాలుగు సముద్రములు త్రిప్పించినావు. ఏమి బలము! ఏమి పరాక్రమము! ఏమి గాంభీర్యము! 37

మూ. ఏవమశ్రాన్తవద్వీర శీఘ్రమేవ మహార్ణవాన్,
మాం చైవోద్వహమానస్తు కోఽన్యో వీరః క్రమిష్యతి. 38

ప్ర అ. వీర = వీరుడా! ఏవమ్ = ఈ విధముగా. అశ్రాన్తవత్ = అలసట లేకుండగా, అన్యః = ఇతరుడైన, కః వీరః = ఏ వీరుడు, మాం చైవ = నన్ను కూడ, ఉద్వహమానః = మోయుచు, శీఘ్రమేవ = శీఘ్రముగా, మహార్ణవాన్ = మహాసముద్రములను, క్రమిష్యతి = దాటగలడు?

తా. వీరుడా! ఈ విధముగా అలసట లేకుండ, నన్ను కూడ మోయుచు మరొక ఏ వీరుడు శీఘ్రముగా మహాసముద్రములకు వెళ్ళగలడు? 38

మూ. త్రయాణామేవ భూతానాం గతిరేషా ప్లవంగమ,
మనోనిలసుపర్ణానాం తవ చాత్ర న సంశయః. 39

ప్ర. అ. ప్లవంగమ = ఓ వాలీ! ఏషా = ఈ, గతిః = గమనము, మనో నిలసువర్ణానామ్ = మనస్సు, వాయువు, గరుత్మంతుడు అను, త్రయాణామ్ = మూడు, భూతానామ్ = భూతములకూ, తవ చ = నీకూ ఉన్నది. అత్ర = ఈ విషయమునందు, సంశయః=సంశయము, న = లేదు.

తా. ఓ! వానరరాజా! ఇట్టి గమనము మనస్సు, వాయువు, గరుత్మంతుడు అను మూడు భూతాలకు నీకూ మాత్రమే ఉన్నది. సంశయము లేదు. 39

మూ. సోఽహం దృష్టబలస్తుభ్యమిచ్ఛామి హరిపుంగవ,
త్వయా సహ చిరం సఖ్యం సుస్నిగ్ధం పావకాగ్రతః. 40

ప్ర. అ. హరిపుంగవ = వానరశ్రేష్ఠా! తుభ్యమ్=నీకొరకు, (నీయొక్క), దృష్టబలః = చూడబడిన బలము గల, సః అహమ్ = అట్టి నేను, త్వయా సహ= నీతో కూడ, పావకాగ్రతః=అగ్ని ఎదుట, సుస్నిగ్ధమ్=చాల దట్టమైన, సఖ్యమ్ = స్నేహమును, చిరమ్ = చిరకాలము, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. ఓః వానరశ్రేష్ఠా! నీ బల మెంతటిదో నా కిప్పుడు తెలిసినది. నీతో చిరకాలము అగ్నిసాక్షికముగా, మనమైన స్నేహమును కోరుచున్నాను. 40

మూ. దారాః పుత్రాః పురం రాష్ట్రం భోగాచ్ఛాదనభోజనమ్,
సర్వమేవావిభక్తం నౌ భవిష్యతి హరీశ్వర. 41

ప్ర. అ. హరీశ్వర=వానరరాజా! దారాః=భార్యలు, పుత్రాః=పుత్రులు, పురమ్ = పట్టణము. రాష్ట్రమ్=రాష్ట్రము, భోగాచ్ఛాదనభోజనమ్ = భోగములు, ఆచ్ఛాదనములు, భోజనము, సర్వమేవ=సమస్తమూ కూడ, నౌ = మన ఇద్దరికి, అవిభక్తమ్ = విభజింపబడనిదిగా, భవిష్యతి = ఉండగలదు.

తా. వానరరాజాః భార్యలు, పుత్రులు, పురము, రాష్ట్రము, భోగములు, ఆచ్ఛాదనములు, భోజనమూ అన్నికూడ మనిద్దరికి కలిసియే ఉండగలవు. 41

మూ. తతః ప్రజ్వాలయిత్వాగ్నిం తావుభౌ హరిరాక్షసౌ,
భ్రాతృత్వముపసంపన్నౌ పరిష్వజ్య పరస్పరమ్. 42

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తౌ=ఆ, హరిరాక్షసౌ=వానరరాక్షసులు,

ఉభౌ = ఇద్దరూ, అగ్నిమ్ = అగ్నిని, ప్రజ్వాలయిత్వా = మండింపచేసి, పరస్పరమ్ = పరస్పరము, పరిష్వజ్య = కౌగలించుకొని, భ్రాతృత్వమ్ = భ్రాతృత్వమును, ఉపసంపన్నౌ = పొందిరి.

తా. పిమ్మట ఆ వాలిరావణులు అగ్నిని రగిల్చి, పరస్పరము కౌగలించుకొని భ్రాతృత్వమును (సోదరస్నేహమును) పొందిరి. 42

మూ. అన్యోన్యం లమ్బితకరౌ తతస్తౌ హరిరాక్షసౌ,
కిష్కిన్ధాం విశతుర్హృష్టౌ సింహౌ గిరిగుహామివ. 43

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తౌ = ఆ, హరిరాక్షసౌ = వానరరాక్షసులు, అన్యోన్యమ్ = పరస్పరము, లమ్బితకరౌ = పట్టుకొనబడిన హస్తములు గలవారై, హృష్టౌ = సంతోషించినవారై, సింహౌ = సింహములు, గిరిగుహామివ = పర్వత గుహను వలె, కిష్కిన్ధామ్ = కిష్కింధను, విశతుః = ప్రవేశించిరి.

తా. పిమ్మట ఆ వాలిరావణులు పరస్పరము చేతులు కలిపి సంతోషించుచు రెండు సింహములు పర్వతగుహలో ప్రవేశించినట్లు కిష్కింధలో ప్రవేశించిరి. 43

మూ. స తత్ర మాసముషితః సుగ్రీవ ఇవ రావణః,
అమాత్యైరాగతైర్నీతస్త్రైలోక్యోత్సాదనార్థిభిః. 44

ప్ర. అ. సః రావణః = ఆ రావణుడు, తత్ర = అక్కడ, సుగ్రీవః ఇవ = సుగ్రీవుడు వలె, మాసమ్ = మాసమును, ఉషిత్వా = నివసించి, ఆగతైః = వచ్చిన, త్రైలోక్యోత్సాదనార్థిభిః = మూడు లోకములను పీడించుటకు కోరుచున్న, అమాత్యైః = అమాత్యులచేత, నీతః = తీసికొని వెళ్ళబడినాడు

తా. ఆ రావణుడు అక్కడ సుగ్రీవుడు వలె (సోదరుడు వలె) ఒక మాసము ఉండెను. ఇంతలో మూడు లోకములను పీడింపవలె నని కోరిక గల అమాత్యులు వచ్చి అతనిని తీసికొని వెళ్ళిరి. 44

మూ. ఏవమేతత్పురావృత్తం వాలినా రావణః ప్రభో,
ధర్షితశ్చ వృతశ్చాపి భ్రాతా పావకసంనిధౌ. 45

ప్ర అ. ప్రభో = ప్రభువైన రామా! ఏవమ్ = ఇట్లు, ఏతత్ = ఇది, పురా = పూర్వము, వృత్తమ్ = జరిగినది. రావణః = రావణుడు, వాలినా = వాలి

చేత, ధర్షితః చాపి = అవమానించబడినాడు, పావకసంనిధౌ = అగ్నిసంనిధియందు, భ్రాతా = సోదరుడుగా, వృతః చాపి = కోరబడినవాడు.

తా రామా! పూర్వము ఈ విధముగ జరిగినది. వాలి రావణుణ్ణి అవమానించి తరువాత అగ్నిసాక్షికముగా అతనితో మైత్రి చేసికొన్నాడు. 45

మూ. బలమప్రతిమం రామ వాలినోఽభవదుత్తమమ్,
సోఽపి త్వయా వినిర్దగ్ధః శలభో వహ్నినా యథా. 46

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
చతుస్త్రింశః సర్గః.

ప్ర. అ. రామ = రామా! వాలినః = వాలియొక్క, ఉత్తమమ్ = ఉత్తమమైన, బలమ్ = బలము, అప్రతిమమ్ = సాటిలేనిదిగా, అభవత్ = ఉండెను. సః అపి = అతడు కూడ, త్వయా = నీచేత, శలభః = మిడత, అగ్నినా యథా = అగ్నిచేత వలె, వినిర్దగ్ధః = కాల్చివేయబడినాడు.

తా. రామా! ఈ విధముగ వాలి బలము చాల గొప్పదిగా, సాటి లేనిదిగా ఉండెను. అతనిని కూడా నీవు మిడతను అగ్ని మాడ్చివేసినట్లు మాడ్చివేసినావు. 46

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
ముప్పదినాల్గవ సర్గ సమాప్తము.

అథ పఞ్చత్రింశః సర్గః

[రావణుడు ప్రశ్నించగా అగస్త్యుడు హనుమంతుని జన్మపరాక్రమాదులను వర్ణించి చెప్పుట].

మూ. అపృచ్ఛత తదా రామో దక్షిణాశాశ్రయం మునిమ్,
ప్రాఞ్జలిర్వినయోపేత ఇదమాహ వచోఽర్థవత్. 1

ప్ర. అ. తదా = అప్పుడు, రామః = రాముడు, దక్షిణాశాశ్రయమ్ = దక్షిణ దిక్కు ఆశ్రయముగా గల, మునిమ్ = మునిని, అపృచ్ఛత్ = అడిగెను. ప్రాఞ్జలిః = కట్టబడిన దోసిలికలవాడై, వినయోపేతః = వినయముతో కూడినవాడై, అర్థవత్ = అర్థము గల, ఇదం వచః = ఈ వచనమును, ఆహ = పలికెను.

తా. అప్పుడు రాముడు అగస్త్యుణ్ణి ప్రశ్నించెను. వినయవంతుడై అంజలి ఘటించి అర్థయుక్తమైన వచనమును ఇట్లు పలికెను. 1

మూ. అతులం బలమేతద్వై వాలినో రావణస్య చ,
న త్వేతాభ్యాం హనుమతా సమం త్వితి మతిర్మమ. 2

ప్ర. అ. వాలినః = వాలియొక్క, రావణస్య చ = రావణునియొక్క, ఏతత్ = ఈ, బలమ్ = బలము, అతులమ్ = సాటి లేనిది. తు = కాని, ఏతాభ్యామ్ = వీరిద్దరియొక్క బలము, హనుమతా = హనుమంతునితో, న సమమ్ = సమానమైనది కాదు, ఇతి = అని, మమ = నాయొక్క, మతిః = బుద్ధి.

తా. వాలి బలము, రావణుని బలము సాటిలేనిదే. కాని వీళ్ళిద్దరి బలమూ హనుమంతుని బలముతో సమానము కాదని నా అభిప్రాయము. 2

మూ. శౌర్యం దాక్ష్యం బలం ధైర్యం ప్రాజ్ఞతా నయసాధనమ్,
విక్రమశ్చ ప్రభావశ్చ హనూమతి కృతాలయాః. 3

ప్ర. అ. శౌర్యమ్ = శూరత్వము, దాక్ష్యమ్ = మంచితనము, బలమ్ = బలము, ధైర్యమ్ = ధైర్యము, ప్రాజ్ఞతా = బుద్ధి, నయసాధనమ్ = నీతికార్యమును సాధించుట, విక్రమః చ = పరాక్రమము, ప్రభావః చ = ప్రభావము, హనూమతి = హనుమంతునియందు, కృతాలయాః = చేయబడిన నివాసము గలవి.

తా. శౌర్యము, మంచిదనము (లేదా సామర్థ్యము), బలము, ధైర్యము, బుద్ధి, నీతి, యుక్తమైన కార్యమును సాధించుట, పరాక్రమము, ప్రభావము-ఇవన్నీ హనుమంతుణ్ణి ఆశ్రయించుకొని ఉన్నవి. 3

మూ. దృష్ట్వైవ సాగరం వీక్ష్య సీదన్తీం కపివాహినీమ్,
సమాశ్వాస్య మహాబాహుర్యోజనానాం శతం ప్లుతః. 4

ప్ర. అ. మహాబాహుః = గొప్ప బాహువులు గల హనుమంతుడు, సాగరమ్ = సముద్రమును, దృష్ట్వా ఏవ = చూచియే, సీదన్తీమ్ = దిగులుచెందుతున్న, కపివాహినీమ్ = వానర సేనను, వీక్ష్య = చూచి, సమాశ్వాస్య = ఓదార్చి, యోజనానామ్ = యోజనములయొక్క, శతమ్ = శతమును, ప్లుతః = దాటినాడు.

తా. మహాబాహువైన ఇతడు సముద్రమును చూడగానే దిగులు చెందిన వానర సేనను చూచి, ఓదార్చి, వంద యోజనముల దూరము దాటినాడు. 4

మూ. ధర్షయిత్వా పురీం లఙ్కాం రావణాన్తఃపురం తదా,
దృష్ట్వా సంభాషితా చాపి సీతా హ్యాశ్వాసితా తథా. 5

ప్ర. అ. లఙ్కాం పురీమ్ = లంకానగరమును, ధర్షయిత్వా = ఎదిరించి, తదా = అప్పుడు, రావణాన్తఃపురమ్ = రావణుని అంతఃపురమును, దృష్ట్వా = చూచి, సీతా = సీత, సంభాషితా = మాటలాడబడినది. తథా = మరియు, ఆశ్వాసితా హి = ఓదార్చబడినది కదా.

తా. అప్పు డితడు లంకను ఎదిరించి, అంతఃపురమును చూచి, సీతతో మాటలాడి ఆమెను ఓదార్చినాడు. 5

మూ. సేనాగ్రగా మన్త్రిసుతాః కింకరా రావణాత్మజః,
ఏతే హనుమతా తత్ర ఏకేన వినిపాతితాః. 6

ప్ర. అ. సేనాగ్రగాః = సేనకు ముందు నడచివచ్చిన, మన్త్రిసుతాః = మంత్రుల కుమారులు, కింకరాః=కింకరులు, రావణాత్మజః = రావణుని కుమారుడైన అక్షుడు, ఏతే = వీరు, తత్ర = అక్కడ, ఏకేన = ఒక్క, హనుమతా = హనుమంతునిచేత, వినిపాతితాః = పడగొట్టబడినారు.

తా. అక్కడ ఒక్క హనుమంతుడు సేనానాయకులైన మంత్రికుమారులను, కింకరులను, అక్షకుమారుని చంపినాడు. 6

మూ. భూయో బన్ధాద్విముక్తేన భాషయిత్వా దశాననమ్,
లఙ్కా భస్మీకృతా యేన పావకేనేవ మేదినీ. 7

ప్ర. అ. భూయః = మరల, బన్ధాత్ = బంధమునుండి, విముక్తేన = విడవబడిన, యేన = ఎవనిచేత, దశాననమ్ = రావణునిగూర్చి, అభాష్య = పలికి, మేదినీ = భూమి, పావకేనేవ = అగ్నిచేత వలె, లఙ్కా = లంక, భస్మీకృతా = భస్మముచేయబడినదో.

తా. బంధమునుండి విముక్తుడై ఇతడు మరల రావణునితో మాటలాడి, అగ్ని భూమిని భస్మము చేసినట్లు లంకను భస్మముచేసెను. 7

మూ. న కాలస్య న శక్రస్య న విష్ణోర్విత్తపస్య చ,
కర్మాణి తాని శ్రూయన్తే యాని యుద్ధే హనూమతః. 8

ప్ర. అ. యుద్ధే = యుద్ధమునందు, హనూమతః=హనుమంతునియొక్క, యాని = ఏ, కర్మాణి = పనులు, శ్రూయన్తే = వినబడుచున్నవో, తాని = అవి, కాలస్య=యమునివి, న=వినబడుటలేదు. శక్రస్య = ఇంద్రునివి, న=వినబడుటలేదు. విష్ణోః=విష్ణువుయొక్క కర్మలు, న = వినబడుటలేదు. విత్తపస్య చ=కుబేరునివి మాద, న = వినబడుటలేదు.

తా. యుద్ధములో హనుమంతుడు ఎట్టి పనులు చేసెనో అట్టి పనులు యముడు గాని, ఇంద్రుడు గాని, విష్ణువు గాని, కుబేరుడు కాని చేసినట్లు వినబడుటలేదు. 8

మూ. ఏతస్య బాహువీర్యేణ లఙ్కా సీతా చ లక్ష్మణః,
ప్రాప్తా మయా జయశ్చైవ రాజ్యం మిత్రాణి బాన్ధవాః. 9

ప్ర. అ. ఏతస్య=ఇతనియొక్క, బాహువీర్యేణ=బాహుపరాక్రమముచేత, లఙ్కా = లంక, సీతా = సీత, లక్ష్మణః చ = లక్ష్మణుడు, జయశ్చ ఏవ = జయమూ, రాజ్యమ్ = రాజ్యము, మిత్రాణి = మిత్రులు, బాన్ధవాః = బంధువులూ, మయా = నాచేత, ప్రాప్తాః = పొందబడినారు.

తా. ఈతని బాహుబలముచేతనే నేను లంకను, సీతను, లక్ష్మణుణ్ణి, జయమును, రాజ్యమును, మిత్రులను, బంధువులను పొందగల్గితిని. 9

మూ. హనూమాన్యది మే న స్యాద్వానరాధిపతేః సఖా,
ప్రవృత్తిమపి కో వేత్తుం జానక్యాః శక్తిమాన్ భవేత్. 10

ప్ర. అ. వానరాధిపతేః = వానరరాజుయొక్క, సఖా = మిత్రుడైన, హనుమాన్ = హనుమంతుడు, మే = నాకు, న స్యాద్యది = లేకున్నచో, జానక్యాః = సీతయొక్క, ప్రవృత్తిమ్ అపి = జాడనైనా, వేత్తుమ్ = తెలుసుకొనుటకు, కః = ఎవడు, శక్తిమాన్ = శక్తిమంతుడు, భవేత్ = అగును ?

తా. సుగ్రీవుని మిత్రుడైన హనుమంతుడే నాకు లేకున్నచో సీత జాడనైనా తెలిసికొనగలిగినవాడు ఎవడైనా ఉన్నాడా ? 10

మూ. కిమర్థం వాలీ చైతేన సుగ్రీవప్రియకామ్యయా,
తదా వైరే సముత్పన్నే న దగ్ధో వీరుధో యథా. 11

ప్ర. అ తదా = అప్పుడు, వైరే = వైరము, సముత్పన్నే = పుట్టినదగుచుండగా, సుగ్రీవప్రియకామ్యయా=సుగ్రీవుని ప్రియమునందు కోరికచేత, ఏతేన = ఈతనిచేత, వాలీ=వాలి, వీరుధః యథా = మొక్కలు వలె, కిమర్థమ్ = ఎందువలన, న దగ్ధః=కాల్చబడలేదు ?

తా. అప్పుడు వాలిసుగ్రీవులకు వైరము ఏర్పడినప్పుడు ఈ హనుమంతుడు సుగ్రీవునకు ప్రియము చేయవలెనను కోరికతో వాలిని, మొక్కను వలె, ఎందుకు కాల్చివేయలేదు ? 11

మూ. న హి వేదితవాన్మన్యే హనుమానాత్మనో బలమ్,
యద్దృష్టవాన్ జీవితేష్టం క్లిశ్యన్తం వానరాధిపమ్. 12

ప్ర. అ. హనుమాన్ = హనుమంతుడు, ఆత్మనః = తనయొక్క, బలమ్ = బలమును, న హి వేదితవాన్ = తెలిసికొనలేదు అని, మన్యే = తలచుచున్నాను. యత్ = ఎందువలన, ఆత్మనః = తనకు, జీవితేష్టమ్ = జీవితము వలె ఇష్టుడైన, వానరాధిపమ్ = సుగ్రీవుణ్ణి, క్లిశ్యన్తమ్ = బాధపడుచుండగా, దృష్టవాన్ = చూచినాడో.

తా. హనుమంతుడు తన జీవితముతో సమానముగా ఇష్టుడైన సుగ్రీవుడు బాధపడుచుండగా చూచుచు ఊరుకొన్నాడనగా-అతనికి తన బలము ఎంతటిదో తెలియలేదు అని నేను అనుకొనుచున్నాను. 12

మూ. ఏతన్మే భగవన్సర్వం హనూమతి మహామునే,
విస్తరేణ యథాతత్త్వం కథయామరపూజిత. 13

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! అమరపూజిత = దేవతలచేత పూజించబడినవాడా! మహామునే = మహామునీ! హనూమతి = హనుమంతునివిషయమునందు, ఏతత్ = దీనిని, సర్వమ్ = సమస్తమును, యథాతత్త్వమ్ = యథార్థముగా, విస్తరేణ = విస్తారముగా, మే = నాకు, కథయ = చెప్పుము.

తా. పూజ్యుడా! దేవతలచేత పూజింపబడువాడా! మహామునీ! హనుమంతునికి సంబంధించిన ఈ విషయము నంతమూ నాకు సవిస్తరముగా, ఉన్నది ఉన్నట్లు చెప్పుము. 13

మూ. రాఘవస్య వచః శ్రుత్వా హేతుయుక్తమృషిస్తతః,
హనూమతః సమక్షం తమిదం వచన మబ్రవీత్. 14

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఋషిః = ఋషి, రాఘవస్య = రాముని యొక్క, హేతుయుక్తమ్ = హేతువులతో కూడిన, వచః = వచనమును, శ్రుత్వా = విని, హనూమతః = హనుమంతునియొక్క, సమక్షమ్ = ఎదుటనే, తమ్ = ఆ రాముణ్ణి గూర్చి, ఇదమ్ = ఈ, వచనమ్ = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. అప్పుడు అగస్త్యుడు హేతుయుక్తమైన రాముని మాట విని హనుమంతుని ఎదుటనే ఇట్లు పలికెను. 14

మూ. సత్యమేతద్రఘుశ్రేష్ఠ యద్బ్రవీషి హనూమతి,
న బలే విద్యతే తుల్యో న గతౌ న మతౌ పరః 15

ప్ర. అ. రఘుశ్రేష్ఠ = రామా! హనూమతి = హనుమంతుని విషయము నందు, యత్ = ఏ వాక్యమును, బ్రవీషి = పలుకుచున్నావో, ఏతత్ = ఇది, సత్యమ్ = సత్యము. బలే = బలమునందు, తుల్యః = సమానుడైన, పరః = ఇతరుడు, న విద్యతే = లేడు. గతౌ = నడకయందు లేడు. మతౌ = బుద్ధియందు, న = లేడు.

తా. రామా! హనుమంతుని విషయమునందు నీవు చెప్పినది నిజమే. బలమునందు గాని, బుద్ధియందు గాని ఇతనితో సమానుడు మరొకడు లేడు. 15

మూ. అమోఘశాపైః శాపస్తు దత్తోఽస్య మునిభిః పురా,
న వేత్తా హి బలం సర్వం బలీ సన్నరిమర్దన. 16

ప్ర. అ. అరిమర్దన = శత్రుసంహారకుడా! పురా = పూర్వము, అమోఘశాపైః = వ్యర్థము కాని శాపము గల, మునిభిః = మునులచేత, అస్య = ఇతనికి, శాపః తు = శాపము, దత్తః = ఇవ్వబడినది. బలీ సన్ = బలవంతుడై ఉండి, సర్వమ్ = సమస్తమైన, బలమ్ = బలమును, న వేత్తా హి = ఎరుగడు కదా.

తా. శత్రుసంహారకుడవైన రామా! పూర్వము హనుమంతునకు వ్యర్థము కాని శాపము గల మునులు శాప మిచ్చిరి. ఆ శాపముచేత ఇతడు బలవంతుడే అయినను తనకు ఎంత బలమున్నదో ఎరుగడు. 16

మూ. బాల్యేఽప్యేతేన యత్కర్మ కృతం రామ మహాబల,
తన్న వర్ణయితుం శక్యమితి బాల్యతయాస్యతే. 17

ప్ర. అ. మహాబల = గొప్ప బలము గలవాడా! రామ = రామా! ఏతేన = వీనిచేత, బాల్యేఽపి = బాల్యమునందు కూడ, యత్ = ఏ, కర్మ = పని, కృతమ్ = చేయబడినదో, తత్ = అది, వర్ణయితుమ్ = వర్ణించుటకు, న శక్యమ్ = శక్యము కాదు. బాల్యతయా = బాల్యముతో (అజ్ఞానముతో), ఇతి = ఇట్లు, ఆస్యతే = ఉండుట.

తా. గొప్ప బలము గల రామా! బాల్యములో కూడ ఇతడు ఎంతటి పని చేసినాడో అది వర్ణింప శక్యము కాదు. ఇతడు అజ్ఞానముచేతనే ఈ విధముగా కూర్చొని ఉన్నాడు. 17

మూ. యది వాస్తి త్వభిప్రాయః సంశ్రోతుం తవ రాఘవ,
సమాధాయ మతిం రామ నిశామయ వదామ్యహమ్. 18

ప్ర. అ. రాఘవ = రఘువంశమునందు పుట్టినవాడా! రామ = రామా! సంశ్రోతుమ్ = వినుటకు, తవ = నీకు, అభిప్రాయః = అభిప్రాయము, అస్తి యది వా = ఉన్నచో, మతిమ్ = బుద్ధిని, సమాధాయ = సావధానము చేసికొని, నిశామయ = వినుము. అహమ్ = నేను, వదామి = చెప్పుచున్నాను.

తా. రామా! నీకు వినవలె నని కోరిక ఉన్నచో సావధానచిత్తముతో వినుము; చెప్పెదను. 18

మూ. సూర్యదత్తవరస్వర్ణః సుమేరుర్నామ పర్వతః,
యత్ర రాజ్యం ప్రశాస్త్యస్య కేసరీ నామ వై పితా. 19

ప్ర. అ. సూర్యదత్తవరస్వర్ణః = సూర్యునిచేత ఇవ్వబడిన వరముచేత బంగారువికారమైన, సుమేరుః నామ = సుమేరువు అను, పర్వతః = పర్వత మున్నది, యత్ర = ఎక్కడ, అస్య = ఈతనియొక్క, పితా = తండ్రియైన, కేసరీ నామ = కేసరి అను నతడు, రాజ్యమ్ = రాజ్యమును, ప్రశాస్తి = పాలించు చున్నాడో!

తా. సూర్యు డిచ్చిన వరముచేత సువర్ణమయమైన మేరు పర్వత మున్నది. అక్కడ ఈ హనుమంతుని తండ్రియైన కేసరి రాజ్యమును పాలించుచున్నాడు. 19

మూ. తస్య భార్యా బభూవేష్టా హ్యఞ్జనేతి పరిశ్రుతా,
జనయామాస తస్యాం వై వాయురాత్మజముత్తమమ్. 20

ప్ర. అ. అఞ్జనా ఇతి = అంజన అని, పరిశ్రుతా = ప్రసిద్ధురాలైన, తస్య = అతనియొక్క, ఇష్టా = ఇష్టురాలైన, భార్యా = భార్య, బభూవ = ఉండెను. తస్యామ్ = ఆమెయందు, వాయుః = వాయువు, ఉత్తమమ్ = ఉత్తముడైన, ఆత్మజమ్ = కుమారుణ్ణి, జనయామాస వై = పుట్టించెను.

తా. అతనికి అంజన అను పేరుతో ప్రసిద్ధి చెందిన ఇష్టురాలైన భార్య ఉండెను. ఆమెయందు వాయుదేవుడు ఉత్తముడైన పుత్రుణ్ణి పుట్టించెను. 20

మూ. కాలికూకనిభాభాసం ప్రాసూతేమం తదాఞ్జనా,
ఫలాన్యాహర్తుకామా వై నిష్క్రాన్తా గహనే వనే. 21

ప్ర. అ. తదా = అప్పుడు, అఞ్జనా = అంజన, కాలికూకనిభాభాసమ్ = వరిముల్లు వంటి కాంతి గల, ఇమమ్ = ఇతనిని, ప్రాసూత = కనెను. వరా = శ్రేష్ఠురాలైన ఆమె, ఫలాని = ఫలములను, ఆహర్తుకామా = తీసికొనిరావలె నను కోరికగలదై, గహనే = దట్టమైన, వనే = వనమునందు, నిష్క్రాన్తా = బయలు దేరి వెళ్ళినది.

తా. అంజన వరిగింజముల్లు వంటి పచ్చని శరీరకాంతి గల ఈ హను మంతుణ్ణి కనెను. ఉత్తమురాలైన ఆమె పండ్లు తీసికొనివచ్చుటకై దట్టమైన అడ విలో ప్రవేశించెను. 21

మూ. ఏష మాతుర్వియోగాచ్చ క్షుధయా చ భృశార్దితః,
రురోద శిశురత్యర్థం శిశుః శరవణే యథా. 22

ప్ర. అ. మాతుః = తల్లియొక్క, వియోగాత్ చ = వియోగమువలననూ, క్షుధయా చ = ఆకలిచేతనూ, భృశార్దితః = మిక్కిలి పీడించబడిన, ఏషః = ఈ, శిశుః = శిశువు, శరవణే = రెల్లుగడ్డి వనమునందు, శిశుః యథా = శిశువైన కుమారస్వామి వలె, రురోద = ఏడ్చెను.

తా. తల్లి దగ్గర లేకపోవుటచేతను, ఆకలిచేతను మిక్కిలి పీడింపబడిన శిశువుగా ఉన్న ఈ హనుమంతుడు శరవణములో శిశువుగా ఉన్న కుమారస్వామి వలె ఏడ్చెను. 22

మూ. తదోద్యన్తం వివస్వన్తం జపాపుష్పోత్కరోపమమ్,
దదర్శ ఫలలోభాచ్చ హ్యుత్పపాత రవిం ప్రతి. 23

ప్ర. అ. తదా = అప్పుడు, ఉద్యన్తమ్ = ఉదయించుచున్న, జపాపుష్పో త్కరోపమ్ = జపాపుష్పముల సముదాయముతో సమానుడైన, వివస్వన్తమ్ = సూర్యుణ్ణి, దదర్శ = చూచెను. ఫలలోభాత్ = ఫలమునందు లోభమువలన, రవిం ప్రతి = సూర్యుణ్ణి గూర్చి, ఉత్పపాత = ఎగిరెను.

తా. అప్పుడు ఆ శిశువునకు జపాపుష్పముల ప్రోగువలె ఉన్న ఉదయించుచున్న సూర్యుడు కనబడెను. అది పల మనుకొని దానియందు ఆసక్తి చేత ఆ శిశువు సూర్యుని దగ్గరకు ఎగిరెను. 23

మూ. బాలార్కాభిముఖో బాలో బాలార్క ఇవ మూర్తిమాన్,
గ్రహీతుకామో బాలార్కం ప్లవతేఽమ్బరమధ్యగః. 24

ప్ర. అ. మూర్తిమాన్ = మూర్తిగల, బాలార్కః ఇవ = బాలసూర్యుడు వలె ఉన్న, బాలః = ఆ బాలుడు, బాలార్కమ్ = బాలార్కుణ్ణి, గ్రహీతుకామః = గ్రహించుటకు కోరికగలవాడై, అమ్బరమధ్యగః = ఆకాశమధ్యమును పొందినవాడై, బాలార్కాభిముఖః = బాలసూర్యునికి అభిముఖుడై, ప్లవతే = ఎగురుచున్నాడు.

తా. రెండవ బాలసూర్యుడు వలె ఉన్న ఆ బాలుడు బాలార్కుణ్ణి గ్రహించు కోరికతో, బాలార్కునికి అభిముఖుడై ఆకాశమధ్యమునందు ఎగిరెను. 24

మూ. ఏతస్మిన్ ప్లవమానే తు శిశుభావే హనూమతి,
దేవదానవయక్షాణాం విస్మయః సుమహానభూత్. 25

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, హనూమతి = హనుమంతుడు, శిశుభావే = శైశవమునందు, ప్లవమానే = ఎగురుచుండగా, దేవదానవయక్షాణామ్ = దేవతలకు, దానవులకు, యక్షులకు, సుమహాన్ = చాల గొప్పదైన, విస్మయః = ఆశ్చర్యము, అభూత్ = అయెను.

తా. హనుమంతుడు ఈవిధముగా శైశవమునందు ఎగురుచుండగా దేవ-దానవ-యక్షులు చాల ఆశ్చర్యము చెందిరి. 25

మూ. నాప్యేవం వేగవాన్ వాయుర్గరుడో న మనస్తథా,
యథాయం వాయుపుత్రస్తు క్రమతేఽమ్బరముత్తమమ్.

ప్ర. అ. అయమ్ = ఈ, వాయుపుత్రః తు = వాయుపుత్రుడు, ఉత్తమమ్ = చాల ఎత్తైన, అమ్బరమ్ = ఆకాశమును, యథా = ఎట్లు, క్రమతే = ఆక్రమించుచున్నాడో, ఏవమ్ = ఇట్లు, వాయుః అపి = వాయువు కూడ, వేగవాన్ = వేగముగలవాడు, న = కాడు. గరుడః = గరుత్మంతుడు, న = కాడు. తథా = మరియు, మనః = మనస్సు, న = కాదు.

తా. "అత్యున్నతమైన ఈ ఆకాశముమీదికి ఈ వాయుపుత్రుడు ఎంత వేగముగా ఎగురుచున్నాడో అంత వేగము వాయువునకు గాని, గరుత్మంతునికి గాని మనస్సుకు గాని లేదు". 26

మూ. యది తావచ్ఛిశోరస్య ఈదృశో గతివిక్రమః,
యౌవనం బలమాసాద్య కథంవేగో భవిష్యతి. 27

ప్ర. అ. శిశోః = శిశువైన, అస్య = ఇతనియొక్క, గతివిక్రమః = గమన పరాక్రమము, ఈదృశః యది తావత్ = ఇట్టిదైనచో, యౌవనమ్ = యౌవనమును, బలమ్ = బలమును, అసాద్య = పొంది, కథంవేగః = ఎట్టి వేగము గలవాడు, భవిష్యతి = కాగలడో।

తా. "శిశువై ఉండగానే ఇతనికి ఇంతగమనవేగమున్నచో యౌవనమును, బలమును పొందిన పిమ్మట ఇతని వేగము ఎంత ఉండునో!" 27

మూ. తమనుప్లవతే వాయుః ప్లవన్తం పుత్రమాత్మనః,
సూర్యదాహభయాద్రక్షంస్తుషారచయశీతలః. 28

ప్ర. అ. తతః = అటుపిమ్మట, వాయుః = వాయువు, సూర్యదాహ భయాత్ = సూర్యునివలన దాహము (కాలిపోవుట)కలుగు నను భయమువలన, రక్షన్ = రక్షించుచు, తుషారభయశీతలః = మంచు సముదాయము వలె చల్లనై, ప్లవన్తమ్ = ఎగురుచున్న, తమ్ = ఆ, ఆత్మనఃపుత్రమ్ = తన పుత్రుణ్ణి, అనుప్లవతే = అనుసరించి ఎగురుచున్నాడు.

తా. అప్పుడు వాయువు ఎగురుచున్న తన పుత్రుణ్ణి సూర్యునివలన కలుగు దాహభయమునుండి రక్షించుచు, మంచుగడ్డ వలె చల్లగా అయి, ఎగురుచున్న అతని వెనుకనే ఎగిరి వెళ్ళుచుండెను. 28

మూ. బహుయోజనసాహస్రం క్రామన్నేవ గతోఽమ్బరమ్,
పితుర్బలాచ్చ బాల్యాచ్చ భాస్కరాభ్యాశమాగతః. 29

ప్ర. అ. పితుః = తండ్రియొక్క, బలాచ్చ = బలమువలన, బాల్యాచ్చ = బాల్యమువలన, బహుయోజనసాహస్రమ్ = అనేక యోజనముల సహస్రములను,

క్రామన్ = ఆక్రమించుచు, అమ్బరమ్ = ఆకాశమును, గతః = పొందినవాడై, భాస్కరాభ్యాశమ్ = సూర్యుని సమీపమును, ఆగతః = పొందినాడు.

తా. ఆ శిశువు తండ్రియైన వాయువు బలమువలనా, బాల్యమువలనా, కొన్నివేల యోజనముల దూరమును ఆక్రమించుచు, ఆకాశములో సూర్యునిదగ్గరకు వెళ్లెను. 29

మూ. శిశురేష త్వదోషజ్ఞ ఇతి మత్వా దివాకరః,
కార్యం చాస్మిన్ సమాయత్తమిత్యేవం న దదాహ సః.

ప్ర. అ. శిశుః = శిశువైన, ఏషః = ఇతడు, అదోషజ్ఞః = దోషములు తెలియనివాడు, ఇతి = అనీ, అస్మిన్ = దీనియందు, కార్యం చ = దేవకార్యము కూడ, సమాయత్తమ్ = ఆధారపడి ఉన్నది, ఇత్యేవమ్ = ఇట్లు, మత్వా = తలచి, సః దివాకరః = ఆ సూర్యుడు, న దదాహ = కాల్చలేదు.

తా. "ఇతడు శిశువు; తప్పొప్పులు తెలియనివాడు. ఇతడు దేవతాకార్యము కూడ చేయవలసి ఉన్నది". అని ఆలోచించి సూర్యుడు అతనిని కాల్చలేదు. 30

మూ. యమేవ దివసం హ్యేష గ్రహీతుం భాస్కరం ప్లుతః,
తమేవ దివసం రాహుర్జిఘృక్షతి దివాకరమ్. 31

ప్ర. అ. ఏషః = ఇతడు, యమ్ ఏవ = ఏ, దివసమ్ = దివసమును, భాస్కరమ్ = సూర్యుణ్ణి, గ్రహీతుమ్ = గ్రహించుటకు, ప్లుతః = ఎగిరినాడో, తం దివసమ్ ఏవ = ఆ రోజునే, రాహుః = రాహువు, దివాకరమ్ = సూర్యుణ్ణి, జిఘృక్షతి = గ్రహింప దలచుచున్నాడు.

తా. ఈ హనుమంతుడు సూర్యునిదగ్గరకు ఎగిరిన దివసమునందే రాహువు సూర్యుణ్ణి పట్టుకొనుటకు వచ్చెను. 31

మూ. అనేన చ పరామృష్టో రాహుః సూర్యరథోపరి,
అపక్రాన్తస్తతస్త్రస్తో రాహుశ్చన్ద్రార్కమర్దనః. 32

ప్ర. అ. సూర్యరథోపరి = సూర్యుని రథము పైభాగమునందు, రాహుః = రాహువు, అనేన = ఇతనిచేత, పరామృష్టః = స్పృశించబడెను. చన్ద్రార్క

మర్దనః = చంద్రసూర్యులను మర్దించు, రాహుః = రాహువు. తతః = వానివలన, త్రస్తః = భయపడినవాడై, అపక్రాన్తః = దూరముగా తొలగిపోయినాడు.

తా. సూర్యుని రథముమీద ఉన్న ఆ రాహువును హనుమంతుడు స్పృశించగానే సూర్యచంద్రులను మ్రింగే ఆ రాహువు కూడ భయపడి పారిపోయెను. 32

మూ. ఇన్ద్రస్య భవనం గత్వా సరోషః సింహికాసుతః,
అబ్రవీద్భ్రుకుటిం కృత్వా దేవం దేవగణైర్వృతమ్. 33

ప్ర. అ. సింహికాసుతః = రాహువు, సరోషః = కోపముతో కూడినవాడై, ఇన్ద్రస్య = ఇంద్రునియొక్క, భవనమ్ = భవనమును గూర్చి, గత్వా = వెళ్ళి, భ్రుకుటిమ్ = భ్రుకుటిని (కనుబొమ్మల విరుపును), కృత్వా = చేసి, దేవగణైః = దేవతాగణములతో, వృతమ్ = కూడిన, దేవమ్ = ఆ దేవుణ్ణిగూర్చి, అబ్రవీత్ = పలికెను.

తా. ఆ రాహువు కోపముతో ఇంద్రభవనమునకు వెళ్ళి కనుబొమ్మలు విరచి దేవతాగణములతో కూడిన ఆ ఇంద్రునితో ఇట్లనెను. 33

మూ. బుభుక్షాపనయం దత్త్వా చన్ద్రార్కౌ మమ వాసవ,
కిమిదం తత్త్వయా దత్తమన్యస్య బలవృత్రహన్. 34

ప్ర. అ. బలవృత్రహన్ = బల-వృత్రాసురుల సంహారకుడవైన, వాసవ = ఇంద్రా! మమ = నాకు, చన్ద్రార్కౌ = చంద్రసూర్యులను, బుభుక్షాపనయమ్ = ఆకలిని తీర్చే అన్నముగా, దత్త్వా = ఇచ్చి, తత్ = అది, త్వయా = నీచేత, అన్యస్య = మరొకనికి, దత్తమ్ = ఇవ్వబడినది; ఇదమ్ = ఇది, కిమ్ = ఏమి?

తా. బలవృత్రాసురసంహారకుడవైన ఇంద్రా! చంద్రసూర్యులను నాకు ఆహారముగా ఇచ్చిన నీవే ఆ ఆహారమును మరొకనికి కూడా ఇచ్చినావు! ఇది ఏమిటి? 34

మూ. అద్యాహం పర్వకాలే తు జిఘృక్షుః సూర్యమాగతః,
అథాన్యో రాహురాసాద్య జగ్రాహ సహసా రవిమ్. 35

ప్ర. అ. అద్య = నేడు, పర్వకాలే = పర్వకాలమునందు, అహమ్ = నేను,

సూర్యమ్=సూర్యుణ్ణి, జిఘృక్షుః=పట్టుకొన దలచినవాడనై, ఆగతః=వచ్చినాను. అథ = అనంతరము, అన్యః = మరియొక, రాహుః = రాహువు, ఆసాద్య = సమీపించి, సహసా = వెంటనే, రవిమ్ = సూర్యుణ్ణి, జగ్రాహ = పట్టుకొనెను.

తా. ఈ రోజున పర్వకాలమునందు సూర్యుణ్ణి పట్టుకొనుటకై నేను వచ్చుసరికి మరొకడు సూర్యుణ్ణి పట్టుకొనినాడు. 35

మూ. స రాహోర్వచనం శ్రుత్వా వాసవః సంభ్రమాన్వితః,
ఉత్పపాతాసనం హిత్వా ఉద్వహన్ కాఞ్చనీం స్రజమ్.

ప్ర. అ. సః వాసవః = ఆ ఇంద్రుడు. రాహోః = రాహువుయొక్క, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, సంభ్రమాన్వితః=తొందరతో కూడినవాడై, కాఞ్చనీమ్=బంగారు, స్రజమ్ = మాలికను. ఉద్వహన్ = ధరించి, ఆసనమ్ = ఆసనమును, హిత్వా = విడచి, ఉత్పపాత = లేచెను.

తా. ఆ మాటలు విని ఇంద్రుడు తొందరపడుచు, బంగారుమాల ధరించి ఆసనమును విడచి వెంటనే లేచెను. 36

మూ. తతః కైలాసకూటాభం చతుర్దన్తం మదస్రవమ్,
శృఙ్గారధారిణం ప్రాంశుం స్వర్ణఘణ్టాట్టహాసినమ్. 37
ఇన్ద్రః కరీన్ద్రమారుహ్య రాహుం కృత్వా పురఃసరమ్,
ప్రాయాద్యత్రాభవత్సూర్యః సహానేన హనూమతా. 38

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఇన్ద్రః = ఇంద్రుడు, కైలాసకూటాభమ్= కైలాసశిఖరము వంటి కాంతిగల, చతుర్దన్తమ్ = నాలుగు దంతములు గల. మదస్రవమ్ = మదమును స్రవించుచున్న, శృఙ్గారధారిణమ్=అలంకారమును ధరించుచున్న, ప్రాంశుమ్ = ఎత్తైన, స్వర్ణఘణ్టాట్టహాసినమ్ = బంగారు ఘంటల అట్టహాసము (పెద్దనవ్వు) గల, కరీన్ద్రమ్ = గజేంద్రమును, ఆరుహ్య = ఎక్కి, రాహుమ్ = రాహువును, పురఃసరమ్=ముందు నడచువానినిగా, కృత్వా=చేసి, సూర్యః=సూర్యుడు, అనేన= ఈ, హనూమతా సహ=హనుమంతునితో కూడ, యత్ర=ఎక్కడ, అభవత్ = ఉండెనో అక్కడికి, ప్రాయాత్= వెళ్లెను.

తా. పిమ్మట ఇంద్రుడు కైలాసశిఖరము వంటి కాంతి గల నాలుగు

దంతములు గల మదమును స్రవించుచున్న, అలంకారములు ధరించిన ఎత్తైన బంగారు ఘంటల నాదముతో అట్టహాసము చేయుచున్నట్లున్న, గజేంద్రము నెక్కి రాహువును ముందు ఉంచుకొని సూర్యుడూ, హనుమంతుడూ ఉన్నచోటికి వెళ్లెను. 37, 38

మూ. అథాతిరథ సేనాగాద్రాహురుత్సృజ్య వాసవమ్,
అనేన చ స వై దృష్టః ప్రధావన్ శైలకూటవత్. 39

ప్ర. అ. అథ = అటుపిమ్మట, రాహుః = రాహువు, వాసవమ్ = ఇంద్రుణ్ణి, ఉత్సృజ్య = విడచి, అతిరథ సేన = చాలా వేగముతో, అగాత్ = వెళ్ళెను. అనేన = ఈ హనుమంతునిచేత, ప్రధావన్ = పరుగెత్తుచున్న, శైలకూటవత్ = పర్వతశిఖరమువలె ఉన్న, సః = అతడు, దృష్టః వై = చూడబడెను.

తా. అప్పుడు రాహువు ఇంద్రుని దాటి అతిశీఘ్రముగా ముందుకు వెళ్లెను. పర్వతశిఖరమువలె ఉన్న, పరుగెత్తుచున్న ఆ రాహువును హనుమంతుడు చూచెను. 39

మూ. తతః సూర్యం సముత్సృజ్య రాహుం ఫలమవేక్ష్య చ,
ఉత్పపాత పునర్వ్యోమ గ్రహీతుం సింహికాసుతమ్. 40

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సూర్యమ్ = సూర్యుణ్ణి, సముత్సృజ్య = విడచి, రాహుమ్ = రాహువును, ఫలమ్ = ఫలమునుగా, అవేక్ష్య చ = చూచి, సింహికాసుతమ్ = రాహువును, గ్రహీతుమ్ = గ్రహించుటకు, పునః = మరల, వ్యోమ = ఆకాశమును గూర్చి, ఉత్పపాత = ఎగిరెను.

తా. అప్పుడు హనుమంతుడు సూర్యుణ్ణి విడిచివేసి, రాహువును చూచి ఫలము అనుకొని ఆ రాహువును పట్టుకొనుటకై మరల ఆకాశముమీద ఎగిరెను.

మూ. ఉత్సృజ్యార్కమిమం రామ ప్రధావన్తం ప్లవంగమమ్,
అవేక్ష్యైవం పరావృత్తో ముఖశేషః పరాఙ్ముఖః. 41

ప్ర. అ. రామ = రామా! అర్కమ్ = సూర్యుణ్ణి, ఉత్సృజ్య = విడచి, ఏవమ్ = ఇట్లు, ప్రధావన్తమ్ = పరుగెత్తివచ్చుచున్న, ఇమమ్ = ఈ, ప్లవంగమమ్ = వానరుణ్ణి, అవేక్ష్య = చూచి, ముఖశేషః = ముఖముమాత్రమే మిగిలినవాడు

(రాహువు), పరాఙ్ముఖః = వెనుకకు ముఖము గలవాడై, పరావృత్తః=వెనుకకు తిరిగినాడు.

తా. సూర్యుణ్ణి విడచి ఆ విధముగా తనమీదికి పరుగెత్తి వచ్చుచున్న హనుమంతుణ్ణి చూచి రాహువు ముఖము వెనుకకు చేసి, వెనుకకు మరలెను. 41

మూ. ఇన్ద్రమాశంసమానస్తు త్రాతారం సింహికాసుతః,
ఇన్ద్ర ఇన్ద్రేతి సంత్రాసాన్ముహుర్ముహురభాషత. 42

ప్ర. అ. సింహికాసుతః = రాహువు, ఇన్ద్రమ్ = ఇంద్రుణ్ణి, త్రాతారమ్= రక్షకుణ్ణిగా, ఆశంసమానః = కోరుచు, సంత్రాసాత్=భయమువలన, ఇన్ద్ర ఇన్ద్ర ఇతి=ఇంద్రా, ఇంద్రా అని, ముహుర్ముహుః=మాటిమాటికి, అభాషత=పలికెను.

తా. రాహువు తనను ఇంద్రుడు రక్షించవలె నని కోరుచు, భయముతో ఇంద్రా! ఇంద్రా! అని మాటిమాటికి అరచెను. 42

మూ. రాహోర్విక్రోశమానస్య ప్రాగేవాలక్షితం స్వరమ్,
శ్రుత్వేన్ద్రోవాచ మా భైషీరహమేనం నిషూదయే. 43

ప్ర. అ. విక్రోశమానస్య = అరచుచున్న, రాహోః = రాహువుయొక్క, ప్రాగేవ = పూర్వమే, ఆలక్షితమ్ = గుర్తించబడిన, స్వరమ్ = స్వరమును, శ్రుత్వా = విని, ఇన్ద్రః=ఇంద్రుడు, మా భైషీః=భయపడకుము. అహమ్=నేను, ఏనమ్ = వీనిని, నిషూదయే = సంహరించెదను అని, ఉవాచ = పలికెను.

తా. రాహువు అరచుచుండగా ఇంద్రుడు పూర్వపరిచితమైన అతని స్వరమును గుర్తించి, "భయపడకుము; నేను ఈతనిని సంహరించెదను" అని పలికెను. 43

మూ. ఐరావతం తతో దృష్ట్వా మహత్తదిదమిత్యపి,
ఫలం మత్వా హస్తిరాజమభిదుద్రావ మారుతిః. 44

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మారుతిః=హనుమంతుడు, ఐరావతమ్= ఐరావతమును, దృష్ట్వా = చూచి, ఇదమపి = ఇది కూడ, మహత్ = గొప్ప, ఫలమ్ = ఫలము, ఇతి = అని, మత్వా = తలచి, హస్తిరాజమ్ = ఆ గజరాజును గూర్చి, అభిదుద్రావ = పరుగెత్తెను.

తా. అప్పుడు హనుమంతుడు ఐరావతమును చూచి, ఇది కూడ ఏదో పెద్ద ఫలము అని అనుకొని దానిమీదికి పరుగెత్తెను. 44

మూ. తథాస్య ధావతో రూపమైరావతజిఘృక్షయా,
ముహూర్తమభవద్ఘోరమిన్ద్రాగ్న్యోరివ భాస్వరమ్. 45

ప్ర. అ. తథా = ఆ విధముగా, ఐరావతజిఘృక్షయా = ఐరావతమును పట్టుకొనవలె నను కోరికతో, ధావతః = పరుగెత్తుచున్న, అస్య = ఈతనియొక్క, రూపమ్ = రూపము, ముహూర్తమ్ = ఆ ముహూర్తమును (మునందు), ఘోరమ్= భయంకరముగాను, ఇన్ద్రాగ్న్యోః ఇవ=ఇంద్రాగ్నులయొక్క వలె, భాస్వరమ్= ప్రకాశించునదిగాను, అభవత్ = అయెను.

తా. ఆ విధముగ ఐరావతమును పట్టుకొనవలె నను ఉద్దేశ్యముతో పరుగెత్తుచున్న ఆ హనుమంతుని రూపము, ఆ ముహూర్తమునందు, భయంకరముగాను, ఇంద్రాగ్నులరూపము వలె తేజోవంతముగాను ఉండెను. 45

మూ. ఏవమాధావమానం తు నాతిక్రుద్ధః శచీపతిః,
హస్తాన్తాదతిముక్తేన కులిశేనాభ్యతాడయత్. 46

ప్ర. అ. నాతిక్రుద్ధః = ఎక్కువగా కోపించని, శచీపతిః = ఇంద్రుడు, ఏవమ్ = ఈ విధముగా, ఆధావమానమ్ = పరుగెత్తుచున్న అతనిని, హస్తాన్తాత్= చేతి చివరి భాగమునుండి, అతిముక్తేన = విడువబడిన, కులిశేన=వజ్రాయుధము చేత, అభ్యతాడయత్ = కొట్టెను.

తా. ఇంద్రుడు ఎక్కువ కోపము లేనివాడై, ఈ విధముగా పరుగెత్తి వచ్చుచున్న ఈతనిని చేతి చివరిభాగముచేత విడచిన వజ్రాయుధముతో కొట్టెను.

మూ. తతో గిరౌ పపాతైష ఇన్ద్రవజ్రాభితాడితః,
పతమానస్య చైతస్య వామో హనురభజ్యత. 47

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఏషః = ఇతడు, ఇన్ద్రవజ్రాభితాడితః = ఇంద్రుని వజ్రముచేత కొట్టబడినవాడై, గిరౌ = పర్వతముమీద. పపాత = పడెను. పతమానస్య = పడుచున్న, ఏతస్య= ఈతనియొక్క, వామః = ఎడమ, హనుః= దౌడ అభజ్యత = విరిగెను.

తా. అప్పుడు ఇతడు ఇంద్రుని వజ్రము దెబ్బకు పర్వతముపీద పడి పోయెను. పడిపోయినప్పుడు ఇతని ఎడమ దౌడ విఱిగెను. 47

మూ. తస్మింస్తు పతితే చాపి వజ్రతాడనవిహ్వలే,
చుక్రోధేన్ద్రాయ పవనః ప్రజానామహితాయ సః. 48

ప్ర. అ. తస్మిన్ = అతడు, వజ్రతాడనవిహ్వలే = వజ్రముచేత కొట్టుట చేత వ్యాకులుడై, పతితే చాపి = పడిపోయినవాడగుచుండగా, సః = ఆ, పవనః = వాయువు, ప్రజానామ్ = ప్రజలయొక్క, అహితాయ = అహితముకొరకు, ఇన్ద్రాయ = ఇంద్రునికొరకు, చుక్రోధ = కోపించెను.

తా. వజ్రము దెబ్బ తగిలి వ్యాకులుడైన హనుమంతుడు పడిపోగానే వాయువు ప్రజలకు కష్టము కలుగు విధముగ ఇంద్రునిమీద కోపించెను. 48

మూ. ప్రచారం స తు సంగృహ్య ప్రజాస్వన్తర్గతః ప్రభుః,
గుహాం ప్రవిష్టః స్వసుతం శిశుమాదాయ మారుతః. 49

ప్ర. అ. ప్రజాసు = ప్రజలలో, అన్తర్గతః = అంతర్గతుడైన, ప్రభుః = సమర్థుడైన, సః మారుతః = ఆ వాయువు, ప్రచారమ్ = సంచారమును, సంగృహ్య = సంగ్రహించి, శిశుమ్ = శిశువైన, స్వసుతమ్ = తన కుమారుణ్ణి, ఆదాయ = గ్రహించి, గుహామ్ = గుహను, ప్రవిష్టః = ప్రవేశించినాడు.

తా. ప్రజలలోపల నివసించు సర్వసమర్థుడైన ఆ వాయువు, తన సంచారమును ఆపివేసి, శిశువైన తన కుమారుణ్ణి తీసికొని ఒక గుహలో ప్రవేశించెను. 49

మూ. విణ్మూత్రాశయమావృత్య ప్రజానాం పరమార్తికృత్,
రురోధ సర్వభూతాని యథా వర్షాణి వాసవః. 50

ప్ర. అ. ప్రజానామ్ = ప్రజలయొక్క, విణ్మూత్రాశయమ్ = మలమూత్ర స్థానమును, ఆవృత్య = అడ్డగించి, పరమార్తికృత్ = గొప్ప పీడను చేయుచున్న వాడై, వాసవః = ఇంద్రుడు, వర్షాణి యథా = వర్షములను వలె, సర్వభూతాని = సకలప్రాణులను, రురోధ = కదలలేకుండునట్లు చేసెను.

తా. ప్రజల మలమూత్రస్థానములను అడ్డగించి, గొప్ప బాధ కలిగించుచు సకలభూతములను, ఇంద్రుడు వర్షములను నిరోధించి నట్లు నిరోధించెను. 50

మూ. వాయుప్రకోపాద్భూతాని నిరుచ్ఛ్వాసాని సర్వతః,
సంధిభిర్భిద్యమానైశ్చ కాష్ఠభూతాని జజ్ఞిరే. 51

ప్ర. అ. సర్వతః=అంతటా, భూతాని=భూతములు, వాయుప్రకోపాత్=వాయువుయొక్క ప్రకోపమువలన, నిరుచ్ఛ్వాసాని=ఉచ్ఛ్వాసము లేనివై, భిద్యమానైః = ఛేదింపబడుచున్న, సంధిభిః = శరీరసందులతో, కాష్ఠభూతాని = కఱ్ఱలుగా అయిపోయినట్లు, జజ్ఞిరే = అయినవి.

తా. ప్రపంచకమునందు అంతటా ప్రాణుల ఉచ్ఛ్వాసము ఆగిపోయినవి. వాయుప్రకోపమువలన కీళ్లు పట్టులు తప్పి ప్రాణులన్నీ కఱ్ఱల వలె అయినవి. 51

మూ. నిఃస్వాధ్యాయవషట్కారం నిష్క్రియం ధర్మవర్జితమ్,
వాయుప్రకోపాత్త్రైలోక్యం నిరయస్థమివాభవత్. 52

ప్ర. అ. త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము, వాయుప్రకోపాత్ = వాయువుయొక్క ప్రకోపమువలన, నిఃస్వాధ్యాయవషట్కారమ్ = స్వాధ్యాయవషట్కారములు లేనిదై, నిష్క్రియమ్ = క్రియలు లేనిదై, ధర్మవర్జితమ్ = ధర్మశూన్యమై, నిరయస్థమ్ ఇవ = నరకములో ఉన్నది వలె, అభవత్ = ఆయెను.

తా. వాయుప్రకోపమువలన స్వాధ్యాయము, వషట్కారము (దేవతలకు చేయు హవిఃసమర్పణము) ఆగిపోయినవి. క్రియలు అన్నీ నిలచిపోయినవి. ధర్మాచరణము లేకుండెను. ఈ విధముగా మూడు లోకములూ కూడ నరకములో ఉన్నట్లుండెను. 52

మూ. తతః ప్రజాః సగన్ధర్వాః సదేవాసురమానుషాః,
ప్రజాపతిం సమాధావన్ దుఃఖితాశ్చ సుఖేచ్ఛయా. 53

ప్ర. అ. తతః=అటుపిమ్మట, సగన్ధర్వాః=గంధర్వులతో కూడిన, సదేవాసురమానుషాః=దేవతలతో, అసురులతో మనుష్యులతో కూడిన, ప్రజాః=ప్రజలు, దుఃఖితాః=దుఃఖితులై, సుఖేచ్ఛయా = సుఖమునందు ఇచ్ఛచేత, ప్రజాపతిమ్ = బ్రహ్మదేవుణ్ణి గూర్చి, సమాధావన్ = పరుగెత్తిరి.

తా. పిమ్మట గంధర్వులు, దేవతలు, అసురులు, మనుష్యులు దుఃఖా క్రాంతులై, సుఖమును కోరుచు బ్రహ్మదేవునివద్దకు వెళ్ళిరి. 53

మూ. ఊచుః ప్రాఞ్జలయో దేవా మహోదరనిభోదరాః,
త్వయా తు భగవన్ సృష్టాః ప్రజానాథ చతుర్విధాః. 54

ప్ర. అ. మహోదరనిభోదరాః = మహోదరునితో సమానమైన పెద్ద ఉదరములు గల, దేవాః = దేవతలు, ప్రాఞ్జలయః = కట్టబడిన దోసిళ్లు గలవారై, ఊచుః = పలికిరి. భగవన్ = భగవంతుడా! ప్రజానాథ = ప్రజాపతీ! త్వయా తు = నీచేతనే, చతుర్విధాః = నాలుగు విధములైన మేము, సృష్టాః = సృజింపబడితిమి.

తా. మహోదరుడు వలె పెద్ద పొట్టలు గల ఆ దేవతలు ఇట్లు పలికిరి- "పూజ్యుడవైన బ్రహ్మదేవా! నాలుగు విధములైన ప్రజలను నీవే సృజించితివి. 54

మూ. త్వయా దత్తోఽయమస్మాకమాయుషః పవనః పతిః,
సోఽస్మాన్ ప్రాణేశ్వరో భూత్వా కస్మాదేషోఽద్య సత్తమ,
రురోధ దుఃఖం జనయన్నన్తఃపుర ఇవ స్త్రియః,
తస్మాత్త్వాం శరణం ప్రాప్తా వాయునోపహతా వయమ్.
వాయుసంరోధజం దుఃఖమిదం నో నుద దుఃఖహన్.

ప్ర. అ. అయమ్ = ఈ, పవనః = వాయువు, అస్మాకమ్ = మాయొక్క, ఆయుషః = ఆయుర్దాయముయొక్క, పతిః = ప్రభువుగా, దత్తః = ఇవ్వబడినాడు. సత్తమ = చాల శ్రేష్ఠుడా! సః ఏషః = అట్టి ఈ వాయువు, ప్రాణేశ్వరః = ప్రాణములకు అధిపతిగా, భూత్వా = అయి ఉండి, కస్మాత్ = ఎందువలన, అద్య = ఇప్పుడు, దుఃఖమ్ = దుఃఖమును, జనయన్ = కలిగించుచు, అన్తఃపురే = అంతఃపురమునందు, స్త్రియః ఇవ = స్త్రీలను వలె, అస్మాన్ = మమ్ములను, రురోధ = నిరోధించెను? తస్మాత్ = ఆ కారణమువలన, వాయునా = వాయువుచేత, ఉపహతాః = కొట్టబడిన, వయమ్ = మేము, త్వామ్ = నిన్ను, శరణం ప్రాప్తాః = శరణు జొచ్చినాము. దుఃఖహన్ = దుఃఖములను తొలగించువాడా! నః = మాయొక్క, వాయుసంరోధజమ్ = వాయునిరోధమువలన కలిగిన, ఇదం దుఃఖమ్ = ఈ దుఃఖమును, నుద = పోగొట్టుము.

తా. ఈ వాయువును మా ఆయుస్సుకు అధిపతినిగా నీవే చేసితివి. సత్తమా! అట్టి ఈ వాయువు మా ప్రాణాలకు అధిపతి అయి ఉండి కూడ, అంతఃపురములో స్త్రీలను నిరోధించినట్లు మమ్ములను నిరోధించి దుఃఖము కలిగించుచున్నాడు. వాయువుచేత పీడితులమైన మేము నిన్ను శరణుజొచ్చినాము. దుఃఖములను తొలగించువాడా! వాయునిరోధమువల్ల కలిగిన, మా దుఃఖమును తొలగించుము. 55,56

మూ. ఏతత్ప్రజానాం శ్రుత్వా తు ప్రజానాథః ప్రజాపతిః, 57
కారణాదితి చోక్త్వాసౌ ప్రజాః పునరభాషత.

ప్ర. అ. ప్రజానాథః = ప్రజల ప్రభువైన, ప్రజాపతిః = బ్రహ్మదేవుడు. ప్రజానామ్ = ప్రజలయొక్క, ఏతత్ = ఈ వాక్యమును, శ్రుత్వా = విని, కారణాత్ = కారణమువలననే, ఇతి = అని, ఉక్త్వా చ = పలికి, పునః = మరల, ప్రజాః = ప్రజలను గూర్చి, అభాషత = పలికెను.

తా. ప్రజల ప్రభువైన ప్రజాపతి ప్రజలు పలికిన ఈ మాటలు విని, "దీని కొక కారణ మున్నది" అని చెప్పి మరల ఇట్లనెను. 57

మూ. యస్మింశ్చ కారణే వాయుశ్చుక్రోధ చ రురోధ చ, 58
ప్రజాః శృణుధ్వం తత్సర్వం శ్రోతవ్యం చాత్మనః క్షమమ్.

ప్ర. అ. ప్రజాః = ప్రజలారా! వాయుః = వాయువు, యస్మిన్ కారణే = ఏ కారణమునందు, చుక్రోధ చ = కోపించెనో, రురోధ చ = నిరోధించెనో, తత్ = దానిని, సర్వమ్ = సమస్తమునూ, శృణుధ్వమ్ = వినండి. ఆత్మనః = తమకు, క్షమమ్ = తగువిధముగా, శ్రోతవ్యమ్ = వినదగినది.

తా. ప్రజలారా! వాయువునకు. ఎందుచేత కోపము వచ్చెనో, ఎందుకు అతడు ఈ విధముగా నిరోధించెనో అది అంతా వినుడు. మీకు తగు విధముగా వినండి. 58

మూ. పుత్రస్తస్యామరేశేన ఇన్ద్రేణాద్య నిపాతితః, 59
రాహోర్వచనమాస్థాయ తతః స కుపితోఽనిలః.

ప్ర. అ. తస్య = అతనియొక్క, పుత్రః = పుత్రుడు, అమరేశేన = దేవతల

ప్రభువైన, ఇన్ద్రేణ = ఇంద్రునిచేత, రాహోః = రాహువుయొక్క, వచనమ్ = వచనమును, ఆస్థాయ = అవలంబించి, అద్య = ఇప్పుడు, నిపాతితః = పడగొట్టబడినాడు. తతః = ఆ కారణమువలన, సః అనిలః = ఆ వాయువు, కుపితః = కోపించినాడు.

తా. రాహువు మాటలు విని దేవతల ప్రభువైన ఇంద్రుడు నేడు, వాయుదేవుని పుత్రుని పడగొట్టినాడు. అందుచేత అతడు కోపించినాడు: 59

మూ. అశరీరః శరీరేషు వాయుశ్చరతి పాలయన్, 60
శరీరం హి వినా వాయుం సమతాం యాతి దారుభిః.

ప్ర. అ. వాయుః = వాయువు, అశరీరః = శరీరము లేనివాడై, పాలయన్ = పాలించుచు, శరీరేషు = శరీరములయందు, చరతి = సంచరించుచున్నాడు. వాయుం వినా = వాయువు లేకుండగా, శరీరమ్ = శరీరము, దారుభిః = కట్టెలతో, సమతామ్ = సమత్వమును, యాతి = పొందును.

తా. శరీరము లేని వాయువు శరీరమును పాలించుచు దానిలో సంచరించుచుండును. వాయువు లేనిచో శరీరము కట్టెవలె అయిపోవును. 60

మూ. వాయుః ప్రాణః సుఖం వాయుర్వాయుః సర్వమిదం జగత్,
వాయునా సంపరిత్యక్తం న సుఖం విన్దతే జగత్.

ప్ర. అ. వాయుః = వాయువే, ప్రాణః = ప్రాణము. వాయుః = వాయువే, సుఖమ్ = సుఖము. వాయుః = వాయువే, సర్వమ్ = సమస్తమైన. ఇదం జగత్ = ఈ జగత్తు. వాయునా = వాయువుచేత, సంపరిత్యక్తమ్ = విడవబడిన, జగత్ = జగత్తు, సుఖమ్ = సుఖమును, న విన్దతే = పొందదు.

తా. వాయువే ప్రాణము. వాయువే సుఖము. ఈ సమస్తజగత్తూ వాయువే. వాయువు విడిచివేసినచో జగత్తుకు సుఖ ముండదు. 61

మూ. అద్యైవ చ పరిత్యక్తం వాయునా జగదాయుషా, 62
అద్యైవ తే నిరుచ్ఛ్వాసాః కాష్ఠకుడ్యోపమాః స్థితాః.

ప్ర. అ. జగత్ = జగత్తు, ఆయుషా = ఆయుర్దాయమైన, వాయునా = వాయువుచేత, అద్యైవ = ఇప్పుడే, పరిత్యక్తమ్ = విడవబడినది. అద్యైవ = ఇప్పుడే,

తే = వారు, నిరుచ్ఛ్వాసాః = ఉచ్ఛ్వాసము లేనివారై, కాష్ఠకుడ్యోపమాః = కాష్ఠములతోను గోడలతోను సమానులై, స్థితాః = ఉన్నారు.

తా. ఆయుర్దాయస్వరూపుడైన వాయువు జగత్తును ఇప్పుడే విడచినాడు. ప్రాణులన్నీ ఇప్పుడే ఉచ్ఛ్వాసనిఃశ్వాసములు లేక కఱ్ఱల వలె, గోడల వలె అయిపోయినారు. 62

మూ. తద్యామస్తత్ర యత్రాస్తే మారుతో రుక్ప్రదో హి నః, 63
మా ప్రసాదం గమిష్యామ అప్రసాద్యాదితేః సుతమ్.

ప్ర. అ. తత్ = ఆ కారణమువలన, నః = మనకు, రుక్ప్రదః = రోగము నిచ్చిన, మారుతః = వాయువు, యత్ర = ఎక్కడ, అస్తే = ఉన్నాడో, తత్ర = అక్కడికి, యామః = వెళ్ళుదము. అదితేః = అదితియొక్క, సుతమ్ = కుమారుడైన ఆతనిని, అప్రసాద్య = అనుగ్రహింప చేసికొనకుండగా, ప్రసాదమ్ = ఆరోగ్యమును, మా గమిష్యామ = పొందము.

తా. అ. అందుచేత మనము మనకు అనారోగ్యము కలిగించిన వాయువు ఉన్న చోటికి వెళ్ళుదము. ఆ వాయువును అనుగ్రహింపచేసికొనకుండగా మనకు ఆరోగ్యము లేదు. 63

మూ. తతః ప్రజాభిః సహితః ప్రజాపతిః
సదేవగన్ధర్వభుజఙ్గగుహ్యకైః,
జగామ యత్రాస్యతి తత్ర మారుతః
సుతం సురేన్ద్రాభిహతం ప్రగృహ్య సః. 64

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సదేవగన్ధర్వభుజఙ్గగుహ్యకైః = దేవతలతోను, గంధర్వులతోను, సర్పములతోను, యక్షులతోను కూడిన, ప్రజాభిః = ప్రజలతో, సహితః = కూడిన, ప్రజాపతిః = బ్రహ్మదేవుడు, సురేన్ద్రాభిహతమ్ = దేవేంద్రునిచేత కొట్టబడిన, సుతమ్ = పుత్రుణ్ణి, ప్రగృహ్య = గ్రహించి, సః మారుతః = ఆ వాయువు, యత్ర = ఎక్కడ, అస్యతి = ఉండునో, తత్ర = అక్కడికి, జగామ = వెళ్ళెను.

తా. పిమ్మట బ్రహ్మదేవుడు దేవ-గంధర్వ-సర్ప-యక్షాదులతోను ఇత

ప్రజలందరితోని కలిసి, మహేంద్రునిచేత కొట్టబడిన తన కుమారుణ్ణి తీసికొనివెళ్లి వాయువు ఉన్నచోటికి వెళ్ళెను. 64

మూ. తతోఽర్క వైశ్వానరకాఞ్చనప్రభం
సుతం తదోత్సఙ్గగతం సదాగతేః,
చతుర్ముఖో వీక్ష్య కృపామథాకరో
త్సదేవగన్ధర్వఋషియక్షరాక్షసైః. 65

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
పఞ్చత్రింశః సర్గః.

ప్ర. అ. తతః = అటు పిమ్మట, దేవగన్ధర్వఋషియక్షరాక్షసైః = దేవగంధర్వఋషియక్షరాక్షసులతో కూడిన, సః చతుర్ముఖః = ఆ బ్రహ్మదేవుడు, సదాగతేః = వాయువుయొక్క, ఉత్సఙ్గగతమ్ = ఒడిలో ఉన్న, అర్కవైశ్వానరకాఞ్చనప్రభమ్ = సూర్య-అగ్ని-సువర్ణముల కాంతి వంటి కాంతి గల, సుతమ్= కుమారుణ్ణి, వీక్ష్య = చూచి, తదా = అప్పుడు, కృపామ్ = కృపను, అకరోత్ = చేసెను.

తా. పిమ్మట దేవ-గంధర్వ-ఋషి - యక్ష-రాక్షసులతో కలసి వెళ్ళిన బ్రహ్మదేవుడు వాయువు ఒడిలో ఉన్న. సూర్యాగ్నిసువర్ణముల కాంతి వంటి కాంతి గల అతని కుమారుణ్ణి చూచి జాలిపడెను. 65

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో
ముప్పదియైదవ సర్గ సమాప్తము.

అథ షట్త్రింశః సర్గః

[బ్రహ్మాదిదేవతలు హనుమంతుణ్ణి మరల జీవింపచేసి వరములు ఇచ్చుట. వాయువు హనుమంతుణ్ణి తీసికొని వెళ్లుట. ఋషుల శాపముచేత హనుమంతుడు తన బలమును మరచిపోవుట. "నేను వేయబోవుయజ్ఞమునకు రావలెను" అని ప్రార్థించి రాముడు అగస్త్యాదులను పంపివేయుట].

మూ. తతః పితామహం దృష్ట్వా వాయుః పుత్రవధార్దితః,
శిశుకం తం సమాదాయ ఉత్తస్థౌ ధాతురగ్రతః 1

ప్ర. అ. తతః = అటుపిమ్మట, పుత్రవధార్దితః = పుత్రునియొక్క వధచేత పీడితుడైన, వాయుః = వాయువు, పితామహమ్ = బ్రహ్మదేవుణ్ణి, దృష్ట్వా = చూచి, తం శిశుకమ్ = ఆ చిన్ని శిశువును, సమాదాయ = గ్రహించి, ధాతుః = బ్రహ్మయొక్క, అగ్రతః = ఎదుట, ఉత్తస్థౌ = లేచెను.

తా. పుత్రుని వధచేత దుఃఖించుచున్న ఆ వాయువు బ్రహ్మదేవుణ్ణి చూచి ఆ పిల్లవానిని ఎత్తికొని బ్రహ్మదేవుని ఎదుట లేచి నిలబడెను. 1

మూ చలకుణ్డలమౌలిస్రక్తపనీయవిభూషణః,
పాదయోర్న్యపతద్వాయుస్త్రిరుపస్థాయ వేధసే. 2

ప్ర. అ. చలకుణ్డలమౌలిస్రక్ = కదలుచున్న కుండలములు, శిరోమాల్యములూ గల, తపనీయభూషణః = బంగారు అలంకారములు గల, వాయుః = వాయువు, వేధసే = బ్రహ్మకు, త్రిః = మూడు పర్యాయములు. ఉపస్థాయ = ఉపస్థానము చేసి, పాదయోః = పాదములమీద, న్యపతత్ = పడెను.

తా. కుండలములు, శిరోమాలికలు కదలాడగా, బంగారు అలంకారములు ధరించిన ఆ వాయువు బ్రహ్మకు మూడు పర్యాయములు ఉపస్థానము (మంత్రముచ్చరించుచు సమీపించుటను)చేసి, అతని పాదములమీద పడెను. 2

మూ. తం తు వేదవిదా తేన లమ్బాభరణశోభినా,
వాయుముత్థాప్య హస్తేన శిశుం తం పరిమృష్టవాన్. 3

ప్ర. అ. వేదవిదా = వేదములను ఎరిగిన, లమ్బాభరణశోభినా = వ్రేలాడుచున్న ఆభరణములతో ప్రకాశించుచున్న, తేన హస్తేన = ఆ హస్తముతో, తం వాయుమ్ = ఆ వాయువును, ఉత్థాప్య = లేవదీసి, తం శిశుమ్ = ఆ శిశువును పరిమృష్టవాన్ = స్పృశించినాడు.

తా. బ్రహ్మదేవుడు వేదములను ఎరిగిన, వ్రేలాడుచున్న ఆభరణములతో ప్రకాశించుచున్న హస్తముతో ఆ వాయువును పైకి లేవదీసి ఆ శిశువును స్పృశించెను. 3

మూ. స్పృష్టమాత్రస్తతః సోఽయం సలీలం పద్మజన్మనా,
జలసిక్తం యథా సస్యం పునర్జీవితమాప్తవాన్. 4

ప్ర. అ. తతః = అటుపిమ్మట, పద్మజన్మనా = బ్రహ్మదేవునిచేత, సలీలమ్ = విలాసపూర్వకముగా, స్పృష్టమాత్రః = స్పృశించబడిన, సః అయమ్ = అట్టి ఈ శిశువు, జలసిక్తమ్ = నీటితో తడపబడిన, సస్యం యథా = సస్యము వలె, పునః = మరల, జీవితమ్ = జీవితమును, ఆప్తవాన్ = పొందినాడు.

తా. బ్రహ్మదేవుడు విలాసపూర్వకముగా స్పృశించగానే ఆ శిశువు నీరు చల్లిన సస్యము వలె మరల జీవితమును పొందెను. 4

మూ. ప్రాణవన్తమిమం దృష్ట్వా ప్రాణో గన్ధవహో ముదా,
చచార సర్వభూతేషు సంనిరుద్ధం యథా పురా. 5

ప్ర. అ. ప్రాణః = ప్రాణస్వరూపుడైన, గన్ధవహః = వాయువు, ప్రాణవన్తమ్ = ప్రాణముగల, ఇమమ్ = ఈ శిశువును, దృష్ట్వా = చూచి, ముదా = సంతోషముతో, యథాపురా = పూర్వమునందు వలె, సంనిరుద్ధమ్ = శరీరములో నిరోధింపబడునట్లుగా, సర్వభూతేషు = సమస్తప్రాణులయందు, చచార = సంచరించెను.

తా. ప్రాణస్వరూపుడైన వాయువు ఆ శిశువునకు ప్రాణము వచ్చుట చూచి

సంతోషించి పూర్వమునందు వలె అన్ని ప్రాణుల శరీరములలో ప్రవేశించి సంచరించెను. 5

మూ. మరున్నిరోధాద్వినిర్ముక్తాస్తాః ప్రజా ముదితాభవన్,
శీతవాతవినిర్ముక్తాః పద్మిన్య ఇవ సాంబుజాః. 6

ప్ర. అ. మరున్నిరోధాత్ = వాయునిరోధమునుండి, వినిర్ముక్తాః = విడవబడిన, తాః = ఆ, ప్రజాః = ప్రజలు, శీతవాతవినిర్ముక్తాః = శీతమునుండి వాతమునుండి విడువబడిన, సాంబుజాః = పద్మములతో కూడిన, పద్మిన్యః ఇవ = పద్మలతలు వలె, ముదితాః = సంతోషించినవారు, అభవన్ = అయిరి.

తా. వాయునిరోధమునుండి విముక్తులైన ఆ ప్రజలు శీతవాతములనుండి విముక్తములై పద్మములతో నిండిన పద్మలతల వలె సంతోషించిరి. 6

మూ. తతస్త్రియుగ్మస్త్రికకుత్త్రిధామా త్రిదశార్చితః,
ఉవాచ దేవతా బ్రహ్మా మారుతప్రియకామ్యయా. 7

ప్ర. అ. తతః = అటుపిమ్మట, త్రియుగ్మః = యశోవీర్యములు, ఐశ్వర్యశ్రీలు, జ్ఞాన-వైరాగ్యములు అను మూడు జంటలు గలవాడు, త్రికకుత్ = మూడు మూర్తులలో శ్రేష్ఠుడు, త్రిధామా = మూడు లోకములు స్థానముగా గలవాడు, త్రిదశార్చితః = దేవతలచేత పూజింపబడినవాడు అయిన, బ్రహ్మా = బ్రహ్మ, మారుతప్రియకామ్యయా = వాయువునకు ప్రియము చేయవలె నను కోరికచేత, దేవతాః = దేవతలను గూర్చి, ఉవాచ = పలికెను.

తా. పిదప యశస్సు-వీర్యము, ఐశ్వర్యము-శోభ, జ్ఞానము-వైరాగ్యము అను మూడు జంటలు గలవాడు, త్రిమూర్తులలో శ్రేష్ఠుడు, దేవతలచేత పూజింపబడినవాడు అయిన బ్రహ్మదేవుడు వాయువునకు ప్రియము చేకూర్చవలె నను కోరిక చేత దేవతలతో ఇట్లు పలికెను. 7

మూ. భో మహేన్ద్రాగ్నివరుణా మహేశ్వరధనేశ్వరౌ,
జానతామపి వః సర్వం వక్ష్యామి శ్రూయతాం హితమ్. 8

ప్ర. అ. భోః = ఓ! మహేన్ద్రాగ్నివరుణాః = మహేంద్ర అగ్నివరుణ

లారా! మహేశ్వరధనేశ్వరౌ = మహేశ్వర కుబేరులారా! జానతామ్ అపి = తెలిసినవారే అయినను, వః = మీకు, సర్వమ్ = సమస్తమును, వక్ష్యామి = చెప్పెదను. హితమ్ = హితము, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. ఓ! మహేంద్ర-అగ్ని-వరుణ-మహేశ్వర-కుబేరులారా! మీ కందరికి ఈ విషయము తెలిసినదే అయినను చెప్పుచున్నాను. నేను చెప్పు హితమును వినండి. 8

మూ. అనేన శిశునా కార్యం కర్తవ్యం వో భవిష్యతి,
తద్దదధ్వం వరాన్ సర్వే మారుతస్యాస్య తుష్టయే. 9

ప్ర. అ. అనేన శిశునా = ఈ శిశువు చేత, వః = మీయొక్క, కార్యమ్ = కార్యము, కర్తవ్యమ్ = చేయదగినది, భవిష్యతి = కాగలదు, తత్ = ఆ కారణమువలన, సర్వే = అందరూ, అస్య = ఈ, మారుతస్య = వాయువుయొక్క, తుష్టయే = సంతోషముకొరకు, వరాన్ = వరములను, దదధ్వమ్ = ఇవ్వండి.

తా. ఈ శిశువు ముస్ముందు మీ కార్యమును సాధించవలసింది ఉన్నది. అందువలనా, ఈ వాయుదేవుని సంతోషముకొరకు మీరందరూ ఇతనికి వరములను ఇవ్వండి. 9

మూ. తతః సహస్రనయనః ప్రీతియుక్తః శుభాననః,
కుశేశయమయీం మాలాముత్క్షిప్యేదం వచోఽబ్రవీత్. 10

ప్ర. అ. తతః = అటుపిమ్మట, శుభాననః = శుభమైన ముఖము గల, సహస్రనయనః = ఇంద్రుడు, ప్రీతియుక్తః = ప్రేమతో కూడినవారై, కుశేశయమయీమ్ = బంగారు పద్మముల వికారమైన, మాలామ్ = మాలను, ఉత్క్షిప్య = ఎత్తి, ఇదం వచః = ఈ వచనమును, అబ్రవీత్ = పలికెను.

తా. పిమ్మట మంగళకరమైన ముఖముగల దేవేంద్రుడు ఆనందముతో బంగారు పద్మముల మాలను పైకి చూపి (ఇచ్చి) ఇట్లు పలికెను. 10

మూ. మత్కరోత్సృష్టవజ్రేణ హనురస్య యథా హతః,
నామ్నా వై కపిశార్దూలో భవితా హనుమానితి. 11

ప్ర. అ. అస్య = ఇతనియొక్క, హనుః = దౌడ, మత్కరోత్సృష్టవజ్రేణ = నాచేతిచేత విడువబడిన వజ్రముచేత, యథా = ఎట్లు, హతః = కొట్టబడినదో, కపిశార్దూలః = ఈ వానరశ్రేష్ఠుడు, నామ్నా = పేరుచేత, హనుమాన్ ఇతి = హనుమంతుడు అని, భవితా = కాగలడు.

తా. ఇతని దౌడ నేను ప్రయోగించిన వజ్రముచేత కొట్టబడినది. అందుచేత ఈ వానరశ్రేష్ఠుని పేరు హనుమంతుడు అని ప్రసిద్ధము కాగలదు. 11

మూ. అహమస్య ప్రదాస్యామి పరమం వరమద్భుతమ్,
ఇతః ప్రభృతి వజ్రస్య మమావధ్యో భవిష్యతి. 12

ప్ర. అ. అహమ్ = నేను, అస్య = వీనికి, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, పరమమ్ = గొప్పదైన, వరమ్ = వరమును, ప్రదాస్యామి = ఇచ్చెదను. ఇతః = ప్రభృతి = ఇది మొదలు, మమ వజ్రస్య = నా వజ్రమునకు, అవధ్యః = చంపశక్యము కానివాడు, భవిష్యతి = కాగలడు.

తా. నే నితనికి ఆశ్చర్యకరమైన ఒక గొప్ప వరము నిచ్చెదను. ఇటుపై ఇతడు నావజ్రముచేత చంపుటకు శక్యముకానివాడుగా అగును. 12

మూ. మార్తణ్డస్త్వబ్రవీత్తత్ర భగవాంస్తిమిరాపహః,
తేజసోఽస్య మదీయస్య దదామి శతికాం కలామ్. 13

ప్ర. అ. తత్ర = అక్కడ, భగవాన్ = పూజ్యుడైన, తిమిరాపహః = చీకటిని పోగొట్టు, మార్తణ్డః తు = సూర్యుడైతే, అబ్రవీత్ = పలికెను. మదీయస్య = నాసంబంధమైన, అస్య = ఈ, తేజసః = తేజస్సుయొక్క, శతికామ్ = నూరవ కలామ్ = అంశమును, దదామి = ఇచ్చుచున్నాను.

తా. పూజ్యుడైన, తిమిరవినాశకుడైన సూర్యుడు ఇట్లు పలికెను. నేను నా తేజస్సులోని నూరవవంతు ఇతనికి ఇచ్చెదను. 13

మూ. యదా చ శాస్త్రాణ్యధ్యేతుం శక్తిరస్య భవిష్యతి,
తదాస్య శాస్త్రం దాస్యామి యేన వాగ్మీ భవిష్యతి, 14
న చాస్య భవితా కశ్చిత్సదృశః శాస్త్రదర్శనే.

ప్ర. అ. శాస్త్రాణి = శాస్త్రములను, అధ్యేతుమ్ = చదువుటకొరకు, అస్య = వీనికి, యదా = ఎప్పుడు, శక్తిః = శక్తి, భవిష్యతి = కాగలదో, తదా = అప్పుడు, అస్య = వీనికి, శాస్త్రమ్ = శాస్త్రమును, దాస్యామి = ఇవ్వగలను, యేన = దేనిచేత, వాగ్మీ = ఉత్తమవాక్కు గలవాడు, భవిష్యతి = కాగలడో. శాస్త్రదర్శనే = శాస్త్రజ్ఞానమునందు, అస్య = ఇతనికి, సదృశః = సమానుడు, కశ్చిత్ = ఒక్కడూ కూడ, న భవితా చ = ఉండడు.

తా. శాస్త్రాధ్యయనము చేసే శక్తి వచ్చినపుడు ఇతనికి నేను శాస్త్రము నేర్పెదను. దానిచేత ఇతడు మాటలలో నేర్పరి కాగలడు. శాస్త్రజ్ఞానములో ఇతనిని పోలినవాడు ఉండడు. 14

మూ. వరుణశ్చ వరం ప్రాదాన్నాస్య మృత్యుర్భవిష్యతి,
వర్షాయుతశతేనాపి మత్పాశాదుదకాదపి. 15

ప్ర. అ. వరుణః చ = వరుణుడు కూడ, వరమ్ = వరమును, ప్రాదాత్ = ఇచ్చెను. వర్షాయుతశతేనాపి = నూరు అయుతముల సంవత్సరములచేత కూడ, మత్పాశాత్ = నా పాశమువలనా, ఉదకాదపి = ఉదకమువలనా, అస్య = ఇతనికి మృత్యుః = మృత్యువు, న భవిష్యతి = కలుగదు.

తా. పది లక్షల సంవత్సరాలకు కూడ నా పాశముచేత గాని, జలముచేత గాని ఇతనికి మృత్యువు కలగదు. 15

మూ. యమో దణ్డాదవధ్యత్వ మరోగత్వం చ దత్తవాన్,
వరం దదామి సంతుష్ట అవిషాదం చ సంయుగే. 16

ప్ర. అ. యమః = యముడు, దణ్డాత్ = దండమువలన, అవధ్యత్వమ్ = చంప శక్యము కాక పోవుటను, అరోగత్వం చ = రోగము లేకపోవుటను, దత్తవాన్ = ఇచ్చినాడు. సంతుష్టః = సంతోషించిన నేను, సంయుగే = యుద్ధమునందు, అవిషాదం చ = దిగులుపాటు లేకపోవుటను కూడ, వరమ్ = వరమును, దదామి = ఇచ్చుచున్నాను.

తా. యముడు సంతోషించి తన దండము వలన చావు లేకపోవుటను, రోగము కలుగకపోవుటను, యుద్ధములో దిగులుచెందకుండుటను వరముగా ఇచ్చెను. 16

మూ. గదేయం మామికా నైవ సంయుగేషు వధిష్యతి,
ఇత్యేవం ధనదః ప్రాహ తదా హ్యేకాక్షిపిఙ్గలః. 17

ప్ర. అ. తదా = అప్పుడు, ఏకాక్షిపిఙ్గలః = ఒక నేత్రమునందు పచ్చదనము గల, ధనదః = కుబేరుడు, మామికా = నా సంబంధమైన, ఇయం గదా = ఈ గద, సంయుగేషు = యుద్ధములయందు, నైవ వధిష్యతి = చంపదు, ఇత్యేవమ్ = అని, ప్రాహ = పలికెను.

తా. "నా గద యుద్ధములలో ఇతనిని చంపదు" అని పచ్చని ఒక కన్ను గల కుబేరుడు అప్పుడు పలికెను. 17

మూ. మత్తో మదాయుధానాం చ అవధ్యోఽయం భవిష్యతి,
ఇత్యేవం శంకరేణాపి దత్తోఽస్య పరమో వరః. 18

ప్ర. అ. అయమ్ = ఇతడు, మత్తః = నా వలన, మదాయుధానాం చ = నా ఆయుధములకూ, అవధ్యః = చంప శక్యము కానివాడు, భవిష్యతి = కాగలడు, ఇత్యేవమ్ = ఇట్లు, శంకరేణాపి = శంకరునిచేత కూడ, అస్య = ఇతనికి, పరమః = గొప్ప, వరః = వరము, దత్తః = ఇవ్వబడినది.

తా. "ఇతడు నా ఆయుధములచేత గాని, నాచేత గాని చంపబడడు" అని శివుడు కూడ అతనికి గొప్ప వరము నిచ్చెను. 18

మూ. విశ్వకర్మా చ దృష్ట్వేమం బాలం ప్రతి మహారథః,
శిల్పినాం ప్రవరః ప్రాదాద్వరమస్య మహామతిః. 19

ప్ర. అ. శిల్పినామ్ = శిల్పులలో, ప్రవరః = శ్రేష్ఠుడు, మహారథః = మహారథుడు, మహామతిః = గొప్ప బుద్ధి కలవాడు అయిన, విశ్వకర్మా చ = విశ్వకర్మ కూడ, ఇమమ్ = ఈ, బాలం ప్రతి = బాలుణ్ణి, దృష్ట్వా = చూచి, అస్య = ఇతనికి, వరమ్ = వరమును, ప్రాదాత్ = ఇచ్చెను.

తా. మహారథుడు, శిల్పులలో శ్రేష్ఠుడూ, గొప్ప బుద్ధి కలవాడూ అయిన విశ్వకర్మ ఈ బాలుణ్ణి చూచి ఇతని కొక వర మిచ్చెను. 19

మూ. మత్కృతాని చ శస్త్రాణి యాని దివ్యాని తాని చ,
తైరవధ్యత్వమాపన్నశ్చిరజీవీ భవిష్యతి. 20

దీర్ఘాయుశ్చ మహాత్మా చ బ్రహ్మ తం ప్రాబ్రవీద్వచః,
సర్వేషాం బ్రహ్మదణ్డానామవధ్యత్వం భవిష్యతి. 21

ప్ర. అ. మత్కృతాని = నాచేత తయారుచేయబడిన, యాని = ఏ, శస్త్రాణి = ఆయుధములు గలవో, తాని = ప్రసిద్ధములైన, యాని = ఏ, దివ్యాని దివ్యములైన శస్త్రము లున్నవో, తైః = వానిచేత, అవధ్యత్వమ్ = వధింప శక్యము కాకపోవుటను, ఆపన్నః = పొందినవాడై, చిరజీవీ = చిరకాలము జీవించువాడు, దీర్ఘాయుః చ = దీర్ఘాయుర్దాయము కలవాడూ, భవిష్యతి = కాగలడు. మహాత్మా = మహాత్ముడైన, బ్రహ్మా = బ్రహ్మ, తమ్ = అతనిని గూర్చి, వచః = వచనమును, ప్రాబ్రవీత్ = పలికెను. సర్వేషాం = సమస్తమైన, బ్రహ్మదణ్డానామ్ = బ్రహ్మ దండములకు, అవధ్యత్వమ్ = వధ్యుడు కాకపోవుట, భవిష్యతి = కాగలదు.

తా. "నేను తయారుచేసిన అస్త్రములచేత గాని, ఇతరములైన దివ్యాస్త్రముల చేతగాని చంప శక్యము కానివాడై ఇతడు దీర్ఘాయుర్దాయవంతుడై చిరకాలము జీవించగలడు". మహాత్ముడైన బ్రహ్మదేవుడు కూడ-"ఇతడు ఏ బ్రహ్మదండముల చేతను చంపబడడు"అని పలికెను. 20,21

మూ. తతః సురాణాం తు వరైర్దృష్ట్వా హ్యేనమలంకృతమ్,
చతుర్ముఖస్తుష్టమనా వాయుమాహ జగద్గురుః. 22

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సురాణామ్ = దేవతలయొక్క, వరైః = వరములచేత, అలంకృతమ్ = అలంకరించబడిన, ఏనమ్ = ఇతనిని, దృష్ట్వా = చూచి, జగద్గురుః = జగద్గురువైన, చతుర్ముఖః = బ్రహ్మదేవుడు, తుష్టమనాః = సంతోషించిన మనస్సు కలవాడై, వాయుమ్ = వాయువును గూర్చి, ఆహ = పలికెను.

తా. అప్పుడు దేవతలు ఇచ్చిన వరములచేత అలంకరించబడిన ఇతనిని చూచి జగత్తునకు అంతకూ పూజ్యుడైన బ్రహ్మదేవుడు మనస్సులో సంతోషించి వాయువుతో ఇట్లు పలికెను. 22

మూ. అమిత్రాణాం భయకరో మిత్రాణామభయంకరః,
అజేయో భవితా పుత్రస్తవ మారుత మారుతిః. 23

ప్ర. అ. మారుత = ఓ! వాయువా! తవ = నీయొక్క, పుత్రః = పుత్రుడైన, మారుతిః = హనుమంతుడు, అమిత్రాణామ్ = శత్రువులకు, భయకరః = భయము కలిగించేవాడుగాను, మిత్రాణామ్ = మిత్రులకు, అభయంకరః = అభయమును కలిగించేవాడుగాను, భవితా = కాగలడు.

తా. ఓ! వాయూ! నీ కుమారుడు హనుమంతుడు శత్రువులకు భయంకరుడు, మిత్రులకు అభయము ఇచ్చువాడు కాగలడు. 23

మూ. కామరూపః కామచారీ కామగః ప్లవతాం వరః,
భవత్యవ్యాహతగతిః కీర్తిమాంశ్చ భవిష్యతి. 24

ప్ర. అ. ప్లవతామ్ = ఎగురువారిలో, వరః = శ్రేష్ఠుడైన ఇతడు, కామరూపః = స్వేచ్ఛారూపము కలవాడు, కామచారీ = స్వేచ్ఛానుసారము చరించువాడు, కామగః = ఇచ్ఛానుసారము వెళ్ళువాడు, అవ్యాహతగతిః = అడ్డుకొనబడని గమనము కలవాడు, భవతి = అగును. కీర్తిమాన్ చ = కీర్తిగలవాడు కూడ, భవిష్యతి = కాగలడు.

తా. ఇతడు ఎగురగలవారిలో శ్రేష్ఠుడై ఇష్టము వచ్చిన రూపము ధరించగలడు. ఇష్టానుసారము సంచరించును. ఇష్టానుసారము వెళ్ళును. ఇతని గతిని ఎవ్వరూ అడ్డజాలరు. కీర్తిమంతుడు అగును. 24

మూ. రావణోత్సాదనార్థాని రామప్రీతికరాణి చ
రోమహర్షకరాణ్యేవ కర్తా కర్మాణి సంయుగే. 25

ప్ర. అ. సంయుగే = యుద్ధమునందు, రావణోత్సాదనార్థాని = రావణుని వినాశమే ప్రయోజనముగా గల, రామప్రీతికరాణి చ = రామునకు ప్రీతిని కలిగించు, రోమహర్షకరాణి = రోమాంచమును కలిగించు, కర్మాణి = కర్మలను, కర్తా = చేయగలడు.

తా. ఇతడు యుద్ధములో రావణుని వినాశమునకు హేతువులు, రామునకు ఆనందకరములు, ఆశ్చర్యజనకములు అయిన పనులు చేయగలడు. 25

మూ. ఏవముక్త్వా తమామన్త్య్ర మారుతం త్వమరైః సహ,
యథాగతం యయుః సర్వే పితామహపురోగమాః. 26

ప్ర. అ. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, తం మారుతమ్ = ఆ వాయువును, ఆమన్త్య్ర = ఆమంత్రించి, పితామహపురోగమాః = బ్రహ్మదేవుడు మొదలైన, సర్వే = అందరూ, అమరైః సహ = దేవతలతో కూడ, యథాగతమ్ = వచ్చిన విధముగానే, యయుః = వెళ్ళిరి.

తా. బ్రహ్మదేవుడు మొదలైన వారందరూ వాయువుతో ఇట్లు పలికి, అతని అనుమతి తీసికొని (వెళ్లెదము అని చెప్పి), వచ్చిన విధముగ వెళ్ళిరి. 26

మూ. సోఽపి గన్ధవహః పుత్రం ప్రగృహ్య గృహమానయత్,
అఞ్జనాయాస్తమాఖ్యాయ వరదత్తం వినిర్గతః. 27

ప్ర. అ. సః గన్ధవహః అపి = ఆ వాయువు కూడ, పుత్రమ్ = పుత్రుణ్ణి, ప్రగృహ్య=గ్రహించి, గృహమ్=గృహమును గూర్చి, ఆనయత్=తీసికొనివచ్చెను. అఞ్జనాయాః = అంజనకు, తమ్ = వానిని, వరదత్తమ్ = ఇవ్వబడిన వరములు కలవానినిగా, ఆఖ్యాయ = చెప్పి, వినిర్గతః = వెళ్ళిపోయినాడు.

తా. వాయువు ఆ పుత్రుణ్ణి ఇంటికి తీసికొని వెళ్ళి, అతనికి వరములు లభించిన విషయమును అంజనకు తెలిపి వెళ్ళిపోయెను. 27

మూ. ప్రాప్య రామ వరానేష వరదానబలాన్వితః,
జవేనాత్మని సంస్థేన సోఽసౌ పూర్ణ ఇవార్ణవః. 28

ప్ర. అ. రామ = రామా! ఏషః = ఇతడు, వరాన్ = వరములను, ప్రాప్య = పొంది, వరదానబలాన్వితః = వరదానముతోను బలముతోను కూడినవాడై, ఆత్మని = తనయందు, సంస్థేన = ఉన్న, జవేన = వేగముతో, సః అసౌ = అట్టి ఇతడు, అర్ణవః ఇవ = సముద్రము వలె, పూర్ణః = నిండినవాడుగా (అయెను).

తా. రామా! ఇతడు వరములు పొంది, వరదానమువలన కలిగిన బలముతోను, సహజబలముతోను కూడినవాడై, సముద్రము వలె తనలో ఉన్న వేగముతో నిండి ఉండెను. 28

మూ. తరసా పూర్యమాణోఽపి తదా వానరపుంగవః,
ఆశ్రమేషు మహర్షీణామపరాధ్యతి నిర్భయః. 29

ప్ర. అ. తదా = అప్పుడు, తరసా = వేగముచేత (బలముచేత), పూర్యమాణః = నింపబడుచున్న, వానరపుంగవః అపి = వానరశ్రేష్ఠుడు కూడ, మహర్షీణామ్ = మహర్షులయొక్క, ఆశ్రమేషు = ఆశ్రమములయందు, నిర్భయః = భయములేనివాడై, అపరాధ్యతి = అపరాధము చేయుచున్నాడు.

తా. అప్పుడు బలముతో నిండిన హనుమంతుడు భయము లేనివాడై మహర్షుల ఆశ్రమములలో అపరాధములు చేయుచుండెను. 29

మూ. స్రుగ్భాణ్డాన్యగ్నిహోత్రాణి వల్కలానాం చ సంచయాన్,
భగ్నవిచ్ఛిన్నవిధ్వస్తాన్ సంశాన్తానాం కరోత్యయమ్. 30

ప్ర. అ. అయమ్ = ఇతడు, సంశాన్తానామ్ = శాంతులైన మహర్షుల యొక్క, స్రుగ్భాణ్డాని = యజ్ఞోపకరణములను, అగ్నిహోత్రాణి = అగ్నిహోత్రములను, వల్కలానామ్ = నారబట్టలయొక్క, సంచయాన్ చ = సముదాయములను, భగ్నవిచ్ఛిన్నవిధ్వస్తాన్ = భగ్నమైనవాటినిగాను, ఛేదింపబడినవాటినిగాను, నశించినవాటినిగాను, కరోతి = చేయుచుండెను.

తా. ఇతడు యజ్ఞసాధనములైన స్రుక్కులను, పాత్రలను, అగ్నిహోత్రములను, నారబట్టలను ముద్దలుకొట్టి, చీల్చి, నశింపచేయుచుండెను. 30

మూ. ఏవంవిధాని కర్మాణి ప్రావర్తత మహాబలః,
సర్వేషాం బ్రహ్మదణ్డానామవధ్యః శమ్భునా కృతః. 31

ప్ర. అ. సర్వేషామ్ = సమస్తమైన, బ్రహ్మదణ్డానామ్ = బ్రహ్మదండములకు, అవధ్యః = చంప శక్యము కానివాడుగా, శమ్భునా = బ్రహ్మచేత, కృతః = చేయబడిన, మహాబలః = గొప్ప బలముగల హనుమంతుడు, ఏవంవిధాని = ఈ విధములైన, కర్మాణి = కర్మలను, ప్రావర్తత = చేసెను.

తా. ఏ బ్రహ్మదండమువలనా కూడ మరణము లేకుండే టట్లు బ్రహ్మ చేత చేయబడిన, గొప్ప బలము గల హనుమంతుడు ఈ విధములైన పనులు చేసెను. 31

మూ. జానన్త ఋషయః సర్వే సహన్తే తస్య శక్తితః,
తథా కేసరిణా త్వేష వాయునా త్వఞ్జనీసుతః. 32
ప్రతిషిద్ధోఽపి మర్యాదాం లఙ్ఘయత్యేవ వానరః.

ప్ర. అ. సర్వే = సమస్తమైన, ఋషయః = ఋషులు, శక్తితః = శక్తి వలన, తస్య = అతనికి (అతనిని), జానన్తః = ఎరిగినవారై, సహన్తే=సహించు చున్నారు. తథా = అట్లు, ఏషః = ఈ, వానరః = వానరుడైన, అఞ్జనీసుతః = హనుమంతుడు, కేసరిణా = కేసరిచేతను, వాయునా = వాయువుచేతను, ప్రతిషిద్ధోఽపి = నిషేధించబడినను, మర్యాదామ్ = కట్టుబాటును, లఙ్ఘయత్యేవ = లంఘించుచునే ఉన్నాడు.

తా. అతని శక్తిని గూర్చి తెలిసిన ఋషు లందరూ సహించుచుండిరి. కేసరీ, వాయువూ నిషేధించినా కూడ ఈ అంజనాకుమారుడైన హనుమంతుడు బాలు డగుటచేత కట్టుబాట్లను అతిక్రమించెను. 32

మూ. తతో మహర్షయః క్రుద్ధా భృగ్వఙ్గిరసవంశజాః, 33
శేపురేనం రఘుశ్రేష్ఠ నాతిక్రుద్ధాతిమన్యవః.

ప్ర. అ. తతః = అటుపిమ్మట, భృగ్వఙ్గిరసవంశజాః = భృగుఅంగిరసుల వంశములయందు పుట్టిన, మహర్షయః = మహర్షులు, క్రుద్ధాః = కోపించిరి. రఘుశ్రేష్ఠ = రామా! నాతిక్రుద్ధాతిమన్యవః = ఎక్కువగా కోపించని వారు, ఎక్కువ పగ లేనివారు అయిన ఆ ఋషులు, ఏనమ్ = ఇతనిని, శేపుః = శపించిరి.

తా. అప్పుడు భృగ్వంగిరసవంశీయులైన ఆ ఋషులు కోపించిరి. రామా! కాని వారు ఎక్కువ కోపము గాని, పగ గాని లేనివారై ఇతనిని శపించిరి. 33

మూ. బాధసే యత్సమాశ్రిత్య బలమస్మాన్ ప్లవంగమ, 34
తద్దీర్ఘకాలం వేత్తాసి నాస్మాకం శాపమోహితః,
యదా తే స్మార్యతే కీర్తిస్తదా తే వర్ధతే బలమ్. 35

ప్ర. అ. ప్లవంగమ = వానరా! యత్ = ఏ, బలమ్ = బలమును, సమాశ్రిత్య = ఆశ్రయించి, అస్మాన్ = మమ్ములను, బాధసే = బాధించుచున్నావో,

తత్ = ఆ బలమును, అస్మాకమ్ = మాయొక్క, శాపమోహితః = శాపముచేత మోహింపబడినవారవై, దీర్ఘకాలమ్ = చాలకాలమును, న వేత్సాసి = ఎరుగవు. తే = నీయొక్క, కీర్తిః = కీర్తి, యదా = ఎప్పుడు, స్మార్యతే = స్మరింపచేయబడునో, తదా = అప్పుడు, తే బలమ్ = నీ బలము, వర్ధతే = వృద్ధిపొందును.

తా. ఓ! వానరా! నీవు ఏ బలమును చూచుకొని మమ్ములను బాధించుచున్నావో ఆ బలము చాలకాలమువరకు, నీకు మా శాపముచేత తెలియకుండుగాక. నీ కీర్తిని ఎప్పుడు స్మరింపచేయుదురో అప్పుడు నీ బలము వృద్ధిపొందును.

వి. దక్షిణసముద్రతీరమునందు జాంబవంతుడు స్మరింపచేయుటతో ఈ శాపము అంతమైన దని భావము. 34, 35

మూ. తతస్తు హతతేజౌజా మహర్షివచనౌజసా,
ఏషో౽శ్రమాణి తాన్యేవ మృదుభావం గతో౽చరత్. 36

ప్ర. అ. తతః = అటుపిమ్మట, ఏషః = ఇతడు, మహర్షివచనౌజసా = మహర్షుల వచనముయొక్క బలముచేత, హతతేజౌజాః = అణచివేయబడిన తేజస్సు బలము గలవాడై, తాని = ఆ, ఆశ్రమాణ్యేవ = ఆశ్రమములనే, మృదుభావమ్ = మృదుత్వమును, గతః = పొందినవాడై, అచరత్ = సంచరించెను.

తా. అప్పుడు మహర్షుల వాక్యప్రభావముచేత తేజోబలములు అణగిపోగా ఇతడు మెత్తదనముపొంది ఆ ఆశ్రమములలోనే సంచరించెను. 36

మూ. అథర్క్షరజసో నామ వాలిసుగ్రీవయోః పితా,
సర్వవానరరాజాసీత్తేజసా ఇవ భాస్కరః. 37

ప్ర. అ. అథ = మరి యొక విషయ మేమనగా, వాలిసుగ్రీవయోః = వాలిసుగ్రీవులయొక్క, పితా = తండ్రియైన, తేజసా = తేజస్సుచేత, భాస్కరః ఇవ = సూర్యుడు వలె ఉన్న, ఋక్షరజసో నామ = ఋక్షరజసు దను, సర్వవానరరాజా = సమస్తవానరుల రాజా, ఆసీత్ = ఉండెను.

తా. తేజస్సుచేత సూర్యునివంటివాడైన ఋక్షరజసు దను సకలవానరరాజా ఉండెను. అతడు వాలిసుగ్రీవుల తండ్రి. 37

మూ. స తు రాజ్యం చిరం కృత్వా వానరాణాం మహేశ్వరః,
తత స్త్వృక్షరజా నామ కాలధర్మేణ యోజితః. 38

ప్ర. అ. ఋక్షరజా నామ = ఋక్షరజస్సు అను పేరు గల, సః = ఆ, వానరాణామ్ = వానరులయొక్క, మహేశ్వరః = మహాప్రభువు, చిరమ్ = చిర కాలము, రాజ్యమ్ = రాజ్యమును, కృత్వా = చేసి, తతః = అటుపిమ్మట, కాల ధర్మేణ = మృత్యువుచేత, యోజితః = కూర్చబడినాడు.

తా. వానరరాజైన ఆ ఋక్షరజస్సు చాల కాలము రాజ్యము చేసి మర ణించినాడు. 38

మూ. తస్మిన్న స్తమితే చాథ మన్త్రిభిర్మన్త్రకోవిదైః,
పిత్ర్యే పదే కృతో వాలీ సుగ్రీవో వాలినః పదే. 39

ప్ర. అ. తస్మిన్ = అతడు, అస్తమితే = మరణించినవాడగుచుండగా, అథ = అటుపిమ్మట, మన్త్రకోవిదైః = ఆలోచనల ఎరిగిన, మన్త్రిభిః = మంత్రుల చేత, వాలీ = వాలి, పిత్ర్యే = తండ్రికి సంబంధించిన, పదే = స్థానమునందు, కృతః = చేయబడెను. (ఉంచబడెను). సుగ్రీవః = సుగ్రీవుడు, వాలినః = వాలి యొక్క, పదే = స్థానమునందు, చేయబడెను.

తా. అతని మరణానంతరము ఆలోచనలో సమర్థులైన మంత్రులు తండ్రి స్థానములో వాలిని రాజుగాను, వాలిస్థానములో సుగ్రీవుణ్ణి యువరాజునుగాను చేసిరి. 39

మూ. సుగ్రీవేణ సమం తస్య అద్వైధం ఛిద్రవర్జితమ్,
ఆబాల్యం సఖ్యమభవదనిలస్యాగ్నినా యథా. 40

ప్ర. అ. తస్య = ఆ వాలికి, ఆబాల్యమ్ = బాల్యమునుండి, సుగ్రీవేణ సమమ్ = సుగ్రీవునితో కూడ, అద్వైధమ్ = భేదభావము లేని, ఛిద్రవర్జితమ్ = ఛిద్రములు లేని, సఖ్యమ్ = స్నేహము, అనలస్య = వాయువునకు, అగ్నినా యథా = అగ్నితో వలె, అభవత్ = ఆయెను.

తా. బాల్యమునుండి కూడ వాలికి సుగ్రీవునితో, వాయువునకు అగ్నితో వలె, భేదభావము కాని, కపటము కాని లేని స్నేహము ఉండెను. 40

మూ. ఏష శాపవశాదేవ న వేద బలమాత్మనః,
వాలిసుగ్రీవయోర్వైరం యదా రామసముత్థితమ్. 41

ప్ర. అ. రామ = రామా ! వాలిసుగ్రీవయోః = వాలిసుగ్రీవులకు, యదా = ఎప్పుడు, వైరమ్ = వైరము, సముత్థితమ్ = ఏర్పడినదో, అప్పుడు, ఏషః = ఈ హనుమంతుడు, శాపవశాదేవ = శాపవశముచేతనే, ఆత్మనః = తనయొక్క, బలమ్ = బలమును, న వేద = తెలిసికొనలేదు.

తా. రామా ! అట్టి వాలిసుగ్రీవులకు వైరము కలిగినప్పుడు ఈ హను మంతుడు శాపము మూలముననే తన బలము తెలియక ఉండెను. 41

మూ. న హ్యేష రామ సుగ్రీవో భ్రామ్యమాణోఽపి వాలినా,
దేవ జానాతి న హ్యేష బలమాత్మని మారుతిః. 42

ప్ర. అ. రామ = రామా ! వాలినా = వాలిచేత, భ్రామ్యమాణః = త్రిప్ప బడుచున్న, ఏషః సుగ్రీవః అపి = ఈ సుగ్రీవుడు కూడ, న వేద హి = ఎరుగడు కదా. దేవ = ఓ ! ప్రభూ ! ఏషః మారుతిః = ఈ హనుమంతుడు, ఆత్మని = తనయందు, బలమ్ = బలమును, న వేద హి = ఎరుగడుకదా.

తా. ప్రభువైన రామా ! వాలిచేత తరుమబడుచున్న సుగ్రీవునికి కూడ హనుమంతునకు ఎంత బలమున్నదో తెలియదు. హనుమంతునకు తన కెంత బలమున్నదో తెలియదు. 42

మూ. ఋషిశాపాహృతబలస్తదైవ కపిసత్తమః,
సింహః కుఞ్జరబద్ధో వా ఆస్థితః సహితో రణే. 43

ప్ర. అ. తదైవ = అప్పుడే, ఋషిశాపాహృతబలః = ఋషుల శాపముచేత హరించబడిన బలము గల, కపిసత్తమః = ఈ వానరశ్రేష్ఠుడు, కుఞ్జరబద్ధః = ఏనుగుచేత బంధించబడిన, సింహః వా = సింహము వలె, సహితః = కూడిన వారై, రణే = యుద్ధమునందు, ఆస్థితః = నిలచినాడు.

తా. ఆనాడు ఋషు లిచ్చిన శాపముచేత హరింపబడిన బలము గల (బల జ్ఞానము లేని) ఈ హనుమంతుడు, ఏనుగచేత బంధింపబడిన సింహము వలె,

వాలిసుగ్రీవులయుద్ధమునందు, సుగ్రీవునితో నిలచిపోయినాడు ; యుద్ధము చేయ లేదు. 43

మూ. పరాక్రమోత్సాహమతిప్రతాప
సౌశీల్యమాధుర్యనయానయైశ్చ,
గామ్భీర్యచాతుర్యసువీర్యధైర్యై
ర్హనూమతః కోఽప్యధికోఽస్తి లోకే. 44

ప్ర. అ. పరాక్రమోత్సాహమతిప్రతాపసౌశీల్యమాధుర్యనయానయైః చ= పరాక్రమము, ఉత్సాహము, బుద్ధి, ప్రతాపము, మంచిస్వభావము, మధురత్వము (మంచితనము), నీతి, అనీతుల జ్ఞానము-వీటిచేత, గామ్భీర్యచాతుర్యసువీర్య ధైర్యైః= గాంభీర్యము, నేర్పు, గొప్పపరాక్రమము, ధైర్యము-వీటిచేత, లోకే= లోకమునందు, హనూమతః= హనుమంతునికంటె, అధికః= అధికుడు, కోఽపి =ఎవరైనా, అస్తి= ఉన్నాడా ?

తా. పరాక్రమము, ఉత్సాహము, బుద్ధి, ప్రతాపము, మంచి స్వభావము, మాధుర్యము, ఏది నీతి, ఏది కాదు అనే జ్ఞానము, గాంభీర్యము, నేర్పు, గొప్ప బలము, ధైర్యము అనే గుణములచేత హనుమంతునికంటె గొప్పవాడు, ఈ లోకములో, ఎవరైనా ఉన్నాడా ? 44

మూ. అసౌ పునర్వ్యాకరణం గ్రహీష్యన్
సూర్యోన్ముఖః ప్రష్టుమనాః కపీన్ద్రః,
ఉద్యద్గిరేరస్తగిరిం జగామ
గ్రన్థం మహద్ధారయన్నప్రమేయః. 45

ప్ర. అ. అప్రమేయః=ఇంతటివాడని చెప్ప శక్యము కాని, అసౌ= ఈ, కపీన్ద్రః=హనుమంతుడు, వ్యాకరణమ్=వ్యాకరణమును, గ్రహీష్యన్=గ్రహించ దలచినవాడై, సూర్యోన్ముఖః= సూర్యాభిముఖుడై, ప్రష్టుమనాః = అడుగుటకు మనస్సు కలవాడై, మహత్ = గొప్పదైన, గ్రన్థమ్= గ్రంథమును, ధారయన్= ధరించుచు, ఉద్యద్గిరేః=ఉదయాద్రి నుండి, అస్తగిరిమ్=అస్తాద్రిని గూర్చి, జగామ =వెళ్ళెను.

తా. అప్రమేయుడైన ఈ హనుమంతుడు వ్యాకరణమును అభ్యసించుటకై

పెద్ద గ్రంథమును తీసికొని, సూర్యునకు అభిముఖుడై, ఆ సూర్యుణ్ణి అడుగుట కొరకు ఉదయాద్రినుండి అస్తాద్రివరకు ప్రయాణము చేసెను. 45

మూ. ససూత్రవృత్త్యర్థపదం మహార్థం
ససంగ్రహం సాధ్యతి వై కపీన్ద్రః,
న హ్యస్తి కశ్చిత్సదృశోఽస్తి శాస్త్రే
వైశారదే ఛన్దగతౌ తథైవ. 46

ప్ర. అ. కపీన్ద్రః = ఈ వానరశ్రేష్ఠుడు, ససూత్రవృత్త్యర్థపదమ్=సూత్రములతోను, వృత్తి (సూత్రార్థము)తోను, వార్తికములతోనుకూడిన, ససంగ్రహమ్ = సంగ్రహముతో కూడిన, మహార్థమ్ = గొప్ప అర్థము గల మహాభాష్యమును, సాధ్యతి = సాధించుచున్నాడు. (ధరించినాడు). శాస్త్రే = శాస్త్రమునందు, వైశారదే = నేర్పునందు, తథైవ = మరియు, ఛన్దగతౌ = ఛందఃశాస్త్రరీతియందు, సదృశః = సమానుడు, కశ్చిత్ = ఎవ్వడూ కూడ, నాస్తి హి = లేడు కదా ?

తా. ఈ హనుమంతుడు పాణిని రచించిన అష్టాధ్యాయి అనే వ్యాకరణ సూత్రములతోను, వాటి వ్యాఖ్యతోను, వార్తికములతోను, సంగ్రహముతోను కూడిన మహాభాష్యమును ధరించినాడు. శాస్త్రపాండిత్యములోను, ఛందఃశాస్త్రరీతిలోను ఈతనితో సమానుడు ఎవడూ కూడ లేడు.

వి. క్రీస్తుకు పూర్వం ఏడవ శతాబ్దికి చెందిన పాణిని వ్యాకరణసూత్రములు రచించినాడు. ఎనిమిది అధ్యాయములలో ఉండుటచేత దీనికి 'అష్టాధ్యాయి' అని పేరు. దానికి లఘువ్యాఖ్యలు ఉండేవి. వాటికి 'వృత్తి' అని పేరు. సూత్రాలలో ఉన్న లోపాలు సవరించుచు కాత్యాయనాదులు కొన్ని వాక్యాలు వ్రాసినారు. వాటికి వార్తికము లని పేరు. పాణిని మేనమామయైన వ్యాడి అష్టాధ్యాయికి లక్ష గ్రంథాత్మకమైన విస్తృతవ్యాఖ్య రచించినాడట. దీనికి సంగ్రహము అని పేరు. ఆ గ్రంథము క్రి. శ. నాలుగు ఐదు శతాబ్దాలనాటికే అలభ్యం అయిపోయినది. కేవలం భర్తృహరి మొదలైనవారి గ్రంథాల ద్వారా దానిని గూర్చి తెలుస్తూన్నది. క్రి. పూ. 150 ప్రాంతంవాడైన పతంజలి అష్టాధ్యాయికి, వార్తికాలకి విస్తృత వ్యాఖ్య రచించినాడు. దానికి 'మహాభాష్యం' అని పేరు. వీటినన్నింటినీ హనుమంతుడు సూర్యునిదగ్గర అభ్యసించినాడని ఈ శ్లోకానికి భావం. అయితే కొందరు

వ్యాఖ్యాతలు 'సంగ్రహ' గ్రంథాన్ని గూర్చి వినలేదు కాబోలు, అందుచేత 'సంగ్రహ' శబ్దానికి ప్రకరణాదికము అని అర్థము వ్రాసినారు. ఈ శ్లోకం ప్రాచ్య ప్రతిలో లేదు. 46

మూ. సర్వాసు విద్యాసు తపోవిధానే
ప్రస్పర్ధతేఽయం హి గురుం సురాణామ్,
సోఽయం నవవ్యాకరణార్థవేత్తా
బ్రహ్మ భవిష్యత్యపి తే ప్రసాదాత్. 47

ప్ర. అ. అయమ్ = ఇతడు, సర్వాసు = సమస్తములైన, విద్యాసు = విద్యలయందు, తపోవిధానే = తపశ్చరణమునందు, సురాణాం గురుమ్ = బృహస్పతిని, ప్రస్పర్ధతే = పోటీపడుచున్నాడు. నవవ్యాకరణార్థవేత్తా = తొమ్మిది వ్యాకరణముల అర్థము తెలిసిన, సః అయమ్ = అట్టి ఇతడు, తవ = నీయొక్క, ప్రసాదాత్ = అనుగ్రహమువలన, బ్రహ్మ = బ్రహ్మగా, భవిష్యతి = కాగలడు.

తా. ఇతడు సకలవిద్యలలోను, తపశ్చర్యలోను బృహస్పతితో పోటీ చేయుచున్నాడు. తొమ్మిది వ్యాకరణములు ఎరిగిన ఇతడు నీ అనుగ్రహమువలన (రాబోవు కల్పములో) బ్రహ్మదేవుడు కాగలడు.

వి. ప్రాచ్యప్రతులు మొదలైనవాటిలో ఈ శ్లోకము లేదు. 47

మూ. ప్రవివిక్షోరివ సాగరస్య
లోకాన్ దిధక్షోరివ పావకస్య,
లోకక్షయేష్వేవ యథాన్తకస్య
హనూమతః స్థాస్యతి కః పురస్తాత్. 48

ప్ర. అ. ప్రవివిక్షోః = ప్రవేశింపదలచిన, సాగరస్య ఇవ = సముద్రము యొక్క వలె, లోకాన్ = లోకములను, దిధక్షోః = కాల్చదలచిన, పావకస్య ఇవ = అగ్నియొక్క వలె, లోకక్షయేషు ఏవ = ప్రళయకాలములయందు, అన్తకస్య యథా = యమునియొక్క వలె, హనూమతః = హనుమంతునియొక్క, పురస్తాత్ = ఎదుట, కః = ఎవడు, స్థాస్యతి = ఉండగలడు.

తా. భూమిని ముంచెత్తదలచిన సముద్రానికి వలె, లోకాలను కాల్చివేయ

దలచిన అగ్నికి వలె, ప్రళయకాలములో యమునకు వలె హనుమంతునికి ఎవరు ఎదుట నిలబడగలరు ? 48

మూ. ఏషేవ చాన్యే చ మహాకపీన్ద్రాః
సుగ్రీవమైన్దద్వివిదాః సనీలాః,
సతారతారేయనలాః సరమ్భా
స్త్వత్కారణాద్రామ సురైర్హి సృష్టాః. 49

ప్ర. అ. రామ = రామా ! ఏషేవ = ఈ హనుమంతుడు వలె, సనీలాః = నీలునితో కూడిన, సతారతారేయనలాః = తారునితోను, అంగదునితోను, నలునితోను కూడిన, సరమ్భాః = రంభునితో కూడిన, అన్యే = ఇతరులైన, మహాకపీన్ద్రాః = గొప్ప వానరనాయకులు, సుగ్రీవమైన్దద్వివిదాః = సుగ్రీవ-మైంద-ద్వివిదులు, సురైః = దేవతలచేత, త్వత్కారణాత్ = నీకారణమువలన, సృష్టాః హి = సృజింపబడినారు కదా ?

తా రామా ! ఈ హనుమంతుడు వలెనే సుగ్రీవుడు, మైందుడు, ద్వివిదుడు, నీలుడు, తారుడు, అంగదుడు, నలుడు, రంభుడు, ఇతర వానరవీరులూ కూడ నీకు సాహాయ్యము చేయుటకొరకే దేవతలచేత సృష్టించబడినారు. 49

మూ. గజో గవాక్షో గవయః సుదంష్ట్రో
మైన్దః ప్రభో జ్యోతిముఖో నలశ్చ,
ఏతే చ ఋక్షాః సహ వానరేన్ద్రై
స్త్వత్కారణాద్రామ సురైర్హి సృష్టాః. 50

ప్ర. అ. ప్రభో = ఓ ! ప్రభూ ! రామ = రామా ! గజః = గజుడు, గవాక్షః = గవాక్షుడు, గవయః = గవయుడు, సుదంష్ట్రః = సుదంష్ట్రుడు, మైన్దః = మైందుడు, జ్యోతిముఖః = జ్యోతిముఖుడు, నలశ్చ = నలుడు, ఏతే = ఈ, ఋక్షాః చ = భల్లూకములు, వానరేన్ద్రైః సహ = వానరనాయకులతో కూడ, త్వత్కారణాత్ = నీకారణమువలన, సురైః = దేవతలచేత, సృష్టాః హి = సృజింపబడినారు కదా.

తా. ఓ ! జగత్ప్రభూ ! రామా ! గజ-గవాక్ష-గవయ-సుదంష్ట్ర-మైంద-

శ్యోతిముఖ-నలు లనే ఈ భల్లూకములను, వానరనాయకులను నీకొరకే దేవతలు సృష్టించినారు. 50

మూ. తదేతత్కథితం సర్వం యన్మాం త్వం పరిపృచ్ఛసి,
హనూమతో బాలభావే కర్మైతత్కథితం మయా. 51

ప్ర. అ. త్వమ్ = నీవు, మామ్ = నన్ను, యత్ = దేనిని, పరిపృచ్ఛసి = అడుగుచున్నావో, తత్ = అట్టి, ఏతత్ సర్వమ్ = ఇది అంతా, కథితమ్ = చెప్పబడినది. హనూమతః = హనుమంతునియొక్క, బాలభావే = బాల్యమునందు, ఏతత్ = ఈ, కర్మ = పని, మయా = నాచేత, కథితమ్ = చెప్పబడినది.

తా. నీవు ప్రశ్నించిన విషయము లన్నీ చెప్పినాను. బాల్యములో హనుమంతుడు చేసిన పనికూడ చెప్పినాను. 51

మూ శ్రుత్వాగస్త్యస్య కథితం రామః సౌమిత్రిరేవ చ,
విస్మయం పరమం జగ్మర్వానరా రాక్షసైః సహ. 52

ప్ర. అ. రామః = రాముడు, సౌమిత్రిః ఏవ చ = లక్ష్మణుడు, రాక్షసైః సహ = రాక్షసులతో కూడ, వానరాః = వానరులు, అగస్త్యస్య = అగస్త్యుని యొక్క, కథితమ్ = చెప్పుటను, శ్రుత్వా = విని, పరమమ్ = గొప్ప, విస్మయమ్ = ఆశ్చర్యమును, జగ్ముః = పొందిరి.

తా. అగస్త్యుడు చెప్పిన వృత్తాంతమును విని రాముడు, లక్ష్మణుడు, వానరులు, రాక్షసులు చాల ఆశ్చర్యము పొందిరి. 52

మూ. అగస్త్యస్త్వబ్రవీద్రామం సర్వమేతచ్ఛ్రుతం త్వయా,
దృష్టః సంభాషితశ్చాసి రామ గచ్ఛామహే వయమ్. 53

ప్ర. అ. అగస్త్యః తు = అగస్త్యుడు, రామమ్ = రాముణ్ణి గూర్చి, అబ్రవీత్ = పలికెను, రామ = రామా! ఏతత్ = ఇది, సర్వమ్ = సమస్తమూ, త్వయా = నీచేత, శ్రుతమ్ = వినబడినది. దృష్టః = చూడబడినవాడవు, సంభాషితః = మాటలాడబడినవాడవు, అసి = అయితివి. వయమ్ = మేము, గచ్ఛామహే = వెళ్ళుచున్నాము.

తా. అగస్త్యుడు రామునితో-''రామా! ఈ కథ అంతా విన్నావు కదా.

మేము నీ దర్శనము చేసికొన్నాము , మాటలాడినాము. ఇంక వెళ్లెదము'' అని పలికెను. 53

మూ. శ్రుత్వైతద్రాఘవో వాక్యమగస్త్యస్యోగ్రతేజసః,
ప్రాఞ్జలిః ప్రణతశ్చాపి మహర్షిమిద మబ్రవీత్. 54

ప్ర. అ. రాఘవః = రాముడు, ఉగ్రతేజసః = ఉగ్రమైన తేజస్సు గల, అగస్త్యస్య=అగస్త్యుని యొక్క, ఏతత్ = ఈ, వాక్యమ్=వాక్యమును, శ్రుత్వా= విని, ప్రాఞ్జలిః=ఎత్తబడిన దోసిలి కలవాడై, ప్రణతః చ అపి=నమస్కరించుచు, మహర్షిమ్ = మహర్షిని గూర్చి, ఇదమ్ = ఈ వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తా. రాముడు ఉగ్రమైన తపఃశక్తి గల అగస్త్యుని మాటలు విని, అంజలి ఘటించి నమస్కరించుచు మహర్షితో ఇట్లనెను. 54

మూ. అద్య మే దేవతాస్తుష్టాః పితరః ప్రపితామహాః,
యుష్మాకం దర్శనాదేవ నిత్యం తుష్టాః సబాన్ధవాః. 55

ప్ర. అ. అద్య = నేడు, మే=నాకు, దేవతాః=దేవతలు, పితరః = పితృ దేవతలు, ప్రపితామహాః=ప్రపితామహులు, తుష్టాః=సంతోషించినారు. యుష్మాకమ్ = మీయొక్క, దర్శనాత్ ఏవ = దర్శనమువలననే, సబాన్ధవాః = బంధువులతో కూడిన మేము, నిత్యమ్ = నిత్యమూ, తుష్టాః = సంతోషించినాము.

తా. "నేడు దేవతలు, పితృదేవతలు, ప్రపితామహులు నా విషయమున సంతోషించినారు. మీ దర్శనమువలననే బంధుసహితులమైన మేము సంతోషించు చున్నాము". 55

మూ. విజ్ఞాప్యం తు మమైతద్ధి యద్వదామ్యాగతస్పృహః,
తద్భవద్భిర్మమ కృతే కర్తవ్యమనుకమ్పయా. 56

ప్ర. అ. మమ = నాకు, ఏతత్ = ఇది, విజ్ఞాప్యం హి = విజ్ఞాపన చేయదగినది కదా. ఆగతస్పృహః = వచ్చిన కోరిక గల నేను, యత్ = దేనిని, వదామి = చెప్పుచున్నానో, తత్ = అది, భవద్భిః = మీచేత, మమ కృతే = నా నిమిత్తమై, అనుకమ్పయా = దయతో, కర్తవ్యమ్ = చేయదగినది.

తా. "నేను విజ్ఞాపన చేయవలసినది ఒక టున్నది, కోరికతో నేను చెప్పుచున్న దానిని మీరు నా కోసమై దయతో చేయవలెను." 56

మూ. పౌరజానపదాన్ స్థాప్య స్వకార్యేష్వహమాగతః,
క్రతూనహం కరిష్యామి ప్రభావాద్భవతాం సతామ్. 57

ప్ర. అ. పౌరజానపదాన్ = పౌరులను, జానపదులను, స్వకార్యేషు = తమ కర్తవ్యములయందు, స్థాప్య = ఉంచి, ఆగతః = వచ్చిన, అహమ్ = నేను, సతామ్ = సత్పురుషులైన, భవతామ్ = మీయొక్క, ప్రభావాత్ = ప్రభావమువలన, క్రతూన్ = యజ్ఞములను, కరిష్యామి = చేయగలను.

తా. 'నేను పౌరులను, జానపదులను వారి వారి కార్యములందు నియమించి వచ్చి సత్పురుషులైన మీ ప్రభావమువలన క్రతువులు చేసెదను". 57

మూ. సదస్యా మమ యజ్ఞేషు భవన్తో నిత్యమేవ తు,
భవిష్యథ మహావీర్యా మమానుగ్రహకాఙ్క్షిణః. 58

ప్ర. అ. మహావీర్యాః = గొప్ప తపోబలము గల, భవన్తః = మీరు, మమ = నాయొక్క, యజ్ఞేషు = యజ్ఞములయందు, సదస్యాః = సదస్యులై (సభ్యులై). నిత్యమ్ ఏవ తు = ఎల్లప్పుడూ, మమ = నాయొక్క, అనుగ్రహకాఙ్క్షిణః = అనుగ్రహమును కోరుచున్నవారు, భవిష్యథ = కాగలరు.

తా. "తపోబలసంపన్నులైన మీరు, నాపై నిత్యము అనుగ్రహము చూపుచు, నేను చేయబోవు యజ్ఞములయందు సభ్యులుగా ఉందురుగాక". 58

మూ. అహం యుష్మాన్ సమాశ్రిత్య తపోనిర్ధూతకల్మషాన్,
అనుగృహీతః పితృభిర్భవిష్యామి సునిర్వృతః. 59

ప్ర. అ. అహమ్ = నేను, తపోనిర్ధూతకల్మషాన్ = తపస్సుచేత కడిగివేయబడిన పాపములు గల, యుష్మాన్ = మిమ్ములను, సమాశ్రిత్య = ఆశ్రయించి, పితృభిః = పితృదేవతలచేత, అనుగృహీతః = అనుగ్రహింపబడినవాడనై, సునిర్వృతః = చాల సంతోషించినవాడను, భవిష్యామి = కాగలను.

తా. "నేను తపస్సుచేత అన్ని పాపములను తొలగించుకొనిన మిమ్ములను ఆశ్రయించి, పితృదేవతల అనుగ్రహము పొంది సంతోషముతో ఉండగలను."

మూ. తదాగన్తవ్యమనిశం భవద్భిరిహ సంగతైః,
అగస్త్యాద్యాస్తు తచ్ఛ్రుత్వా ఋషయః సంశితవ్రతాః, 59
ఏవమస్త్వితి తం ప్రోచ్య ప్రయాతుముపచక్రముః,
ఏవముక్త్వా గతాః సర్వే ఋషయస్తే యథాగతమ్. 60

ప్ర. అ. తత్=ఆ కారణమువలన, సంగతైః=కలసిన, భవద్భిః=మీచేత, అనిశమ్=ఎల్లప్పుడూ, ఇహ=ఇక్కడికి, ఆగన్తవ్యమ్=రావలసి ఉన్నది. సంశితవ్రతాః=తీవ్రమైన నియమము గల, అగస్త్యాద్యాః=అగస్త్యుడు మొదలైన, ఋషయః=ఋషులు, తత్=దానిని, శ్రుత్వా=విని, ఏవమ్=ఇట్లే, అస్తు=అగుగాక, ఇతి=అని, ప్రోచ్య=పలికి, ప్రయాతుమ్=వెళ్ళుటకు, ఉపచక్రముః=ఉపక్రమించిరి. సర్వే=సమస్తమైన, తే ఋషయః=ఆ ఋషులు, ఏవమ్=ఇట్లు, ఉక్త్వా=పలికి, యథాగతమ్=వచ్చినవిధముగానే, గతాః=వెళ్ళినారు.

తా. "అందుచేత మీరందరూ కలిసి తరచు ఇక్కడికి వచ్చుచుండవలెను." కఠిననియమములు పాటించు అగస్త్యాది ఋషులు ఆ మాటలు విని, "అట్లే అగుగాక" అని పలికి వెళ్ళుటకు బయలుదేరిరి. ఆ ఋషులందరూ ఇట్లు పలికి వచ్చిన విధముననే తిరిగి వెళ్ళిరి. 59, 60

మూ. రాఘవశ్చ తమేవార్థం చిన్తయామాస విస్మితః,
తతోఽన్తం భాస్కరే యాతే విసృజ్య నృపవానరాన్ 61
సంధ్యాముపాస్య విధివత్తదా నరవరోత్తమః,
ప్రవృత్తాయాం రజన్యాం తు సోఽన్తఃపురచరోఽభవత్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
షట్త్రింశః సర్గః.

ప్ర. అ. రాఘవః చ=రాముడు కూడ, విస్మితః=ఆశ్చర్యపడినవాడై, తమ్=ఆ, అర్థమ్ ఏవ=విషయమునే, చిన్తయామాస=ఆలోచించెను. తతః=అటుపిమ్మట, భాస్కరే=సూర్యుడు, అస్తం యాతే=అస్తాద్రిని పొందినవాడగుచుండగా, తదా=అప్పుడు, సః=ఆ, నరవరోత్తమః=నరశ్రేష్ఠులలో ఉత్తము

డైన రాముడు, నృపవానరాన్ = రాజులను వానరులను, విసృజ్య = విడచి, విధివత్ = యథావిధిగా, సంధ్యామ్ = సంధ్యను, ఉపాస్య = సేవించి, రజన్యామ్ = రాత్రి, ప్రవృత్తాయామ్ = ప్రారంభ మైనదగుచుండగా, అన్తఃపురచరః = అంతఃపురమునందు సంచరించేవాడు, అభవత్ = అయెను.

తా. రాముడు ఆశ్చర్యముతో కొంతసేపు ఆ విషయములను గూర్చియే ఆలోచించెను. ఇంతలో సూర్యుడు అస్తాద్రికి వెళ్ళెను. అప్పుడు రాముడు రాజులను, వానరులను వారి వారి విడిదులకు పంపివేసి, యథావిధిగా సంధ్యోపాసన చేసి, రాత్రి కాగానే అంతఃపురములో ప్రవేశించెను. 62

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ముప్పైఆరవ సర్గ సమాప్తము.

అథ సప్తత్రింశః సర్గః

[రాముడు సదస్యులతో కూడి రాజసభను అలంకరించుట]

మూ. అభిషిక్తే తు కాకుత్స్థే ధర్మేణ విదితాత్మని,
వ్యతీతా యా నిశా పూర్వా పౌరాణాం హర్షవర్ధనీ. 1

ప్ర. అ. ధర్మేణ = ధర్మముచేత, విదితాత్మని = ప్రసిద్ధమైన మనస్సు గల, కాకుత్స్థే = రాముడు, అభిషిక్తే తు = అభిషేకించబడినవాడగుచుండగా, పౌరాణామ్ = పౌరుల, హర్షవర్ధనీ = సంతోషమును వృద్ధి పొందించు, యా = ఏ, పూర్వా = మొదటి, నిశా = రాత్రి ఉన్నదో అది, వ్యతీతా = గడచినది.

తా. ధర్మముచేత ప్రసిద్ధమైన మనస్సు గల (ధార్మికప్రవృత్తి గల మనస్సు కలవాడుగా ప్రసిద్ధుడైన) రాముడు రాజ్యాభిషిక్తుడైన తరువాత పౌరుల సంతోషమును వృద్ధిపొందించు మొదటి రాత్రి గడచినది. 1

మూ. తస్యాం రజన్యాం వ్యుష్టాయాం ప్రాతర్నృపతిబోధకాః,
వన్దినః సముపాతిష్ఠన్ సౌమ్యా నృపతివేశ్మని. 2

ప్ర. అ. తస్యామ్ = ఆ, రజన్యామ్ = రాత్రి, వ్యుష్టాయామ్ = తెల్లవారినదగుచుండగా ప్రాతః = ప్రాతఃకాలమునందు, నృపతిబోధకాః = రాజును మేల్కొలుపు, సౌమ్యాః = సౌమ్యులైన, వన్దినః = వందులు, నృపతివేశ్మని = రాజగృహమునందు, సముపాతిష్ఠన్ = వచ్చిరి.

తా. ఆ రాత్రి తెల్లవారగానే రాజును మేల్కొలుపు సౌమ్యులైన స్తోత్రపాఠకులు ప్రాతఃకాలమునందు రాజప్రాసాదమునకు వచ్చిరి. 2

మూ. తే రక్తకణ్ఠినః సర్వే కింనరా ఇవ శిక్షితాః,
తుష్టువుర్నృపతిం వీరం యథావత్ సంప్రహర్షిణః. 3

ప్ర. అ. రక్తకణ్ఠినః = మధురమైన కంఠస్వరము గలవారు, శిక్షితాః = బాగుగా నేర్పబడిన, కింనరాః ఇవ = కింనరులవలె ఉన్న, తే సర్వే = వాళ్ళందరూ, సంప్రహర్షిణః = సంతోషముగలవారై, వీరమ్ = వీరుడైన, నృపతిమ్ = రాజును, యథావత్ = యథావిధిగా, తుష్టువుః = స్తుతించిరి.

తా. సుశిక్షితులైన కింనరుల వలె మధురకంఠధ్వని గల వాళ్ళందరూ సంతోషవంతులై వీరుడైన రాజును యథావిధిగా స్తుతించిరి 3

మూ. వీర సౌమ్య ప్రబుధ్యస్వ కౌసల్యాప్రీతివర్ధన,
జగద్ధి సర్వం స్వపితి త్వయి సుప్తే నరాధిప. 4

ప్ర. అ. వీర = వీరుడా! సౌమ్య = సౌమ్యుడా! కౌసల్యాప్రీతివర్ధన = కౌసల్యకు సంతోషమును వృద్ధిపొందించువాడా! ప్రబుధ్యస్వ = మేల్కొనుము. నరాధిప = రాజా! త్వయి = నీవు, సుప్తే = నిద్రపోవుచుండగా, సర్వమ్ = సమస్తమైన, జగత్ = జగత్తు, స్వపితి హి = నిద్రపోవును కదా ?

తా. కౌసల్యకు ఆనందమును వృద్ధిపొందించు, వీరుడవు, సౌమ్యుడవు అయిన రామా! మేల్కొనుము. రాజా! నీవు నిద్రపోవుచున్నచో జగత్తు అంతా నిద్రపోవునుగదా? 4

మూ. విక్రమస్తే యథా విష్ణో రూపం చైవాశ్వినోరివ,
బుద్ధ్యా బృహస్పతేస్తుల్యః ప్రజాపతిసమో హ్యసి. 5

ప్ర. అ. తే = నీయొక్క, విక్రమః = పరాక్రమము, విష్ణోః యథా = విష్ణువుయొక్క విక్రమము వంటిది. రూపం చ = రూపము, అశ్వినోరివ = అశ్వినీదేవతల రూపమువంటిది. బుద్ధ్యా = బుద్ధిచేత, బృహస్పతేః = బృహస్పతికి, తుల్యః = సమానుడవు. ప్రజాపతిసమః = ప్రజాపతితో సమానుడవు, అసి హి = అయి ఉన్నావు కదా ?

తా. నీ పరాక్రమము విష్ణువుపరాక్రమము వంటిది. రూపము అశ్వినీదేవతల రూపము వంటిది. నీవు బుద్ధిచేత బృహస్పతితో సమానుడవు. ప్రజాపతివంటివాడవు.

మూ. క్షమా తే పృథివీతుల్యా తేజసా భాస్కరోపమః,
వేగస్తే వాయునా తుల్యో గామ్భీర్యముదధేరివ. 6

ప్ర. అ. తే = నీయొక్క, క్షమా = ఓర్పు, పృథివీతుల్యా = భూమితో సమానము. తేజసా = తేజస్సుచేత, భాస్కరోపమః = సూర్యునితో సమానుడవు. తే = నీయొక్క, వేగః = వేగము, వాయునా = వాయువుతో, తుల్యః = సమానము. గామ్భీర్యమ్ = గాంభీర్యము, ఉదధేః ఇవ = సముద్రముయొక్క గాంభీర్యము వంటిది.

తా. నీ ఓర్పు భూమి ఓర్పు వంటిది. నీ తేజస్సు సూర్యుని తేజస్సుతో సమానము. నీ వేగము వాయువుతో తుల్యము. గాంభీర్యము సముద్రముగాంభీర్యము వంటిది. 6

మూ. అప్రకమ్ప్యో యథా స్థాణుశ్చన్ద్రే సౌమ్యత్వమీదృశమ్,
నేదృశాః పార్థివాః పూర్వం భవితారో నరాధిప. 7

ప్ర. అ. స్థాణుః యథా = శివుడు వలె, అప్రకమ్ప్యః = కంపింపశక్యము కానివాడవు. ఈదృశమ్ = ఇట్టి, సౌమ్యత్వమ్ = సౌమ్యత్వము, చన్ద్రే = చంద్రుని యందున్నది. నరాధిప = రాజా! ఈదృశాః = ఇట్టి, పార్థివాః = రాజులు, పూర్వమ్ = పూర్వము, న = లేరు. న భవితారః = ఇటుపై ఉండబోరు.

తా. నీవు శివుడు వలె కదల్ప శక్యము కానివాడవు. నీ వంటి సౌమ్యత్వము చంద్రునిలోమాత్రమే ఉన్నది. మహారాజా! నీవంటి రాజులు పూర్వమెన్నడూ లేరు. మున్ముందు పుట్టరు. 7

మూ. యథా త్వమసి దుర్ధర్షో ధర్మనిత్యః ప్రజాహితః,
న త్వాం జహాతి కీర్తిశ్చ లక్ష్మీశ్చ పురుషర్షభ. 8

ప్ర. అ. పురుషర్షభ = పురుషశ్రేష్ఠుడా! త్వమ్ = నీవు, యథా = ఎట్లు, దుర్ధర్షః = ఎదిరింప శక్యముకానివాడవు, ధర్మనిత్యః = ధర్మమునందు నిత్యుడవు, ప్రజాహితః = ప్రజలకు హితుడవు అయి ఉన్నావో అట్లే, కీర్తిః చ = కీర్తి, త్వామ్ = నిన్ను, న జహాతి = విడచుటలేదు. లక్ష్మీః చ = లక్ష్మి కూడ, న = విడచుటలేదు.

తా. నీవు ఎదురింప శక్యముకానివాడవు. నిత్యము ధర్మతత్పరుడవు. ప్రజల హితమును కోరువాడవు. పురుషశ్రేష్ఠుడా! నిన్ను కీర్తి, లక్ష్మి విడిచిపెట్టవు. 8

మూ. శ్రీశ్చ ధర్మశ్చ కాకుత్స్థ త్వయి నిత్యం ప్రతిష్ఠితౌ,
ఏతాశ్చాన్యాశ్చ మధురా వన్దిభిః పరికీర్తితాః. 9

ప్ర. అ. కాకుత్స్థ = రామా ! శ్రీశ్చ = లక్ష్మి, ధర్మశ్చ = ధర్మమూ, త్వయ = నీయందు, నిత్యమ్ = నిత్యమూ, ప్రతిష్ఠితౌ = స్థిరముగా ఉన్నవి. వన్దిభిః = వందులచేత. ఏతాశ్చ = ఇవీ, మధురాః = మధురములైన, అన్యాశ్చ= ఇతరస్తుతులూ, పరికీర్తితాః = పలకబడినవి.

తా. "రామా ! నీయందు లక్ష్మి, ధర్మము స్థిరముగా నిలచి ఉన్నవి". వందులు ఈ స్తుతులను, మధురములైన మరి కొన్ని స్తుతులను చేసిరి. 9

మూ. సూతాశ్చ సంస్తవైర్దివ్యైర్బోధయన్తి స్మ రాఘవమ్,
స్తుతిభిః స్తూయమానాభిః ప్రత్యబుధ్యత రాఘవః. 10

ప్ర. అ. సూతాః చ=సూతులు కూడ, దివ్యైః = ఉత్తమములైన, సంస్తవైః = స్తుతులతో, రాఘవమ్ = రాముణ్ణి, బోధయన్తి స్మ = మేల్కొలిపిరి. రాఘవః = రాముడు, స్తూయమానాభిః = స్తుతింపబడుచున్న, స్తుతిభిః = స్తుతుల చేత, ప్రత్యబుధ్యత = మేల్కొనెను.

తా. సూతులు కూడ ఉత్తమములైన స్తుతులతో రాముణ్ణి మేల్కొలిపిరి. రాముడు ఈ విధముగ వందిసూతాదులు చేసిన స్తుతులకు మేల్కొనెను. 10

మూ. స తద్విహాయ శయనం పాణ్డురాచ్ఛాదనాస్తృతమ్,
ఉత్తస్థౌ నాగశయనాద్ధరిర్నారాయణో యథా. 11

ప్ర. అ. సః = అతడు, పాణ్డురాచ్ఛాదనాస్తృతమ్ = తెల్లని ఆచ్ఛాదనము చేత కప్పబడిన, తత్ = ఆ, శయనమ్ = శయనమును. విహాయ = విడచి, నాగ శయనాత్ = ఆదిశేషశయనమునుండి, హరిః=పాపములను హరించు, నారాయణః యథా=విష్ణువు వలె, ఉత్తస్థౌ = లేచెను.

తా. రాముడు తెల్లని ఆచ్ఛాదనవస్త్రముచేత కప్పబడిన ఆ శయనమును విడచి ఆదిశేషశయనమునుండి సర్వపాపహరుడైన నారాయణుడు లేచినట్లు లేచెను. 11

మూ. తముత్థితం మహాత్మానం ప్రహ్వాః ప్రాఞ్జలయో నరాః.
సలిలం భాజనైః శుభ్రైరుపతస్థుః సహస్రశః. 12

ప్ర. అ. ప్రహ్వాః = వంగిన, ప్రాఞ్జలయః = కట్టబడిన దోసిళ్ళు గల, సహస్రశః = వేలకొలది, నరాః = మనుష్యులు, శుభ్రైః = శుభ్రములైన, భాజనైః = పాత్రలచేత, సలిలమ్ = ఉదకమును గ్రహించి, ఉత్థితమ్ = లేచిన, మహాత్మానమ్ = మహాత్ముడైన, తమ్ = ఆ రాముణ్ణి, ఉపతస్థుః = సమీపించిరి.

తా. ఆ రాముడు లేవగానే అనేకమంది మనుష్యులు వినయముతో దోసిళ్ల కట్టి నమస్కరించి, శుభ్రములైన పాత్రలతో జలమును తీసికొనివచ్చి అతనిని సమీపించిరి. 12

మూ. కృతోదకః శుచిర్భూత్వా కాలే హుతహుతాశనః,
దేవాగారం జగామాశు పుణ్యమిక్ష్వాకుసేవితమ్. 13

ప్ర. అ. కృతోదకః = చేయబడిన స్నానముకలవాడై, శుచిః = పవిత్రుడు, భూత్వా = అయి, కాలే = తగినకాలమునందు, హుతహుతాశనః = హోమము చేయబడిన అగ్ని గలవాడై, ఆశు = శీఘ్రముగా, ఇక్ష్వాకుసేవితమ్ = ఇక్ష్వాకు రాజులచేత సేవింపబడిన, పుణ్యమ్ = పవిత్రమైన, దేవాగారమ్ = దేవతాగృహ మును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. స్నానము చేసి, పవిత్రుడై, తగు కాలమునందు అగ్నిహోమము చేసి, శీఘ్రముగా ఇక్ష్వాకురాజులచేత సేవింపబడిన పవిత్రమైన దేవతాగృహమునకు వెళ్ళెను. 13

మూ. తత్ర దేవాన్ పితౄన్ విప్రానర్చయిత్వా యథావిధి,
బాహ్యకక్షాన్తరం రామో నిర్జగామ జనైర్వృతః. 14

ప్ర. అ. రామః = రాముడు, తత్ర = అక్కడ, దేవాన్ = దేవతలను, పితౄన్ = పితృదేవతలను, విప్రాన్ = బ్రాహ్మణులను, యథావిధి = యథాశాస్త్ర ముగా, అర్చయిత్వా = పూజించి, జనైః = జనులతో, వృతః = కూడినవాడై, బాహ్యకక్షాన్తరమ్ = వెలుపలి వాకిలిని గూర్చి, నిర్జగామ = బైటకువచ్చెను.

తా. రాముడు అక్కడ దేవతలను, పితృదేవతలను, బ్రాహ్మణులను యథా విధిగా పూజించి, జనులతో కలిసి బైట నున్న వాకిలి దాటి వచ్చెను. 14

మూ. ఉపతస్థుర్మహాత్మానో మన్త్రిణః సపురోహితాః,
వసిష్ఠప్రముఖాః సర్వే దీప్యమానా ఇవాగ్నయః. 15

ప్ర. అ. సపురోహితాః=పురోహితులతో కూడిన, మహాత్మానః=మహాత్ము లైన, మన్త్రిణః = మంత్రులు, దీప్యమానాః = ప్రజ్వలించుచున్న, అగ్నయః ఇవ = అగ్నులు వలె ఉన్న, సర్వే = సమస్తమైన, వసిష్ఠప్రముఖాః = వసిష్ఠుడు మొదలైనవారు, ఉపతస్థుః = సమీపించిరి.

తా. పురోహితులు, మహాత్ములైన మంత్రులు, ప్రజ్వలించుచున్న అగ్నుల వలె ఉన్న వసిష్ఠాదులు ఆదరపూర్వకముగా అతని దగ్గరకు చేరిరి. 15

మూ. క్షత్రియాశ్చ మహాత్మానో నానాజనపదేశ్వరాః,
రామస్యోపావిశన్ పార్శ్వే శక్రస్యేవ యథామరాః. 16

ప్ర. అ. నానాజనపదేశ్వరాః=అనేకదేశముల ప్రభువులైన, మహాత్మానః= మహాత్ములైన, క్షత్రియాః చ=క్షత్రియులు కూడ, శక్రస్య=ఇంద్రుని పార్శ్వము నందు, అమరాః ఇవ = దేవతలు వలె, రామస్య = రామునియొక్క, పార్శ్వే = పార్శ్వమునందు, ఉపావిశన్ = కూర్చుండిరి.

తా. అనేకదేశముల ప్రభువులైన మహాత్ములైన క్షత్రియులు కూడ, ఇంద్రుని ప్రక్క దేవతలు కూర్చున్నట్లు రాముని ప్రక్క కూర్చుండిరి. 16

మూ. భరతో లక్ష్మణశ్చాత్ర శత్రుఘ్నశ్చ మహాయశాః,
ఉపాసాంచక్రిరే హృష్టా వేదాస్త్రయ ఇవాధ్వరమ్. 17

ప్ర. అ. అత్ర = ఇచట, భరతః=భరతుడు, లక్ష్మణః చ = లక్ష్మణుడు, మహాయశాః = గొప్ప కీర్తిగల, శత్రుఘ్నః చ=శత్రుఘ్నుడు, హృష్టాః=సంతో షించినవారై, త్రయః = మూడు, వేదాః = వేదములు, అధ్వరమ్ ఇవ = యజ్ఞ మును వలె, ఉపాసాంచక్రిరే = ఉపాసించిరి.

తా. అక్కడ భరతుడు, లక్ష్మణుడు, గొప్ప కీర్తి గల శత్రుఘ్నుడు మూడు వేదములు యజ్ఞమును ఉపాసించినట్లు రాముణ్ణి ఉపాసించిరి. 17

మూ. యాతాః ప్రాఞ్జలయో భూత్వా కింకరా ముదితాననాః,
ముదితా నామ పార్శ్వస్థా బహవః సముపావిశన్. 18

ప్ర. అ. కింకరాః=కింకరులు, ప్రాఞ్జలయః=కట్టబడిన దోసిళ్లు కలవారు, భూత్వా=అయి, ముదితాననాః=సంతోషించిన ముఖములు గలవారై, యాతాః= వెళ్ళిరి. ముదితా నామ = ముదిత లను పేరు గల, పార్శ్వస్థాః = పార్శ్వము నందుండువాళ్లు, బహవః = చాలమంది, సముపావిశన్ = దగ్గర కూర్చుండిరి.

తా. కింకరులు అంజలి ఘటించి నమస్కరించి, వికసించిన ముఖములతో దూరముగా తొలగిరి. ముదిత లను చాలమంది పార్శ్వమునందు ఉండేవాళ్ళు దగ్గర కూర్చుండిరి. 18

మూ. వానరాశ్చ మహావీర్యా వింశతిః కామరూపిణః,
సుగ్రీవప్రముఖా రామముపాసన్తే మహౌజసః. 19

ప్ర. అ. మహావీర్యాః=గొప్ప పరాక్రమము గల, కామరూపిణః=స్వేచ్ఛా రూపము గల, మహౌజసః=గొప్ప తేజస్సు గల, సుగ్రీవప్రముఖాః = సుగ్రీవుడు మొదలైన, వింశతిః = ఇరువదిమంది, వానరాః చ = వానరులు కూడ, రామమ్ ఉపాసన్తే = రాముని దగ్గర కూర్చుండిరి.

తా. గొప్ప పరాక్రమము, తేజస్సు గల, స్వేచ్ఛానుసారము రూపములు ధరించు సుగ్రీవుడు మొదలైన ఇరువదిమంది వానరులు రాముని దగ్గర కూర్చుం డిరి. 19

మూ. విభీషణశ్చ రక్షోభిశ్చతుర్భిః పరివారితః,
ఉపాసతే మహాత్మానం ధనేశమివ గుహ్యకః. 20

ప్ర. అ. చతుర్భిః = నలుగురు, రక్షోభిః = రాక్షసులతో, పరివారితః = కూడిన, విభీషణః చ = విభీషణుడు కూడ, మహాత్మానమ్ = మహాత్ముడైన రాముణ్ణి, గుహ్యకః = యక్షుడు, ధనేశమ్ ఇవ = కుబేరుణ్ణి వలె, ఉపాసతే = ఉపాసించుచుండెను.

తా. నలుగురు రాక్షసులతో కూడిన విభీషణుడు యక్షుడు కుబేరుని దగ్గర కూర్చున్నట్లు మహాత్ముడైన రామునిదగ్గర కూర్చుండెను. 20

మూ. తథా నిగమవృద్ధాశ్చ కులీనా యే చ మానవాః,
శిరసా వన్ద్య రాజానముపాసన్తే విచక్షణాః. 21

ప్ర. అ. తథా = మరియు, నిగమవృద్ధాః చ = ఆ యా సంఘములలో పెద్దలు, కులీనాః = సత్కులములందు పుట్టిన, యే = ఏ, మానవాః = మానవులు గలరో, విచక్షణాః = నేర్పు గల, తే = వారు, రాజానమ్ = రాజును, శిరసా = శిరస్సుచేత, వన్ద్య = నమస్కరించి, ఉపాసన్తే = ఉపాసించుచుండిరి.

తా. ఆ యా సంఘముల పెద్దలు, నేర్పు గల, సత్కులప్రసూతులైన మానవులు రామునకు శిరస్సు వంచి నమస్కరించి ఉపాసించుచుండిరి. 21

మూ. తథా పరివృతో రాజా శ్రీమద్భిరృషిభిర్వరైః,
రాజభిశ్చ మహావీర్యైర్వానరైశ్చ సరాక్షసైః. 22
యథా దేవేశ్వరో నిత్యమృషిభిః సముపాస్యతే,
అధికస్తేన రూపేణ సహస్రాక్షాద్విరోచతే. 23

ప్ర. అ దేవేశ్వరః = దేవేంద్రుడు, నిత్యమ్ = ఎల్లప్పుడూ, ఋషిభిః = ఋషులచేత, యథా = ఎట్లు, సముపాస్యతే = ఉపాసించబడునో, తథా = అట్లే, రాజా = రాముడు, శ్రీమద్భిః = శ్రీమంతులు, వరైః = శ్రేష్ఠులూ అయిన, ఋషిభిః = ఋషులతోను, మహావీర్యైః = గొప్ప పరాక్రమము గల, రాజభిః చ = రాజుల తోను, సరాక్షసైః = రాక్షసులతో కూడిన, వానరైః చ = వానరులతోను, పరివృతః = కూడి ఉండెను. తేన = ఆ, రూపేణ = రూపముచేత, సాక్షాత్ = సాక్షాత్తూ, సహస్రాక్షాత్ = ఇంద్రునికంటె, అధికః = అధికుడై, విరోచతే = ప్రకాశించు చుండెను.

తా. దేవేంద్రుని చుట్టూ ఎల్లప్పుడూ ఋషులు ఉన్నట్లు రాముని చుట్టూ తేజోవంతులూ, ఉత్తములూ అయిన ఋషులూ, గొప్ప పరాక్రమము గల రాజులూ, వానరులూ, రాక్షసులూ కూర్చుండి ఉండిరి. కాని రూపసంపదచేత రాముడు దేవేంద్రునికంటె అధికముగా ప్రకాశించుచుండెను. 22,23

మూ. తేషాం సముపవిష్టానాం తాస్తాః సుమధురాః కథాః,
కథ్యన్తే ధర్మసంయుక్తాః పురాణజ్ఞైర్మహాత్మభిః. 24

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
సప్తత్రింశః సర్గః.

ప్ర. అ. సముపవిష్టానామ్=కూర్చొని ఉన్న, తేషామ్=వారికి, పురాణజ్ఞైః =పురాణములను ఎరిగిన, మహాత్మభిః=మహాత్ములచేత, ధర్మసంయుతాః= ధర్మముతో కూడిన, సుమధురాః=చాల మధురములైన, తాః తాః=ఆ యా, కథాః=కథలు, కథ్యన్తే=చెప్పబడుచుండెను.

తా. వారందరూ కూర్చొని ఉండగా పురాణములను ఎరిగిన మహాత్ములు వారికి చాల మధురములు, ధర్మబోధకములూ అయిన ఆ యా కథలు చెప్పుచుండిరి. 25

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ముప్పదిఏడవ సర్గ సమాప్తము.

(ఇటుపైన అగస్త్యుడు రామునకు వాలిసుగ్రీవవృత్తాంతాదులు చెప్పినట్లు ఐదు సర్గలు ఉన్నవి. అగస్త్యాదులు అందరూ తిరిగి తమ స్థానాలకు వెళ్ళిపోయినట్లు 36వ సర్గలో చెప్పిన తరవాత ఇక్కడ ఈ సర్గలు వచ్చుట అసంగతము గాన ఇవి ప్రక్షిప్తసర్గలనీ, అందుచేత వ్యాఖ్యాతలు వీటికి వ్యాఖ్యానములు వ్రాయలేదనీ పరిమల వల్లికేషన్సువారు వ్యాఖ్యాత్రయముతో ప్రకటించిన రామాయణం సంపాదకులు (2884 పేజీలో) వ్రాసినారు.)

ప్రక్షిప్తః సర్గః ప్రథమః

[బ్రహ్మదేవుని కన్నీటినుండి ఋక్షరజస్సు అను వానరుడు పుట్టుట. ఒక సరస్సులో మునగగానే అతడు స్త్రీ అగుట. ఆమెను చూచి మోహించిన ఇంద్రసూర్యుల ద్వారా వాలిసుగ్రీవులు పుట్టుట. ఋక్షరజస్సును బ్రహ్మదేవుడు కిష్కింధలో వానరరాజుగా చేయుట].

మూ. ఏతచ్ఛ్రుత్వా తు నిఖిలం రాఘవోఽగస్త్యమబ్రవీత్,
యఏషర్క్షరజా నామ వాలిసుగ్రీవయోః పితా. 1
జననీ కా చ భవనం సా త్వయా పరికీర్తితా,
వాలిసుగ్రీవయోశ్చాపి నామనీ కేన హేతునా. 2
ఏతద్బ్రహ్మన్ సమాచక్ష్వ కౌతూహలమిదం హి నః.

ప్ర. అ. రాఘవః=రాముడు, ఏతత్ = దీనిని, నిఖిలమ్=సమస్తమునూ, శ్రుత్వా = విని, అగస్త్యమ్ = అగస్త్యుని గూర్చి, అబ్రవీత్=పలికెను. ఋక్షరజా నామ = ఋక్షరజస్సు అను, యః ఏషః = ఏ ఇతడు గలడో, అతడు, వాలిసుగ్రీవయోః = వాలిసుగ్రీవుల, పితా = తండ్రి. భవనమ్ = వాళ్ళ ఉత్పత్తిస్థానమైన, జననీ=తల్లి, కా = ఎవతె, త్వయా = నీచేత, పరికీర్తితా = చెప్పబడినది ? వాలిసుగ్రీవయోః = వాలిసుగ్రీవుల, నామనీ = పేర్లు, కేన హేతునా = ఏ హేతువు చేత ? బ్రహ్మన్ = ఓ! బ్రాహ్మణుడా ! ఏతత్=దీనిని, సమాచక్ష్వ = చెప్పుము; నః = మాకు, ఇదమ్ = ఇది, కౌతూహలం హి = వేడుక గదా !

తా. రాముడు ఇదంతా విని అగస్త్యునితో ఇట్లు పలికెను - "ఋక్షరజస్సు అను నతడు వాలిసుగ్రీవుల తండ్రి కదా ? వీళ్ళ తల్లి ఎవరని నీవు చెప్పినావు? వాలిసుగ్రీవులకు ఆ పేర్లు ఎందుకు వచ్చినవి ? ఈ విషయమును చెప్పుము. మాకు దాని విన వేడుకగా ఉన్నది". 1, 2

మూ. స ప్రోక్తో రాఘవేణైవమగస్త్యో వాక్యమబ్రవీత్, 3
శృణు రామ కథామేతాం యథాపూర్వం సమాసతః.

ప్ర. అ. రాఘవేణ = రామునిచేత, ఏవమ్ = ఇట్లు, ప్రోక్తః = పలకబడిన, సః = ఆ, అగస్త్యః = అగస్త్యుడు, వాక్యమ్ = వాక్యమును, అబ్రవీత్ = పలికెను. రామ = రామా. ఏతాం కథామ్ = ఈ కథను, యథాపూర్వమ్ = పూర్వము జరిగినవిధముగ, సమాసతః = సంక్షిప్తముగా (లేదా పూర్తిగా), శృణు = వినుము.

తా. రాముని మాటలు విని అగస్త్యు డిట్లు పలికెను - "రామా ! ఈ కథను పూర్వము జరిగిన విధముగ పూర్తిగా వినుము." 3

మూ. నారదః కథయామాస మమాశ్రమ ముపాగతః, 4
కదాచిదటమానోఽసావతిథిత్వముపాగతః.

ప్ర. అ. మమ = నాయొక్క, ఆశ్రమమ్ = ఆశ్రమమును, ఉపాగతః = పొందిన, నారదః = నారదుడు, కథయామాస = చెప్పెను. అటమానః = సంచరించుచున్న, అసౌ = ఇతడు, కదాచిత్ = ఒకానొకనాడు, అతిథిత్వమ్ = అతిథిత్వమును, ఉపాగతః = పొందినాడు.

తా. నా ఆశ్రమమునకు వచ్చిన నారదుడు చెప్పినాడు. లోకసంచారము చేయుచున్న ఇతడు ఒకనాడు నాకు అతిథిగా వచ్చినాడు. 4

మూ. అర్చితస్తు యథాన్యాయం విధిదృష్టేన కర్మణా, 5
సుఖాసీనః కథామేనాం మయా పృష్టః స కౌతుకాత్.
కథయామాస ధర్మాత్మా మహర్షే శ్రూయతామితి. 6

ప్ర. అ. విధిదృష్టేన = శాస్త్రమునందు చూడబడిన, కర్మణా = కర్మచేత, యథాన్యాయమ్ = న్యాయానుసారముగా, అర్చితః = పూజింపబడినాడు. సుఖాసీనః = సుఖముగా కూర్చున్న, సః ధర్మాత్మా = ఆ ధర్మాత్ముడు, కౌతుకాత్ = వేడుకవలన, మయా = నాచేత, పృష్టః = అడగబడినవాడై, మహర్షే = మహర్షీ ! శ్రూయతామ్ = వినబడుగాక, ఇతి = అని, కథయామాస = చెప్పెను.

తా. శాస్త్రోక్తప్రకారము న్యాయానుసారముగా పూజింపబడి సుఖముగా కూర్చొని ఉన్న అతనిని నేను వేడుకచేత అడుగగా అతడు "మహర్షి ! వినుము" అని ఉపక్రమించి ఈ కథను చెప్పెను. 5, 6

మూ. మేరుర్నగవరః శ్రీమాన్ జామ్బూనదమయః శుభః,
తస్య యన్మధ్యమం శృఙ్గం సర్వదైవతపూజితమ్. 7

తస్మిన్ దివ్యా సభా రమ్యా బ్రహ్మణః శతయోజనా,
తస్యామాస్తే సదా దేవః పద్మయోనిశ్చతుర్ముఖః. 8

ప్ర. అ. శ్రీమాన్ = శోభాయుక్తము, జామ్బూనదమయః = సువర్ణమయము, శుభః = సుందరమూ అయిన, నగధరః=పర్వతశ్రేష్ఠమైన, మేరుః= మేరుపర్వత మున్నది. తస్య = దానియొక్క, సర్వదైవతపూజితమ్ = సమస్త దేవతలంచేతా పూజింపబడిన, యత్ = ఏ, మధ్యమం శృఙ్గమ్=మధ్యమశిఖరము గలదో, తస్మిన్ = దానిమీద, బ్రహ్మణః=బ్రహ్మదేవునియొక్క, శతయోజనా= నూరు యోజనముల విస్తారము గల, రమ్యా = సుందరమైన, దివ్యా = దివ్యమైన, సభా = సభ ఉన్నది. పద్మయోనిః = పద్మము ఉత్పత్తిస్థానముగా గల, చతుర్ముఖః = నాలుగు ముఖములు గల, దేవః = బ్రహ్మదేవుడు, సదా = ఎల్లప్పుడూ, తస్యామ్ = దానియందు, ఆస్తే = ఉన్నాడు.

తా. బంగారము వికారమైన, శోభాయుక్తము, మంగళప్రదమూ, పర్వతశ్రేష్ఠమూ అయిన మేరుపర్వత మున్నది. దాని మధ్యమశిఖరము దేవతలందరిచేత పూజింపబడునది. దానిమీద నూరుయోజనముల విస్తారము గల బ్రహ్మదేవుని రమ్యమైన దివ్యసభ ఉన్నది. పద్మమునుండి పుట్టిన, చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు నిత్యమూ ఆ సభలో ఉండును. 7, 8

మూ. యోగమభ్యస్యతస్తస్య నేత్రాభ్యాం యదసుస్రువత్,
తద్గృహీతం భగవతా పాణినా చర్చితం తు తత్. 9

ప్ర. అ. యోగమ్=యోగమును, అభ్యస్యతః=అభ్యసించుచున్న, తస్య= ఆ బ్రహ్మదేవునియొక్క, నేత్రాభ్యామ్ = నేత్రములనుండి యత్ = ఏది, అసుస్రువత్ = స్రవించెనో, తత్ = అది, భగవతా = భగవంతునిచేత, గృహీతమ్=

గ్రహింపబడినది. తత్ = అది, పాణినా = హస్తముచేత, చర్చితమ్ = రాయ బడినది.

తా. బ్రహ్మదేవుడు యోగాభ్యాసము చేయుచుండగా ఆతని నేత్రముల నుండి జలము స్రవించెను. ఆతడు దానిని గ్రహించి చేతితో రాసెను. 9

మూ. నిక్షిప్తమాత్రం తద్భూమౌ బ్రహ్మణా లోకకర్తృణా,
తస్మిన్నశ్రుకణే రామ వానరః సంబభూవ హ. 10

ప్ర. అ. రామ = రామా! తత్ = అది, లోకకర్తృణా = లోకమునకు కర్తయైన, బ్రహ్మణా = బ్రహ్మదేవునిచేత, భూమౌ = భూమియందు, నిక్షిప్త మాత్రమ్ = ఉంచబడినదోలేదో, తస్మిన్ = ఆ, అశ్రుకణే = కన్నీటి బిందువునందు, వానరః = వానరుడు, సంబభూవ హ = పుట్టెను.

తా. రామా! ఆ కన్నీటి బిందువును లోకస్రష్టయైన బ్రహ్మదేవుడు నేల మీద ఉంచగానే దానినుండి వానరుడు పుట్టెను. 10

మూ. ఉత్పన్నమాత్రస్తు తదా వానరశ్చ నరోత్తమ,
సమాశ్వాస్య ప్రియైర్వాక్యై రుక్తః కిల మహాత్మనా. 11

ప్ర. అ. నరోత్తమ = నరశ్రేష్ఠుడా! తదా = అప్పుడు, ఉత్పన్నమాత్రః = పుట్టిన, వానరః = వానరుడు, మహాత్మనా = ఆ మహాత్మునిచేత, ప్రియైః వాక్యైః = ప్రియములైన వాక్యములచేత, సమాశ్వాస్య = బుజ్జగించి, ఉక్తః కిల = చెప్పబడి నాడట.

తా. నరోత్తముడవైన రామా! పుట్టీ పుట్టగానే ఆతనిని మంచి మాటలతో బుజ్జగించి బ్రహ్మదేవుడు ఇట్లు పలికినాడట. 11

మూ. పశ్య శైలం సువిస్తీర్ణం సురైరధ్యుషితం సదా,
తస్మిన్ రమ్యే గిరివరే బహుమూలఫలాశనః, 12

మమాన్తికచరో నిత్యం భవ వానరపుంగవ,
కం చిత్కాలమిహాస్వ త్వం తతః శ్రేయో భవిష్యతి. 13

ప్ర. అ. వానరపుంగవ = ఓ! వానరశ్రేష్ఠుడా! సదా = ఎల్లప్పుడూ,

సురైః = దేవతలచేత, అధ్యుషితమ్ = అధిష్ఠించబడిన, సువిస్తీర్ణమ్ = చాల విశాలమైన, శైలమ్ = పర్వతమును, పశ్య = చూడుము. తస్మిన్ = ఆ, రమ్యే = రమ్యమైన, గిరివరే = పర్వతశ్రేష్ఠమునందు, బహుమూలఫలాశనః = అనేకమూలఫలములను తినుచున్నవాడవై, నిత్యమ్ = ఎల్లప్పుడూ, మమ = నాయొక్క, అన్తికచరః = సమీపమునందు సంచరించువాడవు, భవ = అగుము. త్వమ్ = నీవు, కంచిత్ కాలమ్ = కొంత కాలము, ఇహ = ఇక్కడ, ఆస్వ = ఉండుము. తతః = అటుపిమ్మట, శ్రేయః = శ్రేయస్సు, భవిష్యతి = కాగలదు.

తా. ఓ! వానరశ్రేష్ఠుడా! ఎల్లప్పుడూ దేవతలచే అధిష్ఠింపబడిన అతివిశాలమైన ఈ పర్వతమును చూడుము. రమ్యమైన ఆ పర్వతముమీద లభించు అనేకములైన ఫలములు, మూలములు భుజించుచు నిత్యమూ నాదగ్గర సంచరించుచుండుము. కొంతకాలము ఇక్కడే ఉండుము. తరవాత నీకు శ్రేయస్సు కలుగును. 12, 13

మూ. ఏవముక్తః స చైతేన బ్రహ్మణా వానరోత్తమః,
ప్రణమ్య శిరసా పాదౌ దేవదేవస్య రాఘవ. 14

ఉక్తవాన్ లోకకర్తారమాదిదేవం జగత్పతిమ్,
యథాజ్ఞాపయసే దేవ స్థితోఽహం తవ శాసనే. 15

ప్ర. అ. రాఘవ = రామా! ఏతేన = ఈ, బ్రహ్మణా = బ్రహ్మచేత, ఏవమ్ = ఇట్లు, ఉక్తః = పలుకబడిన, సః వానరోత్తమః = ఆ వానరోత్తముడు, దేవదేవస్య = ఆ దేవదేవునియొక్క, పాదౌ = పాదములను, శిరసా = శిరస్సుచేత, ప్రణమ్య = నమస్కరించి, లోకకర్తారమ్ = లోకముల కర్తయైన, జగత్పతిమ్ = జగత్తుకు ప్రభువైన, ఆదిదేవమ్ = ఆదిదేవుడైన ఆ బ్రహ్మను గూర్చి, ఉక్తవాన్ = పలికినాడు. దేవ = దేవా! యథా = ఎట్లు, ఆజ్ఞాపయసే = ఆజ్ఞాపించుచున్నావో అట్లు, తవ = నీయొక్క, శాసనే = శాసనమునందు, అహమ్ = నేను, స్థితః = ఉన్నాను.

తా. రామా! బ్రహ్మదేవుని మాటలు విని ఆ వానరోత్తముడు దేవదేవుని పాదములకు శిరస్సు వంచి నమస్కరించి, జగత్తును సృజించిన, జగత్తుకు ప్రభు

వైన ఆ దేవదేవునితో-"దేవా! నీవు ఆజ్ఞాపించిన విధముగ ప్రవర్తించెదను"అని చెప్పెను. 14,15

మూ. ఏవముక్త్వా హరిర్దేవం యయౌ హృష్టమనాస్తదా,
స తదా ద్రుమఖణ్డేషు ఫలపుష్పఘనేషు చ, 16
చరన్ ప్రతిబలః శీఘ్రం వనే ఫలకృతాశనః,
చిన్వన్ మధూని ముఖ్యాని చిన్వన్ పుష్పాణ్యనేకశః. 17
దినే దినే చ సాయాహ్నే బ్రహ్మణోఽన్తికమాగమత్.

ప్ర. అ. హరిః = వానరుడు, దేవమ్ = దేవుణ్ణి గూర్చి, ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా=పలికి, తదా=అప్పుడు, హృష్టమనాః=సంతోషించిన మనస్సు కలవాడై, యయౌ=వెళ్లెను. ప్రతిబలః=(బ్రహ్మతో) సమానమైన బలముగల, సః=అతడు, తదా = అప్పుడు, ఫలపుష్పఘనేషు = ఫలములతోను పుష్పములతోను దట్టమైన, ద్రుమఖణ్డేషు = వృక్షసముదాయములయందు, శీఘ్రమ్ = శీఘ్రముగా, చరన్ = సంచరించుచు, వనే = వనమునందు, ఫలకృతాశనః = ఫలములచేత చేయబడిన భోజనము కలవాడై, ముఖ్యాని = ముఖ్యములైన, మధూని = మధువులను. చిన్వన్ = ప్రోగుచేయుచు, అనేకశః = అనేకపర్యాయములు, పుష్పాణి = పుష్పములను, చిన్వన్=ఏరుచు, దినే దినే=ప్రతిదినమునందూ, సాయాహ్నే=సాయంకాలమునందు, బ్రహ్మణః = బ్రహ్మయొక్క, అన్తికమ్ = సమీపమును, ఆగమత్ = పొందెను.

తా. అప్పుడు ఆ వానరుడు బ్రహ్మదేవునితో ఇట్లు పలికి, సంతోషముతో వెళ్లెను. బ్రహ్మదేవునితో సమానమైన బలము గల అతడు ఫలపుష్పములతో నిండిన వృక్షసముదాయములలో శీఘ్రముగా సంచరించుచు, వనమునందు ఫలములు భుజించుచు, ఉత్తమమైన మధువు, పుష్పములు, ప్రోగుచేయుచు, ప్రతిదినము నందూకూడ సాయంకాలమునకు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళుచుండెను. 16,17

మూ. గృహీత్వా రామ ముఖ్యాని పుష్పాణి చ ఫలాని చ, 18
బ్రహ్మణో దేవదేవస్య పాదమూలే న్యవేదయత్.

ప్ర. అ. రామ = రామా! ముఖ్యాని = ముఖ్యములైన, పుష్పాణి = పుష్ప

ములను, ఫలాని చ=ఫలములను, గృహీత్వా = గ్రహించి, దేవదేవస్య= దేవతల దేవతయైన, బ్రహ్మణః = బ్రహ్మయొక్క, పాదమూలే = పాదముల మూలము నందు, న్యవేదయత్ = నివేదించెను.

తా. ఉత్తమములైన పుష్పములు, ఫలములు తీసికొని వెళ్ళి దేవదేవుడైన బ్రహ్మదేవుని పాదాలవద్ద సమర్పించుచుండెడివాడు. 18

మూ. ఏవం తస్య గతః కాలో బహు పర్యటతో గిరిమ్, 19
కస్య చిత్త్వథ కాలస్య సమతీతస్య రాఘవ,
ఋక్షరాడ్వానరశ్రేష్ఠస్తృషయా పరిపీడితః, 20

ప్ర. అ. రాఘవ=రామా! తస్య=అతడు, బహు=అధికముగా, గిరిమ్= పర్వతమును, పర్యటతః = సంచరించుచుండగా, కాలః=కాలము, గతః = గడచి నది. అథ = అటు పిమ్మట, కస్య చిత్=ఒకానొక (కొంత), కాలస్య = కాలము, సమతీతస్య=గడచినదగుచుండగా, ఋక్షరాడ్=ఋక్షముల రాజు, వానరశ్రేష్ఠః= వానరశ్రేష్ఠుడూ అయిన అతడు, తృషయా = దప్పికచేత, పరిపీడితః = పీడింప బడెను.

తా. ఈ విధముగా అతడు అత్యధికముగా పర్వతముమీద తిరుగుచుండగా కాలము గడచుచుండెను. రామా! కొంత కాలము గడచిన పిమ్మట, ఒకనాడు భల్లూకములకు కూడ ప్రభువైన ఆ వానరశ్రేష్ఠుడు దప్పికచేత పీడింపబడెను.

మూ. ఉత్తరం మేరుశిఖరం గతస్తత్ర చ దృష్టవాన్,
నానావిహగసంఘుష్టం ప్రసన్నసలిలం సరః. 21

ప్ర. అ. ఉత్తరమ్ = ఉత్తరమున నున్న, మేరుశిఖరమ్ = మేరుపర్వత శిఖరమును గూర్చి, గతః=వెళ్ళినవాడై, తత్ర=అక్కడ నానావిహగసంఘుష్టమ్ =అనేకవిధములైన పక్షులచేత ధ్వనిచేయించబడిన, ప్రసన్నసలిలమ్ = ప్రసన్న మైన ఉదకము గల, సరః = సరస్సును, దృష్టవాన్ = చూచినాడు.

తా. అతడు మేరుపర్వతమునందలి ఉత్తరశిఖరమునకు వెళ్ళి అక్కడ అనేకవిధములైన పక్షులచేత ధ్వనింపచేయబడుచున్న, నిర్మలమైన ఉదకము గల సరస్సును చూచెను. 21

మూ. చలత్కేసరమాత్మానం కృత్వా తస్య తటే స్థితః,
దదర్శ తస్మిన్ సరసి వక్త్రచ్ఛాయామథాత్మనః. 22

ప్ర. అ. ఆత్మానమ్ = తనను, చలత్కేసరమ్ = కదలుచున్న జూలు కల వానినిగా, కృత్వా = చేసి, తస్య = దానియొక్క, తటే = తీరమునందు, స్థితః = నిలచిన అతడు, అథ = పిమ్మట, తస్మిన్ సరసి = ఆ సరస్సునందు, ఆత్మనః = తనయొక్క, వక్త్రచ్ఛాయామ్ = ముఖప్రతిబింబమును, దదర్శ = చూచెను.

తా. అతడు తన జూలు కదల్చుచు దాని తీరమునందు నిలబడి ఆ సరస్సులో తన ప్రతిబింబమును చూచెను. 22

మూ. కోఽయమస్మిన్ మమ రిపుర్వసత్యన్తర్జలే మహాన్,
రూపం చాన్తర్గతం తత్ర వీక్ష్య తత్ప్లవగో హరిః. 23
క్రోధావిష్టమనా హ్యేష నియతం మావమన్యతే,
తదస్య దుష్టభావస్య పుష్కలం కుమతేర్గృహమ్. 24

ప్ర. అ. అస్మిన్ = ఈ, అన్తర్జలే = నీటి మధ్య, మమ = నాయొక్క, మహాన్ = గొప్ప, రిపుః = శత్రువైన, అయమ్ = ఇతడు, కః = ఎవడు, వసతి = నివసించుచున్నాడు? హరిః = వానరుడు, తత్ర = అక్కడ, అన్తర్గతమ్ = లోపల నున్న, రూపం చ = రూపమును, వీక్ష్య = చూచి, క్రోధావిష్టమనాః = క్రోధముతో ఆవిష్టమైన మనస్సు గల, ఏషః = ఇతడు, నియతమ్ = తప్పక, మా = నన్ను, అవమన్యతే = అవమానించుచున్నాడు. తత్ = అందువలన, దుష్టభావస్య = దుష్టమైన భావము గల, అస్య = ఈ, కుమతేః = చెడ్డ బుద్ధి గలవానియొక్క, పుష్కలమ్ = పుష్కలమైన, గృహమ్ = గృహము.

తా. "ఇత డెవడో నా గొప్ప శత్రువు నీటి మధ్యనివసించుచున్నాడు"అని అనుకొనుచు ఆ వానరుడు లోపల నున్న అతని రూపమును కూడ చూచి,-"ఇతడు కోపావేశముగల మనస్సుతో నన్ను అవమానించుచున్నాడు. నిజము, ఇది దుష్టభావము గల ఈ కుమతి నివసించు పుష్కలమైన గృహము". 23,24

మూ. ఏవం సంచిన్త్య మనసా స వై వానరచాపలాత్,
అప్లుత్య చాపతత్తస్మిన్ హ్రదే వానరసత్తమః. 25

ప్ర. అ. సః వానరసత్తమః = ఆ వానరశ్రేష్ఠుడు, ఏవమ్ = ఇట్లు, మనసా = మనస్సుచేత, సంచిన్త్య = ఆలోచించి, వానరచాపలాత్ = వానరచపలత్వమువలన, అప్లుత్య = ఎగిరి, తస్మిన్ = ఆ, హ్రదే = మడుగునందు, అపతత్ = పడెను.

తా. ఆ వానరశ్రేష్ఠుడు ఈ విధముగా ఆలోచించి, వానరసహజమైన చాపలముచేత ఎగిరి ఆ మడుగులోనికి దుమికెను. 25

మూ. ఉత్ప్లుత్య తస్మాత్స హ్రదాదుత్థితః ప్లవగః పునః,
తస్మిన్నేవ క్షణే రామ స్త్రీత్వం ప్రాప స వానరః. 26

ప్ర. అ. సః ప్లవగః = ఆ వానరుడు, తస్మాత్ = ఆ, హ్రదాత్ = హ్రదముమండి, ఉత్ప్లుత్య = ఎగిరి, పునః = మరల, ఉత్థితః = లేచినాడు. రామ = రామా! సః వానరః = ఆ వానరుడు, తస్మిన్ క్షణే ఏవ = ఆ క్షణమునందే, స్త్రీత్వమ్ = స్త్రీత్వమును, ప్రాప = పొందెను.

తా. ఆ వానరుడు ఆ హ్రదమునుండి ఎగిరి మరల పైకి లేచెను. రామా! ఆ క్షణమునందే ఆ వానరుడు స్త్రీగా మారిపోయెను. 26

మూ. మనోజ్ఞరూపా సా నారీ లావణ్యలలితా శుభా,
విస్తీర్ణజఘనా సుభ్రూర్నీలకున్తలమూర్ధజా. 27
ముగ్ధసస్మితవక్త్రా చ పీనస్తనతటా శుభా,
హ్రదతీరే చ సా భాతి ఋజుయష్టిర్లతా యథా. 28

ప్ర. అ సా నారీ = ఆ స్త్రీ, మనోజ్ఞరూపా = మనోహరమైన రూపము గలది, లావణ్యలలితా = లావణ్యముచేత సుందరమైనది, శుభా = మంగళప్రదురాలు, విస్తీర్ణజఘనా = విశాలమైన జఘనము కలది, సుభ్రూః = అందమైన కనుబొమ్మలు గలది, నీలకున్తలమూర్ధజా = నల్లని ముంగురులు కేశములూ గలది, ముగ్ధసస్మితవక్త్రా చ = సుందరమైన, చిరునవ్వుతో కూడిన ముఖము గలది, పీనస్తనతటా = బలిసిన స్తనప్రదేశము గలది, శుభా = సుందరి. సా = ఆమె, హ్రదతీరే = హ్రదముతీరమునందు, ఋజుయష్టిః = ఋజువైన దండము గల, లతా యథా = లత వలె, భాతి = ప్రకాశించుచున్నది.

తా. ఆ స్త్రీరూపము మనోహరముగా ఉండెను. ఆమె లావణ్యముతో చక్కగా మంగళప్రదురాలుగా ఉండెను. ఆమె జఘనము విస్తీర్ణముగాను, కను బొమ్మలు అందముగాను, ముంగురులు, కేశములు నల్లగాను ఉండెను. ఆమె ముఖము చిరునవ్వుతో అలరారుచుండెను. స్తనతటము బలిసి ఉండెను. శుభ ప్రదమైన ఆమె ఆ సరస్తీరమునందు ఋజువుగా ఉన్న లత వలె ఉండెను. 27,28

మూ. త్రైలోక్యసున్దరీ కాన్తా సర్వచిత్తప్రమాథినీ,
లక్ష్మీవ పద్మరహితా చన్ద్రజ్యోత్స్నేవ నిర్మలా. 29

ప్ర. అ. త్రైలోక్యసున్దరీ=మూడు లోకములలో సుందరి యైన, కాన్తా= మనోహరురాలైన, సర్వచిత్తప్రమాథినీ = అందరి చిత్తమును పీడించే ఆమె, పద్మ రహితా = పద్మములు లేని, లక్ష్మీవ=లక్ష్మి వలె, నిర్మలా=నిర్మలమైన, చన్ద్ర జ్యోత్స్నేవ = వెన్నెలవలె ఉండెను.

తా. మూడు లోకములలోను సుందరి, మనోహరురాలు, అందరి మనస్సు లను పీడించేది అయిన ఆమె పద్మములు చేతిలో లేని లక్ష్మివలె, నిర్మలమైన వెన్నెల వలె ఉండెను. 29

మూ. రూపేణాప్యభవత్సా తు శ్రీర్గీర్దేవీ ఉమా యథా,
ద్యోతయన్తీ దిశః సర్వాస్తత్రాభూత్సా వరాఙ్గనా. 30

ప్ర. అ. సా తు = ఆమెయైతే, రూపేణ = రూపముచేత, శ్రీః=లక్ష్మీదేవి, గీర్దేవీ = సరస్వతీదేవి, ఉమా యథా = పార్వతీదేవి వలె, అభవత్ = ఉండెను. సా = ఆ, వరాఙ్గనా=శ్రేష్ఠురాలైన స్త్రీ, సర్వాః=సమస్తమైన, దిశః=దిక్కులను, ద్యోతయన్తీ = ప్రకాశింపచేయుచు, తత్ర = అక్కడ, అభూత్ = ఉండెను.

తా. అక్కడ దిక్కులను అన్నింటినీ ప్రకాశింపచేయుచున్న ఆ ఉత్తమ స్త్రీ సౌందర్యముచేత లక్ష్మి వలె, సరస్వతి వలె, పార్వతీదేవి వలె ఉండెను. 30

మూ. ఏతస్మిన్నన్తరే దేవో నివృత్తః సురనాయకః,
పాదావుపాస్య దేవస్య బ్రహ్మణస్తేన వై పథా. 31

ప్ర. అ. ఏతస్మిన్ = ఈ, అన్తరే=మధ్యకాలమునందు, సురనాయకః= దేవతాప్రభువైన, దేవః = దేవుడు, దేవస్య = దేవుడైన, బ్రహ్మణః = బ్రహ్మ

యొక్క, పాదౌ = పాదములను, ఉపాస్య = సేవించి. తేన పథా = ఆ మార్గము చేత, నివృత్తః వై = మరలినాడు.

తా. ఇంతలో దేవేంద్రుడు బ్రహ్మదేవుని పాదములను సేవించి ఆ మార్గమునసే తిరిగి వెళ్ళుచుండెను. 31

మూ. తస్యామపి చ వేళాయా మాదిత్యోఽపి పరిభ్రమన్,
తస్మిన్నేవ పదే సోఽభూద్యస్మిన్సా తనుమధ్యమా. 32

ప్ర. అ. తస్యామ్ = ఆ, వేళాయామ్ = సమయమునందు, పరిభ్రమన్ = సంచరించుచున్న, ఆదిత్యః = సూర్యుడు, సా = ఆ, తనుమధ్యమా = సన్నని నడుము గల స్త్రీ, యత్ర = ఎక్కడ ఉండునో, తస్మిన్ = ఆ, పదే ఏవ = స్థానమునందే, అభూత్ = ఉండెను.

తా. ఆ సమయమునందు సంచరించుచున్న సూర్యుడు ఆ స్త్రీ ఏ ప్రదేశమునందు ఉండెనో ఆ స్థానమునందే ఉండెను. 32

మూ. యుగపత్సా తదా దృష్టా దేవాభ్యాం సురసున్దరీ,
కన్దర్పవశగౌ తౌ తు దృష్ట్వా తాం సంబభూవతుః. 33

ప్ర. అ. సా = ఆ, సురసున్దరీ = దేవతాస్త్రీ, దేవాభ్యామ్ = ఆ దేవతలిద్దరి చేత, యుగపత్ = ఒక్కమారుగ, దృష్టా = చూడబడినది. తౌ = వారిద్దరూ, తామ్ = ఆమెను. దృష్ట్వా = చూచి, కన్దర్పవశగౌ = మన్మథవశులు, సంబభూవతుః = అయిరి.

తా. ఆ దేవతాస్త్రీని వారిద్దరూ ఒకే సమయమునందు చూచిరి. ఆమెను చూచి వారు మన్మథునకు వశులైరి. 33

మూ. తతః క్షుభితసర్వాఙ్గౌ సురేన్ద్రౌ పన్నగావివ,
తద్రూపమద్భుతం దృష్ట్వా త్యాజితౌ ధైర్యమాత్మనః 34

ప్ర. అ. తతః = అటుపిమ్మట. పన్నగౌ ఇవ = సర్పముల వలె, క్షుభిత సర్వాఙ్గౌ = క్షోభింపచేయబడిన సకలశరీరములు గల, సురేన్ద్రౌ = ఆ దేవతా నాయకులు, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైన, తద్రూపమ్ = ఆమె రూపమును,

దృష్ట్వా = చూచి, ఆత్మనః = తమయొక్క, ధైర్యమ్ = ధైర్యమును, త్యాజితౌ = విడిపింపబడినారు.

తా. సర్పముల వలె దేహమునందు అంతటా క్షోభ చెందిన ఆ దేవతా నాయకులు ఇద్దరూ అద్భుతమైన ఆ రూపమును చూచి తమ ధైర్యమును కోల్పోయిరి. 34

మూ. తతస్తస్యాం సురేన్ద్రేణ స్కన్నం శిరసి పాతితమ్,
అనాసాద్యైవ తాం నారీం సంనివృత్త మథాభవత్. 35

ప్ర. అ. తతః = అటుపిమ్మట, తస్యామ్ = ఆమె విషయమునందు, స్కన్నమ్ = జారిన వీర్యము, సురేన్ద్రేణ = ఇంద్రునిచేత, శిరసి = శిరస్సునందు, పాతితమ్ = పడవేయ బడినది, అథ = అటుపిమ్మట, తాం నారీమ్ = ఆ స్త్రీని, అనాసాద్యైవ = పొందకుండగానే, సంనివృత్తమ్ = మరలినది, అభవత్ = ఆయెను.

తా. అప్పుడు ఆమె విషయమున స్ఖలితమైన వీర్యమును ఇంద్రుడు ఆమె శిరస్సు మీద విడువగా అది ఆమెను చేరకుండా ప్రక్కకు మరలెను. 35

మూ. తతః సా వానరపతిం జజ్ఞే వానరమీశ్వరమ్,
అమోఘరేతస స్తస్య వాసవస్య మహాత్మనః. 36

ప్ర. అ. తతః = అటుపిమ్మట, సా = ఆమె, మహాత్మనః = మహాత్ముడైన, వాసవస్య = ఇంద్రునియొక్క, అమోఘరేతసః = వ్యర్థముకాని రేతస్సు నుండి, వానరపతిమ్ = వానరరాజూ, ఈశ్వరమ్ = సమర్థుడు అయిన, వానరమ్ = వానరుణ్ణి, జజ్ఞే = కనెను.

తా. అప్పుడు ఆమె మహాత్ముడైన ఆ దేవేంద్రుని అమోఘమైన వీర్యము నుండి వానరుల ప్రభువూ సర్వసమర్థుడూ అయిన వానరుణ్ణి కనెను. 36

మూ. వాలేషు పతితం బీజం వాలీ నామ బభూవ సః,
భాస్కరేణాపి తస్యాం వై కన్దర్పవశవర్తినా. 37
బీజం నిషిక్తం గ్రీవాయాం విధానమనువర్తతా.

ప్ర. అ. బీజమ్ = రేతస్సు, వాలేషు = తోకమీద, పతితమ్ = పడినది. సః =

అతడు, వాలి నామ = వాలి అను పేరు కలవాడు, బభూవ = ఆయెను. కన్దర్ప వశవర్తినా = మన్మథునకు వశుడైన, విధానమ్ = తన కర్తవ్యమును, అనువర్తతా = అనుసరించుచున్న, భాస్కరేణాపి = సూర్యునిచేతకూడ, తస్యామ్ = ఆమె యందు, గ్రీవాయామ్ = కంఠమునందు, బీజమ్ = బీజము, నిషిక్తమ్ = తడపబడినది.

తా. ఆ రేతస్సు వాలమునందు పడుటచేత అతడు వాలి అయ్యెను. తన కర్తవ్యమును ఆచరించుచున్న సూర్యుడు మన్మథ వశంవదుడై ఆమె కంఠము మీద రేతస్సును ఉంచెను. 37

మూ. తేనాపి సా వరతనుర్నోక్తా కించిద్వచః శుభమ్, 38
నివృత్తమదనశ్చాథ సూర్యోఽపి సమపద్యత,
గ్రీవాయాం పతితం బీజం సుగ్రీవః సమజాయత. 39

ప్ర. అ. సా = ఆ, వరతనుః = శ్రేష్ఠమైన శరీరము గల స్త్రీ, తేనాపి = వానిచేతకూడ, శుభమ్ = శుభమైన, కించిత్ వచః = ఏ మాటా కూడ, న ఉక్తా = చెప్పబడలేదు. అథ = పిమ్మట, సూర్యః అపి = సూర్యుడు కూడ, నివృత్తమదనః = తొలగిన మన్మథుడు కలవాడు, సమపద్యత = ఆయెను. గ్రీవాయామ్ = కంఠమునందు, పతితమ్ = పడిన, బీజమ్ = బీజము, సుగ్రీవః = సుగ్రీవుడుగా, సమజాయత = ఆయెను.

తా. ఆ సూర్యుడు ఆమెతో ఒక మాట కూడ మాట్లాడలేదు. అతనినుండి మన్మథుడు దూరమాయెను. కంఠము మీద పడిన ఆ రేతస్సు సుగ్రీవుడయ్యెను. 38, 39

మూ. ఏవముత్పాదితౌ వీరౌ వానరేన్ద్రౌ మహాబలౌ,
దత్త్వా తు కాఞ్చనీం మాలాం వానరేన్ద్రస్య వాలినః, 40
అక్షయ్యాం గుణసంపూర్ణాం శక్రస్తు త్రిదివం యయౌ.

ప్ర. అ. వీరౌ = వీరులైన, మహాబలౌ = గొప్ప బలము గల, వానరేన్ద్రౌ = వానరనాయకులు, ఏవమ్ = ఈ విధముగా, ఉత్పాదితౌ = పుట్టించబడినారు. శక్రస్తు = దేవేంద్రుడు, వానరేన్ద్రస్య = వానరనాయకుడైన, వాలినః = వాలికి, కాఞ్చనీమ్ = బంగారము వికారమైన, అక్షయ్యామ్ = నాశము లేని, గుణసంపూర్ణామ్ = మంచి గుణములతో నిండిన, మాలామ్ = మాలను, దత్త్వా తు = ఇచ్చి, త్రిదివమ్ = స్వర్గమును గూర్చి, యయౌ = వెళ్లెను.

తా. వీరులు, మహాబలశాలులూ అయిన ఆ వానరనాయకులు ఈ విధముగ పుట్టింపబడిరి. ఇంద్రుడు నాశము లేని, మంచి గుణములు గల బంగారుమాలను వానరేంద్రుడైన వాలికి ఇచ్చి స్వర్గమునకు వెళ్లెను. 40

మూ. సూర్యోఽపి స్వసుతస్యైవ నిరూప్య పవనాత్మజమ్, 41
కృత్యేషు వ్యవసాయేషు జగామ సవితామ్బరమ్.

ప్ర. అ. సవితా = సర్వకామములను కనెడు, సూర్యోఽపి = సూర్యుడు కూడ, స్వసుతస్యైవ = తన కుమారునకు, పవనాత్మజమ్ = హనుమంతుణ్ణి, నిరూప్య=చూపి, కృత్యేషు = చేయదగిన, వ్యవసాయేషు = కార్యములయందు, అమ్బరమ్ = ఆకాశమును గూర్చి, జగామ = వెళ్ళెను.

తా. సూర్యుడు తన కుమారునకు హనుమంతుణ్ణి మిత్రునిగా చూపి, తాను చేయవలసిన పనులు చేయుటకై ఆకాశమునకు వెళ్లెను. 41

మూ. తస్యాం నిశాయాం వ్యుష్టాయాముదితే తు దివాకరే, 42
స తద్వానరరూపం తు ప్రతిపేదే పునర్నృప.

ప్ర. అ. నృప = రాజా, తస్యామ్ = ఆ, నిశాయామ్ = రాత్రి, వ్యుష్టాయామ్ = గడచిన దగుచుండగా, దివాకరే = సూర్యుడు, ఉదితే = ఉదయించిన వాడగుచుండగా, సః = అతడు, తద్ = ఆ, వానర రూపమ్ = వానర రూపమును, పునః = మరల, ప్రతిపేదే = పొందెను.

తా రాజా! ఆ రాత్రి తెల్లవారి సూర్యుడు ఉదయించగానే ఆ ఋక్షరజస్సు మరల వానరరూపమును పొందెను. 42

మూ. స ఏవ వానరో భూత్వా పుత్రౌ స్వస్య ప్లవంగమౌ, 43
పిఙ్గేక్షణౌ హరివరౌ బలినౌ కామరూపిణౌ,
మధూన్యమృతకల్పాని పాయితౌ తేన తౌ తదా. 44

ప్ర. అ. సః = అతడు, వానరః ఏవ = వానరుడు గానే, భూత్వా = అయి, స్వస్య = తనయొక్క, పుత్రౌ = పుత్రులైన, పిఙ్గేక్షణౌ = పచ్చని కళ్ళు గల, బలినౌ = బలవంతులైన, కామరూపిణౌ = స్వేచ్ఛారూపముగల, హరివరౌ = వానర శ్రేష్ఠులు అయిన, ప్లవంగమౌ = వానరులను, (చూచెను). తౌ = వాళ్ళిద్దరూ,

తదా = అప్పుడు, తేన = అతనిచేత, అమృతకల్పాని = అమృతముతో సమానములైన, మధూని = తేనెలను, పాయితౌ = త్రాగించబడిరి.

తా. అతడు వానరుడుగా మారి, పచ్చని కళ్ళు గల,బలవంతులు, స్వేచ్ఛా రూపము గలవారు వానరశ్రేష్ఠులూ అయిన తన పుత్రులైన ఆ వానరులను చూచెను. అప్పుడు అతడు వారిద్దరికీ అమృతమువంటి తేనెలు త్రాగించెను. 43, 44

మూ. గృహ్య ఋక్షరజాస్తౌ తు బ్రహ్మణోఽన్తిక మాగమత్,
దృష్ట్వర్క్షరజసం పుత్రం బ్రహ్మాలోకపితామహః, 45
బహుశః సాన్త్వయామాస పుత్రాభ్యాం సహితం హరిమ్.

ప్ర. అ. ఋక్షరజాః = ఋక్షరజస్సు, తౌ = వాళ్ళిద్దరినీ, గృహ్య = గ్రహించి, బ్రహ్మణః = బ్రహ్మయొక్క, అన్తికమ్ = సమీపమును, అగమత్ = పొందెను. లోకపితామహః = లోకములకు పితామహుడైన, బ్రహ్మా=బ్రహ్మ, పుత్రమ్=పుత్రుడైన, ఋక్షరజసమ్=ఋక్షరజస్సును, దృష్ట్వా = చూచి, పుత్రాభ్యామ్=పుత్రులతో, సహితమ్=కూడిన, హరిమ్=ఆ వానరుణ్ణి, బహుశః=అనేక విధములుగా, సాన్త్వయామాస = ఓదార్చెను.

తా. ఋక్షరజస్సు వారిద్దరినీ తీసికొని బ్రహ్మదగ్గరకు వచ్చెను. లోకములకు పితామహుడైన బ్రహ్మదేవుడు పుత్రుడైన ఋక్షరజస్సును చూచి, పుత్రులతో కూడిన అతనిని అనేక విధముల ఓదార్చెను. 45

మూ. సాన్త్వయిత్వా తతః పశ్చాద్దేవదూతమథాదిశత్, 46
గచ్ఛ మద్వచనాద్దూత కిష్కిన్ధాం నామ వై శుభామ్.
సా హ్యస్య గుణసంపన్నా మహతీ చ పురీ శుభా. 47

ప్ర. అ. సాన్త్వయిత్వా=ఓదార్చి, తతః పశ్చాత్=అటు పిమ్మట, అథ= అనంతరము, దేవదూతమ్ = దేవదూతను, ఆదిశత్ = ఆజ్ఞాపించెను. దూత = దూతా! మద్వచనాత్ = నా మాటవలన, శుభామ్ = శుభమైన, కిష్కిన్ధాం నామ =కిష్కింధ అను నగరమును గూర్చి, గచ్ఛ = వెళ్లుము. గుణసంపన్నా = మంచి గుణములతో నిండిన, మహతీ = గొప్పదైన, శుభా = మంగళప్రదమైన, సా పురీ = ఆ పట్టణము, అస్య హి = ఈతనిది కదా ?

తా. ఓదార్చి పిమ్మట బ్రహ్మదేవుడు దేవదూతతో ఇట్లు పలికెను."దూతా!

నా మాటవలన ఉత్తమైన కిష్కింధాపురమునకు వెళ్ళుము. మంచి గుణములు గల గొప్పదైన, మంగళప్రదమైన ఆ నగరము ఇతనిది." 46,47

మూ. తత్ర వానరయూథాని సుబహూని వసన్తి చ,
బహురత్నసమాకీర్ణా వానరైః కామరూపభిః. 48

ప్ర. అ. తత్ర = అక్కడ, సుబహూని = చాలా అధికమైన, వానర యూథాని=వానరముల గుంపులు, సన్తి చ = ఉన్నవి. బహురత్నసమాకీర్ణాః = అనేకరత్నములతో వ్యాప్తమైనది. కామరూపిభిః = స్వేచ్ఛారూపము గల, వానరైః = వానరులతో (కూడినది).

తా. ఆ పురములో అనేక వానరయూథములు నివసించుచున్నవి. అది అనేకరత్నములతోను, కామరూపధారులైన వానరులతోను నిండి ఉన్నది. 48

మూ పుణ్యా పుణ్యవతీ దుర్గా చాతుర్వర్ణ్యపురస్కృతా,
విశ్వకర్మకృతా దివ్యా మన్నియోగాచ్ఛ శోభనా. 49

ప్ర. అ. పుణ్యా = పవిత్రమైనది, పుణ్యవతీ=పుణ్యములు గలది, దుర్గా= ప్రవేశింప శక్యము కానిది, చాతుర్వర్ణపురస్కృతా = నాలుగు వర్ణములచేత గౌర వించబడినది. మన్నియోగాత్ = నా ఆజ్ఞవలన. విశ్వకర్మకృతా = విశ్వకర్మ చేత చేయబడినది. దివ్యా = దివ్యమైనది. శోభనా = సుందరమైనది.

తా. అది పవిత్రమైనది. పుణ్యము కలది. ప్రవేశింప శక్యము కానిది. నాలుగు వర్ణములకు నివాసమైనది. దివ్యము, సుందరము అయిన ఆ నగరమును నా ఆజ్ఞచేత విశ్వకర్మ రచించినాడు. 49

మూ. తత్రర్క్షరజసం దృష్ట్వా సపుత్రం వానరర్షభమ్,
యూథపాలాన్సమాహ్వాయ యాంశ్చాన్యాన్ ప్రాకృతాన్
హరీన్. 50

తేషాం సంభావ్య సర్వేషాం మదీయం జనసంసది,
అభిషేచయ రాజానమారోప్య మహదాసనే. 51

ప్ర. అ. తత్ర=అక్కడ, సపుత్రమ్=కుమారులతో కూడిన, వానరర్షభమ్

= వానరశ్రేష్ఠుడైన ఋక్షరజసమ్=ఋక్షరజస్సును, దృష్ట్వా=చూచి (చూపించి), యూథపాలాన్ = గుంపుల పాలకులను, అన్యాన్ = ఇతరులైన, యాన్ చ = ఏ, ప్రాకృతాన్ = ప్రాకృతులైన, హరీన్ = వానరులను, సమాహ్వాయ = పిలచి, జనసంది = జనుల సభయందు, సర్వేషామ్ = సమస్తమైన, తేషామ్= వాళ్ళకు, మదీయమ్ = నా సంబంధమైన అభిప్రాయమును, సంభావ్య = తెలిపి, మహదాసనే = గొప్ప ఆసనమునందు, ఆరోప్య = ఎక్కించి, రాజానమ్ = రాజునుగా, అభిషేచయ = అభిషిక్తుని చేయుము.

తా. అక్కడ పుత్రసహితుడైన వానరశ్రేష్ఠుడైన ఋక్షరజస్సును చూపి, వానరయూథనాయకులను, సామాన్యవానరులను పిలచి, జనుల సభలో అందరికి నా అభిప్రాయమును తెలిపి, ఇతనిని సింహాసనముమీద కూర్చుండబెట్టి రాజునుగా అభిషిక్తుని చేయుము. 50,51

మూ. దృష్టమాత్రాశ్చ తే సర్వే వానరేణ చ ధీమతా,
అస్యర్క్షరజసో నిత్యం భవిష్యన్తి వశానుగాః. 52

ప్ర అ. తే సర్వే = వాళ్ళందరూ, ధీమతా=బుద్ధిమంతుడైన, వానరేణ= వానరునిచేత, దృష్టమాత్రాః చ=చూడబడగానే, నిత్యమ్ = ఎల్లప్పుడూ, అస్య= ఈ, ఋక్షరజసః = ఋక్షరజస్సుకు, వశానుగాః = వశమునందున్నవారు, భవిష్యన్తి = కాగలరు.

తా. ధీమంతుడైన ఈ ఋక్షరజస్సు చూడగానే వాళ్ళందరూ ఈతనికి నిత్యమూ వశులై ఉండగలరు. 52

మూ. ఇత్యేవముక్తే వచనే బ్రహ్మణా తం హరీశ్వరమ్,
పురతః కృత్య దూతోఽసౌ ప్రయయౌ తాం పురీం శుభామ్.

ప్ర. అ. బ్రహ్మణా = బ్రహ్మచేత, ఇత్యేవమ్=ఇట్లు, ఉక్తే = పలకబడిన దగుచుండగా, అసౌ = ఆ, దూతః = దూత, తమ్ = ఆ, హరీశ్వరమ్ = వానరనాయకుణ్ణి, పురతఃకృత్య = ముందు ఉంచుకొని, శుభామ్ = సుందరమైన, తాం పురీమ్ = ఆ పట్టణమును గూర్చి, ప్రయయౌ = వెళ్లెను.

తా. బ్రహ్మ ఇట్లు చెప్పగా ఆ దూత ఆ వానరనాయకుణ్ణి తీసికొని సుందరమైన ఆ కిష్కింధానగరమునకు వెళ్లెను. 53

మూ. స ప్రవిశ్యానిలగతిస్తాం గుహాం వానరోత్తమమ్,
స్థాపయామాస రాజానం పితామహనియోగతః. 54

ప్ర. అ. అనిలగతిః = వాయువు వంటి గమనము గల, సః = ఆ దూత, తాం గుహామ్ = ఆ గుహను, ప్రవిశ్య = ప్రవేశించి, వానరోత్తమమ్ = ఆ వానర శ్రేష్ఠుణ్ణి, పితామహనియోగతః = బ్రహ్మదేవుని ఆజ్ఞవలన, రాజానమ్ = రాజునుగా, స్థాపయామాస = స్థాపించెను.

తా. ఆ దూత వాయువేగముతో ఆ కిష్కింధానగరమునకు వెళ్ళి, బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము ఆ వానరోత్తముణ్ణి రాజునుగా స్థాపించెను. 54

మూ. రాజ్యాభిషేకవిధినా స్నాతోఽథాభ్యర్చితస్తథా,
స బద్ధముకుటః శ్రీమానభిషిక్తః స్వలంకృతః. 55

ప్ర. అ. శ్రీమాన్ = శోభాయుక్తుడైన, సః = అతడు, రాజ్యాభిషేకవిధినా = రాజ్యాభిషేకవిధానముచేత, స్నాతః = స్నానము చేసినవాడై, తథా = మరియు, అభ్యర్చితః = పూజింపబడినవాడై, బద్ధముకుటః = కట్టబడిన కిరీటముగలవాడై, అభిషిక్తః = అభిషేకింపబడినాడు. స్వలంకృతః = బాగా అలంకరింపబడినాడు.

తా. శ్రీమంతుడైన అతడు రాజ్యాభిషేకవిధానముప్రకారము అభిషిక్తుడై, పూజింపబడినవాడై, కిరీటధారియై, చక్కగా అలంకరించుకొనెను. 55

మూ. ఆజ్ఞాపయామాస హరీన్సర్వాన్ముదితమానసః,
సప్తద్వీపసముద్రాయాం పృథివ్యాం యే ప్లవంగమాః. 56

ప్ర. అ. సప్తద్వీపసముద్రాయామ్ = ఏడు ద్వీపములు, సముద్రములు గల, పృథివ్యామ్ = భూమియందు, యే = ఏ, ప్లవంగమాః = వానరులు గలరో, సర్వాన్ = సమస్తమైన, హరీన్ = వానరులను, ముదితమానసః = సంతోషించిన మనస్సు గలవాడై, ఆజ్ఞాపయామాస = ఆజ్ఞాపించెను.

తా. అతడు సంతోషించిన మనస్సుతో ఏడు ద్వీపములు, సముద్రములూ గల భూమిమీద ఉన్న వానరు లందరినీ ఆజ్ఞాపించెను. (పాలించెను). 56

మూ. వాలిసుగ్రీవయోరేవమేష చర్షరజాః పితా,
జననీ చైష తు హరిరిత్యేతద్భద్రమస్తు తే. 57

ప్ర. అ. ఏవమ్ = ఈ విధముగా, ఏషః = ఈ, ఋక్షరజాః = ఋక్షరజస్సు, వాలిసుగ్రీవయోః = వాలిసుగ్రీవులకు, పితా = తండ్రి. ఏషః = ఈ, హరిః = వానరుడే, జననీ చ = తల్లి కూడ. ఇత్యేతత్ = అనునది చెప్పబడినది. తే = నీకు, భద్రమ్ = క్షేమము. అస్తు = అగుగాక.

తా. ఈ విధముగా ఈ ఋక్షరజస్సు వాలిసుగ్రీవులకు తండ్రి. ఇతడే తల్లి కూడ. ఈ విషయము నీకు చెప్పితిని. నీకు క్షేమ మగుగాక. 57

మూ. యశ్చైతచ్ఛ్రావయేద్విద్వాన్యశ్చైతచ్ఛృణుయాన్నరః,
సిధ్యన్తి తస్య కార్యార్థా మనసో హర్షవర్ధనాః. 58

ప్ర. అ. యః = ఏ, విద్వాన్ = విద్వాంసుడు, ఏతత్ = దీనిని, శ్రావయేత్ = వినిపించునో, యః = ఏ, నరః = మనుష్యుడు, ఏతత్ = దీనిని, శృణుయాత్ = వినునో, తస్య = వానియొక్క, మనసః = మనస్సునకు, హర్షవర్ధనాః = సంతోషమును వృద్ధి పొందించు, కార్యార్థాః = కార్యములు, ప్రయోజనములు, సిధ్యన్తి = సిద్ధించును.

తా. ఏ విద్వాంసుడు ఈ కథను వినిపించునో, ఎవడు దీనిని వినునో వాళ్ల మనస్సుకు ఆనందమును వృద్ధిపొందించు కార్యములు సిద్ధించును. 58

మూ. ఏతచ్చ సర్వం కథితం మయా విభో
ప్రవిస్తరేణేహ యథార్థతస్తత్,
ఉత్పత్తిరేషా రజనీచరాణా
ముక్తా తథైవేహ హరీశ్వరాణామ్. 59

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః సర్గః ప్రథమః.

ప్ర. అ. విభో = ఓ ! ప్రభూ! తత్ = ఆ, ఏతత్ = ఇది, సర్వమ్ = సమస్తమూ, ఇహ = ఇక్కడ, ప్రవిస్తరేణ = విస్తరముతో, యథార్థతః = యథార్థముగా, మయా = నాచేత, కథితమ్ = చెప్పబడినది. ఏషా = ఈ, రజనీచరాణామ్ = రాక్షసులయొక్క, ఉత్పత్తిః = పుట్టుక, ఉక్తా = చెప్పబడినది.

తా. రామా! ఈ విషయము నంతనూ నీకు యథార్థముగా, సవిస్తరముగా చెప్పినాను. రాక్షసుల ఉత్పత్తి, వానరుల ఉత్పత్తీ కూడ చెప్పబడినది. 59

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో ప్రక్షిప్త సర్గ (మొదటిది) సమాప్తము.

ప్రక్షిప్తః సర్గః ద్వితీయః

[రావణుడు సనత్కుమారునినుండి శ్రీ మహావిష్ణువునకు గల మాహాత్మ్యము తెలిసికొని అతని చేతిలో మరణము తన కెట్లు లభించునా అని ఆలోచించుట].

మూ. ఏతాం శ్రుత్వా కథాం దివ్యాం పౌరాణీం రాఘవస్తదా,
భ్రాతృభిః సహితో వీరో విస్మయం పరమం యయౌ. 1

ప్ర.అ తదా = అప్పుడు, భ్రాతృభిః = సోదరులతో, సహితః = కూడిన, వీరః = వీరుడైన, రాఘవః = రాముడు, దివ్యామ్=దివ్యమైన, పౌరాణీమ్ = పురాణమునకు సంబంధించిన, ఏతాం కథామ్ = ఈ కథను, శ్రుత్వా = విని,పరమమ్ = గొప్ప, విస్మయమ్ = ఆశ్చర్యమును, యయౌ = పొందెను.

తా. సోదరులతో కూడిన వీరుడైన రాముడు దివ్యమైన పురాతనమైన ఈ కథను విని గొప్ప ఆశ్చర్యమును పొందెను.

మూ. రాఘవోఽథ ఋషేర్వాక్యం శ్రుత్వా వచన మబ్రవీత్,
కథేయం మహతీ పుణ్యా త్వత్ప్రసాదాచ్ఛ్రుతా మయా. 2

ప్ర. అ. రాఘవః=రాముడు, ఋషేః = ఋషియొక్క, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, అథ = అటుపిమ్మట. వచనమ్ = వచనమును, అబ్రవీత్ =పలికెను. త్వత్ప్రసాదాత్ = నీ అనుగ్రహమువలన, పుణ్యా = పుణ్యమైన, మహతీ = గొప్పదైన, ఇయం కథా = ఈ కథ, మయా=నాచేత, శ్రుతా = వినబడినది.

తా. రాముడు అగస్త్యుని మాటలు విని ఇట్లు పలికెను. నీ అనుగ్రహమువలన పుణ్యప్రదమైన ఈ గొప్ప కథను విన్నాను.

మూ. బృహత్కౌతూహలే చాస్మిన్ సంవృతో మునిపుంగవ.
ఉత్పత్తిర్యాదృశీ దివ్యా వాలి సుగ్రీవయోర్ద్విజ. 3

ప్ర. అ. మునిపుంగవ = మునిశ్రేష్ఠుడా! ద్విజ=బ్రాహ్మణుడా! అస్మిన్= ఈ, బృహత్కౌతూహలే = గొప్పవేడుకయందు, సంవృతః = కూడి ఉంటిని. వాలి సుగ్రీవయోః = వాలిసుగ్రీవులయొక్క, దివ్యా = దివ్యమైన, ఉత్పత్తిః = పుట్టుక, యాదృశీ = ఎట్టిదో.

తా. మునిశ్రేష్ఠుడవైన ఓ! బ్రాహ్మణోత్తమా! వాలిసుగ్రీవుల ఈ దివ్యమైన పుట్టుక ఎట్టిదో కదా అని నేను ఆశ్చర్యముతో నిండి ఉన్నాను. 3.

మూ. కిం చిత్రం మమ బ్రహ్మర్షే సురేన్ద్రతపనావుభౌ,
జాతౌ వానర శార్దూలౌ బలేన బలినాం వరౌ. 4

ప్ర. అ. బ్రహ్మర్షే = ఓ! బ్రహ్మర్షీ! బలేన=బలముచేత, బలినామ్= బలవంతులలో, వరౌ = శ్రేష్ఠులైన. ఉభౌ = ఇద్దరు, సురేన్ద్రతపనౌ = ఇంద్ర సూర్యులు, వానరశార్దూలౌ = వానర శ్రేష్ఠులుగా, జాతౌ=పుట్టినారు, మమ = నాకు, కిం చిత్రం = ఏమి ఆశ్చర్యము!

తా. ఓ బ్రహ్మర్షీ! బలముచేత బలవంతులందరిలోను ఉత్తములైన ఇంద్ర సూర్యులు ఇద్దరూ వానరశ్రేష్ఠులుగా పుట్టినారు. గాన ఇది ఎంతో ఆశ్చర్యముగా ఉన్నది. 4

మూ. ఏవముక్తేతు రామేణ కుమ్భయోనిరభాషత.
ఏవమేతన్మహాబాహో వృత్తమాసీత్పురా కిల. 5

ప్ర. అ. రామేణ = రామునిచేత, ఏవమ్ =ఇట్లు, ఉక్తే =చెప్పబడగా, కుమ్భయోనిః=అగస్త్యుడు, అభాషత=పలికెను, మహాబాహో!=గొప్పబాహువులు గలవాడా! పురా = పూర్వము, ఏతత్=ఇది, ఏవమ్ = ఇట్లు, వృత్తం కిల = జరిగినదట.

తా. రాముని మాటలు విని అగస్త్యుడిట్లు పలికెను. ఓ! మహాబాహూ! పూర్వము ఈ విషయము ఈ విధముగా జరిగినదట. 5

మూ. అథాపరాం కథాం దివ్యాం శృణు రాజన్ సనాతనీమ్
యదర్థం రామ వైదేహీ రావణేన పురా హృతా. 6
తత్తేఽహం సంప్రవక్ష్యామి సమాధిం శ్రవణే కురు.

ప్ర.అ. రాజన్ = రాజా! అథ = మరియు, అపరామ్ = మరియొక, దివ్యామ్ = దివ్యమైన, సనాతనీమ్ = ప్రాచీనమైన, కథామ్ = కథను, శృణు = వినుము. రామ = రామా! పురా = పూర్వము, రావణేన = రావణునిచేత, వైదేహీ = సీత, యదర్థమ్ = ఎందునిమిత్తము, హృతా = హరింపబడినదో, తత్ = దానిని, అహమ్ = నేను, తే = నీకు, సంప్రవక్ష్యామి = చెప్పెదను. శ్రవణే = వినుటయందు, సమాధిమ్ = ఏకాగ్రతను, కురు = చేయుము.

తా. రామా! ప్రాచీనమైన మరొక దివ్యమైన కథ చెప్పెదను; వినుము. పూర్వము రావణుడు సీతను ఎందుకు హరించినాడో చెప్పెదను. సావధానచిత్తముతో వినుము. 6

మూ. పురా కృతయుగే రామ ప్రజాపతిసుతం ప్రభుమ్ 7
సనత్కుమారమాసీనం రావణో రాక్షసాధిపః

ప్ర. అ. రామ = రామా! పురా = పూర్వము, కృతయుగే = కృతయుగమునందు, రాక్షసాధిపః = రాక్షసప్రభువైన, రావణః = రావణుడు, ప్రజాపతిసుతమ్ = బ్రహ్మపుత్రుడు, ప్రభుమ్ = సమర్థుడు అయిన, ఆసీనమ్ = కూర్చొని ఉన్న, సనత్కుమారమ్ = సనత్కుమారుణ్ణి (చూచెను.)

తా. రామా! పూర్వము కృతయుగమునందు రాక్షసరాజైన రావణుడు, బ్రహ్మదేవుని పుత్రుడూ, సర్వథాసమర్థుడూ అయిన సనత్కుమారుడు ఒక చోట కూర్చొని ఉండగా చూచెను. 7

మూ. వపుషా సూర్యసంకాశం జ్వలన్తమివ తేజసా, 8
వినయావనతో భూత్వా హ్యభివాద్య కృతాఞ్జలిః,
ఉక్తవాన్ రావణో రామ తమృషిం సత్యవాదినమ్. 9

ప్ర. అ. రామ = రామా! రావణః = రావణుడు, వపుషా = దేహముచేత,

సూర్యసంకాశమ్ = సూర్యునితో సమానుడైన, తేజసా = తేజస్సుచేత, జ్వలన్తమ్ ఇవ = మండుచున్నట్లు ఉన్న, సత్యవాదినమ్ = సత్యమును పలుకు, తమ్ = ఆ, ఋషిమ్ = ఋషిని, కృతాఞ్జలిః=చేయబడిన దోసి కలవాడై, వినయావనతః= వినయముచేత వంగినవాడు, భూత్వా = అయి, అభివాద్య=నమస్కరించి, ఉక్తవాన్ = పలికినాడు.

తా. రామా! సూర్యునివంటి దేహముతో తేజస్సుతో ప్రజ్వలించుచున్నట్లు ఉన్న, సత్యము పలుకు ఆ ఋషికి రావణుడు సవినయముగా అంజలి ఘటించి మ్రొక్కి ఇట్లు పలికెను. 8,9

మూ. కో అస్మిన్ ప్రవరో లోకే దేవానాం బలవత్తరః,
యం సమాశ్రిత్య విబుధా జయన్తి సమరే రిపూన్. 10

ప్ర. అ. అస్మిన్ = ఈ, లోకే = లోకమునందు, దేవానామ్ = దేవతలలో, బలవత్తరః = అధికబలవంతుడు, కః = ఎవడు ? యమ్=ఎవనిని, సమాశ్రిత్య= ఆశ్రయించి, విబుధాః = దేవతలు, సమరే=యుద్ధమునందు, రిపూన్ =శత్రువులను, జయన్తి = జయించుచున్నారో.

తా. ఈ లోకములో దేవతలు ఎవనిని ఆశ్రయించి యుద్ధమునందు శత్రువులను జయించగలుగుచున్నారో అట్టి, దేవతలలో కెల్లా అత్యధికమైనబలము కలవాడు ఎవడు? 10

మూ. కం యజన్తి ద్విజా నిత్యం కం ధ్యాయన్తి చ యోగినః,
ఏతన్మే శంస భగవన్ విస్తరేణ తపోధన. 11

ప్ర. అ. భగవన్ = పూజ్యుడా! తపోధన = ఓ! మహాముని! ద్విజాః= బ్రాహ్మణులు, నిత్యమ్ = ఎల్లప్పుడూ, కమ్ = ఎవనిని, యజన్తి = పూజించుచున్నారు? యోగినః = యోగులు, కమ్ = ఎవనిని, ధ్యాయన్తి = ధ్యానించుచున్నారు? ఏతత్ = దీనిని, విస్తరేణ = విస్తరముతో, మే = నాకు, శంస = చెప్పుము.

తా. పూజ్యుడవైన ఓ! మహాముని! నిత్యమూ ద్విజులు ఎవనిని పూజించుచున్నారు? యోగులు ఎవనిని ధ్యానించుచున్నారు? ఈ విషయమును నాకు సవిస్తరముగ చెప్పుము.

మూ. విదిత్వా హృద్గతం తస్య ధ్యానదృష్టిర్మహాయశాః,
ఉవాచ రావణం ప్రేమ్ణా శ్రూయతామితి పుత్రక. 12

ప్ర. అ. ధ్యానదృష్టిః=ధ్యానదృష్టి గల, మహాయశాః = గొప్ప కీర్తి గల సనత్కుమారుడు. తస్య = వానియొక్క, హృద్గతమ్ = మనస్సులో ఉన్న అభిప్రాయమును, విదిత్వా=తెలుసుకొని, రావణమ్= రావణునిగూర్చి, పుత్రక= పుత్రా! శ్రూయతామ్ = వినబడుగాక, ఇతి = అని, ప్రేమ్ణా=ప్రేమతో, ఉవాచ = పలికెను.

తా. ధ్యానదృష్టి గల మహాయశఃశాలియైన ఆ సనత్కుమారుడు రావణుని మనస్సులో ఉన్న అభిప్రాయమును తెలుసుకొని "నాయనా! వినుము" అని ఇట్లు చెప్పెను. 12

మూ. యో వై భర్తా జగత్కృత్స్నంయస్యోత్పత్తిం న విద్మహే,
సురాసురైర్నతో నిత్యం హరిర్నారాయణః ప్రభుః. 13

యస్య నాభ్యుద్గతో బ్రహ్మ విశ్వస్య జగతః పతిః,
యేన సర్వమిదం సృష్టం విశ్వం స్థావరజఙ్గమమ్. 14

తం సమాశ్రిత్య విబుధా విధినా హరిమధ్వరే
పిబన్తి హ్యమృతం చైవ మానితాశ్చ యజన్తి తమ్. 15

ప్ర. అ. యః = ఎవడు, కృత్స్నమ్ = సమస్తమైన, జగత్=జగత్తును, భర్తా = భరించువాడో, యస్య = ఎవనియొక్క, ఉత్పత్తిమ్ = పుట్టుకను, న విద్మహే = ఎరుగమో, హరిః = సర్వపాపములను హరించువాడు, నారాయణః = జలము నివాసస్థానముగా గలవాడు, ప్రభుః = సమర్థుడు అయిన ఎవడు, నిత్యమ్ = నిత్యమూ, సురాసురైః = సురులచేతను, అసురులచేతను, నతః = నమస్కరించబడుచున్నాడో. విశ్వస్య = సమస్తమైన, జగతః = జగత్తుకు, పతిః = ప్రభువైన, బ్రహ్మ = బ్రహ్మ, యస్య = ఎవనియొక్క, నాభ్యుద్భవః= నాభినుండి పుట్టినాడో. యేన = ఎవనిచేత, స్థావరజఙ్గమమ్=స్థావరజంగమాత్మకమైన, ఇదమ్= ఈ, విశ్వమ్=ప్రపంచము, సృష్టమ్=సృజింపబడినదో, తమ్= ఆ, హరిమ్ = విష్ణువును, సమాశ్రిత్య = ఆశ్రయించి, విబుధాః = దేవతలు

(దేవతాత్వమును పొందబోవు పండితులు),అధ్వరే=యజ్ఞమునందు,(పూజింతురు). అమృతమ్ = అమృతమును, పిబన్తి=త్రాగుదురు. మానితాః చ ఏవ=గౌరవింప బడినవారై, తమ్ = ఆ విష్ణువును, యజన్తి = పూజించుచుందురు.

తా. శ్రీమహావిష్ణువు ఈ జగత్తుకు అంతకూ ప్రభువు. అతని జన్మను గూర్చి మనకు తెలియదు. (పుట్టుక లేనివాడు). నిత్యము అతనికి సురులు, అసురులూ కూడ నమస్కరించుచుందురు. సర్వసమర్థుడు, జలమునందు శయనించువాడు అయిన ఇతడు సకలపాపములను హరించును. ఇతని నాభినుండి పుట్టిన బ్రహ్మదేవుడు సకల జగత్తుకు అధిపతి. స్థావరజంగమాత్మకమైన ఈ జగత్తు అంతా ఈ విష్ణువే సృష్టించినాడు. అట్టి ఈ హరిని ఆశ్రయించి పండితులు యజ్ఞములుచేసి దేవత్వమును పొంది అమృతపానము చేయుదురు. అందరిచేత సన్మానింపబడుచు వీరు విష్ణువునే పూజించుచుందురు. 13-15

మూ. పురాణైశ్చైవ వేదైశ్చ పాఞ్చరాత్రైస్తథైవ చ,
ధ్యాయన్తి యోగినో నిత్యం క్రతుభిశ్చ యజన్తి తమ్.16

ప్ర. అ. పురాణైః చ ఏవ = పురాణములచేతను, వేదైః చ = వేదముల చేత, తథైవ చ = మరియు, పాఞ్చరాత్రైః=పాంచరాత్రములచేతను, (పూజించు చుందురు). యోగినః = యోగులు, నిత్యమ్ = ఎల్లప్పుడూ, ధ్యాయన్తి= ధ్యానము చేయుచుందురు. క్రతుభిః చ = యజ్ఞములచేత గూడ, తమ్ = అతనిని, యజన్తి = పూజించుచుందురు.

తా. పురాణ-వేద-పాంచరాత్రాగమాదులలో చెప్పిన విధముగ జనులు ఈ విష్ణువునే పూజించుచుందురు. నిత్యమూ యోగులు ఇతనిని ధ్యానింతురు. యజ్ఞముల చేత పూజించుచుందురు. 16

మూ. దైత్యదానవరక్షాంసి యే చాన్యే చామరద్విషః
సర్వాఞ్జయతి సంగ్రామే సదా సర్వైః స పూజ్యతే. 17

ప్ర. అ. దైత్యదానవరక్షాంసి = దైత్యులను,దానవులను రాక్షసులను, అన్యే = ఇతరులైన, యే = ఏ, అమరద్విషః చ = దేవతాశత్రువులు గలరో, సర్వాన్ = వాళ్ళనందరినీ, సంగ్రామే = యుద్ధమునందు, జయతి = జయించును.

సదా = ఎల్లప్పుడూ, సర్వైః = అందరిచేతా, సః = అతడు, పూజ్యతే = పూజింపబడుచున్నాడు.

తా. దైత్యదానవ రాక్షసులను, దేవతల శత్రువులైన ఇతరులను అందరినీ శ్రీమహావిష్ణువు యుద్ధములో జయించుచుండును. అందరూ పూజించుచున్నది ఈతనినే. 17

మూ. శ్రుత్వా మహర్షేస్తద్వాక్యం రావణో రాక్షసాధిపః,
ఉవాచ ప్రణతో భూత్వా పునరేవ మహామునిమ్. 18

ప్ర. అ. రాక్షసాధిపః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, మహర్షేః = మహర్షియొక్క, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, ప్రణతః = వంగినవాడు, భూత్వా = అయి, పునః ఏవ = మరల, మహామునిమ్ = మహామునిని గూర్చి, ఉవాచ = పలికెను.

తా. రాక్షసరాజైన రావణుడు మహర్షి పలికిన ఆ మాటలు విని, మరల వినయపూర్వకముగ అతనితో ఇట్లనెను. 18

మూ. దైత్యదానవరక్షాంసి యే హతాః సమరేఽరయః,
కాం గతిం ప్రతిపద్యన్తే కాం చ తే హరిణా హతాః. 19

ప్ర. అ. అరయః = శత్రువులైన, యే = ఏ, సమరే = యుద్ధమునందు, హతాః = చంపబడిన, దైత్యదానవరక్షాంసి = దైత్యులు, దానవులు, రాక్షసులూ ఉన్నారో, వారు, కామ్ = ఏ, గతిమ్ = గతిని, ప్రతిపద్యన్తే = పొందుదురు ? హరిణా = విష్ణువుచేత, హతాః = చంపబడినవారు, కాం గతిమ్ = ఏ గతిని, ప్రతిపద్యన్తే = పొందుదురు.

తా. యుద్ధములో చంపబడిన శత్రువులైన దైత్యదానవరాక్షసులకు ఏ గతి వచ్చును ! విష్ణుమూర్తిచేత చంపబడిన వారికి ఏ గతి కలుగును ? 19

మూ. రావణస్య వచః శ్రుత్వా ప్రత్యువాచ మహామునిః,
దైవతైర్నిహతా నిత్యం ప్రాప్నువన్తి దివః స్థలమ్. 20

ప్ర. అ. రావణస్య = రావణునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా =

విని, మహామునిః = మహాముని, ప్రత్యువాచ = తిరిగి పలికెను. దైవతైః = దేవతలచేత, నిహతాః = చంపబడినవారు, నిత్యమ్=నిత్యముగా (తప్పక), దివః = స్వర్గముయొక్క, స్థలమ్ = స్థలమును, ప్రాప్నువన్తి = పొందుదురు.

తా. రావణుని మాట విని ఆ మహాముని ఇట్లు బదులు చెప్పెను. దేవతల చేత చంపబడినవాళ్లు తప్పక స్వర్గమునకు వెళ్ళుదురు. 20

మూ. పునస్తస్మాత్పరిభ్రష్టా జాయన్తే వసుధాతలే.
పూర్వార్జితైః సుఖైర్దుఃఖైర్జాయన్తే చ మ్రియన్తి చ. 21

ప్ర. అ. తస్మాత్ = ఆ స్వర్గమునుండి, పరిభ్రష్టాః = భ్రష్టులై, పునః = మరల, వసుధాతలే=భూమిమీద, జాయన్తే=పుట్టుదురు. పూర్వార్జితైః=పూర్వము సంపాదించబడిన, సుఖైః=సుఖకరములైన పుణ్యముల చేతను, దుఃఖైః=దుఃఖ కరములైన పాపములచేతను, జాయన్తే= పుట్టుచుందురు. మ్రియన్తి చ = మరణించుచుందురు.

తా. స్వర్గమునుండి భ్రష్టులై మరల భూలోకములో పుట్టుచుందురు. పూర్వము సంపాదించిన పుణ్యపాపములను పట్టి పుట్టుచుందురు. చచ్చు చుందురు. 21

మూ. యే యే హతాశ్చక్రధరేణ రాజం
స్త్రైలోక్యనాథేన జనార్దనేన,
తే తే గతాస్తన్నిలయం నరేన్ద్రాః
క్రోధోఽపి దేవస్య వరేణ తుల్యః. 22

ప్ర. అ. రాజన్ = రాజా! చక్రధరేణ=చక్రమును ధరించిన, త్రైలోక్య నాథేన = మూడు లోకముల ప్రభువైన, జనార్దనేన = విష్ణువుచేత, యే యే= ఎవరెవరు, హతాః = చంపబడినారో, తే తే = ఆ యా, నరేన్ద్రాః=రాజులు, తన్నిలయమ్ = ఆ మహావిష్ణువు స్థానమును గూర్చి, గతాః = వెళ్ళినారు. దేవస్య= దేవుడైన విష్ణువుయొక్క, క్రోధః అపి=క్రోధము కూడ, వరేణ = వరముతో, తుల్యః = సమానము.

తా. చక్రధారి, మూడు లోకాల ప్రభువూ అయిన ఆ జనార్దనుని చేతిలో

మరణించిన రాజు లందరూ ఆ విష్ణువు స్థానమైన వైకుంఠమునకే వెళ్ళుదురు. శ్రీ మహావిష్ణువు కోపము కూడ వరముతో సమానము 22

మూ. శ్రుత్వా తత స్తద్వచనం నిశాచరః
సనత్కుమారస్య ముఖాద్వినిర్గతమ్.
తథా ప్రహృష్టః స బభూవ విస్మితః
కథం ను యాస్యామి హరిం మహాహవే. 23

ఇత్యార్షే శ్రీ మద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః సర్గః ద్వితీయః.

ప్ర. అ. సః = ఆ, నిశాచరః = రావణుడు, తతః = పిమ్మట, సనత్కుమారస్య = సనత్కుమారునియొక్క, ముఖాత్ = ముఖమునుండి, వినిర్గతమ్ = బయల్వెడలిన, తత్ = ఆ, వచనమ్ = వచనమును, శ్రుత్వా = విని, తథా = అట్లు, ప్రహృష్టః = సంతోషించినవాడై, విస్మితః = ఆశ్చర్యము చెందినవాడు, బభూవ = ఆయెను. మహాహవే = మహాయుద్ధమునందు, హరిమ్ = విష్ణువును గూర్చి, కథం ను = ఎట్లు, యాస్యామి = వెళ్ళుదును (అని ఆలోచించెను).

తా. ఆ రావణుడు సనత్కుమారుని మాటలు విని, సంతోషము, ఆశ్చర్యము కూడ పొంది, నేను హరిని యుద్ధములో ఎదిరించుట ఎట్లు సిద్ధించును? " అని ఆలోచించెను. 23

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు,
ఉత్తరకాండలో రెండవ ప్రక్షిప్త సర్గ సమాప్తము.

అథ ప్రక్షిప్తసర్గః తృతీయః

[సనత్కుమారుడు రావణునకు శ్రీమహావిష్ణువు గొప్పతనమును వర్ణించి చెప్పి ఆతడు రాముడుగాను లక్ష్మి సీతగాను అవతరించగలరని చెప్పుట]

మూ. ఏవం చిన్తయతస్తస్య రావణస్య దురాత్మనః
పునరేవాపరం వాక్యం వ్యాజహార మహామునిః. 1

ప్ర. అ. దురాత్మనః = దురాత్ముడైన, తస్య రావణస్య = ఆ రావణుడు, ఏవమ్ = ఇట్లు, చిన్తయతః = చింతించుచుండగా, మహామునిః = మహాముని, పునరేవ = మరల, అపరమ్ = మరియొక, వాక్యమ్ = వాక్యమును, వ్యాజహార = వలికెను.

తా. దురాత్ముడైన ఆ రావణుడు ఇట్లు ఆలోచించుచుండగా ఆ మహాముని మరల ఇట్లు వలికెను. 1

మూ. మనసశ్చేప్సితం యత్తద్భవిష్యతి మహాహవే,
సుఖీ భవ మహాబాహో కం చిత్కాలముదీక్షయ. 2

ప్ర. అ. మహాబాహో = గొప్పబాహువులు కలవాడా! యత్ = ఏది, మనసః = మనస్సునకు, ఈప్సితమ్ = ఇష్టమో, తత్ = అది, మహాహవే = మహా యుద్ధమునందు, భవిష్యతి = కాగలదు. సుఖీ = సుఖవంతుడవు, భవ = అగుము కించిత్ కాలమ్ = కొంచెము సమయమును, ఉదీక్షయ = నిరీక్షించుము.

తా. ఓ! మహాబాహూ! యుద్ధములో నీకిష్టమైనది కాగలదు. సుఖముగా ఉండుము. కొంతకాలము నిరీక్షించుము.

మూ. ఏవం శ్రుత్వా మహాబాహు స్తమృషింప్రత్యా వాచ సః,
కీదృశం లక్షణం తస్య బ్రూహి సర్వమశేషతః. 3

ప్ర. అ. మహాబాహుః=గొప్ప బాహువులు గల, సః=అతడు, ఏవమ్=ఇట్లు, శ్రుత్వా=విని, తమ్ = ఆ, ఋషిమ్=ఋషిని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. తస్య = ఆ విష్ణువుయొక్క, లక్షణమ్=లక్షణము, కీదృశమ్=ఎట్టిది? సర్వమ్ = సమస్తమును, అశేషతః = పూర్తిగా, బ్రూహి = చెప్పుము.

తా. రావణుడు ఆ మాటలు విని ఆ ఋషితో మరల ఇట్లు పలికెను. ఆ మహావిష్ణువు లక్షణము లేవో పూర్తిగా చెప్పుము. 3

మూ. రాక్షసేశవచః శ్రుత్వా స మునిః ప్రత్యభాషత,
శ్రూయతాం సర్వమాఖ్యాస్యే తవ రాక్షసపుంగవ. 4

ప్ర. అ. రాక్షసేశవచః = రాక్షసరాజు వచనమును, శ్రుత్వా=విని, సః మునిః=ఆ ముని, ప్రత్యభాషత = తిరిగి పలికెను. రాక్షసపుంగవ = రాక్షసశ్రేష్ఠుడా! సర్వమ్ = సమస్తమునూ, తవ=నీకు, ఆఖ్యాస్యే=చెప్పగలను. శ్రూయతామ్ = వినబడుగాక.

తా. రావణుని మాటలు విని ఆ ముని మరల ఇట్లనెను. రాక్షసశ్రేష్ఠుడా! నీకు అంతా చెప్పెదను వినుము. 4

మూ. స హి సర్వగతో దేవః సూక్ష్మోఽవ్యక్తః సనాతనః,
తేన సర్వ మిదం వ్యాప్తం త్రైలోక్యం సచరాచరమ్. 5

ప్ర. అ. సః దేవః=ఆ దేవుడు, సర్వగతః హి=అంతటా ఉన్నవాడు కదా సూక్ష్మః=సూక్ష్మమైనవాడు. అవ్యక్తః = వ్యక్తుడు కానివాడు. సనాతనః = అతి పురాతనుడు. సచరాచరమ్ = జంగమస్థావరాత్మకమైన, ఇదమ్ = ఈ, త్రైలోక్యమ్=మూడులోకముల సముదాయము, సర్వమ్ = సమస్తమూ, తేన = వానిచేత, వ్యాప్తమ్ = వ్యాపింపబడినది.

తా. ఆ శ్రీమహావిష్ణువు అంతటా ఉన్నాడు. సూక్ష్ముడు. స్పష్టముగా ఇంద్రియములకు గోచరుడు కానివాడు. అతిప్రాచీనుడు. స్థావరజంగమాత్మకములైన ఈ మూడు లోకములను అతడు వ్యాపించి ఉన్నాడు. 5

మూ. స భూమౌ దివి పాతాలే పర్వతేషు వనేషు చ,
స్థావరేషు చ సర్వేషు నదీషు నగరీషు చ. 6

ప్ర. అ. సః= అతడు, భూమౌ=భూమియందు, దివి=స్వర్గమునందు, పాతాలే=పాతాళమునందు, పర్వతేషు = పర్వతములయందు, వనేషు చ = వనములయందు, సర్వేషు= సమస్తమైన, స్థావరేషు=స్థావరములయందు, నదీషు =నదులయందు, నగరీషు=నగరములయందు (ఉన్నాడు).

తా. భూమి, స్వర్గము, పాతాళము, పర్వతములు, వనములు, స్థావరములు, నదులు, నగరములు మొదలైన అన్నిటియందు శ్రీమహావిష్ణువు ఉన్నాడు. 7

మూ. ఓఙ్కారశ్చైవ సత్యశ్చ సావిత్రీ పృథివీ చ సః,
ధరాధరధరో దేవో హ్యనన్త ఇతి విశ్రుతః.

ప్ర. అ. సః=అతడే,ఓఙ్కారః చ=ఓంకారము. సత్యః చ=సత్యస్వరూపుడు. సావిత్రీ=సావిత్రి, పృథివీ= భూమి, ధరాధరధరః=పర్వతములను కూడ ధరించు, దేవః=దేవుడైన,అనన్తః=అనంతుడు అని, విశ్రుతః=ప్రసిద్ధుడు.

తా. అతడే ఓంకార–సత్యస్వరూపుడు. సావిత్రి, భూమి కూడ అతడే. భూమిని ధరించే పర్వతములను ధరించు ఆదిశేషుడుగా కూడ అతడు ప్రసిద్ధుడు.

మూ. అహశ్చ రాత్రిశ్చ ఉభే చ సంధ్యే
దివాకరశ్చైవ యమశ్చ సోమః,
స ఏవ కాలో హ్యనిలోఽనలశ్చ
స బ్రహ్మరుద్రేన్ద్రా స ఏవ చాపః. 8

ప్ర. అ సః=అతడే, అహశ్చ=పగలు, రాత్రిశ్చ=రాత్రి, ఉభే=రెండు సంధ్యే=సంధ్యలు. దివాకరః చైవ=సూర్యుడు, యమః చ=యముడు, సోమః= చంద్రుడు, స ఏవ=అతడే, కాలః=కాలము, అనిలః=వాయువు, అనలః=అగ్ని. సః=అతడే, బ్రహ్మరుద్రేన్ద్రాః=బ్రహ్మరుద్రేంద్రులు. సః ఏవ=అతడే, ఆపః= ఉదకము.

తా. పగలు, రాత్రి, రెండు సంధ్యలు, సూర్యుడు, యముడు, చంద్రుడు కాలము, వాయువు, అగ్ని. బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, ఉదకము-సర్వమూ ఇతడే. 8

మూ. విద్యోతతి జ్వలతి భాతి లోకాన్
సృజత్యయం సంహరతి ప్రశాస్తి,
క్రీడాం కరోత్యవ్యయలోకనాథో
విష్ణుః పురాణో భవనాశకైకః. 9

ప్ర. అ. అవ్యయలోకనాథః=వినాశరహితుడైన లోకప్రభువైన,పురాణః= ప్రాచీనుడైన, భవనాశకైకః= సంసారమును నశింపచేయు ఏకైక దేవుడైన, విష్ణుః=విష్ణువు, విద్యోతతి=ప్రకాశింపజేయుచున్నాడు. జ్వలతి=మండుచున్నాడు. భాతి=ప్రకాశించుచున్నాడు. అయమ్=ఇతడే, లోకాన్=లోకములను, సృజతి= సృజించుచున్నాడు. ప్రశాస్తి = రక్షించుచున్నాడు, సంహరతి = సంహరించు చున్నాడు. క్రీడామ్=క్రీడను, కరోతి=చేయుచున్నాడు.

తా. వినాశము లేని లోకప్రభువైన, అతిప్రాచీనుడైన ఈ విష్ణువు ఒక్కడే సంసారదుఃఖమును నశింపజేయగలవాడు. అన్నింటినీ ప్రకాశింపచేయును. లోకములను సృజించి, రక్షించి, సంహరించుచుండును. ఈ విధముగా క్రీడించు చుండును. 9

మూ. అథవా బహునానేవ కిముక్తేన దశానన.
తేన సర్వమిదం వ్యాప్తం త్రైలోక్యం సచరాచరమ్. 10

ప్ర. అ. దశానన= రావణా! అథవా= లేదా, ఉక్తేన = చెప్పబడిన, బహునా= అధికమైన, అనేన = దీనిచేత, కిమ్=ఏమి ప్రయోజనము? సచరాచరమ్=జంగమస్థావరములతో కూడిన, ఇదమ్ = ఈ, త్రైలోక్యమ్ = మూడు లోకముల సముదాయము. తేన=వానిచేత, వ్యాప్తమ్=వ్యాపించబడినది.

తా. రావణా! లేదా-ఇదంతా చెప్పి ఏమి ప్రయోజనము? ఒక్క మాటలో చెప్పవలెననగా జంగమస్థావరాత్మకమైన ఈ మూడు లోకములను ఈ విష్ణువు వ్యాపించి ఉన్నాడు. 10

మూ. నీలోత్పలదలశ్యామః కిఞ్జల్కారుణవాససా,
ప్రావృట్కాలే యథా వ్యోమ్ని సతడిత్తోయదో యథా. 11

ప్ర. అ. కిఞ్జల్కారుణవాససా = కింజల్కముల వలె ఎఱ్ఱనైన వస్త్రముతో కూడిన, నీలోత్పలదలశ్యామః = నల్లకలువల రేకుల వలె శ్యామవర్ణము గల అతడు, యథా=ఎట్లుండును అనగా, ప్రావృట్కాలే=వర్షకాలమునందు, వ్యోమ్ని

= ఆకాశమునందు, సతడిత్ = మెరుపులతో కూడిన, తోయదః యథా = మేఘము వలె ఉండును.

తా. కింజల్కముల వలె అరుణవర్ణమైన వస్త్రము ధరించిన నీలోత్పలదల శ్యాముడైన ఆ మహావిష్ణువు వర్షాకాలమునందు ఆకాశమునందున్న మెరుపులతో కూడిన మేఘము వలె ఉండును. 11

మూ శ్రీమాన్ మేఘవపుః శ్యామః ప్రభుః పఙ్కజలోచనః,
శ్రీవత్సేనోరసా యుక్తః శశాఙ్కకృతలక్షణః. 12

ప్ర. అ. శ్రీమాన్ = శోభ గలవాడు, మేఘవపుః = మేఘమువంటి శరీరము గలవాడు, శ్యామః = నల్లనివాడు, ప్రభుః = సమర్థుడు, పఙ్కజలోచనః = పద్మముల వంటి నేత్రములు కలవాడు, ఉరసా = వక్షస్థలముచేత, శ్రీవత్సేన = శ్రీవత్సముతో, యుక్తః = కూడినవాడు, శశాఙ్కకృతలక్షణః = చంద్రుడు వలె చేయబడిన గుర్తు గలవాడు.

తా. శ్రీమహావిష్ణువు చాల శోభగలవాడు. మేఘము వలె నల్లని శరీరము గల, పద్మములవంటి నేత్రములు గల సర్వసమర్థుడు. వక్షఃస్థలమునందు శ్రీవత్స మను పుట్టుమచ్చ ఉండుటచే మచ్చ ఉన్న చంద్రుడు వలె ఉండును. 12

మూ. తస్య నిత్యం శరీరస్థా మేఘస్యేవ శతహ్రదా,
సఙ్గ్రామరూపిణీ లక్ష్మీర్దేహమావృత్య తిష్ఠతి. 13

ప్ర. అ. మేఘస్య = మేఘముయొక్క, శతహ్రదా ఇవ = మెరుపు వలె, నిత్యమ్ = నిత్యమూ, తస్య = అతనియొక్క, శరీరస్థా = శరీరమునందున్న, సఙ్గ్రామరూపిణీ = యుద్ధరూపము గల, లక్ష్మీః = లక్ష్మి, దేహమ్ = దేహమును, ఆవృత్య = ఆవరించి, తిష్ఠతి = ఉన్నది.

తా. యుద్ధస్వరూపురాలైన లక్ష్మి (విజయలక్ష్మి) నిత్యమూ అతని శరీరమునందు, మేఘమునందు మెరుపువలె, ఉండి అతని దేహమును ఆవరించి ఉండును. 13

మూ. న శక్యః స సురైర్ద్రష్టుం నాసురైర్న చ పన్నగైః,
యస్య ప్రసాదం కురుతే స వై తం ద్రష్టుమర్హతి. 14

ప్ర. అ. సః = అతడు, సురైః = దేవతలచేత, ద్రష్టుమ్ = చూచుటకు, న శక్యః = శక్యమైన వాడు కాడు అసురైః = అసురులచేత, న = కాదు. పన్నగైః చ = సర్పములచేత, న = కాదు. యస్య = ఎవనికి, ప్రసాదమ్ = అనుగ్రహమును, కురుతే = చేయునో, సః = అతడు, తమ్ = అతనిని, ద్రష్టుమ్ = చూచుటకు, అర్హతి = తగి ఉన్నాడు.

తా. అతనిని దేవతలు గాని, అసురులు గాని, పన్నగులు గాని, చూడజాలరు. అతడు ఎవరిని అనుగ్రహించునో వారుమాత్రమే చూడగలరు. 14

మూ. న హి యజ్ఞఫలైస్తాత న తపోభిస్తు సంచితైః,
శక్యతే భగవాన్ ద్రష్టుం న దానేన న చేజ్యయా. 15

ప్ర. అ. తాత = తండ్రీ! భగవాన్ = భగవంతుడు, యజ్ఞఫలైః = యజ్ఞముల ఫలములచేత, ద్రష్టుమ్ = చూచుటకు, న శక్యతే హి = శక్యము కాదు కదా. సంచితైః = సంపాదించబడిన, తపోభిః = తపస్సులచేత, న = శక్యముకాదు. దానేన = దానములచేత, న = కాదు. ఇజ్యయా చ = యాగముచేత కూడ, న = కాదు.

తా. నాయనా! ఆ భగవంతుడ్జి యజ్ఞఫలములచేత గాని, బాగా చేసిన తపస్సులచేత గాని, దానముచేత గాని, యాగముచేత గాని చూడ శక్యము కాదు. 15

మూ. తద్భక్తైస్తద్గతప్రాణైస్తచ్చిత్తైస్తత్పరాయణైః,
శక్యతే భగవాన్ ద్రష్టుం జ్ఞాననిర్దగ్ధకిల్బిషైః. 16

ప్ర. అ. తద్గతప్రాణైః = అతనినే పొందిన ప్రాణములు గల, తచ్చిత్తైః = అతనియందే చిత్తము గల, తత్పరాయణైః = అతనియందే ఆసక్తి గల, జ్ఞాననిర్దగ్ధకిల్బిషైః = జ్ఞానముచేత కాల్చివేయబడిన పాపములు గల, తద్భక్తైః = అతని భక్తులచేతనే. భగవాన్ = భగవంతుడు, ద్రష్టుమ్ = చూచుటకు, శక్యతే = శక్య మగుచున్నాడు.

తా. ప్రాణములను ఆ భగవంతునికే సమర్పించి, చిత్తములను అతనియందే

నిలిపి ఎల్లప్పుడు అతనినే ఏకైకరక్షకుడని భావించుచు, జ్ఞానముచేత పాపమును కాల్చివేసికొనిన భక్తులు మాత్రమే భగవంతుణ్ణి చూడగలరు. 16

మూ. అథవా రాక్షసేన్ద్ర త్వం యది తం ద్రష్టుమిచ్ఛసి,
కథయిష్యామి తే సర్వం శ్రూయతాం యది రోచతే. 17

ప్ర. అ. అథవా = లేదా. రాక్షసేన్ద్ర = రాక్షసరాజా! త్వమ్ = నీవు, తమ్ = ఆ భగవంతుణ్ణి, ద్రష్టుమ్ = చూచుటకు, ఇచ్ఛసి యది = కోరినచో, తే = నీకు, సర్వమ్ = సమస్తమును, కథయిష్యామి = చెప్పెదను. రోచతే యది = ఇష్టమైనచో, శ్రూయతామ్ = వినబడుగాక.

తా. రాక్షసరాజా! నీవు ఆ భగవంతుణ్ణి చూడదలచినచో నీకు అంతా చెప్పెదను; ఇష్టమైనచో వినుము. 17

మూ. కృతే యుగే వ్యతీతే వై ముఖే త్రేతాయుగస్య తు,
హితార్థం దేవమర్త్యానాం భవితా నృపవిగ్రహః. 18

ప్ర. అ. కృతే యుగే = కృతయుగము, వ్యతీతే వై = గడచిన దగుచుండగా, త్రేతాయుగస్య = త్రేతాయుగముయొక్క, ముఖే = ప్రారంభమునందు, దేవమర్త్యానామ్ = దేవతలయొక్క, మానవులయొక్క, హితార్థమ్ = హితముకొరకు, నృపవిగ్రహః = రాజరూపము గలవాడై, భవితా = పుట్టగలడు

తా. కృతయుగము గడచిపోయిన పిమ్మట త్రేతాయుగప్రారంభమునందు భగవంతుడు, దేవతల, మనుష్యుల హితము కొరకు రాజదేహము ధరించి పుట్టగలడు. 18

మూ. ఇక్ష్వాకూణాం చ యో రాజా భావ్యో దశరథో భువి,
తస్య సూనుర్మహాతేజా రామో నామ భవిష్యతి. 19

మహాతేజా మహాబుద్ధిర్మహాబలపరాక్రమః,
మహాబాహుర్మహాసత్త్వః క్షమయా పృథివీసమః. 20

ప్ర. అ. భువి = భూలోకమునందు, ఇక్ష్వాకూణామ్ = ఇక్ష్వాకువంశీయులలో, యః = ఏ, దశరథః = దశరథు డను, రాజా = రాజు, భావ్యః = పుట్ట

నున్నాడో, తస్య = అతనికి, మహాతేజాః = గొప్పతేజస్సు గల, రామో నామ = రాము డను, సూనుః = కుమారుడు, భవిష్యతి = పుట్టగలడు. మహాతేజాః = గొప్ప తేజస్సు గల అతడు, మహాబుద్ధిః = గొప్ప బుద్ధి గలవాడు. మహాబలపరాక్రమః = గొప్ప బలపరాక్రమములు గలవాడు, మహాబాహుః = గొప్ప బాహువులు కలవాడు. మహాసత్త్వః = గొప్ప ధైర్యము గలవాడు, క్షమయా = ఓర్పుచేత, పృథివీసమః = భూమితో సమానుడు.

తా. భూలోకములో ఇక్ష్వాకువంశమునందు దశరథమహారాజు పుట్టగలడు. అతనికి మహాతేజశాలియైన రాము డను పుత్రుడు జనించును. గొప్ప బుద్ధి, బలము, పరాక్రమము, ధైర్యము గల ఆ మహాబాహువు ఓర్పుచేత భూమితో సమానుడుగా ఉండును. 19, 20

మూ. ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్యః సమరే శత్రుభిస్తదా,
భవితా హి తదా రామో నరో నారాయణః ప్రభుః. 21

ప్ర. అ. తదా = అప్పుడు, ప్రభుః = ప్రభువైన, నారాయణః = నారాయణుడు, సమరేః = యుద్ధమునందు, ఆదిత్యః ఇవ = సూర్యుడు వలె, దుష్ప్రేక్ష్యః = చూడశక్యముకాని, నరః = నరుడైన, రామః = రాముడుగా, భవితా హి = పుట్టగలడు.

తా. అప్పుడు ప్రభువైన నారాయణుడు యుద్ధరంగంలో శత్రువులకు సూర్యుడు వలె చూడశక్యముగాని రాముడుగా నరరూపమున అవతరించగలడు. 21

మూ. పితుర్నియోగాత్స విభుర్దణ్డకే వివిధే వనే,
విచరిష్యతి ధర్మాత్మా భ్రాత్రా సహ మహామనాః. 22

ప్ర. అ. ధర్మాత్మా = ధర్మాత్ముడు, మహామనాః = గొప్ప మనస్సు కలవాడూ అయిన, సః = ఆ, విభుః = ప్రభువు, పితుః = తండ్రియొక్క, నియోగాత్ = ఆజ్ఞవలన, వివిధే = అనేకవిధములైన, దణ్డకే వనే = దండకవనమునందు, భ్రాత్రా సహ = సోదరునితో కూడ, విచరిష్యతి = సంచరించగలడు.

తా. ధర్మాత్ముడు, గొప్ప మనస్సు గలవాడు అయిన రామప్రభువు

తండ్రి ఆజ్ఞచేత సోదరునితో కలిసి విశాలమైన దండకావనములో సంచరించగలడు. 22

మూ. తస్య పత్నీ మహాభాగా లక్ష్మీః సీతేతి విశ్రుతా,
దుహితా జనకస్యైషా ఉత్థితా వసుధాతలాత్. 23

ప్ర. అ. లక్ష్మీః = లక్ష్మి, సీతేతి = సీత అని, విశ్రుతా = ప్రసిద్ధురాలైన, మహాభాగా = మహాభాగ్యవంతురాలైన, తస్య పత్నీ = ఆ రాముని భార్యగా (కాగలదు). ఏషా = ఈమె, వసుధాతలాత్ = భూమినుండి, ఉత్థితా = పైకి వచ్చిన, జనకస్య = జనకునియొక్క, దుహితా = కుమార్తె (అగును).

తా. లక్ష్మీదేవి సీత అను ప్రసిద్ధి చెందినదై మహాభాగ్యవంతురాలై ఈ రాముని భార్య కాగలదు. ఈమె భూమినుండి ఆవిర్భవించి జనకుని కుమార్తె అగును. 23

మూ. రూపేణాప్రతిమా లోకే సర్వలక్షణలక్షితా,
ఛాయేవానుగతా రామం నిశాకరమివ ప్రభా. 24

ప్ర. అ. రూపేణ = రూపముచేత, లోకే = లోకమునందు, అప్రతిమా = సాటిలేనిది, సర్వలక్షణలక్షితా = అన్ని ఉత్తమలక్షణములతో కూడినదీ అయిన ఈమె, నిశాకరమ్ = చంద్రుణ్ణి, ప్రభా ఇవ = కాంతి వలె, రామమ్ = రాముణ్ణి. ఛాయేవ = నీడ వలె, అనుగతా = అనుసరించినది (కాగలదు).

తా. సౌందర్యముచేత లోకములో సాటి లేని, సకలసల్లక్షణ లక్షితురాలైన ఈ సీత చంద్రుణ్ణి కాంతి వలె, నిత్యమూ రాముణ్ణి నీడ వలె అనుసరించి ఉండును. 24

మూ. శీలాచారగుణోపేతా సాధ్వీ ధైర్యసమన్వితా,
సహస్రాంశో రశ్మిరివ హ్యేకా మూర్తిరివ స్థితా. 25

ప్ర. అ. శీలాచారగుణోపేతా = మంచి శీలముతోను, ఆచారముతోను, గుణములతోను కూడిన, సాధ్వీ = పతివ్రతయైన, ధైర్యసమన్వితా = ధైర్యముతో

కూడిన ఆ సీత, సహస్రాంశోః = సూర్యునియొక్క, రశ్మిరివ = కిరణము వలె, ఏకా = ఒక, మూర్తిరివ = మూర్తివలె, స్థితా = ఉన్నది.

తా. మంచి శీలము, ఆచారము, సద్గుణములూ గల ఆ సీత గొప్ప ధైర్యము గలదై, సూర్యుని కిరణము వలె, ఆ కిరణముయొక్క మరొక మూర్తి వలె ఉన్నది. (ఉండగలదు). 25

మూ. ఏవం తే సర్వమాఖ్యాతం మయా రావణ విస్తరాత్,
మహతో దేవదేవస్య శాశ్వతస్యావ్యయస్య చ. 26

ప్ర. అ. రావణ = రావణా! ఏవమ్ = ఈ విధముగా, మయా = నాచేత, తే = నీకు, సర్వమ్ = అంతా, విస్తరాత్ = విస్తరమువలన, మహతః = గొప్ప వాడు, శాశ్వతస్య = నిత్యుడు, అవ్యయస్య చ = నాశరహితుడూ అయిన, దేవ దేవస్య = దేవదేవునియొక్క ప్రతాపాదికము, కథితమ్ = చెప్పబడినది.

తా. రావణా! ఈ విధముగా నీకు, నేను, సర్వోత్తముడు, నిత్యుడు, వినాశరహితుడు, దేవదేవుడూ అయిన శ్రీమహావిష్ణువు ప్రతాపమును సవిస్తరముగా చెప్పినాను. 26

మూ. ఏవం శ్రుత్వా మహాబాహూ రాక్షసేన్ద్రః ప్రతాపవాన్,
త్వయా సహ విరోధేచ్ఛుశ్చిన్తయామాస రాఘవ. 27

ప్ర. అ. రాఘవ = రామా! మహాబాహుః = గొప్ప బాహువులు గల, ప్రతాపవాన్ = ప్రతాపవంతుడైన, రాక్షసేన్ద్రః = రాక్షసరాజు, ఏవమ్ = ఇట్లు, శ్రుత్వా = విని, త్వయా సహ = నీతో కూడ, విరోధేచ్ఛుః = విరోధమును కోరు చున్నవాడై, చిన్తయామాస = ఆలోచించెను.

తా. రామా! మహాబాహువు, ప్రతాపవంతుడూ అయిన రావణుడు ఈ విషయము విని, నీతో వైరము పెట్టుకొనవలె నని కోరుచు మనస్సులో ఆలో చించెను. 27

మూ. సనత్కుమారాత్తద్వాక్యం చిన్తయానో ముహుర్ముహుః,
రావణో ముముదే శ్రీమాన్ యుద్ధార్థం విచచార హ. 28

ప్ర. అ. శ్రీమాన్ = శ్రీమంతుడైన, రావణః = రావణుడు, సనత్కుమా

రాత్ = సనత్కుమారునినుండి, తత్ = ఆ, వాక్యమ్ = వాక్యమును గూర్చి, ముహుర్ముహుః = మాటిమాటికి, చిన్తయానః = ఆలోచించుచు, ముముదే=సంతోషించెను. యుద్ధార్థమ్ = యుద్ధముకొరకు, విచచార హ = సంచరించెను.

తా. శ్రీమంతుడైన ఆ రావణుడు సనత్కుమారుడు చెప్పగా వినిన ఆ మాటలను గూర్చి మాటిమాటికి ఆలోచించుచు సంతోషించెను. యుద్ధముకొరకై సంచరించెను. 28

మూ. శ్రుత్వా చ తాం కథాం రామో విస్మయోత్ఫుల్లలోచనః,
శిరసశ్చాలనం కృత్వా విస్మయం పరమం గతః. 29

ప్ర. అ. రామః = రాముడు, తాం కథామ్ = ఆ కథను, శ్రుత్వా = విని, విస్మయోత్ఫుల్లలోచనః = ఆశ్చర్యముచేత వికసించిన నేత్రములు గలవాడై, శిరసః = శిరస్సుయొక్క, చాలనమ్ = చాలనమును, కృత్వా = చేసి, పరమమ్= గొప్ప, విస్మయమ్ = ఆశ్చర్యమును, గతః = పొందినాడు.

తా. రాముడు ఆ కథను విని ఆశ్చర్యముచేత నేత్రములు వికసించగా తల వంకించుచు, గొప్ప ఆశ్చర్యమును పొందెను. 29

మూ. శ్రుత్వా తు వాక్యం స నరేశ్వరస్తదా
ముదా యుతో విస్మయమానచక్షుః,
పునశ్చ తం జ్ఞానవతాం ప్రధాన
మువాచ వాక్యం వద మే పురాతనమ్. 30

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః తృతీయః సర్గః.

ప్ర. అ. తదా = అప్పుడు, సః నరేశ్వరః = ఆ రాముడు, వాక్యమ్ = వాక్యమును, శ్రుత్వా = విని, ముదా = సంతోషముతో, యుతః = కూడినవాడై, విస్మయమానచక్షుః = వికసించుచున్న నేత్రములు కలవాడై, పునః చ = మరల, జ్ఞానవతామ్ = జ్ఞానవంతులలో, ప్రధానమ్ = ప్రధానుడైన, తమ్ = ఆ అగస్త్యుని గూర్చి, మే = నాకు, పురాతనమ్ = ప్రాచీనమైన, వాక్యమ్=వాక్యమును, వద= చెప్పుము అని, ఉవాచ = పలికెను.

తా. అప్పుడు ఆ వాక్యములు విన్న రాముడు సంతోషించుచు, ఆశ్చర్యము చేత వికసించిన నేత్రములు గలవాడై "ప్రాచీనకథను చెప్పుము"అని మరల జ్ఞానవంతులలో శ్రేష్ఠుడైన ఆ అగస్త్యమునిని కోరెను. 30

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు
ఉత్తరకాండలో మూడవ ప్రక్షిప్తసర్గ సమాప్తము.

అథ చతుర్థః ప్రక్షిప్తసర్గః

[*అగస్త్యుడు నారదుడు చెప్పినట్లుగా ఈ కథను కొనసాగించుట.*]

మూ. తతః పునర్మహాతేజాః కుమ్భయోనిర్మహాయశాః,
ఉవాచ రామం ప్రణతం పితామహ ఇవేశ్వరమ్. 1

ప్ర. అ. తతః = అనంతరము, మహాతేజాః = గొప్ప తేజస్సు గల, మహాయశాః = గొప్ప కీర్తిగల, కుమ్భయోనిః = అగస్త్యుడు, పితామహః = బ్రహ్మదేవుడు, ఈశ్వరమ్ ఇవ = ఈశ్వరుణ్ణి గూర్చి వలె, ప్రణతమ్ = నమస్కరించుచున్న, రామమ్ = రాముణ్ణి గూర్చి, పునః = మరల, ఉవాచ = పలికెను.

తా. అటుపిమ్మట, గొప్ప తేజస్సు, కీర్తి గల అగస్త్యుడు, బ్రహ్మదేవుడు పరమేశ్వరునితో వలె, వినయసంపన్నుడైన రామునితో మరల ఇట్లు పలికెను. 1

మూ. శ్రూయతామితి చోవాచ రామం సత్యపరాక్రమమ్,
కథాశేషం మహాతేజాః కథయామాస స ప్రభుః. 2

ప్ర. అ. మహాతేజాః = గొప్ప తేజస్సు గల, ప్రభుః = సమర్థుడైన, సః = ఆ అగస్త్యుడు, సత్యపరాక్రమమ్ = సత్యమైన పరాక్రమము గల, రామమ్ = రాముణ్ణి గూర్చి, శ్రూయతామ్ = వినబడుగాక, ఇతి = అని, ఉవాచ = పలికెను. కథాశేషమ్ = మిగిలిన కథను, కథయామాస = చెప్పెను.

తా. గొప్ప తేజస్సు గల, సమర్థుడైన ఆ అగస్త్యుడు సత్యమైన పరాక్రమము గల రామునితో "వినుము" అని పలికి అతనికి మిగిలిన కథను చెప్పెను.

మూ. యథాఖ్యానం శ్రుతం చైవ యథావృత్తం యథా తథా,
ప్రీతాత్మా కథయామాస రామాయ మహామతిః. 3

ప్ర. అ. మహామతిః = గొప్ప బుద్ధి గల అగస్త్యుడు, ప్రీతాత్మా=సంతోషించిన మనస్సు గలవాడై, యథాఖ్యానమ్ = తనకు ఇతరులు చెప్పినవిధముగా, శ్రుతం చైవ = తనచేత వినబడిన కథను, యథావృత్తమ్ = జరిగిన విధముగా, యథా తథా=ఉన్నదున్నట్లు, రాఘవాయ=రామునకు, కథయామాస=చెప్పెను.

తా. మహాబుద్ధిశాలియైన అగస్త్యుడు సంతోషించిన మనస్సుతో ఆ కథను తనకు ఇతరులు ఎట్లు చెప్పిరో, తాను ఎట్లు వినెనో అట్లే, జరిగినది జరిగినట్లు రామునకు చెప్పెను. 3

మూ. ఏతదర్థం మహాబాహో రావణేన దురాత్మనా,
సుతా జనకరాజస్య హృతా రామ మహామతే. 4

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! మహామతే = గొప్ప బుద్ధి గలవాడా! రామ=రామా! దురాత్మనా=దుర్బుద్ధియైన, రావణేన= రావణునిచేత, ఏతదర్థమ్=ఇందునిమిత్తమే, జనకరాజస్య సుతా=సీత, హృతా= హరించబడినది.

తా. గొప్ప బుద్ధి గల, మంచి బాహుబలము గల రామా! దురాత్ముడైన రావణుడు అందుకొరకే సీతను హరించినాడు. 4

మూ. ఏతాం కథాం మహాబాహో నారదః సుమహాయశాః,
కథయామాస దుర్ధర్ష మేరౌ గిరివరోత్తమే. 5

ప్ర. అ. మహాబాహో=గొప్ప బాహువులుగలవాడా! దుర్ధర్ష = ఎదిరింప శక్యము కానివాడా! ఏతాం కథామ్ = ఈ కథను, సుమహాయశాః = చాల గొప్ప కీర్తి గల, నారదః=నారదుడు, గిరివరోత్తమే=శ్రేష్ఠపర్వతములలో ఉత్తమమైన, మేరౌ = మేరుపర్వతముమీద, కథయామాస = చెప్పెను.

తా. ఓ! మహాబాహూ! జయింప శక్యముకాని ఓ! రామా! ఈ కథను గొప్ప కీర్తి గల నారదుడు పర్వతములలో ఉత్తమమైన మేరుపర్వతముమీద చెప్పినాడు.

మూ. దేవగన్ధర్వసిద్ధానామృషీణాం చ మహాత్మనామ్,
కథాశేషం పునః సోఽథ కథయామాస రాఘవ, 6
నారదః సుమహాతేజాః ప్రహసన్నివ మానద.

ప్ర. అ. మానద = గౌరవమును ఇచ్చువాడా! రాఘవ = రామా! అథ = అటుపిమ్మట, సుమహాతేజాః = చాల గొప్ప తేజస్సుగల, సః = ఆ, నారదః = నారదుడు, ప్రహసన్ ఇవ = నవ్వుచు, కథాశేషమ్ = కథయొక్క శేషభాగమును, దేవగన్ధర్వసిద్ధానామ్ = దేవగంధర్వసిద్ధులకు, మహాత్మనామ్ = మహాత్ములైన, ఋషీణాం చ = ఋషులకు, పునః = మరల, కథయామాస = చెప్పెను.

తా. ఇతరుల గౌరవమును కాపాడు రామా! గొప్ప తేజస్సు గల ఆ నారదుడు సంతోషముతో నవ్వుచు మిగిలిన కథను మహాత్ములైన దేవ-గంధర్వ-సిద్ధ-మహర్షులకు మరల చెప్పెను. 6

మూ. తాం కథాం శృణు రాజేన్ద్ర మహాపాపప్రణాశనీమ్, 7
యాం తు శ్రుత్వా మహాబాహో ఋషయో దైవతైః సహ,
ఊచుస్తం నారదం సర్వే హర్షపర్యాకులేక్షణమ్. 8

ప్ర. అ. మహాబాహో = గొప్ప బాహువులు గలవాడా! రాజేన్ద్ర = రాజాధిరాజా! దైవతైః సహ = దేవతలతో కూడ, సర్వే = సమస్తమైన, ఋషయః = ఋషులు, యామ్ = దేనిని, శ్రుత్వా = విని, హర్షపర్యాకులేక్షణమ్ = సంతోషముతో వ్యాకులములైన నేత్రములు కలుగునట్లుగా, తం నారదమ్ = ఆ నారదుణ్ణి గూర్చి, ఊచుః = పలికిరో, తామ్ = ఆ, మహాపాపప్రణాశనీమ్ = మహాపాపములను నశింపచేయు, కథామ్ = కథను, శృణు = వినుము.

తా. గొప్ప బాహుబలము గల రాజాధిరాజా! రామా! దేవతలూ, ఋషులూ కూడ ఏ కథను విని ఆనందాశ్రువులు కార్చుచు నారదునితో ఇట్లు అనిరో అట్టి మహాపాపవినాశకమైన కథను వినుము. 7,8

మూ. యశ్చేమాం శ్రావయేన్నిత్యం శృణుయాచ్చాపి భక్తితః,
స పుత్రపౌత్రవాన్ రామ స్వర్గలోకే మహీయతే. 9

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః సర్గః చతుర్థః.

ప్ర. అ. రామ = రామా, యః చ = ఎవడు, ఇమామ్ = దీనిని, నిత్యమ్ = నిత్యమూ, శ్రావయేత్ = వినిపించునో, భక్తితః = భక్తివలన, శృణుయాత్ చ

అపి = వినునో, సః = అతడు, పుత్రపౌత్రవాన్ = పుత్రపౌత్రులుకలవాడై, స్వర్గ లోకే = స్వర్గలోకమునందు, మహీయతే = పూజింపబడును.

తా. రామా! ఆ ఋష్యాదులు ఇట్లనిరి-"ఎవరు ఈ కథను భక్తిపూర్వకముగా వినిపించునో, ఎవరు వినునో ఆ ఇద్దరూ పుత్రపౌత్రాదిసుఖ మనుభవించి స్వర్గములో పూజింపబడుదురు." 9

"బాలానందిని" అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో నాల్గవ ప్రక్షిప్త సర్గ సమాప్తము.

అథ ప్రక్షిప్తః సర్గః పఞ్చమః

[నారదుడు చెప్పగా శ్వేతద్వీపమును గూర్చి విని రావణుడు అక్కడివారితో యుద్ధముచేయుటకై వెళ్లుట. అక్కడ స్త్రీలచేతిలో అవమానము పొందుట, సనత్కుమారుడు రావణునికి శ్రీమహావిష్ణు ప్రభావము తెలుపుట. అతని చేతిలో మరణించవలెనని రావణుడు నిశ్చయించుకొనుట.]

మూ. తతః స రాక్షసో రామ పర్యటన్ పృథివీతలే,
విజయార్థీ మహాశూరై రాక్షసైః పరివారితః. 1

దైత్యదానవరక్షఃసు యం శృణోతి బలాధికమ్,
తమాహ్వయతి యుద్ధార్థీ రావణో బలదర్పితః. 2

ప్ర. అ. రామ = రామా! తతః = అటుపిమ్మట, బలదర్పితః = బలముచేత గర్వించిన, మహాశూరైః = చాల శూరులైన, రాక్షసైః = రాక్షసులచేత, పరివారితః = చుట్టబడిన, రాక్షసః = రాక్షసుడైన, సః రావణః = ఆ రావణుడు, విజయార్థీ = విజయమును కోరుచు, పృథివీతలే = భూమిమీద, పర్యటన్ = సంచరించుచు, దైత్యదానవరక్షఃసు = దైత్యులలోను, దానవులలోను, రాక్షసులలోను, యమ్ = ఎవనిని, బలాధికమ్ = బలముచేత అధికుడ్జిగా, శృణోతి = వినునో, తమ్ = వానిని, యుద్ధార్థీ = యుద్ధమును కోరుచు, ఆహ్వయతి = ఆహ్వాయించుచున్నాడు.

తా. రామా! అటుపిమ్మట బలముచేత గర్వించిన ఆ రావణుడు శూరులైన రాక్షసులు వెంట రాగా, విజయమును కోరుచు. భూమిమీద సంచరించుచు దైత్య-దానవ.రాక్షసులలో మంచి బలవంతుడని వినిన ప్రతివానిని యుద్ధానికి పిలిచెను.

మూ. ఏవం స పర్యటన్ సర్వాం పృథివీం పృథివీపతే,
బ్రహ్మలోకాన్నివర్తన్తం సమాసాద్యాథ రావణః, 3
వ్రజన్తం మేరుపృష్ఠస్థమంశుమన్తమివాపరమ్,
తమభిసృత్య ప్రీతాత్మా హ్యభివాద్య కృతాఞ్జలిః, 4
ఉవాచ హృష్టమనసా నారదం రావణస్తదా.

ప్ర. అ. పృథివీపతే=ఓ! రాజా! ఏవమ్ = ఇట్లు, సర్వామ్=సమస్తమైన, పృథివీమ్ = భూమిని, పర్యటన్ = సంచరించుచున్న, రావణః = రావణుడు, అథ = అటుపిమ్మట, బ్రహ్మలోకాత్ = బ్రహ్మలోకమునుండి, నివర్తన్తమ్ = మరలి వచ్చుచున్న, మేరుపృష్ఠస్థమ్ = మేరుపర్వతము పైభాగమునందున్న, వ్రజన్తమ్=వెళ్లుచున్న, అపరమ్ = మరి యొక, అంశుమన్తమ్ ఇవ=సూర్యుడు వలె ఉన్న, నారదమ్ = నారదుణ్ణి, సమాసాద్య = సమీపించి, ప్రీతాత్మా = సంతోషించిన మనస్సు గలవాడై, తమ్=అతనిని, అభిసృత్య=చేరి, కృతాఞ్జలిః= చేయబడిన దోసిలి కలవాడై, అభివాద్య = నమస్కరించి, తదా = అప్పుడు, రావణః=ఆ లోకరావణుడు, హృష్టమనసా=సంతోషించిన మనస్సుతో, ఉవాచ= పలికెను.

తా. రామా! ఈ విధముగా భూమిపై చరించుచున్న రావణుడు ఒకనాడు బ్రహ్మలోకమునుండి తిరిగి వచ్చుచున్న నారదుణ్ణి చూచెను. వెళ్ళుచున్న అతడు మేరుపర్వతము పైభాగమునందు రెండవ సూర్యుడు వలె ప్రకాశించుచుండెను. రావణుడు మనస్సులో సంతోషించుచు అతనిని సమీపించి, అంజలి ఘటించి నమస్కరించి ఇట్లు పలికెను. 3,4

మూ. ఆ బ్రహ్మభువనం లోకాస్త్వయా దృష్టాహ్యనేకశః, 5
కస్మిన్ లోకే మహాభాగ మానవా బలవత్తరాః,
యోద్ధుమిచ్ఛామి తైః సార్ధం యథాకామం యథాసుఖమ్.

ప్ర. అ. మహాభాగ = మహాభాగ్యవంతుడా! ఆ బ్రహ్మభువనమ్ = బ్రహ్మలోకమువరకు, లోకాః = లోకములు, త్వయా = నీ చేత, అనేకశః = అనేక పర్యాయములు, దృష్టాః హి = చూడబడినవికదా. కస్మిన్=ఏ, లోకే = లోకమునందు, మానవాః=మానవులు, బలవత్తరాః=అధికబలము కలవారు? తైః సార్ధమ్ = వాళ్ళతో, యథాకామమ్ = ఇచ్ఛానుసారముగా, యథాసుఖమ్ = సుఖముగా, యోద్ధుమ్= యుద్ధముచేయుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా. మహాభాగ్యశాలి వైన నారదా! బ్రహ్మలోకమువరకూ ఉన్న అన్ని లోకములను నీవు అనేక పర్యాయములు చూచి ఉన్నావు. ఏ లోకములోని మానవులు అధికబలవంతులు? ఇచ్ఛానుసారము వాళ్ళతో సుఖముగా యుద్ధము చేయ గోరుచున్నాను. 5,6

మూ. చిన్తయిత్వా ముహూర్తం తు నారదః ప్రత్యువాచ తమ్,
అస్తి రాజన్ మహాద్వీపం క్షీరోదస్య సమీపతః. 7

ప్ర. అ. నారదః = నారదుడు, ముహూర్తమ్ = ముహూర్తకాలము, చిన్తయిత్వా = ఆలోచించి, తమ్ = వానిని గూర్చి, ప్రత్యువాచ = తిరిగి పలికెను. రాజన్ = రాజా! క్షీరోదస్య = క్షీరసముద్రము యొక్క, సమీపతః = సమీపమునందు, మహాద్వీపమ్ = మహాద్వీపము, అస్తి = ఉన్నది.

తా. నారదుడు ముహూర్తకాలము ఆలోచించి బదులు చెప్పెను. "రాజా! క్షీరసముద్రము దగ్గర ఒక మహాద్వీప మున్నది. 7

మూ. తత్ర తే చన్ద్రసంకాశా మానవాః సుమహాబలాః,
మహాకాయా మహావీర్యా మేఘస్తనితనిఃస్వనాః. 8

ప్ర. అ. తత్ర = అక్కడ, తే మానవాః = ఆ మానవులు, చన్ద్రసంకాశాః = చంద్రునితో సమానులు, సుమహాబలాః = చాల గొప్ప బలము కలవారు, మహాకాయాః = గొప్ప శరీరము కలవారు, మహావీర్యాః = గొప్ప పరాక్రమముగలవారు, మేఘస్తనితనిఃస్వనాః = ఉరుమువంటి ధ్వని గలవారు.

తా. ఆ ద్వీపములో నివసించు మానవులు చంద్రుడు వలె తెల్లగా ఉందురు. పెద్ద శరీరములు గల వారి బలము పరాక్రమము కూడ చాల గొప్పవి. వారి కంఠధ్వని ఉరుముల వలె ఉండును. 8

మూ. మహామాత్రా ధైర్యవన్తో మహాపరిఘబాహవః,
శ్వేతద్వీపే మయా దృష్టా మానవా రాక్షసాధిప. 9
బలవీర్యసమోపేతాన్ యాదృశాం స్త్వమిహేచ్ఛసి.

ప్ర. అ. రాక్షసాధిప = రాక్షసరాజా! ఇహ = ఇప్పుడు, త్వమ్ = నీవు, బలవీర్యసమోపేతాన్ = బలపరాక్రమములతో సమముగా కూడిన, యాదృశాన్ = ఎట్టి వారిని, ఇచ్ఛసి = కోరుచున్నావో, అట్టి, మహామాత్రాః = పెద్ద ప్రమాణము గల, ధైర్యవన్తః = ధైర్యవంతులైన, మహాపరిఘబాహవః = పెద్ద పరిఘలవంటి బాహువులు గల, మానవాః = మానవులు, మయా = నాచేత, శ్వేతద్వీపే = శ్వేతద్వీపమునందు, దృష్టాః = చూడబడినారు.

తా. రాక్షసరాజా! బలమూ, పరాక్రమమూ రెండూ సమముగా ఉన్న ఎట్టివారు కావలె నని కోరుచున్నావో అట్టి మానవులను నేను శ్వేతద్వీపములో చూచినాను. పెద్ద దేహప్రమాణము, పెద్ద పరిఘల (కోటగడియలు) వంటి బాహువులూ గల ఆ మానవులు చాల ధైర్యమున్నవారు. 9

మూ. నారదస్య వచః శ్రుత్వా రావణః ప్రత్యువాచ హ, 10
కథం నారద జాయన్తే తస్మిన్ ద్వీపే మహాబలాః,
శ్వేతద్వీపే కథం వాసః ప్రాప్తస్తైస్తు మహాత్మభిః. 11

ప్ర. అ. నారదస్య = నారదునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, రావణః = రావణుడు, ప్రత్యువాచ హ = తిరిగి పలికెను. నారద = నారదుడా! తస్మిన్ = ఆ, ద్వీపే = ద్వీపమునందు, మహాబలాః = గొప్పబలము గలవారు, కథమ్ = ఎట్లు, జాయన్తే = పుట్టుదురు? తైః = ఆ, మహాత్మభిః = మహాత్ములచేత, శ్వేతద్వీపే = శ్వేతద్వీపమునందు, వాసః = నివాసము, కథమ్ = ఎట్లు, ప్రాప్తః = పొందబడినది.

తా నారదుని మాటలు విని రావణుడు మరల ఇట్లడిగెను. "నారదా! మహాబలశాలులు ఆ ద్వీపమునందు ఎట్లు పుట్టుదురు? ఆ మహాత్ములకు శ్వేతద్వీపమునందు నివాసము ఎట్లు లభించినది? 10 11

మూ. ఏతన్మే సర్వమాఖ్యాహి ప్రభో నారద తత్త్వతః,
త్వయా దృష్టం జగత్సర్వం హస్తామలకవత్సదా. 12

ప్ర. అ. ప్రభో = సమర్థుడ వైన, నారద = నారదా! మే = నాకు, ఏతత్ = = దీనిని, సర్వమ్ = సమస్తమునూ, తత్త్వతః = యథార్థముగా, ఆఖ్యాహి = చెప్పుము. త్వయా = నాచేత, సర్వమ్ = సమస్తమైన, జగత్ = జగత్తు, సదా = ఎల్లప్పుడూ, హస్తామలకవత్ = చేతిలోని ఉసిరికాయ వలె, దృష్టమ్ = చూడబడినది.

తా. సమర్థుడవైన ఓ నారదా! నాకు ఈ విషయము నంతనూ యథార్థముగా చెప్పుము. నీవు ప్రపంచకము నంతను సర్వదా అరచేతిలోని ఉసిరికాయ వలె చూచుచుందువు కదా. 12

మూ. రావణస్య వచః శ్రుత్వా నారదః ప్రత్యువాచ హ,
అనన్యమనసో నిత్యం నారాయణపరాయణాః. 13
తదారాధనసక్తాశ్చ తచ్చిత్తాస్తత్పరాయణాః,
ఏకాన్తభావానుగతాస్తే నరా రాక్షసర్షభ. 14

ప్ర. అ. రావణస్య = రావణునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, నారదః = నారదుడు, ప్రత్యువాచ హ = తిరిగి పలికెను. రాక్షసర్షభ = రాక్షసశ్రేష్ఠుడా! తే నరాః = ఆ నరులు, అనన్యమనసః = ఇతరమునందు మనస్సు లేనివారై, నిత్యమ్ = నిత్యమూ, నారాయణపరాయణాః = నారాయణునియందు ఆసక్తి గలవారు. తదారాధనసక్తాః చ = అతనిని ఆరాధించుటయందు ఆసక్తులు, తచ్చిత్తాః = అతనయందే చిత్తము గలవారు, తత్పరాయణాః = అతడే అత్యుత్తమమైన గతిగా కలవారు. ఏకాన్తభావానుగతాః = అతనిని ఒక్కనినే సేవించుట అను భావమును అనుసరించువారు.

తా. రావణుని మాటలు విని నారదుడు తిరిగి పలికెను. రాక్షసశ్రేష్ఠుడా! ఆ జనులు నిత్యమూ మరొక చింత లేనివారై నారాయణునియందే ఆసక్తి కలిగి ఉందురు. అతనిని ఆరాధించుటలో ఆసక్తులై అతనిని గూర్చియే ఆలోచించుచు, అతడే ఉత్తమగతి యని నమ్మి అతనిని ఒక్కనినే సేవించుచుందురు. 13, 14

మూ. తచ్చిత్తాస్తద్గతప్రాణా నరా నారాయణం శ్రితాః,
శ్వేతద్వీపే తు తైర్వాస అర్జితః సుమహాత్మభిః. 15

ప్ర. అ. నరాః = ఆ నరులు, తచ్చిత్తాః = ఆ నారాయణునియందే చిత్తము గలవారై, తద్గతప్రాణాః = అతనినే పొందిన ప్రాణములు గలవారై, నారాయణమ్ = నారాయణుణ్ణి, శ్రితాః = ఆశ్రయించినారు. సుమహాత్మభిః = చాల గొప్పవారైన. తైః = వాళ్లచేత, శ్వేతద్వీపే = శ్వేతద్వీపమునందు, వాసః = నివాసము. అర్జితః = సంపాదించబడినది.

తా. అక్కడి నరులు నారాయణునిమీదనే చిత్తము నిలిపి అతనికే ప్రాణములు సమర్పించి సేవించుచుందురు. ఆ మహాత్ములు శ్వేతద్వీపమునందు నివాసమును (పుణ్యముచేత) సంపాదించుకొనినారు. 15

మూ. యే హతా లోకనాథేన శార్ఙ్గమానమ్య సంయుగే,
చక్రాయుధేన దేవేన తేషాం వాసస్త్రివిష్టపే. 16

ప్ర. అ. లోకనాథేన = లోకముల నాథుడైన, దేవేన = దేవునిచేత, యే = ఎవరు, సంయుగే = యుద్ధమునందు, శార్ఙ్గమ్ = శార్ఙ్గ ధనస్సును, ఆనమ్య = వంచిగాని, చక్రాయుధేన = చక్రాయుధముచేత గాని, హతాః = చంపబడి నారో, తేషామ్ = వారికి, త్రివిష్టపే = స్వర్గమునందు, వాసః = నివాసము.

తా. లోకముల ప్రభు వైన ఆ నారాయణుడు శార్ఙ్గమును వంచి గాని, చక్రాయుధము ప్రయోగించి గాని ఎవరిని చంపునో వారికి స్వర్గమునందే నివాసము లభించును. 16

మూ. న హి యజ్ఞఫలైస్తాత న తపోభిర్న సంయమైః,
న చ దానఫలైర్ముఖ్యైః స లోకః ప్రాప్యతే సుఖమ్. 17

ప్ర. అ. తాత = నాయనా! సః లోకః = ఆ లోకము, యజ్ఞఫలైః = యజ్ఞముల ఫలములచేత, సుఖమ్ = అనాయాసముగా, న ప్రాప్యతే = పొంద బడదు, తపోభిః = తపస్సులచేత, న = పొందబడదు. సంయమైః = నియమముల చేత, న = పొందబడదు. ముఖ్యైః = ముఖ్యములైన, దానఫలైః = దానఫలముల చేత, న చ = పొందబడదు.

తా. నాయనా! ఆ లోకమును యజ్ఞములచేత గాని, తపస్సులచేత గాని, నియమములచేత గాని, ముఖ్యములైన దానములచేత గాని ఎవ్వరూ అనాయాస ముగా పొందజాలరు. 17

మూ. నారదస్య వచః శ్రుత్వా దశగ్రీవః సువిస్మితః,
ధ్యాత్వా తు సుచిరం కాలం తేన యోత్స్యామి సంయుగే,
ఆపృచ్ఛ్య నారదం ప్రాయాచ్ఛ్వేతద్వీపాయ రావణః.

ప్ర. అ. దశగ్రీవః = పది కంఠములు గల, రావణః = రావణుడు, నార దస్య = నారదునియొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, సువిస్మితః = చాల ఆశ్చర్యపడినవాడై, సంయుగే = యుద్ధమునందు, తేన = ఆ నారాయణు నితో, యోత్స్యామి = యుద్ధము చేసెదను అని, సుచిరమ్ కాలమ్ = చాలా సేపు,

ధ్యాత్వా తు = ఆలోచించి, నారదమ్ = నారదుణ్ణి, అపృచ్ఛ్య = అడిగి, శ్వేత ద్వీపమ్ = శ్వేతద్వీపమును గూర్చి, ప్రాయాత్ = వెళ్ళెను.

తా. దశగ్రీవుడైన రావణుడు నారదుని మాటలు విని చాలా ఆశ్చర్యము చెంది, నేను ఆ నారాయణునితో యుద్ధము చేసెదను. అని చాలాసేపు ఆలోచించి నారదుని అనుమతి గైకొని శ్వేతద్వీపమునకు వెళ్ళెను. 18

మూ. నారదోఽపి చిరం ధ్యాత్వా కౌతుహలసమన్వితః, 19
దిదృక్షుః పరమాశ్చర్యం తత్రైవ త్వరితం యయౌ,
స హి కేలికరో విప్రో నిత్యం చ సమరప్రియః. 20

ప్ర. అ. నారదః అపి = నారదుడు కూడ, చిరమ్ = చాలా సేపు, ధ్యాత్వా = ఆలోచించి, కౌతూహలసమన్వితః = వేడుకతో కూడినవాడై, పరమాశ్చర్యం = గొప్ప ఆశ్చర్యమును, దిదృక్షుః = చూడదలిచినవాడై, త్వరితమ్ = శీఘ్రముగా, తత్రైవ = అచటికే, యయౌ = వెళ్ళెను. సః = ఆ, విప్రః = బ్రాహ్మణుడు, కేలికరః = పరిహాసము చేయుచుండును. నిత్యమ్ = నిత్యమూ, సమరప్రియః చ = యుద్ధము ప్రియముగా గలవాడు.

తా. నారదుడు కూడ చాలసేపు ఆలోచించి, వేడుక కలవాడై అత్యాశ్చర్య కరమైన ఆ విషయమును చూడ దలచినవాడై శీఘ్రముగా శ్వేతద్వీపమునకు వెళ్లెను. ఆ నారదునకు యుద్ధ మన్న చాలా ఇష్టము. నిత్యమూ పరిహాసము చేయుచుండును. 19, 20

మూ. రావణోఽపి యయౌ తత్ర రాక్షసైః సహ రాఘవ,
మహతా సింహనాదేన దారయన్ స దిశో దశ. 21

ప్ర. అ. రాఘవ = రామా! సః రావణః అపి = ఆ రావణుడు, మహతా = గొప్ప, సింహనాదేన = సింహనాదముచేత, దశ = పది, దిశః = దిక్కులను, దారయన్ = చీల్చివేయుచు, రాక్షసైః సహ = రాక్షసులతో కూడ, తత్ర = అక్కడికి, యయౌ = వెళ్ళెను.

తా. ఆ రావణుడు కూడ గొప్ప సింహనాదముచేత పది దిక్కులను చీల్చి వేయుచు రాక్షసులతో కలిసి అక్కడికి వెళ్లెను. 21

మూ. గతే తు నారదే తత్ర రావణోఽపి మహాయశాః,
ప్రాప శ్వేతం మహాద్వీపం దుర్లభం యత్సురైరపి 22

ప్ర. అ. నారదే=నారదుడు, తత్ర = అచటికి, గతే = వెళ్ళినవాడగుచుండగా, మహాయశాః = గొప్ప కీర్తి గల, రావణః అపి = రావణుడు కూడ, యత్ = ఏది, సురైరపి = దేవతలచేత కూడ, దుర్లభమ్ = పొంద శక్యము కానిదో అట్టి, శ్వేతమహాద్వీపమ్ = శ్వేతద్వీపమును, ప్రాప = పొందెను.

తా. నారదుడు అచటికి వెళ్ళిన తరవాత గొప్ప కీర్తి గల రావణుడు కూడ దేవతలకుకూడ పొంద శక్యము కాని ఆ శ్వేతద్వీపమును చేరుకొనెను. 22

మూ. తేజసా తస్య ద్వీపస్య రావణస్య బలీయసః,
తత్తస్య పుష్పకం యానం వాతవేగసమాహతమ్. 23
అవస్థాతుం న శక్నోతి వాతాహత ఇవామ్బుదః.

ప్ర. అ. తస్య ద్వీపస్య = ఆ ద్వీపముయొక్క, తేజసా = తేజస్సుచేత, బలీయసః = బలవంతుడైన, తస్య రావణస్య = ఆ రావణునియొక్క, యానమ్= వాహనమైన, తత్ పుష్పకమ్ = ఆ పుష్పకము, వాతవేగసమాహతమ్ = గాలి యొక్క వేగముచేత కొట్టబడినదై, వాతాహతః = గాలిచేతకొట్టబడిన, అమ్బుదః ఇవ = మేఘము వలె, అవస్థాతుమ్ = నిలచుటకు, న శక్నోతి = సమర్థము కాలేదు.

తా. బలవంతుడైన ఆ రావణుని వాహనమైన పుష్పకము, ఆ ద్వీపము తేజస్సుచేత, వాయువేగముచేత కొట్టబడినదై, గాలిచేత ఎగురగొట్టబడిన మేఘము వలె నిలబడ లేకపోయెను. 23

మూ. సచివా రాక్షసేన్ద్రస్య ద్వీపమాసాద్య దుర్దృశమ్, 24
అబ్రువన్ రావణం భీతా రాక్షసా జాతసాధ్వసాః.

ప్ర.అ. రాక్షసేన్ద్రస్య=రావణునియొక్క, సచివాః=మంత్రులైన, రాక్షసాః = రాక్షసులు, దుర్దృశమ్ = చూడశక్యము కాని, ద్వీపమ్=ద్వీపమును, ఆసాద్య = పొంది, భీతాః=భయపడినవారై, జాతసాధ్వసాః = పుట్టిన కంపము గలవారై, రావణమ్ = రావణుని గూర్చి, అబ్రువన్ = పలికిరి.

తా. రావణుని మంత్రులైన రాక్షసులు చూడ శక్యము కాకుండ ఉన్న ఆ శ్వేతద్వీపమును సమీపించగానే భయపడి వణకిపోవుచు రావణునితో ఇట్లనిరి. 24

మూ. రాక్షసేన్ద్ర వయం మూఢా భ్రష్టసంజ్ఞా విచేతసః, 25
అవస్థాతుం న శక్ష్యామో యుద్ధం కర్తుం కథంచన,
ఏవముక్త్వా దుద్రువుస్తే సర్వ ఏవ నిశాచరాః. 26

ప్ర. అ. రాక్షసేన్ద్ర = రాక్షసరాజా! వయమ్ = మేము, మూఢాః = మోహము చెందినాము. భ్రష్టసంజ్ఞాః = భ్రష్టమైన సంజ్ఞ కలవాళ్లము, విచేతసః = చైతన్యము లేనివాళ్లము, యుద్ధమ్ = యుద్ధమునందు, కర్తుమ్ = చేయుటకు, కథం చన = ఏ విధముగానూ కూడ, అవస్థాతుమ్ = నిలచుటకు, న శక్ష్యామః = సమర్థులము కాజాలము. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సర్వే ఏవ = సమస్తమైన, తే నిశాచరాః = ఆ రాక్షసులు, దుద్రువుః = పారిపోయిరి.

తా. "రాజా! మాకు స్పృహ తప్పిపోవుచున్నది. ఏమీ తెలియుటలేదు. చైతన్యము తొలగిపోవుచున్నది. ఏ విధముగానూ కూడ నిలిచి యుద్ధము చేయజాలము" అని పలికి ఆ రాక్షసు లందరూ పారిపోయిరి. 25, 26

మూ. రావణోఽపి హి తద్యానం పుష్పకం హేమభూషితమ్,
విసర్జయామాస తదా సహ తైః క్షణదాచరైః. 27

ప్ర. అ. తదా = అప్పుడు, రావణః అపి = రావణుడు కూడ, హేమ భూషితమ్ = బంగారముచేత అలంకరించబడిన, తత్ = ఆ, పుష్పకం యానమ్ = పుష్పకవిమానమును, తైః = ఆ, క్షణదాచరైః సహ = రాక్షసులతో కూడ, విసర్జయామాస = విడచివేసెను.

తా. రావణుడు బంగారముచేత అలంకరించబడిన ఆ పుష్పకమును, ఆ రాక్షసులను కూడ విడచివేసెను. 27

మూ. గతం తు పుష్పకం రామ రావణో రాక్షసాధిపః,
కృత్వా రూపం మహాభీమం సర్వరాక్షసవర్జితః. 28
ప్రవివేశ తదా తస్మిన్ శ్వేతద్వీపే స రావణః,
ప్రవిశన్నేవ తత్రాశు నారీభిరుపలక్షితః. 29

ప్ర. అ. రామ = రామా! పుష్పకం తు = పుష్పకమైతే, గతమ్ = వెళ్ళిపోయినది. సర్వరాక్షసవర్జితః = సమస్తరాక్షసులచేత విడువబడిన, రాక్షసాధిపః = రాక్షసరాజైన, రావణః = రావణుడు, మహాభీమమ్ = చాలా భయంకరమైన, రూపమ్ = రూపమును, కృత్వా = చేసి, తదా = అప్పుడు, తస్మిన్ = ఆ, శ్వేతద్వీపే = శ్వేతద్వీపమునందు, ప్రవివేశ = ప్రవేశించెను. తత్ర = అక్కడ, ప్రవిశన్ ఏవ = ప్రవేశించుచుండగానే, సః రావణః = ఆ రావణుడు, ఆశు = శీఘ్రముగా, నారీభిః = స్త్రీలచేత, ఉపలక్షితః = చూడబడినాడు.

తా. రామా! పుష్పకము వెళ్ళిపోయినది. రాక్షసు లెవ్వరూ దగ్గర లేని ఆ రావణుడు చాలా భయంకరమైన రూపము ధరించి అప్పుడు ఆ శ్వేతద్వీపములో ప్రవేశించెను. అతడు అక్కడ ప్రవేశించిన వెంటనే ఆతనిని అక్కడ ఉన్న స్త్రీలు చూచిరి. 28, 29

మూ. ఏకయా స స్మితం కృత్వా హస్తే గృహ్య దశాననః,
పృష్టశ్చాగమనం బ్రూహి కిమర్థమిహ చాగతః, 30
కో వా త్వం కస్య వా పుత్రః కేన వా ప్రహితో వద.

ప్ర. అ. ఏకయా = ఒక స్త్రీచేత, స్మితమ్ = చిరునవ్వును, కృత్వా = చేసి, హస్తే = హస్తమునందు, గృహ్య = గ్రహించి, సః దశాననః = ఆ రావణుడు, ఆగమనమ్ = ఆగమనమును గూర్చి, పృష్టః = అడగబడినాడు; బ్రూహి = చెప్పుము, కిమర్థమ్ = ఎందుకు, ఇహ = ఇక్కడికి, ఆగతః = వచ్చినావు? త్వమ్ = నీవు, కః వా = ఎవరవు? కస్య వా = ఎవనియొక్క, పుత్రః = పుత్రుడవు? కేన వా = ఎవనిచేత, ప్రహితః = పంపబడినావు? వద = చెప్పుము.

తా. ఒక స్త్రీ చిరునవ్వు నవ్వుచు వానిని చేతితో పట్టి లేవదీసి "నీవు ఎందుకు వచ్చినావు? నీవు ఎవ్వడవు? ఎవని పుత్రుడవు? ఎవరు పంపినారు? చెప్పుము" అని అతని రాకను గూర్చి ప్రశ్నించెను. 30

మూ. ఇత్యుక్తో రావణో రాజన్ క్రుద్ధో వచనమబ్రవీత్. 31
అహం విశ్రవసః పుత్రో రావణో నామ రాక్షసః,
యుద్ధార్థమిహ సంప్రాప్తో న చ పశ్యామి కం చన. 32

ప్ర.అ. రాజన్ = రాజా! ఇతి = ఇట్లు, ఉక్తః = పలకబడిన, రావణః =

రావణుడు, క్రుద్ధః=కోపించినవాడై, వచనమ్=వచనమును, అబ్రవీత్=పలికెను. అహమ్=నేను, విశ్రవసః = విశ్రవసుయొక్క, పుత్రః = పుత్రుడనైన, రావణో నామ = రావణుడను పేరుగల, రాక్షసః = రాక్షసుడను. యుద్ధార్థమ్= యుద్ధముకొరకు, ఇహ = ఇక్కడికి, సంప్రాప్తః = వచ్చినాను. కం చన = ఏ పురుషుణ్ణి, న పశ్యామి చ = చూచుట లేదు.

తా. రామా! ఆ మాటలకు కోపించిన రావణుడు ఇట్లు పలికెను. " నేను విశ్రవసుని పుత్రుడనైన రావణుడను రాక్షసుడను. యుద్ధము చేయుటకై ఇక్కడికి వచ్చినాను. కాని పురుషుడెవ్వడూ కనబడుటలేదు". 31, 32

మూ. ఏవం కథయతస్తస్య రావణస్య దురాత్మనః,
ప్రాహసంస్తే తతః సర్వే సుస్వనం యువతీజనాః. 33

ప్ర. అ. దురాత్మనః = దురాత్ముడైన, తస్య రావణస్య = ఆ రావణుడు, ఏవమ్ = ఇట్లు, కథయతః = చెప్పుచుండగా, తతః = అటుపిమ్మట, సర్వే = సమస్తమైన, తే = ఆ, యువతీజనాః = స్త్రీలు, సుస్వనమ్ = మంచి ధ్వని కలుగునట్లుగా, ప్రాహసన్ = నవ్విరి.

తా. దురాత్ముడైన రావణుని ఆ మాటలు విని ఆ స్త్రీలు అందరూ పకపకా నవ్విరి. 33

మూ. ఏకయా క్రుద్ధయా తాసాం బాలవద్గృహ్య లీలయా,
భ్రామితస్తు సఖీమధ్యే మధ్యే గృహ్య దశాననః. 34

ప్ర. అ. తాసామ్ = ఆ స్త్రీలలో, క్రుద్ధయా = కోపించిన, ఏకయా = ఒక స్త్రీచేత, బాలవత్ = బాలుణ్ణివలె, లీలయా = అనాయాసముచేత, గృహ్య= గ్రహించి, దశాననః = రావణుడు, మధ్యే = నడుమునందు, గృహ్య = గ్రహించి, సఖీమధ్యే = సఖుల మధ్యయందు, భ్రామితః=త్రిప్పబడినాడు.

తా. ఆ స్త్రీలలో ఒక స్త్రీ కోపముతో వానిని చిన్న పిల్లవానిని వలె అనాయాసముగా పట్టుకొని, నడుము దగ్గర పట్టి సఖురాళ్ళమధ్య త్రిప్పెను. 34

మూ. సఖీమన్యాం సమాహూయ పశ్య త్వం కీటకం ధృతమ్,
దశాస్యం వింశతిభుజం కృష్ణాఞ్జనసమప్రభమ్. 35

ప్ర అ. అన్యామ్ = మరియొక, సఖీమ్ = సఖురాలిని, సమాహూయ = పిలచి, త్వమ్ = నీవు, ధృతమ్ = పట్టుకొనబడిన, దశాస్యమ్ = పదిముఖములు గల, వింశతిభుజమ్ = ఇరువది భుజములు గల, కృష్ణాఞ్జన సమప్రభమ్ = నల్లని కాటుకతో సమానమైన కాంతి గల, కీటకమ్=పురుగును,పశ్య = చూడుము అని చెప్పెను.

తా. ఆమె మరొక సఖురాలిని పిలిచి "పది ముఖాలు, ఇరవై చేతులూ ఉన్న కాటుక రంగు పురుగును పట్టుకొన్నాను, చూడుము" అని చెప్పెను. 35

మూ. హస్తాద్ధస్తం స చ క్షిప్తో భ్రామ్యతే శ్రమలాలసః,
భ్రామ్యమాణేన బలినా రాక్షసేన విపశ్చితా, 36

పాణావేకాథసందష్టా రోషేణ వనితా శుభా,
ముక్తస్తయాశుభః కీటో ధున్వన్త్యా హస్తవేదనాత్. 37

ప్ర. అ. సః=అతడు, హస్తాత్ = ఒకరి చేతి నుండి, హస్తమ్ = మరియొకరి చేతిని గూర్చి, క్షిప్తః= విసరబడినవాడై, శ్రమలాలసః = శ్రమవ్యాకులుడై, భ్రామ్యతే = తిరుగుచున్నాడు. అథ = పిమ్మట, భ్రామ్యమాణేన= త్రిప్పబడుచున్న, బలినా = బలవంతుడైన, విపశ్చితా = బుద్ధిమంతుడైన, రాక్షసేన=రాక్షసునిచేత, రోషేణ = కోపముతో, ఏకా=ఒక, శుభా=సుందరియైన, వనితా=స్త్రీ, సందష్టా= కరవబడినది. హస్తవేదనాత్ = చేతియందు నొప్పివలన, ధున్వన్త్యా = దులుపుచున్న, తయా = ఆమెచేత, అశుభః=అమంగళకరమైన, కీటః=పురుగు, ముక్తః = విడవబడినది.

తా. ఒక స్త్రీ చేతినుండి మరొక స్త్రీ చేతిలోనికి విసరుటచే అలసిపోయిన బలవంతుడు, తెలివిగలవాడు అయిన ఆ రావణుడు ఆ విధముగా కొంతసేపు జరిగిన పిమ్మట కోపముతో ఒక స్త్రీ చెయ్యి కరచెను. అపుడు ఆమె చేతియందు నొప్పిచేత దులిపి ఆ అశుభమైన పురుగును క్రింద పడవేసెను. 36, 37

మూ. గృహీత్వాన్యా తు రక్షేన్ద్రముత్పపాత విహాయసా,
తతస్తామపి సంక్రుద్ధో విదదార నఖైర్భృశమ్. 38

ప్ర. అ. అన్యా తు = మరియొక స్త్రీ యైతే. రక్షేన్ద్రమ్ = ఆ రాక్షస రాజును, గృహీత్వా = పట్టుకొని, విహాయసా = ఆకాశముచేత, ఉత్పపాత =

ఎగిరెను. తతః = అటుపిమ్మట, సంక్రుద్ధః = కోపించినవాడై, తామపి = ఆమెను కూడ, భృశమ్ = మిక్కిలి, నఖైః = గోళ్ళచేత, విదదార = చీల్చెను.

తా. మరొక స్త్రీ వానిని తీసుకొని ఆకాశమార్గమున ఎగిరెను. అతడు కోపముతో ఆమెను కూడ గోళ్ళతో ఎక్కువగా చీరెను. 38

మూ. తయా స హి వినిర్ధూతః సహసైవ నిశాచరః,
పపాత సోమ్భసోఽ మధ్యే సాగరస్య భయాతురః. 39

సహసైవ = వెంటనే, సః నిశా చరః = ఆ రావణుడు, తయా = ఆమెచేత, వినిర్ధూతః = విసిరివేయబడెను. సః = అతడు, భయాతురః = భయముచేత వ్యాకులుడై, సాగరస్య = సముద్రముయొక్క, అమ్భసః = ఉదకముయొక్క, మధ్యే = మధ్యయందు, పపాత = పడెను.

తా. వెంటనే ఆమె దులిపివేయగా ఆ రాక్షసుడు భయవ్యాకులుడై సముద్రజలమధ్యమునందు పడెను. 39

మూ. పర్వతస్యేవ శిఖరం యథా వజ్రవిదారితమ్,
ప్రాపతత్సాగరజలే తథాసౌ వినిపాతితః. 40

ప్ర. అ. తథా = అట్లు, వినిపాతితః = పడవేయబడిన, అసౌ = ఈతడు, వజ్రవిదారితమ్ = వజ్రముచేత చీల్చబడిన, పర్వతస్య = పర్వతముయొక్క, శిఖరం యథా ఇవ = శిఖరము వలె, సాగరజలే = సముద్రజలమునందు, ప్రాపతత్ = పడెను.

తా. ఆమె ఆ విధముగా దులిపివేయగా అతడు వజ్రముచేత చీల్చబడిన పర్వతశిఖరము వలె సముద్రజలములో పడెను. 40

మూ. ఏవం స రావణో రామ శ్వేతద్వీపనివాసిభిః,
యువతీభిర్వ్విగృహ్యాశు భ్రామితశ్చ తతస్తతః. 41

ప్ర. అ. రామ = రామా! సః రావణః = ఆ రావణుడు, ఏవమ్ = ఈ విధముగా, శ్వేతద్వీపనివాసిభిః = శ్వేతద్వీపమునందు నివసించుచున్న, యువ

తిభిః = స్త్రీలచేత, ఆశు = శీఘ్రముగా, విగృహ్య = పట్టుకొని, తత స్తతః = అటు ఇటు, భ్రామితః చ = త్రిప్పబడినాడు.

తా. రామా! ఈ విధముగా శ్వేతద్వీపములో నివసించు స్త్రీలు ఆ రావణుణ్ణి పట్టుకొని ఇటు అటూ విసిరివేసిరి. 41

మూ. నారదోఽపి మహాతేజా రావణం ప్రాప్య ధర్షితమ్,
విస్మయం పరమం కృత్వా ప్రజహాస ననర్త చ. 42

ప్ర. అ. మహాతేజాః = గొప్పతేజస్సు గల, నారదః అపి = నారదుడు కూడ, ధర్షితమ్ = అవమానింపబడిన, రావణమ్ = రావణుణ్ణి, ప్రాప్య = పొంది, పరమమ్ = గొప్ప. విస్మయమ్ = ఆశ్చర్యమును, కృత్వా = చేసి, ప్రజహాస = బిగ్గరగా నవ్వెను. ననర్త చ = నాట్యము చేసెను కూడ.

తా. గొప్ప తేజస్సు గల నారదుడు అవమానింపబడిన రావణుని వద్దకు వెళ్ళి, చాలా ఆశ్చర్యము ప్రకటించుచు బిగ్గరగా నవ్వి నృత్యము చేసెను. 42

మూ. ఏతదర్థం మహాబాహో రావణేన దురాత్మనా,
విజ్ఞాయాపహృతా సీతా త్వత్తో మరణకాఙ్క్షయా. 43

ప్ర.అ. మహాబాహో = గొప్పబాహువులు గలవాడా! ఏతదర్థమ్ = ఇందు నిమిత్తమే, దురాత్మనా = దుష్టబుద్ధిగల, రావణేన = రావణునిచేత, త్వత్తః = నీనుండి, మరణకాఙ్క్షయా = మరణమునందు కోరికచేత, విజ్ఞాయ = తెలిసియే, సీతా = సీత, అపహృతా = అపహరించబడినది.

తా. ఓ మహాబాహూ! దురాత్ముడైన రావణుడు ఇందువలననే, నీనుండి మరణము పొందవలె నను కోరికతో సీతను కావలె నని అపహరించినాడు. 43

మూ. భవాన్నారాయణో విష్ణుః శఙ్ఖచక్రగదాధరః,
శార్‌ఙ్గపద్మాయుధో వజ్రీ సర్వదేవనమస్కృతః. 44
శ్రీవత్సాఙ్కో హృషీకేశః సర్వదేవాభిపూజితః,
పద్మనాభో మహాయోగీ భక్తానామభయప్రదః. 45

ప్ర. అ. భవాన్ = నీవు, నారాయణః = జలము స్థానముగా గల, శఙ్ఖ

చక్రగదాధరః = శంఖచక్రగదలు ధరించిన, శార్ఙ్గపద్మాయుధః = శార్ఙ్గము అను ఆయుధము పద్మమూ గల, సర్వదేవనమస్కృతః = సమస్తదేవతలచేత నమస్కరించబడిన, శ్రీవత్సాఙ్కః = శ్రీవత్సము చిహ్నముగా గల, హృషీకేశః = ఇంద్రియములకు ప్రభువైన, సర్వదేవాభిపూజితః = సమస్తదేవతలచేత పూజింపబడిన, పద్మనాభః = పద్మము నాభియందు గల, మహాయోగీ = గొప్ప యోగి అయిన, భక్తానామ్ = భక్తులకు, అభయప్రదః = అభయమును ఇచ్చు, దేవః = దేవుడవు.

తా. నీవే శంఖ-చక్ర-గదా-శార్ఙ్గ-పద్మాదులను ధరించిన, సర్వదేవతల చేతను సమస్కరింపబడు, శ్రీవత్స మనే పుట్టుమచ్చ గల, ఇంద్రియములకు అధిపతి అయిన, సర్వదేవతలచేత పూజింపబడు, పద్మము నాభియందు ఉన్న, గొప్ప యోగియైన, భక్తులకు అభయమిచ్చు ఆ నారాయణుడవు. 44,45

మూ. వధార్థం రావణస్య త్వం ప్రవిష్టో మానుషీం తనుమ్,
కిం న వేత్సి త్వమాత్మానం యథా నారాయణో హ్యహమ్.

ప్ర. అ. త్వమ్ = నీవు, రావణస్య = రావణునియొక్క, వధార్థమ్ = వధ కొరకు, మానుషీమ్ = మనుష్య సంబంధమైన, తనుమ్ = శరీరమును, ప్రవిష్టః = ప్రవేశించినావు. త్వమ్ = నీవు, ఆత్మానమ్ = తనను గూర్చి, కిమ్ = ఎందువలన, న వేత్సి = తెలుసుకొనుటలేదు? యథా = ఏమనగా, అహమ్ = నేను, నారాయణః హి = నారాయణుడను కదా.

తా. నీవు రావణుని సంహరించుటకొరకు మానుషరూపము ధరించినావు. "నేను నారాయణుడను" అని నీవు తనను గూర్చి ఎందుకు తెలుసుకొనుట లేదు? 46

మూ. మా ముహ్యస్వ మహాభాగ స్మర చాత్మానమాత్మనా,
గుహ్యాద్గుహ్యతరస్త్వం హి హ్యేవమాహ పితామహః. 47

ప్ర. అ. మహాభాగ = మహానుభావా! మా ముహ్యస్వ = మోహము చెంద కుము. ఆత్మానమ్ = నిన్నుగూర్చి, ఆత్మనా = తనచేతనే (స్వయముగానే), స్మర = స్మరించుము. త్వమ్ = నీవు, గుహ్యాత్ = రహస్యముకంటె, గుహ్యతరః హి

= ఎక్కువ రహస్యమైనవాడవుకదా ? పితామహః = బ్రహ్మదేవుడు, ఏవమ్ = ఇట్లు, అహ హి = చెప్పినాడు కదా!

తా. మహాభాగ్యవంతుడైన రామా ! మోహము చెందకుము. నిన్ను గూర్చి స్వయముగనే తెలిసికొనుము. నీవు రహస్యములలో పరమరహస్యము అని బ్రహ్మదేవుడే చెప్పినాడు కదా ? 47

మూ. త్రిగుణశ్చ త్రివేదీ చ త్రిధామా త్రిపదాత్మకః,
త్రికాలకర్మా త్రైవిద్యస్త్రిదశారిప్రమర్దన. 48

ప్ర. అ. త్రిదశారిప్రమర్దన = దేవశత్రువులను మర్దించినవాడా ! (నీవు) త్రిగుణః చ = సత్త్వరజస్తమోగుణములు కలవాడవు. త్రివేదీ చ = మూడు కాలములను ఎరిగినవాడవు. త్రిధామా = మూడు స్థానములు కలవాడవు. త్రిపదాత్మకః = మూడు పదములచేత గ్రహించినవాడవు. త్రికాలకర్మా = మూడు కాలములందు కర్మలు చేయువాడవు. త్రైవిద్యః = మూడు విద్యలకు (వేదములకు) సంబంధించినవాడవు.

తా. ఓ ! రాక్షససంహారకా ! నీవు మూడు గుణములను నియమించువాడవు. మూడు కాలములు (భూత - వర్తమాన - భవిష్యత్తులు) తెలిసినవాడవు. మూడు అడుగులచేత బలిరాజ్యము నంతనూ హరించినవాడవు. (లేదా "ఓం తత్ సత్''అను మూడు పదములచేత చెప్పబడువాడవు). మూడు కాలములందు జరుగు పనులు నడిపించువాడవు. మూడు వేదములచేత ప్రతిపాదించబడువాడవు. 48

మూ. త్వయాక్రాన్తాస్త్రయో లోకాః పురాణైర్విక్రమైః త్రిభిః,
త్వం మహేన్ద్రానుజః శ్రీమాన్ బలిబన్ధనకారణాత్. 49

అదిత్యా గర్భసంభూతో విష్ణుస్త్వం హి సనాతనః,
లోకాననుగ్రహీతుం వై ప్రవిష్టో మానుషీం తనుమ్. 50

ప్ర. అ. త్వయా = నీచేత, త్రయః = మూడు, లోకాః = లోకములు, పురాణైః = ప్రాచీనములైన, త్రిభిః = మూడు, విక్రమైః = పాదవిన్యాసములచేత, ఆక్రాన్తాః = ఆక్రమించబడినవి. త్వమ్ = నీవు, బలిబన్ధనకారణాత్ = బలిని

బంధించుట అను కారణమువలన, శ్రీమాన్ = శ్రీమంతుడైన, మహేన్ద్రానుజః = మహేంద్రుని తమ్ముడవుగా, అదిత్యాః = అదితియొక్క, గర్భసంభూతః = గర్భము నుండి పుట్టినావు. త్వమ్ = నీవు, సనాతనః = సనాతనుడవైన, విష్ణుః హి = విష్ణువు కదా లోకాన్ = లోకములను, అనుగ్రహీతుమ్ = అనుగ్రహించుటకు, మానుషీమ్ = మనుష్యసంబంధమైన, తనుమ్ = శరీరమును, ప్రవిష్టః వై = ప్రవేశించినావు.

తా. పూర్వము మూడు అడుగులచేత మూడు లోకాలను ఆక్రమించినావు. బలిని బంధించుటకై దేవేంద్రుని తమ్ముడవుగా అదితిగర్భమునందు పుట్టినావు. నీవు సనాతనుడవైన విష్ణుమూర్తివి కదా ? లోకములను అనుగ్రహించుటకే మనుష్య శరీరము దాల్చినావు. 49, 50

మూ. తదిదం సాధితం కార్యం సురాణాం సురసత్తమ,
నిహతో రావణః పాపః సపుత్రగణబాన్ధవః. 51

ప్ర అ. సురసత్తమ = దేవతలలో శ్రేష్ఠుడా ! సురాణామ్ = దేవతల యొక్క, తత్ = ఆ, ఇదమ్ = ఈ, కార్యమ్ = కార్యము. సాధితమ్ = సాధించ బడినది. పాపః = పాపాత్ముడైన, సపుత్రగణబాన్ధవః = పుత్రులతోను, అనుచరుల గణములతోను, బంధువులతోను కూడిన, రావణః = రావణుడు, నిహతః = చంపబడినాడు.

తా. దేవతాశ్రేష్ఠుడా ! ఈ దేవతాకార్యమును సాధించినావు. పాపాత్ముడైన రావణుణ్ణి వాని పుత్ర–పరివార–బంధువులనూ చంపినావు 51

మూ. ప్రహృష్టాశ్చ సురాః సర్వే ఋషయశ్చ తపోధనాః,
ప్రశాన్తం చ జగత్సర్వం త్వత్ప్రసాదాత్సురేశ్వర. 52

ప్ర. అ. సురేశ్వర = దేవతాప్రభూ ! సర్వే = సమస్తమైన, సురాః = దేవతలు, తపోధనాః = తపస్సే ధనముగా గల. ఋషయః చ = ఋషులు, ప్రహృష్టాః = సంతోషించినారు. త్వత్ప్రసాదాత్ = నీ అనుగ్రహమువలన, సర్వమ్ = సమస్తమైన, జగత్ = జగత్తు, ప్రహృష్టమ్ = సంతోషించినది.

తా. దేవతల అధీశ్వరుడా ! దేవతలు, తపోధనులైన ఋషులు అందరూ సంతోషించినారు. నీ అనుగ్రహము వలన సకలజగత్తూ ప్రశాంతముగా ఉన్నది

మూ. సీతాలక్ష్మీర్మహాభాగా సంభూతా వసుధాతలాత్,
త్వదర్థమిహ చోత్పన్నా జనకస్య గృహే ప్రభో. 53

ప్ర. అ. మహాభాగా = మహాభాగ్యవంతురాలైన, లక్ష్మీః = లక్ష్మి, వసుధాతలాత్ = భూమినుండి, సీతా = సీతగా, సంభూతా = పుట్టినది. ప్రభో = ఓ! ప్రభూ! త్వదర్థమ్ = నీకొరకే, ఇహ = ఇక్కడ, జనకస్య = జనకునియొక్క, గృహే = గృహమునందు, ఉత్పన్నా = పుట్టినది.

తా. మహాభాగ్యవంతురాలైన లక్ష్మీదేవి భూతలమునుండి సీతగా ఆవిర్భవించినది. ఓ! ప్రభూ! ఈమె నీకోసమే జనకుని గృహములో జన్మించినది. 53

మూ. లఙ్కామానీయ యత్నేన మాతేవ పరిరక్షితా,
ఏవమేతత్సమాఖ్యాతం తవ రామ మహాయశః. 54

ప్ర అ. మహాయశః = గొప్ప కీర్తిగలవాడా! రామ = రామా! లఙ్కామ్ = లంకను గూర్చి, ఆనీయ = తీసికొనివచ్చి, యత్నేన = ప్రయత్నముచేత, మాతేవ = తల్లి వలె, పరిరక్షితా = రక్షించబడినది. ఏవమ్ = ఈ విధముగా, ఏతత్ = ఇది, తవ = నీకు, సమాఖ్యాతమ్ = చెప్పబడినది.

తా. గొప్ప కీర్తి గల రామా! రావణుడు సీతను లంకకు తీసికొనివచ్చి తల్లిని వలె ప్రయత్నపూర్వకముగ రక్షించినాడు. ఈ విషయము నంతనూ ఈ విధముగ నీకు చెప్పినాను. 54

మూ. మమాపి నారదేనోక్తమృషిణా దీర్ఘజీవినా,
యథా సనత్కుమారేణ వ్యాఖ్యాతం తస్య రక్షసః, 55
తేనాపి చ తదేవాశు కృతం సర్వమశేషతః.

ప్ర. అ. మమాపి = నాకు కూడ, దీర్ఘజీవినా = దీర్ఘకాలము జీవించు, ఋషిణా = ఋషియైన, నారదేన = నారదునిచేత, ఉక్తమ్ = చెప్పబడినది. సనత్కుమారేణ = సనత్కుమారునిచేత, తస్య రక్షసః = ఆ రాక్షసునకు, యథా = ఎట్లు, వ్యాఖ్యాతమ్ = చెప్పబడినదో, తేనాపి = వానిచేత కూడ, తదేవ = అదే, ఆశు = శీఘ్రముగా, సర్వమ్ = సమస్తమూ, అశేషతః = పూర్తిగా, కృతమ్ = చేయబడినది.

తా. నా కీ కథ దీర్ఘజీవియైన నారదమహర్షి చెప్పినాడు. సనత్కుమారుడు రావణునకు ఎట్లు చెప్పెనో అతడు క్రమముగా, అంతా ఆ విధముగానే చేసినాడు.

మూ. యశ్చైతచ్ఛ్రావయేచ్ఛ్రాద్ధే విద్వాన్ బ్రాహ్మణసంనిధౌ,
అన్నం తదక్షయం దత్తం పితౄణాముపతిష్ఠతి.

ప్ర. అ. యః=ఏ, విద్వాన్ = విద్వాంసుడు, ఏతత్ = దీనిని, బ్రాహ్మణ సంనిధౌ = బ్రాహ్మణుల సంనిధియందు, శ్రాద్ధే = శ్రాద్ధమునందు, శ్రావయేత్ = వినిపించునో, దత్తమ్ = (అతనిచేత) ఇవ్వబడిన, తత్ = ఆ, అన్నమ్ = అన్నము, అక్షయమ్ = అక్షయమై, పితౄణామ్ = పితృదేవతలకు, ఉపతిష్ఠతి = చేరును.

తా. విద్వాంసుడు బ్రాహ్మణసంనిధిలో శ్రాద్ధసమయమునందు దీనిని వినిపించినచో ఆ శ్రాద్ధమునందు ఇచ్చిన అన్నము అక్షయమై పితృదేవతలకు చేరును. 56

మూ. ఏతాం శ్రుత్వా కథాం దివ్యాం రామో రాజీవలోచనః, 57
పరం విస్మయమాపన్నో భ్రాతృభిః సహ రాఘవః.

ప్ర. అ. రాజీవలోచనః = ఎఱ్ఱని పద్మముల వంటి నేత్రములు గల, రాఘవః = రఘువంశ సంజాతుడైన, రామః = రాముడు, భ్రాతృభిః సహ=సోదరులతో కూడ, ఏతామ్ = ఈ, దివ్యామ్ = అద్భుతమైన, కథామ్=కథను, శ్రుత్వా విని, పరమ్ = మిక్కిలి, విస్మయమ్ = ఆశ్చర్యమును ఆపన్నః = పొందినాడు.

తా. పద్మపత్రాక్షుడైన రాముడు, అతని సోదరులూ కూడ దివ్యమైన ఈ కథ విని చాల ఆశ్చర్యము చెందిరి. 57

మూ. వానరాః సహసుగ్రీవా రాక్షసాః సవిభీషణాః, 58
రాజానశ్చ సహామాత్యా యే చాన్యేఽపి సమాగతాః,
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రా ధర్మసమన్వితాః.
సర్వే చోత్ఫుల్లనయనాః సర్వే హర్షసమన్వితాః,
రామమేవానుపశ్యన్తి భృశమత్యన్తహర్షితాః. 60

ప్ర. అ. సహసుగ్రీవాః = సుగ్రీవునితో కూడిన, వానరాః = వానరులు, సవిభీషణాః = విభీషణునితో కూడిన, రాక్షసాః = రాక్షసులు, సహామాత్యాః =

అమాత్యులతో కూడిన, రాజానః చ = రాజులు, యే = ఏ, అన్యే అపి=ఇతరులు, సమాగతాః = వచ్చినారో, వారు, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, క్షత్రియాః=క్షత్రియులు, వైశ్యాః = వైశ్యులు, ధర్మసమన్వితాః=ధర్మముతో కూడిన, శూద్రాః= శూద్రులు, సర్వే చ = అందరూ, ఉత్ఫుల్లనయనాః = వికసించిన నేత్రములు కల వారైరి. సర్వే = అందరూ, హర్షసమన్వితాః = సంతోషముతో కూడినవారైరి. అత్యన్తహర్షితాః = మిక్కిలి సంతోషించుచు, భృశమ్ = మిక్కిలి, రామమ్ ఏవ = రాముణ్ణే, అనుపశ్యన్తి = చూచుచుండిరి.

తా. సుగ్రీవాదివానరులు, విభీషణాది రాక్షసులు, రాజులు, వారి అమాత్యులు, అక్కడికి చేరిన ఇతరులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, ధార్మికులైన శూద్రులు, అందరూ కూడ ఆనందపరవశులు అయిరి. వికసించిన నేత్రములతో అందరూ రామునివైపే చూచుచుండిరి. 58-60

మూ. తతోఽగస్త్యో మహాతేజా రాఘవం చేదమబ్రవీత్,
దృష్టాః సభాజితాశ్చాపి రామ యాస్యామహే వయమ్. 61
ఏవముక్త్వా గతాః సర్వే పూజితాస్తే యథాగతమ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే ఉత్తరకాణ్డే
ప్రక్షిప్తః సర్గః పంచమః.

ప్ర. అ. తతః=అటుపిమ్మట, మహాతేజాః=గొప్ప తేజస్సు గల, అగస్త్యః = అగస్త్యుడు, రాఘవమ్ = రాముణ్ణి గూర్చి, ఇదమ్=ఈ వాక్యమును, అబ్రవీత్ పలికెను. రామ = రామా! వయమ్ = మేము, దృష్టాః = చూడబడినాము, సభాజితాః చ అపి = గౌరవించబడినాము కూడ, యాస్యామహే = వెళ్లెదము. ఏవమ్ = ఇట్లు, ఉక్త్వా = పలికి, సర్వే = వారందరూ, పూజితాః = పూజింపబడినవారై, యథాగతమ్ = వచ్చినట్లుగానే, గతాః = వెళ్ళినారు.

తా. పిమ్మట గొప్ప తేజస్సు గల అగస్త్యుడు రామునితో-"రామా! మాకు దర్శన మిచ్చి మమ్ములను గౌరవించినావు. ఇక మేము వెళ్ళెదము"అని పలికెను. ఇట్లు పలికి అందరూ పూజింపబడినవారై వచ్చినట్లుగానే తిరిగి వెళ్ళిరి. 61

"బాలానందిని"అను శ్రీమద్రామాయణాంధ్రవ్యాఖ్యానమునందు ఉత్తరకాండలో.
ఐదవ ప్రక్షిప్త సర్గ సమాప్తము.